
మండలి బుద్ధప్రసాద్



శ్రీ మండలి బుద్ధప్రసాద్
షష్ట్యబ్దిపూర్తి సందర్భంగా

బుద్ధయానం

అభినందన సంచిక



తండ్రి మండలి వేంకట కృష్ణారావు, తల్లి శ్రీమతి ప్రభావతిదేవి,
భార్య శ్రీమతి విజయలక్ష్మి, కుమార్తెలు కృష్ణప్రభ, అవనిజ, కుమారుడు వెంకట్‌రామ్ (రాజా)లతో



ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభాపతి పీఠంపై...





ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంలో
ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి అభినందనలు అందుకుంటూ...



నోబెల్ పురస్కార గ్రహీత మదర్ థెరిస్సాతో...



నోబెల్ పురస్కార గ్రహీత, బౌద్ధ గురువు శ్రీ దలైలామాతో...



శ్రీమతి ఇందిరాగాంధీతో...



శ్రీ రాజీవ్ గాంధీతో...



డా॥ అబ్దుల్ కలాంతో...



భారత రాష్ట్రపతి శ్రీ ప్రణబ్ ముఖర్జీ, ఆం.ప్ర. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగార్లతో...



భారత ప్రధాని శ్రీ పి.వి.నరసింహారావుతో...



భారత ప్రధాని డా॥ మన్మోహన్ సింగ్‌తో...



వివాహ సమయంలో ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు గారి ఆశీస్సులను పొందుతున్న
వధూవరులు విజయలక్ష్మి & బుద్ధప్రసాద్.



ఎ.ఐ.సి.సి. అధ్యక్షురాలు శ్రీమతి సోనియాగాంధీతో...



తిరుపతిలో 4వ ప్రపంచ తెలుగు మహాసభలు ప్రారంభోత్సవంలో
రాష్ట్రపతి శ్రీ ప్రణబ్ ముఖర్జీ, ముఖ్యమంత్రి శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డిలతో...



పులిగడ్డ - పెనుమూడి వంతెన ప్రారంభిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్. రాజశేఖరరెడ్డితో...



శ్రీకాకుళంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణలో డా॥ కొణిజేటి రోశయ్య,
డా॥ సి. నారాయణరెడ్డి, సద్గురు శివానందమూర్తి, రాజా అచ్యుతా దేవరాయలు ప్రభృతులతో...



ప్రపంచ తెలుగు రచయితల మహాసభలలో...

శ్రీ మండలి బుద్ధప్రసాద్ షష్ఠ్యబ్దిపూర్తి సందర్భంగా

బుద్ధయానం

అభినందన సంచిక



సంపాదకవర్గం :

మద్దాలి రఘురామ్

డా॥ టి. గౌరీశంకర్

డా॥ గంధం సుబ్బారావు

ప్రచురణ :

కిన్నెర పబ్లికేషన్స్

శ్రీ మండలి బుద్ధప్రసాద్ షష్ట్యబ్దిపూర్తి సందర్భంగా

బుద్ధయానం

అభినందన సంచిక

ప్రతులు : 1000

ప్రథమ ముద్రణ : మే, 2016

వెల : రూ. 200/-

ISBN: 978-93-84374-03-7

ప్రచురణ మరియు ప్రతులకు :


కిన్నెర ఆర్ట్ థియేటర్స్

మద్దాలి గోల్డెన్ నెస్ట్,
ఫ్లాట్ నెం. 101 & 102, # 2-2-674/153,
సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, హైదరాబాద్ - 500 013.
ఫోన్: 040-27426666
సెల్: 98660 57777

ముద్రణ :

సాయిలిఖిత ప్రింటర్స్

ఖైరతాబాద్, హైదరాబాద్ - 500 004.
ఫోన్: 040-6554 5979



भारत के उप-राष्ट्रपति के विशेष कार्य अधिकारी
OFFICER ON SPECIAL DUTY
TO THE VICE-PRESIDENT OF INDIA
नई दिल्ली/NEW DELHI - 110011
TEL.: 23016422 / 23016344 FAX : 23012645


MESSAGE

The Hon'ble Vice President of India is happy to learn that Kinnera Art Theatres is organizing the 60th Birth Day Celebrations of Sri Mandali Buddha Prasad, Deputy Speaker, Andhra Pradesh Legislative Assembly on May 26, 2016.

The Vice President extends his greetings and congratulations to all those associated with Kinnera Art Theatres and wishes Sri Mandali Buddha Prasad good health, happiness and many more years in the service of the nation.

(Anshuman Gaur)

New Delhi
09th May, 2016.



प्रधान मंत्री कार्यालय
नई दिल्ली - 110011
PRIME MINISTER'S OFFICE
New Delhi - 110011

सत्यमेव जयते


MESSAGE

The Prime Minister is happy to learn that Kinnera Art Theatres is celebrating the Shashti Purthi function of Shri Mandali Buddha Prasad and publishing a commemorative Special Issue on 27th May, 2016 to mark the occasion.

On this occasion, best wishes for the Shashti Purthi function of Shri Mandali Buddha Prasad and success of the commemorative Special Issue.

(Chandresh Sona)
Deputy Secretary

16 May, 2016
New Delhi



E.S.L. Narasimhan

GOVERNOR
ANDHRA PRADESH

RAJ BHAVAN
HYDERABAD-500 041
May 26, 2016.


Respected Sri Mandali Buddha Prasad Garu,

On this most memorable day to you, I offer my good wishes, and wish you many happy returns of the day. My prayers to Lord Almighty to give you y(ears) of joy, happiness, good health and success in your endeavours.

Kind regards,

Yours sincerely,
ESL Narasimhan
26/5/16
(E.S.L. Narasimhan)

Shri Mandali Buddha Prasad,
Deputy Speaker,
Andhra Pradesh Legislative Assembly,
Hyderabad.



K. Rosaiah

सत्यमेव जयते

GOVERNOR
TAMIL NADU

Raj Bhavan
Chennai-600 022

Dated: 12th May 2016.

MESSAGE

I am happy to learn that the organizers of Kinnera Art Theatres are bringing out a special issue in commemoration with the Shasthi Purthi - 60th Birthday Celebrations of Sri Mandali Buddha Prasad, Deputy Speaker, Andhra Pradesh Legislative Assembly on 26th May 2016.


Sri Mandali Buddha Prasad, Deputy Speaker, Andhra Pradesh Legislative Assembly and Soldier of Telugu Language Movement is known for his simplicity and dedicated service to the people of Andhra Pradesh and Telugu language. As Minister of Andhra Pradesh Govt., Chairman of Andhra Pradesh Official Language Commission, Sri Buddha Prasad has carved a niche and has set himself as an example for others to emulate. His initiatives to make Challapalli Village of his Constituency stand first in implementation of Prime Minister Shri Narendra Modi's "Swachh Bharat" bears testimony to this.

I convey my warm felicitations and best wishes to Sri Mandali Buddha Prasad on his 60th Birthday and wish him a long, happy and healthy life and all success in his service to Telugu people.

(K.ROSAIAH)

NARA CHANDRABABU NAIDU AMARAVATHI

CHIEF MINISTER
ANDHRA PRADESH



సందేశం

సిద్ధార్థునిలో కన్పించే సౌమ్యం, వినయం, సౌశీల్యం, గాంభీర్యం మండలి బుద్ధప్రసాద్ గారిలో చూస్తాం. రాజకీయం వృత్తి అయితే ప్రవృత్తి సాహితీ వ్యాసంగం. ఈ రెంటినీ సమన్వయం చేసుకుంటూ వస్తున్న సవ్యసాచి మండలి బుద్ధప్రసాద్ గారు.

సృజనశీలి, సాహితీవేత్త, తెలుగుభాషే ఆయన శ్వాస, గుండె ఘోష. అధికారభాషా సంఘ అధ్యక్షునిగా పని చేశారు. పాఠశాలల్లో తెలుగు మాధ్యమంగా ప్రభుత్వ ఉత్తర్వు తీసుకురావటానికి ఎంతో కృషిచేశారు.

తెలుగు మహాసభలను విజయవంతం చేసినా, తెలుగుకు ప్రాచీనభాష హోదా రావటానికి పాటుపడినా..తెలుగు భాషమీద మమకారంతోనే చేశారు. షష్టిపూర్తి అరవై వసంతాల సమీక్షణం. ఆయనది ఎంతో పరిపూర్ణ జీవితం. శాసన సభ ఉపసభాపతి శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి షష్టిపూర్తి శుభాకాంక్షలు.



CHIEF MINISTER
TELANGANA

HYDERABAD

K. CHANDRASEKHAR RAO

23. 05. 2016.

MESSAGE

I am happy to note that Kinnera Art Theatres is bringing out a special issue on the occasion of Shashti Purthi celebrations of Sri.Mandali Buddha Prasad, Dy. Speaker AP Legislative Assembly.

I wish the cultural organization all the best in their endeavours.

(K.CHANDRASHEKHAR RAO)



DR. A. CHAKRAPANI
Ph.D (Law); LL.D.

CHAIRMAN
Andhra Pradesh Legislative Council

Phones : 66101919 (O)
23391400 (R)
Hyderabad

Date: 13.05.2016

అభినందన

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి శ్రీ మండలి బుద్ధప్రసాద్ 60 వసంతాలు పూర్తి చేసుకొని షష్టిపూర్తి మహోత్సవానికి సిద్ధమౌతున్న సమయాన వారికి, వారి కుటుంబ సభ్యులకు నా హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

అపర గాంధేయవాది, నిరాడంబర రాజకీయవేత్త కీ.శే. మండలి వెంకట కృష్ణారావుగారి తనయుడుగా, తండ్రి ఆశయసాధన కోసం ఆయన చూపిన బాటలో నిరంతరం పయనిస్తూ, తెలుగుభాషా వికాసానికి అహర్నిశలు కృషిచేస్తున్న తెలుగు భాషారథసారథి, సాహితీసాంస్కృతిక బంధువు మండలి బుద్ధప్రసాద్. 2016, మే 26 వ తేదీన ఆయన 60 వసంతాలు పూర్తి చేసుకుంటున్న శుభ సందర్భంలో మిత్రులు, శ్రేయోభిలాషులు, సాహితీ వేడుకలను నిర్వహించి, అభినందన గ్రంథాన్ని ప్రచురించడం నాకు అత్యంత ముదావహమైన విషయం.

బుద్ధప్రసాద్‌గారు నిగర్వి, స్నేహశీలి. నాకు తన తండ్రితో గల ఆత్మీయానుబంధాన్ని కొనసాగిస్తున్న సహృదయుడు. కృష్ణాజిల్లా అభివృద్ధికి, తన జన్మభూమి అవనిగడ్డ ప్రజానీకానికి చిత్తశుద్ధితో విశేషసేవలు అందిస్తున్నారు.

శ్రీ బుద్ధప్రసాద్‌గారు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, సమాజహిత కార్యక్రమాలు ఇంకా అనేకం నిర్వహించాలని మనసారా ఆకాంక్షిస్తున్నాను. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణానికి వారి సేవలు అత్యవసరమని నేను భావిస్తున్నాను.

ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, వారి కుటుంబానికి సర్వశుభాలు చేకూరాలని మనసారా కోరుకుంటున్నాను.

(డాక్టర్ ఏ. చక్రపాణి)

Office: Public Gardens, Hyderabad - 500 004 A.P. (Ph. No.) 040-66101919, Fax No.: 040-2321 0407.
Resi. No.: 275/A, MLA's Colony, Road No. 12, Banjara Hills, Hyderabad - 500034. (Ph. No.) 040-23391400.



Dr. Kodela Siva Prasada Rao
M.S.,

SPEAKER
ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY

MESSAGE

I am delighted to know "SHASHTI PURTHI' Celebrations of Sri Mandali Buddha Prasad, an eminent politician who dedicated his life for the development and advancement of Telugu Language & Literature.

As peoples representative from Avanigadda, he is instrumental in grounding many popular projects such as Puligadda- Penumudi bridge on Krishna River and Pulichintala Project.

By conducting 4th World Telugu Conference at Tirupati in 2012, he awakened the pride amongst the Telugu speaking people for their language & history and due to his efforts "Administrative legal terminology in Telugu" was published.

Sri Mandali Buddha Prasad is man of smiles and friendly to every one. His characteristic style of function with honesty earned him friends beyond political barriers. Sri Mandali Buddha Prasad is "AJATA SATRUVU" in politics.

I am fortunate to have his association in all walks of life for the last two decades. I wish long and fruitful life to him and his family members.

(Dr. Kodela Siva Prasada Rao)

To
The Chairman,
Sri Mandali Buddha Prasad Shashti Purthi Celebrations Committee,
Hyderabad

Assembly Buildings, Public Gardens, Hyderabad - 500 004. Ph.Nos. : Off.: +9140 66101313, Ext. 1260, 1371 ; +9140 23234076
Fax : +9140 23298262 ; Resi.: +9140 23551056, 23541578 ; Mobile : +9140 9848005923 ; E-mail : kodeladr@gmail.com

N. CHINA RAJAPPA M.A.
Minister for Home & Disaster Management,
Government of Andhra Pradesh
Hyderabad.

सत्यमेव जयते

DEPUTY CHIEF MINISTER
Andhra Pradesh

Room No. 201, 1st Floor,
South H-Block,
A.P. Secretariat,
Hyderabad - 500 022.
Phone : 040-23455998,
040-23450878.

సందేశం

నేడు రాష్ట్రంలో తెలుగు భాషాభిమానులను గురించి మాట్లాడితే ముందుగా శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు గుర్తుకి వస్తారు. తెలుగు భాష, సాహిత్యాల ప్రాముఖ్యతను ప్రపంచ నలుమూలల తెలియజేసారు. తెలుగు భాషకు ప్రాచీన భాషగా గుర్తింపు తీసుకురావడానికి ఎంతో కృషి చేశారు. తెలుగు భాషా ప్రేమికునిగా, సాహిత్య, సాంస్కృతిక అభిమానిగా, బహు గ్రంధకర్తగా పేరు గడించారు. రచయితలకు, సాహితీవేత్తలకు, కవి పండితులకు, కళాకారులకు తలలో నాలుకలా ఉన్నారు. ఆయన రచించిన "మారిషస్ లో తెలుగు తేజం", "ప్రజలు – ప్రగతి", "ఇంగ్లాండులో తెలుగు వైభవ స్మృతులు" వంటి రచనలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. రాజకీయాల్లో, సేవాకార్యక్రమాల్లో తండ్రికి తగ్గ తనయుడిగా పేరుగావించారు. బుద్ధప్రసాద్ గారు అనేక సాంఘిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దివిసీమలో సంభవించిన పెను తుఫాను బాధితుల సహాయ కార్యక్రమాల్లో రేయింబవళ్ళు శ్రమించి ఎంతో మందిని ఆదుకున్నారు. ఆ పెను బీభత్సంలో అనాధలైన 120 మంది బాల బాలికలను చేరదీసి, ఆశ్రయం, అన్నపానాలు కల్పించి వృత్తి విద్యలలో శిక్షణ ఇప్పించారు. రాజకీయాల్లో ఏ పదవి చేపట్టిన ఆ పదవికి వన్నె తెచ్చారు. శాసన సభ్యుడిగా, మంత్రిగా, అధికార భాషా సంఘం అధ్యక్షునిగా పలు పదవులు చేపట్టి ప్రజలకు చేరువైనారు. కృష్ణా జిల్లా అభివృద్ధిలో ఆయన పాత్ర ఎంతో ఉంది. రైతుల పక్షాన అనేక పోరాటాలు చేసి పులిచింతల, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించారు.

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రస్తుత ఉపసభాపతిగా శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు శాసనసభ నడిపించే విధానం రాష్ట్ర ప్రజలతో పాటు పలువురి మేధావుల మన్నన పొందింది. ఆయన భవిష్యత్ లో అనేక ఉన్నత పదవులు నిర్వహించాలని. తెలుగు భాషకు, సాహిత్యానికి ప్రపంచ ఖ్యాతి తేవాలని, నిండు నూరేళ్ళ ఆయురారోగ్యాలతో జీవించాలని నిండు మనసుతో కోరుకుంటున్నాను.

(నిమ్మకాయల చిన రాజప్ప)

YANAMALA RAMAKRISHNUDU,
MINISTER FOR FINANCE & PLANNING
COMMERCIAL TAXES, LEGISLATIVE AFFAIRS

(O) 0866-2546299
CAMP OFFICE:
D.No. 48-11/1-5/8B,
4th Floor, Vallabhaneni Arcade,
GDR Street, Currency Nagar,
Vijayawada - 520008.
Cell: +91 -98499 14555,
e-mail: 1. min_fin@ap.gov.in,
2. rkyanamala@yahoo.com.

సందేశం

నేడు రాష్ట్రంలో తెలుగు భాషాభిమానులను గురించి మాట్లాడితే ముందుగా శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు గుర్తుకి వస్తారు. తెలుగు భాషా సంఘం అధ్యక్షులుగా తెలుగు భాష, సాహిత్యాల ప్రాముఖ్యతను ప్రపంచ నలుమూలల తెలియజేసారు. తెలుగు భాషకు ప్రాచీన భాషగా గుర్తింపు తీసుకురావడానికి ఎంతో కృషి చేశారు. తెలుగు భాషా ప్రేమికునిగా, సాహిత్య, సాంస్కృతిక అభిమానిగా, బహు గ్రంథకర్తగా పేరు గడించారు. రచయితలకు, సాహితీవేత్తలకు, కవి పండితులకు, కళాకారులకు తలలో నాలుకలా ఉన్నారు. ఆయన రచించిన "మారిషస్ లో తెలుగు తేజం", "ప్రజలు-ప్రగతి", "ఇంగ్లాడులో తెలుగు వైభవ స్మృతులు" వంటి రచనలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. రాజకీయాల్లో, సేవాకార్యక్రమాల్లో తండ్రికి తగ్గ తనయుడిగా పేరుగాంచారు. బుద్ధప్రసాద్ గారు అనేక సాంఘిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దివిసీమలో సంభవించిన పెను తుఫాను బాధితుల సహాయ కార్యక్రమాల్లో రేయింబవళ్ళు శ్రమించి ఎంతో మందిని ఆదుకున్నారు. ఆ పెను బీభత్సంలో అనాధలైన 120మంది బాల బాలికలను చేరదీసి, ఆశ్రయం, అన్నపానాలు కల్పించి వృత్తి విద్యలలో శిక్షణ ఇప్పించారు. రాజకీయాల్లో ఏ పదవి చేపట్టిన ఆ పదవికి వన్నెతెచ్చారు. శాసన సభ్యుడిగా, మంత్రిగా, అధికార భాషా సంఘం అధ్యక్షునిగా పలు పదవులు చేపట్టి ప్రజలకు చేరువైనారు. కృష్ణా జిల్లా అభివృద్ధిలో ఆయన పాత్ర ఎంతో ఉంది. రైతుల పక్షాన అనేక పోరాటాలు చేసి పులిచింతల, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించారు.

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రస్తుత ఉపసభాపతిగా శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు శాసనసభ నడిపించే విధానం రాష్ట్ర ప్రజలతో పాటు పలువురి మేధావుల మన్నన పొందింది. ఆయన భవిష్యత్ లో అనేక ఉన్నత పదవులు నిర్వహించాలని, తెలుగు భాషకు, సాహిత్యానికి ప్రపంచ ఖ్యాతి తేవాలని, నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో జీవించాలని నిండు మనసుతో కోరుకుంటున్నాను.

యనమల రామకృష్ణుడు

B. Gopala Krishna Reddy
Minister for Environment & Forests
Science & Technology and Co-Operation

Room No. 403, 4th Floor
'J' Block, AP Secretariat
Hyderabad - 500004
Off: Ph 040-23450633
Resi: Ph 040-23542998
Mobile: 9849000567

Dt. 09.05.2016

శుభాభినందనలు

కిన్నెర ఆర్ట్ థియేటర్స్ నాలుగు దశాబ్ధాలుగా కళారంగానికి, కళాకారులు, సాంస్కృతీ వారధులకు చేస్తున్న సేవ, అభినందనల కార్యక్రమాలు ప్రశంసనీయం. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ కు 60 ఏళ్ళు నిండుతున్న సందర్భంగా షష్ట్యబ్ధి అభినందన సభ నిర్వహణ, ఈ సందర్భంగా ఆయన మీద ప్రత్యేక సంచిక తీసుకురావడం మరింత ముదావహం. మండలి బుద్ధప్రసాద్ రాజకీయాల్లో ఉన్న బహుముఖ ప్రజ్ఞాశాలి. మృదుబాషణ, నిరాడంబరత, స్నేహశీలత ఆయన సొంతం. తెలుగుభాషోద్యమ సైనికుడుగా ఆయనకో ప్రత్యేక గుర్తింపు. గతంలో మంత్రిగా, అధికార భాషాసంఘం అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన వివాద రహితుడుగా అందరి మన్ననలు అందుకుంటున్న వ్యక్తి. ఇలాంటి వ్యక్తి షష్ట్యబ్ధి అభినందన సభలో తీసుకువచ్చిన ఈ ప్రత్యేక సంచికలో తెలుగు భాషా సాహిత్యం, సంస్కృతి ఔన్నత్యాన్ని చాటే వ్యాసాలు, కవితలు ప్రముఖ సాహితీవేత్తల నుంచి సేకరించి ముద్రించడం ముదావహం. నిర్వాహకులకు అభినందనలు. మండలి బుద్ధప్రసాద్ ఆయురారోగ్యాలతో మరెన్నో వసంతాలు జరుపుకోవాలని మనసా వాచా కోరుకుంటున్నాను.

ధన్యవాదాలతో...

మీ

B Gopala

బొజ్జల గోపాలకృష్ణారెడ్డి

DR. PALLE RAGHUNATHA REDDY
Msc, M.Phil, Phd
MINISTER FOR INFORMATION & PUBLIC RELATIONS
INFORMATION TECHNOLOGY & COMMUNICATIONS,
NON-RESIDENT INDIAN EMPOWERMENT & RELATIONS,
TELUGU LANGUAGE & CULTURE,
MINORITIES WELFARE & EMPOWERMENT
GOVERNMENT OF ANDHRA PRADESH

South 'H' Block,
2nd Floor, Room No. 315
A.P. Secretariat,
Hyderabad - 500 022.
Andhra Pradesh, INDIA.
Ph: 040 - 23450348 (O).
Fax : 040 - 23450371 (F)

అచ్చమైన గాంధేయవాది

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతి శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు అచ్చమైన గాంధేయవాది. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, కళల పట్ల పట్టుతో పాటు, మక్కువగల స్నేహశీలి. తెలుగు భాషోద్యమ సైనికుడుగా, మన సంస్కృతీ, సాంప్రదాయాలు, చరిత్రను ఔపోసనపట్టిన శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు ఆదర్శనీయమైన రాజకీయనాయకుడు. ఆయన భావితరాలకు ఎంతో స్ఫూర్తికూడా. శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు నాకు సోదరసమానులు. విలువలతోకూడిన జీవితంతోపాటు, విలువలతోకూడిన రాజకీయాలు చేస్తూ రాణిస్తున్న అతికొద్దిమంది నాయకుల్లో శ్రీ బుద్ధప్రసాద్ గారు ఒకరని చెప్పడం అతిశయోక్తి కాదు. నిష్కళంక, నిరాడంబర రాజకీయవేత్తగా అన్ని రాజకీయ పక్షాల మన్నన పొందడం అంటే ఆషామాషీ కాదు. బుద్ధప్రసాద్ గారి నాన్న కీ.శే. శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారి అడుగుజాడల్లో నడుస్తూ, గాంధీయ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న సౌజన్యమూర్తి. అలాంటి స్నేహశీలి, మృదుస్వభావి షష్టిపూర్తి సందర్భంగా కిన్నెర ఆర్ట్ థియేటర్స్ వారు ప్రత్యేక సంచిక తేవడం అభినందనీయం.

పల్లె రఘునాథరెడ్డి

PYDIKONDALA MANIKYALA RAO
Minister for Endowments
Government of Andhra Pradesh

Room No. 810, 8th Floor,
J Block, A.P. Secretariat,
Hyderabad- 500 022.
email: min_endowments@ap.gov.in
min_endowments@yahoo.com

Phone No. 040- 23450362

బుద్ధునికి ఉన్నంత శాంతం- బుద్ధప్రసాద్ గారి సొంతం

Date: ....

తెలుగు భాషా సాహిత్య, సాంస్కృతిక సంఘ సంస్కరణ వాదిగా, కళారాధకునిగా, నిష్కళంక గాంధేయ వాదిగా శ్రీ మండలి బుద్ధ ప్రసాద్ గారు తెలుగు వారందరికి సుపరిచితం.

కీ.శే. శ్రీ మండలి వేంకట కృష్ణారావు, శ్రీమతి ప్రభావతిదేవి పుణ్యదంపతులకు పెద్ద కుమారునిగా జన్మించిన బుద్ధప్రసాద్ గారు యావత్ దివిసీమకే పెద్దబిడ్డగా వ్యవహరించి, కష్టించి అవనిగడ్డ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు.

అధికార భాషాసంఘం అధ్యక్షునిగా తెలుగు భాషోద్యమానికి కొత్త ఊపిరులూది, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోను తెలుగు వెలుగులు విరజిమ్మే విధంగా, గిడుగు అడుగులో అడుగు కలిపి దేశ భాషలందు తెలుగు లెస్స అని మరోసారి ఋజువు చెసిన అభినవ కృష్ణదేవరాయ మన బుద్ధప్రసాద్ గారు.

పువ్వు పుట్ట గానే పరిమళిస్తుంది అన్న చందంగా శ్రీ బుద్ధప్రసాద్ గారు చిన్నతనం నుండి సం క్షేమ కార్య క్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, నూనుగు మీసాల నూత్న యవ్వనంలో "దీనజన సంక్షేమ సమితి" ని స్థాపించి దివిసీమ వుప్పెనలో, 2005 సునామీ విపత్తులో ఉవ్వెత్తున సహాయ పునరావాస కార్యక్రమాలలో పాల్గొన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించిన ప్రతిసారి, ప్రజలకు కష్టం ఎదురైన ప్రతీసారి శ్రీ బుద్ధప్రసాద్ గారు వారి కన్నీళ్ళు తుడవడానికి అహర్నిశలు అలుపెరగని యోధునివలె కృషి చేయడం వారి విశాల దృక్పథానికి తార్కాణం.

అవనిగడ్డ నియోజకవర్గం నుండి మూడు సార్లు ఎన్నికై అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ కు మంత్రిగా అద్వితీయ సేవలందించి అన్ని రాజకీయ వర్గాల వారిని కలుపుకుపోయి, డెల్టా సంరక్షణకు, ఆధునికీకరణకు నడుంకట్టి, ప్రస్తుతం నూతన రాష్ట్ర శాసనసభకు ఉప సభాపతిగా కర్తవ్య నిర్వహణ కావిస్తూ, నిష్కళంక రాజకీయాలకు మార్గదర్శిగా, సేవే పరమావధిగా భావించే మానవత్వానికి మనుష్య రూపం మన బుద్ధప్రసాద్ గారు. స్నేహశీలి, మృధుస్వభావి, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన శ్రీ బుద్ధ ప్రసాద్ గారికి 60 వసంతాలు పూర్తవటం ఆనందదాయకం. వారు ఇలాగే శత వసంతాలు పూర్తి చేసుకోవాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ...

మీ

P. M. R.

(పైడికొండల మాణిక్యాల రావు)

M. PADMA DEVENDER REDDY
B.A., LL.B.
DEPUTY SPEAKER
Telangana Legislative Assembly

Quarter No. # 4,
Minister Residential Quarters,
Road No. 12, Banjara Hills,
Hyderabad.
Off : 040-23241441
Resi : 040-23321579/1569
Email : deputyspeaker.telangana@gmail.com

తేది : 03.05.2016

అభినందన

శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారు తెలుగు భాషాభిమానిగా, నిష్కళంక రాజకీయవేత్తగా తెలుగువారందరి అభిమానాన్ని చూరగొన్నారు. వారి తండ్రిగారు మాజీ మంత్రివర్యులు శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు గాంధేయవాదిగా పేరు గడించారు. దివిసీమలో సంభవించిన ఉప్పెన తుఫాను బీభత్సంలో ఊళ్ళకు ఊళ్ళే తుడిచిపెట్టుకు పోగా, కకావికలై ప్రాణాలతో బయటపడ్డ ప్రజలకు తన ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా, ఆయన సేవ చేశారని మా పెద్దలు చెప్పేవారు. బుద్ధప్రసాద్‌గారు తండ్రి గారి అడుగు జాడల్లో నడుస్తున్న నిరాడంబర వ్యక్తి, స్నేహశీలి.

రాజకీయ నాయకులకు బహు అరుదుగా మాత్రమే ఉండే లక్షణమైన తెలుగు భాషాభిమానాన్ని తండ్రిగారి వారసత్వంగా బుద్ధప్రసాద్‌గారు కొనసాగించడం ఆయన విశిష్ట వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుంది. ఎదురైనప్పుడు చిరునవ్వుతో పలుకరిస్తూ, ఆప్యాయంగా మాట్లాడే బుద్ధప్రసాద్‌గారి సంస్కారం ఆయనను అందరికీ దగ్గర చేస్తుంది.

బుద్ధప్రసాద్‌గారికి 60 ఏళ్ళు నిండిన సందర్భంగా, వారి షష్టిపూర్తి ఉత్సవాన్ని నిర్వహిస్తున్న కిన్నెర సంస్థ వారిని అభినందిస్తూ, బుద్ధప్రసాద్‌గారికి నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

(ఎం. పద్మా దేవేందర్ రెడ్డి)

Dr. K.V. Ramana Chary , IAS (Retd.)
Advisor to Government
Govt. of Telangana, Secretariat Hyderabad

Room No. 314A, II nd Floor,
D-Block, Telangana Secretariat,
Hyderabad
(0) : 040 - 23454862

09.05.2016

నా'నుడి'

తెలుగు భాషా, సాహిత్యాల పరివ్యాప్తికి,
సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు
అపురూపమైన సేవ చేస్తున్న వారు
శ్రీ మండలి బుద్ధ ప్రసాద్ గారు.
ఒక రాజకీయ నాయకుడుగా ఉన్నా
వైరి వర్గం అంటూ లేకుండా
ధీరోదాత్తుడిగా, ధీరోద్ధత్తుడిగా
అందరి మన్ననలను అందుకుంటున్నారాయన.
ఆపత్కాల సమయంలో దివి సీమను ఆదుకొన్నా .. .. ..
మత్స్య, పశు క్రాంతులను తెచ్చినా
తెలుగు ఖ్యాతిని "ప్రపంచ తెలుగు సభ"లలో నినదించినా,
అధికార భాషా సంఘాధ్యక్షులుగా
తిరుపతిలో ప్రపంచ తెలుగు మహాసభలు
విజయవంతం చేసినా
తెలుగు వారి అంతర్జాలావసరాల కోసం 'తెలుగు విజయం'
సంక్షిప్త సందేశాలకు 'యుని కోడ్'ను చేయించినా
అది వారికే చెల్లింది.
అరవై ఏళ్లొచ్చినా ఇరవై ఏళ్లనాటి భావజాలంతో
చైతన్యశీలిగా ముందుకు సాగుతూ.. .. ..
రాజకీయాల్లో వుంటూనే
విభిన్న ప్రక్రియల్లో తనదైన శైలిలో
భాషా, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవ చేస్తూ .. .. ..
తరం తరం గుర్తుంచుకొనేలా
నిరంతరం గుర్తుండిపోయే
వారి జీవితం శుభ ప్రదం
జయప్రదం కావాలని ఆశిస్తూ.. .. ..

శుభాకాంక్షలతో ....

డా. కె. వి. రమణా చారి, ఐ.ఎ.ఎస్ (రి.)

KOONA RAVI KUMAR B.E.,
GOVERNMENT WHIP,
A.P. LEGISLATIVE ASSEMBLY,
HYDERABAD.

Amadalavalasa Constituency,
Plot No. 34, Shanthi Nagar Colony,
Besides : Govt. Degree College (MEN)
SRIKAKULAM Town and Dist.,
Tel : Off. (ADV). 08942-286666
Off. (HYD). 040-23233900
Cell : 9440195672



కూన రవి కుమార్,
ప్రభుత్వ సచేతక్,
ఆంధ్రప్రదేశ్ శాసనసభ

వెన్నెల సంతకం

తెలుగుతల్లి–కళామతల్లి పోటీపడి మరీ దత్తత తీసుకున్న తెనుగింటి వెన్న ముద్ద – మన బుద్ధప్రసాద్.. పద్ధతివీడని–పరనింద ఎరుగని–సరళమైన సంప్రదాయ జీవన శైలి గల బుద్ధప్రసాద్‌ని ఈ రాష్ట్రంలో రాజకీయ కోణంలో ఎవరూ చూడరు, ఎవరికి వారే – మా వాడు అన్న భావన కలుగుతుంది – బహుశా మరే వ్యక్తికి ఇది సాధ్యపడదేమో...

ఇక పదవులంటారా... తనకంటే ఎక్కువ పదవులు చేసినవారు ఉన్నారు... ఎవరికీ రాని "మంచి" అనే గుత్తాధిపత్యం మన బుద్ధుడిదే...

దేశభాషలు ఎన్ని నేర్చినా మాతృభాషను మరువని వాడే నిజమైన పౌరుడన్న స్ఫురణ తనది – పుస్తక పఠనంకంటే చౌకైన వినోదం – విలువైన విజ్ఞానం మరొకటి లేదని గ్రహించిన వ్యక్తి – నేను అన్న మమకారం, నాది అన్న అహంకారం లేని వ్యక్తి తనని తనే సరిదిద్దుకునే వ్యక్తి, తనని చూసి పుస్తకాలు పులకిస్తాయి.

మాతృమూర్తి ప్రభావతమ్మగారు నేర్పిన వినయం తనకి అతిపెద్ద ఆభరణం, దేశ భక్తుడైన తన తండ్రి మండలి వెంకట కృష్ణారావు చూపిన దిశను దర్శించాడు కనుకనే, గాంధేయవాదిగా – ఓ స్వాతంత్ర్య సమర యోధునికి దక్కిన గౌరవం – తనని చూసిన వెంటనే ఓ ఆత్మీయ భావం – నమస్కరించడానికి చేతులు వాటంతటవే లేచి తృప్తి పడతాయి – తన బాల్యం నుండి చేనేత తప్ప మరో వస్త్రం ఎరుగడు – దర్పం డాబులేని అదోరకం దర్జా అయిన జీవితం మన మండలిది.

స్వదేశమైనా విదేశమైనా తెలుగుభాష ప్రాచుర్యానికి ప్రతీ వేదికపైన తెలుగుభాష ఔచిత్యాన్ని ప్రపంచానికి తెగేసి చెప్పే తెగువ మన బుద్ధిడికే సొంతం, కాబట్టే తెలుగు అంతర్జాల మహాసభలకు గౌరవాధ్యక్షుడయ్యాడు. అనేక అంతర్జాతీయ వేదికలపై తెలుగుకి వెలుగైనాడు.. తెలుగు భాషా ప్రేమికుడు గనుకనే ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుతల్లి కొలువులో అధికార భాషకు అధ్యక్షుడై, నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలకు అంతాతానై... తెలుగునేలను తరింపజేసాడు. పరిపాలనా న్యాయపదకోశాన్ని ముద్రించి తెలుగులోనే పరిపాలన అన్న నినాదాన్ని అధికారికం చేసిన ధన్యుడు – మన బుద్ధప్రసాద్.

శాసన సభ్యునిగా – అమాత్యునిగా శాసన సభ ఉపసభాపతిగా – తన గమనం, ఓ ఆదర్శం – తన అరవై ఏళ్ల జీవితం....

తెలుగు నేలపై... ఓ వెన్నెల సంతకం...

శుభాభినందనలతో ....

(కూన రవికుమార్)
ప్రభుత్వ సచేతక్



Justice Grandhi Bhavani Prasad
CHAIRMAN

Andhra Pradesh Electricity Regulatory Commission
11-4-660, 4th Floor, Singareni Bhawan, Red Hills, Hyd-500 004
Ph: 040-23397364 Fax: 040-2339 7378
Email: chmn@aperc.gov.in

ఆదర్శ వ్యక్తి

శ్రీ రఘురాం గారికి,

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతి, గౌరవనీయులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి షష్టిపూర్తి శుభసందర్భంగా కిన్నెర ఆర్ట్ థియేటర్స్ వారు ఒక ప్రత్యేక సంచికను విడుదల చేయ సంకల్పించటం హర్షణీయం.

ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలతో తెలుగు భాషా సంస్కృతుల పునరుజ్జీవనోద్యమానికి శ్రీకారం చుట్టిన మాన్యులు, కీర్తిశేషులు శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారికి వారసుడుగా శ్రీ బుద్ధప్రసాద్ తెలుగువారి హృదయాలలో తండ్రిని మించిన తనయుడుగా సుస్థిరస్థానం సంపాదించారు. ఆడంబరాలకు, అహంకారానికి, అక్రమార్జనకు దూరంగా ఉంటూ గాంధేయ విలువలను జీవనమార్గంగా పాటిస్తూ మృదు స్వభావిగా, స్నేహశీలిగా, నిరాడంబరుడుగా, మచ్చలేని ప్రవర్తనతో నైతిక విలువలకు పట్టం కట్టిన రాజకీయవేత్తగా, సమకాలీన తెలుగు జీవితంలో శ్రీ బుద్ధ ప్రసాద్ ప్రత్యేక గుర్తింపును పొందారు. శాసన సభ్యుడిగా, రాజకీయ కార్యకర్తగా, రాష్ట్ర మంత్రిగా, అధికార భాషా సంఘ అధ్యక్షుడిగా ఏ హోదాలో ఉన్నా ఆయన మనసుకు అత్యంత ప్రియమైనవి తెలుగుభాష, సంస్కృతి, చరిత్ర, కళలు, సాహిత్యం, సంగీతం, నృత్యం, కవిత్వం ఇత్యాది విషయాలు. తెలుగు భాషోద్యమ సారథిగానేకాక 1977 దివిసీమ ఉప్పెన బాధితుల పునరావాస కృషికి, ఎంతోమంది అనాధ బాలబాలికలకు తోడూ నీడగా నిలచిన సేవకు, పాడి, మత్స్య పరిశ్రమలు, పశుసంవర్ధక శాఖల మంత్రిగా బడుగు బలహీన వర్గాలకు ఇచ్చిన చేయూతకు, కృష్ణా డెల్టా రైతు హక్కుల సంరక్షణ పోరాటానికి, పులిగడ్డ పెనుమూడి మండలి వెంకట కృష్ణారావు వారధి నిర్మాణ కృషికి, కృష్ణా విశ్వవిద్యాలయ స్థాపనకు దోహదపడినందుకు, ఇంకా ఇంకా అనేక అభివృద్ధి, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలకు సూత్రధారిగా శ్రీ బుద్ధ ప్రసాద్ విశేష కీర్తిని ఆర్జించారు. తెలుగులో చక్కని రచనలు కూడా చేసిన శ్రీ బుద్ధ ప్రసాద్ ప్రపంచంలోని తెలుగు వారందరినీ ఏకోన్ముఖులను చేయడానికి నిరంతరం శ్రమిస్తున్నారు. అన్నివిధాల ఈనాటి యువతరానికి ఒక ఆదర్శంగా మనం చూపగలిగిన అతికొద్ది మంది సమకాలీనులలో శ్రీ బుద్ధ ప్రసాద్ ఒకరు. వారి బంధుత్వం, స్నేహం, సహచర్యం నాకు, నా శ్రీమతి సరళాదేవికి విలువైన మధుర స్మృతులు. సర్వజన హితుడు, సన్నిహితుడు అయిన శ్రీ మండలి బుద్ధ ప్రసాద్ ఇంకా ఎన్నో కాలాల పాటు ప్రజాసేవ, దివిసీమ సేవ, భాషా సేవ, సాంస్కృతిక సేవ చేస్తూ తెలుగు చరిత్రలో ఎప్పటికీ గుర్తింపబడాలని కోరుకుంటూ,

అభినందనలతో,

భవదీయుడు,
గ్రంధి భవానీ ప్రసాద్
(గ్రంధి భవానీ ప్రసాద్)

శ్రీ మద్దాళి రఘురాం
ప్రధాన కార్యదర్శి
కిన్నెర ఆర్ట్ థియేటర్స్

श्री श्री जगद्गुरु शङ्कराचार्य महासंस्थानम्,
दक्षिणाम्नाय श्रीशारदापीठम्, शृङ्गेरी
Sri Sri Jagadguru Shankaracharya Mahasamsthanam
Dakshinamnaya Sri Sharada Peetham, Sringeri - 577 139.

Ref: S-18 | 1296.

ఆశీర్మంత్రాక్షతలు

Date: 14.05.2016

శ్రీ మద్దాలి రఘురామ్ గారికి,

మీరు వ్రాసిన పత్రము అందినది. శ్రీచరణుల సన్నిధిన సమర్పించినాను.

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి శ్రీమండలి బుద్ధప్రసాద్ గారికి 26 మే 2016 వ తేదీకి 60 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భములో కిన్నెర సంస్థ అధ్వర్యములో 27-5-2016 సాయంత్రం హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో అభినందన సభను ఏర్పాటుచేసి ఒక ప్రత్యేక సంచికను వెలువరించనున్నామని వ్రాసితిరి. చాలా సంతోషము.

శ్రీ శారదాచంద్రమౌళీశ్వరుల అనుగ్రహము వలన ఈ కార్యక్రమము నిర్విఘ్నముగా జరుగుగాకయనియు, ప్రత్యేక సంచిక విశిష్టమైన లేఖనములతో కూడుకొని సర్వాంగసుందరముగా వెలువడుగాకయనియు, శ్రీబుద్ధప్రసాద్ గారికి మరియు వారి కుటుంబసభ్యులకు దీర్ఘాయురారోగ్యాది సకలశ్రేయస్సులు లభించుగాకయనియు శ్రీచరణులు ఆశీర్వదించి అనుగ్రహించిన ఆశీర్మంత్రాక్షతలు శ్రీశారదా చంద్రమౌళీశ్వరుల ప్రసాదము పంపుచున్నాను.

ఇట్లు
T. Dakshinamurthy

Phone: 08265 - 250123 / 250192 • Fax: 08265 - 250792
E-mail: info@sringerisharadapeetham.org • www.sringerisharadapeetham.org



విశ్వగురు పీఠాధిపతి
భగవాన్ శ్రీశ్రీశ్రీ విశ్వయోగి
విశ్వంజీ మహరాజ్

విశ్వ మందిరం, గుంటూరు.



ఓం శ్రీ సాయిరాం గురు దేవదత్త

దివ్య ఆశీస్సులు

కిన్నెర ఆర్ట్ థియేటర్స్, హైద్రాబాదు వారు చిరంజీవి మండలి బుద్ధప్రసాద్ షష్టిపూర్తి మహోత్సవ సందర్భముగా 27-05-2016 సాయంత్రం హైద్రాబాదులోని రవీంద్ర భారతిలో అభినందన సభను ఏర్పాటు చేయటం, ఒక ప్రత్యేక సంచికను ప్రచురించి బహుకరించడానికి సంకల్పించడము ఎంతో ఆనందదాయకము, అభినందనీయము. ఇటువంటి సంకల్పానికి ఉపక్రమించిన కిన్నెర సంస్థకు దాని అధ్యక్షులు ఆర్. ప్రభాకరరావుకు, జనరల్ సెక్రటరీ మద్దాలి రఘురాము మరియు సభ్యులందరికి హృదయ పూర్వక ఆశీస్సులు అందచేస్తున్నాను.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ జగమెరిగిన మహా మహనీయుడు. పార్టీలకు, మతాలకు, కులాలకు, రాజకీయాలకు, అతీతంగా అందరి అభిమానాన్ని చూరగొని, మానవతా విలువల వికాసమునకు నిర్విరామ కృషి చేయుచున్న పరిపూర్ణ మానవతా మూర్తి చిరంజీవి బుద్ధప్రసాద్. తండ్రికి తగ్గ తనయుడేకాక, తండ్రిని మించిన తనయుడిగా, తండ్రి యొక్క వంశము యొక్క తెలుగు జాతి యొక్క ఖ్యాతిని విశ్వ విఖ్యాతము చేసిన నిండైన తెలుగు తేజము చిరంజీవి బుద్ధప్రసాద్.

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, తెలుగు, భాష పట్ల, తెలుగు కళలపట్ల అత్యంత అభిమానము గల బుద్ధప్రసాద్, వాటి ప్రాచుర్యము కోసము అవిరళ కృషి చేసాడు, తపన చెందాడు, తపస్సు చేసాడు. కలుషిత రాజకీయలకు అతీతంగా, తనకు ప్రాప్తించిన ఏపదవిలోనైనా నిష్కామ, నిర్విరామ కృషిచేసి ఎమ్.ఎల్.ఎ.గా, మంత్రిగా జాతికి సేవచేసాడు. అధికార భాషాసంఘము అధ్యక్షులుగా, బాధ్యతలను విజయవంతంగా నిర్వహించటమేగాక, నాల్గవ ప్రపంచ తెలుగు మహా సభల విజయానికి కారకుడైనాడు. వివిధ కార్యాలయాలలో తెలుగు భాషను అమలు చేయుటలో విశేషకృషి చేసాడు. న్యాయస్థానములలో కూడా తెలుగు భాషను ఉపయోగించడంలో విజయవంతుడైనాడు. యోగ్యత కలిగిన నాడు, పదవులు తమంతట తామే వరిస్తాయని అనడానికి ఉదాహరణ ఉపసభాపతి పదవి ఆయనను వరించటమే. సమర్థుడు, పరిపాలనాదక్షుడైన ముఖ్యమంత్రి గౌ॥శ్రీ నారా చంద్రబాబు నాయుడు హృదయంలో ప్రత్యేక స్థానమును సంపాదించుకొన్నాడు.

అన్నిరంగాలలో, అన్ని వర్గాలలో, అన్ని దేశాలలో అందరి ప్రేమను చూరగొన్న **"అందరివాడు అజాత శత్రువైన"** చిరంజీవి బుద్ధప్రసాద్ 60 సం॥లు నిండి షష్టిపూర్తి మహోత్సవములు జరుపుగొనుచున్న శుభ సందర్భముగా **"విజయోస్తు, దిగ్విజయోస్తు"** అని మనసారా ఆశీర్వదిస్తూ, యావత్ కుటుంబానికి ఆశీస్సులు అందచేస్తున్నాను. అతి క్లిష్టమైన పరిస్థితులలోవున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము అంతర్జాతీయఖ్యాతిని పొందే విధముగా శక్తివంతముకావాలని, నవ్యాంధ్ర రాజధాని అత్యద్భుత మహావిశ్వనగరముగా రూపు దిద్దుకోవాలని మనసారా ఆకాంక్షిస్తూ, హృదయ పూర్వక ఆశీస్సులను అందచేస్తున్నాను. ప్రపంచ వ్యాప్తముగా వున్న తెలుగు వారందరూ సమైక్యమై, హార్దిక, ఆర్థిక, సహాయ, సహకారములను ప్రభుత్వమునకు, గౌ॥ ముఖ్యమంత్రికి అందించాలనే ఆకాంక్షను తెలియచేస్తూ ఆశీస్సులను అందచేస్తున్నాను.

ఓం శాంతిః శాంతిః శాంతిః

శుభం భూయాత్



With the Divine Blessings of His Holiness

JAGADGURU SANKARACHARYA

SRI SRI SRI SWAROOPANANDENDRA SARASWATI MAHASWAMY

VISAKHA SRI SARADA PEETHAM



తేది. 10. 05. 2016

విశాఖపట్నం.

దివ్యాశీస్సులు

జగద్గురు శంకరాచార్య విశాఖ శ్రీ శారదాపీఠాధిపతులు **శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారి దివ్య ఆశీర్వచనములతో** వ్రాయునది.

శ్రీ మండలి బుద్ధ ప్రసాద్‌గారు అంటే మాకు అవ్యాజమైన అభిమానము వారి జీవనమార్గము మానవాళికి ఆదర్శమార్గము. నిజాయితీ, నిబద్ధత, పారదర్శకతతో కూడిన జీవనం వారిది. ఈ 60 సంవత్సరములు గడిపిన శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారికి పరిపూర్ణ ఆశీర్వచనములు అని శ్రీస్వామివారు తెలియజేసారు.

అంతేగాక ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం అధ్యక్షులుగా 2012-14 సంవత్సరములో ఉండి తెలుగు జాతికి ఎంతో మేలు చేసారు. వీరికి సామాజిక దృక్పథమేగాక పెద్దలు, పూజ్యులు, మహాత్ముల యందు ఆయనకున్న గౌరవమే ఆయనకి గల పరిపూర్ణ ఆశీస్సులు.

విశాఖ శ్రీ శారదాపీఠం అంటే వారికి ప్రత్యేకమైన అభిమానం అలాగే వారి 60 సంవత్సరాలు పూర్తి అయిన "షష్టి పూర్తి" వేడుకలు దిగ్విజయంగా జరగాలి. ఆయుష్షు, ఆరోగ్యము బాగుండాలి. ఆయన ఆలోచనా విధానం యువతకి మార్గదర్శకంగా ఉండాలని శ్రీ శారదాచంద్రమౌళీశ్వరుని కోరుతూ ఆశీర్వదిస్తూ ఇలా తెలియజేయమన్నారు.

ఇట్లు

G. Kameswarasarma

(జి. కామేశ్వర శర్మ)

ధర్మాధికారి

విశాఖ శ్రీ శారదాపీఠం

Pendurti, Visakhapatnam - 530051, Andhra Pradesh, India. Ph : 0891-2763332
Web Site : www.srisaradapeetham.org E-mail : info@srisaradapeetham.org

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
డాక్టర్ సి. నారాయణరెడ్డి ఎక్స్ ఎం.పి.
ఎం.ఏ., పిహెచ్.డి., డి.లిట్.
అధ్యక్షులు
తెలంగాణ సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్, హైదరాబాదు - 500 001.
ఫోన్ : (ఆ) 24753724

Jnanpith Awardee
Dr. C. Narayana Reddy Ex. M.P.
M.A., Ph.D., D.Litt.
PRESIDENT
Telangana Saraswatha Parishath
Tilak Road, Hyderabad - 500 001.
Phone : (Off.) 24753724

అభినందనలు


పూర్వ ఆంధ్రప్రదేశ్ మంత్రివర్యులు, తెలుగుభాషా సంస్కృతుల పరిరక్షణ నిరంతర నిమగ్న మనస్కులు, ఉప్పెన పాలైన దివిసీమకు పూర్వస్థితిని కలిగించిన దేశభక్తులు శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారు.

శ్రీ కృష్ణారావు గారి కుమారులు తండ్రిగారి సద్గుణాలను కైవసం చేసుకున్న తనయులైన మండలి బుద్ధప్రసాద్‌గారి షష్టిపూర్తి తెలుగు భాషీయులందరికి అభీష్టపూర్తి.

దివిసీమను ఉప్పెన ఉల్లోలితం చేసినప్పుడు మండలి వెంకట కృష్ణారావు గారి పట్ల ఉన్న సౌజన్యం వలనను వారితో పాటు ఉప్పెన పాలైన దివిసీమను తిరిగి చూసినాను. మాతోపాట 20 ఏండ్ల యువకుడు ఉన్నాడు. ఎవరని తెలుసుకుంటే తెలిసింది, అతడు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఉపసభాపతిగా ఉన్న మండలి బుద్ధప్రసాద్‌గారే అని.

తాను చేపట్టిన ఏ కార్యక్రమమైనా పరమ నిపుణంగా నిర్వహించే బుద్ధప్రసాద్ గారిని 'బుద్ధి' ప్రసాద్ గారని ఆత్మీయంగా సంభావిస్తుంటాను.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి షష్టిపూర్తి నిర్వహిస్తున్న కిన్నెర సంస్థను, ప్రత్యేకించి ఆ సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురాంను మనసారా అభినందిస్తున్నాను.



(డా॥ సి. నారాయణ రెడ్డి)

केन्द्रीय हिंदी समिति
भारत सरकार
కేంద్రీయ హిందీ సమితి
భారత ప్రభుత్వం
CENTRAL HINDI COMMITTEE
GOVT. OF INDIA

सदस्यः
आचार्य यार्लगड्डा लक्ष्मीप्रसाद
पीएच.डी. (हिंदी), पीएच.डी. (तेलुगु)
पूर्व सांसद (राज्य सभा)

సభ్యులు :
ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్
పిహెచ్.డి. (హిందీ), పిహెచ్.డి. (తెలుగు)
రాజ్యసభ పూర్వ సభ్యులు

MEMBER :
Dr. Lakshmi Prasad Yarlagadda
Ph.D. (Hindi), Ph.D. (Telugu)
Former Member of Parliament (Rajya Sabha)

అభినందన

మిత్రులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి షష్టిపూర్తి సందర్భంగా ఒక గ్రంథాన్ని ప్రచురించటం అభినందనీయం. బుద్ధప్రసాద్ గారు తన తండ్రి గారైన స్వర్గీయ వెంకట కృష్ణారావు గారి అడుగుజాడలలో పయనిస్తూ, జీవితాన్ని పండించుకున్నారు. గాంధేయ మార్గంలో ఇటు ప్రజాసేవలో అటు భాషా సంస్కృతుల పరిరక్షణలో తనదైన శైలిలో నిరంతర సేవలనందిస్తున్నారు.

ఆయన మరింత శక్తితో ఉత్సాహంగా ఈ రంగాలలో ముందుకు సాగాలని నా ఆశంస.

భవదీయ

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

email : ylp1953@gmail.com Web : www.ylp.in +91 98490 67343, +91 99480 77222, +91 98106 67343
#9-28-4, Balaji Nagar, Visakhapatnam - 530 003
డోర్ నెం. 9-28-4, బాలాజీ నగర్, విశాఖపట్నం - 530 003.

ఫోన్ : 040-23234815
సెల్ : 9490189824
ఫ్యాక్స్ : 040-23236911
ఇ-మెయిల్ : vc@teluguuniversity.ac.in

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
POTTI SREERAMULU TELUGU UNIVERSITY

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
ఉపాధ్యక్షులు

లలిత కళా క్షేత్రం,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్-500 004.

అభినందనలు

తేది: 27.4.2016

తెలుగుజాతికి ఎప్పుడూ స్మరణీయులైన రాష్ట్రేతరాంధ్రుల, విదేశాంధ్రుల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న కీ.శే. మండలి వెంకట కృష్ణారావుగారి వ్యక్తిత్వం పుణికిపుచ్చుకున్నవారు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు. వీరి కుటుంబ నేపథ్యం గాంధేయవాదం, పేద బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడడమేకాకుండా తెలుగు భాష, సాహిత్య, చరిత్ర, సంస్కృతుల పట్ల ఆదరాభిమానాలే కాకుండా అభిరుచిని పెంచుకొన్న పరిశీలనాభిలాషి బుద్ధప్రసాద్ గారు అనడంలో అతిశయోక్తి లేదు. తెలుగు రాష్ట్రాల్లోనూ, రాష్ట్రేతర ప్రాంతాల్లోనూ, విదేశాల్లోనూ తెలుగుభాషకు చిరునామాగా బుద్ధప్రసాద్ గారిని అందరూ చెప్పుకోవడం హర్షణీయం.

వారు తండ్రికి తగ్గ తనయుడుగా దివిసీమ అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతూ కృష్ణా జిల్లా అభివృద్ధి సంఘం ద్వారా అక్కడి ప్రజల మనోభావాలకు అనుగుణంగా ప్రజాహిత కార్యక్రమాలను చేపట్టి ప్రజల మన్ననలను పొందారు... పొందుతున్నారు. వారు అవనిగడ్డ శాసనసభ స్థానం నుండి ఎమ్మెల్యేగా మూడుసార్లు ఎన్నికయ్యారు. కీ.శే. వై.యస్. రాజశేఖరరెడ్డి గారి మంత్రివర్గంలో పశుసంవర్థక, పాడిపరిశ్రమ, మత్స్యశాఖామాత్యులుగా పనిచేసి, 'పశుక్రాంతి', 'మత్స్యక్రాంతి' అనే నూతన పథకాలను రూపొందించి ఆ శాఖకు వన్నె తెచ్చారు. పశుసంరక్షణకు ఒక ప్రత్యేక పరిశోధనాకేంద్రాన్ని స్థాపించి పశుసంపద కాపాడుకోవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పి ప్రజలకు స్ఫూర్తినిచ్చారు. మాన్యశ్రీ కిరణ్‌కుమార్‌రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో అధికారభాషా సంఘం అధ్యక్షులుగా, 2012 డిసెంబర్ 27 నుండి 29 వరకు తిరుపతిలో మూడు రోజుల పాటు వైభవంగా జరిగిన 'నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభల' నిర్వహణలో చురుగ్గా పాల్గొనడమే కాకుండా, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి కూడా తగు ప్రాధాన్యాన్నిచ్చి సభలు జయప్రదం కావడానికి తనవంతు కృషి చేశారు. తెలుగు రాష్ట్రాలుగా విడిపోయిన తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ఉప సభాపతిగా వారు సభల నిర్వహణలో, సభలో సభ్యుల ప్రవర్తనానియమావళి రూపకల్పనపై ప్రత్యేక దృష్టి సారించి తనదైన ముద్ర వేయగలిగారు.

2012 డిసెంబరులో తిరుపతిలో జరిగిన మహాసభల సందర్భంగా విశ్వవిద్యాలయం రాష్ట్రేతర ప్రాంతాల్లో నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవాలలోనూ, మహాసభల ప్రత్యేక సంచిక రూపకల్పనలోనూ, తిరుపతిలో విశ్వవిద్యాలయం పక్షాన నిర్వహించిన విద్యాత్మక సదస్సుల్లోనూ వారి తోడ్పాటు మరువలేనిది. అలుపెరుగని సామాజిక భాషా కృషీవలుడుగా 60 వసంతాలు పూర్తి చేసుకొని షష్టిపూర్తి జరుపుకోవడం నాకు సంతోషాన్నిచ్చింది. ఈ సందర్భంగా ఒక ప్రత్యేక సంచికను వెలువరించడం భాషాభిమానులందరికీ ఆనందదాయకం.

రాష్ట్రేతరాంధ్రుల, విదేశాంధ్రుల విద్యాసాంస్కృతిక సమస్యల పరిష్కారం కోసం ఏర్పడిన అంతర్జాతీయ తెలుగు కేంద్రానికి వారి నాన్నగారి పేరు పెట్టడంలోనూ, అదేవిధంగా రాష్ట్రేతర ప్రాంతాల్లో, విదేశాల్లో తెలుగు భాషామతల్లికి విశేషసేవలందించిన సంస్థలకు, వ్యక్తులకు వారి తండ్రి జన్మదినం ఆగస్టు 4వ తేదీన 'కీ.శే. మండలి వెంకట కృష్ణారావు సంస్కృతి పురస్కారం' పేరిట 2007వ సంవత్సరం నుండి క్రమం తప్పకుండా రూ.25,000/- నగదు పురస్కారాన్ని వారు విశ్వవిద్యాలయానికి అందించి, రాష్ట్రేతర ప్రాంతాల్లో, విదేశాల్లో తెలుగువారికి స్ఫూర్తిని కలిగించారు. అందుకు వారికి నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

వారి భావిజీవితంలో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించి తెలుగు భాష, సాహిత్య, చరిత్ర, సంస్కృతులకు రెట్టించిన ఉత్సాహంతో సేవ చేస్తారని మనసారా నమ్ముతూ వారికి షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

(ఎల్లూరి శివారెడ్డి)

'రసభారతి', ఇ. నెం. 1-1-336/77 (518), వివేకనగర్, చిక్కడపల్లి, హైదరాబాద్-500 020, ఫోన్ : 040-27632020

Aamoda Publications Pvt. Ltd.
Publishers Of Andhra Jyothi

V. Radhakrishna
Managing Director

సద్గుణవాణి

భాషా సంస్కృతులు ఒక జాతి ఆత్మగౌరవ చిహ్నాలు. రాజకీయాలకు, వాటికి మధ్య అవినాభావ సంబంధం ఉంటుంది. శ్రీకృష్ణదేవరాయలు, మహమ్మద్ కులీ కుతుబ్‌షా వంటి రాజులు తెలుగు కవుల్ని పోషించడమే కాకుండా తామే స్వయంగా గొప్ప రచనలు చేశారు. కానీ దురదృష్టవశాత్తూ ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని దశాబ్దాలుగా భాషా సంస్కృతులకు, రాజకీయాలకు మధ్య బంధం బలహీనపడింది. రాజకీయ ప్రసంగాలకు భాష ఎంతో ప్రధానమైనప్పటికీ... రెండూ వేర్వేరనే ధోరణి ఎందుకో ప్రబలింది. ఎన్టీఆర్ హయాంలో మినహా మరెన్నడూ మన భాషకు దక్కాల్సిన స్థానం దక్కలేదు. రాజకీయ నాయకుల్లో తెలుగు భాషపై అధికారం, సాహిత్యంపై మక్కువ కలిగినవారు ఎవరున్నారంటే దుర్భిణీ వేసి వెదకాల్సిన దుస్థితి దాపురించింది.

ఆంధ్ర దేశంలో దీనికి ఉన్న అతి కొద్ది మినహాయింపుల్లో మండలి బుద్ధప్రసాద్ ఒకరు. తెలుగు భాష, సాహిత్యాలకు సంబంధించి ఏం చేయాలన్నా, ఏ కార్యక్రమం నిర్వహించాలన్నా ముందుగా గుర్తుకువచ్చే నాయకుడు ఆయనే. అధికార భాషా సంఘం అధ్యక్ష పదవిపై ఆయన తనదైన ముద్ర వేశారు. తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో తిరుపతిలో ప్రపంచ తెలుగు మహాసభల్ని దిగ్విజయంగా నిర్వహించడమే కాకుండా డిజిటల్ ప్రపంచంలో తెలుగును ముందుకు తీసుకువెళ్లడానికి ఎంతో కృషి చేశారు. లండన్‌లో సి.పి.బ్రౌన్ సమాధి అభివృద్ధికి, మచిలీపట్నంలో కృష్ణా యూనివర్సిటీ స్థాపనకు చాలా పాటుపడ్డారు.

కొన్ని దశాబ్దాలుగా తెలుగు భాషే కాదు, తెలుగు రైతాంగం కూడా తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటోంది. ఆ రైతాంగానికి కూడా బుద్ధప్రసాద్ పెద్ద దిక్కుగా నిలబడ్డారు. కృష్ణా డెల్టా ఆధునికీకరణ కోసం, రైతుల నీటి సమస్యలపైన అలుపెరుగని పోరాటం చేశారు. 1977 దివిసీమ ఉప్పెన సందర్భంలో బాధితులకు అండగా నిలిచారు. దీనజన సంక్షేమ సమితి తరపున వందలాది అనాథ పిల్లలకు ఆశ్రయమిచ్చి ఆదుకున్నారు. వావిలాల గోపాలకృష్ణయ్య, ఎన్.జి.రంగా వంటి గాంధేయవాదుల సాహచర్యం కలిగిన బుద్ధప్రసాద్, వారి సద్గుణాలను పుణికి పుచ్చుకున్నారు. ఎమ్మెల్యేగా, రాష్ట్రమంత్రిగా, నేడు ఉప సభాపతిగా నిరుపమాన సేవలు అందిస్తున్న ఆయనకు షష్టిపూర్తి సందర్భంగా నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నాను. ఆయనపై ప్రత్యేక సంచిక ప్రచురించాలన్న కిన్నెర ఆర్ట్ థియేటర్స్ వారి ఆలోచనకు నా అభినందనలు తెలియజేస్తున్నాను.

వేమూరి రాధాకృష్ణ

Regd & Admn Office: Andhra Jyothi Buildings, Plot No. 76, Road No. 70, Aswani Enclave, Huda Heights, Jubilee Hills, Hyderabad-500033.
Ph. 040-2333 3377

దివ్యాశీస్సులు

శ్రీయుత మండలి బుద్ధప్రసాద్‌గారి షష్ట్యబ్ద్యుత్సవ సంచిక ప్రచురిస్తున్నారని తెలిసి చాల ఆనందమైంది. అయితే అంతలోనే ఆశ్చర్యం కూడా! అప్పుడే మా బుద్ధప్రసాద్ గారికి అరువది సంవత్సరాల ప్రాయం సంతరించుకుందా అని.

బుద్ధప్రసాద్ గారు పేరుకు తగినట్లే శాంతమూర్తి. నిగర్వి. బాధ్యత, కర్తవ్య నిర్వహణంలో ఆయనకు ఆయనే సాటి. ఒకప్పుడు దివిసీమకే పరిమితమైన వారి సేవలు నేడు యావదాంధ్ర దేశానికి విస్తరించటం ముదావహం.

వారితో నా పరిచయం 1998లో మా స్వగ్రామం పెదప్రోలులో గ్రామ దేవతల ఉత్సవాలు జరిపినప్పుడు. ఆ తరువాత వారు నిర్వహించిన 'దివి ఉత్సవాలు' చరిత్రలో నిలిచిన విశేషం. తరువాత పెదకళ్ళేపల్లిలో జరిపిన వసంతోత్సవాలు. ఆ రెండు కార్యక్రమాలను ఎంతో దీక్షాదక్షతలతో నిర్వహించారు. శ్రీకాకుళం ఆంధ్రనాయక స్వామి ఆలయంలో శ్రీకృష్ణదేవరాయల శిలావిగ్రహాన్ని, కాసుల పురుషోత్తమ కవి విగ్రహాన్ని స్థాపించి స్థానికుల మన్ననలకు పాత్రులైనారు. దివిప్రాంతానికి వారు చేసిన, చేస్తోన్న సేవలు ప్రశంసనీయం. రాజకీయాలతో నిమిత్తం లేకుండా అర్హులైన వారికి చేయూత నివ్వటం వారి ప్రత్యేకత. అందుకే ఒకప్పుడు నేను వారిని వివేకవైయాత్యునిగా పేర్కొన్నాను. దానికి ఈడైనవి వారి గుణశీలాలు.

నేడు షష్ట్యబ్ది జరుపుకుంటున్న మా బుద్ధప్రసాదు శతవసంతాలు సుఖసంతోషాలతో వర్ధిల్లేటట్లు అవనిగడ్డ వీరరాయచోడ నారాయణ దేవర తన దివ్యాశీస్సులను వర్షించుగావుతమని ఆదైవాన్ని ప్రార్థిస్తూ...

- యార్లగడ్డ బాల గంగాధరరావు
విజయవాడ

రాష్ట్రేతర తెలుగు సమాఖ్య

RASHTRETARA TELUGU SAMAKHYA

(Soc Regd.No:679/2015)

Address: 12,Ratrani Bungalows, Ramdevnagar,Satellite Road, Ahmedabad-380015
Website:www.rashtretaratelugusamakhya.com E-mail:rashtretaratelugusamakhya@gmail.com Mobile:0982511440

మార్గదర్శి

తెలుగు భాషాభిమాని,అమృత హృదయుడు శ్రీ మండలి బుద్ధ ప్రసాద్ గారి షష్టి పూర్తి మహోత్సవాన్ని ఘనముగా నిర్వహించ సంకల్పించినందుకు కిన్నెర సంస్థను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

శ్రీ బుద్ధప్రసాద్ గారి తండ్రిగారిని చిన్నప్పుడు ప్రత్యక్షముగా చూసినప్పటికి , పెద్దయ్యాక దూర ప్రాంతాలు వెళ్ళటమువలన మాకు బుద్ధ ప్రసాద్ గారితో పరిచయము గత ఐదు సంవత్సరాలుగా మాత్రమే కలదు. నిజము చెప్పాలంటే రాజకీయ నాయకులతో సంబంధము మాకు పెద్దగా లేదు. వేరొక తెలుగు భాషాభిమాని ఫోన్లో సంప్రదించగా రాత్రి తొమ్మిది గంటలకు అవనిగడ్డ నుంచి వస్తూనే సమయము కేటాయించారు. మూడు గంటలపాటు దేశములోని తెలుగు భాషా పరిస్థితుల గురించి, సాహిత్యము గురించి ముచ్చటించుతూ, కాలం తెలియలేదు.వారు తెలుగు భాషకి సంబంధించిన అమూల్యమైన మూడు గ్రంథాలను బహుకరించారు. ఆ నాడు మొదలైన సాంగత్యము నన్ను అహమదాబాద్ సరిహద్దులను దాటించి భారత్ దేశం ఎడల విస్తరించింది. రాష్ట్రేతర తెలుగు సమాఖ్య కు మార్గము ఏర్పరిచింది. నాలుగేండ్లు అందరిని కూర్చి అహమదాబాద్ లొ జరిగిన ప్రథమ సమ్మేళనాన్ని వారు ప్రారంభించారు. ఈ రోజు ప్రతి రాష్ట్రంలో, ప్రతి నగరములో రాతెస శాఖలు ఉన్నాయంటె దానికి వారు చూపిన దారే.

వారికున్న భాషాభిమానమే వారిని దేశ విదేశాలలొనున్న మాతృభాషాభిమానులను నోరారా పలకరించి స్పందన తీరుస్తున్నది. వారు మరిన్ని జన్మదినాలను జరుపుకోవాలని, తెలుగు భాష అభివృద్ధికి మరింత దృఢత్వముతో నాయకత్వము వహించాలని రాతెస మనసారా కోరుతున్నది.

(పిశిపాటి వెంకట పూర్ణ చంద్ర ప్రసాద్)

అహమదాబాద్

అద్యక్షులు

ది. 14 మే 2016

C.M.K. REDDY, *Dsc FRCS (Glas) FRCS (Ire)*
PRESIDENT
All India Telugu Federation
Linguistic Minorities Forum of Tamil Nadu
Tamil Nadu Medical Practitioner's Association
Sri Kakana Durga Telugu Educational Institutions

Appreciation

I am delighted to know that you are bringing a commemorative souvenir on the occasion of Sashti Poorthi of a very close family friend, an extraordinary politician and Deputy Speaker of AP Legislative Assembly, Hon. Sri Mandali Buddhaprasad.

I have known him from his early days, when he used to accompany his father, then AP Education Minister, late Sri Mandali Venkata Krishna Rao, whenever he visited Chennai on several occasions.

He truly imbibed or inherited rather, all the great qualities of his father, such as Gandhian spirit, soft-spoken, uncontroversial nature, profound love to mother tongue and above all, a perfect human being, not conversant with the tricks of present day politics.

Since all his life achievements are going to be depicted in the souvenir, I don't intend to repeat them, except to say that his services during Diviseema calamities in building a community centre, to the development of Telugu in the combined state, as the Chairman, Official Language Commission and during the 4th World Telugu Conference at Tirupathi in 2012, have been exemplary and highly productive.

In the current scenario of erosion of traditional values in life, fading love to mother country & mother tongue, deteriorating spirit of National Integration, we need more politicians like Sri Buddhapasad, to bring back the past glories Telugus had enjoyed during the dynasty of Sri Krishnadevaraya. On behalf of 2 crores of Telugus living in Tamil Nadu, I pray the ALMIGHTY to bless him with long, healthy life and wish the Sashtyabdhi Function a productive success.

- C.M.K. Reddy

KINNERA ART THEATRES

Maddali Golden Nest, Flat No. 101 & 102, # 2-2-674/153,
Central Excise Colony, Hyderabad - 500 013. Phone: 27426666, Cell: 98660 57777
Email: info@kinnera.net, Website: www.kinnera.net

అధ్యక్షులు :
రొద్దం ప్రభాకరరావు, ఐపిఎస్ (రిటైర్డ్)

కార్యదర్శి :
మద్దాళి రఘురామ్

'సాహితీ బంధు'

మాన్యులు గౌరవనీయులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారిని కలసినప్పుడు నా మనస్సు, నా ఆలోచనలు చిన్నప్పటి అనుభవాలతో నిండిపోతాయి. మా కుటుంబ పెద్దలు శ్రీ కల్లూరు సుబ్బారావుగారు, మా తండ్రి గారి ఆరాధ్య గురువులు శ్రీ బళ్ళారి రాఘవులు గారు మా ఇంట్లో బస చేసినప్పుడు వారిని కలవడానికి ఎంతో మంది ప్రఖ్యాత రాజకీయ నాయకులు, పండితులు, రచయితలు, సంగీత విద్వాంసులు, నటులు వచ్చేవారు. మా ఇంట్లో రాజకీయాల గురించి మాట్లాడేవారు కారు. సంస్కృతి, కళలు, రాయలసీమ కళాపరిషత్, కవి సమ్మేళనాలు, కృష్ణదేవరాయ ఉత్సవాలు, దేశభక్తి బోధించే నాటకాలు గురించే చర్చించే వారు. అందరు నిరాడంబరంగా, అత్యంత శ్రద్ధతో, అపార అనుభవంతో మాట్లాడేవారు. నేను చదివిన చదువులతోపాటు వారి మాటలు జ్ఞానభిక్షపెట్టి, సన్మార్గాన్ని బోధించాయి. గాంధీజీ బాటలో నడచిన అన్ని వర్గాల రాజకీయ నాయకులు కూడా ఈ విషయాలల్లో కలసి సహృదయంతో మేలిగేవారు. ఈ కార్యక్రమాలల్లో పాల్గొనేవారు.

శ్రీ బుద్ధప్రసాద్ గారు అదే మార్గంలో తనజీవితాన్ని ఆదర్శవంతంగా గడుపుతున్నవారు. వారి పితృదేవులు కీ॥శే॥లు మండలి వెంకటకృష్ణారావు గారి లాగానే నిరాడంబర జీవనం, సత్ప్రవర్తన, ఉత్తమ భారతీయ జీవన విధానం, వినమ్ర బాంధవ్యం, స్నేహం, పరోపకారాలతో ప్రజల మన్ననలను పొందిన ప్రజా నాయకులు. వారు ఎన్నో గురుతర బాధ్యతలు నిర్వహిస్తున్నా, ఎన్నో కార్యక్రమాలు ప్రజల కోసం రూపొందిస్తున్నా నిరంతర విద్యార్థి, నిరంతర కృషీవలుడు. గాంధీజీ గారు చెప్పిన "Be the change you want to see in the world" విధంగా, తన జీవితాన్ని సందేశంగా మార్గదర్శకం చేస్తూ, అందర్నీ సమన్వయ పర్చి, కలుపుకొని ముందుకు సాగే మనస్తత్వం కలవారు. భారతీయ సంస్కృతి, ఉత్తమ జీవనానికి, సామాజిక శాంతికి, సామాజిక శ్రేయస్సును పూర్తిగా నమ్మినవారు. దేశపు మట్టినీ, దేశపు మనుషులను గౌరవిస్తూ ప్రపంచమంతా 'వసుదైక కుటుంబకం'గా రూపొందించాలని కృషి చేస్తున్నవారు. దానికి మన దేశాన్ని, మన భాషను, మన సంస్కృతిని, గౌరవించుకోవడమే పునాది అని నమ్మి దానికై నిర్విరామ కృషి చేస్తున్నవారు. మా కిన్నెర సంస్థకు కీ॥శే॥లు మండలి వెంకటకృష్ణారావు గారి వలెనే శ్రీ బుద్ధప్రసాద్ గారు కూడా మార్గదర్శకులై మమ్మును వెన్నుతట్టి నడిపిస్తున్నారు. అన్ని సాంస్కృతిక, సేవా సంస్థలకు వారు పెద్ద దిక్కుగా ఉన్నారు. తెలుగువారి సాంస్కృతిక, భాషా ఐకమత్యానికి కృషి చేయిస్తున్నారు. వారి షష్టిపూర్తి సందర్భంగా ఈ అభినందన సంకలనాన్ని ప్రచురించి, విడుదల చేసే కార్యక్రమాన్ని కిన్నెర జరపడానికి అంగీకరించినందుకు వారికి కృతజ్ఞతలు.

వారు ఇప్పుడు 60 వసంతాలు పూర్తి చేసుకుంటున్నారు. మన పెద్దలు ఈ 60 సం॥ల కాలం తరువాత మళ్ళీ పుట్టిన నామ సంవత్సరములో అడుగు పెట్టడం ఒక నవ యవ్వన జీవన ప్రస్థానంగా ఆశీర్వదిస్తారు. "Recycled Youth" అని కొందరు అన్నారు. మళ్ళీ యువ ఉత్సాహంతో, పండిన అనుభవంతో, పరిపక్వమైన జ్ఞానంతో వారు ముందు కార్యక్రమాలను రూపొందిస్తూ పూర్ణ ఆయుష్షుతో వర్ధిల్లాలనీ, వారికి, కుటుంబ సభ్యులకు భగవంతుడు ఆయురారోగ్య, ఐశ్వర్యాలు వర్షించాలని ప్రార్థిస్తున్నాను.

- రొద్దం ప్రభాకరరావు

National Flag Desinger
Sri Pingali Venkaiah

Sri Pingali Venkaiah Smaraka Samstha

(Regd. No. 62/2002)

H.No: 1-9-285/9, Vidya Nagar, Hyderabad - 500 044, Telangana, INDIA
Phones: 040-65762320, 27090918; Mobile No: +919848444734; Fax No: 040-27074949
Email: spvcharitabletrust@gmail.com | Website: www.spvcharitabletrust.org



ఆత్మీయ సందేశం

సత్సంకల్పాలకు, సచ్ఛీలతకు, బుద్ధుని ప్రతినీడగా, తెలుగుభాషా ప్రియతములుగా, తెలుగు నేలాభిమానుడుగా, దేశమాత ముద్దుబిడ్డడుగా, ఒక దిశగా గారాల పుత్రుడేమో! అన్నటులు అందరిలో, నే చిన్నవాడినే కానీ నా తండ్రిపేరునకు నే వారసుడినన్న నడవడికతో దేశనేతల మనస్సులలో తారతమ్యములేక సమాన గౌరవమర్యాదలను యిస్తూ, పొందుతూ అందరిలో ఒక్కడై పొరపచ్చాలు లేని మనసుతో నిరాడంబరునిగా ప్రతిక్షణం నాబోటి వారికి తలచుకొనగానే మంచి మనసుతో పలకే వారి ముఖబింబమే కాదు, మంచి శ్రీమతితో, చిన్నారులతో వారి గృహం సందర్శించగానే మంచి కుటుంబమంటే యిదికదా! మంచి రాజకీయమంటే యిదికదా! అని అనిపించే శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు; మా జాతీయపతాక రూకర్త శ్రీ పింగళి వెంకయ్య ఛారిటబుల్ ట్రస్ట్ మరియు స్మారక సంస్థలకు గౌరవాధ్యక్షులుగా వుండి, వారి దివిరత్నానికి సానపెట్టిన మూర్తి, మా ట్రస్టు నుండి మేమెంచుకున్న పవిత్ర **బంగారు పతకం** శ్రీ పింగళి వెంకయ్య గారి గౌరవార్థం ప్రప్రథమంగా **బహూకరించి**, వారికి **"తెలుగు భాషోద్యమ రథసారథి"**గా బిరుదాన్నిచ్చి గౌరవించుకున్న అదృష్టవంతులం. మా ట్రస్టు యొక్క సత్సాంప్రదాయానుసారంగా మాకు దక్కింది.

అట్టి సుగుణశీలికి **భీమరథశాంతి (షష్టిపూర్తి) మహోత్సవం** శతాధికవత్సరముల ఆయుషు నిచ్చి, మరిన్ని వసంతాలు వారు కుటుంబసభ్యులతో నూతనోత్సాహులై, మరిన్ని సుగంధ రాజకీయ పుష్పాలను వెదజల్లాలని తెలుగుతల్లి ఆశగా ఆనందంగా ఎదురుచూస్తుందని, నా ప్రగాఢ విశ్వాసం. అలాగని సంపూర్ణ ఆనందంతో వారికి మా సంతోషాన్ని తెలియపరచుచున్నాను మహదానందంతో...

ఈ మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కిన్నెర సంస్థవారికి నా హృదయపూర్వక అభినందనలు.

ఇట్లు

కె.హెచ్.ఎస్. జగదంబ

(కె. హెచ్.ఎస్. జగదంబ)

వ్యవస్థాపక అధ్యక్షురాలు

Dr G SAMARAM MBBS., FCGP, FIMSA, FAMS, MSCEPI
National President
Indian Medical Association (2009-10)

Vasavya Nursing Home
Benz Circle, Vijayawada - 520010
Andhra Pradesh, INDIA
Cell : 98481 24977
E-mail:drsamaram@hotmail.com

సాహితీ మిత్రులు

శ్రీ మండలి బుద్ధప్రసాద్ పేరులోనే బుద్ధుడు ఉన్నాడు. ఆయన శాంతమూర్తి, అహింసామూర్తి. ఆయన గాంధేయవాదానికి ప్రతీక. గాంధేయవాదులకి ఆదర్శం. సేవాతత్పరత, నిరాడంబరత మూర్తీభవించిన వ్యక్తి. అలుపెరగని సంఘసేవాపరాయణుడు.

ఎవరిలోనూ లేని ఒక ప్రత్యేకత ఆయనలో ఉంది. సాహిత్యమన్నా, సాహితీవేత్తలన్నా ఆయనకి చెప్పలేనంత అభిమానం. ఆయన లేని సాహితీ సభ లేదనవచ్చు. ఒకవేళ ఆయన లేని సాహితీ సభ నిర్వహింపబడితే అది వెలవెలాబోతూ ఉంటుంది. ఏ సాహితీ సభలో ఆయన ఉన్నా జీవం తొణికిసలాడుతుంటుంది. సాహితీవేత్తలకు ఆయన ఒక పెద్ద అండ. ఆయన మాట చాలు, సాహితీవేత్తలకు ఎంతో స్ఫూర్తి వస్తుంది. పదవి ఉన్నా లేకపోయినా ఆయనకి చెప్పలేనంత విలువ ఉంది, గౌరవం ఉంది. ఇది ఆయన వ్యక్తిత్వానికి గొప్ప నిదర్శనం.

ఎందరో వ్యక్తులు పదవుల్లో ఉండగా వెలుగొందుతారు. పదవి లేకపోతే విలవిలలాడిపోతారు. వారిని పిలిచే నాథుడు ఉండడు. వారి వెంట మనుష్యులు ఉండరు. కాని శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారు ఈ విషయంలో పూర్తిగా ఎక్స్‌ప్షనల్. పదవి ఉన్నప్పుడు ఆయన ఎన్ని మన్ననల పొందారో, పదవిలో లేనప్పుడు కూడా అంతగానో, అంతకంటే మించో ఆయన మన్ననలు పొందారు. దిస్ ఈజ్ రియల్లీ గ్రేట్.

వారితో నా పరిచయం ఈనాటిది కాదు, ఏనాటిదో. వాళ్ల నాన్నగారు శ్రీ మండలి కృష్ణారావుగారు, మా నాన్నగారు శ్రీ గోరాగారు అత్యంత సన్నిహితులు, గాంధేయవాదులు, సర్వోదయవాదులు, సంఘసంస్కర్తలు. మా కుటుంబానికి, వారి కుటుంబానికి ఎంతో అనుబంధం ఉంది. శ్రీ బుద్ధప్రసాద్‌గారు వారి చిన్నప్పటి నుంచి నాకు తెలుసు. చిన్నతనంలో ఆయన ఎంత సాదాసీదాగా ఉన్నారో, గాంధేయవాదిగా వారి నాన్నగారితో ఎలా కొనసాగారో, ప్రజలతో మమైక్యం అయ్యారో అదే విధంగా ఈనాటికీ ఆయనలో ఆ సాదాసీదాతనం, గాంధీతత్వం, సంఘసేవాభావం వెలుగొందుతూనే ఉన్నాయి. చాలామంది యువకులు వయస్సు పెరిగిన తర్వాత, పదవులు వచ్చిన తర్వాత మారిపోతారు, మరోలా తయారవుతారు. కాని నేనెరిగిన మండలి బుద్ధప్రసాద్‌గారు ఆనాటికీ ఈనాటికీ ఒక్కటే. వారిలోని మంచితనం, స్నేహశీలత అలాగే వెలుగొందుతున్నాయి.

శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారి చేతుల మీదుగా నా పుస్తకావిష్కరణ సభలు జరిగాయి. ఆయన చేతుల మీదుగా నేను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు అందుకున్నాను. ఆయన చేతుల మీదుగా అనేక పురస్కారాలు అందుకున్నాను. నేను ఎన్ని పురస్కారాలు అందుకున్నా మండలి బుద్ధప్రసాద్‌గారి చేతుల మీదుగా అందుకున్న పురస్కారాలే నన్ను ఎంతో పులకింప చేస్తుంటాయి. దానికి కారణం వారి మంచి హృదయమే.

అటువంటి మహనీయుని షష్టిపూర్తి సందర్భంలో నా మనస్సులో మాటని అక్షరరూపంలో సాక్షాత్కరింప చేస్తున్నందుకు ఎంతగానో ఆనందంగా ఉంది. ఆయన ప్రజలతో మమైక్యమై, సాహితీవేత్తల ఆత్మీయుడై వందేళ్ళు ఆయుఃరారోగ్యాలతో వెలుగొందాలని కోరుకుంటున్నాను. వారికి నా శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను.

జి. సమరం
(డా॥జి.సమరం)

అభినందన

పెద్దలు పెట్టినపేరుకు, ప్రవర్తనకు పొంతన కుదిరిన అతి కొద్దిమందిలో శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారు ఒకరు. బుద్ధప్రసాద్‌గారు మాకు సన్నిహితులు. వారితో స్నేహం వున్నదని అనుకోవడమే మాకు చాలా సంతోషంగా వుంటుంది. ఎప్పుడూ ఉల్లాసంగా, చిరునవ్వు చెదరకుండా వుంటారు బుద్ధప్రసాద్‌గారు. రాజకీయాలు, భాషా సాంస్కృతిక అంశాలపట్ల ప్రేమ అనే రెండు కత్తులను ఒక ఒరలో ఇమిడ్చి సమర్థవంతంగా నిర్వహిస్తున్న బుద్ధప్రసాద్‌గారిని చూస్తే చాలా ఆశ్చర్యం, గౌరవం కలుగుతుంటాయి. స్వాతంత్ర్యోద్యమకాలంలో సాహిత్యంలో అభినివేశం వున్న దిగ్గంతుల వంటి రాజకీయవేత్తలుండేవారు. జాతీయస్థాయిలో చూస్తే పండిత జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, పి.వి. నరసింహారావు, అటల్ బిహారీ వాజ్‌పేయి వంటివారుంటే మన రాష్ట్రస్థాయిలో బెజవాడ గోపాలరెడ్డి, అయ్యదేవర కాళేశ్వరరావు లాంటివారున్నారు. ఇలాంటి వారికి కొనసాగింపు మన బుద్ధప్రసాద్‌గారు.

ఎంత సమూహంలోవున్నా ఒక రచయితనో, చరిత్రవేత్తనో చూస్తే పేరుతో పిలిచి, పలకరించి, ఇప్పుడు వారేంచేస్తున్నారో కనుక్కోవడం అనే లక్షణం రాజకీయనాయకులలో ఒక్క బుద్ధప్రసాద్ గారిలోనే గమనిస్తాము.

అందుకే మా ఫౌండేషన్ తరుపున పునఃప్రచురించిన తొట్టతొలి తెలుగు నిఘంటువు ఆంధ్రదీపికను, తొట్టతొలి చరిత్ర సంచిక శ్రీ రాజరాజ నరేంద్ర పట్టాభిషేక సంచికను బుద్ధప్రసాద్‌గారి చేతులమీదుగా ఆవిష్కరింపచేశాము.

మిత్రులు, సహృదయులు శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారు మరిన్ని కీర్తి శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాము.



శ్రీ రాజరాజనరేంద్ర పట్టాభిషేక సంచిక ఆవిష్కరణ
మోదుగుల రవికృష్ణ, వకుళాభరణం రామకృష్ణ,
మండలి బుద్ధప్రసాద్, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి



తొట్టతొలి తెలుగు నిఘంటువు - ఆంధ్రదీపిక ఆవిష్కరణ, 16-08-2014
ఎడమనుండి: శ్రీ జి.వి. గున్నయ్యశ్రేష్ఠి, శ్రీ మండలి బుద్ధప్రసాద్,
శ్రీ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, శ్రీ వెలగా వెంకటప్పయ్య, శ్రీ కోడాటి వియ్యన్నారావు,
శ్రీ జి.వి. పూర్ణచంద్

బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, ఛైర్మన్
బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్,
గుంటూరు

'కిన్నెర' మాట

కిన్నెర 1977లో స్థాపించబడి నేటి వరకు కొన్ని వందల, వేల సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించింది. ప్రముఖ సాహితీమూర్తుల శతజయంతి ఉత్సవాలు, సుప్రసిద్ధ కళాకారుల షష్ట్యబ్ది పూర్తి మహోత్సవాలను, గ్రంథావిష్కరణలను, భాషామహోత్సవాలను, అనేక కళారూపాలకు సుదీర్ఘమైన ఉత్సవాలను ఘనంగా నిర్వహించింది.

1980లో కిన్నెర పబ్లికేషన్స్ ప్రారంభించి నేటివరకు 112 గ్రంథాలను తెలుగువారికి అందించింది. వాటిలో 'శ్రీ రమణ మహర్షితో సంభాషణలు', 'తెలుగు భాషా వైభవం', 'మా నాన్నగారు', 'అమ్మ', 'పాడనా తెలుగు పాట', 'తెలుగు రచయిత డైరెక్టరీ', 'వాగ్విలాసం' మొదలైన విశిష్ట గ్రంథాలున్నాయి.

కిన్నెర 113వ ప్రచురణగా శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి షష్ట్యబ్ది పూర్తి సందర్భంగా 'అభినందన గ్రంథం' ప్రచురించి సాహితీప్రియులకు అందించడం మా అదృష్టంగా భావిస్తున్నాము.

గత నలభై సంవత్సరాలుగా శ్రీ మండలి కుటుంబంతో కిన్నెరకు, నాకు సాంస్కృతిక అనుబంధం కొనసాగుతున్నది.

అపర గాంధేయవాదిగా పేరుపొందిన పూర్వ మంత్రివర్యులు కీ.శే. శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారు కిన్నెర నిర్వహించిన ఎన్నో కార్యక్రమాలలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆశీస్సులు అందించారు. ముఖ్యంగా 1992లో శ్రీ పి.వి. చలం గారి దర్శకత్వంలో కిన్నెర నిర్మించిన చిత్రం 'అమరజీవి పొట్టి శ్రీరాములు' టెలిఫిల్మ్‌ని శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారు ప్రారంభించారు.

తెలుగు భాషారథసారథిగా, సాహిత్య సాంస్కృతిక అభిమానిగా, బహు గ్రంథకర్తగా శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు తెలుగువారందరికీ సుపరిచితులు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలోని తెలుగు వారికి, ప్రవాసాంధ్రులకు, విదేశాంధ్రులకు - వారి ఇళ్ళల్లో, వారి గుండెల్లో తెలుగుకి మారుపేరు 'మండలి బుద్ధప్రసాద్.' పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని 'మండలి వెంకట కృష్ణారావు' అంతర్జాతీయ తెలుగు కేంద్రం ద్వారా, ఇతర రాష్ట్రాలలోను, ఇతర దేశాలలోను తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి విశేష కృషి చేస్తున్నారు బుద్ధప్రసాద్ గారు. ప్రవాసాంధ్రులకు, విదేశాంధ్రులకు ఇక్కడి ప్రభుత్వానికి మధ్య వారధి బుద్ధప్రసాద్ గారు.

గత 20 సంవత్సరాలుగా 'కిన్నెర' నిర్వహించిన పలు సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలలో ముఖ్య అతిథిగా, అధ్యక్షులుగా పాల్గొని 'కిన్నెర' ఎదుగుదలకి ఎంతో సహకరించారు బుద్ధప్రసాద్ గారు. అధికార భాషా సంఘం అధ్యక్షులుగా నియమించబడినపుడు ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతిగా నియమించబడినపుడు వారికి ఆత్మీయ సత్కారం నిర్వహించింది 'కిన్నెర'.

'కిన్నెర' గౌరవ సలహాదారులుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి షష్ట్యబ్ది పూర్తి మహోత్సవాన్ని 27 మే, 2016న రవీంద్రభారతిలో నిర్వహించే అవకాశం మాకు రావడం, ఆ సందర్భంగా అభినందన గ్రంథాన్ని ప్రచురించడం మాకు ఎంతో ఆనందంగా ఉంది.

ఈ గ్రంథానికి తమ అమూల్యమైన సందేశాలు, వ్యాసాలు, కవితలు వ్రాసి పంపిన వారందరికీ కృతజ్ఞతలు. ముఖ్యంగా ఈ గ్రంథం ప్రచురించిన 'రైతునేస్తం' అధినేత శ్రీ వెంకటేశ్వరరావు గారికి, సహకరించిన డా. గంధం సుబ్బారావు గారికి, శ్రీ మోహన్, శ్రీమతి పద్మ గార్లకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

- మద్దాళి రఘురామ్

కార్యదర్శి

డా॥ గుజ్జుల రవీంద్ర
మేయర్
ఆల్ట్‌లాండ్స్‌బర్గ్, జర్మనీ

అభినందన సందేశం

మిత్రులారా!

మన డిప్యూటీ స్పీకర్ బుద్ధప్రసాద్ గారి షష్టిపూర్తి మన తెలుగువారికి ఒక పండుగ. ఈ సందర్భంగా వారి గురించి కొన్ని మాటలు:

1. బుద్ధప్రసాద్ గారు నా అంచనా ప్రకారం అన్ని విదేశాలలో తెలుగు భాషకు రాయబారి. ఆయన చాలా విదేశాలలో తెలుగు వారితో మాట్లాడటం, తెలుగు కమ్యూనిటీని ఏకం చేయటానికి చాలా కార్యకలాపాలు చేశారు – ముఖ్యంగా వారి ఆధ్వర్యంలో తెలుగు ప్రపంచ మహాసభలు గర్వ కారణంగా జరిగాయి.

2. ఈ సందర్భంగా నాకు వారి జర్మనీ రాక గుర్తుకొస్తుంది:
రాత్రి ఎంత ఆలస్యంగా వచ్చినా నన్ను నిద్ర పోనివ్వకుండా, జర్మనీ సమాజము మరియు చరిత్ర గురించి, రాజకీయాల గురించి చాలా ప్రశ్నలు అడిగి సమాధానాలు వ్రాసుకునేవారు. అప్పట్లో ఎందుకో ఇదంతా నాకు అర్థం కాలేదు. వారు భారతదేశం తిరిగి వెళ్ళగానే తన జర్మనీ అనుభవాల గురించి అందరికీ అర్థం అయ్యేలా చక్కటి పుస్తకం ఒకటి వ్రాసి ప్రింట్ చేశారు.

3. వారు నిజమైన గాంధేయులు – గాంధీగారి మరియు వారి తండ్రి మండలి వెంకట కృష్ణారావుగారి బాటలో నడుస్తూ, ఇప్పటి వరకు ఎంతో నిజాయితీతో, అసలు గర్వమే లేకుండా సాధారణ మనిషిగా, సామాన్య మనుషుల కొరకు పోరాడుతూ జీవిస్తున్నారు. మన రెండు తెలుగు రాష్ట్రాలకు మరియు భారతదేశానికి ఇటువంటి రాజకీయ నాయకుల అవసరము ఎంతో ఉన్నది.

4. నన్ను, నాతో వచ్చిన జర్మనీదేశపు ముఖ్యులను అడుగుతూ ఉంటారు – ఈ సంవత్సరం ఎక్కడెక్కడ ఏమేమి ప్రాజెక్టులు చేస్తారు? చిన్నపిల్లల కోసం విద్యాశ్రమం కట్టిస్తారా/ ఇండ్లు లేని దళిత కులాల వారికి ఇండ్లు కట్టిస్తారా లేక ఆశ్రమాలను కట్టిస్తారా అని. వారి వత్తిడి ద్వారానే మేము జర్మనీ దేశము నుంచి చాలా ప్రాజెక్టులు చెయ్యగలిగాము. ఈ సంవత్సరము మళ్ళీ దాదాపు ఇరవై (20) మంది విద్యార్థులు విజయవాడ ప్రాంతాల్లో నాలుగు (4) వారాలు తెలుగు విద్యార్థులతో గడిపి, తెలుగు సంస్కృతిని తెలుసుకొని మరియు చూసిపోతారు.

జర్మనీ దేశములో ఉన్న మా స్నేహితులందరి దగ్గర నుంచి, లయన్స్ క్లబ్ ఆల్ట్‌లాండ్స్‌బర్గ్ సభ్యుల నుంచి మరియు మా రాష్ట్రపు స్పీకర్ – శ్రీమతి బ్రిత్తాస్టార్క్ నుంచి ముఖ్యంగా నా కుటుంబము తరుపున – గాభీ, ప్రియ, రికోల నుంచి హృదయపూర్వక అభినందనలు.

వారు ఇంకా నలభై (40) సంవత్సరాలు తెలుగు భాషకు, తెలుగు ప్రజలకు సేవచేసే అవకాశం ఉండాలని మా కోరిక ...

✦ ✦ ✦

విషయసూచిక

వ్యాసాలు

కవితలు

సమీక్షలు

వ్యాసాలు

నిరాడంబరతకు నిర్వచనం

- డా. ఎ. చక్రపాణి

ఆధునిక ప్రజాజీవితంలో ప్రజాప్రతినిధులు హంగూ ఆర్భాటాలకు ఇస్తున్న ప్రాముఖ్యం, ప్రజా సమస్యల పరిష్కారానికి ఇస్తే బాగుంటుంది. ఇది ఎంతైనా అవసరం.

ప్రజల సహాయసహకారాల వల్లనే తాము ప్రజాప్రతినిధులుగా విజయం సాధించామని విశ్వసించేవారు అరుదుగా కనిపిస్తారు. అలా అరుదుగా కనిపించే వారిలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతి శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు ఒకరు.

ఎదిగినకొద్దీ ఒదిగి ఉండాలనే నానుడిని సార్థకం చేస్తూ, ఏ పదవిలో ఉన్నా నిరాడంబరతకే పెద్ద పీట వేసే వ్యక్తి మండలి బుద్ధప్రసాద్. ప్రజల తలలో నాలుకలా తన పని తాను చేసుకుంటూ పోయే నాయకుడు బుద్ధప్రసాద్...

శాసనసభ్యుడిగా, మంత్రిగా, రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతిగా శ్రీ మండలి బుద్ధప్రసాద్ పదవిలో ఉన్నా, లేకపోయినా ప్రజలకు మంచి చేయడానికి గడచిన నాలుగు దశాబ్దాలుగా కృషి చేస్తూనే ఉన్నారు.

నిరాడంబరత, నిబద్ధత అన్నవి తండ్రి స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు వారసత్వంగా మండలి బుద్ధప్రసాద్‌కు సంక్రమించిన ఆస్తి. గాంధేయవాదానికి అంకితమైన మండలి వెంకట కృష్ణారావు అడుగు జాడలలోనే మండలి బుద్ధప్రసాద్ తన రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తున్నారు. రాజకీయాలలో తమ స్వంత లాభాల కోసం అధికారాన్ని వాడుకునేటటువంటి ఆధునిక రాజకీయ లక్షణాలు బుద్ధప్రసాద్‌లో ఏ మాత్రం కానరావు.

గాంధేయ వాదంలో భాగంగా నిరాడంబర జీవితం గడుపుతూ, అవనిగడ్డ, దివిసీమ ప్రాంతాల అభివృద్ధికి నిర్విరామ కృషిని కొనసాగిస్తున్న ప్రజా నాయకుడు శ్రీ మండలి బుద్ధప్రసాద్.

రాజకీయ రంగంలోనే కాదు, తెలుగు భాషపై మక్కువ కూడా తన తండ్రి స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు ప్రభావంతో అబ్బిన మరొక అపురూపమైన లక్షణం.


హైద్రాబాద్‌లో జరిగిన మొదటి ప్రపంచ తెలుగు మహాసభలకు అసలైన సారథి, సచివుడు, స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు. భారీ స్థాయిలో జరిగిన ఈ కార్యక్రమాన్ని కేవలం ఒక మంత్రిగా కాకుండా, తెలుగు భాషపై మక్కువతో హృదయపూర్వకంగా ఆ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ప్రజలను, తెలుగు భాషాభిమానులందరినీ ఏకం చేయడానికి జరిగిన బృహత్తర కార్యక్రమమే ఈ ప్రపంచ తెలుగు మహాసభలు. నాడు తండ్రి వెన్నంటి ఉండి ఈ కార్యక్రమాలను చూసిన బుద్ధప్రసాద్ అనంతర కాలంలో తెలుగు భాషకు అంకితమయ్యారు.

రాజకీయ రంగంలో ప్రవేశించకముందే తెలుగు భాషా వికాస కార్యక్రమాలలో ఆయన విశేషంగా పాల్గొన్నారు. మరొక్కసారి ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి నగరంలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలు మండలి బుద్ధప్రసాద్ అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే జరగడం యాదృచ్ఛికమే అయినా, అది అరుదైన, సముచితమైన అవకాశం.

పెద్ద ఎత్తున ఈ మహాసభలు ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ప్రజలకు ఎనలేని ఉత్సాహాన్ని ఇచ్చాయి. దేశంలోని ఇతర రాష్ట్రాలలో మరియు ప్రపంచంలోని ఇతర దేశాలలో ఉన్న పలు తెలుగు భాషా సంఘాలను సంఘటితపరచడానికి మండలి బుద్ధప్రసాద్ చేస్తున్న కృషి ప్రశంసనీయమైనది. తద్వారా తెలుగు భాషాభివృద్ధిలో మండలి బుద్ధప్రసాద్‌కు శాశ్వత స్థానం లభిస్తున్నది.

నిరాడంబరతకు చిరునామా అయిన మండలి బుద్ధప్రసాద్ మున్ముందు కూడా విజయవంతంగా తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తారని ఆశిద్దాం.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ తన షష్టిపూర్తి సందర్భంగా ఆయన కలకాలం ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో, ఐశ్వర్యసిద్ధితో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ...



'తెలుగు బుద్ధుడు' శ్రీ మండలి బుద్ధప్రసాద్
తెలుగు భాషా సంస్కృతుల పునరుజ్జీవనోద్యమం

- గుత్తికొండ సుబ్బారావు, డా. జి.వి. పూర్ణచందు

శ్రీమండలి బుద్ధప్రసాదు తెలుగు భాషా ప్రయోజనం కోసం పుట్టిన వ్యక్తి. తెలుగుభాష ఆయనకు ఏకనిష్ఠ, తదేక ధ్యానమూ కూడా!

రాజకీయాలు ఆయనకు సేవా ధర్మం అయితే, భాషా సంస్కృతులు ఆయనకు జన్మతః అబ్బిన అంశాలు. 2009 ఎన్నికల్లో జీవన్మరణంగా పోటీ జరుగుతున్నా, ఎన్నికలకు ముందురోజు బందరులో కృష్ణాజిల్లా రచయితల సంఘం సభ జరుగుతుంటే వచ్చి పాల్గొన్నారు. అది భాషా సంస్కృతుల పట్ల ఆయన నిబద్ధతకు ఒక ప్రత్యక్ష సాక్ష్యం. గెలిచినా ఓడినా ఒకేలా ప్రతిస్పందించే స్థితప్రజ్ఞత ఆయన ప్రవృత్తి.

"అయితే యోగులూ, కాకపోతే భోగులూ"గా ఉన్న ఈ లోకంలో ఒక యోద్ధుడు, ఒక రసధారా ప్రవర్తకుడూ కలగలసిన నిండయిన మూర్తి మన మధ్యే సంచరిస్తూ, మనలను మనకు తెలీకుండానే తన మార్గాన నడుపుకు పోతున్నాడంటే, మనం ఎంత ధన్యులం...! ఆయన సమకాలీనుల మైనందుకు! అవును. ఆ మూర్తీభవించిన స్థితప్రజ్ఞుడే శ్రీ బుద్ధప్రసాద్! పేరుకు తగ్గ వ్యక్తిత్వం ఆయనది. తానే ఒక చైతన్యమై, తానే ఒక ఆదర్శమై, తానే ఒక ఆలోచనై, తానే ఒక ఆచరణై, స్ఫూర్తిమంతమైన పాత్ర పోషిస్తున్న మరో వ్యక్తి మనకు కానరాడు. అది శ్రీ బుద్ధప్రసాదుకే చెల్లిన వ్యక్తిత్వ సంపద!

రాజకీయాలు, సాంస్కృతిక సేవ అనేవి రెండూ ఒక దానికి ఒకటి పొసగని అంశాలు. ఈ రెండు విరుద్ధ గుణాలనూ ఇముడ్చుకో గలిగిన అర్ధనారీశ్వర తత్వం శ్రీ బుద్ధప్రసాదుకు తండ్రి నుంచి సంక్రమించిన వారసత్వమే! కీ.శే. మండలి వెంకట కృష్ణారావు గారు కవులూ కళాకారులు ఒక వైపునా, రాజకీయ వేత్తలూ, రాజనీతిజ్ఞులూ ఇంకొకవైపునా కుడి, ఎడమలుగా మెరుస్తుంటే, ఒక రాజర్షిలా తెలుగు నేల మీద ప్రకాశించారు. వారి కోవలో, వారి త్రోవలో, వారి ఆదర్శాలను పుణికిపుచ్చుకొని సాగుతున్న శ్రీ మండలి బుద్ధప్రసాదు తెలుగు జాతికి అపురూపంగా దొరికిన ఒక మణిరత్నం.

తెలుగుభాషా సంస్కృతుల పరిరక్షణ, పునరుజ్జీవనం, పురావైభవాన్ని చాటటం ఆయన లక్ష్యం. అందుకు ఎంతటి శ్రమ కైనా తట్టుకో గలిగే గుండెనిబ్బరం ఆయనకుంది. దార్శనికుడైన తండ్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావు, సంస్కృతీ ప్రతిబింబమైన తల్లి శ్రీమతి ప్రభావతీదేవి కలల పంటగా 1956 మే నెల 26వ తేదీన శ్రీ బుద్ధప్రసాద్ జన్మించారు, తెలుగుదనం నిండిన కుటుంబం వారిది. శ్రీ బుద్ధప్రసాద్ ఆలోచనలన్నీ తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణ దిశగా సాగాయి.

లబ్ధ ప్రతిష్ఠులైన వారితో బాల్యం నుంచీ ఆయనకు సాన్నిహిత్యం ఉంది. ఆ యింట పుట్టటమే ఒక అదృష్టం. పెద్దలైన వారిని దగ్గరగా అధ్యయనం చేసేందుకు శ్రీ బుద్ధప్రసాదుకు గొప్ప అవకాశం కలిగింది. బహుశా అది చాలా తక్కువ మంది యువకులకు దొరికే అదృష్టం అని చెప్పాలి.

ఒకసారి దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు కృష్ణారావు గారింటికి వచ్చారు. ఆయన ఇంట్లో ఉన్నంత సేపూ ఏదో తెలియని ఆరాధనా భావంతో ఆయన వెన్నంటే ఉన్నారట శ్రీ బుద్ధప్రసాద్. అప్పటికి శ్రీ బుద్ధప్రసాద్ చాలా చిన్నవాడు. కృష్ణశాస్త్రి గారు వెళ్ళేప్పుడు ఆయన్ని కారు దాకా దిగబెట్టేందుకు వెడితే, కృష్ణ శాస్త్రి గారు ఒక కాయితం మీద "నా గురువు ఎవరో తెలుసా...?" అని వ్రాసి చూపించారట. దానికి తడుముకోకుండా, "రఘుపతి వెంకట రత్నం నాయుడు గారు" అని సమాధానం ఇచ్చారట బుద్ధప్రసాదు. ఆయన కన్నీళ్ళతో శ్రీ బుద్ధప్రసాదుని కావులించుకొని, తన సంచీలోంచి "ఋగ్వీథి" అనే పుస్తకం తీసి ఆయన చేతిలో పెట్టారు. అది శ్రీ రఘుపతివారి సూక్తులకు కృష్ణశాస్త్రి గారు స్వయంగా అల్లిన పద్యాల సంకలనం. శ్రీ బుద్ధప్రసాదు ఆ గ్రంథాన్ని చాలా భక్తితో అందుకున్నారు.

గురుభక్తి ఎలా ఉంటుందో ఆయనకు ఆ సంఘటన గొప్ప పాఠం నేర్పింది. ఆనాడే కాదు, ఈనాటికీ పెద్దలంటే అదే గురుభావం కనబరుస్తారు శ్రీ బుద్ధప్రసాదు. తండ్రి కొన్నిగుణాలు నూరిపోశా రాయనకి. జీవితంలో సత్పురుషులతోనే సాంగత్యం చెయ్యాలనీ, పెనుసవాళ్ళు ఎదురయితే బాధ్యతాయుతంగా నడుచుకోవాలనీ, అభివృద్ధి కార్యక్రమాలమీదే దృష్టి ఉంచుకోవాలనీ, ఏ పని చేసినా అది ప్రజలకు ఎంతో కొంత మేలు కలిగించేదిగా ఉండాలనీ, జాతికి స్ఫూర్తినిచ్చే అంశాలకు ప్రాధాన్యత నివ్వాలనీ, భాషా సంస్కృతుల పరిరక్షణకు నడుం కట్టాలనీ, ఎంతటి విపత్తు సంభవించినా గాంధేయ మార్గం వీడరాదనీ తండ్రి ఆయనకు నేర్పిన సుద్దులు! "ఉప్పెనలో నడిచేవాళ్ళు చైతన్యవంతులు-ఉప్పెనకు దడిసే వాళ్ళు జీవన్మృతులు" అనే ఖలీల్ జిబ్రాన్ సూక్తి ప్రేరణగా తన తండ్రి హితవచనాలను శ్రీ బుద్ధప్రసాదు ఆకళింపు చేసుకున్నారు.

సమాజం, సాహిత్యం, సంస్కృతుల త్రివేణి శ్రీ మండలి బుద్ధప్రసాద్. తెలుగు వాస్తవికతకు నిలువెత్తు నిజం ఆయన. మహర్షులందరూ ఒక ఎత్తూ, అగస్త్యుడొకరూ ఒక ఎత్తూ అన్నట్టుగా ఈ సామాజిక వ్యవస్థలో శ్రీ బుద్ధప్రసాద్ ఒక్కరూ ఒక ఎత్తు.

"శ్రీ బుద్ధప్రసాద్ పూర్వ మంత్రి కాదు, అపూర్వ మంత్రి" అన్న సినారె పలుకులు అక్షర సత్యాలు. జాతీయతా భావం, జాతి సాంస్కృతిక వారసత్వాల పట్ల నిబద్ధత కలిగిన 'గాంధీతరం' రాజకీయ నాయకుల వారసత్వాన్ని నిలుపుకొస్తున్న ఏకైక వారసుడు శ్రీ బుద్ధప్రసాద్ అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అభివర్ణించారు, ఈ మాటలు శ్రీ బుద్ధప్రసాద్ వ్యక్తిత్వానికి అద్దం పడతాయి.

సాహితీవేత్తగా శ్రీ బుద్ధప్రసాద్

బుద్ధప్రసాద్ గారిలో భాషాభిమాని మాత్రమే కాదు, ఒక మంచి రచయిత కనిపిస్తాడు, విమర్శకుడు తొంగి చూస్తాడు, భాషావేత్త పలకరిస్తాడు, చక్కని వచనం రాసే పత్రికా రచయిత భాసిస్తుంటాడు. చక్కగా విడమరిచి వివరించగల వచోవైభవం ఆయనలో తారట్లాడుతుంటుంది. వీటన్నింటినీ మించి, ఆయనలో ఒక చరిత్రకారుడు ఈ లోకం పుట్టుపూర్వోత్తరాలను తడిమి చూస్తుంటాడు. విషయ వివేచన చేయగలిగిన అద్భుత రచయిత ఆయన.

శ్రీ బుద్ధప్రసాద్ విస్తృతంగా విదేశాల్లో పర్యటించారు. అవి విహార యాత్రలుగా కాక, ఆయా దేశాల సంస్కృతీ వికాసాలు పరిశీలిస్తూ, ప్రతీ యాత్రపైనా ఒక యాత్రాచరిత్ర గ్రంథం వ్రాశారు. 'మారిషసులో తెలుగు జీవనం', 'నా జర్మనీ యాత్ర', 'లండనులో తెలుగు వైభవ స్మృతులు' గ్రంథాలు వ్రాశారు. శాసన సభ్యుడిగా ఎన్నో దేశాల్లో అధికారికంగా జరిపిన పర్యటనల విశేషాలతో 'ప్రజలూ-ప్రగతి' అనే విశ్లేషణాత్మక రచన చేసారు. నాటి ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు, ప్రతిపక్షనాయకుడు డా. వై.యస్. రాజశేఖరరెడ్డి ఆ పుస్తకానికి ముందుమాటలు వ్రాశారు. శ్రీ బుద్ధప్రసాద్ వివిధ అంశాలమీద ఎన్నో పత్రికల్లో వందలాది వ్యాసాలు వ్రాశారు. యాభైకి పైగా

సాహిత్య, సామాజిక గ్రంథాలకు ముందుమాటలు వ్రాశారు. మహనీయులకు నివాళిగా వారు రాసిన వ్యాసాలే ఒక సంకలనం అవుతాయి. విశ్వనాథ నుండి సినారె, వేటూరి వరకూ ఎందరితోనో ఆత్మీయ బంధం ఆయన కుంది.

ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గారితో కలిసి లండన్ లో పర్యటించినప్పుడు తెలుగు భాషకు అపూర్వ సేవ చేసిన ప్రాతః స్మరణీయుడు సి.పి. బ్రౌన్ సమాధిని ఆ ఇద్దరూ కలిసి లండన్ శ్మశాన వాటికలో సమాధులన్నీ గాలించి కనుగొని లండన్ తెలుగు సంఘం వారి చేత దాన్ని పునరుద్ధరింప చేశారు. అలాగే, లండన్‌లోనే సర్ ఆర్థర్ కాటన్ సమాధిని సందర్శించి ఘనంగా నివాళి అర్పించారు. కాటన్ గారి మనుమడు రాబర్ట్ కాటన్ గారిని ప్రభుత్వ అతిథిగా రాష్ట్రానికి ఆహ్వానించి కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాలన్నీ సందర్శింపచేసి, ఘనంగా సత్కరించి పంపారు.

హోసూరులోనూ, బ్రహ్మపురంలోనూ, చెన్నైలోనూ, ముంబాయిలోనూ, బెంగుళూరులోనూ, ఇంకా ఎన్నో చోట్ల తెలుగు ఉత్సవాలు, తెలుగు జానపద కళల ప్రదర్శనలు విజయవంతం కావటానికి ఆయన ప్రత్యక్ష ప్రమేయం ముఖ్య కారణం.

గాంధేయ వాదం

గాంధేయ వాదం, గాంధీనాదం ప్రతిధ్వనించే గాంధీక్షేత్రం ఆయన ఇల్లు... పుట్టిన నాటినుంచీ పెరిగిన, ఎరిగిన, ఎదిగిన వాతావరణం గాంధీయతే! జాతీయతా భావం మూర్తీభవించిన వ్యక్తిత్వం ఆయనది.

డా. బెజవాడ గోపాలరెడ్డి, ఆచార్య యన్.జీ. రంగా, ప్రభాకర్ జీ వంటి సత్పురుషుల సాంగత్యం చిన్ననాటినుంచే ఆయనకు కలిగాయి. శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారి సేవానిరతిని అందుకొంటూ, ఆ తండ్రి ఆలోచనల్లోంచి, ఆచరణల్లోంచి, ఆకాంక్షల్లోంచి అంకురించి, తండ్రిని మించిన మహావృక్షమై ఎదిగాడు శ్రీ బుద్ధప్రసాద్. ఆకారంలోనే కాదు. ఆచరణలో కూడా ముమ్మూర్తులా ఆయన కృష్ణారావుగారే!

చిన్ననాడే అఖిలభారత నిర్మాణ కార్యకర్తల మహాసభ, ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సంఘసేవకుల మహాసభ అవనిగడ్డలో నిర్వహించిన అనుభవం, తద్వారా పొందిన పరిణతి ఆయనకు గాంధేయ నిర్మాణ కార్యక్రమాలు బాగా వంటబట్టే అవకాశం కలిగించాయి. గాంధీజీ 18 అంశాల నిర్మాణ కార్యక్రమంలో మాతృభాష పరిరక్షణ ఒకటి కావటంతో ఆయన ఆలోచనలన్నీ అమ్మభాష మీద లగ్నం అయ్యాయి. 'మాతృభాష తృణీకారం మాతృమూర్తి తిరస్కారం' అనే గాంధీ సూక్తి చిన్ననాడే మనసును పట్టుకొంది. అదే పట్టుగొమ్మగా ఏకైక నినాదమై, ఏకైక విధానమై, తెలుగుభాషోద్యమ నిర్మాణానికి నడుం బిగించేందుకు ఆయనకు స్ఫూర్తి నిచ్చింది.

1990లలో గాంధేయభావ వ్యాప్తి కోసం దశాబ్దికి పైగా 'గాంధీక్షేత్రం' మాసపత్రిక సంపాదకులుగా ఆ పత్రికని వ్యయ ప్రయాసల కోర్చి నిర్వహించారు. ఆం.ప్ర. చిన్నపత్రికల సంఘం ఆయనకు ఆనాడే ఉత్తమ సంపాదకుడి పురస్కారం ఇచ్చి గౌరవించింది. గాంధేయ సమాజ సేవా సంస్థ కార్యదర్శిగా అనేక శిక్షణా శిబిరాలను నిర్వహించారు. శ్రీ ఏటుకూరి బలరామమూర్తి 'గాంధేయ మార్గం–తాత్వికత', శ్రీ తల్లాప్రగడ ప్రకాశరావు ఆత్మకథ 'నా రాట్నచక్రం' శ్రీ మధురాంతకం రాజారావు 'తెలుగు కథలలో గాంధీ దర్శనం', శ్రీ జోశ్యుల సూర్యనారాయణమూర్తి 'ఆచార్య వినోబా', శ్రీ కాశీనాథుని పూర్ణ మల్లికార్జునుడు 'గాంధీ నిర్మాణ కార్యక్రమాలు', 'శ్రీ వియోగి హరి 'అస్పృశ్యత' గ్రంథాలను ఆ సంస్థ పక్షాన ప్రచురించారు.

మహాత్ముడిని మనం కోల్పోయి ఆరు దశాబ్దాలు దాటిపోయింది. ఇంకా దేశీయుల్లో జాతీయతా స్ఫూర్తి కొనసాగుతున్నదంటే గాంధీమార్గం సుస్థిరంగా ఉన్నదనే అర్థం. ఈ నాటి సామాజిక వ్యవస్థలో గాంధీ సజీవుడిగా

ఉండి ఉంటే ఏం చేసేవాడనేది ఊహాజనిత ప్రశ్న కాదు. గాంధీ నిష్క్రమణం తరువాత ఆయన ఎవరికోసం అహరహం పరితపించారో ఆ హరిజన, గిరిజన, బడుగు ప్రజల జీవితాల్లో పెద్దగా వచ్చిన మార్పేమీ లేదు కాబట్టి, గాంధీ జీవించి ఉంటే, తన పోరాటం కొనసాగించే వాడనీ, అనుకున్నది తప్పక సాధించే వాడని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఒక వేముల కూర్మయ్యని, ఒక వెన్నెలకంటి రాఘవయ్యనీ తలచుకున్నప్పుడు కారణజన్ములు లోకం కోసమే పుడతారని అనిపిస్తుంది. బడుగుల బతుకుల్లో మార్పు లేదంటే, గాంధీ అవసరం ఈనాడు ఎంతైనా ఉందని అర్థం.

రాజకీయ చిత్తశుద్ధి కొరవడి, వెనుకబాటుతనం అనే విషవృక్షం దేశంలో విషబీజాలనే నాటుతోంది. గిరిసంపద దోపిడీ, అధికారుల అవినీతి, మధ్య దళారీల అకృత్యాలు, ప్రభుత్వ నిర్లిప్తత ఇవన్నీ ఆ విషవృక్షపు ఫలాలే! రాజకీయ నిర్లిప్తత వల్లనే వీధి స్థాయి నీచులు కూడా మాఫియా స్థాయికి ఎదుగుతున్నారు. ఈ దేశం బాగుపడాలంటె, ప్రజలే గాంధీగిరి చెలాయించాల్సిన అవసరం ఉంది. ఒక్కొక్కరుగా కాకుండా ముక్తకంఠంతో అందరూ ఖండిస్తేనే అవినీతి అందలం దిగుతుంది. గాంధీ లేని లోటు లోటే! దాన్ని తీర్చే ఏకనాయకుడు, లోక నాయకుడు తయారు కాకపోవటం దురదృష్టం.

రాజకీయ రంగ ప్రవేశం

శ్రీ బుద్ధప్రసాద్ జాతీయ సమైక్య వాది. కుటుంబ వారసత్వంగా ఆయనకు సంక్రమించిన అంశం అది! సహజంగా మృదు స్వభావిగా కనిపించినా, మాట మెత్తగా అనిపించినా, నిర్ణయాల విషయంలో ఆయన దృఢచిత్తత ఆశ్చర్యాన్ని కల్గించేదిగా ఉంటుంది.

ప్రజలే కాదు, అధికారులు, ప్రభుత్వం కూడా శ్రీ బుద్ధప్రసాద్‌ను సంస్కృతీ సంప్రదాయలకు ప్రతినిధిగానే సంభావిస్తారు. రాజకీయ నాయకులకు ప్రవేశం లేదు అని నిషేధించిన చోటుకి కూడా సగర్వంగా తల ఎత్తుకొని వెళ్ళ గలిగే ఉన్నత వ్యక్తిత్వం ఉన్న రాజకీయవేత్త శ్రీ బుద్ధప్రసాద్. నేటి నేతలకు ఆయనొక రోల్ మోడల్, ఒక ఆచరణీయ ఆదర్శం. ఒక యోగ్యతా పత్రం!

ఆయన రాజకీయ రంగ ప్రవేశం కూడా తప్పనిసరి పరిస్థితుల్లో జరిగింది. 1972 'జై ఆంధ్ర' ఉద్యమ కాలంలో తండ్రి మండలి వెంకట కృష్ణారావుగారు రాష్ట్ర మంత్రిగా సమైక్య వాదానికి కట్టుబడి ఉన్నందుకు, ఒక విధమైన వెలిని ఎదుర్కొన్నారు. తండ్రి హైదరాబాదు నుండి జిల్లాకు రాలేని పరిస్థితి. అవనిగడ్డలో కుటుంబం అంతా ఒక ఏడాదిపాటు గృహ నిర్బంధంలో, పోలీస్ పహరా మధ్య జీవన్మరణ సమస్యగా జీవించారు. ఆ సమయంలో కాంగ్రెస్ కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు శ్రీ బుద్ధప్రసాద్ రాజకీయాల్లోకి రావలసి వచ్చింది.

పలకరించేందుకు చుట్టూ ఎవరూ లేని పీడకల లాంటి ఆ రోజుల్లో శ్రీ బుద్ధ ప్రసాద్‌కు పుస్తకాలే నేస్తాలు.తెలుగు భాషాసాహిత్యాల మీద ఆయనకు ఆసక్తి కలగటానికి అప్పుడు చేసిన అధ్యయనమే కారణం. అదే రాజకీయ నాయకుల్లో ఆయనకు ఒక ప్రత్యేక వ్యక్తిగా గుర్తింపు తెచ్చింది. దివిసీమ ఉప్పెన సమయంలో చేసిన సేవలు, అనాథ బాల సంరక్షణ కేంద్రమూ, ఇంకా ఎన్నో అంశాలు ఆయన్ని భాషాసేవాపరాయణుణ్ణి చేసాయి.

తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ సుదీర్ఘకాలం ప్రతిపక్షంలో గడిపింది. కృష్ణాజిల్లాలో కాంగ్రెస్ పీకలదాకా కష్టాల్లో కూరుకొని, నిస్తేజంగా ఉన్న కాలం అది! పదేళ్ళపాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసి, శ్రీ బుద్ధప్రసాద్ ఆ పార్టీకి జవసత్వాలు నింపి మెజారిటీ బాటన నడిపించగలిగారు. 2007లో శ్రీ బుద్ధప్రసాద్‌కు రెండవ విడత మంత్రివర్గ విస్తరణలో తప్పకుండా అవకాశం వస్తుందనీ, ఆయనకు విద్యా, సాంస్కృతిక శాఖలు అప్పగిస్తారని అందరూ ఎదురు చూశారు. ఎక్కడ ఏ సభ జరిగిన ప్రతి ఒక్కరూ ఆ విషయాన్నే ప్రస్తావించేవారు.

కృష్ణాజిల్లా దివిసీమలోని శ్రీకాకుళంలో ఆంధ్రమహావిష్ణు దేవాలయ ప్రాంగణంలో ఒక మంటపంలో కూర్చుని శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యద కావ్యానికి శ్రీకారం చుట్టిన కథ అందరికీ తెలిసినదే! బాసిపీటలు వేసుకుని కూర్చుని కావ్యరచన చేస్తున్నభంగిమలో కృష్ణదేవరాయల నిలువెత్తు విగ్రహాన్ని శ్రీ బుద్ధప్రసాద్ అక్కడ ప్రతిష్ఠింపచేస్తున్నారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ పక్షాన, రెండు రోజులు సభలు జరుగుతున్నాయి. సరిగ్గా సభలు ప్రారంభమయ్యే సమయానికి కృష్ణాజిల్లాకు ముఖ్యమంత్రి అధికార పర్యటనకు వచ్చారు. పదవులు ఆశించే రాజకీయ శక్తులన్నీ ముఖ్యమంత్రి చుట్టూ కేంద్రీకరించాయి. శ్రీ బుద్ధప్రసాద్ మాత్రం సభల ఏర్పాటు మీద మాత్రమే మనసు లగ్నం చేశారు. ముఖ్యమంత్రిని కలవటానికి విమానాశ్రయానిక్కూడా వెళ్ళలేదు. అదీ ఆయన నిబద్ధత. పదవులూ, ప్రలోభాలూ కాదు, ఉద్యమాలు నిబద్ధతతో నిర్మాణం అయితేనే విజయం సాధిస్తాయి. అందుకే, మళ్ళీ చెప్పిందే చెప్పినా తప్పు లేదు- గాంధీజీ నాయకత్వం ఎలా ఉండేదో శ్రీ బుద్ధప్రసాదు నాయకత్వాన పనిచేస్తున్నవారికి అనుభవైక వేద్యం అవుతోంది.

పెనుసవాళ్ళు అనదగిన సంఘటనలు ఆయన జీవితకాలంలో అనేకం సంభవించాయి. 2003లో కృష్ణాడెల్టా ఎండిపోయి, రెండు పంటలు పండించే రైతు ఒక పంట కూడా వెయ్యలేని పరిస్థితి వచ్చినప్పుడు, సత్వర చర్యలు చేపట్టవలసిందిగా ప్రభుత్వాన్ని కోరడం కోసం పెను ఉద్యమం నిర్వహించవలసి వచ్చింది. కృష్ణాడెల్టా పరిరక్షణ సమితిగా వివిధ రాజకీయ పక్షాల నాయకులు ఏర్పడి, దానికి శ్రీ బుద్ధప్రసాదుని కన్వీనరుగా ఎన్నుకున్నారు. శాసన సభ్యునిగా అవనిగడ్డ నియోజకవర్గంలో తిరుగుతూనే సాయంత్రం అయ్యేసరికి విజయవాడ చేరుకొని-ఇంజనీర్లతో, మేధావులతో కూర్చుని డెల్టా స్థితిగతులను అర్థం చేసుకొనే ప్రయత్నం చేశారాయన.

పార్టీ జెండాలు పక్కన పెట్టించి, అందరి చేతా సర్ ఆర్థర్ కాటన్ బొమ్మ ముద్రించిన జెండాలు పట్టించారు. శ్రీ బుద్ధప్రసాద్ నాయకత్వంలో జరిగిన ఆనాటి ఉద్యమం, ప్రకాశం బ్యారేజి పైన ఆయన నాయకత్వంలో నిర్వహించిన చారిత్రక 'రైతుధర్నా' లాంటి కార్యక్రమాలు కృష్ణాడెల్టాకు ఊపిరి పోశాయి. కృష్ణాడెల్టా ఎండిపోతున్న సమయంలో డెల్టా రైతాంగాన్ని సమకూర్చి లక్షలాది జనవాహినితో ప్రకాశం బ్యారేజిని దిగ్బంధం చేసి, ఆనాటి ప్రభుత్వం దిగి వచ్చేలా చేసిన ఆయన ఉద్యమస్ఫూర్తి తెలుగు ప్రజల జ్ఞాపకాల్లో చిరస్థాయిగా ఉంటుంది. అప్పటిదాకా కృష్ణాడెల్టా వాసులు మూడు పూటలా తిండి తింటారని ఇతర ప్రాంతాల వాళ్ళు అసూయతో చూసేవాళ్ళు. శ్రీ బుద్ధప్రసాదు ఉద్యమంతో రాష్ట్రంలో కరువు కోరల్లో విలవిలలాడుతున్న ప్రాంతం కృష్ణాడెల్టాయేనని అటు లోకానికి, ఇటు ప్రభుత్వానికి కూడా తెలిసి వచ్చింది. కృష్ణాడెల్టా ఆధునికీకరణ పనులుగానీ, పులిచింతల నిర్మాణం గానీ ఈ ఉద్యమం సాధించిన విజయాలే!

అవనిగడ్డని రేపల్లెతో కలుపుతూ కృష్ణానది పైన పెనుమూడి వారధి కోసం అనేక సంవత్సరాలుగా దివిసీమ ప్రజలు ఉద్యమిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోని సందర్భంలో, ప్రతిపక్ష కాంగ్రెస్ శాసనసభ్యుడిగా ఉన్న శ్రీ బుద్ధప్రసాద్ తన శాసన సభ్యత్వానికి రాజీనామ ఇస్తానని ప్రకటించి, వంతెనని సాధించారు. ఈ వంతెన కోసం సుదీర్ఘ పోరాటం చేసిన మండలి వెంకట కృష్ణారావు గారి పేరుతో ఈ పెనుమూడి వారధిని పిలుస్తున్నారు. దివిసీమ వాసులు పక్కనున్న రేపల్లెకు పది నిమిషాల ప్రయాణానికి బెజవాడ దాకా వచ్చి నదిని దాటవలసిన శ్రమ తప్పింది. అలాగే, విజయవాడ పులిగడ్డ కరకట్ట రోడ్డుని రెండు లైన్ల రోడ్డుగా శ్రీ బుద్ధప్రసాదు సాధించ గలగటం వలన వేగం పెరిగి, దూరంతగ్గి ఇప్పుడు బెజవాడకు కేవలం ఒక గంట దూరంలోకి వచ్చేసింది అవనిగడ్డ. ఒకప్పుడు ఒళ్ళు హూనం అయ్యే ప్రయాణం... బెజవాడ నుండి మూడు గంటలు పట్టేది.

హంసలదీవి దగ్గర కృష్ణాసాగర సంగమం వరకూ, రహదారిని నిర్మించి దాన్ని పెద్ద యాత్రాస్థలిగా తీర్చిదిద్దారు. కృష్ణాడెల్టా ఆధునికీకరణ కార్యక్రమానికి అనుమతి సాధించింది కూడా ఆయనే! అనుక్షణం రైతాంగం ప్రయోజనాల కోసం ఉద్యమించేందుకు సిద్ధంగా ఉండే 'రైతుమిత్రుడు' ఆయనే!

రాష్ట్ర పశు సంవర్ధక, పాడిపరిశ్రమ, పశువైద్య విశ్వవిద్యాలయ, మత్స్య శాఖల మంత్రిగా శ్రీ బుద్ధప్రసాద్ ఆ మంత్రిత్వ శాఖలకే వన్నె తెచ్చారు, తన పదవీ కాలంలోనే, 'పశుక్రాంతి', 'జీవ క్రాంతి' పథకాలు ప్రవేశపెట్టారు. పశువులకు కూడా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఉండాలని విజయవాడ, హైదరాబాదు, పులివెందులలో ఆసుపత్రులు మంజూరు చేశారు! దేశంలో ఎక్కడా లేని ఫిషరీస్ పోలిటెక్నిక్'ని దివిసీమలో నెలకొనేలా చేశారు. ఇవన్నీ ఆయన మేధస్సులో పుట్టి, మానస పుత్రికలుగా ఎదిగిన వినూత్న ప్రాజెక్టులు.

మూగజీవాల మంత్రిగా ఆయన్ని చూసినప్పుడు, గాయపడిన హంసని సేదతీర్చిన వాడికే ఆ హంస మీద హక్కు ఉంటుందని, వేటాడిన కిరాతకుడికి ఉండదనీ వాదించిన గౌతమ బుద్ధుడు ఆయనలో కనిపించేవాడు. శ్రీ బుద్ధప్రసాద్ దృష్టిలో నిరాదరణకు గురవుతున్న తెలుగు అక్షరాలూ మూగజీవాలే! పశుసంవర్ధక శాఖామాత్యునిగా అటు మూగజీవాలకు, ఇటు మూగ భాషగా మారుతున్న తెలుగుకూ సమానంగా సేవచేసి 'తెలుగు బుద్ధు'డని ప్రశస్తి తెచ్చుకున్నారు.

భాషోద్యమ విజయాలు

శ్రీ మండలి బుద్ధప్రసాద్ నేతృత్వంలో తెలుగువారి తొలి రాజధాని కృష్ణాజిల్లా శ్రీకాకుళంలో 2002 నవంబరు 1, 2 తేదీలలో జరిగిన తెలుగు భాషోద్యమ సమాలోచన శిబిరం తెలుగు భాషోద్యమానికి నాందీ పలికింది. అమ్మభాష పట్ల మమతానురాగాల్ని పెంపొందించటం ప్రధాన కార్యక్రమంగా ప్రజల గుండె తలుపులు తట్టి భాషా చైతన్యాన్ని కలిగించే అనేక కార్యక్రమాలు ఆనాటినుంచీ తెలుగు నేలమీద ముమ్మరంగా జరిగాయి. ఇదే సభలో తెలుగు భాషోద్యమ సమాఖ్య ఆవిర్భవించింది. శ్రీ బుద్ధప్రసాద్ నాయకత్వంలో డా. సామల రమేష్ బాబు, శ్రీ సి. ధర్మారావు ఇంకా ఎందరో భాషోద్యమానికి నడుం బిగించారు. గిడుగువారు నడిపిన వ్యావహారిక భాషోద్యమానికి కొనసాగింపుగా దీనిని రెండవ తెలుగు భాషోద్యమం అన్నారు.

శ్రీ బుద్ధప్రసాద్, తానే ప్రేరకుడిగా, తానే సూత్రధారిగా, తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం మొదటగా నడుం బిగించిన నేత. భాషా పరిరక్షకులు వెలిగించిన జ్యోతిని ఆయన అందిపుచ్చుకున్నారు. ఒక జ్యోతితో అనేక జ్యోతులు వెలిగించినట్టు అనేక మంది భాషోద్యమకారుల్ని తీర్చిదిద్దారు.

తెలుగు భాషోద్యమానికి కర్త, కర్మ, క్రియ ఆయనే! ప్రజల గుండె తలుపులు తట్టి వారిలో తెలుగుభాషపట్ల గౌరవాన్ని, సంస్కృతి పట్ల అభిమానాన్ని ప్రేరేపిస్తూ, భాషా జాతీయులుగా తెలుగువారి చరిత్రని వెలుగులోకి తేవటం ఆయన ప్రణాళిక. ఆయన అడుగులో అడుగులేస్తూ వెన్నంటి ఎందరో ప్రముఖులైన సాహితీవేత్తలు, భాషావేత్తలూ, చరిత్రవేత్తలు నడుస్తున్నారు.

ఇంటిభాషగా, బడిభాషగా, ఏలుబడిభాషగా తెలుగు అమలు గురించి 2004 నుంచి జరుగుతున్న ప్రణాళికాబద్ధమైన పోరాటాల ఫలాలు అందటం అప్పుడే ప్రారంభమయ్యాయి. ప్రజలు తెలుగులో మాట్లాడటం ఒక గౌరవనీయమైన అంశంగా భావించుకోవటం ఎల్లెడలా కనిపిస్తోంది. ఇది ఒక మంచి పరిణామం. అది భారీ స్థాయిలో లేకపోవచ్చు. కానీ, గతంతో పోలిస్తే 'మా పిల్లలకు తెలుగు రాదండీ' అని గొప్పగా అనే పరిస్థితి కొంత తగ్గింది.

శ్రీ బుద్ధప్రసాద్ పూనికతో తెలుగు భాషోద్యమం ఊపందుకుంటున్నకొద్దీ, ప్రజలలో భాషాపరంగా, రాజకీయంగానూ, సాంస్కృతికంగానూ తమకు అన్యాయం జరిగినట్లు గ్రహింపు రాసాగింది. 21-3-2003న ఆనాటి ప్రతిపక్ష కాంగ్రెస్ శాసన సభ్యుడు శ్రీ బుద్ధప్రసాద్ అసెంబ్లీలో ఒక అనధికార తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో నర్సరీ నుండి 5వ తరగతి వరకూ తెలుగులోనే విద్య బోధించాలని ఆయన ఆ తీర్మానంలో కోరారు. విద్యామంత్రి శ్రీ మండవ వెంకటేశ్వరరావు ఆమేరకు సభలో శ్రీ బుద్ధప్రసాద్‘కు హామీ ఇచ్చారు కూడా! ఆనాటి సహశాసన సభ్యులు డా.కె. లక్ష్మణ్, శ్రీ జి. రామకృష్ణారెడ్డి, శ్రీ ఎన్. రఘువీరారెడ్డి, శ్రీ సి. కృష్ణయాదవ్ ఈ తీర్మానానికి మద్దతు ప్రకటించారు.

తెలుగువాడిగా పుట్టి, తెలుగునేల మీద తెలుగు అక్షరం ముక్క నేర్చుకోకుండా పోస్ట్ గ్రాడ్యుయేషన్లు పూర్తి చేసుకొంటున్నారనీ, ఈ తెలుగు రాష్ట్రంలో తెలుగు చదవకపోతేనే ప్రభుత్వ గుర్తింపు ఉంటుందనే పరిస్థితి నడుస్తోందనీ, అసెంబ్లీలో ఘాటుగా విమర్శించి, ప్రభుత్వాన్ని మేల్కొల్పారు శ్రీ బుద్ధప్రసాద్. దానిపైన విస్తృత పోరాటమే ఆయన చేయాల్సి వచ్చింది. తెలుగు భాషోద్యమం, తెలుగు భాషోద్యమ సమాఖ్య, ఇంకా ఎన్నో సంస్థలు, ఎందరో భాషాభిమానులూ విశేష పోరాటాలు చేశారు. దాని ఫలితంగానే జీవో నెం.86ను ఆనాటి ప్రభుత్వం విడుదల చేసింది. అక్షరాభ్యాసం నుంచి 10వ తరగతి వరకూ తెలుగు తప్పనిసరిగా బోధనాంశంగా ఉండాలనేది ఈ 86వ జీవో సారాంశం. త్రిభాషా సూత్రానికి అనుగుణంగా తెలుగును తప్పనిసరి చేస్తున్న జీవో ఇది. భాషోద్యమ పరంగా ఇది శ్రీ బుద్ధప్రసాద్ అధిగమించిన ఒక మైలురాయి.

హైదరాబాదులో తెలుగుతల్లి విగ్రహం మీద తెలుగుతల్లి అని తెలుగులో రాయకపోవటం, సెక్రెటేరియట్‘లో రాష్ట్ర సచివాలయం అని తెలుగు అక్షరాల్లో ఎక్కడా లేకపోవటం, ఏ ఊళ్ళోనూ ఏ దుకాణం మీదా ఒక్క తెలుగు బోర్డు కనిపించక పోవటం ఇలా తెలుగు అనేది ఒక పనికిరాని అంశంగా మారిపోతోందని ఆయన ఆవేదన చెంది చేసిన ఆందోళన ఫలితంగా సచివాలయంలో ఎక్కడ చూసినా తెలుగక్షరాలు కనిపించాయి.

2006 ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా శ్రీ బుద్ధప్రసాద్ ప్రేరణతో హైదరాబాదు ఇందిరా పార్క్ దగ్గరున్న సత్యాగ్రహ చౌక్‌లో సాహితీవేత్తలతో సామూహిక సత్యాగ్రహం నిర్వహించి, తెలుగు భాష విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తి చూపుతూ, తెలుగుభాషకు క్లాసికల్ హోదా మరియు పాలనాభాషగా తెలుగు అమలు గురించీ తెలుగు భాషోద్యమ సమాఖ్య ఉద్యమించినప్పుడు ప్రతిపక్ష నాయకుడు శ్రీ చంద్రబాబు నాయుడు సహా అన్ని రాజకీయ పార్టీల వారూ వచ్చి తమ సంఘీభావం ప్రకటించారు.

2004 సెప్టెంబర్ 17 వ తేదీన కేంద్ర ప్రభుత్వం తమిళ భాషకు క్లాసికల్ హోదాని ప్రకటించిన తరువాత శ్రీ బుద్ధప్రసాద్ తెలుగు భాషోద్యమం శక్తియుక్తు లన్నింటినీ తెలుగు భాష ప్రాచీనత నిరూపించే పరిశోధనల వైపు, కార్యక్రమాల వైపు మళ్ళించారు. నిజానికి, కేంద్ర ప్రభుత్వం పైన రాజకీయ వత్తిళ్ళతోనే తెలుగు భాషకు ప్రాచీనతా హోదాని సాధించగలమనేది వాస్తవం. తెలుగు భాష ప్రాచీనతని నిర్ణయించటం, ప్రాచీనమైన తెలుగు సంస్కృతిని పరిరక్షించే చర్యలు తీసుకోవటం పైన శ్రీబుద్ధప్రసాద్ ప్రధానంగా తన దృష్టిని కేంద్రీకరించి భాషోద్యమాన్ని కొత్త మార్గాన నడిపించారు. భాషావేత్తలూ, చరిత్రకారులూ, ఔత్సాహికులైన పరిశోధకులూ ఆయన పిలుపుకు ఎంతగానో ప్రతిస్పందించి ఈ ఐదేళ్ళకాలంలో వెలుగులోకి తెచ్చిన విశేషాలు ఎన్నో వున్నాయి. శ్రీ బుద్ధప్రసాద్ ప్రేరణతో డా. జి.వి. పూర్ణచందు ‘తెలుగే ప్రాచీనం’ గ్రంథం, దాని హిందీ అనువాదం, అలాగే, ‘నైలూ నుండి కృష్ణదాకా’ గ్రంథాలు కొత్త ఆలోచనలకు ద్వారాలు తెరిచాయి. ఇంకా, భాష ప్రాచీనతను నిరూపిస్తూ ఎందరో అనేక రచనలు చేశారు.

బడిభాష, ఏలుబడి భాషలుగా తెలుగు వాడకం గురించి తెలుగు భాషోద్యమ సమాఖ్య ఉద్యమ స్వరూపాన్ని తీసుకురాగా, కృష్ణాజిల్లా రచయితల సంఘం ఇంటిభాషగా తెలుగు వాడకం గురించి, తెలుగు భాష ప్రాచీనతని నిరూపించే పరిశోధనల గురించీ భాషాభిమానులూ, భాషావేత్తలూ, పరిశోధకులూ కదిలేలా గట్టి ఊపు తెచ్చింది. ఈ రెండు సంస్థల నిర్మాణానికీ ఊతంగా నిలిచిన వ్యక్తి శ్రీ బుద్ధప్రసాద్. ఈ రెండు సంస్థల కార్యక్రమాలు తెలుగు భాషోద్యమానికి ఎంతగానో తోడ్పడ్డాయి.

శ్రీ బుద్ధప్రసాద్ ఎందరినో ఇందులో భాగస్వాములను చేసి అన్నింటా తానై, ఎన్నో విధాలుగా తెచ్చిన వత్తిడి ఫలితంగానే మనం తెలుగు భాషకు క్లాసికల్ హోదా సాధించుకో గలిగామన్నది వాస్తవం. 2004లో ఉమ్మడిరాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక, డా. ఏ.బి.కె. ప్రసాదు అధికార భాషాసంఘం అధ్యక్షుడిగా శ్రీ బుద్ధప్రసాదుకు తోడయ్యారు. డా. ఆవుల మంజులత తెలుగు విశ్వవిద్యాలయం వైస్-చాన్సలర్‌గానూ, ప్రాచీనతా హోదా సాధకసమితి సభ్యురాలుగానూ, ఎన్నో భాషోద్యమ కార్యక్రమాలు నిర్వహించి చేదోడయ్యారు. ద్రవిడ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణగారు తనస్థాయిలో చేసిన కృషి ప్రాచీనతా హోదా సాధనకు ఎంతగానో దోహదపడింది. సీనియర్ మంంత్రి శ్రీ యం. సత్యనారాయణరావు నాయకత్వంలో ఈ రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులందరినీ వెంటబెట్టుకొని, ఢిల్లీలో కేంద్రమంత్రుల్ని, నాటిప్రధాని మన్మోహన్‌సింగునీ కలిసి తెలుగుభాషకు క్లాసికల్ హోదా అభ్యర్థించారు. ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడెమీ అధ్యక్షులు పద్మశ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఢిల్లీ స్థాయిలో తన పలుకుబడితో చేసిన కృషి, ఆనాటి ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖరరెడ్డిపైన రాష్ట్రమంత్రిగా శ్రీబుద్ధప్రసాద్ తీసుకు వచ్చిన రాజకీయ వత్తిడి, క్లాసికల్ హోదాని సాధించటానికి ప్రముఖంగా తోడ్పడ్డాయి.

శ్రీ వేటూరి సుందరరామ్మూర్తి అవనిగడ్డలో ఒక సాహితీ సభ కోసం వచ్చినప్పుడు శ్రీ బుద్ధప్రసాద్ ప్రేరణతో ఉత్తేజితులై, తెలుగు భాషకు క్లాసికల్ హోదా కోరుతూ తన జాతీయ అవార్డును తిరిగి ఇచ్చేస్తున్నట్టు ప్రకటించి ఒక సంచలనం కలిగించారు. దాంతో మొత్తం తెలుగు సినిమా ప్రపంచం కదిలింది. ప్రజల్లో ఎక్కడ లేని చైతన్యం వచ్చింది. అలా ఎవరితో ఎప్పుడు ఏ పని చేయించాలో తెలిసి చేయించగల నేర్పరితనం బుద్ధప్రసాద్ గారిలో కనిపిస్తుంది. ఉద్యమ నిర్మాత ముఖ్య లక్షణం ఇది.

ప్రతిరోజూ మీడియాలో కనిపించి అవాకులూ చవాకులూ మాట్లాడకపోతే ప్రజలు తమని మరిచి పోతారనే ఒక వింత రాజకీయ ధోరణికి భిన్నంగా భాషాసంస్కృతుల కార్యకర్తగా శ్రీ బుద్ధప్రసాద్ వార్తల్లోని వ్యక్తి అయ్యారు.

ప్రపంచ తెలుగు

2004 ఎన్నికల్లో గెలిచి, ద్వితీయార్థంలో పశుసంవర్ధక శాఖామాత్యులైనా, 2009 ఎన్నికల్లో ఓటమి చవిచూసినా బుద్ధప్రసాద్ గారి భాషా సాంస్కృతిక సేవా నిరతిలో తేడా కనిపించలేదు. ఆయన ఏ పదవిలోనూ లేని రోజుల్లోనే తెలుగు భాషకు అంతర్జాతీయ స్థాయిని తెచ్చే సాంకేతిక నైపుణ్యత కోసం ఎనలేని కృషి చేశారు. యూనికోడ్ కన్సార్టియంలో సభ్యత్వం పొందేందుకు రాష్ట్రప్రభుత్వం ముందుకు వచ్చేలా చేయటంలో బుద్ధప్రసాద్ గారి పాత్ర ముఖ్యమైంది.

యూనికోడ్ కన్సార్టియం అనేది ఒక లాభాపేక్షలేని వాణిజ్య సేవా సంస్థ. అనేకరకాల సాంకేతిక సంస్థలు సభ్యులుగా కలిగిన సంస్థ ఇది. ఇప్పుడున్న అనేక సంకేతాల లిపులను యూనికోడ్ మార్పిడి విధానం Unicode Transformation Format (UTF) ద్వారా ప్రామాణిక లిపి పరిధిలోకి తీసుకు రావటం దీని లక్ష్యం. వివిధ సాంకేతిక సంస్థలు తమ ఉపకరణాలలో ఉచితంగా తెలుగును వినియోగించటానికి ఇప్పుడు అవకాశం

ఏర్పడుతుంది. భాషాభిమానులకు ఇది శుభవార్తే! ప్రపంచ భాషగా తెలుగును అభివృద్ధి చేయటానికి ఇది తొలి అడుగు. విశ్వవ్యాప్తంగా ఉన్న 18 కోట్ల తెలుగు ప్రజలను తెలుగునేలతో అనుసంధానం చెయ్యగల్గింది ఒక్క తెలుగు అంతర్జాలం మాత్రమే. మనకన్నా తక్కువ సంఖ్యలో ప్రజలున్నప్పటికీ చాలా భాషలు తమ మాతృభాషని కంప్యూటరీకరించటంలో ఎంతో ముందున్నాయి. తెలుగుప్రజలు, ప్రభుత్వమూ తమ భాషను ప్రపంచ భాషగా తీర్చి దిద్దుకోవటానికి సమాయత్తం కావాల్సిన సమయం ఇది.

'ప్రపంచ తెలుగు' సాధ్యం కావాలంటే ఐటి రంగంతో పాటు, భాషాశాస్త్రం, సాహిత్యం, వేదం, వేదాంతం, వ్యాకరణం, వైద్యం, గణితం, చరిత్ర, ఇతర సాంకేతిక శాస్త్ర నిపుణులను కూడా ఒకే వేదిక పైకి తీసుకు రావలసిన అవసరం ఉంది. వీరందరి కూటమిగా ఒక అధ్యయన సంస్థ ఏర్పాటు తక్షణం జరగాలి. మాతృభాషాభిమానం కలిగిన నిపుణులైన అధ్యాపకేతరులు ఈ అందరి కూటమితో సాంకేతిక పదాలను ఒకచోట చేర్చి సమగ్రమైన బృహన్నిఘంటువు రూపకల్పన చేయవలసి ఉంది."ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో వేల ఏళ్ళుగా వివిధ ప్రదేశాలలో, కాలాలలో వికసించిన సాహిత్యం, శాస్త్రాల నుండి సమాచారం పొందుపరచటానికి, నిలవ చేయటానికి, తిరిగి పొందటానికి కంప్యూటర్ ఎంతైనా అవసరం. అది తెలుగు భాషలో, తెలుగు భాషకోసం పనిచేసేదిగా ఉండాలి. దీనికోసం విషయ సూచికలు, విషయాలవారీ విభజన, వెదకులాట(సెర్చ్) మొదలైన ఉపకరణాలను తయారు చేయాలి. భాష, సాహిత్యం, శాస్త్రం, సాంకేతికత, వాణిజ్యం, విద్య మొదలైన రంగాల సహకారంతో తెలుగు ఉనికిని కాపాడటం కోసం, నేటి సమాచార అభ్యుదయానికి అమ్మభాషను అనుసంధానం చేయటం కోసం నిపుణులను ఒకే వేదిక పైకి తీసుకు రావలసిన అవసరం ఉంది" అంటారు శ్రీ బుద్ధప్రసాద్.

ఒక దశలో తెలుగు వర్చువల్ విశ్వవిద్యాలయం ఏర్పాటును శ్రీ బుద్ధప్రసాద్ ప్రతిపాదించారు. మిచిగాన్ వర్చ్యుయెల్ విశ్వవిద్యాలయం పనిచేస్తోంది. తమిళనాడులో తమిళ వర్చ్యుయెల్ అకాడెమీని నెలకొల్పి దానికి విశ్వవిద్యాలయ ప్రతిపత్తి నిచ్చి, తమిళ వర్చ్యుయెల్ విశ్వవిద్యాలయంగా రూపొందించారు. పాకిస్తాన్ వర్చ్యుయెల్ అకాడెమీ ఆ దేశస్థాయిలో పని చేస్తోంది. తెలుగు భాషని సాంకేతికంగా అభివృద్ధి చేయాలంటే ఇలాంటివి మనకూ కావాలనీ, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఇలాంటి సంస్థ మాత్రమే ప్రపంచ భాషగా తెలుగును రాజిల్ల చేయగలదనీ శ్రీ బుద్ధప్రసాద్ భావించారు. విధివిధానాలను అధ్యయనంచేసి తెలుగు వర్చువల్ అకాడెమీ ఏర్పాటుకు కావలసిన దస్త్రాలను తయారు చేశాము కూడా! అలాగే, తెలుగు భాష బాగోగులకు బాధ్యత వహించే ఒక ప్రాధికారిక సంస్థ అవసరం గురించి శ్రీ బుద్ధప్రసాద్ చాలా సార్లు ప్రస్తావించారు. అధికార భాషా సంఘం పార్లమెంటు చేసిన చట్ట ప్రకారం ఏర్పడిన సంస్థ. దానికి అధికారాలకన్నా పరిమితులే ఎక్కువ. తెలుగు ప్రాధికారిక సంస్థ నిధులతోను, విధులతోను, బాధ్యతలతోను స్వతంత్ర ప్రతిపత్తి కలిగి పనిచేసేదిగా ఉన్నప్పుడు ఎక్కువ ఫలితం వస్తుందంటారాయన. నిజానికి, తెలుగు ప్రాధికార సంస్థ ఏర్పాటుకు కావలసిన మార్గదర్శక సూత్రాలను రూపొందించి, నాటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డిగారికి 2013 జనవరిలో అందచేశారు కూడా! తిరుపతి 4వ ప్రపంచ తెలుగు మహాసభల తరువాత ఏర్పడిన సానుకూలతను భాషా సంస్కృతుల పరిరక్షణకోసం వేగంగా ఉపయోగించాలని ఆయన ప్రయత్నించారు. రాష్ట్రవిభజన ముంచుకురావటంతో అన్నీ పక్కకు పడిపోయాయి.

'ఇంటర్నెట్లో తెలుగువాడకం' పై కృష్ణాజిల్లా రచయితల సంఘం మొదటగా 2006లో విజయవాడలో వర్క్‌షాపు నిర్వహించింది. అప్పుడు రాష్ట్రమంత్రిగా ఉన్న శ్రీ బుద్ధప్రసాదు సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని, అంతర్జాలంలో తెలుగు బాగా వాడకంలోకి రావాలంటే ఫాంట్ల తయారీదారులు కనీసం ఒక యూనికోడ్ ఫాంటును ప్రజలు ఉచితంగా వాడుకొనే అవకాశం కల్పించాలని కోరారు. ఆ సదస్సుకు మరొక అతిథిగా విచ్చేసిన అనుఫాంట్స్ అధినేత అందుకు సానుకూలంగా స్పందించారు కూడా! ఇలాంటి అవకాశాలను ఉపయోగించుకోవలసింది ప్రభుత్వ యంత్రాంగం. దాన్ని కదిలించటం అంటే కైలాసాన్ని కదిలించటమే!

అంతర్జాలాన్ని తెలుగులో వాడటానికి అనుకూల పరిస్థితుల మీద ఒక ప్రపంచ సదస్సు నిర్వహించాలనే ఆలోచన చాలాసార్లు చేశారు శ్రీ బుద్ధప్రసాద్. ఒక దశలో కృష్ణాజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో 'తొలి తెలుగు ఇంటర్నెట్ మహాసభ' నిర్వహణ కోసం ఒక కార్యాచరణని రూపొందించి ప్రకటించటం కూడా జరిగింది. సిలికానాంధ్ర సంస్థ కూడా ఇందుకు తోడ్పడటానికి ముందుకు రావటంతో, తొలి చర్చా వేదికను విజయవాడలో కాకుండా, హైదరాబాదులో ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో ఆనాటి సమాచార సాంకేతిక మంత్రి శ్రీ పొన్నాల లక్ష్మయ్య ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రభుత్వపరంగా అంతర్జాలంలో తెలుగు వాడకంపై తీసుకోవలసిన చర్యల గురించి ఆయనకు నిపుణుల ద్వారా వివరించటం, అందుకు సానుకూలంగా ఆయన స్పందించటం, ఫలితంగా ఒక సాంకేతిక సలహా మండలి ఏర్పరచటం జరిగాయి. ఈ కమిటీలో శ్రీ బుద్ధప్రసాదు, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాదు, శ్రీ కూచిభొట్ల ఆనంద్ ప్రభృతులు సభ్యులుగా ఉన్నారు. ఈ సాంకేతిక సలహామండలి సూచన మేరకు యూనికోడ్ కన్సార్టియం అంతర్జాతీయ సంస్థలో పూర్తి స్థాయి సభ్యత్వం పొందాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

సాంకేతికంగా భాషా సంస్కృతుల అభివృద్ధి అనే ఏకైక అంశంపైన, కృష్ణాజిల్లా రచయితల సంఘం 2011 ఆగష్టులో 2వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించింది. యూనికోడ్ కన్సార్టియంలో పూర్తిస్థాయి సభ్యత్వం, 14 తెలుగు యూనికోడ్ ఫాంట్లు, ఒక కొత్త తెలుగు 'కీబోర్డు,'ఇంకా మరికొన్ని సాంకేతిక ప్రయోజనాల కోసం 70 కోట్ల వ్యయంతో ఒక కార్యాచరణ ప్రణాళికని ఆంధ్రప్రదేశ్ సాంకేతిక శాఖ పక్షాన ప్రకటించారు. తెలుగుజాతి యావత్తు ఈ పరిణామాలను హర్షించింది.

సాంకేతిక రంగానికి సంబంధించిన తయారీదారుల సహకారం మీదే ఇదంతా ఆధారపడి ఉంటుంది కాబట్టి, సిలికాన్ లోయలోనే, ఆయా తయారీదారీ సంస్థల ప్రతినిధులతో తొలి తెలుగు అంతర్జాల అంతర్జాతీయ సదస్సు నిర్వహించేందుకు ప్రతిపాదించారు శ్రీ బుద్ధప్రసాదు. 2011 నవంబరులో వైభవోపేతంగా, స్ఫూర్తిదాయకంగా, నిర్మాణాత్మకంగా ఈ తొలి అంతర్జాల తెలుగు సభలు జరిగాయి. అనేక సాంకేతిక సంస్థలు సహకరించటంతో 2012 మార్చిలో ప్రభుత్వం మొదటి విడతగా మూడు తెలుగు యూనికోడ్ హెడ్డింగ్ ఫాంట్లను రూపొందింపచేసి, విడుదల చేసింది. అవి ప్రస్తుతం ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. నిజానికి ఈ విజయానికి తమిళుల నుంచే మనం ప్రేరణ పొందినప్పటికీ, సాంకేతికంగా కొన్ని అడుగులు అదనంగానే వేయగలిగాం అని చెప్పవచ్చు. ప్రభుత్వం ఇంత వేగంగా స్పందించటంలో బుద్ధప్రసాద్ గారి నిర్ణయాత్మక పాత్ర, ఆమాత్యులు శ్రీ పొన్నాల లక్ష్మయ్యగారి ప్రేరణ, భాషకోసం ఏదయినా చేయాలనే తపన ఉన్న అధికారుల సహకారం కలిసొచ్చిన అంశాలు. ఇది శ్రీ బుద్ధప్రసాదు నేతృత్వంలో నడుస్తున్న తెలుగు భాషోద్యమం సాధించిన విజయం.

2006-13 సంవత్సరాల కాలంలో భాష పట్ల కొత్త ఆశలు రేకెత్తించిన ఇలాంటి సంఘటనలు అనేకం జరిగాయి. ఇప్పుడు అవన్నీ తలచుకుంటుంటే అదే స్వర్ణయుగం అనిపిస్తోంది. గతకాలమే మేలనే నిరాశ ఆవహిస్తోంది. సాంకేతికాభివృద్ధి కోసం, ప్రాచీనతా హోదా కోసం బుద్ధప్రసాద్ గారి వెంట నడిచి, ఆయన ఆదేశానుసారం చేపట్టిన అసంఖ్యాకమైన కార్యక్రమాలన్నీ, కళ్లలోంచి కలలా కరిగిపోతున్నాయి. ఇప్పుడా యూనికోడ్ సభ్యత్వం ఏమయ్యిందో, ఆ యూనికోడ్ ఫాంట్ల గతి ఏమిటో తెలీని పరిస్థితి. చేపట్టిన భాషాభివృద్ధి కార్యాచరణ ఎక్కడి కక్కడ ఆగిపోయింది. మళ్ళీ సున్నా నుండి మొదలు పెట్టుకోవలసిందే!

కృష్ణాజిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షుడిగా...

1983లో కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రారంభమయ్యింది. మండలి వెంకట కృష్ణారావుగారు గౌరవాధ్యక్షుడిగా, ముక్కామల నాగభూషణం గారు అధ్యక్షుడిగా, కళాప్రపూర్ణ తెన్నేటి హేమలత, డా. త్రిపురనేని వెంకటేశ్వరరావు, డా.పోతుకూచి వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షులుగా, గుత్తికొండ సుబ్బారావు ప్రధాన కార్యదర్శిగా,

శ్రీ మైత్రేయ కోశాధికారిగా, బుద్ధప్రసాద్ గారూ, డా. జి. వి. పూర్ణచంద్ కార్యదర్శులుగా తొలి కార్యవర్గం ఏర్పడింది. దాదాపు ఆరు మహాసభలు, అనేక పుస్తకాలు ఇంకా చాలా సాహిత్య కార్యక్రమాలూ జరిగాయి.

తరువాతి కాలంలో నాగభూషణంగారూ, మండలి వెంకట కృష్ణారావుగారు, డా. త్రిపురనేని వెంకటేశ్వర రావు గారూ, రచయిత్రి లత, మైత్రేయ ఇలా ఒక్కరొక్కరే కాలం చేయటంతో కృష్ణాజిల్లా రచయితల సంఘం కుంటుపడింది.

2005లో శ్రీ బుద్ధప్రసాద్ గౌరవాధ్యక్షులుగా, గుత్తికొండ సుబ్బారావు, డా. జి వి పూర్ణచందు అధ్యక్ష కార్యదర్శులుగా కృష్ణాజిల్లా రచయితల సంఘాన్ని పునరుద్ధరించారు. అప్పటినుండీ, సంస్థ ప్రధాన కార్యక్రమాలన్నీ తెలుగు భాషోద్యమం దిశగా మళ్ళించి ఊరూరా తెలుగు భాషా సదస్సులు ఏర్పాటు చేయించారు.

1. 2006 అక్టోబర్ 27, 28 తేదీలలో జాతీయ తెలుగు రచయితల మహాసభలు, 50 ఏళ్ళ ఆంధ్రప్రదేశ్ లో తెలుగు భాషా సాహిత్యాలు పొందిన పరిణామక్రమాన్ని విశ్లేషిస్తూ 112 పరిశోధనా వ్యాసాలతో వెయ్యి పుటల 'తెలుగుపసిడి' ఉద్గ్రంథం ప్రచురణ
2. 2007లోనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా తెలుగు భాషను ఆధునీకరించే అంశంపైన, తెలుగు యూనీకోడ్ లిపిని అభివృద్ధి చేయటం పైన విజయవాడలో ఒక జాతీయ సదస్సు నిర్వహణ. ఆ సదస్సులో 'తెలుగు పసిడి' కృష్ణాజిల్లా రచయితల సంఘం వెబ్'సైట్ కూడా ఆయన ప్రారంభించారు.
3. 2007 సెప్టెంబర్ 21-23 లలో మొదటి ప్రపంచ తెలుగు రచయితల మహాసభలను విజయవాడలో నిర్వహింప చేశారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వజ్రోత్సవాల సందర్భంగా ఈ సభలు జరిగాయి, ప్రజలలో భాషోద్యమ స్ఫూర్తిని కలిగించి, భాషాభిమానాన్ని రేకెత్తించటమే లక్ష్యంగా ఈ ప్రపంచ సభలను నిర్వహిస్తున్నామని శ్రీ బుద్ధప్రసాద్ ప్రకటించారు. నాటి రాష్ట్ర గవర్నర్ శ్రీ యన్. డి. తివారీని ఆహ్వానించి సభలు ప్రారంభింప చేశారు. 60 ఏళ్ళ స్వతంత్ర భారతదేశంలో తెలుగు వారు నిర్వహించిన పాత్ర గురించి 216 పరిశోధనా వ్యాసాలతో, వజ్రభారతి గ్రంథ ప్రచురణ.
4. 2007 డిసెంబర్ 2న న్యాయస్థానాలలో తెలుగు అమలు అనే విషయం మీద న్యాయమూర్తులు శ్రీ మంగారి రాజేందర్ (జింబో), శ్రీ సుబ్రహ్మణ్యం, న్యాయవేత్త శ్రీ మాడభూషి శ్రీధర్ ప్రభృతులతో ఒక జాతీయ సదస్సు నిర్వహించారు. తెలుగులోనే తీర్పు లివ్వాలనే ఆలోచనని న్యాయమూర్తులకు కలిగించటం ఈ సదస్సు లక్ష్యం.
5. 2008 ఫిబ్రవరి 17, 18 తేదీలలో భారతీయ భాషా కేంద్రం, ద్రవిడ విశ్వవిద్యాలయం వారి సహకారంతో కృష్ణాజిల్లా రచయితల సంఘం ద్వారా 'తెలుగు భాష ప్రాచీనత- విశిష్టత' అనే అంశం మీద మొదటి సారిగా జాతీయ సదస్సు నిర్వహించి తెలుగే ప్రాచీనమని ఎలుగెత్తి చాటారు శ్రీ బుద్ధప్రసాద్. ఈ సదస్సులో సమర్పితమైన పరిశోధనా పత్రాలను తెలుగు భాష ప్రాచీనత-విశిష్టత పేరుతో ఒక ఆకర గ్రంథంగా ప్రచురించింది. తెలుగుభాషకు క్లాసికల్ హోదా సాధించటంలో ఈ జాతీయ సదస్సు ముఖ్యమైన మలుపు ఆనాడు.
6. 2008 మార్చి 21, 22 తేదీలలో మచిలీపట్టణం డచ్ కోటలో కృష్ణాజిల్లా చారిత్రక వైభవం జాతీయ సదస్సుని భారతీయ పురావస్తు సర్వేక్షణ వారి సౌజన్యంతో నిర్వహించి 'కృష్ణాజిల్లా సర్వస్వం' ఉద్గ్రంథం ప్రచురించింది.

7. 2008 మార్చిలోనే చిన్నయసూరి ద్విశతాబ్ది ఉత్సవాలను రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలలోనూ, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సహకారంతో నిర్వహించి బాలవ్యాకరణం మీద సమగ్రమైన పునర్మూల్యాంకనం జరిపించారు.

8. 2008 ఆగస్టు 2 నుంచి 5 వరకు మచిలీపట్నం నుంచి నెల్లూరు వరకూ దాదాపు 300 మంది సాహితీవేత్తలతో తెలుగు భాష, సంస్కృతీ చైతన్య యాత్రను శ్రీ బుద్ధప్రసాద్ ప్రారంభించారు. భాష కోసం రచయితలు చేస్తున్న ఈ యాత్రని దండి యాత్రతో పోల్చి, ఈ యాత్రలో పాల్గొన్న రచయితలను భాషాసత్యాగ్రహులుగా అభివర్ణించారు శ్రీ బుద్ధప్రసాద్. మన ఇంట్లో మనం తెలుగులోనే మాట్లాడుకుందాం అనే నినాదంతో ప్రజల గుండె తలుపులు తట్టిన యాత్ర ఇది. ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాదు ఈ యాత్రకు సారథ్యం వహించారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లా రచయితల సంఘాలు ఈ యాత్రను నిర్వహించాయి.

9. 2009 జనవరి 24, 25 తేదీలలో రాష్ట్రంలోని పురావస్తు శాస్త్రవేత్తలు అనేకమందిని ఆహ్వానించి సింధు–కృష్ణా లోయల నాగరికతల తులనాత్మక అధ్యయన సదస్సును విజయవాడలో నిర్వహించారు. సింధు నాగరికతకు సమాంతరంగా తెలుగునేలపైన కూడా జనావాసాలు ఉండేవని అంగీకరిస్తున్న పరిశోధకులకు ఆ సంస్కృతిని తెలుగు సంస్కృతిగా ప్రకటించవలసిన అవసరాన్ని శ్రీ బుద్ధప్రసాద్ గుర్తు చేశారు.

10. 2010లో కృష్ణాజిల్లా రచయితల సంఘం ద్వారా, ఎమెస్కో వారి సహకారంతో తెలుగు మణిదీపాలు అనే 1200 పేజీల ఉద్గ్రంథాన్ని ప్రచురించారు. వివిధ రంగాలలో ప్రసిద్ధులైన 70 మంది జీవిత చరిత్రలు ఇందులో సంకలితం చేశారు.

11. 2010 సంవత్సరాంతంలో ఉత్తర అమెరికా తెలుగు సంస్థ 'తానా' వారి సహకారంతో తరతరాల తెలుగు సంస్కృతి పైన స్ఫూర్తిదాయకమైన సదస్సు నిర్వహించి, తెలుగు సంస్కృతి ప్రాచీనతని, దాని ప్రశస్తిని వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. తరతరాల తెలుగు సంస్కృతి గ్రంథం తానా ప్రచురణగా జూలై 2న అమెరికాలో ఆవిష్కరణ జరిగింది.

12. 2012లో సాంకేతిక తెలుగు కోసం 2వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు, 2015లో తెలుగు భాషా పరిరక్షణ కోసం 3వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలను నిర్వహించడం జరిగింది.

12. ఇంకా... తెలుగు మాండలికాల పైన కృష్ణా విశ్వవిద్యాలయంలో ఒక సదస్సుని, తెలుగు కథకి నూరేళ్ళ సందర్భంగా భారతీయ భాషాకేంద్రం సహకారంతో మచిలీపట్టణంలో ఒక జాతీయ సదస్సునీ, మచిలీపట్టణంలోనే శ్రీకృష్ణదేవరాయ వైభవం సదస్సునీ ఇలా ఎన్నో జాతీయ స్థాయి సెమినార్లను కృష్ణాజిల్లా రచయితల సంఘం ద్వారా నిర్వహింపచేసి, తెలుగు భాషోద్యమ స్ఫూర్తిని శ్రీ బుద్ధప్రసాద్ కలిగించారు.

ప్రాచీనతాహోదా కోసం న్యాయ పోరాటం :

ప్రాచీనతా హోదాని సాధించటానికి అవరోధంగా ఉన్న చెన్నై హైకోర్టులో కేసుని పరిష్కరించటం కోసం శ్రీ బుద్ధప్రసాదు పడిన ఆవేదన అంతా ఇంతా కాదు. మరొక పరిష్కారం కానక, ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘం, ప్రకాశం జిల్లా రచయితల సంఘంతో కలిసి సుప్రీంకోర్టుని ఆశ్రయించటం జరిగింది. చెన్నై కోర్టులో ఈ కేసు కొట్టివేయవలసిందిగా సుప్రీంకోర్టును కోరాము. చెన్నై హైకోర్టులో తీర్పు అనుకూలంగా రానప్పుడు జోక్యం చేసుకుంటామని సుప్రీంకోర్టు మమ్మల్ని తిరిగి వెనక్కి పంపించింది.

ఈ లోగా, 2008 అక్టోబరు 31న తెలుగు, కన్నడ భాషలకు క్లాసికల్ హోదా ఇవ్వటానికి కేంద్రానికి ఎలాంటి అడ్డంకులూ లేవని ప్రభుత్వం న్యాయసలహా ఇవ్వటంతో తెలుగు, కన్నడ భాషలకు క్లాసికల్ హోదా ప్రకటించారు.

అయితే ఇది కేవలం ఆరంభం మాత్రమే! క్లాసికల్ హోదాని ప్రకటించి ఎనిమిదేళ్ళౌతోంది. మన విశ్వవిద్యాలయాలు గానీ, పరిశోధనా సంస్థలు గానీ, ఇంత వరకూ ఒక్క నిర్దిష్టమైన పరిశోధనా ప్రాజెక్టును సిద్ధం చేయలేక పోయారు. అలసత్వం భాషకు, జాతికీ అపకారం చేస్తుందనేది తిరుగులేని సత్యమే!

ఈ వ్యాసం వ్రాస్తున్న సమయానికి మద్రాస్ హైకోర్టులో వేసిన ఈ రిట్ పిటీషన్ అతీగతీ లేని స్థితిలో ఉంది. సుప్రీంకోర్టు తీర్పు తరువాత నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కొణిజేటి రోశయ్యగారు, ప్రభుత్వ పక్షానే ఈ కేసులో ఇంప్లీడ్ అవుతామనీ, వ్యక్తులు, సంస్థలూ ఎలాంటి రిట్లూ వేయవద్దనీ కోరారు. ప్రభుత్వం మద్రాస్ హైకోర్టులో ఆ మేరకు హాజరయ్యింది కూడా! తదనంతర కాలంలో ఆ విషయమే మరుగున పడిపోయింది. చెన్నైకి చెందిన శ్రీ తూమాటి సంజీవరావు ప్రభృతులు తప్ప, ఈ కేసు గురించి పట్టించుకున్న నాధుడు లేడు. మన తరఫున ప్రాతినిధ్యం లేకపోవటాన తీర్పు మనకు వ్యతిరేకంగా వచ్చినా చీమకుట్టినంత బాధ ఎవరికైనా కలిగితే ఆశ్చర్యమే!

అధికారభాషా సంఘం అధ్యక్షుడిగా

కిరణ్ కుమార్ రెడ్డిగారు ముఖ్యమంత్రిగా వచ్చాక భాషా సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమానికి మరింత ఊపు తెచ్చే కార్యాచరణకు పూనుకున్నారు శ్రీ బుద్ధప్రసాద్. కిరణ్ కుమార్ రెడ్డిగారు తనపదవీ కాలం చివరి దశలో బుద్ధప్రసాద్ గారిని అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా నియామకం చేశారు. గట్టిగా ఏణ్ణర్థం కాలం కూడా లేదు. ఒక వైపున రాష్ట్రం వేర్పాటు – సమైక్య వాదాలతో రగులుతోంది. భాష గురించి ఎవరికీ పట్టని విచిత్ర స్థితి నడుస్తోంది. తెలుగు అనే పదమే శత్రువన్నట్టు తెలుగు తల్లిని కించపరిచే పరిస్థితులు, మహాకవులైనవారి విగ్రహాల కూల్చివేత లాంటి మాతృభాష ద్రోహాలు చెలరేగుతుంటే, తెలుగు హృదయం తల్లడిల్లుతున్న రోజులవి! అధికారభాష గురించి పోరాడేందుకు ఏ మాత్రం సమయం కాని పరిస్థితి అది!

శ్రీ బుద్ధప్రసాద్ అధికార భాషాసంఘం అధ్యక్షుడు కాగానే చేసిన తొలి ప్రయత్నంగా 4వ ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణకు ప్రభుత్వాన్ని అంగీకరింపచేశారు. ఈ తిరుపతి ప్రపంచ తెలుగు మహాసభల సందేశాన్ని మారుమూల పల్లెల్లోకి తీసుకువెళ్ళే ప్రయత్నం చేశారు. ప్రతీ కుగ్రామం లోనూ తెలుగు భాషకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహింపచేశారు. అధికార యంత్రాంగం, ముఖ్యంగా కలెక్టర్లు ఈ విషయంలో శ్రద్ధ తీసుకోవటంతో తెలుగును కాపాడుకోవాలనే నినాదం ఊరూరా మిన్నుముట్టింది. భారీ స్థాయిలో కార్యక్రమాలు చేసినప్పుడే ఇలాంటివి సాధ్యపడతాయి. 4వ ప్రపంచ తెలుగు మహాసభల ప్రయోజనం అది! ముల్కీ, జై ఆంధ్ర ఉద్యమాల తరువాత తెలుగువారిని ఏకం చేయటంలో1975లో జరిగిన మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు సహకరిస్తే, రాష్ట్రం విడిపోయినా తెలుగు వారంతా ఒక్కటేననే సందేశం ఇంకా తెలుగువారి గుండెల్లో ప్రతిధ్వనించటానికి తిరుపతి 4వ మహాసభలు దోహదపడ్డాయి.

వ్యక్తులు, సంస్థలూ ఉద్యమాలను నిర్వహిస్తారు. దాన్ని అందిపుచ్చుకుని వ్యవస్థీకృతం చేయవలసిన బాధ్యత ప్రభుత్వానిది! ప్రభుత్వానికి కళ్ళూ చెవులుగా ఉన్న అధికార యంత్రాంగం ఇలాంటి పరిణామాలను గమనించి ప్రభుత్వ విధానాల రూపకల్పన చేయవలసి ఉంటుంది. కానీ, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణ విషయంలో ఇలాంటిది జరగలేదు. నిమ్మకు నీరెత్తినట్టే ప్రభుత్వ వ్యవస్థ, విశ్వవిద్యాలయాలు కూడా వ్యవహరించాయి.

తెలుగు భాషకు ప్రాచీనతాహోదా సాధన విషయంలో కలిసిరాని విశ్వవిద్యాలయాలు, ఆ హోదా సాధించాక పరిశోధనల కోసం ఉద్దేశించిన నిధుల వినియోగం మీద కూడా దృష్టిపెట్టకపోవటం విచిత్రం. మనతోపాటుగా ప్రాచీనతా హోదా సాధించుకున్న కన్నడం వారు కన్నడ పరిశోధనల కోసం ఏ విధంగా స్పందిస్తున్నారో అనేది ఎవ్వరికీ పట్టలేదు.

ఒక మునిసిపాలిటీ వారు ప్రజా సౌకర్యాలు కల్పించే విషయంలో ఎన్నిసార్లు తీర్పులిచ్చినా పట్టించుకోకపోవటాన్ని జస్టిస్ కృష్ణయ్యర్ గారు, bovine indeference అన్నారు. '...మీద వానకురిసినట్టు' అనే సామెత లాంటి పదం ఇది. భాష విషయంలో తెలుగుప్రభుత్వాల తీరు ఇంతకు భిన్నమైనదేమీ కాదు. ప్రభుత్వ నేతల్లో కన్నా అధికార గణాల్లోనే తెలుగు భాష పట్ల apathetic ధోరణి ఎక్కువగా ఉంది.

శిలాఫలకాలను కావాలని ఇంగ్లీషులో వ్రాయించేది అధికారులే! ఇక్కడ రిక్షాలను ఆపరాదు' అనే బోర్డు కూడా ఇంగ్లీషులోనే వ్రాయించే మేధావులు అధికారుల్లో ఉన్నారు. వాళ్ళు తెలీకుండానే మాతృభాషాద్రోహానికి కారకులౌతున్నారు. అధికార భాషాసంఘం అధ్యక్షుడిగా శ్రీ బుద్ధప్రసాద్ ఈ పరిస్థితిని మార్చి, అధికారుల్లో తెలుగుపట్ల గౌరవాన్ని పెంచేందుకు ప్రయత్నించారు. తిరుపతి మహాసభల్ని ఆయన అందుకు బాగా ఉపయోగించారు.

ప్రభుత్వ తెలుగు భాషా సాంస్కృతిక శాఖకు ఒక నిర్దేశిత క్యాలెండరు ఉన్నప్పుడు, ప్రభుత్వానికి ప్రకటిత భాషా విధానం ఉన్నప్పుడు, పాలనలో తెలుగు అమలు విషయంలో నిర్లక్ష్యాన్ని శిక్షార్హం చేసినప్పుడే పరిస్థితిలో మార్పు వస్తుంది. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ప్రభుత్వ యంత్రాంగం మారదు కాబట్టి, భాషా సంస్కృతుల పరిరక్షణ కొనసాగే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి స్థాయిలో ఒకసారి ఈ నిర్ణయం తీసుకోగలిగితే అది తరతరాల శాసనం అవుతుంది.

సమైక్యవాది శ్రీ బుద్ధప్రసాద్

శ్రీ బుద్ధప్రసాద్ ఏనాటికీ సమైక్యవాదే! భౌగోళికంగా పెద్ద రాష్ట్రాలకు మన్నన మర్యాదలు ఎక్కువగా లభిస్తున్న తీరుని మనం గమనిస్తూనే ఉన్నాం. చిన్న రాష్ట్రాలుగా చీలిపోతే జాతీయ స్థాయిలో ఔన్నత్యాన్ని కోల్పోయి తెలుగు జాతి చిన్నబోతుందనేది ఆయన ఆవేదన! దేశంలో అన్ని రాష్ట్రాలనీ చిన్న రాష్ట్రాలుగా విభజించినప్పుడు తెలుగువారు కూడా రెండు రాష్ట్రాలు గానో, మూడు రాష్ట్రాలుగానో ఉండవచ్చు. విభజన నిర్ణయం ద్వేష పూరిత వాతావరణంలో కాక, పాలనా సౌలభ్యం అనే సూత్రం మీద జరగాలంటారాయన. రాష్ట్రాన్ని చీల్చినవారుగానీ, చీలేందుకు కారకులైన వారు గానీ ఈ దృష్టితో చూడకపోవటం తెలుగు జాతికి జరిగిన ఒక చారిత్రక అపకారం.

రాజకీయ ప్రయోజనాల కోసమో, స్వలాభాల కోసమో వేర్పాటువాదాన్నో, సమైక్యవాదాన్నో భుజాన మోయటం, ప్రతి చిన్న సమస్యనీ రాజకీయంచేసి తద్వారా లబ్ధి పొందాలనుకోవటమే చాణక్యం అనుకుంటున్న నేటి కాలపు చాలామంది రాజకీయవేత్తలకు, శ్రీ బుద్ధప్రసాద్ వ్యక్తిత్వానికి తేడా కొట్టొచ్చినట్టే కనిపిస్తుంది. ఆయనది 'ప్రపంచ తెలుగు దృష్టి'. అది అందరికీ తేలికగా అర్థం కాగలిగే విషయం కాదు. ఆయన చెప్పిన సత్యాన్ని గుర్తించటానికి తెలుగు జాతికి సమయం పట్టుంది.

2009 డిశెంబరు 9న శ్రీ చిదంబరం ప్రకటన వెలువడిన సమయంలో శ్రీ బుద్ధప్రసాద్ కర్ణాటకలో పర్యటిస్తున్నారు. హుటాహుటిన విజయవాడకు తిరిగి వచ్చారు. రాజకీయపక్షాలన్నీ ఐక్య కార్యాచరణ సమితిగా ఏర్పడి శ్రీ బుద్ధప్రసాదుని నాయకుడిగా ఎన్నుకున్నారు. ఎలాంటి ఉద్రిక్తతలు, అవాంఛనీయ సంఘటనలు లేకుండా

గాంధేయ మార్గాన ఆయన ఉద్యమాన్ని నడిపిన తీరు అందరూ గమనించిన అంశమే! వేర్పాటువాదులు కూడా ఆయనలోని నిబద్ధతని గౌరవిస్తారు.

2009 డిసెంబరు, 23న కేంద్ర హోం మంత్రి చిదంబరం గారి ప్రకటన తరువాత కోస్తా, సీమ జిల్లాలలో ప్రకంపనలు లేచినప్పుడు, సమైక్య రాష్ట్ర పరిరక్షణ కమిటీ గౌరవాధ్యక్షునిగా ఈ రెండుప్రాంతాలలో బందులూ, హింసాయుత సంఘటనలు, ఆస్తుల విధ్వంసం జరగకుండా, గాంధేయమార్గంలో ఉద్ధృతంగా ఉద్యమాన్ని నడిపించి ప్రజల మనోభావాలను చాటి చెప్పారు. "బందులెవరికండీ...? రోడ్డు పక్కన టీ స్టాలులో టీ త్రాగే పేదవారికే గానీ, 5స్టారు హోటళ్ళలో టీ త్రాగే వారికి బందులు వర్తించవు. ఎర్రబస్సుల్లో తిరిగేవారికే గానీ, విమానాల్లో ఎగిరేవారికి వర్తించవు" అంటారు శ్రీ బుద్ధప్రసాదు. ఇది ఈనాటి సాధారణ రాజకీయనాయకుడి మనసులో కలికానికిక్కూడా కనిపించని ఆలోచన! ఇది హృదయంతో ఆలించి పాలించే వారికి మాత్రమే కలిగే ఆలోచన!

రాష్ట్రం విడిపోయినా భాషా సంస్కృతుల విషయంలో బుద్ధప్రసాద్ గారు రెండు రాష్ట్రాలు అనే మాటనే అంగీకరించేవారు కాదు. ఇన్నాళ్ళూ హైదరాబాద్ చుట్టూ మాత్రమే అధికార యంత్రాంగం పరిభ్రమించిందనీ, ఇకనైనా 13 జిల్లాలకు తగిన న్యాయం జరగాలనీ మా బోంట్లు అన్నప్పుడు కూడా, మనం సంకుచితంగా ఆలోచించ కూడదని మందలించిన ఔన్నత్యం ఆయనది.

రాష్ట్రం విడిపోతే భాషాసంస్కృతులకు తీవ్రమైన దెబ్బతగుల్తుందని ముందునుండీ బుద్ధప్రసాద్‌గారు అంటూనే ఉన్నారు. తక్కిన సమస్యలు సానుకూలంగా పరిష్కరించుకోవచ్చు. కానీ, 'పట్టనితనం' అనే సమస్యకు పరిష్కారం ఉండదు. ఎందుకంటే దాన్ని పట్టించుకునే వాళ్ళుండరు కాబట్టి! ఏది ఏమైనా, భాషాసంస్కృతుల పరిరక్షణ బాధ్యతని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే వహించాలని బుద్ధప్రసాద్‌గారు పదేపదే కోరుతున్నారు. గతరెండేళ్ళలో ఆం.ప్ర. ప్రభుత్వ ఉగాది పురస్కారాల్లో రాష్ట్రేతరులైన తెలుగువారిని సముచితరీతిలో గౌరవించటం ఇందుకు తార్కాణం.

తెలుగమ్మ కంట కన్నీళ్ళు

ఈనాటి తెలుగుభాష పరిస్థితి చూస్తున్నప్పుడు "ద్వా సపర్ణా సయజా సఖాయ" అనే ఋక్కు గుర్తుకొస్తుంది. "చెట్టుమీద రెండు పక్షులు కూర్చున్నాయి. ఒక పక్షి హాయిగా ఫలాలు ఆరగిస్తోంది. రెండో పక్షి నిర్లిప్తంగా దానివంక చూస్తోంది" అని వర్ణిస్తుంది ఈ ఋక్కు. ఒక వంక కన్నడ, తమిళ, మళయాళ భాషలవారు ప్రాచీనతా హోదా ఫలాలను సద్వినియోగ పరచుకుంటున్నారు. మనం మాత్రమే, కేవలం మనం మాత్రమే రెండో పక్షిలా, అక్కుపక్షిలా దిక్కులు చూస్తున్నాం.

భాషా సంస్కృతుల సేవలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వెనకబడి ఉంది. ఇది శ్రీ బుద్ధప్రసాద్‌తో పాటు భాషాభిమానులందరకీ ఆందోళన కలిగించే విషయమే! ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన కార్యక్రమాల అమలును ఆయన గట్టిగా కోరుతున్నారు.

రాజకీయపరంగానూ, సంస్కృతిపరంగానూ, శ్రీ మండలి బుద్ధప్రసాద్ వ్యక్తిత్వ పరిశీలనకు ఇవి కొన్ని పరిచయ వాక్యాలు మాత్రమే! నిజంగా ఒక వ్యక్తి ఇన్ని విజయాలను సాధించగలడా... అని సందేహం కలిగేలా అసంఖ్యాక కార్యక్రమాలెన్నో చేసి చూపించా రాయన! స్వదేశీ విశ్వవిద్యాలయాలు, అనేక ఇతర మహత్తర సంస్థలు చెయ్యలేని, చెయ్యని పనులెన్నింటినో ఒంటిచేత్తో చేసి చూపించిన వ్యక్తి శ్రీ బుద్ధప్రసాద్.

కృష్ణాజిల్లా చారిత్రక వైభవం సదస్సు ప్రారంభోత్సవానికి కొద్ది నిమిషాల ముందు సుడిగాలితో కూడిన భయంకరమైన వాన రావటంతో ఎక్కడివారక్కడ చెల్లా చెదురైపోయారు. అప్పటికప్పుడు వేదికని మరొక సురక్షిత స్థావరానికి మార్చటం జరిగింది. మంత్రిగా ఉన్న శ్రీ బుద్ధప్రసాదు స్వయంగా బల్ల ఎక్కి తన చేతుల్తో బ్యానరు కట్టిన దృశ్యం కళ్ళను చెమరుస్తుంది.

ఒకరిని నోరు తెరిచి చందాలు, ఆర్థిక సాయాలు అడిగిన పాపాన పోలేదాయన. డొనేషన్లు అడగటం అంటే ఆయనకు ప్రాణం మీదకు వస్తుంది. ఎంత పెద్ద కార్యక్రమం అయినా సరే... ఆయన సంకల్పిస్తారు. ఆ కార్యక్రమం జరిగిపోతుంది. అంతే! తెలుగుజాతి జాతీయంగా, అంతర్జాతీయంగా కూడా సగర్వంగా తలఎత్తుకు నిలబడాలనేది శ్రీ బుద్ధప్రసాద్ ఆకాంక్ష, ఆదర్శం. భక్తుడు తుడిస్తేనే భగవంతుడి కన్నీళ్ళు ఆగుతాయనే సత్యాన్ని కన్నప్ప కథ మనకు చాటిచెప్తుంది.

ఒక భాషోద్యమ కార్యకర్తగా, ఒక భాషా సేవకుడిగా, ఒక మార్గ నిర్దేశకుడిగా, ఒక నిరంతర అధ్యయన శీలిగా, తెలుగు సంస్కృతి, వికాసాలకు ప్రతినిధిగా నిలిచిన శ్రీ బుద్ధప్రసాద్ షష్టిపూర్తి కానుకగా కృష్ణాజిల్లా రచయితల సంఘం సమకూర్చి అందిస్తున్న ఈ అపురూప వ్యాసాల సంకలనం పరిశోధకులకు ఒక ఆకరగ్రంథంగా నిలుస్తుందని ఆశిస్తున్నాం.

'ప్రబుద్ధభారతి' పరిశోధనా వ్యాససంపుటి కోసం కొన్ని అపురూప వ్యాసాలను ఈ దృష్టికోణం లోంచే ఏరి ఎంపిక చేసుకున్నాం. ఈ వ్యాసాలలోని స్ఫూర్తి లోకానికి అందాలని, జాతి ఔన్నత్యానికి పాటుపడాలని ప్రతి ఒక్కరం సంకల్పం చేసుకోవటానికి తెలుగువ్యాస మండలి తోడ్పడుతుందని మా ఆశంస. అది నెరవేరితే సంకలన కర్తలుగా మాకదే ఆనందం.



అప్పుడే అరవైయేళ్లా!

- డా. పొత్తూరి వెంకటేశ్వరరావు

సహృదయులు, మాననీయులు మండలి వెంకట కృష్ణారావుగారి అబ్బాయి బుద్ధప్రసాద్‌గారికి అప్పుడే అరవైయేళ్లా!

నేను మొదటిసారి చూసినప్పుడు బుద్ధప్రసాద్ గారు ఇరవైయేళ్ల యువకుడు. ఖద్దరు పైజామా, పొట్టిచేతుల చొక్కా, చేతిలో పుస్తకంతో కనిపించిన ఆ చిరంజీవిని పలకరించి, మాట్లాడిన కొద్దిసేపటిలోనే ఆయన సాత్విక స్వభావుడనీ, మృదుభాషి అనీ అనిపించింది. ఇది ఎప్పుడో నలభై ఏళ్ల క్రిందటి మాట. ప్రపంచ తెలుగు మహాసభలు జరిగిన తరువాత తెలుగు జర్నలిస్టులమైన మాలో చాలా మందికి కృష్ణారావుగారితో అనుబంధం పెరిగింది. ముగ్గురమో, నలుగురమో గుర్తులేదుగాని జర్నలిస్టులం అవనిగడ్డలోని ఆయన ఇంటికి వెళ్లాము. అతిథిమర్యాదలైన తరువాత ఆయన మమ్మల్ని తన ఇంటిలోని సొంత గ్రంథాలయంలోకి తీసుకొని వెళ్లారు. అలమారులలో చక్కగా సర్ది ఉన్న పుస్తకాలలో ఎక్కువ గాంధేయ సాహిత్యానికి సంబంధించినవి. గాంధీగారి జీవితానికి సంబంధించిన పుస్తకాలలో చాలాచోట్ల గుర్తులు పెట్టి ఉన్నాయి. వాటిని చూపించి "ఇవి మీరు తరచు చదువుతుంటారా?" అని అడిగాము. అప్పుడే అక్కడికి వచ్చిన బుద్ధప్రసాద్‌గారిని మాకు పరిచయం చేసి కృష్ణారావుగారు "నేను చదువుతాను, నాకంటె ఎక్కువగా మా అబ్బాయి చదువుతాడు" అని చెప్పారు. బుద్ధప్రసాద్‌గారితో మాట్లాడుతుంటే ఆయనకు అప్పటికే గాంధేయ సిద్ధాంతాల పట్ల తగినంత అవగాహన ఉన్నదనిపించింది. ఆ రోజుల్లో నాకు తెలిసినంతలో యువకులకు సోషలిస్టు సాహిత్యం మీద ఉన్న ఆసక్తి గాంధేయ సిద్ధాంతాల పట్ల ఉండేది కాదు. బుద్ధప్రసాద్‌గారు ఆ విధంగా ఒక అసాధారణ యువకుడనిపించింది. పుస్తకాలు చదివే అలవాటు ఆయనకు చిన్నప్పటి నుంచి ఉంది. తండ్రిగారి నుంచి ఆయనకు అబ్బిన అలవాట్లలో అది ఒకటి.

నాటికీ నేటికీ మధ్య నాలుగు దశాబ్దులు గడచిపోయాయి. చరిత్ర మలుపులు తిరిగింది. కృష్ణారావుగారి రాజకీయ వారసత్వం బుద్ధప్రసాద్‌గారికి సంక్రమించింది. అప్పుడే బుద్ధప్రసాద్‌గారికి అరవైయేళ్లా అనిపించిందిగాని మా అందరి వయస్సులు మాత్రం పెరగలేదా! నేనిప్పుడు 82 సంవత్సరాల వృద్ధుడిని. ఆయన ఇంకా యువకుడే. అందుకే ఆయనకు అప్పుడే అరవై యేళ్లా అనిపించి ఉంటుంది. బుద్ధప్రసాద్‌గారి వేషభాషలలో గానీ, విశ్వాసాలలోగానీ నాటికీ నేటికీ ఏవిధమైన మార్పు లేదు. ముఖంలో లేతదనం ఒకింత తగ్గిందిగానీ, ముదిమితనం రాలేదు.

తెలుగుభాష పట్ల ఆయన అభిమానం అప్పుడూ ఇప్పుడూ ఒకటే. తెలుగు ప్రజలంతా ఒకటే అనే ఆయన విశ్వాసం సడలలేదు. రాష్ట్రం చీలికను ఆయన త్రికరణ శుద్ధిగా వ్యతిరేకించారు. ఆయనకు ఒక ప్రాంతం పట్ల వ్యతిరేకత గానీ, మరొక ప్రాంతం పట్ల ప్రత్యేక అభిమానంగానీ లేవు. తెలుగు మాతృభాషగా ఉన్న అన్ని ప్రాంతాలు అభివృద్ధి కావాలన్నదే ఆయన అభిమతం. నేను రాష్ట్ర విభజన అనివార్యమని 1968-69 నుంచి నమ్మి అలా వాదిస్తున్నవాడిని. కనుక ఇతర నాయకులను గురించి సహజంగానే అవగాహన ఉంటుంది.

కడచిన నాలుగు దశాబ్దాలలో బుద్ధప్రసాద్‌గారు రాజకీయంగా ఎదగటం చూశాను. ఆయన ఎమ్.ఎల్.ఎ. కావటం, మంత్రి కావటం, అధికార భాషాసంఘం అధ్యక్షుడు కావటం చూశాను. ఇప్పుడు (2016) ఆయన శాసనసభ డిప్యూటి స్పీకర్‌గా పనిచేయటం చూస్తున్నాను. ఎథిక్స్ కమిటీ అధ్యక్షుడుగా ఆయన ఒక గురుతర బాధ్యతను స్వీకరించటం తెలుసు. మంత్రిగా ఆయన వ్యవహార శైలి నిర్మాణాత్మకమైనది. ఎవరైనా వచ్చి మా ఊరికి ఇది కావాలని అడిగితే వెంటనే అది ఎలా చేయటమని ఆలోచన చేసేవారేగాని, ఎలా తప్పించుకొందామనిగానీ, ఇందులో మనకేమి ప్రయోజనం ఉందనిగానీ ఆలోచించేవారు కాదు. స్వీయ అనుభవమే ఒకటుంది. నేను ఆశ్రమం వేసుకొని ఉంటున్న పొత్తూరు గ్రామానికి (గుంటూరు జిల్లా) ఆయన వచ్చినప్పుడు మా గ్రామ ప్రజలు అక్కడున్న పశువుల ఆస్పత్రిని మరింత వృద్ధి చేయమని అడిగారు. దాని స్థాయి పెంచటానికి సాంకేతికంగా కొన్ని అడ్డంకులు ఉన్నాయి. ఆయన వాటిని తొలగించి ఆస్పత్రిని అభివృద్ధిపరిచారు. సాధారణంగా అధికారులు అడ్డుపుల్ల వేస్తే మంత్రి "ఎమ్.ఎల్.ఎ.గారి చేత ఉత్తరం రాయించండి, ప్రయత్నిద్దాం" అనో, "ఆఫీసర్లు కుదరదంటున్నారండీ, చూద్దాము" అని సమాధానం చెప్పి తప్పించుకొంటారు. బుద్ధప్రసాద్‌గారితో చాలామంది అనుభవం కూడా నా అనుభవం లాంటిదే.

బుద్ధప్రసాద్‌గారు పరిస్థితుల ప్రోద్బలం వల్ల పార్టీ మారినప్పటికీ ఆయన రాజకీయ విశ్వాసాల విషయంలో ఏ విధమైన మార్పూ లేదు. మార్చుకొనవలసిన అవసరం రాకపోవటం ఆయన అదృష్టం. సిద్ధాంతాల విషయంలో కొందరు రాజకీయ నాయకులు కాలానుగుణమైన మార్పులు చేసుకొంటారు. కొందరు సర్దుకుపోదామనుకొంటారు. కొందరు రాజీపడరు. అలా రాజీపడని నాయకులలో బుద్ధప్రసాద్‌గారొకరు. ఆయన మరిన్ని దశాబ్దుల కాలం ఇలాగే ఆయురారోగ్యాలతో ప్రజాసేవ చేస్తూ వర్ధిల్లాలని నా ఆకాంక్ష.



తెలుగువారి ఆణిముత్యం

- డా. ఎన్. గోపి

'పురుషులందు పుణ్య పురుషులు వేరయా' అనే వేమన సూక్తికి చక్కటి ఉదాహరణ మండలి బుద్ధప్రసాద్‌గారు. రాజకీయాల కల్లోల సరోవరంలో ఆయనొక నిబ్బరమైన పద్మం.

ఆ రోజుల్లో చాలా మందికి ఈయన మండలి వెంకట కృష్ణారావు గారి కుమారుడిగానే గుర్తింపు. అది గొప్ప గుర్తింపు కూడా! మండలి వారు 1975 లో ప్రథమ ప్రపంచ తెలుగు మహా సభల శిఖరంగా ఉన్నప్పుడు నా వయసు 25 ఏళ్ళు. ఆ సభల వైభవాన్ని సార్థకతను ప్రత్యక్షంగా ఆస్వాదించిన వాణ్ణి. అప్పటి అవిభక్తరాష్ట్రంలోని భాషా సాహిత్యాలన్నింటినీ ఒక చోట కుప్పవోసినట్లున్న ఆ బృహత్కార్యక్రమం తెలుగువారి మనస్సుల్లో ఎప్పటికీ చెరిగేది కాదు. ఆ సభల్లోనే, 'బాలలకమిటీ'లో సభ్యులుగా ఉన్న బుద్ధప్రసాద్‌గారి వ్యక్తిత్వవికాసం ప్రారంభమైందనుకుంటాను.

దాదాపు 40 ఏళ్ల క్రితం దివిసీమలో (1977) పెనుతుఫాను సంభవించినపుడు మండలి వెంకట కృష్ణారావు గారు చేసిన పునరావాస మానవోద్యమం కూడా చరిత్రలో నిలిచిపోయింది. అప్పుడిన్ని ప్రసార సాధనాలు లేవు. కాలికి గుడ్డలు కట్టుకొని, దిగబడే బురదలో శవాల మధ్య తిరుగుతూవున్న మండలి వారి ఛాయాచిత్రాలు ఇంకా నా మనసు తెరపై నిలిచి ఉన్నాయి. అటువంటాయన కుమారుడు బుద్ధప్రసాద్‌గారు. బుద్ధప్రసాద్‌గారిని చూసినప్పుడల్లా నాకు "A great son of a great father" అనిపిస్తుంది.

1999 లో బుద్ధప్రసాద్‌గారు ఎం.ఎల్.ఏ.గా ఎన్నికైనారు. అప్పుడు నేను తెలుగు విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా నియమించబడ్డాను.

తెలుగు విశ్వవిద్యాలయంలో, రూపురేఖలు పూర్తిగా రాని ఒక మ్యూజియం ఉండేది. దాని పేరు 'తరతరాల తెలుగు జాతి'. ఆ మ్యూజియం అధ్వాన్న స్థితిలో ఉందనీ, దానిని గురించి ప్రభుత్వాలు పట్టించుకోలేదని, తెలుగుదేశం ప్రభుత్వం ఆ మ్యూజియం అభివృద్ధికి ఏమి చేయదలచుకున్నదనీ బుద్ధప్రసాద్‌గారు అసెంబ్లీలో ప్రశ్న వేశారు. అప్పటి ఉన్నతవిద్యాశాఖా మంత్రి శ్రీ కరణం రామచంద్రరావుగారు నాకు ఫోన్ చేసి, దీనికి సమాధానం తయారు చేయమని చెప్పారు. నేను వి.సి. గా బాధ్యతలు స్వీకరించగానే భారతప్రభుత్వ సాంస్కృతికశాఖ వారితో సంప్రదించి, మ్యూజియం అభివృద్ధికి రూ. 5.00 లక్షలు మంజూరు చేయించుకున్నాము. దానికి మరొక రూ. 5.00 లక్షలు మ్యాచింగ్ గ్రాంటుగా జతచేసి, మ్యూజియం అభివృద్ధికి పథక రచన చేశామని, పని కూడా ప్రారంభమైందనీ, ఆ 'ఎల్.ఏ.క్యూ.' కు సమాధానం వ్రాసి పంపి, ఆ ప్రశ్న వచ్చే రోజు అసెంబ్లీకి మా రిజిస్ట్రార్‌తోపాటు వెళ్ళాను. ఆ సమాధానానికి బుద్ధప్రసాద్‌గారు సంతృప్తి చెందారు.

'తరతరాల తెలుగుజాతి మ్యూజియం' వారినాన్నగారి పథకం. అది అనుకున్న రీతిలో కార్యరూపం దాల్చలేదనే తపన, ఆవేదనతో ఉన్న ఆయన ఆ ప్రశ్న వేశారు. ఇప్పుడు సాంస్కృతిక పరమైన అట్లాంటి ప్రశ్నలు వేసే వారే కరువయ్యారు. సాంస్కృతిక శాఖను కేటాయించినందుకు తదనంతర కాలంలో అలిగిన మంత్రులను కూడా మనం చూశాము.

బుద్ధప్రసాద్‌గారు తెలుగుభాషను రక్షించాలనే నిజమైన సంకల్పం గలవారు. తనకున్న పరిధిలో ప్రభుత్వంలోకూడా కదలిక తేవడానికి ఆయన వెనుకాడరు. ప్రవాసాంధ్రులంటే కూడా ఆయనకు మనసులోపలి నుంచి అభిమానం. అయితే, విద్యావ్యవస్థలో తెలుగును అనివార్య భాషగా మార్చకుండా, భావితరాల కోసం తెలుగును రక్షించడం సాధ్యం కాదని నా అభిప్రాయం. ఇంగ్లీషు పదాలు లేని తెలుగు మాట్లాడితేనో, తెలుగు ప్రాచీన భాషగా గుర్తింపబడితేనో తెలుగు నిలబడుతుందని నేను అనుకోను. చాలా మంది రాజకీయవేత్తలకు సిలబస్‌లో తెలుగుభాషకు, తెలుగు మాధ్యమానికి తేడా తెలియదు. అభివృద్ధికీ, విధ్వంసానికీ మధ్య కార్యకారణ సంబంధాన్ని చాలా మంది గుర్తించరు. అందమైన 'కాస్మటిక్' మాటలతో భాషాపరిరక్షణ జరగదు. బుద్ధప్రసాద్‌గారికి దీనిపై స్పష్టమైన అవగాహన ఉంది. యావత్తు తెలుగుజాతి ఒక స్పష్టత కోసం వారిపైనే ఆశలు పెట్టుకున్నదని నా విశ్వాసం.

నేనూ, బుద్ధప్రసాద్‌గారు అనేక సాహిత్య సభలలో కలిసి పాల్గొన్నాము. వారినెప్పుడు కలిసినా ఒక సహజమైన చిరునవ్వు, ఒక ఆప్యాయతతో కూడిన మాట, ఏ విషయం తీసుకున్నా స్ఫటిక స్వచ్ఛమైన అవగాహన ఆయనలో కనబడతాయి. ఆయనతో కరచాలనం చేస్తే, ఆయన చేయి చల్లగా, మృదువుగా, హాయిగా ఉంటుంది. అసెంబ్లీ నుంచి వస్తున్నా సరే! అదీ ఆయన వ్యక్తిత్వం. హైదరాబాదుతో ఆయన అనుబంధం ఎప్పటికీ ఉండేదే. ఆయన ఖైరతాబాద్ కళాశాలలోనే చదివారు. రాష్ట్రాలు విడిపోయినా, తెలుగువారి మధ్య అనుబంధాలు ఎప్పటికీ తరిగేవి కావు. ఏ ప్రాంతం వారికైనా బుద్ధప్రసాద్ గారు 'మా వాడు' అనే అనుభూతిని ఆయన ఇవ్వగలిగారు.

బుద్ధప్రసాద్‌గారు మన తెలుగువారందరికీ ఒక ధీమా – ఆయన తలుచుకుంటే తెలుగు భాషా సంస్కృతులకు ఢోకా లేదని.

రాజకీయాలలో కొన్ని ఆటుపోట్లున్నా, హృదయగతంగా ఆయన నిష్కల్మషమైన వ్యక్తి. దానికాయన నవ్వే సాక్ష్యం. ఆయన నవ్వినపుడు కేవలం పెదవులే కాదు – ముఖమంతా నవ్వుతుంది. ఎంతటి చిన్నవారితోనైనా ఒకక్షణం ఆగి, పలకరించి, వారు చెప్పింది వినే సంస్కారం ఉన్న అరుదైన రాజకీయవేత్త, రాజ్యాంగ నిబద్ధుడు, సంస్కారాన్ని అంతస్యూతంగా పుణికిపుచ్చుకున్న వ్యక్తి మండలి బుద్ధప్రసాద్‌గారు. వారికి అరవై ఏళ్ళు ఒక హద్దు మాత్రమే. కానీ, వారు చేయబోయే మహత్కార్యాలకు హద్దు లేదు. తెలుగువారందరి శుభాకాంక్షలు రెప్పలుగా మారి, వారిని కాపాడుకుంటాయి.

ఈ సందర్భంగా వారిపై నా సద్భావనల పుష్పాలను వెదజల్లుతున్నాను.

ప్రబుద్ధ రాజకీయవేత్త

- డా. తుర్లపాటి కుటుంబరావు

"మండలి బుద్ధప్రసాద్ మన రాజకీయ రంగంలో విశిష్ట వ్యక్తి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సరిగా ఇవే మాటలలో కాకపోయినా – ఇదే అర్థంలో అసెంబ్లీలో అన్నారు.

ముఖ్యమంత్రి అన్నమాట అక్షరాల నిజం. అయిదారు సంవత్సరాల క్రితం నేను, ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు కలిసి కారులో వెడుతుండగా, "మన రాజకీయవేత్తలలో విశిష్ట వ్యక్తులు ఎవర"న్న చర్చ వచ్చింది. ఆయన ముగ్గురు పేర్లు చెప్పగా, వారిలో బుద్ధప్రసాద్ ఉన్నారు! నా అభిప్రాయం ఎప్పటి నుంచో అదే! అయితే, సమకాలిక రాజకీయవేత్త అయిన ఆయన తన కంటే చాలా చిన్నవాడైన మండలికి అంతటి కితాబు యివ్వడం నాకు ఆశ్చర్యం కలిగించింది.

వర్తమాన రాజకీయ రంగం భ్రష్టు పట్టిపోయింది. ఇలాంటి మన రాజకీయ రంగంలో అక్కడక్కడ వెలుగు లీనుతున్న కొన్ని ఆశాజ్యోతులు కానవస్తూ ఉంటాయి. అలాంటి వెలుగు దివ్వెలలో మండలి బుద్ధప్రసాద్ ఒకరు! ఈ రాజకీయ కారు చీకటిలో కాంతి పుంజం వెలుగులు విరజిమ్మడం కష్టమే. అయినా, బుద్ధప్రసాద్ తన ప్రబుద్ధ వ్యవహార శైలితో నేటి రాజకీయ రంగంలో విలక్షణంగా, విశిష్టంగా భాసిస్తున్నారు. ఈ విషయాన్ని మొన్నటివరకూ బుద్ధప్రసాద్‌కు ప్రత్యర్థి పక్షంలో ఉన్న చంద్రబాబునాయుడు గుర్తించడం ఆయన రాజనీతి పరిణతికి నిదర్శనం.

రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పదవి మండలికి విశేష పదవి కాదు. ఆయన 2007–09 మధ్య రాష్ట్ర మంత్రిగా ఉన్నారు. అంతకంటే కూడా మంత్రి హోదాతో అధికార భాషా సంఘం అధ్యక్షుడుగా సంవత్సరానికి పైగా పనిచేశారు. రాష్ట్రమంత్రిగా కంటే భాషా సంఘం అధ్యక్షుడిగా తనకే కాక, ఆ సంఘం పేరు ప్రతిష్టలు పెంచారు. టి.ఎన్.శేషన్ ఎన్నికల కమిషన్ అధినేతగా వచ్చిన తరువాతే అలాంటి కమిషన్ ఒకటి ఉన్నదని ప్రజలు తెలుసుకున్నారట! అధికార భాషా సంఘం విషయంలో అలా అనలేము కాని, మొత్తం మీద బుద్ధప్రసాద్ తన కొద్దిపాటి ఆ పదవీ కాలంలో తెలుగుభాషకు అదివరకు ఎన్నడూ ఎవ్వరూ సాధించలేని ప్రత్యేకతను, ప్రాచుర్యాన్ని సాధించారని చెప్పవచ్చు. ఇందుకు తాను అధ్యక్షుడుగా వచ్చిన మూడు నెలలకే తిరుపతిలో జరిగిన చతుర్థ ప్రపంచ తెలుగు మహాసభల సాఫల్యంలో ఆయన నిర్వర్తించిన కీలకపాత్రే నిదర్శనం!

ఇదంతా రాస్తూ ఉంటే, భాషా సంఘం నుంచి మండలి నిష్క్రమణ వల్ల తెలుగు భాషాఉద్యమం కుంటుపడుతుందా? అన్న ఆందోళన కలగడం సహజం. అయితే, తెలుగు భాషామతల్లి గారాబు బిడ్డ 'మండలి' ఎక్కడ ఉన్నా, తన భాషామతల్లిని విస్మరించరని చెప్పవచ్చు. ఆయన ప్రభుత్వంలో తన పలుకుబడిని ఉపయోగించే, తెలుగు భాషాజ్యోతి కొడిగట్టకుండా చూడగలరని చెప్పవచ్చు.

కాగా, స్పీకర్, లేదా ఆయన పరోక్షంలో స్పీకర్ బాధ్యతలు నిర్వహించే డిప్యూటీ స్పీకర్ పదవి మంత్రి పదవి కంటే మిన్న అని నా అభిప్రాయం! స్పీకర్ పదవి నుంచి మంత్రి పదవిలోకి మారాలని ప్రయత్నించిన పిడతల రంగారెడ్డి, శ్రీపాదరావు, కిరణ్‌కుమార్‌రెడ్డిలకు నేను అదే సూచన చేశాను. ఎందరో ఉండే మంత్రులలో ఒకరుగా ఉండే కంటే 'చుక్కల్లో చంద్రుడి' వలే స్పీకర్ పదవే గొప్పదని నేను వారికి కొన్ని సన్నివేశాలలో సూచించాను.

కాగా, ఏ పదవిలో ఉంటే, ఆ పదవికి, వన్నెతెచ్చి, దానిపై తనముద్ర వేసే మండలి బుద్ధప్రసాద్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా కూడా తన విశిష్టతను చాటుకోగలరని ఆశించుదాం! ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిష్టించాలని ఆశీర్వదించుదాం. ఆయనకంటే పాతిక సంవత్సరాలు వయస్సులో పెద్దవాడినైన నేను ఆయనకు షష్టిపూర్తి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.



ఆశీరభినందనలు!

- డా. ఎస్. గంగప్ప

'శిష్యాదిచ్ఛత్ పరాజయం' అనేది లోకంలోని ప్రసిద్ధ సూక్తి. ఎంతటి గురువుకైనా శిష్యుడు సాధించిన విజయాలకు పరాజయమంటారు. గురువుని మించిన పదవులలంకరించగా గురువుగారికి ఎంతో ఆనందదాయకమైన అంశం. తన శిష్యుడంతటి వాడయ్యాడన్న గర్వం గురువుగారిదవుతుంది. అలాంటి పంచర్థం వర్థిష్ణువు చి॥ మండలి బుద్ధ ప్రసాద్ వల్ల నాకు కలిగిందని ఎంతో సంతోషిస్తున్నాను, గర్విస్తున్నాను. కీ.శే. మండలి వెంకట కృష్ణారావు గారికి తగిన తనయుడని భావించాను ఒకనాడు. కానీ ఈనాడు బుద్ధప్రసాద్ తండ్రిని మించిన తనయుడనడంలో ఏ మాత్రం సందేహముండనక్కరలేదు. 1973-77 మధ్య హైద్రాబాద్ ఖైరతాబాద్‌లోని న్యూగవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో బి.ఏ.లో నా విద్యార్థి బుద్ధప్రసాద్. ఆనాడే ఆతనిలోని గుణాల్ని విశిష్టంగా నేనే కాదు, తోటి అధ్యాపకులు గ్రహించారు. తెలివితేటలు, నాయక లక్షణాలు, తెలుగు భాషపై మమకారం - ఇవన్నీ అతనిలోని సద్గుణాలు. తాతతండ్రుల నుంచి స్వీకరించిన గాంధీయవాద లక్షణాలు అమితం.

తదనంతరం అవనిగడ్డ గాంధీక్షేత్రంలో భాష, సంస్కృతి సంబంధ సదస్సులలో నన్నెంతగానో మన్నించి ప్రసంగాలు చేయించి తన నిబద్ధతను నిరూపించుకున్నాడు.

ఎం.ఎల్.ఏ. అయినా, మంత్రి అయినా, అధికార భాషా సంఘం అధ్యక్షులైనా, ఈనాడు అత్యున్నతపదవి ఆంధ్రప్రదేశ్ శాసనసభాపక్ష ఉపసభాపతిగా ఉన్నప్పటికి తెలుగు భాషా సాహిత్య - సంస్కృతులకు చేస్తున్న సేవ అనన్య సామాన్యం, పరమ ప్రశంసనీయం. దేశవిదేశీ పర్యటనలో ఎంతో విజ్ఞానాన్ని సంపాదించుకొన్నారు.

బుద్ధప్రసాద్ బాబు తోటి నా అనుబంధాన్ని పేర్కొనవలసి ఉంది. 1973లో నా పరిశోధనాత్మక గ్రంథం 'క్షేత్రయ్య పదసాహిత్యం' గ్రంథానికి ఆం.ప్ర. సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఆనాడు బుద్ధప్రసాద్ తండ్రి గారు మండలి వెంకటకృష్ణారావుగారు ఆం.ప్ర. విద్యాసాంస్కృతిక శాఖామాత్యులు గనుక వారికి నామమాత్రుల సలహా మేరకు 1974లో అంకితమివ్వడం జరిగింది.

అలాగే బుద్ధప్రసాద్ చేస్తున్న తెలుగు భాషా సంస్కృతుల సేవను పురస్కరించుకొని 2005లో 'దివిసీమ సాంస్కృతిక వైభవం' గ్రంథాన్ని అంకితమిచ్చాను. 1999లో గుంటూరులో కీ.శే. వావిలాల గోపాలకృష్ణయ్యగారి గౌరవాధ్యక్షతన, నా అధ్యక్షతన 'తెలుగు భాషా పరిరక్షణ సమితి' ఏర్పాటు చేసి బుద్ధప్రసాద్‌కి ఆ సభల్లో ప్రముఖ పాత్ర వహింపజేయడమే గాదు, మన తెలుగు భాష-తమిళమే గాదు - ప్రాచీనమైనదని నిరూపిస్తూ ' తెలుగు భాషకు ప్రాచీన భాషా గౌరవం' అనే గ్రంథాన్ని రచించి బుద్ధప్రసాద్‌కి 2007లో అంకితమిచ్చాను. ముచ్చటగా మూడో గ్రంథం 'తెలుగు సాహితీ వైభవం' బుద్ధప్రసాద్‌కి

అంకితమివ్వడానికి సిద్ధంగా ఉందని చెప్పడానికి సంతోషిస్తున్నాను. గౌరవనీయులు కీ.శే. వావిలాల గోపాలకృష్ణయ్య గారి తరువాత అధికార భాషా సంఘం అధ్యక్షులై ఎనలేని సేవ చేశారు. ఇప్పుడు చేస్తున్నారు. తెలుగు భాష కూడా అంతర్జాలంలో ఒక భాషగా తెలుగు భాషా సంస్కృత్యభ్యున్నతి కోసం చేస్తున్న సేవతో పాటు సర్వ విధాల నవ్యాంధ్ర రాష్ట్రం సమున్నతంగా అభివృద్ధి చెందుతుందన్న ఆకాంక్షతో ఆ మార్గంలో కృషి చేస్తున్నారు.

సేవాతత్పరుడైన బుద్ధప్రసాద్‌కి అప్పుడే షష్టిపూర్తి మహోత్సవమా? అని ఒకింత నాకాశ్చర్యం కలిగినా –నిజమే! కాల మాగదు ఎవరికోసమూ! తెలుగు భాషా సంస్కృతులను నిలబెట్టడానికై చేస్తున్న కృషి కొనసాగాలంటే ఆనందోత్సాహాలతో గడిపిన సంపూర్ణంగా అరువదేళ్లే గాదు నిండునూరేళ్ళు జీవించి భాషా ప్రజాసేవలో తరించి ఖ్యాతి గడించాలని ఆశిస్తున్నాను, ఆశీర్వదిస్తున్నాను మనసారా! శుభం!

అస్తు, శుభమస్తు, ఆరోగ్యమస్తు, కీర్తి
రస్తు, ఐశ్వర్య దీర్ఘాయురస్తు, మిగుల
తెలుగు భాష, సంస్కృతులకు వెలుగునింప
సేవ చేయు కొరకిదె ఆశీర్వదింతు!



(తాత) మండలి వెంకట్రామయ్య, (తండ్రి) వెంకట కృష్ణారావు, (తాత) భోగాది వెంకట్రామయ్య
(నానమ్మ) మహంకాళమ్మ, (తల్లి) ప్రభావతి, (చెల్లి) రేవతి, (అమ్మమ్మ) వెంకటసుబ్బమ్మ
క్రింద: బుద్ధప్రసాద్, (చెల్లి) అన్నపూర్ణ, (తమ్ముడు) సత్యప్రసాద్ (1969)

రాజ్యాశ్రమ ముని

- ప్రాచార్య శలాక రఘునాథ శర్మ

మాన్యులు మండలి బుద్ధప్రసాద్ గారంటే నాకు చాలా ఇష్టం. ఎందుకంటే–

1. ఆయన రాజకీయాలలో నిర్మల చిత్తవృత్తితో ఉండగలుగుతున్నారు.

2. ప్రజా సేవాతత్పరత ఆయనలో కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది.

3. స్వయంగా విద్వత్కోటిలో సముచిత గౌరవాన్ని స్వయంకృషితో సాధించుకొన్న వ్యక్తి.

4. విద్వద్వర్యులను సమాదరించటంలో ఒక ప్రత్యేక ప్రతిభ ఆయనకు ఉన్నది. అంటే విద్యా గౌరవమూ, విద్వద్గౌరవమూ పుష్కలంగా ఉన్న వ్యక్తి.

5. ఆయన స్మితపూర్వాభిలాషి. ఇది రా.నా.లలో చాలా అరుదుగా కనిపించే మహాలక్షణం.

6. తెలుగు భాషా సంప్రదాయాల మీద గొప్ప అనురాగాభిమానాలు నిలువెల్లా ఆయనలో ఉన్నాయి.

7. ఓట్ల కోసం కాకుండా, సేవాతత్పరతను, వారి తండ్రిగారిలాగా పెంపొందించుకొన్న మహనీయుడు.

8. నన్నయగారు "కలయగఁబల్కరంచి రుపకారులు నైరని నమ్మియుండగా వలవదు బుద్ధిమంతులు నవప్రియులైన ధరాధినాథులన్" అన్నారు. దీనికి అపవాదప్రాయమైన వ్యక్తిత్వం శ్రీ బుద్ధప్రసాద్‌గారిది. గుండెమీద చేయి వేసుకొని ఆయనను నమ్మి ఉండవచ్చు. అటువంటి సచ్ఛీలం ఆయన సొమ్ము.

9. మేమిద్దరం ఒక జిల్లావాళ్ళం. అయితే ఏమిటి? అంటే కృష్ణవేణమ్మ జలాలను అమృతంలాగా ఆస్వాదించి నైర్మల్యాన్ని సంతరించుకున్న వ్యక్తులం.

ఇంకా చాలా ఉన్నాయి, ఆయన నాకు ఇష్టుడు అని చెప్పటానికి. మాన్య మహోదయులు మండలి వేంకట కృష్ణారావుగారు, ముఖ్యంగా భోజన పదార్థాలను వ్యర్థం చేయటం ఇష్టపడనివారు. అది చాలా గొప్పలక్షణం. ఒకసారి నాకు వారి అనిష్టతను చవిచూడవలసిన పరిస్థితి ఏర్పడింది. కానీ ఉపాయంగా వారి ప్రశంసకు పాత్రుడనయ్యాను. శ్రీ బుద్ధప్రసాద్ గారిని భావిస్తున్నంతసేపూ నాకు వారి నాయనగారు గుర్తుకు వస్తూ ఉంటారు. వీరు త్రికరణాలలో వారికి ప్రతిరూపం.

షష్టిపూర్తి సందర్భంలో శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారిని గట్టిగా ఆశీర్వదిస్తున్నాను.

"సమస్త సన్మంగళానిభవన్తు"

తండ్రిని మించిన తనయుడు

- డా. రేవూరు అనంత పద్మనాభరావు

1975 ఏప్రిల్‌లో జరిగిన ప్రథమ తెలుగు ప్రపంచ మహాసభలకు ప్రధాన సూత్రధారి శ్రీ మండలి వెంకటకృష్ణారావు. కందుకూరు తాలూకా రచయితల సంఘాధ్యక్షుడిగా ఉన్న నాకు వారు సభలలో ప్రతినిధిగా పాల్గొనమని ఆహ్వానం పంపారు. ఆ సభా నిర్వహణలో ఆయన 'శంకరంబాడి'ని ఆంధ్రదేశానికి పరిచయం చేశారు. ఆయనకు పెన్షన్ వచ్చేలా చేశారు. "మా తెలుగు తల్లికి మల్లెపూదండ"కు శాశ్వతకీర్తి లభించింది.

ఆ సంవత్సరం ఆగస్టులో నేను కడప ఆకాశవాణి కేంద్రంలో చేరాను. అప్పుడు కడప జిల్లా కలెక్టరు పి.యల్. సంజీవరెడ్డి. కృష్ణారావు విద్యాశాఖామంత్రిగా జిల్లా పర్యటనకు వచ్చారు. మా స్టూడియోకి ఆహ్వానించాను. నేనే ఇంటర్వ్యూ చేశాను. ఆయనకు శాఖాపరమైన సమాచారం యావత్తు కరతలామలకం. అన్ని ప్రశ్నలకూ సాధికారికంగా, సోదాహరణంగా సమాధానాలు గణాంకాలతో వివరించారు. ఆయన సరియైన విద్యామంత్రి అనిపించింది.

1978లో నేను విజయవాడ ఆకాశవాణికి బదిలీ మీద వెళ్లాను. ఒకరోజు నా గదిలో ఆఫీసు పని చూసుకొంటున్నాను. ఎదురుగా సాదాసీదా వ్యక్తిగా లోపలికి వచ్చారు మండలివారు. 'దివిసీమ గాంధీ'గా ఆయన అప్పటికే పేరు తెచ్చుకొన్నాడు. నేరుగా స్టేషన్ డైరక్టర్ యం. శివప్రకాశం రూంకెళ్లి కూచొని నన్ను పిలిపించవచ్చు లేదా కార్లోనే కూచొని ఎవరినో నా వద్దకు పంపవచ్చు. కాని, మామూలు వ్యక్తిలా వచ్చి పలకరించి, తర్వాత స్టేషన్ డైరెక్టర్ గదిలోకి వెళ్లాము. ఆ విధమైన సాదాసీదా రాజకీయ మహోన్నతుడు మండలి.

అప్పటికింకా రెండు పదుల నూనూగు మీసాల నూత్న యువకుడు బుద్ధప్రసాద్. గుడిసేవ విష్ణుప్రసాద్ అనే సాహితీమిత్రుడు మండలి కుటుంబానికి సన్నిహితుడు. ఒకసారి ఓ సాహితీ కార్యక్రమానికి ఆహ్వానిస్తే అవనిగడ్డ గాంధీక్షేత్రం వెళ్లాము. అప్పుడు మండలివారి ఇంట్లోనే ఆతిథ్యం. అప్పుడు పరిచయమయ్యారు బుద్ధప్రసాద్. మంత్రికుమారుడననే భావం ఆయన మాటలలో, చేతలలో ఎన్నడూ ప్రస్ఫుటం చేయలేదు.

తండ్రికి తగిన తనయుడిగా అవనిగడ్డ ప్రాంతంలో తనదైన శైలిలో సమాజసేవకు అంకితమయ్యారు. తండ్రివలె కవిపండితులకు సన్నిహితులయ్యారు. ఆంధ్రదేశంలోనే గాదు, దక్షిణం దేశంలో రచయితలందరితో ప్రత్యక్ష పరిచయం, వారి గ్రంథ ప్రచురణలకు, గ్రంథావిష్కరణలకు ప్రోత్సాహం కలిగించారు. పదవుల వెంట ఆయన పరుగులు తీయలేదు. ప్రజల వెంట నడిచారు. ప్రజాసమస్యల పరిష్కారానికి పట్టంగట్టారు.

కృష్ణా డెల్టా సంరక్షణకు నడుం బిగించారు. ఉద్యమ సారథిగా రైతన్నలకు బాసటగా నిలిచారు. మంత్రిగా ఉన్నా ఏ విధమైన ఆర్భాటాలు లేకుండా ప్రజలకు చేరువయ్యారు. రైతు సమస్యలే గాదు, భాషాపరమైన సమస్య కోసం నిరంతరం పోరాడారు. తెలుగుభాషకు అధికార హోదా కోసం ఒక శక్తిగా కృషి చేసి సాధించారు. అధికారభాషా సంఘాధ్యక్షులుగా తనదైన ధోరణిలో రాష్ట్రం నలుమూలలా సంచరించి తెలుగు విజయం, అంతర్జాలంలో ప్రవేశపెట్టారు.

నాడు-నేడు : ఆనాడు 1975లో ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలకు తన తండ్రి సూత్రధారి అయితే 2012 డిసెంబరులో తిరుపతిలో జరిగిన నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలకు బుద్ధప్రసాద్ సూత్రధారి. ప్రపంచ సభల పర్యవేక్షణకు త్రిమూర్తులవలె ముగ్గురు సారథ్యం వహించారు. రాళ్లబండి కవితాప్రసాద్, కె.వి రమణాచారి అధికార గణమైతే బుద్ధప్రసాద్ ప్రభుత్వ పక్షాన విధాన నిర్ణయాలకు వెనుబలంగా నిలిచారు. అత్యంత వైభవంగా ఆ సభలు నిర్వహించబడ్డాయి.

కేవలం ప్రభుత్వమే తెలుగు సభలు నిర్వహించే బాధ్యతను తీసుకోవాలనుకోవడం సరికాదనీ, కృష్ణా జిల్లా రచయితల సంఘ రథసారథిగా రెండు, మూడు ప్రపంచ స్థాయి సదస్సులు స్వయంగా నిర్వహించారు. ప్రత్యేక సంచికలు వెలువరించారు. దివిసీమ సాహితీ సాంస్కృతిక నృత్య కళారూపాలకు కాణాచి. క్షేత్రయ్య ఆరాధించిన మొవ్వ, కూచిపూడి నాట్య సంప్రదాయానికి పుట్టినిల్లు ఆయన కూచిపూడి, కృష్ణరాయలు సందర్శించి ఆముక్తమాల్యదా రచనకుపక్రమించిన శ్రీకాకుళాంధ్రదేవుడు, ఈ ప్రాంత సాంస్కృతిక వారసత్వానికి పెన్నిధులు. వాటి అభివృద్ధికి నిరంతర ప్రణాళికలు వేసి రాజకీయ వొత్తిడులు తెచ్చి ఎన్నో పథకాలు రూపొందించారు. అలా వెలసినదే కూచిపూడి నాట్యాభివృద్ధి సంస్థ. దానికి కూచిభొట్ల ఆనంద్ వంటి సమర్థులను ఎంపిక చేసిన ఘనత బుద్ధప్రసాద్‌ది.

సాహిత్య - రాజకీయ సవ్యసాచులు : 1960వ దశకంలో కేంద్ర, రాష్ట్ర రాజకీయాలలో తనదైన ముద్రవేసి పండిత జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రిగా వ్యవహరించిన డా. బెజవాడ గోపాలరెడ్డి అసలు సిసలైన గాంధేయవాది. ఆయన లక్షణాలను పుణికిపుచ్చుకున్న నేటి తరం ఏకైక వ్యక్తి బుద్ధప్రసాద్.

మూడు దఫాలు శాసనసభ్యులుగా పనిచేసినా, పశుసంవర్ధకశాఖా మంత్రిగా పనిచేసినా, అధికార భాషా సంఘ అధ్యక్షత వహించినా ఆయన లేని సాహిత్య సాంస్కృతిక సభలు ఆంధ్రదేశంలో అరుదు. కవులు, రచయితలు, గాయకులను పేరుపేరునా పలకరించి ఆత్మీయతా ముద్రవేసి మాట్లాడతారు. వారి కష్టసుఖాలు పరామర్శిస్తారు. భేషజం లేకుండా వారితో తానే టెలిఫోన్‌లో సంభాషిస్తారు. ఎవరినీ నొప్పించని మనస్తత్వం రాజకీయ నాయకులకు తక్కువ. అలాంటి రాజకీయాలు నేటితరానికి సరిపడవు. అయినా నిగర్విగా బుద్ధప్రసాద్ మసలుకొంటున్నారు.

2014 శాసనసభ ఎన్నికలలో ఆయన అవనిగడ్డ నుంచి గెలిచారు. ఆంధ్రదేశంలోని సాహిత్య సాంస్కృతిక కళారంగ ప్రియులందరూ ఆయన విద్యాశాఖ లేదా సాంస్కృతిక శాఖ మంత్రిగా ఎంపికవుతారని ఆశించారు. నూతన రాజకీయ సమీకరణాల వలన అది కుదరలేదు. అయినా ఆయన సంయమనం ప్రకటించారు. ఆవేశకావేశాలకు లోనుగాలేదు. తన వర్గీయులను రెచ్చగొట్టలేదు.

ముఖ్యమంత్రి తన మీద విశ్వాసంతో అందించిన శాసనసభా ఉపసభాపతి హోదాకు గౌరవం తెచ్చారు. శాసనసభ్యుల ఆదరం చూరగొన్నారు. తన నిత్య సాంస్కృతిక సభావిహారానికి సమయం కేటాయిస్తూ జంటనగరాలలోనేగాక, దక్షిణ దేశమంతా పర్యటించి ఆంధ్రుల సాంస్కృతిక జీవనానికి జవసత్వాలు చేకూరుస్తున్నారు. అందుకే 'శతమానం భవతి' అని షష్టిపూర్తి శుభవేళ సాహితీ వేత్తలందరూ ఆశీర్వదిస్తున్నారు.

శుభాభినందనలు

- డా. వకుళాభరణం రామకృష్ణ

మండలి బుద్ధప్రసాద్ గారు వర్తమాన రాజకీయాల్లో ప్రముఖులు కారు. సిరిసంపదలతో తులతూగే విలాస వంతులూ కాదు. తన శక్తికి మించి, అవకాశాలను అందిపుచ్చుకొని పైకి ఎగబాకాలనే మనస్తత్వమూ కాదు. మందీ, మార్బలం వెంట రాగా, హోదాకు, పలుకుబడికి మించిన అట్టహాసాలతో, హడావుడి చేసేవారూ కాదు. ఆనూచానంగా రాజకీయ కుటుంబానికి చెంది రాజకీయాల్లో వుంటూనే రాజకీయ చాణక్యం ఎరగని సాదాసీదా మనిషి.

మనిషి తనం కరిగించి పోసిన మూర్తిమత్వం వారిది. గుణదోషాలను కలబోసుకొని, సామాన్యునిగా ఉంటూ, వారు తిరుగాడే రాజకీయ వాతావరణంలో మనగలగడం కష్టసాధ్యమే!

ఇది వారిని పొగడ్డమో, విమర్శించడమో కాదు. వీరి గురించి ఏమి చెప్పాలనుకున్నా, రాయాలనుకొన్నా, నా మనసులో ముసిరే ఆలోచనలు ఇవి. ఇంతకూ బుద్ధప్రసాద్ గారు నాకెలా తెలుసు? జగమెరిగిన వారి గురించి ఎవరికీ తెలీని విషయాలు ఏం చెప్పగలను?

తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణ, పెంపుదల, వారసత్వ సంపదను కాపాడ్డం, చారిత్రక స్పృహతో, గతాన్ని వర్తమానంతో సంధించి, భవిష్యత్‌ను నిర్దేశించుకొనే క్రమంలో, తెలుగువారి చరిత్రను భావితరాలకు అందించాలన్న తపన. ఈ కృషిని వాస్తవీకరించే క్రమంలో నిమగ్నమై ఉన్నపుడే వారితో పరిచయం, ఆత్మీయ స్నేహంగా మారి, మా కృషికి ఆదరువుగా వారి ఆపన్నహస్తం మా ముందుకొచ్చింది. వినడమే గానీ, అంతవరకూ పరిచయం లేని వైనం.

పదిహేనేండ్ల క్రితం, అప్పటికే కొన్ని దశాబ్దాలుగా తెలుగువారి చరిత్ర, పరిశోధన, బోధనలపై అవిరళ కృషి సల్పుతున్న ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ తెలుగుల చరిత్ర, సంస్కృతులను పరిశోధించి, గ్రంథస్తం చేయాలని సంకల్పించింది. ఎనిమిది సంపుటాల్లో (ఆంగ్లం, తెలుగు రెండూ, క్రీ.పూ. 5000 నుండి క్రీ.శ. 2000 దాకా) ఈ కృషి, దశల వారీగా చేయ నిర్ణయించింది. మొదటి సంపుటం (చరిత్ర పూర్వ యుగం) వెలువడ్డాక ప్రచురణ కర్తలు లేక భారంగా కృషి కొనసాగిస్తున్న కష్ట సమయంలో, బుద్ధ ప్రసాద్ గారు పరిచయమయ్యారు. మా కృషి గూర్చి తెలుసుకున్నారు. ఇలాంటి కృషి, 1960 దశకంలోనే జరిపించాలని, అప్పుడు విద్యాశాఖామంత్రిగా ఉన్న వారి నాన్న మండలి వెంకట కృష్ణారావుగారు సంకల్పించినా, అది కొనసాగలేదు. ఇప్పుడా కృషి చరిత్ర కాంగ్రెస్ చేపట్టడం, బుద్ధప్రసాద్ గారికి, వారి నాన్నగారి కల సాకారమవుతున్నట్లు అన్పించిందేమో!

ఈ బృహత్కార్యాన్ని (ఆఖరి సంపుటం నం. 8 త్వరలో వెలువడుతుంది) బుద్ధప్రసాద్ ప్రోత్సహిస్తూ వస్తూన్నారు. ఈ పదిహేనేళ్లలో, ఎన్నోసార్లు, మేము చేపట్టిన బృహత్ కార్యక్రమం పూర్తి

చేయగలమా, అని సందేహాలు, ఇబ్బందులు, ఎదుర్కొన్నప్పుడు, 'నేనున్నానని' భరోసా యిస్తూ వచ్చారు. తెలుగువారి చరిత్ర, సంస్కృతుల పట్ల వారి కున్న అభినివేశమది!

మన చరిత్ర, సంస్కృతులు ఇవ్వాళ చౌరస్తాలో నిలబడి ఉన్నాయి. రాష్ట్ర విభజన జరిగాక, అవిభాజ్యమైన వీటిని పంపకాలు చేయాల్సిన పరిస్థితి రాగా ఇంతవరకూ అది జరగలేదు, రెండు సంవత్సరాలైనా! ఇది నింద కాదు. ఆవేదన. విభజన అటుంచి, ఈ రంగాల్లో జరగాల్సిన కృషి, జరిపించాల్సిన గురుతర బాధ్యత రెండు రాష్ట్రాలపై ఉంది. పాత పునాదుల్ని విస్మరించి, నూతన సంస్కృతిని పెంచి, ప్రోది చేయగలమా? గతాన్ని విస్మరించిన జాతికి భవిష్యత్ ఉంటుందా? ఆర్థిక, సామాజిక ప్రగతికి వన్నె తెచ్చేది, దాన్నొక చారిత్రక సన్నివేశంలో దర్శింపచేసేది, ఒక జాతి సంస్కృతి కాదా? తిండి, గుడ్డ, భౌతికావసరాల ధ్యాస అవసరమే. But, do human beings live by bread alone? ఇలాంటి ప్రశ్నలెన్నో ముందుకొస్తున్నాయి.

మండలి బుద్ధప్రసాద్ గారికి వీటిపట్ల ఆసక్తీ, అభినివేశమూ ఉన్నాయి. చక్కని చదువరి. విశ్లేషకులు. ఉపన్యాసకులు. నటరాజ రామకృష్ణ జీవిత చరిత్ర మేమ ఆవిష్కరిస్తున్న సందర్భంలో వారు చేసిన, విపుల, విశ్లేషణాత్మక ప్రసంగం మరువలేనిది. చరిత్ర, సంస్కృతులను పరిరక్షించే క్రమంలో, వారు తోడ్పాటు నందించగలరా? రాజకీయాలను పక్కనబెట్టి వీటి పరిరక్షణకు నడుం కట్టగలరా? సమాధానాలు దొరకని ప్రశ్నలివి. కానీ, సంస్కృతీ పరిరక్షణ ఏ ఒక్కరి వల్లనో సాధ్యమయేది కాదు. దానికి జాతి యావత్తూ పూనిక వహించాలి. ఈ కృషిలో బుద్ధప్రసాద్ గారు భాగస్వాములు కావాలనీ, భవిష్యత్ తరాలు వారిని గుర్తుంచుకొనే అంశం ఇదేననీ, దీన్ని వారు గ్రహిస్తారని నా విశ్వాసం.

వారికి నా శుభాభినందనలు.



మూర్తి దాల్చిన తెలుగు సంస్కృతి

- డా. కొలకలూరి ఇనాక్

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు నాకు దాదాపు నలభై ఏళ్ళ క్రితం పరిచయమయ్యారు. అప్పుడు వారు బి.ఏ. చదువుతున్నారని గుర్తు.

వారి తండ్రి కీ॥శే॥ మండలి వేంకట కృష్ణారావు గారు విద్యాశాఖ మంత్రిగా ఉండేవారు. వారంటే నాకు గౌరవం. చాలా ఇష్టం. నేనెప్పుడు అనంతపురం నుంచి హైదరాబాదు వచ్చినా వారిని కలిసేవాణ్ణి. ఎంత పనులు, సందర్శకుల ఒత్తిడిలో ఉన్నా రెండు నిమిషాలయినా నేను నా పుస్తకం ఇవ్వటానికి సమయం ఇచ్చేవారు. నేనప్పుడు విరివిగా వ్రాస్తూ ఉండేవాణ్ణి.

యం.వి. కృష్ణారావు గారిని దర్శించటానికి వచ్చిన ఎవరికీ నిరాశ కలిగేది కాదు. వారు పూలమాలలు వేయించుకొనేవాళ్ళు కాదు. బస్సుల్లో ప్రయాణాలు చేసేవాళ్ళు, మంది మార్బలం, హంగు ఆర్భాటం ఉండేవి కావు. అసలుసిసలు సామాన్యుల నాయకుడు. దివిసీమలో ఉప్పెన వచ్చినప్పుడు పీకల్లోతు నీళ్ళలో గ్రామగ్రామం, ఆపదకు భయపడకుండా, తిరిగి సహాయచర్యలు చేపట్టిన వారు నాకు అప్పుడొక అద్భుతం. ఇప్పుడొక ఆదర్శ జ్ఞాపకం.

నేను మంత్రి గారిని కలుస్తున్న రోజుల్లో వారికుమారులు శ్రీ బుద్ధప్రసాద్‌గారితో పరిచయమయింది అప్పటికీ వారికి తెలుగు సాహిత్యంతో, తెలుగు కవులు, రచయితలతో మంచి పరిచయం, ఇష్టం ఉండేవి. అపారమైన జిజ్ఞాస ఉండేది. ఆ తృష్ణ ఆ వయస్సు వాళ్ళలో అరుదు.

యం.వి. కృష్ణారావు గారి సోదరులు యం. కుటుంబరావుగారు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పరీక్షాధికారిగా ఉండేవారు. పరీక్షా నియంత్రణలో వారికి గట్టిపట్టు ఉండేది. మంచి పేరుండేది. నన్ను భేషజం లేకుండా పలకరించేవారు. తర్వాత చాలా సన్నిహితులమయ్యాం. ఆపైన మంచిమిత్రులమయ్యాం. అనంతపురంలో ఉన్న వారి కుమార్తెను చూడటానికి వచ్చి ఉన్నప్పుడు రోజూ సాయంత్రం కలుసుకొనేవాళ్ళం.

వారి కుటుంబంతో నాకున్న అనుబంధం వల్ల శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారిపట్ల విశేషమైన ఇష్టం. వాత్సల్యం ఏర్పడ్డాయి. వీరిని నేను యం.యల్.ఏ.గా, మంత్రిగా, అధికార భాషా సంఘం అధ్యక్షులుగా, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతిగా చూడగలగటం సదవకాశం.

వీరు నిరాడంబరులు, అధికార దర్పంలేనివారు. సర్వజన సులభులు. ఎవరు పలకరించినా, ప్రేమగా మాట్లాడతారు. ఎవరైనా ఫోను చేసి మాట్లాడతారు. వారి వెంట గన్‌మేన్‌లు, రెండు మూడు కార్లు, ముగ్గురు నలుగురు సిబ్బంది ఉండటం నేను చూడలేదు.

శ్రీ బుద్ధప్రసాద్‌గారు ప్రజాసేవకోసం రాజకీయాలలో ఉన్నారు కానీ ఏ పదవులూ కోరుకోలేదు. దేనికి ఆరాటపడలేదు. పోరాటం చేయలేదు. మొన్నటికి మొన్న ఏమీ ఆశించకుండా ఇంట్లో విశ్రాంతి తీసుకొంటున్నప్పుడు శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు పిలచి శాసనసభ ఉప సభాపతి పదవి ప్రదానం చేయటం మనమంతా పత్రికల్లో చదివిన సంగతే!

తెలుగుభాష, తెలుగు సాహిత్యం, తెలుగు కళలు, సంగీతం, నృత్యం, శిల్పం, జానపదకళలు, ప్రజాజీవితం, ప్రజావికాసం, కళల – కళాకారుల అభివృద్ధి వీరు కంఠదఘ్నంగా కోరుకొంటూ ఉంటారు.

వీరికి తెలుగు సంస్కృతి మీద అపరిమితమైన ప్రేమ ఉంది. ఏ మాత్రం వెలుగున్నా, ఆ కళాకారుణ్ణి ప్రోత్సహిస్తూ ఉంటారు. తెలుగుకు సంబంధించిన అనేక సంఘాలవాళ్ళు వీరిని ఆరాధిస్తారు. అభిమానిస్తారు. ఏ సాహిత్య, కళా, సాంస్కృతిక భాషా సంఘాలవాళ్ళు ఎప్పుడు ఫోను చేసినా పలుకుతారు. వారి వారి కార్యక్రమాలకు హాజరయి వాళ్ళ కృషిని అభినందిస్తారు. ప్రోత్సహిస్తారు. సాహిత్యం వంటి నాటక కళా సాంస్కృతిక రంగాల వాళ్ళ ఆహ్వానం మేరకు ఆయన పర్యటించని ప్రదేశం ఆంధ్రరాష్ట్రంలో లేదు. ఇరుగుపొరుగు రాష్ట్రాలు, తమిళ, కన్నడ, ఒరిస్సా, మహారాష్ట్ర, ఢిల్లీ వంటి రాష్ట్రాలలో అనేక సభలు, సమావేశాలలో పాల్గొన్నారు. అమెరికా, బ్రిటన్, మారిషస్, సింగపూర్ వంటి దేశాలలో ఆంధ్రుల సాంస్కృతిక రాయబారిగా పర్యటించారు. తెలుగు వాళ్ళు ప్రపంచంలో ఏమూల నుంచి పిలిచినా, వీలునుబట్టి ఆ కార్యక్రమానికి హాజరయి వాళ్ళను ఆనందింప చేస్తూ వచ్చారు.

బుద్ధప్రసాద్ గారిది విశేషమైన జ్ఞాపకశక్తి. వ్యక్తులు, స్థలాలు, సమయాలు అనేకం వారి ప్రసంగాలలో ఉటంకిస్తారు. ఏదీ అసందర్భంగా కానీ, ఔచిత్యరహితంగా కానీ, పులుముడుగా ఉండదు. వారి అరవై ఏళ్ళ జీవితంలో పొందిన అనుభవ పరంపరను అంత విశదంగా గుర్తుంచుకోవటం, దాన్ని సమయం, సందర్భం గుర్తించి వివరించటం అందరికీ సాధ్యం కాదు.

ప్రోత్సహించటం ఆయన జీవిత లక్ష్యం. దేశానికి ఏ రంగంలో ఎంత మాత్రం సేవ చేసినా, ఆ ప్రముఖుల్ని ప్రశంసించటం, ప్రోత్సహించటం వారికి నైజమయింది.

తెలుగన్నా, తెలుగు సాంస్కృతిక, కళా, ప్రజారంగమన్నా వారికి అపారమైన భక్తి. రెండు రాష్ట్రాల తెలుగువాళ్లే కారు, ఇరుగుపొరుగు రాష్ట్రాలవారే కారు, ప్రపంచ దేశాలలో ఉన్న మొత్తం ఆంధ్రులు 18 కోట్ల మంది ఆయనకు ఆత్మీయులే.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి దైవభక్తి ఎక్కువ. జీర్ణదేవాలయోద్ధరణ వారికి ఇష్టం. శ్రీకాకుళాంధ్ర మహావిష్ణు సేవలో తరించటం వారికానందం. వారి స్వస్థలమైన అవనిగడ్డకు సమీపంలో ఉన్న కూచిపూడిని, కూచిపూడి నాట్యరీతిని భగవద్భక్తి గానే ఆరాధిస్తారు.

ఏ సాహిత్యవేత్తయినా, ఏ మహాశయుడైనా తన రచన బహూకరిస్తే, దాన్ని బుద్ధప్రసాద్ గారు చదువుతారు. అంతేకాదు, అభినందన లేఖ రాస్తారు. సందర్భం వచ్చినప్పుడు సభలు, సమావేశాలలో ప్రస్తావిస్తారు. నన్నా విధంగా మన్నించారు. వీరు తండ్రికి తగ్గ తనయులు. ఎదుటి మనిషిని ప్రేమించటం వీళ్ళిద్దరికీ ఉన్న సద్భాగ్యం.

ఎవరినీ నొప్పించకపోవటం బుద్ధప్రసాద్ గారి నియమము. ఎవరి అర్హత కొద్ది వారిని అభిమానించటం వారి నైజం. ఏ మనిషిలోనైనా, మంచిని చూడటం, చూపటం వారి దృష్టి విశేషం. వారి గుణ గ్రహణ పారీణత కళారత్నాది పురస్కారాలకు కళామూర్తుల్ని ఎంపిక చేయటంలో నేను దగ్గరగా చూశాను.

నేను దివి సీమ ఉప్పెన సందర్భంలో అనంతపురం అందించిన పాత బట్టల మూటలు తీసుకొని, అవనిగడ్డలో వారింట దించినప్పుడు వారానందించిన తీరు నేను ఎప్పటికి మర్చిపోలేను.

పెళ్ళి సందర్భాలలో భోజనం ఏర్పాట్లు సహజమే కదా, పెళ్ళి వాళ్ళు, తమకు అత్యంత ప్రీతిపాత్రమైన పదార్థాలు వండింపజేసి, ఆహూతులు ఆనందిస్తుంటే, సంతోషిస్తారు. కానీ బుద్ధప్రసాద్‌గారు, తనకు ఇష్టమైనవికాకుండా, జనానికి ఇష్టమైన వంటకాలు చేయించారు. ఆంధ్ర రుచులు వేరుగా, తెలంగాణ రుచులు ప్రత్యేకంగా, రాయలసీమ వంటకాలు ముఖ్యంగా ఏర్పాట్లు చేయించటం నాకు ఆశ్చర్యం కలిగించింది. గుంటూరు సమీప గ్రామంలో పుట్టి, రాయలసీమలో 45 ఏళ్ళు జీవించి, 15 ఏళ్ళుగా తెలంగాణలో ఉంటున్న నాకు అన్నీ రుచులూ ఇష్టమే. ఎంత ఆనందించానో! పెళ్ళి భోజనం విషయంలో ప్రజల ఇష్టం, తన అభీష్టంగా మార్చుకొన్న వీరి అద్భుత మనస్తత్వం వీరి కూతురు పెళ్ళిలో, నేను చూశాను.

అవనిగడ్డ గాంధీక్షేత్రంలో వీరి తండ్రి గారున్నప్పుడు ఒకసారి, వీరు నిర్వహిస్తున్నప్పుడొకసారి – ప్రసంగించే అవకాశాలు నాకు లభించాయి. ఆ ప్రసంగ సారాంశాలు వీరికి ఇప్పటికీ గుర్తుండటం నా అదృష్టం.

మా చిరంజీవులు మా తల్లిగారి పేరిట, నా భార్య గారి పేరిట ప్రతి ఏటా నిర్వహించే పురస్కార కార్యక్రమాలలో చాలాసార్లు వీరు ముఖ్య అతిథిగా వచ్చి, పురస్కృతుల్ని, మా చిరంజీవుల్ని ఆశీర్వదించి సభలను విజయవంతం కావించారు.

కీ॥శే॥ యం.వి. కృష్ణారావు గారు నాకు మొదటి, రెండవ ప్రపంచ తెలుగు మహా సభల్లో, హైదరాబాదులో, మలేషియాలో పాల్గొనే భాగ్యం కలిగించారు. శ్రీ బుద్ధప్రసాద్ గారు లండన్ నగరంలో జరిగిన తెలుగు సభలలో నేను పాల్గొనే అవకాశం కల్పించారు. నన్ను హైదరాబాదులో, గుంటూరులో, విజయవాడలో సత్కరించిన సభల్లో పాల్గొని ఆత్మీయంగా అభినందించారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం పక్షాన నిర్వహించిన అనేక సమావేశాలలో, ప్రపంచ తెలుగు రచయితల సభల్లో నాకు భాగస్వామ్యం కల్పించారు.

నాకు 'పద్మశ్రీ' వచ్చినప్పుడు అభినందించటంతోపాటు మరునాడే అధికార భాషా సంఘం కార్యాలయంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి, నన్ను గూర్చి, నా సాహిత్యం గూర్చి ప్రేమ పూర్వకంగా అభినందించటం మధురమైన అనుభూతి.

అధికారభాషా సంఘ నిర్వహణలో, రవీంద్రభారతిలో అవిభక్త ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లాల కలెక్టర్లు హాజరయిన సభలో నాకు పద్మశ్రీ రావటం తెలుగు జాతికి, భాషకు, దేశానికి గర్వకారణమని చెప్పి సన్మానించటం వారి ఔదార్యానికి పరాకాష్ఠ.

నాకు 'మూర్తి దేవి' పురస్కారం వచ్చినట్లు పత్రికల్లో వార్త చదివి, వెంటనే ఫోను చేసి అభినందించారు. ఈ సందర్భంలో నన్ను ప్రేమగా పలకరించిన మొదటి ఆత్మీయులు వీరు.

పుట్టపర్తి సాయిబాబా దర్శనం చేసుకొని అనంతపురం నుంచి తిరుగు ప్రయాణంలో సమయం చూచుకొని వచ్చి నన్ను ప్రేమగా పలకరించటం వారి అనురాగ హృదయానికి నిదర్శనం.

నాకిప్పటికీ శ్రీ బుద్ధప్రసాద్ గారు 20 ఏళ్ళ యువకుడు గానే గుర్తున్నారు. అప్పుడే షష్ట్యబ్ది పూర్తి అంటే ఆశ్చర్యమే! అది కాలం, దాని మహిమ అనంతం. శ్రీ బుద్ధప్రసాద్ గారు ఈ కాలంలో చేసిన కృషి చారిత్రాత్మకం. చిరంజీవిగా దేశ హృదయంలో వీరు నిలచి ఉంటారు. ఈ షష్ట్యబ్ది పూర్తి నాటికి వీరు మూర్తిదాల్చిన తెలుగు సంస్కృతి కాగలిగారు. ఇదెంత అదృష్టం!

శ్రీమతి మండలి బుద్ధప్రసాద్ గారు ఎల్లప్పుడూ చేదోడు వాదోడుగా ఉంటారు. వీరి చిరంజీవులు తల్లిదండ్రుల ఆజ్ఞానువర్తులై జీవిస్తున్నారు. వీరి కుటుంబ జీవితం మిక్కిలి ప్రశాంతం.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి, వీరి కుటుంబానికి వీరి ఇష్టదైవం ఆయుష్షును, ఆరోగ్యాన్ని, ఐశ్వర్యాన్ని, ప్రజాసేవ కోసం రాజకీయంగా అభివృద్ధిని, సమస్త సుఖసంతోషాలను, సర్వశాంతి శుభాలను, సకల సంతృప్తుల్ని కలిగిస్తాడని నమ్ముతున్నాను.



సచ్ఛీలతకు సమున్నత రూపం

- ఎం.డి. రత్నకుమార్

ప్రజాస్వామ్యంలో వారసత్వ రాజకీయాలకు తావులేదు. కానీ, ప్రజల అభిమానం, అంకితభావం ఒక వ్యక్తిలో అసాధారణరీతిలో ప్రదర్శితమైతే ప్రజామోదం అనివార్య మౌతుంది. దశాబ్దాలుగా ప్రజల అభిమానాన్ని నిలుపుకోవటం కొందరికే సాధ్యం. ఆ కోవకు చెందిన వ్యక్తే మండలి బుద్ధప్రసాద్. రాజకీయంగా ఎదిగేందుకు తన తండ్రి ఎం.వి. కృష్ణారావు బాటలు పరిచినా రాజకీయ చదరంగంలో నిలిచి గెలిచేందుకు బుద్ధప్రసాద్‌కు తక్షణ అవకాశాలు రాలేదు. స్వీయ ప్రణాళికలతో ప్రజల అవసరాల్ని తీర్చే రీతిలో అహరహం పోరాటం జరిపిన తర్వాత మాత్రమే ఆయనకు చట్టసభలో ప్రవేశం సాధ్యమైంది. కుమారుడి రాజకీయ ఎదుగుదలను కళ్ళారా చూడాలని తపించిన తన తండ్రి గతించిన తర్వాత కానీ, అసలైన ప్రజా ప్రతినిధిగా అవకాశం బుద్ధప్రసాద్‌కు రాలేదు. 1994 అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి పోటీచేసి ఓటమి పాలైనా కృష్ణాజిల్లాలో కాంగ్రెస్ పార్టీకి 12ఏళ్ళ పాటు సారథ్యం వహించి పటిష్టపర్చిన తర్వాత కానీ తదుపరి ఎన్నికల్లో విజయం దఖలు పడలేదు. తొలిసారే ప్రతిపక్ష సభ్యునిగా శాసనసభలో అడుగుపెట్టిన బుద్ధప్రసాద్‌కు అడుగడుగునా సమస్యలే పలకరించాయి. ప్రతిపక్ష సభ్యునిగా అడుగుపెట్టటం ఒక విధంగా మంచికే దారితీసింది. ఐదేళ్ళపాటు ప్రజా సమస్యలపై గళమెత్తడం, పోరాటబాటలో పయనించటంతో నిరంతరం ప్రజలతో మమేకం అయ్యే అవకాశం ఏర్పడింది. ఒక విధంగా చెప్పాలంటే బుద్ధప్రసాద్‌కు శాసనసభ్యుడిగా తొలి టర్మ్ తన రాజకీయ జీవితంలో అత్యంత కీలకం. రాష్ట్రానికి అన్నంగిన్నె లాంటి కృష్ణా డెల్టా ఎడారిగా మారే పరిస్థితులు పోరాటం వైపు పురిగొల్పాయి. దాని ఫలితంగానే కృష్ణా డెల్టా పరిరక్షణ సమితి పేరిట జరిగిన ఆందోళన కార్యక్రమాలు ఆయనలోని నాయకుడిని లోకానికి తెలియజేశాయి. వ్యక్తిగత సమర్థత (పర్సనల్ కాలిబ్రి) రాజకీయాల్లో అత్యంత అవసరం. అది లేకుండా ఎన్ని అవకాశాలు వచ్చినా వాటిని అందిపుచ్చుకోవటం సాధ్యం కాదు. ముందే చెప్పినట్టుగా తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచేందుకు బుద్ధప్రసాద్ పడిన కష్టం అంతా ఇంతా కాదు. ఏ వ్యక్తికైనా కావాల్సింది ఆర్థిక వనరులు. అవి లేకుండా ఎన్నికల్లో నెట్టుకు రావటం చాలా కష్టం. అయితే కార్యకర్తల అండదండలతో ఆయన గెలిచి చూపించారు. ఆయన తండ్రి హయాంలో తన పరపతిని ఉపయోగించుకుని బాగుపడిన వ్యక్తులు సైతం అలాంటి కీలక సమయంలో బుద్ధప్రసాద్‌కు మొహం చాటేశారు. అయినప్పటికీ ప్రజలు ఆశీర్వదించిన కారణంగా బుద్ధప్రసాద్ చట్టసభలో అడుగుపెట్టారు. ఆయన ఏదీ మర్చిపోరు. నిరాడంబరత మరో ఆభరణం. తొలి ఎన్నికల్లో మొహం చాటేసిన వ్యక్తులు, గెలవగానే దగ్గరయ్యేందుకు ప్రయత్నించారు. పైగా 'బాబు' (బుద్ధప్రసాద్)కు డబ్బు అవసరమైన పక్షంలో మమ్మల్ని ఓ మాట అడగొచ్చుగా, మొహమాటం దేనికి? అంటూ సదరు నయా కోటీశ్వరులు ఆయన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించటం జరిగింది. ఈ పరిణామం ఆయన్ని తీవ్రంగా బాధపెట్టింది. సున్నిత హృదయం కలుక్కుమనేలా చేసింది. నాతో ఉన్న సాన్నిహిత్యం కారణంగా ఓ సందర్భంలో ఈ విషయం ప్రస్తావించి బాధపడ్డారు. ఎమ్మెల్యే అయినప్పటికీ ఆర్.టి.సి. బస్సులో ప్రయాణించటం బుద్ధప్రసాద్‌కు అలవాటు.

అలాంటి సందర్భంలో ఓసారి ఆయనతో పాటు చేసిన బస్సు ప్రయాణంలో ఈ విధంగా తన అంతరంగాన్ని ఆవిష్కరించారు. రాజకీయాల్లో ధన ప్రభావం నానాటికీ అధికమైపోతున్న తరుణంలో తాను భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేసేది అనుమానమే నని చూఛాయగా చెప్పారు కూడా. అయితే మీలాంటి వ్యక్తులకు డబ్బు అవసరం అంతగా ఉండదు అంతకంటే విలువైన ప్రజాభిమానం మీకు ఉంది. కలత చెందొద్దని నేను ఆ సందర్భంగా సలహా ఇవ్వటం నాకింకా గుర్తుంది. ప్రజా ప్రయోజనాలు దెబ్బతినే అవకాశం ఉన్నప్పుడు నాయకుడిని సైతం లెక్కచేయకపోవటం అందరికీ సాధ్యం కాదు. ఒక విధంగా– తేడా వస్తే రాజకీయ భవిష్యత్తు ప్రమాదంలో పడేంతటి సంఘటనలు ఎమ్మెల్యేగా తొలిసారి ఎన్నికైన కాలంలోనే (1999–2004) జరిగాయి. అప్పట్లో తెలంగాణ అంశం రాజుకున్న దశలో, పులిచింతల ప్రాజెక్టుపై రాజకీయంగా ఏమీ చెప్పలేని పరిస్థితుల్ని ఆనాటి రాష్ట్ర కాంగ్రెస్ ఎదుర్కొంది. నల్గొండ జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పులిచింతల ప్రాజెక్టు శంకుస్థాపన శిలాఫలకాల్ని, దూరం చేసి రావటం కాంగ్రెస్‌లో కల్లోలానికి దారితీసింది. పులిచింతలపై కాంగ్రెస్ వైఖరి ఏమిటి? అంటూ బుద్ధప్రసాద్ ధైర్యంగా ప్రశ్నించటం అప్పట్లో ఒక సంచలనం. ఆనాటి పి.సి.సి. అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ రావు, సిఎల్‌పి నేత వై.ఎస్. రాజశేఖర్ రెడ్డిలు సైతం కాంగ్రెస్ వైఖరిని చెప్పలేని పరిస్థితి. అయినప్పటికీ బుద్ధప్రసాద్‌ను శాంతింపజేశారు. డెల్టా పరిరక్షణ పేరుతో ఆయన ఉద్యమించినా ఏమనలేని స్థితి. అయితే కృష్ణాడెల్టా అంశాల్ని ప్రజల్లోకి తీసుకెళ్ళటం పార్టీకి మేలు చేస్తుందని నాయకత్వం తలపోసిన కారణంగా బుద్ధప్రసాద్‌పై వేరే రకమైన అభిప్రాయానికి నాయకత్వం అప్పట్లో రాలేదు. కృష్ణానదిపై పులిగడ్డ పెనుమూడి వారధిని నిర్మించాలనే డిమాండ్ బుద్ధప్రసాద్‌ను మరోసారి సిసలైన నాయకుడిగా నిలబెట్టింది. అప్పట్లో వారధిని మరోచోటకు తరలించే ప్రయత్నాలు కూడా ముమ్మరంగా జరిగాయి. కత్తిపూడి–పామర్రు జాతీయ రహదారిని పొడిగించి శ్రీకాకుళం వద్ద కృష్ణానదిపై వారధి నిర్మించాలన్న ప్రతిపాదన పురుడు పోసుకుంది. దీన్ని తీవ్రస్థాయిలో వ్యతిరేకించిన బుద్ధప్రసాద్ చివరకు రాజీనామా వరకూ వెళ్ళారు. జాతీయ రహదారిని దివిసీమ ద్వీపం మీదుగా తీసుకెళ్ళి పులిగడ్డ పెనుమూడి వద్ద వంతెనను నిర్మించాలన్న ప్రజా డిమాండ్‌ను నెరవేర్చే దిశగా మరో ఉద్యమాన్ని ప్రారంభించారు. ప్రజా క్షేత్రంలో ఇతర సంఘాలు కూడా ఆందోళన చేస్తున్నప్పటికీ శాసనసభ్యుడి వైఖరే విషయాన్ని ఓ కొలిక్కి తీసుకురాగలదన్న అభిప్రాయం నెలకొంది. ఆ సమయాన ఆయన సంధించిన రాజీనామా అస్త్రం పెను సంచలనానికి కారణమైంది. 90 మంది కాంగ్రెస్ శాసనసభా పక్షం (సి.ఎల్.పి) లో సభ్యుడై ఉండి, నాయకుడు వై.ఎస్. రాజశేఖర్ రెడ్డికి కనీసం సమాచారం లేకుండా ఒక ఎమ్మెల్యే నేరుగా రాజీనామా పత్రాన్ని ముఖ్యమంత్రికి పంపించటం సంచలనానికి దారితీసింది. బుద్ధప్రసాద్ రాజీనామా విషయాన్ని ఆయన నాయకుడైన వై.ఎస్. సైతం మీడియా ద్వారానే తెలుసుకున్నారు. సహజంగానే వై.ఎస్.కు ఈ విషయంలో బుద్ధప్రసాద్‌పై కోపం వచ్చింది. తనకు చెప్పకుండా తనతో సంప్రదించకుండా రాజీనామా చేయటం ఆయనకు సుతరామూ నచ్చలేదు. ఏమిటిది? అంటూ ఆగ్రహం ప్రదర్శించారు తన సన్నిహితుల వద్ద. దీన్నే అదనుగా తీసుకొని బుద్ధప్రసాద్ పట్ల వై.ఎస్.కు దురభిప్రాయం కలిగే విధంగా కొందరు వ్యవహరించారు. ప్రజల నిజమైన డిమాండ్ పట్ల శాసనసభ్యుడిగా స్పందించిన తీరును నాయకత్వమే అపార్థం చేసుకుంటే ఎలా? అదే సమయంలో ఒక జర్నలిస్టుగా వై.ఎస్.తో నాకున్న సాన్నిహిత్యం కారణంగా ఆయనకు ఎమ్మెల్యే పట్ల అపోహలు కలుగకుండా నేను ఆ రోజున యథాశక్తి కృషి చేశాను. ప్రజల డిమాండ్ పట్ల బుద్ధప్రసాద్‌కున్న చిత్తశుద్ధి,

అంకితభావమే నా ప్రయత్నానికి ప్రేరణ. "బుద్ధప్రసాద్ మీకు చెప్పలేదన్న పాయింటును చూడొద్దు. ప్రజల డిమాండ్‌పై ఆయనలా స్పందించటం 100 శాతం కరెక్టన్న అంశాన్ని దయచేసి గమనించండి" అన్న సందేశాన్ని వై.ఎస్.కు చేరవేశాను. ఫలితంగా నాయకుడిలో అపార్థం తొలగిపోయింది. బుద్ధప్రసాద్ రాజీనామా నిర్ణయంతో ప్రభుత్వంలోనూ కదలిక వచ్చింది. ప్రతిపక్ష ఎమ్మెల్యే ఒక అంశంపై రాజీనామా ప్రకటించాడు. పైగా అతడి నాయకుడినీ (వైఎస్) సంప్రదించ లేదు. మేమెందుకు పట్టించుకోవాలన్న ధోరణి తొలి ఘడియలో ముఖ్యమంత్రి చంద్రబాబులో కన్పించింది. అదేరోజు లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్‌లో ముఖ్యమంత్రి విలేకరుల సమావేశం ఏర్పాటైంది. దానిలోనూ ఇదే ప్రస్తావన. మొదట చంద్రబాబు కూడా శ్రీకాకుళం వద్ద వారధి నిర్మాణానికే మద్దతుగా మాట్లాడారు. నేను వెంటనే బుద్ధప్రసాద్ రాజీనామా కారణాన్ని, దానిపై చంద్రబాబు స్పందననూ కోరాను. "అవనిగడ్డ వద్ద నుంచి జాతీయ రహదారి ఎలా వెళ్తుంది? ప్రతివాడూ తన ఊరి మీదుగానే జాతీయ రహదారి వెళ్ళాలని అనుకుంటే ఎలా?" అని చంద్రబాబు నన్ను తిరిగి ప్రశ్నించారు. అది స్థానిక ప్రజల్లో 70 ఏళ్లుగా ఉన్న ఆకాంక్షని, దాన్ని నెరవేర్చాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వంపైన ఉందని నేను స్పందించాను. దివిసీమ ద్వీపానికి దూరంగా వారధి నిర్మాణం జరిగేందుకు ప్రణాళిక సన్నద్ధమవుతోందన్న విషయంపై నిజానికి చంద్రబాబుకు సైతం ఆ క్షణం వరకూ నిర్దిష్ట సమాచారం లేదు. ఆ తర్వాత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే ఆయన స్పందించి వారధి నిర్మాణాన్ని మంజూరు చేయటం, శంకుస్థాపన సైతం చేయటం జరిగిపోయాయి. తదుపరి అధికారంలోకి వచ్చాక వైఎస్సే ఆ వంతెనను ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి ముందురోజు నేనాయన్ను సచివాలయంలో ఆయన ఛాంబర్‌లో ప్రత్యేకంగా కల్సుకుని, ఆ వారధి ప్రాముఖ్యతనూ, ఆ డిమాండ్‌కున్న 70 ఏళ్ళ నేపథ్యాన్ని వివరించాను. అంతటి ప్రాధాన్యత కారణంగానే ఎమ్మెల్యే రాజీనామాకు సిద్ధపడాల్సి వచ్చిందని మళ్ళీ గుర్తు చేయగా ఆయన నవ్వుతూ నా మాటలతో ఏకీభవించారు. తడ-ఇచ్ఛాపురం తీర రహదారిలో భాగంగా పులిగడ్డ- పెనుమూడి వారధికి నిర్మాణం జరగాలని అప్పటికి 30 ఏళ్ళ కిందటే మండలి వెంకటకృష్ణారావు ప్రతిపాదించిన నేపథ్యంలోనే ఆ వారధికి ఆయన పేరునే పెడుతూ వైఎస్ ప్రకటన చేశారు. వైఎస్ వంటి ముక్కుసూటి మనస్తత్వం గల నాయకుడు, ఎల్లప్పుడూ విధేయత కల్గిన వ్యక్తులనే తన సన్నిహిత చట్రంలోకి రానిస్తాడు. బుద్ధప్రసాద్ వంటి స్వతంత్రభావాలు, వ్యక్తిగత నిర్ణయాలు తీసుకొనే శక్తి ఉన్న శాసనసభ్యులకు వైఎస్ సరసన చోటు దొరకటం అంత సులభం కాదన్న అభిప్రాయం అప్పట్లో నెలకొంది. ఆ కారణంగానే 2004 లో అధికారంలోకి వచ్చినా అందరి అంచనాలకు భిన్నంగా బుద్ధప్రసాద్‌కు తొలి క్యాబినెట్‌లో స్థానం కల్పించలేదు. అయితే ప్రజాభిమానం కల వ్యక్తుల్ని సముచిత రీతిలో గౌరవించకపోయినా, తగిన అవకాశం కల్పించకపోయినా ఆ ప్రభావం అంతిమంగా ప్రభుత్వంపై పడుతుందన్న ఆలోచనకు వై.ఎస్. గురయ్యారు. అయితే, అప్పట్లో మంత్రివర్గ విస్తరణకు ముందు 2006లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫలితాల ఆధారంగా ఎమ్మెల్యేల పనితీరుపై విస్తరణలో అవకాశం ఇవ్వాలన్న ప్రతిపాదన వచ్చింది. ఆ మేరకు కాంగ్రెస్ సీనియర్ నేత పర్వతనేని ఉపేంద్ర సారథ్యంలో ఒక కమిటీని కూడా వైఎస్ నియమించారు. ఆ కమిటీ సదరు లెక్కలన్నీ పరిశీలించి, ఫలితాల సాధన ప్రాతిపదికన బుద్ధప్రసాద్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించటం సాధ్యం కాదని తేల్చేసింది. అయినప్పటికీ వ్యక్తిగత ప్రతిష్ట, నాయకత్వ పటిమ, సచ్ఛీలత ప్రాతిపదికన బుద్ధప్రసాద్‌ను నిర్లక్ష్యం చేయటం ఇకపై తగదని వైఎస్ ఓ నిర్ణయానికి వచ్చారు. ఫలితంగానే 2007లో జరిగిన మంత్రివర్గ

విస్తరణలో తొలిసారి మంత్రిగా ప్రమాణం చేశారాయన. రెండేళ్ళపాటు మంత్రిగా తనదైన ముద్రను వేసిన బుద్ధప్రసాద్ 2009 ఎన్నికల్లో ఓటమి పాలు కావటం నిజమైన దురదృష్టం. లేకుంటే మరో 5 ఏళ్ళ పాటు మంత్రిగా వ్యవహరించటం ద్వారా కోట్లాది రూపాయల అభివృద్ధి పనుల్ని అవనిగడ్డ నియోజకవర్గానికి చేసి ఉండేవారు. వరుసగా 14 రౌండ్లలో ఆధిక్యాన్ని ప్రదర్శించిన బుద్ధప్రసాద్ చివరి రౌండ్ వెనుకబడి 400 పైగా ఓట్ల తేడాతో ఓటమి పాలైనారు. ఎంత అభివృద్ధి చేసినా ప్రజల దృక్పథంలోనూ మార్పు వచ్చిందన్న భావన ఆయనలో ఏర్పడింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఓ కుగ్రామానికి అన్ని రకాల మౌలిక సదుపాయాల్ని కల్పిస్తే, అక్కడ తనకు ఓట్లు పడలేదని, పైగా పోలింగ్‌రోజున తమకింకా డబ్బులు అందలేదని అక్కడకు వెళ్ళిన తనతోనే కొందరు ఓటర్లు చెప్పారని ఆయన ఆవేదన చెందారు. బుద్ధప్రసాద్ ఓటమి పాలైనందుకు నియోజకవర్గంలో ఆయన పట్ల ఏర్పడిన సానుభూతి తదుపరి ఎన్నికల వరకూ కొనసాగిన ఫలితంగా ఆయన్ను మళ్ళీ విజయలక్ష్మి వరించింది.

ఇక ఐదు కోట్ల మంది ప్రజలకు తీరని వేదన మిగిలిన రాష్ట్ర విభజన అంశం కాంగ్రెస్ పార్టీకి సమాధికట్టింది. తాను పుట్టి పెరిగి కాంగ్రెస్‌నే వీడాల్సిన పరిస్థితిని బుద్ధప్రసాద్ కూడా ఎదుర్కొన్నారు. 2009 డిసెంబరు 9న కేంద్ర హోం మంత్రి పి. చిదంబరం చేసిన తెలంగాణా ప్రకటన ప్రకంపనలు రేపింది. వెంటనే కార్యరంగంలోకి దిగి జిల్లాలో నేతల్ని సమాయత్తం చేశారు బుద్ధప్రసాద్. విభజన ఎంతటి అనర్థాలకు దారితీస్తుందో ఢిల్లీ నాయకత్వానికి విడమర్చి చెప్పినా ప్రయోజనం లేకపోయింది. 150 ఏళ్ళ తర్వాత 1956లో ఒక్కటై 58 ఏళ్ళు కలిసి మెలిసి జీవించిన తెలుగు ప్రజలు కేవలం రాజకీయాల కారణంగా విడిపోవాల్సి వచ్చింది. ఇది తెలుగుజాతి చరిత్రలో అతి పెద్ద విషాదంగా నిలిచిపోతుంది. నిత్యం రాజకీయాల్లో మునిగితేలటంతో పాటుగా భాషా వికాసానికి యథాశక్తి పాటు పడుతుండటం బుద్ధప్రసాద్ ప్రత్యేకత. ఈ కారణంగానే అధికార భాషా సంఘం అధ్యక్ష పదవి ఆయన్ను వరించింది. రాష్ట్ర విభజన నిర్ణయానికి నిరసనగా ఆ పదవి నుండి బుద్ధప్రసాద్ వైదొలిగారు. ఎంతగా నిరసించినప్పటికీ కాంగ్రెస్ నాయకత్వం తాను చేయదల్చుకున్నది చేసి పారేయటం బుద్ధప్రసాద్ వంటి నేతల్ని తీవ్రంగా బాధించింది. అయితే ప్రాంతాలుగా వేరైనా ప్రజల్ని విద్వేషం బారినపడకుండా భాషోద్యమంతో ఏకం చేయవచ్చన్నది బుద్ధప్రసాద్ నిశ్చితాభిప్రాయం. రాజకీయంగా వేరుదారులైపోయినా భాషతో ఇరురాష్ట్రాల ప్రజల్ని జతచేసి సామరస్యపూర్వక వాతావరణాన్ని శాశ్వతం చేయొచ్చన్న బుద్ధప్రసాద్ ఆకాంక్ష నెరవేరాలని ప్రతి తెలుగువాడూ కోరుకుంటాడు. సుదీర్ఘ పరిచయం ఉన్న స్నేహితుడిగా ఆయనకు నా మనఃపూర్వక షష్టిపూర్తి శుభాకాంక్షలు.

ఉపసంహారం

ఒక వ్యక్తి శాసనసభ్యుడిగా సమర్థతతో ముందడుగు వేయటం అతడి నాయకత్వ పటిమకు నిదర్శనం. కానీ, పార్టీలకు అంతగా ప్రశంసలు పొందటం, అందులోనూ ఒక ప్రతిపక్ష శాసనసభ్యుడిగా ముఖ్యమంత్రి ప్రశంసను పొందటం అరుదుగా కానీ జరగదు. శాసనసభ్యుడిగా తొలిసారి ఎన్నికైన కాలంలోనే ముఖ్యమంత్రి దృష్టిలోనూ పడ్డారు బుద్ధప్రసాద్. సహజంగానే ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న నేతకు శాసనసభ్యులందరి పనితీరుపై ఒక అవగాహన ఉంటుంది. దానికి ఇంటెలిజెన్స్ నివేదికలే ప్రాతిపదిక. బుద్ధప్రసాద్‌పై అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సమర్థుడన్న అభిప్రాయం కలిగింది. అవనిగడ్డ

నియోజకవర్గ తెలుగుదేశం వ్యవహారాల్లో సమన్వయ లోపంపై అప్పట్లో చంద్రబాబుకు తీవ్ర అసంతృప్తి ఉండేది. ఒకానొక సందర్భంలో ఎన్.టి.ఆర్. ట్రస్ట్ భవన్‌లో ఆయన నియోజకవర్గ స్థానిక నాయకులతో సమీక్ష చేస్తుండగా వారి ప్రవర్తనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పార్టీకి బలమైన నాయకత్వం లేదన్నది ముఖ్యమంత్రి నిశ్చితాభిప్రాయం. "మీ వైఖరి బాగోలేదు. ఇలాగైతే అవనిగడ్డలో పార్టీ గెలుపు కష్టం. అలాగని మీరు చెప్పినట్లు నేను వినే ప్రసక్తి లేదు. మీరెలా ఉన్నా నియోజకవర్గ అభివృద్ధి నాకు ముఖ్యం. తెలుగుదేశం గెలవకపోయినా ఫర్వాలేదు. అక్కడి కాంగ్రెస్ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మంచివాడు. అతడి ద్వారా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాను" అని స్థానిక నాయకులకు చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రవిభజన నేపథ్యంలో అనూహ్య రాజకీయ పరిణామాల ఫలితంగా బుద్ధప్రసాద్ తెలుగుదేశంలో చేరటం, ఎమ్మెల్యేగా ఎన్నిక కావటం జరిగిపోయి, శాసనసభ ఉపసభాపతి పదవిని అలంకరించారు. ఆ విధంగా చంద్రబాబు కోరుకున్నట్లుగా పార్టీకి నియోజకవర్గంలో బలమైన నాయకత్వ సమస్య తీరిపోవటం గమనార్హం.



జిల్లెలమూడి అమ్మతో మండలి కుటుంబం

'మండలి'తో ఒక దశాబ్ది అనుబంధం

- డా. రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

కార్ల్‌మార్క్స్‌కు షేక్స్పియర్ అంటే మహా ఇష్టం. బాగా చదివాడు. వి.ఐ. లెనిన్‌కు టాల్‌స్టాయ్ గొప్ప రచయిత. బాగా చదివాడు. మావో స్వయంగా కవి. గాంధీజీ గొప్ప సాహిత్య పాఠకుడు. డా. బి.ఆర్. అంబేద్కర్ కార్ల్‌మార్క్స్ తర్వాత బ్రిటీష్ గ్రంథాలయాన్ని సంపూర్ణంగా చదివిన వ్యక్తి. అందులో సాహిత్య గ్రంథాలు కూడా ఉన్నాయి. సర్దార్ భగత్‌సింగ్ చిన్న వయస్సులోనే మంచి పాఠకుడయ్యాడు. భారతదేశంలో సంఘ సంస్కరణ స్వాతంత్ర్యోద్యమ కాలంలో రాజకీయ, సాంఘిక ఉద్యమకారులు, కార్యకర్తలు సాహిత్యాన్ని హృదయదఘ్నంగా ప్రేమించేవాళ్ళు. దానిని చదివేవాళ్ళు. వాళ్ళ కార్యక్రమాలలో సాహిత్య సంస్కారం కనిపించేది. పుచ్చలపల్లి సుందరయ్య, ఐదుకల్లు సదాశివన్ వంటి వాళ్ళను చూస్తే ఈ విషయం తెలుస్తుంది. స్వతంత్రం వచ్చిన తర్వాత కూడా 1970ల దాకా ఏ సామాజిక రంగంలో కృషి చేసే వాళ్ళకైనా సాహిత్య గంధం ఉండేది. ఆ తర్వాతనే పరిస్థితి తలక్రిందులైంది. రాజకీయవాదులకు, నాయకులకు, కార్యకర్తలకు, ఇంజనీర్లు, వైద్యులు వంటి వాళ్లకు సాహిత్యం వాసన చూడదగనిది అయిపోయింది. పార్లమెంటులోనో, శాసనసభలోనో ఆర్థిక శాఖామాత్యులు వార్షిక పద్దులు ప్రవేశపెడుతూ ఒకటి అరా సాహిత్య వాక్యాలను ఉటంకిస్తే మురిసిపోయే రోజులొచ్చాయి. అవకాశం వచ్చినప్పుడు, అవసరం కలిగినప్పుడు భాషా సాహిత్యాల మీద ఆకాశం తూట్లు పడేట్లు మాట్లాడటం, చెప్పినంతగా చేతలుండకపోవడం నేటి రాజకీయమైపోయింది. సాహిత్యం ఒక అనుత్పాదక వ్యవహారమనే దురభిప్రాయం ప్రబలిపోయింది. సాహిత్యం విలువ తెలుసుకొని అన్ని రంగాలలోకి ప్రజాసాహిత్యాన్ని చొప్పించగలిగితే అనేక రుగ్మతలు తగ్గిపోతాయి. ఇది మన నాయకుల తలకెక్కవలసి ఉంది. ఈ నేపథ్యంలో సి.వి. అన్నట్లు "కారు చీకట్లో కాంతిరేఖ" లాగా ఇవాళ కూడా కొందరైనా భాషా సాహితీ సంస్కృతీ సంస్కారాన్ని జీర్ణించుకొన్న రాజకీయ నాయకులుండటం మనం సంతోషించాల్సిన అంశం. అలాంటి కొద్దిమందిలో నాకు తెలిసి మండలి బుద్ధప్రసాద్ గారొకరు. ఆయన రాజకీయాలలో ఉంటూ ఓడినా, గెలిచినా వాడిపోని సాంస్కృతిక చైతన్యం పోతపోసిన మూర్తి. తెలుగు భాష, తెలుగు సాహిత్యం, తెలుగు సంస్కృతులను ముప్పేటగా జీర్ణించుకొన్న వారు మండలి. వాటిని ప్రేమించటమే కాదు వాటిని ప్రచారం చేయడంలో, వాటికి భంగం కలిగినప్పుడు గొంతు విప్పడంలో ఆయన నిబద్ధులై ఉంటారు.

2006కు ముందు నేను బుద్ధప్రసాద్ గారిని మాధ్యమాలలోనే చూసేవాడిని. డా. ఎ.బి.కె. ప్రసాద్ గారు 2005లో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులయ్యారు. ఆ సంఘంలో నేను సభ్యునిగా పనిచేశాను. 2006లో ఏలూరులో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించాం. ఆ సమావేశంలో నేను మొదటిసారి బుద్ధప్రసాద్ గారిని ప్రత్యక్షంగా కలుసుకున్నాను. మాట్లాడాను. మధ్యాహ్నం ఎండలో ఒక చిన్న చెట్టు దగ్గర అన్నం తింటున్న సమయంలో నేను వెళ్లి ఆయన్ని కలిసాను. ఇప్పటికి పదేళ్లయింది. నిరంతరం ఆయనతో ఫోన్లో మాట్లాడుతూనే ఉన్నాను. దాదాపు ఏడు పర్యాయాలు సమావేశాలలో కలుసుకున్నాను. ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా ఆయన మాటతీరు ఆత్మీయంగానే ఉంటుంది. ఏలూరులో కలుసుకున్న తర్వాత కొంత విరామం తర్వాతనే రెండోసారి

కలుసుకోగలిగాను. 2012లో గురజాడ అప్పారావుగారి 150వ జయంతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రవీంద్రభారతిలో నిర్వహించింది. అప్పుడు నాకు పురస్కారం వచ్చింది. ఆ సమయంలో వేదికకు వెనుక వైపు నన్ను పలకరించి బుద్ధప్రసాద్ గారు శుభాకాంక్షలు తెలిపారు. 2013 నవంబరు 10న యోగి వేమన విశ్వవిద్యాలయం లోని సి.పి. బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రం నిర్వహించిన సి.పి. బ్రౌన్ జయంతికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అప్పుడు నేను ఆ సంస్థ బాధ్యతలు నిర్వహిస్తున్నాను. ఆ సమావేశంలో వారు మెకంజీ కైఫీయత్‌లు 7వ సంపుటాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత 2014 ఆగస్టు 8, 9 తేదీలలో బెంగుళూరు విశ్వవిద్యాలయంలోని తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య కొలకలూరి ఆశాజ్యోతి సెంట్రల్ కాలేజ్ ప్రాంగణంలో దక్షిణ భారతీయ భాషా సాహిత్యాల మీద రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించారు. దానికి బుద్ధప్రసాద్ గారు ముఖ్య అతిథిగా వచ్చారు. నేను కీలకోపన్యాసం చేశాను. ఆ ఏడాది అక్టోబరు 19న కడపలోని సి.పి. బ్రౌన్ స్మారక గ్రంథాలయంలో డా. జానమద్ది హనుమచ్ఛాస్త్రిగారి విగ్రహావిష్కరణ సభకు విశిష్ట అతిథిగా వచ్చారు. దానికి జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ కె.జి. శంకర్ మొదలైన వాళ్ళు అతిథులుగా వచ్చారు. 2016 జనవరి మొదటి వారంలో ఒంగోలులో 'ప్రకాశం జిల్లా రచయితల సంఘం– తెలుగు రచయితల సదస్సును నిర్వహించింది. అందులో బుద్ధప్రసాద్ గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాదొక ప్రసంగం ఉంది. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం 2016 ఏప్రిల్ 30, మే 1 తేదీలలో తిరుపతిలో కథారచన మీద రెండు రోజుల శిక్షణాశిబిరం నిర్వహించింది. ఆ సమయంలో 11 మంది తెలుగు కథారచయితల కథల సంపుటాలను ప్రచురించింది. 2016 మే 1వ తేదీ సాయంకాలం 4.30 గంటలకు శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో జరిగిన సభలో బుద్ధప్రసాద్ గారు ముఖ్య అతిథిగా హాజరై కథా సంపుటాలను ఆవిష్కరించారు. ఈ అన్ని సందర్భాలలో ఆయనను ఎప్పుడు కలుసుకున్నా ఒక రాజకీయ నాయకుణ్ణి కలుసుకున్నామన్న భావన కలుగదు. ఒక సాంస్కృతిక సేనానిని కలుసుకున్న అనుభూతి కలుగుతుంది. రాజకీయ నాయకులను కలుసుకొని మాట్లాడటానికి ఒక గ్రామర్ ఉంటుంది. బుద్ధప్రసాద్ గారి దగ్గర ఆ గ్రామర్‌ను అనుసరించవలసిన అవసరం ఉండదు. ఆయనది సాంస్కృతిక వ్యాకరణమే కాని రాజకీయ వ్యాకరణం కాదు.

ఏలూరులో కలిసినప్పుడు నన్ను గంభీరంగా చూస్తూ రాచపాళెంగారూ! మీరూ, కాలువ మల్లయ్యగారు బాగా పని చేస్తున్నారు అని అభినందించారు. గురజాడ జయంతి నాడు రవీంద్రభారతిలో వేదికకు పక్కన కలిసినప్పుడు గురజాడ వారి పట్ల గౌరవం ఉండడమే కాక, ఆయన సాహిత్యాన్ని బాగా ప్రచారం కూడా చేశారు. విమర్శలు వ్రాశారు. మీకు పురస్కారం ఇవ్వడంలో ఔచిత్యముంది అని ఆనందంగా చెప్పారు. సి.పి. బ్రౌన్ జయంతికి కడప వచ్చినప్పుడు ఉదయం స్టేట్ గెస్ట్‌హౌస్‌లో కలిశాను. అప్పుడు రాయలసీమ రచయితలతో తనకు గల పరిచయాలను ప్రస్తావించారు. సాయంకాలం సభలో కల్నల్ మెకంజీ, సి.పి. బ్రౌన్ వంటి పాశ్చాత్యులు తెలుగు భాషా సంరక్షణకు చేసినంత దోహదం తెలుగువాళ్ళుగా మనం చేయలేకపోతున్నాం. ఇదొక ప్రమాదానికి సంకేతం అని హెచ్చరించారు. సి.పి. బ్రౌన్ భాషాపరిశోధనా కేంద్రం చేస్తున్న కృషి రాష్ట్రమంతా తెలుస్తున్నదని ప్రశంసించారు. తాళ్ళపాక కవులు, వేమన, వీరబ్రహ్మం ఒక వైపు, ప్రబంధ కవులు మరొక వైపు తెలుగు సాహిత్యాన్ని రెండు మార్గాలలో అభివృద్ధి చేసిన తీరును పరామర్శించారు. అలాగే గడియారం, పుట్టపర్తి, జానమద్ది వంటి వాళ్ళ కృషిని శ్లాఘించారు. బెంగుళూరు సదస్సులో ముఖ్య అతిథిగా ఆయన చేసిన ప్రసంగంలో ఆయనొక తులనాత్మక సాహిత్య విమర్శకుడుగానే ప్రసంగించారు. ఇతర దక్షిణాది రాష్ట్రాలలో తెలుగు నిరాదరింపబడుతున్న విషయాన్ని ధైర్యంగా ప్రస్తావించారు. డా. జానమద్ది హనుమచ్ఛాస్త్రిగారి విగ్రహావిష్కరణ సభలో పాల్గొనటం పట్ల సంతోషం

వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యానంతరం గ్రంథాలయోద్యమానికి జానమద్ది చేసిన కృషి అనితర సాధ్యమన్నారు. కడప అనగానే సి.పి. బ్రౌన్ స్మారక గ్రంథాలయంతో పాటు దాని వ్యవస్థాపకులు శాస్త్రిగారు తప్పక గుర్తుకొస్తారన్నారు. ఈ సందర్భంలోనే ఒక చమత్కారాన్ని కూడా పేర్కొనాలి. ఆ సభలో అతిథులను వేదిక పైకి ఆహ్వానించిన జానమద్ది హనుమచ్ఛాస్త్రిగారి కుమారుడు జానమద్ది విజయభాస్కర్ నన్ను గురించి చెబుతూ 'వయస్సు పైబడుతున్నా రాచపాళెం చాలా చురుగ్గా యువకుడులాగా వయసును మరిచిపోయి పనిచేస్తున్నారు– అని అన్నారు. వెంటనే బుద్ధప్రసాద్ గారు కలగజేసుకొని "రాచపాళెంగారికి ఇంకా వయసు పైబడలేదు. మీరు ఆయన్ని ముసలాయన్ని చేయకండి" అన్నారు. సభలో నవ్వులు వెల్లివిరిశాయి.

రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు నిరంతరం ఉద్రిక్తంగానే జరుగుతున్నాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య వాదోపవాదాలు తీవ్రంగా సాగుతున్నాయి. ఒక్కోసారి అవి సరిహద్దులు దాటుతున్నాయి కూడా. అలాంటి ఒక సమావేశాన్ని టి.వి.లో చూస్తూ వెంటనే బుద్ధప్రసాద్ గారి సెల్‌కి ఒక మెసేజ్ పెట్టాను. "మాస్టారూ! 'కృష్ణరాయబారం' నాటకంలో శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునితో "మామా! క్రమక్రమముగా నీ కొలువు కూటము రణ కూటమగుచున్నది" అని అంటాడు. మన శాసనసభ వ్యవహారాలను చూస్తుంటే ఆ మాట గుర్తుకొస్తున్నది" అన్నది నా మెసేజ్. ఆ తర్వాత ఒంగోలులో జరిగిన రచయితల సదస్సులో బుద్ధప్రసాద్ గారు ప్రసంగిస్తూ నా మెసేజ్‌ను ప్రస్తావించారు. కడుపుబ్బా నవ్వుతూ, తమాయించుకుంటూ నా మెసేజ్ కోట్ చేశారు. అప్పటికే రెండు మూడు చోట్ల ఆ మెసేజ్‌ను ప్రస్తావించానని, రాచపాళెం ఉన్న సభలో ప్రస్తావించడం మరింత ఆనందంగా ఉందని అన్నారు. నాకు నా మెసేజ్‌ని బుద్ధప్రసాద్ గారు గుర్తుపెట్టుకున్నారన్న దానికన్నా, ఆయన అంతగా నవ్వుతూ చెప్పడం ఆనందం కలిగించింది. ఎందుకంటే ఆయన ఎప్పుడూ గంభీరంగా ఉంటారు. ఆ రోజు ఆయన హాయిగా నవ్వడం నేను చూశాను. ఒంగోలు సభలో ఆరు రాష్ట్రాల నుంచి ఆరుగురు రచయితలను సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి నన్ను సత్కరించారు. అది బుద్ధప్రసాద్ గారి, కొలకలూరి ఇనాక్ గారి చేతుల మీదుగా జరిగింది. ఆ సభలో బుద్ధప్రసాద్ గారు చేసిన ప్రసంగం తెలుగు భాషా సాహితీ సంస్కృతీ ప్రియులకు దిశానిర్దేశం చేసింది.


తిరుపతిలో 'అరసం' సభలో ప్రసంగిస్తూ బుద్ధప్రసాద్ గారు, కట్టమంచి రామలింగారెడ్డి, మధురాంతకం రాజారాం, కలువకొలను సదానంద వంటి విమర్శకులు, రచయితలు పుట్టడం తెలుగుజాతి గర్వించదగిన విషయం అని అన్నారు. 2016 ఉగాది పర్వదినాన చాలా ఆలస్యమయినా కలువకొలను సదానందగారిని 'కళారత్న' బిరుదుతో సత్కరించుకోవడం తెలుగు వాళ్ళందరికీ సంతోషదాయకమన్నారు. అభ్యుదయ రచయితల సంఘం ప్రజాసాహిత్యాన్ని ప్రచారం చేయడమే కాక ప్రచురణ కూడా చేపట్టడం ముదావహమన్నారు.

బుద్ధప్రసాద్ గారు ఏ సభకు వచ్చినా వొట్టి చేతులతో వస్తారు, గట్టి ప్రసంగం చేస్తారు. చేతిలో కాగితం లేకుండా గంటసేపు ప్రసంగిస్తారు. ఏ సభలో ఏ అంశం మీద ప్రసంగించాలో దాని మీదే ప్రసంగిస్తారు. శాఖాసంక్రమణం ఉండదు. అడవిలో దారి తప్పడం వంటి ప్రసంగాలు చేయరు. ఆత్మోత్కర్ష ఉండదు. విషయం మాత్రమే ఉంటుంది. నిరాడంబరత, కలుపుగోలుతనం, తెలుగుతనం ఆయన వ్యక్తిత్వంలో త్రిభంగిమలు. ఎప్పుడు ప్రసంగించినా సదస్సులో అదొక పత్ర సమర్పణ చేసినట్లే ఉంటుంది. ఎక్కడైనా, ఎవరైనా విజ్ఞప్తి పత్రాలిస్తే వెంటనే 'ఓస్ ఇదెంత' అనరు. అందులోని సాధ్యాసాధ్యాలను పరిశీలించి చెబుతారు.

నాకు రాజకీయ నాయకులతో చాలా తక్కువ సంబంధాలున్నాయి. నలుగురైదుగురు తెలిసిన వాళ్లున్నా వాళ్ళ దగ్గరికి పోయినది లేదు. బహుశా మండలి బుద్ధప్రసాద్ గారితోనే నాకు ఈ మాత్రం సంబంధమైనా ఉంది. ఈ సంబంధానికి కూడా ఆయన రాజకీయ నాయకుడు కావటం కారణం కాదు. తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణలో ఆయన కీలక భాగస్వామి అవుతుండటమే కారణం.

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ప్రారంభ సమావేశానికి అనుకుంటాను మండలి వెంకట కృష్ణారావుగారు రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా అనంతపురం వచ్చారు. అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావుగారు కూడా వచ్చారు. అప్పుడు కృష్ణారావుగారిని చూసి ఆ తర్వాత బుద్ధప్రసాద్ గారిని చూస్తే అంతా నాన్నగారి లాగానే ఉన్నారే అనుకున్నాను.

బుద్ధప్రసాద్ గారి 60వ జన్మదినోత్సవ సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నాను.



మాజీ గవర్నర్ శ్రీ మీర్ అక్బర్ ఆలీ ఖాన్‌తో మండలి కుటుంబం

నేనెరిగిన బుద్ధప్రసాద్ గారు

- డా. ఎన్.ఎస్. రాజు

మాన్యులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు ఒక అపురూపమైన రాజకీయ నాయకులు. ఇలా సాధారణంగా ఎవరి గురించీ చెప్పుకోడం ఉండదు. ఎందుకంటే ఆయన కొన్ని ప్రత్యేకతలున్న విశిష్ట సంస్కార గుణ శోభితులు కాబట్టి. ఆయన రాజకీయోద్యానంలో తులసి మొక్క అని వారిని ఉద్దేశించి ఒక సభలో అన్నాను. దీనిని వివరించవలసి వస్తే తులసికి ఉన్న సౌకుమార్య పవిత్రతలతో వారిలోని ఆజన్మ సిద్ధమైన సౌజన్యం, గృహవాతావరణం ద్వారా వారికి అబ్బిన సాహిత్య సౌహార్ద్రం అనేవి అభేదంగా చెప్పదగినవి. వారిని ఎరిగినవారు దీనిని కాదనలేరు. వారికి పరిచయం ఉన్నంతమంది తెలుగు భాషాభిమానులు, కళాకారులు, రాష్ట్రేతరాంధ్రులు మరెవరికి లేరని గట్టిగా చెప్పగలం. అందువల్లనే వారు గొప్ప సంస్కార సౌశీల్యాలతో రాజకీయాలలో నిష్కళంకులుగా నిలబడుతున్నారు. ఇంతటి ప్రత్యేకత ఉన్న బుద్ధప్రసాద్ గారిని అపురూప రాజకీయ నాయకులని అనక ఏమని సంబోధించగలం?

1999వ సంవత్సరం ఆగస్టు 29వ తేదీన హైదరాబాదులోని తెలుగు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో తెలుగు భాషా దినోత్సవ సభ పూర్తయిన వెంటనే నా వద్దకు డా. గంధం సుబ్బారావు గారు వచ్చి "ఎం.ఎల్.ఏ. బుద్ధప్రసాద్ గారు మిమ్మల్ని కలుసుకోవాలనుకొంటున్నారు. మీరు కలుస్తారా!' అని అడిగారు. వారి ఇంటి వివరాలు, ఫోన్ నెంబరు ఇచ్చారు. అప్పుడు ఆయన కాంగ్రెస్ పార్టీ శాసన సభ్యులు, ప్రతిపక్షనేత. భాషోద్యమంలో ఒక యువ శాసనసభ్యులు కూడా పాల్గొనబోతున్నారని అర్థం చేసుకున్నాను. నేనూ తోటి కార్యకర్తలు కాశీనాథుని నాగేశ్వరరావుగారు, చెలంచెర్ల భాస్కరరెడ్డి గారు కలిసి ఆయన ఇంటికి వెళ్లాం. భాషోద్యమ ఆవశ్యకాన్ని, మా లక్ష్యాన్ని, ఆచరణ పద్ధతిని వివరించి, అప్పటికి నాలుగేళ్లకు పైగా చేస్తున్న కృషిని తెలియజేశాం. ఆయన, తెలుగు పట్ల అభిమానాన్ని మా కృషి పట్ల సంతోషాన్ని ప్రకటించారు. అంతకు ముందు ఆయన మా సభ ఒకదానికి వచ్చిన సంగతిని ప్రస్తావించి సాహిత్య సంస్థలు చాలా ఉంటాయి కాని భాషా సంస్థ ఇది ఒక్కటే అని ప్రకటించి మా విధానాలతో ఏకీభవించారు. మృదుభాషి అయిన ఆయన మాటల్లో మా ఉద్యమానికి ఆయన అండగా నిలబడతారు అనే అర్థం వచ్చింది. అప్పటి నుంచి ఆయన ఏ పదవిలో ఉన్నా మా తెలుగు భాషా చైతన్య సమితి కార్యక్రమాలన్నింటా మాలో ఒకరయ్యారు. ఈ సంఘటన బుద్ధప్రసాద్ గారిని సామాజిక స్పృహ ఉన్న తెలుగు భాషాభిమానిగానే కాకుండా నిగర్వీగా కూడా నిలుపుతోంది.

వారు అప్పుడు ఇప్పుడు ఒకేలాగ ఉన్నారు. గంభీరంగా కనిపించే బుద్ధప్రసాద్ గారిలో ఒక కార్యదీక్షాపరుడు ఉన్నాడు. ఈ తరం శాసనసభ్యులలో ప్రభుత్వాన్ని తెలుగు అభివృద్ధి గురించి ప్రశ్నించేది ఆయన ఒక్కరే అంటే అతిశయోక్తి కాదు. పాఠశాల స్థాయిలో తెలుగు తప్పనిసరి పాఠ్యాంశంగా ఉండడం, తెలుగు మాధ్యమం బలోపేతం కావడం, ఇంటర్‌లో విధిగా తెలుగు కొనసాగడం, కార్యాలయాల్లో తెలుగు అమలు అనే వాటిపై మేము వివరణ పత్రాలు తయారు చేయగా, వారు చర్చించి ప్రశ్నలకు అనుకూలంగా

తిరిగి రాసుకొని శాసనసభకు వెళ్లేవారు. తర్వాత ఈ అంశాలపై తెలుగు భాషా చైతన్య సమితి ఇచ్చిన విజ్ఞప్తుల మేరకు విద్యాశాఖామాత్యులతోను, కార్యదర్శులతోను సమావేశాలు వారే ఏర్పాటు చేసేవారు. క్రమంగా విద్యారంగంలో తెలుగు బలోపేతం అయింది. అధికార భాషా సంఘాల నియామకం ద్వారా ప్రభుత్వ శాఖలలో తెలుగు వాడకంపట్ల చైతన్యం పెరిగింది. ఇప్పుడు ప్రభుత్వ వర్గాలలో తెలుగు పట్ల ఉదాసీనత లేకపోవడానికి, సమాజంలో భిన్న రంగాలవారు తెలుగు పట్ల అభిమానం పెంచే కార్యక్రమాలు చేపట్టడానికి పూర్వరంగాన్ని నిర్మించిన ఆ రోజుల్లో మా సమితికి బుద్ధప్రసాద్ గారు బలమైన నేపథ్యంగా నిలబడ్డారు. ఇలా వారి కార్యదీక్షకు ఉదాహరణలను చాలా చూపవచ్చు.

ఒక రోజున ధర్మారావుగారు, నాగేశ్వరరావుగారు, నేను ఉండగా మాతో బుద్ధప్రసాద్ గారు "మన కార్యక్రమాలు తెలుగు సమాజం అంతటికీ వర్తించేవే అయినా హైదరాబాదుకే పరిమితం అవుతున్నాయి. వీటిని రాష్ట్రవ్యాప్తం చెయ్యాలి. ఇలాగే ఇతర చోట్ల కూడా తెలుగు కోసం ఎవరికివారు కార్యక్రమాలు చేస్తున్నారు. అన్ని సంస్థల వారిని ఒక చోటుకి చేర్చి చర్చించుకొని ఒకే కార్యాచరణ ప్రణాళికతో అందరూ సమష్టిగా ముందుకు వెళితే భాషోద్యమం మరింత విజయవంతం అవుతుంది. దీనికోసం ఆంధ్రుల తొలి రాజధాని కృష్ణాతీరంలోని శ్రీకాకుళంలో 2002 నవంబరు 1 నాడు రాష్ట్రస్థాయి సదస్సు జరుపుదాం. దాని నిర్వహణకు అన్ని ఏర్పాట్లు నేను చేస్తాను. విజయవాడలో సామల రమేశ్ బాబు గారు సహకరిస్తారు" అని చెప్పారు. శ్రీకాకుళం సభకు ప్రణాళికా రచన చేయగా అది ఆయన నాయకత్వంలో విజయవంతం అయింది. ఆయన మద్దతుతో ఉద్దేశించిన లక్ష్యం నెరవేరడానికి ధర్మారావు గారు అధ్యక్షులుగా, రమేశ్ బాబు గారు కార్యదర్శిగా 2003లో తెలుగు భాషోద్యమ తెలుగు భాషోద్యమ సమాఖ్య ఏర్పాటయింది. ఇప్పుడు చాలామంది తెలుగు కోసం చేసే ఆందోళనలకు నేపథ్యంగా భాషోద్యమ వాతావరణం సృష్టించడంలో బుద్ధ ప్రసాద్ గారు ఇలా ఒక నిశ్శబ్ద ఉద్యమ నాయకుడుగా తన పాత్రను నిర్వహించారు.

ప్రశాంతవదనంతో కనిపించే బుద్ధప్రసాద్ గారిలో ఒక పోరాటయోధుడు ఉన్నాడని చాలా కొద్దిమందికే తెలుసు. హైదరాబాదులోని సచివాలయం ప్రధాన ద్వారంపైన, దానికి దగ్గరలోని తెలుగుతల్లి విగ్రహంపైన పేర్లు ఇంగ్లీషులో ఉన్నాయి. వాటిని తెలుగులో కూడా రాయించమని మా సమితి చేసిన విజ్ఞప్తులు ఫలితాన్ని ఇవ్వకపోవడంతో కొందరు భాషాభిమానులతో కూడి సచివాలయం ముందు సత్యాగ్రహం చేయవలసి వచ్చింది (2002). అప్పుడు శాసనసభ సమావేశాల్లో ఉన్న బుద్ధప్రసాద్ గారికి ఈ వార్త తెలియగానే ఆయన హుటాహుటిన వచ్చి సత్యాగ్రహ ఆందోళనలో ముందువరసలో నిలబడ్డారు. మమ్మల్ని తమ ఆధీనంలోకి తీసుకోవాలని చూసిన పోలీసులకు మాతో ఉన్న బుద్ధప్రసాద్‌గారిని చూడగానే నోరు మెదల లేదు, చేయి కదలలేదు. శాసనసభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకోవాలంటే శాసనసభాపతి అనుమతి ఉండాలి. అది పోలీసులకు సులభసాధ్యం కాలేదు. గంటల తరబడి వేచివున్నా వారికి ఏంచేయాలో తోచక అచేతనులుగా ఉండిపోయారు. అంటే అక్కడ వ్యవస్థ నిలబడిపోయింది. ప్రభుత్వం మీద గౌరవంతో బుద్ధప్రసాద్ గారు కొంచెం పక్కకు తొలగగా మమ్మల్ని పోలీసులు వాహనం మీదకు ఎక్కించబోయారు. అయినా తోటి కార్యకర్తలతో కూడి ఉండాలన్న భావనతో ఆయన మాతో కలిసే ఉన్నారు. అలా వారు మాతో పోలీసు స్టేషనులో ఉండవలసి వచ్చింది. వారి వ్యక్తిత్వం గురించి ఇంతకంటే వేరే ఏ నిదర్శనం చూపగలం.

తెలుగుకోసం ఒక శాసనసభ్యుడు సభను మధ్యలో వదిలి రోడ్డు మీదకు వచ్చిన సంఘటన బహుశ ఇదొక్కటేనేమో! పైకి శాంతంగా కనిపించే బుద్ధప్రసాద్ గారిలో దాగి ఉన్న పోరాటయోధుడు బయటకు వచ్చి ఉండకపోయినట్లైతే పై సన్నివేశం మరోలా ఉండేది కదా!

ఇలా నేనెరిగిన బుద్ధప్రసాద్ గారిలోని నిజాయితీ, నిష్కపటత్వాల గురించి కొంచెమైనా రాయకుండా ఈ వ్యాసం ముగిస్తే అసమగ్రం అవుతుంది. 2012 డిసెంబరులో జరిగిన 'తెలుగదేల యన్న దేశంబు తెలుగు' అనే వ్యాస సంపుటి పుస్తకావిష్కరణ సభకు, తర్వాత 2013 జులైలో జరిగిన నా పదవీ విరమణ సభకు మితభాషి బుద్ధప్రసాద్ గారే ముఖ్య అతిథి. ఆ రెండు సభలలోను ఆయనకు నాకు ఉన్న పరిచయాన్ని ప్రస్తావిస్తూ ఆయన భాషా సమితి ఏర్పాటు, గిడుగువారి జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా ప్రకటించడం, తెలుగు విద్యార్థులకు పురస్కారాలు ఇవ్వడం, ద్వితీయ భాషగా తెలుగు తప్పనిసరి చేయించడం, పాఠ్యగ్రంథ రచన, నిఘంటు నిర్మాణం మొదలైన అంశాలతో నాకున్న సంబంధాన్ని స్పృశించారు. తెలుగు భాషా చైతన్య సమితి కార్యక్రమాల గురించి మాట్లాడుతూ "రాజుగారిలో ఎవరికీ తెలియని ఉద్యమకారుడు ఉన్నాడు. ఆయన పైకి చల్లగా ఉండే పిడుగు. సచివాలయం పేరు తెలుగులో రాయించడానికి చేసిన సత్యాగ్రహం ద్వారా ఆయన పోలీసుల అదుపులో ఉండవలసి వచ్చింది. ఇప్పుడు తెలుగు గురించి ఎవరు ఏం మాట్లాడినా దానికీ, నా వంటి వారు చాలా మంది ఈ తెలుగు భాషా ఉద్యమంలోకి రావడానికీ రాజు గారే మార్గదర్శి" అని అంటూ ఉపన్యసించారు. మనస్సులో ఉండే ఇలాంటి సత్యాల్ని బహిరంగపరచడానికి అద్దంలాంటి స్వచ్ఛమైన హృదయం ఉండాలి. అలాంటి నిర్మల హృదయులు కావడం చేతనే బుద్ధప్రసాద్ గారు పై విధంగా ప్రకటించగలిగారు. వీరు సాహిత్య సభలలోను, సాంస్కృతిక సదస్సులలోను, తెలుగు గోష్ఠులలోను, రాష్ట్రేతరాంధ్రుల సమ్మేళనాలలోను పాల్గొన్న పలు సందర్భాలను ప్రస్తావించవచ్చు. వాటిలో వీరు నిర్వహించిన పాత్రను విపులీకరించి చెప్పడం కంటే సంగ్రహంగా వీరిని ఆంధ్రుల సాంస్కృతిక ప్రతినిధి అని చెప్పడమే సముచితం. ఇటువంటి బుద్ధప్రసాద్ గారు ఆదర్శవంతమైన రాజకీయ నాయకులు. అచంచలమైన భాషాభిమాని, నిరుపమానమైన సాంస్కృతిక పోషకులు. ఇలాంటి వ్యక్తులు కొందరు ఉండవచ్చు అని ఎవరైనా అనవచ్చు. ఇంతకు మించి ఈయన వంటి అకళంకమైన మానవీయమూర్తిని వేరొకరిని చూపడం ఎంత కష్టమో కదా! ఇటువంటి బుద్ధప్రసాద్ గారి షష్ట్యబ్ది సన్మాన సందర్భంగా....

శతమానం భవతి శతాయుః పురుషః
శతేంద్రియ ఆయుష్యేవేంద్రే ప్రతితిష్ఠతి.

బహుముఖ ప్రజ్ఞాశాలి

- డా. పోతుకూచి సాంబశివరావు

శ్రీ బుద్ధప్రసాద్ గారికి షష్టిపూర్తి జరుగుతోందని తెలిసి సంతోషించాను. ఆయన నాకు వారి చిన్నతనం నుంచీ తెలుసు. ముఖ్యంగా వారి తండ్రిగారు విద్యామంత్రిగా ఉన్న కాలం నుంచి నాకు బుద్ధప్రసాద్ గారితో పరిచయమే. ఎన్నోసార్లు ఆయన తన తండ్రి ఛాంబర్ దగ్గరే కనిపించేవారు. తరువాత నా కర్థమయింది వారి తండ్రి బుద్ధప్రసాద్‌ను రాజకీయరంగంలోకి ప్రవేశపెట్టాలని అనుకుంటున్నారని. సాధారణంగా అవి మంచి ప్రయత్నాలు. అందరు రాజకీయవేత్తలు, వ్యాపారస్తులు తమ కుమారులను తమ రంగంలోకి దింపి వారిని అందులో ప్రవీణులను చేస్తారు. బుద్ధప్రసాద్ తండ్రి గారి వద్దే రాజకీయ పాఠాలు నేర్చుకున్నారు. ఎన్నడైనా మేము అవనిగడ్డ వెళ్ళినప్పుడు అక్కడ బుద్ధప్రసాద్ మాకు స్వాగతం పలికి మా క్షేమ సమాచారాలు తెలుసుకునేవారు.

తండ్రి మండలి వెంకట కృష్ణారావుగారు ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించడంలో అద్వితీయమైన పాత్ర వహించారు. బుద్ధప్రసాద్ గారు ఇటు నిర్వహణా రీతులు, భాషా సౌందర్యం, రచయితలతో పరిచయాలు పెంచుకొని, ఒక ఉన్నత శ్రేణి పౌరుడుగా, విద్యావేత్తగా, రాజకీయవేత్తగా ఎదిగారు. మండలి బుద్ధప్రసాద్ అంటే పర్యాయపదం తెలుగు సంస్కృతి. వారికి తెలుగు భాషా రీతులు, తెలుగు రచయితులు బాగా తెలుసు. ఒక్కొక్క వ్యక్తి గురించి ఆయన మాట్లాడితే వారి జీవిత చరిత్ర క్షుణ్ణంగా చెప్పగలరు. ఇటీవల 'విశ్వ సాహితి' పక్షాన దాశరథి స్మారక సభ ఏర్పాటు చేస్తే, దాశరథి సాహిత్యం, వ్యక్తిత్వం గురించి చాలా రసరమ్యంగా, అనర్గళంగా తెలియజేశారు. ఆయన ఉపన్యాసాలు కూడా సముచిత అక్షరబద్ధంగా, వినసొంపుగా ఉంటాయి.

బుద్ధప్రసాద్, డా. ఎ. చక్రపాణి సన్నిహితులు. స్నేహితులు కూడా. నేను చక్రపాణి మిత్రుడిగా వారి ఛాంబర్‌లో బుద్ధప్రసాద్‌గారిని కలుసుకున్నాను కూడా. లండన్‌లో ప్రపంచ తెలుగు సభల నిర్వహణలో ఆయన ఎంతో కృషి చేశారు.

మండలి బుద్ధప్రసాద్ విద్యావేత్త. నిష్కళంక రాజకీయవేత్త. మంచి స్నేహితుడు. ఎప్పుడు చూసినా నవ్వుతూ పలకరించే వ్యక్తి. అదృష్టం కూడా కలిసి వచ్చింది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఉపసభాపతిగా నియమించబడ్డారు.

జీవితంలో షష్టిపూర్తి చాలా ముఖ్యమైన ఘట్టం. అయితే ఇంత త్వరగా ఆయనకు షష్టిపూర్తి అంటే నమ్మలేం. ఆయన సౌందర్యం, ఆరోగ్యం, చిరునవ్వులు ఎప్పుడూ ఆయన్ను యౌవన దశలో ఉన్నట్టే చూపిస్తాయి.

బుద్ధప్రసాద్ చిరకాలం రాజకీయరంగంలో ఉండి, ఇంకా ఎన్నో ఉన్నత పదవులు పొంది తెలుగువారికి సేవ చేయాలని నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నాను.

భాషా సాంస్కృతిక వారసుడు

- శ్రీమతి జమునా రమణారావు

ముందుగా శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారి షష్టిపూర్తి సందర్భంగా వారికి నా శుభాకాంక్షలు.

నాలుగు దశాబ్దాలకు పూర్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో శ్రీ జలగం వెంగళరావు గారి మంత్రి వర్గంలో విద్య, సాంస్కృతిక శాఖ మంత్రివర్యులుగా ఉన్న శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారితో పరిచయ భాగ్యం కలగడమే కాక, కళల గురించీ, కళాకారుల గురించీ, సాంస్కృతిక కార్యక్రమాల గురించీ అనేక మార్లు వారిని సంప్రదించే సమయాలలో తన ఆదర్శవంతమైన నడవడితో, ఆత్మీయతతో, ఆదరణీయమైన పలకరింపులతో అందరినీ ఆకట్టుకున్న మంచి వ్యక్తి శ్రీ మండలి బుద్ధప్రసాద్. గాంధీ సిద్ధాంతాలకు కట్టుబడి జీవించాలని, ప్రజాసేవ లందించాలనీ ఆ విలువలతో నడిచిన తండ్రి బాటలో నడుస్తున్న ధన్యజీవి శ్రీ మండలి బుద్ధప్రసాద్. దశాబ్దాలు గడిచినా ఈ నాటికీ కూడా కృష్ణారావు గారితో సంబంధం ఉన్న వారందరినీ గౌరవించడం, వారితో సత్సంబంధాలు కొనసాగించడం ఆయన సంస్కారానికి అద్దం పడుతుంది.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి భాషా ప్రియత్వం, సాహితీ రసజ్ఞత గురించి ముఖ్యంగా ఒక విషయం చెప్పాలి. ఈ మధ్య శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారి జయంతి సందర్భంగా అవనిగడ్డ వెళ్ళినప్పుడు శ్రీకృష్ణ దేవరాయలు దర్శించిన శ్రీకాకుళం, విజయనగరం దగ్గర ఉన్న శ్రీకాకుళం ఒకటే అన్న భావనలో నే ఉన్నప్పుడు, అది సరికాదని శ్రీకృష్ణదేవరాయలు దర్శించిన, ఆముక్త మాల్యదకు శ్రీకారం చుట్టిన శ్రీకాకుళం అవనిగడ్డ దగ్గరలోని ఓ గ్రామం అని అక్కడకు నన్ను తీసుకువెళ్ళి అక్కడ శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు దేవాలయాన్ని దర్శింపచేసారు. అంతేకాకుండా నేను కథానాయకి పాత్ర పోషించిన శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు కథ సినిమాలోని నా నటనను ప్రశంసిస్తూ అక్కడ తాను ప్రతిష్ఠింప చేసిన శ్రీకృష్ణ దేవరాయలు రచన చేస్తున్న విగ్రహాన్ని చూపించి ఆ ప్రాంత స్థల పురాణాన్ని విశదీకరించారు. వారి కార్యదక్షత, ప్రజాసేవానిరతి పట్ల ప్రజలలో వారికున్న అత్యంత ఆదరాభిమానాలూ చూసి నేను ఎంతో సంతోషించాను.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో అధికార భాషా సంఘ అధ్యక్షునిగా, మంత్రిగా విశిష్ట సేవలందించడంతో బాటు, కేంద్రం నుంచి తెలుగు భాషకు ప్రాచీన హోదా సాధించడంలో, 2014లో తిరుపతిలో అత్యంత సమర్థవంతంగా 4వ ప్రపంచ తెలుగు భాషా సాంస్కృతిక మహోత్సవాలు నిర్వహించడంలో ఆయన పాత్ర మరువలేనిది. అంతేకాక భాషాభివృద్ధికి, సాంస్కృతిక కార్యక్రమాల అభివృద్ధికి వారందించిన సేవలు చిరస్మరణీయం. అలాగే తమ నియోజక వర్గంలో పలు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి వారు నిర్వహించిన తీరు అత్యంత ప్రశంసనీయం.

నేడు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు ఆంధ్రప్రదేశ్ శాసన సభకు ఉపసభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం; అటు పరిపాలనా బాధ్యతలనూ, ఇటు భాషా సాంస్కృతిక కార్యక్రమాలనూ నిర్విరామంగా కొనసాగిస్తూ అందరి ఆదరాభిమానాలనూ చూరగొనడం వారి శ్రేయోభిలాషులందరికీ ఆనందదాయకం.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి షష్టిపూర్తి ఉత్సవాన్ని ప్రముఖ సాంస్కృతిక సంస్థ కిన్నెర భారీ ఎత్తున ఈ మే నెల 27వ తేదీన రవీంద్రభారతిలో నిర్వహించుకోబోవడం నాకు అత్యంత ఆనందాన్ని కలిగిస్తున్నది. ఈ సందర్భంగా శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికీ, కిన్నెర వారికీ నా మనఃపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను.

మృదుభాషి

- డా. శోభానాయుడు

బుద్ధప్రసాద్ గారి పేరు చెప్తే నాకే కాదు ఎవరికైనా మనసులోకి వచ్చేవి ఆయన...

నిరాడంబరత

తెలుగుభాషాభిమానం

సాహితీపిపాస

మృదుభాషి అన్నదానికి నిర్వచనం.

నాకు రాజకీయాలతో పరిచయంగానీ, వాటిలో అభిరుచిగానీ లేవు.

అందుకేనేమో ఆయన మంత్రి ఉన్నప్పుడైనా, ఇప్పుడు ఉపసభాపతిగా ఉన్నా, ఆయన రాజకీయనాయకుడనే భావన రాదు.

అలాగే ఆయన తెలుగు భాషపై, కళలపై మక్కువ కలిగిన వ్యక్తి. కాబట్టి నాకెప్పుడూ అచ్చ తెలుగు మనిషిగానూ, కళాపోషకుడిగానూ కనిపిస్తారు.

కొన్నిసార్లు ఆయనతోపాటు సాంస్కృతిక సభల్లో పాల్గొనే సదవకాశం కలిగింది. దోషాలు లేని అచ్చ తెలుగులో ఆయన మాట్లాడుతుంటే, తెలుగు భాష రానివారికి కూడా మన భాషలోని మాధుర్యం తెలుస్తుంది.

కూచిపూడి నా ఊపిరి. నా ప్రపంచం. కళలు ప్రభుత్వ తోడ్పాటు లేకపోతే మనలేవు. రాజులకాలం నుంచీ ఇది జరుగుతున్నదే. ప్రభుత్వ ప్రతినిధిగా ఉన్నా, లేకపోయినా కూచిపూడి నాట్యం ప్రాచుర్యానికి మండలివారు చేసిన, చేస్తున్న సేవలు శ్లాఘనీయం. హైదరాబాద్‌లో సిలికాన్ ఆంధ్ర సంస్థ నిర్వహించిన నాట్య సమ్మేళనానికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఆయన తోడ్పాటు హర్షణీయం.

కళాభిమానే కాకుండా ఆ ప్రాంతపువాసి కూడా కాబట్టి 'కూచిపూడి' కళకి ఆయన మరింత సేవ చేస్తారని నా నమ్మకం.

నేను నాట్యం నేర్చుకునే రోజుల్లో మా గురువుగారు పూజ్యులు కీ.శే. వెంపటి చిన సత్యంగారు, బుద్ధప్రసాద్ గారి తండ్రిగారైన శ్రీ మండలి కృష్ణారావుగారు దివిసీమ ఉప్పెన సమయంలో చేసిన ప్రజాసేవ గురించి తరచూ చెప్తుండేవారు.

కళలమీద మక్కువ, మాతృభాషాభిమానం, సేవాగుణం మండలివారి వంశలక్షణాలు అనిపిస్తుంది.

శ్రీ బుద్ధప్రసాద్ గారి షష్ట్యబ్ది పూర్తి శుభసందర్భాన మనఃపూర్వక శుభాకాంక్షలు.

అవును .. ఆయనే!

- డా. ద్వా.నా. శాస్త్రి

రాజకీయ పురుషులందు
పుణ్యపురుషులు వేరయా!
అవును
గెలుపోటములకు పదవులకు వేదన చెందని
స్థితప్రజ్ఞుడాయన!
అసలు ఆయనే
ఒక భాషాసాహితీ మండలి గదా!
అవనిగడ్డలో పుట్టినా
అవని అంతట తెలుగు జిలుగులు జిమ్ముతున్న
భాషాతపనుడాయన!

ఆయన ఇచ్చే ప్రసాదం ఆత్మీయంగా నవ్వులతో పలకరించుకుంటూ వెళ్ళడమే. పైకి 'బుద్ధుడి'లాగానే అగుపిస్తాడు. కాని లోలోన భాషాత్త్వ వివేచన సాగుతూనే ఉంటుంది. అధికారం, పదవి... తన కోసం, మా కోసం అని అననే అనడు – తెలుగు తల్లికి అండగా నిలవాలనే ఇవన్నీ అంటూ నవ్వుతారు. ఒక ఛలోక్తికి ఆయన విరగబడి నవ్వుతుంటే నవ్వు కూడా తలదించుకొంటుంది.

"మీరు పదండి వెనకాల నేనుంటాను" అనే వారసత్వం ఆయనకి అబ్బనేలేదు. నా కెందుకు? ఈ గర్వం అంటే... మా ఇద్దరికీ కన్నతల్లి కృష్ణా జిల్లా కావటమే!!



'పద్మశ్రీ' అల్లు రామలింగయ్యతో...

తెలుగు తేజానికి అభినందనలు

- డా. శరత్‌జ్యోత్స్నా రాణి

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి పేరు చెపితే మనకు గుర్తుకు వచ్చే ప్రజా నాయకులు, హితులు అయిన కీర్తిశేషులు శ్రీ మండలి వెంకటకృష్ణారావు గారు. తండ్రిని మించిన తనయుడిగా ఎంతో కీర్తిప్రతిష్ఠలను అందుకున్న ప్రముఖ రాజకీయవేత్త మన బుద్ధప్రసాద్ గారు. కృష్ణా జిల్లా నాగాయలంక గ్రామంలో 1956 మే 26వ తేదిన జన్మించారు. వీరికి అప్పుడే అరవై ఏళ్ళు అంటే నాకు కాస్తా ఆశ్చర్యంగా ఉంది. బుద్ధప్రసాద్ గారు 1956 మే 26న పుడితే నేను అదే సంవత్సరం ఏప్రిల్ 28న పుట్టాను. నాకు వీరితో మంచి సాహిత్య సంబంధం ఉంది. వీరు కేవలం మంచి రాజకీయవేత్తే కాదు మంచి సాహిత్య బంధువు, సాహితీవేత్త కూడ. తెలుగు అన్నా, తెలుగు పదం విన్నా, తెలుగు సంస్కృతి భాషలపట్ల వారికున్నంత ప్రేమ, మక్కువ మరెవ్వరిలోను కనిపించదు. అందుకే వారు 2012-14 సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘానికి అధ్యక్షులుగా పనిచేయడమే కాదు తెలుగు భాషను అమలు చేస్తున్న జిల్లా కలెక్టర్లకు, ప్రభుత్వోద్యోగులకు అవార్డును అందించి ప్రోత్సహించారు. ఐటి శాఖ ద్వారా 'తెలుగు విజయం' ప్రాజెక్టును చేపట్టి ఇంటర్‌నెట్ ద్వారా తెలుగులో సంక్షిప్త సందేశాలను పంపే 'యూనికోడ్'ను రూపొందించారు. వీరిని చూస్తే ఆరణాల తెలుగు బిడ్డ కదలి వస్తున్నట్లుగా అనిపిస్తుంది. చాల మంది రాజకీయ వేత్తలు జనం కోసం ఏదో తమకు తోచిన నాల్గు మాటలు సభల్లో మాట్లాడతారు. కాని బుద్ధప్రసాద్ గారు ఏ విషయంపైనైనా అనర్గళంగా, స్పష్టంగా తెలుగులో చక్కగా ఉపన్యసించగల వక్తృత్వం, సమర్థ రాజకీయ నేతృత్వం ఉంది. మంచి సాహితీవేత్తగా ప్రజల హృదయాలలో నిల్చిపోయారు. 'పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు' బుద్ధప్రసాద్ గారు చిన్ననాటి నుండి ప్రజాసేవలో పాల్గొని ప్రజల మన్ననలను ఈనాటి వరకు అందుకుంటున్న మహావ్యక్తి. ముఖ్యంగా సార్వత్రిక ఎన్నికలలో అవనిగడ్డ నియోజకవర్గం నుండి యంయల్ఏగా మూడు సార్లు ఎన్నిక కావడం ఇందుకు నిదర్శనం. కృష్ణా డెల్టా సంరక్షణ సంఘానికి అధ్యక్షులుగా వ్యవహరిస్తూ పులిగడ్డ-పెనుమూడి మధ్య కృష్ణానదిపై వారధిని నిర్మించి, ఈ వారధికి తండ్రి పేరైన 'వెంకట కృష్ణారావు వారధిగా' నామకరణం చేయడం ఎంతో విశేషం. అంతే కాదు వారి సంకల్పం, చిత్తశుద్ధి, ప్రజా సమస్యల పట్ల వారికున్న అవగాహనను మనం అర్థం చేసుకోవచ్చు. పులిచింతల - పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించడం, ముఖ్యంగా విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి కృష్ణా విశ్వవిద్యాలయం పేరుతో ఒక కొత్త విశ్వవిద్యాలయ స్థాపనకు కృషి చేసిన ముఖ్యులు మన బుద్ధప్రసాద్ గారు.

"దేశమంటే మట్టి కాదోయ్ మనుషులోయ్" అన్న గురజాడ వాక్కును మనం బుద్ధప్రసాద్ గారిలో చూడవచ్చు. మనిషిని ఎంతో ప్రేమించే బుద్ధప్రసాద్ గారు పుస్తకాలను అదే విధంగా ప్రేమిస్తారు. కేవలం పుస్తకాలను సేకరించడం, చదవడంతోపాటు వీరు కూడ 'మారిషస్‌లో తెలుగుతేజం', 'ప్రజలు - ప్రగతి', 'ఇంగ్లండులో తెలుగు వైభవం' వంటి గ్రంథాలను రచించి రచయితగా పేరు పొందారు. ప్రతి సంవత్సరం

ఆగస్టు 4వ తేదీన కృష్ణారావు గారి జయంతిని నిర్వహిస్తూ, తండ్రిగార్ని స్మరిస్తూ ఎన్నో ఉత్తమోత్తమమైన కార్యక్రమాలను ఇంకా నిర్వహిస్తున్న జన నాయకుడు బుద్ధప్రసాద్ గారు. తండ్రి నుంచి పుణికి పుచ్చుకున్న ఉత్తమ భావాలను, సిద్ధాంతాలను ఆచరిస్తూ నవసమాజంలో యువత పాత్ర ఎలా ఉండాలో అని ఆలోచిస్తూ యువతను ప్రగతి పథంలో నడపడం కోసం 'గాంధీ క్షేత్రం' అనే ఓ చక్కని పత్రికను నడిపారు. బుద్ధప్రసాద్ గారు నిత్య చైతన్యశీలి. నిరంతరం ప్రజలకు, యువతకు, విద్యార్థులకు, సాహితీ వేత్తలకు, సాంస్కృతిక సంస్థలకు ఏదో ఒక సందేశాన్ని ఇవ్వాలని లేదా ఒక ఉపకారాన్ని చెయ్యాలనే తపన కలిగిన వ్యక్తిత్వం వారి సొత్తు.

ఒకే వ్యక్తిలో ఇన్ని సుగుణాలు ఉండవు. కాని బుద్ధప్రసాద్ గారిలో ఎన్నో సుగుణాలు రాసులుగా పోసి ఉన్నాయి అనటంలో ఎటువంటి సందేహం లేదు. దీనికి మరొక కారణం ఉందని నా కనిపిస్తుంది. వీరి పేరులోనే 'బుద్ధ' అనే పదం కలిసి ఉంది. అందుకే వీరు ఆంధ్రులకు, మిత్రులకు, ప్రజలకు బుద్ధప్రసాద్‌గా కన్పిస్తారు. బుద్ధుడు నడిచిన నేలపై జన్మించిన బుద్ధప్రసాద్ గారు గాంధేయవాదిగా, మానవతావాదిగా పేరు పొంది, ఆంధ్ర రాష్ట్రానికి, ఆంధ్ర ప్రజలకు ముఖ్యంగా తెలుగు వారికి ఎనలేని కీర్తిని తీసుకొచ్చిన ఆణిముత్యంగా అభివర్ణించాలి. అటువంటి తెలుగుతేజం అయిన బుద్ధప్రసాద్ గార్కి ఆ భగవంతుడు ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించాలని, 60 వసంతాలను నింపుకుంటున్న బుద్ధప్రసాద్ గారిని మనసారా అభినందిస్తున్నాను.

నిరాడంబరుడు, నిగర్వి అయిన బుద్ధప్రసాద్ గారిలో నేను చూసిన ఒక సుగుణం., వారిని నేటికి ముందుకు నడిపిస్తున్న ఆభరణం, (ఆయుధం) ఒక్కటే అది వారి పెదవులపై విరిసి తాండవిస్తూ నిరంతరం వెలిగే చిరునవ్వే. అది వారి విజయానికి, వారి ప్రస్థానానికి ముందడుగని భావిస్తు మరొక్కసారి అభినందిస్తున్నాను.



శ్రీ నటరాజ రామకృష్ణ బృందంతో

ప్రియతమ నేతకు అక్షరాభిషేకం

- మూల్పూరి వెంకటేశ్వరరావు

స్వచ్ఛమైన మనసులు, అందమైన చిరునవ్వులు, సిరిసంపదలు నిచ్చే పాడిపంటలు, ఆప్యాయతలను కుమ్మరించే ఆత్మీయులు, ప్రకృతి అందాలతో విరాజిల్లుతూ, ఆ దివిని సైతం తలదన్నే ప్రకృతి సౌందర్యం మా దివిసీమకే సొంతం. అటువంటి దివిసీమ ముద్దుబిడ్డ, తెలుగు వాడిని, తెలుగు వేడిని ప్రపంచానికి తెలియజేసిన మా ప్రియతమ నేత శ్రీ మండలి కృష్ణారావుగారి తనయుడు, మా మండలి బుద్ధప్రసాద్ గారికి లభించే ఈ గౌరవం, మా దివిసీమ ప్రజలందరికీ దక్కే గౌరవంగా భావిస్తున్నాను.

దశాబ్దాల నేపథ్యంలో విశేష అనుభవాన్ని గడించి, అవనిగడ్డ నియోజక ప్రజానీకంచే నీరాజనాలందుకుంటూ, నిష్కళంక, నిరాడంబర రాజకీయవేత్తగా, తండ్రిబాటలో పయనిస్తూ, గాంధేయ వాదాన్ని తనకు జీవన వేదంగా మార్చుకుని, ఆచరణ క్రియాశీలక రాజకీయవేత్తగా పేరొందిన సౌజన్యమూర్తి, తెలుగు భాషా వైభవ ప్రాచుర్యమునకు నడుం బిగించిన సాహితీ పిపాసి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన ఉప సభాపతి మాన్యశ్రీ మండలి బుద్ధ ప్రసాద్ గారికి 2016 మే, 26వ తేదీ నాటికి 60 వసంతాలు పూర్తి అవుతున్న శుభతరుణాన్ని పురస్కరించుకుని, అభినందన గ్రంథాన్ని ప్రచురించుచున్న కిన్నెర ఆర్ట్ థియేటర్ వారికి ముందుగా నా అభినందనలు తెలియజేస్తున్నాను.

నాకు బుద్ధప్రసాద్ గారు వారి చిన్నతనం నుండే పరిచయం. వారు మా అబ్బాయి లక్ష్మణస్వామి సమవయస్కులు. మంచి స్నేహితులు కూడా! నేను చల్లపల్లి మండలం, లక్ష్మీపురం గ్రామ సర్పంచ్‌గా 1970-81 వరకు విధులు నిర్వహించినప్పటి నుండీ వారి తండ్రిగారైన మండలి వెంకట కృష్ణారావు గారికి సన్నిహితులుగా ఉన్నాను. నా రాజకీయ జీవితానికి స్ఫూర్తి ప్రదాత కృష్ణారావు గారు. 27 సం॥ల పరిచయ కాలంలో వారి నుండి ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. జాతీయవాదిగా, లోక్‌సభ సభ్యునిగా, రాష్ట్రమంత్రిగా, తొలి ప్రపంచ తెలుగు సభల నిర్వాహకునిగా, దివిరత్నంగా ఖ్యాతి గడించిన మహనీయునితో 27 సం॥ల పాటు సహచరునిగా గడపటం నా అదృష్టం.

1975 సం॥ ఏప్రిల్ నెలలో హైదరాబాద్‌లో ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలు అద్భుతంగా నిర్వహించారు. అదొక వాస్తవిక స్వాప్నిక సుందర జగత్తు అని చెప్పవచ్చు. ఆ మహాసభలలో నేను కూడా పాల్గొనే అవకాశం కల్పించారు మా కృష్ణారావు గారు. తరువాత 1981లో రెండవ ప్రపంచ తెలుగు మహాసభలు మలేషియాలో ఎంతో ఘనంగా నిర్వహించారు. అటువంటి మహనీయుని వారసుడు మా బుద్ధ ప్రసాద్ గారు.

మా బుద్ధప్రసాద్ గారు 1999, 2004, 2014 సం॥రాలలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో అవనిగడ్డ నియోజక వర్గం నుండి శాసన సభకు ఎన్నికై 2007-2009 సం॥రాలలో పశు సంవర్ధక పాడి పరిశ్రమ,

మత్స్య శాఖామాత్యులుగా పనిచేశారు. వారు పదవిలో ఉన్నా, లేకపోయినా దివిసీమ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. అభివృద్ధి పనులకే ఎక్కువ సమయం కేటాయిస్తూ, రాజకీయాలకు అతీతంగా సమాజానికి కావలసిన మంచి పనులు చేస్తూ, మంచి పేరును సంపాదించారు. వారు ఏ స్థాయిలో ఉన్నా మా స్థాయి వారిని గౌరవించడం వారికి పెద్దల పట్ల ఉన్న గౌరవానికి సూచిక.

ముఖ్యంగా కృష్ణాడెల్టా సంరక్షణ సంఘాన్ని ఏర్పాటు చేసి, దానికి అధ్యక్షులుగా ఉండి, రాజకీయాలకు అతీతంగా కృష్ణాజిల్లా ఆధునికీకరణకు అనేక ఉద్యమాలు నడిపి పోరాడిన నేత, కృష్ణానది కరకట్టపై పులిగడ్డ నుండి విజయవాడ వరకు రహదారి వెడల్పు చేయించారు. దీనివల్ల పులిగడ్డ నుండి విజయవాడకు మధ్య దూరం గణనీయంగా తగ్గటమే కాక ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్య కొంతవరకు సమసిపోయింది.

1977 నవంబరు 19వ తేదీన సంభవించిన పెను తుఫానుకు దివిసీమ ప్రాంతం అతలాకుతలమైంది. అప్పుడు మండలి వెంకట కృష్ణారావు గారు మన రాష్ట్ర విద్యా సాంస్కృతిక శాఖామాత్యులుగా ఉన్న సమయం. ఆ కాళరాత్రిలో కృష్ణారావుగారు తుఫాను బాధితులకు చేసిన సేవలు చిరస్మరణీయం. అప్పుడు 20 సం॥ల వయస్సు ఉన్న బుద్ధప్రసాద్ గారు వారి తండ్రి గారితో పాటు రాత్రింబవళ్ళు సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఒక నెల రోజుల పాటు కృష్ణారావు గారితో పాటు నేనూ, ఐ.ఎ.ఎస్. అధికారి ఎ.వి.ఎస్. రెడ్డిగారితో కలసి సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్నాను. అదొక మరపురాని అనుభూతి.

పువ్వుపుట్టగానే పరిమళించినట్లు బుద్ధప్రసాద్ గారు 20 సం॥రాల వయస్సు నుండే రాజకీయాలకు అతీతంగా సమాజసేవ చేయటం హర్షణీయం. అవనిగడ్డ గాంధీక్షేత్రంలో ఎప్పుడూ ఏదో ఒక సామాజిక కార్యక్రమాలు జరిపిస్తూ, కళాకారులను, కళలను ప్రోత్సహిస్తూ ఒక చక్కటి సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో ఎంతోమంది కళాకారులను సగౌరవంగా ఆహ్వానించి, సన్మానించారు. తెలుగుదనాన్ని ఇష్టపడుతూ, తెలుగుభాషపై ఎనలేని మక్కువ పెంచుకున్నారు మన బుద్ధప్రసాద్ గారు. అంజలీదేవి, జమున, వేటూరి, గజల్ శ్రీనివాస్, ఆచంట వెంకటరత్నం నాయుడు వంటి గొప్ప కళాకారులకు ఘనసన్మానాలు చేసిన కళారవి మన బుద్ధప్రసాద్‌గారు.

ప్రధాని నరేంద్రమోదీ పిలుపు నందుకుని, ముఖ్యంగా చల్లపల్లి పట్టణంలో స్వచ్ఛభారత్, స్వచ్ఛ చల్లపల్లి రథసారథులైన డా. డి.ఆర్.కె. ప్రసాద్ గారికి, డా. పద్మావతి గారికి, వారి కార్యకర్తలకు వెన్నుదన్నుగా ఉంటూ ప్రతి కార్యక్రమంలోనూ పాల్గొంటూ, చల్లపల్లి గ్రామానికి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు రావడానికి వీరు చేస్తున్న కృషి ప్రశంసనీయం.

రాజకీయాలకు అతీతంగా, అభివృద్ధే ధ్యేయంగా, తెలుగుజాతి ఔన్నత్యానికి పాటుపడుతూ, నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో జీవించాలని మనసారా కోరుకుంటూ.....

స్థితప్రజ్ఞుడు

- యాతగిరి శ్రీరామ నరసింహారావు

ఎటువంటి ఒడిదుడుకులు వచ్చినా తొణకడు, బెణకడు. పదవులకై ఆరాటం చెందడు. వచ్చిన వాటిని సమర్థంగా నిర్వహిస్తాడు ఆయన శక్తికి సరియైన పదవి రాలేదని పలువురు భావించినా, వారి ఎదుటే ఆ మాటలన్నా చిరునగవే సమాధానం.

ఈనాడు ఆంధ్రప్రదేశ్‌లో ఏ సాంస్కృతిక ఉత్సవమైనా ఆయన పాల్గొనవలసిందే. చారిత్రక ప్రదర్శనయైనా, కళాప్రదర్శనయైనా ఆయన ఉండి తీరాలి. లేకపోతే, ఆ లోటు కొట్టవచ్చినట్లు కనబడుతుంది. హిస్టరీ కాంగ్రెసులోనూ ఆయన ప్రసంగించవలసిందే. కూచిపూడి సదస్సులోనూ అంతే, మాతృభాషా ఉద్యమంలోనూ ఆయన ముందుండాలి.

ఆయన పుస్తకాల పురుగు, నిరంతరం గ్రంథ పఠనం ఆయన సొత్తు. మనం ఆయనకు ఏం పుస్తకం ఇచ్చినా, తప్పనిసరిగా చదివి భావాన్ని ఫోన్లోనో, కాగితం మీదో పెడతారు. ఈ లక్షణం ఈ రోజున ఎంతమంది రాజకీయవేత్తలకుంది? అదిగో ఆ సత్‌లక్షణం మాన్యులు శ్రీ పి.వి. నరసింహారావుగారిలో ఉండేది. ఆయన పదవిలో ఉన్నా లేకున్నా పుస్తకం చదవవలసినదే! అనేక పర్యాయాలు నేనలా పుస్తకాలు పి.వి. గారికిచ్చాను.

ఒకసారి మండలివారు మంత్రి పదవిలో ఉండగా, నాటి మా శాసనసభ్యులు శ్రీ రౌతు సూర్యప్రకాశరావుతో కల్సి రాజమహేంద్రికి ఒక కార్యక్రమానికి ఆహ్వానించాను. చూద్దాం చేద్దాం అనకుండా ఒక తేదీనిచ్చారు. అంతేకాదు ఒక కాగితం మీద ఆకుపచ్చ సిరాతో ఒక నాటి రాజమహేంద్రి ప్రముఖుల పేర్లు వ్రాసి, మోనోగ్రాఫ్స్ రాయించి ఇస్తే, వెలుగు చూసే ప్రయత్నం చేస్తామన్నారు. కొద్దిమంది ప్రముఖులతో రాయించి ఇస్తే, చాలామటుకు ప్రకటించారు. ఏ ప్రాంతంలో ఎవరెవరు ప్రముఖులు ఉండేవారో వారికి తెల్సినట్లుగా మరొకరికి తెలియదు. డాక్టరు గూడూరి నమశ్శివాయ మా ఆంధ్రకేసరి యువజన సమితిలో గతంలో ఆంధ్రకేసరి ప్రకాశం గారిపై ఇచ్చిన ప్రసంగ పాఠం మా వద్దనున్నదని రాజమహేంద్రిలో వారికి చెప్పగానే, పదివేల రూపాయలనిచ్చి అచ్చు వేయించమన్నారు మండలివారు. ఆ గ్రంథం ఇప్పుడు మలి ముద్రణ కూడా అయింది.

ఒక్క ఆంగ్లపదమైనా లేకుండా ఉపన్యాసాన్ని ఎంతసేపైనా ఇస్తారు బుద్ధప్రసాద్. తెలుగుభాషపై మమకారం హెచ్చు. ఆ మాతృభాషకు ఎవరు అన్యాయం తలపెట్టినా సహించరు. ఈ విషయంలో వావిలాల వారు మనకు కన్పిస్తారు. మాతృభాషా సదస్సులనెన్నింటినో కడు దక్షతతో నిర్వహించారు. తండ్రిగారి వలెనే ప్రపంచ తెలుగు మహాసభలను దిగ్విజయంగా నడిపి పేరు తెచ్చుకున్నారు. అలాగే తెలుగు రచయితల మహాసభలనూ జయప్రదం చేసారు.

రాష్ట్రంలో ఏఏ పట్టణాల్లో ఎవరెవరు ప్రముఖులు వివిధ రంగాలలో ఉన్నారో అప్పటికప్పుడు చెప్పగలరు. వారందరికీ వివిధ సందర్భాలలో సత్కారాలందుకొనే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు.

దేశంలో సింధునాగరికత వంటివి ఎక్కడెక్కడ ఉన్నాయో పరిశీలించి, వ్యాసాలను ప్రచురించి పదిమందికి చెప్పే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. బౌద్ధ సంస్కృతిపట్ల ప్రత్యేక అభిమానమున్నట్లు తెలుస్తుంది. దివిసీమ రత్నాలను వెలికి తీసారు. వారి జన్మదినోత్సవం నాడు ఒకనాటి మేటి ప్రముఖుల వ్యాసాలతో తెలుగు వ్యాసమండలి శాశ్వతంగా నిల్చిపోయే గొప్ప పరిశోధనాత్మకమైన గ్రంథం. నిరంతరం పఠింపవలసిన గ్రంథ రాజం.

60 వసంతాల బుద్ధప్రసాద్ జీవితం పలువురికి ఆదర్శం కావాలని ఆకాంక్షిస్తున్నాను.

విలువలకు విలువనిచ్చే ప్రజానాయకుడు

- డా. పాలకుర్తి మధుసూదన రావు

మండలి బుద్ధప్రసాద్ గారి షష్ట్యబ్దిపూర్తి మహోత్సవాలను పురస్కరించుకొని వెలువరించే ప్రత్యేక సంచికకు నా అభిప్రాయాన్ని అందించాలని కిన్నెర రఘురామ్ గారు నాకు ఒక లేఖ పంపించారు.

మండలి బుద్ధప్రసాద్‌గారు అంటే నాకు ఎనలేని గౌరవం. భారతదేశ రాజకీయ, సాంస్కృతిక వారసత్వాన్ని జీర్ణించుకొని, విలువలతో కూడిన జీవనపథాన్ని ఎంచుకున్న కుటుంబానికి వారసుడు మండలి బుద్ధప్రసాద్ గారు.

బుద్ధప్రసాద్ గారి తండ్రిగారు మండలి వేంకటకృష్ణారావుగారి పేరు వినని తెలుగు వాడు ప్రపంచంలోనే లేడు. గాంధీ గారి సిద్ధాంతాలకు, తెలుగు భాషకు, తెలుగు సంస్కృతికి, అంతా ఎందుకు తెలుగు వాడి ఊపిరికి భరోసా ఇచ్చిన మహనీయులు మండలి వేంకట కృష్ణారావుగారు. నేను ఆకాశవాణిలో ప్రొడ్యూసర్‌గా ఉన్న రోజుల్లో వారిని కనీసం ఓ ఇరవైసార్లు అయినా ఇంటర్వ్యూ చేసాను.

తండ్రి ఉన్నతమైన లక్షణాలను పుణికి పుచ్చుకున్న తనయులు మనకు అరుదుగా కనిపిస్తారు. నా దృష్టిలో మండలి వేంకట కృష్ణారావుగారి ఆలోచనా సరళిని పరిపూర్ణంగా ఆకళింపు చేసుకొని ఉన్నతమైన విలువలకు అక్షర రూపంగా నిలిచిన ప్రజల మనిషి బుద్ధప్రసాద్ గారు.

మహాత్మాగాంధీ గారి సిద్ధాంతాలు భారతదేశ ఆత్మకు ప్రతిరూపాలు. గాంధేయవాదమే ప్రపంచశాంతికి ఏకైక మార్గం అని ఏనాడో ప్రపంచం గుర్తించింది. మాన్యుడు, సామాన్యుడు అనే భేదభావం లేకుండా మానవ సమాజం, మానవీయ దృక్పథంతో మనగలిగితే, అది నిజమైన 'మానవ కళ్యాణం'. ఇది గాంధీ మహాత్ముడు మనకిచ్చిన సందేశం. దీన్ని నమ్మిన జ్ఞాని, విజ్ఞాని, సామాజిక దార్శనికుడు మండలి వేంకట కృష్ణారావుగారు. తండ్రికి ఎంత ఓపిక ఉండేదో, ఎంత సౌమ్యత ఉండేదో, ఎంత సహనం ఉండేదో ఎంత పరితపించే హృదయం ఉండేదో, ఇవన్నీ నేను బుద్ధప్రసాద్ గారిలో చూసాను.

నేను దూరదర్శన్ డైరెక్టర్‌గా ఉన్న రోజుల్లో విజయవాడలో కవిసమ్మేళనాన్ని నిర్వహించాలనుకున్నాను. అదీ గాంధీగారి ప్రాశస్త్యాన్ని చాటి చెప్పే కవి సమ్మేళనం. ఆ విషయాన్ని బుద్ధప్రసాద్ గారితో ప్రస్తావించాను. నాకు 'మండలి' అనగానే మహాత్మాగాంధీ గారు గుర్తుకొస్తారు. వారు ఈ కవి సమ్మేళనానికి ముఖ్య అతిథిగా రావడానికి అంగీకరించారు.

'మహాత్మా! నీకు జోహార్లు' అనే శీర్షికతో తెలుగునాట ఉన్న సుప్రసిద్ధ కవివరేణ్యులను ఆహ్వానించి కవిసమ్మేళనాన్ని నిర్వహించాం. విజయవాడలో నిర్వహించిన ఈ కవిసమ్మేళనం ప్రత్యక్ష ప్రసారంగా 176 దేశాలకు వెళ్ళింది. ఎంతోమంది ఈ కార్యక్రమాన్ని చూసి దూరదర్శన్ హైద్రాబాద్ కేంద్రాన్ని ఆశీర్వదించారు. ఇదంతా మండలి బుద్ధప్రసాద్ గారు మాకు అందించిన స్ఫూర్తివల్లే సాధ్యపడింది.

మంచి మనసుతో విరాజిల్లుతున్న బుద్ధప్రసాద్ గారు, వారి కుటుంబం, కలకాలం సకల సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ.....

శుభాకాంక్షలతో...

సేవాతత్పరులు

- గోవిందరాజు రామకృష్ణారావు

సేవానిరతికి పర్యాయపదం 'మండలి'. పూర్వమంత్రివర్యులు శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారికి అవనిగడ్డలోని బోర్డు హైస్కూలులో సహాధ్యాయి కావడం నా అదృష్టం. విద్యార్థిగా ఆయన గాంధీ ప్రభావంతో స్వరాజ్యకాంక్ష పెంచుకున్నారు. ఖద్దరు దుస్తులు ధరించారు. అప్పుడే నాయకత్వ లక్షణాలు ప్రస్ఫుటమయ్యాయి. ఎవరికేసహాయం కావాలన్నా వెంటనే అందించేవారు. నిరాడంబరత, వినయశీలం, మానవీయత, కారుణ్యం మూర్తీభవించిన మండలి వారి కృషి అగణ్యం. 1945లో నిత్యావసర వస్తువులు కొరతగా ఉన్నప్పుడు తోటి ఎస్.ఎస్.ఎల్.సి. విద్యార్థులు రాత్రిపూట చదువుకోవడానికి వీలుగా మండలివారు కిరోసిన్ సమకూర్చిన వైనం నేనెన్నటికి మరువను. 1977 దివిసీమ ఉప్పెన బాధితులకు ఆయన రేయింబవళ్లు శ్రమించి సహాయమందించిన తీరు అనితరసాధ్యం. వివిధ దేశాల తెలుగువారు కలుసుకునే అపూర్వవేదికగా 'ప్రపంచ తెలుగు మహాసభల'కు నాంది పలికిన మండలి వారు గొప్ప దార్శనికులు. మంత్రిగా ఆయన దీక్షదక్షతలు సర్వవిదితం. ఆయనను గురించి 'మాన్ విత్ మిషన్ – మండలి వెంకట కృష్ణారావు' అనే పేరుతో ఆంగ్లంలో నేను రచించిన గ్రంథాన్ని 2008లో తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించింది. మండలివారు చిరస్మరణీయులు.

ఆ మహనీయుని తనయుడుగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి మాన్య శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు తండ్రి గుణ సంపదకు ఉత్తమ వారసులు. అన్ని వర్గాల వారి అభిమానాన్ని చూరగొన్న సుహృన్మణి, సౌజన్యమూర్తి. 20 సం॥ల ప్రాయంలోనే దివిసీమ ఉప్పెన బాధితులకు సహాయ కార్యక్రమంలో తండ్రికి బాసటగా నిలిచిన సేవాతత్పరులు. ఆయన స్థాపించిన 'దీన జన సంక్షేమ సమితి' ఆర్తులకు రక్షణ చేకూర్చే ప్రబల సాధనం. అవనిగడ్డలోని 'గాంధీక్షేత్రం'లో గాంధీ సిద్ధాంతాలను, ఆశయాలను జీర్ణించుకున్నారాయన. పులిగడ్డ–పెనుమూడి మధ్య శ్రీ బుద్ధ ప్రసాద్ గారి చొరవపై నిర్మించిన 'మండలి వెంకట కృష్ణారావు వారధి' ప్రజలకెంతో ఉపయోగకారి. కృష్ణానది కరకట్టపై రహదారి వెడల్పు చేయడం వంటి పెక్కు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన చేకూర్చిన స్ఫూర్తే ముఖ్యహేతువు. తెలుగు విశ్వవిద్యాలయంలోని మండలి వెంకట కృష్ణారావు 'అంతర్జాతీయ తెలుగు కేంద్రం' విదేశాలలోని తెలుగు వారికి భాషాపరంగా ఎంతగానో తోడ్పడుతున్నది. శ్రీ బుద్ధప్రసాద్ గారు ఇతర రాష్ట్రాలలో, ఇతర దేశాలలోని తెలుగువారు మాతృభూమితో సంబంధాలు కొనసాగించేందుకు ఉత్తర వారధిగా ఉన్నారు. మంత్రివర్యులుగా శ్రీ బుద్ధప్రసాద్ గారు 'పశుక్రాంతి', 'మత్స్యక్రాంతి', 'పరిశోధన కేంద్రం' 'సూపర్ స్పెషాలటీ పశువైద్యశాలలు' మొదలైన వాటి ఏర్పాటు ఆయన కార్యసామర్థ్యానికి, నూతన ప్రణాళికా రచనా పటిమకు నిదర్శనం. అధికార భాషా సంఘం అధ్యక్షులు శ్రీ బుద్ధప్రసాద్ గారు చేపట్టిన 'తెలుగు విజయం' పథకం సాంకేతికంగా ఎంతో ప్రాధాన్యం సంతరించుకుని అంతర్జాలంలో తెలుగు వాడుకకు దోహదం చేకూర్చింది. ఆయన పర్యవేక్షణలో వెలువడిన 'పరిపాలనా న్యాయపదకోశం' చాలా ప్రయోజనకారి. 2012 సం॥ తిరుపతిలో ఆయన సారథ్యంలో జరిగిన

'నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు' సర్వంకష విజయం సాధించాయి. ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతిగా శ్రీ బుద్ధప్రసాద్ గారి నిర్వహణ గరిమ విజ్ఞులందరి ప్రశంస లందుకుంటున్నది.

గ్రంథ రచయిత, భాషాభిమాని, కళోద్ధారకులు అయిన శ్రీ బుద్ధ ప్రసాద్ గారు భాషాసాహిత్య కళాసంస్కృతుల ప్రవర్ధకులుగా విశేష ప్రోత్సాహం అందిస్తున్నారు. తెలుగుకు ప్రాచీన ప్రతిపత్తి సాధనలో ఆయన గురుతర పాత్ర వహించిన సత్యం ఎల్లరకు తెలిసిందే. సాంస్కృతిక సంస్థలకు ఆయన పెన్నిధి. శ్రీ బుద్ధప్రసాద్ గారి బహుముఖీన సేవలకు ఇవి వాచవిగా పేర్కొన్నవి.

మాన్యశ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి 2016 మే 26న షష్ట్యబ్ది పూర్తి మహోత్సవం జరుగుతున్న ఆనందభరిత సందర్భంలో వారి అభిమానిగా వారి తండ్రిగారి సహాధ్యాయి, బాల్యస్నేహితుడుగా నా హృదయ పూర్వక శుభాకాంక్షలు, అభినందనలు అందజేస్తున్నాను.



రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డితో మండలి కుటుంబం

సాంస్కృతిక మండలి

- డా. డి. విజయ భాస్కర్

ఈనాటి రాజకీయాల్లో భాష, సంస్కృతుల ప్రస్తావన చాలా అరుదుగా ఉంటుంది. నాయకులకు కూడా వాటి పట్ల ఆసక్తి తక్కువే. అలాంటి నేపథ్యంలో శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారిలాంటి వారు రాజకీయాల్లో ప్రముఖంగా ఉండటం మన అదృష్టంగా చెప్పుకోవాలి. తెలుగు భాష పట్ల, సంస్కృతుల పట్ల అపారమైన ప్రేమున్న వారు. ఇది వారి తండ్రి గారి నుండి అబ్బిన విశేష లక్షణం. సాధారణంగా పిల్లలు తల్లిదండ్రుల ఆస్తిపాస్తులకు, పదవులకు వారసులు అవుతారు. కాని వారి అభిమానాలకు, విలువలకు వారసులు కావటం ఒక విలువైన సామాజిక సన్నివేశం. వారి నిరాడంబరత, నిస్వార్థం, మృదుస్వభావం అందరికీ వచ్చే గుణాలు కావు.

నేను అవనిగడ్డ వెళ్ళి చూసి చాలా ఆశ్చర్యపోయాను. విశాలమైన స్థలంలో ఆడిటోరియం, మీటింగ్ హాలు, లైబ్రరీ – ఒక ఆశ్రమ వాతావరణం కనిపించింది తప్పా ఒక రాజకీయ నాయకునికి చెందిన పార్టీ ఆఫీసులాగ లేదు. ఆ ఆడిటోరియంలో ఎప్పుడంటే అప్పుడు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రవచనాలు, సభలు, సద్గోష్ఠులు – ఇలా ఒక సాంస్కృతిక కేంద్రంగా, గాంధీతత్వ బోధనా క్షేత్రంగా దాన్ని మార్చడం ఆయనకే చెల్లు. ఆయన చేస్తున్న సాంస్కృతిక, సాహిత్య సేవ కేవలం రెండు తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాదు. ప్రవాసాంధ్రులు, విదేశాంధ్రులకు విస్తరించి ఉంది. వారందరితో ఆయనకు వ్యక్తిగత పరిచయాలు, సాన్నిహిత్యం ఉంది. వాళ్ళనెవర్ని కదిలించిన బుద్ధప్రసాద్ గారిక్కడకు వచ్చారనో, మమ్మల్ని కలిశారనో, ఏదో ఒకటి ఆయన ప్రమేయాన్ని గురించి చెబుతుంటారు.

సాహిత్య, సాంస్కృతిక కోణాల్లోంచి అంతగా అల్లుకుపోయిన నాయకుడు మరొకరు లేరనడం అతిశయోక్తి కాదు. ఈ మధ్య ఉగాది పండుగకు శ్రీమతి రామలక్ష్మి గారికి 'కళారత్న' అవార్డు ప్రకటిస్తే అనివార్య కారణాలతో ఆమె రాలేక పోయారు. ఒక రోజు నాకు ఫోన్జేసి "విజయభాస్కర్ రామలక్ష్మి గారి ఇంటికెళ్ళి ఆ అవార్డు ఇచ్చి వద్దామని" అన్నారు.

"పదండి సార్" అని నేనూ వెళ్ళినప్పుడు తెలిసింది ఆయనకు కళాకారులన్నా, రచయితలన్నా ఎంత గౌరవమో! ఆమె ఆనాటి ముచ్చట్లు చెబుతుంటే ఒక గంటసేపు అన్నీ వింటూ ఎంత ఆనందించారో!

రాష్ట్రంలో ఉన్న రచయితలు, కవులు, కళాకారులు, సంస్థలు, అందరితో అతనికి పరిచయముంది. అలాగే తెలుగు భాషకు ప్రాచీన భాష హోదా రావడంలో గానీ, ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణలోగానీ కీలకమైన పాత్ర వహించారు. అధికార భాషా సంఘం అధ్యక్షునిగా ఆయన చేసిన విశేషమైన కృషి అందరికీ తెలిసిందే.

నాకనిపిస్తుంది ఆయన కేవలం ఒక వ్యక్తి కాదు – ఒక వ్యవస్థ– ఒక సాంస్కృతిక మండలి.

షష్టిపూర్తి సందర్భంగా వారికి నా హృదయ పూర్వక అభినందనలు.

మా భాషోద్యమ బంధం

- డా. సామల రమేష్‌బాబు

తొమ్మిదేళ్ళక్రితం... బుద్ధప్రసాద్ గారు మంత్రిగా ఉండగా, ఆయన 51వ ఏట అడుగుపెట్టిన సందర్భంగా 'స్వర్ణయానం' పేరుతో ఒక అభినందన సంచికను ప్రచురించారు. అందులో 'తెలుగుజాతి ఆశ పెట్టుకోదగిన నాయకుడు శ్రీ బుద్ధప్రసాద్' అనే వ్యాసాన్ని నేను వ్రాశాను. దానికి కొనసాగింపుగానే ఇప్పుడు ఆయన అరవయ్యవ ఏట అడుగుపెడుతున్న సందర్భంగా ఈ క్రింది మాటలను వ్రాస్తున్నాను.

నాటికీ నేటికీ బుద్ధప్రసాద్ గారు ఇంకా ఎంతో ఎదిగారు. 2009 ఎన్నికల్లో ఆయన కొద్ది ఓట్ల తేడాతో ఓడిపోయినప్పుడు కీ.శే.సి. ధర్మారావుగారు నాతో అన్నారు – "ఆయనకు పట్టిన తెలుగు పిచ్చి వల్లే ఓడిపోయారు" అని. ఈ మాటపై మా ఇద్దరిమధ్యా కొద్దిసేపు సంభాషణ జరిగింది. అదంతా ఇప్పుడిక్కడ అక్కరలేదు గానీ – ఎన్నికలపట్ల బుద్ధప్రసాద్ గారు తగినంత శ్రద్ధ చూపలేదని ఆయన బాధపడ్డారు. ఆయన గెలుస్తారని, సాంస్కృతికశాఖ, ప్రాథమిక విద్యకు మంత్రి అవుతారని ధర్మారావు గారి ఆశ. నాకైతే ఆయన గెలిచి తప్పక మంత్రి అవుతారని ఎడతెగని నమ్మకం. బుద్ధప్రసాద్ గారి ఓటమి వార్త విని, ఇద్దరమూ కుంగిపోయాం.

ఎన్నికల్లో ఓటమి అనేది ఆ వ్యక్తి ఓటమి కాదు. అందుకు ఎన్నో కారణాలుంటాయి. అప్పట్లో రాజకీయ పార్టీల పరిణామాల వల్ల ఆయన గెలవలేకపోయారు. కానీ – ఒక వ్యక్తిగా, రాజకీయ నాయకుడుగా ఆయన ఓడిపోలేదు. తండ్రిగారి నుండి వచ్చిన గొప్ప వారసత్వం ఆధారంగా ఆ అడుగుజాడల్లోనే తనదైన వ్యక్తిత్వాన్ని, రాజకీయ నిపుణతను, తన సేవానిరతితో పెంచుకొన్న బుద్ధప్రసాద్‌గారు నిరంతరం ఎదుగుతూనే ఉన్నారు. తెలుగుజాతి పట్ల ఆయన నిబద్ధత, తెలుగుభాషా సంస్కృతుల రక్షణ పట్ల ఆయనకున్న శ్రద్ధ, చేసిన కృషి – ప్రశ్నించడానికి వీలులేనట్టివి. అవి ఆయన వ్యక్తిత్వానికి ఔన్నత్యాన్నిచ్చాయే గాని, రాజకీయంగా ఆయన పెరగడానికి అవి ఎప్పుడూ అడ్డు కాలేదు. పైపెచ్చు ఆయనకు రాష్ట్రంలోను, ఇతర రాష్ట్రాల్లోనూ అంతర్జాతీయంగానూ తెలుగు సాంస్కృతిక సేనానిగా ప్రతినిధిగా నేతగా గుర్తింపు నిచ్చాయి.

సాంస్కృతిక సంఘాల కార్యక్రమాల్లోను, కళావేదికలకు, భాషాసాహిత్య సదస్సులకు, గోష్ఠులకు – అవి ఎక్కడ జరిగినా బుద్ధప్రసాద్ గారిని ముఖ్యఅతిథిగా పిలవాలనే అలవాటు తెలుగువారిలో ఏర్పడింది. ఇవన్నీ ఆయనకు గొప్పదనాన్ని ఇచ్చే అంశాలే గాని స్థాయిని తగ్గించేవి కావు కదా.

2009 నుండి 2014 ఎన్నికల వరకూ నడిచిన చరిత్రలో – చివరి రెండేళ్ళూ అధికారభాషా సంఘం అధ్యక్షులుగా నియమితులైన తర్వాత ఆయన ఎంతో కృషి చేశారు. తొలుత వావిలాల, తర్వాత నండూరి రామకృష్ణమాచార్యులు, సినారె, ఎబికెలకు ధీటుగానే గాక, తన రాజకీయ హోదాను, పలుకుబడిని ఉపయోగించి, ఒక కొత్త తేజస్సును అధికార భాషాసంఘానికి కలిగించారు.

ఇక్కడ కొన్ని సంగతుల్ని చెప్పాలి.

అధికార భాషాసంఘం చట్టబద్ధంగా ఏర్పడిందే కానీ దాన్ని ఒక తోలుబొమ్మగా, ఒక ఉత్సవ విగ్రహంగా చేశారు – మన పాలకులు. ఆ సంఘానికి నియమాల (రూల్స్)ను గాని, ఒక వ్యవస్థను గాని ఏర్పాటు చేయకుండా గాలిలో వదిలేశారు. ఈ పరిస్థితిని గుర్తించి తెలుగు భాషోద్యమ సమాఖ్య తొలి నుండీ విమర్శిస్తూనే ఉంది. సమాఖ్యను ప్రారంభించిన సందర్భంలోను, తర్వాత అనేక సందర్భాల్లోను బుద్ధప్రసాద్ గారు అధికార భాషా సంఘం పట్ల ప్రభుత్వ ధోరణిని విమర్శించారు కూడా.

అటువంటి వ్యక్తి అధికార భాషాసంఘానికి అధ్యక్షులుగా బాధ్యతను చేపట్టనున్నారన్న వార్తను విని నేను ఆశ్చర్యపోయాను. అయితే ఆయన ఆలోచనా విధానం వేరుగా ఉంది. క్యాబినెట్ హోదాతో తానా బాధ్యతను చేపట్టనున్నందున ప్రభుత్వ వ్యవస్థలో, పార్టీలో తనకున్న స్థిరమైన స్థానం వల్ల, పలుకుబడి వల్ల కొన్ని పనులు సాధించగలమన్న వ్యూహమూ, నమ్మకమూ ఆయనది.

తెలుగు భాషోద్యమ సమాఖ్య స్థాపనలో కీ.శే. ధర్మారావు గారు, బుద్ధప్రసాద్ గారు, నేనూ కీలకంగా ఉన్నాం. మరికొందరు పెద్దల తోడ్పాటుతో సమాఖ్యను స్థాపించాం. ప్రత్యక్ష రాజకీయాల్లోను, పార్టీ బాధ్యతల్లోను ఉన్నందున బుద్ధప్రసాద్ గార్ని సమాఖ్యకు అధ్యక్షుడిగా చేసుకోలేకపోయినా, సమాఖ్యకు సంబంధించి ఆయన స్థాయి అంతకంటే ఎక్కువ ప్రభావవంతమైనదని ఇక్కడ గుర్తుపెట్టుకోవాలి. సమాఖ్యకు ఎప్పుడూ ఆయన 'పెద్దదిక్కు'గానే ఉన్నారు.

2012 డిసెంబరులో నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల్ని జరపాలని శ్రీ కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం తలపెట్టింది. అంతకుముందు 2011లోనే ఈ సభలను జరపాలని ప్రకటించి, ప్రయత్నించి వ్యవధి తక్కువైనందున సాధ్యంకాక విరమించింది. మళ్ళీ 2012లో తలపెట్టిన తర్వాత – ఆ పనికి – ఆగస్టు 29న గిడుగు రామమూర్తి గారి జయంతినాడు శ్రీకారం చుట్టింది. అంతకుముందే తెలుగు భాషోద్యమ సమాఖ్య నాలుగైదు ఏండ్లుగా కొన్ని కోర్కెలను ప్రభుత్వం ముందుకు, ప్రజల ముందుకు తెచ్చి వాటి సాధనకై పోరాడుతూ ఉంది. సమాఖ్య నడిపిన నిరశన దీక్షా శిబిరాలలో ఈ డిమాండ్లను సమర్థిస్తూ అన్ని రాజకీయ పార్టీల నేతలూ పాల్గొని, ప్రసంగించినవారే. బుద్ధప్రసాద్ గారు అన్ని కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 2012 ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం సందర్భంగా సమాఖ్య జరిపిన నిరశన దీక్షా శిబిరంలో నాటి ప్రతిపక్ష నాయకులు, నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు పాల్గొని అన్ని డిమాండ్లను సమర్థించారు. ఆ రోజు శిబిరంలో బుద్ధప్రసాద్ గారూ, వామపక్ష నాయకులూ, భాజపా నాయకులూ పాల్గొన్నారు. అప్పటినుండి ప్రభుత్వం వెంటపడి విన్నపాలు ఇస్తున్నాం. ఏమీ ఫలితం లేకుండాపోయింది. తెలుగుకోసం ఏమీ చేయకుండా ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించడానికి మీకేం హక్కు ఉంది అని సమాఖ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఆగస్టు 29 లోగా కొన్ని డిమాండ్లనైనా ఆమోదించకపోతే ఉద్యమిస్తామని ప్రకటించింది. ఆగస్టు 29న గిడుగు జయంతిని రవీంద్రభారతి ప్రాంగణంలో ప్రభుత్వం ఘనంగా నిర్వహించ తలపెట్టింది. ఆ సందర్భంగా ప్రభుత్వం ఇవ్వజూపిన పురస్కారాలను ధర్మారావు గారూ, నేనూ, స.వెం. రమేశ్ మరికొందరు తిరస్కరించాం. ఆ సభలో సమాఖ్య కార్యకర్తలు నినాదాలు చేస్తూ, ధర్నా చేయడంతో మొదలైన నిరశన కార్యక్రమాలు ప్రపంచ మహాసభల వరకూ కొనసాగాయి.

మహాసభలకు మూడునాలుగు నెలల ముందుగా ప్రభుత్వం బుద్ధప్రసాద్‌గారిని అధికార భాషా సంఘం అధ్యక్షులుగా నియమించి ప్రపంచ మహాసభల నిర్వహణను ఆయన భుజస్కంధాల మీద పెట్టింది. ఆ

బాధ్యతను మరెవరికీ సాధ్యం కానంత గొప్పగా – అంత తక్కువ వ్యవధిలో నిర్వహించిన ఘనత బుద్ధప్రసాద్ గారికే దక్కుతుంది. ఆయనతోపాటు ఎంతో బాధ్యతను నిర్వహించిన పెద్దలున్నా బుద్ధప్రసాద్ గారిని అధికార భాషా సంఘం అధ్యక్షులుగా చేయడం వల్లే ప్రభుత్వానికి పరువు దక్కింది.

సమాఖ్యకు పెద్ద దిక్కయిన బుద్ధప్రసాద్ గారే అధికార భాషా సంఘం అధ్యక్షులైనా, సమాఖ్య డిమాండ్లకు ప్రభుత్వాన్నించి తగిన స్పందన లేకపోవడంతో సమాఖ్య పోరాటమార్గాన్నే చేపట్టింది. అదే సమయంలో సమాఖ్య అధ్యక్షుడిగా నేను, పెద్దలు సి. ఆంజనేయరెడ్డి, కె.వి. రమణాచారిగార్ల సహకారంతో వారితో కలిసి నాటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి గారిని అక్టోబరు 2 (గాంధీజయంతి) నాడు కలిసి తెలుగు భాషా రక్షణకు, అభివృద్ధికి కావలసిన డిమాండ్లను వారికి నివేదించి, కనీసం మూడు డిమాండ్లనైనా ఆమోదించి ప్రకటించాల్సిందిగా విజ్ఞప్తి చేశాం. దానికి వారెటువంటి సానుకూలత చూపలేదు. దానితో సమాఖ్య తన నిరసన కార్యక్రమాలను కొనసాగించింది. చివరకు ప్రపంచ మహాసభల తొలి రోజునే ముఖ్యమంత్రి గారి నోట కొన్ని వాగ్దానాలు వచ్చాయి. వాటిపై స్పందనలో కొన్ని సూచనలను, వాగ్దానాలు సభ తీర్మానాలుగా రావలసిన అవసరాన్నీ సమాఖ్య అదేరోజున లేఖలో ప్రభుత్వ దృష్టికి తెచ్చింది. ఆశించిన విధంగా మూడవ రోజున అధికార తీర్మానాలను బుద్ధప్రసాద్ గారే స్వయంగా ప్రతిపాదించి ఆమోదాన్ని పొందారు.

మండలి బుద్ధప్రసాద్ గారు ప్రభుత్వంలో ఉండి, అన్ని సంగతులను సమన్వయం చేసుకుంటూ రాజకీయవేత్తగానే గాక, రాజనీతిజ్ఞుడుగా విజ్ఞతతో వ్యవహరించి ప్రభుత్వాన్ని ఒప్పించబట్టే ఈ ఫలితాలు వచ్చాయి. ఇందుకు సమాఖ్య పోరాటం ప్రజాస్వామ్య పద్ధతిలో వారికి శక్తినిచ్చింది. బయటి నుండి సమాఖ్య, ప్రభుత్వం లోపలి నుండి బుద్ధప్రసాద్ గారూ లక్ష్యసిద్ధితో పనిచేయబట్టే ఫలితాలు వచ్చాయి.

కొన్ని లక్ష్యాలతో సాగిన ఉద్యమాన్ని ఆయన తన స్థానబలంతో సఫలం చేశారు. ఆయన అధికార భాషాసంఘం అధ్యక్షుడిగా లేకుంటే ఆ ఫలితాలు వచ్చేవి కావు. ఆ తర్వాత ఆ తీర్మానాలను అమలు చేయించడానికి ఆయన ముఖ్యమంత్రిగారి వెంటపడి అనేక జి.ఒ.లను రాబట్టారు. ఏడాది పొడవునా కార్యక్రమాలకు ఒక అద్భుతమైన అజెండాను ప్రభుత్వం చేత ఒప్పించారు. సభలు జరిగిన ఏడాదికి 31 డిసెంబరు 2013న వచ్చిన జి.ఒ.నెం.909 వల్ల జనవరి 1, 2014 నుండి తెలుగుభాష కొరక మంత్రిత్వశాఖ – సాంస్కృతికశాఖలో భాగంగా ఏర్పడింది. తర్వాత రెండు రాష్ట్రాలుగా విభజన అయినా, ఆ జి.ఒ. పుణ్యమా అని రెండుచోట్లా మంత్రిత్వశాఖలు ఏర్పడ్డాయి. సమాఖ్య పోరాటానికీ, బుద్ధప్రసాద్ గారికీ ఈ ఘనత దక్కుతుంది.

ప్రపంచ సభల విషయంలో తనతో కలిసి పనిచేయమని ఆయన నన్ను కోరారు. నేనే పోరాట మార్గం పట్టాను. 'ప్రపంచ సభల్లో తీర్మానాలను ప్రతిపాదిస్తే వాటిని కాదని ఎవరూ అనరు. అందరి ఆమోదం పొందిన తర్వాత అధికారభాషా సంఘం అధ్యక్షుడుగా నేను వాటిని ప్రభుత్వం ద్వారా అమలులోకి తెచ్చే కృషి చేస్తాను' అన్నారు. నాకూ ఆయన మీద నమ్మకం ఉంది కానీ అంతకంటే పోరాట మార్గాన్నిచేపట్టి, ఆయన మాటకు బలాన్నివ్వడం ద్వారా లక్ష్యాలను సాధించవచ్చుననే వ్యూహాన్ని చేపట్టాం.

ఆ ప్రభుత్వ జి.ఒ.లేమిటి? అవి అమలు జరిగినవా లేదా? అదంతా వేరే కథ. ఇక్కడ సందర్భం కాదు. మరొకచోట సందర్భం వచ్చినపుడు సమీక్ష చేయాల్సిన అంశం అది.

తెలుగు భాషా సాంస్కృతికోద్యమ నేతగా ఆయనను అందరూ గౌరవిస్తున్నారు. ఇందువల్ల ఆయన పైన నైతికంగా పెద్ద బాధ్యత ఉన్నది. సమైక్య ఆంధ్రప్రదేశ్ 60 ఏళ్ళకు పైగా పరిపాలనలో మన ప్రభుత్వాలు తమ భాషా విధానాన్ని ప్రకటించలేకపోయాయి. భాషా రక్షణపట్ల, అభివృద్ధిపట్ల శ్రద్ధ వహించకపోవడం కూడా రాష్ట్ర విభజనకు కారణమయింది.

ఇప్పుడైనా రెండు రాష్ట్రాల్లో స్పష్టమైన భాషావిధాన ప్రకటన జరగాలి. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంత వరకు ప్రభుత్వంపై ఈ విషయంలో ఒత్తిడి తేవలసిన నైతిక బాధ్యత శ్రీ బుద్ధప్రసాద్‌గారిపై ఉంది. ఇందుకు కావలసిన ప్రతిపాదనలన్నిటినీ ఇప్పటికే సమాఖ్య, కొందరు విశ్వవిద్యాలయ ఆచార్యులు బహిరంగంగా ప్రకటించి ఉన్నారు. వాటిని ఉపయోగించుకొని ప్రభుత్వానికి ఒక భాషావిధాన అవసరాన్ని తెలియజేయాలని మనవి చేస్తున్నాను.

చివరగా రెండు మాటలు : బుద్ధప్రసాద్ గారు వయసులో నాకంటే పదేళ్ళు చిన్నవారు. అయినా అనుభవంలోను, వ్యక్తిత్వంలోను, ఇతరత్రా ఏ విధంగా తీసుకొన్నా నా కంటే ఎంతో ఉన్నతులు. 17, 18 ఏళ్ళక్రితం వారు పరిచయమై, ఇరువురం కలిసి కృష్ణాజిల్లా శ్రీకాకుళంలో తెలుగు భాషోద్యమ సమాలోచనా శిబిరాన్ని నడిపినప్పటి నుండి ఆయనంటే నాకు సోదరభావం – గౌరవంతో నిండిన సోదరభావం. ఆయన నాపట్ల ఎప్పుడూ ఆదరంగానే ఉన్నారు. ప్రపంచ మహాసభల సందర్భంగా మామధ్య బాగా దూరం ఏర్పడ్డదని కొందరు అనుకున్నారు. అది తప్పు.

ఇప్పటికే చాలా వ్రాశాను. చెప్పడానికి చాలా సంగతులున్నాయి గానీ ఇప్పుడు కాదు.

2013 అక్టోబరు చివరి ఆదివారం నాడు బందరులో జరిగిన ఒక సభలో బుద్ధప్రసాద్ గారూ నేను పాల్గొనాలి. నాకు ఆరోగ్యం ఏమీ బాగుండలేదు. త్వరలోనే గుండెకు ఆపరేషన్ చేయించుకోవాలి. అయినా కారు తెప్పించుకొని బందరు వెళ్ళి వద్దామనుకున్నాను. చివరకు నమ్మకం పోయింది. రాలేనని ఫోన్ చేసి సమావేశకర్త, మిత్రుడు యుటిఎఫ్ వెంకటేశ్వరరావు గారికి చెప్పాను. అప్పటికే వచ్చి ఉన్న బుద్ధప్రసాద్‌గారికి తెలిసింది. ఆ మధ్యాహ్నమే నేను హైదరాబాద్‌కు వెళ్ళి ఆస్పత్రిలో చేరిపోయాను. ఆ మర్నాడే బుద్ధప్రసాద్ గారు అపోలోకు వచ్చేశారు. ఎంతో ధైర్యం చెప్పి వెళ్ళారు. మళ్ళీ ఆ మర్నాడు కూడా వచ్చి చాలా సేపు నాతో గడిపారు. వెళ్తూ వెళ్తూ క్రింది అంతస్తులో ఉన్న డా॥ దేమె రాజారెడ్డి గారికి నా గురించి జాగ్రత్త తీసుకోమని చెప్పి వెళ్ళారు. అంతేకాదు, మంత్రిత్వశాఖ జి.ఒ. త్వరలోనే వస్తుంది అని చెప్పి వెళ్ళారు. తనంతట తానే చొరవ తీసుకుని హాస్పిటల్ ఖర్చులో కొంత భాగాన్ని ప్రభుత్వం నుండి ఆర్థికంగా అందించారు కూడా.

బుద్ధప్రసాద్ గారు తొణకని నిండుకుండ. అందరితో స్నేహంగా ఉండాలని కోరుకుంటారు. ఎవరితోనూ సంఘర్షించే వైఖరి కాదు ఆయనది. రాజకీయవేత్తగా ఆయన ఆలోచనా విధానం అందరికీ అన్నివేళలా రుచికరంగా ఉండకపోవచ్చు. ఆయన తెలుగుదేశంలో చేరడాన్ని నేను సమర్థించాను. ఉన్న వ్యవస్థల ద్వారా సమాజానికి వీలైనంత మేలు చెయ్యాలనేది ఆయన విధానం. నిండు నూరేళ్ళు ఆయన ఆరోగ్యంగా, శక్తిమంతుడుగా ఉండాలని, మరింత పెద్ద నాయకుడుగా ఎదగాలని, తెలుగుజాతికి మరింతగా సేవ చేసేందుకు తగిన అధికారయుత పదవులను ఆయన అధిరోహించాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాను.

నిస్వార్థ నాయకుడు భాషా సేవకుడు

- డా. అమరేశం రాజేశ్వర శర్మ

మాన్యమిత్రులు శ్రీ మండలి బుద్ధప్రసాదుగారి షష్టిపూర్తి సమారోహ నిర్వహణమును గూర్చి విని చాలా ఆనందించినాను. వారితో నా అనుబంధము రెండు తరాలకు వ్యాపించినట్టిది. వారి జనకులు కీ.శే. మండలి వెంకట కృష్ణారావు గారు విద్యామంత్రిగా ఉండిన కాలమది. పరిశోధకులయిన తెలుగు పండితులు తమ ఆవిష్కారాలను గూర్చి ఆంగ్లంలో ప్రచురించని కారణంగా వారికి తగినంత కీర్తిరావడం లేదని భావించి, ఆంగ్లంలో రచనలు చేసేవిధంగా వారిని ప్రోత్సహించవలెననే సంకల్పంతో 'ఆంధ్రప్రదేశ్ ఓరియంటల్ కాన్ఫరెన్సు' ను ప్రారంభించడం జరిగింది. ఆ సందర్భంలో ఆచార్య సి. నారాయణరెడ్డి గారి నాయకత్వాన ఆ సంస్థకు ఆర్థిక సహాయాన్నందించవలసిందని మేము కొందరు విద్యామంత్రిగారి దర్శనం చేయగా వారు అప్పటికప్పుడు పాతికవేల రూపాయలను మంజూరు చేసినారు. అది నేను కృష్ణారావుగారిని మొదటిసారి దర్శించడం. మరో సందర్భంలో ఓరియంటల్ హైస్కూలు విద్యార్థులు సంస్కృత పాఠ్యగ్రంథములను గూర్చి బెజవాడ గోపాలరెడ్డి గారి ద్వారా వారి సాయము కోరవలసి వచ్చింది. విద్యామంత్రిగా ఉన్న కృష్ణారావుగారు విషయాన్ని అర్థం చేసికొన్నారు. వెంటనే ఒక కమిటీని నియమించినారు. ఆ కమిటీ కొత్త పద్ధతి పాఠ్యగ్రంథాన్ని సిద్ధం చేసింది. ప్రభుత్వమే ముద్రించవలసి వస్తే ఒక సంవత్సరం ఆలస్యమయ్యేటట్లున్నదని భావించి, ప్రాచ్య విద్యాపరిషత్తు ముద్రణ భారాన్ని స్వీకరించింది. మూడు నెలలలో కొత్త పాఠ్యపుస్తకాన్ని విద్యార్థులందుకొన్నారు. అదీ కృష్ణారావు గారి కార్యనిర్వహణ విధానము. వారు గాంధీ మార్గంలో దేశసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చి తమ పదవినందుకనుగుణంగా ఉపయోగించుకోవడానికే రెండు సందర్భాలు ఉదాహరణంగా నిలుస్తవని నా అభిప్రాయం. వారి మార్గంలోనే ప్రజాసేవను చేస్తూ నిరాడంబరంగా జీవిస్తున్న వారు మాన్యమిత్రులు శ్రీ మండలి బుద్ధప్రసాదుగారు.


తెలుగుభాషకు ప్రాచీన భాష హోదాకై కృషి జరుగుతున్నప్పుడు మొదటి సారిగా నేను బుద్ధప్రసాదుగారిని కలుసుకోవడం జరిగింది. వారు నన్ను ఆంధ్రభాష ప్రాచీనతకున్న సాక్ష్యాన్ని పొందుపరుస్తూ, ఒక వ్యాసం వ్రాసి ఇమ్మని నన్నడిగినారు. నేను శాతవాహనుల కంటే పూర్వకాలంలోనే ఆంధ్రదేశాన్ని పాలించిన ఆంధ్రవిష్ణువు అనుమతితో వ్రాయబడ్డ కాణ్వ వ్యాకరణ సూత్రాలతో పాటు, ఇతరాధారాలను గూర్చి వ్యాసం వ్రాసి వారికందించడం జరిగింది. ఆ పరిచయం అట్లా మొదలై దినదినాభివృద్ధిగా కొనసాగుతున్నది. వారూ నేనూ సమాన భావాలు కలవారం కావడం ఇందుకొక ముఖ్య కారణమని నేను భావిస్తున్నాను.

అవును. బుద్ధప్రసాదు గారు చాలామంది రాజకీయ నాయకుల వలె ఆంధ్రభాషాభివృద్ధికై మాటల్లోనే తప్ప చేతల్లో ఏ సాయమూ చేయనివారు కారు. చిత్తశుద్ధితో ఆంధ్రభాషాభివృద్ధికై కృషి చేస్తూ, ఆ రంగంలో ఉన్నవారందరితోనూ సద్భావంతో ఉన్నందువల్లనే, నాకు వారితో ఆత్మీయ బంధం బలపడింది.

ఈనాడు స్కూలు తరగతులలోగానీ కళాశాల స్థాయిలో గానీ తెలుగుకీయదగినంత ప్రాముఖ్యము లభించుట లేదనేది జగమెరిగిన సత్యము. పరిపాలకులు త్వరగా ఈ విషయములో తగిన శ్రద్ధ తీసికొని సరియైన విధాన నిర్ణయము చేయకపోతే, తెలుగు భాష కాలగర్భంలో కలిసిపోతుందనే వారి హెచ్చరిక సత్యమయ్యే ప్రమాదం పొంచి ఉన్నదని భావించవలసి వస్తున్నది.

చిత్రమేమంటే, ఒకవైపు తెలుగువారు అనేక కారణాల వలన ఈనాడు మనదేశంలో ఇతర రాష్ట్రాలలోను, ఇతర దేశాలు చాలావాటిల్లోను, జీవనం సాగిస్తున్నారు. వారి జీవికకు తెలుగు తోడ్పడడం లేదు. మరోవైపు కంప్యూటరు విజ్ఞానాభివృద్ధి కారణంగా ఇంగ్లీషు భాషా ప్రాముఖ్యం పెరిగి, ఇతర భాషలకు దెబ్బతగులుతున్నది. అందులోను తెలుగువారు పరభాషా వ్యామోహం ఎక్కువ కలవారు కావడం చారిత్రక సత్యంగా కానవస్తున్నది. ఇది సరియైన రీతిలో ఉపయోగపడితే, భాషాభివృద్ధికెంత మేలు చేస్తుందో, అంతే హానిని సరిగా ఉపయోగించుకోకపోతే కలిగించగలదు.

ఏ భాషలోనైనా ప్రాంతీయ వ్యవహారంలో అనేకములైన మాండలిక భేదాలేర్పడడం చాలా సహజమైన లక్షణం. వాటినన్నింటినీ స్వీకరిస్తూ, అన్ని మాండలికాలనూ ఆదరిస్తూ, భాషాభివృద్ధికి కృషి చేయవలసిన అవసరం ఈనాడు చాలా ముఖ్యమయినదిగా కానవస్తున్నది. ఇటువంటి కృషిలో బుద్ధప్రసాదుగారి వంటి నాయకుల అవసరం చాలా ఉన్నది. భగవంతుడు వారికా అవకాశమీయవలెననీ, ఆయన కృషి సఫలం కావాలనీ ఆశించడమే మావంటి వారు కోరేది. అస్తు.



కమ్యూనిస్టు నాయకులు శ్రీ చండ్ర రాజేశ్వరరావు, శ్రీ ముక్కామల నాగభూషణంలతో...

వారసత్వానికి అర్థం చెప్పిన వారసుడు

- అన్నపూర్ణపుత్ర డా. శివనాగిరెడ్డి

జూలై 1వ తేదీ, 1978లో నేను హైదరాబాదు అబిడ్స్ ప్రాంతం తిలక్‌రోడ్‌లో ఉన్న దేవాదాయ (దేవదేయ అనాలి), ధర్మాదాయ శాఖలో సహాయస్థపతిగా ఉద్యోగంలో చేరాను. అంతకు ముందు 15 రోజుల క్రితం ఇంటర్వ్యూకు హాజరైనపుడు, తిలక్‌రోడ్డులోనే ఉన్న విశ్వకర్మ భవన్ (హాస్టల్)లో బస చేశాను. ఆ రోజు ఆదివారం కావటాన ఇంటర్వ్యూకి ముందుగానే దేవాదాయశాఖకు చేరుకొన్నాను. అప్పటి కమీషనర్ పురుషోత్తమ నాయుడు, గణపతిస్థపతిగారు మమ్మల్ని ఇంటర్వ్యూ చేశారు. ఫలితాల కోసం, మరుసటిరోజు రమ్మన్నారు. ఖాళీగా ఉండే బదులు అలా తిరిగొద్దామని అబిడ్స్‌కు చేరుకున్నాను. బొగ్గులకుంట నుంచి బాటా షాపు దాకా, రోడ్డుకు రెండువైపులా పాతపుస్తకాలు వేల సంఖ్యలో కనిపించాయి. ఒక్కొక్క తెలుగు పుస్తకాన్ని శీర్షికతో పాటు నిశితంగా చూడటం మొదలుపెట్టాను. అన్నీ కావలసిన పుస్తకాలే. నేను చూచిన ప్రతి చోటా ఒకేరకమైన చిన్న సైజు పుస్తకాలు చాలానే ఉన్నాయి. ఏమిటా ఇవి అని పరిశీలించి చూస్తే, 1975లో మొదటి ప్రపంచ తెలుగు సభల సందర్భంగా ప్రచురించిన పుస్తకాలు. అప్పట్లో హైదరాబాదు నుంచి తెనాలికి ఆర్టీసీ బస్సులో 16 రూపాయల ఛార్జీ. ఆ రోజు, మరుసటిరోజూ భోజనాలకు, ఛార్జీలకు సరిపడా ఉంచుకోగా, మిగిలిన 20 రూపాయలతో పుస్తకాలు కొనాలి అని నిశ్చయించుకున్నాను. ముందుగా నేను తీసుకొన్నవి రెండు పుస్తకాలు. అవి, గడియారం రామకృష్ణశర్మ గారు రాసిన మన 'వాస్తుసంపద', డి. సోమేశ్వరరావుగారు రాసిన 'మన శిల్పసంపద'. ఒక్కో పుస్తకానికి రెండు రూపాయల చొప్పున చెల్లించాను. వాటిని చిన్నసైజులో, అందరికీ కావలసిన విషయాల్లో, రెండు రూపాయల అందుబాటు ధరకి అందించింది అప్పటి విద్యాశాఖామాత్యులు, గౌరవనీయులు శ్రీ మండలి వెంకటకృష్ణారావు గారు. అప్పటికి నాకు ఆ ఇద్దరు రచయితలూ తెలియరు. అయితే తిరుపతి శిల్పకళాశాలలో నేను నాలుగేళ్ళపాటు సంప్రదాయ వాస్తు శిల్పంలో శిక్షణ పొందేప్పుడు, అసలు పాఠ్యపుస్తకాలే లేవు. అందుచేత ఇవి తెలుగులో ఉండటాన కొన్నాను. తరువాత అదే సిరీస్‌లో మరికొన్ని 2 రూపాయల పుస్తకాలు కొనుక్కొన్నాను.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, ఆ పుస్తకాల్ని ముద్రింపజేసింది తెలుగు భాషాభిమాని, తెలుగు సంస్కృతిని పరిరక్షించాలని కంకణం కట్టుకొని, మొదటి ప్రపంచ తెలుగు సభలను నిర్వహించటానికి ప్రధాన కారకుడైన శ్రీ మండలి వెంటక కృష్ణారావు గారని తెలిసింది. దేశ విదేశాల్లోని తెలుగువారందరినీ, తెలుగు భాష సంస్కృతి రంగాల్లో విశేషకృషి సల్పిన ప్రముఖుల చేత పుస్తకాలు రచింపజేయించి, సభల సందర్భంగా వారందరినీ సముచితంగా సత్కరింపజేసి, చక్కటి సాంస్కృతిక సదస్సులు, ప్రదర్శనలను ఏర్పాటు చేసి, తెలుగు వంటకాల రుచి చూపించి, ఇకముందు తెలుగు భాషా సంస్కృతులు వెల్లివిరియటానికి హాజరైన ప్రతివారికే కాక, ప్రభుత్వానికి, వివిధ సాంస్కృతిక సంస్థలకు కర్తవ్యబోధ చేసి, స్ఫూర్తినందించిన మహనీయుడు మండలి వెంకట కృష్ణారావు గారని, అటు తరువాత గానీ, నాకు తెలియలేదు. నేను తిరుపతి శిల్పకళాశాలలో చదివేటప్పుడు అది 1975, ఆగస్టు నెల అన్నమాచార్య కళా మండప ప్రారంభోత్సవం జరిగింది. అప్పటి

దేవాదాయ శాఖామాత్యులు సాగి సూర్యనారాయణ రాజు గారు, ఆయనతో పాటు ప్రారంభోత్సవంలో మరో అతిథిగా విచ్చేసినవారు అప్పటి మంత్రివర్యులు మండలి వెంకట కృష్ణారావుగారు.

నేను 1978 జులై 1 నుంచి, 1981 ఆగస్టు 30 వరకూ, దేవాదాయ శాఖలో పనిచేసి, తరువాత రాష్ట్ర పురావస్తుశాఖలో సహాయ స్థపతిగా పనిచేశాను. 1996లో ఇప్పటికీ ఖచ్చితంగా 20 ఏళ్ళ క్రితం శ్రీ మండలి బుద్ధ ప్రసాద్‌గారు (మొదటిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైనపుడు) పురావస్తుశాఖకు వచ్చినపుడు డా॥ బి. సుబ్రహ్మణ్యం గారితో వారిని కలవటం జరిగింది. అదే వారితో నా మొదటి పరిచయం. ఆయన దివిసీమ దేవాలయాలు, శాసనాల గురించి పులిగడ్డ అక్విడెక్టు, అప్పటి లిఫ్ట్ ఇరిగేషన్ కట్టడాలు, బ్రిటిషు వారు అవనిగడ్డలో నిర్మించిన కోర్టు బిల్డింగ్, ఇరిగేషన్ బిల్డింగ్‌ల గురించి ప్రసంగించారు.

వారసత్వ కట్టడాలు, చరిత్ర శాసనాలు, దేవాలయాలు, వాటి పరిరక్షణ పట్ల ఆయనకెంత మక్కువ ఉందో తెలుసుకొన్న నాకు ఆశ్చర్యమేసింది. ఒక రాజకీయ నాయకునికి చరిత్ర పట్ల ఇంత మమకారం, సంస్కృతి పట్ల ఇంత ఆసక్తి ఉండటం నను మరింత ఆశ్చర్యపరిచింది. అటు తరువాత నాలుగైదుసార్లు పురావస్తుశాఖకు వచ్చినపుడల్లా నేను వారిని కలిశాను. అలా ప్రారంభమైంది తెలుగును, తెలుగువారిని, వారెక్కడున్నా వారి ఆచార వ్యవహారాలను గురించి పట్టించుకొని, వాటి పరిరక్షణ కోసం నిరంతరం పాటుపడే వ్యక్తిగా, శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారితో.

1986లో ఒకసారి ఉస్మానియా విశ్వవిద్యాలయ పురావస్తు, చరిత్ర, సంస్కృతి శాఖలో లెక్చరర్‌గా పనిచేస్తున్న అవధానుల విజయకుమార్ బాబు, నన్ను అవనిగడ్డకు తీసుకెళ్ళారు. విజయ్‌కుమార్ బాబు, నేను, చీమకుర్తి శేషగిరి రావుగారు నడిపించిన తెలుగు గోష్ఠిలో సభ్యులం. విజయ్‌కుమార్ బాబు, భావనారాయణ స్వామి దేవాలయాలపై పరిశోధన చేస్తున్నారు. అన్ని భావనారాయణ స్వామి దేవాలయాల ప్లానులు గీయాలని నన్ను, సర్పవరం, అవనిగడ్డ, పొన్నూరు, బాపట్ల తిప్పారు. దివి తాలూకాలోని భావదేవరపల్లి లోని భావనారాయణ స్వామి దేవాలయానికి వెళ్ళటానికి ఇద్దరమూ అవనిగడ్డ చేరుకొన్నాం. అయితే, ఇంతలో ఒక యువకుడు బయటికొచ్చి, "నాన్నగారు లేరండి, రండి, కూర్చోండి. భోజనం చేసి వెళ్దురు గాని" అన్నాడు. "థాంక్సండీ, మేం భోజనం చేశాం. భావదేవరపల్లి వెళ్ళాలి. అక్కడి గుడి గురించి తెలుసుకోవాలి. అక్కడ ఎవరైనా పరిచయస్తులుంటే వెంకటకృష్ణారావు గారిని వారితో ఒకమాట చెప్పించుకొందామని వచ్చామండి" అని విజయకుమార్‌బాబు బదులిచ్చారు. నేను వాళ్ళబ్బాయి బుద్ధప్రసాద్‌ని. మీరు భావదేవరపల్లిలో అర్జునరావుగారుంటారు. వారిని కలవండి. నాన్నగారి పేరు చెబితే ఆయన మిమ్మల్ని గుడికి తీసుకెళ్తారు" అని చెప్పారు. తరువాత మేమిద్దరమూ నాగాయలంక వెళ్ళి అక్కడినుంచి భావదేవరపల్లి వెళ్ళి, అర్జునరావుగారి సహాయంతో పని ముగించుకొని పడవపై రేపల్లె వైపు వెళ్ళి పొన్నూరు, బాపట్ల దేవాలయాల ప్లానులు గీసుకొన్నాం. ఇదంతా నాకు బుద్ధప్రసాద్‌గారు మా ఆఫీస్‌కు వచ్చినపుడు గుర్తొచ్చి ఆయనతో చెప్పాను.

అటు తరువాత ఆయన మా ఆఫీసుకు వచ్చిపుడల్లా బి. సుబ్రహ్మణ్యం (ఆయన ఇపుడు లేరు) గారినీ, నన్నూ పిలిపించుకొని దివిసీమలోని పురాతన స్థలాలు, చారిత్రక కట్టడాలపైనే మాట్లాడేవారు. ఇంతలో 2002లో దివిసీమకు ఉప్పెన వచ్చి 25 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా, అవనిగడ్డలో మండలి వెంకట కృష్ణారావుగారు స్థాపించిన గాంధీ క్షేత్రంలో ఒక సదస్సు నిర్వహించారు. దానికి నన్ను, ఉప్పెన వచ్చినపుడు

కృష్ణాజిల్లా ఎస్పీగా పనిచేసిన శ్రీ సంబటూరి వీరనారాయణ రెడ్డి గారినీ ఆహ్వానించారు. ఉప్పెన వచ్చినపుడు కృష్ణారావుగారితో పాటు వీరనారాయణ రెడ్డి గారు కూడా రంగంలోకి దిగి సొర్లగొంది గ్రామాన్ని పునర్నిర్మించటానికి కృషి చేశారు. అప్పటికి చిన్నవాడైన బుద్ధప్రసాద్ శవాల గుట్టల పక్కనే నడుచుకొంటూ దివిసీమవాసుల్ని ఆదుకోవటంలో కూడా పాల్గొనటాన్ని పత్రికలు కొనియాడాయి.

2002లోనే కృష్ణా ఉత్సవాలలో భాగంగా, అవనిగడ్డ జిల్లా పరిషత్ స్కూల్లో దివిసీమ మహోత్సవాలను జరిపించాలని, అప్పటి పర్యాటక కార్యదర్శి చందనా ఖాన్ గారిని ఒప్పించి, ఘనంగా జరిపించారు బుద్ధప్రసాద్‌గారు. అనేక ప్రభుత్వ స్టాళ్ళు ఏర్పాటు చేసిన ఆయన రాష్ట్రంలోని బౌద్ధ స్థలాలు, కట్టడాలు, శిల్పాలపై కూడా ఒక ప్రత్యేక ప్రదర్శన ఉంటే బాగుంటుందన్న ఆయన కోరిక వల్ల నేను, డా॥ బి. సుబ్రహ్మణ్యం గారు కలిసి ఆ ప్రదర్శనను ఏర్పాటు చేశాము.

మరల 2004లో దివిసీమ ఉత్సవాలు జరిపినపుడు అప్పటి పురావస్తు శాఖ డైరెక్టర్ కేదారేశ్వరి గారితో బుద్ధప్రసాద్‌గారు, అక్విడెక్టు 1904లో నిర్మించిందనీ, అలానే స్థానిక లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం క్రీ.శ. 10వ శతాబ్దినాటి దేవాలయమనే, ఈ రెండింటినీ రక్షిత కట్టడాలుగా ప్రకటించి, పరిరక్షించాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. దివిసీమలోని హంసలదీవి, సంగమ ప్రదేశాలను, అక్విడెక్టుతో పాటు అప్పటి లిఫ్టు ఇరిగేషన్ స్కీమ్ (తెలుగు నేలపై బ్రిటిషువారు నిర్మించిన మొదటి లిఫ్టు స్కీమ్)ను బ్రిటిషువారు కట్టిన వారసత్వ కట్టడాలైన కోర్టు బిల్డింగు, ఇరిగేషన్ ఆఫీసు బిల్డింగ్‌లను కూడా ఆయన మరమ్మత్తు చేయాలన్నారు.

కృష్ణాజిల్లా, సిరివాడకు చెందిన రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టరుగా పనిచేసి, పురాతన స్థలాలు, చారిత్రక కట్టడాల పరిరక్షణ, కొత్త మ్యూజియాల ఏర్పాటుకు ఎనలేని కృషి చేసిన, డా॥ పి.వి. కృష్ణశాస్త్రి గారంటే బుద్ధప్రసాద్ గారికి ఎంతో గౌరవం. దివిసీమ చరిత్ర సభలకు ఆయనను ఆహ్వానించి, దివిసీమతో పాటు డెల్టా ప్రాంతంలో తాండవమాడిన కరువుల చరిత్రను రాయించారు. అలాగే మరో పురావస్తు శాస్త్రవేత్త ప్రొ. ఎంఎల్.కె. మూర్తి గారిని ఆహ్వానించి దివిసీమలోని నాగాయలంక పరిసరాల్లో చేపలు పట్టేవారి స్థితిగతులపై ఒక అధ్యయనాన్ని చేయించి, దివిసీమలో ఇప్పటికీ కొనసాగుతున్న అలనాటి జీవన విధానాన్ని నమోదు చేయించారు.

బుద్ధప్రసాద్ గారికి తెలుగు సంస్కృతిలో భాగాలైన సాహిత్యం, సంగీతం, శిల్పం, జానపద కళలు, దేవాలయాలు, బౌద్ధ స్థావరాలు, సంప్రదాయ వంటలు, ముగ్గులు మొదలైన అనేక అంశాలపై ఆసక్తి ఉంది. అంతేకాదు, ఆయా రంగాల్లోని ప్రముఖులను ఆయన వ్యక్తిగతంగా కలుసుకొని, వీలైనపుడల్లా అవనిగడ్డ గాంధీక్షేత్రానికి రప్పించి, దివిసీమ అందాలను, హంసలదీవి, సముద్ర తీర సౌందర్యాన్ని చూపించేవారు. అంతెందుకు, దివిసీమలో పుట్టి, దేశవిదేశాల్లో స్థిరపడిన అనేక మంది ప్రముఖులను దివిసీమకు రప్పించి, వారిని సముచితంగా సత్కరించి పంపేవారు.

అన్ని రంగాల కంటే బుద్ధప్రసాద్‌గారికి చరిత్ర–సంస్కృతి అంటే మక్కువ ఎక్కువ. శాసనసభ్యులుగా ఉన్నప్పుడూ, లేనప్పుడూ, మంత్రివర్యులుగా కొనసాగుతున్నప్పుడూ వీలు చిక్కినప్పుడల్లా ఆయన హైదరాబాదులోని పురావస్తు శాఖలను, కేంద్ర, రాష్ట్ర, ప్రాచ్యలిఖిత గ్రంథాలయం, పరిశోధనా సంస్థనూ, స్టేట్

ఆర్కైవ్స్‌ను, అసెంబ్లీలోని గ్రంథాలయాన్ని (వావిలా గోపాలకృష్ణయ్యగారి తరువాత, ఎక్కువసార్లు అసెంబ్లీ గ్రంథాలయాన్ని సందర్శించిన ఘనత దక్కించుకున్నారు) ఇంకా ప్రముఖ చరిత్రకారులైన డా॥ వివి. కృష్ణశాస్త్రి, సర్వశ్రీ పి.వి. పరబ్రహ్మశాస్త్రి, వకుళాభరణం రామకృష్ణ, ఐ.కె. శర్మ, ప్రొ. ఎం.ఎల్‌కే. మూర్తి గారిని వారి ఇంటికెళ్ళి పరామర్శించి చరిత్ర, శాసనాలపై చర్చించేవారు.

ఈ క్రమంలోనే బుద్ధప్రసాద్ గారికి కేంద్ర పురావస్తుశాఖ హైదరాబాదు సర్కిల్ సూపరింటెండింగ్ ఆర్కియోలజిస్టుగా పనిచేస్తున్న తెలుగువాడైన జితేంద్ర దాస్ గారిని పరిచయం చేసుకొని దివిసీమకు ఆహ్వానించారు. స్వయంగా వెంట ఉండి మచిలీపట్నం ఫోర్టు, బందరు పోర్టు, డచ్, ఇంగ్లీషువారి వారసత్వ కట్టడాలు, ఘంటసాల బౌద్ధ స్థూపం, దివిసీమలోని చారిత్రక ప్రదేశాలను చూపించారు. క్రీ.పూ. 2వ శతాబ్దం నుంచి క్రీ.శ. 15వ శతాబ్దం దాకా ఒక అంతర్జాతీయ రేవు పట్టణంగానే కాక, బౌద్ధస్థూపం, జలధీశ్వర స్వామి దేవాలయాలను, శ్రీకృష్ణదేవరాయలు సందర్శించి, ఆముక్తమాల్యద రచనకు శ్రీకారం చుట్టిన శ్రీకాకుళం దేవాలయాన్నీ, ఇంకా యార్లగడ్డ, హంసలదీవి, గణపేశ్వరం, లాంటి చారిత్రక దేవాలయాలను చూపించిన వాటిని పరిరక్షించమని విన్నవించారు.

అంతే, కథ ఇక కొత్తమలుపు తిరిగింది ఎప్పుడో 1870లో బాస్వెస్ గుర్తించి, 1904లో అలెగ్జాండర్ రీ తవ్వకాలు జరిపిన ఘంటసాల మహాస్థూపానికి మహర్దశ పట్టింది. బుద్ధప్రసాద్‌గారి విన్నపాన్ని, ఆదేశంగా స్వీకరించిన జితేంద్రదాస్ గారు, మట్టిదిబ్బలా ఉన్న స్థూపాన్ని తవ్వటం మొదలుపెట్టారు. ఒక్కొక్క ఇటుకరాయి వరుస చొప్పున బయటపడుతూ, చక్రాకార స్థూపం, చుట్టూ నాలుగు ఆయత వేదికలు, ప్రదక్షిణాపథం వెలుగుచూసింది. అప్పటివరకూ లంజదిబ్బగా పిలువబడిన దిబ్బ దివ్యమైన బౌద్ధస్థూపంగా కనబడుతూ, గ్రామ ప్రజలకే కాక ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే బయటపడిన శిథిల భాగాలను పునరుద్ధరించే పనిని, శిల్పాలను పదిలపరిచే పనిని కూడా జితేంద్ర దాస్‌గారు చేపట్టి, ఘంటసాలను ఒక పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దారు. అంతేకాదు, ఎప్పట్నించో గ్రామ ప్రజల నోట్లో నానుతున్న మ్యూజియం కావాలన్న కోరిక కూడా బుద్ధప్రసాద్ గారి ద్వారా తీరింది. కొన్ని దశాబ్దాలుగా స్థూపం చుట్టుపక్కలా ఘోటకం దిబ్బ దగ్గర, గ్రామంలోని జలధీశ్వరాలయం దగ్గర, బయల్పడిన గ్రామస్థుల ఇళ్ళలో ఉన్న అనేక అపురూప బౌద్ధ శిలాఫలకాలు, శాసన స్తంభాలను పై మ్యూజియంలో భద్రపరిచారు. ఇదిగో ఈ సందర్భంలోనే గ్రామంలో ఒక సంఘటన జరిగింది. మ్యూజియంలో నిలబెట్టటానికి స్థూపం దగ్గర దొరికిన తలలేని ఒక బుద్ధుని విగ్రహాన్ని అక్కడ ఉంచగా, ఒకనాటి రాత్రి దొంగలుపడి, ఆ బుద్ధ విగ్రహాన్ని దొంగిలించి, ఎక్కడికో తరలించుకుపోయారు. ఖంగుతిన్న గ్రామస్థులు తమ ఇళ్ళల్లో సొత్తు పోయినంతగా బాధపడి, ఆ విషయాల్ని గొర్రెపాటి రామకృష్ణ గారి ద్వారా బుద్ధప్రసాద్ గారికి తెలియజేశారు. చరిత్ర, సంస్కృతి, శిల్పాలు, శాసనాలను ప్రాణం కంటే మిన్నగా చూచుకొనే బుద్ధప్రసాద్ గారు ఖిన్నుడైపోయారు. తన ఇంట్లో ఒక వ్యక్తి తప్పిపోయిన దాని కంటే ఎక్కువ బాధపడి, ఉన్నఫళంగా ఘంటసాల చేరుకొన్నారు. స్థానిక పోలీస్ స్టేషనుకెళ్ళి, జరిగిన సంగతి చెప్పి, ఎలాగైనా ఆ బుద్ధుని బొమ్మను తిరిగి రాబట్టాలని ఎస్సైకి చెప్పారు. రెండు నిముషాల్లో ఎస్సై, దొంగిలించబడిన బుద్ధుని విగ్రహం ఫొటో బుద్ధప్రసాద్ గారికి చూపిస్తూ, “అయ్యా – తల లేని ఈ బొమ్మ బట్టలుతకటానికి తప్ప దేనికీ పనికిరాదు. అయినా మీరు (ఎం.ఎల్.ఏ) వచ్చారు గాబట్టి మా ప్రయత్నాలు మేము చేస్తాం” అని జవాబిచ్చాడు. సంతృప్తి చెందని బుద్ధప్రసాద్ గారు, అప్పటి కృష్ణాజిల్లా ఎస్పీ

సీ.వీ. ఆనంద్ గారిని కలసి జరిగిన సంగతి చెప్పగా, ఆయన ఘంటసాలకు వచ్చి చర్యలు తీసుకోవటం ప్రారంభించగానే ట్రాన్స్‌ఫర్ అయి వెళ్లిపోయారు. ఆయన స్థానంలో వచ్చిన కొత్త ఎస్పీ సందీప్ శాండిల్య గారిని కలిశారు బుద్ధప్రసాద్ గారు. ఆయనతో పోయిన విగ్రహం చాల విలువైందనీ, ఘంటసాల చరిత్రకు ప్రత్యక్షసాక్ష్యమనీ, దాన్ని ఎలాగైనా దొరకబుచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. రంగంలోకి దిగిన శాండిల్య ముందుగా మ్యూజియం వాచ్‌మన్‌ను తనదైన శైలిలో విచారించగా, దొంగతనంలో పాల్గొన్న వ్యక్తుల ఆచూకీ చూచాయగా ఇచ్చాడు. వేట ముమ్మరమైంది. ఒక రోజు బుద్ధప్రసాద్ గారు మా ఆఫీసు (పురావస్తుశాఖ) కొచ్చి విగ్రహం జాడ తెలియటం లేదు. ఒకసారి ఆంజనేయరెడ్డి గారితో చెబుదామన్నారు. అప్పుడు రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ఉన్న ఆయన దగ్గరకు ఇద్దరం వెళ్ళాం. జరిగిందంతా ఆయనకు చెప్పగానే ఆయన కొంతమంది విజిలెన్స్ పోలీసులకు ఫోన్లో ఈ విషయాన్ని చెప్పి, నిఘా పెంచమన్నారు. ఈలోపు ఒక ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. దొంగల్లో ఒకర్ని పట్టుకొని విచారించగా, చెన్నైలోని అంతర్జాతీయ స్మగ్లర్ల ముఠా తమకు డబ్బు ఆశ చూపి, ఈ పనికి పురమాయించిందని చెప్పాడు. దొంగ ఇచ్చిన ఆచూకీతో, మిగతా వారిని కూడా అదుపులోకి తీసుకొని విచారించగా కొత్త విషయం బయల్పడింది. శాతవాహన, ఇక్ష్వాకుల కాలం నాటి బౌద్ధ శిలా ఫలకాలకూ, బుద్ధుని విగ్రహాలకు విదేశాల్లో గిరాకీ ఉందనీ, తమకు పెద్ద మొత్తంలో ఆశచూపారన్నారు. దొంగల్లో గుబులు పుట్టింది. ఎవరి కోసమో ఈ విలువైన విగ్రహాన్ని ఇవ్వటమేమిటి; మనమే అమ్ముకొంటే మొత్తం డబ్బు తమకే దక్కుతుందని భావించి, చెన్నై బృందాన్నికి ఆ విగ్రహాన్నివ్వకుండా తామే విదేశాలకు పంపటానికి, చెన్నైలోని మరో స్మగ్లర్ల ముఠాకు చేరవేయటానికి నాగార్జున సాగరు ద్వారా తరలిస్తుండగా, పోలీసు కార్డన్ సెర్చిలో భాగంగా, మాచర్ల పోలీసులు ఈ విగ్రహాన్ని స్వాధీనం చేసుకొని, కృష్ణా ఎస్పీగారికి తెలియజేశారు. ఇన్ని నాళ్ళూ, ఆ విగ్రహం (దొంగిలించిన దగ్గర నుంచి చెన్నైకి తరలించే దాకా) హైదరాబాదులో బుద్ధప్రసాద్‌గారుండే మధురానగర్ ప్రక్కనే ఉన్న సంజీవ్‌రెడ్డినగర్‌లో ఒక ఇంట్లో ఉందన్న సంగతి తెలిసి బుద్ధప్రసాద్ గారు ఒకింత ఆశ్చర్యానికి గురైనారు. తన నియోజకవర్గంలో దొంగతనానికి గురై హైదరాబాదులోని తన నివాసానికి చేరువలో ఇంతకాలం ఆ బుద్ధుని బొమ్మను దాచి ఉంచడం, ఆయన్ను ఒక రకంగా నిమ్మళ పరిచింది. తన ప్రాంతం విగ్రహం తనకు సమీపంలోనే భద్రంగా (అయితే దొంగల దగ్గర తీరం దాటకుండా) ఉన్నందుకు ఒక రకంగా సంతోషించారు. అటు తరువాత విచారణ పూర్తై, ఆ విగ్రహాన్ని ఘంటసాల చేర్చేంత వరకూ బుద్ధ ప్రసాద్ గారు ప్రతిక్షణం పాటు పడ్డారు. దొరికిందన్న ఆనందతో ఉన్న గ్రామస్థుల కళ్లలో కాంతులు చూచి, ఆయన కూడా మరింత ఆనందపడ్డారు,

నియోజక వర్గ ప్రజల బాగోగులు, రాజకీయాలు చూచుకొంటూనే మళ్ళీ పురాతన కట్టడాల పరిరక్షణకు పూనుకొన్నారు. అవనిగడ్డలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం ఎంతో పురాతనమైందనీ, అలాగే లిఫ్ట్ ఇరిగేషన్ కట్టడం కూడా వారసత్వపరంగా ప్రాముఖ్యం సంతరించుకొందని, ఈ రెండు కట్టడాలనూ, పరిరక్షించటానికి చర్యలు తీసుకోమని ఎన్నోసార్లు పురావస్తు శాఖను కోరి, కోరి విసిగి పోయారు. 2010లో ప్రొ. పి. చెన్నారెడ్డి డైరెక్టర్‌గా ఉన్నప్పుడు, నాకు విజయవాడ కార్యాలయంలో ఖాళీగా ఉన్న సహాయ సంచాలకుల పోస్టు అదనపు బాధ్యతలనిచ్చారు. నేను 2010 డిసెంబరు నుంచి 2011 మే నెల వరకూ విజయవాడలో పనిచేసినపుడు, ఈ రెండు కట్టడాల చారిత్రక నేపథ్యాన్ని, రక్షిత కట్టడాలుగా ప్రకటించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ, డైరెక్టర్ గారికి లేఖ రాసి, ఆ ప్రతిపాదనలు తెలియజేశాను. ఆయన సెక్రెటరీ గారిని

కలిసి వాటిని రక్షిత కట్టడాలుగా ప్రకటిస్తూ జీవోలు జారీ చేయటం, గెజెట్‌లో ప్రకటించటం చకచకా జరిగిపోయాయి. ఇదంతా నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు జరగటం ఎంతో సంతోషంగా ఉంది.

రక్షిత కట్టడాలుగా ప్రకటించటం పూర్తైంది. ఇంతలో నేను హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లాను. మళ్ళీ ఒకసారి బుద్ధప్రసాద్ గారు, మా ఆఫీసుకొచ్చి చెన్నారెడ్డి గారిని కలిసి ఈ రెండు కట్టడాలను మెరుగు పరచాలని విజ్ఞప్తి చేయగా, ఆయన, నేను, డా. బి. సుబ్రహ్మణ్యం కలిసి అవనిగడ్డకు చేరుకొన్నాం. నేను ఆలయం, లిఫ్ట్‌ఇరిగేషన్ కట్టడాల ప్లాన్లు, కొలతలు తీసుకొని కావలసిన మరమ్మతులతో పాటు, సుందర తీరంగా తీర్చిదిద్దటానికి ఒక అంచనా తయారు చేశాను. 13వ ఆర్థిక సంఘం నిధుల నుంచి చెన్నారెడ్డి గారి చేత లక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి 50 లక్షలు, లిఫ్ట్‌ఇరిగేషన్ కట్టడానికి 25 లక్షల రూపాయలు, మలి విడత మరో 25 లక్షలు, మొత్తం కలిపి కోటి రూపాయల్ని శాంక్షను చేయించి, వాటిని పదిలపరచటమే కాక పర్యాటక స్థావరాలుగా మార్చి, అవనిగడ్డ రుణం తీర్చుకొన్నారు బుద్ధ ప్రసాద్ గారు.

ఇంతటితో ఊరుకొన్నారా అంటే అదీ లేదు. ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ వార్షిక సభ అవనిగడ్డలో జరపాలి అని నిర్ణయించుకొని ఈ సంస్థ గౌరవాధ్యక్షులు ప్రొ. వకుళాభరణం రామకృష్ణ గారిని ఒప్పించి, 2012వ సం॥లో అవనిగడ్డలో జరిపించి అనేక మంది చరిత్ర కారులను రప్పించి, అద్వితీయమైన, అతిథి మర్యాదలతో సభలను జరిపించి, వచ్చిన వారికి స్థానిక కట్టడాలతో పాటు దివిసీమ గ్రంథాన్ని, హంసల దీవి దేవాలయం సాగర సంగమాన్ని దర్శింపజేసి, ఆయన తరించిపోయారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ గారిని ప్రత్యేకంగా ఈ చరిత్ర సభలకు ఆహ్వానించారు.

కృష్ణదేవరాయల గురించి చదవటమే గానీ, చూడలేకపోయాను. కృష్ణదేవరాయలు పరిపాలనా వ్యవహారాలను తిమ్మరుసు ద్వారా చక్కబెడుతూ, ఎక్కువ సమయాన్ని సాహిత్యం, కళలు, దేవాలయాల అభివృద్ధికీ, మొత్తంగా మన సంస్కృతిపట్ల మమకారంతో విద్వద్గోష్ఠులతో, కవి సమ్మేళనాలతో, నాట్య ప్రదర్శనలను తిలకించటంతో హంపి–విజయనగరంలోనూ, యుద్ధ సమయాల్లో సైనిక స్కంధావారాల్లోనూ ఉల్లాసంగా కాలం గడిపేవాడు. అలాగే దివిసీమ ముద్దుబిడ్డ, అవనిగడ్డ కృష్ణదేవరాయలుగా కీర్తించబడిన మండలి బుద్ధప్రసాద్‌గారు, డా. పాలపర్తి శ్యామలానంద్ ప్రసాదు, గుడిసేవ విష్ణు ప్రసాద్, జొన్నవిత్తుల, పువ్వాడ తిక్క సోమయాజి లాంటి కవులు, కొలకలూరి ఇనాక్, గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభ రావు, వేదాంతం రాజగోపాల చక్రవర్తి, ప్రొ. గంగప్ప, ప్రొ. యార్లగడ్డ బాలగంగాధరరావు లాంటి సాహితీమూర్తులతోనూ, ప్రొ. వకుళాభరణం, డా. వి.వి. కృష్ణ శాస్త్రి. డా. బి. సుబ్రహ్మణ్యం, డా. ఈమని శివనాగిరెడ్డి, ప్రొ. సుందర రామశాస్త్రి లాంటి చరిత్రకారులతోను, వేదాంతం రామలింగేశ్వర శాస్త్రి, పసుమర్తి కేశవప్రసాదు, రాధేశ్యాం లాంటి కూచిపూడి నాట్యాచార్యులతోను, వేటూరి సుందరరామమూర్తి, తనికెళ్ళ భరణి లాంటి సినీరచయితలతోనూ, ఒకరేమిటి పాత్రికేయులు, జానపద కళాకారులతో పరివేష్టితుడైన, మహామానవీయుడుగా పేరొందిన మండలి వెంకటకృష్ణారావుగారి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న అటు తండ్రి గారికే కాక, దివిసీమకే వన్నె తెచ్చిన బుద్ధప్రసాద్ నాకు పరిచయం కావటం నా అదృష్టంగా భావిస్తున్నాను.

తెలుగు భాషా సాంస్కృతిక సేవా సైనికుడు

- ఉప్పులూరి మల్లికార్జునశర్మ

ఆయన ఉంటున్నది రాజకీయం రంగం, అయినా తెలుగు భాషాసేవ మరువలేదు. తెలుగు సంస్కృతిని విడనాడలేదు. గాంధీ సిద్ధాంతాలకు దూరం కాలేదు. తెలుగు కళామతల్లి సేవను మానలేదు. అన్ని పార్టీల వారి అభిమానానికి దూరం కాలేదు. సామాజిక సేవారంగాలలో తన శక్తికి మించిన సేవ చేస్తూ అందరి మన్ననలు చూరగొంటున్న బహు కొద్దిమంది రాజకీయనాయకులలో శ్రీ మండలి బుద్ధ ప్రసాద్ ఒకరు.

ప్రముఖ గాంధేయవాది, సర్వోదయ నాయకుడు, తెలుగు జాతి సమైక్యతా రథానికి చుక్కాని పట్టిన యోధుడు, ఆంధ్రప్రదేశ్ విద్యాసాంస్కృతిక వ్యవహారాల మంత్రిగా తెలుగు సంస్కృతీ వైభవాన్ని ప్రపంచ నలుదిశలకు వ్యాపింప చేసిన భాషాభిమాని, నిరాడంబరుడు కీ.శే. మండలి వెంకట కృష్ణారావుగారి తనయుడుగా తండ్రిగారి అడుగుజాడలలో చిన్ననాటి నుండి ప్రయాణం చేస్తూ, ఈ 60 సంవత్సరాలలో అనేకమంది పెద్దల ఆశీస్సులు పొందిన అదృష్టవంతుడు శ్రీ బుద్ధప్రసాద్.

ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న రోజులలోనే బాలబాలికలనందరిని సంఘటితపరచి బాలసంఘాలను ఏర్పరచి వారు భావిభారత పౌరులుగా తయారు కావటానికి, దేశభక్తి, సమాజసేవ వారికి నూరిపోసిన బాలనాయకుడు బుద్ధప్రసాద్. తన తల్లిదండ్రుల ఆలోచనావిధానాలను తన జీవితానికి మలుచుకుని, ముఖ్యంగా జాతిపిత గాంధీ మహాత్ముని సిద్ధాంతాలను ఆకళింపు చేసుకుని, ఆనాటి నుండి ఈనాటి వరకు అమలు చేయటానికి ప్రయత్నిస్తున్న, నైతిక విలువలు కల్గిన వారు శ్రీ బుద్ధప్రసాద్.

తండ్రి ప్రారంభించిన అవనిగడ్డలోని గాంధీక్షేత్రంలో తర్ఫీదు పొంది ఆ క్షేత్రానికి వచ్చే ఆనాటి పెద్దలందరికి అంటే రాజకీయ నాయకులు, కవులు, గాయకులు, కళాకారులు, సామాజిక సేవాతత్పరులు, సర్వోదయవాదులు మొదలైన వారికి సేవలుచేసి, వారి ఆశీస్సులు పొంది, ఉద్యోగాలకు, వ్యాపారాలకు వెంపరలాడకుండా సమాజసేవకే అంకితమైన శ్రీ బుద్ధప్రసాద్ లాంటి వ్యక్తులు కొద్దిమందే ఉంటారని నా అభిప్రాయం.

శ్రీ బుద్ధప్రసాద్ పేరుకు తగ్గట్టుగానే అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ, చిరునవ్వులు చిందిస్తూ, కరుణతో చూస్తూ, తన చేతనయిన సహాయం చేస్తూ, అందరికీ తలలో నాలుకగా మెలుగుతూ అందరి హృదయాలకూ సంతృప్తిని పంచిపెట్టే స్వభావం అందరికీ అలవడటం కష్టం, అందులో రాజకీయ రంగంలో ఉన్న వారికి మరీ కష్టం. ఇటువంటి కష్టతరమైన జీవితాన్ని తాను ఎంచుకుని, పెద్దల, పిన్నల మన్ననలు పొందటం శ్రీ బుద్ధ ప్రసాద్‌కే చెల్లింది.

నా రాజకీయ గురువులు శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారితో నాకు 60 ఏళ్ళ పై చిలుకు పరిచయం. మా నాయన గారు, స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ ఉప్పులూరి రామశాస్త్రి గారంటే శ్రీకృష్ణారావు

గారికి అమిత గౌరవం. నా చిన్నతనంలోనే మా నాయన గారితో పాటు దివిసీమ, గాంధీక్షేత్రానికి వెడుతూ ఉండేవాడిని. శ్రీ కృష్ణారావు గారి నిరాడంబరత్వం, చిరునవ్వులొలికే ఆయన ముఖ వర్చస్సు, ఆయన ఖద్దరు వస్త్రధారణ, సేవా కార్యక్రమాలు, దివిసీమకు వారు చేస్తున్న సేవలు, భారత జాతీయ కాంగ్రెస్ నాయకులుగా వారు చేస్తున్న సేవలు నన్ను ఆకర్షించాయి. అప్పటి నుండి నేను వారితో ఎక్కువ సన్నిహితంగా ఉండేవాడిని. ఆ రోజులలో శ్రీ బుద్ధప్రసాద్‌కు 10 ఏళ్ళు మాత్రమే. అంటే నాకు బుద్ధప్రసాద్ 50 ఏళ్ళుగా తెలుసన్నమాట. బాలప్రసాద్‌గా, విద్యార్థి ప్రసాద్‌గా, యువజన ప్రసాద్‌గా, సాహితీ ప్రసాద్‌గా, భాషా ప్రసాద్‌గా, రాజకీయ ప్రసాద్‌గా, మంత్రి ప్రసాద్‌గా ఆయన ఎదుగుదల అంతా గమనించిన నేను ఆయనను చూచినపుడల్లా మనసులో ఆనందపడుతుంటాను. ఈనాడు ఆయన ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఉపాధ్యక్ష ప్రసాద్‌గా ఎదగడం వల్ల నూటికి నూరు శాతం బుద్ధప్రసాద్ అయ్యాడు. అన్ని రాజకీయ పార్టీలకు సన్నిహితంగా ఉంటూ, అందరి మన్ననలు పొందుతూ, అందరి అభిమానాన్ని చూరగొంటూ, తెలుగు జాతికి అన్నిరంగాలలో సేవలు చేస్తున్న శ్రీ మండలి బుద్ధప్రసాద్ నా స్నేహితుడు, శ్రేయోభిలాషి కావటం నాకెంతో ఆనందదాయకం.

శ్రీ మండలి వెంకట కృష్ణారావు, శ్రీమతి ప్రభావతీ దేవిగార్ల కుమారుడుగా జన్మించిన శ్రీ బుద్ధప్రసాద్ దినదిన ప్రవర్ధమానమై 60 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో వారి తల్లిదండ్రులను తలుచుకుని పాదాభివందనం చేయాలని ఉంది. అయితే మా గురుతుల్యుడు, కీ.శే. మండలి కృష్ణారావు గారు దివంగతులయ్యారు. శ్రీమతి ప్రభావతీ దేవి ఆరోగ్యంగా అవనిగడ్డలో గాంధీక్షేత్రంలో నివశిస్తున్నారు. గడిచిన 60 సంవత్సరాలుగా ఆ మహాతల్లి చేతుల మీదుగా వారి ఇంట్లో ఎన్ని సార్లు భోజనం చేశానో నాకే తెలియదు. అవనిగడ్డకు పెద్దలు, పిన్నలు ఎవరు వచ్చినా ఆమె స్వహస్తాలతో వంట చేసి కడుపు నిండా భోజనం పెట్టి ఆమె ఆనందపడుతూ, ఇంటిని నిత్యాన్నదాన గృహంగా మలిచిన శ్రీ మండలి కృష్ణారావు గారి దంపతులకు నా బోటివారం ఋణపడ్డాం. అటువంటి పుణ్యదంపతుల నోము ఫలంగా జన్మించిన చిరంజీవి బుద్ధప్రసాద్‌కు 60 సంవత్సరాలు పూర్తి అయిన ఈ షష్టిపూర్తి శుభసందర్భంలో మరో 60 సంవత్సరాలు ఆయురారోగ్య ఐశ్వర్యాలను, ఇంకా ఉన్నత పదవులను ఇచ్చి కాపాడాలని నేను హృదయపూర్వకంగా ఆ సృష్టికర్తను ప్రార్థిస్తూ, శ్రీ బుద్ధప్రసాద్ కుటుంబసభ్యులందరికి ఆయురారోగ్యాలు కలుగచేయవలసినదిగా భగవంతుని ప్రార్థిస్తూ మండలి బుద్ధప్రసాద్ షష్టిపూర్తి సందర్భంలో ఒక ప్రత్యేక సంచికను ప్రచురిస్తున్న కిన్నెర ఆర్ట్ థియేటర్ సాంస్కృతిక సంస్థకు నా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

సంస్కార సేతువు ఈ విద్వన్ 'మండలి'

- డా॥ ఆశావాది ప్రకాశరావు

ఎదుటివారి సంతోషం కోసం, తమను తాము తగ్గించుకొనే ఉత్తములు, సార్వకాలీనంగా హెచ్చింపబడుతారని విజ్ఞులంటారు. ఈ మాట మాన్యశ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి అక్షరాలా వర్తిస్తుంది. నిర్లిప్త నియత మాధుర్య జీవనవిధానం వారి సన్నిధిలో దర్శనీయం అవుతుంది.

కృష్ణాజిల్లా రచయితల సంఘం నిర్వహించిన జాతీయ స్థాయి సభలకు పెక్కింటికి నేను హాజరైనాను. అక్కడే వారి ప్రథమ పరిచయం. నా ప్రసంగం సాంతం విని "మీ పద్యపఠనం మధురం, మీ ప్రసంగపాఠం మార్దవం" అంటూ నిండుమనసుతో ప్రశంసించారు. భోజన సమయంలో మా వంటి వయోధికుల్ని గుర్తుంచుకొని పేరుపేరునా పిలుస్తూ కూర్చుండ నియమించి ఆహారపదార్థాలు పళ్లెంలో పెట్టుకొని తెచ్చి మాకు ఇస్తున్నారు శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారు. ఒక మంత్రిస్థానీయుడు విద్యాధికులపట్ల, కవిపండితులపట్ల ఇంతగా సేవాభావంతో ఒదిగిపోవడం చూచి చాలా ఆశ్చర్యపడ్డాను. తర్వాత అర్థమైంది ఈ గుణాలు సహజాతాలే గాని, బాహిరంగా తెచ్చిపెట్టుకొన్నవి కావని. అంతేగాక పరంపరాగత వంశీయలక్షణాలు పరిమళింపజేయడం బుద్ధప్రసాద్ లాంటి నవనీత హృదయులకే సాధ్యమని.

వీరు కృష్ణాజిల్లా రచయితల సంఘ ప్రచురణలకు గౌరవ సంపాదకుడుగా, ప్రధాన హితవరిగా చేసిన సేవల్లో వారి నిశిత పరిశీలన ద్యోతకమవుతుంది. వారి ఆకాంక్షలకు అనురూపంగా, అక్షర ప్రపంచంలో ఆ ప్రచురణలు అక్షయకీర్తి సముపార్జించుకొనేలా శ్రద్ధ చూపారు. అవి 'తెలుగు పున్నమి', 'తెలుగు పసిడి' వంటి బృహత్ గ్రంథాలు. అవి జిజ్ఞాసువులకు, పరిశోధక విద్యార్థులకు ఆంధ్ర సాంస్కృతిక కోణాలన్నింటిని సమగ్రంగా పట్టియిస్తాయి. అందలి ప్రసిద్ధ వ్యాసాలకు రచయితల్ని ఎంపిక చేయటంలో, ముద్రణకు తగిన ఆర్థిక వనరులు కల్పించటంలో ప్రశంసనీయమైన దృష్టి సారించారు.

ఒకమారు యువభారతి అధ్యక్షులు శ్రీ మాడభూషి అనంతాచార్యులతో హైద్రాబాదులోని వారి నివాసానికి వెళ్ళినాను. అక్కడ ఉత్తమగృహస్థుని లక్షణాలు వారిలో పుష్కలంగా మూర్తీభవించి కనిపించాయి. ఎదురుగావచ్చి లోనికి ఆహ్వానించటం, తేనీరు వగైరా సమకూర్చటం, ఎదుటివారిని సైతం గోష్ఠిలో భాగస్వాముల్ని చేయటం వంటివి చూచి నేను ముగ్ధడనయ్యాను. ఆ సందర్భంలో వారు పలు గ్రంథాల్లోని అనేక విషయాలను ఉటంకించటం వారికి గల ధారణా పటిమకు సాక్ష్యమైంది. చివరగా నేను ఏపనికై వారి దగ్గరకు వెళ్లానో తెలిసికొని, సంబంధిత వ్యక్తులకు నన్నుగూర్చి మహోన్నతంగా చెప్పి, నా కార్యాన్ని సానుకూలం చేశారు. ఇవన్నీ వారి విశాల హృదయానికి, సేవాభావానికి నిలువెత్తు నిదర్శనాలు. కార్యసాధనలో ఏవిధమైన ఆవేశానికి చోటివ్వని, లక్ష్మణరేఖ దాటని, సాధుస్తముదాయన. ఆశ్రితుల ఆనందము పరమావధిగా మెలిగే ఆస్వాద్యవర్తనుడాయన.

వారు సభల్లో ప్రసంగించేటప్పుడు శాంతగంభీర లసన్మూర్తియైన శారదలా భాసిస్తారు. అతిసాధారణమైన ఆయన వాక్యచాలనం వెనుక ఆలోచనీయమైన అంశాలను నిక్షిప్తంచేసి సభకు కాన్కచేస్తారు. వాక్యాంతక్రియలకు తడబాటు కనిపించదు. అవి సాభిప్రాయంగా వచ్చి కూర్చుంటాయి. ప్రతి విషయాన్ని క్రమగతిలో నడుపుతూ దానికి సమగ్రతనిస్తారు. ఆ కారణంగా జిజ్ఞాసులకు ఆయా అంశాలపై స్పష్టమైన అవగాహన ఏర్పడుతుంది. నిండుకుండ తొణకదన్న సామెత వీరి సన్నిధిలో సార్థకమవుతుంది.

రాష్ట్ర అధికార భాషాసంఘ అధ్యక్షులుగా, సామాన్య విషయాన్ని సైతం నిశితంగా పరిశీలించి నిర్ణయం తీసికొనేవారు. తెలుగు పొలంపై వివిధ సాహితీప్రక్రియల్లో తలపండినవారు, ఎవ్వరెవ్వరు ఎక్కడెక్కడ ఉన్నారన్నది ఆరాతీసి, ఎవ్వరి ద్వారా ఏ విధమైన సేవల్ని రాబట్టవచ్చు అనే నిర్దిష్టమైన ప్రణాళిక వారి మనోగోళంలో ఎప్పుడూ సిద్ధంగా ఉండేది. సహసభ్యుల సహకారాన్ని పొందటంలోను, సరైన సమయంలో ఆయా సందర్భాలకు తగినరీతిలో ఆచరణాత్మకతను రాబట్టటంలోను, సంయమనంతో కూడిన శ్లాఘనీయమైన నేర్పు ప్రదర్శించేవారు. తనకు పూర్వం ఆ పదవిలో ఉన్నవారు చేపట్టిన ప్రయోజన పథకాలను కొనసాగించటంలో అలసతకు ఏమాత్రం చోటీయకుండా మసలేవారు. నేల విడిచి సాము చేయటం వారికి తెలియదు.

ప్రతి నూత్నసంవత్సర ఆరంభంలో, తన ఆత్మీయులకు, అభిమానులకు, అధికారులకు తెలుగులోనే శుభాకాంక్షలు చేరవేస్తారు. ఎవరైనా పుస్తకాలు పంపిస్తే, వెంటనే అందినట్లు తెలపటమే కాక, దాన్ని తలస్పర్శిగా చూచిన సాక్ష్యాలతో అభినందనలు తెలుపుతారు. తమ రచనలకు అభిప్రాయం కోరి దగ్గరికి వచ్చిన వారికి, ఏ మాత్రం వీలున్నా అక్కడికక్కడే ఆమూలచూడంగా ఆ గ్రంథాన్ని త్రిప్పిచూచి మున్నుడి వ్రాసికోండని ఆశువుగా అందించి, ఆమోదముద్రగా తన సంతకం చేస్తారు. ప్రబల కారణాంతరాల చేత ఆలస్యమైతే క్షమాపణ చెప్పటానికి వెనుకాడరు సరికదా ఆ వ్యక్తులకు సముచిత సముదాయింపు సమాధానం ఇస్తారు. ముఖం నలుచుకోవటం, పరాఙ్ముఖంగా ఉండటం, సణగటం వంటివి ఏకోశాన తనలోకి రానీయరు. చిరునవ్వు చిగురింపజేస్తూ, హృదయావర్జకమైన సంభాషణ చేస్తుంటారు. తనవల్ల ఏ కించన్మాత్రమైనా ఎదుటివారికి మేలుకలగాలని ఆకాంక్షించటంలోనే వారి విశ్వశ్రేయోభావం కనిపిస్తుంది.

నా సాహితీ స్వర్ణోత్సవ సంచికయైన 'ప్రకాశ పథం'నకు అమాత్యపదవిలో ఉండి కూడా సకాలంలో స్పందించి తమ అమూల్య సందేశాన్ని అందించారు. భాగ్యనగరంలో క్షీరసాగర సాహితీ సమితి నాకై నిర్వహించిన కనకాభిషేక కార్యక్రమానికి ఉపసభాపతి స్థానీయులై కూడా సావకాశంగా, ముఖ్య అతిథిగా విచ్చేశారు. "గుఱ్ఱం జాషువా, బోయి భీమన్నల తర్వాత, డా. ఆశావాది పద్య విధేయ సంప్రదాయ సాహితీమూర్తిగా నిలుస్తారు" అని అభిభాషించారు. ఆశావాది గారికి పద్మశ్రీ రావలసిన అర్హతలన్నీ ఉన్నాయని, దీని సాధనలో తనవంతు పాత్ర నిర్వహిస్తానని స్పష్టంగా ప్రకటించిన సౌజన్యమూర్తి ఆయన. గుణగ్రహణ పారీణతకు మారుపేరుగా మండలి బుద్ధప్రసాద్ గారు నిలిచారనటంలో సందేహం లేదు. నాటి సన్మాన కార్యక్రమంలో ప్రేమ, గౌరవం, ఆర్ద్రత ముప్పేటగా ముడివడేట్లు నా శిరస్సుపై బంగారు పుష్పాలను ఉంచుతూ "ఆశావాది గారూ! మీ మనోభీష్టం సిద్ధించుగాక!" అనటం నేను నేటికీ మరచిపోలేను.

మా జిల్లాలో "మాకు ఆశావాది గురువం"టూ ఎదుట మాత్రం ప్రశంసిస్తూ, అర్హమైన నా ఆకాంక్షలకు అనురూపంగా నిలబడటానికి ససేమిరా అంగీకరించని నాయకులనో లేదా రాష్ట్రస్థాయి స్వకుల ఉన్నతాధికారులనో పోల్చుకున్నప్పుడు శ్రీ మండలివారి అపార సౌజన్యం మరువలేనిది. ఏవిధమైన భేషజాలు లేకుండా అందరిలోను కలసిపోవటం, అవతలివాళ్ల సామర్థ్యాలకు జోతలర్పించటం, తగిన అవకాశాలను కల్పించటం వీరిని చూచి ఇతరులు నేర్చుకోవలసి ఉంది. ధనం, విద్య, వంశం అనేవి దుర్మతులకు మదాన్ని కలిగిస్తూ ఉండగా, సజ్జనులైన వారికి అవే అణకువ, వినయం సంతరిస్తాయన్న భారత పురాణసత్యం వీరిని చూడగానే మనకు గుర్తుకు వస్తుంది. చెరగని స్నేహశీలం వారికి పెట్టనికోట.

ఆచార్య కోరాడ మహదేవశాస్త్రిగారి భాషాచారిత్రక వ్యాసాల గ్రంథావిష్కరణ సభకు శ్రీ బుద్ధప్రసాద్ గారు అనంతపురం వచ్చారు. ఆహ్వానపత్రికలో నా పేరున్నా, అనారోగ్యం కారణంగా నాటి కార్యక్రమానికి హాజరు కాలేకపోయాను. శ్రీ మండలి వారు పదేపదే నన్ను గుర్తుచేసుకొని ఆశావాది గారు ఎందుకు రాలేదని కార్యనిర్వాహకుల్ని అడిగారట! నిండుమనసుతో అభిమానుల్ని పరామర్శించటంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. తన బలమైన విశ్వాసానికి ప్రతిఘాతం కలిగినా, ధీరమనస్కులై యధాస్థితికి వస్తారు. మొత్తం మీద రాజకీయాలలో ఉన్నవారు ఆ రంగంలోని వారిని తప్ప అన్యుల్ని పట్టించుకోరు. కానీ తన రక్తంలో జీర్ణించుకొన్న సాహిత్యాభిమానంతో సరస్వతీ మూర్తుల్ని ఒకమారు చూచినా శాశ్వతంగా గుర్తుంచుకొనే ప్రవృత్తి వీరిది.

విజయవాడ పట్టాభి కళాపీఠం వారు నాకు గిడుగు రామమూర్తి పంతులు స్మారక తెలుగు భాషోద్యమకారుల ప్రతిభాపురస్కారాన్నీ, మచిలీపట్నంలోని ఆంధ్ర సారస్వత సమితి వారు కీ.శే. 'కవిపాదుషా' పువ్వాడ శేషగిరిరావు స్మారక పద్యకవితా పురస్కారాన్నీ అందజేసిన రెండు సభల్లోను శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు ముఖ్యఅతిథిగా ఉండినారు. నా అభ్యుదయం పట్ల, నా ప్రసంగం పట్ల ఎక్కువ మక్కువ చూపే వీరి సౌహార్దాన్ని నిత్యస్మరణీయంగా నా మనస్సులో నిల్పుకొన్నాను. ఈ సంస్కార సేతువైన వీరిని సాహితీజగత్తు అనునిత్యం మధురస్మృతుల మధ్య మననం చేసుకుంటూనే ఉంటుంది.

తెలుగు భాషాసాహిత్యాలతో ముడివడిన సాంస్కృతిక చైతన్యాన్ని, కాలానుగుణంగా వస్తున్న మార్పుల్ని, తులనాత్మకంగా గుణాత్మకంగా అధ్యయనం చేసినారు శ్రీ బుద్ధప్రసాద్‌గారు. "ఏదేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని" అనే మాటను నెమరువేసుకుంటూ, తమ విదేశీపర్యటనల్లోను, అన్యరాష్ట్రాల్లోను కూడా తెలుగువెలుగును పునరుద్ఘాటిస్తూ పూర్ణచంద్రోదయను ప్రసరింపజేస్తారు. తలబొప్పె కట్టించే రాజకీయ బాధ్యతలు ఎన్ని ఉన్నా అవిశ్రాంత సాహితీపథికుడుగా ఉంటూ, తనివోని దాహంతో పరిశ్రమించి తెలుగు భాషాసాహిత్యాలలో కృషి చేశారు. వీరికి 'డాక్టరేట్' అన్నది ఒక కొలమానం కాదు. అది కాలమానం మాత్రమే. తిరుపతి వేంకటకవులు చెప్పినట్లుగా 'నేనే నేనని నేను నేనని' అచిరకాలంలోనే తప్పక వీరిని వరిస్తుందనటంలో ఆవంత కూడా సందేహం లేదు – వారికైనా వారి అభిమానులకైనా.

వీరికి అరవై వసంతాలు నిండుతున్న శుభసందర్భాన్ని పురస్కరించుకొన్న కిన్నెర యాజమాన్యం ప్రత్యేకించి డా॥ రొద్దం ప్రభాకరరావు, శ్రీ మద్దాళి రఘురాం గారు ఒక సంచికను అభినందన కుసుమంగా శ్రీ బుద్ధప్రసాద్ గారికి సమర్పించాలని ఆలోచించటం చాల సముచిత నిర్ణయం.

తండ్రి నుండి వచ్చిన ఉదాత్త సంస్కృతి, గురుదత్తమైన ఉత్తమ విజ్ఞానం రెండు కళ్లుగా, వాటిని అనువైనచోట అచ్చొత్తినట్లుగా ప్రతిష్ఠించటం వారిలోని ప్రత్యేకత. జాతీయభావాల కూడలిగా, గాంధీ అడుగుజాడల్లో పయనించే నిరాడంబర సంఘ సేవకులైన వీరికి సకల శుభాలు కలుగుగాక! 'బుద్ధవర'ములైన ప్రేమ, కరుణ, దయ, సత్యాలను మహా'ప్రసాద'ంగా హృదయభూషలుగా దాల్చిన వీరికి క్రమగతిలో సప్తతి, అమృతోత్సవ, సహస్ర చంద్రదర్శనాది శాంతికలాపాలు దేదీప్యమానంగా ఇంటిల్లిపాది మధ్య నిర్వహింపబడేల ఆ పరాత్పరుడు వీరిని దీవించి రక్షించుగాక. ఆంధ్రదేశమే కాక యావత్ భారతదేశం కూడా వీరి మేధోనికషమైన సామాజిక సేవల్ని వినియోగించుకోగలదని మనసారా కోరుకుంటున్నాను.



మహాత్మాగాంధీ మనుమరాలు శ్రీమతి ఉషాగోకనీతో మండలి బుద్ధప్రసాద్

నిజమైన గాంధేయవాది

- కోడూరి శ్రీరామమూర్తి

ఎవరు గాంధేయవాది? – అనే ప్రశ్న వచ్చినప్పుడు పలు విధాలైన సమాధానాలు రావడానికి అవకాశం ఉంది. కొందరు ఖద్దరు బట్టలు ధరించి, ఖద్దరు టోపీ పెట్టుకున్న వారందరూ గాంధేయవాదులే అని అంటారు. మరికొందరు గాంధీజీ స్వాతంత్ర్యోద్యమం నిర్వహిస్తూ ఉండే రోజుల్లో – జెండా పట్టుకుని వాలంటీర్లా పనిచేసి, జైలుకు వెడితే చాలు వారందరూ గాంధేయ వాదులే అని అంటారు. ఇంకొందరు గాంధీగారి పేరు పదే పదే వల్లెవేసే రాజకీయవాదులు గాంధేయవాదులనవచ్చు. (ఇప్పుడు రాజకీయవాదుల్లో గాంధీగారి పేరు తలచుకునేవారు కూడా తక్కువే అనుకోండి – అది వేరే సంగతి.)

కాని, నాకు మాత్రం ఒక గాంధేయవాది ఎలా ఉండాలో గాంధీగారే చెప్పారనిపించింది. తనను తాను 'శూన్యం' (జీరో)గా మార్చుకోవాలనే వారాయన.

తనను తాను 'శూన్యం'గా మార్చుకోవడం అంటే – ఆలోచన శక్తిని చంపుకుని 'అజ్ఞాని'గా బ్రతకడం కాదు. ఈ విషయానికి సంబంధించిన వివరణ ఆయనే ఇచ్చారు.

ఒక బ్రిటిష్ జర్నలిస్ట్ గాంధీగారిని ఇంటర్వ్యూ చేస్తూ – "ఒక వ్యక్తి తనను తాను 'జీరో'గా మార్చుకోవడం అంటే ఏమిటి?" అని అడిగాడు.

దానికి గాంధీగారు సమాధానం చెబుతూ – "దీని అర్థం ఏమిటంటే, మంచి బహుమతులను తీసుకొనడంలో వ్యక్తి చివరగా ఉండడం, అందరికీ సేవ చెయ్యాలని పరితపించడం, ఇతరులకు మేలు చేసినా ఎవరి దగ్గిర నుండి ఎలాంటి కృతజ్ఞతా ఆశించకుండా ఉండడం, ఎవరికన్నా తాను అధికుడనని భావించకుండా ఉండడం, అహంభావం అనేది లేకుండా అత్యంత నిరాడంబరంగా, వినమ్రతతో ఉండడం" అని అన్నారు గాంధీజీ.

వ్యక్తి తనను తాను 'జీరో'గా మార్చుకోవడం అంత సులభం కాదు. అడుగడుగునా 'అహం' అడ్డుపడుతూ ఉంటుంది. ఈ విషయంలో శిక్షణ ఇచ్చేందుకే గాంధీజీ తన ఆశ్రమంలో అగ్రవర్ణులను ప్రత్యేకంగా ఏరి, వారిచేత పాకీదొడ్లు తుడిపించే వారు. ఆయన కూడా స్వయంగా చీపురుపట్టి అపరిశుభ్రంగా ఉన్నచోటల్లా (పాకీదొడ్డితో సహా) శుభ్రం చేసేవారు. చెప్పిన విషయాన్ని తాను ఆచరించడం మాత్రమే కాకుండా, ఇతరుల చేత ఆచరింపజేసేందుకు మహాత్ముడు అనుసరించిన కఠోర మార్గం ఇది.

ఇంతటి కఠోర శ్రమ అవసరం లేకుండానే గాంధీజీ చెప్పినదాన్ని ఆచరించగలిగిన గాంధేయవాదులు కొందరుంటారు.

ఈ తరహాలో ఉన్న ఇట్లాంటి గాంధేయ వాదులను గురించి తలుచుకున్నప్పుడు, నాకు మండలి బుద్ధప్రసాద్ గారు కనబడతారు. నా ఉద్దేశంలో గాంధీగారు కోరుకున్న ఈ లక్షణంతో బాటుగా మరిన్ని మంచి లక్షణాలు వారిలో ఉన్నాయి.

ప్రపంచ ప్రఖ్యాత నాటకకర్త విలియమ్ షేక్స్‌పియర్ ఒకనాటకంలో అంటాడు – “కొందరు గొప్పవాళ్ళుగా పుడతారు. కొందరు గొప్పతనాన్ని సాధించుకుంటారు. కొందరిపై గొప్పదనం ఆపాదించబడుతుంది” అని. నిస్వార్థ ప్రజానాయకుడు, కార్యదక్షుడు, అయిన మండలి వెంకట కృష్ణారావు గారి తనయుడుగా, – బుద్ధప్రసాద్ గారు గొప్పవాడు గానే పుట్టారు. ఆ తర్వాత, కృషితో మరింత గొప్పదనాన్ని సాధించుకున్నారు.

ఇక్కడ నేను ‘గొప్ప’ అనే మాటను – ఐశ్వర్యానికో, అధికారానికో, పర్యాయపదంగా వాడలేదు. అవి వారికి ఉండవచ్చును. అది వేరే విషయం. కాని, నేను ‘గొప్ప’ అనే పదాన్ని హృదయ సంస్కారానికి పర్యాయపదంగానే వాడాను. బుద్ధప్రసాద్‌గారికి సాహిత్య సంస్కారం ఉంది. గాంధేయ విలువలను ప్రేమించగల సంస్కారం ఉంది. మనిషిని మనిషిగా గౌరవించగల సంస్కారం ఉంది. అదే ఆయనకు ఒక విలక్షణమైన వ్యక్తిత్వాన్ని తెచ్చి పెట్టింది. బుద్ధప్రసాద్‌గారు విజ్ఞులైన రాజకీయ నాయకులని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

మళ్ళీ గాంధీగారినే జ్ఞాపకం చేసుకుంటే – ‘నాయకుడు’ అనేవాడు నిండు అంకె (1, 2, 3 మొ॥) వంటి వాడు అయి ఉండాలి’ అనే వారాయన. అంతేకాదు – “ఆ తర్వాత ఎన్ని సున్నాలు జత చేరినా అంకెకు విలువ పెరుగుతుందే కాని, తగ్గదు. అయితే, నాయకుడు నిండు అంకె కాకుండా అతడే ఒక ‘సున్నా’ అయితే, వెనుక ఎన్ని సున్నాలు ఉన్నా విలువ పెరగదు” అని కూడా అన్నారాయన. అలాంటి ‘నిండు అంకె’ వంటి నాయకుడు బుద్ధప్రసాద్ గారు. సంఖ్య విలువను పెంచే నాయకుడాయన.

“క్రమశిక్షణతో ప్రవర్తించగలిగినవాడే జన్మతః ప్రజాస్వామ్యవాది” అని భావించిన గాంధీజీ – శాసన సభలో గాని, పార్లమెంటులోగాని అట్లాంటి క్రమశిక్షణ లోపించినప్పుడు ఆయన – Parliament is simply a costly toy of the nation అని విసుక్కునేవారు. అంతేకాదు – “శాసనసభ్యులు ప్రజలకు మార్గదర్శకులు కాదు. ప్రజలే వారికి మార్గదర్శకులు. ప్రజలకు విశ్వాస పాత్రులుగా ఉండి, వారి కోరికలను తీర్చడం వారి బాధ్యత” అంటూ, “అసలైన అధికార కేంద్రం ప్రజలు. శాసనసభలు, పార్లమెంటులు, సముద్రం లోని నీటి బిందువులు మాత్రమే” అనేవారు గాంధీజీ. గాంధేయవాది అయిన బుద్ధప్రసాద్ గారు అట్లాంటి బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధి అని నా నమ్మకం.

×××

బుద్ధ ప్రసాద్ గారితో నాకు కొద్ది సంవత్సరాల పరిచయం మాత్రమే ఉంది. నా గాంధేయ రచనను అంతకు చాలాకాలం క్రితమే ఆయన చదివారట. 1969లో ప్రపంచ వ్యాప్తంగా గాంధీజీ శతజయంతి ఉత్సవాలు జరుగుతున్నప్పుడు నేను – ఆయన జీవితంలోని ఉత్తేజకరమైన ఉదంతాలను ఏరి, రెండు సంవత్సరాలపాటు ‘ఆంధ్రజ్యోతి వారపత్రిక’లో ప్రచురించాను. ఆ పత్రికవారు వాటికి ‘గాంధీజీ కథావళి’ అని పేరు పెట్టి ఒక ప్రత్యేకమైన పేజీలో ప్రచురించేవారు. అప్పట్లో ఆ శీర్షిక విశేష జనాదరణ పొందింది. ఆ తర్వాత అది పుస్తక రూపంలో వచ్చి,ఎనిమిది ముద్రణలను పొందింది. ఇంతకూ చెప్పవచ్చేదేమిటంటే, ఆనాటికి యువకులుగా ఉన్న బుద్ధప్రసాద్ గారు ఆ శీర్షికను చాలా ఆసక్తిగా చదివే వారట. ఆ శీర్షిక తననెంతో ఆకట్టుకుందని ఆయన నోట వినడం నాకెంతో ఆనందాన్నిచ్చింది. ఆ తర్వాత నేను చాలా గాంధేయ రచనలు రాశాను. వాటన్నింటికీ నా తొలినాటి గాంధేయ రచనే స్ఫూర్తి.

బుద్ధప్రసాద్ గారితో పరిచయం అయిన తర్వాత – అధికార భాషా సంఘ అధ్యక్షుని హోదాలో, డిప్యూటీ స్పీకర్ హోదాలో, రాజమండ్రికి కొన్ని సందర్భాలలో వచ్చారు గాని – నా ఆరోగ్య కారణాల రీత్యా ఆయనను వ్యక్తిగతంగా కలవలేదు. ఆ విషయం ఆయనకు ఫోనులో చెబితే, "మీరు రాలేకపోతే నేనే వస్తాను మీ ఇంటికి–" అన్నారు! ఆ మాట చాలు. ఆయన సంస్కారం గురించి చెప్పడానికి.

ఈ మధ్య నేను హైదరాబాద్ వెళ్ళినప్పుడు – మా అబ్బాయిని తోడు తీసుకుని వారి ఇంటికి వెళ్ళాను. ఎంతో సాదరంగా వారు నన్ను ఆహ్వానించారు. ఆయన ఇంటిలో వారు కూర్చున్న కుర్చీ పక్కన పెద్ద పుస్తకాల గుట్ట కనిపించింది. మా అబ్బాయికి వాటిని చూపిస్తూ "బుద్ధప్రసాద్ గారిని డిప్యూటీ స్పీకర్‌గా కాదు. ఇలా చూడాలి" అని చెప్పాను. ఇది సత్యం.

అవనిగడ్డ గ్రామంలో ఆయన విశేష వ్యయ ప్రయాసలతో 'గాంధీక్షేత్రం' నిర్వహిస్తున్నారు. గాంధీక్షేత్రం పక్షాన కొన్ని పుస్తకాలను కూడా వెలువరించారు. ప్రధానమంత్రి మోడీగారు గాంధేయ స్ఫూర్తితో 'స్వచ్ఛ భారత్' కార్యక్రమాన్ని చేపట్టిన విషయం అందరికీ తెలిసిందే. ఆ సందర్భంలో తన వంతు కృషిగా బుద్ధప్రసాద్ గారు అవనిగడ్డలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించడం మాత్రమే కాకుండా – "స్వచ్ఛగాంధీయం" అనే పేరుతో ఒక పుస్తకాన్ని కూడా వెలువరించారు. అందులో వ్యాసం రాయమని ఆయన నాకు ఫోనులో చెబితే – నేను 'మహాత్ముడు కలలుగన్న స్వచ్ఛ భారత్' అనే మకుటంతో ఒక వ్యాసం రాసి పంపించాను.

ఈ విషయం అలా ఉంచి ఆ పుస్తకాన్ని ఆయన ఎడిట్ చేసిన తీరు అద్భుతంగా ఉంది. వీధులు ఊడ్చే చీపురుతో గాంధీగారి బొమ్మ ముఖచిత్రంగా ఉన్న ఈ పుస్తకంలో – 'బహురూపి గాంధి' వంటి మంచి రచన అనువాదం, కనూ గాంధి, అభా గాంధిల రచన అనువాదం, గాంధీజీ గురించి గతంలో నారాయణరెడ్డి, కృష్ణశాస్త్రి రాసిన కవితలు, ఇలాంటివన్నీ ఈ పుస్తకంలో 'గుదిగుచ్చారు' బుద్ధప్రసాద్‌గారు. అంతేకాదు – మంచి సంపాదకీయం కూడా రాశారు. గాంధీ సాహిత్య ప్రేమికులందరి వద్దా ఉండవలసిన చిన్న పుస్తకం ఇది.

మే నెలలో బుద్ధప్రసాద్ గారి షష్టిపూర్తి జరుగుతున్నది. సాధారణంగా ఇట్లాంటి సందర్భాలలో అందరూ – ఈ ఉత్సవం జరుపుకుంటున్న వారిని నూరేళ్లు సుఖంగా జీవించాలని ఆశీర్వదిస్తారు.

ఇది రాస్తున్నప్పుడూ మళ్ళీ నాకు గాంధీగారే జ్ఞాపకం వస్తున్నారు. గాంధీ గారి ఒక జన్మదినోత్సవం రోజున, మదన్‌మోహన మాలవ్యా ఆయనకు ఒక సందేశం పంపిస్తూ "మీరు నూరేళ్లు బ్రతకాలని ఆశిస్తాను" అని రాశారు. దానికి హాస్య ప్రియుడైన గాంధీజీ కృతజ్ఞతలు తెలుపుతూ, "నేను నూటపాతికేళ్ళు బ్రతుకుదామని అనుకుంటున్నాను. నా జీవితం పాతికేళ్లు తగ్గించారు మీరు" అని రాశారు! ఆ రోజున ప్రజాసేవ చెయ్యాలని ఆయనకున్న తపనే ఆయన చేత అలా పలికించింది. (అయితే – దేశవిభజన తర్వాత, పెచ్చు పెరిగి పోయిన మత కల్లోలాలను చూచినప్పుడు ఆయనలో జీవితేచ్ఛ తగ్గిపోయింది– అది వేరే విషయం).

అందుచేత – బుద్ధప్రసాద్‌గారు నూరేళ్ళు కాక, నూటపాతికేళ్లు జీవించి, బహుముఖంగా ప్రజాసేవ చెయ్యాలని ఆకాంక్షిస్తున్నాను. శుభం.

మంచితనానికి, మర్యాదకు మరోపేరు

- డా. వెల్చాల కొండలరావు

ప్రతిభ కంటె - మేటి పాండిత్యమున కంటె,
 మిన్న - మంచితనము - మేలు - చాలు,
సృష్టి శిల్పమునకు శిఖరాయమానుండు;
 మంచి గుండె యున్న - మానవుండు.
ఎడద చేర్చు గాత - పుడమి కవ్వలి వెల్గు;
 మట్టి లోన పుట్టి గిట్టు మనిషి,
కాదు - బ్రదుకు - పొట్ట కక్కూర్తి మాత్రమే!
 మనిషి చూడదగును మంచి తనము.
 - నండూరి రామకృష్ణమాచార్య

ప్రజాస్వామ్యంలో రాజకీయ రంగంలో ఉండేవారు ఎంతో ఉన్నతంగా, ఉదారంగా, ఉత్సాహంగా అనిపిస్తూ, కనిపిస్తూ అందరికీ అందుబాటులో ఉండాలి. అలాంటివి మొదట వారికి 'మనవాడు', 'మంచివాడు' అను కీర్తి తెచ్చిపెడుతాయి.

ఎన్నికల్లోనే కాక ఎన్నిక పిదప కూడా వారు తమ నియోజకవర్గాలకు అడపా దడపా వెళ్తూ స్థానికుల బాగోగులు తెలుసుకుంటూ చేయగలిగినవి చేయాలి. చేయజాలనివి ఎందుకు చేయడానికి వీలుకావో నొప్పించక తానొవ్వక నచ్చజెప్పగలగాలి.

నాయకుని పొందుబాటుకన్నా కూడా వారికి వారి అందుబాటు, accessibility చాలా ముఖ్యమని ఎంతో మురిపెంగా, ముచ్చటగా చెప్పుకుంటారు లోకులు. ఒక పని అయినా కాకున్నా, ఒక వినతిని అతడు కాదన్నా అవునన్నా ఆ కాదనడం, అవుననడంలో ఉంటుంది అతని శక్తి, యుక్తి.

ఏది జరిగినా జరగకపోయినా ఒక మంచి నాయకుని ముసిముసి నవ్వు చాలని అనుకుంటారు చాలామంది. నవ్వులో అంత అయస్కాంతముంటుంది. ప్రజా ప్రతినిధులనబడే వారు ఊరకే అలా ఎన్నుకోబడినందువలననే అలా పిలవబడరు. ఎన్నో విషయాలలో వారు ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి, 'నేనున్నానుగా' ('మై హూనా' అని అంటారు దానినే ఉర్దూలో) అను ధీమాను, విశ్వాసాన్ని ఎన్నుకున్నవారిలో కల్గించడంలో ఉంటుంది ఎన్నుకోబడిన వారి సమర్థత, యోగ్యత.

మండలి బుద్ధప్రసాద్ గారికి ఈ సద్గుణాలన్నీ పుష్కలంగా ఉన్నాయి. ఇవన్ని చాలావరకు 'మాస్'ను ఆకట్టుకోగలిగే గుణాలైతే, వారిలో 'క్లాస్'ను ఆకట్టుకునే గుణాలు కూడా చాలా ఉన్నాయి.

కొందరు 'మాస్'కు మాత్రమే ప్రాముఖ్యమిస్తారు, 'క్లాస్'ను పట్టించుకోనే పట్టించుకోరు. 'క్లాస్'కు చెందినవారు ఎన్నికల్లో అట్టే పాల్గొనరని వారిని విస్మరిస్తారు. మండలివారు 'మాస్'కు ఎంత ప్రాముఖ్యమిస్తారో 'క్లాస్'కు కూడా అంతే ప్రాముఖ్యమిస్తారు. వారినీ నొప్పించరు, వీరినీ నొప్పించరు. 'క్లాస్'కు చెందిన వారిని వారి సాహిత్య, సారస్వత, సాంస్కృతిక రంగాలకు చెందిన అభిలాషలతో ఒప్పిస్తారు, మెప్పిస్తారు. 'మాస్'కు చెందిన వారిని వారు వారికి చెందిన సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి మెప్పిస్తారు. వారికి వారినీ వీరినీ మెప్పించే ఒప్పించేటంత క్రమశిక్షణా ఉంది, ప్రతిభాపాటవాలున్నాయి, పారదర్శకత, ప్రసన్నత ఉన్నాయి.

మండలి వారి లాంటి బహుముఖ ప్రతిభాశీలురు, అభిరుచులు, అభిలాష, ఆసక్తి, ఆదరణలున్న రాజకీయ నాయకులు ఆ కాలంలో చాలామందే ఉండేవారు కాని ఈ కాలంలో అలాంటివారు చాలా అరుదు. అలాంటి అరుదైన వ్యక్తిత్వం గలవారు మండలి బుద్ధప్రసాద్ గారు. వారితో కాసేపు గడపడం అదొక అరుదైన అనుభూతి, అనుభవం, విద్య. అందులో ఏ సందేహమూ లేదు.

అందుకే వారికి ఇంటా బయటా అంత కీర్తి! వారివలన ఇతరులకు అంతస్ఫూర్తి! అందుకే ఇంటా బైటా వారిని సమావేశాలకు, సభలకు సదస్సులకు పిలవాలని ఎంతోమందికి ఎంతో ఆసక్తి. వారిలాంటి చక్కగా చిక్కగా మృదుమధురంగా, సందర్భోచితంగా, ఖులాసాగా, హుందాగా మాట్లాడేవారు ఈనాటి రాజకీయులలో చాలా తక్కువ. వారు ఏ విషయం పైనైనా ఎంతో అందంగా, ఆనందంగా, homely గా మాట్లాడగలరు. అందుకే వారికి ఈ రాష్ట్రం ఆ రాష్ట్రం అనకుండా ఉభయ రాష్ట్రాల్లో ఎంతోమంది ఆత్మీయులు, అనుయాయులున్నారు.

నా అభిప్రాయంలో వారికి 'డిప్యూటీ స్పీకర్‌షిప్' చాలా చిన్నపదవి. అది వారి శక్తి సామర్థ్యాలకు, ప్రతిభకు సరిపోని గుర్తింపు. వారికి విద్యపై, తెలుగు భాషపై ఉన్న అభిమానం అంతా ఇంతా కాదు. సాహిత్యం, సారస్వతం, సంస్కృతి, సంగీతం, కళలు, విద్య వీటన్నిటినీ ఒక కూటమిగా ఏర్పరచి వారిని ఆ కూటమికి మంత్రిగా నియమిస్తే అవన్నీ బాగుపడతాయని అనుకునేవారిలో నేనొకణ్ణి. ఎందుకంటే వాటికన్నిటికీ ఒకదానికి ఇంకొకదానితో దగ్గరి సంబంధముంటుంది కనుక. మండలి వారిలాంటి బహుముఖీన ప్రజ్ఞలున్నవారిని కేవలం ఒక డిప్యూటీ స్పీకర్‌గా వేస్తే అది సంఘానికే, రాష్ట్రానికే నష్టం. ఇకమీదటైనా అమాత్యులు వారి సామర్థ్యాలకు, ప్రతిభకు, అర్హతలకు సరిపోయే బాధ్యతలనిచ్చి పదిమందిచే మంచిపని చేశారని అనిపించుకుంటారని ఆశిస్తున్నాం.

వారికి వారి షష్ట్యబ్దిపూర్తి సందర్భంగా నా అనేకానేక శుభాకాంక్షలు. వారు మండలి కృష్ణారావుగారి కుమారులైనందుకు వారి కీర్తిని సౌమ్యంగా, సమర్థంగా ఇనుమడిస్తున్నందుకు వారికి నా అభినందనలు. వయసులో పెద్దవాన్ని కాబట్టి వారికి నా అనేకానేక దీవెనలు.

రాజకీయాలలో చురుకైన పాత్ర వహిస్తూ 'మంచివాడు' అని అనిపించుకోవడం చాలా కష్టం. అలా అనిపించుకుంటున్నందుకు వారికి మరోసారి నా అనేకానేక ప్రశంసలు.

మంచి జనుల కీర్తి - మలయ మారుత మట్లె
వెల్లి విరియ గలదు - విశ్వ మెల్ల.
నింగి నేల కలిసి - నెత్తావి కెరటాలు,
గుండె లెల్ల కదిపి కుదుప గలవు.
ఏ మతస్థుడైన నేమి? పూజ్యు డతండు,
సానుభూతి యున్న - సహన మున్న;
వేత్త అతడె - గొప్ప - వేదాంతి ఆతడే;
పండి నట్టి జాలి గుండె యున్న.
మేటి తెలివి తేట మిసిమి మీగడ యేది?
మేటి రాజనీతి మేధ యేది?
లలిత చాకచక్య లౌక్య మేళన మేది?
మనిషి మనసులోని - మంచితనము.

- నండూరి రామకృష్ణమాచార్య

గుణపక్షపాతి

- రావినూతల శ్రీరాములు

"మనం కృష్ణాతీరం వారం ఎక్కడికి వెళ్ళినా పెద్దపీట వేయించుకుంటాం". ఈ మాట మల్లాది రామకృష్ణశాస్త్రి దివిసీమ కేంద్రంగా సాగిన 'కృష్ణాతీరం' నవలలో ఒక పాత్ర చేత పలికించారు. ఈ వాక్యం మండలి వారి కుటుంబానికి చక్కగా అన్వయమవుతున్నది. చిత్రంగా మండలి వారిది దివిసీమే!

శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారు భారత రిపబ్లిక్ తొలి పార్లమెంట్‌కు బందరు నియోజకవర్గం నుండే అతి పిన్న వయస్సులో ఎన్నికై నాటి భారత ప్రధాని పండిట్ నెహ్రూని తన ప్రతిభా పాటవాలతో ఆకట్టుకున్నారు.

సదాచారానికి ఆలవాలమైన కుటుంబం, లోక కల్యాణం కాంక్షించే సజ్జన సాంగత్యం మండలి బుద్ధప్రసాద్‌కు భగవదనుగ్రహం వల్ల లభించిన అవకాశాలయి ఆయన 'ఉదాత్త మనీషి'గా రూపొందడానికి కారణాలయినాయి. తండ్రి వలెనే బుద్ధప్రసాద్ చిన్నతనంలోనే ప్రజాసేవ రంగంలో ప్రవేశించారు.

మడత నలగని మల్లె పూవులాంటి ఖద్దరు దుస్తులు వేసి, వాడని చిరునగవు, వయోవృద్ధులు మొదలు చిన్నవారిని సైతం అందరిని ప్రియంగా ముందుగానే పలుకరించే స్వభావం బుద్ధప్రసాదుకు సహజంగా అమరిన సుగుణం.

ప్రపంచం నలుమూలలా ఉన్న తెలుగు వారిని ఒక వేదికపై చేర్చింది 1975లో హైదరాబాద్‌లో అపూర్వంగా సాగిన తొలి ప్రపంచ తెలుగు మహాసభలు. వాటికి మూలస్తంభం మహనీయుడు నాటి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి మండలి వెంకటకృష్ణారావు.

తండ్రిగారిని వెన్నంటి తిరుగుతూ, సభల విజయానికి తోడ్పడిన నవయువకుడు మండలి బుద్ధప్రసాద్. ఆనాటి అనుభవాలు ఎందరో మహనీయులు పరిచయం కావడంతో పాటు తర్వాత కాలంలో పాలనా దక్షతకు శ్రీ బుద్ధప్రసాద్‌కు దోహదం చేశాయి.

అపార ప్రాణ నష్టం కల్గించిన 1977 అక్టోబరు నాటి దివిసీమ పెనుతుఫానులో సహాయ చర్యలు, పునరావాస కార్యక్రమాలలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయని త్యాగమూర్తులు ప్రభాకర్‌జీ, మండలి వెంకట కృష్ణారావుగారు.

ఆ కాలంలో వీరిద్దరి సేవా భాగ్యం లభించడం బుద్ధప్రసాదు చేసుకున్న సుకృతమనవచ్చు. మండలివారు పదవుల కోసం ప్రాకులాడరు. అవే వారిని వెదుక్కుంటూ వస్తాయి. శ్రీ బుద్ధప్రసాద్ తండ్రి మాదిరే చిన్న వయస్సులోనే శాసనసభ్యులైనారు. సభలు జరిగినంత కాలం రాజధానిలోను మిగతా సమయమంతా నియోజకవర్గ ప్రజల మధ్య వారి సమస్యలను తెలుసుకుంటూ గడపడం వారి దినచర్య.

20 సంవత్సరాల పాటు మద్రాసు, ఆంధ్ర, ఆంధ్రప్రదేశ్ శాసన సభ్యులుగా పని చేసిన శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య, హోసూరు ప్రతినిధిగా తొమ్మిది సంవత్సరాలు మద్రాసు శాసన సభ్యులుగా ఉన్న శ్రీ కె.ఎస్. కోదండ రామయ్యగార్లు బుద్ధప్రసాదు గారి దృష్టిలో ఆదర్శ శాసనసభ్యులు. ఇరువురి దృష్టి నిరంతరం తెలుగు ప్రజలు, తెలుగు భాషపైన ఉండేవి.

శ్రీ బుద్ధప్రసాద్ స్థితి అలాంటిదే! కలలోనూ, మెలకువలోనూ తెలుగే!

శ్రీ బుద్ధప్రసాద్ స్థితప్రజ్ఞులనవచ్చు. ఒకసారి శాసనసభ ఎన్నికలలో ఓటమి పాలయినారు. అయినా ఎంత మాత్రం నిరాశకు లోనుకాలేదు. ఎప్పటిలాగే నియోజక వర్గ ప్రజలకు సేవలందిస్తూనే వచ్చారు.

అలాగే మంత్రి పదవి లభించినప్పుడు ఆయన పొంగలేదు. తన బాధ్యత పెరిగిందని భావించారే తప్ప అధికార దర్పాన్ని ఆయన దరిదాపులకు చేరనీయలేదు. ఆయనకు లభించిన పదవులన్నింటికీ న్యాయం చేశాననే తృప్తి ఆయనకు ఉంటూ వచ్చింది.

శ్రీ బుద్ధప్రసాద్ గారికి లభించిన పదవులలో ఆయనను అమితంగా ఆకట్టుకొన్నది 'ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం' అధ్యక్ష పదవి. శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్య గారు సంఘం ఏర్పడినప్పుడు తొలి అధ్యక్షులు కాగా ఉమ్మడి రాష్ట్రంలో సంఘానికి చివరి అధ్యక్షులుగా బుద్ధప్రసాద్. వీరిరువురే చిత్తశుద్ధితో తెలుగు భాషాభివృద్ధికి తోడ్పడ్డారని చెప్పాల్సి ఉంది.

ఒక్క పరభాషా పదం దొర్లకుండా తెలుగులో అనర్గళంగా గంటల కొద్ది మాట్లాడడం శ్రీ వావిలాల లోనూ, శ్రీ బుద్ధప్రసాదు లోనూ నేను గమనించాను. తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడటం మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేకత. సమైక్యాంధ్ర ఉద్యమంలో తలమునకలుగా పాల్గొనడం చివరకు అధికార పదవిని త్యజించడం జరిగింది.

నవ్యాంధ్రప్రదేశ్‌కు శాసనసభకు తొలి ఉపాధ్యక్షునిగా ఎన్నికయ్యే భాగ్యం శ్రీ బుద్ధప్రసాద్‌కు కలిగింది. ఆ పదవికి ఆయన న్యాయం చేకూర్చగలడనడంలో సందేహం లేదు.

ప్రపంచంలో ఏ మూలన తెలుగు సంఘం వారెవరు పిలిచిన శ్రీ బుద్ధప్రసాద్ వారి చెంతకు వాలి సంఘీభావాన్ని చాటుతారు. ప్రభుత్వం, విశ్వవిద్యాలయాలు ప్రతిభావంతులను ఎన్నిక చేసేటప్పుడు బుద్ధప్రసాదును సంప్రదిస్తుంటారు.

అలాంటి సందర్భంలో శ్రీ బుద్ధప్రసాద్ గుణం (సమర్థత) ప్రధానంగా అభ్యర్థిని ఎన్నిక చేస్తారే తప్ప ఇతర అంశాలను పరిగణింపరు. 2015లో నేను రాసిన 'ఆంధ్రరత్న'కు 2016లో 'ప్రభాకర్‌జీ' పుస్తకాలకు బుద్ధప్రసాద్ చక్కని పీఠికలు రాసి నన్ను అభినందించారు.

సౌమ్యశీలి, మృదుస్వభావి అయిన శ్రీ మండలి బుద్ధప్రసాద్ శతాయుష్కులై తెలుగు భాషకు తెలుగు ప్రజలకు ఇతోధికంగా సేవలందించాలని పరాత్పరుణ్ణి నేను కోరుకుంటున్నాను.

ముఖచిత్రం

- డా॥ వోలేటి పార్వతీశం

చాలామంది మాకు అన్నీ తెలుసనుకుంటారు. మిగిలిన వాళ్ళల్లో కొంతమంది మాకేమీ తెలియదంటూ ఉంటారు. ఏమీ తెలియని వాళ్ళు, అన్నీ తెలిసిన వాళ్ళల్లా ప్రవర్తిస్తుంటే, చాలా తెలిసిన వాళ్ళు అసలేమీ తెలియనట్టు ఉంటారు. అలా తనకేమీ తెలియనట్టుంటూనే మనందరికీ తెలిసిన వ్యక్తీ శ్రీ మండలి బుద్ధప్రసాద్. చాలామందికి తెలిసీ, పేరూ ప్రఖ్యాతులు బోలెడన్ని ఉండి పెద్ద వాళ్ళైన వాళ్ళ ఇళ్ళల్లో పుట్టడం, అందరికీ దొరకని అదృష్టమే. కానీ, కొండొకచో దురదృష్టం కూడా. మహాకవి విశ్వనాథ ఇంట్లోనో, భారతరత్న సచిన్ టెండూల్కర్ ఇంట్లోనో పుడితే బావుండొచ్చునేమో గానీ అంచనాలకు మించిన బతుకును, అనునిత్యం ఒత్తిడితో బతకాలి. ఆ మహనీయుల, మహావ్యక్తుల వారసత్వాన్ని ప్రతిఫలింప చేసే స్థాయిని అందుకొని తీరాలి. లేదంటే వాళ్ళూ, మనమూ కూడా చిన్నబోతాము. అటువంటి నేపథ్యంలోనే శ్రీ బుద్ధప్రసాద్ పుట్టినా, వెలుగంటే సూర్యుడే కాదు, ఆ వెలుగును తాను స్వీకరించి, చల్లదనాన్ని జతచేసి, మనకి పంచి ఇచ్చే చంద్రుడిదీ వెలుగే సుమా! అని మనకి నిరూపించారు. తేడా అల్లా అక్కడ వెలుగైతే, ఇక్కడ వెన్నెలైంది. అక్కడ సూర్యుడైతే, ఇక్కడ చంద్రుడైంది. తండ్రిని మించిన తనయుల్ని, మనం రామాయణ కాలం నుంచీ చూస్తున్నాం. తండ్రికి తగ్గ తనయునిగా వర్తమానంలో బుద్ధప్రసాద్ గారిని చూస్తున్నాం. ఇది ఆయన సాధించుకున్న ఘనత. మనం ఆపాదిస్తున్న మాన్యత.

తల్లి చాటు బిడ్డలు మనకి లోకంలో తరచుగా ఎదురౌతుంటారు. కానీ బుద్ధప్రసాద్ తండ్రి చాటు బిడ్డ. నేనూ ఒక తండ్రి చాటుబిడ్డగా, నా చిన్నతనంలో మా నాన్నగారితో కలసి, మండలి వెంకట కృష్ణా రావుగారి దర్శనానికి వెళ్ళినప్పుడు, తండ్రిచాటు బిడ్డలుగా మేమెదురైన జ్ఞాపకమేదో మసకగా వెలుగుతుంది. కానీ ఒకరినొకరు ఎరిగివుండకపోవచ్చు. ఇద్దరు తండ్రి చాటు బిడ్డలు ఎదిగే వయస్సులో తారసపడ్డా, వాళ్ళ మధ్య మైత్రి పెనవేసుకుపోయే సందర్భాలు కూడా రావాలి కదా! అప్పట్లో అలాంటి సందర్భాలు రాలేదు. అయినా, మా తాతతండ్రుల సాహిత్య కృషిని హృదయ మగ్నంగా ఎటిగిన వ్యక్తి శ్రీ బుద్ధప్రసాద్. ముఖ్యంగా శశాంక (మా నాన్నగారు) అమృతోత్సవ సంచికలో 'గేయకవి శశాంక' కవితను ఉటంకిస్తూ మంచి వ్యాసం వ్రాశారు.

ఇంకో విషయం చెబుతాను. బుద్ధప్రసాద్ గారిలో నేనొక సుగుణాన్ని బాగా పసిగట్టగలిగాను. తండ్రిగారి వద్ద నుండి, ప్రజాసేవ, సమాజసేవ అందిపుచ్చుకున్నా, నాయకత్వ లక్షణాలు అలవర్చుకున్నా, నిర్మలత్వాన్ని, నిష్కల్మషత్వాన్ని తానుగా పెంపు చేసుకున్నా, ఇవన్నీ తనను తాను ఆవిష్కరించుకోవడానికి ఉపకరించాయి. అయితే, అసలైన గొప్ప సుగుణమేమిటంటే, ఆయన గొప్ప చదువరి. విశేషించి అధ్యయనశీలి. బహుశా ఈ లక్షణం ఆయనను విశిష్ట నాయకునిగా నిలిపింది. ఎవరు ఏ పుస్తకమిచ్చినా, ఎక్కడ ఏ పుస్తకం తారసపడినా, ఆ క్షణానే ఆ పుస్తకం పుటల మధ్యకు చేరిపోవడం ఇప్పటికీ గమనార్హమే. మనం ఏదో పనిమీద

వెళ్ళి కలిసినా, అలాంటి సందర్భంలో పుస్తకం చేతిలో పెడితే, మనతో మాట్లాడటం మరిచి, పుస్తకంతో మమేకం కావడం నేను గమనించాను. ఈ లక్షణాన్ని సమాంతర సమాజంలో నేను మరొకరి దగ్గర గమనించలేదు. ఈ పుస్తక పఠనం ఆయన మూర్తిమత్వాన్ని విశేషించి అలంకరించింది. సాహిత్యం పట్ల, సామాజిక చరిత్ర పట్ల, భౌగోళిక చరిత్ర పట్ల ఆసక్తి, అవగాహన ఆయనలో విశేషంగా ఉన్నాయి. తన జిల్లాలోనూ, నియోజక వర్గంలోనూ వనరుల్ని, వసతుల్ని, పంటల్ని, జలసంపదను, చారిత్రక కట్టడాల్ని, పౌరాణిక కట్టడాల్ని, కొలతలతో సహా చెప్ప గలిగిన ధారణ ఆయనకు పుష్కలంగా ఉంది. తెలుగు ప్రముఖుల జీవిత చరిత్రలు ఆయనకు కరతలామలకాలు. పదిమందికి ఉపయోగపడే ప్రముఖ స్థితి కనుక ఆయనకు సంక్రమిస్తే ఎవరిని ఎక్కడ ఉంచి ఏ కార్యం సాధించాలో ఏ ఫలితం అందించాలో బుద్ధప్రసాద్ గారికి క్షుణ్ణంగా తెలుసు.

నేను ప్రాథమికంగా ప్రసార మాధ్యమానికి చెందిన వాడిని కనుక, ఆయనకు దగ్గరగా మెలిగే సందర్భాలు కొన్ని దొరికాయి. దాదాపు రెండున్నర దశాబ్దాలకు పై బడిన మైత్రిని ఆయన నాకు కానుకిచ్చారు. హైదరాబాద్‌లో సరేననుకోండి. విజయవాడలో, ఐదున్నర సంవత్సరాలు పనిచేయడం, నాకు అదనంగా కలిసి వచ్చిన అదృష్టం. ఆ ఫలితమే ఆ సాన్నిహిత్యం మరింత దృఢంగా కుదురుకుంది. బుద్ధప్రసాద్ గారు సారథ్యం వహించే కార్యక్రమాలలో, కార్యక్రమ రూపకల్పనా, ప్రణాళికా రచనని, నిర్వహణా దక్షతని, అతి చేరువగా గమనించే సందర్భాలు నాకు లభించాయి. ముఖ్యంగా దివిసీమ ఉత్సవాలలోను, కృష్ణాజిల్లా సాంస్కృతిక ఉత్సవాలను, కృష్ణవేణీ నదీ తీరంలో నిర్వహించిన సందర్భంలో, నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలను తిరుపతిలో నిర్వహించిన సందర్భంలో ఆయన ప్రణాళికా రచనా నైశిత్యాన్ని గమనించే అవకాశం చాలా ఎక్కువగా దొరికింది. దివి ఉత్సవాలను, దివిసీమ చరిత్రలో నిలిచిపోయే విధంగా ఆయన రూపకల్పన చేశారు. నాకు బాగా జ్ఞాపకం. ఒక బృహత్ సాహితీ రూపకాన్ని ఆ ఉత్సవాల పతాక సన్నివేశంలో ప్రదర్శించారు. 'తెలుగు విజయం' పేరుతో దానిని ఏర్పాటు చేసినట్టు గుర్తు. గత వైభవాన్ని మన స్ఫురణకు తెచ్చేలా ఎందరో సాహిత్య, సాంస్కృతిక ప్రకాండుల ఆహార్యాలతో, వర్తమాన కళాధురీణులు భాగస్వాములైన ఆ రూపకంలో నృత్త రత్నావళి కర్త, కాకతీయ సేనా నాయకుడు అయిన జాయప సేనానిగా బుద్ధప్రసాద్ గారు వేషం కట్టడం ఇప్పటికీ నా కళ్ళముందు ఉంది. ఆ మొత్తం వేదిక పైన, జాయపసేనాని వేషంలో బుద్ధప్రసాద్ ప్రత్యేక ఆకర్షణగా మారిపోయారు. బహుశా బుద్ధప్రసాద్ గారు వేషం కట్టిన ఒకే ఒక్క సందర్భమనుకుంటాను.

ప్రసార మాధ్యమం, అత్యంత ప్రతిభావంతమైన మాధ్యమమని, దానిని ప్రయోజనకరంగా వాడుకోవాలని, తద్వారా సమాజ అభివృద్ధిని కాంక్షించవచ్చు అన్నది, ఆయన ఆలోచన. అనేక సందర్భాలలో ఆయన అటు ఆకాశవాణి, ఇటు దూరదర్శన్ సంస్థలు నిర్వహించిన కార్యక్రమాలలో ప్రధాన భాగస్వామి అయ్యారు. ఇక్కడ రెండు సందర్భాల గురించి నేను ప్రత్యేకంగా చెప్పదలిచాను. నేను, శ్రీమతి యార్లగడ్డ శైలజగారు, విజయవాడలో నూతనంగా దూరదర్శన్ కేంద్రం ఏర్పాటు చేసిన తొలినాళ్లల్లో అక్కడ పనిచేశాం. అప్పటికి విజయవాడ కేంద్రంగా ప్రసారాలు ఉండేవి కాదు. కానీ కార్యక్రమాలు ఆ ప్రాంతంలో రూపకల్పన చేసి, హైదరాబాద్ కేంద్రం ద్వారా ప్రసారం చేసే వాళ్లం. అలాంటి నేపథ్యంలో ఒక రోజు బుద్ధప్రసాద్ గారు విజయవాడలోని మా కేంద్రానికి వచ్చారు. మామూలు ముచ్చట్లు ముగిసాక, దివి సీమవైశిష్ట్యాన్ని వివరించారు.

చారిత్రక పౌరాణిక ప్రాశస్త్యం కలిగిన ఆలయాలెన్నో ఈ ప్రాంతంలో ఉన్నాయని, వాటన్నిటిపైనా ఒక డాక్యుమెంటరీని నిర్మించడం ద్వారా, తెలుగు వారందరికీ, ఈ ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిచయం చెయ్యొచ్చని అన్నారు. బుద్ధప్రసాద్ గారి విషయ సేకరణకు, విపులీకరణకు నేనూ, శైలజగారు ఆశ్చర్యపోయిన సన్నివేశమది. ఆ క్షణమే, డాక్యుమెంటరీ నిర్మాణానికి సంకల్పం కూడా చేసుకున్నాం.

అటు తర్వాత, మా దూరదర్శన్ బృందంతో కలసి నేను, నాలుగైదు విడతలుగా దాదాపు ముప్ఫై రోజుల పాటు, దివి తాలూకాలో పర్యటించాను. దివి తాలూకానే కాకుండా, దానికి సరిహద్దుల్లో ఉన్న ప్రధాన చారిత్రక, పౌరాణిక ప్రశస్తి కలిగిన ఆలయాలను, ప్రదేశాలను కూడా సందర్శించి చిత్రీకరించాము. ఇక్కడ ప్రత్యేకంగా చెప్పవలసినదేమంటే మేము ఆ ప్రాంతాలలో సంచరించిన ప్రతి నిముషము, బుద్ధప్రసాద్ గారూ మాతో ఉన్నారు. అంతేకాదు, ఆ పర్యటనలో ప్రతి ప్రాంతానికి రవాణా సౌకర్యమూ, వెళ్లిన చోటల్లా ఆహార పానీయాల ఏర్పాట్లు ఆయన ఏర్పాటు చేసినవే. ఇలా దగ్గరుండి ప్రతి చిన్న విషయాన్ని స్వయంగా చూసుకున్న మరొక రాజకీయవేత్తను నా నాలుగు దశాబ్దాల వృత్తి జీవితంలో నేనెప్పుడూ చూడలేదు. అందుకే ఆయన నా కళ్ళకు రాజకీయవేత్తలా కాదు, సామాజిక సేవా కార్యకర్తలా గోచరిస్తారు. బుద్ధప్రసాద్ సహనానికి, ఓపికకు, అంకిత స్వభావానికి, ఆ రోజుల్లో మా సహచరులంతా జోతలు చేసినవాళ్ళే. ఈ కార్యక్రమానికి నాగార్జున విశ్వవిద్యాలయం, విశ్రాంత ఆచార్యులు యార్లగడ్డ బాలగంగాధరరావు సూత్రధారిగాను, డా. వేదాంతం రాజగోపాల చక్రవర్తిగారు రచయితగాను, బుద్ధప్రసాద్ గారి కోరిక మేరకు మాకు సహాయ సహకారాలందించారు. ఈవిధంగా దూరదర్శన్ విజయవాడ సముపార్జించుకున్న ఈ దృశ్యసంపదను, 2004 కృష్ణా పుష్కరాల సమయంలో ప్రతి రోజు ఒక్కొక్క ఆలయాన్ని పరిచయం చేస్తూ, ప్రసారం చేసి, మా పుష్కర ప్రత్యేక ప్రసారాలను సుసంపన్నం చేసుకున్నాం. ప్రత్యేక అనుమతులతో, తాత్కాలిక ప్రత్యక్ష ప్రసారాలను కూడా నిర్వహించగలిగాం.

రెండో సందర్భాన్ని కూడా ఇక్కడ ప్రస్తావిస్తాను. డా॥ పాలకుర్తి మధుసూదనరావుగారు సంచాలకత్వ బాధ్యతలు నిర్వర్తిస్తున్న రోజుల్లో, బుద్ధప్రసాద్‌గారితో చర్చించి, విజయవాడలో ఒక మంచి కార్యక్రమాన్ని రూపొందించమని సూచించారు. ఈ సన్నివేశంలో నేను, బుద్ధప్రసాద్ గారు, ప్రత్యేకంగా దూరదర్శన్‌లో సమావేశమయ్యాం. తెలుగు భారతి, భారత భారతిగా రూపుదిద్దుకున్న కృష్ణా జిల్లాలో, ప్రేక్షకుల సమక్షంలో ఒక కవి సమ్మేళనాన్ని ఏర్పాటు చేద్దామనే నిర్ణయానికి వచ్చాం. ఈ వివరం మధుసూదన రావుగారికి చెప్పగానే బావుంది. 'బాపూ! నీకు జోహార్లు' అంటూ ఆ క్షణంలోనే, శీర్షిక నామకరణం చేశారు. విజయవాడలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ప్రేక్షకుల సమక్షంలో కవి సమ్మేళనం ఏర్పాటు చేశాం. విజయవాడ, కృష్ణా జిల్లా కవులనే కాకుండా ఆనాటి సంయుక్త ఆంధ్రప్రదేశ్‌లోని కవి ప్రముఖులందరినీ ఆహ్వానించి, దాదాపు 25 మంది కవులతో భారీ కవిసమ్మేళనాన్ని ఏర్పాటు చెయ్యడం జరిగింది. ముఖ్య అతిథి మండలి బుద్ధప్రసాద్. హైదరాబాద్ నుంచి సంచార చిత్రీకరణ యంత్రాంగాన్ని విజయవాడకు తరలించి దాదాపు నలభై మంది ఉద్యోగుల సహకారంతో, కార్యక్రమాన్ని రూపొందించాము. అదొక అనూహ్య విజయం. ఆ కార్యక్రమ ప్రారంభంలో ముఖ్యఅతిథిగా మండలి బుద్ధప్రసాద్ గారు చేసిన ప్రసంగం ఆనాటి ఆహుతుల్ని ఆశ్చర్య చకితుల్ని చేసింది. తండ్రి గారితో సహా ఆ కుటుంబం, గాంధేయవాదులు కావడం, తండ్రి ఏర్పాటు చేసిన

గాంధీక్షేత్రాన్ని అంతే నిర్వహణాదక్షతతో నడిపించడం, ఇవన్నీ కారణాలు కావొచ్చు. గాంధీతత్వాన్ని ఆరోజు బుద్ధప్రసాద్ గారు వచోవైభవంగా వివరించారు. మహాత్ముని మూర్తిమత్వాన్ని మాటలు కట్టి ఆయన ఆవిష్కరించిన తీరు ఇప్పటికీ నా కర్ణేంద్రియాలలో నిక్షిప్తమై ఉంది.

నేను పదవీ విరమణ చేసిన అనంతరం, కిన్నెర సంస్థ నా షష్ట్యబ్దిపూర్తి మహోత్సవాన్ని వైభవంగా జరిపింది. ఆ సభకు ముఖ్యఅతిథి మండలి బుద్ధప్రసాద్ గారే. కానీ, ఆనాటి సభకు రాలేకపోయారు. ముఖ్యమంత్రిగారితో, అత్యవసరమైన సమావేశ కారణంగా విజయవాడలోనే ఉండిపోయారు. "మనిషిని ఇక్కడ ఉన్నాను గానీ, మనసక్కడే వుంది పార్వతీశం!" అని ఆయన ఫోన్లో తన అశక్తతకు వివరణ చెబుతుంటే, సభకు రాలేదన్న బాధకన్నా, ఇటువంటి అమృత హృదయుని సాన్నిహిత్యం దొరికినందుకు ఎక్కువ ఆనందపడ్డాను. మరి కొన్నాళ్ళకు విజయవాడలోనే, తన సారథ్యంలో నా షష్ట్యబ్ద పూర్తిని మరోసారి వైభవంగా జరిపించి ఆలోటు తీర్చేశారు.

కొత్త సినిమా విడుదలయ్యాకా, ఆ సినిమాని ప్రచారం చేసుకునే సందర్భంలో, పత్రికా విలేకర్ల సమావేశంలో, సినిమా హీరోలు, ఈ మధ్య తరచుగా ఒక మాట చెబుతున్నారు. "ఈ సినిమాలో నా పాత్ర చాలా సహజంగా ఉంటుంది. పక్కింటిలోని మనకి తెలిసిన వాళ్ళ అబ్బాయిలాగా, పొరుగింటి కుర్రాడిలాగా. అంచేత అందరూ నా పాత్రని బాగా కనెక్ట్ అవుతారు" అని. అలా ఒక వ్యక్తి రాజకీయాల్లో వున్నాడంటే, అది బుద్ధప్రసాద్‌గారే, నిజంగా మన పక్కింటి కుర్రాడిలాగే ఉంటారు. హంగూ, ఆర్భాటాలు పూర్తిగా శూన్యం! అందుకే నేనూ ఈ నాలుగు మాటలు అలవోకగా చెప్పగలిగాను. ఈ ఘనత వారు సాధించుకున్నదే.

ఇలా ఆయన సాధించుకున్న వ్యక్తిత్వమే అక్షరాల ఆయన ముఖ చిత్రం. నేను చెప్పింది కూడా అక్షరాల్లో ఆముఖ చిత్రమేగా.



సినీ దర్శకుడు శ్రీ జంధ్యాలను సత్కరిస్తున్న మండలి బుద్ధప్రసాద్

పరమాత్మీయానుబంధం మాది

- డా॥ కె.వి. కృష్ణకుమారి

మాననీయ మూర్తి, మానవతకు స్ఫూర్తి, నిజమైన కర్మయోగి మా సోదరులు శ్రీ బుద్ధప్రసాద్ గారు. 'గారు' అని అతికష్టం మీద అనగలుగుతున్నాను. ఎందుకంటే, దైవపరమైన లక్షణాలను సొంతం చేసుకున్న 'మనీషి' 'గారూ' అన్న సంబోధనకు అతీతులు. ఐనా కొన్ని లాంఛనాలను పాటించక తప్పదేమో!

మానవత్వం ముందు తలవంచుతాము.
మంచి తనంలో మమేకమవుతాము.
నిష్కళంక వ్యక్తిత్వానికి చేతులు జోడిస్తాము.
నిరుపమాన మనస్వితో చేతులు కలుపుతాము.
బుద్ధప్రసాద్ గారి ముందు మనమలాగే ఉంటాము.
మానవత్వమా! నీ చిరునామా ఎక్కడంటే,
మంచి తనమా! నీ ఉనికి ఎక్కడంటే,
నిష్కళంకమా! నీ స్థానం ఎక్కడంటే,
నిర్వచన కతీతమైన మానసిక తపస్వీ! నువ్వెక్కడున్నావంటే,
వచ్చే సమాధానం ఒక్కటే, ఒక్కటే, ఒక్కటే,
అదే శ్రీ బుద్ధప్రసాద్ దగ్గరేనని–
శ్రీ బుద్ధప్రసాద్‌లో లోనేనని–
శ్రీ బుద్ధప్రసాద్ తోనేనని.

కర్మసిద్ధాంతాన్ని ప్రగాఢంగా నమ్మే నేను, గీతావాక్యాలనే ప్రామాణికాలుగా ముందుకు సాగిపోయే నాకు, పునర్జన్మల పైనా, పూర్వ జన్మల అనుబంధాల పైనా ప్రగాఢమైన విశ్వాసం ఉంది. పునర్జన్మ తాలూకు అనుభూతుల పైనా అంతరాత్మ పరమైన అనుభవాలు ఎన్నో వున్నాయి. గత జన్మ తాలూకు అనుబంధీకులు. ఈ జన్మలో ఏదో రకంగా దగ్గరవుతూనే ఉంటారు. అంతులేని అనుబంధానికి ప్రతీకలై, అనూహ్యమైన అనుభూతులను తట్టిలేపుతూనే ఉంటారు.

అటువంటి అనుబంధీకులే బుద్ధప్రసాద్ గారు.
అంతటి అనుబంధమే మా ఇద్దరి మధ్యనా ఉన్నది.

జన్మజన్మల అనుబంధాలకు నిర్వచనమై అభిమాన పుత్రికగా నన్ను అక్కున చేర్చుకున్న నా పితృతుల్యులు, మా అంకుల్ డాక్టర్ నీలం సంజీవరెడ్డి గారి ద్వారా కూడా సోదరునితో నా అనుబంధం ప్రగాఢమై, సుస్థిరమై నిలచి పోయింది. అనుబంధానికి మూలకారణం, మా అంకుల్ సంజీవరెడ్డి గారికి శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారి పైన ఉన్న అవ్యాజానురాగం. అంచనాలకతీతమైన మమతానుబంధం. 1945 సం॥లో విద్యార్థి దశ నుంచీ,

కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎ.పి.సి.సి. జాయింట్ సెక్రటరీగా, అంచెలంచెలుగా ఎదిగి, లోక్‌సభకు ఎన్నికై, రాష్ట్రమంత్రిగా కూడా, నిస్వార్థ సేవలను అందజేసిన మండలి వెంకట కృష్ణారావుగారి వ్యక్తిత్వం, సేవానిరతీ, స్వచ్ఛమైన రాజకీయ ప్రస్థానం, తెలుగు భాషాపరమైన విశేషాభిమానం, అంకుల్ సంజీవరెడ్డిగారిని విపరీతంగా ఆకర్షించి ఆప్యాయతతో దగ్గరకు జేర్చింది. అడుగడుగునా ఆయన ప్రశంసలను అందుకునేలా చేసింది.

1977 నవంబర్ నెలలో వచ్చి, దివిసీమను మరుభూమిగా మార్చిన భయంకర తుఫాన్ తెచ్చిన పెను విపత్కాల సమయంలో, ధీరోదాత్తతతో దివిసీమ వాసులను పరిరక్షించుకుంటూ, ఆత్మబంధువుగా ఆదుకుంటున్న మండలివారి నిస్వార్థ సేవా తత్పరతను, ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, చెమ్మర్చిన కళ్ళతో ఆప్యాయంగా కృష్ణారావుగారిని గాఢాలింగనం చేసుకున్నారు. సంజీవరెడ్డి గారు అనేకానేక సేవా కార్యక్రమాలను చర్చించుకుని రూపకల్పన చేసుకున్నారు. పెనుతుఫాన్ ఉప్పెన తాకిడికి వేలాది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది పశువులు విగతజీవులయ్యాయి. ఒంటరి పోరాటం చేస్తున్న తండ్రిగారి చెయ్యందుకుని, ఆయన స్ఫూర్తిని నింపుకుని 20 సంవత్సరాల చిరు వయసులోనే అవిశ్రాంతంగా పాటుపడుతూ రేయింబవళ్ళూ శ్రమించారు చిరంజీవి బుద్ధప్రసాద్. 'దీనజన సంక్షేమ సమితి'ని స్థాపించి, ఆ హృదయ విదారకమైన బీభత్సంలో సర్వమూ కోల్పోయి అనాథలుగా మిగిలిన బాలబాలికలను చేరదీసి, ఆశ్రయం కల్పించి, వృత్తి విద్యలలో శిక్షణనందించి, ఎక్కడ, ఎప్పుడు, ఎవరికి, ఏ రకమైన విపత్తు వచ్చినా నేనున్నానంటూ, సేవా కార్యక్రమాలలో అజేయంగా నిలచిన చిరంజీవి బుద్ధప్రసాద్ సేవానిరతికి పులకాంకితులయ్యారు డాక్టర్ నీలం. అప్పటికే 1977 జులైలో భారత రిపబ్లిక్ రాష్ట్రపతిగా ఏకగ్రీవంగా దేశాధినేతగా ఎన్నికైన ఈ నిష్కళంక త్యాగధనుడు చిరంజీవి బుద్ధప్రసాద్‌ని హృదయపూర్వకంగా ఆశీర్వదించారు.

మా నాన్నగారు డాక్టర్ కాజా జగన్నాథ రావుగారు మా అంకుల్‌కి ప్రాణాధికమైన స్నేహితులు. శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారూ అంకుల్‌కి ఆత్మ సంబంధీకులు. ఆ విధంగా అంకుల్‌కు నేను మానస పుత్రికనైతే, శ్రీ బుద్ధ ప్రసాద్ మానసపుత్రుడు. ఏ జన్మలోనో పెనవేసుకుపోయిన అక్కాతమ్ముళ్ళ అనుబంధం మా ఇద్దరిదీ. బాల్యం నుంచీ కూడా నన్ను కృష్ణక్కగా అభిమానిస్తున్నారని తెలియకుండానే, శ్రీ బుద్ధప్రసాద్ పైన ఆపేక్షనూ, అభిమానాన్ని పెంచుకున్నాను. ఆయనలోని సాహితీ పిపాసనూ, సాంస్కృతికపరమైన అభిమానాన్నీ, తెలుగు భాషపైన ఆయనకున్న మక్కువనూ, తెలుగు భాషాసంస్కృతుల ఉద్ధరణకై కంకణం కట్టుకుని అవిశ్రాంత పోరాటంలో లక్ష్యాన్ని అధిగమించగలుగుతున్న ఆయన కార్యదీక్షనూ, ఆహ్లాదంగా గమనిస్తూ ఆనందాశ్రువులతో కూడిన అక్షయాక్షితలను అందజేసుకునే దాన్ని. అధికార భాషా సంఘ అధ్యక్షునిగా ఆయన సాధించిన విజయాలు అనితర సాధ్యాలు.

అజాత శత్రువుగా, గాంధేయవాదిగా, సామాజిక, సాంఘిక సేవాతత్పరునిగా, ఆయన సాధించుకున్న ప్రత్యేకతలను ఎవ్వరూ, ఎప్పటికీ మరచిపోలేరు. సువిశాలమైన ఆ కళ్ళల్లో శాంతి సందేశాలు కన్పిస్తాయి. నిశితమైన ఆ చూపులలో అపారమైన సాహితీ తృష్ణ నిక్షిప్తమై కన్పిస్తుంది. ఆ చిరునవ్వులో విశ్వప్రేమ తత్వామృతం గోచరమవుతుంది. సుతిమెత్తని ఆ మాటల పొందికలో శత్రువునైనా సమ్మోహనపరచగల ప్రేమతత్వం వినిపిస్తుంది.

తండ్రిగారు స్థాపించిన అంతర్జాతీయ తెలుగు సంస్థలకు ఊపిరిపోస్తూ, వారి స్ఫూర్తితో, గాంధీగారి సిద్ధాంతాల పట్ల మక్కువను పెంచుకుని, అజాత శత్రువుగా, అరాచకీయాలకు సంప్రోక్షణ చేస్తూ, పవిత్ర రాజకీయ ప్రగతిని చూడాలని అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు.

1929వ సం॥లో 16 సం॥ల వయసులో గాంధీజీ అనంతపురం వచ్చిన సందర్భంలో ఆయన సందేశాలకూ, ఆదేశాలకూ ప్రభావితులై తక్షణమే ఖద్దరు ధరించి ఆ క్షణం నుంచీ జీవితాంతం ఖద్దరును మాత్రమే ధరించారు గాంధేయవాది డాక్టర్ నీలం. అలాగే ఆయన మానస పుత్రుడు శ్రీ బుద్ధ ప్రసాద్ కూడా గాంధీజీ సిద్ధాంతాలకు ఆకర్షితులై బాల్యం నుంచే ఖద్దరు వస్త్రాలను మాత్రమే ధరిస్తున్నారు.

ఎటువంటి భావసామీప్యం! ఆత్మ సంబంధీకుల భావన లెప్పుడూ ఒకే పంథాలో పయనిస్తూ ఉంటాయి.

ఇటీవల నేను వ్రాసిన గ్రంథాల ఆవిష్కరణ మహోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీ బుద్ధప్రసాద్ జన్మజన్మల అనుబంధాలకు నిజ దర్పణమైన 'సశేషం' గ్రంథాన్ని ఆవిష్కరిస్తూ హృద్యంగా హృదయాన్ని కూడా ఆవిష్కరింపజేశారు. అక్క వ్రాసిన పితృతుల్యులైన త్యాగధనుడు 'నీలం'కు అంకితమిచ్చిన ఈ గ్రంథాన్ని ఈ మానస పుత్రుడే ఆవిష్కరించాలన్న నా కోరికను సఫలీకృతం చేశారు.

స్వంత ధనాన్ని వెచ్చించడమే తెలుసుగానీ – పరధనాన్ని ఆశించటం తెలియదు.
అనుక్షణం ఆపన్నుల కోసం కష్టపడటమే తెలుసు గానీ,
ఆశ్రిత పక్షపాతమనేది ఉంటుందని తెలియదు.
సౌమ్యంగా, స్నేహపూర్వకంగా, స్వచ్ఛమైన చిరునవ్వుతో రాజకీయాలలో పాలుపంచుకోవడమే తెలుసు గానీ –
కక్షలూ, కార్పణ్యాలూ, రాగద్వేషాలతో కలుషితమయే అరాచకీయాల పొడే గిట్టని ఈ స్థితప్రజ్ఞునిలోని ప్రత్యేకతలన్నీ వారసత్వంగా తండ్రి గారి ద్వారా సంక్రమించిన అమూల్య సంపదే.

నూతన సంవత్సరారంభంలో విధిగా ఫోన్లో శుభాకాంక్షలను పంచుకుంటాం. "ఈ రాజకీయ పరిస్థితులలో అసెంబ్లీ వాతావరణాన్ని కూడా తట్టుకుని నిలద్రొక్కుకునే శక్తిని భగవంతుడు మీకివ్వాలన్నదే నా ఆకాంక్ష" అన్న నా కోరికకు పెద్దగా నవ్వేస్తారాయన.

ఆ నవ్వులో పవిత్రమైన పసితనమే విన్పిస్తూంది. నా కోరిక నెరవేరి తీరుతుందన్న దృఢత్వం కూడా కన్పిస్తుంది.

సాహితీ, సంస్కృతీ, నృత్య కళలకు నిలయమైన 'కిన్నెర' ఎప్పుడూ, తన ప్రత్యేకతలకు పట్టం కడుతూనే ఉంటుంది. తండ్రిగారి ఆశయాలను సఫలీకృతం చేసే నేపథ్యంలో శతాధిక గ్రంథాలను ప్రచురించి, ప్రముఖులను సత్కరించుకుంటూ, పవిత్రమైన సాహితీ యజ్ఞాలను కూడా చేపడుతూ, రఘురాముడిగా తన పేరును సార్థకం చేసుకుంటున్న సోదరులు రఘురాం గారికీ, ఆయనలో నిలచిన నిండైన స్ఫూర్తి, నా సోదరి నృత్య కిన్నెర ఉషాగాయత్రికీ నా హృదయ పూర్వకమైన అభినందనలు తెలియజేసుకుంటున్నాను.

శతాధిక సంవత్సరాలకు పైగా ఆర్తులను ఆదుకుంటూ, అభిమానులను అలరిస్తూ, సమాజానికి సేవలందిస్తూ, ఎప్పటికీ ఇలాగే, ఆనందంగా, ఆహ్లాదంగా, ఆరోగ్యంగా ఉండాలని, 60వ జన్మ దినోత్సవ సందర్భంగా నా ప్రియమైన సోదరులు చి॥ బుద్ధప్రసాద్ (గారి)ని కృష్ణక్కగా ఆశీర్వదిస్తూ అభినందన చందనాలనందజేస్తున్నాను.

తెలుగుభాష ఉద్యమ సారథి, సాంస్కృతిక బంధువు

- ఆకెళ్ళ

తెలుగు భాషకు, మండలి వారికి ఉన్న సంబంధం ఏమిటో కానీ, శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారికి తెలుగు భాష అంటే చాలా చాలా ఇష్టం. ఇక తెలుగు భాష వికాసానికి వారు చేసిన సేవ అనన్య సామాన్యం.

1974 సం. మండలి వెంకట కృష్ణారావు గారు ప్రపంచ తెలుగు మహాసభలకు ఏర్పాట్లు చేస్తున్నపుడు, మండలి వెంకట కృష్ణారావు గారిని మొట్టమొదటిసారి నేను కవిసామ్రాట్ విశ్వనాథ సత్యన్నారాయణ గారి ఇంట్లో చూశాను. అది తెలుగు మహాసభలు జరగబోయే ముందు దృశ్యం.

కవిసామ్రాట్‌కి శ్రీ కృష్ణారావు గారంటే ఎంత ప్రేమో – శ్రీ కృష్ణారావు గారికి సత్యన్నారాయణ గారంటే ఉన్న భక్తి ఏమిటో నాకంటితో చూశాను.

వారు మాట్లాడుతుంటే వేయి పడగలు నవలలో హరప్పనాయుడు – సుబ్బనశాస్త్రి నాకు గుర్తుకువచ్చేరు. నాయకుడంటే ఎలా ఉండాలో కవులపట్ల, కళలపట్ల – గాయకులు చూపించాల్సిన గౌరవం, ఆదరణ ఏమిటో నాటి విద్యాశాఖ మంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణారావు గారి దగ్గర చూశాను. సాటి మనుషుల పట్ల వారి వాత్సల్యం అనుభవించాను.

ఆ తర్వాత వారిని రెండు మూడుసార్లు కలిసాను. ఆయనెప్పుడూ అంతే ఆదరాన్ని చూపారు. నా పట్లే కాదు అందరి కళాకారుల పట్ల, కవులపట్ల అదే ఆదరణ చూపటాన్ని నేను గమనించాను.

దాదాపు పాతికేళ్ల తర్వాత ఆ దివ్యసీమ నుంచే శ్రీ మండలి కృష్ణారావు గారి పుత్రరత్నం, తండ్రిని మించిన తనయుడు అనిపించుకున్న శ్రీ మండలి బుద్ధప్రసాద్ రాజకీయాల్లోకి వచ్చారు.

తండ్రి రాజకీయ వారసత్వాన్నే కాదు, మంచితనాన్ని – సర్వసమానత్వాన్ని పుణికి పుచ్చుకున్నారు శ్రీ బుద్ధప్రసాద్. వారితో పరిచయం ఏర్పడిన దగ్గరినుంచి చూస్తున్నాను. చెరగని చిరునవ్వు – అందరిని ప్రేమించే ప్రేమగుణం వారి సొత్తు.

ఏ రాజకీయ పార్టీలో శ్రీ బుద్ధప్రసాద్ గారున్నా – ఆయన అందరికీ ఇష్టులే. ఆయనే పార్టీలో వున్నా సాంస్కృతిక రంగాలకి, తెలుగు భాషకి వారందిస్తున్న సేవలు చిరస్మరణీయాలు. చిరుదరహాసంతో సదా అందరికి వెన్నెలలు పంచే జాబిలి శ్రీ బుద్ధప్రసాద్. నేను వారి తండ్రి గారితో ఆత్మీయత పంచుకుని కుమారునితో కూడా చక్కటి స్నేహాన్ని సాధించుకున్నందుకు సంతోషిస్తూ – నేను రాసిన "స్వర్ణ నందులు" అనే రెండు నాటకాల సంపుటిని 2012 సంIIలో వారికి అంకితం చేసుకున్నాను.

ఆ సందర్భంగా నేను అవనిగడ్డకి వెళ్లటం జరిగింది. ఆ ఊరిలో జనానికి – వారి కుటుంబం పట్ల – ముఖ్యంగా బుద్ధప్రసాద్ గారి పట్ల ఉన్న ప్రేమాభిమానాలు చూసి ఆశ్చర్యపోయాను.

రాజకీయాల్లో ఉన్న నాయకుల పట్ల, కొందరు ఇష్టులు – కొందరు అయిష్టులు ఉంటారు. అలాంటిది ఊరందరికి ఆయనంటే అభిమానమే అది భయం కాదు, భక్తి వాత్సల్యం. వారి అన్న గురించో, తాత గురించో, తండ్రి గురించో ప్రస్తావించినట్లు చూసి ముగ్దుడ్ని అయిపోయాను.

రాజకీయాల్లో ఆయన సంపాదించుకున్నది ఏదీలేదని కూడా అప్పుడే, అక్కడే విన్నాను. అయితే అది అబద్ధం అనిపించింది. ఆయన ప్రజల మనసుల్ని పూర్తిగా దోచుకున్నారు – ఇది నిజం.

శ్రీ మండలి బుద్ధ ప్రసాద్ గారి షష్టిపూర్తి సందర్భంగా వారికి భగవంతుడు ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలని సాహితీ మూర్తులందరి తరపున కోరుకుంటున్నాను.



న్యూఢిల్లీలో జరిగిన 'కృష్ణాపత్రిక' శతజయంతి సభలో మంత్రి శ్రీ బండారు దత్తాత్రేయ, మాజీ ప్రధాని శ్రీ పి.వి. నరసింహారావు, ప్రధాని శ్రీ అటల్ బిహారీ వాజ్‌పాయ్, కేంద్ర మంత్రి శ్రీ ఎం. వెంకయ్యనాయుడు, శ్రీ పిరాట్ల వెంకటేశ్వర్లు, ప్రసంగిస్తున్న మండలి బుద్ధప్రసాద్

సౌజన్యమూర్తి

- బి. హనుమారెడ్డి

శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారు పేరుకు తగ్గట్టుగా సౌజన్యమూర్తి. తోటివారిని ఇంపుగా అభిమానించే వ్యక్తి. చిరునవ్వు, ఆయన వ్యక్తపరిచే ప్రేమ ఆయన్ను ప్రజల హృదయాల్లోకి చేర్చి పదిలపరిచాయి.

బుద్ధప్రసాద్ గారు సమాజాన్ని చేతనావస్థకు నడిపే సారథి. అది వారి తల్లి–తండ్రి గారల నుండి వచ్చిన జన్యుసంపద. సాంప్రదాయ, సాంస్కృతిక, మానవీయ విలువలకు, మానవ సంబంధాలకు హారతులెత్తుతారు. నమ్రత ఆయన సిరి, సంపద. నిజాయితీకి పెట్టింది పేరైన నాయకులు.

భాషాసేవను పరమావధిగా భావించిన తెలుగుతల్లి ముద్దుబిడ్డడు. కృష్ణా జిల్లా రచయితల సంఘం గౌరవ అధ్యక్షునిగా ప్రస్థానిస్తూ, అధికార భాషాసంఘం అధ్యక్షునిగా పగ్గాలు చేపట్టారు. కాని ఆ చట్టపరిధిలోనే నడవాల్సి వచ్చింది. ప్రజలు, ప్రభుత్వం తెలుగు భాషా వాడకంపై రాష్ట్రంలోని జిల్లాల్లో పర్యటించి చర్చలు జరిపి ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు భాష వాడకంపై చర్యలు చేపట్టారు.

సాటి మా ప్రకాశం జిల్లా రచయితల సంఘానికి గుర్తింపునిచ్చి, విలువ పెంచి, నన్ను, మా సంఘాన్ని బహుగా ప్రశంసించారు. మా సంఘం నిర్వహించిన రాష్ట్రస్థాయి మహాసభల ప్రారంభాలలో, ముగింపులలో ప్రసంగించి ముందుకు నడిపారు. 2016 జనవరి 8వ తేదీన మా సంఘం జరుపుకున్న స్వర్ణోత్సవాలను ప్రారంభించి సాహితీ సంఘాల చరిత్రలో మా జిల్లా రచయితల సంఘం పేరును స్వర్ణాక్షరాలతో లిఖింపజేశారు.

మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు తండ్రి క్రిష్ణారావు గారు జరిపితే, నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు బుద్ధప్రసాద్ గారు అంతా తానై నడిపారు.

తెలుగువారెక్కడున్నా వారి ఆత్మగౌరవం బుద్ధప్రసాద్‌గారి నినాదం.

వీరు, వీరి తండ్రి గాంధేయవాదులు. ఏ పార్టీలో ఉన్నా యం.యల్.ఏ.గా, మంత్రిగా, డిప్యూటీ స్పీకరుగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తున్నారు.

మంచి ప్రజారచయితగా పేరులో కొచ్చారు.

బుద్ధప్రసాద్ గారు, షష్టిపూర్తేకాక, సహస్ర చంద్ర దర్శనోత్సవమే కాక, శతవసంతోత్సవం జరుపుకునే ఆయురారోగ్యాన్ని ఆయనకు భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థిస్తూ షష్ట్యబ్ది ఉత్సవం జయప్రదం కావాలని కోరుకుంటూ ఆశీస్సులందిస్తూన్నాను.

కారణజన్ములు

- అశ్వినీకుమార్

కొందరు వ్యక్తులు కారణజన్ములు. విచిత్రమేమంటే – ఈ విషయం వారికి ఎరుక కలిగినట్లే తమ జీవనయానాన్ని మొదటి అడుగునుంచి సమాజ స్పృహతోనే, తోటివాని అవసరానికి, పుట్టినగడ్డ స్ఫూర్తిని, మట్టివాసనను వదలకుండానే జిల్లాస్థాయిలో, రాష్ట్రస్థాయిలో, జాతీయస్థాయిలోనే కాకుండా అంతర్జాతీయంగా తన జాతికి, భాషకు అహరహము సేవలందిస్తూ తాము కారణజన్ములమని చెప్పక చెప్పగలరు.

జన్మతః అహింసచ జాతీయవాద వాతావరణంలో సంచరించినా తన విద్య, పెరుగుదల ఒక సేవాతత్పరుడు, విద్యాధికుడు, గాంధేయమార్గంలో రాజకీయ ప్రజాసేవలో నడుస్తున్న తండ్రి కనుసన్నల్లో తన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకుని వినయశీలునిగా, నిగర్విగా ప్రజాజీవితంలో, రాజకీయాలలో రాణించటం కత్తిమీద సాము! ఎన్నో ప్రకృతి వైపరీత్యాలకు అతలాకుతలమైన గడ్డపై ప్రజలకు అండగా నిలబడి, కుల రాజకీయాల కీలలలో దగ్ధమైన పురిటిగడ్డ మీద ఒక దీపస్తంభంలా నిలబడి, ప్రజలను మళ్లీ సన్మార్గంలో మళ్లించగలిగిన ధీశాలి!

అంతేనా – తన తల్లి భాష అంతరించిపోతున్న పట్టీలో ఉందని తెలిసిన క్షణం నుంచి ఈనాటి వరకు – తెలుగును, తెలుగు ప్రభను మళ్లీ దేదీప్యమానంగా వెలిగించటానికి ఆయన చేయని శ్రమలేదు, తిరగని భారత, ఖండాంతర ప్రదేశం లేదు. అవిశ్రాంతంగా గత 15 సంవత్సరాలుగా ఎన్నో సభలు జరిపారు, జరిపించారు, ఉద్గ్రంథాలు పొందుపరిచారు, నాలాంటివాళ్లకు స్వయంగా తెచ్చి అందించారు. ఇవన్నీ త్రికరణశుద్ధిగా ఆచరించాలంటే తనను, తన ప్రజను, తన భాషను, తన పురిటిగడ్డను ఎంతగానో ప్రేమించాలి. ఆ శ్రమను కార్యాచరణలో వ్యక్తీకరించాలి. అలా చేయగలిగేది – కారణజన్ములే.


ఆయన రాజకీయ ప్రస్థానం ఎన్ని ఒడిదుడుకులకు లోనయిందో కృష్ణాజిల్లావాసిగా నాకు తెలుసు. ఎప్పుడూ ప్రజలతోనే ఉన్నారు. ప్రజాసేవకే అంకితమైనారు. టెలిఫోను బిల్లుకు డబ్బులు వెతుక్కోవడం నేను చూశాను. నాలాంటి నలుగురు స్నేహితుల్ని అవనిగడ్డ పిలిచి, తమ ఆతిథ్యాలు అందించారు. ఒక ఎమ్.ఎల్.ఎ. లేదా ఒక మంత్రి ఆర్భాటం ఉందనుకుంటే పొరపాటే. తనతోపాటే మాకూ – కానీ ఎంతటి ఆప్యాయత!

“రేపు మలేషియా వెళ్తున్నాను. ఆహ్వానం స్వయంగా ఇద్దామనుకున్నాను. నా కార్యదర్శి ద్వారా పంపుతున్నాను. మీరు తప్పకరావాలి...” ఇదీ మొన్న ఫోను! తరచూ కాకపోయినా అప్పుడప్పుడూ ఇటుగా వచ్చినపుడు మిసిమి కార్యాలయానికి తప్పనిసరిగా వస్తారు. ఎప్పుడైనా రచనలూ పంపిస్తారు. ఇంత నిరాడంబరి ఈ రాజకీయ చదరంగంలో ఎట్లా నెగ్గుకొస్తున్నారో కదా అనుకుంటాను. దీనికీ ఎంతో సంయమనం, సహనం కావాలి మరి. ఆయనలో గొప్ప 'సమతుల్యాన్ని' గమనించాను. ఎప్పుడూ చిరునవ్వు

చెరగనివ్వరు. చొక్కా – అదే ఖద్దరు చొక్కా – నలగనివ్వరు. అంతే. అంతకంటే ఏ ఆడంబరాలు, అలంకారాలు ఉండవు. రిస్ట్‌వాచి కూడా ఉందోలేదో?

బందరులో, అవనిగడ్డలో, హైదరాబాదులో ఆయన ఉపన్యాసాలు విన్నాను. ఎప్పుడూ అతిశయోక్తులుగానీ, సభనలంకరించినవారిని పొగడడం కాని వినలేదు. విషయాన్ని సూటిగా చక్కని తెలుగులో తెలియజెప్పగలరు. సభికుల చప్పట్ల కోసం ఆశించరు కూడా. ఇలాంటి వ్యక్తి ఎన్నికల్లో ఎలా నెగ్గుకొస్తున్నారో అని ఆశ్చర్యమేస్తుంది. ముఖ్యంగా నోరు విప్పితే అబద్ధాలు చెప్పే రాజకీయ నాయకుల వలయంలో, కేవలం 'ప్రజాసేవ' కోసం అధికారంలో ఉండాలని ఉవ్విళ్ళూరే పార్టీ పెద్దల మధ్యలో ఆయన ఎంత 'జాగరూకుడై' ఉండాలి? మరి కారణజన్ములు ఆ మాత్రం జాగ్రత్తపడగలరుకదా. కార్యనిర్వహణే వారి ప్రచారం. సత్సంకల్పమే వారి సత్యసంధత! ఘంటసాల నుంచి అమరావతి వరకు బౌద్ధం విలసిల్లిన సీమ! దివిసీమ, మరి ఆయన పేరులో 'బుద్ధ' అనే ఉంటుంది. చల్లపల్లి రాజాలా 'ప్రసాద్' ఆ సీమలో ఎక్కువశాతం నామధేయాల్లో చోటుచేసుకుంటుంది. అలా ఆయన 'బుద్ధప్రసాద్'గా ప్రసిద్ధులు!

శతాయుష్మాన్‌భవ!



కలెక్టర్ శ్రీ డి.ఆర్. మీనాతో సాగర సంగమం ప్రదేశ సందర్శన

అభినందన

- డా. రాపాక ఏకాంబరాచార్యులు

సౌజన్యమూర్తి, సాహితీరససింధువు, మందస్మిత ప్రసన్నవదనులు, మాన్యమహోదయులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి మే నెలలో జరుపబోయే షష్ట్యబ్దిపూర్తి మహోత్సవం మనందరికి ఆనందదాయకము, హర్షదాయకము.

నాకు వారితో 30 సంవత్సరాల చెలిమి ఉన్నది. 1986లో వారితో నాకు పరిచయం ఏర్పడింది. 1985లో నేను ఏలూరు డి.ఆర్.డి.ఏ.లో క్రెడిట్ ప్లానింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగిస్తున్నాను. వారి బంధువు ఏలూరులో నా సహోద్యోగి. వారు బుద్ధప్రసాద్ గారి గురించి చెబుతూ ప్రసాద్ గారు "గాంధీక్షేత్రం" అనే పత్రికను నడుపుతున్నారు, దానిలో మీ వ్యాసాలు వ్రాయండి అని నన్ను ప్రోత్సహించారు. అప్పుడు నేను గాంధీక్షేత్రం పత్రికలో 5 వ్యాసాలు వ్రాశాను. అవి 1) శాంతి దూత శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి 2) శ్రీ బులుసు సాంబమూర్తి 3) రాయలసీమ రత్నం కల్లూరి సుబ్బారావు గారు 4) శ్రీ దామోదరం సంజీవయ్య 5) శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ గారలు అనేవి. చాలాకాలం అంటే దశాబ్దికాలం ఆ పత్రికను ప్రసాద్ గారు నడిపారు కాని అనివార్య కారణాల వల్ల ఆ పత్రిక నిలిచిపోయినందులకు వారు చాలా విచారించారు. "మా తండ్రిగారి కోరిక ఈ పత్రిక నడపాలని, వారు కోరేవారు కాని దానిని నడపలేకపోయినందుకు బాధపడేవారు' ' అనేవారు. కాని ఆ పత్రిక నడచినంత కాలం మంచి పేరు సంపాదించింది. మంచి సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ, మొదలైన అంశాలు, బుద్ధప్రసాద్ గారు చేసిన ఇంటర్వ్యూలతో శోభిల్లిందా పత్రిక.

వారితో నా పరిచయంలో రెండవ ఘట్టం. అవనిగడ్డలోనూ క్రిషి (కృష్ణా ఇండస్ట్రియల్ సెల్ఫ్ హెల్ప్ ఇన్‌స్టిట్యూషన్) సంస్థ ద్వారా యువకుల శిక్షణ కొరకు టి.వి. ట్రెయినింగ్ సెంటర్ ప్రారంభించడం. నేను విజయవాడలో క్రిషి స్పెషల్ ఆఫీసర్‌గా ఉద్యోగిస్తున్నాను. వారు అవనిగడ్డలో టి.వి. ట్రెయినింగ్ సెంటర్ పెట్టాలన్నారు. వెంటనే మండలి వెంకటకృష్ణారావు గారి ద్వారా జిల్లా కలెక్టర్ భట్టాచారి గారికి ఫోను చేయించగానే కలెక్టర్‌గారు సరేనన్నారు. అక్కడ ట్రెయినింగ్ సెంటర్ పెట్టాము. అది సమర్థవంతంగా నడిచింది. నేను 15 రోజుల కొక పర్యాయం పరిశీలనకు వెళ్లేవాడిని. అక్కడ ప్రసాద్ గారింట్లో భోజనం. ప్రసాద్ గారి తల్లి శ్రీమతి ప్రభావతిదేవి గారి వంట అమృతసదృశం. ట్రెయినింగ్ సెంటర్ గాంధీక్షేత్రంలో వారిచ్చిన గదిలో చాలా సమర్థవంతంగా నడిచింది. మూడు పర్యాయాలు హైదరాబాదులో ప్రసాద్ గారింట్లో భోజనం చేశాను. ప్రసాద్ గారి భార్య కాశీ అన్నపూర్ణ వంటిది. ఆమె ప్రేమతో ప్రసాద్ గారికి, నాకు చక్కని భోజనం స్వయంగా వడ్డించి పెట్టారు.

ప్రసాద్ గారు సమర్థవంతంగా 3 పర్యాయాలు (2007, 2011, 2014) విజయవాడలో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించారు. వారు నన్ను పద్యకవిత్వంపై వ్యాసం వ్రాయమన్నారు. సరేనని

నేను వ్రాయడం మొదలు పెట్టేటప్పటికి అది 45 పేజీల దగ్గర ఆగింది. అప్పుడు ప్రసాద్ పశుసంవర్ధక శాఖ మంత్రిగా నున్నారు. వారు సెక్రటేరియట్‌లో 'బి' బ్లాక్‌లో నున్నారు. వ్యాసం పట్టుకు వెళ్ళాను. వారి దగ్గర సెక్రటరీ కూర్చున్నారు. నా వ్యాసం వారికిమ్మన్నారు. నేను వారికిచ్చాను. అది చూచి వారు ఇంత పెద్ద వ్యాసమా అన్నారు. వెంటనే బుద్ధప్రసాద్ జోక్యం చేసుకుని దానిని ప్రింట్ చేసెయ్యమన్నారు. అది ప్రింటయ్యింది. ప్రింట్‌లో 25 పేజీలు దాటింది. నా యందు వారికున్న ప్రేమ, అనురాగము అటువంటివి. తరువాత రెండవ ప్రపంచ సభలకు 'పద్యకవిత్వము భవితవ్యము' గూర్చి నేను వ్రాసిన వ్యాసము ప్రింటయ్యింది. మూడవ సభలకు 'మానసిక ఉల్లాసాన్ని కలిగించే మహనీయ కళారూపాలు' అనే వ్యాసం వ్రాశాను.

తెలుగు భాషా సంస్కృతుల పట్ల వారికున్న అభినివేశము, భక్తితత్పరతలు వర్ణింపశక్యము కాదు. పశుసంవర్ధక శాఖామంత్రిగాను, అధికార భాషా సంఘాధ్యక్షులుగాను సమాజానికి భాషా సాహిత్యాలకు నిరుపమానమైన సేవ చేశారు. నేడు ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గానున్నారు. రాబోయే రోజులలో అనేక పదవులను నిర్వహించి గొప్పవిఖ్యాతి నార్జించగలరు. జగత్కళ్యాణమూర్తియైన సర్వేశ్వరుడు బుద్ధప్రసాద్ గారికి ఆయురారోగ్యైశ్వర్యములు, సుఖశాంతులు ప్రసాదించుగాత!



మైసూరు బృందావన్ గార్డెన్స్‌లో మండలి కుటుంబం

అజాత శత్రువు

- శారదా అశోకవర్ధన్

మల్లె చెట్టుకు మల్లెపూలే పూస్తాయి. ఉల్లిచెట్టుకి ఉల్లిపూలే పూస్తాయి. విత్తనం ఒకటైతే చెట్టు మరొకటి రాదు కదా! సంస్కారవంతమైన, సాహితీవనమైన ఇంట్లో, నాటి మంత్రివర్గంలో ఒకరై నిరాడంబర, నిష్కళంక జీవితాన్ని గడిపి, సాహితీమూర్తిగా, కళాపోషకులుగా ప్రసిద్ధి గాంచిన శ్రీ మండలి కృష్ణారావు గారికి సుపుత్రుడుగా పుట్టిన బుద్ధప్రసాద్ గారు సాక్షాత్తూ తండ్రి దగ్గరి నుంచి అన్ని సుగుణాలను పుణికిపుచ్చుకుని, పుత్రోత్సాహాన్ని తల్లిదండ్రులకు కలిగించిన మనీషి. దివిసీమలో అవనిగడ్డలో కృష్ణారావు గారు నిర్వహించిన కార్యక్రమాలు ఇటు సాహితీ పరంగా అటు సంక్షేమ సహితంగా ఇప్పటికీ మరపురానివి, మరిచిపోలేనివి.

కౌలాలంపూర్‌లో జరిగిన రెండవ ప్రపంచ తెలుగు మహాసభలో నిర్వహించిన కవి సమ్మేళనంలో పాల్గొనడం మరువలేని అనుభూతి. అక్కడ అందరి ప్రముఖుల సమక్షంలో అందుకున్న కవి సమ్మేళన సత్కారం జీవితాంతం మరువలేనిది. రామాయణం గురించి వింటూ రాముణ్ణి ప్రార్థిస్తున్నప్పుడు, రాముడు అంత గొప్పవాడయినా దశరథపుత్రా, కౌసల్య తనయా అంటూ కూడా గుర్తుచేస్తాం. అలాగే బుద్ధప్రసాద్ గారు తల్లిదండ్రుల సంస్కారాన్నీ, సహనాన్నీ, సద్బుద్ధినీ సంపూర్ణంగా సంతరించుకున్న మనీషి. కనుక వారి గురించి ప్రస్తావిస్తున్నప్పుడు వారి తల్లిదండ్రుల గురించి కూడా ప్రస్తావించక తప్పదు.

ముఖ్యంగా బుద్ధప్రసాద్ గారు బాలానందం కార్యక్రమాల నుంచి ఎదిగి, తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ, గాంధీజీ సిద్ధాంతాలను నమ్ముతూ, ఆచరిస్తూ అందరినీ చిరునవ్వుతో పలకరిస్తూ, రాజకీయాలలోనూ, సామాజిక కార్యక్రమాలలోనూ ఎప్పుడూ చిర్రుబుర్రులూ, చిటపటలూ ప్రదర్శించకుండా ముందుకు సాగే వ్యక్తి. అతని మోహంలో ఆప్యాయతా, గౌరవభావం, ప్రశాంతతా తప్ప, ఇతరుల పట్ల మరే భావమూ కనిపించదు వారి వదనంలో. స్థితప్రజ్ఞులు వారు. ఏ పుస్తకమో, ఏ రచనో, ఏ పత్రికలోనో చదివి, అది జ్ఞాపకం ఉంచుకుని ఆ వ్యక్తులు కనిపించినప్పుడు బాగుందని తన అభిప్రాయాన్ని చెప్పడం ఆయన గొప్పతనం. అందరితో కలిసి పోయే వారి స్వభావం రాజకీయంగానూ, స్నేహితులకు కూడా ఆనందాన్ని పంచుతుంది. ఎవ్వరినీ నొప్పించకుండా మాట్లాడడం, గొప్పలకూ ఆర్భాటాలకూ దూరంగా ఉండడం, వారిని అందరికీ దగ్గరగా చేరుస్తుంది. వారిని చూస్తే మంచి అంతా ఒక్కచోట రాశిపోసుకున్నట్టు అనిపిస్తుంది.

నాకు ఆశ్చర్యం కలిగించిన విషయమేమిటంటే, వారి షష్ట్యబ్దిపూర్తి అన్నమాట. వారికి అరవైఏళ్లు దాటాయా? నమ్మలేకపోయాను.

వారిలాగే ఆయురారోగ్యాలతో, అంతస్థుల వైభోగంతో, ఆనందంతో, నూరేళ్ళ పండగ చేసుకోవాలని కోరుకుంటూ నాకు ఈ నాలుగు మాటలూ చెప్పే అవకాశాన్ని కల్పించిన కిన్నెర ఆర్ట్ థియేటర్స్ రఘురాం గారికి ధన్యవాదాలు తెలుపుతూ...

బహుముఖ ప్రజ్ఞాశాలి, సౌజన్యశీలి

- డా. ఎ. రాధాకృష్ణ రాజు

శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారితో నాకు దాదాపు 45 సంవత్సరాల సుదీర్ఘమైన స్నేహ సంబంధం. మొట్టమొదటి సారిగా పూజ్యులు, దివంగత శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారు 1972వ సంవత్సరంలో అవనిగడ్డ నియోజకవర్గం నుండి ఏకగ్రీవంగా శాసనసభ్యులుగా ఎన్నిక అయి అజాత శత్రువుగా అందరిచే కీర్తించబడి, పి.వి నరసింహారావుగారి మంత్రివర్గంలో మొట్టమొదటి సారిగా సాంఘిక సంక్షేమ శాఖామాత్యులుగా నియమింపబడిన సందర్భముగా వారిని కలిసినప్పుడు ఈ మండలి బుద్ధప్రసాద్ గారిని చూశాను. అప్పుడు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి వయసు 16 సంవత్సరాలు, యుక్తవయసు కలిగిన యువకులుగా నాటి నుండి ఆత్మీయ పరిచయం అయి అంచలంచెలుగా ఎదిగారు. శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారి నేతృత్వంలో 1975వ సంవత్సరంలో మొట్టమొదటి ప్రపంచ తెలుగు మహాసభలకు వారు కార్యాధ్యక్షులుగా నేను కార్యదర్శిగా ఆ సభలకు వారితో పని చెయ్యటం ఒక మరపురాని అనుభూతి. ఆ కార్యక్రమంలో అప్పుడు మండలి బుద్ధప్రసాద్ గారు కూడా వారి తండ్రితో ఉండి అన్ని కార్యక్రమాలు క్షుణ్ణంగా పరిశీలించి పాల్గొనేవారు. అప్పటి నుండి తెలుగు భాషా సాంస్కృతుల వికాసానికి వారి ప్రేరణతో కృషి చేస్తూ 1981వ సంవత్సరం 'కౌలాలంపూర్' జరిగిన రెండవ ప్రపంచ తెలుగు మహాసభలకి, 1987లో 'చెన్నై'లో జరిగిన జాతీయ స్థాయి తెలుగు మహాసభలకి కీలకమైన బాధ్యతలు నిర్వహించి, ఆ స్ఫూర్తితోనే గురువులు డా॥ సి. నారాయణ రెడ్డి గారి నేతృత్వంలో 1990లో బెంగళూరులో జరిగిన అఖిల భారత తెలుగు మహాసభలకు ప్రధాన కార్యదర్శిగా ఉండి శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారి ఆధ్వర్యంలో ఆ మహాసభలను, ఒక అపురూపమైన సభలుగా నిర్వహించడం జరిగినది. ఆ సభలో కూడ శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం జరిగినది. నాటి నుండి నేటి వరకు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు శాసనసభ్యులుగా, మంత్రిగా, అధికార భాషా సంఘ అధ్యక్షులుగా, ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతిగా ఎన్ని పదవులు నిర్వహించినా, ఆ పదవులకే గౌరవం తెచ్చిన వ్యక్తిత్వం శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారిది. అలాగే 1975 సంవత్సరంలో తెలుగు విజ్ఞాన సమితి భవన సముదాయాన్ని, శ్రీకృష్ణదేవరాయ కళామందిరం నిర్మాణానికి శంకుస్థాపన కూడా నాటి ఆంధ్రప్రదేశ్ విద్యా మరియు సాంస్కృతిక శాఖామాత్యులుగా శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు ప్రారంభించినప్పుడు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు కూడా ఆ కార్యక్రమములో పాల్గొనడం జరిగింది. ఆయన ఈ రోజు జరుపుకుంటున్న షష్టిపూర్తి తెలుగు భాష ఉద్యమకారులకి, తెలుగుభాష సంస్కృతుల అభిమానులకి, ఆయన శ్రేయోభిలాషులందరికి ఈ షష్ట్యబ్ద పూర్తి మా అందరికీ ఇష్టాబ్దిపూర్తి'గా జరుపుకుంటున్నాం. ఆయన తెలుగు భాషకు చేసిన సేవలు ప్రపంచ వ్యాప్తంగా అందరి మన్ననలు పొందాయి. ఇంకా సుదీర్ఘకాలం ఆయన సేవలు 'తెలుగుతల్లికి' నిరంతరం లభించాలని, ఆయన నిండు నూరేళ్ళు సుఖసౌభాగ్యాలతో వర్ధిల్లాలని ఆ వెంకటేశ్వర స్వామిని ప్రార్థిస్తున్నాను.

'తెలుగు విజయం' చిరునామా

- ఎ. అమరనాథరెడ్డి


అంతర్జాలం ప్రసిద్ధిలోకి వచ్చి దాదాపు ఇరవై సంవత్సరాలైనా తెలుగు భాష ఆధునికీకరణకు, సాంకేతికీకరణకు అప్పటి వరకూ పెద్దగా చెప్పుకోదగ్గ కృషి జరగలేదు. 2011 వ సంవత్సరంలో, శ్రీ మండలి బుద్ధ ప్రసాద్ గారి ప్రోద్బలంతో అంతర్జాల సలహా సంఘం ఏర్పాటు చేయడం జరిగింది. శ్రీ బుద్ధ ప్రసాద్ గారికి తోడు, పద్మభూషణ్ శ్రీ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ గారు, శ్రీ కూచిభొట్ల ఆనంద్ గారు, శ్రీ గారపాటి ఉమామహేశ్వర రావు గారు, శ్రీ. పేరి భాస్కర్ రావు గారు, శ్రీ. వీవెన్ గారు మొదలగు తెలుగు భాషలో విశిష్ట సేవలందించిన పలువురు ప్రముఖులతో పాటు, ఆంధ్రప్రదేశ్ జ్ఞానాధారిత అనుసంధాన సంస్థ (AP Society for Knowledge Networks) కి ముఖ్య కార్య నిర్వహణాధికారిగా నాకు కూడా ఆ సలహాసంఘంలో సభ్యునిగా పనిచేసే అవకాశం కలిగింది.

శ్రీ బుద్ధప్రసాద్ గారి ఆలోచనల మేర, ఆంధ్రప్రదేశ్ జ్ఞానాధారిత అనుసంధాన సంస్థ మరియు తెలుగు అంతర్జాల సలహా సంఘం ఆధ్వర్యంలో, సిలికానాంధ్ర సౌజన్యంతో, 18 నూతన యూనీకోడ్ ఆధారిత ఖతులను (unicode fonts in telugu), మరియు అంతర్జాలంలో తెలుగు భాష కొరకు పలు ఉపకరణాలను అభివృద్ధి చేసి, 'తెలుగు విజయం' పథకము క్రింద ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యావత్ తెలుగు జాతికి ఉపయోగపడేలా అంతర్జాలంలో పొందుపరచడం జరిగింది. ఈ తెలుగు విజయం చేపట్టిన కార్యక్రమాలలో నాకు మరియు తెలుగు విజయం ప్రత్యేకాధికారి అయిన శ్రీ శంకర్ తూములూరి గారికి, శ్రీ బుద్ధ ప్రసాద్ గారు అందించిన సహాయ సహకారాలు మరువలేనివి. ఈ 18 ఖతులలో, శ్రీ బుద్ధ ప్రసాద్ గారు అందించిన స్ఫూర్తికి, తెలుగు విజయం పథకం కొరకు ఆయన చేసిన కృషికి, తెలుగు భాషకు ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఒక ఖతికి 'మండలి ఖతి' (Mandali Font) అని నామకరణం చేయడం జరిగింది. తెలుగు విజయం కార్యక్రమాలలో భాగంగా, 2012లో తెలుగు అంతర్జాతీయ అంతర్జాల సమావేశాలు సిలికాన్ వ్యాలీలో, 2013లో విశాఖపట్నంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.

శ్రీ. బుద్ధ ప్రసాద్ గారి ఆధ్వర్యంలో, 2012 వ సంవత్సరంలో, తెలుగు విజయ యాత్ర పేరిట, ప్రపంచ తెలుగు మహా సభలకు హైదరాబాదు నుంచి తిరుపతి వరకు సైకిల్ యాత్ర నిర్వహించడం జరిగింది. 700 కిలో మీటర్లు పొడవునా, ఐదు రోజుల పాటు సాగిన ఈ సైకిల్ యాత్రను, శ్రీ బుద్ధ ప్రసాద్ గారు జెండా ఊపి యాత్రను ప్రారంభించడం, నేను కూడా, ఆ 700 కిలో మీటర్లు సైకిల్ మీద తిరుపతి వెళ్ళడం, ఊరూరా, అంతర్జాలంలో తెలుగు భాష పరివ్యాప్తి చెందేలా కార్యక్రమాలు నిర్వహించడం, నాకు మరిచిపోలేని అనుభూతి. 2012 వ సంవత్సరంలో, శ్రీ మండలి బుద్ధ ప్రసాద్ గారిని అధికార భాష సంఘం అధ్యక్షుడిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించడం జరిగింది. ఈ పరిణామాలు అన్నీ తెలుగు భాష అంతర్జాలంలో వ్యాప్తి చెందడానికి ఎంతో ఉపకరించాయి.

ఈ క్రమంలో వారితో కలిసి పనిచేయడం, తెలుగు భాష ప్రాచీన భాష మాత్రమే కాదు, ప్రపంచ భాష అని చాటి చెప్పడానికి ఒక అవకాశం కలగడం, అన్నిటికంటే ముఖ్యంగా, ఒక ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారితో కలిసి పనిచేయడం, ఆయనతో ఒక విడదీయరాని బంధం ఏర్పడటం, ఒక అదృష్టంగా, భగవంతుని వరంగా భావిస్తున్నాను.

ఆయన ఆధ్వర్యంలో తెలుగు భాషకి మరిన్ని విజయాలు చేకూరాలని, ఈ షష్ట్యబ్దిపూర్తి సందర్భంగా శ్రీ. బుద్ధప్రసాద్ గారు ఆరోగ్యంగా, ఆనందంగా, ఉండాలని, నా లాంటి మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని కోరుకుంటున్నాను.



మైసూరు బృందావన్ గార్డెన్స్‌లో మండలి కుటుంబం

బుధజన వినుతుడు ప్రసాదగుణ శోభితుడు

- డా. డి. కిరణ్‌క్రాంత్ చౌదరి

ఇద్దరి వ్యక్తులమధ్య ఏర్పడే స్నేహబంధానికి కారణాన్ని 'జన్మాంతారాణి భావస్థిరాణి' అనే సిద్ధాంతాన్ని నేను అంగీకరించలేను. స్నేహసంబంధానికి కారణాలుగా ఒకేవిధమైన ఆలోచనా విధానం, ఒకే దృక్పథం, ఒకే సిద్ధాంతం వంటివి చెప్తుంటారు. అయితే గౌరవనీయులు మండలి బుద్ధప్రసాద్‌గారితో నాస్నేహానికి కారణం అవేమికాదు. నేను వారికి సహాధ్యాయినికాదు, వారి ప్రాంతంవాణ్ణి అసలే కాదు. వారున్న రంగానికి నాకు సంబంధమే లేదు. కాని నాలుగైదేళ్ళ కింద మా పరిచయం ఆరంభమైంది. ఇంతకొద్దికాలంలో మామధ్య అంత గాఢమైన అనుబంధం ఏర్పడిందంటే అదంతా తెలుగు సంస్కృతి, తెలుగు కళల గొప్పదనమే. బుద్ధప్రసాద్‌గారిపై నాకు ఏర్పడ్డ స్నేహబంధానికి కాలం నాలుగైదేళ్ళైనా, వారి కుటుంబంపై, వారి తండ్రిపై ఒక గౌరవాత్మకమైన అభిమానం 1977 నుండే ఏర్పడింది. అది తెలుసుకోవాలంటే దివిసీమ తుఫాన్ దాకా వెళ్ళాల్సిందే. ఆ సంవత్సరం నవంబర్‌లో వచ్చిన భయంకరమైన తుఫాన్, అందులో భాగంగా వచ్చిన ఉప్పెన, ఆ ప్రాంత ప్రజలజీవనం అస్తవ్యస్థమైన సన్నివేశం ఇప్పటికీ మరచిపోలేని పీడకల. అప్పుడు నేను ఎం.ఏ. చరిత్ర చదువుతూ, ఎడ్యుకేషన్ టూర్‌లో భాగంగా ఒరిస్సా వెళ్ళి తిరిగి పూరీ ఎక్స్‌ప్రెస్‌లో స్నేహితులతో వస్తున్నా. ఏలూరులో రైలు ఆగిపోయింది. కారణం తుఫాన్ ప్రభావం. ఎటూ వెళ్ళలేని పరిస్థితి. అప్పుడే మొదటిసారిగా ఆ ప్రాంతంలో ప్రజలకు సేవలందిస్తున్న మండలి వేంకటకృష్ణారావు పేరు వినడం జరిగింది. వేలమంది చనిపోయి, దిక్కుతోచక విలపిస్తున్న కుటుంబాలకు వారి కుటుంబం అండగా నిలబడ్డ సంఘటన నా మనస్సులో చెరగని ముద్రవేసింది. తర్వాత కాలంలో బుద్ధప్రసాద్‌గారితో నాకు అనుబంధం ఏర్పడ్డానికి అది బీజప్రాయమై ఉండవచ్చు.

సజ్జనులతో స్నేహం మధ్యాహ్నకాలపు నీడలా మొదటి పొట్టిగా ఉండి మెల్లగా పెరిగి పెద్దదవుతుంది అంటారు భర్తృహరి. అది వాస్తవమే. నాకు వారితో స్నేహం మధ్యాహ్నకాలపు నీడలా మెల్లగా ప్రవర్ధమానమైంది. 2012లో ఒకటి రెండుసార్లు విద్యావిషయిక సమావేశాల గురించి ఫోన్‌లో మాట్లాడవలసి వచ్చింది. అప్పటికివారు బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నారు. ఒక సాధారణ అధ్యాపకుడుగా వారితో మాట్లాడేందుకు సంకోచించినా, వారు ఫోన్‌లో కనపరిచిన సౌమ్యాన్ని చూసి ఆశ్చర్యపోయాను. "మీ గురించి విన్నానండీ. మంచి ఆచార్యులని, ఉన్నతస్థాయి పరిశోధకులనీ" అంటూ ఆయన ఫోన్‌లో నాగురించి చెప్తుంటే నాకే ఆశ్చర్యం వేసింది. ప్రజానాయకుడు, రాష్ట్రమంత్రి, కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, తెలుగుభాషకు ప్రాచీనహోదాకోసం పరితపిస్తున్న ఒక వ్యక్తి, నిరంతర బాధ్యతల నిర్వహణలో క్షణం తీరికలేని వ్యక్తి ఫోన్‌లో అంత చక్కగా మాట్లాడ్డం ఆనందాన్నిచ్చింది.

టి.వీల్లో, పత్రికల్లో చూడ్డంతప్ప నేరుగా శ్రీ బుద్ధప్రసాద్‌గారిని చూసే అవకాశం నాకు దొరకలేదు. నేరుగావెళ్ళి కలిసేంత పరిచయం లేదు. అయితే అనుకోకుండా ఆ సందర్భం కూడా వచ్చింది. అది

మనరాష్ట్రంలో కాదు మనదేశంలో కాదు, యుకేలో. ప్రపంచ చరిత్ర సమాఖ్య సమావేశాలు లండన్‌లో జరిగాయి. 2012 జూలై 13 తేదీ సమావేశం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధులుగా గౌరవనీయులు చక్రపాణిగారు, బుద్ధప్రసాద్‌గారు అక్కడికి వచ్చారు. 'యూనిక్ ఫీచర్స్ ఆఫ్ ఆర్ట్ ఇన్ ఆంధ్ర' అనే అంశంపై నేను చేసిన ఉపన్యాసాన్ని వారిద్దరూ ఎంతో మెచ్చుకున్నారు. ఆ క్షణంలో తెలుగుదనాన్ని, తెలుగుతల్లిని గుండెల్లో పెట్టుకొని, తెలుగు సంస్కృతి వికాసం కోసం నిరంతరం శ్రమించే తెలుగుమూర్తిమత్వం గల బుద్ధప్రసాద్‌గారు నా ఉపన్యాసం మెచ్చుకోవడం పట్ల నేను ఎంతో సంతోషపడ్డాను. కొంత గర్వంగా భావించాను. తానెంతో ప్రజ్ఞాపాటవాలు గలవాడైనా, ఎదుటివ్యక్తిలోని ప్రతిభను మెచ్చుకొనే హృదయ పరిపక్వత కొద్దిమందికే ఉంటుంది. అలాంటి సంస్కారవంతమైన వారి మనస్సు నన్ను ఆకర్షించింది. అప్పటి అభినందనల పరిచయం అభిమానపూర్వక స్నేహంగా మారింది. వయస్సులో నాకన్నా రెండేళ్లు చిన్నవాడైనా విజ్ఞతలో పెద్దవాడుగా నాకు కన్పించాడు.

సభల్లో కన్పించే నాయకులు కేవలం కరచాలనాలతో ముందుకెళ్ళిపోతూ, ఆ తర్వాత మర్చిపోయే తత్వంగల నేటి పరిస్థితుల్లో వారు నన్ను గుర్తుపెట్టుకొని ఉంటారని నేనూహించలేదు. అది నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు తెలుగు రాష్ట్రంలో జరగబోతున్న సందర్భం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తిరుపతిలో 2012 డిసెంబర్ 27, 28, 29 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా ఆ సభలు నిర్వహించాలని నిర్ణయించింది. ఆ సమయంలో నాకు వారి దగ్గరనుంచి ఫోన్ వచ్చింది. "మన ప్రభుత్వం పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ద్వారా కొన్ని ప్రత్యేక అంశాలపై మోనోగ్రాఫ్‌లు తయారు చేస్తుంది. మీరు 'తెలుగువారి శిల్పకళ' అనే అంశంపై ఓ పుస్తకం రాయాలి" అని వారి ఆదేశం. అప్పుడర్థమైంది నాకు బుద్ధప్రసాద్‌గారి నిబద్ధత. ఎవరు ఏ రంగంలో సమర్థులో, ఎవరు ఏ పనిలో నిష్ణాతులో నిర్ధారించడం, దాన్ని కార్యరూపంలోకి తీసుకొనిరావడంలో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా చూడడం వారిదక్షత. ఒకవైపు తెలుగు మహాసభల బాధ్యతను నిర్వర్తిస్తూ, ఆ ఏర్పాట్లన్నీ సవ్యసాచిలా చూస్తూ, నాకు పుస్తకం రాయమని చెప్పడం మర్చిపోలేని సంఘటన. నేను అప్పుడు థాయ్‌లాండ్‌లో ఉన్నాను. వారికోరికపై సకాలంలో ఆపని పూర్తిచేయడం, ఆ పుస్తకాన్ని చూసి వారు ఆనందించడం, ప్రపంచ తెలుగు మహాసభల్లో నన్ను ప్రత్యేకంగా సన్మానించడం వంటి సంఘటనలు వారి ప్రోత్సాహక హృదయాన్ని తెల్పుతాయి.

అవనిగడ్డ వారి నియోజకవర్గం. వారి సొంతగడ్డ. ఆయన హైస్కూల్ వరకు విద్యనభ్యసించిన ప్రాంతం. 2013లో అక్కడ డిగ్రీకాలేజీలో ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాలు జరిగాయి. నేను ఆ సమావేశాలకు వెళ్ళినప్పుడు నన్ను వారింటికి ఆహ్వానించారు. ఆరోజు వారింట్లో నాకిచ్చిన అతిథ్యం మర్చిపోలేని జ్ఞాపకం. వారి కుటుంబసభ్యులంతా వడ్డించిన క్షణాలు కళ్ళముందే మెదలాడుతున్నాయి. సౌందర్యనందనోద్యాన వనంలో పెరిగిన చెట్లన్నీ సువాసనలు వెదజల్లేవే. తాతతండ్రుల నుండి వస్తున్న గౌరవమర్యాదల వారసత్వం వారి పిల్లల్లో కూడా ద్విగుణీకృతమై కన్పించింది.

2014 జనవరి నెల. అది నేను పదవీవిరమణ చేస్తున్న సందర్భం. నా పదవీ విరమణ సభకు వారిని ముఖ్యఅతిథిగా ఆహ్వానించడానికి వస్తున్నామని, నా మిత్రుడు ఆచార్య నాగోలు కృష్ణారెడ్డి వారిని అపాయింట్‌మెంట్ కోరాడు. అందుకు వెంటనే వారు ఫోన్‌లోనే "ఎవ్వరూ నన్ను పిలవడానికి రావద్దు. నేను

తప్పకుండా ఆ సన్మానసభకు వస్తున్నాను' అని చెప్పారట. ఫోన్‌లో పిలిచిన వెంటనే సభకు రావడానికి సుముఖత వ్యక్తం చేయడమే కాదు. జనవరి 3వ తేదీ ఆద్యంతం ఆ సభలో ఉండి వారిశుభాశీస్సులతో దిగ్విజయం చేసిన ఘనత వారిదే. ఆ సభలో నాగురించి వారు చెప్పిన లోతైన విషయాలు అందర్నీ ఆశ్చర్యపరిచాయి.

నిష్కల్మశతత్వం, నిండైన మనస్తత్వం గల బుద్ధప్రసాద్‌గారు సొంతపనిపై తిరుపతి వచ్చినప్పుడు నాకు ఫోన్ చేసి, కుటుంబ సమేతంగా నేరుగా ఇంటికి రావడం మరచిపోలేని అనుభూతి. ఆ తర్వాత కాలంలో రాష్ట్రచిత్రపటంలో ఎన్నో మార్పులు, సర్దుబాట్లు, నిరంతర వ్యూహ ప్రతివ్యూహాలు. రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచాలని బుద్ధప్రసాద్‌గారు చేసిన వైయక్తిక, సామూహిక ప్రయత్నాలన్ని నేను గమనించినవే. ఎన్నో వత్తిడులు, ఎన్నికల ప్రచార సన్నాహకాలు, గెలుపులు ఇవన్నీ ఒకవైపు ఉన్నా మరోవైపు మిత్రులతో నిరంతరం ఫోన్‌లో మాట్లాడుతూనే ఉండేవారు.

మండలి బుద్ధప్రసాద్‌గారి గొప్పదనాన్ని చెప్పేంతటి కొలమానాలు నాదగ్గరలేవు. ఎందుకంటే ప్రాచీన చరిత్ర సంస్కృతి పరిశోధకుడిగా మాత్రమే ఆయనకు సన్నిహితమైన నేను, ఆయనకు ఇష్టమైన మిత్రుల్లో ఒకడ్ని అనేది వాస్తవం. అయితే వారిలో ఎన్నో పార్శ్వాలున్నాయి. వారి సుదీర్ఘ రాజకీయ అనుభవం, తాతతండ్రుల నుండి వారసత్వంగా వచ్చిన మృదుమనస్తత్వం, సేవాతత్పరత చెప్పడానికి నాకు సాధ్యం కాదు. కాళిదాసు చెప్పినట్లు రూపానికి తగిన ప్రజ్ఞ, ప్రజ్ఞకు తగిన సదాలోచన, సదాలోచనకు తగిన కార్యారంభం, కార్యారంభానికి తగిన ప్రతిఫలాన్ని పొందడం బుద్ధప్రసాద్‌గారికి కూడా సాధ్యమని మాత్రం ధైర్యంగా చెప్పగలను.

వృత్తిరీత్యా వారు ఎం.ఎల్.ఏగా, మంత్రిగా, ఉపసభాపతిగా ఎన్నో బాధ్యతలను నిర్వర్తించినా, ప్రజలకు సేవచేస్తున్నా, వారి మనసు మాత్రం తెలుగువారి కళలు, సంస్కృతి, వారసత్వం, సాహిత్యం వంటివాటిపై నిరంతరం ఆలోచిస్తూ ఉంటుందనేది నగ్నసత్యం. ఆ విషయాన్ని ఎన్నో ఉదాహరణలు రుజువుచేస్తాయి. గిడుగు రామమూర్తి పంతులుగారి ఆవేశాన్ని, ఆవేదనను అర్థం చేసుకున్నవారు ఆయన. తెలుగు భాషపట్ల, సంస్కృతి, కళల పట్ల అచంచలమైన ప్రేమ, పాశ్చాత్య వ్యామోహం వాటిని కుదేలు చేస్తున్న పరిస్థితుల పట్ల బుద్ధప్రసాద్‌గారు వెంటనే స్పందించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో తెలుగుభాష అమలుకోసం కొత్తపద్ధతుల్ని అధికారభాషా సంఘం అధ్యక్షులుగా ప్రారంభించారు. తమతమ కార్యాలయాల్లో తెలుగును సమర్థంగా అమలు చేసిన కలెక్టర్లకు, ఉద్యోగులకు అవార్డులివ్వడం ఆయనకు తల్లిభాషపై ఉన్న అవ్యాజమైన ప్రేమను తెలుపుతుంది.

ఈరోజు తెలుగు పండుగలకు సెల్‌ఫోన్‌లో వచ్చే తెలుగు సంక్షిప్త సందేశాన్ని చూసి మురిసిపోతున్నాం. అయితే ఆ ఆనందం వెనుక బుద్ధప్రసాద్‌గారి కృషి దాగిఉందనేది చాలా మందికి తెలియని అంశం. ఐ.టి. శాఖద్వారా 'తెలుగు విజయం' ప్రాజెక్ట్‌లో భాగంగా బుద్ధప్రసాద్‌గారు రూపొందింపచేసి 'యూనికోడ్' అనే సంక్షిప్త సందేశాలను గురించి కూడా తెలిసింది కొద్దిమందికే.

ముందే చెప్పుకున్నట్లు వారిలోని ప్రధానమైనకోణం ప్రజానాయకత్వం. తాను పుట్టి పెరిగిన ప్రాంతంకోసం ఆయన సాగించిన పోరాటాలు, కృష్ణాజిల్లా ఆధునికీకరణకోసం నడిపిన ప్రజాచైతన్య యాత్రలు పుస్తకంగా తీసుకురావలసిన అవసరం ఉంది. ఫలితం తేలని పోరాటాల గురించి కాదు, వారు ఏది చేసినా ఫలితం తేలాల్సిందే. పశుసంవర్ధకశాఖనైనా, మత్స్యశాఖనైనా, ఒక శాస్త్రీయ పద్ధతిలో అభివృద్ధి చేసిన పాలనాదక్షత వారిది. కృష్ణావిశ్వవిద్యాలయ ఏర్పాటు వెనుక, ఆ ప్రాంతపు ప్రాజెక్టుల రూపకల్పన వెనుక బుద్ధప్రసాద్ గారి ఛోదకబలం ఎంతో నాకు తెలుసు.

బుద్ధప్రసాద్‌గారిలో నాకెప్పుడు రాజకీయ నాయకుడు కనిపించడు. సాహితీవేత్త, సమన్వయమూర్తి కన్పిస్తాడు. 'అతిభాష మతిహాని మితభాష అతిహాయి' అనేది వారికి నచ్చినసూక్తి. పున్నమి వెన్నల్లాంటి నవ్వు, సున్నితమైన హావభావాలు వారికే సొంతం. ఎక్కువగా పుస్తకాల్ని అధ్యయనం చేయడం వలన వారిలో ఆ శాంతమైన తత్వం వచ్చిందో, గాంధేయవాదాన్ని జీర్ణించుకోవడం వల్ల ఆ స్థితప్రజ్ఞాతత్వం వచ్చిందో నేను తేల్చలేని పరిస్థితి. నాగాయలంక నుండి సాగించిన నిరాడంబరమైన, వినమ్రపూర్వక నడకే వారిని నాణ్యమైన నాయకుడిగా తయారు చేసింది. రాజకీయ పక్షాల్లో అజాతశత్రువును చేసింది. అదృష్టం కలిసొచ్చి ఎదిగిన నాయకత్వం కాదు వారిది. ప్రజ్ఞాపాటవాలతో పయనం సాగించి సాధించుకున్న స్థానం. అయినా కొందరికి పదవులు అందం. పదవులకే కొందరు అందం. అందులో బుద్ధప్రసాద్‌గారు రెండో విభాగానికి చెందినవారు. ఎన్నో సంచలనాలతో కూడిన వార్తలతో నిరంతరం కనిపించే నాయకులు కల్గిన నేటి రాజకీయ చదరంగంలో కడిగిన మేలిమి ముత్యంలా ముందుకెళ్తున్న బుద్ధప్రసాద్‌గారు, ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతిగా తన ప్రతిభను ఇనుమడింపచేస్తున్నారు. శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారు 60 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న ఈ సందర్భంలో వారు చక్కటి ఆయురారోగ్య కీర్తిచంద్రికలతో ముందుకు సాగాలని కోరుకుంటూ....



ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుతో మండలి కుటుంబం

తెలుగు భాషావికాసమే మండలి ఊపిరి

- ముదిగొండ శాస్త్రి

ముఖాన చిరునవ్వు... మాటల్లో .. వేషభాషల్లో ఉట్టిపడే గాంధేయవాదం... రాజకీయాలను, పదవులను తెలుగు భాషావికాసానికి ఉపయోగిస్తున్న తెలుగు భాషా కృషీవలుడు... దేశవిదేశాల్లో తెలుగు జాతి ప్రాభవాన్ని చాటిచెబుతున్న నాయకుడు... తెలుగు భాషాభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేసిన తపస్వి... కృష్ణాజిల్లా ప్రజల ముద్దు బిడ్డ మండలి బుద్ధప్రసాద్.

ఆయన బాల్యం నుంచి నాకున్న అనుభవాలను, అనుభూతులను సంక్షిప్తంగా ఈ షష్టి పూర్తి మహోత్సవంలో మీ ముందు ఉంచుతున్నాను. నేను చూస్తుండగానే ఇలా ఉన్నత శిఖరాలకు ఎదిగిన శ్రీ బుద్ధప్రసాద్ పాత్రికేయునిగా, గాంధీక్షేత్రం పత్రికాసంపాదకులుగా ఉన్న రోజుల్లో మేము పాత్రికేయుల సంఘం స్థాపించాం. ఆ సంఘానికి నేను అధ్యక్షునిగా ఉంటే... వీరు గౌరవాధ్యక్షులుగా ఉండేవారు. తరువాత ఈ సంఘం జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి సంఘంగా ఏర్పడింది. శ్రీవారి సూచనల మేరకు పాత్రికేయులకు శిక్షణా తరగతులు నిర్వహించాం. ఇందుకు బుద్ధప్రసాద్ ప్రధాన భూమిక వహించారు.

తెలుగువారి చరిత్ర, కళలు, ఆచార వ్యవహారాలకు ఉన్న ప్రత్యేకతను దేశమంతటా చాటి చెప్పేందుకు ఉద్యమ రూపంలో తీసుకుని వెళుతూ తెలుగు భాష ప్రాచీనత కోసం యాత్రలు నిర్వహించిన ఉద్యమకారుడు బుద్ధప్రసాద్.. మచిలీపట్నం నుంచి నెల్లూరుకు పాదయాత్ర చేసి తెలుగు భాషకు ప్రాచీన హోదా సాధించేందుకు నిర్వహించిన ఉద్యమాలను, విజయాలను సేవాతత్పరతను మీముందు ఉంచుతున్నాను.

శ్రీ బుద్ధప్రసాద్ రెల్లుగడ్డి ఇంట్లో గాంధీక్షేత్రం పత్రికకు అక్షరాలను కూర్చిన రోజులు మరచిపోలేదు...

పెను ఉప్పెనలో 1977లో 21 ఏళ్ళ బుద్ధప్రసాద్ తన తండ్రి మండలి వెంకట కృష్ణారావు కాళ్ళు వాచి తిరగలేని పరిస్థితిలో నేనున్నానంటూ దుఃఖార్తులకు ఊరట కలిగించిన రోజులు మరచిపోలేదు.. దీనజన సంక్షేమ సమితి ద్వారా అనాథలను అక్కున చేర్చుకున్న సంగతి మరచి పోలేదు.

గాంధీ మహాత్ముని కోడలు నిర్మలాగాంధీ, గాంధేయవాదులు ప్రభాకర్‌జీ, వావిలాల గోపాలకృష్ణయ్యలను పిలిచి యువకులను చైతన్య పరిచేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించారు.

దివంగత మండలి వెంకట కృష్ణారావు వారసునిగా తెలుగు భాషాభివృద్ధికిగాను ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించేందుకు వీరు చేసిన కృషి అనితర సాధ్యము. మంత్రిగా ఉన్న సమయంలో రాత్రి ఒంటిగంట వరకు గోష్ఠుల్లో పాల్గొన్న రోజులు ఉన్నాయి.,

1999, 2004, 2014లలో మూడు పర్యాయాలు శాసనసభ్యునిగా గెలుపొందడం ఒక ఎత్తయితే తెలుగుకు ప్రాచీన హోదా తీసుకుని వచ్చేందుకు కృషి చేసి, విజయం సాధించడం మరొక ఎత్తు.

మండలి వెంకట కృష్ణారావు దివంగతులైన తరువాత ఆయన బాటలో ఎవరు భాషా సేవ చేస్తారని తెలుగువారంతా ఆలోచించారు. తండ్రికి తగ్గ తనయునిగా తెలుగు భాషకు సేవలందించడానికి నేనున్నానంటూ ముందుకు వచ్చారు.

ఎనలేని అధ్యయనం

బాల్యం నుంచి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను అధ్యయనం చేశారు. చరిత్రకారులు, తెలుగు పండితులు చేసే భాష, సాహిత్య అధ్యయనాలను బుద్ధప్రసాద్ చేస్తున్నారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షులుగా వీరు ఉంటున్నారు. ప్రపంచ మహాసభల్లో, కృష్ణా మహోత్సవాల్లో శ్రీ బుద్ధప్రసాద్‌తో పాటు పాల్గొనడం అదృష్టంగా మేము భావించాము. శ్రీ బుద్ధప్రసాద్ నిర్వహిస్తున్న భాషోద్యమాల్లో అడుగులు వేసిన వారందరికీ ఆయన చేస్తున్న కృషి తెలిసిందే. ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆవిష్కరించిన 'తెలుగు పసిడి', 'వజ్రభారతి', 'తెలుగు పున్నమి' వంటి గ్రంథాలు చరిత్రలో నిలిచిపోయిన గ్రంథాలు.

తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియలకు పెద్ద పీట వేశాయి ఈ మహాసభలు. వేలాది తెలుగు కవులు, అష్టావధానులు, శతావధానులు, కళాకారులు, లక్షలాది తెలుగు భాషాభిమానులకు బుద్ధప్రసాద్ ఎవరో తెలియనిది కాదు. భోగరాజు పట్టాభి సీతారామయ్య, ముట్నూరి కృష్ణారావు, రఘుపతి వెంకటరత్నం నాయుడు, కాశీనాథుని నాగేశ్వరరావులపై ప్రసంగించదగిన దిట్ట ఈయనే! బుద్ధప్రసాద్ అంటే ఒక విజ్ఞాననిధి అనిపించుకున్నారు. వేలాది పుస్తకాలను ఆవిష్కరిస్తున్నారు. కవులు, రచయితలు బుద్ధప్రసాద్ చేతుల మీదుగా తమ గ్రంథాలను ఆవిష్కరించేందుకు కోరుకుంటున్నారు. ఉపసభాపతిగా పదవీబాధ్యతలు స్వీకరించిన శుభదినాన గౌరవనీయులు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు ప్రశంసలనందుకున్నారు. తిరుపతిలో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించేందుకు బుద్ధప్రసాద్ చేసిన కృషిని ముఖ్యమంత్రి శాసనసభలో ప్రస్తావించారు. బుద్ధప్రసాద్ వేయి వసంతాల పాటు తెలుగు భాషకు, తెలుగు జాతికి సేవలందిస్తారని ఆశిస్తూ.

శతమానం భవతి...



మెగాస్టార్ చిరంజీవితో...

ఆదర్శమూర్తి అధికార భాషాస్ఫూర్తి

- డా. టి. గౌరీశంకర్

ప్రస్తావన

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు గతంలో మంత్రిగా, అధికార భాషా సంఘం అధ్యక్షులుగా, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ఉపసభాపతిగా సమున్నత పదవులలో పనిచేశారు, చేస్తున్నారు. మంత్రిగా ప్రజాసేవలో నిమగ్నమయ్యారు. భాషా సంఘాన్ని నిబద్ధతతో అభివృద్ధి వైపు నడిపించారు, శాసనసభ సమావేశాలను హుందాగా కొనసాగిస్తున్నారు. రాజకీయ రంగంలో ఉంటూ తెలుగు జాతి చరిత్ర, సంస్కృతులు, తెలుగు భాషా సాహిత్యాల గురించి అహరహం ఆలోచించే వ్యక్తి. వాటి పరిరక్షణ కోసం చిత్తశుద్ధితో కృషి చేసే మనిషి. నిలువెల్లా భాషాభిమానం మూర్తీభవించిన తెలుగు భాషా ప్రేమికుడు ఆయన. భాషా చైతన్యానికి చిరునామాగా మారిన ఆయన ధ్యాస, శ్వాస తెలుగు భాషే!

మన రాష్ట్రంలోని పరిస్థితుల గురించే కాకుండా ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాలలోని తెలుగు వారి గురించి, అక్కడి తెలుగు భాషా స్థితిగతుల గురించి కూడా పట్టించుకొంటారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు గొంతుకలలో తెలుగువాణి తాజాగా వినిపించాలన్నది వీరి ఆశయం. తెలుగు జాతి చరిత్రను పరిరక్షించుకోవాలి, సంస్కృతిని కాపాడుకోవాలి, భాషను నిలబెట్టుకోవాలి, సాహిత్యాన్ని పరిపుష్టం చేసుకోవాలన్నది వీరి అభిమతం. ఎక్కడైనా తెలుగు భాషకు అవమానం, అన్యాయం జరుగుతుందన్నా, దానికి విఘాతం కలుగుతుందన్నా ఆయన వెంటనే స్పందిస్తారు. ఎక్కడైనా తెలుగుకు సంబంధించి అపురూపమైన ఆనవాళ్ళు దొరికాయన్నా, వినూత్న పరిశోధనలు జరిగాయన్నా అక్కడ నడుం బిగించి నడయాడుతారు. అంతటి భాషోద్యమ రథసారథి శ్రీ బుద్ధప్రసాద్ గారు.

ఈ స్ఫూర్తిని వీరు తమ తండ్రిగారైన కీ.శే. మండలి వెంకట కృష్ణారావుగారి నుంచి పొందారు. బాల్యం నుంచే తండ్రిగారి వెన్నంటి అనేక ప్రజాహిత కార్యక్రమాల్లో, భాషాసాంస్కృతిక సమావేశాలలో, సభలలో, సదస్సులలో పాల్గొనడం వల్ల వీరు అటు ప్రజలకు దగ్గరయ్యారు, ఇటు భాషాకోవిదులకు, సాహితీ వేత్తలకు, సాంస్కృతిక కళాకారులకు సన్నిహితులయ్యారు. అపారమైన విషయ పరిజ్ఞానాన్ని సంపాదించుకొన్నారు. అటు రాజకీయ సభలో గానీ, ఇటు భాషా సారస్వత సమావేశంలో గానీ ప్రసంగించేటప్పుడు సంబంధిత అంశంపై సాధికారికంగా, సమగ్రంగా, సప్రమాణంగా మాట్లాడే నైపుణ్యాన్ని సాధించారు. ఎంత ఎదిగినా ఒదిగే లక్షణం, సౌజన్యం, సౌశీల్యం, స్నేహ సౌహార్ద్రతలు వీరిలో పుష్కలంగా ఉన్నాయనడానికి, వీరి విజయపరంపరయే నిదర్శనం. పదవులు బాధ్యతలను పెంచుతాయని నమ్మినందువల్లనే వీరు ఏ పదవిలో ఉన్నా ఆ పదవికి న్యాయం చేస్తూనే తెలుగు భాషా సంస్కృతుల మనుగడ కోసం ఉద్యమిస్తూ ఉంటారు.

ప్రస్థానం

తమ తండ్రి గారు బీజావాపనం చేసిన ప్రపంచ తెలుగు మహాసభల ఆలోచనను వీరు అందిపుచ్చుకుని కొనసాగింపచేయటంలో ముందంజ వేస్తూ వచ్చారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం ద్వారా 'ప్రపంచ తెలుగు

రచయితల మహాసభల' నిర్వహణ, కేంద్ర ప్రభుత్వం తెలుగుకు ప్రాచీన భాషా హోదాను కల్పించటంలో కృషి, ఆ భాషా కేంద్రాన్ని మన రాష్ట్రంలో నెలకొల్పటానికి అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలను సానుకూలంగా స్పందింప చేయటంలో పోషించిన కీలక పాత్ర, శ్రీకృష్ణదేవరాయల పంచశతి పట్టాభిషేక మహోత్సవాలను అప్పటి ప్రభుత్వం ఘనంగా జరపటంలో వీరి గణనీయమైన సేవ, కృష్ణా జిల్లాలోని శ్రీకాకుళ ఆంధ్రనాయక దేవాలయంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్ఠాపనకు వీరి పూనిక, ఆధునిక అవసరాలకు అనుగుణంగా తెలుగును అంతర్జాలం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా విస్తరింపచేయటంలో సంబంధిత సమాచార సాంకేతిక (ఐటి) నిపుణులను కూడగట్టుకుని 'తెలుగు విజయం' ప్రాజెక్టు ద్వారా తెలుగులో ఇంటర్‌నెట్ సంక్షిప్త సందేశాలు పంపే 'యూనికోడ్' రూపకల్పనలో వీరు చూపిన చొరవ, అధికార భాషా సంఘం ద్వారా పాలనా భాషగా తెలుగు అమలు కోసం, పాఠశాల స్థాయిలో నిర్బంధ తెలుగు బోధన కోసం వీరు చేసిన ప్రయత్నం లండన్ వెళ్ళి అక్కడ సి.పి.బ్రౌన్ స్మారక చిహ్నాన్ని కనుగొనడంలో తీసుకున్న శ్రద్ధ మొదలైనవి వీరి జీవన ప్రస్థానంలో కొన్ని మైలురాళ్ళు.

గాంధేయవాది, రాజకీయ కోవిదుడు, ప్రజా సేవకుడు, నిజాయితీపరుడు అయిన ఆనాటి విద్యాశాఖామంత్రి, దివంగత నేత, తెలుగు భాషా సాంస్కృతికోద్ధారకుడు కీ.శే. మండలి వెంకటకృష్ణారావు గారి ప్రభావం వీరిపై గాఢంగా ఉంది. భాషాభిమానం, సాంస్కృతిక చైతన్యం, సేవా నిరతి, రాజనీతి మొదలైన లక్షణాలన్నీ తండ్రి గారి నుంచి పుణికిపుచ్చుకున్నవే.

ప్రపంచ తెలుగు మహాసభల ఆలోచన

1975 ఏప్రిల్ 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ఆనాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొదటి ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించింది. దీనిలో 16 దేశాల నుంచి 92 మంది, మన దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి 981 మంది, తెలుగు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 4,489 మంది తెలుగువారు ప్రతినిధులుగా, పరిశీలకులుగా వచ్చి పాల్గొన్నారు. ఉదయం నుంచీ సాయంకాలం వరకు విద్వత్ గోష్ఠులు, సదస్సులు, కవి సమ్మేళనాలు జరిగాయి. సాయంకాలం నుంచీ తెల్లవారు ఝాము దాకా సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటయ్యాయి. హైదరాబాదులోని లాల్ బహదూర్ స్టేడియంలో అత్యంత వైభవంగా జరిగిన ఈ తెలుగు మహాసభల మొత్తం ప్రాంగణానికి 'కాకతీయ నగరమ'ని, సదస్సుల సభాస్థలికి 'నాగార్జున పీఠమ'ని, సాంస్కృతిక ప్రదర్శనల వేదికకు 'శ్రీకృష్ణదేవరాయ దర్బార'ని పేర్లు పెట్టారు. ఈ ప్రాంగణంలోని శాతవాహన నగరంలో తరతరాల తెలుగు జాతి ప్రదర్శన ఏర్పాటయ్యింది. దీనిలో తెలుగు జాతి చరిత్రను తెలియచెప్పే పెద్దపెద్ద తైలవర్ణ చిత్రాలు, తెలుగు మహనీయుల నిలువెత్తు ఛాయాచిత్రాలు, నాగార్జునకొండ నమూనాలు, దేశ పటాలు, కుడ్య చిత్రాలు, ప్రాచీన రాజముద్రికలు, అమరావతి స్థూపం ప్రతికృతి వంటి అపురూపమైన వస్తు సంచయాన్ని దిద్దితీర్చారు. ఈ సందర్భంగా తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర–సంస్కృతి, కళలు మొదలైన అంశాలపై తెలుగు, ఆంగ్ల భాషల్లో 78 లఘు గ్రంథాలు ప్రచురించారు. 'తెలుగు వాణి' పేరుతో తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో ఒక బృహత్ ప్రత్యేక సంచికను వెలువరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు పొందిన వివిధ రంగాలకు చెందిన 240 మంది ప్రముఖులను సన్మానించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక తపాలా బిళ్ళను విడుదల చేసింది. నగరంలోని కొన్ని స్థానిక సినిమా హాళ్ళల్లో ప్రతినిధుల కోసం 47 ఉత్తమ తెలుగు చలనచిత్రాలను ఉచితంగా ప్రదర్శింపచేసింది. రాష్ట్ర

ప్రభుత్వం ఆ ఏడాదిని తెలుగు సాంస్కృతిక సంవత్సరంగా ప్రకటించింది. ఇంతటి వైభవోపేతమైన తెలుగు మహాసభల నిర్వహణ రథసారథి, ఆనాటి స్వర్గీయ మండలి వెంకటకృష్ణారావు గారు.

సరిగ్గా ఇదే మూసలో పోసినట్లు 2012 డిసెంబర్ 27, 28, 29 తేదీలలో ఆనాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తిరుపతిలో నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలను భారీఎత్తున నిర్వహించింది. ఈ నిర్వహణ బాధ్యతను తమ భుజస్కంధాలపై వేసుకున్న వారిలో శ్రీమండలి బుద్ధప్రసాద్‌గారు ప్రముఖులు. అప్పుడు వీరు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షపదవిలో ఉన్నారు. దీనితో పాటు అప్పటి ప్రభుత్వం వీరిని మహాసభలకు ఉన్నతస్థాయి సంఘం సభ్యుడిగా నియమించింది. పదవులు, హోదాలు ఏమిటి అన్నవి కాదు. చిత్తశుద్ధి, దృఢ సంకల్పం, పట్టుదల అన్నవి ముఖ్యం అని వీరు నిరూపించారు.

తిరుపతి మహాసభలలో సుమారు 5 లక్షల మంది ప్రజలు పాల్గొన్నారు. 10 ఇతర రాష్ట్రాల నుంచి, 14 ఇతర దేశాల నుంచి అయిదువేల మంది ప్రతినిధులుగా వచ్చారు. ఆరువేల మంది కవులు, రచయితలు, కళాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భాషా సాహిత్య సాంస్కృతిక రంగాలలోని పలు అంశాలపై మొత్తం రెండు వందల పైచిలుకు లఘు గ్రంథాలు ప్రచురించారు. విశాలమైన ప్రధాన వేదికతో పాటు అయిదు ఉపవేదికలు ఏర్పాటయ్యాయి. ఈ వేదికలపై సుమారు 60 రకాల సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. తిరుపతి ప్రధాన వీధులలో జరిగిన ఊరేగింపులో దాదాపు 40 వేల మంది కళాకారులు, రచయితలు, ప్రతినిధులు, అతిథులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ మహా సభలలో చేసిన ప్రధాన తీర్మానాలు తెలుగు భాషకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నది ఒకటి. దీని వెనుక మండలి బుద్ధప్రసాద్ గారి కృషి ఎంతో ఉన్నది. ఆ మేరకు ప్రభుత్వం 2014 జనవరిలో భాషా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేస్తూ సాంస్కృతిక శాఖకు అనుబంధం చేసింది. తక్కిన తీర్మానాలలో పాఠశాల స్థాయి విద్యలో అంటే ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగు బోధనను నిర్బంధం చేయటం, పూర్వపు మాదిరిగా సాహిత్య, సంగీత, నాటక లలిత కళా అకాడమీల పునరుద్ధరణ, ఇంటర్మీడియట్ వరకు సాంస్కృతిక విద్య. ఇతర రాష్ట్రాలలో, దేశాలలో ఉన్న తెలుగు వారి పిల్లలకు పుస్తకాలు ఉచితంగా అందచేయటం, ఉపాధ్యాయులను ఏర్పాటు చేయటం, ప్రతి ఐదేళ్ళకు ఒకసారి ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించటం, 2013 సం॥న్ని తెలుగు భాషా సంస్కృతుల వికాస సం॥గా ప్రకటించటం వంటివి ముఖ్యమైనవి. తండ్రిగారి ఆధ్వర్యంలో జరిగిన ఆనాటి తెలుగు సభలను తనయుని నేతృత్వంలో జరిగిన ఈ సభలు తలపింపజేశాయి.

ప్రపంచంలోని తెలుగువారందరినీ ఒక వేదికపైకి కొని తెచ్చిన ఆనాటి మొదటి ప్రపంచ తెలుగు మహా సభల తీర్మానం మేరకు అప్పటి ప్రభుత్వం 1976లో అంతర్జాతీయ తెలుగు సంస్థను ఏర్పాటు చేసింది. ఇతర రాష్ట్రాలలో, ఇతర దేశాలలో స్థిరపడ్డ తెలుగు వారికి భాషా సాంస్కృతిక సేవలందించటం ఈ సంస్థ ప్రధాన లక్ష్యం. ఈ సంస్థకు అధ్యక్షులుగా ఉన్న కీ.శే. మండలి వెంకట కృష్ణారావుగారు ఆనాడు మన దేశంలోని ఇతర రాష్ట్రాలు, కొన్ని ఇతర దేశాలలో పర్యటించారు. అక్కడి తెలుగువారి చారిత్రక నేపథ్యం, భాషా స్థితిగతులను గురించి కూలంకషంగా తెలుసుకున్నారు. ఈ సంస్థ ద్వారా వారికి అనేక సేవలందించారు. అందువల్ల ప్రవాసాంధ్రుల గుండెల్లో మండలి వెంకటకృష్ణారావుగారు పదిలంగా కొలువైపోయారు. కొందరు తెలుగువాళ్ళు ఆయన ఫోటోను పెట్టుకుని దైవంగా కొలిచిన దాఖాలాలు ఉన్నాయి. అక్కడి కొన్ని తెలుగు పాఠశాలల్లో వీరి ప్రస్తావన నేటికీ వినిపిస్తుంది. వీరికి ప్రపంచవ్యాప్తంగా ఎందరో తెలుగు భాషాభిమానులున్నారు.

ఆనాటి ప్రభుత్వం అంతర్జాతీయ తెలుగు సంస్థ ద్వారా ఏప్రిల్ 1981లో మూడు రోజుల పాటు మలేషియాలో రెండవ ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించింది. ప్రతి ఏడాది జాతీయ స్థాయిలో, ప్రతి రెండేళ్ళకు అంతర్జాతీయ స్థాయిలో తెలుగు మహాసభలు జరపాలని అనుకోవటం వల్ల 1983 జులై 17, 18 తేదీలలో హైదరాబాదులో మొదటి అఖిల భారత తెలుగు మహాసభలు, 1984 మే 6, 7 తేదీలలో ఆనాటి మద్రాసులో రెండవ అఖిల భారత తెలుగు మహా సభలు జరిగాయి. ఈలోగా 1985 డిసెంబర్ 2న అప్పటి ప్రభుత్వం తెలుగు విజ్ఞాన పీఠాన్ని ఏర్పాటు చేస్తూ ఆనాటి సాహిత్య, సంగీత, నాటక, నృత్య, లలిత కళా అకాడమీలతో పాటు తెలుగు భాషా సమితి, అంతర్జాతీయ తెలుగు సంస్థలను విలీనం చేసింది. అంతర్జాతీయ తెలుగు సంస్థ ఈ పీఠంలో అంతర్జాతీయ తెలుగు కేంద్రం పేరుతో ఒక కేంద్రంగా పనిచేయసాగింది. ఆ తరువాత ఈ పీఠం విశ్వవిద్యాలయంగా మారింది. కొన్నాళ్ళ తరువాత ఈ విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు పెట్టబడింది.

ఈ నేపథ్యంలో 1990 ఫిబ్రవరిలో తెలుగు విశ్వవిద్యాలయం అంతర్జాతీయ తెలుగు కేంద్రం ద్వారా బెంగళూరులో 3వ అఖిల భారత తెలుగు మహాసభలను జరిపించింది. అదే సం॥ డిసెంబర్ మాసంలో 3 రోజుల పాటు మారిషస్ దేశంలో 3వ ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించింది. ఈ సభలకు ఆనాడు మండలి వెంకట కృష్ణారావుగారు, వారితో పాటు మండలి బుద్ధప్రసాద్ గారు తండ్రి తనయులు ఇరువురూ హాజరుకావటం విశేషం. ఈ వరుసలో 1997 ఏప్రిల్‌లో ముంబయిలో నాల్గవ అఖిల భారత తెలుగు మహా సభలు, 2000ల సం॥ ఆగస్టు 13, 14 తేదీలలో ప్రాంతీయ స్థాయిలో ఒడిశాలోని బరంపురంలో, అదే నెల 26, 27 తేదీలలో తమిళనాడులోని హోసూరులో ప్రాంతీయ స్థాయి తెలుగు మహాసభలు జరిగాయి. తిరిగి 2007 జూన్ ఒకటి నుంచి మూడవ తేదీ వరకు తెలుగు విశ్వవిద్యాలయం చెన్నైలో అయిదవ అఖిల భారత తెలుగు మహాసభలను, 2011 ఫిబ్రవరి 4, 5 తేదీలలో బరంపురంలో ఆరవ అఖిల భారత తెలుగు మహాసభలను జరిపించింది. ఈ రకంగా తెలుగు మహాసభలు అనే ఒక ఆలోచనకు అంకురార్పణ చేసిన కీ.శే. మండలి వెంకటకృష్ణారావుగారు ప్రాతఃస్మరణీయులు. ఆ పరంపరను కొనసాగిస్తున్న వారి కుమారులు మండలి బుద్ధప్రసాద్ గారు ఆదరణీయులు. ఇంతవరకు మొత్తం నాలుగు ప్రపంచ తెలుగు మహాసభలు, ఆరు అఖిల భారత తెలుగు మహా సభలు, రెండు ప్రాంతీయ స్థాయి తెలుగు మహా సభలను 1975 నుంచి ఆనాటి ప్రభుత్వం ఆధ్వర్యంలో అప్పటి అంతర్జాతీయ తెలుగు సంస్థ, అనంతర కాలంలోని అంతర్జాతీయ తెలుగు కేంద్రం జరుపుతూ వచ్చింది. ఈ మహాసభల ఆలోచనను స్వీకరిస్తూ తరువాతి కాలంలో మన దేశంలోని ప్రపంచ తెలుగు సమాఖ్య, కృష్ణా జిల్లా తెలుగు రచయితల సంఘం, అమెరికా, లండన్, మలేషియా, సింగపూర్, దుబాయ్ వంటి ఇతర దేశాలలో ఆటా, తానా, నాటా, ఈటా వంటి పలు స్వచ్ఛంద సంస్థలు అడపాదడపా తెలుగు సభలను నిర్వహిస్తూ ఉన్నాయి.

ఈ స్ఫూర్తితో 2011 డిసెంబర్ 8, 9, 10 తేదీలలో మారిషస్ దేశంలో అక్కడి తెలుగు వారు ఆ దేశ ప్రభుత్వం, 'మారిషస్ ఆంధ్ర మహాసభ', 'తెలుగు స్పీకింగ్ యూనియన్', 'తెలుగు కల్చరల్ సెంట్రల్ ట్రస్ట్' సంయుక్తాధ్వర్యంలో తెలుగు మహాసభలను నిర్వహించారు. దీనికి ఆనాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమీలు తోడ్పాటును అందించాయి. ఈ సభలను శ్రీ బుద్ధప్రసాద్‌గారు సమన్వయం చేశారు. అప్పటి మన రాష్ట్ర మంత్రులతో, ప్రభుత్వాధికారులతో ఆయన కలిసి మారిషస్ వెళ్ళి ఆ సభల విజయానికి కృషి సలిపారు. 1990లో వారి తండ్రి గారి హయాంలో మారిషస్‌లో మూడవ ప్రపంచ

తెలుగు మహాసభలు జరిగితే తిరిగి ఇరవై ఏళ్ళ తరువాత అదే మారిషస్ దేశంలో బుద్ధప్రసాద్ గారి ఆధ్వర్యంలో తెలుగు మహాసభలు జరగటం యాదృచ్ఛికమే అయినా చారిత్రాత్మకమైన సన్నివేశం. ఆనాడు కృష్ణారావు గారిని అక్కడి తెలుగువారు తమ ఇళ్ళకు ఆహ్వానించి ఆదరించిన మధుర స్మృతులను, తీపి జ్ఞాపకాలను, అపురూపమైన సంఘటనలను 2011 నాటి సభలలో వారు నెమరువేసుకోవటం బుద్ధప్రసాదు గారిలోనే కృష్ణారావు గార్ని చూసుకోవటం మరపురాని సందర్భం. బుద్ధప్రసాద్ గారు కృతజ్ఞతగా అక్కడి తెలుగు భాషా వికాసం కోసం పాటుపడిన పెద్దలను ఈ వేదికపై సత్కరించటం ఆయనలోని ఔదార్యాన్ని, ఔన్నత్యాన్ని ఆవిష్కరించి చూపుతుంది.

తండ్రి పేరుకు సార్థకత

ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారిని గుర్తించి, వారిలో మాతృభాషా సాంస్కృతిక స్పృహను జాగృతం చేసిన కీ.శే. మండలి వెంకట కృష్ణారావు గారి పేరును శాశ్వతపరచటానికి బుద్ధప్రసాద్‌గారు తెలుగు విశ్వవిద్యాలయంలోని అంతర్జాతీయ తెలుగు కేంద్రానికి మండలి వెంకటకృష్ణారావు గారి పేరును పెట్టటానికి చేసిన కృషి ప్రత్యేకంగా పేర్కొనదగినది. అంతేగాక ఈ కేంద్రం ద్వారా ఇతర రాష్ట్రాలలో, విదేశాలలో తెలుగు భాషా సంస్కృతుల అభివృద్ధి కొరకు సేవలందిస్తున్న వారిని కీ.శే. మండలి వెంకటకృష్ణారావు గారి పేరిట, ప్రతిఏటా వారి పుట్టిన రోజు నాడు నగదు బహుమతితో సత్కరించటం బుద్ధప్రసాద్ గారిలోని పితృభక్తితో పాటు తెలుగు భాషా సంస్కృతుల పట్ల వీరికి ఉన్న అనురక్తిని, సంస్కారాన్ని స్పష్టపరుస్తుంది.

అధికార భాషా సంఘం

శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారు 2012 అక్టోబర్ 25వ తేదీన ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. అధికార భాషా సంఘం కేవలం ప్రభుత్వ కార్యాలయాలలో తెలుగు అమలుపై పర్యవేక్షణకే పరిమితం కాకుండా అసలు తెలుగు అమలుకు ఎదురవుతున్న అవరోధాలేమిటో తెలుసుకొని, వాటి నివారణా చర్యలను గురించి ఆలోచించే దిశగా వీరు అడుగులు వేశారు. కార్యాలయపు ఫైళ్ళలో తెలుగు రాయాలంటే తెలుగులో పాండిత్యం అవసరం లేదు కానీ కనీసం భాషా వ్యవహారజ్ఞానం ఉండాలి. అది నిన్నటి తరంలో మిగిలి ఉన్నా, నేటి తరంలో అంతంత మాత్రమే. అందుకే ప్రస్తుతం ప్రభుత్వోద్యోగాలలో చేరేవారు తెలుగు తెలిసిన వారైతేనే అధికార భాషగా తెలుగు బాగా అమలు కాగలదు. అంటే విద్యా విధానం నుంచే మౌలికమైన మార్పులు జరగాలన్నది వీరి అభిప్రాయం. తెలుగు బోధన ఈనాడు సజావుగా సాగితేనే, కార్యాలయాలలో రేపు తెలుగు కనపడుతుందన్నది వీరి విశ్వాసం. అంతేగాక తెలుగు ప్రజలలో తెలుగు భాష పట్ల గౌరవాభిమానాలను ఇనుమడింపజేయడానికి భాషాసాంస్కృతిక కార్యక్రమాలు విరివిగా జరిపి, ప్రజలను భాషోన్ముఖుల్ని చేసి ఉత్తేజపరచాలన్నది వీరి ఉద్దేశం. అధికార భాషా సంఘం అధ్యక్షునిగా వీరు నిర్వహించిన కార్యక్రమాలు వీరి ఈ ఆకాంక్షలను ప్రతిఫలింపజేస్తాయి.

నిర్వహించిన కార్యక్రమాలు :

- అధికార భాష చట్టం ఏర్పడిన మే 14వ తేదీని మొట్టమొదటి సారిగా 'అధికార భాషా దినోత్సవం'గా ప్రకటిస్తూ, ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఆ ఏడాది 'అధికార భాషా వారోత్సవాల'ను జరిపించడానికి వీరు కారణం.

- అధికార భాషా సంఘం చరిత్రలో ఆ మాటకు వస్తే నిన్నటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలోనే 2013 ఫిబ్రవరి 10వ తేదీ ఒక అపూర్వ సన్నివేశం. ఆనాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, గౌ॥ శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి గారు, ఆనాటి ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి గౌ. జస్టిస్ పినాకి చంద్రఘోష్ గారు ఇద్దరూ ఒకే వేదిక పైకి వచ్చి 'తెలుగులో న్యాయపాలన'పై చర్చించటం ఒక చారిత్రిక సంఘటన. అధికార భాషా సంఘం చరిత్రలో ఒక కొత్త అధ్యాయం. న్యాయవ్యవస్థలో ప్రజలకు న్యాయం చేరువకావడంలో ప్రధాన అవరోధం భాష. కోర్టు వాదప్రతివాదాలు, తీర్పులు మాతృభాష తెలుగులో కాకుండా ఇంగ్లీషులో జరగడం వల్ల కోర్టుల్లో ఏం జరుగుతుందో, తీర్పు ఫలానా విధంగా ఎందుకొచ్చిందో కక్షిదారునికి తెలిసే పరిస్థితి లేదు. ఈ విషయం గురించి అప్పటి హైకోర్టు న్యాయమూర్తి, ఈనాటి సుప్రీం కోర్టు న్యాయమూర్తి, ఆనాటి ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమి అధ్యక్షులు శ్రీ ఎన్.వి. రమణగారు ఒక పత్రికలో రాసిన వ్యాసం శ్రీ బుద్ధప్రసాద్‌గారిని ఆలోచింపజేసింది. వెంటనే జస్టిస్ నూతలపాటి వెంకటరమణ గారితో చర్చించి 'తెలుగులో న్యాయపాలన' అనే సదస్సును ఏర్పాటు చేశారు. నాటి ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం నాటి ఆంధ్రప్రదేశ్ జ్యుడిషియల్ అకాడమి సహకారంతో జరిగిన ఈ సదస్సు నిర్వహణలో నాటి జ్యుడిషియల్ అకాడమీ అదనపు సంచాలకులు శ్రీ వేదాంతం సీతారామావధాని గారు, జ్యుడీషియల్ అకాడమి వరిష్ఠ సభ్యులు, నాటి జిల ఆల జడ్జి, ప్రముఖ కవి శ్రీ మంగారి రాజేందర్ (జింబో) గారు తమ పూర్తి సహకారాన్ని అందించి సదస్సు విజయవంతం కావడానికి తోడ్పడ్డారు. ఆ తరువాత జరిగిన సదస్సులలో నాటి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చంద్రయ్యగారు, జస్టిస్ ఎల్. నరసింహారెడ్డిగారు, పూర్వ లోకాయుక్త శ్రీ ఆర్. రామానుజం గారు, జస్టిస్ బి. చంద్రకుమార్ గారు, జస్టిస్ జి. రోహిణి గారి వంటి ఎందరో న్యాయమూర్తులు, ఆనాటి ఉమ్మడి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయశాస్త్రకోవిదులు, మేధావులు, విద్యావంతులు పెద్ద ఎత్తున దీనిలో పాల్గొని ఈ సదస్సును జయప్రదం చేశారు.

- 'తెలుగులో న్యాయ పాలన' పై హైదరాబాదు, విజయవాడలలో జరిగిన ఈ సదస్సులు న్యాయ వ్యవస్థపైనే కాకుండా అధికార భాషా వినియోగం పైన అపారమైన ప్రభావాన్ని చూపాయి. తత్ఫలితంగా కింది స్థాయి న్యాయ స్థానాలలో అరవైకి పైగా తెలుగులో తీర్పులు వచ్చాయి. ఈ స్ఫూర్తితో పోలీసు శాఖలో కూడా తెలుగును అమలు జరుపుతామని డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు ప్రకటించారు.

- 2012 డిసెంబర్ 27, 28, 29 తేదీలలో తిరుపతిలో జరిగిన నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా 'అధికార భాషగా తెలుగు'పై సదస్సు జరిపించి, ఆ సదస్సులోని ప్రసంగ పత్రాలను 'తెలుగు కిరణాలు' పేరుతో సంకలన పరిచారు.

- ప్రతి ఫిబ్రవరి 21వ తేదీన 'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవా'న్ని నిర్వహించి, ఈ సందర్భంగా తెలుగు భాష, చరిత్ర, పరిశోధన, పత్రికారంగం, నిఘంటు నిర్మాణం, ఉర్దూ భాషారంగాలలో, తెలుగు అమలులో ఉత్తమ ఫలితాలను సాధించిన ప్రభుత్వాధికారులను, ప్రశంసనీయమైన సేవలందించిన ఉద్యోగులను నగదు పురస్కారాలతో సత్కరించారు.

- 2013 జూన్ 7వ తేదీన 'నల్గొండ జిల్లా నమూనా' అనే అంశంపై జిల్లా కలెక్టర్ సమన్వయంతో, ఇతర జిల్లాల అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇటు బుద్ధప్రసాద్ గారి పట్టుదలతో అటు కలెక్టర్ డా. నందివెలుగు ముక్తేశ్వరరావుగారు, వారి సిబ్బంది కృషితో అధికార భాషగా తెలుగు అమలులో నల్గొండ జిల్లా మొదటిదిగా నిలిచింది.
- 2013 జులై 20వ తేదీన 'పోటీ పరీక్షలలో తెలుగు' అంశంపై సదస్సు జరిపించారు.
- 2013 ఆగస్టు 29న 'తెలుగు భాషా దినోత్సవం' నిర్వహించి, ఈ సందర్భంగా ప్రముఖ భాషా శాస్త్ర వేత్తలను, పత్రికా రచయితలను 'గిడుగు పురస్కారాల'తో సత్కరించారు.

వీరి కృషితో సాధించిన సత్ఫలితాలు

- రాష్ట్రంలోని పాఠశాలలలో ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు విధిగా తెలుగును బోధించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
- తెలుగు భాషాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపకల్పన, అమలు కోసం ఒక ప్రత్యేక మంత్రిత్వశాఖను ప్రభుత్వం 2014 జనవరి నుంచి ఏర్పాటు చేస్తూ, దానిని ఇదివరకే ఉన్న సాంస్కృతిక శాఖకు అనుసంధానం చేసింది.
- ఆ మధ్య యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ తీసుకొన్న కొన్ని కొత్త నిర్ణయాలు మన రాష్ట్రంలో సివిల్స్ రాసే తెలుగు అభ్యర్థులకు తీవ్ర నష్టం కలిగించేవిగా ఉన్నాయి. దీని వల్ల తెలుగు చదివేవారు నిరుత్సాహానికి గురై, ఇకపై తెలుగు చదవకుండా ఉండే పరిస్థితి ఏర్పడుతుంది. యు.పి.ఎస్.సి. తీసుకొన్న నిర్ణయాన్ని వెనకకు తీసుకోవలసిందిగా కోరమంటూ ఇటు రాష్ట్ర ప్రభుత్వానికీ, అటు కేంద్ర ప్రభుత్వానికీ, యు.పి.ఎస్.సి; అధ్యక్షునికీ బుద్ధప్రసాద్‌గారు విన్నపాలు పంపడం, ఇది పార్లమెంట్‌లో తీవ్ర చర్చలకు దారి తీయడం, వెంటనే యు.పి.ఎస్.సి. తన నిర్ణయాలను ఆపి ఉంచడం జరిగింది. దీనివల్ల తెలుగు అభ్యర్థులకు కొంత ఊరట లభించింది. తెలుగు చదువుకునే వెసులుబాటు కలిగింది.
- రాష్ట్ర ప్రభుత్వ సమాచార, సాంకేతిక శాఖతో సంప్రదింపులు జరిపి, కంప్యూటర్ వినియోగంలో సరికొత్త తెలుగు సాఫ్ట్‌వేర్ల రూపకల్పనకు, కొత్త రకమైన పద్దెనిమిది ఏకరూప ఖతులను (ఫాంట్స్), ఇతర ఉపకరణాలను వినియోగంలోకి తీసుకురావడమైంది.
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్యలిఖిత గ్రంథాలయం, పరిశోధనాలయంలోని విశిష్టమైన తాళపత్ర గ్రంథాలను పరిశీలించి, వాటిల్లో కొన్నింటిని తిరుపతి తెలుగు మహాసభల సందర్భంగా ముద్రింపించి వెలుగులోకి తేవడమైంది.
- అధికార భాష రాష్ట్ర చట్టం, కొన్ని ఇతర రాష్ట్రాల చట్టాల తెలుగు అనువాదం ఆంధ్రప్రదేశ్ గెజెట్ ప్రత్యేక సంచిక నాల్గవ భాగం–సిలో ప్రచురించడానికి జి.ఓ.ఎం.ఎస్. నెం.128, తేదీ : 26.09.2013 ద్వారా ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయించారు.
- రాష్ట్రంలోని అన్ని దుకాణాలు, వ్యాపార సంస్థలు తమ నామ ఫలకాలను తెలుగులో రాయించి పెట్టాలన్న ప్రభుత్వ ఉత్తర్వులను నూటికి నూరు శాతం అమలు అయ్యేటట్లు సంబంధిత కార్మిక శాఖను కోరడం, తత్ఫలితంగా 90 శాతం దాకా దీనిని సాధించడం జరిగింది.

- అధికార భాషా సంఘం ప్రోత్సాహంతో నల్గొండ జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం 'నల్గొండ నమూనా–పాలనా భాషగా తెలుగు' అనే పుస్తకాన్ని తయారు చేసి మిగతా జిల్లాలకు మార్గదర్శిగా నిలిచింది. తెలుగులో పాలన సాగించడం వల్ల తాము ప్రజలకు దగ్గర కాగలుగుతున్నట్లుగా, తద్వారా ఉద్యోగ నిర్వహణలో ఎంతో ఆత్మ సంతృప్తిని పొందుతున్నట్లుగా ఆ జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ప్రకటించింది.
- సంకల్పబలం, చిత్తశుద్ధి ఉంటే అధికార భాషగా తెలుగు అమలు కష్టసాధ్యం కాదని సచివాలయంలోని ప్రకృతి వైపరీత్యాలు, విపత్తు నివారణ శాఖ కార్యాచరణ ద్వారా నిరూపణ చేసింది.

ప్రచురణలు:

'తెలుగు కిరణాలు' పేరిట ప్రసంగ పత్రాల సంకలన పుస్తకంతో పాటు 'తెలుగులో న్యాయపాలన', 'సంక్షిప్త న్యాయ పదకోశం', 'పోటీ పరీక్షలలో తెలుగు', 'నల్గొండ నమూనా–పాలనాభాషగా తెలుగు' మొదలైన ప్రచురణలను వెలువరించింది.

అధికార భాషగా తెలుగు దాని ప్రయోజనాలను కాపాడడానికీ, దాని సర్వతోముఖ వికాసానికీ అధికార భాషా సంఘం అధ్యక్షునిగా శ్రీ బుద్ధప్రసాద్‌గారు అప్పట్లో ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేశారు.

అందించిన సూచనలు:

- అధికార భాషా సంఘం అధ్యక్షుని పదవీకాలం ముగిశాక, తిరిగి కొత్త అధ్యక్షుణ్ణి నియమించడానికి సమయం పడుతుంది. ఇది నెలలు కావచ్చు, సంవత్సరాలు కావచ్చు. అధ్యక్షుడు లేని కాలంలో భాషా సంఘం పనులు స్తంభించి పోకుండా ఉండడానికి సచివాలయంలో అధికార భాషా సంఘం వ్యవహారాలు చూసే ప్రభుత్వ కార్యదర్శిని అధికార భాషాసంఘం ఉపాధ్యక్షునిగా; ప్రధాన పరిపాలన శాఖ ప్రభుత్వ ఉపకార్యదర్శిని అధికార భాషా సంఘం కార్యదర్శిగా శాశ్వత ప్రాతిపదికపై పూర్తికాలానికి నియమించాలి.
- అధికార భాషా చట్టం 1966 8వ నిబంధన మేరకు ప్రభుత్వానికి నియమాలు రూపొందించే అధికారం ఉంది. కానీ 47 సంవత్సరాలైనా ఇంకా నియమాలనే తయారు చేయలేదు. ఈ పనిని ప్రభుత్వ న్యాయశాఖ చేపట్టడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలి.
- ప్రభుత్వ సమీక్షా సమావేశాలలో అధికారభాషగా తెలుగు అమలుపై చర్చించే అంశాన్ని కూడా అజెండాలో చేర్చాలి.
- జిల్లా స్థాయిలో ప్రభుత్వ కార్యాలయాలలో అధికార భాషగా తెలుగు అమలును పర్యవేక్షించడానికి పూర్తిస్థాయిలో జిల్లా భాషాధికారిని నియమించాలి.
- రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల వెబ్‌సైట్లు ప్రస్తుతం ఇంగ్లీషులోనే ఉన్నాయి. ఇవి తెలుగులో కూడా ఉండేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలి.
- సచివాలయంలోని అనువాద కేంద్రం ప్రస్తుతం అక్కడ ఉన్న అన్ని శాఖలకు అనుసంధానం చేయబడి ఉన్నందువల్ల, అధికార భాషా సంఘం అనువాదపు పనులు చేయడానికి అవకాశం ఉండదు.

అందువల్ల ప్రభుత్వ ఉత్తర్వులు, సర్క్యులర్లు, మెమోలు, చట్టాలు, ఆర్డినెన్సులు వగైరా తెలుగులోకి తర్జుమా చేయడానికి అధికార భాషా సంఘానికి ప్రత్యేకించి ఒక అనువాద శాఖను ఏర్పాటు చేయాలి.

- సచివాలయం సీనియర్ స్టెనోగ్రాఫర్ల విద్యార్హతలలో ప్రస్తుతం డిగ్రీతోపాటు ఇంగ్లీషు టైపు, షార్ట్ హ్యాండ్‌లలో హయ్యర్ గ్రేడ్, తెలుగులో లోయర్ గ్రేడ్ ఉంటే చాలని ఉంది. మన రాష్ట్ర అధికార భాష తెలుగు అయినందువల్ల తెలుగులో హయ్యర్ గ్రేడ్, ఇంగ్లీషులో లోయర్‌గ్రేడ్ ఉంటే చాలని సవరణ చేయాలి.
- ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమీషన్ నిర్వహించే పోటీ పరీక్షలలో తెలుగు పరీక్షను ఒక తప్పనిసరి అంశంగా ప్రవేశ పెట్టాలనీ; గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షల పాఠ్యప్రణాళికలో 150 మార్కులకు తెలుగు భాషా సాహిత్యాలకు సంబంధించిన పేపర్ పెట్టాలని సర్వీసు కమీషన్‌ను, రాష్ట్ర ప్రభుత్వాన్ని అధికార భాషా సంఘం కోరింది.
- రాష్ట్రంలో ఉర్దూ రెండవ అధికార భాషగా అమలులో ఉన్న నేపథ్యంలో ఉర్దూ మీడియం పాఠశాలలలో ఉర్దూ మీడియం లేదా ఉర్దూ మొదటి భాషగా చదివిన వారితో మాత్రమే నేరుగా నియామకం లేదా పదోన్నతుల ద్వారా జరిపే అన్ని కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి.
- కడప నగర పాలక సంస్థ పరిధిలోని ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కాకపోవడం చేత ప్రతి ఏటా ముస్లిం మైనారిటీ పేద పిల్లలు నష్టపోతున్నందువల్ల, విద్యాహక్కు చట్టం మేరకు వారికి న్యాయం చేయాలి.
- రాజ్యాంగంలోని 73వ అధికరణాన్ని వివరిస్తూ, విద్యాహక్కు చట్టం అమలులో తెలుగు భాషకు, తెలుగు మాధ్యమంలో చదివే పిల్లలకు జరిగే అన్యాయాన్ని గురించి తెలిపి, దాని సవరణ కోసం ప్రభుత్వం పూనుకోవాలి. విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘించే పాఠశాలలపై చర్యలు చేపట్టాలి.
- ఆంగ్ల మాధ్యమంలో నడిచే ఆదర్శ పాఠశాలలలో తెలుగు భాషా మాధ్యమ బోధనను పరిశీలించాలి.
- రాష్ట్రంలోని ఉన్నత పాఠశాలలలో పనిచేసే గ్రేడ్–2 భాషా పండితుల పోస్టులను అప్‌గ్రేడ్ చేసి, వారికి పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలి.
- రాష్ట్రంలోని ప్రాచ్యకళాశాలలను పరిరక్షిస్తూ వాటి పరిస్థితులను చక్కదిద్ది, వాటన్నింటిని ఒక విశ్వ విద్యాలయానికి అనుబంధం చేయాలి. అధ్యాపకులను నియమించి, ఉద్యోగావకాశాలు కల్పించాలి. వచ్చే పేద విద్యార్థులకు వసతి కల్పించి, ఉపకార వేతనాలు ఇప్పించాలి.
- భాషా నిపుణులు, పత్రికా రచయితలు, విద్వాంసులు, ఆచార్యులతో కూడిన బృందం తరచుగా సమావేశమై, ఆధునిక అవసరాలకు తగిన విధంగా ఆంగ్లం లేదా ఇతర భాషలలోని పదాలకు తెలుగు సమానార్థకాలను పరికల్పన చేసి పదనిధిని ఏర్పాటు చేయాలి.
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంకేతిక శాఖ తమ ఇంజనీరింగ్ కళాశాలలలోని కోర్సులలో తెలుగు సాహిత్య సంస్కృతుల పాఠ్యాంశాల బోధనకు అవకాశం కల్పించాలి.

- గతంలో ప్రభుత్వం రద్దు చేసిన వివిధ అకాడమీలను తిరిగి ఏర్పాటు చేస్తూ, వాటిని కేంద్ర అకాడమీలతో అనుసంధానపరచి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులను పొందడానికి ప్రయత్నించాలి.

- తెలుగు భాషా సంస్కృతుల ఔన్నత్యాన్ని తెలియజేప్పే ఉత్తమ తెలుగు చలనచిత్రాలకు రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలను ఇవ్వాలి.

- జాతీయ స్థాయిలో హిందీని అధికార భాషగా అమలు చేయడానికి భారత ప్రభుత్వం కొన్ని ప్రత్యేక అధికారాలను ఇచ్చింది. అదే మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్ర అధికార భాషా సంఘానికి ప్రత్యేక అధికారాలు ఇవ్వాలి.

- ప్రాచీన తెలుగు భాషా కేంద్రాన్ని మైసూర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ నుంచి హైదరాబాదుకు మార్చడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించిన నేపథ్యంలో, అందుకు అనువైన స్థలాన్ని ప్రభుత్వం ఇక్కడ వెంటనే కల్పించి, ఇందుకోసం కేంద్రం విడుదల చేసే నిధులు జారి పోకుండా కాపాడుకోవాలి.

- కేంద్రం హిందీ సంస్థాన్ తరహాలో తెలుగు భాషాభివృద్ధి కోసం ఒక కేంద్ర సంస్థను స్థాపించడానికి భారత ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలి. తద్వారా ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాలలోని తెలుగు వారి విద్యా సాంస్కృతిక సమస్యల పరిష్కారానికీ, వారికి కావలసిన తెలుగు పాఠ్య గ్రంథాల తయారీకి, జాతీయ, అంతర్జాతీయ సదస్సుల నిర్వహణకూ; శాస్త్ర, సాంకేతిక రంగాల ద్వారా తెలుగు వికాసానికీ మార్గం సుగమం కాగలదు.

- భారత ప్రభుత్వం 'హిందీ రాజభాష' విషయంలో కనబరుస్తున్న శ్రద్ధాసక్తులు వివిధ రాష్ట్రాల అధికార భాషల అమలు పట్ల కూడా కనబరచాలి. హిందీ అమలు కోసం నిధులు వెచ్చిస్తున్నట్లే రాష్ట్రాల అధికార భాషల అమలు కోసం నిధులు కేటాయించేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలి.

- 1978లో కేంద్ర ప్రభుత్వం అఖిల భారత స్థాయిలో అన్ని రాష్ట్రాల అధికార భాషల సదస్సును నిర్వహించింది. ఈ సందర్భంగా హిందీకి మాత్రమే పరిమితమైన కేంద్రంలోని అధికార భాషా విభాగాన్ని రాష్ట్ర అధికార భాషల శాఖగా మార్చాలని తీర్మానించింది. రాజ్యాంగ సవరణలను నిర్దేశించే సర్కారియా కమీషన్ కూడా 1988లో ఈ మార్పు వెంటనే జరగాలని తన 241వ సిఫార్సులో ఉద్ఘాటించింది. అయినా ఇంతవరకు ఇది జరగలేదు. కేంద్రప్రభుత్వం ఇందుకు చర్యలు చేపట్టాలి.

- త్రిభాషా సూత్రం ప్రకారం ఉత్తరాది రాష్ట్రాల వారు తెలుగును ద్వితీయ భాషగా నేర్చుకొనేటట్లు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలి.

- తెలుగువారు అత్యధిక సంఖ్యలో నివసిస్తున్న తమిళనాడు, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాలలో తెలుగును రెండవ అధికార భాషగా గుర్తించాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను మన రాష్ట్ర ప్రభుత్వం కోరాలి.

ఈ పై అంశాలన్నీ అధికార భాషా సంఘం అధ్యక్షుని హోదాలో శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు ఆనాటి ప్రభుత్వానికి నివేదించారు. అధికార భాషను సక్రమంగా అమలుపరచడానికి, అసలు తెలుగు బోధనను పటిష్టపరచాలన్న మౌలికాంశంపై వీరు దృష్టి కేంద్రీకరించారు. అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు

అధికార భాష అమలు విషయంలో అసలు ఏం చేశాయి, ఏం చేస్తున్నాయని ఇంత విస్తృతంగా ఆలోచించి అధ్యయనం చేసిన అధికార భాషా సంఘం అధ్యక్షులు శ్రీ బుద్ధప్రసాద్ గారేనని చెప్పవచ్చు.

ఈ పై అంశాలతోపాటు అధికార భాషా సంఘం అధ్యక్షునిగా శ్రీ బుద్ధప్రసాద్‌గారు తెలుగు ప్రచారోద్యమంలో భాగంగా ఒడిశాలోని బరంపురం, తమిళనాడులోని తంజావూరు, మేలట్టూరు, చెన్నై, మైసూరు, పుదుచ్చేరి, ముంబయి మొదలైన నగరాలతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా, కువైట్, సింగపూర్ వంటి విదేశాలలో పర్యటించి తెలుగు భాషా స్థితిగతులను గురించి ప్రసంగించారు. సింగపూర్‌లో తెలుగు సమాజం వారి తెలుగు టెలివిజన్‌ను ప్రారంభించారు. కువైట్‌లోని దుకాణాలపై తెలుగులో నామఫలకాలను చూసి పులకించి పోయారు. తంజావూర్‌లోని సరస్వతీ మహల్ గ్రంథాలయం, చెన్నైలోని ప్రాచ్యలిఖిత భాండాగారం, ప్రభుత్వ పురావస్తుశాలలు సందర్శించి అక్కడి తెలుగు తాళ పత్ర గ్రంథాల ఆచూకీని రాబట్టే ప్రయత్నం చేశారు.

ఇంకా వివిధ విశ్వవిద్యాలయాలు నిర్వహించిన భాషా సాహిత్య సదస్సులలో పాల్గొని తెలుగు నిఘంటువులు, పదకోశాల నిర్మాణం చేపట్టాలనీ సూచించారు. నూతన పరిశోధనలకు వారిని ఉసిగొల్పారు. అనేక ఇతర సాంస్కృతిక సంస్థల తెలుగు కార్యక్రమాలలో పాల్గొని తెలుగు భాషా పరిరక్షణ కోసం వ్యూహాత్మక రచన చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

ఇండియాటుడే 10 మంది శక్తి సంపన్నులలో ఒకరిగా అధికార భాషా సంఘం అధ్యక్షుడు శ్రీ మండలి బుద్ధప్రసాద్‌ని గుర్తించిందంటే వారి అంకితభావం, నిస్వార్థ భాషా సేవకు తగిన గుర్తింపు లభించినట్లయింది.

భాష కోసం ఉద్యమించే ఒక విశిష్ట నాయకుని, భాషా ప్రేమికుని అంతరంగ ఆవిష్కరణం ఇది. శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు అరవై ఏళ్ళు పూర్తి చేసుకొనే శుభతరుణంలో వారు మరిన్ని భాషాసేవలు చేయడానికి వారికి ఆ భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యైశ్వర్యాలను ప్రసాదించాలని, కోరుకుంటూ వారికి, వారి కుటుంబానికి నా శుభాకాంక్షలు!



మారిషస్ గవర్నర్ జనరల్ శ్రీ వీరాస్వామి రింగడ్ దంపతులతో...

తెలుగుజాతి గర్వించదగ్గ వ్యక్తిత్వం

- పతివాడ సూర్యనారాయణ

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గార్కి, షష్ట్యబ్ది పూర్తి జరుగుతుందంటే చాలా ఆనందంగా ఉంది. దీనికి 'కిన్నెర' సంస్థ పూనుకోవడాన్ని అభినందించాలి.

శ్రీ బుద్ధప్రసాద్ తెలుగుభాషకు ప్రాచీన హోదా సాధించడంలోను, దేశ విదేశాల్లో పర్యటించి తెలుగుజనం ఎక్కడ ఉన్నా సమీకృతం చేసి, వారి కష్టసుఖాలు తెలుసుకొని, చేతనైనంత సహాయ, సహకారాలు అందించడంలో ముందుండడం, ఏ పదవిలో ఉన్నా లేకపోయినా తెలుగు భాషా సాహిత్య, సంస్కృతుల పరిరక్షణ, అభివృద్ధి చేయడంలో ఎంతో కృషి చేసారు, చేస్తున్నారు.

బుద్ధప్రసాద్గారు మితభాషి, గంభీరోపన్యాసాలు చేయరు కానీ, ఎన్నో నూతన విషయాల్ని ఆవిష్కరిస్తూ, విషయ సేకరణతో, తేట తెలుగులో జనాన్ని ఆకట్టుకొనేలా ప్రసంగిస్తారు.

రాజకీయాలకు అతీతంగా సభలు, సమావేశాలకు వీరిని పిలుస్తారు, తెలుగుజాతి భాషా సాహితీ సంస్కృతీ సభలకు, దేశ విదేశాల్నుంచి పిలుస్తారు. స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు చేస్తారు.

నిరంతర పుస్తక పఠన, అరుదైన ప్రాచీన గ్రంథాల్ని మిత్రులతో ప్రచురింపచేయడమో, తను ప్రచురించడమో వారి సాహితీ తృష్ణకు తార్కాణం. అయ్యదేవర, భాట్టం శ్రీరామమూర్తి ఆత్మకథలు వారు పూనుకొని ప్రచురించినవే, తంజావూరు వంటి తెలుగు ప్రాచీన గ్రంథాలయాలు, ఎక్కడున్నా దర్శించడం వారి నిత్యకృత్యం. ఈ మధ్య పన్ చంద్రశేఖర్ గారి అపూర్వ గ్రంథాలు చెన్నైలో చూచినట్లు చెప్పారు.

బుద్ధప్రసాద్ గారు చాలా సౌమ్యులు. పరుషంగా, దురుసుగా మాట్లాడటం నేనెరగను. ఏకీభవించకపోయినా సున్నితంగా ఆకట్టుకొనే విధంగా చెప్పి ఒప్పించడం వారి నైజం.

ఆయనకు పదవులు, నిస్స్వార్థంగా ప్రజలకు మేలు కూర్చడానికే కాని, స్వార్థానికి కాదు. భాషా సాహితీ సంస్కృతీ సేవలే ప్రథమ శ్రేణిలో నిలుస్తాయి.

బుద్ధప్రసాద్ గారితో నా తొలి పరిచయం వారి విద్యార్థి దశలోనే, నేను బందరులో ఉండగా మిత్రులు గుత్తికొండ సుబ్బారావు గారు పరిచయం చేయడం జరిగింది. గుత్తికొండ, విహారి ప్రభృతులతో కలసి నేను 'స్పందన సాహితీ సమితి' కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గోవడంతో సాహితీ సౌరభాలు గుబాళించాయి. తరువాత కాలంలో శ్రీకాకుళం (కృష్ణా జిల్లా) లో జరిగిన తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రారంభ కార్యక్రమంలో కలిసినప్పటి నుంచి మరింత అనుబంధం ఏర్పడింది. అప్పటినుంచి వారు చదివిన గ్రంథాల్లో ముఖ్య విషయాలు చెప్పడం, నేను చదివినవి వారికి చెప్పడం. అలా ఎన్నో విషయాలు తెలుసుకోవడం గొప్ప అనుభూతి. నాకు ఎన్నో అపూర్వ గ్రంథాలు ఇచ్చారు. బుద్ధప్రసాద్ గారు నాకంటే చాలా చిన్నవారైనా వారితో మాట్లాడడం ఒక విద్యా సముపార్జనగా తోస్తుంది.

వీరి తండ్రిగారు మండలి వెంకట కృష్ణారావుగారు నాకు విద్యార్థి. కాంగ్రెసులో ఉన్నప్పటి నుంచి తెలుసు. ఆనాటి రాష్ట్ర నాయకత్వంలో వారితో పాటు ఎ.యస్.ఆర్. కృష్ణ, యన్.వి.యస్. ప్రసాదరావు, అన్నేరాజ్యం (రాజ్యంసిన్హా), యన్.సి. గంగిరెడ్డి (కడప), కృష్ణారెడ్డి ప్రభృతులుండేవారు. రవీంద్రవర్మ (భారత విద్యార్థి కాంగ్రెసు అధ్యక్షులు) వారు తరువాత కాలంలో కేంద్రమంత్రి కూడా అయ్యారు. ఇది 70 సంవత్సరాల పూర్వ గాథ. ఇదంతా ఎందుకంటే, శ్రీ బుద్ధప్రసాద్ కూడా తండ్రిలానే విద్యార్థి దశనుంచే ప్రజాసేవకు అంకితమయ్యారు.

నీతి, నిజాయితీలు అరుదుగా కనిపించే నేటి సమాజంలో, మచ్చలేని రాజకీయ జీవితం గడుపుతూ ఆణిముత్యంలా వెలుగొందే చి॥ బుద్ధప్రసాద్ గార్ని అభినందిస్తూ, ఆశీర్వదిస్తున్నాను.



అవనిగడ్డ గాంధీక్షేత్రంలో శ్రీమతి ఇందిరాగాంధీ, డా॥ మర్రి చెన్నారెడ్డి, శ్రీ ప్రభాకర్‌జీ లతో...

తండ్రిని మించిన తనయుడు

- డా. కైకాల సత్యనారాయణ

చిరంజీవి మండలి బుద్ధప్రసాద్ షష్టిపూర్తని, దానికి ఈ నెల 27వ తారీకున రవీంద్రభారతిలో అభినందన సభ అని పంపిన ఆహ్వానపత్రిక, దానితో పాటు పంపిన అతని జీవిత విషయాలతో కూడిన లేఖ చూసి ముందు ఆశ్చర్యపోయాను. తర్వాత ఎంతో ఆనందించాను.

ఆశ్చర్యం ఎందుకంటే మా కళ్లముందు పెరిగిన కుర్రాడు అప్పుడే షష్టిపూర్తి చేసుకునే పెద్దవాడయ్యాడా అని ఆశ్చర్యమేసింది. ఇక ఆనందమంటారా అతని జీవిత చరిత్ర తెలిపే ఆ పేపరు చూస్తుంటే యీ చిన్న వయస్సులో యిన్ని పదవులు నిర్వహించి యిన్ని ప్రజాహిత కార్యాలు చేపట్టి మన జాతికి, దాని ఔన్నత్యానికి తోడ్పడే కార్యాలు చేసారా అని ఎంతో ఆనందం కలిగింది.



నా మిత్రుడు, నా ఆత్మీయుడు, మించి మా బంధువు అయిన చిరంజీవి, అతన్ని చూసి గర్వపడుతున్నాననే భావన కలిగించింది. "అయామ్ వెరీమచ్ ప్రౌడ్ ఆఫ్ హిమ్" అని ఫీలయ్యాను. అతన్ని గూర్చి వేరే ఏమీ వ్రాయనక్కర్లేదు. వారు ప్రచురించిన ఆ కాగితం అందరికి అందేటట్లు చేస్తే చాలు. మొత్తం వారు చేసిన ఘనకార్యాలన్నీ విశదమవుతాయి. ఈ కొద్దిపాటి పీరియడ్‌లో మూడుసార్లు ఎమ్.ఎల్.ఎ. గా నెగ్గటం, ఒకసారి మంత్రిగా చేయటం, ఒకసారి అధికార భాషాధ్యక్షులుగా వుండటం, ఒకసారి ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతిగా కార్యాలు నిర్వహించటం, అతని చతురత చాటుతుంది.

అతను నిర్వహించే కృష్ణాజిల్లా అభివృద్ధి పనులు, చేసే సాంఘిక కార్యక్రమాలు, తెలుగు భాషా సంస్కృతుల సేవ, అతను చదివిన పుస్తకాలు, చేసిన రచనలు, చేసిన ప్రవాసాంధ్ర సేవ యిలా చెప్పుకుంటూ పోతే యింకా ఎన్నో ఎన్నో వున్నాయి. ఇవి చాలవా అతన్ని గురించి మనం గర్వంగా ఫీల్ అవటానికి.

వయసు తక్కువ. ఇంకా ఎన్నో పదవులు నిర్వహించాలి. ఎన్నో ప్రజాహిత కార్యాలు చెయ్యాలి, మన భాష, మన సంస్కృతికి వన్నె తేవటానికి ఎంతో చెయ్యాలి, చాలా పీరియడ్ వుంది.

ఇలా మనం ఎన్నోసార్లు అతన్ని గురించి వ్రాయాలి. ఎన్నో సత్కార్యాలు జరగాలి. అన్ని అప్పుడప్పుడు మనం వ్రాయాలి, మనం చెప్పాలి. అన్నీ యిప్పుడే ఎందుకు? అందుకు ఒక్కమాటలో చెప్పాలంటే నాకనిపించింది, "తండ్రికి తగ్గ కొడుకు కాదు... తండ్రిని మించి కొడుకు"...

విలక్షణ వ్యక్తిత్వం వారి సొంతం

- డా. డి. మునిరత్నం నాయుడు

తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతుల పరిరక్షణ, పరివ్యాప్తే జీవిత లక్ష్యాలుగా మార్చుకొన్న విలక్షణ వ్యక్తిత్వం మూర్తీభవించిన మాన్య మహోదయులు శ్రీ బుద్ధప్రసాద్ గారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారికి ఆత్మబంధువు వారు. తన, పరభేదం లేకుండా అన్ని రాజకీయ పక్షాల నాయకులకు నిరాడంబర మిత్రుడిగా, స్నేహశీలిగా అందరి మన్ననలను చూరగొన్న విలక్షణ రాజకీయవేత్త. తెలుగు భాషోద్యమానికి చుక్కానివంటి వారనడంలో అతిశయోక్తి లేదు. తెలుగుకు ప్రాచీన భాషా హోదా సాధనోద్యమంలో చురుకుగా పాల్గొన్న తెలుగుభాషామాని వారు. పుస్తక ప్రియులు, గ్రంథపఠనాభిలాషి, రచయిత, ప్రపంచంలోని తెలుగువారందరినీ చిన్నాపెద్దా తేడా లేకుండా సమాదరించి వారి భాషా సాంస్కృతిక సమస్యలను పరిష్కరించి ప్రవాసాంధ్రుల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న వారి తండ్రి మాజీమంత్రివర్యులు, గాంధేయవాది, చిరస్మరణీయులు కీ.శే. మండలి వెంకట కృష్ణారావుగారి వారసత్వానికి ప్రతీక వీరు. తండ్రి మార్గంలోనే పయనిస్తూ రాజకీయాలలో అజాతశత్రువుగా ఉన్నత శిఖరాలను చేరుకొన్న నిరాడంబర రాజకీయవేత్త శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు.

బాల్యం నుంచే తండ్రితో పాటు రాష్ట్రేతర ప్రాంతాల్లో, విదేశాల్లో తెలుగువారి సమస్యలను ఆకళింపు చేసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న నిష్కళంక 'భాషావారధి' వారు. 1975వ సంవత్సరం హైదరాబాదులో, 1990వ సంవత్సరంలో మారిషస్‌లో జరిగిన మొదటి, మూడవ ప్రపంచ తెలుగు మహాసభల్లో వారు పాల్గొన్నారు. హైదరాబాదు, చెన్నై, బెంగళూరు, బరంపురం పట్టణాల్లో జరిగిన అఖిల భారత తెలుగు మహాసభల్లోనూ వారు పాల్గొని ప్రవాసాంధ్రుల పట్ల, వారి సమస్యల పట్ల స్పందించివారి సర్వతోముఖ వికాసానికి నిరంతరం శ్రమిస్తున్న భాషా కృషీవలులు వారు. తిరుపతిలో 2012 డిసెంబరు 27 నుంచి 29 వరకు వైభవోపేతంగా ప్రభుత్వం పక్షాన జరిగిన 'ప్రపంచ తెలుగు మహాసభల'కు నేతృత్వం వహించి మార్గనిర్దేశనం చేసి మహాసభలను విజయపథంలో నడిపించిన భాషాసాంస్కృతిక తపస్వి వారు. ఈ మహాసభల్లో తెలుగు విశ్వవిద్యాలయానికి సముచిత ప్రాతినిధ్యాన్ని కల్పించి విశ్వవిద్యాలయానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తేవడంలో వారి కృషి అనిర్వచనీయం.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి తెలుగుభాషా సాహిత్యాలతోపాటు చరిత్ర, సంస్కృతుల పట్ల అమితాసక్తి. పూర్వపు అంతర్జాతీయ తెలుగు సంస్థ లక్ష్యాలలో ఒకటైన 'తెలుగువారి సమగ్ర చరిత్ర' ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయడానికి తమవంతు సహకారాన్ని, ప్రోత్సాహాన్ని సదరు ప్రాజెక్టు నిర్వాహకుల్లో ప్రధాన భూమికను పోషించిన ఆచార్య వకుళాభరణం రామకృష్ణ గారికి అందించారు. లండన్‌లో 2012 జులై 14, 15 తేదీల్లో మొదటి ప్రపంచ చరిత్ర మహాసభలు విజయవంతంగా జరగడానికి లండన్‌లోని యునైటెడ్ కింగ్‌డమ్ తెలుగు అసోసియేషన్ వారికి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి పూర్తి సహకారాన్ని అందించారు. ఆ సభలకు తెలుగు రాష్ట్రాల్లో చరిత్ర విభాగంలోని నిష్ణాతులైన పండితులను ఆహ్వానించి తెలుగువారి చరిత్రను పునర్నిర్మించడానికి గల అవకాశాలను ఆవిష్కరింపజేయడానికి దోహదం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు.

ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో తెలుగుభాషా సాహిత్య సంస్కృతుల పరిరక్షణ, పరివ్యాప్తికి విశేష కృషి చేసిన రాష్ట్రేతర ప్రాంతాల్లోని, విదేశాల్లోని తెలుగు సంస్థలను ప్రోత్సహించడానికి ప్రవాసాంధ్రుల్లో స్ఫూర్తిని కలిగించడానికి తమ తండ్రి కీ.శే. మండలి వెంకట కృష్ణారావు గారి జయంతినాడు ప్రతి సంవత్సరం ఆగస్టు 4న 'మండలి వెంకట కృష్ణారావు సంస్కృతి పురస్కారం' పేరున రూ. 25,000/- నగదు పురస్కారాన్ని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ద్వారా ప్రదానం చేస్తున్నారు.

సంస్కృతి పురస్కారం :

2007లో ఈ పురస్కారంను మలేషియాలో తెలుగు భాషా సంస్కృతుల అభివృద్ధికి విశేషమైన కృషి చేసిన శ్రీ మదిని సోమనాయుడు గారికి అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మాన్యశ్రీ డా. వై.ఎస్. రాజశేఖరరెడ్డి గారి చేతుల మీదుగా హైదరాబాదు జూబిలీ హాలులో ప్రదానం చేయడమైంది. అమెరికాలోని 'సిలికానాంధ్ర అసోసియేషన్' వారికి తేది : 4.8.2008న రవీంద్రభారతిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక శాఖామాత్యులు మాన్యశ్రీ కె. రోశయ్య గారి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని సిలికానాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ కూచిభొట్ల ఆనంద్ గారికి అందజేయడం జరిగింది. 2009 సంవత్సరానికి గాను తమిళనాడు రాష్ట్రంలోని హోసూరు పరిసర ప్రాంతాల్లో తెలుగు భాష, సాహిత్య, సంస్కృతుల పరిరక్షణకు అహర్నిశలూ కృషి చేస్తున్న 'హోసూరు తాలూకా ఆంధ్ర సాంస్కృతిక సమితి' వారికి అప్పటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మాన్యశ్రీ ఎన్.డి. తివారీ చేతుల మీదుగా రాజ్‌భవన్‌లోని దర్బారు హాలులో ప్రదానం చేయడమైంది. 2010 సంవత్సరానికి గాను ఒరిస్సాలో ముఖ్యంగా బరంపురం పరిసర ప్రాంతాల్లో తెలుగు భాష, సాహిత్య, సంస్కృతుల పరిరక్షణకూ, పరివ్యాప్తికీ వంద సంవత్సరాల క్రితం బరంపురం నడిబొడ్డున స్థాపించబడి, ఆ ప్రాంతంలోని తెలుగువారి కోసం విశేష కృషి చేస్తూ, శత వసంతోత్సవాలు జరుపుకున్న 'ఆంధ్ర భాషాభివర్ధనీ సమాజం' వారికి అప్పటి ముఖ్యమంత్రి మాన్యశ్రీ డా. కె. రోశయ్య గారి ద్వారా ఈ పురస్కారం ప్రదానం చేయడమైంది. 2011 సంవత్సరానికి మారిషస్‌లో తెలుగు భాష, సాహిత్య, సంస్కృతుల పరిరక్షణకూ, పరివ్యాప్తి కోసం తెలుగు పాఠశాలలను నిర్వహిస్తూ, ఆ ప్రాంతంలోని తెలుగువారి కోసం విశేష కృషి చేస్తోన్న 'మారిషస్ ఆంధ్ర మహాసభ' వారికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి మాన్యశ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిగారి ద్వారా పబ్లిక్ గార్డెన్స్‌లోని జూబిలీహాలులో పురస్కారాన్ని ప్రదానం చేయడమైంది. 2012 సంవత్సరానికి గాను తెలుగుభాష, సంస్కృతుల పరిరక్షణ, పరివ్యాప్తికి ఎంతగానో శ్రమిస్తున్న బెంగుళూరులోని 'తెలుగు విజ్ఞాన సమితి' వారికి అప్పటి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభాపతి మాన్యశ్రీ చక్రపాణి గారి చేతుల మీదుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళామందిరంలో పురస్కారాన్ని ప్రదానం చేయడమైంది. అలాగే 2013 సంత్సరానికి 'బర్మా తెలుగు సంఘం', మయన్మార్ వారికి, 2014 సంవత్సరానికి గాను 'ప్రపంచ తెలుగు సమాఖ్య', చెన్నై వారికి పురస్కారాలు ప్రదానం చేయడమైంది. 2015 సంవత్సరానికి గాను ఆంధ్ర అసోసియేషన్, కలకత్తా వారికి పురస్కారం ప్రదానం చేయడమైంది.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు 60 ఏళ్ళ (షష్టిపూర్తి) పండుగ చేసుకొంటున్న సందర్భంగా మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించి తెలుగు భాష, సాహిత్య, సంస్కృతులకు రెట్టించిన ఉత్సాహంతో సేవ చేస్తారని ఆశిస్తూ షష్టి పూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

నా జ్ఞాపకాలలో

- బైస దేవదాసు

నలభై ఏళ్ళ క్రితం అంటే 1975 ఏప్రిల్ నెల. తెలుగు ప్రపంచ మహాసభలు. నిజామాబాద్ జిల్లా నుండి విద్యార్థిగా తొలిసారిగా సభలో పాల్గొన్న సందర్భం. లాల్ బహద్దూర్ స్టేడియంను మొదటిసారి చూసిన దినం. నారాయణగూడలో గల కేశవ మెమోరియల్ స్కూల్‌లో మాకు విడిది. వారం రోజులు కార్యక్రమాల్లో పాల్గొన్న మాకు హృదయానందం. ఆరడుగుల ఆజానుబాహుడు రాష్ట్ర విద్యాశాఖామంత్రి మండలి వెంకట కృష్ణారావు గారు. మన తెలుగు భాష గురించి, భాషాభివృద్ధిపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అనర్గళంగా ఉపన్యసిస్తుంటే ఆ మాటలు నా చెవులను తాకి మనసును ఉత్తేజపరచి మెదడులో నిక్షిప్తమైన క్షణం.

పదిహేనేళ్ళ క్రితం. తెలుగు భాషాభివృద్ధి గురించి మళ్ళీ అవే మాటలు. అసెంబ్లీ ప్రాంగణంలో మిత్రులు పిరాట్ల వెంకటేశ్వర్లుతో మరో ఆరడుగుల తెలుగుదనంతో పరిచయం. ఆయనే మండలి బుద్ధప్రసాద్‌గారు. తండ్రికి తగ్గ తనయుడిగా ఆయన ఆలోచనా వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని తెలుగు భాష పట్ల చేస్తున్న కృషికి ప్రతిరూపంగా కనిపించారు. అప్పటి నుంచి ఎన్నో సభల్లో పాల్గొన్నాం. అనేక వేదికలపై ఆశీనులయ్యాం.

2010 జులై 31న మచిలీపట్నంలో 'కీ॥శే కోపల్లె హనుమంతరావు స్మారక సభ'లో నాకు సత్కారం ఆయన సమక్షంలోనే జరగడం ఆనందం. ఆ రోజు బుద్ధప్రసాద్ గారు చేసిన ప్రసంగం అమూల్యమైనది. ఎన్నో సభల్లో ఆయనతో పాటు పాల్గొన్న నాకు ఆయన ప్రసంగాలు వింటున్నపుడు ఇలాంటి వారు ఊరి కొక్కరుంటే చాలు తెలుగు భాషాభివృద్ధికి మార్గం సుగమం అనిపించింది.

ఒకసారి పరిచయం మరిచిపోలేని నిజం. స్నేహానికి ఆయనే నిలువెత్తు సాక్ష్యం. ఐదేళ్ళ క్రితం నగరానికి వందల కిలో మీటర్ల దూరంలో ఉన్నా ఆహ్వానం అందుకుని మా అమ్మాయి పెళ్ళికి వచ్చి ఆశీర్వదించి మమ్మానందపరచి ఆశ్చర్యపరిచిన నిరాడంబర వ్యక్తి.

అనతి కాలంలోనే అందరి హృదయాలను చూరగొని రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పక్షాల నాయకుల నుంచి మన్ననలందుకుంటూ తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రజా నాయకులు వీరు. తెలుగు వారి హృదయాలలో నిలిచిన అరుదైన సంతకం. అరవై ఏళ్ల యువకుడు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి షష్టిపూర్తి సందర్భంగా అందజేస్తున్న నా హృదయపూర్వక స్నేహాభినందనలు. శుభాకాంక్షలు.

నిగర్వి

- వింజమూరి రాగసుధ

అరవై శోభాయమైన వసంతాలు చూసిన మాన్యులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి మొదటగా షష్ట్యబ్దిపూర్తి సందర్భంగా శుభాకాంక్షలు.

ఎన్నో సంవత్సరాలుగా సమర్థంగా, బహుముఖంగా భాష, సంస్కృతి, రాజకీయపరంగా కీలకపాత్రలు పోషించిన బుద్ధప్రసాద్ గారిని గత కొన్ని సంవత్సరాలలో ఒక సమీప కోణంలోనించి చూసే అవకాశం రావటం అదృష్టంగా భావిస్తున్నాను. వారి సతీమణితో, కుమార్తెలతో పరిచయం, సంభాషణల జ్ఞాపకాలు కుసుమగుచ్ఛంలో గులాబీల్లా గుబాళిస్తూనే ఉంటాయి.

వారి నిరాడంబరత, సరళత, ఏ విషయాన్నైనా చర్చించటం వారి వ్యక్తిత్వంలోని అభినందనీయమైన అంశాలు. యోగ్యమైన పని ఏదైనా దానికి తన సంపూర్ణ సహాయ సహకారాలు అందించే నైజంతో ముందంజ వేస్తారు. ఆయన ఈ స్వభావం చూసిన వారు కోకొల్లలే ఉండచ్చు. మచ్చుకి రెండు మూడు వ్యక్తిగత అనుభవాల తార్కాణాలు ఉదహరిస్తాను.

బర్మింగ్ హాంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కుంభాభిషేకం జరుగుతున్న సందర్భంగా వివిధ నదీజలాలు సేకరించటంలో నేను కూడా చురుకైన పాత్ర వహించటం జరిగింది. ఆ సందర్భంగా వారు స్వయంగా సమయం వెచ్చించి సపరివార సమేతంగా కృష్ణాజిల్లా సందర్శనానికి తీసికెళ్ళి, హంసలదీవి నుండి కృష్ణానదీ జలాలు సేకరించేందుకు దోహదం చెయ్యటమే కాకుండా, స్వతహగా నేను నృత్యకళాకారిణిని కాబట్టి, కూచిపూడి సిద్ధేంద్ర నాట్యకళాపీఠానికి తీసికెళ్ళి ప్రముఖ నాట్య కళాకారులు, గురువులు డా. వేదాంతం రామలింగశాస్త్రి గారిని సగౌరవంగా పరిచయం చేసారు. అలాగే మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయదర్శనం చేయించారు.

2010లో వారు లండన్ నగర పర్యటన చేసినప్పుడు నేను లండన్ తెలుగు సంఘం (తాల్) సాంస్కృతిక కార్యదర్శిగా పదవీబాధ్యతలు నిర్వహిస్తూ ఉగాది కార్యక్రమాన్ని సమన్వయం చెయ్యటం జరిగింది. ఆ సందర్భంగా వారు విడుదల చేసిన పుస్తకంలో ఎంతో అభిమానంగా నా గురించి కూడా ప్రస్తావించటం కించిత్తు గర్వకారణంగా అనిపించింది. ఎంతో కొంత కృషి చెయ్యకపోతే ప్రముఖుల వృత్తాంతాలలో మన పేరు చేటు చేసుకోదు కదా అనే ఆత్మ విశ్వాసం, నేను ఇంకా ఎంతో చెయ్యచ్చు అనే స్ఫూర్తీ కలిగాయి.

సి.పి. బ్రౌన్ స్వదస్తూరిలో రాసుకొన్న లాన్స్ సతూర అనే సంగ్రహం, ఆయన ఛాయాచిత్రం యూ.కే.లో దొరికే అవకాశాలు, ఇతరత్రా పరిశోధనల గురించి వారితో తరచుగా సంభాషించటం ద్వారా భాషపైన, సాహిత్యంపైన వారి జిజ్ఞాస, ఆసక్తి, పరిశీలనా వ్యాపృత్తి అన్నీ ఇంకా విదితమయ్యాయి.

ఇటీవల నేను బ్రిటిషు పార్లమెంటులో మూడు వందల సంవత్సరాల నాటి ఆచార్య రామానుజులపై రాయబడ్డ తెలుగు వచనగ్రంథం ఆవిష్కరించిన సందర్భంగా వారు పంపించిన ప్రశంసా సందేశం ఎంతో ఆనందాన్నిచ్చింది.

డాబుదర్పాలు లేకుండా మృదువుగా మాట్లాడటం, నిగర్వమైన ప్రవర్తన ఆయన వ్యక్తిత్వానికి ఎనలని వన్నె తెచ్చాయి. సాహిత్యాభిలాషిగా ఎంతోమంది మహామహుల రచనలు ప్రచురించి సుస్మరణీయం చేసారు. పిల్లకాయనైన నన్నూ, నా రచనా వ్యాసంగాన్నీ, సాంస్కృతిక వ్యాపకాలనీ ప్రోత్సహిస్తూ ఉండే శ్రీ బుద్ధప్రసాద్ గారు మరెన్నో వసంతాలు చూడాలనీ, వారి సహస్రచంద్ర దర్శనం సందర్భంగా మళ్ళీ మరిన్ని జ్ఞాపకాలసరులు ఉదహరించే సదవకాశం నాకు రావాలనీ ఆకాంక్షిస్తున్నాను.



ఆచార్య ఎన్.జి.రంగాతో...

సహృదయ సౌజన్యమూర్తి

- శ్రీమతి వి.ఎల్. ఇందిరాదత్

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు నిలువెల్లా తెలుగుదనం మూర్తీభవించిన మాననీయుడు. అందరినీ చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరించే గుణం వారికి అపారమైన ఆదరణను, అభిమానాన్ని సంపాదించిపెట్టాయి. బుద్ధప్రసాద్ గారు అజాతశత్రువు. ప్రతిభతో పాటు ఉన్నత వ్యక్తిత్వం వారి సొంతం. ఆదర్శవంతమైన వ్యక్తిత్వం ఉన్నవారే చక్కగా పనిచేసి ఫలితాలు సాధిస్తారు. బుద్ధప్రసాద్ గారి సామాజిక దృష్టి, జనకల్యాణ కాంక్ష, తెలుగుభాష, సంస్కృతుల పట్ల ఆయన ప్రేమాభిమానాలు ప్రజా జీవితాల్లో ఉన్నవారికి ఆదర్శప్రాయాలు.

తన తండ్రిగారైన కీ॥శే॥ శ్రీ మండలి వేంకట కృష్ణారావు గారి మంచి గుణాలన్నిటినీ పుణికి పుచ్చుకున్నారు. శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు తన నడవడికతో, సత్ప్రవర్తనతో నేటికీ తన తండ్రి గారిని సమాజంలో సజీవంగా, సమున్నతంగా నిలబెట్టగలుగుతున్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, జన్మభూమికి, మాతృభాషకు నిండు గౌరవాన్ని తెచ్చే వారి జన్మ చరితార్థమే. అట్టి వారిలో మండలి బుద్ధప్రసాద్ గారు ప్రథమ వరుసలో ఉంటారు.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతిగా ఉన్న శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి 2016 మే నెల, 26వ తేదీకి 60 సంవత్సరాలు నిండుతున్న శుభతరుణంలో నిండు మనసుతో వారికి శుభాభినందనలు తెలియజేస్తున్నాను. ఈ సందర్భంగా అభినందన గ్రంథం ప్రచురించాలన్న "కిన్నెర" సంస్థ వారి సంకల్పం హర్షణీయం.

శ్రీ బుద్ధప్రసాద్ గారితో నాకున్న చిరకాల పరిచయం, తెలుగుభాషా సంస్కృతుల పరిరక్షణ, పరిపోషణల్లో మా అనుబంధం– వారి గురించి నాలుగు మాటలు వ్రాయటానికి నాకు అవకాశం ఇచ్చాయని భావిస్తున్నాను. మా స్వస్థలం కూడా కృష్ణా జిల్లానే. జగ్గయ్యపేట దగ్గర ముక్త్యాల సంస్థానం. బుద్ధప్రసాద్ గారి శాసనసభ నియోజకవర్గంలోని చల్లపల్లి మా మేనమామలైన చల్లపల్లి జమీందారుల స్వస్థలం. (శ్రీమంతు రాజా యార్లగడ్డ శివరామప్రసాద్, శ్రీమంతు రాజా యార్లగడ్డ రామకృష్ణ ప్రసాద్).

అంతేగాక, దేశవిదేశాల్లో ఉన్న అనేక తెలుగు సంఘాలను సంఘటిత పరుస్తూ ఏర్పాటుచేసిన ప్రపంచ తెలుగు సమాఖ్యకు నేను అధ్యక్షురాలిగా ఉండటం వలన సమాఖ్య నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా, గౌరవ అతిథిగా పాల్గొన్న శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారితో కలిసి వేదికను పంచుకోవడం జరిగింది. ప్రపంచ తెలుగు సమాఖ్య నిర్వహించిన అనేక సాహిత్య సదస్సులలో, భాషాపరమైన చర్చల్లో, కవి సమ్మేళనాల్లో, వార్షిక మహాసభల్లో శ్రీ బుద్ధప్రసాద్ గారు పాల్గొని, ఎన్నో చక్కని ఉపన్యాసాలు ఇచ్చారు. మన భాషా, సాహిత్యం పట్ల, కవుల పట్ల, కళలపట్ల, సంస్కృతీ సాంప్రదాయాల పట్ల వారికున్న పరిజ్ఞానం అనంతం. అందరికీ విషయం బోధపడేలాగా అనర్గళంగా ఉపన్యసించగలరు.

తెలుగు భాషా సంస్కృతుల, కళల, కళాకారుల పరిరక్షణకు, పరిపోషణకు తపన పడే స్వభావం ఆయనది. ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రగతికి ఆయన ఎన్నో సలహాలు, సూచనలు ఇచ్చేవారు – ఇస్తూనే ఉన్నారు. శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి గురించి ఎన్ని విశేషాలు చెప్పినా సశేషాలే. వారితో ఒక్కసారి పరిచయం ఏర్పడితే జీవితాంతం మరిచిపోలేని అనుబంధం కలుగుతుంది అనటంలో ఎటువంటి అతిశయోక్తిలేదు.

మృదుభాషి, హితభాషి అయిన శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు నిండునూరేళ్ళు ఆరోగ్యవంతులై భాషాభ్యుదయానికి, సమాజోద్ధరణకు పాటుపడాలని – పాలనాపరంగా మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి మంచిపాలనను అందించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలవాలని ఆకాంక్షిస్తూ – శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి మరొకమారు మా కుటుంబం తరఫున, ప్రపంచ తెలుగు సమాఖ్య తరఫున షష్ట్యబ్ది పూర్తి శుభాభినందనలు తెలియజేస్తున్నాను.



గవర్నర్ శ్రీ రామేశ్వర్ ఠాగూర్‌తో

ఆత్మీయ అనుబంధము

- భీమన్న పుల్లా, రామకృష్ణ



కొంతకాలము నుండి ఇంగ్లండులో స్థిరపడిన మేము మాంచెస్టర్ తెలుగు అసోసియేషన్ (మాటా) పేరుతో తెలుగు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ తెలుగు వారికి ఇతోధికంగా సేవ చేసుకుంటూ వస్తున్నాము.

ఒంగోలు తెలుగు సభలకు మా తరఫున అధ్యక్షులుగా శ్రీ పుల్లా భీమన్న పాల్గొన్నారు. అక్కడనే బుద్ధప్రసాదు గారితో సమాగమము, ఆ తదుపరి మొదటి తెలుగు చరిత్ర ప్రపంచ సదస్సు జరపాలని వారు నడుము కట్టడముతో మా మధ్య బంధము ఇంకా ఇనుమడించింది. ఇంగ్లండు నుండి శ్రీ కిల్లి ప్రసాదు గారు 'మన చరిత్ర సభల'కు నడుము కట్టి అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి ఆ చరిత్ర సదస్సును జరిపి తీరాలన్న కృతనిశ్చయులై మా సహకారాన్ని చేకొన్నప్పుడు మా మధ్య ప్రయోజనాత్మక సౌహార్ద్ర పూర్వక సత్సంబంధాలు నెలకొన్నాయి. మా మిత్రులూ, సంస్థలో ఎగ్జిక్యూటివ్ సభ్యులూ, చరిత్ర మరియు భాషా విషయాలపైని అవగాహన కలిగిన వారూ అయిన డా. మాదిన రామకృష్ణ గారిని ఇంగ్లండ్ తెలుగు వారి తరఫున సమన్వయ కర్తగా నియమించడంతో మాకు సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. దిగ్విజయముగా నిర్వహించిన ఆ సభలను గూర్చి ఇక్కడ ప్రస్తావించడానికి సమయాభావము అని మిన్నకుంటున్నాను.

ఆ తరువాత గత ఏడు జరిగిన, నాల్గవ ప్రపంచ సాహిత్య సదస్సులో (వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా మరియు యునైటెడ్ కింగ్డం తెలుగు అసోసియేషన్) వారు సమైక్యంగా నిర్వహించిన సభలకు విచ్చేసి తెలుగు భాషాభిమానాన్ని తనకు గల ప్రత్యేక అభిలాషనూ పంచి పెట్టారు.

వారి 60వ జన్మ దినోత్సవము సందర్భముగా మా అనుభూతిని మీ అందరితో పంచుకోవడము ఆనందంగా కూడా ఉంది. మిత భాషణము, భాష మీద ఎనలేని అభిమానము, సహృదయత, తల పెట్టిన కార్యాన్ని మిక్కిలి జాగ్రత్తతో నిర్వహించడమూ, ఉన్నత విలువలూ కలిగిన శ్రీ మండలి బుద్ధప్రసాదు గారికి, సకల ఆయురారోగ్య శుభాలు కలగాలని కోరుకుంటున్నాము!

శాంతమూర్తి

- జిడిగుంట రామచంద్ర మూర్తి

కొంతమంది వ్యక్తుల్ని మనం 'దూరం' నించి చూసినప్పుడు, పరుగెత్తుకుని వెళ్ళి పరవశంతో పలకరించాలని అనిపిస్తుంది!

మరికొంతమంది వ్యక్తులు 'దూరం'గా ఉన్న మనల్ని చూసినప్పుడు, ప్రేమను కళ్లల్లో నింపుకొని చిరునవ్వులు పెదవులపై చిందిస్తూ 'ఎలావున్నారూ? బావున్నారా?' అని కనుబొమ్మల్ని ఎగురవేస్తూ ప్రశ్నిస్తున్నట్టు అనిపించి మన మనసు ఆనందంతో పులకరిస్తుంది!

ఈరెండు 'తరహా'లకూ చెందిన వ్యక్తిగా నాకు అనిపించే గౌరవనీయ మిత్రులలో శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు కూడా ఒకరు!

శ్రీ బుద్ధప్రసాద్ గారితో నాకు 'మంచి' పరిచయం ఏర్పడి అయిదారేళ్లే అయింది. అయితే వారి నాన్నగారైన వెంకట కృష్ణారావుగారితో అంతకుముందే, ఎప్పుడో 1975 ప్రాంతాల్లో నేను హైదరాబాదు ఆకాశవాణి కేంద్రం, కుటుంబ నియంత్రణ విభాగంలో 'స్క్రిప్టు రైటరు'గా పని చేసిన రోజుల్లోనే పరిచయం ఏర్పడింది. వృత్తిరీత్యా, కుటుంబ నియంత్రణ పక్షోత్సవాలూ, వారోత్సవాలూ జరిగినప్పుడూ, ప్రపంచ ఆరోగ్య దినాలు నిర్వహించబడినప్పుడూ – వారి ఇంటికో, క్యాంపు ఆఫీసుకో వెళ్లి వారి 'సందేశాలను' రికార్డు చేసి ఆకాశవాణిలో ప్రసారం చేసేవాడిని. వారిని నేను కలసినప్పుడల్లా ఆదరణతో ఆహ్వానించేవారు.. ఆప్యాయంగా పలకరించేవారు!

ఆ తండ్రిగారి గుణగణాలనూ, సంస్కారాన్నీ పుణికి పుచ్చుకున్న శ్రీ బుద్ధప్రసాద్ గారు గౌతమ బుద్ధుడిలా ఓ 'శాంతమూర్తి'ని స్ఫురణకు తెస్తారు. ఆయనది చల్లని మనసు... ఎప్పుడూ తెల్లని దుస్తుల్లోనే కనిపిస్తారు. సభల్లో మెల్లగా మాట్లాడతారు. అయితే ఆయనలో ఉన్న 'పదసంపద' ఆయన మాటల్లో ప్రతిబింబిస్తూంటుంది!

'పూజకొద్దీ పురుషుడు, దానం కొద్దీ బిడ్డలు' – అని మనం ఒక నానుడి వింటూంటాం! ఆ రెండు మాటలూ ఆడవారికి మాత్రమే వర్తించేవైతే – 'పూర్వ జన్మసుకృతం కొద్దీ మిత్రులు' ఎందరో లభించారు. నా ఉన్నతికి తోడ్పడ్డారు. నాకు మంచి జరగాలని ఆకాంక్షించారు. మంచి జరిగితే ఆనందించారు. వారి పేర్లు అన్నీ ఇక్కడ ప్రస్తావించటం సబబూ, సందర్భమూ కాదనిపిస్తుంది. ఎందుకంటే వారిలో ఒకరుగా ఉన్న శ్రీ బుద్ధప్రసాద్ గారి షష్ట్యబ్దిపూర్తి పండుగ సందర్భంగా నా ప్రియమిత్రుడు కిన్నెర రఘురాం ఈ ఉత్సవాన్ని జరపటం – ప్లస్ – దాన్ని పురస్కరించుకుని ఈ అభినందన గ్రంథాన్ని ప్రచురించి వెలువరించటం జరుగుతోంది కనుక ఆయన గురించే రాస్తున్నాను. రాసే అవకాశాన్ని నాకు కల్పించినందుకు ఆయన్ని (రఘురాంని) కృతజ్ఞతా పూర్వకంగా అభినందిస్తున్నాను.

శాంతి, సామరస్యం, సద్భాషణం, సహృదయత, సత్ప్రవర్తన – ఈ పంచసూత్రాలనే పంచప్రాణాలుగా భావిస్తూ జీవిస్తున్న గౌరవనీయ మిత్రులు శ్రీ బుద్ధప్రసాద్ గారిని ఎన్నో పదవులు అలంకరించాయి. అలంకారప్రాయంగా కాకుండా ఆచరణీయం చేసి ఆ పదవులన్నింటికీ ఆయన వన్నెను చేకూర్చారు.

తెలుగుభాషా ప్రేమికులుగా – సాహితీ సాంస్కృతిక కార్యక్రమాల పట్లా, కళాకారుల పట్లా గౌరవం కలిగిన వ్యక్తిగా, సహృదయునిగా శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు నిండు నూరేళ్లు ఆయుష్షుతో, పండువెన్నెల వంటి ఆరోగ్యంతో, తామూ తమ కుటుంబ సభ్యులూ అనుభవించగా తమ బంధుమిత్రులకు సైతం అందించగలిగే ఐశ్వర్యంతో జీవించాలని ఆ 'ఇలవేలుపు' శ్రీ వేంకటేశ్వరస్వామినీ, మా ఇంటివేలుపు ఆ పరమశివుణ్ణీ ప్రార్థిస్తూ ఈ షష్టిపూర్తి వేడుక దిగ్విజయం కావాలని కాంక్షిస్తున్నాను.



మండలి వెంకట కృష్ణారావు పులిగడ్డ–పెనుమూడి వారధి

నిస్వార్థ ప్రజాసంక్షేమ ధృతి, తెలుగు భాషా వికాస పథస్ఫూర్తి

- తల్లాప్రగడ రవికుమార్

అమల హృదయుడు, మృదుస్వభావి, వివాదరహితుడూ, తన నరనరానా జాతీయ స్ఫూర్తి, మాతృభాషాభిమానం నింపుకున్న నిండైన, అరుదైన నాయకుడు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు. సౌశీల్యత, సచ్ఛీలత వారసత్వంగా తండ్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారి నుండి అందిపుచ్చుకున్న తండ్రికితగ్గ తనయుడు బుద్ధప్రసాద్‌గారు.

బుద్ధప్రసాద్ గారితో నా పరిచయం స్వర్గీయ వేటూరి సుందర రామమూర్తిగారి ద్వారా 15 ఏళ్ళ క్రింద జరిగింది. అంతకుముందు వర్ధమాన కవిగా అనేక సమావేశాల్లో ఆయనను కలవడం జరిగినా, కవిత్వపోటీలో ప్రథమ బహుమతి ఆయన చేతుల మీదుగా నేను తీసుకోవడం తటస్థించినా కూడా నాకంటూ ప్రత్యేక గుర్తింపు బుద్ధప్రసాద్ గారిలో కలగడానికి ప్రధానకారకులు డా॥ వేటూరి గారే!

ఆంగ్లభాషాభిమానం వెర్రితలలు వేస్తూ తెలుగు భాషను అపహాస్యం చేస్తున్న రోజుల్లో ఆవేదనతో, ఆవేశంతో తెలుగుభాషా పునర్వికాసం కోసం ఉద్యమించిన ఏకైక తెలుగు రాజకీయ నేత బుద్ధప్రసాద్‌గారు. ప్రాచీన భాషగా తెలుగును గుర్తించాలని నినదించి ఆంధ్రరాష్ట్రంలో విజ్ఞులనూ, మేధావులను, పండితపామరులనూ ఉద్యమబాట పట్టించి తెలుగుకు ప్రాచీన భాష హోదా సాధించిన ఘనత బుద్ధప్రసాద్ గారిదే అనడం అతిశయోక్తి కాదు.

ఆంధ్రరాష్ట్రంలో ఏ మూలన ఏ కవి సమ్మేళనం జరిగినా, రచయిత గ్రంథావిష్కరణలు జరిగినా, సాంస్కృతిక ప్రదర్శనలు జరిగినా శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు హాజరు కావడం పరిపాటి. ఆంధ్ర భాషాభివృద్ధికోసం, ఆంధ్రభాషకు ఆధునిక సాంకేతిక హంగులు సంతరించడం కోసం విదేశాలలో నివసిస్తున్న ప్రవాస తెలుగు వాళ్ళందరినీ కలుపుకుని గత రెండు దశాబ్దాలుగా బుద్ధప్రసాద్ గారు అలుపెరుగక శ్రమిస్తున్నారు. తెలుగు భాషను యువతరానికీ, భావితరాలకూ దగ్గర చేయడం కోసం దేశవిదేశాల్లో స్థిరపడ్డ తెలుగు వారితో ప్రత్యేక గోష్ఠీ సమావేశాలు నిర్వహించడం, కంప్యూటర్‌కు తెలుగును అనుసంధానించడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని యువతరం అభివృద్ధి పరచడానికి వారిని ఆ దిశగా చైతన్యవంతులను చేయడం. తెలుగు ఖతులు (ఫాంట్స్) తెలుగు ప్రజలకు ఉచితంగా అందించడం... ఇలా ఒకటేమిటి? అనేకానేక ప్రగతిశీల కార్యక్రమాలతో అధికారంలో ఉన్నా లేకపోయినా ఎప్పుడూ తీరికనేదే లేకుండా భాషా సేవ చేస్తున్నారు బుద్ధప్రసాద్‌గారు.

2002లో జగ్గయ్యపేట తాలూకా ముక్త్యాలలో తెలుగు మహాసభలు నిర్వహించినా, అవనిగడ్డలో శ్రీకృష్ణదేవరాయ పంచశతాబ్ది ఉత్సవాలు నిర్వహించినా ఎంతో దీక్షాదక్షతలతో విజయవంతం చేయడం బుద్ధప్రసాద్ గారికి ఎంతో ఆత్మతృప్తిని కలిగించే వ్యవహారం.

తెలుగు వారందరూ ఒకేజాతి, ఒకే భౌగోళిక ఛత్రఛాయలో ఉండాలని అభిలషించిన నికార్సయిన తెలుగు భాషాభిమాని బుద్ధప్రసాద్‌గారు.

బుద్ధప్రసాద్ గారికి డా॥ వేటూరి సుందర రామమూర్తి గారంటే ప్రత్యేకమైన గౌరవాభిమానాలు. ఇద్దరూ దివిసీమ వాసులవడం యాదృచ్ఛికం కావొచ్చు కానీ ఇద్దరిలోని తీవ్ర భాషాభిమానమే కారణం అనడం నిజం. తెలుగు భాషకు ప్రాచీన భాష హోదా ఇవ్వకపోతే తనకు వచ్చిన జాతీయ అవార్డును పరిత్యజిస్తానన్న వేటూరి వారి ఆవేదనను అంతే ఆవేశంతో ఎలుగెత్తి ఉద్యమించారు బుద్ధప్రసాద్ గారు. వేటూరిగారు 2010లో పరమపదించినప్పుడు బుద్ధప్రసాద్ గారు ఎంత వెలితి అనుభవించారో! ఆ మహానుభావుడికి నివాళిగా విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో వేటూరి వారి కాంస్య విగ్రహాన్ని నెలకొల్పి 'వేటూరి సాహితీ సమితి' 2011 జనవరి 20–30 తేదీల్లో నిర్వహించిన వేటూరి 76 జయంతి ఉత్సవాలు జరిగిన రెండు రోజులూ అన్ని తానై ముందుండి కార్యక్రమాలను ఎంతగానో విజయవంతం చేశారు బుద్ధప్రసాద్ గారు. అలాగే నేను రాసిన 'అక్షరమాల కథలు' పుస్తకావిష్కరణకి ఎంతో పని వత్తిడిలో ఉన్నా కూడా హాజరయి నన్ను ఆశీర్వదించిన సహృదయులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు.

రాజకీయ కుటుంబ నేపథ్యంతో ప్రజానాయకుడిగా, రెండు పర్యాయాలు శాసన సభ్యుడిగా ఉండి అవనిగడ్డ ప్రజలకు తలలో నాలుకలా ఉంటూ కృష్ణా డెల్టా ప్రాంత రైతాంగానికి సాగునీరు, తాగునీరు సాధించి పెట్టడంలో బుద్ధప్రసాద్ గారి కృషి మరువలేనిది. పులిగడ్డ–పెనుమూడిపై వంతెన బుద్ధప్రసాద్ గారి కృషి ఫలితమే! ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖామాత్యులుగా కొద్ది నెలలపాటు మాత్రమే ఆంధ్రరైతాంగానికి సేవ చేసే అవకాశం లభించింది బుద్ధప్రసాద్‌గారికి. ఆ కొద్దికాలంలోనే తనదైన వ్యవహార దక్షతతో ఆ శాఖను కడు సమర్థంగా నిర్వహించి ప్రజాసేవలో చెరగని ముద్రవేశారు బుద్ధప్రసాద్ గారు.

మారిన రాజకీయ పరిణామాల దృష్ట్యా దశాబ్దాలుగా క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ కార్యకర్తగా ఉన్నా.. నియోజక ప్రజల అభీష్టం మేరకు తెలుగుదేశం తరపున అవనిగడ్డ నుండి మూడోసారి శాసనసభ్యునిగా ఎన్నికవడం ప్రత్యర్థుల్ని సైతం ఆశ్చర్యపరిచింది. అంతేకాదు ప్రత్యక్షంగా తెలుగుదేశం పార్టీ కోసం ప్రత్యేకంగా పనిచేయక పోయినా, బుద్ధప్రసాద్ గారిలోని ఉన్నత వ్యక్తిత్వం, వివాద రాహిత్య రాజకీయ జీవితం, పార్టీలకు అతీతమైన ప్రజాసేవా దృక్పథం ఆయనను ఉపసభాపతిగా ఉన్నత స్థానాన్ని అలకరింపజేసింది. ప్రత్యర్థుల మనసు సైతం గెలుచుకున్న అద్భుత వ్యక్తిత్వం బుద్ధప్రసాద్ గారిది అనడానికి ఇంతకన్నా ప్రత్యక్ష నిదర్శనం ఏం కావాలి?

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి వ్యక్తిత్వం విశిష్టమైనది. ప్రస్తుత అత్యాధునిక సమాజంలో ముఖ్యంగా తెలుగునేల మీద తెలుగు వాడకం నానాటికీ అరుదైపోతుండటం వారిని ఎంతో కలచివేసింది. తెలుగు యువతరం ఆధునిక సాంకేతికతను ఎంత అందిపుచ్చుకున్నా తమ మాతృభాష అయిన తెలుగును మర్చిపోవడం తగదని, మాతృభాషాభివృద్ధికి యువతరం ముందుకు వచ్చి తెలుగుభాషా పునర్జాగరణ మహాయజ్ఞంలో చురుకుగా పాలుపంచుకోవాలని ఎక్కడ ఏ సభలో సందర్భం కలసివచ్చినా యువతరానికి సందేశం ఇవ్వకుండా విడిచిపెట్టరు. ఆంధ్రులతోనూ, ప్రవాసాంధ్రులతోనూ ముఖ్యంగా యువతరాన్ని

లక్ష్యంగా చేసుకొని తెలుగు భాషాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న నిడుపైన వ్యక్తిత్వం, భాషాభిమానం బుద్ధప్రసాద్ గారిది.

వేల సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగుసాహిత్యపు పరిమళాన్ని నవయువతరం అందిపుచ్చుకోవాలంటే తెలుగుభాష కూడా ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా రూపాంతరం చెందవలసిన అగత్యాన్ని, అవసరాన్ని ఎంతో ముందుగానే గుర్తించిన దార్శనికుడు బుద్ధప్రసాద్ గారు. కంప్యూటర్‌లోను ఇంటర్‌నెట్‌లోనూ, చరవాణుల్లోను తెలుగులోనే సంభాషణలు జరపడం, ఈ–మెయిల్స్ పంపడం సులభమయ్యేలా తెలుగు సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి పరచడంలో విశేషమైన కృషిచేస్తున్నారు బుద్ధప్రసాద్ గారు. ప్రాచీన తెలుగు గ్రంథాలన్నిటినీ కంప్యూటర్ పరిభాషలోకి అనువదించి ప్రపంచంలో ఏ మూల ఎక్కడ ఏ తెలుగువాడున్నా అక్కడి నుంచే తెలుగు ప్రాచీన, ఆధునిక గ్రంథాలను చదవగలిగేలా తెలుగుభాషను ఆధునికీకరించడంలో అలుపెరుగని కృషి బుద్ధప్రసాద్ గారిది. అలాగే ప్రపంచం నలుమూలలా పర్యటిస్తూ అక్కడి తెలుగువారందరినీ కలిసి ఆప్యాయంగా మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి వారేం చేస్తున్నారో ఇంకా ఏమేం చేయవచ్చో ప్రణాళికలు రచించడం, భారతదేశపు ఇతర భాషల్లోకి ముఖ్యంగా జాతీయభాష అయిన హిందీలోకి తెలుగు సాహిత్యం అనువాదం కావడం కోసం ఎందరెందరో మేధావుల్ని, పండితుల్ని, ఉపాధ్యాయుల్ని కలిసి ఆ దిశగా వారికి స్ఫూర్తి రగిలిస్తున్న విశిష్ట వ్యక్తి బుద్ధప్రసాద్ గారు.

ఇంతటి రాజకీయేతర విశాల దృక్పథం, భాషాభిమానం గల రాజకీయ నాయకుడు ప్రస్తుత సమాజంలో బుద్ధప్రసాద్ గారు తప్ప మరొకరు లేరని నిష్కర్షగా చెప్పవచ్చు. నిరంతర మాతృభాషాభివద్ధి కంకణబద్ధునికి, నిరంతర ప్రజాసేవా దురంధరునికి, అలుపెరుగని సంక్షేమ పథనిర్దేశకునికి ఈ షష్ట్యబ్ది మహోత్సవ సందర్భంగా అనేకానేక శుభకామనలను తెలియజేస్తున్నాను. బుద్ధప్రసాద్ గారి నేతృత్వంలో ఆయన అందించిన స్ఫూర్తితో తెలుగునేల నాలుగుచెరగులా తెలుగు భాషాభివృద్ధి బహుముఖీనంగా విస్తృతి చెందాలని మనస్ఫూర్తిగా అభిలషిస్తున్నాను.

ఆ సర్వేశ్వరుడు బుద్ధప్రసాద్ గారికి, వారి కుటుంబానికి సంపూర్ణ ఆయురారోగ్యాలను, కీర్తిప్రతిష్ఠలను అఖండంగా ప్రసాదించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ అభినందనలు అందిస్తున్నాను.

అందరి భాషా బంధువు

- కిలారు ముద్దుకృష్ణ

నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనంగా నిలచిన వ్యక్తి శ్రీ మండలి బుద్ధ ప్రసాద్. అధికార పదవిలో ఉన్నా, లేకపోయినా చెరగని చిరునవ్వుతో తెలుగు భాషాభివృద్దే తన ధ్యేయం అన్న విధంగా బుద్ధప్రసాద్ నిరంతరం శ్రమిస్తున్నారు. అందుకే దేశ విదేశాల్లో ఉన్న తెలుగువారందరు ప్రాంతీయ, రాజకీయ భేదాలు లేకుండా మండలి బుద్ధప్రసాద్‌ను మనసారా అభిమానించడం నేను కళ్ళారా చూసాను.

శ్రీ బుద్ధ ప్రసాద్‌తో కలిసి నేను ఇప్పటివరకు ఏడు పర్యాయాలు విదేశాలలో పర్యటించే అవకాశం కలిగింది. ఈ సందర్భంగా ప్రవాసాంధ్రులు బుద్ధప్రసాద్ పట్ల చూపిస్తున్న ఆదరాభిమానాలను గమనించాను. విలువలు కలిగిన వ్యక్తిగా మండలి ఇటు స్వదేశంలోనూ, అటు విదేశాలలోనూ కీర్తి ప్రతిష్టలు సంపాదించుకున్నారు. రాజకీయాలలో విలువలు పడిపోతున్న ప్రస్తుత తరుణంలో రాజకీయవేత్తగా అందరి అభిమానాలను పొందటం బుద్ధప్రసాద్‌కే దక్కింది. ఇప్పటివరకు మండలి బుద్ధప్రసాద్ నాలుగు పర్యాయాలు అమెరికాలో పర్యటించారు. మంత్రిగా, ఏ పదవి లేకుండా, అధికార భాషాసంఘం అధ్యక్షునిగా, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా అయన ఇప్పటివరకు నాలుగు సార్లు అమెరికా పర్యటనకు వెళ్ళారు. ఈ నాలుగుసార్లు బుద్ధప్రసాద్‌తో కలిసి అమెరికా పర్యటనలో పాల్గొనే అవకాశం నాకు కలిగింది. 2008వ సంవత్సరంలో జూన్ నెలలో సిలికాన్ వ్యాలీలో జరిగిన సిలికానాంధ్రా నిర్వహించిన మొదటి ప్రపంచ కూచిపూడి ఉత్సవాలకు మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి, ఆ ఉత్సవాలను గిన్నిస్ పుస్తకంలో ఎక్కించడానికి ఆయన చేసిన కృషి అందరి ప్రశంసలను అందుకుంది. 2011 సెప్టెంబర్ నెలలో మళ్ళీ ఇదే ప్రదేశంలో సిలికానాంధ్ర ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి ప్రపంచ తెలుగు అంతర్జాల సదస్సులో బుద్ధప్రసాద్ పాల్గొని తెలుగు భాషను విశ్వవ్యాప్తం చేయడంలో విశేషమైన కృషి జరిపారు. 2013 మే నెలలో డల్లాస్ నగరంలో నిర్వహించిన తానా మహాసభలకు బుద్ధప్రసాద్ విశిష్ట అతిథిగా విచ్చేసి మూడు రోజులపాటు కీలక ఉపన్యాసాలు చేసి అమెరికాలోని భాషాభిమానులను ఆకట్టుకున్నారు. అనంతరం 2014 అక్టోబర్‌లో డల్లాస్‌లో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి బుద్ధప్రసాద్ హాజరయ్యారు, ఈ సందర్భంగా సిల్లికాన్ వ్యాలీలో గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి అక్కడి తెలుగు విభాగాన్ని పరిశీలించారు . బుద్ధప్రసాద్‌తో పాటు నాలుగు పర్యాయాలు ఆయన వెంట నేను అమెరికాలో పర్యటించాను.

2011 డిసెంబర్ నెలలో మారిషస్‌లో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలకు బుద్ధప్రసాద్ తనతోపాటు నన్ను కూడా వెంట తీసుకొని వెళ్ళారు. వారం రోజులపాటు మారిషస్‌లో తెలుగు ప్రజల మధ్య బుద్ధప్రసాద్‌తో కలిసి గడపటం నా అదృష్టంగా భావిస్తున్నాను. మారిషస్ నలుమూలల నివసిస్తున్న తెలుగు ప్రజలకు బుద్ధప్రసాద్‌తో పాటు, ఆయన తండ్రి మాజీ మంత్రివర్యులు మండలి వెంకటకృష్ణారావు కూడా చిరపరిచితులు. మారిషస్‌లో అంతకుముందు నిర్వహించిన తెలుగు మహాసభలకు మండలి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అప్పటిలో తండ్రితోపాటు బుద్ధప్రసాద్ జరిపిన పర్యటనలను అక్కడి తెలుగువారు గుర్తుచేసుకున్నారు. బుద్ధప్రసాద్ ఈ పర్యాయం తనతో పాటు తనకుమారుడు వెంకట్ రామ్‌ను మారిషస్‌కు

తీసుకువచ్చారు. వందల సంవత్సరాల క్రితం మారిషస్ దేశం వెళ్ళి స్థిరపడిన అక్కడి తెలుగు వారు తమకు భాషపట్ల అభిమానం పెరగడానికి మండలి కృష్ణారావు, ఆయన కుమారుడు బుద్ధప్రసాద్‌లు జరుపుతున్న కృషిని అక్కడి తెలుగు వారు మర్చిపోలేకుండా ఉన్నారు.

2012వ సంవత్సరం జులై నెలలో లండన్‌లోని బ్రిటిష్ లైబ్రరీలో యు.కె తెలుగు సంఘం నిర్వహించిన ప్రథమ చరిత్ర తెలుగు మహాసభలకు బుద్ధప్రసాద్ తనతో పాటు నేను కూడా పాల్గొనే విధంగా ఏర్పాటు చేశారు. ఈ మహాసభలలో తెలుగు జాతి చరిత్రకు సంబంధించి బుద్ధప్రసాద్ చేసిన కీలక ఉపన్యాసం అందరిని ఆకట్టుకుంది . లండన్ లోని బ్రిటిష్ గ్రంథాలయంలో ఉన్న వేలాది తాళపత్ర గ్రంథాలలో నిక్షిప్తమై ఉన్న తెలుగు జాతి చరిత్రను వెలుగులోకి తీసుకురావటానికి బుద్ధప్రసాద్ చేసిన సూచనలు ఆకట్టుకున్నాయి. ఈ మహాసభలలో అప్పటి కేంద్రమంత్రి చిరంజీవి, శాసనమండలి ఛైర్మన్ చక్రపాణి, ఎం.ఎల్.సి ఐలాపురం వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు. తెలుగు భాష అభివృద్ధి కోసం విశేష కృషి చేసిన సి.పి బ్రౌన్ సమాధిని లండన్ పర్యటనలో భాగంగా బుద్ధప్రసాద్‌తో కలిసి సందర్శించడం మరచిపోలేని అనుభూతి.

ఇటీవల 2016 ఏప్రిల్ 9 వ తేదీన మలేషియా దేశంలో ఆక్కడి తెలుగు సంఘం 'టామ్' నిర్వహించిన ఉగాది వేడుకలకు ఆయనతో పాటు నేను కూడా హాజరయ్యాను. నాలుగు రోజుల పాటు ఆయనతో కలిసి మలేషియా దేశంలో పర్యటించి అక్కడి తెలుగు వారిని కలుసుకోవటం సంతోషం కలిగించింది. మలేషియా దేశంలో నివసిస్తున్న తెలుగు వారు బుద్ధప్రసాద్ తమ కుటుంబసభ్యుడిగా ప్రేమానురాగాలు కురిపించారు.

తన ఎదుటి వారిలో ఉన్న సామర్థ్యాన్ని. తెలివితేటలను గుర్తించటంలో బుద్ధప్రసాద్‌కు ఉన్న శక్తి మరొకరికి వుండదనేది నా అభిప్రాయం. విదేశాలలో తనతో పాటు పర్యటించిన నన్ను పలుమార్లు బుద్ధప్రసాద్ ప్రత్యేకంగా అభినందించడంతోపాటు ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై నన్ను తన చేతుల మీదుగా సత్కరించటం ఆయనలో ఉన్న స్నేహగుణానికి నిదర్శనం. స్వదేశంలోను బుద్ధప్రసాద్‌తోపాటు పలు ప్రాంతాల్లో పర్యటించే అవకాశం నాకు కలిగింది. గత ఏడాది తమిళనాడులో తెలుగు భాష అమలు తీరు గురించి బుద్ధప్రసాద్ ఐదు రోజులపాటు తంజావూరు, తదితర ప్రాంతాలలో జరిపిన పర్యటనలో పాల్గొనే అవకాశం నాకు కల్పించారు. తంజావూరులో ఉన్న తమిళ విశ్వవిద్యాలయం తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక తెలుగు విశ్వవిద్యాలయాన్ని, తెలుగు వారు గర్వించే విధంగా ఏర్పాటు చేయటానికి బుద్ధప్రసాద్ ప్రయత్నిస్తున్నారు.

తిరుపతిలో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా బుద్ధప్రసాద్ నన్ను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ప్రభుత్వ అతిథిగా హాజరవుతున్న న్యూజెర్సీ అసెంబ్లీ డిప్యూటి స్పీకర్ చివుకుల ఉపేంద్రకు వెన్నంటి వుండే విధంగా మహాసభల సందర్భంగా, బుద్ధప్రసాద్ నాకు బాధ్యతలను అప్పగించారు. తిరుపతి ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణలో బుద్ధప్రసాద్ పోషించిన పాత్ర యావత్ తెలుగు ప్రజల ప్రశంసలను అందుకుంది. బుద్ధప్రసాద్ మంచి స్నేహశీలి. అధికారిక పనుల ఒత్తిడిలో ఉన్నప్పటికీ ఫోన్ చెయగానే స్పందించే గొప్ప గుణం ఆయనకు వుంది. వారానికి ఒక్కసారైనా ఆయన సన్నిహితులను ఫోన్‌లో పలకరించి యోగక్షేమాలు తెలుసుకోవటం బుద్ధప్రసాద్‌కు ఉన్న ప్రత్యేక లక్షణం. ఒక్క మాటలో చెప్పాలంటే ఎదిగిన కొద్దీ ఒదిగిన మనిషి బుద్ధప్రసాద్. ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని తెలుగు భాషభిమానులంతా మనసారా కోరుకుంటున్నారు.

అభినందనీయుడు

- డా. అక్కిరాజు సుందర రామకృష్ణ

సామాన్యంగా రాజకీయ రంగంలో నేతల మాటలు, చేతలు, అధికార దర్పాలు, ధనార్జనలు, అవకాశ వాదాలు, అతికృతకమైన వేష ధారణలు.. మొదలైనవి అన్నీ కొంచెం ఆలోచించి చూస్తే ఒక రీతిగా తోస్తాయి. అదేం విచిత్రమో, మాటలకూ, చేతలకూ పొంతన అసలు ఉండదు. ముఖ్యంగా మరీ ఇటీవలి, 20, 30 యేళ్ళ రాజకీయ రంగాన్ని గనుక తిరగేసి చూస్తే, విలువలకు ప్రాధాన్యం, గౌరవం ఇచ్చే వ్యక్తుల్ని భూతద్దంలో చూచినా దొరకడం కష్టమే!

ఇటువంటి తరుణంలో, నాకు తెలిసినంత వరకూ, శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు, ఈ రంగంలో ఒక ప్రత్యేక వ్యక్తిగా కనబడతారు. భేషజం, ఆర్భాటం లేని వ్యక్తిత్వం వారిది. సున్నితమైన పలకరింపు, ఎక్కడా కృతకత్వం లేని వర్తన నాకయితే కనబడ్డాయి. పోయిన సంవత్సరం లండన్‌లో జరిగిన తెలుగు మహాసభలకు నేనూ వెళ్ళడం జరిగింది. 'మండలి' వారూ వచ్చారు. ప్రముఖ కవులు, కవయిత్రులూ కొంతమంది వచ్చారు. శ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాదు గారు గూడా వచ్చారు. బ్రిటిష్ పార్లమెంట్ భవనాన్ని మాకు, అక్కడి మన తెలుగు సాంస్కృతిక సంఘాల నేతలు చూపించడం, మర్యాద పూర్వకంగా అక్కడ మా అభినందన ప్రసంగాలు ఇవన్నీ జరిగాయి. అటు అమెరికా నుంచి పెద్దలు, చక్కని వక్త, ముఖ్యంగా హాస్య సంభాషణా చతురులు శ్రీ వంగూరి చిట్టెన్ రాజు గారు గూడా వచ్చారు. అసలు ఈ సభలకు ప్రేరణ చిట్టెన్ రాజు గారే! ఆ సభలలో, మండలి బుద్ధ ప్రసాద్ గారు చేసిన సందేశాత్మకమైన ఉపన్యాసం నాకింకా గుర్తుకు వస్తున్నది. తెలుగు భాష, సంస్కృతి, ఆచారాలపై ఎనలేని మమకారాన్ని కలిగియున్న బుద్ధప్రసాద్ గారికి అప్పుడే షష్ట్యబ్ది పూర్తి అంటే నమ్మలేక పోతున్నాను. నేను వీరి తండ్రి గారైన మండలి కృష్ణారావు గారిని బాగా ఎరిగిన వ్యక్తిని. వారి సహాయ సహకారాలు గూడా పొందిన వాణ్ణి. ఎందుకంటే, ఆయన విద్యామంత్రిగా ఉన్నారు. నేను, ఆంధ్రోపన్యాసకుడిగా పని చేసి విశ్రాంతి తీసుకుంటున్న వాడిని. శ్రీ కృష్ణారావు గారి జన్మదిన వేడుకలలో 'గాంధీ భవన్' లాంటి వేదికల మీద గొంతెత్తి పద్యాలను ఆలపించిన వాణ్ణి. అలాగే, ఈ బుద్ధప్రసాద్ గారి అనేక సభలలో నేను పాల్గొనడం అనేది, గత 20 సం॥లు పైగా జరుగుతూనే ఉన్నది. నా నాటకం అన్నా, నా పద్య పఠనం అన్నా, నా విరచిత గ్రంథాలన్నా అత్యంతం అభిమానించే మండలి బుద్ధప్రసాద్ గారికి ఈ షష్ట్యబ్ది వేడుకలు అత్యంత వైభవంగా జరగాలని కోరుకుంటున్నాను. అంతే గాదు సప్తతి, సహస్ర చంద్ర దర్శన వేడుకలు కూడా యింకా యింకా వైభవంతో జరగాలని, బుద్ధప్రసాద్ గారికి సంపూర్ణమైన ఆయురారోగ్య ఐశ్వర్యాలు, ఆ పరమ పురుషుడు ప్రసాదించాలనీ త్రికరణ శుద్ధిగా కోరుకుంటున్నాను. అభినందన పూర్వకంగా రెండు పద్య కుసుమాలు అందిస్తున్నాను.

అతడు స్నేహ వర్తనుడు, 'ఆంధ్ర' మటన్న నమేయ భక్తి – వి
ఖ్యాతిని గన్న నేత, చిరుహాసము తోడన దెట్టి వారికేన్
చేతము రంజలన్ మివుల చెల్వపు పల్కుల నాదరించు, ఈ
పూత చరిత్రు 'సుగ్ర రథమూర్తి' కృపామృత దృ (వృ)ష్టి ప్రోచుతన్!

ధీగుణ సంయుతుడున్, మరి
వాగాడంబరము లేక వర్తిలు వాడున్;
ఏ గరువ మెరుంగడు, ప్రజ
బాగున్ సతతంబు గోరు వర నేతయునున్!

రూప రేఖలె గాదు, ఏ పగిదిని గన్న
తండ్రికిన్ తగినట్టి తనయు డితడు
ఏ వివాదాలకు, ఏ ప్రలోభాలకు
సుంతేని గురి గాని సుజన పరుడు
వస్త్ర ధారణె గాదు, వర్తనన్ 'గాంధిజీ'
మార్గాన పయనించు మహిత యశుడు
ప్రజలె యీతని ఆశ – ప్రజలె యీతని ధ్యాస
'శ్రీ'ల నార్జింప చుక్కుదురు వాడు
మాట మన్నన లెరిగిన మంజు గుణుడు
ప్రథిత సద్గ్రంథ పఠనాను రక్తు డితడు!
నిజము, మము బోంట్లు కవులకు నేస్తమితడు!
అరయ 'మండలి' వంశ శశాంకు డితడు!

మనం సమాజంలో 'సైలెంట్ వర్కర్' అనే మాట వింటూంటాం! వాళ్ళకు కీర్తి ప్రతిష్ఠలూ, నిత్య ప్రశంసలూ, నీరాజనాలూ నచ్చవు. వాళ్ళు చేయదలచుకున్న పనులను సమాజ శ్రేయస్సుకు చిత్త శుద్ధితో చేస్తుంటారు. అదిగో, అటువంటి వ్యక్తులలో శ్రీ బుద్ధ ప్రసాద్ గారు నిస్సంశయంగా అగ్ర గణ్యుడు. గతంలో జరిగిన కృష్ణా జిల్లా పుష్కరాల సందర్భంగా వారు తీసుకున్న శ్రమ, ముఖ్యంగా సంచికను బయటికి తీసుకు రావడంలో వారు పడ్డ తపన ప్రత్యక్షంగా చూచిన వాళ్ళల్లో నేనొకణ్ణి. మరొక వ్యక్తి కీ॥శే॥ రాళ్ళబండి కవితా ప్రసాద్. ఇంకా ఎందరో ఉన్నారు. వారందరినీ స్మరించడం గూడా ధర్మమే అయినా, అప్రస్తుతమౌతుంది గాబట్టి, ఈ నాలుగు మాటలతో నా వ్యాసాన్ని ముగిస్తున్నాను....

PEOPLE'S LEADER

– Dr. Chepuru Subbarao

Sri Mandali Buddha Prasad Garu has had an inheritance of highly cherished values from his father, the illustrious Late Sri Mandali Venkata Krishnarao Garu, values like idealogical commitment to principles rather than interests, patriotism, missionary zeal for service, love of our tradition and culture, a deep love of our language and literature. He is one of the most soft-spoken persons I have ever known in spite of his rock-like commitment to values he cherishes. It is great of him to respect an individual as an individual. Policy is policy, but politeness is politeness. He is always cheerful and unruffled with an unpretentious smile behind which can be seen a sort of reflective look of a visionary not entirely free from a thoughtful melancholy.

Sri Buddha Prasad Garu is gifted with great managerial skills. Even when he was quite young his father used to entrust him with management of things easy and not so easy. He is known for his quiet efficiency; he just manages things seemingly problematic without any ado. It is hard to think of people who are free from self-praise. Even some of the great prople skillfully invite flattery from others. But Buddha Prasad Garu is an honourable exception to such vain flock.

When he was the chief guest at two or three functions I happened to be one of the speakers. Never did I see him speak in self-praise. He always possesses adequate knowledge of the subject on which he speaks, and he speaks in slow and soft rhythms . His speech is always like a gentle presentation on the subject given. He never gets emotional as he speaks but always remains thoughtful. He would only speak about the prime impulses or forces that cause a situation rather than about people. He has absolutely no charm for oratorical tone or flourishes, but he can at once compel attention. People are invariably impressed with the unadorned simplicity of his manner and his unpretentious language. Simplicity and honesty gain ground as usual in the long run. Honesty is the best policy not just in business but also in politics.

He is one of the very few non-controversial public men respected even by people of all political parties and of different idealogical hues. He has no enemies ; perhaps he has only idealogical opponents. Even this expression 'idealogical opponents'

is not precisely applicable in his case. He regards those who differ with him not as opponents but as persons with different perceptions. And that is his noble political culture. Besides all this , there is something indefinable in him beyond analysis by which people will be with him being loyal to him; He has some sort of inexplicable magnetism about him.

He had won elections three times for Assembly, was cabinet minister once, Language Commission Chairman for a term, and conducted The World Telugu Conference ably. Now of course Deputy Speaker. He accepts whatever comes his way without reservations and performs with total involvement and great dignity. People will be happy if such leaders are in power.

He loves reading, he loves writing. He loves neither of them for self-glorification. He loves reading for the enrichment of his mind and he loves writing to communicate with clarity and precision. He is a great lover of literary culture. He has respect for scholarship and intellectuality. He is a patron of letters and literatteurs like his father. It is his culture to befriend wise men.

It will be unjust not to refer to the Gandhi Kshetram when we write about the Mandali family. Visitors will be housed and treated to delicious meals there in the Gandhi Kshetram run by them as true Gandhians. Gandhi Kshetram with its rows of simple and unpretentious rooms with hay roof but with all the necessary comforts like neat beds and fans bounded by a lush green vegetable garden all around and dotted with cool comforting shady trees would have a magical effect on us and make us feel like inmates of a holy ashram pervaded by a great mystic benevolent power. The greenery, the cool breezes and the peace and the mystic look there would have a soothing effect on our body, mind and soul. We feel like going and staying there while in stress. This I speak from personal experience. Gandhi Kshetram is like a child reared lovingly by the Mandali family.

May Sri Mandali Buddha Prasad Garu live long and have all the joys of life.

మహామనీషి!

- కోట వేణుగోపాల కృష్ణప్రసాద్

ఈ తరంలో గాంధేయవాదాన్ని అనుసరించే అతి నిరాడంబరుడు, స్నేహశీలి, మితభాషి శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి షష్టిపూర్తి మహోత్సవం జరుగుతున్న శుభ సందర్భంలో ఆయనకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

"జీవితంలో నీకు అత్యంత ఇష్టమైన వ్యక్తి ఎవరు?" అని నన్నెవరైనా ప్రశ్నిస్తే వెంటనే స్ఫురణకు వచ్చే పేరు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు. అవనిగడ్డ ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులుగా, ప్రస్తుతం శాసన సభ ఉప సభాపతిగా ఆయన సమర్థుడైన సేవాభావం కలిగిన నాయకుడని నిరూపించుకున్నారు. స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు గారి వారసుడిగా రాజకీయ రంగప్రవేశం చేసి, పెద్దాయన కీర్తి ప్రతిష్ఠలకు ఏ మాత్రం భంగం కలిగించని విధంగా నడచుకోవడం మా ప్రియ మిత్రుడు, స్నేహశీలి శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికే చెల్లింది. తండ్రి గుణగణాల్ని, సేవా తత్వాన్ని పుణికిపుచ్చుకుని పెద్దాయన అడుగుజాడల్లో ఈనాటికీ నడుస్తున్నారు.

మా కుటుంబానికి మండలి వారి కుటుంబంతో ఆత్మీయానుబంధమున్నా, 1973 నుండే శ్రీ బుద్ధప్రసాద్ గారితో కలసి నడవడం ఆరంభమైంది. నేను అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న రోజులవి. ఆయన నాకు ఒక సంవత్సరం సీనియర్. ప్రముఖ రాజకీయ నాయకుని సంతానమైనా, ఆయనలో ఎలాంటి అహంభావం కనిపించేది కాదు. చాలా నిరాడంబరంగా, క్రమశిక్షణతో మెలిగేవారు. పుస్తకాలు చదవడం ఆయనకున్న మరో గొప్ప అలవాటు. వారి తండ్రి గారి దార్శనికత, సేవాభావం, పుస్తకాల సాహచర్యం ఆయన్ని గాంధేయవాదిగా తీర్చిదిద్దాయనడంలో సందేహం లేదు. ఇదంతా ఎలా చెప్పగలుగుతున్నానంటే మా సమ వయస్కుల్లో శ్రీ బుద్ధప్రసాద్ గారితోపాటు నేను కూడా వారి తండ్రి గారికి దగ్గరగా మసలాను. ఆయన గుణగణాలను, సేవా తత్పరతను దగ్గరగా పరిశీలించిన వాడిని.

అప్పట్లో దివిసీమలో కమ్యూనిస్టుల ప్రాబల్యం అధికంగా ఉండేది. ప్రత్యర్థుల పట్ల వారు దురుసుగా కూడా ప్రవర్తిస్తుండేవారు. రాజకీయాల్లో డబ్బులకు ప్రాధాన్యం అప్పుడప్పుడే పెరుగుతున్న రోజులవి. డబ్బుల్లేకుండా, దురుసుగా ప్రవర్తించకుండా సౌమ్యంగా రాజకీయాల్లో నెగ్గుకురావడం శ్రీ బుద్ధప్రసాద్ గారికే చెల్లింది. ఎన్ని పదవుల్ని అలంకరించినా, నిరాడంబరంగా ఉండటం, ఇతరులను నొప్పించకపోవడం వారికున్న అలవాటు. "రాజకీయాల్లో శత్రువులెవరూ ఉండరు. ఉండేది కేవలం ప్రత్యర్థులు మాత్రమే" అని ప్రగాఢంగా నమ్మే వ్యక్తాయన. ఆ నమ్మకమే రాజకీయ ప్రత్యర్థుల్లోనూ ఆయన్ని 'అజాతశత్రువు'గా నిలిపింది. అందులోనూ తండ్రి నుంచి పుణికి పుచ్చుకున్న దార్శనికత, సేవాభావం వారిని ఇన్నాళ్ళూ తిరుగులేని నాయకునిగా నిలబెట్టిందని నేను గట్టిగా విశ్వసిస్తాను.

గాంధేయవాదాన్ని తు.చ. తప్పకుండా అనుసరించే ఆయన, ప్రతి విషయాన్ని జాతీయ దృక్పథంతో ఆలోచిస్తారు. అయినా ఆయనకు తెలుగు భాష, సంస్కృతి మరియు సాహిత్యాలపైన అపారమైన మమకారం. దాన్నెప్పుడూ దాచుకోవాలని కూడా ఆయన ఆలోచించరు. లండన్ పర్యటన సందర్భంగా తెలుగు భాషకు మహోపకారం చేసిన స్వర్గీయ సి.పి. బ్రౌన్ గారి సమాధిని సందర్శించారు. అక్కడి 'లండన్ తెలుగు అసోసియేషన్' వారి సహాయ సహకారాలతో బ్రౌన్ గారి సమాధిని అభివృద్ధి చేయడానికి తీవ్రంగా కృషి చేశారు. అలాగే కన్నడిగుడైనా 'దేశ భాషలందు తెలుగు లెస్స' అన్న కృష్ణదేవరాయల కాంస్య విగ్రహాన్ని కృష్ణా జిల్లాలోని శ్రీకాకుళంలో నెలకొల్పేందుకు కృషిచేశారు. 'దివి మహోత్సవం' పేరుతో ఒక ఉత్సవం నిర్వహించి దివిసీమపై తనకున్న అపారమైన ప్రేమని చాటుకున్నారు. 2008లో అమెరికాలో నిర్వహించిన మొదటి అంతర్జాతీయ కూచిపూడి నృత్య పండుగకు అధ్యక్షులుగా వ్యవహరించారు. తనకు అత్యంత ఇష్టమైన ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘ అధ్యక్ష బాధ్యతల్ని సమర్థంగా నిర్వహించారు. ఆ సమయంలోనే ఆయన ఉపాధ్యక్షులుగా 2012 సంవత్సరంలో డిసెంబరు 27 నుండి 29 వరకు తిరుపతిలో నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా వారి తండ్రిగారైన స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు గారిని స్మరించుకోవడం అత్యంతావశ్యకం.

స్వర్గీయ జలగం వెంగళరావు గారు సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సమయమది. స్వర్గీయ మండలి వెంకటకృష్ణారావు గారి సమర్థతను గుర్తించి విద్యావ్యవస్థను చక్కదిద్దేపనిని ఆయనకు అప్పగించారు. విద్యాశాఖా మంత్రిగా పెద్దాయన సమర్థంగా విధులు నిర్వహిస్తున్న సమయంలోనే తెలుగుజాతి మధ్య ఐక్యతను పెంపొందించేందుకు మొట్టమొదటి ప్రపంచ తెలుగు మహాసభలు హైదరాబాదులో నిర్వహించడం జరిగింది. స్వర్గీయ జలగం వెంగళరావు గారు గౌరవాధ్యక్షులుగా, పెద్దాయన కార్యనిర్వాహక అధ్యక్షులుగా 1975 ఏప్రిల్, 12న ప్రారంభమైన తెలుగు మహాసభలు వారం రోజులపాటు చాలా ప్రతిష్ఠాత్మకంగా జరిగాయి. మొదటి ప్రపంచ తెలుగు మహాసభలకు స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు గారు కార్యనిర్వాహక అధ్యక్షులుగా వ్యవహరిస్తే, ఆయన కుమారుడు శ్రీ మండలి బుద్ధ ప్రసాద్ గారు తిరుపతిలో నిర్వహించిన నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలకు ఉపాధ్యక్షులుగా వ్యవహరించారు. ఆ అదృష్టం ఏ కొద్దిమంది పుణ్యపురుషులకో లభిస్తుందంటే అతిశయోక్తి కాదేమో.

2013 లో లండన్లో జరిగిన ప్రపంచ తెలుగు చరిత్ర సమావేశాలకు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు అధ్యక్షులుగా వ్యవహరించారు. భారత జాతీయతకు లోబడి తెలుగు భాషపై, జాతిపై, సంస్కృతిపై ఆయనకు గల మక్కువను పై కార్యక్రమాలు తెలియజేస్తాయి. 1972లో జరిగిన జై ఆంధ్ర ఉద్యమ సమయంలో ఆంధ్రప్రదేశ్ సమైక్యతను కాపాడటంలో వారి కుటుంబం నిర్వహించిన పాత్ర అనన్య సామాన్యం. తెలుగు జాతి సమైక్యంగా ఉండాలని పరితపించినందుకు వారి కుటుంబం అనుభవించిన బాధలు, అవమానాలు అన్నీ ఇన్నీ కావు. ఇటీవల జరిగిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా ఆయన సమైక్యత వైపే దృఢంగా నిలబడ్డారు.

చరిత్రలో తెలుగు జాతిపైన అనేక కుట్రలు జరిగాయి. తెలుగు ప్రజలు అనేకసార్లు విడగొట్టబడ్డారు. ఆ కుట్రలన్నీ ఛేదించుకుని అనేక పోరాటాల తర్వాత మరలా తెలుగు జాతంతా 1956లో ఆంధ్రప్రదేశ్ పేర

ఏకమైంది. కానీ చరిత్ర పునరావృత్తం అయ్యింది. తెలుగు జాతి విచ్ఛిన్నానికి తన మాతృ సంస్థ కాంగ్రెస్ పార్టీయే కారణమవడం ఆయన జీర్ణించుకోలేకపోయారు. అందుకే తమ కుటుంబానికి అత్యంత ప్రీతిపాత్రమైన కాంగ్రెస్ పార్టీని బాధాతప్త హృదయంతో వీడాల్సివచ్చింది.

కృష్ణా జిల్లా ప్రజా ప్రతినిధిగా ఆయన జిల్లాకు చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. కృష్ణా జిల్లా మైదాన రైతులకు, జిల్లా అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివి. కృష్ణా జిల్లా మైదాన ఆధునికీకరణకు ఆయన ఒక పనిముట్టుగా ఉపయోగపడ్డారనేది అందరికీ తెలిసిన విషయమే. అలాగే పులిగడ్డ – పెనుమూడి వంతెన నిర్మాణంలోను, పులిగడ్డ -- విజయవాడ కరకట్ట రోడ్డు నిర్మాణంలోను ఆయన పాత్ర ప్రశంసనీయం. అలాగే మచిలీపట్నంలో కృష్ణా విశ్వవిద్యాలయాన్ని స్థాపించడంలో ఆయనదే ప్రముఖమైన పాత్ర. కృష్ణా మైదాన రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి కోసం ఆయన అనేక ఉద్యమాలు చేశారు. దానికొరకు సెప్టెంబరు, 2004లో ఏడు రోజులు నిరాహార దీక్షకూడా చేసిన విషయం ఎవరూ మరచిపోలేరు. పులిచింతల, పోలవరం ప్రాజెక్టులు నిర్మిస్తే తెలుగు ప్రజలకు ఎంత మేలు కలుగుతుందో గుర్తించి వాటిని మంజూరు చేయించే విషయంలో ప్రముఖ పాత్ర పోషించారు. ఏదైనా ఒక సమస్యను వారి దృష్టికి తీసుకెళితే, వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవడం ఆయనకున్న సహజ లక్షణం.

1977లో దివిసీమలో సంభవించిన ఉప్పెన సందర్భంగా రాత్రనక, పగలనక ఉప్పెన బాధితులకు సేవచేశారు. దీన జన సంక్షేమ సమితి కార్యదర్శిగా వ్యవహరిస్తూ ఆ సంస్థ తరపున దాదాపు 120 మంది అనాథ బాల బాలికలకు ఉచిత వసతి, ఆహార మరియు విద్యాసదుపాయాలు కల్పించారు. 2005లో కోస్తా ఆంధ్ర జిల్లాల్లో సంభవించిన సునామీ ఉత్పాతం సందర్భంగా ఆయన నిర్వహించిన పాత్ర మరువలేనిది. విపత్తుల సమయంలో బాధితుల పక్షాన నిలబడి వారిలో ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని కల్పించడం ఆయనలోని ప్రత్యేక లక్షణం.

అనేక పదవులు అలంకరిస్తూ సమర్థుడైన, నిజాయితీ కలిగిన రాజకీయ నాయకుడిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. అలాగే గాంధేయవాదిగా, సంఘ సేవకుడిగా ఆయన అనేక కార్యక్రమాలు నిర్వహించారు. మరొకవైపు తెలుగు భాషాసంస్కృతుల ప్రేమికుడిగా తెలుగు భాషాభివృద్ధికి అనేక కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు సాహిత్యంపై ప్రేమతో 'మారిషస్‌లో తెలుగు తేజం', 'ప్రజలు–ప్రగతి', 'ఇంగ్లండులో తెలుగు వైభవ స్మృతులు' మొదలైన పుస్తకాలు రచించారు.

అలాంటి అద్వితీయ వ్యక్తి 60 సంవత్సరాలు పూర్తి చేసుకుని, 61వ సంవత్సరంలో అడుగిడుతున్న శుభ సందర్భంగా వారికి ఆయురారోగ్య, ఐశ్వర్యాలు ప్రసాదించాలని ఆ భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను. ఆయన ఇంకా అనేక ఉన్నత పదవులు అధిరోహిస్తే సామాన్యుడికి కొండంత అండ దొరుకుతుందని ప్రగాఢంగా నమ్మే వ్యక్తిని నేను. నవ్యాంధ్ర నిర్మాత, గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో సాగుతున్న ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో మా మండలి వారు ప్రముఖ పాత్ర పోషించాలని కోరుకుంటున్నాను.

తెలుగు వెలుగుల మణిదీపం

- డా. మసన చెన్నప్ప

తెలుగు భాషా సాహిత్యాల సముద్ధరణకు కంకణం కట్టుకున్న శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు తెలుగు వైతాళికులలో నిలిచే వ్యక్తి.

అది 1975, హైదరాబాదులో ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతున్న సంవత్సరం. జలగం వెంగళరావు గారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, మండలి వేంకట కృష్ణారావుగారు విద్యామంత్రిగా వున్నారు. వారిద్దరి నేతృత్వంలో లాల్‌బహదూర్ స్టేడియంలో ఉత్సవాలు జరిగాయి. ఆ ఉత్సవాల నిర్వహణలో బాధ్యతాయుతమైన పదవిని తండ్రి శ్రీ కృష్ణారావు గారు అలంకరిస్తే, కుమారుడు బుద్ధప్రసాద్ బాలల కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఇదొక అపూర్వమైన విషయం! ఆ తర్వాతి కాలంలో అతడు తండ్రికి తగ్గ కుమారుడై తెలుగు భాషా సంస్కృతుల సంరక్షణలో అందరికంటే ముందుంటాడని ఎవరూ ఊహించలేదు. కాని ఈ నలభై సంవత్సరాలుగా తెలుగునాట భాషా సాహిత్యాలకు కొండంత అండగా ఉన్న మండలి బుద్ధప్రసాద్ గారి భాషా సంస్కరణ దృష్టిని, భాషా పరిరక్షణ నిరతిని అడుగడుగునా చూస్తున్నవాణ్ణి, ఎప్పుడు ఎక్కడ కనిపించినా "చెన్నప్పా!" అని ఆప్యాయంగా పిలిచే భాషా సాంస్కృతిక సమున్నత వ్యక్తిత్వం శ్రీ బుద్ధప్రసాద్‌గారిది.

కొందరు కుమారులు తండ్రికి వారసులుగా ఉండలేకపోతారు. కాని, శ్రీ బుద్ధప్రసాద్‌గారు భాషా ప్రేమికులుగా, భాషా సముద్ధారకులుగా తండ్రి నుండి వారసత్వాన్ని పొందడం తెలుగు భాష చేసుకొన్న అదృష్టమనక తప్పదు.

శ్రీ బుద్ధప్రసాద్ గారి జీవితాన్ని అనుశీలిస్తే వారి ప్రధాన లక్ష్యం తెలుగు భాష అభ్యుదయం మాత్రమే. రాజకీయ రంగంలో ప్రవేశించినప్పటికీ వారు రాజనీతిజ్ఞులుగానే పేరు తెచ్చుకొన్నారు. ఏ పదవిని అధిరోహించినా తమ పెదవిని భాషకే అంకితం చేశారు. ప్రజాసేవలో ఉన్నా, భాషా సాహిత్యాల సేవలో వారిది ప్రత్యేకమైన శైలి.

1975 నుండి నిన్న మొన్న తిరుపతిలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల దాకా అన్నివేళలా వారి మార్గదర్శనం లభించింది. ప్రపంచంలో ఎక్కడ తెలుగు భాషా సదస్సులు జరిగినా శ్రీ బుద్ధప్రసాద్ గారు తప్పక వెళ్ళాల్సిందే.

గాంధేయవాదం, నిరాడంబరమైన జీవితం, ఆహ్లాదకరమైన సంభాషణ, పరహిత బుద్ధి, మాతృదేశాభిమానం మొదలైన సద్గుణాలు వారికి తెలుగుభాషకు ఇతోధిక సేవ చేయడానికి సహకరించాయి.

నాకు తెలిసినంత వరకు తెలుగు భాష మీద పట్టుగల రాజకీయ నాయకులలో పి.వి. నరసింహారావు గారు, బెజవాడ గోపాలరెడ్డి గారు, ఎన్.టి. రామారావు గారు ప్రముఖులు.

ఆ తర్వాత మరొక్క విశిష్టమైన వ్యక్తి గౌరవనీయులైన శ్రీ బుద్ధప్రసాద్ గారే. భాష మీద, సంస్కృతి మీద మాట్లాడమంటే ఏదో నాల్గు మాటలు మాట్లాడడం కాక, శ్రోతల మనస్సుల మీద ముద్రవేసే ఉపన్యాసాలు శ్రీ బుద్ధప్రసాద్‌గారు చేస్తారు.

ఒకసారి జొన్నవిత్తులవారు శ్రీకాకుళాంధ్ర విష్ణువు పేరుతో శ్రీకాకుళంలో జరిగే భాషా మహోత్సవాలకు నన్నాహ్వానించినారు. అక్కడ శ్రీ బుద్ధప్రసాద్ గారితో ఒక గంటసేపు సాహిత్య చర్చ చేసే అవకాశం లభించింది. ఇట్లే ఎన్నో సభల్లో వారిని కలుసుకోవడం ఒక ఎత్తైతే, వారి ప్రభావవంతమైన, సంస్కరణోపేతమైన ప్రసంగాలు వినడం మరొక యెత్తు.

ఇప్పుడు తెలుగు నేల రెండుగా విభక్తమైనది. భాషాపరంగా ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం శ్రద్ధ చూపవలసిన అవసరం ఉంది. అయ్యో శ్రీ బుద్ధప్రసాద్ లాంటి మహోన్నతమైన వ్యక్తి తెలుగును సముద్ధరించడానికి తెలంగాణలో లేడాయెను గదా అని నా బాధ!

అయినా, మహనీయులు ఎక్కడున్నా వారి ప్రభావం పడుతూనే ఉంటుంది. వారి స్ఫూర్తి దూరంగా ఉన్నవారికి కూడా లభిస్తూనే ఉంటుంది.

శ్రీ బుద్ధప్రసాద్ గారికి భాషా సాహిత్యాల పట్ల అంత అభినివేశం ఎట్లా కల్గిందనే ప్రశ్న చాలామందిలో కల్గుతుంది. దానికొక్కటే కారణం. వీరు చేతికందిన ప్రతి పుస్తకాన్ని చదువుతారు. ఆ పుస్తకం వల్ల సమాజానికి, వ్యక్తికి గల ప్రయోజనాన్ని గుర్తిస్తారు. రచయితను ప్రోత్సహిస్తారు. ఎక్కడ కనిపించినా పలకరించి, వెన్నుతట్టి ముందుకు వెళ్ళమని భరోసా ఇస్తారు. ఆర్థికంగా తోడ్పడుతారు. ఇంతకంటే ఇంకేం కావాలి తెలుగు రచయితలకు?

శ్రీ బుద్ధప్రసాద్‌గారు తెలుగునాట భాషా ప్రియులకు కల్పవృక్షమంటే అతిశయోక్తి కాదు. వారి సేవలు ఇక ముందు కూడా, రాష్ట్రీయంగా, జాతీయంగా, అంతర్జాతీయంగా తెలుగువారికందాలని ఆశిస్తున్నాను.

ప్రవాసాంధ్రులతో సత్సంబంధాలు కలిగిన ఏకైక భాషామణిదీపం మన బుద్ధప్రసాద్ గారు!

"మాతృభూమిని మరచి - మాతృభాషను మరచి

మాతృదేశము మరచి - మనలేను మల్లీ"

అని నేను నా "మల్లి పదాలు" కవితాసంపుటిలో రాశాను. ఈ మూడింటికి అక్షరాలా ప్రతినిధి మన బుద్ధప్రసాద్‌గారు. వారికి అరవై వసంతాలు నిండిన సందర్భంగా నా హృదయ పూర్వక శుభాకాంక్షలర్పిస్తూ, వారు శతాధిక వయోవృద్ధులై, భాషా సాహిత్య సముద్ధారకులై చిరయశస్సు పొందాలని ఆశిస్తూ, భగవంతుడందుకు సహకరించాలని ప్రార్థిస్తున్నాను.

మధుర స్మృతులు

- డా. ఎస్.వి.ఎన్. ప్రసాద్

ప్రసిద్ధమైన తెలుగు భాషకు పట్టాభిషేకం చేయ తలపెట్టి, తొలి ప్రపంచ తెలుగు మహాసభలకు శ్రీకారం చుట్టి, అప్పటి ముఖ్యమంత్రివర్యులు శ్రీ వెంగళరావు గారి సారథ్యంలో విద్య, సాంస్కృతిక శాఖామాత్యులు శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు రాష్ట్రం నలుదిశలూ సంచరించారు.

మద్రాసు మహానగరంలోని శాస్త్రీ భవన్‌లో కేంద్ర ప్రభుత్వ శాఖలలోని తెలుగు ఉద్యోగుల సేవార్థం నేను, మరి కొందరు మిత్రులు కలిసి 1967లో నెలకొల్పి, విజయవంతంగా సేవలందిస్తున్న 'తెలుగు కల్చరల్ అకాడమీ'కి మండలి వారు ఆహ్వానం పంపుతూ, సమావేశానికి పిలిచారు. అప్పటి నుండి ముఖ్యమంత్రిగారు, మండలి వారు మద్రాసు విడిది చేసినప్పుడల్లా నేను, మా కమిటీవారు కూడా వారికి చేదోడు వాదోడుగా వుండి, వారి మెప్పులు పొందాము.

తన వెంటే నన్ను డాక్టర్ సి.ఎమ్.కె. రెడ్డి గారింటికి తీసుకెళ్ళి, పరిచయం చేసి, మాట్లాడిన పిదప, అంతా కలిసి వారింట్లోనే భోంచేసి వెళ్ళడం, ఆలిండియా తెలుగు ఫెడరేషన్‌ని స్థాపించిన డా॥ రెడ్డిగారు అప్పుడప్పుడూ గుర్తు చేస్తూంటారు.

మిగతా రాష్ట్రాలలోను, విదేశాలలోను నివసిస్తున్న తెలుగు ప్రముఖులను, తెలుగు సంస్థలను కలిసి, సంప్రదించి, అందరినీ కలుపుకొని, చరిత్రలో ఒక మరుపురాని ఉత్సవంగా హైద్రాబాద్ నగరంలో 1975లో తొలి ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించిన ఘనత శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారిది!

శ్రీ కృష్ణదేవరాయల వారి సంస్థానంలో పండిత, సాంస్కృతిక సమావేశాలను తలపింపజేసేవిగా, తెలుగు మహాసభలు జరిగాయని ప్రజా ప్రశంస!

ఇంగ్లీషు–తెలుగు భాషా మిళితంగా ప్రసంగించిన వారు కొందరైతే, అరవం–తెలుగు, కన్నడ–తెలుగు, హిందీ–తెలుగు కలగాపులగంగా ప్రసంగించి, సభలకు వన్నె తెచ్చినవారు మరి కొందరు! కవి, పండిత ప్రసంగాలు సరేసరి!!

నా వరకు వస్తే, భారత యుద్ధంలో, బాణాలు ఎక్కుపెట్టి, సంధించినప్పుడు 'ఆటమిక్ ఎనర్జీ' ఎలా యాక్టివేట్ చేయబడ్డదో, మూడు నిమిషాల వ్యవధిలో, కరతాళ ధ్వనుల మధ్య 'పత్రపఠనం' చేశాను!

'ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వానం' అనే హోర్డింగులలో 'మహాసభలకు' అని రాయడం అప్పటి హైద్రాబాద్ తెలుగుకి అద్దం పట్టింది. అతిథులకు నవ్వు పుట్టించింది. సభ నుండి బయటకొస్తే, రిక్షా వాళ్ళ దగ్గర్నుంచి, బయటనున్న మిగతావాళ్ళంతా హిందీలోనూ, ఉర్దూలోను మాట్లాడడం విదేశవాసులకి, ఇతర రాష్ట్ర వాసులకి ఆశ్చర్యం కలిగించింది! 'ఇదేమి తెలుగు రాజధానిరా బాబూ!' అని విస్తుపోయారు, నాతో సహా! ఇక అతిథులకు జరిపిన అతిథి సత్కారంలో 'తెలుగు వారి తరువాత, ఎవరైనా' అని నిరూపణ జరిగింది!

వీటన్నిటికీ కారకులు కీ॥శే॥ మండలి వెంకట కృష్ణారావుగారనేది జగమెరిగిన సత్యం! కృష్ణుడి సారథ్యం వంటిదే కదా, మండలి కృష్ణుడి ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణ! శ్రీకృష్ణదేవరాయల అసలు సిసలైన వంశీకులు కదా యీ మండలి వారు! అదే వీరి ఘనత! చారిత్రక వివరాలు నా పుస్తకం 'జీవనవేదం' లో పొందుపరిచాను!

ఇక బుద్ధుడి విషయానికొస్తాను. అప్పుడే షష్ట్యబ్ద పూర్తి అంటే, నమ్మబుద్ధి కావడం లేదు! నిన్న, మొన్నటి వాడు! నాన్న వెంట అడపా దడపా కనిపించిన వాడు! నెమ్మదస్తుడు! బుద్ధునిలా మౌనముద్ర వహిస్తాడు! సహృదయుడు! జాలి, దయ వెన్నతో తిన్నవాడు! కృష్ణ పరమాత్మ వంటి తండ్రి చేత సానపెట్టిన 'రత్నం' కదా, యీ మండలి బుద్ధప్రసాదు! అందుకే ముఖంలో ఆ నిగ! అన్ని పార్టీల వ్యక్తులను ఆకర్షిస్తాడు సదా!

ఎం.ఎల్.ఏ. అయ్యాడు! మంత్రి అయ్యాడు! క్రొత్త పథకాలతో బడుగు బలహీనవర్గాలకు ఎనలేని సేవ చేశాడు!

అధికార భాషా సంఘ అధ్యక్షుడిగా, తండ్రి స్ఫూర్తితో, 2012 లో చతుర్థ ప్రపంచ తెలుగు మహాసభలను తిరుపతిలో వైభవోపేతంగా నిర్వహించాడు! మరుగునపడ్డ తెలుగు సంస్కృతి, శిల్ప సంపదలను కనిపెట్టి, వాటిని ఆంధ్రరాష్ట్రంలో పునఃప్రతిష్ఠించడానికి అంకురార్పణ చేశాడు! తెలుగు భాషకు కేంద్ర ప్రభుత్వం చేత ఇవ్వబడిన పురాతన హోదాను రద్దు చేయించడానికి కొందరు చేసే దుష్టయత్నాలను, నిర్వీర్యం చేయడానికి తన వంతు కృషి చేస్తున్నాడు!

తెలుగు భాషను కాన్వెంటుల దాడి నుండి రక్షించుకోవడానికి నేను పదే పదే చేస్తున్న ఒకే సూచన ఇది. "ఎల్.కె.జి. లోనే పిల్లలకు ఇంగ్లీషు ఎ.బి.సి.లతో పాటు, తెలుగులో అ ఆ లు కూడా నేర్పుతూ, తెలుగు భాషను ఒక సబ్జెక్టుగా చేర్పించండి! నేర్పించండి!" ఇది తాను పూనుకుంటేనే అయ్యే పని! బుద్ధప్రసాద్ సాధిస్తాడు! తెలుగును బ్రతికిస్తాడు!!

మద్రాసు యూనివర్సిటీ వారి తెలుగు శాఖ శ్రీ మాడభూషి సంపత్‌కుమార్ నిర్వహణలో 540 మంది తెలుగు ప్రముఖులకు నా 'అంతరంగాలు' పుస్తకంతో 'అఖండ అంకితాలు' చేస్తే, నా వెంట నిలబడి, వచ్చిన ప్రముఖులు పద్మవిభూషణ్ డా॥ ఎం. బాలమురళీకృష్ణ, పద్మభూషణ్, డా॥ పి. సుశీలతో సహా, వచ్చిన తదితర గౌరవనీయులందరినీ దుశ్శాలువలతో సత్కరించి, సన్మానించింది, మండలి బుద్ధప్రసాదే! ఆ అద్భుత కార్యక్రమం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సు నుండి నాకు ప్రపంచ రికార్డును అందుకొనే అవకాశాన్ని కలగచేసింది.

లిమ్కా వారు నాకు మరొక ప్రపంచ రికార్డు ఇచ్చిన 'అనురాగ వనం' పుస్తకావిష్కరణ సభ, మద్రాసు వేణుగోపాల విద్యాలయ లో జరిగినప్పుడు కూడా, వీరి చేతుల మీదుగా శ్రీ కె. అనిల్‌కుమార్ రెడ్డి గారికి అంకితమివ్వడం, సమాజ సేవకులైన ఎనమండుగురు జైన్ ప్రముఖులకు ఆంధ్రజాతి తరపున 'సేవారత్న' అవార్డులతో సన్మానించి, సత్కరించడం సభ్యసమాజం హర్షిస్తుంది! తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సు వారు కూడా నాకు వారి రెండవ ప్రపంచ రికార్డు అందజేశారు!

పర్యావరణ పరిరక్షణకు నేను వ్రాసిన 'వృక్షగాథ'ని అభినందిస్తూ, ఆంధ్రప్రదేశ్ దళిత కళామండలి వారు హైద్రాబాద్ రవీంద్రభారతిలో శ్రీ బుద్ధప్రసాద్ చేతుల మీదుగా నాకు సన్మాన, సత్కారాలు చేసి, 'పెరియార్– ట్రూ ఇండియన్–2013' అవార్డును అందజేయడం, చెన్నైవాసిగా నాకు కీర్తి, ప్రతిష్ఠలు కలిగించింది.

భావదేవరపల్లి లోని వారు చదువుకున్న పాఠశాల 50వ వార్షికోత్సవ సందర్భంలో శ్రీ మండలి ఉదయభాస్కర్, శ్రీ ఆవుల రామమోహన్‌రావు ల ద్వారా నన్నాహ్వానింపజేసి, ఆ వేదిక మీద 2016 సంక్రాంతి ఆనాడు నన్ను సాదరంగా సన్మానించడం, నా గౌరవాన్ని ఇనుమడింప జేసింది!

కాంగ్రెస్ హయాంలో మంత్రి పదవిలో వున్నా తెలుగుదేశం వారు ఉప సభాపతిని చేసినా, రేపొక నాటికి భారత దేశాధ్యక్షుడైనా, స్వదేశానికి మంచి చేయగల జాతిరత్నం! కల్లాకపటమెరుగని మహామనీషి మండలి బుద్ధప్రసాదు!

'సునామి' అనే పేరు తెలీని రోజుల్లో, 1977లో దివిసీమలో సముద్రపు రాక్షస అలలు చెలరేగి, ఉప్పెనై వచ్చి గ్రామాలకు గ్రామాలనే ముంచి, వేలకొద్దీ జనాన్ని, పశుపక్ష్యాదులనీ హతమార్చినప్పుడు, తల్లడిల్లిన తండ్రితో పాటు, యువకుడైన బుద్ధప్రసాదు ఆకలి, దప్పులు మరిచి, రేయింబవళ్ళు శ్రమించి, సేవలు చేసి, 'మానవసేవే మాధవసేవ'గా విశ్వసించిన మహనీయులు వారు! వీరు నెలకొల్పిన గాంధీ గ్రామం వీరి సేవా తత్పరతకు తార్కాణం! అకుంఠిత గాంధేయవాదులు! సర్వదా ఖద్దరుధారణ వీరికి అత్యంత ప్రీతిపాత్రం! వీరి సేవలను, సందేశాలను వ్రాయాలంటే, ఒక గ్రంథమే తయారవుతుంది! కనుక, ఇంతటితో నా జ్ఞాపకాలకు తెరదించుతున్నాను!

షష్ట్యబ్ద పూర్తి శుభ సమయాన శ్రీ మండలి బుద్ధప్రసాద్‌కి ఆయురారోగ్యైశ్వర్యాలతో పాటు, కుటుంబ ఆనందం, ఆహ్లాదం, మనశ్శాంతి మెండుగా కలగాలని మనఃపూర్వక ఆశీస్సులు!!!

మంచివారికి అందరూ మెచ్చే కార్యక్రమాన్ని చేస్తున్న ప్రియమైన కిన్నెర ఆర్ట్ థియేటర్స్ వారికి నా శతాధిక అభినందనలు!!!

వన రక్షణే – జన రక్షణ!

మానవసేవే – మాధవసేవ!

శుభం!

సాంస్కృతిక కళాభిమాని

- కె.వి. సత్యనారాయణ

తెలుగుజాతి ఔన్నత్యాన్ని, తెలుగు భాష మాధుర్యాన్ని, భారతీయ సాంస్కృతిక కళావైభవాన్ని దశదిశల వ్యాప్తి చేయడానికి నిరంతరం కృషి చేస్తున్న శ్రీ మండలి బుద్ధప్రసాద్ తెలుగుతల్లి ముద్దుబిడ్డ, నిరాడంబరుడు, స్నేహశీలి, గ్రంథకర్త, మృదుభాషి అయిన శ్రీ బుద్ధ ప్రసాద్ గారితో పరిచయము నిజంగా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను.

ఆంధ్రుల రాజధాని కృష్ణా జిల్లాలోని శ్రీకాకుళంలో వేంచేసియున్న శ్రీ శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణు ఆలయమును సందర్శించిన ఆంధ్రభోజుడు, శ్రీ కృష్ణదేవరాయలవారు 'ఆంధ్ర మహావిష్ణు' స్వప్న సాక్షాత్కారములో తెల్పిన విధముగా ఆలయములో 'అముక్తమాల్యద' అను తెలుగు కావ్య రచనకు ఉపక్రమిస్తాడు. శ్రీకృష్ణ దేవరాయలు గురించి తెలియని తెలుగువాడు లేడు అనడంలో అతిశయోక్తి లేదు. కాని, 'అముక్తమాల్యద' కావ్యము గురించి సాహితీవేత్తలకు, సాహిత్య ప్రియులకు, మరికొద్ది మందికి తెలుసు అనుకుంటున్నాను. శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు శ్రీకాకుళంలోని ఆంధ్ర మహావిష్ణు ఆలయములో "దేశభాషలందు తెలుగులెస్స" అని పలికిన శ్రీకృష్ణ దేవరాయలవారి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాటు చేస్తూ కాకతాళీయంగా హైదరాబాదు రవీంద్రభారతిలో కలవడమైనది. మాటల సందర్భమున వారు నన్ను శ్రీ కృష్ణదేవరాయల చరిత్రపై నృత్య రూపకము చేయగలరా అని అడిగారు. నేను ఎంతో సంతోషముతో ఎవరైనా వ్రాసి ఇస్తే తప్పక చేస్తాను అని అన్నాను. వెంటనే ఆయన డా॥ రాళ్ళబండి కవితా ప్రసాద్ గారికి ఈ విషయమును చెప్పి వారిని నృత్య రూపకమును వ్రాయమని అడుగగా వారు కూడా సంతోషముతో అంగీకరించి 'అముక్తమాల్యద'లోని గోదాదేవి కళ్యాణ ఘట్టము ముఖ్యాంశముగా ఎంతో అందముగా నృత్య రూపకమును శ్రీ మండలివారి ఊహకు, శ్రీ రాళ్ళబండి వారు రచన చేశారు. నా నృత్య దర్శకత్వములో 'అముక్తమాల్యద' రూపొంది శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణు సన్నిధిలో విజయవంతముగా ప్రదర్శించబడి, ఇప్పటికి దేశ విదేశాలలో ఎన్నో ప్రదర్శనలు ఇవ్వడమైనది. తెలుగు భాష ఉన్నతని దశదిశలుగా ప్రచారము చేసే భాగ్యము ఈ నృత్య రూపకము ద్వారా కలిగినది. అప్పటి నుండి ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి 11వ తారీఖున శ్రీకాకుళములో ఒక కొత్త నృత్య రూపకము మేము ప్రదర్శించడం ఒక ఆనవాయితీ అయ్యింది. తరువాత శ్రీ మండలి వారి ఊహలలోంచి వచ్చిన 'పంచకావ్య' డా॥ రాళ్ళబండి వారి అద్భుత రచన, మన కావ్యాలలోని గొప్పతనాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శించే అవకాశము రావడము నా అదృష్టము. ఇందుకు కారకులు, సాహితీ ప్రియులు, తెలుగు భాష అభివృద్ధికి నిరంతరము కృషి చేస్తున్న శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు.

ఈ క్రమములో 'పంచకావ్య', 'కాలార్చన', 'చిన్నదేవి', 'నృత్యాక్షరి', 'శ్రీకృష్ణ కర్ణామృతము' నృత్య రూపక నిర్మాణము వారి ఆధ్వర్యములో జరిగాయి. ఎదుటివారిలో సామర్థ్యాన్ని గుర్తించి, ప్రోత్సహించడములో వారికి వారే సాటి. ఎప్పుడూ చిరునవ్వుతో అందరిని ఆప్యాయముగా పలకరించే వారి ఔన్నత్యము ఎంతో గొప్పది.

తెలుగుభాష వికాసము, అభివృద్ధి, పరిశోధన, ప్రచారము వారి లక్ష్యాలు. నిండు తెలుగు తనము ఉట్టిపడేలా ఉంటాయి ఆయన ప్రసంగాలు. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. బ్రిటన్ లాంటి దేశము సందర్శించేవారు లండన్‌లోని అద్భుత పర్యటన ప్రదేశాలు, విందులు, వినోదాలకు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. కాని వీరు మాత్రము తెలుగు భాషకు విశేష కృషి సల్పి, తెలుగులో నిఘంటువును తయారు చేసిన విదేశీవాడైన సర్ సి.పి. బ్రౌన్ గారి సమాధి బ్రిటన్‌లో ఎక్కడ ఉన్నది? అని ఆరా తీసి అంతవరకు ఆ విషయం మీద ఎవరికి అవగాహన లేకపోవడం వలన ఎంతో కష్టముపై కనుక్కొని అక్కడ తెలుగువారిని వెంటబెట్టుకువెళ్ళి సి.పి. బ్రౌన్ గారి సమాధిని సందర్శించి వారికి ఘన నివాళిని అర్పించిన గొప్ప వ్యక్తి మన మండలిగారు. ప్రతీ తెలుగువాడు సి.పి. బ్రౌన్ గారు తెలుగుభాషకు చేసిన మేలు ఎన్నటికి మరువలేనిది.

తమిళనాడులోని మేలట్టూరు భాగవతమేళ నాట్య సాంప్రదాయము ఎంతో గొప్పది. అందున యక్షగానాలు తెలుగులో ప్రదర్శించడము విశేషము. అది తెలుసుకొని శ్రీ బుద్ధప్రసాద్ గారు మేలట్టూరు సందర్శించి అక్కడి నాట్య కళాకారులను కలుసుకొని, వారి ప్రదర్శన విశేషాలు తెలుసుకొని వారి ప్రదర్శనలు తరువాత ఆంధ్రరాష్ట్రములో ఏర్పాటు చేసి వారిని ఎంతగానో ప్రోత్సహించుచున్నారు. తమిళులు అయినప్పటికి భాగవతమేళ సాంప్రదాయాన్ని పరిరక్షించుచూ వారు తెలుగులో యక్షగానాలు ప్రదర్శించుట మనకు గర్వకారణము. మేలట్టూరులోని భాగవతులు "శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారితో స్నేహము దొరకడము మా అదృష్టము, వారి వలన ఈ మేలట్టూరులోని భాగవతకళ ఇంకా ఎంతో అభివృద్ధి చెందుతుందనే ఆశతోయున్నాము" అని స్వయముగా వారు చెప్పడము, మిత్రులమైనందుకు ఎంతో సంతోషదాయకము. తెలుగు పదాలు ఎక్కడ ఉన్నా అక్కడ బుద్ధప్రసాద్ గారు ఉంటారు అన్నది నిజం.

ప్రతీ సంవత్సరం నా పుట్టిన రోజు సందర్భముగా సెప్టెంబర్ 26వ తారీఖున ఒక ప్రముఖ నాట్య కళాకారులను సత్కరించడం ఆనవాయితి. అవార్డుకి కళాకారుల ఎంపిక చేయడంలో మరియు వారు స్వయముగా హాజరయ్యి సత్కరించడము వారు కళాకారుడైన నాపై చూపే అభిమానము మరువలేనిది. ఎప్పుడు ఎదుటివారిలోని మంచితనాన్ని చూచి అభిమానించే వ్యక్తి శ్రీ బుద్ధ ప్రసాద్ గారు. సంగీత, సాహిత్య, నృత్య, నాటక అన్ని రంగాలపై ఎంతో అవగాహన, అభిమానము ఉన్న వ్యక్తి, ఎన్నడు ఎవ్వరిని నొప్పించే విధముగా నడుచుకోని వ్యక్తి, ఎప్పుడు అందరిలో మంచిని చూసే వ్యక్తి, రాజకీయ నాయకులకు ఆదర్శమూర్తి.

వారి షష్టిపూర్తి సందర్భముగా ఆ భగవంతున్ని ఆయనకు నిండు నూరేళ్లు, ఆయురారోగ్య ఐశ్వర్యములు ప్రసాదించాలని ప్రార్థించుచూ వారికి నా హృదయపూర్వక అభినందనలు.

ఆదర్శమూర్తి

- డా. వి.ఆర్. రాసాని

1977లో నేను తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో బి.ఏ. మొదటి సంవత్సరం చదువుతున్నాను. ఆ సంవత్సరంలోనే దివిసీమలో తుఫాను వచ్చి, వరదలు పల్లెల్ని ముంచేశాయి. ఊర్లు ఊర్లే నీళ్ళల్లో కొట్టుకుపోయాయి. జరిగిన ధన, ప్రాణ నష్టాలు చెప్పనలవి కానివి. రాష్ట్రంలోని జనం చలించి పోయారు. వారికి సహాయ సహకారాలందించడానికి విద్యార్థిలోకం కదిలింది. మా కళాశాల నుంచీ కూడా బట్టలు, బియ్యం, పప్పు, చింతపండు, మిరపకాయలు వంటివి సేకరించి, వాటిని వరద బాధితులకందించడానికి కొన్ని వందల మంది విద్యార్థులు బయలుదేరారు. వారిలో నేనూ ఒకణ్ణి. నిరాశ్రితులైన జనాలకు మేమెత్తుకుపోయిన వస్తువుల్ని పంచుతూ ఒక పల్లె దగ్గర గుంపుగా చేరిన జనం కనిపిస్తే అక్కడికి వెళ్ళాం. అక్కడ ఓ పెద్దాయన, మాసిన తెల్లటి బట్టలతో, మాసిన గెడ్డం, చెదరిన జుట్టుతో నిలబడి బాధితుల బాధల్ని విని కన్నీరు కారుస్తూ ధైర్యం చెబుతున్నాడు. మేమక్కడికి వెళ్ళేసరికి మా గురించి అడిగి మమ్మల్ని కౌగిలించుకుని మీ సహృదయానికి నమస్కారం అన్నారు. ఇసుకలో తిరిగితిరిగి కాళ్ళు పుండ్లయిన పరిస్థితి వారిది. మేము తీసుకెళ్ళిన వస్తువుల్ని అక్కడి జనాలకందించి మాకెంతో కృతజ్ఞతలు చెప్పారు. ఆయనెవరైందీ తాను చెప్పలేదు కానీ పక్కన వారు చెప్పారు. ఆయన ఇక్కడి నాయకులు, మంత్రివర్యులు మండలి వెంకట కృష్ణారావుగారు అని. మాకాశ్చర్యమేసింది. చెప్పులు కూడా లేకుండా ప్రజల కోసం తల్లడిల్లిన ఆ వ్యక్తి మంత్రిగారని తెలిసి ఇంతా అంతా ఆశ్చర్యం కలుగలేదు. శరీరంలోని ప్రతి కణంలోను ప్రజా సేవ భావాన్ని నింపుకున్న ఆ కృష్ణారావుగారి వారసులైన వారి కుమారులు మండలి బుద్ధప్రసాద్ గారిని చూసినప్పుడంతా నాకు వారి నాన్నే గుర్తుకొస్తారు. బుద్ధప్రసాద్ గారిలోను వాళ్ళ నాన్నగారికున్న గొప్ప ప్రజాసేవాతత్పరత నిండుగా ఉంది. అందుకేనేమో తొణకని నిండుకుండలా ఉంటారు వారు. అందునా వారి తండ్రిగారి పోలికలు వారిలోను ఉన్నాయి. అంతేకాదు నిస్వార్థ రాజకీయ నాయకులుగా గుర్తింపు పొందిన వారు బుద్ధప్రసాద్ గారు. వీరు గొప్ప సాహిత్యాభిమాని. నాటక కళ అన్నా, మాతృభాషన్నా వల్లమాలిన ప్రేమ వారికుంది.

మొట్టమొదట ఇప్పటికి పదయిదేళ్ళ క్రితం చిత్తూరులో చి.ర.సం. అధ్యక్షులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి గారు, కార్యదర్శి కె. రామకృష్ణగారు ఏర్పాటు చేసిన ఒక సాహిత్య సభలో వారిని చూశాను. ఆ సభలో మాట్లాడే అవకాశం కూడా నాకు కలిగింది. ఆ సభలో బుద్ధప్రసాద్ గారు ఏ మాత్రం గొప్పలకు పోకుండా ఎంతో ప్రేమగా మామూలుగా మాట్లాడి ఆశ్చర్యపరిచారు. అక్కడే కలిసి భోంచేసినప్పుడు నావివరాలడిగి "మీరు మాట్లాడింది కూడా బాగుంది" అని మెచ్చుకున్నారు. అప్పుడూ వారి నాన్న కృష్ణారావుగారే గుర్తుకొచ్చారు. ఎందుకంటే ఆ తండ్రీకొడుకులిద్దరిలోనూ ఒకే రకమైన సౌమత్య... ప్రేమగా మాట్లాడేతత్త్వం.

ఆ తర్వాత 2009లో జరిగిన మండలి వెంకటకృష్ణారావు గారి వర్ధంతి సందర్భంగా 'నడుస్తున్న చరిత్ర' పత్రిక ద్వారా ఏర్పాటు చేసిన నాటికా రచన పోటీల్లో 'జలజూదం' అన్న నా నాటికకు బహుమతి

లభించింది. ఆ సందర్భంగా 29.7.2009వ తేదీన విజయవాడలో జరిగిన కృష్ణారావుగారి వర్ధంతి సభలో బుద్ధప్రసాద్ గారి చేతుల మీదుగా 'మండలి బుద్ధప్రసాద్ సాహిత్య పురస్కారం' అందుకున్న అదృష్టం నాది. ఆ సమయంలో అదే ఆదరణ, అదే సౌమ్యత, అదే ప్రేమతో కూడిన మాటలు. వారి తండ్రి గారిని గుర్తు చేసే పద్ధతి మరుపుకు రానిది.

చాలా ఏండ్ల తర్వాత బుద్ధప్రసాద్ గారిని కలిసే అవకాశం ఈ మధ్యలోనే కలిగింది.

మిత్రులు, ప్రసిద్ధ నాటక, కథారచయిత వల్లూరి శివప్రసాద్‌గారు; గొప్ప రంగస్థల కళాకారులు, నాటక ప్రయోక్త గంగోత్రి సాయిగారు నాచేత అరుదైన పుస్తకం రాయించి ముద్రించారు. ఆ పుస్తకం పేరు 'ప్రసిద్ధ తెలుగు నాటక పద్యాలు'. ఆ పుస్తకాన్ని చూడమని గౌరవనీయులైన బుద్ధప్రసాద్ గారికిచ్చారట శివప్రసాద్‌గారు, సాయిగారు. 2015వ సంవత్సరంలో బుద్ధప్రసాదుగారు వారి తండ్రి గారి వర్ధంతి సందర్భంగా ఆహ్వాన నాటక పోటీలు ఏర్పాటు చేసి, ఆ కార్యక్రమాలలో చివరి రెండు రోజులు ఈ పుస్తక ప్రభావంతోనే 'నాటక సాహిత్యంపైన ప్రత్యేకంగా ఒక సదస్సు' ఏర్పాటు చేశారు. పైగా రాత్రిపూట జరిగే నాటక పోటీలకు నన్ను కూడా ఒక న్యాయనిర్ణేతగా నియమించారు. రాత్రిపూట నాటక ప్రదర్శనలు, పగటి పూట సదస్సు. మధ్య మధ్యలో అక్కడికి వచ్చిన ప్రసిద్ధ కళాకారులకు సన్మానాలు, రాజకీయ నాయకుల చేత ఉపన్యాసాలు కూడా ఏర్పాటు చేశారు. అలాగే ప్రత్యేకంగా ప్రసిద్ధ నాటక రంగ కళాకారులైన ఆచంట వెంకటరత్నం గారికి, సినీ కళాకారిణి అయిన జమున గారికి పెద్ద ఎత్తున గౌరవ ప్రదమైన సన్మానాలు కూడా చేశారు. ఆ నాటకాలు, సన్మానాలు మరపురానివి. దానికి మించి అక్కడి జనాలకి వారిపైన అభిమానం, గౌరవం వెలకట్టలేనివిగా అనిపించాయి. ఎందుకంటే ఒక నాటకం రసవత్తరంగా ప్రదర్శిస్తున్నప్పుడు ఉన్నట్టుండి వర్షం వచ్చేసింది. చల్లదనం కోసం వేసిన షామియానాల కింద జనం తడుస్తూనే నాటకాన్ని చూశారు. పైగా ఆ నాటకం మన తెలుగు భాష, సాహిత్యాలపైన రాసి ప్రదర్శిస్తున్నది. ఆ దృశ్యాన్ని చూసిన నాకు అక్కడ ప్రదర్శిస్తున్న నాటకం గొప్పదా? ఆ నాటకం వేయించిన బుద్ధప్రసాద్ గారి కళాభిమానం గొప్పదా? ఆ నాటక ప్రదర్శనలకు తండ్రిగారితో కలిసి ఎంతో శ్రమపడుతూ నిర్వహిస్తున్న బుద్ధప్రసాద్ గారి అబ్బాయి అయిన వెంకట్ గారిదా? లేక అక్కడి ప్రజల కళాభిమానం గొప్పదా అన్న విషయం తేల్చుకోలేని సందర్భమది.

ఆ నాటికలు జరిగిన నాలుగు రోజులు పగలు, రాత్రి, కార్యక్రమాలు ముగిసేంత వరకు బుద్ధప్రసాద్ గారు ముందు వరుసలోనే కూర్చొని కార్యక్రమాలను ఒకవైపు చాకచక్యంగా నిర్వహిస్తూనే, మరోవైపు సదస్సులోను, చర్చల్లోను పాల్గొన్నారు. ఆ చర్చల్లో తెలుగు భాష, తెలుగువారి సాంస్కృతిక కళల గురించీ, నేడు వాటికి దాపురించిన దీనావస్థను గురించి మాట్లాడిన మాటలు, చర్చించిన విషయాలు జీవితాంతం గుర్తుండేవే.

చివరి రోజున జరిగిన నాటక సాహిత్య సదస్సులో గంగోత్రి సాయి, వల్లూరి శివప్రసాద్, కందిమళ్ళ సాంబశివరావు లాంటి వారు పాల్గొని పలు అంశాలపైన ఉపన్యసించారు. ఆ సదస్సులో నేను కందుకూరి 'అభిజ్ఞాన శాకుంతలం', కాళ్ళకూరి 'చింతామణి', 'మధుసేవ' బలిజేపల్లి 'హరిశ్చంద్ర' వంటి నాటకాలలోని స్త్రీ

పాత్రల గురించీ, 'కన్యాశుల్కం', 'మృచ్ఛకటికం' వంటి సాంఘిక నాటకాలలోని స్త్రీల గురించి, వాటిలో కథను మలుపు తిప్పిన సన్నివేశాలను, ఆంగ్లంలో అసంబద్ధ నాటకాలకు ఆదర్శమైన శామ్యూల్ బకెట్ 'వెయిటింగ్ ఫర్ గోడోట్' బ్రెఖ్ట్ 'కావ్యరంగం' సిద్ధాంతాన్ని, 15వ శతాబ్దంలోనే తెలుగులో రాయబడ్డ శ్రీనాథుని 'క్రీడాభిరామం'లోని అసంబద్ధ శిల్పాన్ని వివరిస్తు ఉపన్యసించాను. అదంతా విన్న బుద్ధప్రసాద్ గారు నా ఉపన్యాసంలోని అంశాల గురించి, నేను చెప్పిన పద్ధతి గురించి మెచ్చుకోలుగా మాట్లాడిన విషయమూ నాకు మరచిపోలేని సంఘటనే. ఆ స్టేజీపైనే ఒక నటుడిగా, నవలా, కథ, నాటక రచయితగా నన్ను గుర్తించి సన్మానించిన విషయమూ మరచిపోలేనిది.

అంతటి సత్సాహిత్య అభిలాష, సత్కళాభిమాని, సౌమ్యులు, సద్గుణ సంపన్నులు, సంఘ సేవాతత్పరులు, నేటి శాసనసభ ఉపసభాపతి అయిన బుద్ధప్రసాద్ గారి అభిమానాన్ని పొందినందుకు నేను నిజంగా గర్వపడుతున్నాను. మండలి వెంకట కృష్ణారావు గారిని దర్శించి, వారిమెప్పును పొంది, ఆ తర్వాత వారికుమారులైన బుద్ధప్రసాద్ గారి అభిమానాన్ని పొంది, వారి కుమారుడైన వెంకట్ గారితో పరిచయం ఏర్పడడం నా భాగ్యంగా భావిస్తున్నాను.

ఇంతమంచి మనసు కలిగిన బుద్ధప్రసాద్ గారు పుత్ర, పౌత్ర, కళత్ర సౌభాగ్యాలతో నిండునూరేండ్లు ఆరోగ్యంతో వర్ధిల్లాలనీ, వారు భాషకు, కళలకు, సాహిత్యానికి మరింత సేవ చేయగలరనీ ఆశిస్తున్నాను.



మండలి బుద్ధప్రసాద్ దంపతులను ఆశీర్వదిస్తున్న కేంద్ర మంత్రులు శ్రీ పి.వి. నరసింహారావు, శ్రీ పి. శివశంకర్

బుద్ధుని ధర్మచక్రం

- భవిరి రవి

దీవులు భగవంతుని దీవెనలందుకున్న తావులు, గంగమ్మ ముద్దుబిడ్డలు - అలా దేశంలో ఉన్న దేవులకూ తలమానికం మా దివిసీమ. అందులోను దివ్య కృష్ణా మహానదీమతల్లి ఒడిలో నిలిచిన రత్నం మా నాగాయలంక గ్రామం. అందులో ప్రభవించిన రత్నమే శ్రీ మండలి బుద్ధప్రసాద్ మహాశయులవారు, విశ్రుత కీర్తులైన శ్రీ మండలి వెంకటకృష్ణారావుగారి కుమారులుగా సుప్రసిద్ధులు, అవనిగడ్డ నియోజకవర్గం (ఎం.ఎల్.ఏ) శాసనసభ్యులుగా 1999, 2004, 2014 ఎన్నికల్లో గెలిచిన విజయకీర్తిగల మహాపురుషులు, వారి తండ్రిగారైన కృష్ణారావుగారికి వలెనే వీరు కూడా తెలుగుభాషా సారస్వతాలకు ఎనలేని సేవ చేస్తున్నారు. అందు అంతర్జాతీయ తెలుగు భాషాకేంద్రం / తెలుగు విజయం మొదలైన ప్రాజెక్టులు, సేవలు చాలా ముఖ్యమైనవి. 2014లో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నికై ఆ పదవిలో కొనసాగుతూ దేశసేవ - సాహిత్య సేవ - కళారంగసేవ అవిరళంగా, అవిశ్రాంతంగా చేస్తున్నారు మా మండలి బుద్ధప్రసాద్ గారు.

కృష్ణా జిల్లాలో "కృష్ణా జిల్లా డెల్టా సంరక్షణ సంఘా"న్ని ఏర్పాటు చేసి, దానికి అధ్యక్షులై ఉద్యమాలు నడిపి అసమాన శౌర్య ధైర్యాలు ప్రదర్శించారు. కృష్ణానదిపై పులిగడ్డ-పెనుమూడి వారధి నిర్మించి తండ్రిగారి పేరిట మండలి వెంకటకృష్ణారావు వారధిగా నామకరణం చేసి మా సీమకు మరో శ్రీరామచంద్రుడిగా అవతరించారు. 1977లో దివిసీమకు పెనుతుఫాను ప్రమాదం సంభవించిన దశలో తండ్రిగారి స్ఫూర్తితో నవయువకులైన వీరు పేరుకు బాలచంద్రుడిలా వీరత్వం ప్రదర్శించి దీనజన సంక్షేమ సమితి నెలకొల్పి దీనులు, అనాధలకు ఆశ్రయం కల్పించారు.

1975 మొదటి ప్రపంచ తెలుగు మహాసభలలో, 1990 మారిషస్ సభలలో పాల్గొని సేవలందించారు. 2007-2011-2014లో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించారు. 2011 మిల్పిటాస్ (యు.ఎస్.ఎ) అంతర్జాల మహాసభలకు గౌరవ అధ్యక్షులైనారు. తెలుగును ప్రాచీన భాషగా గుర్తించడానికి ఎంతో శ్రమించారు. అసంఖ్యాకమైన రచనలు అంకితం పొంది ఎన్నో గ్రంథాలు వ్రాసి, గ్రంథాలు సేకరించి తెలుగు భాషకు ఎంతో సేవ చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నాగాయలంక మండలములోని భావదేవరపల్లి గ్రామంలో ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాలను నెలకొల్పి దానిని వారి మానస పుత్రికను చేసుకున్న ఘనత వారికే దక్కింది. గాంధేయవాదిగా, ఆదర్శ నాయకునిగా, విశిష్ట వ్యక్తిగా, దివిసీమ ముద్దుబిడ్డగా, నిగర్వికా, నిరాడంబరుడిగా, నిర్మలహృదయుడిగా షష్టిపూర్తి జరుపుకుంటున్న మా బుద్ధప్రసాదు గారికి - తోటి దివిసీమ పౌరుడిగా, కళాకారుడిగా, భాషా సాంస్కృతిక సేవకుడిగా నేను సైతం నా జోహార్లర్పిస్తున్నాను.

కృష్ణా పుష్కరాల సందర్భంగా శ్రీ కృష్ణారావుగారి కుమార రత్నం షష్టిపూర్తి జరుపుకోవడం అత్యంత విశేషమైన విషయం. కృష్ణా తీరంలో అత్యంత వైభవంగా వెలసిన గౌతమబుద్ధుని ధర్మచక్రం శ్రీ బుద్ధప్రసాద్ గారి మాటల్లో చేతల్లో చూచే భాగ్యం లభించినందుకు ఈనాడు తెలుగువారంతా గర్విస్తున్నారు. అలాగే దివిసీమ బిడ్డగా నేను మీకు నా శుభాకాంక్షలు తెలుపుతున్నాను. ఇలాగే మీరు సహస్రచంద్ర దర్శనోత్సవము – శతమానోత్సవం జరుపుకొని దివిసీమకు, తెలుగు సీమకు అజరామరకీర్తి కాంతులు కలిగిస్తారని ఆశిస్తా.

విజయవాడ కనకదుర్గమ్మ – వేదాద్రి యోగానంద పంచ నరసింహుడు – తిరుమలగిరి ద్వాదశనామ వేంకటేశ్వరుడు, శ్రీశైల మల్లికార్జునుడు – భద్రాచల రాముడు – మంగళగిరి పానకాలస్వామి – పొన్నూరు భావనారాయణుడు – ఘంటశాల జలధీశ్వరుడు – చిలకలపూడి పాండురంగడు – బందరు నాగేశ్వర స్వామి – మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరుడు – శ్రీకాకుళం ఆంధ్రమహావిష్ణువు – అవనిగడ్డ లంకమ్మతల్లి – హంసలదీవి వేణుగోపాలుడు – భావదేవరపల్లి భావనారాయణుడు – నాగాయలంక విశ్వేశ్వర స్వామి సహిత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారు

ఇత్యాది దేవతలంతా మీ షష్టిపూర్తి ఉత్సవం ఘనంగా జరగాలని ఎదురుచూస్తున్నారు. మీరింకా ఎంతో ఉత్సాహంతో, శక్తితో ఈ రాష్ట్రానికి, యావద్ భారత దేశానికి సేవలందించి ప్రపంచ విఖ్యాతి పొందాలని, దివిసీమ విజయకేతనం విశ్వవిఖ్యాతం చేయాలని ఆశిస్తూ, ఆకాంక్షిస్తూ....



అభినవ శ్రీకృష్ణదేవరాయలు

- శంకర నారాయణ

"శాంతము సముద్రము కన్నా గొప్పది" అంటారు. అయినా సముద్రంలో గొప్పతనం ఏముంది? అందులో ఉండేవన్నీ తాగడానికి ఉప్పునీళ్లే. అలాకాకుండా అమృతంలాంటి మంచినీటితో నిండిన సముద్రుడని ఒక మంచి పేరు పెట్టాలంటే.. ఏమి పేరు పెట్టాలి? మండలి బుద్ధప్రసాద్ అని! ఆయనకు ఒక్కడికి మంత్రి పదవి ఇచ్చినా మంత్రి మండలి అనొచ్చు. ఆవేశకావేశాలతో రగిలిపోతున్న ప్రస్తుత రాజకీయ రంగానికి మండలి బుద్ధప్రసాద్ ఒక ఒయాసిస్సు... తిరుగులేని ఓ ఆశీస్సు. ఆయనొక నిండుకుండ! మనందరికి పంచప్రాణాలుంటె ఆయనకు ఏడు ప్రాణాలున్నాయి. ఆరో ప్రాణం ప్రజాసేవ అయితే ఏడో ప్రాణం సాహిత్యసేవ. ఆయనది నిండుమనంబు నవ్యనవనీత సమానము. అంతే. పల్కుదారగా ఖండల శస్త్రతుల్యం మాత్రం కానే కాదు.

మండలి వారితో నాకు వంశపారంపర్య పరిచయం. ఒక దీపం ఇంకో దీపాన్ని వెలిగించినట్టు అనే మాట గుర్తొస్తుంది. బుద్ధప్రసాద్ గారి నాన్నగారు మండలి వెంకట కృష్ణారావు మార్కాపురంలో నేను ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లో ఆయన మాకు విద్యాశాఖ మంత్రి. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి కళాశాలకు ముఖ్యఅతిథిగా వచ్చారు. నేను మండలి వారి మీద గేయం రాసి, అచ్చువేసి ఆ సభలో చదివి, ఆయనకు సమర్పించాను. అది 'కృష్ణా రామా...కృష్ణా....రామా' అని మొదలవుతుంది. ఇవి 1973లో. ఆ తర్వాత ప్రపంచ తెలుగు మహాసభల్లో మండలి కృష్ణారావుగారి విశ్వరూపం, అశ్వరూపం చదివినా మా ఎమ్మెల్యే, నన్నో అద్భుతంగా ఆశీర్వదించిన మా ఎమ్మెల్యే పూల సుబ్బయ్య గారు కృష్ణారావుగారిని పరిచయం చేశారు. గాంధీని నేను చూడలేదు. ఆయన సిద్ధాంతాలు మూర్తీభవించిన మండలి కృష్ణారావు గారిని చూశాను. ఆ తర్వాత నాలుగు దశాబ్దాలకు ఓ చిత్రం జరిగింది. ఒకరోజు రాత్రి పది గంటలకు మండలి బుద్ధ ప్రసాద్ గారి నుంచి ఫోన్ వచ్చింది. అంతకు ముందు రెండుసార్లు 'నేను మీ నాన్నగారి మీద కవిత రాసి చదివాను' అని బుద్ధప్రసాద్ గారికి చెప్పడం ఇందుకు ప్రేరణ. "శంకరనారాయణ గారూ! మీరు మా నాన్నగారి మీద రాసిన కవిత మా ఇంట్లో దొరికింది" అన్నారు. నాకు పరమానందం కలిగింది. చిత్రమేమిటంటే ఆ కవిత నా దగ్గరలేదు. ఆ కవిత జిరాక్స్ కాపీ నాకు కావాలని అడిగాను. 'జిరాక్స్ ఎందుకు ఒరిజినలే' పంపిస్తానన్నారు బుద్ధప్రసాద్ గారు. లేదండీ ఒరిజినల్ మీదగ్గరే ఉండాలి. జిరాక్స్ పంపించడం చాలు అన్నాను. నాకు కాపీ పంపారు. ఒక మంత్రిగా ఉండి ఒక కుర్రాడు రాసిన కవితను ఇంటికి తీసుకు వెళ్లి భద్రపరచడం ఎంత విశేషం! నేను ఆ అదృష్టానికి నోచుకున్నాను. నేను నాగార్జున యూనివర్సిటీలో తెలుగు ఎమ్మే చదివే రోజుల్లో దివిసీమ తుఫాను వచ్చింది. దివి సీమ వాస్తవ్యులైన మండలి కృష్ణారావు చేసిన సేవలు ఆయనలోని మహాత్ముణ్ణి ప్రపంచానికి చూపించాయి. గాంధేయవాదం మూర్తీభవించిన మహోన్నతులైన నాయకులు. అందరికీ ఆస్తిపాస్తులు వారసత్వంగా వస్తాయి. బుద్ధప్రసాద్‌గారికి మానవత్వం కూడా వారసత్వంగా వచ్చింది.

బుద్ధప్రసాద్ గారితో నా తొలి పరిచయం చల్లపల్లి దగ్గర. అక్కడ వద్దిపర్తి పద్మాకరరావు గారి ఆశీతావధానం జరిగింది. అందులో అప్రస్తుత ప్రసంగిని నేను. అక్కడికి వెళ్ళగానే నిర్వాహకులు బుద్ధ ప్రసాద్ గారిని నాకు పరిచయం చేస్తామన్నారు. నేను సరేనని కదిలాను. బుద్ధప్రసాద్ గారే నన్ను పలకరించారు. అప్పుడు ఆంధ్రప్రభ దినపత్రికలో నేను రాస్తున్న ఫన్‌గన్ కాలమ్ రెగ్యులర్‌గా చదువుతానని, అదంటే నాకు ఇష్టం అని చెప్పారు. ఆ మాటలు విని నేను ఉప్పొంగిపోయాను. బుద్ధప్రసాద్ గారిలో నిజమైన బుద్ధుణ్ణి చూశాను. 'బుద్ధం శరణం గచ్ఛామి' అనుకొన్నాను. ఆ పరిచయం నిరాఘాటంగా కొనసాగింది.

బుద్ధప్రసాద్ గారిలో ఎవరైనా ఇష్టపడే గుణం శాంతం. ఆయనలాంటి శాంతమూర్తులు ఒక్కో పార్టీలో నలుగురు ఉన్నా చాలు మన రాజకీయ రంగం అద్భుతంగా ప్రకాశిస్తుంది. మన దేశం విశ్వగురువు అయిపోతుంది.

బుద్ధప్రసాద్ గారు సాహితీ సమరాంగణ సార్వభౌముడిని తలపించే అభినవ శ్రీకృష్ణదేవరాయలు. ఎటొచ్చీ కృష్ణదేవరాయల మాతృభాష తుళు అయినా తెలుగుకు ఎనలేని సేవ చేశారు. దేశభాషలందు తెలుగులెస్స అన్నారు. కానీ బుద్ధ ప్రసాద్ గారిది తెలుగు మాతృభాష అయినా తెలుగుకు ఇంత సేవచేయడం ఎంతో సేవ చేయడం చిత్రాతిచిత్రం. తెలుగువాడు తెలుగుకు సేవచేసే రోజులా ఇవి. మరి బుద్ధప్రసాద్ చీమకు కూడా హానితలపెట్టని పరమ గాంధేయవాది. అన్నట్టు వారి ఇల్లు కూడా గాంధీక్షేత్రం. ఆ క్షేత్రంలో బుద్ధప్రసాద్ గారు 2005లో ఉగాది సందర్భంగా నా హాస్యావధానం ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమంలో ప్రముఖ సినీ హీరోయిన్ వాణిశ్రీగారు, ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారులు ఆచార్య ఎస్.వి. రామారావు గారు కూడా పాల్గొనడం నా జీవితంలో మరిచి పోలేని, మైమరిచి పోయే ఘట్టం. "పండంటి కాపురానికి పదిసూత్రాలు అంటారు అన్ని అవసరమా?" అని వాణిశ్రీ గారు నన్ను హాస్యావధానంలో ప్రశ్న వేశారు. "పది సూత్రాలు అవసరం లేదు ఒక్క సూత్రం చాలు. అదే మంగళసూత్రం. దానిని కాపాడుకుంటే చాలు" అన్నాను.

ఆ సభలో బుద్ధప్రసాద్ గారు మాట్లాడుతూ "తప్పు చేసినవారు నా వాళ్లయినా సరే శిక్షించండి.. ఏ మాత్రం వెనకాడవద్దు" అని వేదిక మీద ఉన్న పోలీసు ఉన్నతాధికారులను ఉద్దేశించి చెప్పారు. బుద్ధప్రసాద్ గారు కార్యక్రమం ఫొటోలు కూడా తెచ్చి నాకు ఇచ్చారు. నామీద ఆయన ఎందుకు అంత అభిమానం చూపించారో ఆలోచిస్తే నాకు అర్థమయింది.

నేను ఒక రకంగా దివిసీమకు అల్లుణ్ణి. మా అత్తగారి సొంత ఊరు పెద్దప్రోలు. అల్లుళ్లను గౌరవించడం మన సంప్రదాయం కదా! బుద్ధప్రసాద్ గారికి ఆ విషయం తెలీకపోయినా దైవికంగా అలా జరిగిందేమో!

బుద్ధప్రసాద్ గారికి నాకు మధ్య ఇంకో విశేషమైన అభిమానం ఉంది. నవ్యాంధ్రప్రదేశ్ పుట్టిన తొలి సంవత్సరంలోనే మన్మథనామ ఉగాది పురస్కారం నాకు ఇచ్చారు. నా హాస్యావధానానికి ప్రభుత్వం నుంచి లభించిన తొలి గుర్తింపు అది. ఈ పురస్కార నిర్ణయ సంఘానికి బుద్ధప్రసాద్ గారు సారథి కావడం నాకు మరీ ఆనందం కలిగించింది.

రాజకీయ నాయకులు పదవుల కోసం నిద్రమానుకుని నానా ప్రయత్నాలు చేస్తుంటారు. కానీ బుద్ధప్రసాద్ గారు నిద్రపోతుండగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి పదవి ఆయన్ను వరించింది. ఆయన దగ్గర కొంత కాలం 'మత్స్య' యంత్రం (మత్స్యశాఖ) కూడా ఉంది. హరిలోని రెండక్షరాల సంగతేమో గానీ తెలుగు అనే మూడక్షరాలను ఆయన నిత్యం జపిస్తుంటారు. ప్రసంగంలో నా నోట ఇంగ్లీషు మాటలు వస్తున్నప్పుడు ఒకసారి హెచ్చరించారు కూడా. తెలుగు సేవలో పడి కొద్దిలో ఎమ్మెల్యే పదవిని చేజార్చుకున్న త్యాగ చరిత్ర కూడా ఉంది.

ఇరవై ఏళ్ళ ఉత్సాహం ఇనదీప్తులు చిమ్ముతున్న బుద్ధప్రసాద్ గారికి 60 సంవత్సరాలు నిండుతున్నాయంటే ఆశ్చర్యం! దేవుడి మీద నాకు చెడ్డకోపం. నేను దుర్ముఖినామ సంత్సరంలో పుట్టాను. నాకూ అరవై ఏళ్లు నిండుతున్నాయి. ఒకే సంవత్సరంలో పుట్టినా బుద్ధ ప్రసాద్ గారిని అంత గొప్పవాణ్ణి చేసి, నన్ను దేవుడు ఇలా ఎందుకు చేశాడో? అయినా దేవుణ్ణి క్షమిస్తాను. బుద్ధప్రసాద్ గారు తెలుగువారి సంప్రదాయమైన నూట పదహారు సంవత్సరాలు జీవించాలని నా ఆకాంక్ష.



సినీనటులు శ్రీ సి. నాగభూషణం, శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు, సంగీత నాటక అకాడమీ అధ్యక్షులు శ్రీ కె.వి. గోపాలస్వామి, శ్రీ మండలి వెంకట కృష్ణారావు, శ్రీ ధూళిపాళ్ళ, శ్రీ మిక్కిలినేని లతో

వరంగల్లుతో అనుబంధం

- డా. అంపశయ్య నవీన్

మండలి బుద్ధప్రసాద్ గార్ని నేను మొదటిసారి వరంగల్లులో కలుసుకున్నాను. తెలుగు భాషోద్యమ సమాఖ్య వారు ఈ శతాబ్దపు ప్రారంభంలో (2002లో) వరంగల్లులో తెలుగును బోధనా భాషగా, పరిపాలనా భాషగా అభివృద్ధి చెయ్యడంలో ఎదురయ్యే సమస్యల్ని చర్చించటానికి ఒక సదస్సును నిర్వహించారు. ఆ సదస్సుకు మండలి బుద్ధప్రసాద్ గారొచ్చారు. రెండ్రోజులు వరంగల్‌లోని రీజినల్ ఇంజనీరింగ్ కాలేజి వారి గెస్ట్ హౌస్‌లో ఉన్నారు. ఆ సదస్సు నిర్వహణలో ప్రముఖ పాత్ర వహించిన ఆచార్య పేర్వారం జగన్నాధధం గారూ, సామల రమేష్‌బాబు మొదలైన ఎందరో తెలుగుభాషా ప్రేమికులతో తన అభిప్రాయాలను పంచుకున్నారు. అప్పుడే ఆయన నాకు మంచి మిత్రుడయ్యాడు. నా నవల 'అంపశయ్య'ను చదివానని చెప్పారు. ఆ సదస్సులో కీలకోపన్యాస పత్రాన్ని నేనే రాసి చదివాను. చాలా బావుందన్నారు. ఆ సదస్సు కారణంగా ఆయనతో గడిపిన ఆ రెండ్రోజులు నా కెప్పుడూ గుర్తొస్తుంటాయి.

2004లో నా నవల 'కాలరేఖలు'కు కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం లభించినప్పుడు బుద్ధప్రసాద్ గారు నాకు ఢిల్లీ నుండి ఫోన్ చేసి అభినందనలు చెప్పారు. చాలా సంతోషించాను. 'కాలరేఖలు' చదివానని కూడా చెప్పారు. 2007లో విజయవాడలో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు జరిగినప్పుడు ఆయన ప్రత్యేకంగా నన్నూ, పేర్వారం జగన్నాధంగార్ని ఆ సభలకు ఆహ్వానించారు. నేనూ జగన్నాధం గారు కలిసి వరంగల్లు నుండి ఆ సభలకు హాజరయ్యాం. అలా బుద్ధప్రసాద్ గార్ని మరోసారి కలుసుకునే అవకాశం లభించింది. ఆ తర్వాత వారిని రెండు, మూడు సార్లు హైదరాబాదులో కలుసుకున్నాను. ఎప్పుడు కలిసినా చాలా ఆప్యాయంగా పలకరించే వారు.

ఒక రాజకీయ నాయకుడిగా ఆయన దివిసీమ ప్రాంతానికి చేసిన సేవలు చరిత్రాత్మకమైనవి. తెలుగు భాషా ప్రేమికుడిగా ఆయన తెలుగు భాషా పరిరక్షణకు చేసిన సేవలు అపూర్వమైనవి. ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం అధ్యక్షులుగా ఆయన నిర్వహించిన పాత్రను ఎవరూ మరచిపోలేరు. రచయితలు, కళాకారుల పట్ల ఆయన చూపించిన గౌరవం నన్ను ముగ్ధుణ్ణి చేసింది. ఏదో ఒక రాజకీయ పార్టీలో పనిచేసినప్పటికి, ఆయన పార్టీలకు అతీతంగా అందరినీ గౌరవించేవారు. 'జెంటిల్‌మెన్' అనే మాటలకు ఆయన నిర్వచనంలా ఉండేవారు. షష్టిపూర్తి జరుపుకుంటున్న ఆ మంచి మనిషికి నా హృదయ పూర్వకమైన శుభాకాంక్షల్ని తెలియజేస్తున్నాను

అప్పడే అరవై వసంతాలా!

- హైమవతీ భీమన్న

మండలి బుద్ధప్రసాదుగారితో నా పరిచయం నాలుగు దశాబ్దాల పైమాటే. మేము, వాళ్ళు ఎర్రమంజిల్ కాలనీలో ఉండేవాళ్ళం. అప్పుడు బుద్ధప్రసాదు వయస్సు సుమారు ఇరవై సంవత్సరాలుంటాయి. వాళ్ళ నాన్నగారు కీ.శే. మండలి వెంకట కృష్ణారావు గారు తరచు భీమన్నగారిని కలవడానికి మా ఇంటికి వస్తూ వుండేవారు. వారితో పాటు బుద్ధప్రసాదు గారు కూడా వస్తుండేవారు. వారి కుటుంబంతో మాకు సన్నిహిత సంబంధం ఏర్పడింది. ఎంతో ఆప్యాయంగా ఉండేవాళ్ళు.

మండలి కృష్ణారావుగారు గొప్ప మానవతావాది, గాంధేయవాది. తెలుగు భాషా సాహిత్యాల పట్ల అపారమైన గౌరవాభిమానాలుండేవి ఆయనకు.

తెలుగు భాష, సంస్కృతి, కళలను పెంపొందించే దిశగా అనేక కార్యక్రమాలు చేపట్టారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని ప్రపంచమంతా వ్యాపింపచేయడం కోసం 1975లో మొట్టమొదటి ప్రపంచ తెలుగు మహాసభలని నిర్వహించి తెలుగు ప్రజల మన్ననలకు పాత్రులయ్యారు. అదే స్ఫూర్తితో 1981లో మలేషియాలోని కౌలాలంపూర్‌లో రెండవ ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించి దేశవిదేశాల్లోని తెలుగువారినందరినీ ఒక వేదిక మీద సమావేశపరిచారు. ఇంతటి మహత్కార్యం ఒక్క మండలివారికే సాధ్యమయింది.

అంతటి మహనీయుడి తనయుడిగా బుద్ధప్రసాద్‌గారు తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ తండ్రి ఆశయాలు నెరవేర్చడంలో కృతకృత్యులయ్యారు.

బుద్ధప్రసాద్‌గారికి తండ్రిగారిలాగే తెలుగుభాష సంస్కృతి, కళలంటే అపారమైన ప్రేమ. ఆ రంగాలలో ఆయన విశేష కృషి చేశారు.

కృష్ణా జిల్లా రచయితల సంఘానికి అధ్యక్షులుగా వుంటూ విజయవాడలో మూడు పర్యాయాలు ప్రపంచ తెలుగు సభలను నిర్వహించారు.

వృత్తిపరంగా రాజకీయాలలో వున్నా తెలుగు భాషని, రచయితలని, కవులను ఎప్పుడూ వెన్నంటే వుంటారు. ఏ రాజకీయ నాయకుడికీ లేని గౌరవం బుద్ధప్రసాదు గారి పట్ల వీరంతా ప్రదర్శించేవారు.

బుద్ధప్రసాద్ గారు మంచి రచయిత. తాను గ్రంథాలు వ్రాయడమే కాదు, ఎంతోమంది కవుల నుంచి అంకితాలు పొందారు.

బుద్ధప్రసాద్‌గారు మృదుస్వభావి. అజాత శత్రువు. అందరినీ ఎంతో ఆప్యాయంగా పలకరించడం ఆయన నైజం.

అనేక సాంఘిక సేవా కార్యక్రమాలలోను, ప్రవాసాంధ్రుల సేవలోను కూడా చాలా చురుకైన పాత్ర పోషించారు.

తండ్రిగారిలాగే బుద్ధప్రసాద్‌గారు గాంధేయవాది. గాంధీజీ సిద్ధాంతాల పట్ల ఆకర్షించబడి ఆ ఆదర్శాలను ఇప్పటికీ పాటిస్తూనే వున్నారు. ప్రజలందరికీ గాంధీజీ సిద్ధాంతాల పట్ల అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో 'గాంధీక్షేత్రం' పత్రికను నడిపేవారు.

మాకు ఆ పత్రిక పంపుతూ ఉండేవారు.

రాజకీయ రంగానికి వస్తే మూడుసార్లు అవనిగడ్డ నియోజకవర్గం నుంచీ ఎమ్.ఎల్.ఎ. గా ఎన్నికయ్యారు. పశుసంవర్ధక శాఖామాత్యులుగా పనిచేశారు. అధికార భాషాసంఘం అధ్యక్షులుగా పనిచేశారు.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఉపసభాపతిగా విధులు నిర్వహిస్తున్నారు.

నిరాడంబరుడు, నిగర్వి, సౌజన్యమూర్తి, స్నేహశీలి, అత్యంత ఆత్మీయుడు అయిన బుద్ధప్రసాద్ గారికి అప్పుడే అరవై వసంతాలు పూర్తవుతున్నాయంటే ఆయన రెండో బాల్యంలోకి ప్రవేశిస్తున్నట్లే.

అరవై సంవత్సరాలు పూర్తి చేసుకొంటున్న ఈ శుభతరుణంలో –

భగవంతుడు ఆయనకు ఇతోధిక ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించాలని కోరుతూ –

శుభాభినందనలతో...



సినీ నటులు శ్రీ కృష్ణ – శ్రీమతి విజయనిర్మలతో...

నిష్కళంక, నిరాడంబర, అపర గాంధేయవాది

- బి.యస్. రామలింగారెడ్డి

భూతలంపై ఎందరో పుడతారు. ఎందరో గతిస్తారు. అందులో వర్తమాన, భూత, భవిష్యత్ త్రికాలాలందు గుర్తుండే వ్యక్తులు కొందరే కొందరు. ఆ కోవకు చెందిన ఆణిముత్యమే మన శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు. వారు ఎంత ఎదిగిన మానవతామూర్తో అంతే అణుకువ కలిగిన రాజకీయవేత్త. అమ్మ అభివృద్ధికి ఆరాటపడే తెలుగు తేజం.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు 1956 మే 26వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని స్వర్గసీమ అదే దివిసీమలోని నాగాయలంక గ్రామంలో జన్మించారు. వారి అమ్మానాన్నలు పరమపూజ్యులు, తెలుగు సంస్కృతికి నిలువుటద్దంగా నిలిచిన మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు జరుపడానికి కారణభూతులైన పూర్వమంత్రివర్యులు కీ.శే. శ్రీ మండలి వెంకటకృష్ణారావు, శ్రీమతి ప్రభావతి దేవి గార్లు. వీరు ప్రాథమిక, హైస్కూల్ విద్యను అవనిగడ్డలో పూర్తి చేసి, కళాశాల విద్యను హైదరాబాదులో పూర్తి చేశారు.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు 1999, 2004, 2014 సార్వత్రిక ఎన్నికలలో అవనిగడ్డ నియోజక వర్గం నుంచి శాసనసభ్యులుగా ఎన్నికైనారు. 2012-14 సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం అధ్యక్షులుగా పనిచేసారు. 2012లో తిరుపతిలో జరిగిన నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించడానికి కృషి చేసి తండ్రికి తగ్గ తనయుడనిపించుకున్నారు. కార్యాలయాల్లో తెలుగు భాషను బాగా అమలు చేస్తున్న జిల్లాధికారులను, ప్రభుత్వ ఉద్యోగులను ఎంపిక చేసి అవార్డులు ఇచ్చారు. తెలుగు భాషాభివృద్ధి కోసం అంతర్జాలంలో 'యూనికోడ్'ను రూపొందింపజేశారు.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు 1977లో దివిసీమలో సంభవించిన పెనుతుఫాను తాకిడికి లక్షలాది ప్రజలు, పశువులు విగతజీవులు అయినప్పుడు తన తండ్రి గారి స్ఫూర్తితో సహాయ కార్యక్రమాలలో రేయింబవళ్ళు శ్రమించారు. దీనజన సంక్షేమ సమితిని స్థాపించి పెనుబీభత్సంలో అనాథలైన బాలబాలికలను చేరదీసి వారికి ఆశ్రయం కల్పించడమే కాక ప్రకృతి విపత్తులు ఎప్పుడు సంభవించినా ప్రజలతో మమేకమై వారి బాధలను తన బాధగా గుర్తించి సేవలందిస్తున్న మహామనిషి.

తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు శ్రమిస్తున్న మానవతావాది. తెలుగు భాషోద్యమ సమాఖ్య వ్యవస్థాపక సభ్యులలో ఒకరు. అనేక గ్రంథాలను అంకితంగా పొందారు. ఈయన పుస్తక ప్రియులు. అనేక రచనలు గావించి తెలుగు తల్లి పాదాలకు సమర్పిస్తున్న తెలుగు తల్లి పరమ భక్తుడు.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు ప్రవాస తెలుగు వారికి, ఇతర రాష్ట్రాలు, దేశాలలో నివసిస్తున తెలుగు వారితో నిరంతర సంబంధం కలిగి ఉండి, వారి భాషా సాంస్కృతికపరమైన అవసరాలను తీర్చడానికి కృషి చేస్తూ వారధిగా పనిచేస్తున్నారు.

హోసూరుకు గల అనుబంధం :

కీ.శే. కె.ఎస్. కోదండ రామయ్య గారు స్థాపించిన 'హోసూరు తాలూక ఆంధ్రసాంస్కృతిక సమితి' తో ఆయన కాలం నుండే అవినాభావ అనుబంధం కలిగినవారు. చేయీ చేయీ కలిపి తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు దక్షిణ భారత దేశంలో తలమానికమైన సంస్థగా ఆంధ్రసాంస్కృతిక సమితిని అభినందించారు. సమితి వారు నిర్వహిస్తున్న కార్యక్రమాలు, శ్రీకృష్ణ దేవరాయల పట్టాభిషేకోత్సవాలు, అన్నమాచార్య సంగీత కార్యక్రమాలు, ఉగాది ఉత్సవాలు, మహనీయుల, మహాకవుల స్మారకోపన్యాసాలు, అవధానాలు, తెలుగు విద్యార్థులకు పోటీలు, తెలుగు సాహిత్య సాంస్కృతిక పరిరక్షణ కార్యక్రమాలలో పాల్గొని తమిళనాడు తెలుగు వారి అభిమానాలకు పాత్రుడైనారు.

అంతేకాక 'హోసూరు తాలూక ఆంధ్ర సాంస్కృతిక సమితి' నిర్వహిస్తున్న కార్యక్రమాలను గమనించి తమ తండ్రి గారి స్మారకార్థం వారి జయంతిని పురస్కరించుకుని 'శ్రీ మండలి వెంకట కృష్ణారావు' పురస్కారాన్ని ప్రవేశపెట్టి 'హోసూరు తాలూకా ఆంధ్రసాంస్కృతి' సమితికి 2009 ఆగస్టు 4వ తేదీన హైదరాబాదు గవర్నర్ భవనంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ద్వారా ప్రదానం చేశారు.

2014 సార్వత్రిక ఎన్నికలలో అవనిగడ్డ నియోజకవర్గం నుండి తెలుగు దేశం పార్టీ శాసనసభ్యులుగా ఎన్నికై ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నికై పదవిలో కొనసాగుతున్న తెలుగువెలుగు, గాంధేయవాది శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారు.

అతని శ్వాస తెలుగు – రక్తం తెలుగు
అమ్మ నుడి పరిరక్షణే – ఆతని ప్రధాన ధ్యేయం

పెనుగాలి వీచింది – అణగారిపోయింది
నట్టనడి సంద్రాన – నావ నిలుచుండాది
చుక్కాని బట్టరా – తెలుగోడా
నావ దరిజేర్చరా – మొనగాడా!

షష్టిపూర్తి శుభవేళ

- యార్లగడ్డ సోమశేఖర ప్రసాద్ (లంకబాబు)

2016 మే 26 కి 60 సంవత్సరాలు నిండి షష్టిపూర్తి మహోత్సవాన్ని జరుపుకుంటున్న మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు.

మన దివిసీమలో మీరు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఆనందిస్తున్నారు. 2002లో కృష్ణాజిల్లా డెల్టా పరిరక్షణకు నాయకత్వం వహించిన మీ వెంట జిల్లా రైతాంగం ఉద్యమంగా నడిచారు. మీ నాయకత్వ పటిమకు అది గీటురాయి.

60 వసంతాలు నిండిన మీరు మరింత ఉత్సాహంగా పనిచేసి దివిప్రజల మనసులో సుస్థిర స్థానాన్ని పొందగలరని ఆశిస్తాను. ప్రజాసేవకు వయసు అడ్డంకి కారాదు. మీ 'అనుభవం' అమూల్యమైనది. ఆ అనుభవమే అవనిగడ్డ నియోజక వర్గానికి శ్రీరామ రక్షగా ఉంటుంది.

మాన్యశ్రీ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారి నాయకత్వాన మనం కలిసి నడుద్దాం. మన ప్రాంత అభివృద్ధికి ముఖ్యమంత్రి గారి అండదండలతో ముందుకు వెళదాం. అనేక విజయాలు సాధిద్దాం.

షష్టిపూర్తి శుభవేళ మీకు, మీ కుటుంబానికి దేవుని ఆశీస్సులతోపాటు ప్రజల ఆశీర్వాదాలు సర్వదా ఉండాలని కోరుకుంటున్నాను.



'పద్మవిభూషణ్' డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణ, శ్రీ అన్నవరపు రామస్వామిలతో...

నిజాయితీకి పర్యాయపదం

- డా. ఘంటా విజయకుమార్

మండలి బుద్ధప్రసాద్ నిఘంటువులో నిజాయితీకి పర్యాయపదంగా చెప్పాల్సిన ఓ మంచిమనిషి నామధేయం. తెలుగుభాషోద్యమ సైనికునిగా, మన సంస్కృతీ సంప్రదాయాలు, గతం, వర్తమానం, భవిష్యత్తును గురించి అవగాహన కలిగిన ఓ విద్యావేత్త. దార్శనికునిగా బుద్ధప్రసాద్‌ను వర్ణించాల్సి ఉంటుంది. ఆరంభంలోనే ఇలా రాయటం కొంత ఆశ్చర్యంగా మునగచెట్టు ఎక్కించే ప్రయత్నంగా కన్పించినా, పొగడ్తలు ఇష్టంలేని వ్యక్తికి అవి వంటపట్టని అంశాలుగా గమనించాలి. బుద్ధప్రసాద్ షష్ట్యబ్దిపూర్తి ఉత్సవాలను నిర్వహించటంతోపాటుగా, ఓ అభినందన గ్రంథాన్ని బహూకరిస్తున్న 'కిన్నెర' సంస్థలకు కృతజ్ఞతలను ముందుగా తెలుపుతున్నాను.నేను బుద్ధప్రసాద్ నాయకత్వ ప్రస్థానం, రాజకీయాల్లో ఆయనకు ఉన్న సర్వోత్కృష్ట స్థానం గురించో ప్రస్తావించను. అవన్నీ నాకనవసరమయిన విషయాలు. వృత్తి జీవితంలో ఆ రకమయిన మాటలు రాయటం అలవాటయినా, నేను బుద్ధప్రసాద్ మూర్తిమత్వాన్ని, వ్యక్తిత్వాన్ని గురించి మాత్రమే రాస్తాను. ఆయన గురించి లోతుగా వెళ్ళే ముందు నేను ఆయన తండ్రి గౌరవనీయులు, తెలుగుభాషకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకుని వచ్చే ఉద్యమానికి పునాది రాయి అయిన దివంగత మండలి వెంకటకృష్ణారావు గురించి రెండు మాటలు ప్రస్తావిస్తాను. అప్పటికి నా వయస్సు 14 ఏళ్ళు ఉంటాయనుకుంటాను. మంత్రి హోదాలో మండలి వెంకటకృష్ణారావు నందిగామ మండల పరిషత్ కార్యాలయానికి (ఇప్పుడు సమితి కార్యాలయమనుకోండి) వచ్చారు. మా నాన్న ఘంటా సుబ్బారావు ఆయనను కలిసేందుకు వెళ్ళుతూ నన్ను తనతో తీసుకుని వెళ్ళారు. ఆయనను చూస్తునే నాన్న ఏకవచనంతో సంబోధించారు. ఓ మంత్రిని అలా పిలవటం ఆ చిన్నవయస్సులో నాతో సహా అక్కడున్న అందరిలో ఆశ్చర్యాన్ని, కొందరికి చికాకును తెప్పించింది. అక్కడున్న అందరిని పక్కన పెట్టి, ఇప్పటికీ ఆ కార్యాలయానికి సమీపంలో ఉన్న దాసుగారి టీబండి చూపిస్తూ "టీ ఇప్పిస్తావురా....!" అంటూ అడిగారు. నాన్నే స్వయంగా టీ గ్లాసును ఆయనకు అందించారు. నా మనస్సులో ఇప్పటికీ చెరగని జ్ఞాపకమది. ఓ మంత్రి అతి సామాన్య ఖద్దరు దుస్తులు ధరించి, ఓ చిన్ననాటి మిత్రున్ని ఆప్యాయత్తో పలుకరించటం, ముచ్చట తీర్చుకోవటం నేను ఏనాడు మరువలేను. తరువాత తరువాత పరిణామాలు మారాయి.

1993లో అవనిగడ్డ గాంధీక్షేత్రానికి నా పెళ్ళిపరిచయ కార్యక్రమానికి ఆహ్వానిస్తూ కార్డు పంపించాను. అందుకు బదులుగా స్వదస్తూరీతో మండలి బుద్ధప్రసాద్ శుభాకాంక్షలు రాసి పంపించారు. ఇప్పటికి నేను ఆ లేఖను భద్రంగా ఉంచుకున్నాను. అలా లేఖరూపంలోనే మండలి బుద్ధప్రసాద్‌తో పరిచయం ఏర్పడింది. తరువాత ఆయన డీసీసీ అధ్యక్షుడయ్యారు, రాష్ట్రమంత్రి అయ్యారు. అధికార భాషా సంఘం అధ్యక్షునిగా పనిచేసారు. ఇప్పుడు రాష్ట్ర శాసనసభకు ఉపసభాపతి అయ్యారు. ఈ మార్పుల్లో నేను నా చిన్నతనంలో నాన్న బాల్యమిత్రుడిలో ఏ నిరాడంబరత చూసానో అదే లక్షణం కన్పించింది. ఎక్కడా గమనిద్దామన్నా గర్వం ఛాయలు నాకు ఆయనలో కన్పించలేదు. నేటి వారసత్వ రాజకీయాల్లో గతాన్ని

విస్మరించి బంధాలను, అనుబంధాలను తుంచేసుకుని ఎక్కడెక్కడికో ఎదుగుతున్న రాజకీయ నాయకులను చూసాం, చూస్తున్నాము. కానీ నాకు ఆయనలో అలాంటి మార్పు కన్పించలేదు. ఓ ఛానల్ అధిపతి ఆయనతో మౌఖిక సంభాషణ చేస్తూ ఆయన సామాజికవర్గ ప్రస్తావన తెచ్చినప్పుడు చూస్తున్న నాలాంటి వాళ్ళందరికి బాధ కలిగింది. కానీ బుద్ధప్రసాద్ నిర్మొహమాటంగానే బదులిచ్చిన తీరు బహుశా తెలుగు ప్రజలకు ఆయన వ్యక్తిత్వాన్ని బహిర్గతం చేసింది. రాజకీయాలల్లో రాజకీయం లోపించి, సామాజికవర్గ భావన బలపడుతున్న నేటి తరుణంలో బుద్ధప్రసాద్ లాంటి వ్యక్తులు అరుదుగానే ఉంటారు. ఆయనకు సామాజికవర్గ ప్రాధాన్యతలో పదవి రావటం అనేమాట దాదాపుగా కటువుగా అన్పిస్తుంది. గాంధీయిజాన్ని అంటే నిజాన్ని నమ్ముకున్న వ్యక్తులను ఎప్పుడు ఆ దృక్కోణంలో చూడటం అంతమంచిది కాదు. సందర్భం కాకున్నా ఈ వ్యాసంలో నేనీ అభిప్రాయాన్ని వ్యక్తం చేయటం ఖచ్చితమనే అన్పిస్తుంది. అంబేద్కర్ మహాశయుడు ఆశించిన అంతిమమయిన సమాజం కులరహిత సమాజం. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అందుకోసం పరిశ్రమిస్తున్న బుద్ధప్రసాద్ లాంటివారిని సమర్థించటం అవసరం. ఒక సందర్భంలో అప్పటికి బుద్ధప్రసాద్ కాంగ్రెస్‌వాదిగానే ఉన్నారు. బళ్ళారి రాఘవ కళాసమితి (బబ్బేళ్ళపాడు) 50 దశాబ్దాల ఉత్సవం నందిగామలో జరుగుతున్నప్పుడు మండలిని ఉద్దేశించి, "బుద్ధప్రసాద్ ఏ పార్టీలో ఉన్నారనే విషయం కన్నా, ఆయన వ్యక్తిత్వానికే ప్రాధాన్యం ఇవ్వాలి" అంటూ తెలుగుదేశం నేత వర్ల రామయ్య ఆయనకు కితాబునిచ్చారు. అమెరికా దేశంలో తెలుగుభాష ఉన్నతిని వివరించే క్రమంలో ఆయన పర్యటించినప్పుడు ఆయన ఎంతో హుందాగా, సాదాసీదాగా వ్యవహరించిన తీరు..కిందనుంచి అన్ని అవరోధాలను అధిగమిస్తూ ఎదిగిన తన లాంటి వారికి ఓ మార్గనిర్దేశనంగా నిలిచిందని తానా పూర్వాధ్యక్షులు నన్నపనేని మోహన్ అన్నప్పుడు మనస్సు ఉప్పొంగింది. ఇదే మాట మా మేనకోడలు ఉషా మలేషియాలోని తనింటికి ఇటీవల కుటుంబసమేతంగా అతిథ్యం స్వీకరించటానికి ఇంటికి వచ్చినప్పుడు ఆయనలోని నిక్కచ్చితనాన్ని, తగ్గింపు గుణాన్ని వివరిస్తూ 'చిన్న నాన్నను' చూసి చాలా నేర్చుకోవాలి మావయ్య అంటూ ఆనందపడిపోయింది. కృష్ణా డెల్టా పరిరక్షణ ఉద్యమసారథిగా ఆయన కాంగ్రెస్‌వాదిగా సాగించిన ఉద్యమం తనకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని, ప్రత్యేకించి డెల్టా రైతాంగ సమస్యల గురించి అవగాహన కల్పించిందని రాష్ట్ర జలవనరులశాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అంటుంటే గర్వంగా అన్పిస్తుంది. జలవనరుల పరిరక్షణకు భగీరథుని మాదిరిగా పనిచేస్తున్న ఉమా లాంటి వాళ్ళు సైతం మండలిని మార్గదర్శిగా చెప్పటం ఆశ్చర్యమన్పించినా ఆయనకు డెల్టా అభివృద్ధి పట్ల ఉన్న మక్కువను తెలియచేస్తుంది. ప్రత్యేకించి కోస్తా రాస్తా నిర్మాణం వెనుక, పులిగడ్డ–పెనుమూడి వంతెన నిర్మాణాల్లో ఆయన స్వేదజలం ప్రతిరోజు తుషారబిందువయి అలరిస్తూ కన్పిస్తుంది. విజయవాడలో రెండు పర్యాయాలు జరిగిన ప్రపంచ తెలుగు రచయితుల మహాసభలకు మండలి సూత్రధారి. తిరుపతిలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలపైన ఆయన ముద్ర ఉంది. అధికార భాషాసంఘాధ్యక్షునిగా న్యాయవ్యవస్థలో తీర్పులు తెలుగులో వెల్లడి కావటానికి ఆయన చేసి కృషిమరువలేనిది. బుద్ధప్రసాద్ గురించి ఎంతరాసినా రాయాలనే అన్పిస్తుంది. విలువలు కాలరాయబడుతున్న వర్తమానంలో బుద్ధప్రసాద్ మానవీయతకు నిలువుటద్దమై నిలుస్తున్నారు. ఆయన మరిన్ని విజయాలు సాధించాలి. ఎందరికో ఆదర్శనీయమై నిలవాలి.

మానవీయ విలువల మణిపూస

- పావులూరి శ్రీనివాస్

శ్రీ మండలి బుద్ధప్రసాద్ 60 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా అభినందన గ్రంథాన్ని కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ వారు ప్రచురించాలని సంకల్పించడం అభినందనీయం.

ఆరుపదుల జీవనయానంలో ప్రతి వ్యక్తికి ఎన్నో విజయాలు, మలుపులు ఉంటాయి. భావితరాలకు ఇలాంటి వ్యాసాలు ఎంతో స్ఫూర్తినివ్వగలవని నమ్ముతూ వారితో నాకున్న పరిచయం, అనుబంధం, మీకు నా భావాల ద్వారా తెలియజేయాలనుకుంటున్నాను.

దివిసీమ తీవ్రవాద భావాలకు ఆలవాలం. కాని నాగరిక చైతన్యానికి ఆలవాలమైన క్షేత్రం అవనిగడ్డలోని గాంధీక్షేత్రం. మంగళకరమైన మానవజాతి అభ్యుదయం కోసం ఆలోచనాత్మకమైన అడుగులు వేసేది అవనిగడ్డ ప్రాంతం. ఆ ప్రాంతంలో తాము జీవిస్తున్న సమాజం ఉన్నత స్థితికి చేరాలని తపించే కుటుంబం మండలి వారిది.

తాత శ్రీ మండలి వెంకట్రామయ్య అడుగుజాడలలో, తండ్రి వెంకట కృష్ణారావు గారి మార్గ నిర్దేశకత్వంలో దివిసీమలో అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఓర్పుగా నేర్పుతో ముందుకు సాగుతున్న శ్రీ మండలి బుద్ధప్రసాద్ రాష్ట్ర వ్యాప్తంగా మంచి పేరును రాజకీయాలకు అతీతంగా పొందటం గర్వించదగిన పరిణామం.

తొలినాళ్లలో డా. వెలగా వెంకటప్పయ్య గారి ద్వారా వీరితో నాకు ప్రత్యక్ష పరిచయం కలిగింది. అప్పటి నుంచి అనేక కార్యక్రమాలలో నన్ను ముందుకు నడిపిస్తూ అనేక సలహాలిస్తూ నా జీవన బాటకు దోహదపడిన వారిలో ముఖ్యులయ్యారు బుద్ధప్రసాద్‌గారు. గాంధీ విధానాలను నమ్ముతూ వీరి కుటుంబంలోని వారంతా సామాన్యంగా గడుపుతూ ఆడంబరాలకు పోకుండా విలువలకు ప్రాధాన్యమివ్వడం ముదావహం. తన రాజకీయ జీవితాన్ని అత్యంత సాధారణంగా ఎంతో సహనంతో వివాదలకు తావు లేకుండా ఆదర్శవంతమైన విలువలతో అవసరమైతే శత్రువులను సైతం మిత్రులుగా మార్చుకొనటంలో ఆయన చూపించిన నైపుణ్యం ఆయనను రాజకీయ నేతగా కాకుండా మానవీయ విలువలను కాపాడే మహా నేతగా అత్యున్నత శిఖరాలపై నిలిపింది. వారు సేకరించిన అనేక వేల గ్రంథాలు గాంధీక్షేత్రం గ్రంథాలయంలో ఉండటం వారి ప్రజ్ఞా పాటవాలకు తార్కాణం.


తెలుగుభాషా సంస్కృతి పట్ల ఆయనకున్న అపార అనుభవంతో తెలుగు ప్రాచీన హోదా సాధించేందుకు దోహదపడిందని నా నమ్మకం. ప్రతి తెలుగు వాడు వీరిని మర్చిపోకుండా ఉండలేరు. మన సంప్రదాయాలన్నా, సంస్కృతి అన్నా, కళలన్నా ఎంతో ఇష్టపడే బుద్ధప్రసాద్ వాటి పరిరక్షణకు కంకణం కట్టుకున్న ధీశాలి. తల్లిదండ్రులు నిరాదరణకు గురి కాకుండా చూడాలి అనే తపనతో నేను పావులూరి ట్రస్ట్

స్థాపించి వారిని ఆహ్వానిస్తే నిరాడంబరంగా పాల్గొని నాకెంతో మద్దతిచ్చారు. నేను ఏ కార్యక్రమం చేపట్టినా భుజం తట్టి ప్రోత్సహించే వ్యక్తిత్వం ఉన్న బుద్ధప్రసాద్ గార్కి నేనెంతో ఋణపడి ఉంటాను.

జీవితం అనేది భగవంతుడు మనకు ప్రసాదించిన గొప్ప వరం. దాన్ని ఇతరులకు పంచి ఇచ్చినప్పుడే మనకు స్వంతం అవుతుంది. ఈ స్ఫూర్తి ప్రేరణతోనే రాజకీయ విలువల సిద్ధాంతాన్ని త్రికరణ శుద్ధిగా నమ్మిన మన మండలి బుద్ధప్రసాద్ గారు అనేక రంగాలలో కృషి చేస్తూ రాణిస్తున్నారు.

జీవితాన్ని మహోత్కృష్ట కళాఖండంగా మలుచుకునే స్వభావం, ప్రక్రియ కొందరికే ఉంటుంది. ఈ ప్రక్రియ ద్వారా మనిషి విలువలకు ప్రాధాన్యమిస్తాడు. అటువంటి బుద్ధప్రసాద్ ఎంతో మంది గుండెల్లో స్నేహ దీపం వెలిగించి ఎదుటివారి వద్ద ప్రతిభను, కొంత సౌరభాలను వెలికితీసి సమాజానికి అందించే పుణ్యమూర్తి శ్రీ బుద్ధప్రసాద్‌గారు నిండు నూరేళ్ళు ఆరోగ్యంగా, ఆనందంగా, సమాజహితంగా ముందుకు పయనించాలని భగవంతుని ప్రార్థిస్తూ...

నిస్వార్థంగా ప్రజలకు సేవలందించి, ప్రజలకోసం జీవించే నాయకులు ప్రజల హృదయాలలో నిలుస్తారని బుద్ధప్రసాద్ గారి ద్వారా నిరూపణ అయ్యింది. అందుకే 2014 సార్వత్రిక ఎన్నికలలో అవనిగడ్డలో విజయఢంకా మోగించి డిప్యూటీ స్పీకర్ పదవి అధిష్ఠించడం వారికున్న యోగ్యతకు తార్కాణం. పదవి ఉన్నా లేకపోయినా ప్రజా సేవే లక్ష్యంగా పనిచేసే బుద్ధప్రసాద్ గారు ప్రాంతాలకు, కులాలకు, రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ బుద్ధప్రసాద్ పేరిట షష్ట్యబ్ది సంచిక విడుదల సందర్భంగా నా శుభాకాంక్షలు అందజేస్తున్నాను.



అమెరికాలో 'వారధి' సంస్థ తరపున మేరీలాండ్ శాసనసభ్యురాలు శ్రీమతి అరుణా మిల్లర్ సత్కారం

బుధజన సేవితుడు

- సాధన నరసింహాచార్య

తెలుగుభాషా భగీరథునిగా, తెలుగు సాంస్కృతిక వికాస వైతాళికునిగా, తెలుగు భాషా పరిరక్షణే ఊపిరిగా, యదార్థ గాంధేయవాదిగా భాషాభిమానుల హృదయాలలో చిరస్థాయిగా నిల్చిపోయే వ్యక్తి మన బుద్ధప్రసాద్ గారు.

కమండలం లేని 'కర్మయోగి'లా నాటితరానికి కీ.శే. మండలి వేంకట కృష్ణారావు గారు స్ఫూర్తినిచ్చిన వారైతే, అదేబాటలో పయనిస్తూ, ఆ వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని, ఆ మహనీయుని ఆశయాలను సతతం స్మరిస్తూ, ఆచరిస్తున్న ధర్మయోగి మన బుద్ధప్రసాద్‌గారు.

తొలి ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణలో నాడు మండలి వేంకట కృష్ణారావు గారు ప్రధాన భూమిక వహించారు. అదే పరంపరలో భాగమా! అన్నట్లు ఇటీవలే జరిగిన 4వ ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణలో బుద్ధప్రసాద్ గారి ముద్ర స్పష్టంగా అగుపించింది.

నాటి ప్రభుత్వం నిర్వహించిన శ్రీకృష్ణదేవరాయల పంచశతాబ్ద ఉత్సవాలు, కూచిపూడి నృత్యోత్సవాలే కాకుండా తెలుగు భాషా సంస్కృతులకు చెందిన ఎన్నో మహోత్సవాలు బుద్ధప్రసాద్ గారి అండదండలతో జయప్రదంగా నిర్వహించబడ్డాయి అనడం అతిశయోక్తి కాదు.

ప్రపంచ తెలుగు మహాసభలలో, శ్రీకృష్ణదేవరాయ పంచశతాబ్ది ఉత్సవాలలో ఇతర భాషా మహోత్సవాలలో వారి నేతృత్వంలో పనిచేయడం మా అదృష్టం. మా సాధన సాహితీ స్రవంతి నిర్వహించే 'పద్యసాధన' 'తెలుగుతోట' కార్యక్రమాలలో వారిస్తున్న ఉత్సాహ, ప్రోత్సాహాలు ఎన్నటికీ మరువలేనివి.

ముఖ్యంగా స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ మాదల వీరభద్రరావు స్మారక పురస్కార ప్రదానోత్సవంలో వారు క్రమం తప్పకుండా పాల్గొంటూ, మాదలవారి పట్ల వారికి గల అభిమానం, మా పట్ల వాత్సల్యాన్ని ప్రదర్శించడం మాకు ఆనందదాయకం.

స్వాతంత్ర్య సమరయోధులు కీ.శే. వావిలాల, మాదల వీరభద్రరావు, డా. పి. తిరుమలరావు, కోదాటి నారాయణరావు, మూర్తిరాజు, ఎం.ఎస్. రాజలింగం వంటి మహనీయులచే అన్ని తరాలకు ఉపయోగపడే గ్రంథాలను రచింపచేయడంలో బుద్ధప్రసాద్ గారు ఎనలేని కృషి చేశారు.

అవనిగడ్డలో 'గాంధీక్షేత్రం' పేరిట గ్రంథాలయాన్ని, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ మూర్తిరాజు గారి అడుగుజాడలలో నడుస్తున్నామని ప్రకటించడం వారి వినయవిధేయతలకు తార్కాణం. మందస్మిత వదనంతో, మొక్కవోని పట్టుదలతో, చెదరని విశ్వాసంతో సత్కార్యాలు నిర్వహిస్తున్నవారు, నేటి తరానికి ఆదర్శప్రాయం.

ప్రాంతాలు వేరైనా, భాషా ఒక్కటే, సంస్కృతి ఒక్కటే. కవులకు, కళాకారులకు, ఎల్లలు లేవని విశ్వసించి తెలుగు భాషావికాసానికి వారు చేస్తున్న కృషి నిత్యస్మరణీయం.

వారు శతవసంతాలు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో విలసిల్లాలని, వారి నేతృత్వంలో మనం మరెన్నో భాషా వికాస కార్యక్రమాలు చేయగలమన్న విశ్వాసంతో వారికి షష్టిపూర్తి శుభాభివందనములు సమర్పిస్తూ....

బుధ జన హృదయ సభాపతి

- గబ్బిట దుర్గాప్రసాద్

విలక్షణ విశిష్ట వ్యక్తిత్వం

ఆయనదొక విచిత్ర చైతన్యం. తాను పెద్దల వద్ద గ్రహించిన విషయ సారాన్ని జనసామాన్యానికి అందించాలన్న తపన, ఆ పెద్దలను విశాల వేదికలపై సత్కరించి ఋణం తీర్చుకోవాలన్న ధ్యేయం. మంచి ఎక్కడున్నా సంగ్రహించి భావితరాలను ఉత్తేజితులను చేయాలన్న ఆలోచన, పాతది తీసి పారేసేది, కొత్తది అమాంతంగా కౌగలించుకొనేది కాదన్న సమతుల్యత, తరతరాల భారతజాతి అన్ని రంగాలలో సాధించిన ప్రగతి నవ నాగరికతా వ్యామోహంలో అధోగతి కాకూడదన్న ఆవేదన, తెలుగు భాషాసాహిత్య, చరిత్ర, సంస్కృతులను మనం కాపాడుకొంటూ ముందు తరాలవారికి అందిస్తూ సాగాలనే సత్సంకల్పం, వెనుకపడిపోతున్న తెలుగును, దాని వెలుగులను తెలుసుకోలేని ఆధునికులను గమనించి తెలుగును శాస్త్రీయత సాంకేతికతలతో పరిపుష్టిచేసి 'యూనికోడ్'లను సాధింపజేసి యువకులను ఆకర్షించాలన్న పట్టుదల, ఏ వేదికమీదైనా వీటినే ప్రస్తావించి, బుద్ధిజీవులను, యువతను, సామాన్యులను, మహిళలను చైతన్యవంతులను చేస్తున్న ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఉప సభాపతి మాన్యశ్రీ మండలి బుద్ధప్రసాద్ నిజంగానే 'బుధ జన హృదయ సభాపతి'. వ్యక్తిగా, శాసనసభ్యునిగా, అధికార భాషా సంఘ అధ్యక్షునిగా, మంత్రిగా, ఉపసభాపతిగా ఏ హోదాలో ఉన్నా ఆయన తెలుగు భాష సంస్కృతుల కోసం, భారతదేశ సమగ్రత కోసం అహరహం శ్రమిస్తున్న అలసట ఎరుగని ఉత్సాహ శీలి, సాటి శాసన సభ్యులకు, మంత్రులకూ, రాజకీయ నాయకులకూ పట్టని ఈ విషయాలపై జనానికి తన రుజు ప్రవర్తన, శాంత స్వభావం, భేషజం లేని వ్యక్తిత్వం, కలుపుగోలుతనం, అవగాహనా చాతుర్యాలతో, విజన్‌తో ప్రేరణ కలిగిస్తున్న ఏకైక విశిష్ట వ్యక్తి, మహా మనీషి.

క్రియా కార్యశీలి

భాషా సాహిత్యాలతో పాటు మనదే అయిన సంగీత, నాటక, చిత్ర, శిల్ప, కళారంగాలనూ పరిపుష్టం చేసుకోవాలని, వీటి అభివృద్ధికోసం మళ్ళీ ఎకాడమీలను పునరుద్ధరించాలని నినదిస్తూ, ప్రభుత్వానికి తెలియబరుస్తూ జాగృతి కలిగిస్తూ మాటలతో కాక చేతలతో చేసి చూపిస్తున్న చాతుర్యం శ్రీ బుద్ధ ప్రసాద్‌ది. కూచిపూడి కళా కేంద్రాభివృద్ధి, హంసలదీవి పర్యాటకాభివృద్ధి, ఘంటసాల బౌద్ధస్తూప పరిరక్షణ, శ్రీకాకుళంలో శ్రీ కృష్ణదేవరాయల, కాసుల పురుషోత్తమ కవి మొదలైన విగ్రహాల స్థాపన, శ్రీకృష్ణదేవరాయ ఉత్సవాలు, కృష్ణామహోత్సవాలు, దివిసీమ ఉత్సవాలు, బందరు కోట ప్రాచీన వైభవం, కృష్ణా జిల్లా సర్వస్వం వంటివి ఆయన ఆలోచనా విధానానికి, కళా వికసన ప్రాభవ చైతన్యానికి నిదర్శనలు.

చోదక ప్రేర మార్గదర్శి

తెలుగు భాషాసాహిత్యాలను తెలుగు దేశంలో కాపాడుకోవటానికి, ప్రజాచైతన్యాన్ని కల్గించటానికి భాషా సంఘాలతో కలిసి ఉద్యమించి తెలుగుకు ప్రాచీన హోదా సాధించి ప్రజాబలాన్ని ప్రభుత్వానికి

తెలియబరచినవారు శ్రీ ప్రసాద్. మన రాష్ట్రంలోనే కాక భారతదేశంలో అనేక రాష్ట్రాలలో ఉన్న తెలుగువారు ఎదుర్కొంటున్న కష్టాలను, అక్కడి ప్రభుత్వాలు తెలుగుకు చేస్తున్న చేటును గుర్తించటానికి ఆయా రాష్ట్రాలలో విస్తృతంగా పర్యటించి, అక్కడి ప్రభుత్వాలను కదిలించి, తెలుగుకు, తెలుగు ప్రజలకు మేలు చేయటంలో మార్గదర్శిగా ఉన్నారు. ముఖ్యంగా తమిళనాడులోని హోసూరు తెలుగువారిని, ఒడిస్సాలోను, మహారాష్ట్ర, కన్నడ రాష్ట్రాల తెలుగు వారినీ ఇక్కడ జరిగే సభలకు ఆహ్వానించి, వారి నోట వారెదుర్కొనే ఇబ్బందులను, సమస్యలను చెప్పించి, మనవంతు సాయమందించే సంకల్పంతో వారికి ఊరట కల్పించటంలో శ్రీ బుద్ధప్రసాద్ చూపించిన చొరవ నిరుపమానం.

సంస్కార మూర్తి

అమెరికా, కెనడా, మారిషస్, ఇంగ్లాండ్ మొదలైన దేశాలలో తెలుగు సభలలో పాల్గొని, వారితో మమేకమై, వారు మన భాషా సాహిత్య సాంప్రదాయాలను పరిరక్షించుకొంటున్న తీరు చూసి ఉప్పొంగి పోయి అలాంటి చైతన్యం ఇక్కడ కూడా రావాలని ఉద్బోధించిన సాహసి శ్రీ బుద్ధప్రసాద్. ఎవరో ఏదో అనుకొంటారనే సందేహం, మొహమాటం లేకుండా మనం వెనకబడి పోతున్నామనే ఆవేదనతో ఆయన చేసే ప్రసంగాలు స్ఫూర్తిమంతాలై కర్తవ్య నిర్వహణకు మార్గదర్శకాలయ్యాయి. ఇది ఆయన సాధించిన అద్భుత విజయం. ఆయనకు మాత్రమే సాధ్యమైన విషయం కూడా. మాట్లాడే ప్రతిమాటలో సంస్కారం ఉట్టిపడి మనం ఏమిటో మనకు ఎరుక కలిగిస్తుంది. ఇంగ్లాండ్‌లో తెలుగు సాహితీ సేవ చేస్తున్న జ్ఞాన వృద్ధులు శ్రీ గూటాల కృష్ణమూర్తి గారిని, మలేషియాలో శ్రీ మదిని సోమనాయుడు గారిని, ఫ్రాన్స్‌కు చెందిన శ్రీ డేనియల్ నేగెర్స్ మొదలైన భాషా సాంస్కృతిక సేవాపరాయణులను కలిసి, కృష్ణా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన జాతీయ, ప్రపంచ తెలుగు రచయితల మహా సభలలో వారితో స్ఫూర్తి పూర్వక ప్రసంగాలు చేయించి, ఆ సభలను నభూతోగా నిర్వహించి ప్రపంచ వ్యాప్త ప్రశంసలను అందుకొనేట్లు చేయటంలో ప్రధాన సారథి శ్రీ బుద్ధప్రసాద్. ఊరికే వేదికలపై ఉపన్యాసాలిస్తే అనుకొన్నది సాధించలేమని, అవన్నీ అక్షరబద్ధమై తరతరాలకు వెలుగుల నివ్వాలని, 'ఆచూకీ పుస్తకాలు'గా, 'కరదీపికలు'గా నిలిచిపోవాలని భావించి 'తెలుగు పసిడి', 'వజ్ర భారతి', 'కృష్ణా జిల్లా సర్వస్వం', 'తెలుగుభారతి' 'మణిదీపాలు' వంటి అత్యుత్తమ గ్రంథ ప్రచురణ చేయించిన క్రాంతదర్శి. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రభుత్వాన్ని ఒప్పించి వారి సహాయ సహకారాలు అందేట్లు చేసి సభలను దిగ్విజయం చేయించిన ఘనత శ్రీ బుద్ధప్రసాద్ గారిదే. ఈ విజయాలలో భాగస్వామ్యులు కృష్ణాజిల్లా రచయితల సంఘ అధ్యక్ష కార్యదర్శులైన శ్రీ గుత్తికొండ సుబ్బారావు, డా. జి.వి. పూర్ణచంద్, శ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌లు అనటంలో సందేహం లేదు. అంతటి దార్శనికులు శ్రీ బుద్ధప్రసాద్. ప్రభుత్వ సంస్థలలో, న్యాయస్థానాలలో తెలుగును వాడటంపై దీక్షగా కృషి చేసి విజయం సాధించారు. సమస్య మూలాలను తరచి పరిష్కరించే నేర్పున్న వారాయన.

సుజన జన మనోరంజనం

కృష్ణా జిల్లాలోను, ఇతర జిల్లాలలోను, రాష్ట్ర, రాష్ట్రేతరంగాను ఉన్న సాహిత్య, సాంస్కృతిక సంస్థలతో, అక్కడి కవులు, రచయితలు, పురాతత్వ వేత్తలు, చిత్రకారులు, నటులు, సంగీతజ్ఞులు, విమర్శక విశ్లేషకులతో, ప్రయోగశీలురతో నిత్యం సంబంధాలను కలిగి వారి సభలలో పాల్గొని, పుస్తకావిష్కరణలు ఇబ్బడి

ముబ్బడిగా చేసి యువతను ప్రోత్సహించి, బుద్ధిజీవులను సత్కరిస్తూ, అన్ని సాహిత్య ప్రక్రియలకూ చేయూత నిస్తూ 'భువన విజయ రాయలు'గా ప్రేరణనిస్తూ నిత్య చైతన్య శీలిగా, నిర్విరామ భాషా సాహిత్య కళారాధక సేవకునిగా, తండ్రి స్వర్గీయ శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారి వారసునిగా జీవితాన్ని ధన్యం చేసుకొంటున్నారు.

సరసభారతితో సాన్నిహిత్యం

శ్రీబుద్ధప్రసాద్ గారితో నాకు 30 ఏళ్ళుగా పరిచయం ఉంది. ఆయనంటే నాకు గొప్ప అభిమానం. రాజకీయ నాయకులు అందరూ ఆయనలాగే ఉంటే, ఆలోచిస్తే, నడిస్తే ఎంత బాగుంటుంది అనిపిస్తుంది. కృష్ణాజిల్లా ఉయ్యూరులో నా ఆధ్వర్యంలో 'సరస భారతి' అనే సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఆరేళ్ళ క్రితం ఏర్పడి 20 గ్రంథాలను ప్రచురించింది. అందులో నేను రాసినవి 13 పుస్తకాలున్నాయి. 'సరస భారతి' నిర్వహించే ఉగాది వేడుకలకు, భాషా సదస్సులకు, పుస్తకావిష్కరణలకు, కథాసదస్సు, గురజాడ, రవీంద్రుల 150వ జయంతి ఉత్సవాలకు శ్రీ ప్రసాద్ విచ్చేసి నిండుదనం తెచ్చి చైతన్య స్ఫూర్తి కలిగించారు. కనిపించగానే నమస్కరిస్తూ "దుర్గాప్రసాద్ గారూ బాగున్నారా?" అంటూ ఆప్యాయంగా పలుకరించే సంస్కారం ఆయనది. ఏ పదవిలో ఉన్నా ఈ తీరులో మార్పు లేదు. సభలలో అధికార దర్జా డాబూ దర్పాలూ ప్రదర్శించని అతి వినయ శీలి, సౌజన్యమూర్తి.

ప్రతిభా పురస్కారాలు

శ్రీ బుద్ధప్రసాద్ రాష్ట్ర, రాష్ట్రేతరాలలో తెలుగు భాషా సంస్కృతులకు విశేష సేవలందిస్తున్న ఉత్తమ సంస్థను నిష్పక్ష పాతంగా ఎంపిక చేసి తమ తండ్రిగారి జయంతి ఆగస్ట్ 4న 'మండలి వెంకట కృష్ణారావు' స్మారక పురస్కారాన్ని స్వంత ఖర్చులతో శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ద్వారాను, తెలుగు భాషా సేవ చేస్తున్న విశిష్ట వ్యక్తికి, కృష్ణాజిల్లా రచయితల సంఘం ద్వారానూ తమ తండ్రిగారి పేర నగదు పురస్కారాన్ని అందజేస్తూ అందరికీ ఆదర్శప్రాయంగా ఉన్నారు. 'క్రీం ఆఫ్ ఇంటిలిజెన్స్' అంటే 'ప్రతిభా నవనీతం' ఎక్కడున్నా గుర్తించి వారి సేవలను సభాముఖంగా అందరికీ తెలియజేసే ప్రేరణ కలిగించటం ఆయనకే సాధ్యం. ఇక్కడ కుల, మత, జాతి, ప్రాంత సంకుచిత భావాలకు తావే లేదు. ప్రతిభకే పట్టాభిషేకం. ఇది అందరికీ సాధ్యం కాని విషయం. ఆయనకే సాధ్యమై, చిరయశస్సుకు కారణమైంది. అందుకే ఆయన విశ్వమానవుడు. "ఉదార చరితానాం వసుధైక కుటుంబకం" అన్నది ఆయన పట్ల సార్ధకమైనది.

అభినవ కృష్ణరాయలు

తెలుగు సాహిత్యంలో శ్రీ బుద్ధ ప్రసాద్ చదవని గ్రంథం లేదేమో? అనుక్షణ పఠనం ఆయన కిష్టం. చదివింది మనసు పొరల్లో ముద్ర పడి ఉండటం ఆయన ప్రత్యేకత. The book is one which will serve to open the eyes even of those who are blind to the sufferings of those around them అని జస్టిస్ శ్రీ అల్లాడి కుప్పుస్వామి రావూరి భరద్వాజ గారి 'జీవన సమరం'పై రాసింది ఆచరణీయం చేశారు. చదవటం, చదివించటంతో పాటు గొప్ప రచనలూ చేశారు. భాషా సంస్కృతులపైనా, తన విదేశీ యాత్రానుభవాలపైనా పుస్తకాలు రాసి ప్రచురించి సమకాలీనులకు, భావితరాలకు ఉత్తేజం కలిగించారు.

లెక్కలేనన్ని గ్రంథాలను అభిమానంతో అంకితం పొందిన 'అభినవ కృష్ణ రాయలు' శ్రీ బుద్ధప్రసాద్. వేలాది విలువైన గ్రంథాలను కొని, సేకరించి స్వంత గ్రంథాలయంలో భద్రపరచిన పుస్తక ప్రియులాయన.

మూర్తిమత్వం

ప్రశాంత వదనం, చెదరని నవ్వు, ఆయన అంతర్యంలాగానే తెల్లని స్వచ్ఛమైన ఖాదీ వస్త్రధారణ, సాంప్రదాయక నడవడి, ప్రాచీన ఆర్వాచీన సాహిత్యంపై సరి సమాన ఆదరణ, ధార్మిక జీవనం, ఆధ్యాత్మిక ఉన్నతి, రుజు ప్రవర్తనం, సాంఘిక సేవ, 'బహుజన హితాయచ బహుజన సుఖాయచ' అన్న ఆదర్శం, అట్టడుగు వర్గాలతో సహా సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధి కోసం శ్రమించే నిండైన విశాల హృదయం, మచ్చలేని నిజాయితీ, విలువలతో కూడిన ప్రవర్తన, సౌజన్యం, స్నేహశీలత, నిష్కళంక నిరాడంబర జీవితం వలన అందరికీ శ్రీ బుద్ధప్రసాద్ దగ్గరయ్యారు. ఆయనతో మాట్లాడటం అంటే ఒక విజ్ఞాన సర్వస్వంలోకి ప్రవేశించటమే. మాట్లాడిన తర్వాత ఆ ప్రభావం గాఢంగా మనసుపై పడి ప్రచోదనం చేస్తుంది. 'ముఖంలో తేజస్సు, హృదయంలో ఉత్సాహం, నిరంతర కార్యతత్పరత సత్వ గుణ లక్షణం' అన్నారు స్వామివివేకానంద. అలాంటి సత్వ గుణ సంపన్నులు శ్రీ బుద్ధప్రసాద్.

మానవీయతకు ఎత్తిన పతాక

'సంకుచితమైన జాతి మతాల సరిహద్దుల్ని చెరిపి వేస్తున్నాను చూడు – అకుంఠితమైన మానవీయ పతాకను ఎగుర వేస్తున్నాను చూడు' అన్న అనుభూతి కవి 'తిలక్' మాటలకు ఆచరణ రూపం కావటం వలననే శ్రీ బుద్ధప్రసాద్‌ను పదవులు వరించాయి. ఆయనవలననే ఆ పదవులు సార్థకమై అలంకారం, గౌరవం పొందాయి. 'క్రుణ్వంతు విశ్వం ఆర్యం' ఈ విశ్వాన్ని ఆర్యమయంగా అంటే సత్పురుషులుగా చేస్తాము అన్నది ఋగ్వేదం. అలాంటి ఆదర్శ పురుషుడు శ్రీ బుద్ధప్రసాద్. బుద్ధ భగవానుడు కూడా 'సమాధిః ఆర్యాణాం ధ్వజా – ప్రజ్ఞా ఆర్యాణాం ధ్వజా ముక్తిం ఆర్యాణాం ధ్వజా' అని సర్వమానవ సమత్వాన్ని సమాదరించాడు. అదే ఈ 'బుద్ధుని' పద్ధతి కూడా.

మూలాల విలువల పరిరక్షణం

పాశ్చాత్య వ్యామోహం పనికి రాదనీ, పక్షి యెంత దూరం సముద్రంపై ప్రయాణం చేసినా చివరికి తన గూటికే చేరుతుందని కవిసామ్రాట్ విశ్వనాథ చెప్పిన విషయాన్ని పదే పదే గుర్తు చేస్తారు శ్రీ బుద్ధప్రసాద్. మన భాషా చరిత్ర సంస్కృతులను పరిపోషించుకొంటూ యువత ముందుకు సాగాలని ఆయన ఉద్బోధ. మన ఉపనిషత్తులు పారమార్థిక హిమాలయాలని, మన సంస్కృతిని పోషించే పావనోదకాలని చెప్పిన పండిట్ నెహ్రూ వాక్కులను మర్చి పోరాదని మరచిపోతే భారతదేశం భారత దేశం అనిపించుకోదని చేసిన హెచ్చరికను అనుసరించి, ఆచరింపజేస్తారు. 'Western civilization makes for material progress but Indian civilization makes for spiritual understanding' అన్న విషయం నరనరాల్లో ఉండాలని కోరుకుంటారు. ప్రాచీన సంప్రదాయం, పారమార్థక దృక్పథం, ఆధునిక శాస్త్ర సాంకేతిక సగుణ ఫలితాలు మానవ భవితకు పునాదులు అని ఆయన నమ్మారు. అలానే ఆచరిస్తున్నారు. పూర్వ సాహిత్యంపైనా ఆకవుల, రచయితల పైనా

ఆరాధనా భావంతో పాటు నవీన సాహిత్య సృజనపైనా అపారమైన ఆపేక్ష ఉన్నవారు. మొదటి దాని భూమికపై రెండవది వృద్ధి చెందాలని కోరుకొంటారు శ్రీ బుద్ధప్రసాద్.

ప్రబుద్ధ చేతుడు

సమకాలీన సమాజంలో శ్రీ బుద్ధప్రసాద్‌ను 'ప్రబుద్ధ చేతుడు' అంటే బుద్ధివైభవాన్ని తెలుసుకొనేవారికి బుద్ధిని ప్రదానం చేసేవాడు అనవచ్చు. అందుకే సాహిత్య శిఖరారోహణం చేసినవారు, సంఘంలో అధికారంలోనూ, విశిష్ట పదవులలోనూ ఉత్కృష్ట స్థానాలలో ఉన్నవారు, యువకులు అందరూ శ్రీ బుద్ధప్రసాద్‌కు ఆత్మీయులే. ఆయన వలన ప్రేరణ పొంది, తమ సామాజిక బాధ్యతను గుర్తించి నడిచేవారే. వారందరి మధ్య సాహిత్య, సంగీత, సామాజిక, కళావిద్య, శాస్త్రసాంకేతిక విషయాలు చర్చిస్తూ దిశానిర్దేశం చేస్తూ, స్ఫూర్తి, ప్రేరణనిచ్చే ఉదాత్త పురుషుడు శ్రీ బుద్ధప్రసాద్. ఎవరు చెప్పినా ఓపికగా విని అర్థం చేసుకొని ఆచరణలో పెట్టటం ఆయన కిష్టం. గొప్ప ప్రజాస్వామ్య వాది. గాంధేయ విధానంలో, అహింసా మార్గంలో ప్రగతి సాధించాలన్న ధ్యేయం ఉన్నవారు.. అజాత శత్రువు. అందరివాడు. అందలాలకు అర్హమైన వాడు.

మహత్తర కానుక

"ధర్మ రక్షణ ప్రేమ తత్వాల నెరిగించు – పోతనాది సుకవి పుంగవులను
స్వరయుత గాన మొసగు త్యాగ రాజాది – లలిత సంగీత కళా నిధులను
బండ రాళ్ళకు ఉలితో ప్రాణంబు పోసిన – శేముషీ ధనులైన శిల్ప వరుల
అవని పేరున్న నాట్యాచార్య వరులైన – కూచిపూడిని నృత్య కోవిదులను
హస్త కళలందు నిష్ణాతు లైన వారి – ఆంధ్రమన్న పూర్ణగ జేయునట్టి వారి
దేశ సేవా దురంధరుల్ ధీనిధులను – కన్న తెల్గు తల్లికి నమస్కార శతము"

అన్న ఆంధ్ర కవి వాక్కు అమోఘం. అలాంటి తెలుగు తల్లి ముద్దు బిడ్డడు, 'దివిసీమ రాయలు', సేవా తత్పరులు, విద్యా వినయ సంపన్నులు, అనునిత్య సరస్వతీ సమార్చకులు. శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి సార్థక జీవనంతో అరవై ఏళ్ళు నిండిన సందర్భంగా కిన్నెర ఆర్ట్ అకాడెమి కార్యదర్శి శ్రీ మద్దాళి రఘురాం గారి ఆధ్వర్యంలో 'షష్ట్యబ్దిపూర్తి అభినందన గ్రంథం' ప్రచురించి బహూకరించటం అభినందనీయం. ఎక్కడెక్కడ ఉన్నా తెలుగు వారందరికీ గర్వకారణం, అత్యంత సంతోషదాయకం. తెలుగు సరస్వతికి అమూల్యాభరణం. మహత్తర కానుక. ఆయురారోగ్యాలతో మరింత ఉన్నత పదవులలో రాణిస్తూ, ప్రజాసేవలో తరిస్తూ, తెలుగు చరిత్ర, భాషా సాహిత్య, సంస్కృతులకు ఇతోధిక సేవ చేసేలా శతాధిక ఆయుష్షును ఆ భగవంతుడు శ్రీ బుద్ధప్రసాద్ గారికి ప్రసాదించాలని మనసారా కోరుకుంటున్నాను.

మనసున్న మనిషికి అరవై వసంతాలు

- అమ్మ కొండవీటి జ్యోతిర్మయి

తెలుగు సుగంధాలను ప్రపంచవ్యాప్తంగా వెదజల్లుతున్న మహా మనిషి మా తెలుగింటి వెలుగు గౌరవనీయులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి 60 వసంతాల శుభాకాంక్షలు.

మంచికి మార్గదర్శిగా, తెలుగు ప్రజలకు ఆత్మీయుడుగా, భాషా సంస్కృతీ కళల పట్ల చక్కని పూజనీయ భావం గల అరుదైన మాన్యులు వీరు. తండ్రి వారసత్వం, తల్లి లాలిత్యం కలబోసుకున్న తెలుగింటి ముద్దుబిడ్డను, ఆ జిల్లా ప్రజలు నేటికీ ఆదరిస్తున్నారు అంటే కారణం, ఆయనకు ప్రజలకు మధ్య ఉన్న అపార అనుబంధమే. శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారిని నేను ఏనాడు రాజకీయ నాయకులుగా చూడలేదు. మా ఇంట మా మనిషిగా మాత్రమే చూస్తున్నాను. దానికి ఆయన ప్రజల పట్ల చూపుతున్న ప్రేమయే.

చరిత్రలో చాలామంది పుడతారు, గిడతారు కాని ప్రజలకోసం, వారి బాగుకోసం తపించే వారిని మాత్రమే చరిత్ర గుర్తు పెట్టుకుంటుంది. అలా నేటి రాజకీయ నాయకులకు భిన్నంగా చరిత్రలో తనకంటూ ఒక పేజీని సృష్టించుకున్న మంచి 'మనిషి' మా బుద్ధప్రసాద్ గారు. వారు ఇలానే స్వామి ఆశీస్సులతో వంద వసంతాలు జరుపుకోవాలని, వారి సేవలను మరింతగా తెలుగు ప్రజలు అందుకోవాలని మనసా, వాచా, కర్మణా భగవంతుని ప్రార్థిస్తూ...

ప్రేమతో -



శతమానం భవతి

- భర్తేపూడి కృష్ణమూర్తి

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు సార్ధక నామధేయులు. బుద్ధుని వలె ప్రశాంత చిత్తులు, స్ఫురద్రూపులు. చిరుమందహాసముతో ఇతరులనాకర్షించెడి మోముగల వారు. స్థితప్రజ్ఞులు.

కృష్ణానది ముఖ ద్వారమున గల దీవుల్లో ఒకటైన దీవి సీమ (దివిసీమ)కే మకుటాయమానమైన మండలి వంశాంకురమైన వెంకట కృష్ణారావు గారి సుపుత్రుడు బుద్ధప్రసాదు. తండ్రి గారి లక్షణములను, ఆశయములను పుణికిపుచ్చుకొని, ప్రజాసేవ చేయుచున్న అపురూప ప్రజానాయకుడు.

కృష్ణానది మీద పెనుమూడి వద్ద వంతెన కట్టించుటకు ముఖ్య పాత్ర వహించి, ఆ వంతెనకు తన తండ్రి గారి పేరు పెట్టి (మండలి వెంకట కృష్ణారావు వారధి) వారి పితృభక్తి చాటుకొన్న మహనీయులు.

ఆ వంతెన లేక పూర్వము గుంటూరు జిల్లా పెనుమూడి నుంచి కృష్ణా జిల్లా పులిగడ్డ రావడానికి నదిమీద ఏక పడవ (ఒకే పడవమీద నదిలోని ఒక పాయనుంచి వేరొక పాయలోనికి మారుతూ నదిని దాటించేది) లేదంటే నది పెద్ద పాయల వద్ద పడవ మీద దాటి మిగతా దూరమంతా ఇసుకలో నడచి రావటంగా ఉండేది.

వారధి వలన గుంటూరు జిల్లా రేపల్లె నుంచి కృష్ణా జిల్లా దివిసీమకు రోడ్డు మార్గము ద్వారా దూరము చాలా తగ్గినది. పూర్వము రేపల్లె వాసులు దివిసీమకు రావాలంటే విజయవాడ, పామర్రు మీదుగా రావలసి వచ్చెడిది.

వారితో నా అనుబంధం : నేను దేవాదాయ శాఖలో రిటైర్మెంట్ తర్వాత డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా విజయవాడ కనకదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానములో పనిచేసేటప్పుడు వారు నన్ను పిలిపించి దేవస్థానము అధీనములోగల హంసలదీవిలోని వేణుగోపాలస్వామి వారి దేవాలయములో ముఖ మండపము పై కప్పు నిర్మాణ పనులకు ఆదేశించినారు.

వారు ఆ దేవాలయము మీద ప్రత్యేక శ్రద్ధ చూపించి అధికారులకు ఆదేశములనిచ్చుట వలన ఆ పనిని సకాలంలో పూర్తి చేయగలిగితిని. వారికి నా ధన్యవాదములు తెల్పుచున్నాను. వారు తెలుగు భాషాభిమాని. ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించుటలో దిట్ట. విజయవాడలో ప్రపంచ తెలుగు రచయితలు 3వ మహాసభల నిర్వహణలో ముఖ్యపాత్ర వహించినారు. ఆ సభలకు నేను హాజరై వారిని కలిసినాను.

వారి షష్ట్యబ్ది మహోత్సవాలు జరుపుట ముదావహము. ఆ ఉత్సవాలు ఘనంగా జరగాలని, వారికి భగవంతుడు ఆయురారోగ్య ఐశ్వర్యములనిచ్చి వార్ని కాపాడాలని, వారు ప్రతి ఏటా పుట్టినరోజు పండుగలు జరుపుకొనుచూ శతాబ్ది ఉత్సవము జరుపుకోవాలని నా ఆకాంక్ష.

ప్రాంతాల మధ్య దూరాలను తగ్గించే వ్యక్తిత్వం

- పున్నా కృష్ణమూర్తి

పదుగురు కూడిన చోట 'ప్రసాదు' అని పిలిస్తే ఒక్కరైనా బదులిస్తారు. అలా బదులిచ్చే వారిలో అనేక దేవతల ప్రసాదులుంటారు. కానీ ఒకరు మాత్రం ఒక్కరే! తెలుగువారిలో, ముఖ్యంగా రాజకీయ రంగంలో ఒకే ఒక వ్యక్తి 'బుద్ధప్రసాద్'! బుద్ధుని 2,500వ జయంతిని భారత ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ధర్మచక్రం – రావి వృక్షం తదితర చిహ్నాలతో ప్రత్యేక తపాలబిళ్లలను విడుదల చేసింది. టిబెట్ నుంచి కొండలను, కోనలను దాటుకుని, గుర్రంపై స్వారీ చేస్తూ, అనుచర గణంతో ప్రవాసిగా విచ్చేసిన దలైలామాను టిబెట్ ప్రవాస ప్రభుత్వాధినేతగా ప్రథమ భారత ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ గుర్తించి గౌరవించారు. దలైలామా ఆ ఏడాది నాగార్జున కొండ సందర్శించారు. ఇన్ని ప్రత్యేకతలున్న బుద్ధుని 2,500వ జయంతి నేపథ్యంలో 1956 మే 16న జన్మించిన శిశువుకి తండ్రి మండలి వెంకట కృష్ణారావు పెట్టిన పేరు బుద్ధప్రసాదు!

గొప్ప పేర్లు అందరికీ సాధారణమే. పేరుకు తగ్గట్లు జీవించడం అసాధారణం. బుద్ధప్రసాద్ గారి వదనంలో బుద్ధుని పండువెన్నెలల కాంతి ఎప్పుడూ దోగాడుతూ ఉంటుంది. స్వాతంత్ర్య సమరయోధుడు, పార్లమెంటు సభ్యుడు, రాష్ట్రమంత్రి, మద్రాస్ తెలుగు కల్చరల్ అకాడెమీ 'తెలుగు వెలుగు'గా సత్కరించిన ప్రముఖుడు తండ్రి మండలి వెంకట కృష్ణారావు గారి సాంస్కృతిక వారసత్వాన్ని నేటికీ కొనసాగిస్తోన్న వ్యక్తిగా ఆయనంటే నాకు గౌరవం.

ఒక రోజు, మా నాయనమ్మకు అన్నగారు గుర్రం మల్లయ్యగారిని కలిసేందుకు మాచెర్ల గ్రామంలో పలువురు పెద్దలు ఇంటికి వచ్చారు. అప్పటికి ఆయన వయస్సు ఏడుపదులు దాటింది. వచ్చిన వారిలో జిల్లాపరిషత్ హైస్కూల్‌లో మా డ్రాయింగ్ మాస్టారు వెంకయ్య గారూ ఉన్నారు. ఆయనకు మించిన చిత్రకారులు నాకు తెలిసి మరెవరూ లేరు! అటువంటిది ఆయన పూలు పండ్లు ఇచ్చి నమస్కరించి మా 'తాత' ను గొప్ప చిత్రకారుడంటా రేమిటి? ఆంధ్రజాతీయ కళాశాలలో ఆర్ట్ విభాగాన్ని మూసివేసినప్పుడు పలువురు చిత్రకారులు వివిధ ఉపాధి మార్గాలను ఎంచుకున్నారని, చిత్రకళా అధ్యాపకుడైన గుర్రం మల్లయ్య మాచర్లకు వచ్చి, నాగార్జున శిల్పా కళాపీఠాన్ని స్థాపించారని, ప్రమోద్ కుమార్ ఛటర్జీగారిని ప్రిన్సిపాల్‌గా ఒప్పించి మాచర్ల రప్పించారు... అని, ఆ సందర్భంగా తెలిపారు! అర్హులకు జరిగే సత్కారాలు తరాల మధ్య ఏర్పడిన కమ్యూనికేషన్ గ్యాప్‌ను తొలగిస్తాయి. ఇంతకీ ఆ సందర్భం ఏమిటి?

ఎమర్జెన్సీ మేఘాలు భారత రాజకీయ రంగాన్ని కమ్ముకోవడానికి కొంచెం ముందు 1975వ సంవత్సరం ఏప్రిల్ 12వ తేదీ నుంచి వారం రోజుల పాటు హైద్రాబాద్‌లో ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి. ప్రపంచ హిందీ మహాసభలకు ప్రతినిధిగా వెళ్లిన అనుభవంతో జలగం వెంగళరావు క్యాబినెట్‌లో సాంస్కృతిక శాఖను నిర్వహిస్తోన్న మండలి వెంకట కృష్ణారావుగారు ప్రపంచ తెలుగు మహాసభలకు తొలిసారిగా శ్రీకారం చుట్టారు. ప్రతి మహాసభలకూ సాంస్కృతిక కారణాలతో పాటు రాజకీయ కారణాలూ

ఉంటాయి. కారణాలు ఏవైనా కొన్ని మహాసభలు క్షేత్రస్థాయిలో మన పెరడులో వైద్యానికి పనికివచ్చే మొక్కలున్నాయని నిరూపిస్తాయి. నేను చెప్పిన స్వానుభవం వేలల్లో ఒకటి మాత్రమే. ప్రపంచంలో ఇన్ని దేశాల్లో ఇంతమంది తెలుగువారున్నారు అని తెలిపిన తెలుగువారి తొలి ప్రపంచ మహాసభలలో బాలుర విభాగానికి బుద్ధప్రసాదు నాయకత్వం వహించారు.

బుద్ధప్రసాద్ గారితో ప్రత్యక్ష పరిచయం 1988 నుంచి, గుంటూరు ఆంధ్రభూమి స్టాఫ్ రిపోర్టర్‌గా పనిచేస్తున్న రోజులు. కృష్ణాజిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకునిగా వివిధ సందర్భాలలో గుంటూరు వచ్చేవారు. ముఖ్యంగా ఒక వారధి నిర్మాణం కోసం వివిధ రాజకీయ పార్టీల నాయకులను కూడగట్టేందుకు.

గుంటూరు జిల్లా పెనుమూడి, కృష్ణాజిల్లా పులిగడ్డ మధ్యగల దూరం వేసవి కాలంలో కూతవేటు దూరమే! వానలు, వరదలు, తుపానులు వచ్చినప్పుడు ఎవరి ప్రపంచాలు వారివిగా ఉంటాయి. రెండు జిల్లాల మధ్య గ్రామాలను రోడ్డుమార్గంలో చేరాలంటే నూరు కిలోమీటర్ల పైగా ప్రయాణించాలి. నాలుగు కిలోమీటర్ల వారధి ఇరు ప్రాంతాలను దగ్గర చేస్తుంది. ఆ వారధి నిర్మాణం కోసం బుద్ధప్రసాద్ ఎంతగానో కృషి చేశారు. పదేండ్ల నుంచి రెండు జిల్లాల మధ్య రాకపోకల దూరం తగ్గింది అంటే అందుకు కారణం బుద్ధప్రసాద్ గారి కృషే! ఆ వారధి పేరును మండలి వెంకట కృష్ణారావుగారి వారధిగా నామకరణం చేయడం ఒక ప్రతీక. బుద్ధప్రసాద్ గారు ప్రాంతాల మధ్య దూరాన్ని, భౌగోళికంగానే కాదు సాంస్కృతికంగా కూడా తగ్గించే వ్యక్తిత్వాల కోవలోని వారు. శాసనసభ్యునిగా, మంత్రిగా, ప్రస్తుతం ఉపసభాపతిగా సైతం పరుషమైన మాట అని ఎరుగని అరుదైన వ్యక్తి. కళాకారులను, రచయితలను గుర్తించి, వారి వద్దకు వెళ్లి వారి అవసరాలను తెలుసుకోవడం తమిళ, కన్నడ రాజకీయ నాయకుల్లో ఒక స్వతఃసిద్ధ సంప్రదాయంగా గమనిస్తాం. తెలుగువారికి సంబంధించి మాత్రం ఎంతటివారైనా రాజకీయ నాయకుల చుట్టూ తిరగాల్సిందే. ఇందుకు అపవాదు మిత్రులు బుద్ధప్రసాద్ గారు. వారికి వారి కుటుంబానికి నా శుభాకాంక్షలు.



కళాకారులతో...

సాహిత్య సాంస్కృతిక సాంఘిక సేవా కూడలి మా 'మండలి'

- జానమద్ది విజయభాస్కర్

కొందరిని ఇంటిపేర్లతో పిలుచుకోగానే చప్పున ఒక తరం పెద్దలు గుర్తుకు వస్తారు. ఆ కోవకు చెందిన వారిలో శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు ఒకరు. వీరి తండ్రి గారు కీ.శే. మండలి వెంకట క్రిష్ణారావు గారు ఆం.ప్ర. రాష్ట్ర విద్యాశాఖామాత్యులుగా 1976లో కడపలోని ప్రభుత్వ కళాశాలకు రావడం జరిగింది. ఆ సందర్భంగా జరిగిన విద్యార్థులు, అధ్యాపకుల సమావేశంలో తాను ప్రసంగించడానికి బదులు విద్యార్థులే ప్రసంగిస్తే తాను ప్రతిస్పందిస్తానని అనడంతో - బి.కాం. డిగ్రీ మూడవ సం॥ చదువుచున్న నేను విద్యార్థుల సమస్యలపై, అధ్యాపకుల వేతనాలపై వివరిస్తూ మాట్లాడగానే, అభినందిస్తూ, కళాశాల విద్యార్థి సంఘం ఎన్నికలు ఆర్భాటంగా జరిగే విధానాన్ని రద్దుచేసి, వక్తృత్వపోటీలు నిర్వహించి వారిలో ఎంపికైన వారిని కళాశాల విద్యార్థి సంఘం నాయకులుగా నియమించాలని ఆదేశించడం జరిగింది. తరువాత కొన్నాళ్లకు వక్తృత్వ పోటీలో నేను విద్యార్థి నాయకుడుగా ఎంపిక కావడం జరిగింది. ఆ సమయంలో శ్రీ బుద్ధప్రసాదు గారు హైదరాబాదులో డిగ్రీ విద్యార్థిగా చురుకుగా పనిచేసేవారు. వారి తండ్రి గారి స్ఫూర్తితో పలుసేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారు. తండ్రిగారి ప్రభావం వీరిపై బాగా ఉందనడంలో అతిశయోక్తి లేదు. 'పులికడుపున మేక పుట్టదు' అన్న నానుడి వీరి విషయంలో అక్షర సత్యం.

యవ్వనం నుండే నాయకత్వ లక్షణాలు, సేవాతత్త్వం, సాహిత్యం పట్ల ఆసక్తి సమాజం పట్ల బాధ్యత, పేదల పట్ల సానుభూతి అతనితో పాటే పెరుగుతూ, విద్యా వినయ సంపన్నుడిగా తీర్చిదిద్దాయి. 22-5-2005వ తేదీన మంత్రిగా ఉన శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు వారికి అత్యంత ఆప్తులైన డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ప్రముఖ పాత్రికేయులు ఆంధ్రభూమి సంపాదకులు శ్రీ కృష్ణారావుగార్లతో కలసి బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించడం జరిగింది. ఆ సమయంలో అక్కడ ఉన్న నేను, మండలి గారికి పుస్తకాలపట్ల ఉన్న మక్కువ, సాహిత్యం పట్ల ఆసక్తి, గ్రంథాలయాలపట్ల అనురక్తి, మీదు మిక్కిలి మా నాన్నగారి పట్ల అభిమానం-గౌరవం - ఆత్మీయత నన్ను ఎంతగానో ఆకర్షించాయి. బ్రౌన్ గ్రంథాలయాన్ని ఆసాంతం పరిశీలించి, నాన్నగారి కృషిని, పట్టుదలని ప్రశంసిస్తూ, తెలుగు వారందరు గర్వపడేలా బ్రౌన్‌కు నిజమైన నీరాజనం ఈ గ్రంథాలయం అంటూ - వీరి తండ్రిగారు శ్రీ యం.వి. క్రిష్ణారావు గారి కృషిని నెమరు వేసుకున్నారు.

రాజకీయాలలో ఉండే వారికి సాధారణంగా సాహిత్యం పట్ల మక్కువ తక్కువ. కానీ, బుద్ధప్రసాద్ గారు రాజకీయ మాలిన్యం అంటని నిఖార్సయిన సాహిత్య ప్రియుడు - చదువరి - రచయిత - నిజమైన సేవాతత్వం అణువణువు నిండిన వినయ భాస్కరుడు. అతని వేషం - భాష - యాస ఎంత సౌమ్యంగా - లలితంగా - ఎదుటివారు చూస్తూనే చేతులెత్తి నమస్కరించాలన్న భావం కలుగజేస్తుంది. నానాటికి కంపుకొడుతూ, కలుషితమై పోతున్న నేటి రాజకీయ వ్యవస్థలో అతను బురదగుంటలోని తామరపువ్వు. భ్రష్టుపడుతున్న రాజకీయ గంజాయి వనంలో నైతిక విలువలతో అందరి మన్ననలు పొందుతూ ఎదుగుతున్న

ఒక తులసి మొక్కలాంటివారు మండలి. శాసనసభ ఉప సభాపతిగా – సభాపతిలేని సందర్భంలో వీరు శాసనసభను నిర్వహించే తీరు కూడా చాలా హుందాగా ఉంటుంది. ఎంతో దూకుడుగా, ప్రచారంకోసమో ఆర్భాటంకోసమో పదే పదే హడావుడి చేసే అర్భక శాసన సభ్యులు సైతం – వీరి వ్యవహార శైలిని, నిష్పాక్షికతను గుర్తెరిగి – సభ్యతతో మెలగడం చూస్తుంటే ఆశ్చర్యమనిపిస్తుంది. వీరి నిరాడంబరత, నిబద్ధత ముందు వారి దూకుడు తగ్గిపోవడం గమనార్హం.

2014 ఫిబ్రవరి 28న మా తండ్రి గారు డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రిగారు పరమదించినపుడు చాలా ఖిన్నుడయ్యారు. ఆ సందర్భంలో ఆయన నన్ను ఓదార్చిన తీరు – అన్నలు లేని నాకు ఒక ఆత్మీయ స్పర్శగా తాకింది. దివిసీమ ఉప్పెనలో – సునామి బీభత్స సమయంలో ఇలా ఎందరిని ఎలా ఓదార్చి ఉంటారోనని భావించి ఆశ్చర్యానికి లోనయ్యాను. అక్టోబరు 20, 2014న బ్రౌన్ గ్రంథాలయంలో నాన్నగారి కాంస్య విగ్రహ ఆవిష్కరణ సభకు ప్రత్యేక అతిథిగా వచ్చి, సభలో స్పందించిన తీరు సభికులను ఆశ్చర్యపరచింది. మా నాన్నగారి పట్ల ఉన్న అనురాగ, ఆత్మీయ భావన అందరినీ ఆలోచింప చేసింది.

అలాగే మా నాన్నగారి జన్మస్థలం అనంతపురం జిల్లా – రాయదుర్గంలో – వారు బాల్యంలో చదువుకున్న పాఠశాల ప్రాంగణంలో – వారి విగ్రహం ఏర్పాటు చేయాలన్న అక్కడి స్థానిక సాహితీప్రియుల, శ్రేయోభిలాషుల కోరిక మేరకు మేమే విగ్రహం చేయించి, ప్రతిష్ట కోసం అనంతపురం కలెక్టర్ అనుమతి కోసం అర్థించగా సుప్రీంకోర్టు తీర్పుకు వక్రభాష్యం చెప్పి, అనుమతి నిరాకరించిన సందర్భంలో బుద్ధప్రసాద్‌గారు ఎంతో బాధపడి – వెంటనే అక్కడి స్థానిక మంత్రి శ్రీ పల్లె రఘునాథరెడ్డితో, రాయదుర్గం శాసన సభ్యులు శ్రీ కాల్వ శ్రీనివాసులతో మాట్లాడి నాన్నగారి విగ్రహ ప్రతిష్టకు అధికార అహంకారం పనికిరాదని – అంతటి మహనీయుని విగ్రహ ప్రతిష్ఠ అక్కడే జరిగి తీరాలని వారికి చెప్పి, వారిని కార్యోన్ముఖులు చేయడం జరిగింది. 05–04–2015 తేదీన అదే పాఠశాలలో నాన్నగారి విగ్రహ ప్రతిష్టకు ఆత్మీయ అతిథిగా వచ్చి, ప్రారంభించడం మా కుటుంబ సభ్యులు, అక్కడి సాహితీ ప్రియులకు మరపురాని మధుర ఘట్టం. మా కుటుంబ సభ్యులు నెలకొల్పిన 'జానమద్ది సాహితీ పీఠం' సంస్థకు గౌరవ సలహాదారుగా ఉండాలని కోరినపుడు ఎంతో ఆనందంగా అంగీకరించడం మాకు గర్వకారణం.

మంచితనం – మానవత్వం, నిబద్ధత, నిరాడంబరత, స్వచ్ఛమైన వేష భాషలతో – ఎలాంటి రాజకీయ మాలిన్యం అంటని నిష్కళంకమైన, నిజాయితీ నిండిన, సాంఘిక, సాహిత్య సాంస్కృతిక సేవాపరాయణత్వంతో – నిత్యం చిరుదరహాసంతో 'అందరి వాడిగా' అన్ని వర్గాల వారి ప్రేమానురాగాలు, ఆదరాభిమానాలు పొందిన నిజమైన స్నేహసంపన్నులు, పుస్తక ప్రియులు, తెలుగు భాష వీరాభిమాని , మా కుటుంబ శ్రేయోభిలాషి, ఆత్మీయులు శ్రీ మండలి బుద్ధ ప్రసాద్ గారికి అపుడే అరవై సంవత్సరాలు నిండాయంటే నమ్మశక్యం కాని నిజం. నిత్యనూత్న యవ్వనంతో – ఆయురారోగ్యాలతో – స్వచ్ఛమైన రాజకీయ వినీలాకాశంలో తనదైన శైలిలో అందరికీ అందనంత ఎత్తులో ఆదర్శనాయకుడిగా ఎదగాలని మనసారా కోరుకుంటూ, వారికి, వారి కుటుంబ సభ్యులకు షష్టిపూర్తి శుభాకాంక్షలు తెలుపుతూ – మీతోటి మా స్నేహం – నిలవాలి కలకాలం.

చేతల మనిషి

- కె.ఎస్.బి.వి.కె. శివరావు

ఎవరీయన? రాజకీయవేత్తా? విద్యావేత్తా? వ్యాపారవేత్తా? వారసత్వంగా అబ్బిన ప్రజాసేవకుడా? కాదు భూమండలపు నాలుగు దిక్కులాగల తెలుగు వారి బంధువు బుద్ధప్రసాదు గారు.

37 సం॥ల తరువాత ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిస్థితులు ఊగిసలాటలో ఉన్న తరుణంలో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి గారితో కలసి బుద్ధప్రసాదు గారు 4వ ప్రపంచ తెలుగు మహాసభలను 2012 డిశంబరు 27, 28, 29 తేదీల నాడు తిరుపతిలో నిర్వహించారు. ఆ సభావేదికపై నుండి ఉపన్యసిస్తున్న బుద్ధప్రసాదు గార్ని చూడగానే వారి తండ్రి మండలి వేంకట కృష్ణారావు గారు గుర్తుకు వచ్చారు. 1975 ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణలో నేనొక కార్యకర్తను. ఆవిధంగా మండలి వేంకట కృష్ణారావుగారి వద్ద పనిచేసే అదృష్టం కల్గింది. వారు అధికార భాషా కమీషను పర్యవేక్షణలో పనిచేసేటట్లుగా మాకు ఒక తెలుగు పరిశోధన విభాగాన్ని ఏర్పాటు చేశారు. మండలి వేంకట కృష్ణారావు గారు, వావిలాల గోపాల కృష్ణయ్య గారి పర్యవేక్షణలో ఎటువంటి మార్పులు లేని, కంప్యూటరుకు అనువైన తెలుగు అక్షరమాల రూపుదిద్దుకున్నది.

పరిస్థితుల ప్రభావం వలన ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయినా బుద్ధప్రసాదు గారు మాత్రం 'తెలుగు జాతి అంతా ఒకటే' అనే దృఢ విశ్వాసం గల మహోన్నత వ్యక్తి. వీరికి తెలుగు వారంటే ఎనలేని ప్రేమాభిమానాలు. తెలుగువారి అభ్యున్నతికి, ఐక్యతకు నిరంతరం కృషి చేస్తూ ఉన్నారు.

తెలుగు భాష

చేవ్రాత ఉత్తర-ప్రత్యుత్తరాలు కనుమరుగౌతున్నాయి. తెలుగు వాడకం తగ్గిపోతున్నది. పట్టభద్ర స్థాయి వారు తెలుగు మాధ్యమంలోనే చదువుకోవలననే ఆనాటి ప్రభుత్వ నిర్ణయం మరుగున పడిపోయింది. తెలుగు చదవకుండానే పట్టభద్రులౌతున్నారు. అమ్మ, ఆవు, ఇల్లు అనే ప్రేమాభిమానాలకు విత్తులు నాటే మాతృభాషను ప్రక్కకు నెట్టి, యాంట్, బ్యాట్, క్యాట్ అనే ఆంగ్ల భాషా అక్షరాలతో చదువు మొదలౌతున్నది ఈనాడు. ఈనాటి బాలలు రేపటి రాష్ట్ర పాలనను మాతృభాషలో కొనసాగించగలరా? ఈ పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించిన బుద్ధప్రసాదు గారు అధికార భాషా కమీషను, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు భాషోద్యమ సమాఖ్య, తదితర సంస్థలతో మమేకమై, నడుం బిగించి తెలుగు భాషను ఉద్ధరించుటకు అలుపెరగని కృషి చేస్తూనే ఉన్నారు. తెలుగు జాతి ఉనికిని నిరంతరం గుర్తు చేసుకునేటట్లు అన్నట్టుగా ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా అమరావతిని నిర్ణయించుటలో వీరి ప్రయత్నం ఉన్నదనిపిస్తుంది నాకు. నన్ను ఆకట్టుకున్న ముఖ్యమైన మూడు అంశాలను ప్రస్తావిస్తాను.

చేతలు : సామాజికం

బుద్ధప్రసాదుగారు మాటల మనిషి కాదు. చేతల మనిషి. తండ్రి తలపెట్టిన 'కృష్ణా జిల్లా పులిగడ్డ – గుంటూరు జిల్లా పెనుమూడి గ్రామాల మధ్య కృష్ణానదిపై వంతెన' నిర్మాణాన్ని తన నిరాహార దీక్షతో సాధించిన గట్టి మనిషి. ఈ వంతెనకు ఆం.ప్ర. ప్రభుత్వం మండలి వేంకట కృష్ణారావు కృష్ణా వారధిగా పేరుపెట్టి వారి సేవలకు కృతజ్ఞతలను చెల్లించినది.

విద్యా వ్యవస్థ

ఒకటవ తరగతి నుండి 10వ తరగతి వరకు తప్పనిసరిగా తెలుగు బోధన ఒక పాఠ్యాంశంగా తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో సాధించిన ఉత్తర్వులు. 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టే కృషి చేస్తున్నారు. తెలుగు విశిష్ట భాషా ప్రతిపత్తికి కేంద్ర ప్రభుత్వ గుర్తింపు.

సర్వోపయోగం

కంప్యూటర్లకు తెలుగు అంతర్జాలం తయారీలో అహర్నిశలు శ్రమించారు.

బుద్ధప్రసాదు గార్కి ఒక మనవి

వాడకం తగ్గి మరుగున పడి మాయమౌబోతున్న భారతీయ మాతృభాషల సముద్ధరణకు భారత రాజ్యాంగ రక్షణ కల్పించే కృషి చేయాలని మనవి.

ఈ తండ్రీ–కొడుకుల జీవన గమనాన్ని హృదయాంతరాళంతో పరిశీలిస్తే వేమన సూక్తి స్ఫురణకు వస్తుంది. ***"కులములోన నొకడు గుణవంతుడాయెనా / కులము వెలయు వాని గుణము చేత / వెలయ వనము లోన మలయ జంబున్నట్లు"*** ఒకరు వినీలాకాశం నుండి వెలుగులను జిమ్ముతుంటే మరియొకరు ఉదయభానుడల్లే ప్రకాశిస్తూనే ఉంటారు.

వీరికి తెలుగు జాతి ఋణపడి ఉంటుంది.

శుభాభినందన

- మంగళగిరి ఆదిత్య ప్రసాద్

సాహిత్యం, రాజకీయం అన్నవి సాధారణంగా ఒక 'ఒర'లో ఇమడనటువంటి విభిన్న రంగాలు. అటు పరిణతి చెందిన రాజనీతిజ్ఞునిగా, ఇటు తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియలపై సంపూర్ణ అవగాహన కలిగిన సాహిత్యోపాసకునిగా, తెలుగుభాషోద్యమనేతగా, గాంధేయవాదిగా అశేష ప్రజానీకం అభిమానాన్ని చూరగొంటున్న మహామనీషి నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప సభాపతి మాన్యులు మండలి బుద్ధప్రసాద్‌గారు.

జనవరి 2005 నుండి జులై 2012 వరకు ఏడున్నర సంవత్సరాల పాటు నేను ఆకాశవాణి విజయవాడ కేంద్రం డైరెక్టర్‌గా పనిచేసినప్పుడు బుద్ధప్రసాద్‌గారితో సన్నిహితంగా ఉండే అవకాశం కలగటం నాకు ఎంతో ఆనందాన్నిస్తుంది.

ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి పునర్వైభవం తీసుకొని రావటానికి నేను ప్రత్యేక ప్రచారోద్యమ పంథాలో కార్యక్రమాలను రూపొందిస్తున్నప్పుడు వారి సూచనల మేరకు అనేక కార్యక్రమాలను ప్రసారం చేసి ఆకాశవాణి విజయవాడ కేంద్రం అసంఖ్యాకశ్రోతల మన్ననలను పొందినది.

ఒకసారి రికార్డింగు కొరకు బుద్ధప్రసాద్ గారు రేడియో కేంద్రానికి వచ్చినప్పుడు "జాతీయ విపత్తు దినం సందర్భంగా మా ఊళ్ళో (అవనిగడ్డలో) గ్రామీణులను – ప్రకృతిపరమైన విపత్తులు సంభవించినప్పుడు రక్షణ చర్యల పట్ల చైతన్యపరుస్తూ ఏదైనా కార్యక్రమం చేయకూడదా!" అని సూచించి మేము ఏర్పాటు చేసిన 'రేడియో ప్రచార సభ'కు వారే పూర్తి ప్రణాళికను రూపొందించి, సభకు అవసరమైన అన్ని ఏర్పాట్లనూ సమకూర్చగా రేడియో ప్రచార సభను అత్యంత వైభవంగాను, విజయవంతంగాను నిర్వహించటం జరిగింది.

బుద్ధప్రసాద్ గారు గొప్ప దార్శనికులు. 2006 సంవత్సరంలో కృష్ణా జిల్లా రచయితల సంఘం వారు బుద్ధప్రసాద్ గారి నేతృత్వంలో జాతీయ తెలుగు మహాసభలను నిర్వహించారు. వక్తల ఉపన్యాసాలను విందామని నేను ఈ సభలకు వెళ్ళినప్పుడు "ఈ సభలలోని వక్తల ప్రసంగాలను రికార్డు చేసి ప్రసారం చేయకూడదా" అని బుద్ధప్రసాద్ గారు చిన్న సూచన చేశారు. ఇది నాకెంతో స్ఫూర్తిని కలుగజేసింది. వెనువెంటనే ఆ సభలలోని ప్రసంగాలను రికార్డు చేసి ప్రసారం చేయగా అసంఖ్యాక శ్రోతలు ఆ ప్రసంగాలను విని ఎంతో ప్రశంసిస్తూ మా కేంద్రానికి జాబులు రాశారు.

తదాదిగా వారి నేతృత్వంలో కృష్ణాజిల్లా రచయితల సంఘం వారు 2007లోను, 2011లోను నిర్వహించిన ప్రపంచ తెలుగు రచయిత, మహాసభలలోని ప్రసంగాలను, మరికొన్ని సందర్భాలలో ఏర్పాటు చేసిన సదస్సులలోని ప్రసంగాలను రికార్డు చేసి ఆకాశవాణి విజయవాడ కేంద్రం ప్రసారం చేయటం జరిగింది.

ఈ విశేషమైన సభలకు వచ్చి ప్రత్యక్షంగా వక్తల ప్రసంగాలను వినలేకపోయిన ఎంతో మంది సాహితీ ప్రియులు విజయవాడ కేంద్రం ద్వారా విని రేడియో కేంద్రాన్ని అభినందిస్తూ ఉత్తరాలు రాశారు.

అలాగే బుద్ధప్రసాద్ గారి అధ్యక్షతన జరిగిన అనేక సాహిత్య సభలలో నేను కూడా పాల్గొని తప్పనిసరిగా పాటో, పద్యమో పాడేవాడిని.

ఇవన్నీ కూడా వారితో నాకు గల చక్కని జ్ఞాపకాలు!

మాన్యులు మండలి బుద్ధప్రసాద్ గారు జాతీయ స్థాయిలో కూడా అత్యున్నత పదవులను అధిష్టించి ప్రజలకు, సాహితీ ప్రియులకు, తెలుగు భాషాభిమానులకు మరిన్ని సేవలు అందించాలని హృదయ పూర్వకంగా ఆకాంక్షిస్తూ మే నెల 27వ తేదీన జరుగనున్న వారి షష్ట్యబ్ది పూర్తి మహోత్సవం సందర్భంగా శుభాభినందనలను తెలియజేస్తున్నాను.



శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీతో...

పెద్దలపట్ల గౌరవం - అదే అతని ఆభరణం

- డి. పారినాయుడు

అది 1998 సంవత్సరం, విజయనగరం జిల్లా పార్వతీపురం జట్టు ట్రస్టు ఆధ్వర్యంలో జట్టుభావ సమాఖ్య సేవాశ్రమం ప్రారంభకార్యక్రమానికి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ వావిలాల గోపాలక్రిష్ణయ్య ముఖ్య అతిథిగా విచ్చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమం ముగిశాక భోజనాల సమయంలో నావైపు చూసి అవనిగడ్డలో గాంధీక్షేత్రం చూసావా? అంటూ వావిలాల నన్ను ఉద్దేశించి అడిగారు. అప్పటికి నాకు శ్రీ మండలి వెంకటకృష్ణారావుగారు, శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారి గురించి తెలుసుగాని గాంధీక్షేత్రం గురించి తెలియదు. అందుకే ప్రశ్నార్థకంగా వావిలాల వైపుచూశాను. ఆయన నా పరిస్థితి అర్థం చేసుకున్నారు. 1977 సంవత్సరం నవంబర్ నెలలో దివిసీమలో సంభవించిన పెనుతుఫానులో అనాథలైన బాలబాలికల కోసం ఏర్పాటు చేసిన గాంధీక్షేత్రం గురించి చూచాయగా తెలియజేసారు. అప్పటి నుండి గాంధీక్షేత్రం చూడాలన్న ఆశను పెంచుకొన్నాను.

ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన హరిసర్వోత్తమరావుగారి జన్మదినోత్సవానికి హాజరైనప్పుడు తొలిసారి బుద్ధప్రసాద్‌గారిని చూసాను. అప్పటికి ఆయన పశుసంవర్ధక శాఖామాత్యులుగా ఉన్నారు. సహజంగా రాజకీయ ప్రముఖులు వస్తున్నప్పుడు కనిపించే హడావుడి నామమాత్రంగా కూడా కనిపించలేదు. వేదికమీద కూర్చున్నంతసేపూ చాలా ప్రశాంతంగా కనిపించారు. అంతవరకూ ఆయన పక్కనే మొహమాట పడుతూ కూర్చున్న నాకు బెరుకుపోయింది. మాటలు కల్పించుకున్నాను. తొలిసారే పరిచయమైన నాతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు.

రెండోసారి తెనాలిలో కలిశాను. పావులూరి ట్రస్టు ఏర్పాటు చేసిన 'వెలగా - అయ్యంకి' పురస్కార ప్రదానోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బుద్ధప్రసాద్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నాను. అలా ఆయనతో ఏర్పడిన పరిచయం విజయనగరం జిల్లా మారుమూల ప్రాంతాలైన పార్వతీపురం, తోటపల్లి గ్రామాలకు 5-6 సార్లు తోడ్కొని వచ్చినట్టు చేసింది. వావిలాల వారి మరణానంతరం జట్టు ట్రస్టు ఏర్పాటు చేసిన వావిలాల స్ఫూర్తి పతకాన్ని డా. వెలగా వెంకటప్పయ్య గారికి ప్రదానం చేసినప్పుడు మరియు తానే స్వయంగా స్ఫూర్తిపతకం స్వీకరించినప్పుడు జట్టు ఆశ్రమానికి వచ్చి ఆత్మీయ స్పర్శను అందించారు.

2012-14 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘం అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మరునాడే తోటపల్లిలో ఆదితల్లి విగ్రహావిష్కరణ చేయడానికి విచ్చేసి భారతీయ సంస్కృతి పట్ల ఆయనకుగల ఎనలేని ప్రేమాభిమానాలను చేతలలో చూపించారు. అదే సంవత్సరం వావిలాల స్ఫూర్తి పతకాన్ని ప్రముఖ రాజనీతిజ్ఞుడు మాజీ మంత్రివర్యులు శ్రీ భాట్టం శ్రీరామమూర్తిగారికి ఇవ్వాలని ఆయనే ప్రతిపాదించారు. పురస్కార ప్రదానోత్సవానికి వారం రోజుల ముందే శ్రీరామమూర్తిగారికి సతీవియోగం జరిగింది. ఆ దహన సంస్కారాలకు హైదరాబాద్ నుండి బుద్ధప్రసాద్‌గారు హాజరయ్యారు. రెండో రోజు బుద్ధప్రసాద్‌గారు నాతో మాట్లాడి పురస్కార ప్రదానోత్సవం తేదీ మార్చుకుందామని చెప్పారు. ఈ విషయం తెలిసిన భాట్టం శ్రీరామమూర్తిగారు అనుకున్న కార్యక్రమం అనుకున్నట్లుగానే జరగాలంటూ వావిలాల వారి గురించి వారితో ఆయనకు గల సాన్నిహిత్యం గురించి జ్ఞాపకం చేసుకున్నారు.

ఆ సంఘటన జరిగినరోజు బుద్ధప్రసాద్‌గారితో పాటు నాకు కూడా కన్నీళ్ళు ఆగలేదు. అంతటి వజ్ర సంకల్పం భాట్టంవారిది. ఈ సంఘటన జరిగిన వారం రోజుల తరువాత బుద్ధప్రసాద్‌గారే తన అధికారిక వాహనంలో భాట్టంవారిని తోటపల్లి తీసుకువచ్చి తన స్వహస్తాలతో వావిలాల స్ఫూర్తి పతకాన్ని భాట్టం శ్రీరామమూర్తి గారికి అందజేసారు. అదీ పెద్దవారిపట్ల బుద్ధప్రసాద్‌గారికున్న గౌరవమర్యాదలు. ఈ ఒక్క సంఘటన చాలు బుద్ధప్రసాద్‌గారి వ్యక్తిత్వం ఎలాంటిదో..... ఇలాంటి సంఘటనలు అందరికీ ముఖ్యంగా యువతకు అందించవలసిన అవసరం ఎంతో ఉంది.

2014 సార్వత్రిక ఎన్నికలలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనానంతరం ఏర్పడిన నవ్యాంధ్రప్రదేశ్‌కు తొలి ఉపసభాపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన బుద్ధప్రసాద్ గారిని విజయనగరానికి ఆహ్వానించా. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం - ఉత్తరాంధ్ర ఉద్యమనేతగా పేరున్న కీ.శే. శ్రీ జయంతి రామలక్ష్మణమూర్తి విగ్రహావిష్కరణతోపాటు ప్రముఖ సంఘసేవకులు శ్రీ రొంగలి పోతన్న గారికి వావిలాల పురస్కారాన్ని అందజేసే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు బుద్ధప్రసాద్.

ఆరోజు కూడా అదే నిరాడంబరత, హైదరాబాద్ నుండి ఫలక్‌నామా ట్రైన్‌లో ఒంటరిగానే వచ్చారు. విజయనగరం స్టేషన్‌లో ఆయన దిగినప్పుడు ప్రభుత్వం తరపున ఒక తహసీల్దార్‌తో పాటు నేను మాత్రమే ఉన్నాం. రాజకీయ పార్టీ కార్యకర్తల హడావిడి మచ్చుకైనా లేదు. జిల్లా పరిషత్ అతిథి గృహంలో బస చేసినప్పుడు ఏ ఒక్క కార్యకర్త కూడా ఆయన్ను కలవడానికి రాలేదు. దీనిని బట్టి మనకు తెలుస్తుంది ఏమంటే ఆర్భాటాలు చేయించుకోవడం ఆయనకేమాత్రం ఇష్టం ఉండదని.

చివరిసారిగా పార్వతీపురానికి ఆయనొచ్చింది 2015 నవంబర్‌లో.. ప్రముఖ జానపద సాహితీవేత్త, శ్రీ రౌతు వాసుదేవరావు వ్రాసిన 'ఒక సామాజిక కార్యకర్త దారిలో పూలు-ముళ్ళు' పుస్తకావిష్కరణ చేయడానికి, నిజాయితీగా సామాజిక కార్యక్రమాలు చేస్తున్నప్పుడు ఎదురౌతున్న ఇబ్బందులను రచయిత ఈ పుస్తకంలో స్పష్టంగా తెలియజేసారు. ఈ పుస్తకానికి తను ముందుమాట వ్రాయడమే కాకుండా తనే స్వయంగా ఆవిష్కరిస్తానని మాటిచ్చి నిలబెట్టుకున్నారు.

పార్వతీపురం మీద మీకెందుకింత మక్కువని ఎవరైనా అడిగితే ఉన్నత ఉద్యోగాన్ని వదలి జట్టు ఆశ్రమాన్ని చాలా చక్కగా నిర్వహిస్తున్న పద్మజమ్మతో పాటు ఆ పిల్లలను చూడాలన్న కోరికతోనే వస్తున్నట్లు చెప్పడం ఆయన నిరాడంబరతకు మరో మచ్చుతునక. గాంధీక్షేత్రంలో తను కొనసాగించలేని పనిని ఎవరు చేస్తున్నా చూడాలనుకొనే పెద్దమనస్సును దేవుడాయనకిచ్చారు.

ఆ మనస్సులో చోటు దొరికే అదృష్టం నాతోపాటు మా జట్టు ఆశ్రమవాసులందరికీ కలగడం పూర్వజన్మ సుకృతంగానే భావిస్తున్నాను. రాజకీయాలంటే గ్రూపులను తయారు చేసి ఎదుటివారి మీద కారాలూ, మిరియాలూ వెదజల్లే నేటి పరిస్థితులలో అందరినీ సమాన భావంతో, అభివృద్ధే లక్ష్యంగా తన పనిని తాను చేసుకుంటూ ముందుకు సాగుతున్న మహామనిషి బుద్ధప్రసాద్‌గారు నిండా నూరేళ్లు జీవించి అధికారభాష తెలుగుతోపాటు భారతీయ సంస్కృతిని, సాంప్రదాయాలను సంరక్షించే శక్తియుక్తులు వారికి కలగాలని మనసారా కోరుకుంటున్నాను.

షష్టిపూర్తి సందర్భంగా అభినందనలు తెలియజేసుకుంటూ...

అందరికీ ఆత్మీయులు

- శ్రీమతి నౌగోరా

మండలి కృష్ణారావుగారి కుటుంబానికి – గోరా కుటుంబానికి సంఘసంస్కరణ, అస్పృశ్యతా నిర్మూలన, నేరస్తుల సంస్కరణ, సాంఘిక సేవా కార్యక్రమాలలో చాలా సన్నిహిత సంబంధం ఉంది. సమాజ ప్రగతే వారి లక్ష్యం. వారి కార్యక్రమాలు గాంధీ చూపిన మార్గాన్నే సాగేవి. 1977లో దివిసీమ భీకర ఉప్పెన, తుఫానుకు గురైనప్పుడు లవణం అన్నయ్య, హేమలతా లవణం, శ్రీ వీరయ్య, ప్రభాకర్‌జీ, శ్రీ కృష్ణారావుగార్ల నాయకత్వంలో తుఫాను బాధితుల సహాయ కార్యక్రమాలు జరిగి దివిసీమను మామూలు స్థితికి తీసుకురావడానికి తోడ్పడ్డాయి.

రిలీఫ్ యాక్టివిటీస్ తర్వాత దివిసీమ ప్రజల అభివృద్ధి కొరకు ఆర్థిక సమతా మండలి శ్రీ వీరయ్య ఆధ్వర్యంలో శ్రీ మండలి కృష్ణారావుగారి సహకారంతో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టింది. అప్పటి నుండి ఇప్పటి వరకు యువకులైన శ్రీ బుద్ధప్రసాద్ గారు ఆర్థిక సమతా మండలి చేసే కార్యక్రమాలలో నాకు ఒక సోదరుడుగా సహకారం అందించి ప్రోత్సహిస్తూ ఉంటారు.

శ్రీ బుద్ధప్రసాద్‌గారు బాలల విద్యాభివృద్ధికి ప్రజాప్రతినిధిగా చాలా ప్రాధాన్యం ఇస్తారు. ఈ క్రింది సంఘటన ఒక ఉదాహరణ.

సిబిసిఎన్‌సి మరియు సిఎస్‌ఐ క్రైస్తవ మిషనరీ సంస్థలు దివిసీమ గ్రామ ప్రాంతాలలో బాలల చదువు నిమిత్తం పాఠశాలలు నిర్మించి, టీచర్లను ఏర్పాటు చేసినవి. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వాటి బాధ్యత ప్రభుత్వం తీసుకున్నది. అప్పుడు కమ్యూనిటీకి స్కూలు నిర్వహణ బాధ్యత అప్పగించారు. టీచర్ల జీతాలు ప్రభుత్వం ఇచ్చింది. ఆ గ్రామీణ ప్రాంతాలు ప్రాకృతిక విపత్తులకు తరచు గురవుతూ పాఠశాలలు శిథిలావస్థకు చేరాయి. ఆర్థిక సమతా మండలి సెక్యులర్ దృక్పథంతో బాలల విద్యకోసం కృషి చేస్తున్నందున శ్రీ బుద్ధప్రసాద్ గారు ఈ విషయం శ్రీ వీరయ్యగారి దృష్టికి తీసుకురావడం జరిగింది. వీరిద్దరు ఆలోచించిన తర్వాత, ఆర్థిక సమతా మండలి బాధ్యత తీసుకుని దక్షిణ చిరువోలు లంక, సూరపనేనివారి పాలెం, రేగుల్లంక, కొడాలి, నిమ్మగడ్డ, అవినగడ్డ 8వ వార్డు, ఆర్.యమ్. గొల్లపాలెం మొదలగు గ్రామాలలో 25 పాఠశాలల భవనాలు, టాయిలెట్లు నిర్మించి నీటి సౌకర్యం కలిగించింది. ఈ పాఠశాలల నిర్మాణంలో ఆయన సలహాలు అందించేవారు.

శ్రీ బుద్ధప్రసాద్‌గారికి ప్రజాక్షేమమే లక్ష్యంగా ఉంటుంది. ఇటీవలి కాలంలో ఆర్థిక సమతా మండలి టి.డి.హెచ్. స్విట్జర్లాండువారి సహకారంతో రేగుల్లంక గ్రామంలో ఇకోసాన్ టాయిలెట్లు నిర్మించింది. ఈ కార్యక్రమం ద్వారా తరుచు ముంపుకు గురయ్యే రేగుల్లంక గ్రామ ప్రజల ఆరోగ్యం మెరుగుపడింది. పరిశుభ్రత, టాయిలెట్ల ద్వారా తయారైన ఎరువు ఉపయోగం ఆ గ్రామ కుటుంబాల స్థితిని మెరుగు పరచాయి.

దీనిని గమనించిన బుద్ధప్రసాద్ గారు రేగుల్లంక ఇకోసాన్ టాయిలెట్లను సందర్శించడమేకాక ప్రభుత్వదృష్టికి, సమాజం దృష్టికి తీసుకువచ్చి కొత్త ప్రయోగాలకు ప్రోత్సహం కలిగించారు. ఇలా సమాజాభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ప్రోత్సాహం లభిస్తూ ఉంటుంది.

తండ్రి స్థాపించిన గాంధీక్షేత్రం ద్వారా గాంధీజీ ఆశయాలను నిర్మాణ కార్యక్రమాల ద్వారా కొనసాగిస్తూ సామాన్య ప్రజల్లో చైతన్యం కలుగజేస్తూ ఉంటారు బుద్ధప్రసాద్ గారు.

ఆర్థిక సమతా మండలి చేసే కార్యక్రమాలకు బుద్ధప్రసాద్‌గారితో పాటు తల్లి ప్రభావతిగారు, భార్య విజయలక్ష్మి గారు, ఇతర కుటుంబసభ్యులు ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తూ ఉంటారు.

సోదరులు బుద్ధప్రసాద్‌గారి షష్టిపూర్తి సందర్భమున ఆర్థిక సమతా మండలి కుటుంబ సభ్యులందరం శుభాకాంక్షలు అందిస్తూ, భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులు అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాం.



న్యూజెర్సీ శిరిడీ సాయి మందిరంలో ప్రసిద్ధ క్యాన్సర్ నిపుణులు పద్మశ్రీ నోరి దత్తాత్రేయుడుతో...

మాయా మర్మం తెలియని నేత!

- జి. రాజశుక

అది 2001 జనవరి. అప్పుడు నేను చెన్నైలో ఇండియా టుడే అనే జాతీయ వార్తాపత్రికకు సంపాదకుడిగా పనిచేస్తుండేవాడిని. ఓ వార్తా కథనం కోసం విజయవాడ వచ్చాను. ఆ కథనం కోసం మొదటిసారిగా మండలి బుద్ధప్రసాద్‌ను కలవబోతున్నాను. ఆయన అప్పుడు స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఉన్నారని తెలిసింది. ఫోన్ చేసి, అపాయింట్‌మెంట్ అడిగాను. ఆయన వెంటనే రమ్మన్నారు. గెస్ట్ పరిసరాలు ప్రశాంతంగా ఉన్నాయి. గెస్ట్ హౌస్ ప్రాంతమంతా పార్టీ నాయకులు, కార్యకర్తలతో హడావిడిగా ఉంటుందనీ, నినాదాలతో మార్మోగిపోతుంటుందనీ ఊహించిన నాకు అటువంటి వాతావరణమేమీ అక్కడ కనిపించలేదు. నగరానికి చెందిన ఒకరిద్దరు నాయకులు అక్కడ కూర్చుని కనిపించారు. కానీ, హడావిడి మాత్రం లేదు. లోపలికి వెళ్ళాను. బుద్ధప్రసాద్ అక్కడ ఓ గదిలో కొందరితో కూర్చుని ఉన్నారు. అక్కడ కూర్చున్నవారిలో చాలామంది నాకు తెలిసినవారే అవడం వల్ల వెంటనే గుర్తుపట్టి లోపలికి వెళ్లాను. అందులో ఎక్కువ మంది విద్యావంతులు, కళాకారులు, కవులు, రచయితలు! – నాకు ఆశ్చర్యం వేసింది. ఏదైనా 'భువన విజయం' లాంటి కార్యక్రమానికి వచ్చానా అనిపించింది.

ఇంటర్వ్యూ మధ్యలో ఆయనను ఇదే ప్రశ్న అడిగాను. "ఇదేమిటి? మీరు కార్యకర్తల మధ్య, అంటే మీ పార్టీ వాళ్ల మధ్య ఉంటారనుకున్నాను" అని వ్యాఖ్యానించాను. "వీళ్లూ మనవాళ్లే కదా" అని ఆయన నవ్వుతూ జవాబిచ్చారు. సాధారణంగా నేను ఏ పార్టీ నాయకుడి దగ్గరకు వెళ్లినా కార్యకర్తలు, నాయకుల హడావిడే ఎక్కువగా కనిపిస్తుంటుంది. కానీ, బుద్ధప్రసాద్ చుట్టూ ఉన్న వాతావరణం ఆయన వ్యక్తిత్వం లాగానే ప్రశాంతంగా కనిపించింది. కొన్నాళ్లకు ఒకసారి నేను అవనిగడ్డ వెళ్లాల్సి వచ్చింది. ఆయనను కలవాలనుకున్నాను. ఇంటి ఆవరణంతా నాయకులు, కార్యకర్తలతో కిటకిలాడిపోతోంది. కానీ, వాతావరణం మాత్రం నిశ్శబ్దంగా ఉంది. ఎవరు ఏ పని మీద వచ్చినా ఆయన వెంటనే ఫోన్ తీసి, వాళ్ల పని పూర్తి చేస్తున్నారు. ఆయన ఎక్కడున్నా ఆయన స్వభావానికి తగ్గ వాతావరణం అక్కడ ఏర్పడుతుందనిపించింది.

దివి సీమకు ఉప్పెన వచ్చి 25 ఏళ్లు పూర్తయిన సంవత్సరంగా అక్కడి ప్రస్తుత పరిస్థితి మీద కథనం చేద్దామనిపించి, మళ్లీ ఆయనను సంప్రతించాను. వాస్తవానికి అప్పటికి కొద్ది రోజుల ముందు దివిసీమ మీద కథనం చేయమని సూచించింది ఆయనే. దివిసీమలో ఏయే ప్రాంతాలను సందర్శించవచ్చో, ఎవరెవరిని సంప్రతించవచ్చో ఆయన నాకు ఫోన్‌లో వివరించి చెప్పారు. సరే, నేను విజయవాడ వచ్చి కారు మాట్లాడుకుని, ఆయనతో ఒకసారి వ్యక్తిగతంగా మాట్లాడి, దివిసీమ అభివృద్ధి మీద ఆయన అభిప్రాయాలు కూడా తీసుకుని వెడదామని ఆయన దగ్గరకు వెళ్లాను. ఆయన నన్ను చూడగానే, "నేనూ వస్తున్నా పదండి" అంటూ తన కారులో బయలుదేరారు. నాకు ఇది వింతగా తోచింది!... ఆయనతో కారులోనే మాట్లాడబోయాను. "దివిసీమ

ఉప్పెన వచ్చినప్పుడు ఎట్లా ఉందో, ఇప్పుడు ఎట్లా ఉందో మీరే స్వయంగా చూసి, అక్కడి బాధితులతో మాట్లాడి మీ అభిప్రాయం మీరు ఏర్పరచుకోండి. ఆ తరువాత విజయవాడ వచ్చిన తరువాత మాట్లాడుదురుగాని" అని ఆయన చిరునవ్వుతో సలహా ఇచ్చారు. ఆ రోజున ఆయన నాతో దాదాపు ఎనిమిది గంటలు గడిపారు.

పేరు పేరునా పలకరింపు

మేము దివి సీమను పూర్తిగా శోధించాం. ఎక్కడికి వెళ్లినా అక్కడి బాధితులను కలుసుకుని, ఉప్పెన తాకిడి, ఇప్పటి పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నాను. ఆయన ఎక్కడా ఒక్క మాట కూడా మాట్లాడలేదు. మా సంభాషణలను వింటూ ఉండేవారు. విచిత్రమేమిటంటే, ఆయన దివిసీమలో ప్రతి ఊర్లోనూ ప్రతి వ్యక్తినీ, ప్రతి కుటుంబాన్నీ వ్యక్తిగతంగా పలకరించారు. పేరు పేరునా పిలిచారు. ఎక్కడో పొలం పని చేసుకుంటున్న వ్యక్తిని సైతం దూరం నుంచే పిలిచి, కుశల ప్రశ్నలు వేసి, చేతులు ఊపి ముందుకు కదిలేవారు. నేను ఆయనను మొదటిసారి కలిసినప్పుడు మీ చుట్టూ నాయకులు, కార్యకర్తలు లేరేమిటని అడగడం ఎంత పేలవమైన ప్రశ్నో నాకప్పటికి అర్థమైంది.

ఆ తరువాత ఆయనను నేను అనేక సందర్భాల్లో కలిశాను. ముఖ్యంగా కృష్ణా జిల్లా రచయితల సంఘం కార్యక్రమాలు జరిగినప్పుడల్లా నేను ఆయనను తప్పనిసరిగా కలుసుకోవడం జరిగేది. ఇటువంటి సభలు, సమావేశాల్లో నేను కూడా ప్రసంగించిన సందర్భాలు అనేకం. నేను ప్రసంగించే సందర్భం వచ్చినప్పుడల్లా ఆయన నాకు ముందుగానే సూచించేవారు. "విమర్శలు ఉండేలా చూడండి" అని. ఆయనను ప్రశంసిస్తే ఆయన కొద్దిగా ఇబ్బందిగా ఫీలయ్యేవారు. నవ్వుతూనే వారించేవారు. ఒక్క అవనిగడ్డలోనే కాదు, మొత్తం కృష్ణా, గుంటూరు జిల్లాల్లో (ఆ మాటకొస్తే తెలుగు రాష్ట్రాల్లో) ఆయనకు తెలియని కళాకారుడు లేడు, ఆయన ఎరగని విద్యావంతుడు, కవి, రచయిత ఉండకపోవచ్చు! అందులో చాలామందిని ఆయన నాకు పరిచయం చేశారు. కాలక్రమంలో మేం మాత్రం మంచి స్నేహితులమయ్యాం. ఆయన ఎవరికైనా, ఎటువంటివారికైనా ఓ శ్రేయోభిలాషి. ఓ సభా ప్రాంగణంలో మా ఇద్దరినీ ఒకసారి లవణంగారు చూసి, "మీ ఇద్దరూ నాకు ఇద్దరు పిల్లలాంటివాళ్లయ్యా" అని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు.

ఆయనది పూర్తిగా సానుకూల దృక్పథం. ఎప్పుడూ విచారంగానో, దిగులుగానో, నిర్వేదంగానో మాట్లాడరు. ఆయన పాజిటివ్ ఔట్‌లుక్‌కు సాటి ఉండరనిపిస్తుంది. అలాగే, ఆయన ఎక్కడికి వెళ్లినా, ఎవరిని కలిసినా పూర్తి సమాచారాన్ని తన చేతిలో ఉంచుకుంటారు. ఒకసారి జర్మనీలో ఓ ప్రాంతానికి చెందిన మేయర్ గుజ్జుల రవీందర్ రెడ్డి విజయవాడ వచ్చారు. పొద్దున్నే బుద్ధప్రసాద్ ఫోన్ చేసి, ఆయనను కలుద్దాం రమ్మన్నారు. వెంటనే వెళ్లాను. ఆయన జర్మనీ గురించి, అక్కడి వివిధ ప్రాంతాలు, సమస్యల గురించి రవీందర్ రెడ్డికే అరగంటసేపు వివరించి చెప్పారు!... అలాగే ఒకసారి ఆయనతో కలిసి హంసలదీవి వెళ్లాను. వెంట పర్యాటక శాఖాధికారులు, పురావస్తు శాఖాధికారులు (డాక్టర్ కేదారేశ్వరి, డాక్టర్ శివనాగిరెడ్డి తదితరులు) కూడా వచ్చారు. ఆయన ఆ ప్రాంత ప్రాశస్త్యాన్ని వివరించడంతో పాటు, ఆ ప్రాంత అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను కూడా ఓ అరగంట పాటు అధికారులకు వివరించారు. ఆయనకు ఈ సబ్జెక్ట్ కరతలామలకం అనిపించింది.

ఒకే మాట ఒకే బాట

ఈ పదిహేను పదహారేళ్ల కాలంలో ఆయన కొంత కాలం శాసనసభ్యుడు, కొంత కాలం మాజీ శాసన సభ్యుడు, కొంతకాలం మంత్రి, పశుసంవర్ధక శాఖ మంత్రిగా పనిచేశారు. పదవి ఉన్నా లేకపోయినా.. ఎమ్మెల్యేగా గెలిచినా గెలవకపోయినా ఆయన తీరులో మాత్రం మార్పు రాలేదు. ఎప్పుడూ ఒకే తీరులో పలకరించడం, అదే ఆత్మీయతను కనబరచడం నాకు మాత్రమే కాదు, ఆయన అశేష మిత్రులు, సన్నిహితులందరికీ అనుభవమయ్యే ఉంటుంది. ఎంత తామరాకుమీద నీటిబొట్టులా వ్యవహరించినా, ఆయన పని చేసే తీరు మాత్రం 'కదిలే మెషీన్' లాగా ఉంటుంది. నేను ఆయన ఎమ్మెల్యేగా ఉండగా ఇంటర్వ్యూ చేశాను. మాజీ ఎమ్మెల్యేగా ఉండగా ఇంటర్వ్యూ చేశాను. అలాగే, మంత్రిగా ఉన్నప్పుడు కూడా ఇంటర్వ్యూ చేశాను. ఈ మూడు దశల్లోనూ ఆయనతో విస్తృతంగా పర్యటనలు కూడా చేశాను. విచిత్రంగా ఆయన ప్రజాదరణలో కూడా మార్పు కనిపించలేదు.

పదవుల్లో లేనప్పుడు కూడా ఆయన ఖాళీగా కూర్చోలేదు. ఆయన తెలుగు భాషోద్యమం, ఆయన డెల్టా ఉద్యమం తెలుగు ప్రజలందరికీ చిరపరిచితమే. ఈ ఉద్యమాల పట్ల నాకు ఆసక్తి ఉన్నందువల్ల, నా వృత్తి రీత్యా నేను స్వయంగా పాల్గొనలేని స్థితిలో ఉన్నందువల్ల, ఉద్యమాల వార్తలను ప్రచురించడంతో సరిపుచ్చుకునేవాడిని. ఆ ఉద్యమాల్లో ఆయన పాల్గొనేటప్పుడు ఆయన తీరు వేరు. రాజకీయ కార్యకలాపాల్లో ఆయన తీరు వేరు. కార్యకర్తలతోనో, మిత్రులతోనూ మాట్లాడుతున్నప్పుడు ఆయన వ్యవహారశైలి వేరు. విశేషమేమిటంటే, ఆయన ఫలానా వార్త రాయమని గానీ, ఫలానా వార్త రాయవద్దని గానీ ఏనాడూ చెప్పలేదు. నా వృత్తికి ఉన్న స్వతంత్రతను ఆయన ఎంతగానో గౌరవించేవారు. పత్రికా స్వేచ్ఛకు, పాత్రికేయుల స్వేచ్ఛకు ఆయన ఏనాడూ అడ్డుతగలలేదు. ఆయనకు తెలుగు భాష పట్ల ఉన్న అపార ప్రేమ అందరికీ తెలిసిందే. ఏవైనా పర్వదినాల్లో ముఖ్యంగా ఉగాది, సంక్రాంతి రోజుల్లో ఇంగ్లీష్‌లో గ్రీటింగ్స్ పంపితే ఆయన దగ్గర నుంచి జవాబు రాదు. తెలుగులో పంపితే మాత్రం వెంటనే సమాధానం వస్తుంది. ఆయన పంపించినా అది తెలుగులోనే ఉంటుంది తప్ప పొరపాటున కూడా ఇంగ్లీషులో ఉండదు. అవి స్వచ్ఛమైన శుభాకాంక్షలే గానీ, గ్రీటింగ్స్ కావు. ఆయన ఎమ్మెల్యేగా, మాజీ ఎమ్మెల్యేగా, మంత్రిగా, అన్నిటికీ మించి రాజకీయ నాయకుడిగా తన అనుభవాలను తరచూ చెబుతుంటారు. అలాగే ఓ జర్నలిస్టుగా నా అనుభవాలనూ, జ్ఞాపకాలనూ ఆయన అడిగి తెలుసుకుంటుంటారు.

నా నాలుగు దశాబ్దాల జర్నలిస్టు జీవితంలో వందలాది మంది నాయకులును కలుసుకున్నాను. అందులో, దాదాపు అన్ని పార్టీలవారూ ఉన్నారు. మాయా మర్మాలతో కూడిన రాజకీయాలే వాళ్లందరి వృత్తి. ఇందులో సందేహమేమీ లేదు. కానీ మాయా మర్మం లేని రాజకీయ నాయకుడు మాత్రం మండలి బుద్ధప్రసాదే. అటువంటి నాయకుడిని ప్రపంచానికి అందించినందుకు అవనిగడ్డ ఏదో అదృష్టం చేసుకుందనిపిస్తుంది.

60 ఏళ్ళ అలుపెరుగని భాష ప్రేమికునికి ప్రేమాభివందనాలు

- చలపాక ప్రకాష్

శ్రీ మండలి బద్ధప్రసాద్ మొదటగా నాకు ఒక శాసనసభ్యునిగానే పరిచయం. ఆ తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండుసార్లు మంత్రివర్యులుగాను అందరితో పాటు సామాన్యమైన పరిచయమే. కాని కృష్ణాజిల్లా రచయితల సంఘానికి గౌరవ అధ్యక్షులుగా ఆయన ప్రపంచ రచయితల మహాసభలు రెండు సార్లు, ప్రభుత్వ హోదాలో ఒకసారి తెలుగు మహాసభలు అద్భుతరీతిన నిర్వహించి, తెలుగు నేలంతా అబ్బురపడే విధమైన ఘనతను సాధించారు. బుద్ధప్రసాద్‌గారిలో ముఖ్యంగా నాకు నచ్చిన గుణాలు ఆయన గాంధేయవాది, మితవాది, నిరాడంబరత్వం.... ఎప్పుడూ చిరునవ్వుతో అవతల వ్యక్తి హోదాలో పెద్దవాడైనా, చిన్నవాడైనా ఏ విధమైన తారతమ్యం చూపకుండా.... ఏ విధమైన భేషజాలు లేకుండా అందర్నీ చిరునవ్వుతో సమానంగా స్వాగతిస్తూ... పలకరించటం నన్ను చాలా ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఎంత ఎత్తు ఎదిగినా ఒదిగుండాలనే తత్త్వాన్ని మళ్ళీ మళ్ళీ గుర్తు చేస్తూ ఉంటోంది. నిజం చెప్పాలంటే నాకు రాజకీయ నాయకులంటే ఒక విధమైన ద్వేషంతో కూడిన భయం. కాని సాధారణ రాజకీయ నాయకుల కంటే భిన్నమైన, మృదువైన, వెన్నలాంటి బుద్ధప్రసాద్ మనస్తత్వం నాతోపాటు మరెందరినో ఆకట్టుకుని మరింత చేరువ చేసిందన్నది మాత్రం నిజం.

అన్నిటికంటే ముఖ్యంగా నేను 'రమ్యభారతి' సాహిత్య వేదిక నిర్వాహకుడిగా.. సభలకు ముఖ్యఅతిథులను ఎన్నిక చేయడంలో నాకు ఎదురైన అనేక చేదు అనుభవాలు ఈ సందర్భంలో మీ ముందుంచి తీరాలి. కొందరు అతిథుల్ని పిలిస్తే వస్తామని మాట ఇస్తారు గాని చివరి నిముషంలో డుమ్మాకొడతారు. మరికొందరు వస్తామని చెప్పి సభ మొదలైనా ఎన్నోసార్లు ఫోన్లు చేస్తేగాని సభకు రారు. ఇలా అనేక విధాలుగా ఆర్థికపరంగా, మానసికంగా అనేక సమస్యలతో విసిగిపోయిన నాలాంటి నిర్వాహకులకు బుద్ధప్రసాద్‌గారి లాంటి సాహిత్యాభిలాషి లభించటం నిజంగా మాకు వరంలాంటిది. ఆయన్ని సభకు అతిథిగా పిలవాలంటే ఎక్కడికీ వెళ్ళనవసరంలేదు సరికదా, ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు. ఆయన ఫోన్‌లోనే చిరునవ్వుతో పలకరిస్తూ.. 'సభకు వస్తాను' అని మాటిచ్చారంటే చాలు, ఇక ఆ సభానిర్వాహకుడు ఆయన గురించి మర్చిపోయి పనులు చేసుకుపోవచ్చు. అంత ఖచ్చితంగా .... సమయానికి మళ్ళీ మళ్ళీ ఫోన్ చెయ్యకుండానే ఆయన ఆ సభలో వాలి పోతారు.. ఇలా రాష్ట్ర రాజకీయాలలో ఎంతో బిజీగా ఉంటూనే బుద్ధప్రసాద్‌గారిలాంటి ఉన్నత స్థాయిగల, మహోన్నతమైన ఉదార స్వభావం గల సాహిత్యాభిలాషి నాలాంటి వారికి భూతద్దంలో వేసినా దొరకలేదుగాక దొరకలేదు. ఇది పొగడ్త కాదు, ఆయన సాహచర్యంలో చేసిన సాహిత్య కార్యక్రమాల ద్వారా నాకు లభించిన అనుభవ సత్యమిది.

ఇంత మంచి హృదయమున్న మండలి బుద్ధప్రసాద్ గారు అప్పుడే షష్ట్యబ్దిలో ప్రవేశించినా అదీ మాలాంటి వారికి ఒక సంబరమే! ఎందుకంటే వయస్సు పైబడుతున్నా తెలుగు భాషకు ప్రపంచ స్థాయిలో ఇతోధిక గౌరవాన్ని, గుర్తింపుని తీసుకొచ్చే రీతిలో, భాషే ఊపిరిగా, సాహిత్యమే శ్వాసగా నిరంతర భాషాప్రేమికునిగా జీవించే ఆయన పెద్దరికంలో.. అలుపెరుగని ఉత్సాహంతో, ఆయన్ని చూసి మరెందరో స్ఫూర్తి పొంది మరింత ఉత్సాహంతో ముమ్ముందుకు నడిచే రీతిలో కొనసాగాలని కోరుకుంటూ.... ఈ సందర్భంగా బుద్ధప్రసాద్‌గారికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

సాహిత్య సాంస్కృతిక వారధి - సారథి

- దంటు సూర్యారావు

అవదాత సుకుమారమైన అంతరంగము, కార్య నిర్వహణ యందు అలుపెరుగని శ్రద్ధ, భారతీయ వారసత్వ సంపదలైన సాహిత్య సాంస్కృతిక విషయముల యందు అపురూపమైన అపూర్వ పరిచయము, అభినివేశము, ఆచరణాత్మక ప్రణాళికా నిర్వహణము, ఆదర్శవంతమైన శీలము ఇలా ప్రపంచంలోని ఉత్తముల సద్గుణాలు రూపుదిద్దుకొంటే శ్రీ మండలి బుద్ధప్రసాద్.

తరాల నుండి వస్తున్న మంచిని తండ్రి గారి నుండి అందిపుచ్చుకొని భావితరాలకు అందించడంలో అందెవేసిన చేయి శ్రీ మండలి బుద్ధప్రసాద్.

వారి తండ్రి గారు శ్రీ మండలి వేంకట కృష్ణారావు, మా తండ్రిగారైన శ్రీ దంటు భాస్కరరావు గారు సహ శాసనసభ్యులుగా, సాహిత్య సాంస్కృతిక పోషకులుగా, నిర్వాహకులుగా చేయి చేయి పట్టి నడచిన వారైనా, మాకు ఒకరి గురించి ఒకరికి తెలిసినా, ప్రత్యక్షంగా కలుసుకోవడం మాత్రం కేవలం ఒక దశాబ్దం క్రిందటే. కాని జన్మ జన్మల బంధంగా మా మధ్య పెనవేసుకున్న సాహిత్య బంధము, సాంస్కృతిక సుగంధము మరిన్ని సత్కార్యములు జరిపించడానికి దోహదమై స్నేహ మాధుర్యమునకు వన్నె తెచ్చి జనహిత కారకమైనది.

2006 సం॥ములో కాకినాడలో శ్రీ పిఠాపురం మహారాజా వారు నిర్మించిన 'ఓం' భవనంలో జరిగిన బ్రహ్మ సమాజ సమ్మేళనానికి శ్రీ బుద్ధప్రసాద్ ముఖ్య అతిథి కాగా నేను సభాధ్యక్షుడుగా మా మధ్య తొలి పరిచయమైనది. నిజానికి ఇట్టి తాత్విక సభలకు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి వగైరా స్థాయి పెద్దలతో కంటే సాంస్కృతిక సారథి-వారధి యైన శ్రీ బుద్ధ ప్రసాద్ వంటి మనసున్న మహరాజే సరియైన అతిథి అని ఎవరేమనుకున్నా ధైర్యంగా అన్న నా మాట ఆయనను ఆశ్చర్యపరచడమే కాదు దగ్గర చేసింది. శ్రీ మండలి వారి కుటుంబం సాహిత్యానికి, ప్రత్యేకించి మాతృభాషాభివృద్ధికి చేసిన ఎనలేని సేవలు సభకు గుర్తుచేశాను. సభ యావత్తు ఆనంద తరంగితమైంది.

2008 సం॥ములో వారు కాకినాడ గాంధీ భవన్ సందర్శించి అక్కడ ప్రదర్శించబడుతున్న అన్ని ఛాయా చిత్రాలు చూసి పులకాంకితులై ఒక అపురూప భావాన్ని వ్యక్తపరిచారు. "భావి తరాలు గాంధీ వంటి ఒక మహనీయుడు ఈ భూమిపై మన మధ్యనే పుట్టి, యావత్ ప్రపంచాన్ని తన నిరాడంబరత, సత్యవాక్ పరిపాలన మరియు అహింసాయుత పోరాటం వంటివి జరిపేరంటే నమ్మరేమో!" అని. అలాగే మరోసారి 2011 సం॥ములో సందర్శించినప్పుడు "చాల మంది సభలలో శ్రీ గాంధీగారి వాక్యాలు ఉటంకిస్తారే గాని, మద్యపాన నిషేధం, సత్యవాక్ పరిపాలనం విషయాలలో ఆచరించడానికి ముందుకు వచ్చేవారు అరుదనీ ముఖ్యంగా ఎన్నికల సమయంలో దీనికి వ్యతిరిక్తంగా వ్యవహరిస్తారనీ, తాను కూడా అందుకు అతీతుణ్ణి కాద"నీ బాధాతప్త హృదయంతో అందరిచే కను చెమర్పించారు.

2011 సం॥ములో కాకినాడలో బ్రహ్మశ్రీ రఘుపతి వేంకటరత్నం నాయుడు గారి 150వ జయంతి కార్యక్రమాలలో కలిసి పనిచేయడం మా మధ్య స్నేహానికి మరింత దోహద పడింది. ఇరు కుటుంబాలు ఒకే మార్గంలో నడుస్తున్నందు వల్ల మా పరిచయం అభిమానంగా మారింది. మేము వారిని ముఖ్య అతిథిగా రమ్మని ఆహ్వానించగానే అంగీకరించి సభకు హాజరు కావడం ఒక విచిత్ర సన్నివేశమైంది. కారణం ఈ మధ్యలో వారు అవిభక్త ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులుగా నియమితులై సొంత జిల్లాయేతర కార్యక్రమాలలో పాల్గోవడం ఇదే మొదటిది. ఈ సభలోనే శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు తమ ఇంటికి వచ్చి వెళ్తున్నప్పుడు కారు వరకు సాగనంపిన సమయంలో తాను తన గురువుగారు ఎవరని అడిగితే శ్రీ దేవులపల్లి గారు మహదానందంతో కాగితంపై సర్ రఘుపతి వేంకటరత్నం నాయుడుగారని రాసి చూపించారని గుర్తుచేసుకుని దేవులపల్లివారితో గల ఇతర అనుబంధాన్ని తెలియపరిచారు.

పనిలో పనిగా నా అభ్యర్థన మన్నించి గత నూరేండ్లుగా కాకినాడ కేంద్రంగా వర్ధిల్లుతున్న 'ఆంధ్ర సాహిత్య పరిషత్' శత జయంతి ఉత్సవాల సందర్భంగా సందర్శించి చిన్ననాట నుండి పరిషత్‌తో తనకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకుని తెలుగు భాషా చరిత్ర రంగాలకు పరిషత్ చేసిన అమోఘమైన సేవలను ఉగ్గడించారు. ప్రధానంగా పరిషత్ సేకరించి ప్రకటించిన తాళపత్ర గ్రంథాలు, శాసనాలు తెలుగు వారికి చేసిన మేలు గురించి శ్లాఘించారు. తన పర్యటన నాటికి పురావస్తుశాఖ ఉన్నతాధికారులను రప్పించారు.

సమయపాలన : ముందుగా అంగీకరించినట్లుగానే అవనిగడ్డ నుండి రోడ్డు మార్గంలో సరిగ్గా 9:00 గంటలకు కాకినాడ చేరి అందరిని ఆశ్చర్యపరిచారు. నిజానికి హైదరాబాదు నుండి రావలసిన ఉన్నతాధికారి కారణాంతరాలవల్ల ఆలస్యమయినా సహృదయంతో మన్నించి ఇతర కార్యకలాపాలలో పాల్గొన్నారు. ఇది వారి సమయపాలనకు, సహృదయతకు నిదర్శనం. 'ఆస్వాదన సాహితీ సమితి' వారి గ్రంథావిష్కరణ కార్యక్రమానికి విచ్చేసినప్పుడు కూడా స్థానిక ప్రజాప్రతినిధులకంటే ముందే వచ్చి జిల్లా అధికారులతో సమీక్షించి సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాల అమలు గురించి వాకబు చేశారు.

సందర్శించి ఊరుకోకుండా హైదరాబాదులో గల భాషా సాంస్కృతిక మరియు పురావస్తు శాఖ ఉన్నతాధికారులందరినీ ఆంధ్రసాహిత్య పరిషత్‌ను సందర్శించమని కోరి ఇతోధిక నిధులు ఇప్పించి ఆ మహా సంస్థ శత జయంతి ఉత్సవాలు చక్కగా జరగడానికి సహాయ పడ్డారు. నన్ను హైదరాబాదు రప్పించి ఆయా ఉన్నతాధికారులను తన ఛాంబరుకు పిలిపించి విషయము వివరింపజేసి మూడు లక్షల రూపాయల గ్రాంటు ఇప్పించారు.

ఫలితంగా, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత శ్రీ రావూరి భరద్వాజగారి అమృత హస్తాలతో కేంద్ర మానవ వనరుల శాఖామంత్రి శ్రీ మల్లిపూడి మంగపతి పళ్లంరాజు గారి సమక్షంలో ప్రారంభమై, శ్రీ మండలి బుద్ధప్రసాద్, శ్రీ రమణాచారి గార్ల నేతృత్వంలో మూడవ రోజు ముగింపు ఉత్సవాలు అత్యద్భుతంగా జరిగినవి. ప్రాచీన సాహిత్యానికి పరిషత్ చేసిన సేవ పదుగురు ఉపన్యాసకులచే కొనియాడబడి, శ్రీ జయంతి రామయ్య పంతులుగారు, శ్రీ పిఠాపురం రాజావారు ఇతర పెద్దలు చేసిన మహనీయ కృషి ఈ నేటి తరానికి అందింది.

దొడ్డ మనసుతో, భావి దర్శనంతో శ్రీ మండలి - శ్రీ ఆంధ్రసాహిత్య పరిషత్‌ను 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సు'గా ప్రకటించాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఆ మహనీయులకు జాతి ఋణపడి ఉందని వాక్రుచ్చారు. శ్రీ దంటు భాస్కరరావు గారు పరిషత్ అధ్యక్షులుగా 'శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు' పూర్తి చేయించి నాటి ఉపరాష్ట్రపతి సర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారిని కాకినాడ తీసుకుని వచ్చి ఆవిష్కరింప జేసిన ఘట్టాన్ని, చివరలో శాసన సభ్యునిగా తనకు ప్రభుత్వంలో గల పలుకుబడిని ఉపయోగించి వితరణ శీలుల దయాదాక్షిణ్యాలకు వదిలివేయక పరిషత్‌ను ప్రభుత్వ ఆధీనం చేసి, కలకాలం ప్రభుత్వోద్యోగులతో నడపబడేలా శాశ్వత మార్గం చూపించిన ముందుచూపును శ్లాఘించారు.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి ఈ సహకారం లేకపోతే ఆ శతజయంతి సభలు సరిగా జరిగేవి కాదేమో! ఇది నా ఒక్కడి అనుభవమే కాదు - రాష్ట్రం నలుమూలలా ఇట్టి సహకారం పొంది సఫలమైన సభలెన్నో! నిర్వహింపబడ్డ నాటక ప్రదర్శనలెన్నో!! పరిఢవిల్లిన కళా సంస్థలెన్నెన్నో!!!

ఆ సభలోనే మా తండ్రి గారి పేరిట ఏర్పాటు చేసిన శ్రీ దంటు భాస్కరరావు స్మారక సాహిత్య పురస్కారం మొదటిగా శ్రీ మండలి బుద్ధ ప్రసాద్ గారి అమృత హస్తాలతో అందించడం ద్వారా నన్ను ధన్యుణ్ణి చేశారు. తరువాత సంవత్సరం ఈ పురస్కార సభకు పిలిచే నాటికి, ది. 30-06-2014న సభ జరిగిన నాటికి మరొక అపూర్వ సన్నివేశం జరిగింది. వారు ఆంధ్రప్రదేశ్ శాసన సభకు ఎన్నికయ్యారు. ఇది కూడా జిల్లాయేతర సభలలో వారు శాసనసభ్యులుగా పాల్గొన్న మొదటి సభ. నేటి వరకు జరిగిన మూడు పురస్కారాలు కూడా వారే ప్రదానం చేశారు.

మా తండ్రిగారైన శ్రీ దంటు భాస్కరరావు గారి శత జయంతి సభ జరిగేనాటికి మరో చిత్రం జరిగింది. మేము పిలిచే నాటికి, సభనాటికి మధ్య వారు ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతిగా నియమితులయ్యారు. ఇలా రెండు సార్లు ముచ్చటైన చిత్రాలకు కాకినాడ వేదికైంది. శతజయంతి సభలో జరిగిన మరో ముచ్చట పేర్కొనకుండా ఉండలేను. సభా నిర్వాహకుడు ప్రముఖ కవి, వ్యాఖ్యాత శ్రీ ఓలేటి పార్వతీశం (దూరదర్శన్ అధికారి) గారు శ్రీ బుద్ధప్రసాద్ వంటి ప్రజా ప్రతినిధుల సమయాన్ని దృష్టిలో పెట్టుకుని కొన్ని ప్రసంగాలను కత్తిరింప చూడగా వీరు సమయాన్నిచ్చి, ఆకలికోర్చి కూడా "పెద్దల ఆదర్శవంతమైన కృషి భావితరాలకు అందడం ముఖ్యం - కాని మా సమయం కాదు" అని నిక్కచ్చిగా శెలవిచ్చారు. సభ యావత్తు ఆశ్చర్యపోయింది.ప్రతిష్టాత్మక పి.ఆర్. కళాశాల పూర్వవిద్యార్థి అయిన శ్రీ చక్రధరరావు గారు (ప్రస్తుతం విజయవాడ సిద్ధార్థ విద్యాసంస్థల ప్రత్యేకాధికారి) మాట్లాడుతూ తాను శ్రీ భాస్కరరావు గారు ఎమ్.ఎల్.ఎ.గా ఉన్న కాలములోనే కళాశాల విద్యార్థి నాయకుడిగా ఎన్నికైన తనను పిలిపించి అభిమానించుటేకాక తానుకూడా పి.ఆర్. కళాశాల పూర్వ విద్యార్థినే అని జ్ఞాపకం చేసి కళాశాల విద్యార్థి బృందాలకు కావలసిన సదుపాయాలు అడిగి తెలుసుకుని అన్నీ కల్పించిన మహానుభావుడని కీర్తించారు. దీనిపై శ్రీ మండలి స్పందిస్తూ తమ ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యా సంస్థలలో ఇలా ఎన్నిక అయిన వారిని తాము ఎప్పుడు అభినందించలేదని తన తండ్రి స్నేహితులైన శ్రీ భాస్కరరావుగారిని ఆదర్శంగా తీసుకుని ఇకపై ఆచరిస్తానని అన్నారు. సభ కరతాళ ధ్వనులతో మార్మోగింది.

నేను మరువలేని మరో సంఘటన : తొలి ప్రపంచ తెలుగు మహా సభలు నిర్వహించిన తండ్రిగారి అడుగు జాడలలో అధికార భాషా సంఘం అధ్యక్షునిగా 4వ ప్రపంచ తెలుగు మహాసభలు తిరుపతిలో నిర్వహించడానికి ముందు జరిగిన సన్నాహక సమావేశానికి నన్ను ఆహ్వానించి ఆంధ్ర సాహిత్య పరిషత్ గురించి ప్రసంగింపజేసి తెలుగు భాషా సాహిత్యాలకు, చరిత్ర నిర్మాణానికి పరిషత్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సమగ్ర కార్యాచరణతో సభలను విజయవంతం చేయాలని మార్గదర్శనం చేశారు.

స్థానిక ప్రజా ప్రతినిధుల కంటే కాకినాడ సాంస్కృతిక రంగంపై వీరికి గల ఆసక్తి, అభిమానం దొడ్డవి. అందుచేతనే కాకినాడ సాహితీ కళా రంగాల వారు వీరికి ఎప్పటికీ ఋణపడి ఉంటారు. ప్రత్యేకించి వారు నాయెడల చూపే ఔదార్యం మహనీయమైనది. తరతరాలు గుర్తుంచుకోతగినది. ఇది ప్రజా శ్రేయస్సు కోసం పునరంకితమై జన్మ జన్మల బంధంగా రూపుదిద్దుకొని భావి తరాలకు ఆదర్శవంతమైనది. మరొక చిత్రమేమిటంటే వ్యక్తిగత స్వార్థాలకు అతీతమై, కల్మష మంటని కమనీయ సౌరభం శ్రీ మండలి బుద్ధ ప్రసాద్ గారి సాన్నిధ్యం.

వారు సాహిత్య సాంస్కృతిక రంగాలకు, కవి పండితులకు, కళాకారులకు చేయూత నీయడం ఎందరికో మాబోంట్లకు ఆదర్శం, భావి తరాలకు దిక్సూచి, అందరిలో సమున్నతుడు శ్రీ మండలి. రాజకీయ రంగానికి సాంస్కృతిక సుగంధాన్ని అలమిన అపురూప రత్నం శ్రీ మండలి. వారు గాంధీగారి గురించి అన్న మాట వీరికీ వర్తిస్తుంది. ఇట్టి వారు రాజకీయాలలో రాణిస్తూ కూడా సంస్కార పరిమళాలను వెదజల్లేరని భావితరాలు నమ్మడం కష్టం. ఈ సంచిక వారి సమ్యక్ కృషికి సాక్ష్యం కావాలని, చరిత్ర నిర్మాణంలో ఒక అంకం కావాలని ఆశిస్తున్నాను. వీరు శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి గారి నిలువెత్తు విగ్రహాన్ని తన నియోజక వర్గంలో ఒకటైన వారి స్వస్థలం పెదకళ్ళేపల్లిలో స్థాపించడంలో, అక్కడే మహాభలు జరిపించడంలో చూపిన అద్వితీయ భాషాభిమానం తరతరాలు గుర్తుంచుకోదగినది. అట్లే కృష్ణదేవరాయల కృషిని, శ్రీకాకుళేశ్వరుని మహిమను లోకానికి తెలియజెప్పాలన్న వీరి తపన గొప్పవి. చిననాడే జలప్రళయానికి గురైన దివిసీమను తన చిన్ని చేతులతో ఆదుకోడానికి మొదలు పెట్టిన కృషి, ఇంతింతై వటుడింతై.... .... అన్నట్లుగా యావత్ ఆంధ్రదేశానికి, కాదు.. భారతదేశంలోని తెలుగు వారందరికీ కాదు కాదు.. ప్రపంచంలోని తెలుగు వారందరికీ ... ఇతోధిక సాంస్కృతిక సేవలుగా వర్ధిల్లి "స్వయం తీర్ణా – పరాం స్తారయతి" అన్న ఋషి వాక్కును గుర్తుకు తెస్తున్నది. అట్టి మహనీయుని షష్టిపూర్తి ఉత్సవ అభినందన గ్రంథానికి 'చంద్రునికో నూలుపోగు' ఈ నా వ్యాసం.

బుధ జన మండలి

- పూషడపు బాలసుబ్బారావు

వస్త్రేణ వపుషా వాచా విద్యయా వినయేనచ
వకారైః పంచభిర్యుక్తః నరో భవతి పూజితః!!

శుభ్రమైన వస్త్రం, ఆకట్టుకునే రూపం, మృదువైన వాక్కు, విచక్షణ తెలిపే విద్య, పెద్దల యందు వినయం అనే ఐదు వకారాలున్న నరుడు లోకపూజితుడవుతాడు.

"అయన వాహనం వెంట పది వాహనాలు దుమ్మురేపుతూ పరుగులెత్తవు
ఆయన చేతలు, చేతులు అపాత్రుల అడుగులకు మడుగులొత్తవు
ఆయన ఆకారం, ఆహార్యం గాంధేయం, ఆయన నడక, నడత బహుజన విధేయం
ఆయనే మన మండలి బుద్ధప్రసాదు"

షష్టి పూర్తి ఎందుకు?

సామ వేదానికి చెందిన ఛాందోగ్యోపనిషత్తు మానవులలో పురుషాయుర్ధాయం 116 సంవత్సరాలుగా చెప్పింది. మన ఆర్ష సాహిత్యం దానిని కాస్త పొడిగించి 120 సంవత్సరాలుగా నిర్ధారించింది. అందుకే అందులో సగభాగం అనగా 60 ఏండ్లు నిండిన పుణ్య పురుషునికి షష్టి పూర్తి ఏర్పరిచారు. ఆ సమయంలో శాంతి, యాగ, దానాది పుణ్యకర్మలు ఆచరించాలని 'కల్ప సూత్రాలు' చెప్తున్నాయి. పెద్దలు ఏర్పరచిన ఈ సత్సంప్రదాయాన్ని కొనసాగిస్తూ స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని గడుపుతున్న శ్రీ విజయలక్ష్మి బుద్ధప్రసాదు దంపతులకు షష్టి పూర్తి వేడుక దైవ ప్రేరితంగా జరుగుతున్నది.

ఈ లోకంలో నిజమైన వారసులు ఏ కొద్దిమంది తల్లిదండ్రులకో లభిస్తారు. మాన్యులు శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారు ఏనాడో తన సత్కీర్తి హలంతో ఈ నేలను దున్ని శాశ్వత పుణ్యలోక వాసం చేస్తున్నారు. తండ్రికి అంతేవాసిగా ఆయన దున్నిన నాగటిచాలులో శక్తి కొలదీ వ్యవసాయం చేస్తున్నారు బుద్ధప్రసాదుగారు.

ఇటీవలి కాలంలో చాలామంది నేతలు అకస్మాత్తుగా తెరమీదకొచ్చి మతాబుల్లా వెలుగుతున్నారు. తారాజువ్వల్లా దూసుకెళ్తున్నారు. కొద్దికాలానికే తెగిన గాలిపటాల్లా ఎవరి పంచనో చేరిపోతున్నారు. ఏనుగుకు బయటి దంతాలు చాలా ఆలస్యంగా వస్తాయి. వచ్చినాక ఇక వెనక్కి వెళ్ళవు. బుద్ధప్రసాదు గారి కీర్తి గజదంతం లాంటిది. ఆయనకు పదవైనా, కీర్తి మధువైనా కొద్ది ఆలస్యంగానే వస్తుంది గానీ వస్తే ఇక తిరిగిపోదు.

ప్రస్తుత రోజుల్లో ఒక ప్రజాప్రతినిధి అన్నీ తానై నడిపించాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని తనదంటూ ఒక వర్గాన్ని పోషించాలని, తామేం చేసినా ఆయన భుజాన వేసుకోవాలని చలనచిత్రాల ప్రభావంతో జనం కోరుకుంటున్నారు. ఇలాంటి విషయాల్లో బుద్ధప్రసాదుగారు తామరాకు మీద నీటిబొట్టు లాగానే ఉంటారు. మంచివారినెప్పుడూ ఆయన రక్షిస్తూనే ఉంటారని బుద్ధి జీవులకు తెలుసు. నేను మాత్రం ప్రసిద్ధ తమిళ ప్రాచీన కవి 'తిరువళ్ళువర్' సూక్తిని ఈ సందర్భంగా మననం చేసుకుంటాను.

"బాణం తిన్నగా ఉన్నా – అది రక్తదాహం కలిగినది
వీణ ఒంపుగా ఉన్నా – అది అందరికీ నాద నీరాజనాన్ని దర్శింపచేస్తుంది"?
బుద్ధప్రసాదు గారు వీణ లాంటి వారు.

బుద్ధప్రసాదు గారి రాజకీయ జీవితంలో విపక్షాల వారు సైతం స్వపక్షంవారి లాగానే ఉండడం ఒక అరుదైన విషయం. బెజవాడ మొదలు కృష్ణా సాగర సంగమం వరకు వేయించిన సుపథం – ఆయన భవిష్యత్ దృష్టి పథానికి తార్కాణం. కూచిపూడి నాట్యాన్ని విశ్వయవనికపై ఆవిష్కరించి గిన్నిస్ గ్రంథంలోకెక్కించడం, స్వర్గీయ కాటన్, క్యాంప్‌బెల్‌ల నాటి కృష్ణ కాలువలను ఆధునికీకరించడం. కాలనాళికలో పడి కనుమరుగైన ఎందరో దివి రత్నాల జిలుగులను సర్వ ప్రజానీకం ముందు ఆవిష్కరించడం, అఖిలాంధ్ర జనాభ్యుదయం కోసం తన తండ్రి మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహిస్తే, అవిభాజ్యాంధ్రప్రదేశ్‌లో చివరి ప్రపంచ తెలుగు మహాసభలను అద్భుతంగా నిర్వహించడం బుద్ధప్రసాదు గారి కలికితురాయిలో కొన్ని మేలి ముత్యాలు మాత్రమే. సునాయాసంగా సుబ్రహ్మణ్యేశ్వరుణ్ణి చూసొస్తున్నా, ఎంతో గర్వంగా గుంటూరు జిల్లా కెళ్తున్నా, ఇకపై మాటిమాటికీ మచిలీపట్నం వెళ్ళాలన్నా దివిసీమకు ముప్పేట రహదారులు బుద్ధప్రసాదు నాయకత్వంలోనే అమిరాయి.

ఏటికిగట్లు చాలా చోట్ల ఉంటాయి. కానీ 'కడలికి కరకట్ట' తీరాంధ్రదేశంలో ఏ సీమకూ లేదు. మండలి వెంకట కృష్ణారావు ముందుచూపుతో దివిసీమకు తూర్పు, దక్షిణాలలో సముద్రానికి కరకట్ట ఏర్పడింది. ఎన్నో ఆటుపోట్లకు తట్టుకొంది. సునామీతో సముద్రుడు దండెత్తి వస్తే శిథిల దశలో ఉన్నా అడ్డుపడింది. మరలా బుద్ధప్రసాదు గారు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సముద్ర కట్టను పూర్తి స్థాయిలో పునరుద్ధరించారు.

నీతి కోసం, నీటి కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన బుద్ధప్రసాదు గారిని మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు ఏరి, కోరి ఉపసభాపతిగా నియమించారు. శ్రీ మండలి, దేశ, విదేశాలలో ఏమూల తెలుగు సవ్వడి వినిపించినా దానిని అవనిగడ్డ గాంధీక్షేత్రానికి తీసుకువచ్చి సందడి చేస్తారు. చైనా, ఇటలీ, జర్మనీలలో విహరించినా భారతీయ సంస్కృతి వారినెంతగా ప్రభావితం చేసిందో కలియచూస్తారు. భావదేవరపల్లిలో ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాల పెట్టి స్వగ్రామాన్ని జాతీయ స్థాయిలో నిలిపారు. భాష మీద మక్కువతో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు అనితర సాధ్యంగా నిర్వహించిన బుద్ధప్రసాదు గారు చరిత్ర మీద వల్లమాలిన అభిమానంతో 'దివి ఐతిహాసిక పరిశోధనా మండలి' నేర్పరచి తరచూ శాసనాల ప్రదర్శనలు, హిస్టరీ కాంగ్రెస్ సభలు, గ్రంథప్రచురణలు, ప్రాచీన దేవాలయాల, కట్టడాల జీర్ణోద్ధరణ కార్యక్రమాలు చేస్తున్నారు. స్వచ్ఛ గాంధేయాన్ని ఉద్యమస్థాయికి తీసుకువెళ్ళిన ఘనత బుద్ధప్రసాదు గారిదే. కవి, గాయక, వైతాళిక పోషకులకు, నిష్కళంక ప్రజా సేవాతత్పరులకు ఎప్పటికీ అపజయం కలుగదు.

దాశరథి మొదలు ఎందరో దార్శనికుల ఆశీస్సులు పొందిన 'బుధారాధన విరాజి' శ్రీ మండలి బుద్ధప్రసాదు గారు. వారు వారి కుటుంబం ప్రజలకు మరెన్నో మంచి పనులు చేయాలని వారికి ఆ ఉమామహేశ్వరులు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని కోరుకుంటూ.....

పురుషోత్తముడు

- ధర్మపురుష లోకనాథశర్మ

సృష్టిలో మానవజన్మ చాలా విశిష్టమైనది. జగద్గురు ఆదిశంకరాచార్యులు జంతూనాం మానవ జన్మ దుర్లభం అన్నారు. అటువంటి మానవ జన్మ ఎన్నో జన్మల పుణ్యఫలం. అటువంటి మానవ జన్మను సార్థకం చేసికొని తన జన్మను, జీవితాన్ని సమాజ హితం కోసం కృషి చేసిన వాడు పురుషోత్తముడు. ఆ విధంగా సమాజ హితం కోసం తన జీవితాన్ని మనసా, వాచా కర్మణా అంకితం చేసినవాడు శ్రీ బుద్ధప్రసాద్.

"పురుషులందు పుణ్యపురుషులు వేరయా" అన్న మన మహాయోగి వేమన సూక్తికి నిర్వచనంగా భగవద్గీతలో కృష్ణ భగవానుడు "మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతిసిద్ధయె" అని చెప్పినట్లుగా మనుష్యులలో కోటికి ఒకడు శ్రీ బుద్ధప్రసాద్ లాంటి వ్యక్తులు పుట్టి సమాజంలో పురుషోత్తముడిగా సమాజానికి సేవలు అందిస్తూ, భగవద్గీతలో భగవానుడు చెప్పినట్లుగా "ఉద్ధరేత్ ఆత్మనాత్మానం" అన్నట్లుగా మానవుడు మాధవుడుగా ఎదిగినవాడు శ్రీ బుద్ధప్రసాద్ మహోదయుడు. శ్రీ బుద్ధప్రసాద్ గారు అజాత శత్రువు. నిత్యం చిరునవ్వు చిందించే నగుమోమువాడు. "అద్వేష్టాసర్వ భూతానాం మైత్రకరుణ ఎవచ నిర్మమో నిరహంకారః" అన్న భగవద్వచనాలకు నిర్వచనం శ్రీ బుద్ధప్రసాద్ గారి జీవితం. శ్రీ బుద్ధప్రసాద్ గారు కులమత భేదములు లేకుండా రాజకీయాలకు అతీతంగా సాహిత్య, సాంస్కృతిక, వివిధ కళారంగాలకు విశిష్ట సేవలు అందించి తెలుగుజాతి గర్వపడేలా తెలుగు భాషకు అంతర్జాతీయ ఖ్యాతిని కల్పించిన మాన్యమహోదయుడు శ్రీ మండలి బుద్ధప్రసాద్.



ప్రముఖ సినీనటి శ్రీమతి అంజలీదేవిని సన్మానిస్తూ...

మండలి వారితో అమెరికా యాత్ర

- వై. వెంకటేశ్వరరావు

అమెరికాలో కాలిఫోర్నియా రాష్ట్రంలోని సిలికాన్ వ్యాలీలో గల క్యూపర్టినో నగరంలో నివసిస్తున్న ప్రవాసాంధ్రులు 2003 సంవత్సరంలో 'సిలికానాంధ్ర' పేరుతో తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణ కోసం ఒక సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. మచిలీపట్నంలో పుట్టి పెరిగిన డా. కూచిభొట్ల ఆనంద్ గారు ఈ సంస్థకు వ్యవస్థాపక అధ్యక్షులు. అక్కడి తెలుగు బాలల్లో తెలుగు భాష పట్ల ఆసక్తి పెంపొందింపచేయడానికి ప్రతివారం 'మనబడి' పేరుతో ఈ సంస్థ తరగతులను నిర్వహిస్తున్నది. ఇందుకుగాను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రత్యేకించి సిలబస్‌ను రూపొందించింది. కాలిఫోర్నియా రాష్ట్రం, చుట్టుప్రక్కల ప్రాంతాలలో తెలుగు పండుగలను ఘనంగా నిర్వహిస్తూ, అక్కడి తెలుగువారి నందరినీ ఒక వేదిక మీదకు తేవడానికి ఈ సంస్థ విశేషంగా కృషి చేస్తున్నది.

కృష్ణాజిల్లాలోని ఒక చిన్న గ్రామమైన కూచిపూడిలో ఏడు వందల సంవత్సరాల క్రిందట శ్రీ సిద్ధేంద్ర యోగి మేధో సంపద నుంచి పరిపూర్ణతను సంతరించుకున్న అపురూప నాట్య ప్రక్రియ కూచిపూడి నాట్యం. ఆంధ్రులకు గర్వకారణమైన ఈ నాట్యప్రక్రియ ఎల్లలు దాటి ఖండాంతర సీమల్లో ఖ్యాతి నార్జించుకున్న తరుణంలో ఈ నాట్యప్రక్రియపై ఒక అంతర్జాతీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేయాలన్న ఆకాంక్ష సిలికానాంధ్ర నిర్వాహకులకు కలిగింది. ఈ సమ్మేళనానికి దేశవిదేశాలలో లబ్ధప్రతిష్టులైన కూచిపూడి నాట్య గురువులను, నర్తకీనర్తకులను, కళావిమర్శకులను, కళాభిమానులను ఆహ్వానించి, వీరందరూ ఒకే వేదిక మీద కలుసుకొని కూచిపూడి వైభవాన్ని గురించి చర్చించుకునే అవకాశం కల్పించాలని, ముందు తరాలకు దీనిని అందించే విధంగా కార్యాచరణ పథకాలను రూపొందించాలనీ నిర్వాహకులు సంకల్పించారు. అంతేకాక, కూచిపూడి సంప్రదాయ గురువుల నుంచి నేర్చుకున్న తొలితరం కళాకారులు, వారినుంచి నేర్చుకున్నవారు, ఇలా ఐదుతరాలకు చెందిన నాట్యగురువులను, నర్తకీనర్తకులను ఒకే వేదికపైకి తెచ్చి గురుపరంపరను శిష్యపరంపరతో సన్మానింపజేయాలనే సంకల్పం సిలికానాంధ్ర వారికి కలిగింది. ఈ ఉద్దేశ్యంతో 'సిలికానాంధ్ర' వారు 2008 జూన్ 20వ తేది నుంచి 22వ తేది వరకు క్యూపర్టినో నగరంలో ప్రథమ అంతర్జాతీయ కూచిపూడి నాట్య సమ్మేళన నిర్వహణకు పూనుకొన్నారు. ఈ ప్రయత్నానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సహాయసహకారాలను అందించాయి.

ఈ నేపథ్యంతో 'సిలికానాంధ్ర' వ్యవస్థాపక అధ్యక్షులు డా. కూచిభొట్ల ఆనంద్‌గారు నాట్య సమ్మేళనంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున ముఖ్య అతిథిగా పాల్గొనవలసిందిగా ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్యశాఖామాత్యులు శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారిని ఆహ్వానించారు. శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారు ముఖ్యమంత్రిగారి అనుమతి పొంది, అంతర్జాతీయ కూచిపూడి నాట్య సమ్మేళనంలో పాల్గొనడానికి అమెరికా ప్రయాణానికి సమాయత్తమైనారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని అమెరికాలోని మరికొన్ని నగరాలను కూడా సందర్శించి, అక్కడి మిత్రులను, తెలుగు ప్రముఖులను పరామర్శించాలని ఆయన సంకల్పించుకున్నారు. నేను 2005 సంవత్సరం నుంచి 'రైతునేస్తం' పేరుతో మాసపత్రికను ప్రచురిస్తున్నాను. ఈ పత్రికకు నేనే సంపాదకుణ్ణి. కూచిపూడి నాట్యం పట్ల సహజంగా నాకున్న ఆసక్తివల్లనూ, డా. కూచిభొట్ల ఆనంద్‌గారితో ఏర్పడ్డ పరిచయం

మూలంగానూ, మంత్రివర్యులు బుద్ధప్రసాద్‌గారితో నాకున్న సాన్నిహిత్యం వల్లనూ, క్యూపర్టినోకు మంత్రిగారితో కలిసి వెళ్లాలనే ఆలోచన నాలో పొటమరించింది. బుద్ధప్రసాద్‌గారు కూడా నా ఆలోచనను బలపరిచి, అమెరికా ప్రయాణానికి నన్ను ప్రోత్సహించారు. సమయం దొరికినంతలో వ్యవసాయ, పాడిపరిశ్రమ రంగాలలో అక్కడ అనుసరిస్తున్న పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆ రంగాలలో ఉపయోగిస్తున్న విధానాన్ని పరిశీలించి, 'రైతునేస్తం' పత్రికలో మన వ్యవసాయదారులకు పనికొచ్చే విధంగా ప్రచురించాలన్న కోరిక కూడా నా మనస్సులో మెదులుతూ ఉంది. ఈ కారణాలతో నేను కూడా అమెరికా ప్రయాణానికి సన్నద్ధమై, హైదరాబాదులో శంషాబాదు విమానాశ్రయం నుంచి అమెరికాకు బయలుదేరి, అమెరికా నుంచి తిరిగి వచ్చేవరకు బుద్ధప్రసాద్ గారికి తోడు నీడగా వెన్నంటి ఉండి, అన్ని విషయాలు ప్రత్యక్షంగా గమనించాను.

మండలి బుద్ధప్రసాద్‌గారితో నేను చేసిన అమెరికా యాత్ర నా జీవితంలో ఒక అద్భుతఘట్టం. ఈ యాత్రలో నేను పొందిన అనిర్వచనీయమైన అనుభూతిని కాలం పొరల మరుగున పడిపోనివ్వకుండా, గ్రంథస్తం చేసి, నా అనుభూతిని పదిలపరచుకోవాలనీ, పదిమందికీ దీనిని పంచిపెట్టాలనీ కోరిక నాలో పరిఢవిల్లింది. తత్ఫలితంగా ఈ వ్యాసాన్ని రాయాలని సంకల్పించాను.

18.06.2008

రాత్రి గం. 1.05 ని.లకు శంషాబాదు విమానాశ్రయం నుంచి బయలుదేరే ఎమిరేట్స్ విమానంలో అమెరికా వెళ్ళడానికి అన్ని ఏర్పాటు పూర్తయినాయి. అక్కడి మిత్రులకు బహూకరించడానికి గాంధీ ప్రతిమలు, తెలుగు సంస్కృతిని తెలియజెప్పే విలువైన గ్రంథాలు విమానయానానికి అనువుగా బుద్ధప్రసాద్ గారు ప్యాక్ చేయించారు. విమానాశ్రయంలో బుద్ధప్రసాద్‌గారి సతీమణి శ్రీమతి విజయలక్ష్మిగారు, తోడల్లుడు మండల భాస్కరరావుగారు, కుమార్తె చిరంజీవి కృష్ణప్రభ, కుమారుడు చిరంజీవి రాజా ఇతర కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, మంత్రిగారి వ్యక్తిగత సిబ్బంది డా॥ గంధం సుబ్బారావు, డా॥ పి. శ్రీనివాసరెడ్డి తదితరులు వీడ్కోలు ఇవ్వగా బుద్ధప్రసాద్ గారు, నేనూ నిర్ణీత సమయానికి విమానమెక్కాము. రాత్రి గం. 1.05 లకు బయలుదేరిన ఎమిరేట్స్ విమానం 9 గంటలు ప్రయాణించి లండన్ విమానాశ్రయం చేరుకుంది. అక్కడ రెండున్నర గంటల విరామం తరువాత అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్ళే మరొక విమానం ఎక్కాము. మరొక తొమ్మిది గంటల ప్రయాణం తరువాత విమానం శాన్‌ఫ్రాన్సిస్కో విమానాశ్రయంలో అక్కడి సమయం ప్రకారం 19.06.2008నాడు మధ్యాహ్నం దిగింది. విమానాశ్రయంలో సిలికానాంధ్ర ప్రముఖులు మాకు ఆప్యాయంగా స్వాగతం పలికారు. శాన్‌ఫ్రాన్సిస్కో విమానాశ్రయం నుంచి క్యూపర్టినో నగరానికి తోడ్కొని వెళ్లి, అక్కడి ప్రసిద్ధ హోటల్ 'సైప్రస్'లో బస ఏర్పాటు చేశారు. అప్పటికే కేంద్ర మంత్రి శ్రీమతి దగ్గుబాటి పురంధేశ్వరిగారు ఆ హోటల్లో ఉన్నారు. ఆమెను పలుకరించి, హోటల్ గదిలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న పిదప, కూచిపూడి నాట్యోత్సవాలు జరగబోయే ఫ్లింట్ సెంటర్‌లోని 'డి అంజా' కాలేజి మైదానంలో ఏర్పాట్లను పరిశీలించడానికి వెళ్లాము. ఏర్పాట్ల గురించి నిర్వాహకులతో బుద్ధప్రసాద్‌గారు చర్చించారు. అక్కడే లంచ్ చేశాము. ఆ తర్వాత తిరిగి హోటల్‌కు చేరుకుని సాయంత్రం వరకు విశ్రాంతి తీసుకున్నాము.

సిలికాన్ వ్యాలీలోని మిల్పిటాస్ స్వాగత్‌లో శ్రీమతి దగ్గుబాటి పురంధేశ్వరికి తానా ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్, బే ఏరియా తెలుగు సంఘం (బాటా) వారి ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో బుద్ధప్రసాద్‌గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురంధేశ్వరిగారు మాట్లాడుతూ, భారత్‌లో ఐఐటిలు, ఐఐఎంలను

గణనీయంగా పెంచుతున్నామనీ, జిల్లాకో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామనీ వెల్లడించారు. బుద్ధప్రసాద్‌గారి ఉపన్యాసం తరువాత సన్మానం జరిగింది. అనంతరం జరిగిన చర్చాగోష్ఠి తరువాత శ్రీమతి పురంధేశ్వరితో ప్రశ్నోత్తర కార్యక్రమం జరిగింది. ఈ హోటల్ తానా ఉపాధ్యక్షుడు శ్రీ కోమటి జయరాంగారిది. ఈయన తానా అధ్యక్షులుగా ఎన్నికైనారు. ఇంకా అధ్యక్ష బాధ్యతలు చేపట్టలేదు. ఆ రాత్రి ఆహూతులందరికీ తన రెస్టారెంట్‌లో శ్రీ జయరాం అద్భుతమైన ఆతిథ్యమిచ్చారు. బుద్ధప్రసాద్‌గారితో అక్కడే భోజనం చేసి, హోటల్ 'సైప్రస్'కు తిరిగి వచ్చి విశ్రాంతి తీసుకున్నాము.

20.06.2008

కాలిఫోర్నియా రాష్ట్రంలో శాంతాక్లారా కౌంటీకి క్యూపర్టినో ఒక సబర్బన్ సిటీ. ఈ నగర జనాభా సుమారు 58 వేల పైచిలుకు. సిలికాన్ వ్యాలీకి గుండెకాయ అనదగిన ముఖ్యమైన పట్టణాలలో క్యూపర్టినో ఒకటి. ప్రపంచ ప్రసిద్ధి చెందిన 'యాపిల్', 'ఒరాకిల్' వంటి సాఫ్ట్‌వేర్ కంపెనీల హెడ్‌క్వార్టర్స్ ఇక్కడే ఉన్నాయి.

ప్రథమ అంతర్జాతీయ కూచిపూడి నాట్య సమ్మేళనానికి క్యూపర్టినో నగరం ఫ్లింట్ సెంటర్‌లోని 'డి అంజా' కాలేజి మైదానాన్ని సిలికానాంధ్రవారు కొన్ని లక్షల డాలర్లు వెచ్చించి, ఇంద్రసభలాగా వైభవోపేతంగా తీర్చిదిద్దారు. డి అంజా కాలేజి క్యూపర్టినో నగరంలో 112 ఎకరాల సువిశాలమైన స్థలంలో 1967లో ఏర్పాటు చేయబడింది. అందమైన ప్రకృతి మధ్య విశాలమైన భవనాలతో అలరారుతున్న ఈ కళాశాలలో ప్రస్తుతం 24,000 మంది విద్యార్థులు చదువుతున్నారు. పూర్తికాలిక అధ్యాపకులు 300 మంది ఉండగా అంశకాలిక అధ్యాపకులు 560 మంది పనిచేస్తున్నారు. రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, పర్యావరణ శాస్త్రం వంటి సంప్రదాయ విద్యలతో పాటు, శారీరక క్రీడలు, వ్యాయామ విద్యల్లో కూడా ఇక్కడ కోర్సులున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్, కూచిపూడి, ఏలూరు, విజయవాడ వంటి ప్రాంతాల నుంచి, చెన్నై, ఢిల్లీ, బెంగుళూరు వంటి రాష్ట్రేతర ప్రాంతాల నుంచీ, కూచిపూడి నర్తకీ నర్తకులు ఈ సమ్మేళనానికి తరలి వచ్చారు. అంతేగాక అమెరికాలోని కనీసం 15 రాష్ట్రాల్లో కూచిపూడి నాట్యాన్ని నేర్పుతున్న గురువులు, తమ శిష్యగణాలతో సహా వచ్చి నాట్య సమ్మేళనంలో పాల్గొన్నారు. రష్యా నుంచి ప్రముఖ నర్తకి, నాట్య గురువు ఎలీనా తరసోవా హాజరయ్యారు.

వేదిక మీద క్యూపర్టినో నగర మేయర్ శ్రీమతి డాలీ శాండోవిల్, కేంద్ర మానవవనరుల శాఖ సహాయ మంత్రి శ్రీమతి పురంధేశ్వరి, ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖామాత్యులు శ్రీ మండలి బుద్ధప్రసాద్, ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమీ అధ్యక్షులు, మాజీ పార్లమెంట్ సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, సుప్రసిద్ధ కూచిపూడి నాట్యాచార్యులతోపాటు సిలికానాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీకూచిభొట్ల ఆనంద్, అధ్యక్షులు శ్రీ విస్సంరాజు శ్రీఫణి, ఉపాధ్యక్షులు శ్రీహరిశాస్త్రి, కార్యదర్శి శ్రీ తల్లాప్రగడ రావు, సంయుక్త కార్యదర్శి శ్రీ గగ్గటూరు మహమ్మద్ ఇక్బాల్, కోశాధికారి శ్రీమతి వేదుల స్నేహ ఆసీనులైనారు. ఈ ఉత్సవాలకు దేశవిదేశాల నుంచి వేయి మంది కూచిపూడి కళాకారులు, పదిహేను వందల మంది ప్రతినిధులు హాజరయినారు. ఆహూతుల హర్షధ్వానాల మధ్య సభలు అట్టహాసంగా ప్రారంభమైనాయి.

ఈ కార్యక్రమంలో అమెరికా పర్యటనకు వచ్చిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి శ్రీ గ్రంధి భవానిప్రసాద్ గారు, వారి సతీమణి శ్రీమతి సరళ గారు కూడా పాల్గొన్నారు.

క్యూపర్టినో నగర మేయర్ శ్రీమతి డాలీ శాండోవిల్ కార్యక్రమానికి చీరకట్టులో వచ్చి అందరినీ ఆకట్టుకున్నారు. 'నమస్తే' అంటూ ఉత్సవాలను ప్రారంభించి, తమ నగరంలో ఈ ఉత్సవాలు జరగడం అక్కడి ప్రజల అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

అబ్బురపరిచే రీతిలో ఉన్న ఏర్పాట్లకు ముగ్ధులైన శ్రీ మండలి బుద్ధప్రసాద్ "కూచిపూడి నాట్యం ఆవిర్భవించి ఏడువందల సంవత్సరాలు దాటినా, ఇప్పటికీ అంతర్జాతీయంగా కూచిపూడి ఉత్సవాలను ఇంత ఘనంగా నిర్వహించలేక పోయామ"ని పేర్కొన్నారు. "సిలికానాంధ్ర ఒక విశిష్ట సంస్థ" అనీ, "రెండువేల అయిదు వందల మంది ప్రతినిధులతో ఈ మహాసమ్మేళనం నిర్వహణ బాధ్యతలు భుజాల కెత్తుకున్న సిలికానాంధ్ర సంస్థ కార్యవర్గాన్ని అభినందిస్తున్నాన"ని అంటూ, "తెలుగు సాహితీ సాంస్కృతిక సంప్రదాయ స్ఫూర్తిని పరిరక్షిస్తూ, దాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి అకుంఠిత దీక్షతో వీరు కృషి చేస్తున్నా"రని కొనియాడారు.

బుద్ధప్రసాద్‌గారు తమ ఉపన్యాసంలో కూచిపూడి నాట్యం 13వ శతాబ్దిలో దివి సీమలోని ఒక కుగ్రామంలో ఉద్భవించిందని, మానవ సమూహాల అతి పురాతనమైన నివాస ప్రాంతాలలో దివిసీమ ఒకటని, ఈ ప్రాంతం ఎన్నో విధాల సౌభాగ్యవంతమైందనీ, అందులో కూచిపూడి నాట్యం ఒక అనర్ఘ రత్నమని పేర్కొన్నారు. కూచిపూడి నాట్య స్రష్ట శ్రీ సిద్ధేంద్ర యోగి తన కాలానికి అందుబాటులో ఉన్న నాట్యప్రక్రియల నన్నింటినీ క్షుణ్ణంగా అధ్యయనం చేసి, కూచిపూడి నాట్యాన్ని రూపొందించాడనీ, ఇందుకు ఆయనకు గల అంకుఠితమైన కృష్ణభక్తి స్ఫూర్తి నిచ్చిందని అన్నారు. ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొన్న ఆంధ్రులకు గర్వకారణమైన ఈ నాట్యప్రక్రియ ఇప్పుడు అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని క్యూపర్టినో నగరంలో అంతర్జాతీయ స్థాయిలో ఉత్సవాలు జరుపుకోవడం అత్యంత హర్షదాయకమని ఉద్ఘాటించారు. అన్ని దేశాలు ప్రపంచీకరణ వైపు పరుగులిడుతున్న ప్రస్తుత తరుణంలో ఐ.టి. పరిజ్ఞానం పల్లెలకు కూడా చొచ్చుకు పోతున్నదనీ, దీన్ని కూచిపూడి నాట్యవికాసానికి ఉపయోగించుకోవాలనీ బుద్ధప్రసాద్‌గారు పిలుపునిచ్చారు.

కొన్ని దశాబ్దాల క్రిందటి వరకు కూచిపూడి నాట్యం స్త్రీలకు నిషిద్ధమని, అటువంటిది ఇప్పుడు స్త్రీలే కాక అన్ని వర్గాల వారు అభ్యసించి, దీనికి కొత్త వెలుగులు తెస్తున్నారనీ, అదే స్ఫూర్తితో కూచిపూడి నాట్యగురువులు ఐ.టి. పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుని కూచిపూడి నాట్యానికి ఆధునికతను సంతరింపజేసి, దశదిశలా విస్తరింపజేయాలని బుద్ధప్రసాద్ గారు సూచించారు.

పిమ్మట భారతీయ సంస్కృతిలో గురుశిష్యపరంపరకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని గురుపూజోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. 100 మంది కూచిపూడి నాట్యగురువులను వారి శిష్యులు ఘనంగా సన్మానించారు. కూచిపూడి నాట్యరంగంలో లెజెండ్ అనదగిన పద్మభూషణ్ డా. వెంపటి చినసత్యం నుంచి మొదలుకొని ఇటీవలి కాలంలో నాట్య శిక్షణ ప్రారంభించిన గురువుల వరకు – ఐదు తరాలకు చెందిన నాట్యగురువులను వేదికపై కూర్చోబెట్టారు. గురువులకు వారివారి శిష్యులు ఘనంగా సత్కారం చేశారు. వారు కూచిపూడి ప్రాభవానికి అందించిన సేవలను ప్రస్తావించి, పుష్పవర్షం కురిపిస్తూ పాదాలను స్పృశించి శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. ఒక్కో గురువుకు ఈ విధంగా సత్కారం జరుగుతున్నప్పుడు కూచిపూడి నాట్యకళలో తిరిగిన ఒక్కో మలుపు, ఒక్కో మెరుపు స్ఫురణకు వచ్చింది. సన్మానాలు అందుకున్న వారిలో వెంపటి చినసత్యం, యామినీ కృష్ణమూర్తి, రాజారెడ్డి రాధారెడ్డి, వి. జయా రామారావు, కౌసల్యారెడ్డి, శోభానాయుడు, మంజుభార్గవి, వనశ్రీరావు, కొత్తపల్లి పద్మ, కె. ఉమారామారావు, పసుమర్తి కేశవప్రసాద్, మద్దాళి ఉషాగాయత్రి, ఆనందాశంకర్, మృణాళినీ సదానంద, పి. అలేఖ్య, జయంతికాశీ, భాగవతుల సేతూరాం, వేదాంతం రామలింగశాస్త్రి, వేదాంతం

రాధేశ్యాం, పసుమర్తి రామలింగశాస్త్రి, పసుమర్తి వెంకటేశ్వరశర్మ, మహంకాళి సూర్యనారాయణ, కె.వి. సత్యనారాయణ, డా. జొన్నలగడ్డ అనూరాధ, కళాకృష్ణ, వేదాంతం వెంకటాచలపతి, వనజా ఉదయ్, పి. రమాదేవి, అమెరికా నుంచి వచ్చిన డా. రత్నపాప, కమలారెడ్డి, జ్యోతి చింతలపూడి, వైదేహి ఎల్లయ్, శ్రీలక్ష్మి పర్సా, దివ్య ఏలూరి, హిమబిందు చల్లా, ఇందిరా శ్రీరాం, శుభ మరువాడ, రంజనీ మండా, జ్యోతి లక్కరాజు, మైథిలీ కుమార్, స్వాతి గుండపనీడు, అపర్ణ కలగొట్ల, లక్ష్మిబాబు, యామినీ సారిపల్లి, సునీత పెండేకంటి, స్వాతి కందాడై, సత్యప్రియరమణ, శ్యామల కర్రా, శశికళ పెనుమర్తి, పుష్యమి లంకా, అనూరాధా నెహ్రూ, జయశ్రీ కొత్తపల్లి, సౌమ్య బులుసు, శోభ బులుసు, శోభ తమ్మన, రాజశ్రీ పాకాల, సమిధ సత్యం తదితరులు ఉన్నారు.

కళలపట్ల, కళారాధన పట్ల, కళాసేవ పట్ల అంకితభావం కలిగిన ఎందరో నాట్యాచార్యులు 'కూచిపూడి'ని విశ్వజనీన నృత్య సౌరభంగా తీర్చిదిద్దారు. పాశ్చాత్య దేశాలు సైతం అబ్బురపడే రీతిలోనూ, అక్కడి మహిళల్లో సైతం ఈ నృత్య ప్రక్రియ పట్ల ఆసక్తి కలిగించే విధంగానూ ఈ కళను అభివృద్ధి చేయడం వెనుక గురువుల పాత్ర ఎంత ఉందో, వారి ద్వారా ఈ కళను అభ్యసించి, దీనికి ప్రాచుర్యం కల్పించిన శిష్యగణాల అభినయ కౌశలం కూడా అంతే ఉంది. ఇవన్నీ కలిసి ఇప్పుడు కూచిపూడిని అంతర్జాతీయ వేదికలెక్కించాయి. ఎవరి వద్దనయితే తొలి అడుగు వేసి, నాట్యం, లయ, విన్యాసాలను ఔపోసన పట్టారో ఆ గురువులను సగౌరవంగా ప్రవాస భారతీయుల సమక్షంలో, వెల్లివిరిసిన ఆనందోత్సాహాల మధ్య సత్కరించుకోవడం ఒక అపూర్వ సన్నివేశం. ఈ కార్యక్రమం కూచిపూడి నాట్యోత్సవాలకు మరింత వన్నె తెచ్చింది. ఇంతమంది గురువులను ఒక వేదికపై కూర్చోబెట్టి తీసిన ఛాయాచిత్రం చరిత్రలో తీపిగుర్తుగా మిగిలిపోతుంది. ఈ కార్యక్రమంలో శ్రీ మండలి బుద్ధప్రసాద్‌తో పాటు, కేంద్రమంత్రి శ్రీమతి దగ్గుబాటి పురంధేశ్వరి, హిందీ అకాడమీ అధ్యక్షులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు డా. ఆవుల మంజులత, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డా. రాళ్ళబండి కవితా ప్రసాద్, తానా అధ్యక్షుడు శ్రీ కోమటి జయరాం, ఆటా అధ్యక్షుడు శ్రీ గవ్వా చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో పశ్చిమాన పసిఫిక్ మహా సముద్ర తీరంలో ఉన్న అందమైన నగరం శాన్‌ఫ్రాన్సిస్కో. పసిఫిక్ సముద్ర తీరానికి దీనిని ముఖద్వారంగా వ్యవహరిస్తారు. ఈ పట్టణ జనాభా సుమారు 8 లక్షలు. ఈ పట్టణం కొండలకు ప్రసిద్ధి. పట్టణంలో 50 కొండలున్నాయి. ఈ కొండలను సుందర పర్యాటక కేంద్రాలుగా మలిచారు. ఇవే కాక అనేక దీవులు కూడా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయబడ్డాయి.

పురాతత్వ పరిశోధనల ఆధారంగా క్రీస్తు పూర్వం 3,000 సంవత్సరాల నుంచి ఇక్కడ మానవ నివాసాలు ఉన్నట్లు ఋజువులు లభిస్తున్నాయి. ఎలము గ్రూపుకు చెందిన ఒహ్లోన్ ప్రజలు ఇక్కడ అనేక చిన్న చిన్న పల్లెలలో నివసించేవారు. స్పెయిన్ దేశస్థులు గాస్ పర్డీ పోర్ట్‌లా నాయకత్వంలో ఈ ద్వీప కల్పంలోని తీరంలో గోల్డెన్ గేట్ సమీపంలో కోటను నిర్మించి స్థావరాలు ఏర్పరచుకున్నారు. స్పెయిన్ దేశం నుంచి స్వాతంత్ర్యం పొందిన తర్వాత ఈ ప్రాంతం మెక్సికోలో ఒక భాగమయ్యింది.

శాన్‌ఫ్రాన్సిస్కో ఉన్నత జీవన ప్రమాణాలు కల నగరము. ఇంటర్నెట్ విప్లవం మూలంగా వస్తున్న అధిక ఆదాయం వల్ల ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన ఉన్నత విద్యావంతులు ఈ ప్రాంతంలో స్థిరపడ్డారు. ఈ ప్రాంతం ఆస్థి విలువలు, కుటుంబ ఆదాయం దేశమంతటిలో ప్రథమ స్థానంలో ఉంది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన పెద్ద హోటళ్ళకు, వినోదాలకు సంబంధించిన ప్రదేశాలకు ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందింది. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించటంలో అమెరికాలో శాన్‌ఫ్రాన్సిస్కో మూడవ స్థానంలో ఉంది.

సాయంత్రం శ్రీ స్వామి ఈరింకి అనే మిత్రుడు బుద్ధప్రసాద్‌గారిని, లక్ష్మీప్రసాద్ గారిని నన్నూ శాన్‌ఫ్రాన్సిస్‌కో నగర పర్యటనకు తీసుకువెళ్ళగా నగరంలోని గోల్డెన్ గేట్ బ్రిడ్జ్ తదితర ప్రదేశాల అందాలను తిలకించి ముగ్ధులమైనాము.

గోల్డెన్ గేట్ బ్రిడ్జ్ : గోల్డెన్ గేట్ బ్రిడ్జ్ అనేది పసిఫిక్ మహాసముద్ర తీరంలోని శాన్‌ఫ్రాన్సిస్కో అఖాతం ప్రారంభమయ్యే ప్రదేశంలో నిర్మించబడిన ఒక గొలుసు వంతెన. ఈ బ్రిడ్జి శాన్‌ఫ్రాన్సిస్కో ద్వీపకల్పంలోని ఉత్తర కొసపై ఉన్న శాన్‌ఫ్రాన్సిస్కో నగరాన్ని మారిన్ కౌంటీతో కలుపుతుంది.

1937వ సంవత్సరంలో ఈ వంతెన పూర్తయ్యే నాటికి ప్రపంచంలోనే అత్యంత పొడవైన గొలుసు వంతెనగా పరిగణింపబడి, అంతర్జాతీయంగా గుర్తించబడిన చిహ్నాల్లో ఒకటిగా ఖ్యాతిగడించింది. ఆ తర్వాత దీని పొడువును ఎనిమిది వంతెనలు అధిగమించినప్పటికీ, దీని ప్రాశస్త్యం తగ్గలేదు. అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ దీన్ని ఆధునిక ప్రపంచపు వింతల్లో ఒకటిగా పేర్కొంది. ప్రపంచంలోని అత్యంత సుందరమైన వంతెనగాను, ఎక్కువగా ఫోటోలు తీయబడిన వంతెనగానూ దీన్ని పేర్కొంటారు.

అందానికి మాత్రమే కాక ఈ వంతెన ఆత్మహత్యలకు కూడా ప్రపంచ ప్రసిద్ధిగాంచింది. గోల్డెన్ గేట్ వంతెన మొత్తం ప్రపంచంలోనే ఆత్మహత్యలు చేసుకోవడంలో ప్రధాన ప్రాంతంగా గుర్తింపు పొందింది. నీటి ఉపరితలానికి ఈ వంతెన ఎత్తు సుమారు 450 అడుగుల వరకు ఉంటుంది. వంతెనపై నుంచి అఖాతంలోకి దూకే వారు కనీసం నాలుగు సెకన్లపాటు గాలిలో తేలిన తర్వాత నీటిని తాకుతారని అంచనా వేశారు. నీటిని తాకే సమయానికి వారి వేగం గంటకు సుమారు 122 కిలోమీటర్లుగా ఉంటుంది. ఇంత వేగంతో ఢీకొట్టినప్పుడు నీరు కాంక్రీటు అంత ధృఢంగా శరీరాన్ని తాకుతుంది. ఈ కారణంగా ఈ వంతెనపై నుండి దూకిన వారిలో ఎక్కువ మంది నీటిని తాకిన వెంటనే ప్రాణాలు కోల్పోతారు. దూకినప్పుడు మరణించనివారు సముద్రపు నీటి చల్లదనానికి మరణిస్తారు.

ఈ వంతెనపై నుంచి దూకడం కోసమే ప్రత్యేకంగా ప్రజలు శాన్‌ఫ్రాన్సిస్కోకు వస్తుంటారని ప్రతీతి. ఈ ప్రాంతానికి చేరుకోవడానికి బస్సు లేదా క్యాబ్‌ను ఉపయోగిస్తారట. వంతెనపై నుండి దూకడం వల్ల మరణించే అవకాశం 98 శాతం వరకు ఉంటుందట. 2006 నాటికి 26 మంది మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారని తెలుస్తున్నది. సారాబిర్న్ బౌమ్ అనే యువతి మొదటి ప్రయత్నంలో బ్రతికి బయటపడింది. కాని మళ్ళీ ప్రయత్నించి ఆత్మహత్య చేసుకుంది. 1979లో ఒక యువకుడు ఈ వంతెనపై నుండి దూకి, ప్రాణాలతో సముద్రాన్ని ఈదుకొని, తానే స్వయంగా ఆస్పత్రికి చేరుకున్నాడు. ఐతే ఈ ప్రయత్నంలో అతని వెన్నుపూసలు కొన్ని విరిగిపోయాయి.

గోల్డెన్ వంతెన గురించిన ఇన్ని విశేషాలు తెలుసుకుని ఆశ్చర్యానికి, ఒక విచిత్రమైన అనుభూతికి గురయ్యాము.

★★★★

నాట్యోత్సవాలలో భాగమైన కూచిపూడి నాట్య ప్రదర్శనలు రాత్రి విందు భోజనం తరువాత ప్రారంభమైనాయి. 'వెన్నెల్లో మన పల్లె' సెట్టింగ్స్‌లో నాట్యప్రదర్శనలు అద్భుతంగా జరిగి, ప్రేక్షకులను రసతరంగాలలో ఓలలాడించాయి. కుమారి స్మితామాధవ్ శాస్త్రీయ సంగీత కచేరి, శివప్రసాద్ ఈలపాట రసజ్ఞులను అలరించాయి. అంతర్జాతీయంగా ప్రముఖ రంగస్థల నటునిగా ఖ్యాతిపొందిన గుమ్మడి గోపాలకృష్ణ శ్రీకృష్ణుని వేషం ధరించి రాయబారం నాటకంలో నుంచి పద్యాలను అద్భుతంగా ఆలపించడం, గ్రామాల్లో వెన్నెల రాత్రుల్లో ప్రజలు నాటకాల సందర్భంగా చేసే సంభాషణలు ఇవన్నీ అపురూపం అనిపించాయి.

21.06.2008

కూచిపూడి నాట్యాచార్యులకు ఆద్యుడైన శ్రీ సిద్ధేంద్ర యోగి విగ్రహాన్ని, ఆయన కొలిచిన శ్రీ బాలాత్రిపుర సుందరి రామలింగేశ్వరస్వామి విగ్రహాలను క్యూపర్టినో నగర వీధుల్లో బంగారు రథంపై 'శోభాయాత్ర' పేరుతో ఊరేగించటంతో ఈ రోజు ఉత్సవాలు ప్రారంభమైనాయి. ఈ విగ్రహాలను, ఇతర పరికరాలను కూచిపూడి నుంచి తెప్పించారు. అమెరికన్ పోలీసులు మోటారు సైకిళ్ళపై 'ఆనర్ ఆఫ్ గార్డ్స్' గా తోడురాగా, జాలిమన్ పార్క్ నుంచి ఉదయం 10.00 గంటలకు ప్రారంభమైన 'శోభాయాత్ర' మూడు కిలో మీటర్ల దూరంలో వున్న "డి అంజా" కాలేజికి మధ్యాహ్నం 12.00 గంటలకు చేరుకుంది. క్యుపర్టినో నగర మేయర్ శ్రీమతి డాలీ శాండోవిల్ రెండవ రోజు కూడా తెలుగింటి ఆడపడుచులా చీరకట్టుకొని, బొట్టుపెట్టుకొని వచ్చి ఈ శోభాయాత్రలో పాల్గొన్నారు. వందమంది కళాకారులు రథాన్ని లాగుతూ ముందుకు నడిపించిన ఈ అద్భుత దృశ్యం స్థానికులను బాగా ఆకట్టుకుంది. ఈ ఊరేగింపు మన దేశ ప్రతిష్టను అమెరికాలో ఇనుమడింపజేసింది.

శోభాయాత్ర తరువాత కళాప్రపంచం వరకే పరిమితమైన కూచిపూడి నాట్యానికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు గౌరవం సముపార్జించి, దీని విశిష్టతను విశ్వవ్యాప్తంగా ప్రచారం చేయడానికి ఉద్దేశించిన నాట్య ప్రదర్శన డి అంజా కాలేజి ప్రాంగణంలో ప్రారంభమైంది. ప్రపంచం నలుమూలల నుంచీ వచ్చిన 400 మంది కూచిపూడి నాట్య కళాకారులు, కళాకారిణులు పద్మభూషణ్ డా. వెంపటి చిన సత్యం రూపొందించిన నృత్య రూపకాన్ని ఒకే వేదికపై అఠాణా 'జతి-స్వరం'పై ప్రదర్శించారు. ఈ నృత్యప్రదర్శనలో పాల్గొన్న కళాకారుల్లో హైదరాబాద్ ఉస్మానియా వైద్య కళాశాలలో చివరి సంవత్సరం విద్యార్థిని పర్వీన్ సుల్తానా కూడా ఉన్నారు.

ఈ ప్రదర్శన పరిశీలనకు వచ్చిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అడ్జ్యుడికేటర్ శ్రీ డానీ గ్రిటన్ ఈ శాస్త్రీయ సంప్రదాయ నృత్యప్రదర్శనను చూసి, అరగంట లోపుగానే పులకించిపోయి, కూచిపూడి నృత్యవిన్యాసాన్ని గిన్నిస్ బుక్‌లో నమోదు చేస్తున్నట్లు సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఆ సమయంలో యావత్ కళాప్రపంచం చేసిన కరతాళధ్వనులతో డి అంజా కళాశాల ప్రాంగణం మారుమోగింది. వేలాది మంది కూచిపూడి కళాభిమానులు, కళాపోషకుల సుదీర్ఘ హర్షధ్వానాల మధ్య పద్మభూషణ్ డా. వెంపటి చిన సత్యంగారికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సర్టిఫికేట్‌ను డానీ గ్రిటన్ అందజేశారు. ప్రపంచ చిత్రపటంలో ఒక బిందువుగా ఉన్న కృష్ణాజిల్లాలోని కూచిపూడి పేరు దీనితో విశ్వవ్యాప్తంగా మోగిపోయింది. డా. వెంపటి చిన సత్యం కుమారులు, శ్రీ రవిశంకర్, శ్రీ వెంకట్ కృషికి తోడు కూచిభొట్ల ఆనంద్‌గారి ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమం విజయవంతమైంది.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో తమ నాట్యం పేరు నమోదు కావడంతో పులకించిన కూచిపూడి కళాకారులు, కళాకారిణులు 60 మంది వెంటనే ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన కూచిపూడి నాట్య ప్రతిష్టను ప్రతిబింబించే 'కూచిపూడి వైజయంతి' నృత్యరూపకాన్ని ప్రదర్శించి, చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా అందరి హర్షధ్వానాలు అందుకున్నారు. కూచిపూడి నాట్యకళారూపం కృష్ణా జిల్లా కూచిపూడిలో ఒక చిన్నపాయగా జన్మించింది. విజయనగర సామ్రాజ్యంలో రాజాశ్రయం పొంది సామాజిక ప్రయోజనం ప్రతిబింబించే ప్రదర్శనలు ఇచ్చింది. అటు తరువాత తంజావూరు నాయక రాజుల పోషణను, ప్రోత్సాహాన్ని అందుకుంది. అనేకానేక యక్షగానాలుగా రూపాంతరం చెందింది. కూచిపూడిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న కళాకారులకు తానీషా ప్రభువు అగ్రహారాన్ని బహూకరించాడు. ప్రపంచ పరివ్యాప్తమై గొప్ప గొప్ప వేదికలపై భారతీయ నాట్యకళాశైలుల గొప్పదనానికి తార్కాణమై నిలిచింది. ఇటువంటి కళాపరిణామాలను కూచిపూడి నాట్యవైజయంతి చాటి చెప్పింది. దేశవిదేశాలకు చెందిన సుమారు 50 మంది నర్తకీ నర్తకులు ఈ నృత్యరూపకాన్ని రమణీయంగా ప్రదర్శించారు. ప్రదర్శనకు అపూర్వ స్పందన లభించింది.

ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యూపర్టినో నగర మేయర్ శ్రీమతి డాలీ శాండోవిల్ ఇక నుంచి క్యూపర్టినో ప్రజలు జూన్ 21ని కూచిపూడి నాట్య దినోత్సవంగా జరుపుకుంటారని మిన్నంటిన హర్షధ్వానాల మధ్య ప్రకటించారు.

సాయంత్రం జరిగిన సభలో కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రి శ్రీమతి పురంధేశ్వరి ప్రసంగించారు. తాను కూడా 13 ఏళ్ళపాటు కూచిపూడి నృత్యాన్ని సాధన చేశానని, ప్రదర్శన లిచ్చాననీ గర్తు చేసుకున్నారు. ఈ ఉత్సవాలకు రావడం తాను జీవితంలో మరచిపోలేని జ్ఞాపకమని చెప్పారు. కూచిపూడికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చినందుకు సిలికానాంధ్ర సంఘం సభ్యులను అభినందించారు. ఈ నృత్యాన్ని విస్తరింపజేయడానికి కేంద్రప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు.

రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖామాత్యులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, కూచిపూడి నృత్యానికి గిన్నిస్ గౌరవం రావడం అపూర్వమైన ఘట్టమని హర్షం వ్యక్తం చేశారు. తెలుగు జాతి ప్రపంచానికి అందించిన గొప్ప కానుక కూచిపూడి నాట్యమనీ, కూచిపూడి పేరు చెప్పగానే నాట్యలోకం పులకిస్తుందనీ, ఇంతటి మహత్తర కళాప్రక్రియకు ఈనాడు అంతర్జాతీయ ఖ్యాతి రావడం తెలుగు వారందరికీ గర్వకారణమని అన్నారు. ఇకపై ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని నాట్యాల కంటే కూచిపూడి ఎక్కువ ఆదరణ పొందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. త్వరలో రాష్ట్రంలో మాతృభూమి ఉత్సవాన్ని నిర్వహిస్తామని, దీనికి ప్రపంచం నలుమూలలా ఉన్న తెలుగువారిని ఆహ్వానిస్తామని చెప్పారు.

కూచిపూడి నాట్యానికి ఈ ఖ్యాతినార్జించి పెట్టిన సిలికానాంధ్ర నిర్వాహకులను బుద్ధప్రసాద్‌గారు అభినందించారు. జూన్ 21వ తేదీని క్యూపర్టినో నగరం కూచిపూడి నాట్య దినోత్సవంగా జరుపుకుంటుందని ప్రకటించినందుకు నగర మేయర్ శ్రీమతి డాలీ శాండోవిల్‌కు బుద్ధప్రసాద్‌గారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పక్షాన భక్తిపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇది తెలుగు సంస్కృతికే ఒక గొప్ప గౌరవమని పేర్కొంటూ, తదుపరి కూచిపూడి నాట్య సమ్మేళనాన్ని ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహిస్తామని ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హిందీ అకాడమీ అధ్యక్షులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ, ఆంధ్రరాష్ట్రంలో డాన్స్ బేబీ డాన్స్ వంటి నృత్యాల పేరుతో ఘోరమైన దృశ్యాలు ప్రదర్శిస్తుంటే, అమెరికా వంటి దేశంలో కూచిపూడికి అపురూపమైన గౌరవం లభించడం మరిచిపోలేని సంఘటన అని వ్యాఖ్యానించారు.

తానా ఉపాధ్యక్షులు శ్రీ కోమటి జయరాం, ఆటా అధ్యక్షులు శ్రీ గవ్వా చంద్రారెడ్డి మాట్లాడుతూ, కూచిపూడికి ప్రాచుర్యం కల్పించడానికి తమ సంస్థల తరఫున ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తామని ప్రకటించారు. భారత కాన్సులేట్ జనరల్ శ్రీ సంజయ్ సిన్హా మాట్లాడుతూ అమెరికాలో ప్రస్తుతం 25 లక్షల మంది భారతీయులు ఉన్నారని చెబుతూ, దేశంలో అన్నింటా వారిదే అగ్రస్థానమని ప్రశంసించారు. కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గ్రంధి భవానిప్రసాద్‌తో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు. అమెరికాలో కూచిపూడి ఉత్సవాలు నిర్వహించడానికి చొరవ తీసుకున్న 'సిలికానాంధ్ర' వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీ కూచిభొట్ల ఆనంద్, సంస్థ నిర్వాహకులు శ్రీ మణిశర్మ, శ్రీ కె. దిలీప్, ఇతర కార్యవర్గ సభ్యులను ముఖ్య అతిథులు ప్రశంసించారు.

ఈ సందర్భంగా నగర మేయర్ తెలుగు ప్రముఖులను సన్మానించారు. తరువాత కూచిపూడి నర్తకి మంజుభార్గవి ఆధ్వర్యంలో కొత్తపల్లి పద్మ రూపొందించి 'తరిగొండ వెంగమాంబ' నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. ఇది అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ఆ తరువాత ప్రముఖ నర్తకులు రాజారెడ్డి, రాధారెడ్డి, కౌసల్యారెడ్డి బృందం

ప్రదర్శించిన 'నాట్యప్రదీపం' ప్రేక్షకులను అలరించింది. కూచిపూడి నాట్యగురువులలో మహోన్నతుడైన డా. వెంపటి చినసత్యం 75వ జన్మదినోత్సవం సందర్భంగా కమలారెడ్డి రూపొందించిన 'గురువందనం' ప్రదర్శన ఉత్సవాలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా రాష్ట్రమంత్రి బుద్ధప్రసాద్‌గారు సి.డి.ని ఆవిష్కరించారు. సిలికానాంధ్ర నిర్వాహకులు మంత్రిగారిని సన్మానించారు. మధ్యాహ్నం భోజనానంతరం షానోజ్ కాలేజి ఆడిటోరియంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో భామాకలాపం, తరంగం నృత్యాలను కూచిపూడి నాట్యకారులు ప్రదర్శించారు.

22.06.2008

అంతర్జాతీయ కూచిపూడి నృత్యోత్సవాల్లో చివరిదైన మూడోరోజు ఉదయం సభలో సిలికానాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ కూచిభొట్ల ఆనంద్, దేశవ్యాప్తంగా కూచిపూడి నాట్యానికి విశేష ప్రాచుర్యం కల్పించేందుకు ఈ నాట్య సమగ్ర వికాసానికి ఆంధ్రప్రదేశ్‌లో ఒకచోట 50 ఎకరాల స్థలాన్ని సేకరించి, అందులో అన్ని హంగులతో కూడిన కూచిపూడి కళాక్షేత్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. సమావేశానికి హాజరైన ప్రతినిధులందరూ ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. ఇందుకు సాయపడాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఒక తీర్మానం చేశారు. 2010 డిసెంబర్‌లో హైదరాబాదులో ద్వితీయ అంతర్జాతీయ కూచిపూడి నృత్యోత్సవాలు నిర్వహించాలని సమావేశంలో మరొక తీర్మానం చేశారు. మండలి బుద్ధప్రసాద్‌గారు ఈ తీర్మానాలను బలపరుస్తూ, ఇందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని కరతాళధ్వనుల మధ్య ప్రకటించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు డా. ఆవుల మంజులతగారు, సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. కవితా ప్రసాద్‌గారు తదితర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి డా. వై.యస్. రాజశేఖరరెడ్డిగారు పంపిన సందేశాన్ని మండలి బుద్ధప్రసాద్‌గారు సదస్యులకు చదివి వినిపించారు. సిలికానాంధ్ర చేపడుతున్న కార్యక్రమాలకు ప్రభుత్వం సహకరిస్తుందని, కూచిపూడి నృత్యం తరతరాల తెలుగువారి నాట్య కళావైభవానికి ప్రతీక అని, ఇంతమంది నాట్యకారులను ఒక వేదిక మీదకు తెచ్చి, వైభవోపేతంగా నిర్వహించబడుతున్న ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్న వారినందరినీ మనసారా అభినందిస్తున్నాననీ ముఖ్యమంత్రిగారు తమ సందేశంలో తెలియజేశారు. సిలికానాంధ్ర వారు అద్భుతమైన రీతిలో నిర్వహించిన కూచిపూడి నాట్యోత్సవాలకు పులకించి పోయిన బుద్ధప్రసాద్‌గారు ఈ సందర్భంగా ఈ క్రింది కవితను చదివారు.

నేడు
కూచిపూడి నాట్య సరస్వతి కాలిగజ్జల
రవళులు
క్యూపర్టినో నగరంలో మార్మోగి
ప్రపంచపు నాలుగు దిక్కులా
ప్రతిధ్వనిస్తున్నాయి

నేడు
అమెరికా దేశపు గాలుల్లో
తెలుగు పదాల పరిమళాలు కలిసి
జగత్తంతా వెదజల్లుతున్నాయి

ఇప్పుడు
అమెరికా సూరీడు
కూచిపూడి వెలుగు కిరణాలు
చిమ్ముతున్నాడు
ఆ వేడి ఆవాడి
చురుక్ చురుక్ మనిపిస్తూ
చురుకుదనాన్ని రగిలిస్తున్నాయి

ఎందుకో తెలుసా?
సిలికానాంధ్ర మరో సూర్యుడిలా
వెలుగుతోంది
తెలుగు సంప్రదాయ స్ఫూర్తిని పరిరక్షిస్తూ
ఏడువందల ఏళ్ల కూచిపూడి చరిత్రలో
కొత్త అధ్యాయాన్ని
సువర్ణ వర్ణాలతో లిఖిస్తోంది సిలికానాంధ్ర.

భవిష్యత్తు రంగస్థలంపై
ఈ అంతర్జాతీయ కూచిపూడి నృత్యోత్సవం
సరికొత్త అంకానికి నాంది పలుకుతుంది.

సిలికానాంధ్రకు వందనం –
కళాభివందనం.

ప్రముఖ కూచిపూడి కళాకారిణి యామినీ కృష్ణమూర్తి సమావేశాంలో ప్రసంగిస్తుండగా సత్యభామ పాత్ర ప్రదర్శించాలని ప్రేక్షకులు ఆమెను ఒత్తిడి చేశారు. సభికులను సంతోషపరిచే ఉద్దేశ్యంతో ఏడు పదుల వయస్సులో ఉన్న ఆమె హుషారుగా "యదువంశ సుధాంబుధిచంద్ర! స్వామి రార" అనే మకుటంతో ఉన్న కృష్ణ శబ్దాన్ని అభినయించి అందరినీ అలరించారు. ఈమె నాట్యానికి డా. రాజారెడ్డి నట్టువాంగం అపూర్వ సన్నివేశంగా భాసించింది. అనంతరం శోభానాయుడు బృందం శ్రీనివాస కల్యాణం ప్రదర్శించింది. తన ప్రదర్శనను రెండున్నర దశాబ్దాల తరువాత వీక్షిస్తున్న గురువు వెంపటి చినసత్యంగారికి శోభానాయుడు పాదాభివందనం చేసినపుడు కరతాళధ్వనులు మిన్నుముట్టాయి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో అంతర్భాగమైన కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాక్షేత్రం ప్రిన్సిపాల్ డా॥ రామలింగశాస్త్రి బృందం ప్రదర్శించిన 'నర్తనశాల' నృత్యరూపకం కూచిపూడి ప్రత్యేకతను చాటింది. కె.వి. సత్యనారాయణ, గుమ్మడి గోపాలకృష్ణ బృందం ప్రదర్శించిన 'ఆముక్తమాల్యద', నృత్యరూపకం, పద్మశ్రీ వి. జయారామారావు – వనశ్రీరావు ప్రదర్శించిన ఓంకార నృత్యం, కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్ర యోగి కళాక్షేత్రంలో అధ్యాపకులు, కూచిపూడి సంప్రదాయ కుటుంబానికి చెందిన వేదాంతం రాధేశ్యాం బృందం సమర్పించిన 'ప్రహ్లాద యక్షగానం' అద్భుతమైనవిగా ప్రశంసలందుకున్నాయి. డా. కె. ఉమారామారావు శిష్యబృందం అమెరికా విద్యార్థినులు ప్రదర్శించిన 'అన్నమయ్య అల్లరి కృష్ణుడు' అన్నమాచార్య కీర్తనలలోని శ్రీకృష్ణలీలామృతాన్ని సాక్షాత్కరింపజేసింది. అఖిల భారత కూచిపూడి నాట్యకళామండలి కార్యదర్శి

పసుమర్తి కేశవప్రసాద్ 'కలాపాలు–యక్షగానాలు' అనే అంశంపై చేసిన ప్రదర్శనాపూర్వక ప్రసంగం – తదితరాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

మరొకవైపు అమెరికాలోని వివిధ రాష్ట్రాల్లో కూచిపూడి నాట్య శిక్షణా సంస్థలను స్థాపించి నిర్వహిస్తున్న గురువులు తమతమ శిష్యులచేత ప్రదర్శింపజేసిన నాట్యాలు పేరున్న కళాకారులకు దీటుగా ఉన్నాయి. ముందుముందు ఈ అమెరికా గురువులు, వారి శిష్యులు తెలుగు నర్తనమైన కూచిపూడిని సమున్నత స్థాయికి చేర్చగలరన్న విశ్వాసం ఈ ప్రదర్శనలను చూసిన వారికి కలిగింది.

ముగింపు సభ

సాయంత్రం జరిగిన ముగింపు సభకు మండలి బుద్ధప్రసాద్‌గారు ముఖ్య అతిథి. ఈ సభలో కూచిపూడి నాట్యాన్ని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌కు ఎక్కించి, ఈ నాట్యప్రక్రియకు ప్రపంచ ప్రఖ్యాతిని ఇచ్చిన అధికారులను ఘనంగా సన్మానించారు. గిన్నిస్ బుక్‌లో రికార్డు అయ్యే స్థాయిలో నృత్యరూపకాన్ని రూపొందించిన సుప్రసిద్ధ నాట్యాచార్యులు పద్మభూషణ్ వెంపటి చినసత్యంగారిని కూగా ఈ సందర్భంగా సభికుల ఆనందోత్సాహాల మధ్య సత్కరించడం జరిగింది.

నాట్య సమ్మేళనం జరిగిన మూడు రోజులు ప్రదర్శించబడిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఒకదానితో మరొకటి పోటీ పడ్డాయి. ఉన్నత ప్రమాణాలతో కూడిన నృత్యరూపకాలు కూచిపూడి ప్రత్యేకతను ప్రపంచ స్థాయిలో చాటి చెప్పాయి. మూడు రోజుల ప్రదర్శనల్లో దేశవిదేశాలకు చెందిన సుమారు 1000 మంది కళాకారులు, కళాకారిణులు తమ ప్రతిభను ప్రదర్శించడం ప్రత్యేకంగా పేర్కొనదగిన అంశం. వీలయినంత ఎక్కువ మందికి ప్రదర్శనావకాశం కల్పించాలన్న ఉద్దేశ్యంతో సిలికానాంధ్ర రూపొందించిన ప్రణాళిక అందరి ప్రశంసలు అందుకుంది.

కూచిపూడి నాట్యలోకం యావత్తూ అమెరికాకు విచ్చేసి, ఆ మూడు రోజులు ఆడి, పాడి ఆనంద డోలికలలో తేలియాడిందని చెప్పడం అతిశయోక్తి కాదు. ముఖ్యంగా అమెరికా సంయుక్త రాష్ట్రాల నుంచి వచ్చిన బాలబాలికలు కూచిపూడి నాట్యంలో పెద్దపెద్ద గురువులను ఒక్క చోట సమ్మేళనంలో చూసి, ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఆ గురువుల ప్రదర్శనలు చూసి, వారిని స్వయంగా కలిసి ఎంతో స్ఫూర్తిని పొందారు.

మూడురోజుల అంతర్జాతీయ కూచిపూడి నాట్య సమ్మేళనాన్ని చిరస్మరణీయంగా నిర్వహించేందుకు సిలికానాంధ్ర చేసిన ఏర్పాట్లు విలక్షణంగా ఉండి, అందరి మన్ననలు పొందాయి.

నృత్యోత్సవాలు జరిగిన మూడు రోజులు దేశవిదేశాల నుంచి తరలి వచ్చిన 2500 మంది కళాకారులకు, ప్రతినిధులకు రెండు పూటలా తెలుగు సంప్రదాయబద్ధంగా పులిహోర, బొబ్బట్లు, ఆవకాయ, గోంగూర వంటి ఘుమఘుమలాడే వంటకాలతో షడ్రసోపేతమైన భోజనాన్ని ఏర్పాటు చేసి, ఆతిథ్యం ఇవ్వడంలోనూ తమకున్న నేర్పును సిలికానాంధ్ర నిర్వాహకులు నిరూపించుకున్నారు.

ఈ మూడు రోజులు సిలికానాంధ్ర సభ్యులు చూపిన ఆదరాభిమానాలు, వారి స్వాగత సత్కారాలు మరువలేనివి. ప్రతి ఒక్కరూ ఎంతో శ్రమ తీసుకుని, ఓర్పుతో వారి వారి బాధ్యతలు నెరవేర్చారు. వారు అకుంఠిత దీక్షతో అహర్నిశలు పరిశ్రమించడం వల్లనే ఈ సభలు కూచిపూడి నాట్య చరిత్రలో ఒక సువర్ణాధ్యాయంగా మిగిలిపోయాయి.

కృపర్టినో నగరంలో బుద్ధప్రసాద్‌గారి మేనత్త శ్రీమతి బాజి, మేనమామ శ్రీ పద్మారావు తమ ఇంటికి భోజనానికి ఆహ్వానించారు. వారి బంధువులు శ్రీమతి జస్వంతి, తిరుమలకట్ట వెంకట శేషగిరిరావు, శ్రీ మండలి సాయిబాబు, అనుపమ తదితరులు అక్కడ బుద్ధప్రసాద్‌గారిని కలిశారు.

23.06.2008

బుద్ధప్రసాద్‌గారిని, లక్ష్మీప్రసాద్‌గారినీ, నన్నూ "తానా" ఉపాధ్యక్షులు శ్రీ కోమటి జయరాంగారు శ్రమ తీసుకొని వారి కారులో అక్కడికి 150 మైళ్ల దూరంలోని శాన్‌ఫ్రాన్సిస్‌కోలో ఉన్న ప్రముఖ హృద్రోగ నిపుణులు డా. లక్కిరెడ్డి హనిమిరెడ్డి గారి ఇంటికి తీసుకుని వెళ్ళారు.

కృష్ణా జిల్లాలోని ఒక కుగ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన లక్కిరెడ్డి హనిమిరెడ్డి గారు అమెరికాలోని మెర్సిడ్ నగరంలో ప్రముఖ కార్డియాలజిస్టుగా ఖ్యాతి గడించారు. సిలికానాంధ్ర కుటుంబ పెద్దగా, నవ్యాంధ్ర భోజుడుగా వెలుగొందే హనిమిరెడ్డిగారు తెలుగు వారందరికీ సుపరిచితులు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా–మెర్సిడ్‌కి 10 లక్షల డాలర్ల వ్యయంతో ఒక భవనాన్ని నిర్మించి ఇచ్చారు. అలాగే మరొక 10 లక్షల డాలర్లను మెర్సిడ్ కాలేజికి కూడా విరాళంగా ఇచ్చారు హనిమిరెడ్డిగారు. శాన్‌ఫ్రాన్సిస్‌కో విశ్వవిద్యాలయంలో ఒక ఆడిటోరియంకు హనిమిరెడ్డిగారి పేరు పెట్టడాన్ని బట్టి వారి వదాన్యతను ఊహించుకోవచ్చు. పుట్టిన గ్రామాన్ని, చదువుకున్న పాఠశాలను, కళాశాలను కూడా వారు మరచిపోకుండా అక్కడ విశేష సౌకర్యాలు కల్పించిన వీరిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా. వై.యస్. రాజశేఖర రెడ్డిగారు ఇటీవలే 'జీవిత సాఫల్య' పురస్కారంతో సన్మానించారు. శాసనసభాపతి శ్రీ కె.ఆర్. సురేష్ రెడ్డి వీరిని 'దాతృత్వ సవ్యసాచి' బిరుదుతో సత్కరించారు. హనిమిరెడ్డిగారి విరాళాలలో అధిక శాతం విద్యారంగానికే చెందడానికి వెనుక ఆయన ఆశయం ఒకటుంది. పేదవారికి ధనసహాయం చేసి సరిపెట్టుకోవడం కాదు వారి ఉద్దేశ్యం. వారికి చదువు చెప్పించి, వారిని పైకి తీసుకువచ్చి, తనంతటి వారిని మరో పది మందిని తయారు చేయాలన్నది వారి ఆశయం. ఈ విధంగా గత దశాబ్దంలో దాదాపు ఐదు మిలియన్ డాలర్లకు పైబడి ఆయన ఇచ్చిన విరాళాలు ఆయనను అపర దానకర్ణుడిని చేశాయి. ఎవరికి, ఏ విధంగా తన స్తోమతను బట్టి ఎలా సహాయం చేయాలా అని ప్రతి క్షణం ఆలోచిస్తుంటానని ఆయన చెబుతారు. ప్రతి ఐశ్వర్యవంతుడూ తాను పుట్టిన నేలకు ఎంతో కొంత సాయం చేస్తే, దేశం సౌభాగ్యవంతమై విరాజిల్లుతుందని భావించే హనిమిరెడ్డి గారు ఇటు స్వరాష్ట్రంలోను, అటు అమెరికా దేశంలోను విశేషమైన సేవలు అందిస్తున్నారు. తనకు ఆత్మీయ మిత్రులైన బుద్ధప్రసాద్‌గారిని డా. హనిమిరెడ్డిగారు సాదరంగా ఆహ్వానించారు. వారి కుటుంబ సభ్యులందరు తమ ఇంటికి ప్రగాఢానుబంధం గల బంధువు వచ్చినట్లు సంబరపడిపోతూ, ఆతిథ్యం ఇచ్చారు.

భోజనానంతరం మమ్మల్ని దగ్గరలో గల ఎఫ్ అండ్ ఎ డెయిరీ ఆఫ్ కాలిఫోర్నియా వారికి చెందిన పాడి కేంద్రానికి హనిమిరెడ్డిగారు తీసుకువెళ్ళారు. ఈ కంపెనీ వారు అమెరికాలో ప్రీమియం ఛీజ్ తయారీలో సుప్రసిద్ధులు. అక్కడ పాలు పితకడం మొదలుకొని అన్ని పనులూ యాంత్రికంగా జరుగుతున్నాయి. హనిమిరెడ్డిగారికి కూడా దగ్గర్లో ఒక మంచి వ్యవసాయ క్షేత్రం ఉంది. ఆ క్షేత్రంలో టమాటోలు పండిస్తున్నారు. అక్కడి టమాటో రకాలు అబ్బురపరచేవిగా ఉన్నాయి. మొక్కజొన్న క్షేత్రాన్ని సందర్శించడం జరిగింది.

24.06.2008

బుద్ధప్రసాద్‌గారు, నేను శాన్‌ఫ్రాన్సిస్‌కో విమానాశ్రయం నుంచి సాయంత్రం విమానంలో సెయింట్ లూయిస్‌కి బయలుదేరాము. విమానం సెయింట్ లూయిస్‌కు రాత్రి 11.00 గంటలకు చేరుకుంది. విమానాశ్రయానికి అక్కడి

తెలుగు ప్రముఖులు డా. దండమూడి రాజేంద్రప్రసాద్, శ్రీ రామారావు వచ్చి, మంత్రిగారికి స్వాగతం పలికారు. బుద్ధప్రసాద్ గారు, నేను డా. రాజేంద్రప్రసాద్‌గారి కోరిక మేరకు వారి ఇంటికి వెళ్ళి ఆతిథ్యం స్వీకరించాము. గతంలో బుద్ధప్రసాద్‌గారి తండ్రిగారు కీ.శే. మండలి వెంకట కృష్ణారావుగారికి కూడా డా. రాజేంద్రప్రసాద్ ఆతిథ్యమిచ్చారు. అందరూ ఆ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆ రాత్రి అక్కడే ఉన్నాము. డా॥ రాజేంద్రపప్రసాద్ మంచి సాహిత్యాభిమాని, వారింట్లో గల గ్రంథాలయంలో అరుదైన సాహిత్యగ్రంథాలు ఉన్నాయి.

25.06.2008

ఉదయం అల్పాహారం తరువాత డా. దండమూడి రాజేంద్రప్రసాద్‌గారి ఇంట్లో వీడ్కోలు తీసుకుని, రామారావుగారి ఇంటికి వెళ్ళడం జరిగింది. వారి ఇంట్లో తెలుగు పుస్తకాల గ్రంథాలయాన్ని చూసి బుద్ధప్రసాద్ గారు అచ్చెరువొందారు. తెలుగు సాహిత్యానికి సంబంధించిన దాదాపు అన్ని పుస్తకాలను సేకరించి, రామారావుగారు తమ ఇంట్లో భద్రపరిచారు. తరువాత అప్పటికే సెయింట్ లూయిస్ నగరానికి చేరుకున్న కేంద్రమంత్రి పురంధేశ్వరి గారితో కలిసి మిసిసిపి నది ఒడ్డున అద్భుతమైన ఇంజనీరింగ్ టెక్నాలజీతో నిర్మించబడిన ఆర్చిని చూశాము. నదికి ఆవలి వైపున ఉన్న ప్రదేశాలను కనుగొన్నదానికి గుర్తుగా ఈ ఆర్చిని నిర్మించారు. 600 అడుగుల ఎత్తుగల ఈ ఆర్చి నిర్మాణానికి రెండు సంవత్సరాల కాలం పట్టింది. ఆ తర్వాత ఆ ప్రదేశంలోనే నిర్మాణానికి సంబంధించి లఘు చలన చిత్రాన్ని అక్కడ ఏర్పాటు చేసిన థియేటర్‌లో చూసాము.

సెయింట్ లూయిస్ అమెరికాలోని మిస్సోరి రాష్ట్రంలో ఉన్న స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన నగరం. ఈ నగరానికి తూర్పున మిసిసిపీ నది ప్రవహిస్తున్నది. ఉత్తర, దక్షిణ, పశ్చిమ ప్రాంతాల్లో సెయింట్ లూయిస్ కంట్రీ ఉన్నాయి. ఫ్రెంచ్ రాజు నాల్గవ లూయిస్ గౌరవార్థం ఈ నగరానికి ఈ పేరు వచ్చింది. 1904వ సంవత్సరంలో అమెరికాలో మొట్టమొదటిసారిగా నిర్వహించిన ఒలింపిక్ క్రీడల పోటీలు ఇక్కడే జరిగాయి. అదే సంవత్సరం వరల్డ్ ఫెయిర్ కూడా ఇక్కడ నిర్వహించారు. ఈ రెండు సంఘటనలు ఆ నగరవాసులకు గర్వకారణమైనాయి. ఆధునిక కాలంలో బయోటెక్నాలజీ, ఇతర సైన్స్ సంబందిత పరిశోధనల్లో సెయింట్ లూయిస్ మంచి అభివృద్ధిని సాధించింది.

సాయంత్రం నగరంలోని ప్రముఖ శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవాలయాన్ని పురంధేశ్వరిగారితో కలిసి చూడటం జరిగింది. సెయింట్ లూయిస్‌లోని తెలుగువారు నిర్మించుకున్న ప్రసిద్ధి చెందిన దేవాలయమిది. ఆ ఆలయంలో ప్రముఖ దేవతా విగ్రహాలు ప్రతిష్ఠించబడి ఉన్నాయి. దేవాలయ ప్రాంగణంలో అక్కడి తెలుగువారు ఏర్పాటు చేసిన సభలో కేంద్రమంత్రి పురంధేశ్వరి, మండలి బుద్ధప్రసాద్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌గార్లు పాల్గొన్నారు. వీరిని ఆ సభలో ఘనంగా సత్కరించారు. రాత్రికి డా. రాజేంద్రప్రసాద్‌గారి ఇంట్లో అక్కడి తెలుగు ముఖులతో పాటు విందారగించి, అక్కడే విశ్రాంతి తీసుకోవడం జరిగింది.

26.06.2008

సెయింట్ లూయిస్ నుంచి ఉదయం విమానంలో డా. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌గారితో పాటు డెట్రాయిట్‌కు బయలుదేరాము. డా. లక్ష్మీప్రసాద్‌గారి కుమారుడు శ్రీ శివరామప్రసాద్ విమానాశ్రయానికి వచ్చి, సాదరంగా తోడ్కొని వెళ్లారు. వారి ఇంట్లోనే భోజనం చేసి విశ్రాంతి తీసుకోవడం జరిగింది.

సాయంత్రం డెట్రాయిట్ తెలుగు సంఘం వారు సభ ఏర్పాటు చేసి బుద్ధప్రసాద్ గారిని ఘనంగా సన్మానించారు. సినీనటుడు శ్రీ చలపతిరావు, నాట్యాచార్య శ్రీ కె.వి. సత్యనారాయణ గార్లను కూడా ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అక్కడ నివసిస్తున్న తెలుగువారు పెద్ద సంఖ్యలో పాల్గొని, తెలుగు సంస్కృతి మీద

తమ తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. అక్కడికి ప్రముఖ తెలుగు రచయిత డా. వెలగా వెంకటప్పయగారి కుమారులు వెలగా నాగార్జునగారు వారి కుటుంబంతో వచ్చి, బుద్ధప్రసాద్‌గారిని కలిసారు.

అమెరికాలోని మిచిగాన్ రాష్ట్రంలోని పెద్ద నగరం డెట్రాయిట్. అమెరికాలోని మిడ్‌వెస్ట్ ప్రాంతంలో డెట్రాయిట్ నదిపైన ఉన్న ముఖ్య రేవు పట్టణం. కెనడా దక్షిణ ప్రాంతంలో ఉన్న అమెరికా నగరాలలో డెట్రాయిట్ ఒక్కటే గుర్తించదగిన పెద్ద నగరం. ఈ నగరం అమెరికాలోని సాంప్రదాయక ఆటోమోటివ్ కేంద్రం. డెట్రాయిట్‌ను మోటార్ సిటీ అని, మోటో టౌన్ అని కూడా పిలుస్తారు.

27.06.2008

బుద్ధప్రసాద్‌గారు, నేను ఉదయం విమానంలో డెట్రాయిట్ నుంచి బయలుదేరి చికాగో నగరానికి చేరుకున్నాము. ప్రముఖ చిత్రకారుడు పద్మశ్రీ యస్.వి. రామారావు, ఆచంట రవిబాబు, వారి సోదరులు విమానాశ్రయంలో మంత్రిగారికి స్వాగతం పలికారు.

చికాగో నగరం హిందూ దేవాలయాలకు ప్రసిద్ధి చెందింది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఇక్కడే ఉంది. అమెరికాలో అత్యధిక సంఖ్యలో తెలుగువారు ఇక్కడే ఉన్నారు.

చికాగో అమెరికాలోని ఇలినాయ్ రాష్ట్రంలో ఒక నగరం. ఇది అమెరికాలోని అతి పెద్ద నగరాలలో మూడవది. దీని జనాభా 9.7 మిలియన్లు. సాంస్కృతిక, ఆర్థిక, రవాణా రంగాలలో మిడ్‌వెస్ట్ (మధ్య పశ్చిమ) ప్రాంతానికి చికాగో ప్రముఖ కేంద్రం. ఈ నగరాభివృద్ధికి ఇక్కడి మిచ్చిగాన్ సరస్సు ఎంతో తోడ్పడుతున్నది. ఈ సరస్సు కారణంగా చికాగో వాతావరణం ఎప్పుడూ అనుకూలంగా ఉంటుంది. వెచ్చని శీతాకాలం, చల్లని ఎండాకాలం ఇక్కడి ప్రత్యేకతలు. మిచిగాన్ సరస్సు వెంట వేసిన రోడ్లు అధిక భాగం నగరంలోని సరస్సు తీరాన్ని తిలకించే వీలు కలిగిస్తుంది. సరస్సు తీరాన లింకన్ పార్కు, గ్రాంటు పార్కు బర్న్‌హామ్ పార్కు మొదలైనవి ఉన్నాయి. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ప్రసిద్ధి చెందిన పర్యాటక కేంద్రాలలో ఇది ఒకటి.

డాక్టర్ దండమూడి రాజేంద్రప్రసాద్ అమెరికా అధ్యక్షుడుగా పోటీ చేస్తున్న ఓబామాకు గట్టి మద్దతుదారు. ఓబామా విధానాలు, ఆశయాలు వినూత్నమైనవని వాటిని అధ్యయనం చేయమని శ్రీ బుద్ధప్రసాద్ గారికి వీడియోటేపులు, పుస్తకాలు బహూకరించారు.

చికాగో విమానాశ్రయం నుంచి బుద్ధప్రసాద్‌గారు, నేను ప్రముఖ చిత్రకారుడు పద్మశ్రీ యస్.వి. రామారావుగారితో వారి ఇంటికి వెళ్లాము. అక్కడే అల్పాహారం ముగించుకుని, రామారావుగారి పెయింటింగ్స్ చూశాము. యస్.వి. రామారావు గారు అంతర్జాతీయంగా పేరున్న ప్రముఖ చిత్రకారులు. అబ్దుల్‌కలాం గారు రాష్ట్రపతిగా ఉండగా వీరితో ముప్పావుగంట గడిపారు. దేశవిదేశాల్లో ఎన్నో అవార్డులు పొందారు.

1951-55 సంవత్సరాలలో ఫైన్ ఆర్ట్స్‌లో డిప్లమా చేసిన రామారావుగారు ఆ తరువాత ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి బి.ఏ. అకౌంటింగ్, బ్యాంకింగ్, బి.ఏ. ఎకనామిక్స్ పట్టాలు పుచ్చుకున్నారు. 1955-59ల మధ్య మద్రాసులోని ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో పెయింటింగ్‌లో డిగ్రీ చేశారు. 1959-62ల మధ్య న్యూఢిల్లీలో పెయింటింగ్‌లో కేంద్రప్రభుత్వం వారి రీసెర్చ్ ఫెలోషిప్ చేశారు. 1965 నుంచి 1969 వరకు లండన్ కంట్రా కౌన్సిల్‌లోను 1969 వరకు ఓహియోలోని యూనివర్సిటీ ఆఫ్ సిన్‌సినాటిలో పెయింటింగ్, డ్రాయింగ్‌ల అధ్యాపకుడుగాను పనిచేశారు. ఆ తరువాత చికాగోలో ఆర్టిస్ట్‌గా స్థిరపడ్డారు.

వీరి అర్ధాంగి డా. సుగుణ గారు యం.డి చేసి చికాగోలో వైద్యులుగా పనిచేస్తున్నారు. కుమార్తె పద్మావతి భరతనాట్యంలో పేరుగడించిన కళాకారిణి. డా. యస్.వి. రామారావుగారిని 2001 సంవత్సరంలో భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో గౌరవించింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. 1965లో వీరు లండన్‌లో జరిగిన రెండవ కామన్వెల్త్ అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్ ఎగ్జిబిషన్లో పాల్గొన్నప్పుడు యూరప్, ఇంగ్లాండ్‌లకు చెందిన న్యాయనిర్ణేతలు ప్రతిష్టాత్మకమైన "The Most Outstanding Artist in Common Wealth" అవార్డుకు ఎంపిక చేశారు.

మధ్యాహ్నం ఇండియన్ రెస్టారెంట్‌లో చికాగో హిందూ దేవాలయాల అధ్యక్షులు శ్రీ వేమూరి సుబ్రహ్మణ్యం గారు విందు ఇచ్చారు. శ్రీ సుబ్రహ్మణ్యంగారి స్వగ్రామం అవనిగడ్డ, వారి మామగారు మచిలీపట్టణం ప్రముఖులలో ఒకరైన శ్రీ సర్వా మధుసూదన ప్రసాద్ గారని తెలుసుకుని శ్రీ బుద్ధప్రసాద్ గారు అమితంగా ఆనందించారు. శ్రీ సుబ్రహ్మణ్యంగారు అమెరికాలో ఉన్నత స్థాయిలో ఉన్నారు.

సాయంత్రం చికాగో దేవాలయాన్ని సందర్శించాము. అక్కడ రాష్ట్ర వైద్యశాఖామంత్రి శ్రీమతి గల్లా అరుణకుమారిగారు కలిశారు. బుద్ధప్రసాద్‌గారి రాక సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అరుణకుమారిగారు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ యస్.వి. రామారావుగారు తెలుగు, ఇంగ్లీషు భాషల్లో రచించిన 'కాలాంచలాలు' కవితా సంపుటుల (The Hindu Temples of Greater Chicago) ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. బుద్ధప్రసాద్ తెలుగుసేత ఆవిష్కరించగా, అరుణకుమారిగారు ఆంగ్లానువాదాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అక్కడి తెలుగు ప్రముఖులు శ్రీ ఎడ్ల గంగాధర్‌గారు తదితరులు పాల్గొన్నారు. బుద్ధప్రసాద్‌గారు పద్మశ్రీ యస్.వి. రామారావుగారి గురించి చెబుతూ, తమ బహుముఖ ప్రజ్ఞతో అంతర్జాతీయ ఖ్యాతి నార్జించిన రామారావుగారు తెలుగు వారందరికీ గర్వకారణమని కొనియాడారు. తెలుగు వారికి చిత్రకళారంగంలో ఒక విశిష్టతను చేకూర్చిన మహోన్నతవ్యక్తి డా. యస్.వి. రామారావు అని, చిత్రకళారంగంలో తనదైన విశిష్టశైలిని రూపొందించి, భారతీయులకు కీర్తి ప్రతిష్టలను చేకూర్చారని, ఎంత ఎత్తుకు ఎదిగినా, తెలుగు భాషా సంస్కృతులను మరువకుండా తన చిత్రాల మీద తెలుగులోనే సంతకం చేయడం ఆయన గొప్పదనమనీ అలాగే ఈ కవితా సంపుటి ద్వారా తెలుగుకు సేవచేశారని బుద్ధప్రసాద్ గారు ఆయనను ప్రశంసించారు. అరుణకుమారిగారు చికాగో నగరంతో తనకు గల అనుబంధాన్ని, పూర్వ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

రాత్రి ఆచంట రవిబాబుగారి ఇంట్లో తెలుగు ప్రముఖుల సమక్షంలో బుద్ధప్రసాద్‌గారికి సన్మానం జరిగింది. ఎ.బి.ఆర్. ఫౌండేషన్ పక్షాన ఏర్పాటు చేసిన ఈ సన్మాన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు ప్రసంగించారు. బుద్ధప్రసాద్ గారికి జ్ఞాపికలను బహూకరించారు. రాత్రి తెలుగు ప్రముఖులతో అక్కడే భోజనం చేసి, గెస్ట్ హౌస్‌లో నిద్రించాము.

28.06.2008

ఉదయం చికాగో నుంచి బుద్ధప్రసాద్‌గారు, నేను డల్లాస్‌కు బయలుదేరాము. డల్లాస్ విమానాశ్రయంలో డా. తోటకూర ప్రసాద్, వారి మిత్ర బృందం బుద్ధప్రసాద్ గారికి సాదరంగా స్వాగతం పలికారు. నేరుగా ప్రసాద్‌గారి ఇంటికి వెళ్ళి, అక్కడే భోజనం చేశాము. మన తెలుగు ప్రముఖులలో ఒకరైన డా. ఆళ్ళ శ్రీనివాసరెడ్డిగారు డల్లాస్‌లో ప్రముఖ కార్డియాలజిస్టు. ఆయన స్నేహితుడొకరు అమెరికన్ జాతీయుడు - అక్కడికి 120 మైళ్ళ దూరంలోని ఓక్లహాం స్టేట్‌లో ఒక వ్యవసాయ క్షేత్రాన్ని నడుపుతున్నారు. భోజనానంతరం డా. ప్రసాద్‌గారు వారి మిత్రబృందం

బుద్ధప్రసాద్‌గారిని, నన్ను ఆ ఫాం హౌజ్ సందర్శనకు తీసుకు వెళ్లారు. పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖా మంత్రిగా బుద్ధప్రసాద్‌గారికి, 'రైతునేస్తం' పత్రికా సంపాదకుడిగా నాకూ వ్యవసాయ క్షేత్రాలు, డెయిరీ ఫారాలు సందర్శించడం ఆసక్తిదాయకమే కదా! ఆ వ్యవసాయ క్షేత్రంలో అన్ని పనులు యంత్రాల సహాయంతోనే చేస్తున్నారు. మంత్రిగారు పొలాల్లో గడ్డి కోసి, దాన్ని బేళ్ళుగా చుట్టే యంత్రాల పని తీరును పరిశీలించారు. John Deer కంపెనీ వారు రూపొందించిన ఈ గడ్డికోసే యంత్రం ఖరీదు సుమారు 38వేల అమెరికన్ డాలర్లు. దీని బరువు 14 వందల పౌండ్లు. ఒక ఎకరంలో గడ్డిని రెండు బేళ్ళుగా చుట్టే సామర్థ్యం ఉన్న ఈ యంత్రం కేవలం ఐదు నిమిషాల్లో ఒక బేలును చుట్టగలుగుతుంది. అమెరికాలో ఈ బేలు ఒక్కొక్కటి 45 డాలర్లు ఖరీదు చేస్తుంది. ఇవి కాక రేక్ మిషన్లు (Rake) ఉన్నాయి. ఈ రేక్ మిషన్ మన పల్లెలో ఉపయోగించే 'గుంటక', 'పళ్ళకోల' వంటి సాధనాలు చేసే పనిని చేస్తాయి. పొలంలో గడ్డి, గాదం, కలుపు మొక్కలు మొదలైన వాటిని పెకిలించి ఏరివేసి, నేలను గుల్ల చేయడానికి, విత్తనాలు వేసే సమయంలో పొలంలో పెద్దపెద్ద మట్టి పెళ్ళలు లేకుండా నేలను చదును చేయడానికి, చల్లిన విత్తనాలపై మన్ను కప్పడానికి ఈ యంత్రాలను ఉపయోగిస్తారు. ఇది ఒక్కొక్కటి సుమారు 14 వేల అమెరికన్ డాలర్లు ఖరీదు చేస్తుంది. గడ్డి కోసే యంత్రం ఖరీదు 9 వేల అమెరికన్ డాలర్లు. బేళ్ళను లారీలకు ఎక్కించే యంత్రం (Loader) ఖరీదు వేయి డాలర్లు. ఈ యంత్రాల సాయంతో అమెరికాలో ఎన్ని వందల ఎకరాల సేద్యమైనా అవలీలగా చేసుకోగలుగుతున్నారు. వ్యవసాయ కూలీల సమస్యతో తల్లడిల్లుతున్న మన వ్యవసాయ రంగానికి ఇటువంటి యంత్రాల అవసరం ఎంతైనా ఉందని భావించాము.

అక్కడి వ్యవసాయ క్షేత్రంలో ఒక విచిత్రమైన జాతి ఆవులను మేము చూడటం జరిగింది. 'Maine Anjou' జాతికి చెందిన ఈ ఆవు అతిశీతల వాతావరణంలో మాత్రమే మనగలుగుతుంది. ఆ ఫారం హౌస్‌లో ప్రత్యేకంగా నిర్మించిన షెడ్లలో డీప్ రిఫ్రిజిరేషన్ వాతావరణంలో ఈ ఆవులను పెంచుతున్నారు. కేవలం మాంసానికి మాత్రమే ఉపయోగపడే ఈ పశువు, అంత చల్లటి వాతావరణంలో పెరుగుతున్నా, చూడటానికి మాత్రం నల్లగా, చాలా మొరటుగా ఉంది. ఇక్కడున్న ఒక్కొక్క మేక 3 వేల నుంచి 4 వేల డాలర్లు ఖరీదు చేస్తుంది. అదే పందేలకు పనికొచ్చే పొట్టేలు మేక అయితే, దాని ఖరీదు 35 వేల అమెరికన్ డాలర్లు ఉంటుంది. మేము ఆ ఫాంహౌస్‌లోని గుర్రపుశాలను కూడా సందర్శించాము. అక్కడ పొలం మధ్యలో రోడ్లను నిర్మించి వ్యవసాయ క్షేత్రంలోని అన్ని ప్రాంతాలకు సునాయాసంగా వాహనంలో వెళ్ళే ఏర్పాటు చేసుకున్నారు.

వ్యవసాయ క్షేత్ర సందర్శన ముగించుకుని బుద్ధప్రసాద్ గారు, నేను సాయంత్రానికి తిరిగి డల్లాస్ చేరుకున్నాము. రాత్రికి తానా మాజీ అధ్యక్షులు రాఘవేంద్రప్రసాద్ గారి ఇంట్లో ఆతిథ్యం పుచ్చుకున్నాము. శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారికి వీరు ఆత్మీయ మిత్రులు. కృష్ణారావు గారు గతంలో అమెరికా పర్యటన చేసినప్పుడు వారి ఆతిథ్యం స్వీకరించారు. వీరు మన ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖరరెడ్డి గారికి వైద్యవిద్యలో క్లాస్మేట్. వీరు పుట్టపర్తి సాయిబాబా భక్తులు. అనేకసార్లు సాయిబాబా ఆదేశంతో అమెరికా డాక్టర్లతో మన రాష్ట్రంలో వైద్యశిబిరాలు నిర్వహించారు. తిరిగి ఇన్నేళ్ళకు తండ్రి అడుగు జాడల్లో నడుస్తున్న బుద్ధప్రసాద్‌గారికి ఆతిథ్యం ఇచ్చే అవకాశం రావడం ఆనందంగా భావించి, ఆయన పొంగిపోయారు. బుద్ధప్రసాద్‌గారితో పాటు నేను కూడ రాఘవేంద్రప్రసాద్ గారు ఆప్యాయంగా ఇచ్చిన షడ్రసోపేతమైన ఆతిథ్యం స్వీకరించి, ఆ రాత్రికి అక్కడే నిద్రించాము.

29.03.2008

ఉదయం అల్పాహారం అనంతరం డా. రాఘవేంద్ర ప్రసాద్‌గారితో కలిసి డల్లాస్‌లోని ప్రముఖ ప్రదేశాలు, దేవాలయాలు, నార్త్ టెక్సాస్ విశ్వవిద్యాలయం సందర్శించడం జరిగింది. దేవాలయ ప్రాంగణంలో మంత్రి గారికి

స్వాగతం పలికిన ఆలయ ధర్మకర్తలు, నిర్వహణాధికారులు అక్కడ జరుగుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. అక్కడి హిందూ టెంపుల్ సొసైటీ వారు సువిశాలమైన ప్రాంగణంలో హిందూ దేవతామూర్తులు అన్నింటిని బహుసుందరమైన రీతిలో చెక్కించి ప్రతిష్ఠించారు. ఈ దేవాలయంలో అన్ని హిందూ పండుగలను ప్రముఖంగా నిర్వహించడంతో పాటు, త్యాగరాజ ఆరాధన, బాలాజి బ్రహ్మోత్సవాలు, వల్లభాచార్య ప్రగత్య మహోత్సవం, ఆది శంకరాచార్య జయంతి, శ్రీనివాసకళ్యాణం, జగన్నాధ రథయాత్ర, దుర్గా నవరాత్రులు, శ్రీరామనవమి ఉత్సవాలు మొదలైనవి ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు, ధార్మిక కార్యక్రమాలైన మెడికల్ క్యాంప్, తెలుగు పిల్లల్లో విద్యా వికాసానికి పాఠశాల మొదలైనవి నడుపుతున్నారు.

యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్‌లో డా. పూడూరు జగదీశ్వరన్ అనే తెలుగాయన ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వీరు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నుంచి 1978 లో పి.హెచ్.డి. పట్టా తీసుకున్నారు. రక్తసంబంధీకులకు వంశపారంపర్యంగా వచ్చే వ్యాధుల మీద వీరు పరిశోధన చేస్తున్నారు. జీబ్రా ఫిష్ నుపయోగించి, క్షీరదముల్లో రక్తప్రసరణ, రక్త సాంద్రత, కణపరిమితి మొదలైన అంశాలలో వారి పరిశోధన కొనసాగుతున్నది.

శ్రీ జగదీశ్వరన్ యూనివర్శిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్ విభాగాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలనే ప్రయత్నంలో శ్రీ బుద్ధప్రసపాద్ గారిని కలవగా వారు ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖరరెడ్డి గారి వద్దకు తీసకెళ్ళడం, యూనివర్సిటీ ఏర్పాటుపై ఉన్నత విద్యామండలిని సాధ్యాసాధ్యాలను పరిశీలించమని ఆదేశించటం జరిగింది. శ్రీ బుద్ధప్రసాద్ గారు అమెరికా పర్యటనకు వస్తున్నారని తెలుసుకుని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్‌ను సందర్శించడానికి ఆహ్వానించారు.

ఆ తరువాత బుద్ధప్రసాద్‌గారు డల్లాస్ తెలుగు సంఘం వారు ఇండియన్ రెస్టారెంట్లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని, అక్కడ వారు నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి తెలుసుకోవడం జరిగింది. అక్కడే తెలుగు ప్రముఖులతో కలిసి భోజనం చేశాము.

డల్లాస్ టెక్సాస్ రాష్ట్రంలోని పెద్ద నగరాలలో ఒకటి. ఈ నగరం బ్యాంకింగ్, వ్యాపారం, సమాచార రంగం, విద్యుచ్ఛక్తి, కంప్యూటర్ విజ్ఞానం, రవాణా రంగాలకు ప్రసిద్ధి చెందినది. చమురు పరిశ్రమలకు పత్తి పంటలకు డల్లాస్‌కు ప్రత్యేకత ఉంది. విస్తారంగా ఉన్న రైలు మరియు రోడ్డు వసతుల కారణంగా ఇది బలవత్తరమైన రవాణా, పారిశ్రామిక, ఆర్థిక కేంద్రంగా రూపొందింది.

డల్లాస్ నగరంలో 700 అడుగులకు పైబడిన ఆకాశ హర్మ్యాలు ఉన్నాయి. డల్లాస్ నగరం బార్బిక్యూ అనే ఒక రకం కాల్చిన వంటకాలకు ప్రసిద్ధి. నోరూరించే మెక్సికన్–టెక్సాస్ వంటలకు, మార్గరిటా అనే శీతల పానీయానికి, చైనా హోటళ్ళకు పేరు పొందింది. విరివిగా కనిపించే స్టీక్ హౌస్‌లు ఈ నగర ఆహార సంస్కృతిలో ఒక భాగం.

అక్కడ మంత్రిగారి బంధువులు, స్నేహితులు, దివిసీమవాసులు కొందరు మంత్రిగారిని వారిని ఇంటికి ఆహ్వానించి, వారిని ఘనంగా సన్మానించారు.

సాయంత్రం డల్లాస్‌లో అందరితో వీడ్కోలు తీసుకుని, విమానంలో మియామీ నగరానికి బయలుదేరాము. మియామీ విమానాశ్రయంలో మంత్రిగారి సోదరి అన్నపూర్ణగారు, బావగారు డా. పద్యాల చంద్రశేఖర్‌గారు, వారి మేనకోడలు డా. ఉజ్జ్వల, ఆమె భర్త శ్రీ కమ్మిని చంద్రశేఖర్ బుద్ధప్రసాద్‌గారికి స్వాగతం పలికి మమ్మల్ని వారి ఇంటికి తోడ్కొని వెళ్ళారు. ఆ రాత్రి అక్కడే బస.

30.06.2008

ఉదయం అల్పాహారం తరువాత మియామీ నగరానికి ప్రసిద్ధి తెచ్చిన సముద్రపు బ్యాక్ వాటర్‌లో విహరించి, ఫిష్ అక్వేరియంను సందర్శించాము. తరువాత డాల్ఫిన్ షో చూసి, దగ్గరలోని ద్వీపాలను సందర్శించాము.

మియామి ఆగ్నేయ ఫ్లోరిడాలోని అట్లాంటిక్ తీరంలో ఉన్న పెద్ద నగరం. అనేక వినోద కేంద్రాలకు, ప్రదర్శనశాలలకు, ఉద్యాన వనాలకు నిలయంగా ఉంది. విందు, వినోదాలకు, నైట్ క్లబ్బులకు, ఒపెరాలు, బ్యాలెలు, కచేరీలు మరియు సంగీత కార్యక్రమాలకు ఈ నగరం పేరుగాంచింది.

మధ్యాహ్నం ఇండియన్ రెస్టారెంట్‌లో అక్కడి తెలుగు ప్రముఖులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని, వారితో కలిసి అక్కడే భోజనం చేశాము.

01.07.2008

సాయంత్రం విమానంలో ఇండియాకు తిరుగు ప్రయాణమైనాము. మధ్యలో విమానం ఆలస్యం మూలంగా 10 గంటలు ఆలస్యంగా 03.07.2008 ఉదయం గం. 9.15 ని.లకు ఎమిరేట్స్ విమానంలో హైదరాబాదు శంషాబాదు విమానాశ్రయంలో దిగాము. విమానాశ్రయానికి యం.యల్.సి. శ్రీ ఐలాపురం వెంకయ్యగారు, సాంకేతిక విద్యాశాఖ మాజీ డైరెక్టర్ శ్రీ పి.హెచ్.ఎన్.బి. శర్మగారు, మంత్రిగారి తోడల్లుడు శ్రీ మండల భాస్కరరావుగారు, మంత్రిగారి కుమారుడు చిరంజీవి వెంకట్రామ్ (రాజా) ఇతర కుటుంబ సభ్యులు, మిత్రులు, సిబ్బంది మా ఇద్దరికి సాదరంగా స్వాగతం పలికారు.

మండలి బుద్ధప్రసాద్‌గారి అమెరికా ప్రయాణం అక్కడి తెలుగువారిలో ఎంతో స్ఫూర్తిని నింపింది. అంతర్జాతీయ స్థాయిలో మొదటిసారిగా అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో జరిగిన కూచిపూడి నాట్య సమ్మేళనంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పక్షాన పాల్గొనడం బుద్ధప్రసాద్‌గారికి, వారితోపాటు నాకు ఒక అపూర్వ అవకాశం. రాష్ట్ర ప్రభుత్వంలో కేబినెట్ మంత్రి అయివుండి కూడా సాంకేతిక కారణాల వల్ల ప్రభుత్వ ప్రతినిధిగా కాక స్వంత ఖర్చులతోటే బుద్ధప్రసాద్ గారు ఈ ప్రయాణాన్ని చేయడం వారి ఔచిత్యగుణాన్ని, వారికి కూచిపూడి నాట్యం పట్ల, తెలుగు సంస్కృతీ సంప్రదాయాల పట్ల, ప్రవాసాంధ్రుల పట్ల గల ప్రగాఢ అనుబంధాన్ని సూచిస్తున్నాయి.

ఉత్సాహభరిత వాతావరణంలో సాగిన నాట్యసమ్మేళనంలో పాల్గొని, తమ వాగ్ధాటితో తెలుగు భాషా సంస్కృతుల వైశిష్ట్యాన్ని సందర్భం వచ్చినప్పుడల్లా అనర్గళంగా కొనియాడి, బుద్ధప్రసాద్‌గారు సభికులను మంత్రముగ్ధులను చేసి, ఉత్సవాలకు నిండుతనాన్ని తెచ్చారు.

ఉత్సవాల తరువాత, సెయింట్ లూయిస్, డెట్రాయిట్, చికాగో, డల్లాస్, మియామి నగరాలలో బుద్ధప్రసాద్‌గారు జరిపిన పర్యటనల సందర్భంగా వారికి జరిగిన సన్మాన సభల్లో తెలుగు భాషా సంస్కృతుల ప్రాచీన వైశిష్ట్యం గురించి చెప్పడంతో పాటు, ప్రపంచీకరణ నేపథ్యంలో సమాచార సాంకేతిక రంగాన్నుపయోగించి తెలుగు భాషను ప్రపంచమంతా విస్తరింపజేయడానికి ఐ.టి. నిపుణులు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఇంటర్నెట్ ద్వారా తెలుగు సాహిత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలని, తెలుగు కవుల వెబ్‌సైట్‌ను రూపొందించాలని, ఆన్‌లైన్ ద్వారా తెలుగు భాషను, కూచిపూడి నృత్యం వంటి మన కళలను నేర్చుకోవడానికి తగు ఏర్పాట్లు చేయాలని, ఐ.టి.

రంగంలోని తెలుగు వారు ఇందు కోసం ఉద్యమరూపంలో కృషి చేయాలని కోరారు. ఇంటర్నెట్ ద్వారా ప్రస్తుతం లభిస్తున్న తెలుగు సాహిత్యం మిగతా భాషలతో పోలిస్తే అతి స్వల్పంగా ఉందనీ, ఒక్క తెలుగు కవికి కూడా వెబ్ సైట్ లేదనీ, ఈ పరిస్థితుల్లో ఐ.టి. రంగంలో పనిచేస్తున్న తెలుగువారు తమ కిష్టమైన కవుల, రచయితల రచనలతో వెబ్‌సైట్లను రూపొందిస్తే, అచిరకాలంలోనే తెలుగుకు సరికొత్త వెలుగును తేగలమని ఆయన అన్నారు. ఈ సూచన అమెరికాలో ఐ.టి. రంగంలో పనిచేస్తున్న తెలుగువారిని విశేషంగా ఆకర్షించింది. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన చిత్రకారుడు డా.యస్.వి. రామారావు మీద వెబ్‌సైట్‌ను రూపొందిస్తామని ఆచంట భరత్‌రావు ట్రస్ట్ నిర్వాహకులు శ్రీ ఆచంట రవిబాబు వెంటనే స్పందిస్తూ ప్రకటించారు. ప్రసిద్ధ సినీ నటుడు కీ.శే. యస్.వి. రంగారావుపై వెబ్ సైట్ నిర్మించడానికి డల్లాస్ నగరంలో ఒక ఐ.టి. ఉద్యోగి ముందుకు వచ్చారు.

ఈ విధంగా బుద్ధప్రసాద్ గారి అమెరికా పర్యటన అక్కడి తెలుగువారిలో ఐ.టి. పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని మాతృభాషా సాహిత్యాలను అంది పుచ్చుకుని, అందులోని మాధుర్యాన్ని ఆస్వాదించే ప్రయత్నాలు ముమ్మరం చేయడానికి దోహదపడింది. అక్కడి వ్యవసాయ క్షేత్రాల సందర్శన నాకు అందివచ్చిన ఒక అద్భుత అవకాశం. వ్యవసాయరంగంలో అక్కడివారు అనుసరిస్తున్న పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అందుబాటులోకి వచ్చిన అధునాతన యంత్రాల పనితీరును పరిశీలించడం, అక్కడ పశుపోషణలో పాటిస్తున్న మెళకువలను గమనించడం నాకు మహత్తరమైన అనుభవాలను మిగిల్చింది.



సినీ దర్శకులు శ్రీ కె. రాఘవేంద్రరావు, శ్రీ కె. విశ్వనాథ్, శ్రీ అక్కినేని నాగేశ్వరరావులతో...

నిజమైన వారసుడు

- డా. గంధం సుబ్బారావు

శ్లో. ప్రజాకార్యం తు తత్కార్యం,
ప్రజాసౌఖ్యం తు తత్సుఖం
ప్రజాప్రియః ప్రియస్తస్య,
స్వహితంతు ప్రజాహితం

"ప్రజల పనియే తన పని; ప్రజల సుఖమే తన సుఖం, ప్రజల సంతోషమే తన సంతోషం; ప్రజల హితమే తన హితం"–

ఈ విధంగా ప్రజలతో మమేకమై, వారితో అవినాభావ సంబంధం కలిగివున్న వాడే ఉత్తమ నాయకుడు.

మండలి బుద్ధప్రసాద్ గారికి ఈ లక్షణాలన్నీ సంపూర్ణంగా ఉండటమే కాక, నిష్కళంక రాజకీయ జీవితం, కార్యదక్షత ఆయనను ఒక ఉదాత్తనేతగా నిలబెట్టాయి.

అనర్గళమైన వాగ్ధాటి, అద్భుతమైన భాషాపటిమతో పాటు తెలుగు భాషా సాహిత్యాల మీద, సంస్కృతి మీద, తెలుగుజాతి గతవైభవం పట్ల ఆయనకుగల అపారమైన ప్రేమాభిమానాలు ఆయనకు రాజకీయవేత్తలలో ఒక ప్రత్యేకతను సంతరించిపెట్టాయి.

తండ్రి అడుగుజాడల్లో :

పూవు పుట్టగానే పరిమళిస్తుంది అన్నట్లుగా, సమర్థ నాయకుడు, సమైక్యవాది, తెలుగు భాషా సంస్కృతుల ప్రేమికుడైన మండలి వెంకట కృష్ణారావుగారి తనయుడుగా బాల్యంనుంచే తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన సుగుణాలన్నిటినీ పుణికిపుచ్చుకొని, ఆ వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు.

బుద్ధప్రసాద్ గారిని నేను 1974 నుంచి ఎరుగుదును. అవి ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్న రోజులు. రాష్ట్ర విద్యాసాంస్కృతిక శాఖల మంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలకు కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఉండి, అన్నీ తానై మహాసభల నిర్వహణకు అవిశ్రాంతంగా కృషిచేస్తూ, అందరినీ ఉత్సాహపరిచి పనిచేయించేవారు. మంత్రిగా తన బాధ్యతలు ముగించుకొని, సాయంత్రం 7.00 గంటల తరువాత రవీంద్రభారతి మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన మహాసభల కార్యాలయానికి వచ్చేవారు. అప్పుడప్పుడు తండ్రిగారితో విద్యార్థిగా వున్న బుద్ధప్రసాద్‌గారు కూడా వచ్చేవారు. మహాసభల కార్యాలయంలో ఒక ఉద్యోగిగా బుద్ధప్రసాద్‌గారిని గమనించేవాడిని. మంత్రిగారి తనయుడు కావటం మూలంగా అందరమూ ఆయనను ప్రత్యేక దృష్టితో చూసేవారము. తండ్రి వెనక వచ్చిన బుద్ధప్రసాద్‌గారు అక్కడున్న పెద్దలకు నమస్కరించి, తండ్రికి దూరంగా

ఖాళీగావున్న కుర్చీలో కూర్చుని, అంతా శ్రద్ధగా గమనించేవారు. ఆ వయసులో కూడా ఆయన తెల్లని ఖద్దరు ప్యాంటు, షర్టే ఎల్లప్పుడూ ధరించేవారు. ఆ వయసు పిల్లలలో ఉండేచిలిపితనం, పిల్లచేష్టలు, సరదాలు లేకుండా ఆ విధంగా తండ్రిగారితో మహాసభల కార్యాలయానికి వచ్చి, మూడు నాలుగు గంటలు ఎవరితో మాట్లాడకుండా, కదలకుండా కూర్చొని అన్నీ గమనిస్తుండటం మాకు ఆశ్చర్యంగా ఉండేది.

నెమ్మదిగా బుద్ధప్రసాద్‌గారి గురించిన విషయాలు తెలియడం మొదలైంది. ఆయనకు పుస్తక పఠనం పట్ల అమితాసక్తి. ఏ మంచి పుస్తకం గురించి తెలిసినా దానిని సేకరించి చదివేవారు. అవి ప్రాచీన కావ్యాలు కావచ్చు, చారిత్రక గ్రంథాలు కావచ్చు – శ్రద్ధగా చదివి, విషయాలను గుర్తుపెట్టుకునే వారు. 1976 లో మారిషస్‌లో జరిగిన "విశ్వ హిందీసమ్మేళనం" సందర్భంగా రాష్ట్ర విద్యాసాంస్కృతిక శాఖామంత్రి హోదాలో భారత ప్రతినిధివర్గంలో సభ్యులుగా మండలి వెంకట కృష్ణారావుగారు మారిషస్‌కు పయనమైనారు. అప్పటి అంతర్జాతీయ తెలుగు సంస్థ డైరెక్టర్ డాక్టర్ పి.యస్. ఆర్. అప్పారావుగారు మారిషస్‌లోని తెలుగువారిని గురించిన ఒక నోటు తయారుచేసి మంత్రిగారికి పంపారు. మండలి వెంకట కృష్ణారావుగారు విద్యామంత్రిగా అంతర్జాతీయ తెలుగు సంస్థకు అధ్యక్షులు కూడాను. ఆ నోటును తండ్రిగారి కంటే ముందే చదివిన బుద్ధప్రసాద్‌గారు పి.యస్.ఆర్. అప్పారావుగారికి ఫోన్ చేసి, తెలుగు భాషా సమితి ప్రచురించిన విజ్ఞాన సర్వస్వం ఫలానా సంపుటంలో మారిషస్ తెలుగువారికి సంబంధించిన మరింత సమాచారం ఉంది – చూడండి అని చెప్పారు. ఆ పుస్తకం తెప్పించుకొని చూసిన అప్పారావుగారు దాదాపు 'షాక్' కు గురైనారు. "అదేమిటి! నాక్కూడా తెలియని విషయం ఈ అబ్బాయికెట్లా తెలిసిందని ఆశ్చర్యపోయారు. బుద్ధప్రసాద్ గారి పుస్తక పఠనాసక్తికి, విషయగ్రహణకు ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

పెద్దల పట్ల బుద్ధప్రసాద్‌గారికి అపారమైన గౌరవం. సాహిత్యం, భాష, చరిత్ర, కళలు, సంఘసేవ వంటి అన్ని రంగాలలో తలమానికాలు అనదగ్గ పెద్దలందరితో ఆయనకు సన్నిహిత పరిచయాలు ఉండేవి. ఎంత పెద్ద పదవిని అధిష్టించినా ఆ గుణం వారిని విడువలేదు. డా. అడపా రామకృష్ణారావు, ఆచార్య జి.యన్. రెడ్డి, శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య, శ్రీ దేవులపల్లి రామానుజరావు, శ్రీ రాయప్రోలు సుబ్బారావు, శ్రీ కోదాటి నారాయణరావు, డా. ఖండవల్లి లక్ష్మీరంజనం, డా. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, న్యాయపతి రాఘవరావు దంపతులు, మాలతీ చందూర్ దంపతులు, జానుమద్ది హనుమచ్ఛాస్త్రి వంటి తెలుగు ప్రముఖులే కాక మదర్ థెరిస్సా, వినోబాభావే, జర్మనీ మేయర్ గుజ్జుల రవీంద్ర, మారిషస్ విద్యామంత్రి శ్రీ పరశురామ్, క్రైస్తవమత ప్రచారకురాలు జాయిస్ మేరీ, జర్మన్ సంఘసేవకుడు డా. హీంజ్ హోర్స్ట్ డైక్‌మన్ వంటి వారితో బుద్ధప్రసాద్‌గారికి చిన్ననాటి నుంచే పరిచయాలున్నాయి. ఇప్పుడు వారినెరిగిన జాతీయ, అంతర్జాతీయ ప్రముఖుల గురించి చెప్పబూనుకోవడం సూర్యుడికి దివిటీ పట్టడమే.

మనసావాచాకర్మణా సమైక్యవాది :

1972 లో ఝుంఝుమారుతంగా చెలరేగిన ప్రత్యేకాంధ్ర ఉద్యమానికి ఎదురొడ్డి నిలిచిన అతికొద్ది మంది ఆంధ్ర నాయకులలో మండలి వెంకట కృష్ణారావుగారొకరు. ఆ కారణంగా వారి కుటుంబం అనేక కష్టనష్టాలకు గురికావలసి వచ్చింది. నిందలు, దూషణలు భరించవలసి వచ్చింది. దాడులను ఎదుర్కోవలసి వచ్చింది. కొంతకాలం ఆయన హైదరాబాదులోనూ, కుటుంబం అవనిగడ్డలోను ఉండవలసిరావడం వలన

కుటుంబమంతా ఆవేదనకు, తీవ్రమైన మానసిక వత్తిడికి గురికావలసి వచ్చింది. అవనిగడ్డలో రోజూ ఇంటి మీద దాడులు పెరిగాయి. ఉద్యమకారులు వారి ఇంటికి ఎవరినీ వెళ్ళనీయలేదు. చివరికి రజకులను, క్షురకులను కూడా వీరి ఇంటికి పోనీయకుండా అడ్డుకున్నారు. ఆ సమయంలో పదిహేనేళ్ళ చిరుప్రాయంలో ఉన్న బుద్ధప్రసాద్‌గారు తల్లి ప్రభావతీదేవిగారికి అండగా నిలిచి, బాలవీరుడుగా తండ్రి ఆశయాలను గౌరవిస్తూ, కార్యకర్తలను సమీకరించి, ప్రత్యేకవాదుల దాడులను ఎదుర్కొన్నారు. కృష్ణారావుగారి అనుచరుడైన హరిజన కార్యకర్త ఎస్. ప్రకాశరావును అవనిగడ్డ వీధుల్లో ప్రత్యేకాంధ్ర నినాదం చేయలేదన్న కారణంతో గుండుచేయించి, సున్నపు బొట్లు పెట్టి అమానుషంగా వేధించారు. ఆ సంఘటనను ఏ దినపత్రిక ప్రచురించడానికి సాహసించలేక పోయింది. అప్పుడు బుద్ధప్రసాద్‌గారు అతనికి ధైర్యం చెప్పి, ఏలూరులోని "స్నేహలత" సంపాదకులు శ్రీ అర్జా సూర్యనారాయణ వద్దకు అతనిని పంపించారు. అర్జా సూర్యనారాయణగారు తన పత్రికలో ఈ విషయాన్ని ధైర్యంగా ప్రచురించారు. ఆ వార్తను ఆంగ్ల దినపత్రికలు ప్రముఖంగా ప్రచురించడంతో ఆంధ్రప్రదేశ్‌లోనే కాక ఉత్తర భారతదేశంలోనూ దీనికి మంచి ప్రచారం లభించింది. దీనిపై పార్లమెంట్‌లో చర్చకూడా జరిగింది. అటువంటి వార్తను ధైర్యంగా ప్రచురించినందుకు "స్నేహలత" వారపత్రిక కూడా ప్రశంసలందుకుంది.

కోసూరి పున్నయ్య భాగవతార్ వంటి కవులచేత సమైక్యవాదాన్ని ప్రబోధిస్తూ వ్రాయించి, బుద్ధప్రసాద్‌గారు "స్నేహలత" కు పంపుతుండేవారు. ఈ విధంగా రాష్ట్ర సమైక్యత కోసం చిన్ననాడే బుద్ధప్రసాద్‌గారు పోరాడారు.

2013 జూన్ లో ఎ.ఐ.సి.సి. అధిష్ఠానం తెలంగాణా రాష్ట్రం ఏర్పాటుకు నిర్ణయం తీసుకోగానే ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం అధ్యక్ష పదవికి రాజీనామా ప్రకటించి రాష్ట్ర సమైక్యత పట్ల తనకు గల నిబద్ధతను చాటుకున్నారు. రాష్ట్రాన్ని చీల్చే దిశగా కాంగ్రెస్ అడుగులు వేస్తుంటే తట్టుకోలేక కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికీ రాజీనామా చేశారు. తరతరాలుగా మనసా, వాచా, కర్మణా కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడిన కుటుంబంలో పుట్టి, ఆ పార్టీని విడనాడడానికి బుద్ధప్రసాద్ గారు పడిన మానసికవేదన వర్ణనాతీతం. ఎంతో ఘనచరిత్ర కలిగి, ప్రపంచంలోనే సుదీర్ఘ చరిత్ర కలిగిన పార్టీలలో ప్రథమ స్థానంలో ఉన్న భారత జాతీయ కాంగ్రెస్ నీచ రాజకీయాలకు పాల్పడి, రాష్ట్రాన్ని విడదీయడం వల్ల కలతచెందిన బుద్ధప్రసాద్ గారు ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తూ, అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి సోనియాగాంధీకి 2013 అక్టోబర్ 4 వ తేదీన ఈ క్రింది లేఖను వ్రాశారు.

"భారత ప్రజానీకాన్ని సమీకరించేందుకు భాష, సంస్కృతి అనేవి సమర్థవంతమైన సాధనాలుగా, ప్రముఖ సమైక్యతాబంధాలుగా పనికివస్తాయనే సత్యాన్ని స్వాతంత్ర్య పోరాటానికి సారథ్యం వహించిన కాంగ్రెసు తొలి రోజుల్లోనే గుర్తించింది. 1905లో భారత జాతీయ కాంగ్రెసు బెంగాలు విభజనను వ్యతిరేకించింది. ఆ విధంగా ఆనాడే భాషా ప్రాతిపదిక సిద్ధాంతానికి అంకురార్పణ చేసింది. 1908లో బీహారుకు ప్రత్యేకంగా రాష్ట్రీయ కాంగ్రెసు కమిటీ ఏర్పడింది. 1917లో ఆంధ్రాకు ప్రత్యేక రాష్ట్ర కాంగ్రెసు సంస్థలను ఏర్పాటు చేయాలని లోకమాన్య బాలగంగాధర్ తిలక్ సమర్థించారు. 1922లో నాగపూర్‌లో జరిగిన కాంగ్రెస్ మహాసభ కాంగ్రెస్ సంస్థను భాషాప్రాతిపదిక మీద రాష్ట్ర సంఘాలుగా పునర్వ్యభజించింది. అప్పటి వరకు మద్రాసు కాంగ్రెసు కమిటీలో కలసి ఉన్న ఆంధ్ర కాంగ్రెసును వేరు చేసి ప్రత్యేక కమిటీగా ఏర్పాటు చేశారు.

1928లో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసిన "నెహ్రూ కమిటీ" ఒక ప్రాంతం విద్యావంతం కావాలన్నా, తన దైనందిన కార్యకలాపాలను స్వంత భాషలో నిర్వర్తించుకోవాలన్నా అది తప్పనిసరిగా భాషాప్రయుక్త ప్రాంతమై ఉండాలని పేర్కొంది. "రాష్ట్రాల పునర్విభజన భాషల ప్రాతిపదికపై జరగాలనే ఆదినుంచి నా లక్ష్యమన్న సంగతి మీకు తెలిసిందే. ఈ సూత్రాన్ని ఆంధ్ర రాష్ట్రోద్యమం నుంచి నేను స్వీకరించా' 'నని 1938లో మహాత్మా గాంధీ సర్వేపల్లి రాధాకృష్ణకు వ్రాసిన లేఖలో పేర్కొన్నారు. 1948లో జవహర్ లాల్ నెహ్రూ అధ్యక్షతన సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్, డా. భోగరాజు పట్టాభి సీతారామయ్య సభ్యులుగా ఏర్పడిన జి.వి.సి. కమిటీ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును సమర్థించింది. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం ఏర్పరచిన మొదటి రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమీషన్ నివేదిక ఆధారంగా 1956లో భాషాప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించింది.

1969-1972లలో వేర్పాటు ఉద్యమాలు ఆంధ్రప్రదేశ్‌లో తలెత్తినప్పుడు శ్రీమతి ఇందిరాగాంధీ "మన రాష్ట్రాలు హేతుబద్ధమైన పద్ధతి పైనే ఏర్పాటయ్యాయి. క్షణికోద్రేకాలకులోనై హేతువాదం పునాదులను కదిలించకుండా మనం జాగ్రత్త పడాలి" అని చెప్పారు. "ప్రజల మనోభావాలను కూడా మనం గమనించాలి. అయితే ప్రభుత్వం ఆవేశాలకు ప్రభావితం కావటం తప్పు. ప్రజలకు ఏది ఎక్కువ శ్రేయస్కరమో మనం గమనించాలి" అని శ్రీమతి ఇందిరాగాంధీ చేసిన దిశానిర్దేశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కాంగ్రెస్ పార్టీ నిర్ణయం చేయడం విచారకరమే కాకుండా కాంగ్రెస్ మూలసిద్ధాంతాన్ని కాలరాసినట్లయింది.

తెలుగుజాతి ఒకే పాలనలోకి రావాలనే దశాబ్దాలు తరబడి తెలుగువారు పోరాటం చేశారు. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేశారు. బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఇన్ని త్యాగాలతో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌ను చిత్తుకాగితాన్ని చించివేసినట్లుగా చించాలని ప్రయత్నించడం దురదృష్టకరం. ఆంధ్రప్రదేశ్‌లో 8.5 కోట్ల మంది తెలుగువారే కాకుండా, ఇతర రాష్ట్రాలలో, ఇతర దేశాలలో మరో 8 కోట్ల మంది తెలుగువారున్నారు. వారందరూ రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తున్నారు. తెలుగు ప్రజల మనోభిప్రాయాలను గమనించకుండా రెండు పర్యాయాలు కేంద్రంలో యు.పి.ఎ. ప్రభుత్వం ఏర్పడటానికి కారణభూతులైన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తగిన బహుమానం ఇచ్చారు. తెలుగుజాతిని నిట్టనిలువునా చీల్చారు. భాషాప్రయుక్త రాష్ట్రాన్ని విడదీసేటప్పుడు ఒక శాస్త్రీయమైన దృక్పథాన్ని కాంగ్రెస్ ప్రకటించకపోవడం శోచనీయం. గతంలో సి.డబ్ల్యు.సి. రెండవ పునర్వ్యవస్థీకరణ సంఘం ఏర్పాటు చెయ్యాలని తీర్మానించి ఆ శిలాశాసనాన్ని పగులకొట్టారు. ఆంధ్రప్రదేశ్ విభజనకు రెండవ పునర్వ్యవస్థీకరణ సంఘం అక్కరలేదట. దేశంలో మిగతా రాష్ట్రాలకు అది వర్తిస్తుందట. ఉత్తరప్రదేశ్ శాసనసభ ఉత్తరప్రదేశ్ ని విభజించమని తీర్మానం చేస్తే దాన్ని బుట్టదాఖలు చేసి, శాసనసభ తీర్మానం లేకుండానే ఆంధ్రదేశాన్ని విభజించాలని ప్రయత్నించడంలో మర్మమేమిటి? దక్షిణాదిలో 42 మంది పార్లమెంటు సభ్యుల బలంగల ఆంధ్రప్రదేశ్‌ని బలహీనపరచి ఉత్తరాది ప్రాబల్యాన్ని చాటుకోవడానికేనా ఈ విభజన.

తెలుగు ప్రజల ఆందోళనలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించింది. తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాలరాసినందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. ముఖ్యమంత్రి, పి.సి.సి. అధ్యక్షులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు సమైక్యంగా ఉంచాలని పదేపదే చెప్పినా పట్టించుకోలేదంటే తెలుగుజాతిని అవమానపరచినట్లే. కాంగ్రెస్ కుటుంబంలో పుట్టాను. ఖద్దరు గుడ్డల

పొత్తిళ్ళలో పెరిగాను. చచ్చేవరకు కాంగ్రెస్‌వాదిగా ఉండాలన్న నా కోరికను కాంగ్రెస్ పార్టీ కాలరాసింది. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీల విధానాలకు పార్టీలో గౌరవం లేనప్పుడు ఆ పార్టీలో ఉండి ప్రయోజనం లేదు. కాంగ్రెస్ తప్పుడు విధానాలకు ప్రజలకు సమాధానం చెప్పలేక జీవచ్ఛవంగా బ్రతకడమా? తెలుగువాడి ఆత్మాభిమానాన్ని దెబ్బతీసిన పార్టీలో చేవచచ్చి పదవుల కోసం కొనసాగడమా? ప్రజాస్వామ్య భావాలకు తిలోదకాలిచ్చి మా నిర్ణయం శిలాశాసనం, దానిని పాటించి తీరాలనే నియంతృత్వ విధానాలకి తలొగ్గడమా? ఇవన్నీ ఆలోచించి ఆత్మాభిమానాన్ని నిలుపుకోవడానికి కాంగ్రెస్ పార్టీని వదులుకోవడమే శ్రేయస్కరమనే నిర్ణయానికి వచ్చాను. ఈ నిర్ణయానికి రావడంలో ఎంతో బాధ, ఎంతో మనోవేదన ఉన్నప్పటికీ తెలుగుజాతిలో పుట్టినందుకు ఈ నిర్ణయం తీసుకోకపోతే జాతి ద్రోహిగా మిగిలిపోతాను.

మా నాన్నగారు స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు కరడుగట్టిన సమైక్యవాది. 1972 'జై ఆంధ్ర' ఉద్యమ సమయంలో శ్రీ పి.వి. నరసింహారావు మంత్రివర్గంలో సమైక్యతను ఆకాంక్షించి ప్రాణాలకు తెగించి నిలబడ్డ ముగ్గురు మంత్రులలో వారు ఒకరు. ఆనాడు శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వాన కాంగ్రెస్ పార్టీ విధానాన్ని అనుసరించి మా నాన్నగారు సమైక్యతను బలపరచినందుకు మా కుటుంబం ఎన్నో బాధలు పడవలసి వచ్చింది. ఎన్నో అవమానాలు భరించవలసి వచ్చింది. మా నాన్నగారు "ఆంధ్రప్రదేశ్ ఐక్యత అన్నది ఒక ఆశయం. విశాలాంధ్ర అన్నది మన ఆదర్శం. ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే వారసత్వం కలిగిన తెలుగుజాతి, తెలుగుజాతిగా, ఏకజాతిగా భారత జాతీయ జీవనంలో ఉన్నత స్థానం ఆక్రమించాలి. మహోజ్వలమైన ఆంధ్ర చరితను, మహోన్నతమైన మన వారసత్వాన్ని మన ముందుంచుకొని మన సాంస్కృతిక వారసత్వసంపదను సుసంపన్నం చేసుకుంటూ పురోగమించాలి" అని ఆనాడు ఉపదేశించారు. ఆ ఆశయసాధన కోసమే నేను శాసనసభ్యుడునైన నాటి నుంచి రాష్ట్ర విభజనకు జరిగే ప్రయత్నాలను ఎదిరించాను. సమైక్యవాదాన్ని కాంగ్రెస్ నాయకత్వానికి వినిపించాను. కాంగ్రెస్ తన మౌలిక సిద్ధాంతానికి తిలోదకాలు ఇస్తుందని కలలో కూడా ఊహించలేదు. సామరస్య పరిష్కారం కనుగొని రాష్ట్ర సమైక్యతను కాపాడతారని ప్రగాఢ నమ్మకంతో ఉన్నాను.

జాతీయ భావాలకు పాతర పెట్టి, రాజకీయ ప్రయోజనాలకే పెద్ద పీటవేసి, తెలుగుజాతి చరిత్రలో చీకటి అధ్యాయాన్ని రచిస్తున్న కాంగ్రెస్ పార్టీ విధానాలకు సంపూర్ణ నిరసన వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాను".

తల్లి ప్రోత్సాహంతోనే "తెలుగుదేశం" లోకి :

పై లేఖకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఏరకమైన స్పందన లేకపోవడం దురదుష్టకరం. ప్రస్తుత రాజకీయాలలో తాను ఇమడలేనని నిశ్చయానికి వచ్చిన బుద్ధప్రసాద్‌గారు తీవ్రమైన నిర్వేదానికి గురై, రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకోవాలని భావించి వైరాగ్యంలో మునిగిపోగా, తల్లి ప్రభావతీదేవమ్మగారే 'తెలుగుదేశం' పార్టీలో చేరమని ప్రోత్సహించారు. ఎలక్షన్ల ముందు ఒకసారి నేను అవనిగడ్డ వెళ్ళగా, ప్రభావతీదేవిగారు నన్ను చేరబిలిచి ఎంతో ఆవేదనతో "బాబు (బుద్ధప్రసాద్) తెలుగుదేశంలో చేరడం నాకు ఇష్టం లేదని, కాంగ్రెస్ లోనే ఉండాలని నేను కోరుకుంటున్నానని, అయినా తల్లి మాటను ధిక్కరించి

బుద్ధప్రసాద్ తెలుగుదేశం తీర్థం పుచ్చుకొన్నాడని గిట్టనివాళ్ళు ప్రచారం చేస్తున్నారు. అసలు బాబును తెలుగుదేశంలో చేరమని ఒత్తిడి తెచ్చిందే నేను. అట్లాంటిది ఈ విధంగా నా పేరు వాడుకుంటూ దుష్ప్రచారం చేయడం నాకు చాలా బాధగా ఉంది. రేపు నేను ప్రెస్ వాళ్ళందరినీ పిలిచి, వారి ముందు ఈ విషయాలు చెప్పదలుచుకున్నాను. ఇందులో ఏమైనా తప్పులున్నయ్యేమో చూడు" అని చెబుతూ, ప్రెస్ వారికి ఇవ్వడానికి తాను స్వదస్తూరీతో తయారు చేసుకున్న ప్రకటనను నాకు చూపించారు. అందులో బుద్ధప్రసాద్‌గారి తండ్రి తెలుగుజాతిని ఒకటిగా ఉంచడం కోసం ఎంతగా పరితపించి, రాష్ట్ర సమైక్యత కోసం ఆయన ఎన్ని కష్టాలు అనుభవించింది, ఆయన ఆశయాలకు విఘాతం కలిగిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రం విడగొట్టడానికి తీసుకున్న నిర్ణయం తనను ఎంతగా కలచివేసిందో వివరిస్తూ, తానే తన తనయుణ్ణి "తెలుగుదేశం"లో చేరమని ఉద్బోధించానని స్పష్టంగా వ్రాసి వుంది. "ఇందులో మీ హృదయం మొత్తం ఆవిష్కరించారు... తప్పులేముంటై అమ్మా. చాలా బాగుంది. దీన్నే పత్రికలవారికివ్వండి" అని ఆ కాగితం ఆమెకు తిరిగి ఇచ్చాను.

అద్భుతమైన పఠనావేగం, జ్ఞాపక శక్తి :

బుద్ధప్రసాద్‌గారు దేనినైనా అతివేగంగా చదువుతారు. ఒక సెకనులో పేజీ త్రిప్పేస్తుంటారు. నేను మొదట్లో ఈయన చదువుతున్నారా... లేక ఊరికే పుటలు త్రిప్పుతున్నారా? అనుకునే వాణ్ణి. అయితే ఎక్కడ తప్పు ఉందో లేక ఎక్కడ అవసరం లేదనుకుంటారో అక్కడ ఠక్కున కళ్ళు ఆగిపోతాయి. దాన్ని బట్టి ఆయన పఠనావేగాన్ని నేను గ్రహించగలిగాను.

1997 సంవత్సరం సెప్టెంబర్ 27 వ తేదీన మండలి వెంకట కృష్ణారావుగారు పరమపదించారు. ఆ తరువాత కొన్నాళ్ళకు వారి స్మృతి చిహ్నంగాఒక ప్రత్యేక సంచికను ముద్రించాలని బుద్ధప్రసాద్‌గారు తలపెట్టారు. ఇందుకోసం కొందరు ప్రముఖులు వ్రాసిన వ్యాసాలు సేకరించుకుని ఫలానా రోజున, ఫలానా సమయానికి గాంధీ భవన్ లో తనకు అందజేయవలసిందిగా బుద్ధప్రసాద్‌గారు నన్ను కోరారు. ఆ వ్యాసాలు సేకరించి చదివిన పిమ్మట వారి గురించి నేను కూడా ఒక వ్యాసం వ్రాయాలని అనిపించి, వ్యాసాన్ని తయారుచేశాను. బుద్ధప్రసాద్‌గారు చెప్పిన సమయానికి గాంధీ భవన్ కు వెళ్ళితే, దూరం నుంచే గాంధీ భవన్ ప్రాంగణం అంతా జన సంతోషంతో హడావుడిగా కనిపించింది. ఇంత మంది జనంలో బుద్ధప్రసాద్ గారిని వెదకటం ఎట్లా అని తలపోస్తూ గాంధీ భవన్ సమీపించే సరికి, గేటు దగ్గరే నా కోసం ఎదురుచూస్తూ బుద్ధప్రసాద్‌గారు నిలుచునివున్నారు. నా వ్యాసం నా వద్దే అట్టిపెట్టుకుని, నేను సేకరించి తెచ్చిన వ్యాసాలను ఇచ్చాను. వాటిని అక్కడికక్కడే చకచకా తిరగేశారు. ఆ పిమ్మట సంకోచిస్తూ నేను వ్రాసిన వ్యాసం ఇచ్చి, " నేనూ ఒకటి వ్రాశాను... చూడండి" అన్నాను. అది చదివి "బాగుంది కదా! నాన్నగారి జీవిత చరిత్ర వ్రాయకూడదూ నువ్వు" అన్నారు. అదేదో ఆషామాషికి అన్నారనుకున్నాను. అయితే అచిరకాలంలోనే అందుకు సంబంధించిన సామాగ్రి అంతా ఇచ్చి నాకు మండలి వెంకట కృష్ణారావుగారి జీవిత చరిత్రను వ్రాసే మహదవకాశం ఇచ్చారు.

బుద్ధప్రసాద్‌గారి జ్ఞాపక శక్తి అమోఘమైంది. ఏదైనా విషయాన్ని చదివితే ఎన్నేళ్ళ తరువాతైనా ఆ విషయం ఏ పుస్తకంలో ఎక్కడ ఉందో చెబుతారు. ఆయన రాజకీయవేత్త కాకపోయుంటే, ఒక గొప్ప విద్యావేత్త అయివుండేవారు.

అజాతశత్రువు :

రాజకీయాల్లో వున్నప్పుడు సహజంగా కొందరు అభిమానులు, కొందరు శత్రువులు ఉంటారు. కొందరికి అభిమానులు ఎక్కువుగా ఉంటే మరికొందరు నేతలకు శత్రువులు ఎక్కువగా ఉంటారు. బుద్ధప్రసాద్‌గారు మొదటి నుంచీ రాజకీయాలలోనే వున్నా ఆయనకు శత్రువులు లేకపోవడం ఆయన స్నేహశీలతకు తార్కాణం. ఎవరెదురైనా నవ్వుతూ పలకరించడం ఆయన ప్రత్యేకత. వివాదాల జోలికి పోకుండా, ఎవరినీ నొప్పించకుండా మసలుకొనే స్వభావం వారిది. బుద్ధప్రసాద్‌గారికి కుల, మత, ప్రాంతీయాభిమానాలు లేవు. తెలుగుజాతి అంతా ఒక్కటే అన్న ఏకైక సూత్రానికి ఆయన కట్టుబడివున్నారు. రాష్ట్రంలోని సాహితీ సాంస్కృతిక వర్గాలకన్నింటికీ ఆత్మీయ బంధువు. బుద్ధప్రసాద్‌గారు ఎక్కడుంటే అక్కడ భాషాసాహితీ సాంస్కృతుల పరిమళాలు గుబాళిస్తాయి. ఆయనను ఎప్పుడూ ప్రముఖ సాహితీవేత్తలు, కళాకారులు, పాత్రికేయులు పరివేష్టించివుంటారు. డా. వై.యస్. రాజశేఖరరెడ్డిగారు బుద్ధప్రసాద్‌గారిని తన మంత్రివర్గంలోకి తీసుకుని పశుసంవర్ధక పాడి పరిశ్రమ, మత్స్య శాఖ ఇవ్వగా..... ప్రముఖ పాత్రికేయులు, ఆంధ్రప్రదేశ్ పత్రిక ముఖ్య సంపాదకులు శ్రీ వల్లీశ్వర్ గారు "బుద్ధప్రసాద్‌గారు మీడియా ఫ్రెండ్లీ – ఆయనకు సమాచార పౌరసంబంధాలు, సాంస్కృతిక వ్యవహారాల శాఖలు ఇస్తే బాగుండేది" అన్నారు. ఏ సభాకైనా ఆయన వస్తే కానీ నిండుదనం రాని పరిస్థితి ఏర్పడింది.

బుద్ధప్రసాద్‌గారు పశుసంవర్ధక మత్స్య శాఖామంత్రిగా ఉన్నప్పుడు ఆ శాఖలో వెలుగుబంటి సూర్యనారాయణ అనే ఒక ఉద్యోగి చేసిన దారుణమైన అవినీతి కుంభకోణం వెలుగులోకి వచ్చింది. అది ఒక దుమారంలాగా చెలరేగి, ప్రభుత్వాన్ని ఒక కుదుపు కుదిపింది. శాసనసభలో ప్రతిపక్ష నేతలు ఈ అంశాన్ని లేవనెత్తగా ఆ శాఖా మంత్రిగా బుద్ధప్రసాద్‌గారు వివరణ ఇచ్చారు. ఎంతో గొడవ చేద్దామనుకున్న ప్రతిపక్ష సభ్యులు బుద్ధప్రసాద్ గారి వ్యక్తిత్వం పై, నిజాయితీ పై ఉన్న గౌరవంతో ఆయన వివరణతో సంతృప్తి చెంది ఆ అంశాన్ని అక్కడితో వదిలి వేశారు. బుద్ధప్రసాద్ గారి స్థానంలో వేరెవరున్నా అది అంతటితో ఆగేది కాదు.

ప్రస్తుత రాజకీయాలలో ప్రతిపక్ష నేతలు కూడా అభిమానించి, ఇష్టపడే ఏకైక రాజకీయ నాయకుడు మండలి బుద్ధప్రసాద్‌గారు.

తండ్రి నుంచి వారసత్వం :

బుద్ధప్రసాద్‌గారికి తండ్రిగారి నుంచి వారసత్వంగా సంక్రమించిన ఆస్తిపాస్తులు ఏమీ లేవు. మండలి వెంకట కృష్ణారావుగారు యం.యల్.ఏ., గా, యం.పి. గా, మంత్రిగా పనిచేసి మిగిల్చిందేమీ లేదు. తన తండ్రి నుంచి తనకు వారసత్వంగా సంక్రమించిన 7 ఎకరాల భూమిని కృష్ణారావుగారు ఏడుగురు హరిజనులకు పంచి పెట్టారు. యం.యల్.ఏ., కోటాలో హైదరాబాదు బంజారాహిల్స్‌లో ఇచ్చిన ఇంటి స్థలాన్ని, హౌసింగ్ బోర్డు వారు ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వద్ద కేటాయించిన ఫ్లాట్‌ను ఆయన, తనకు యం.యల్.ఏ. క్వార్టర్స్‌లో ప్రభుత్వం వసతి కల్పించిందన్న కారణంతో వదులుకున్నారు. అది ఇప్పుడు కోట్ల విలువైన ఆస్తి. ఆ విధంగా కృష్ణారావుగారు హైదరాబాదులో స్వంత ఇల్లు కూడా ఏర్పాటు చేసుకోలేదు.

బుద్ధప్రసాద్‌గారికి తండ్రి నుంచి వారసత్వంగా సంక్రమించిన సంపద – తెలుగుజాతి ప్రాచీన వైభవం పైనా, తెలుగు భాషా సంస్కృతుల పైనా తన తండ్రికి గల అపారమైన మమకారర్మ్మ ఆయనకు గల నిరాడంబరత, నిజాయితీ, స్నేహశీలత, సేవానిరతి, ఆయన అభిమానులు – స్నేహితులు.

తన తండ్రి నుంచి తనకు సంక్రమించిన ఈ వారసత్వ సంపదను బుద్ధప్రసాద్‌గారు పొదివి పట్టుకున్నారు. పదిలంగా కాపాడుకుంటూ వస్తున్నారు. తెలుగుజాతిని సమైక్యంగా ఉంచడం కృష్ణారావుగారి ఆశయాలలో ఒకటి. దాని కోసం బుద్ధప్రసాద్ గారు అహరహం కృషి చేస్తున్నారు. రాష్ట్ర సమైక్యత కోసం పదవులను తృణప్రాయంగా త్యజించారు. 2012 డిసెంబరులో తిరుపతిలో నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలను ఘనంగా నిర్వహించడం వెనుకగల బుద్ధప్రసాద్‌గారి కృషిని అందరూ శ్లాఘించారు. తెలుగుజాతి పూర్వ వైభవాన్ని పునరుద్ధరించడానికి కంకణం కట్టుకున్న చంద్రబాబునాయుడుగారితో జతకట్టారు. ప్రపంచంలో ఎక్కడ తెలుగు సంస్కృతికి సంబంధించిన ఏ కార్యక్రమం జరిగినా అక్కడ బుద్ధప్రసాద్ గారు ఉండటం తప్పనిసరి.

నిరాడంబరత తండ్రి నుంచి చిన్ననాడే బుద్ధప్రసాద్‌గారు అలవరుచుకున్నారు. ఎప్పుడూ తెల్లని ఖద్దరు వస్త్రాలు తప్ప ఆయన మరొకటి ధరించరు.

బుద్ధప్రసాద్‌గారి నిజాయితీని ప్రశ్నించే పరిస్థితి ఇంతవరకు రాలేదు. ఏ రాజకీయ పార్టీలవారు ఆయన నిజాయితీ గురించి ఎప్పుడూ ఎక్కడా ఇంతవరకు అనుమానాలు వ్యక్తం చేయలేదు సరికదా నిజాయితీకి ఆయనను కొండంత నిదర్శనంగా పేర్కొంటారు.

తండ్రి నుంచి తనకు సంక్రమించిన సేవాకార్యక్రమాలను ఆయన ఎక్కడా కుంటుబడకుండా కొనసాగిస్తున్నారు. అవనిగడ్డలో గాంధీక్షేత్రం ఒక ధర్మసత్రం. అనాథలకు, అభాగ్యులకు, తుఫాను బాధితులకు అది ఆశ్రయం. దేశ విదేశాలకు చెందిన స్వచ్ఛంద సంస్థల సేవాకార్యకలాపాలకు అది కేంద్ర స్థానం.

బుద్ధప్రసాద్‌గారి స్నేహశీలత విలక్షణమైంది. ఏ వ్యక్తయినా ఆయనతో ఒకసారి పరిచయం ఏర్పరుచుకుంటే, ఇక జీవితకాలంలో ఆయనను వదలరు. ఇంతవరకు సాగిన ఆయన జీవనయానంలో ఆయనకు పరిచయమైన ఎందరెందెరో వ్యక్తులు ఆయన స్నేహఝురిలో ఓలలాడి, ఆయనతో పాటు కలిసి నడుస్తున్నారు.

బుద్ధప్రసాద్‌గారికి తన తండ్రి నుంచి సంక్రమించిన మరొక ఆస్తి – తన తండ్రి స్నేహితులు, అభిమానులు.

బుద్ధప్రసాద్‌గారు తన తండ్రి స్నేహితులు, అభిమానులు ఎవరినీ వదలలేదు. వారితో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ, వారి అభిమానాన్ని, ఆశీస్సులను పొందుతూ, వారి సలహాలు తీసుకుంటూ వారందరికీ ఆత్మీయుడుగా మసలుకుంటున్నారు. తాను అలా ఉండటమే కాక, తన తనయుడు చిరంజీవి వెంకట్రామ్ (రాజా) కు కూడా ఆ విధంగా ఇప్పటి నుంచే తర్ఫీదు ఇవ్వడం ముదావహమైన విషయం.

అందరు బిడ్డలూ తమ తండ్రి వారసత్వాన్ని మండలి బుద్ధప్రసాద్‌గారి వలె కొనసాగిస్తే, తండ్రులంతా అమరులవుతారు.

ఆదర్శప్రాయులు

- వేలూరి పార్థసారథి, డా. వేలూరి సుమిత్ర

ఆత్మీయులూ, సహృదయులూ శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి షష్ట్యబ్ధి శుభాభినందనలు తెలియచేస్తూ వారితో మా కుటుంబానికి గల మాటలకందని అనుబంధాన్ని అక్షరాలలో బంధించి శ్రీ బుద్ధప్రసాద్ గారి విస్తృత సాహితీ కుటుంబ సభ్యులందరితో పంచుకోవాలనే చిరు ప్రయత్నమిది.

శ్రీ బుద్ధ ప్రసాద్ గారు సూర్యుని వంటివారు. సూర్యునికి 'మిత్ర' అన్న పేరు కూడా ఉంది. మిత్ర అన్న పదానికి స్నేహం, ప్రేమ, వాత్సల్యం ఇలా ఎన్నో పర్యాయపదాలను చెప్పవచ్చు. ఈ గుణాలన్నీ తమ హృదయంలో నింపుకొని తనలో దైవత్వాన్ని సాక్షాత్కరింపచేసుకున్నారు శ్రీ బుద్ధప్రసాద్ గారు. వారిని సూర్యునితో పోల్చడానికి గల కారణాలు అనేకం. సూర్యుడు అంటే వెలుగునిచ్చేవాడు అని అర్థం. కీర్తిశేషులు శ్రీ మండలి కృష్ణారావుగారి కుమారునిగా జన్మించి తండ్రిగారి అడుగుజాడలలో నడుస్తూ లోకానికి వినియోగపడుతూ నిరంతరం సేవాతత్పరత, ఉపకారబుద్ధితో మెలగుతూ తన పని తాను చేస్తూ అందరికీ వెలుగునిస్తున్న సూర్యుడు శ్రీ బుద్ధప్రసాద్ గారు. ఇటువంటి గుణాలున్న వారిని 'శ్రేష్టుడు'గా భగవద్గీత అభివర్ణించింది. వారు ఆదర్శప్రాయులని కీర్తించింది.

పూజ్యులు, పురావస్తు శాస్త్ర నిపుణులు, మా తండ్రిగారు కీ.శే. డా. వేలూరి వెంకట కృష్ణశాస్త్రి గారిపైన శ్రీ బుద్ధప్రసాద్ గారికి ఎనలేని గౌరవం, అంతకు మించి నాన్నగారు చేసిన పురావస్తు పనులపైన, త్రవ్వకాలపైన అవధులు లేని ఆసక్తి ఉన్నాయి. నాన్నగారికి శ్రీ బుద్ధప్రసాద్ గారంటే సాక్షాత్తు శ్రీ కృష్ణదేవరాయలే అని అభిప్రాయం. మా తండ్రిగారు దాదాపు ముప్పై ఐదు సంవత్సరాలు నాటి ఉమ్మడి ఆంధ్రరాష్ట్రంలో పురావస్తు శాఖలో సాంకేతిక నిపుణులుగాను, సంచాలకులుగాను తమ సేవలను అందించారు. నాగార్జునకొండ త్రవ్వకాలలో ప్రారంభమైన వారి ఉద్యోగ ప్రస్థానంలో తెలుగునేల సమగ్ర చరిత్రను, చారిత్రక విశేషాలను వెలుగులోకి తీసుకురావడంలో కీలకపాత్ర వహించారు. తెలుగునేలపై ప్రతిప్రాంతానికి గల చరిత్రను చరిత్రకందని కాలం నుండి చరిత్ర నింపిన కాలం వరకూ గల గతకాలపు వైభవాన్ని ప్రాభవాన్ని వెలికి తీసిన చరిత్రకారులు. బౌద్ధ సంస్కృతికి సంబంధించిన ఎన్నో కొత్త విషయాలను వెల్లడించారు. శ్రీ శాస్త్రి గారు పరిశోధించి, విశ్లేషించి రచించిన అనేక చారిత్రక వ్యాసాలు వివిధ గ్రంథాలలో ప్రచురింపబడ్డాయి. ఈ ప్రచురణల బృహత్కార్యంలో శ్రీబుద్ధప్రసాద్గారి పాత్ర, సహాయ సహకారాలు ఎనలేనివి.

తమలో జ్ఞానం ఉన్నవారే మిగిలిన వారికి జ్ఞానాన్ని పంచగలరు. తాము 'వెలుగు' అయినపుడే ఆ వెలుగును లోకానికి ప్రసరింప చేయగలుగుతాము. శ్రీ బుద్ధప్రసాద్ గారు నిండైన జ్ఞాని. ఆయన విద్వత్తు ఉన్న ప్రతీ విద్వాంసునితోనూ సన్నిహితత్వాన్ని పెంచుకుంటారు. అది తెలుగు సాహిత్యం, చరిత్ర, పురావస్తుశాఖ, సంగీతం, నృత్యం ఇలా శాఖ ఏదైనా సరే. తెలుగు సంస్కృతీ పరిమళాలను వెదజల్లే శాఖ ఏదైనా అది వారికి ప్రియమైన శాఖే. విద్వాంసులందరూ ఆయన ఆత్మీయులే. బంగారంలో ఇమిడ్చినందువలన వజ్రానికీ, వజ్రం

ఉన్నందువలన బంగారానికి విలువ పెరిగినట్లే శ్రీ బుద్ధప్రసాద్ గారితో సాన్నిహిత్యం విద్వాంసులందరికీ హర్షదాయకం.

శ్రీ బుద్ధప్రసాద్ గారితో మా నాన్నగారికి పరిచయం ఎలా జరిగిందో ఇదమిత్థంగా తెలియదు కానీ అవనిగడ్డలో వారు నిర్వహించిన సభకు నాన్నగారు వెళ్ళటం తెలుసు. ఎందుకంటే అక్కడ సదస్సులో జరిగిన విద్వత్‌గోష్ఠి, శ్రీ బుద్ధప్రసాద్ గారు ఇచ్చిన ఆతిథ్యమూ, కవులు వర్ణించిన శ్రీకృష్ణదేవరాయల ఆతిథ్యాన్ని తలపింపచేసేదిగా ఉన్నదని నాన్నగారు చాలాసార్లు అన్నారు. శ్రీకాకుళాంధ్ర మహావిష్ణు దేవాలయ ప్రాంగణంలో శ్రీబుద్ధప్రసాద్ గారి ఆధ్వర్యంలో జరిగిన మరొక సదస్సుకు చరిత్రకారులు, సాహితీవేత్తలు, పత్రికా రచయితలు ఇలా అనేక రంగాలవారు విచ్చేసి ఆ సదస్సును భువన విజయాన్ని తలపింపచేసే విధంగా నిర్వహించారు.

అలా మొదలైన వీరి స్నేహ ప్రస్థానం దినదిన ప్రవర్ధమానమవుతూ వచ్చింది. 1992వ సంవత్సరంలో పదవీవిరమణ చేసిన తరువాత విశ్రాంత సమయాన్ని మరింతగా విద్యావిషయాలకు హెచ్చిస్తూ భారతీయ సంస్కృతి-పురాతత్త్వ పరిశోధనలు అన్న గ్రంథాన్ని రచించారు. అటు తరువాత 'ఫామిన్స్ ఇన్ ఇండియా త్రూ ది ఏజెస్' అన్న పేర ఆంగ్లంలో భారతదేశంలో సంభవించిన అనేక కరవుకాటక పరిస్థితులను తెలియజేస్తూ మరొక గ్రంథాన్ని రచించారు. శ్రీ బుద్ధప్రసాద్ గారు అప్పటికే హైదరాబాద్‌లో వీలుచిక్కినప్పుడల్లా మా యింటికి వస్తూ వుండేవారు. వారే మా ఇంటికి వచ్చేవారు కానీ పని ఉన్నా నాన్నగారిని పిలిపించిన దాఖలాలు లేవు.

వారు పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్యశాఖా మంత్రిగా సేవలందిస్తున్న రోజులవి. వారు క్రియాశీలకంగా ఊపిరిసలపనంత పని ఒత్తిడిలో ఉన్నప్పటికీ మా కార్యక్రమానికి విచ్చేసి జయప్రదం చేశారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం తరపున వెలువడిన 'తెలుగుపసిడి', 'తెలుగు పున్నమి', 'వజ్రభారతి', 'కృష్ణాజిల్లా సర్వస్వం' ఇత్యాది అన్ని సంచికలలోనూ శాస్త్రిగారూ మీ వ్యాసం కావాలని వారే స్వయంగా ఫోనులో మాట్లాడిన మంచి మనసున్న వ్యక్తి, నేటితరం నాయకులకు ఆదర్శప్రాయులు శ్రీ బుద్ధప్రసాద్ గారు.

2012వ సంవత్సరంలో కృష్ణశాస్త్రి గారు అనారోగ్యంగా ఉన్నప్పుడు శ్రీ బుద్ధప్రసాద్ గారు మా ఇంటికి వచ్చి తండ్రిగారి పక్కన ఎంతసేపు కూర్చున్నారో తెలీదు. అప్పటి వరకూ ఒకరకమైన నిర్లిప్తతతో ఉన్న తండ్రిగారు బుద్ధప్రసాద్ గారితో దాదాపు 3 గంటలు మాట్లాడటం చూసి ఆశ్చర్యమేసింది. బుద్ధప్రసాద్ గారు స్నేహశీలి, అంతకుమించి నాన్నగారికి ఆత్మీయులు. అందుకనే వారితో అంతసేపు మాట్లాడగలిగారు.


కృష్ణాజిల్లాలోని చిరివాడ శాస్త్రిగారి స్వగ్రామం. శ్రీ బుద్ధప్రసాద్‌గారు చిరివాడ గ్రామానికి చాలాసార్లు విచ్చేశారు. అక్కడ కూడా మాత్రండిగారూ వారూ గంటల తరబడి చరిత్ర, పురావస్తు శాఖల విషయాలపైనా, అమరావతి, ఘంటశాల వంటి కృష్ణా, గుంటూరు జిల్లాలలోని అనేక ప్రాచీన బౌద్ధస్తూపాలూ, ఆరామాల గూర్చి చర్చించుకునేవారు.

2013 వ సంవత్సరంలో కీ.శే. శ్రీ కృష్ణశాస్త్రిగారు రచించిన ఆంగ్ల వ్యాసాలను సమీకరించి 'ది సైన్స్ ఆఫ్ ఆంటిక్విటీ' అన్న పేరుమీద వ్యాస సంకలనంగా ప్రచురించాము. ఆ గ్రంథాన్ని 'జ్ఞాని', అమృత

హృదయులు శ్రీ బుద్ధప్రసాద్‌గారి చేతుల మీదుగా ఆవిష్కరించి ఆగ్రంథ విలువను ఇనుమడింప చేయగలిగాము. తండ్రిగారు వ్రాసిన తెలుగు వ్యాసాలను ఎమెస్కో వారి సహాయంతో 'డా.వి.వి. కృష్ణశాస్త్రి చరిత్ర, పురాతత్త్వ వ్యాసాలు' అనే పేరుతో ప్రచురించి విజయవాడలో ఆ గ్రంథాన్ని శ్రీ బుద్ధప్రసాద్ గారు ఆవిష్కరించారు. వారి ఉదారతకు, మంచి మనసుకు మా కుటుంబసభ్యులు సర్వదా కృతజ్ఞులము.

కేవలం తండ్రిగారితోనే కాదు, నా సతీమణి డా. సుమిత్ర పట్ల కూడా వారికి ఎనలేని అభిమానం. కూచిపూడి నాట్య సదస్సులు, కార్యక్రమాలలో ఎక్కడ కనబడినా స్వయంగా వారే పలుకరించి మనస్ఫూర్తిగా వారి ఆశీస్సులను అందచేసేవారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకునేవారు.

శ్రీబుద్ధ ప్రసాద్ గారితో మా కుటుంబానికి గల బంధము, అనుబంధము ఇలా ఎంత చెప్పినా అవధులు లేకుండా సాగిపోతూనే ఉంటుంది. వారి షష్టిపూర్తి మహోత్సవవేళ ఆ సౌజన్యమూర్తికి భగవంతుడు ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కాంక్షిస్తున్నాము.



ప్రసిద్ధ సినీ కవి శ్రీ వేటూరి సుందరరామమూర్తితో...

మా మంచి (మహా) మనీషి

- నాయుడు గోపి

ఆరోజు చరిత్రలో మరువలేని రోజు 1977 నవంబరు 19వ తారీఖు. తుఫాను రాత్రి. దివిసీమ ఉప్పెన. ఈ రోజుకూ నవంబరు 19 వస్తే ఆ రోజు గుర్తుకు వస్తుంది. అప్పుడు పేపర్లో వినిపించింది మంత్రివర్యులు మండలి వెంకటకృష్ణారావు గారి పేరు విపరీతంగా. దివిసీమలో పదివేలమంది చనిపోయారట. ఆరేడు గ్రామాలు అసలు కనబడకుండా పోయాయట అని. ఆ ఉప్పెనలో కొట్టుకుపోయి చెట్లకు వేలాడే శవాలు... పశువులు... బీభత్సం... ఆ సన్నివేశాన్ని చూసిన స్థానిక మంత్రివర్యులు వెంకటకృష్ణారావుగారు చిన్నపిల్లాడిలా గుక్కపెట్టి ఏడుస్తున్నారని. పేపర్లో ఫొటోలు చూసి మేమూ ఏడ్చాము. మోకాలిలోతు బురదలో అధికార్లను తీసుకొని కాళ్ళకు పట్టాలు కట్టుకు తిరుగుతున్నారని. తండ్రితోపాటు సహాయక కార్యక్రమాల్లో పాల్గొని సేవలందిస్తున్న కుమారుడు యువనాయకులు బుద్ధప్రసాదు అని.

తన నియోజక వర్గ ప్రజలంతా తనవాళ్ళే, వారికి ఏ కష్టం వచ్చినా తనకు వచ్చినట్లే అని భావించి మానవ విలువలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి ప్రజలను ఆదుకున్న నాయకుడు మండలి వెంకటకృష్ణారావుగారు. ఇది జరిగిన రెండేళ్ళ తర్వాత అవనిగడ్డలో నాటక పోటీలు పెట్టారు 1979లో అనుకుంటాను. ఆ పోటీలలో నేనూ ఒక నాటికను ప్రదర్శించాను. ఉత్తమ ప్రదర్శన బహుమతి మాకే వచ్చింది. ఆ ప్రదర్శన ఇవ్వటానికి అవనిగడ్డ వెళ్ళాము. ఉదయాన్నే దిగాం. వసతి ఇచ్చారు. అవే తుఫాను బాధితుల కోసం వేసిన షెడ్లు. 'గాంధీక్షేత్రం' అనుకుంటున్నాను దాని పేరు. అక్కడ నాలుగు సంవత్సరాల పిల్లల దగ్గర నుండి పది సంవత్సరాల బాలబాలికలు దాదాపు రెండువందల మందికి పైనే ఉన్నారు. వాళ్ళంతా ఉప్పెనలో తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లలట చెప్పారు. వాళ్ళంతా ఇప్పుడు పెద్దవారై ఉంటారు. ఆ బిడ్డల్ని కన్న బిడ్డలుగా చూసుకున్నారు వెంకట కృష్ణారావుగారు. 'కళ' పట్ల ఆయనకెంతో అభిమానం, ఎంతో గౌరవం.

ఆ తరువాత 1993 సంవత్సరంలో మళ్ళీ అవనిగడ్డ వెళ్ళటం జరిగింది. నాదెండ్ల పురుషోత్తమ శాస్త్రిగారని బందరులో ఒక నాటక రంగ ప్రముఖులు, గురుతుల్యులు వున్నారు. వారివద్ద నుండి ఒక ఉత్తరం వచ్చింది. అవనిగడ్డలో పరిషత్ పెడుతున్నారు. మీరు ఒక నాటిక ప్రదర్శించాలని. వెళ్ళాం నాటిక ప్రదర్శనకు. అప్పుడు బుద్ధప్రసాద్ గారు జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంటుగా పనిచేస్తున్నారు. చాలా చురుకుగా జిల్లా కార్యక్రమాల్లో ఉన్నారు. అప్పుడు చూశాను. మళ్ళీ ఆయన్ని ఆ తరువాత చాలాకాలానికి మంత్రి వర్యులు అయిన తరువాత వారిని కలవటం జరిగింది.

మా అమ్మాయి వెటరనరీ డాక్టర్. గుంటూరు దగ్గర కాజ అనే పల్లెటూరులో ఉద్యోగం చేస్తోంది. అల్లుడు ఎయిర్‌ఫోర్సులో ఆఫీసరుగా అస్సాంలో ఉద్యోగం చేస్తున్నాడు. అమ్మాయి సెలవు పెట్టి అస్సాం వెళ్ళేది. అబ్బాయి సెలవుపెట్టి ఇక్కడికి వచ్చేవాడు. ఏడేళ్ళు గడిచిపోయాయి. ఇద్దరు పిల్లలు. ఎవరో చెప్పారు. సికింద్రాబాద్ అయితే ఇద్దరూ ఒకేచోట ఉంటారు. ట్రాన్స్‌ఫర్‌కు ట్రై చేయమని తెలిసినవారు సలహా ఇచ్చారు.

డిపార్టుమెంటులో ట్రై చేశాను. అసంభవం అన్నారు. పొలిటికల్‌గా ఎన్నో ప్రయత్నాలు చేశాను. సాధ్యపడలేదు. ఆ పనిమీద తిరుగుతూ అలసిపోయి రిలాక్స్ అవుదామని ఒక రోజు రవీంద్రభారతి వద్దకు

వచ్చాను. నాటకరంగ మిత్రుడు 'నాటక కళ' సంపాదకుడు రవిశర్మగారు కలిశారు. నాటకం ముచ్చట్లు చెప్పుకుంటున్నాము. మాటల్లో మా అమ్మాయి ట్రాన్స్‌ఫర్ విషయం చెప్పాను. "పశుసంవర్ధక శాఖ మంత్రి మన బుద్ధప్రసాద్‌గారేనని, వారిని కలవలేకపోయావా" అన్నారాయన. నాకంతగా పరిచయం లేదన్నాను. "నువ్వు రంగస్థల నటుడివని ఆయనకు తెలుసు. నటులన్నా, కవులన్నా వారికి ఎనలేని గౌరవం. ఎవరితో పనిలేదు. నువ్వు వెళ్ళిరా!" అంటూ రవిగారు బుద్ధప్రసాద్ గారి ఇంటి అడ్రసు ఇచ్చారు. బుద్ధప్రసాద్ గారి ఆఫీసుకు వెళ్ళాం. ఆయన ఇంకా రాలేదు. వస్తారు అన్నారు. ఇద్దరం అక్కడే కూర్చున్నాం. ఒక గంట తర్వాత బుద్ధప్రసాద్ గారు వచ్చారు. రవిగారు లోపలికి వెళదాం పదమని నన్ను తొందర చేశారు. "బాగా అలసిపోయి వచ్చారు. కాస్త రెస్టు తీసుకున్నాక కలుద్దాం! కొంచెం ఆగండి" అన్నాను నేను. కాదూకూడదని నన్ను లోనికి తీసుకెళ్ళారు రవిగారు.

మంత్రిగారి ఛాంబర్‌లోకి రాగానే రవిగారు నన్ను పరిచయం చేశారు. "ఇతను నాయుడు గోపి. పెద్ద ఫేమస్ రంగస్థల నటులు, దర్శకులు" అని. బుద్ధప్రసాద్‌గారు చిరునవ్వుతో "నాయుడు గోపీ నాకెందుకు తెలియదూ" అన్నారు. నిజంగా ఆ క్షణంలో ఎంత సంబరమేసిందో ఆ ఆనందంలో ఉండగానే, "మీరు 1993లో మా అవనిగడ్డలో నాటిక ఆడారు. 'నవ్వండీ ఇది విషాదం" అని మంత్రిగారు అనగానే నాకు మరింత ఆశ్చర్యం వేసింది. 1993లో ఆడాను. 2009లో కలిశాను. ఎంత గుర్తుపెట్టుకున్నారు. అనుకుంటుండగానే "మీరు రంగస్థలంమీద చేస్తున్న సర్వీసు చూస్తున్నాను. రవీంద్రభారతిలో మీవి చాలా నాటకాలు చూశాను" అని ఆయన అనగానే నాకు చాలాచాలా ఆనందం కలిగింది. "ఏమిటి పని చెప్పండి" అన్నారు. "మా అమ్మాయి వెటరినరీ డాక్టర్. అల్లుడు మిలటరీ ఎయిర్‌ఫోర్సులో ఉన్నారు. ఇద్దరు పిల్లలు. చిన్నవాళ్ళు బాధపడుతున్నారు. అమ్మాయిని డిపిటేషన్ మీద హైదరాబాద్‌కు మారిస్తే అబ్బాయిని కూడా ఇక్కడకు మార్పించటానికి వీలుంటుందని అన్నారు. డైరెక్టర్ గారు కుదరదంటున్నారు" అన్నాను.

అంతే, మంత్రిగారు నన్ను ఇంకొక్క మాటకూడా మాట్లాడనీలేదు. అప్లికేషన్ ఉందా అన్నారు. తీసి ఇచ్చాను. వెంటనే సంతకం పెట్టి డైరెక్టర్‌గారు ఆఫీసులోనే ఉన్నారు. ఇప్పుడే వెళ్ళి కలవండి అన్నారు. రవిశర్మగారి బండి మీద పరుగుపరుగున డైరెక్టర్ గారి ఆఫీసుకు వెళ్ళాము. అప్పటి వరకూ ఎట్టి పరిస్థితుల్లోనూ కుదరదు అన్నవారు మంత్రిగారి లెటరు చూస్తూనే అమ్మాయి ఎక్కడుంది. పిలిపించండి అన్నారు. ఆ మరుసటి రోజే అమ్మాయిని హైదరాబాద్ డిపిటేషన్ మీద పోస్టింగ్ వేశారు. నాకు వారు దేవుడు, భగవంతుడు. ఆ రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది. ఒక చిన్న కళాకారుడిపట్ల ఆయనకున్న అభిమానం ఎంత గొప్పది. నాలాగే ఎంతోమంది, కవులు, కళాకారులు వారి నుండి సహాయం పొందినవారే. ఆ కుటుంబం అంటే 1977 నుండి నాకెంతో గౌరవం. కానీ ఎన్నడూ వెళ్ళి కలవలేదు ఆ తరువాత గుంటూరు, విజయవాడలో ఏ సాహిత్య సాంస్కృతిక కార్యక్రమం జరిగినా వారు వస్తున్నారని పేపర్లో చూసి వెళ్ళి వారిని కలుస్తాను. ఎంతో ఆప్యాయంగా "నాయుడగోపి గారూ బాగున్నారా" అంటారు. కలిసిన ప్రతిసారీ ఆయనలో నాకు ఆ భగవంతుడే కనబడతాడు. అంత గౌరవం ఆయనంటే. ఆయన హయాంలో జరిగిన 4వ ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆయన సమక్షంలో తిరుపతిలో ఒక కళాకారుడిగా సన్మానం పొందాను. అది నా అదృష్టంగా భావిస్తాను. మానవీయ విలువలు తెలిసిన, మహోన్నత వ్యక్తి బుద్ధప్రసాద్ గారు. అనుక్షణం... మన భాష, సంస్కృతి, సాంప్రదాయాలు గౌరవించే మా మంచి మనీషికి 60 వసంతాల ప్రత్యేక సంచిక ప్రచురిస్తూ నాకు ఇంత చోటిచ్చి, నా మనసు తెలిపే అవకాశం కల్పించిన ప్రియమిత్రుడు, అనేక సాంస్కృతిక సేవలందించిన కిన్నెర రఘురామ్ గారికి, వారి మిత్రులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

తండ్రికి తగిన తనయుడు

- సలీం

మాన్యులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారితో నాకున్న జ్ఞాపకాల్ని పంచుకునే ముందు వారి తండ్రి గారైన కీర్తిశేషులు మండలి వెంకట కృష్ణారావు గారితో పెనవేసుకుని ఉన్న ఓ విషయాన్ని ప్రస్తావించటం నా ధర్మం. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి పాతికేళ్ళు పూర్తయిన సందర్భంగా ఓ సదాశయంతో కర్నూల్లో సిల్వర్ జూబ్లీ కాలేజీని 1972లో ప్రారంభించారు. ఇంటర్మీడియెట్ పాసైన విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనపర్చిన వారిని బియస్సి, బికాం, బియ్యే డిగ్రీల్లో చేర్చుకునేవారు. ప్రభుత్వం నించి ఒక్కో విద్యార్థికి వంద రూపాయల గ్రాంట్ అందేది. అందులోనే భోజన వసతి, హాస్టల్ సదుపాయం కల్పించేవాళ్ళు.

నేను అందులో బియస్సీ చదివే రోజుల్లో స్వర్గీయ కృష్ణారావు గారు విద్యాశాఖామాత్యులు. ఆ సమయంలో సిల్వర్ జూబ్లీ కాలేజీకి అందుతున్న ప్రత్యేకమైన గ్రాంట్‌ని ఆపేయాలన్న ప్రతిపాదన వచ్చింది. శ్రీ కృష్ణారావు గారు మా కాలేజీకొచ్చారు. విద్యార్థుల విన్నపాల్ని సావధానంగా విన్నారు. మా కాలేజీలో ప్రతిభతోపాటు పేదరికంలో మగ్గే విద్యార్థులు చాలా మందే ఉండేవారు. అందులో నేనూ ఒకణ్ణి. పదో తరగతిలో జిల్లాలోనే ప్రథముడిగా వచ్చినా, ఇంటర్‌లో బోర్డు ర్యాంకు సంపాదించినా డిగ్రీ చదవలేని ఆర్థిక దుస్థితి నాది. మాకు విద్యాదానంతో పాటు నాలాంటి పేద విద్యార్థులకెందరికో అన్నదానం చేసిన కాలేజీ సిల్వర్ జూబ్లీ కాలేజి. మా ఆవేదనని అర్థం చేసుకున్న విద్యాశాఖ మంత్రిగారు సానుకూలంగా స్పందించారు. మా కాలేజీ బతికిపోయింది. ఆ రకంగా సిల్వర్ జూబ్లీ కాలేజీలో చదువుకున్న ప్రతి విద్యార్థి స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు గారికి రుణపడి ఉంటారు.

గౌ. బుద్ధప్రసాద్ గారు బహు సౌమ్యులు. మృదు భాషి.. ఎవ్వర్నీ నొప్పించే స్వభావం కాదు వారిది. వారు తెలుగు భాషకు, తెలుగు సాహిత్యానికి చేసిన సేవ ఎనలేనిది. కొన్ని సాహితీ సభల్లో వారితోపాటు వేదికను పంచుకునే అదృష్టం నాకు దక్కింది. నా కథల్లో కొన్నిటికి సప్తగిరి ఛానెల్ కోసం దృశ్యరూపం ఇచ్చిన సందర్భంలో ఏర్పాటు చేసిన సభకు వారే ముఖ్య అతిథి. విజయవాడలో 2007లో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు ఎంత ఘనంగా నిర్వహించారో, తెలుగు రచయితల్లో ఎంతటి స్ఫూర్తిని నింపారో దానికి నేనే ప్రత్యక్ష సాక్షిని. ఆ సమయంలో విజయవాడలో డిప్యూటీ కమీషనర్‌గా పన్చేస్తున్న నేను కవి సమ్మేళనంలో పాల్గొనటంతో పాటు అన్ని సభలకు హాజరై సాహితీ సౌరభాల్ని ఆస్వాదించాను. వారు పాల్గొన్న సాహితీ సభల్లో వారి ప్రసంగాలు వినడానికి ప్రేక్షకుడిలా వెళ్ళిన ప్రతిసారీ వారు వేదిక దిగాక "సలీం గారూ బాగున్నారా" అని ఆత్మీయంగా పలకరించే శ్రీ బుద్ధప్రసాద్ గారు నాకే కాదు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ఉన్న అనేకమంది కవులకు, రచయితలకు, భాషాభిమానులకు సాహితీ బంధువు. మే 27వ తేదీన షష్ట్యబ్ది పూర్తి మహోత్సవాలు జరుపుకుంటున్న శుభ సందర్భంగా వారికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియచేసుకుంటూ, భగవంతుడు వారికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, వారి ద్వారా మరింత సాహితీ సేవ, భాషా సేవ జరగాలని కోరుకుంటున్నాను.

ఆణిముత్యం

- పి. పాండురంగారావు

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి షష్ట్యబ్దిపూర్తి అభినందన గ్రంథంలో ప్రచురించుటకు వారితో ఉన్న నా అనుబంధాన్ని సంక్షిప్తంగా ఈ క్రింద పొందుపరుస్తున్నాను.

నేను ఒక రంగస్థల నటుడ్ని. నాటకంలో శిక్షణ పొంది అనేక మంచి నాటకాలు వేసాను. అదే సమయంలో ఆకాశవాణిలో చేరి, ఎన్నో రేడియో నాటకాలలో విజయవంతంగా వేశాను. కళలన్నిటితోనూ సాన్నిహిత్యం కలిగిన శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారితో ముఖాముఖి పరిచయం కల్గడం నా అదృష్టంగా భావిస్తాను.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ సాహితీ ప్రియులు, సంగీత అభిమాని, నాటకాల్ని విరివిగా మెచ్చుకునే తత్వం, తెలుగు భాషోద్యమానికి మార్గదర్శి, నాకు అభిమాన పరిచయస్తులు, మానవతావాది, పరోపకారి ఒకే మనిషిలో ఇన్ని లక్షణాలు ఉండడం అరుదు. ఆయన ఎక్కడ ఉపన్యాసకులుగా ఉన్నా, శ్రద్ధగా వినడం, ఆయన మాటలని ఆకళింపు చేసుకోవడం నాకు అలవాటు. ఆయన కార్యశీలి. ఉదారబుద్ధి కల మహామనీషి. ఆయన ఏ రాజకీయ పార్టీలో ఉన్నా, ఆ పార్టీకే గౌరవాన్ని తెచ్చి పెట్టారు. తన అభిమానులకి, సాహితీ ప్రియులకి, నాటకరంగ ప్రముఖులకి సహాయ సహకారాలందివ్వడానికి రాజకీయ రంగం కొలమానం కాదని వారి అభిప్రాయం.

అన్ని లలిత కళలతో బాటు, నాటక రంగమంటే విశేషమయిన అభిమానం జాస్తి. వాళ్ళ నాన్నగారు కీ.శే. మండలి వెంకట కృష్ణారావుగారి అడుగుజాడల్లో నడిచారు కాబట్టే, లలిత కళలంటే ఆయనకు అభిమానం ఎక్కువ. ఇటీవల అవనిగడ్డలో మంచి నాటకాల్ని నిర్వహించి, మన రాష్ట్రంలో పేరెన్నికగన్న నటుల్ని సన్మానించి, నాటకాల మీద తమ అభిమానాన్ని చాటుకున్నారు. కానీ, వారి దృష్టిని ఒకసారి సారిస్తే విజయవాడలో సరైన రంగస్థలాలు లేవన్న విషయం ఆయనకి ఈ పాటికి అర్థమయ్యే ఉండాలి. ఈ థియేటర్ల కొరతవల్ల మంచి నాటకాలు ప్రేక్షకులు చూసే అవకాశం తక్కువగా ఉంది. మరి ఇలా ముందుకొచ్చి, థియేటర్లు నిర్మించే చొరవ, వాటి ఆవశ్యకత ఒక బుద్ధప్రసాద్‌గారికే తెలుసు.

అందరితోటి సమానంగా మెలిగే వ్యక్తివారు. పెద్దవారైనా, చిన్నవారైనా ఒక్కలాగే ఉండే వ్యక్తి. ఆయన వ్యక్తిత్వం చాలా గొప్పది. ఆయన నవ్వు మాసిపోనిది. సాహిత్యం ఆయన ఊరిపి. నేను రంగస్థల, రేడియో నాటకాల గురించి 'నా అంతరంగం' అనే పుస్తకం రాస్తే, ఆయన మర్చిపోలేని అభిప్రాయం వ్రాశారు. వారి అభిప్రాయం ఆ పుస్తకానికి ఆణిముత్యం.

మండలి వారి ... విస్మృతి

- ఆర్. రవిశర్మ

"ఏమిటి శర్మగారు ! ఏమిటి కబుర్లు!!" అని పలకరించే శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి పలకరింపులోనే ఆయనకున్న జిజ్ఞాసయుతమైన దృక్పథం తెలుస్తుంది ఎవరికైనా. ప్రతి వారి దగ్గర నుంచి ఎంతో కొంత విషయ సముపార్జన చేయాలనే దృక్పథం కనిపిస్తుంది. అడిగారు కదాని జరిగిన కార్యక్రమాల గురించి చెపుతుంటే "అవును నేను విన్నాను" అంటారు. తెలుగు సాహిత్య కళారంగాలలో ఆయనకు తెలియని గతం, వర్తమాన విషయాలు ఉండవు. విజయవాడలో కర్నాటక సంగీత అభివృద్ధికి గుర్తుగా త్యాగరాజు విగ్రహం పెట్టాలని వెడితే అదేమిటి రామకోటి క్షేత్రంలో గుడి ఉంది కదా అన్నారు. నాతో వచ్చిన పెద్దమనిషికి ఆ విషయం తెలియక ఆశ్చర్యపోయారు. అది ఆయన జ్ఞాపకశక్తి. అందువల్లే అనేక విషయాలు తెలిసిన జ్ఞానిగా 'తెలుగు వ్యాసమండలి' అనే 129 రచయితల సంకలనాన్ని తెలుగు సాహిత్యానికి యివ్వగలిగారు. ఇందులో అతి పురాతనమైన వ్యాసాలతోపాటు జవహర్ లాల్ నెహ్రూ కృష్ణదేవరాయల గురించి వ్రాసిన వ్యాసం, రాధా కృష్ణ పండితుడు త్యాగరాజు గురించి వ్యాసం మనకు కనిపిస్తాయి. ఇది కాక తెలుగును ప్రాచీనభాషగా గుర్తింపు తేవటానికి కృష్ణాజిల్లా రచయితల సంఘం తరపున ఆయన ప్రచురించిన గ్రంథాలు, తెలుగుభాష సాహిత్య చరిత్రలో ప్రామాణిక గ్రంథాలు. 2012 సం॥లో జరిగిన తెలుగు మహాసభలను 1975లో వారి తండ్రిగారు మండలి వెంకట కృష్ణారావు గారు నడిపిన రీతిలో నడిపి జాతిని చైతన్యవంతం చేశారు. ఆయన లేకుంటే అప్పటి ముఖ్యమంత్రి తెలుగు మహాసభల గురించి ఆలోచించే వారే కాదు. ఆయన ఓర్పుకు, విషయ పరిజ్ఞానానికి నిదర్శనం తెలుగు మహాసభలు అని చెప్పక తప్పదు.

తెలుగు రాష్ట్రాల విభజన ఆయనను మానసికంగా కృంగదీసింది. ఏం చేయాలో కాంగ్రెసు నాయకులకు అర్థం కాని పరిస్థితి. ఆ పరిస్థితిలో తెలుగుదేశం పార్టీ నుండి ఆయనకు రమ్మని పిలుపు రావటం ఆయన సచ్ఛీలతకు నిదర్శనం. వారికి, వారి తండ్రికి కాంగ్రెసు పార్టీలో ఉన్న మిత్రులు, అభిమానులు యిది సరి అయిన నిర్ణయంకాదు అని సలహాయిచ్చారు. దానికి ఆయన యిచ్చిన సమాధానం కాంగ్రెసుకు భవిత లేదు అని! ఇది ఎంత సహేతుకమో కాలం నిర్ణయించింది. వారి సచ్ఛీలతకు నిదర్శనంగా డిప్యూటి స్పీకరు పదవి లభించింది.

అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గంలో 1952 సం॥ నుంచి ఉన్న వీరి తండ్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారు 1972లో ఏకగ్రీవంగాను, 1978లోను మరల 1983లోను గెలిచారు. 1985,89లో ఓడిపోయారు (167 ఓట్లతేడాతో). అలాగే శ్రీ బుద్ధప్రసాద్ గారు 1999 సం॥లోను 2004లోను, 2014లో గెలిచి 1994లోను 2009లోను ఓడిపోయారు. వారి నాన్న గారి లాగే గెలుపు, ఓటములు సమానంగా ఉన్నాయి. వారి గెలుపు ఓటములు ఎలా ఉన్నా సాంఘిక, రాజకీయ భాషా సాంస్కృతిక సేవ అవిచ్ఛిన్నంగా కొనసాగింది. నియోజకవర్గ ప్రజలు ఆయన పదవిలో ఉన్నా లేకపోయినా, ఆయన సేవలను ఉపయోగించుకుంటారనేందుకు యిది ఒక నిదర్శనం. సాహితీవేత్తలు రాజకీయవేత్తలుగా రాణిస్తారనటానికి స్వర్గీయ శ్రీ పి.వి. నరసింహారావు గారు ఒక నిదర్శనంగా నిలిచారు. అదే తీరున శ్రీ బుద్ధప్రసాద్‌గారు రాష్ట్రస్థాయిలోను, జాతీయ స్థాయిలోను మరింత ముఖ్యమైన పదవులు అధిష్టించాలని ప్రజలు, సాహితీప్రియులు, కళాకారులతోపాటు 'నాటకకళ' కోరుకుంటోంది.

జ్ఞాపక శక్తి సంపన్నులు

- మణి కోపల్లె

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతి, గౌరవనీయులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి షష్ట్యబ్ది పూర్తి సందర్భంగా నా అభినందనలు, శుభాకాంక్షలు తెలియ చేసుకుంటున్నాను.

ముందుగా నేను రాసిన 'కోపల్లె హనుమంతరావు' జీవిత చరిత్ర పుస్తకానికి ముందు మాటలు రాసి ఇచ్చినందుకు, ఆ పుస్తకాన్ని ప్రపంచ తెలుగు రచయితల మహాసభల సందర్భంగా శ్రీయుతులు మండలి బుద్ధప్రసాద్ గారు ఆవిష్కరించినందుకు వారికి నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

వారు ఇంత వరకు రాజకీయ ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్ళు దాటినా వారు తెలుగు భాషకు చేసిన సేవ ఎనలేనిది. వారికి తెలుగన్నా, తెలుగువారన్నా అంతులేని అభిమానం. వారికి మచిలీపట్టణం, పుట్టి పెరిగిన నాగాయలంక, అవనిగడ్డ, మొదలైన కృష్ణా జిల్లా ప్రాంతాలు అంటే ఎంతో అభిమానం వున్నా, వారికి ప్రాంతీయ భేదం లేదు. తెలుగు వారంటే అభిమానం. ఆంధ్ర ప్రాంతం ఎందరో సాహితీవేత్తలు, కవి పండితులు, కళాకారులకు నిలయం.

సహజంగానే తెలుగు భాషాభిమాని, సాహిత్య సాంస్కృతిక ప్రేమికులు అయిన వీరు ప్రపంచమంతా తెలుగు వారు తెలుగు భాషకు చేసే సేవను గుర్తించి వారిని గౌరవిస్తారు.

తెలుగు అధికార భాషా సంఘం అధ్యక్షులుగా నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలను నిరాటకంగా, నిర్విఘ్నంగా నిర్వహించి తెలుగు సాహితీ వేత్తలను గౌరవించారు, సత్కరించారు, అవార్డులు అందించారు. ఇంకా తెలుగు భాషాభివృద్ధికై ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారు.

నేను మా తాత గారి 'జీవిత చరిత్ర' పుస్తకం గురించి సమాచారం కోసం వారిని కలవటం జరిగింది. వారింటికి మా వారితో కలిసి వెళ్ళినపుడు మమ్మల్ని ఎంతో ఆప్యాయంగా పలకరించి ఆహ్వానించారు. వారి ఇల్లు ఒక గ్రంథాలయం. అలమారాలలోనూ, సోఫాల దగ్గరా ఎన్నో పుస్తకాలు వరుసగా బారులు తీరి వున్నాయి. నేను మా తాతగారు శ్రీ కోపల్లె హనుమంతరావు గారిని (ఆంధ్ర జాతీయ కళాశాల వ్యవస్థాపకులు) గురించి అడగగానే వారు వారి అప్పటి విషయాలు చెప్పారు. స్వాతంత్ర్య సమరంలో ఆంధ్రలో ఎలా ఉండేదో, బందరు కాలేజీ గురించి చెప్పారు. అంతేకాదు అక్కడ వున్న పుస్తకాలలోంచి హనుమంతరావు గారిని గురించి వున్న పుస్తకాన్ని తీసి ఇచ్చారు. అన్ని పుస్తకాల్లో ఆయన గురించి వ్యాసం వున్న పుస్తకం తీసి ఇవ్వటం నిజంగా వారి జ్ఞాపకశక్తికి ఉదాహరణ. ఇది చాలా చిన్న విషయం. ఇలాంటి అనుభవాలు ఎంతమందికో అనుభవంలోకి వచ్చి వుంటుంది. నాకు పుస్తకం రాయటానికి కావలసిన సమాచారాన్ని వారు అందించారు. పద్మభూషణ్ శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య గారు రాసిన 'నా జీవన నౌక' పుస్తకాన్ని కూడా ఇచ్చారు. ఆ పుస్తకం నాకు ఎంతో ఉపయోగపడింది. ఆనాటి స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న వీరుల చరితం అది. అలాగే ప్రెస్

అకాడమీ వారి వెబ్‌సైట్ గురించి కూడా వివరాలు అందించారు. నిజంగా ఆ వెబ్‌సైట్ నాకు ఎంతో ఉపయోగపడింది.

నా పుస్తకం సందర్భంగా మేము వారిని రెండు మూడు సార్లు వారి ఇంటికి వెళ్లి కలిసినపుడు, వారి ఆతిథ్యం కూడా తీసుకున్నాము. ఎప్పుడు సాహతీ సభలలో కలిసినా ఆప్యాయంగా పలకరిస్తారు. మా కుశలం అడుగుతారు. విజయవాడలో జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహా సభల సమావేశాలలోనూ వారిని కలిసాము. అనేక సాహితీ సభలలోనూ వారిని కలిసే అవకాశం లభించేది.

ఎప్పుడు కనిపించినా చిరునవ్వుతో, ఆప్యాయతతో కూడిన పలకరింపు వారిది. వృత్తి రీత్యా ఎంతో బాధ్యత కలిగిన శాసనసభా ఉప సభాపతి అయినా, ప్రవృత్తి రీత్యా తెలుగు భాష అభిమానిగా తెలుగు భాషకు ఎనలేని సేవ చేస్తున్నారు. ప్రవాసాంధ్రులకి సైతం వారు భాషా సాంస్కృతిక పరమైన అవసరాలు తీరుస్తుంటారు.

వారు మన తెలుగు భాషలో సందేశాలు పంపుకోవటానికి అవసరమైన యూనికోడ్‌ను రూపొందింపజేయటం వల్ల అంతర్జాలాన్ని ఉపయోగించి కోట్లాదిమంది తెలుగు భాషలో ఉత్తరాలు రాయటం ద్వారా, ఆప్యాయతా బాంధవ్యాలు పటిష్ఠమవుతున్నాయి. ఇది తెలుగువారికి నిజంగా అపురూపమైన సేవే ! శ్రీయుతులు బుద్ధప్రసాద్ గారు తెలుగు భాషా సేవకులు మాత్రమే కాదు. సాంఘిక సేవా తత్పరులు, మన సంస్కృతీ సంప్రదాయాలు అన్నా, భారతీయ కళలన్నా ఎంతో మక్కువ. వీరు నిరాడంబరులు. స్నేహశీలి.

సాహిత్యపరంగా వారితో అనుబంధం ఎప్పటికీ మరువలేని జ్ఞాపకాలు. ముఖ్యంగా నా పుస్తకానికి ముందు మాటలు అందించినందుకు వారికి మరోసారి నా కృతజ్ఞతలు.



మహాత్మాగాంధీ కోడలు శ్రీమతి నిర్మలా రామదాసు గాంధీ, మనుమడు శ్రీ కనూ గాంధీలతో...

తెలుగు భాషోద్యమండలేశ్వరుడు

- స్వర్ణ రాజహనుమంతరావు

నిస్వార్థ ప్రజాసేవకుడు, నిర్మల హృదయాంతరంగుడు, నిష్కళంక సాహితీ బంధువు, నిరుపమ మహోద్యమశీలి, తెలుగు భాషోద్యమ కారకుడు, నిర్విరామ సాంస్కృతిక కృషీవలుడు, స్ఫూర్తిని కలిగిస్తూ దేశమంతటా తెలుగు అక్షర తేజస్సులు నింపుతున్నవాడు, గాంధేయ మార్గంలో జీవితాన్ని సాగించిన తన తండ్రి ఆదర్శాలనెంచుకొని తన్మార్గానుసరణశీలియై నడుస్తున్నవాడే దివి బుద్ధుడు!

మానవ సేవకే కాదు, మాతృభాషా సేవకై శుభసంకల్పం చెప్పుకొని వైవిధ్యభరిత భాషోద్యమాలకు మిత్రబృందాలతో కలిసి దిక్సూచి నేర్పరుస్తూ ఒక్క అవనిగడ్డ గడ్డపైనే కాదు – ఆంధ్ర భాషా భూమండలము పైనే కాదు, ఆంధ్రభాషా యోష నాట్యమాడే ప్రపంచ భాషారంగమంతటా ఉజ్వల భాషోద్యమాల అడుగులు తడబడకుండా అంగలు వేయిస్తున్న మహాసంకల్ప సిద్ధుడే అపర బుద్ధావతార స్ఫురద్రూపుడు!

జిల్లా, రాష్ట్రమనే స్థాయి మరచిపోయి మన భాషౌన్నత్యాన్ని చాటే సభలు, ప్రాచీనతను చాటిన సభలు, భాషా మాధుర్యపు తేనెలొలికించిన సభలు, తెలుగుభాషకు హద్దులు లేవంటూ దేశ విదేశాలలో తెలుగు వెలుగులు వెల్లివిరిసే విధంగా జరిగిన మహాసభలను నిర్వహింపజేసిన మనీషి కదా ఈ భాషా సేవా తత్పర బుద్ధుడు!

తెలుగక్షరాలకు క్షయము లేకుండా, అక్షరంగానే నిలిచే విధంగా మనమందరము తెలుగువారమే, మనందరి భాషామతల్లి తెలుగే కదా! అమ్మభాషను సేవించుకుంటే మన(ను) కన్నమ్మను సేవించుకున్నట్లేనంటూ తెలుగు భాషోద్యమాన్ని ఆత్మీయులతో కలిసి నడిపిస్తూ అందరి మనసులో ఆనందం నింపుతున్న అనుపమోద్యమశీలి శ్రీ బుద్ధప్రసాద్!

అమ్మహోన్నతోద్యమశీలికి, సత్సంకల్ప భావ సంపన్న మహామనీషికి నిండునూరేళ్ళ పరిపూర్ణ జీవితాన్ననుగ్రహింపుమని అందరము చేతులెత్తి ఆ భగవానుణ్ణి ప్రార్థిద్దాము! వయో వృద్ధులందరమూ నిండుమనసుతో ఆశీరక్షతలు వేద్దాము! దేవతలారా! ఈ సద్భావభరిత బుద్ధుణ్ణి శతాయుష్కునిగా దీవించండి! జయ జయ! శ్రీ బుద్ధప్రసాద మహదాశయా! జయీభవ! దిగ్విజయీభవ! చిరంజీవ! చిరంజీవ!

నేనెరిగిన మండలి కుటుంబం

- తలశిల నాగేశ్వరరావు

దివిసీమ పేరు చెప్పగానే విశ్వవ్యాపితంగా నివసిస్తున్న ప్రతి తెలుగువాడికీ ముందుగా గుర్తొచ్చేది మండలి వెంకట కృష్ణారావు గారు, ఆ తదుపరి తరంలో ఆయన తనయుడు బుద్ధప్రసాద్‌గారు. వీరి పూర్వాశ్రమం కైకలూరు మండలం, పల్లెవాడే అయినా తాత వెంకట్రామయ్య గారు, ఉపాధ్యాయుడిగా నాగాయలంక మండలంలోని భావదేవరపల్లిలో స్థిరపడుటచే వీరు మూడు తరాలుగా ఈ ప్రాంత ప్రజలతో మమేకమౌతూ వస్తున్నది నడుస్తున్న చరిత్ర. తండ్రి వెంకట కృష్ణారావు గారి బాటలో పయనించుట వల్లనేమి, సహజసిద్ధమైన సేవాభావం కలిగియుండుట వల్లనేమి బుద్ధప్రసాద్ గారు సామాజిక కార్యక్రమాల పట్ల ఆకర్షితుడై ఆదర్శప్రాయ జీవితాన్ని గడుపుతూ వచ్చారు. వయస్సుపరంగా ఆరుమాసాలు చిన్నవాడే అయినా మండలి అనుసరిస్తున్న, ఆచరిస్తున్న సంవిధానం, సన్మార్గం నన్ను ఆకర్షించాయి. మూడు దశాబ్దాలుగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతుండటంతో వెంకట కృష్ణారావుగారితోనూ ఆ తదుపరి బుద్ధప్రసాద్‌గారితోనూ సన్నిహితంగా మెలగే అవకాశం కలిగింది. ఆది నుంచీ గాంధేయవాదంతో నడుస్తూవస్తున్న మండలివారు రాజకీయరంగంలో వివిధ పదవులను నిర్వహించినా, నిర్వహిస్తున్నా ఆ పరంగా కాక ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తూ రావటం విశేషం. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలనీ ఆ తదుపరి అభివృద్ధి కార్యక్రమాలవైపు దృష్టి మళ్ళించాలన్నది ఆయన వాదన. దివిసీమలో గడప గడపా తెలిసిన సమస్యలను ఎరిగిన రాజకీయ నాయకులలో బుద్ధప్రసాద్ అగ్రగణ్యులు.

మనసుంటే మార్గం లేకపోదన్న రీతిలో ప్రభుత్వపరంగా సాధ్యం కాదనుకున్న ప్రజా సమస్యలను ప్రపంచవ్యాప్తంగా తానెరిగిన, అనుబంధం కలిగిన స్వచ్ఛంద సంస్థల సహకారంతో పరిష్కరించుటలో ఆయనకు ఆయనే సాటి. గతాన్ని గుర్తు చేస్తూ వర్తమానంలో చేపట్టవలసిన కర్తవ్యాన్నీ, భావితరాల వారికి అందించవలసిన భవిష్యత్ ప్రణాళికనూ రూపకల్పన చేయటం మండలి వారికి వెన్నతో పెట్టిన విద్య.

సామాజిక అవసరాలను ముందుగానే గుర్తించటం, అందుకు అవసరమైన విధివిధానాలను సంబంధిత అధికారులతో చర్చించటం ఆయనకు నిత్యకృత్యం. వ్యక్తి ప్రయోజనాల కంటే గ్రామాభివృద్ధికే అధిక ప్రాధాన్యం ఇవ్వటం, ప్రజల ఐకమత్యానికి పాటుపడటం బుద్ధప్రసాద్ గారిలో నాకు నచ్చిన మొదటి అంశం. మానవాళి మనుగడ ప్రకృతిపై ఆధారపడిన విషయాన్నీ, అందుకు మన బాధ్యతనూ నిరంతరం గుర్తుచేయటం ఆయన దూరదృష్టిని చాటుతోంది. మానవ సంబంధాలు దూరమై ఆర్థిక సంబంధాలు బలపడుతున్న నేటి పరిణామాల పట్ల మండలివారు ఆవేదన చెందటం ఆయన మానవీయ కోణానికి తార్కాణం. భారతీయతనూ, తెలుగు జాతి ఔన్నత్యాన్నీ అనుదినం గుర్తు చేస్తూ సంస్కృతీ సాంప్రదాయాల యొక్క ప్రాముఖ్యతను చాటి చెప్పే రాజకీయవేత్తలలో ఆయన తొలివారనే చెప్పాలి. మానవాళి జీవనవిధానంలో భాష ప్రధాన భూమికను పోషిస్తుందనీ అట్టి మాతృభాష మృతభాష కాకుండా కాపాడుకోవాలని పదే పదే తెలియచెప్పే తెలుగు భాషాభిమానిగా బుద్ధప్రసాద్ గణుతికెక్కారు.

విభిన్నజాతులూ, విభిన్న సంస్కృతులూ కలిగియున్న సువిశాల భారతావనిలో నివసిస్తున్న జనాభాలో రాష్ట్రీయ భాష (అధికారిక భాష) హిందీయే అయినా రెండవస్థానం (ప్రాంతీయ భాషే అయినా) తెలుగుకు దక్కుతుందని చాటిచెప్పే మండలి వారిని మరువ రాదు.

స్వాతంత్ర్యోద్యమంలోనూ, ఆ తదుపరి పరిణామక్రమం లోనూ తెలుగువీరుల, ధీరుల, గాథలను గుర్తుకుతెస్తూ కార్యోన్ముఖులను చేయుటలో, స్ఫూర్తిని నింపుటలో బుద్ధప్రసాద్ మార్గదర్శకునిగా నిలుస్తున్నారు. మనిషి 'మనీషి' కావాలనీ మనీకి దాసులు కారాదని హితవు పలికే హితైషిగా ఆయన నిలుస్తున్నారు. ఏ రంగానికి చెందిన విషయాన్నయినా అవగాహనతో, ఆలోచనతో, సమాలోచనతో ప్రజలకు తెలియచెప్పుటలో మండలి వారికి సాటి మరొకరు లేరనేది నిర్వివాదాంశం. దివిసీమ నుంచి ఢిల్లీ వరకూ, అవనిగడ్డ నుంచి అమెరికా వరకూ ఖండాంతరాలలో సైతం తెలుగువాణినీ, బాణినీ చాటుతూ వస్తున్న ఈ భాషాభిమాని అందరికీ ఆదర్శప్రాయులుగా నిలుస్తున్నారు.

అధికారం ప్రజాభ్యున్నతికి దోహదపడాలనీ, అందుకు తమ నేత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి గారి నేతృత్వంలో పనిచేస్తున్నందుకు గర్వంగా ఉందని బుద్ధప్రసాద్ చెప్పటం అతిశయోక్తి కాదు. ఎ.పి. ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకుని వెళుతూ, రాష్ట్ర విభజన తదుపరి పరిణామాలను వివరిస్తున్న తీరు ఆయన రాజనీతికి దర్పణం. సాహిత్యం పట్ల, కళల పట్ల మండలి వారికున్న మమకారం మాటలలో చెప్పలేనిది. మనస్సున్న మనిషిగా అనునిత్యం సమాజసేవలో అవిశ్రాంతంగా పాటుపడటం ఆయనకు అలవాటే. భేషజం ఎరుగని వ్యక్తిగా, సాధారణ జీవితాన్ని గడుపుతూ ప్రజలతో కలసిమెలసి మెలగటం బుద్ధప్రసాద్ గారి ప్రత్యేకత. సభలో ఉన్నా, సమావేశంలో ఉన్నా నవ్వుతూ నవ్విస్తూ గడపటం ఆయనకు పరిపాటే. తెలిసిన వారితో చనువు తీసుకుని చమత్కార సంభాషణలు చేయటం కూడా మండలి వారికి మామూలే. సభనూ, సందర్భాన్ని బట్టి తన బాల్యజీవితంలోని సంఘటనలను పదుగురితో పంచుకోవటం ఆయన నిరాడంబరతకు నిదర్శనం. నా సుదీర్ఘ పాత్రికేయ పరిచయాన్ని పురస్కరించుకొని తాను పర్యటించిన ప్రతి పర్యాయమూ ప్రేమతో, అభిమానంతో 'పితామహా' అంటూ చమత్కరించటం బుద్ధప్రసాద్ గారికి అలవాటే. ఏ విషయాన్నైనా, సమస్యనైనా క్షుణ్ణంగా తెలుసుకోవాలన్న ఆయన ఆసక్తి ఆ తదుపరి చేపట్టనున్న కార్యక్రమాలకు ఉపయుక్తంగా మారటం అబ్బురమే. సాహితీప్రియుడిగా, రచయితగా, వక్తగా, అంతకుమించి తెలుగు భాషాభిమానిగా, మానవతావాదిగా మండలి సుపరిచితులు. గ్రంథ పాఠకునిగా, చారిత్రక పరిశోధకునిగా ఆయనకు తెలియని కవులు లేరు. సాహితీ వేత్తలు, పండితులు బుద్ధప్రసాద్ గారికి నేస్తాలు. ఇన్ని సలక్షణాలు కలిగియున్న మహోన్నత వ్యక్తికి కిన్నెర ఆర్ట్స్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో కళాప్రియులు శ్రీ గంధం సుబ్బారావు గారు, ఇతర సభ్యులు అభినందన గ్రంథ బహూకరణోత్సవం నిర్వహించటం అందుకు బుద్ధప్రసాద్‌గారితో అనుబంధం కలిగియున్న వారితో (వారి షష్టి పూర్తిని పురస్కరించుకుని) అక్షరమాలికను ప్రత్యేక సంచికగా రూపొందించటం ప్రశంసనీయం. ఈ కార్యక్రమం జయప్రదం కావాలని మనసా, వాచా కోరుకుంటున్నాను.

శుభాభినందనలు

- ఆకృతి సుధాకర్

అమ్మపట్ల అనురాగం అందరికీ ఉంటుంది. భాషామతల్లి పట్ల ఆ అనురాగం ఉంటుందా అంటే చెప్పటం కష్టం. కానీ ఒక్కరి విషయంలో మాత్రం నిస్సందేహంగా చెప్పగలం. వారే గౌ॥ శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు.

ఆయన భాషోద్యమ సైనికుడే కాదు.. ఒక కమాండర్. సంస్కృతీ సంప్రదాయాలను వారసత్వంగా పుణికి పుచ్చుకొని, కళలపట్ల అపారమైన మక్కువగల నాయకుడిగా ఆయన్ను తెలియని వారెవ్వరు? ఆయనతో అనుబంధం లేనిదెవరికి?

గత దశాబ్ద కాలంగా ఆయనతో సాన్నిహిత్యం 'ఆకృతి'కి. ఆయన మృదుభాషణం, అందరిని ఆదరించే సుగుణం. ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడే సహజ గుణం. ఎలాంటి వారినైనా ఆకట్టుకునేలా చేస్తాయ్.

నాకు పాతికేళ్ళ వయసులో దివిసీమలో సంభవించిన పెనుతుఫానుకు సంబంధించిన వార్తలు, పేపర్లలో దృశ్యాలు చూసినప్పుడు చలించిపోయే వాడిని. ఒక పెద్దాయన పంచెను నడుముకు బిగించుకొని, మానవ మృతదేహాల మధ్య, పశువుల కళేబరాల మధ్య సహాయ కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్న దృశ్యాలు, ఆ ప్రక్కనే ఆయనకు తోడుగా ఓ 20 ఏళ్ల కుర్రాడు ఆయనకు సహాయం చేస్తున్న దృశ్యం కూడా పేపర్లలో చూడ్డం... ఆయన ఎవరో అని ఆరాతీసినప్పుడు ఒక మంత్రి గారు ఆయన కుమారుడు అని తెలిసి ఆశ్చర్యం.. అబ్బురం కలిగేది... ఇంతకంటే ఉదాహరణ ఏం దొరుకుతుంది వారి నిస్వార్థ సేవగురించి?

ఆయన ఒకసారి 'ఫేస్‌బుక్'లో కనిపిస్తే 'ఫ్రెండ్ రిక్వెస్ట్' యిస్తే గంటలోపలే ఆయన నన్ను ఫ్రెండ్‌గా చేసుకున్నారు... అది ... నా అదృష్టం... మేం తరచుగా ఫేస్‌బుక్‌లో కలుసుకుని మాట్లాడుకుంటాం... విషయాలను షేర్ చేసుకుంటాం.

మే 26న వారి షష్ట్యబ్ది ఉత్సవం జరుపుకుంటున్న ఈ శుభతరుణంలో వారి గురించి నాలుగు మాటలు రాసే అవకాశం రావడం... నా అదృష్టంగా భావిస్తూ... ఆ భగవంతుడు వారికి ఆయురారోగ్య ఐశ్వర్యాలను సదా ప్రసాదించాలని ప్రార్థిస్తూ... శుభాభినందనలు.

మూర్తీభవించిన తెలుగు సంస్కృతి

- డా. జి. ప్రభాకర్

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారితో నాకు గత 20 సం॥రాలుగా పరిచయ భాగ్యం కలిగింది. ఎంతో ఉన్నతమైన వ్యక్తిత్వంతో మహోన్నతమైన పదవులను అలంకరించి, ఎంతో వినయంతో మన సంస్కృతి సాంప్రదాయాల పట్ల ఉన్నతమైన గౌరవంతో సంఘానికి విశేషమైన సేవలు అందిస్తున్న శ్రీ బుద్ధ ప్రసాద్‌గారు నా స్నేహితుడని చెప్పుకునేందుకు నేను ఎప్పుడూ గర్వపడతాను. ఓ ప్రముఖ రాజకీయవేత్తగా ఉన్నప్పటికీ, అంత నిరాడంబరమైన జీవితాన్ని గడపడం అనేది చాలా అరుదుగా మనం చూస్తుంటాం!

బుద్ధప్రసాద్ గారికి, నాకు చాలా అవినాభావ సంబంధం ఉంది. మేమిద్దరం ఆనాటి న్యాయపతి రాఘవరావుగారు స్థాపించిన బాలానందంలో ముఖ్య సభ్యులుగా పెరిగాము.

బాలానంద కార్యక్రమాలలో నేను 1961 నుండి 1975 దాకా ఒక ముఖ్య మెంబర్‌గా అనేకమైన కార్యక్రమాలలో పాల్గొనడం కొన్ని వందల ఆల్ ఇండియా రేడియో నాటకాలలో పాల్గొనడం జరిగింది.

రేడియో అన్నయ్యగా రాఘవరావుగారు, రేడియో అక్కయ్యగా న్యాయపతి కామేశ్వరి గారు, రేడియో తాతయ్యగా శ్రీ మల్లంపల్లి ఉమామహేశ్వర్‌రావుగారు, న్యాయపతి వారి తర్వాత రేడియో అన్నయ్యగా శ్రీ రామకృష్ణారావుగారు (మమ్ములు), ఉత్తరాల అక్కయ్యగా శ్రీమతి ఎం.వి. రమణమ్మగారు పిల్లలతో పిల్లలుగా కలిసిపోయి అనేకమైన కార్యక్రమాలు నిర్వహించేవారు.

ఆదివారం ఎప్పుడు వస్తుందా, ఆటవిడుపుకు బాలానందం ఎప్పుడు వెళ్తామా అని ఆసక్తికరంగా అందరం ఎదురు చూసేవాళ్ళం. అప్పటి బాలానందం కార్యక్రమాలలో శ్రీ బుద్ధప్రసాద్ గారు కూడా తరచూ పాల్గొనేవారట!

మేము ఎప్పుడూ కలిసినా బాలానందం అనుభూతులను నెమరు వేసుకొనడం, బాలానందాన్ని ఇంకా ఏ విధంగా పెంపొందించాలన్న ఆలోచనలు, వాటి గురించిన ప్రణాళికలు చర్చిస్తూ ఉంటాం.

రాష్ట్రంలో బాలల సర్వతోముఖాభివృద్ధికై ప్రభుత్వం 1976లో నెలకొల్పిన ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీకి ఆనాటి రాష్ట్ర విద్యా సాంస్కృతిక మంత్రి మండలి కృష్ణారావుగారు అధ్యక్షతగాను, రాఘవరావుగారు గౌరవ కార్యదర్శిగా ఉన్నారు. ఆ బాలల అకాడమీను కూడా ఇంకా బాగా పెంచి పోషించాలన్నది శ్రీమండలి బుద్ధప్రసాద్ గారి ధ్యేయం.

శ్రీ బుద్ధ ప్రసాద్ గారి ఆలోచనలు, వారి భావనలు రేడియో అన్నయ్య శతజయంతి సందర్భంగా ప్రచురించిన ప్రత్యేక సంచికలో 'బాలల ఉత్తమ వైతాళికుడు అన్నయ్య' అన్న రచనలో మనకు కన్పిస్తాయి.

శ్రీ బుద్ధప్రసాద్ గారు పూజ్య గురుదేవులు సద్గురు శివానందమూర్తి గారికి ఎంతో ఆప్తులు. గురుదేవులు వారిని తన కుమారుడిగా, ఎంతో వాత్సల్యంతో ప్రేమించేవారు. శ్రీ బుద్ధప్రసాద్ గారు ఎప్పుడు విశాఖపట్నం వచ్చినా నాకు ఫోన్ చేసి, ఇద్దరం కలిసి గురువుగారి దర్శనార్థం ఆనందవనం భీమిలికి వెళ్ళేవారం. గురువుగారి దగ్గర తీర్థప్రసాదం స్వీకరించిన తర్వాత, గురువుగారు చాలా సమయాన్ని మాకు ప్రసాదించేవారు గురువుగారు ఎప్పుడూ దేశభక్తి, భారతీయత గురించి శ్రీ బుద్ధప్రసాద్ గారితో ఎక్కువగా మాట్లాడేవారు. ప్రతీ ఒక్కరూ సమగ్ర, సమైక్యత భారతీయత అన్న ముఖ్యమైన అంశాలను గుర్తుపెట్టుకొని, దేశ మనుగడకు కృషి చేయాలని చెప్పేవారు. "ముఖ్యంగా రాజకీయ నాయకులు, దేశ సేవ చేయటానికి వారికొచ్చిన అవకాశాన్ని, భగవంతుడు ఇచ్చిన వరంగా భావించి దేశసేవచేసి భారతమాత రుణం తీర్చుకోవాలి. మీకు భగవంతుడు ఆ వరాన్ని ప్రసాదించాడు. మీలాంటి ఉత్తములు ఆ భరత మాత సేవలో తరిస్తారు అనడంలో సందేహమే లేదు" అని శ్రీ బుద్ధప్రసాద్ గారిని దీవించేవారు గురువుగారు. శ్రీ బుద్ధప్రసాద్ గారిని ఉద్దేశించి గురువుగారు సద్గురు శ్రీ శివానంద మూర్తిగారు సంభాషించినప్పుడల్లా గురువుగారు ఈ సూచనలు చేసేవారు.

శ్రీ బుద్ధప్రసాద్ గారితో ఎప్పుడు మాట్లాడినా దేశం గురించి, దేశం, రాష్ట్ర అభివృద్ధి గురించి, సమాజ శ్రేయస్సు గురించి మాట్లాడేవారు. రాష్ట్ర భవిష్యత్, దేశ భవిష్యత్ మీలాంటి ఉత్తమ రాజకీయ నాయకుల చేతిలోనే ఉంది. మీకీ సమాజాన్ని మార్చే శక్తి, రాష్ట్రాన్ని నడిపించే శక్తి, అవకాశం భగవంతుడిచ్చాడు. దాన్ని సద్వినియోగం చేసుకోవాలని అనేవారు. మంచి సమాజాన్ని, దేశాన్ని నిర్మించడంలో న్యాయశీలత, సనాతన ధర్మపరిరక్షణ, ధర్మమార్గమనుసరించడం కీలకమవుతుంది. వాటిని నమ్మి, ఆచరించే వారిలో మీరు చాలా ముఖ్యులు. కీలకమైన పదవిని భగవంతుడు ప్రసాదించాడు. ధైర్యంగా ముందుకు సాగండని బుద్ధప్రసాద్ గారిని ఆశీర్వదించారు గురుదేవులు గారు. పూజ్య గురుదేవుల దివ్యహస్తాల మీదుగా అనేక సన్మానాలు అందుకున్న అదృష్టవంతులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు.

ఆంధ్రదేశ సాహిత్య, సాంస్కృతిక వైభవం పట్ల వారికి ఉన్న అభిరుచి గౌరవానికి నిదర్శనం. కృష్ణాజిల్లా శ్రీకాకుళం గ్రామంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం, పూజ్య గురువులు రూపకల్పన చేసిన 'ఆంధ్రసాంస్కృతిక వైభవము' ప్రదర్శనలో ఆంధ్రదేశానికి మూల విరాట్టులైన శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు, రాజ్యలక్ష్మి దేవిల ప్రతిమలను చూసి ఎంతో సంతోషించారు శ్రీ బుద్ధప్రసాద్ గారు.

శ్రీ బుద్ధప్రసాద్ గారి కృషితో ఎన్నో ప్రయాసలకు లోనై శ్రీకాకుళంలో ఆంధ్ర మహావిష్ణువు ఆలయం ప్రాంగణంలో శ్రీకృష్ణ దేవరాయల విగ్రహ ప్రతిష్ట చేయించారు. ఆ కార్యక్రమానికి గురుదేవులుని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు.

శ్రీ బుద్ధప్రసాద్ గారు సాధించిన ఆ విజయం మన భారతీయ చరితకు, మన సాంప్రదాయాలకు చేసిన ఆ సేవ చాలా శ్లాఘనీయమైనదని గురువుగారు ఆనందంతో పొంగిపోతూ బుద్ధప్రసాద్‌గారిని దీవించారు. ఆ అపురూపమైన ఆశీస్సులతో ధన్యులయ్యారు బుద్ధప్రసాద్ గారు, వారి కుటుంబం.

శ్రీకృష్ణదేవరాయలు 'ఆముక్తమాల్యద' గ్రంథాన్ని అక్కడే రచించారు. వారి వైభవాన్ని పిల్లలకు అందరికీ చెప్పాల్సిన ఆవశ్యకత మన అందరి బాధ్యత. ఆ బాధ్యతలను తన భుజస్కంధాలపై వేసుకొన్న బుద్ధప్రసాద్ గారి జన్మ తరించిందనీ వారిని ఆశీర్వదించారు గురువుగారు.

శ్రీ శివానంద మూర్తి గారితో ఆ మహోత్సవంలో పాల్గొనే అదృష్టం నాకు కలిగింది.

2006లో గురజాడ కళాక్షేత్రంలో జరిగిన నారద సంగీతోత్సవాలకు బుద్ధప్రసాద్ గారు ముఖ్య అతిథిగా విచ్చేసి కళాకారులను సన్మానించి 'ఆంధ్రవైభవం' కళా ప్రదర్శనని ప్రారంభించారు. ఆంధ్రమ్యూజిక్ అకాడమి సంగీత, నృత్యోత్సవాలకు, శారద సంగీతోత్సవాలకు, వాగ్గేయకార ఉత్సవాలకు వచ్చి అన్ని కార్యక్రమాలు ఆద్యంతం వీక్షించేవారు బుద్ధప్రసాద్ గారు.

శ్రీ బుద్ధప్రసాద్ గారికి మన సంగీతం, సాహిత్యం, మన కళలు, సాంప్రదాయాలు, తెలుగు భాషాభిమానం అంటే పంచప్రాణాలు. ఎల్లవేళలా మన కళలను, సాంప్రదాయాలను భారతీయ విలువలను పోషించాలి, వాటిని అభివృద్ధి చేయాలి అన్న తపనతో నిరంతరం ఎనలేని కృషి చేస్తుంటారు. బుద్ధప్రసాద్‌గారు గురు కుటుంబంలోని ఒక ముఖ్యవ్యక్తిగా గురువుగారి కార్యక్రమాలకు అనేకమార్లు విచ్చేసారు.

తెలుగు భాష అన్నా, సంగీత సాహిత్యాలన్నా శ్రీ బుద్ధప్రసాద్ గారికి ఎంతో మక్కువ. వారి తండ్రి గారైన శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారు తెలుగు భాషోద్యమానికి, నారు, నీరు పోసి పెంచితే దాన్ని ఒక మహావృక్షంగా పెంచాలని నిరంతరం కృషి చేస్తున్న వారిలో శ్రీ మండలి బుద్ధ ప్రసాద్ గారు చాలా ముఖ్యులు. వారి నిరంతర కృషి ఫలితం 2012 సం॥ తిరుపతిలో జరిగిన 4వ ప్రపంచ తెలుగు మహాసభలు.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి నేతృత్వంలో ఆ సభలు ఎంతో వైభవంగా జరిగాయి.

పూజ్య గురుదేవులు సద్గురు శ్రీశివానంద మూర్తిగారు రూపకల్పన చేసిన 'ఆంధ్రవైభవం' ప్రత్యేక ఎగ్జిబిషన్ సనాతన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ వారు తెలుగు మహాసభల సందర్భంగా తిరుపతిలో నిర్వహించారు. మన దేశ ఔన్నత్యాన్ని చాటిన ఆ ప్రదర్శన అందరినీ విపరీతంగా ఆకర్షించింది. ఆ ప్రదర్శన నిర్వహణకు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు అందించిన సహకారం మరచిపోలేము.

ప్రవాసాంధ్రుల సేవ, శ్రీ బుద్ధప్రసాద్ గారి ప్రణాళికలలో ఒక ముఖ్యమైన కార్యక్రమం. 2008 సం॥లో సిలికాన్ ఆంధ్ర డాన్స్ ఫెస్టివల్‌లో అనుకోకుండా వారిని కలవడం జరిగింది. యునైటెడ్ నేషన్స్ అసెంబ్లీకి వెళ్ళిన నేను కాకతాళీయంగా వారిని కాలిఫోర్నియా, యుఎస్ఏలో కలవడం జరిగింది. వారితో పాటు మిత్రులు శ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాదు గారు, శ్రీ కోమటి జయరాంగారు, అందరిని కలవడం జరిగింది. ఆంధ్రదేశానికి చెందిన ప్రఖ్యాత నాట్య కళాకారులు, వెంపటి చిన్న సత్యం, మంజుభార్గవి, శోభానాయుడు, రత్నపాప మొదలగు అనేకమంది ప్రముఖులున్న ఆ సభలో శ్రీ బుద్ధప్రసాద్ గారి ప్రసంగం ముఖ్యంగా ప్రవాసాంధ్రుల పట్ల వారికున్న ప్రేమాభిమానాలు గురించి పలికిన మాటలు అద్భుతం. ప్రవాసాంధ్రులకు భాషా సాంస్కృతికపరమైన సేవలందించటానికి వారు పడే తపన వర్ణనాతీతం.

ఇంగ్లాండ్‌కు వెళ్తే గూటాల కృష్ణమూర్తి గారిని కలవడం, సర్ ఆర్థర్ కాటన్, బ్రౌన్ దొరల సమాధులను సందర్శించి నివాళులర్పించటం వారి సంస్కృతికి దర్పణాలు.

శ్రీ బుద్ధప్రసాద్ గారికి గ్రంథాల పట్ల అమితాసక్తి. “పుస్తక పఠనం నాకు చాలా ఇష్టం” అనేవారు. విశాఖకు ఎప్పుడు వచ్చినా “గురువుగారి గ్రంథాలు కొత్తవి ఏమైనా ప్రచురించారా! ఉంటే తప్పకుండా తీసుకురండి! అనేవారు. గురుదేవులు సద్గురు శివానంద మూర్తి గారి రచనలన్ని వారికి మార్గదర్శకాలైనాయి. గురువుగారి ‘భారతీయత’ పుస్తకం వారికి చాలా ప్రియమైన గ్రంథం, ‘భారతీయత’ ప్రతీ భారతీయుడికి మార్గదర్శ సూచిక అని వారి అభిప్రాయం.

శ్రీ బుద్ధప్రసాద్ గారు 2014 సం॥లో సార్వత్రిక ఎన్నికలలో శాసనసభ సభ్యులుగా ఎన్నికయి ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఉపసభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నికైనప్పుడు పూజ్య గురుదేవులు శ్రీ శివానంద మూర్తిగారు చాలా సంతోషించారు. ఎంతో సౌమ్యులు, నిజాయితీపరులు, సేవాతత్పరులు బుద్ధప్రసాద్ గారు! ఈ పదవిలో ఉండడం ఆంధ్రదేశానికి, రాష్ట్ర ప్రగతికి ఎంతో శుభసూచకం అని ఆశీర్వదించారు గురుదేవులు. శ్రీ బుద్ధప్రసాద్ గారితో నాకున్న సుదీర్ఘమైన పరిచయం, అనుబంధం నాకు తెల్సిన రీతిలో మీ ముందుంచుతున్నాను.

ఈ షష్ఠి పూర్తి మహోత్సవ శుభవేళ, శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి, వారి కుటుంబ సభ్యులకు, పూజ్యగురుదేవులు సద్గురు శివానంద మూర్తిగారి ఆశీస్సులకై ప్రార్థిస్తూ, పరిపూర్ణ ఆయురారోగ్య భాగ్యములు, సకల సన్మంగళ ఐశ్వర్యములు, నిరంతర కృపావర్షంగా లభించాలని కోరుకుంటున్నాను.



ప్రముఖ సినీ గాయకుడు ‘పద్మభూషణ్’ ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యంతో...

అందరివాడు మండలి

- డా. వంశీరామరాజు

మండలి బుద్ధప్రసాద్ గారితో నాకు ఎన్నో ఏళ్ళుగా పరిచయం. ఎప్పుడూ ఒకే తీరుగా, అదే చిరునవ్వుతో అభిమానంగా, ఆప్యాయంగా పలకరించడం బుద్ధప్రసాద్ గారి నిరాడంబరతకు, సౌజన్యానికి నిదర్శనం. వంశీ సంస్థ నిర్వహించిన అనేక కార్యక్రమాలకు ఆయన విచ్చేసి తమ అమూల్య సందేశం అందించారు, తమ ఆశీస్సులూ అభినందనలు అందిస్తూ వస్తున్నారు.

బుద్ధప్రసాద్ గారిని కార్యక్రమాలకు ఆహ్వానించడం చాలా సులువు. ఆయన తన దగ్గరకు వచ్చి పిలవాలని అనుకోరు. డైరీలో రాయించుకోవాలి ఆ తేదీని అనరు. కళాసంస్థలకు ఎంతగానో విలువనిచ్చే ఆయన ఏ మాత్రం అవకాశం ఉన్న కార్యక్రమానికి వస్తారు. క్రమశిక్షణ ఆయన ప్రాణం, ఇక్కడే కాదు విదేశాల్లో ఉన్న తెలుగువారు సైతం వారిని ప్రస్తుతిస్తారు. ఆయన వ్యక్తిత్వాన్ని గుర్తు చేస్తుంటారు. వారితో మాట్లాడటానికి, స్నేహం చేయడానికి ఇష్టపడతారు. ఎవరి మనసూ నొప్పించకుండా ఆప్యాయంగా అందరితో మాట్లాడటం, యోగ క్షేమాలడగడం ఆయన సహజ స్వభావం.

బుద్ధప్రసాద్ గారి తండ్రి గారి పేరు ఏ వేదిక మీదనైనా ఎవరైనా ప్రస్తావించి మాట్లాడితే ఆయనకు మహదానందం. తండ్రిపట్ల ఆయనకు గౌరవం, అలాంటి వ్యక్తి కొడుకుగా ఆయన వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న బుద్ధప్రసాద్‌గారు తండ్రిని మించిన తనయుడు.

సాంస్కృతిక సంస్థలన్నా, సాంస్కృతిక కార్యక్రమాలన్నా వారికి చాలా ఇష్టం. కళాకారులను ప్రోత్సహించడం, అవసరమైనప్పుడు తమ సలహా, సహకారాలు అందించడం కళలపట్ల ఆయనకున్న మక్కువను తెలియచేస్తుంది. తెలుగుభాషా సేవలో భాగంగా 'తెలుగు విజయం' ప్రాజెక్టు ద్వారా అంతర్జాలంలో తెలుగు ఉపయోగిస్తూ తెలుగులో సంక్షిప్త సందేశాలను పంపడానికి యూనికోడ్ రూపొందించి యాంత్రికపరంగా తెలుగును మరో మెట్టు ఎక్కించారు బుద్ధప్రసాద్‌గారు.

మనసులో అనుకున్నది చెప్పడం, దానిని ఆచరణలో పెట్టడం – అనే సూక్తిని పాటిస్తూ తన సమర్థతను నిరూపించుకున్న కార్యాదీక్షాపరుడు మండలి బుద్ధప్రసాద్‌గారు.

ఎంతటి ఉన్నత పదవిలో ఉన్నా ఆ పదవికే గౌరవం తెచ్చిన నిష్కళంక చరిత్ర బుద్ధప్రసాద్‌గారిది. 'ఉదారచరితానాంతు వసుధైక కుటుంబకమ్' అనే ఆర్యోక్తి ఆయనకు అక్షరాలా వర్తిస్తుంది. ఎవ్వరినైనా స్వంతవారిగా భావించి మంచి సలహాలు ఇవ్వగల ఉన్నత సంస్కారం ఆయన స్వంతం. కళా సంస్థలకు చేదోడువాదోడుగా ఉంటూ కళా హృదయంతో వారందించే సహకారం మరువలేనిది.

60 వసంతాలు పూర్తి చేసుకున్న ఈ శుభ తరుణంలో మీకు శుభాలు చేకూరాలనీ, మీ మార్గ దర్శకత్వంలో తెలుగు భాష చిరకాలం విలసిల్లాలనీ, భావితరం తెలుగు పిల్లలు తెలుగుకు ఊపిరిగా నిలవాలని ఆకాంక్షిస్తూ, మరొకసారి జన్మదిన శుభాకాంక్షలందిస్తూ ఆత్మీయతతో...

శతమానంభవతి

- పి.వి. మనోహరరావు

ఆత్మీయులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి 60 వసంతాలు నిండుచున్నవి. మొన్న మొన్నటి వరకు వారి తండ్రి గారు, శ్రీ మండలి కృష్ణారావు మరియు శ్రీ భాట్టం శ్రీరామమూర్తి గారలు మంత్రులుగా యున్నపుడు, పలుమార్లు కలసిన జ్ఞాపకాలు, ముఖ్యంగా ప్రథమ ప్రపంచ మహాసభల, సందర్భంలో చెన్నైలో గడిపిన రోజులు, స్మృతి పథంలో మెదలుచున్నవి. కాలం ఎంత త్వరగా పరుగిడుతుందోయని తోస్తుంది.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు, వారి పితృదేవులు, మండలి కృష్ణారావు గారి, అడుగు జాడల్లో పయనిస్తున్న నిష్కళంకనేత, సాహితి, సాంస్కృతిక, కళా రంగాలతోపాటు, తెలుగు భాషా సేవలు నిరంతరం సల్పుచున్నారు. ముఖ్యంగా వారి స్నేహశీలత, గాంధేయ మార్గం, నిరాడంబరత అన్ని పార్టీల వారితోగల సఖ్యత, సాంఘిక సేవా నిరతి, వారి వ్యక్తిత్వాన్ని, ఔన్నత్యాన్ని, చాటుచున్నది.

బుద్ధప్రసాద్ గారు ఏ పదవిలో యున్నా, ఆ పదవికే రాణింపు తెచ్చిన యోగ్యులు. తెలుగు అధికార భాషా సంఘాధ్యక్షులుగా వారు చేసిన భాషాభివృద్ధిసేవ, తిరుపతిలో ప్రపంచ తెలుగు మహాసభలలో, వారు పోషించిన పాత్ర, అనన్య సామాన్యము, అభినందనీయము. వారి భాషా సేవ విదేశాల్లో కూడా, తెలుగు మహాసభల రూపంలో ద్యోతకమగుచున్నది.

ప్రసాద్ గారి యమ్.ఎల్.ఏ. నియోజకవర్గమైన అవనిగడ్డ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించి, అనురాగ అభిమానం, సంపాదించి ప్రజల గుండెల్లో నిలచి, మూడు తడవలు శాసన సభ్యులుగా గెలవటం ఎంతో శ్లాఘనీయము. వీరి సాంఘిక సేవ, నియోజకవర్గానికే కాక కృష్ణా జిల్లాకు, దివిసీమకు పరివ్యాప్తమైనది. తుఫాను బాధితులను దగ్గరుండి ఆదుకొని, అవసరాలు తీర్చిన, అసమాన సేవాతత్పరులు.

బుద్ధప్రసాద్ గారు పుస్తక పఠనా ప్రియులు. అనేకమంది పుస్తకాలకు, పీఠికలు, ముందు మాటలు వ్రాసినారు. అనేకుల అభిమానం పొంది, అసంఖ్యాక పుస్తకాలను, అంకితం పొందిన, సాహితీ ద్రష్ట. వారి జ్ఞాపకశక్తి అమోఘం. ఆయన అనేక వ్యాసాలు, గ్రంథాలు, వ్రాసి, సాహితీ మూర్తుల మన్ననలందిన సాహితీవేత్త.

బుద్ధప్రసాద్ గారు నాకు అనుజతుల్యులు. అనేకసార్లు మా సర్వార్ధ సంక్షేమ సమితి కార్యక్రమాల్లో పాల్గొని, ప్రసంగించిన ప్రేమమూర్తి. వారు ఎచట కలసినా, దగ్గరకు వచ్చి ఆప్యాయంగా పలుకరించే అభిమాని. వారు ప్రస్తుతం ఆంధ్రరాష్ట్ర శాసనసభ ఉప సభాపతిగా రాణిస్తున్నారు. భవిష్యత్తులో ఉన్నత పదవులను పొంది అందరి మన్ననలందుతారని, ఆశిస్తూ, వారి ఈ షష్ట్యబ్ది మహోత్సవ సందర్భంగా, ఆయురారోగ్య, భోగభాగ్యాలతో అలరారుతారని ఆకాంక్షిస్తూ ఆశీస్సులందిస్తూ శతమానం భవతి:

సర్వేజనాఃసుఖినోభవంతుః

బహుముఖ ప్రజ్ఞాశాలి

- డోగిపర్తి శంకరరావు

నిమగ్నత, నిబద్ధత, నిజాయితీ లాంటి లక్షణాలను పుణికి పుచ్చుకున్న ఒక మహావ్యక్తి యొక్క బహుముఖ వ్యక్తిత్వ ప్రతిభాకోణాలను స్పృశించి వాటికి రమ్యమైన అక్షరబద్ధతను కల్గిస్తున్న మీ ప్రయత్నం మహోన్నతమైంది. గొప్పవారి జీవన విధానాలు, వారి భావనాసంపద్విభవాలే ఒక దేశ లేక ఒక ప్రాంతము యొక్క చరిత్రకు సువర్ణాభరణాలు. ఎంత త్రవ్వినా తరగని రత్నాలగని లాంటి బుద్ధప్రసాద్ గారి జీవితం - సాధన - భావనాసంపత్తులు భావితరాల వారికి నిర్దేశిత గమ్యాలు. అవి తెలుగువారి జీవన మందిరానికి మణిమయ స్థగిత రమ్య గవాక్షాలు. ఆయన గొప్ప భాషా ప్రేమికులు, తెలుగుభాషపట్ల ఎనలేని ప్రేమ, తెలుగు సంస్కృతీ సంప్రదాయాలపట్ల అవిభాజ్యమైన సాన్నిహిత్యం, తెలుగు ప్రజల కళలపట్ల గాఢమైన అనురక్తి - భాషలో నూతన ప్రయోగాల పట్ల తనివితీరని జిజ్ఞాస అనే అంశాలు ఆయన జీవన వికాసాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయి. దానికి తోడు నిండు కుండలాంటి సాత్త్విక తత్వస్ఫోరకమైన వ్యక్తిత్వం ఆయనకు ఒక సంపూర్ణత్వాన్ని ఆపాదించింది.

అనువంశిక లక్షణాలు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారిలో రూపుదిద్దుకున్నాయ్. వారి నాన్నగారు శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు పూర్వ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో మంత్రివర్యులుగా పనిచేసి రాష్ట్రాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు.

1990లో మారిషస్‌లో జరిగిన తృతీయ తెలుగు ప్రపంచ మహాసభకు ప్రతినిధిగా గొప్ప సేవలందించారు. కృష్ణాజిల్లా తెలుగు రచయితల సభకు గౌరవాధ్యక్షునిగా ఎంతో మంది యువ కవులనూ, రచయితలనూ ప్రోత్సహించారు. అమెరికాలో మిల్లటాస్‌లో జరిగిన మొదటి అంతర్జాతీయ తెలుగు అంతర్జాల మహాసభలకు గౌరవాధ్యక్షులుగా వ్యవహరించి ఆంధ్రుల ప్రతిష్ఠకు చక్కని గౌరవాన్ని కలిగించారు. ఆయన నిరాడంబర నిష్కళంక జీవన విధానమే కుమారునికి కూడా లభించింది. ఆయన గాంధేయవాదం ప్రసాద్ గారిలో ప్రధాన జీవన ప్రాతిపదికగా భాసించింది. చదువులో పట్టభద్రత సాధించిన శ్రీ ప్రసాద్‌గారు 1999లో రాజకీయ రంగంలోకి ప్రవేశించి యమ్.ఎల్.ఏ.గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2004, 2014లో శాసనసభ్యునిగా ఎన్నికై ఎన్నో సేవలు చేశారు. ఆయన పాలనాకాలంలో చేసిన కొన్ని పనులను గూర్చి తప్పనిసరిగా ప్రస్తావించాలి. ఆయన పశు సంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్య శాఖామాత్యులుగ ఉన్నప్పుడు ఆయన ప్రవేశపెట్టిన 'పశుక్రాంతి', 'మత్స్య క్రాంతి' పథకాలు పాలనా వ్యవస్థలోనే కొత్త సంస్కరణలుగా ప్రసిద్ధి చెందాయి. అలనాటి అశోక చక్రవర్తిలాగా ఆంధ్రదేశంలో అనేక చోట్ల పశువైద్య శాలలను ఏర్పాటు చేసి నోరులేని జీవుల రుణాన్ని తీర్చుకున్నారు.

2012-2014 సంవత్సరాల మధ్య కాలంలో శ్రీ ప్రసాద్ గారు అధికార భాషా సంఘం అధ్యక్షులుగా పనిచేశారు. మూడురోజులపాటు తిరుపతిలో జరిగిన నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభల విజయానికి ఎంతో

దోహదపడ్డారు. తెలుగు భాష అంతర్జాల భాషగా రూపు దిద్దుకోవడానికి ఎన్నో నూతనమైన విధానాలను ఆవిష్కరించారు.

నూతనంగా ఏర్పడ్డ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఉప శాసనసభాపతిగా చక్కని కీర్తి ప్రతిష్టలు సంపాదించారు.

శ్రీ ప్రసాద్‌గారు కృష్ణాజిల్లాను అభివృద్ధి పథంలో తీర్చిదిద్దారు. పులిగడ్డ – పెనుమూడి మధ్య కృష్ణానదిపై వారధి నిర్మింపజేసి ప్రజలకు ఎంతో మేలు చేశారు. మచిలీపట్టణంలో కృష్ణా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చెయ్యటంలో నిరుపమానమైన కృషి చేశారు. అనేక సేవా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని తన మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు.

ఆయనకు తెలుగుభాషా సంస్కృతులపై ఉన్న ప్రేమ నిరుపమానం. తెలుగు భాషావ్యాప్తికి ఆయన చేసిన కృషి ప్రశంసనీయం. 1975వ సంవత్సరంలో జరిగిన మొదటి ప్రపంచ తెలుగు మహాసభల కమిటి సభ్యులుగా ఉన్నారు.

తెలుగు భాషకు ప్రాచీన హోదా పొందటానికి జరిగిన ఉద్యమంలో క్రియాశీలంగా వ్యవహరించి సత్ఫలితాలను సాధించారు. తెలుగు భాషే కాదు తెలుగువారి కళలపట్ల ఆయనకున్న సాధికారమైన అవగాహన మహోన్నతమైంది. ఆయన ప్రతి కదలిక, స్పందన తెలుగుతనాన్ని ఉట్టిపడేటట్లుగా ఉంటుంది. అరమరికలు లేని ఆయన తెలుగు భాషాభిమానాన్ని చూస్తే ముచ్చటేస్తుంది. తెలుగుతల్లి కడుపున పుట్టినందుకు. అన్ని రకాలుగా తెలుగురుణాన్ని తీర్చుకొని ధన్యతను సాధించారు. ఒక రకంగా చెప్పాలంటే ఆయన మూర్తీభవించిన తెలుగుతేజం. ఆయనకున్న తెలుగు అభిమానాన్ని గూర్చి ఎంత వ్రాసినా తక్కువే.

ఈ సంస్కృతీ ప్రియుడు పుస్తకాల ప్రేమికుడు కూడా. నాకు ఆయనతో సుదీర్ఘమైన పరిచయం ఉంది. ఆయన మా శారద కళాసమితి కార్యక్రమాలకు ఎన్నోసార్లు విచ్చేశారు. వేదికపైనుండి చక్కని ఉపన్యాసాలు చేశారు. భేషజంలేని సూటితనం ఆయన ప్రసంగాలలో స్పష్టంగా కనిపిస్తుంది. అది ఎలాంటి అంశమైనా సరే దానిపై సాధికారిక ప్రసంగం చేయగలరు. కాలనియమాన్ని పాటిస్తూ ఎవర్నీ ఇబ్బంది పెట్టకుండా ఉండటం ఆయనకున్న మంచి అలవాటు. వీరి సంభాషణలు ఎప్పుడూ మృధువుగా ఉంటాయి, మాటలలో, నడతలో, జీవన విధానంలో చక్కని పొందిక కనిపిస్తుంది. నాకు బాగా గుర్తు క్రితం సంవత్సరం అక్టోబర్ 2న గాంధీ జయంతి నాడు విజయవాడ యస్.ఆర్.ఆర్. కళాశాల ప్రక్కనే వున్న హిందీ విద్యాలయాల్లో జరిగిన గాంధీ విగ్రహ ప్రతిష్టాపనోత్సవానికి విచ్చేసి ఎన్నో విషయాలను చర్చించారు. ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. మా ఇంట్లో కాస్సేపు విశ్రాంతి తీసుకున్నారు. అంతే కాదు ఆయన ప్రవాసాంధ్రులతో కలిసి అనేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ పదహారు అణాల తెలుగు మనిషి తెలుగు కోసం, తెలుగు సంస్కృతాభివృద్ధి కోసం మీదు మిక్కిలి తెలుగువారి కోసం నిండు నూరేళ్ళు జీవించాలని భగవంతుణ్ణి కోరుకుంటున్నాను. కిన్నెర ఆర్ట్స్ థియేటర్ తరపున ఇలాంటి చక్కని కార్యక్రమాన్ని స్వీకరించినందుకుగాను మిమ్ములను మరొక్కసారి అభినందిస్తున్నాను.

భాషాభగీరథులు, సాంస్కృతిక సేవా సారథులు

- డా. కళా వేంకట దీక్షితులు

"తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవరోయ్" అన్న కవి వాక్కు చందాన శ్రీ త్యాగరాయ గాన సభ సాంస్కృతికపరంగా ప్రపంచ రికార్డుల స్థాయికి చేరుకుని ప్రపంచ రికార్డును సాధించడంలో సహకరించినది 'ఎందరో మహానుభావులు అందరికీ మా వందనములు'. ఈ ఘనతలో మాకు నాడు మా నాన్నగారు కీ.శే. కళాసుబ్బారావు గారికి అండదండలందించి, భవన నిర్మాణానికి యధోచిత సహకారాన్ని అందించింది ఆనాటి మంత్రివర్యులు, సాంస్కృతిక బంధువు కీ.శే. మండలి వెంకటకృష్ణారావు గారు, వారి సేవలను శ్రీ త్యాగరాయగాన సభ ఎన్నటికి మరువదు.

వారి బాటలోనే పయనిస్తూ, ఆదర్శ భావాలతో, నిరాడంబర తత్త్వంతో సాంస్కృతిక సారథిగా తెలుగువారి హృదయాలలో చెరగని స్థానం పొదిన శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు సాంస్కృతిక వికాసానికి ఎనలేని కృషి చేస్తున్నారన్నది సత్యం. అక్షరసత్యం.

కళాకారులకు, కవులకు పెన్నధిగా ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణలో ప్రధాన భూమికను వహించి, విజయవంతం చేసిన తమ తండ్రిగారు కీ.శే. మండలి వేంకటకృష్ణారావు గారి బాటలో పయనించి, ఇటీవలే జరిగిన 4వ తెలుగు మహాసభల నిర్వహణలో ప్రధానసారథిగా వ్యవహరించిన శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి షష్ఠి పూర్తి సందర్భంగా శుభాకాంక్షలను తెలుపుతూ మరెన్నో జన్మదినాలను జరుపుకుంటూ, తెలుగు భాషామతల్లికి ముద్దుబిడ్డగా తెలుగు వెలుగులను దశదిశలకు వ్యాప్తి చేయాలని కోరుతూ.....

షష్టిపూర్తి శుభాకాంక్షలతో....



స్వచ్ఛభారత్‌లో శ్రీ గజల్ శ్రీనివాస్‌తో...

మూర్తీభవించిన మానవత్వం

- డి. కామేశ్వరి

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి షష్టిపూర్తి పండుగ జరుపుకోబోతున్నందుకు ముందుగా ఆయనకు హార్థిక శుభాకాంక్షలు అందిస్తున్నాను. ఆ సందర్భంగా 'అభినందన' గ్రంథాన్ని ప్రచురించి ఆయన్ని మీ సంస్థ సత్కరించాలని నిర్ణయించడం ఎంతో సముచితంగా ఉంది.

శ్రీ బుద్ధప్రసాద్ గారితో నాకు సన్నిహిత పరిచయం లేకపోయినా, ఆయన రాజకీయ జీవితం, సాహిత్యం, భాషపట్ల ఆయనకున్న అభిమానం, అభిరుచి వలన ఎన్నో సాహిత్య కార్యక్రమాల ద్వారా ఆయనని గురించి తెలుసు. ఆయనని తెలియకపోయినా ఆయన్ని చూడగానే ఓ సహృదయం, సంస్కారం, సౌజన్యం మూర్తీభవించిన, ఉన్నత ఆశయాలున్న వ్యక్తి అనిపిస్తుంది.

ఆయన జీవితం, తండ్రిగారి నీడనే చిన్నతనం నించి ఎన్నో మంచి పనులు చేస్తూ చేదోడువాదోడుగా ఉండి, రాజకీయంగా, సాంఘికంగా, భాషాపరంగా పదవులు అలంకరించిన ఆయనది గొప్ప వ్యక్తిత్వం. రాజకీయ జీవితం అనేకనేక పదవులతో ముడిపడినా, ఆయనకి తెలుగు భాష పట్ల ఉన్న అభిమానం, అభిరుచి, భాషా ప్రయోజనాలు కాపాడాలన్న తపన, మన సంస్కృతి, సాంప్రదాయ విలువలు తెలిపే మన భాషకి, ప్రాచీనభాషగా గుర్తింపు తేవాలని ఉద్యమం చేసి, విజయం సాధించి, ప్రవాసాంధ్రులతో సత్సంబంధాలు కలిగి, భాషాసాంస్కృతిక అవసరాలు తీర్చడానికి కృషి చేస్తున్న గొప్ప వ్యక్తి. తండ్రిగారి జయంత్యుత్సవాలని నిర్వహిస్తూ ఆయన పేరిట ప్రతి ఏటా పురస్కారాలు అందిస్తూ తండ్రి పేరు నిలబెట్టగలిగిన ఓ కొడుకుగా ఆయన తనవంతు కృషి చేస్తున్నారు. నిక్కచ్చైన గాంధేయవాది, మానవత్వం మూర్తీభవించిన సహృదయుడు ఆయన ఇంకా ఎన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని – 'సహస్ర చంద్రదర్శనం' పండుగ చేసుకోవాలని, ఈలోగా ఆయన మరింతగా తెలుగు భాషా వికాసానికి, తెలుగు సాహిత్యానికి గుర్తింపు తెచ్చే మరిన్ని మంచి పనులు చేయాలని మనసారా కోరుతూ, మరోసారి హృదయ పూర్వక శుభాకాంక్షలు. వయసురీత్యా 'శతమానం భవతి' అంటూ ఆశీస్సులు అందచేస్తున్నాను. మీ సంస్థ ఇంతమంచి పని తలపెట్టినందుకు మిమ్మల్ని అభినందిస్తూ...



వరద బాధితులకు అండగా...

దీక్షాస్ఫూర్తి

- డా. కె. ధర్మారావు

తెలుగు భాష ప్రపంచీకరణం చేసిన వ్యక్తి అంటే శ్రీ మండలి వెంకట కృష్ణారావు. వీరితో నా ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలు మొదటి ప్రపంచ తెలుగు మహాసభల నుండి మలేషియా ప్రపంచ తెలుగు మహాసభలు (డెలిగేట్స్ ప్రోగుచేయడంలో సహకారాన్నందించడం) వరకు.

ఆ పరంపరను కొనసాగిస్తూ తెలుగు భాషా, సంప్రదాయాల పరిరక్షణకు కంకణం కట్టుకున్నది ఆయన తనయులు శ్రీ మండలి బుద్ధప్రసాద్. ప్రపంచ తెలుగు సభలు, ప్రపంచ తెలుగు రచయితల సభలు, ప్రపంచ తెలుగు అంతర్జాల సభలు, మరియు దేశవిదేశాలలో జరిగిన ఎన్నో తెలుగు భాషా వికాస సభల ద్వారా, వీరు చేసిన దీక్షా స్ఫూర్తి తెలుగు భాష ప్రాచీన భాషగా గుర్తించబడడానికి దోహదబడినదని నిస్సంకోచంగా చెప్పవచ్చు. అలాగే అధికార భాషాధ్యక్షులుగా ప్రాచీన హోదాను పొందిన తెలుగు భాషకు రావలసిన రాశిఫలాలకు వీరు ఎంతో కృషి చేసారని అందరికి తెలుసు.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారితో మరియు ఆయన జన్మించిన జిల్లాతో దశాబ్దంన్నరకు పైగా పరిచయం ఉన్న నేను ఆ జిల్లా వాసులందరూ (ఏ రాజకీయ పార్టీ ప్రమేయం లేకుండా) ఆయనను ఒక గాంధేయవాదిగా, తెలుగు భాషావాదిగా, మన సంప్రదాయాల పరిరక్షకులుగా, ప్రపంచానికి తెలిసిన తెలుగు వాడిగా ప్రస్తుతించడం నాకు తెలుసు. తెలుగుభాష బుద్ధ ప్రసాద్ గారి శ్వాస, తెలుగు వీర లేవరా శ్రీ బుద్ధప్రసాద్ గారి స్పందన.



2004లో తన చిరకాల స్వప్నం సాగర సంగమ రహదారిని ప్రారంభిస్తున్న శ్రీ మండలి బుద్ధప్రసాద్, జిల్లా కలెక్టర్ శ్రీ ప్రభాకర్ రెడ్డి

తరంతరం నిరంతరం - ప్రజాసేవే పరమావధిగా

- కొట్టి రామారావు

మండలి వారి మూల పురుషుడు శ్రీ చిన పోతినీడు నుండి శ్రీ బుద్ధప్రసాద్ తండ్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావు వరకు ప్రజాసేవలో పునీతులైనవారే... నేడు వేల కోట్లు ఖర్చు పెట్టి ప్రభుత్వాలు చేస్తున్న సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు ఆనాడే శ్రీ వెంకట కృష్ణారావు తండ్రి శ్రీ వెంకట రామయ్య తన కష్టార్జితంతో దాదాపు సొంత వనరులతో చేసి దివిసీమ దివ్యసీమగా మార్చారు. ఇదంతా భారతదేశ స్వాతంత్ర్యానికి 25 సం॥లు ముందే జరిగిందంటే శ్రీ మండలి పూర్వీకుల చరిత్ర ఎంత ఘనమైనదో మనకు తెలుస్తుంది.

మండలి వారి పూర్వీకులు : ఇప్పుడు మండలి వారి పూర్వీకుల చరిత్రను క్లుప్తంగా తెలుసుకుందాం.

మండలి వారి పూర్వీకులు విజయనగర సామ్రాజ్యంలో సేనాపతులు. మహమ్మదీయ రాజుల నయవంచనకు విజయనగర సామ్రాజ్యం పతనమైనది. ఆ మహా ప్రళయంలో మండలి పూర్వీకులు విజయనగరాన్ని వదిలివెళ్లక తప్పలేదు. ఇది 1725-1750 మధ్య జరిగిన మహాప్రస్థానం.

మండలి వారి మూల పురుషుడు శ్రీ చిన పోతినీడు, ఈ వంశం వారంతా దీర్ఘాయుష్కులు, ఆజానుబాహులు, ఆధ్యాత్మిక తత్పరులు, దానశీలురు. విజయనగర సామ్రాజ్య పతనానంతరం శ్రీ చిన పోతినీడుకు 'ఎటుపోవాలి'... అనే మీమాంస కలిగింది. దక్షిణాన, పశ్చిమాన, ఉత్తరాన, మహమ్మదీయుల రాజ్యాలు ఉన్నవి. అందువలన అటు పోవడానికి మనసొప్పలేదు. తూర్పున ఇంకా విజయనగర సార్వభౌముల పరిపాలనే ఉంది. ఇది వరకు ఈ ప్రాంతం మండలి వారికి సుపరిచితమే. శ్రీ కృష్ణ రాయలను కళింగ దిగ్విజయంలో అనుసరించిన సేనా నాయకులు. ఆంధ్ర విష్ణువు సన్నిధిలో కృష్ణ రాయలు సమాసీనుడై పండితులతో చర్చించటం తనే సేనాపతులకు యుద్ధవ్యూహాల గురించి చర్చించడం, ఆముక్తమాల్యద కావ్య రచనను ఊహించడం ఈ సేనా నాయకులకు తెలుసు. కనుక తూర్పునకు తరలి దివిసీమ చేరి, అక్కడి సౌందర్య సౌభాగ్యాలకు ముగ్ధులై అక్కడే స్థిరపడాలని నిశ్చయించారు. ఈ దివి సీమలో తొలిగడ్డ 'పులిగడ్డ'. దీనిలోనే మండలి వారు నివాసం ఏర్పరుచుకున్నారు. తరువాత వారి కార్యాచరణ రంగం దివిసీమ యావత్తు వ్యాపించింది.

మండలి వారి మూల పురుషుడు శ్రీ చిన పోతినీడు అని ఇది వరకే తెలుసుకున్నాం. వారి కుమారుడు శ్రీ కొండయ్య, వారి కుమారుడు శ్రీ సుబ్బయ్య, మరల శ్రీ సుబ్బయ్య గారి కుమారుడు శ్రీ కొండయ్య, వీరి కుమారుడు శ్రీ వెంకటప్పయ్య, వీరి కుమారుడు శ్రీ వెంకట్రామయ్య, వీరి కుమారుడు మన శ్రీ వెంకట కృష్ణారావు. సరే, జగన్మిత్రుడు శ్రీ వెంకట కృష్ణారావు సుపుత్రుడు మనందరి ఆత్మీయ బంధువు శ్రీ బుద్ధప్రసాద్.

శ్రీ వెంకట కృష్ణారావు శ్రీ బుద్ధప్రసాద్‌ల భాషా, ప్రజాసేవాకార్యక్రమాలకు మూల బీజం వెంకట్రామయ్య గారి నుండే ప్రధానంగా ప్రారంభమయింది. వెంకట్రామయ్య చిన్న నాటి నుంచే ప్రజాహిత

కార్యాలలో మునిగితేలారు. భావదేవరపల్లిలో సహకార పరపతి సంఘస్థాపన ద్వారా సహకారోద్యమానికి ఆద్యులయ్యారు. అలాగే పంచాయితీస్థాపన దానికి ప్రథమాధ్యక్షులు. గ్రామం చుట్టూ ఉన్న కాల్వలకు వంతెనలు, రోడ్లు, మంచినీటి బావులు, పాఠశాల భవనాలు, పశువుల ఆసుపత్రి, రూరల్ డిస్పెన్సరీ అన్నింట తానే ముందుండి నడిపించారు. అలాగే అక్కడ ఉన్నత పాఠశాల స్థాపించారు. చుట్టు ప్రక్కల గ్రామాలలో నీటి వనరులు, మురుగు కాల్వలు, రహదారి సౌకర్యాలు, పేదలకు బంజరు భూముల పంపిణీ మున్నగు ప్రజోపయోగ కార్యాలకు నిరంతరం శ్రమించారు. తండ్రి వెంకట్రామయ్య గారి 'జీన్స్'తో పుట్టిన వెంకట కృష్ణారావు గారూ, బుద్ధప్రసాద్ గారూ తమ తండ్రి, తాతగార్ల స్ఫూర్తిని పుణికి పుచ్చుకుని నిరంతరం మరిన్ని ప్రజోపయోగ కార్యక్రమాలకు తమ జీవితాలను వెచ్చించారు. వెచ్చిస్తున్నారు.

తన తండ్రి వెంకట్రామయ్య గారి స్ఫూర్తితో వెంకట కృష్ణారావు గారు తన ప్రజాహిత కార్యక్రమాలను జిల్లా, రాష్ట్రవ్యాప్తంగానే గాక భారతదేశం యావత్తు గర్వించే ప్రజాసేవా కార్యక్రమాలను చేస్తూ కుమారుడు బుద్ధప్రసాద్ గారికి మార్గదర్శకులు అయ్యారు (మండలి పూర్వీకుల చరిత్రకు ఆధారం : శ్రీ తిరుమల రామచంద్ర వ్యాసం – వారికి కృతజ్ఞతతో...వ్యాసకర్త).

"ముతక ఖద్దరు చొక్కా, సాదాగోరంచు పంచ, స్నేహం చిలికే చూపులు, ఆత్మీయత ఒలికే చిరునవ్వు, అంతరంగాన్ని పట్టి యిచ్చే పలుకు, యివన్నీ మనిషిగా రూపొందితే శ్రీ మండలి వెంకట కృష్ణారావు మూర్తి" – డా॥ సినారె. శ్రీ మండలి వెంకట కృష్ణారావు కార్యదక్షతకు, ఆంధ్ర సాంస్కృతిక పునరుజ్జీవనాతత్పరతకు ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలు ప్రబల సాక్షులు, ఒక భాషకు సంబంధించిన వారెక్కడ, ఏ దేశంలో ఉన్నా వారందరినీ ఒక్కచోటకు చేర్చిన ఖ్యాతి బహుశా భారతదేశంలో ఒక్క ఈ తెలుగు మహానాయకుడికే దక్కింది. ఇటువంటి ప్రపంచ భాషా సభలు జరపడం మండలి వెంకట కృష్ణారావు గారి స్ఫూర్తితో భారతదేశంలోని ఇతర భాషల వారూ జరపడం ప్రారంభించారంటే వెంకట కృష్ణారావు గారి మార్గదర్శకత్వం ఎంతటిదో తేట తెల్లమవుతుంది. అలాగే ప్రపంచంలోని తెలుగువారందరికి నిరంతరం సేవలందించే ఒక అంతర్జాతీయ తెలుగు సంస్థను స్థాపించిన ఖ్యాతీ శ్రీ వెంకట కృష్ణారావుకు దక్కుతుంది. తండ్రి స్ఫూర్తితోనే ప్రపంచంలోని తెలుగు వారందరినీ ఒకచోటకు చేర్చడంలో శ్రీ బుద్ధప్రసాద్ కృతకృత్యులయ్యారు. ఈనాడు అమెరికాలో అనేక తెలుగు సంఘాలు, మలేషియా, మారిషస్, ఇంగ్లాండ్ మొదలగు ప్రదేశాల్లోను తెలుగుభాషా, సంస్కృతుల పరిరక్షణకు, అభివృద్ధికి కృషి చేస్తున్నారంటే అన్నింటికీ ప్రధాన ప్రేరణ శ్రీ మండలి వెంకట కృష్ణారావు, శ్రీ బుద్ధప్రసాద్ లే అనడంలో అతిశయోక్తి లేదు.

రాజకీయాల్లో శ్రీ బుద్ధప్రసాద్

సార్వత్రిక ఎన్నికల్లో అవనిగడ్డ నియోజకవర్గం నుంచి 1999, 2004, 2014లలో ఎం.ఎల్.ఏ.గా ఎన్నికైనారు. 2007–09 సం॥ల మధ్య పశుసంవర్ధక పాడిపరిశ్రమ, మత్స్యశాఖామాత్యులుగా పనిచేశారు. పశుక్రాంతి, మత్స్యక్రాంతి పథకాలను రూపొందించి యస్‌సి, యస్‌టిలకు, బడుగు బలహీనవర్గాలకు పాడిపశువుల కొనుగోలుకు రికార్డు స్థాయిలో రాయితీలు, ఋణాలు ఇచ్చి ప్రోత్సహించారు. ఈ పథకాల మూలంగా మత్స్యకార మహిళలకు మహోపకారం జరిగి, ఉపాధి లభించింది. శ్రీ మండలి బుద్ధప్రసాద్

మంత్రిగా ఉన్నప్పుడే హైదరాబాద్, విజయవాడ, పులివెందులలో సూపర్‌స్పెషాలిటీ పశువైద్యశాలలను, భావదేవరపల్లిలో ఫిషరీస్ పాలిటెక్నిక్ కాలేజిని ఏర్పాటు చేయడం జరిగింది. 2014 జనరల్ ఎలక్షన్స్‌లో ఎం.ఎల్.ఏ.గా ఎన్నికయిన శ్రీ బుద్ధప్రసాద్ ఏ.పి. అసెంబ్లీ ఉపసభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నికై కొనసాగుతున్నారు.

అధికార భాషా సంఘం అధ్యక్షులు

శ్రీ బుద్ధప్రసాద్ ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షునిగా పనిచేశారు. ఇదే కాలంలో తిరుపతిలో 4వ ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించి ప్రపంచంలోని తెలుగు మాట్లాడే వారందరినీ మరోసారి ఒక్కచోటకు చేర్చిన ఘనత శ్రీ బుద్ధప్రసాద్‌కే దక్కింది. ఈ సమయంలో శ్రీ బుద్ధప్రసాద్ కాంగ్రెసు పార్టీలో ఉన్నారు. అప్పుడొక ఎం.పి. ఇలా గన్నారు "మేము పార్లమెంటు మెంబర్లం, ఎం.ఎల్.ఏ.లం మాకెవరికీ లేని ప్రాధాన్యత ఏ ఉన్నత పదవీ లేని శ్రీ బుద్ధప్రసాద్‌కే – ప్రసార మాధ్యమాలలో ప్రతిదినం లభిస్తున్నది" అంటే ఆయన సేవలు పార్టీలకతీతంగా ఉన్నవని చెప్పకయే చెప్పినట్లు కదా.

కృష్ణాజిల్లా అభివృద్ధి

శ్రీ బుద్ధప్రసాద్ కృష్ణాడెల్టా సంరక్షణ సంఘాన్ని ఏర్పాటు చేసి, దానికి అధ్యక్షులుగా ఉండి, కృష్ణా డెల్టా ఆధునికీకరణకు అనేక ఉద్యమాలు నడిపి...పులిగడ్డ – పెనుమూడి మధ్య కృష్ణానదిపై వారధిని నిర్మింపజేశారు. ఈ వంతెనకు మండలి వెంకట కృష్ణారావు వారధి అనే సముచిత నామకరణం జరిగింది.

సాంఘిక సేవా కార్యక్రమాలు

1977 నవంబర్‌లో దివిసీమలో సంభవించిన పెనుతుఫాను, ఉప్పెనల తాకిడికి 10 వేల మంది చనిపోగా లక్షలాది పశువుల అసువులు పోయాయి. ఈ సమయంలో తండ్రి స్ఫూర్తితో శ్రీ బుద్ధప్రసాద్ రేయింబవళ్ళు శ్రమించి బాధితులకు విస్తృతమైన సేవలందించారు. అనాథలైన 120 మంది బాలబాలికలను చేరదీసి వారికి ఆశ్రయం కల్పించారు.

తెలుగు భాషా సంస్కృతుల సేవ :

శ్రీ బుద్ధప్రసాద్ పేరు చెప్పగానే ప్రపంచంలో ఏ మూలనున్న తెలుగువారైనా వారి తెలుగుభాషా సేవను ప్రస్తుతించకుండా ఉండలేరు. ఒకప్పుడు దక్షిణ భారతదేశానికే సాంస్కృతిక కేంద్రంగా వెలిసి తరువాత అనాదరణకు లోనైన మచిలీపట్నంలో కృష్ణా విశ్వ విద్యాలయ స్థాపనకు ప్రధాన ప్రేరకులు, కారకులు శ్రీ బుద్ధప్రసాదే. కృష్ణా జిల్లా రచయితల సంఘానికి గౌరవాధ్యక్షులుగా విజయవాడలో 2007లోను, 2011లోను, 2014లోను, ప్రపంచ తెలుగు రచయితల సభలను నిర్వహించారు. 2011లో యుఎస్ఏలో జరిగిన మొదటి అంతర్జాతీయ తెలుగు అంతర్జాల మహాసభలకు గౌరవాధ్యక్షులుగా వ్యవహరించారు. తెలుగు అంతర్జాల అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్న మహోన్నతుడు శ్రీ బుద్ధప్రసాద్. శ్రీ బుద్ధప్రసాద్ అనేక గ్రంథాలకు రచయితగా, మరెన్నో గ్రంథాలకు కృతి స్వీకర్తగా వినుతికెక్కారు.

ఆంధ్రసారస్వత సమితి, మచిలీపట్నంతో మండలివారి అనుబంధం

ఈ వ్యాసకర్త కథతో కూడిన 'ఆకర్షణ' అనే తెలుగు కథాసంకలనాన్ని విద్యాశాఖా మంత్రిగా ఉన్నప్పుడు శ్రీ మండలి వెంకట కృష్ణారావు ఆవిష్కరించారు. ఆ సంకలనంలోని రచయితలను సముచిత రీతిని సత్కరించారు. ఈ వ్యాసకర్త కథా సంపుటి 'రెక్కతెగిన చైతన్యం'ను 'కంచికి చేరని కథ' నవలనూ శ్రీ బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. 'కంచికి చేరని కథ' నవల రచయిత అయిన ఈ వ్యాసకర్త శ్రీ బుద్ధప్రసాద్‌కే అంకితమిచ్చి అపార గౌరవాన్ని పొందారు. 'తెలుగుభాషాభివృద్ధి – పరిరక్షణ' – శ్రీ మైనేని వారి ఉగాది సాహిత్య ప్రతిభా పురస్కారం శ్రీ బుద్ధప్రసాద్‌కిచ్చిన ఘనత ఆంధ్రసారస్వత సమితికి దక్కింది.

ప్రవాసాంధ్రుల సేవ

శ్రీ బుద్ధప్రసాద్ రెండు తెలుగు రాష్ట్రాలలోను, ఇతర రాష్ట్రాలు, దేశాలలోను నివసిస్తున్న తెలుగువారితో నిరంతరం సంబంధాలు కలిగి ఉంటున్నారు. తన తండ్రి స్థాపించిన అంతర్జాతీయ తెలుగు సంస్థ తదనంతర కాలంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో విలీనమయినది. శ్రీ మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం పక్షాన ఇతర రాష్ట్రాలలోను, ఇతర దేశాలలోను తెలుగుభాషా సంస్కృతుల వికాసానికి కృషి చేస్తున్న సంస్థలలో ఒక దానిని ఎంపిక చేసి, శ్రీ మండలి వెంకట కృష్ణారావు పురస్కారాన్ని తన స్వంత వనరులతో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ద్వారా శ్రీ మండలి బుద్ధప్రసాద్ ప్రదానం చేస్తున్నారు. శ్రీ మండలి బుద్ధప్రసాద్ నిజమైన గాంధేయవాది. వారి నివాసం గాంధీక్షేత్రం. కాని వారి కార్యస్థానం తెలుగు వారున్న ప్రపంచంలోని అన్ని దేశాలకు వ్యాపించింది. తెలుగుజాతి భాషా సాంస్కృతిక పరిరక్షణకు, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న మహోన్నతుడు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి షష్టిపూర్తి అభినందనలు, వారికి భగవంతుడు ఆయురారోగ్య, సౌభాగ్యాలు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను.



శ్రీమతి పి. సుశీల, డా॥ సి. నారాయణరెడ్డి, శ్రీమతి బాలసరస్వతిలతో...

విలక్షణ రాజకీయవేత్త బుద్ధప్రసాద్

- మహ్మద్ రఫీ

పూజ్యులు మండలి బుద్ధప్రసాద్ అంటే స్వతహాగా నాకు చాలా ఇష్టం. రాజకీయ నాయకుడైనప్పటికీ ఆయనలో ఆ ఛాయలు కనిపించవు. ఎంతో ఆత్మీయంగా ఆప్యాయంగా మాట్లాడతారు. చెదరని నవ్వు, అపకారం చేయని తత్వం ఆయనకు ఆభరణాలు! మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా, కేబినెట్‌లో మంత్రిగా, అధికార భాషా సంఘం అధ్యక్షులుగా, ఎన్నో సంస్థలకు గౌరవ అధ్యక్షులుగా, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఉప సభాపతిగా ఏ పదవిలో ఉన్నప్పటికీ ఆ పదవికే వన్నె తెచ్చిన విలక్షణ వ్యక్తిత్వం! భేషజాలు ఆయన దరికి చేరడం నేనెప్పుడూ చూడలేదు. కోప్పడటాలు వినలేదు. విసుక్కోవడాలు జరగలేదు. సాంస్కృతిక కళారంగంలో ఉన్నవారందరికీ ఆయనొక పెద్ద మేనమామ లాంటివారు! ఏ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చినా సమయపాలన పాటిస్తారు! సందర్భానుసారం చక్కని సమాచార విజ్ఞానంతో కూడిన ఉపన్యాసం ఇస్తారు.

బుద్ధప్రసాద్ గారితో కలసి మూడు అంతర్జాతీయ ఉత్సవాల్లో పాల్గనడమే కాకుండా అందులో క్రియాశీలక బాధ్యతలు నిర్వహించే అరుదైన అవకాశం నాకు లభించింది. ఈ సంఘటనలను ఎప్పుడూ అదృష్టంగా భావిస్తుంటాను. ఒకటి సిలికానాంధ్ర తొలిసారిగా అమెరికాలోని కుపర్టినోలో నిర్వహించిన అంతర్జాతీయ కూచిపూడి నృత్యోత్సవాలు అయితే, మిగిలినవి రెండు... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన శ్రీకృష్ణ దేవరాయ పంచ శతాబ్ది ఉత్సవాలు, తిరుపతిలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలు! ముఖ్యంగా ఈ రెండు ఉత్సవాల్లో నేను వారి ఆధ్వర్యంలో సాంస్కృతిక మండలి ప్రజా సంబంధాల అధికారిగా ఉండి కీలక బాధ్యతలు నిర్వహించడం, వారు నన్ను ప్రత్యేకంగా అభినందించడం నా జీవితంలో మరచి పోలేని మధుర ఘట్టాలుగా ఎన్నటికీ నిలిచిపోతాయి.

బుద్ధప్రసాద్ గారిని చూసినా, ఆయనతో మాట్లాడినా మనకు కొత్త ఉత్తేజం చేకూరుతుంది. ఎక్కడలేని ఉత్సాహం ఉప్పొంగుతుంది. ఎందుకంటే తెలుగు భాషా వికాసం గుర్తుకొస్తుంది. అమ్మభాషను కాపాడుకోవాలనే పట్టుదల పెరుగుతుంది. ఏ పార్టీలో ఉన్నా భాషా మమకారం మాత్రం ఆయన వీడలేదు. ఎప్పటికప్పుడు తెలుగు భాషకు చలువ పందిళ్ళు వేసి కాపాడుకుంటూ వచ్చారు. వారి తండ్రి మండలి వెంకట కృష్ణారావు వారసుడిగా రాజకీయ రంగంలోకి వచ్చి సూటిగా నీతి నిజాయితీగా తనదైన ముద్ర వేసుకున్న బుద్ధప్రసాద్ నేటి రాజకీయ రంగానికి ఒక నిలువెత్తు సంతకం అనడంలో అతిశయోక్తి ఏ మాత్రం లేదు. ఎందుకంటే, ఎవరైనా పదవుల కోసం ఎదురు చూస్తారు. కానీ, అధికార పార్టీలో పదవుల పందేరం జరుగుతున్న సందర్భంలో ... ఆయన అవేవీ పట్టించుకోకుండా ఇంటికెళ్ళి మధ్యాహ్నం వేళ నిద్రపోతున్న తరుణంలో వారిని చరవాణి ద్వారా నిద్రలేపి మరీ శాసన సభ ఉప సభాధిపతి పదవిని ఇచ్చారంటే... ఆయన విలక్షణ వ్యక్తిత్వానికి ఇంతకన్నా నిదర్శనం మరొకటి ఉంటుందా? మహనీయులు మండలి బుద్ధప్రసాద్‌కు జన్మదినోత్సవ శుభాకాంక్షలు.

ఆయన ఆహార్యం, ఆంతర్యం రెండూ తెలుపే!

- ఎస్.వి. రామారావు

కృష్ణా జిల్లా దివిసీమలో మండలి వంశానికో గౌరవప్రదమైన చరిత్ర వుంది. ఆ చరిత్రకు వన్నె తెచ్చి, రాష్ట్రవ్యాప్తం చేసిన మహనీయులు శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారు. వారు సౌజన్యమూర్తి, ప్రజాసేవ, పరోపకారం ఆయనకు పెట్టని ఆభరణాలు. నిత్య ఖద్దరుధారి. మా పినతండ్రులు పెదకళ్ళేపల్లి కరణాలు కొడాలి రాజారావు, బలరామారావులకు మండలి వారంటే ఎంతో అభిమానం. అలాగే కృష్ణారావుగారు కూడా వారి పట్ల గౌరవం చూపేవారు.

2015 సెప్టెంబరులో నేను, కిన్నెర రఘురామ్ ఒక కార్యక్రమం నిమిత్తం బెంగుళూరు వెళ్ళగా అక్కడ శ్రీ రాధాకృష్ణ రాజు గారి నిర్వహణలో వున్న పాఠశాలలో మండలి వెంకట కృష్ణారావు గారి పేరిట వున్న పెద్ద గ్రంథాలయం చూసి ఆనందించాను. అంటే వారి ఖ్యాతి, కృషి రాష్ట్రాలు దాటింది. అందుకు మరో ఉదాహరణ వారి హయాంలో, వారి నేతృత్వంలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలు.

ఆ మహానుభావుని వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న వారి తనయులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు.

వారు నిత్యం ధవళ వస్త్రాలే ధరిస్తారు. అవి ఎంత స్వచ్ఛంగా నిరాడంబరంగా వుంటాయో ఆయన మనసు కూడా అంత నిర్మలంగా, నిష్కల్మషంగా వుంటుంది. పరోపకారం, తెలుగు భాషాభిమానం, దాని వ్యాప్తికి నిరంతర కృషి వారికొక ప్రత్యేక గుర్తింపు తెచ్చింది.

ఆయన మనస్తత్వానికి రాజకీయాలు కొంత దూరమే; అయినా వున్నత వ్యక్తిత్వం, నిజాయితీలు రాజకీయరంగంలో ఆయనకు ప్రత్యేక స్థానం కల్పించాయి. ఫలితంగా ఉప సభాపతి పదవి నిద్రలేపి మరీ వరించింది.

2012లో తిరుపతిలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల విజయానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమై తండ్రికి వారసులు అనిపించుకున్నారు. ఆయన ఉత్తమ వక్త. ఏ సభలో ప్రసంగించినా సందర్భానికి తగ్గట్టు చారిత్రక వివరాలతో సభా సభికుల్ని రంజింపచేయడం ఆయన ప్రత్యేకత.

సాహిత్యమన్నా, సాహితీపరులన్నా, సాంస్కృతిక సంస్థలన్నా బుద్ధప్రసాద్ గారికి ఎనలేని అభిమానం. పలు వేదికలపై ఆయనతో కలసి పాల్గొనటం నాకు దక్కిన అదృష్టం. సినిమాల గురించి వారికి ఏ సందేహం వచ్చినా నాకు ఫోను చేసి వివరాలు తెలుసుకోవడం ద్వారా నాకు ఆత్మీయులైనారు.

ఆ మహానుభావుడి షష్టిపూర్తి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్న శుభవేళ యీ నాలుగు మాటలు వ్రాసే అవకాశం నాకు దక్కినందుకు ఆనందిస్తున్నాను. మరిన్ని సేవలు రాష్ట్రానికి, ప్రజలకు, తెలుగు భాషకు అందించేందుకు ఆ పరాత్పరుడు వారికి సర్వశుభాలను అందించాలని కోరుకుంటున్నాను.

తండ్రిని మించిన తనయుడు

- డా. ముదిగొండ శివప్రసాద్

అవనిగడ్డ పోతుగడ్డ
తెలుగువారి ముద్దుబిడ్డ
మండలి వంశోన్నతుండు
తండ్రిని మించిన తనయుడు
తెలుగు వెలుగు చిందురేడు
భాషారక్షకుడు నేడు
లుంబినిలో శాంతి దూత
ఉప్పొంగెను తెలుగు మాత
ఆఱు పదుల యువకునికిదె
ఆశీరక్షతల కవిత

శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారు విద్యాశాఖామాత్యులుగా ఉండగా అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుభాష ఎంతో అభివృద్ధి చెందింది. వారు, శ్రీ జలగం వెంగళరావుగారు కలిసి ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించిన తీరు ఆనాడు అందరినీ అబ్బురపరచింది. ఆనాటి మధురస్మృతులు నా కింకా కళ్ళ ముందు మెదలుతున్నాయి. "ఆత్మా పై పుత్ర నామాసి" అని సంస్కృతంలో ఒక సూక్తి ఉంది. అంటే తండ్రి తన తీరని - మిగిలిపోయిన కోరికలను తన పుత్రుని ద్వారా తీర్చుకుంటాడు అని అంటారు. ఇవాళ తెలుగు భాష దానిరక్షణ పేరు చెప్పగానే మొదట గుర్తుకువచ్చేది మండలి బుద్ధప్రసాద్ గారి పేరు. వారి రాజకీయ జీవితం మచ్చలేనిది. గాంధీ యుగం ముగిసిందని అనుకుంటున్న తరుణంలో ఖద్దరు కట్టిన గాంధేయవాదిగా అవనిగడ్డలో గాంధీ నిలయంలో తండ్రి గారి వలెనే అరచేతి చొక్కాతో అటు ఇటు తిరుగుతున్న మండలి గాంధీ ప్రసాదును చూడటం మనకు ముచ్చట అనిపిస్తుంది. తెలుగుభాష మీద నేడు అనేక వైపుల దాడి జరుగుతున్నది. తెలుగు భాష తన అస్తిత్వాన్ని కోల్పోతుందా! అనే భయం పట్టుకుంటున్న సమయంలో తెలుగుతల్లి ముద్దుబిడ్డగా బుద్ధప్రసాద్ శాంతి దూతగా మనకు అందిస్తున్న సహాయం ఊరట కల్గిస్తున్నది.

షష్టిపూర్తి అంటే నిజానికి ఆయన సగం దారిలో ఉన్నట్లే లెక్క. అంటే రెండవ అరవై ప్రారంభమయింది.

మన కోసం, మనభాష కోసం వారికి పరమశివుడు పరిపూర్ణ ఆయురారోగ్యాలు అందజేయాలని కోరుకుంటున్నాను.

'త్ర్యంబకం యజామహే
సుగంధిమ్ పుష్టి వర్ధనం
ఊర్వారుకమివ బంధనాత్
మృత్యోర్ముక్షీయమామృతాత్' (యజుర్వేదము)

చిన్మయానంద సేవానిరతులు

- కోకా విమలకుమారి

"జగమెరిగిన బ్రాహ్మణునికి జంధ్యమేల" అన్నట్లు నిస్వార్థ, నిర్మల హృదయులు, నీతి నిజాయితీలకు నెలవైనట్టి రాజకీయ నాయకులు, మన మాతృభాషోద్యమ నాయకులు, తెలుగు భాషా సంస్కృతీ సంప్రదాయాలకు సారథి మన మండలి బుద్ధప్రసాద్, వారితో నా పరిచయం దాదాపు ఇరవై సంవత్సరాలు.

బుద్ధప్రసాద్ గారి తండ్రిగారు గాంధేయవాది, ఆదర్శమూర్తి మండలి వెంకట కృష్ణారావుగారు. అప్పట్లో దివి తాలూకాలోని ఇరిగేషన్ డిపార్టుమెంటులో వృత్తి నిర్వహణ గావించిన మా నాన్నగారు ఆదిని సుబ్బారావుగారికి కృష్ణారావు గారు సుపరిచితులు. నా జన్మస్థలం కూడా దివి తాలూకాలోని 'పులిగడ్డ' ఆనాటి వెంకట కృష్ణారావుగారు కుటుంబంతో సహా నిర్వహించిన రాజకీయ, ప్రజా, సాంఘిక సేవలు ప్రశంసనీయాలు.

మండలి బుద్ధప్రసాద్ గారు సహృదయులు, సౌమ్యమూర్తి, సహనశీలి. భాషా సాహిత్య సాంస్కృతిక సేవాతత్పరులు. రాజకీయాలలో చేరాక ఎంతోమంది నాయకులు పేరు ప్రఖ్యాతులు పొందాలని ఆశిస్తారు. పేరు ప్రఖ్యాతులనేవి మనం ఆశపడితే వచ్చేవి కావు. ప్రజాసేవలో తరించాలి, ప్రజల మనసు దోచుకొని, ప్రజాదరణ పొందినప్పుడే అసలైన రాజకీయ నాయకులవుతారు. మన బుద్ధప్రసాద్‌గారు ఆ కోవకు చెందినవారు. ప్రజాదరణ పొందినటువంటి ప్రజల మనిషి వారు. మితభాషి అయినప్పటికి వారి మేధస్సంపద ఎనలేనిది. అటు రాజకీయ పరిపాలనా రంగంలో పటిష్ఠమైన, న్యాయబద్ధమైన పరిపాలననందిస్తూ, ఇటు తెలుగు భాషా సాహిత్య సాంస్కృతిక సేవలో తరిస్తూ ప్రజలకు, పాలకులకు కూడా న్యాయం చేకూర్చే విధంగా ప్రగతి పథంలో పయనిస్తున్నారు.

మాన్య మహోదయులు మండలి వెంకట కృష్ణారావు గారు రాజకీయ రంగంలో ప్రతిష్ఠాత్మకమైన సేవలందించి అందరి మన్ననలందుటే గాక వరద ముంపు సమయంలో వరద బాధితుల నాదుకొనుట, కరువు కాటకాలలో కొట్టుమిట్టాడుతున్న పేదల పాలిటి పెన్నిధియై ప్రజాదరణలో తరించిన ధన్యజీవి. వారి గృహమే ఒక సేవాకేంద్రం. ఆ తండ్రిగారి బాటలో పయనిస్తూ వారి రాజకీయ, సామాజిక సేవా వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న పుణ్యచరితులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు. బుద్ధప్రసాద్ గారి శ్రీమతి, వారి సంతానం కూడా సౌమ్యులు. సత్యగుణం కలవారు. అందరితో ఆత్మీయంగా ఉంటారు. వీరు గాంధేయవాది. కనుకనే తండ్రిగారివలే నాటినుండి నేటివరకు ఖద్దరు వస్త్రాలనే ధరించడం వారికెంతో ఇష్టం.

కృష్ణానదిపై పులిగడ్డ వారధి నిర్మాణంలోను, జలయజ్ఞంలోను తమ వంతు సేవలందించిన కృషీవలురు వీరు. విజయవాడలో 2,3, సార్లు కృష్ణాజిల్లా రచయితల సంఘం తరపున ప్రపంచ రచయితల మహాసభలకు సారథ్యం వహించి ఘనంగా నిర్వహించిన ఘనాపాటి మన బుద్ధప్రసాద్‌గారు. తండ్రిగారి నుండి

వారసత్వ ఆస్తిగా స్వీకరించిన ఆస్తి 'గాంధీక్షేత్రం'. ఈ క్షేత్రంలో భాషా సాహిత్య, సామాజిక, రాజకీయ సెమినార్లెన్నో నిర్వహించారు. "గాంధీ క్షేత్రం" మాసపత్రిక ఎంతో విలువైన శీర్షికలతో పాఠక హృదయాలనాకట్టుకొనేది.

బుద్ధప్రసాద్‌గారు ఎన్ని కష్టాలెదురైనా వారు నమ్మిన సిద్ధాంతాల బాటలో నడిచి సఫలీకృతులయ్యేవారు. తెలుగు భాషకు ప్రాచీనహోదా కొరకు పోరాడి సఫలీకృతులైన భాషోద్యమ సారథులు వీరు. సాధారణ కార్యకర్త నుండి మంత్రి పదవి, ఉపసభాపతి పదవులు చేపట్టి ప్రజాదరణ పొందుటే గాక అధిష్ఠానం నుండి కూడా శెభాష్ అనిపించుకొన్న నిరాడంబరులు. 'ఎంత ఎత్తు ఎదిగినా ఒదిగి ఉండే మనస్తత్వం' కలిగిన మహనీయులు మండలి బుద్ధప్రసాద్‌గారు.

"ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీతల్లి భూమి భారతిని" అన్నట్లు, ఎన్ని పదవులు నిర్వహించినా ఎంత అవిశ్రాంతంగా ఉన్నప్పటికీ తమ ఊరు అవనిగడ్డను అక్కడి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలిసికొనుట వారికి పరిపాటి. కూచిపూడి నాట్యాన్ని ప్రోత్సహించు వీరు కేవలం భాషా సాహిత్యాభిమానులే గాక సాహితీవేత్తగా అనేక గ్రంథ రచనలు కూడా గావించారు. వీరి తెలుగు భాషా వ్యాప్తి, సాహితీ కౌశలం ఒక ఆంధ్రప్రదేశ్‌లోనే గాక విదేశాలకు సహితం విస్తరించిందంటే వీరి యొక్క భాషా సాహిత్య సాంస్కృతిక సేవలెంతటి ఔన్నత్యాన్ని సంతరించుకున్నాయో వారితో పరిచయమున్న వారందరికీ విదితమే. వీరు దూరదర్శన్ ద్వారా దివిసీమలోని చారిత్రక, పౌరాణిక దేవాలయాలను డాక్యుమెంటరీ ఫిల్ము తీయించి కృష్ణా పుష్కరాల సమయంలో ప్రదర్శింపజేశారు.

"బాగున్నారామ్మా" అంటూ నన్ను నోరారా పలుకరించే చిరుదరహాస వదనులు, నిరాడంబరులు శ్రీ మండలి బుద్ధప్రాద్ గారి షష్టిపూర్తి సందర్భంగా భగవంతుడు వారికి ఆయురారోగ్య ఐశ్వర్యములను ప్రసాదించాలని ఆశిస్తూ...



అమెరికాలో ప్రసిద్ధ చిత్రకారుడు 'పద్మశ్రీ' ఎస్వీ రామారావుతో

మనసున్న రాజకీయనాయకుడు

- డాక్టర్ వెన్నిసెట్టి సింగారావు

ఎప్పుడో ఆరేడు సంవత్సరాల క్రితం సంగతి. తెలుగు భాషోద్యమ సమాఖ్య పక్షాన ప్రభుత్వ భాషావిధానానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న రోజులవి. ప్రభుత్వం తెలుగుభాషా పునర్వికాసానికి తీసుకోవల్సిన చర్యల గురించి చర్చించడానికి గుంటూరు పట్టణంలో ఒక సదస్సును నిర్వహించాం. భాషను గురించి సరైన అవగాహన ఉన్న రాజకీయ నాయకుడుగా పేరు తెచ్చుకొన్న శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారిని ఆ సదస్సులో మాట్లాడవలసిందిగా ఆహ్వానించాం.

సదస్సు ఉదయమే ప్రారంభమయింది. కోస్తా, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల నుంచి 140 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. వివిధ విషయాల గురించి చర్చించారు. బుద్ధప్రసాద్ గారు రావలసిన సమయమయింది. రాలేదు. సమయం మించి పోయింది. రాలేదు. అధికార పక్షంలో ఉండి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించే సభకు రావడం ఇష్టం లేక రాలేదు అనుకుంటున్నాం. మా ఆలోచనలకు భిన్నంగా బుద్ధప్రసాద్‌గారి కారు సదస్సు ప్రాంతానికి వచ్చింది. ఆ రోజు ఆయన భాషాభివృద్ధికి చేసిన సూచనలు, చేయవలసిన పనుల గురించి చెప్పిన మాటలు ఇప్పటికీ గుర్తున్నాయి. అధికార పక్షంలో ఉండి ప్రభుత్వానికి వ్యతిరేకమైన సదస్సుకు రావడం, అందులో ప్రభుత్వ భాషా విధానాన్ని విమర్శించడం గమనిస్తే, ఆయనకు భాష పట్ల గల అభిమానం ఎంతటి గొప్పదో అర్థమయింది.

పదవుల మీద, అధికారం మీద వ్యామోహం తప్ప, మాతృభాషపట్ల మమకారం కలిగిన రాజకీయ నాయకులు అరుదుగా ఉంటారు. అలాంటి వారిలో మండలి వెంకట కృష్ణారావుగారు ముందుగా ఎన్నదగిన వ్యక్తి. ఆయన సారథ్యంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు దిగ్విజయంగా జరిగాయి. తండ్రి నుంచి భాషాసాహిత్య సాంస్కృతిక వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న బుద్ధప్రసాద్ గారు రాజకీయాన్ని, భాషాభిమానాన్ని రెండు కళ్ళుగా చేసుకున్నారు. ఆయనకూడా ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించి శభాష్ అనిపించుకున్నారు. భాషాసాంస్కృతిక విషయాల్లో సంపూర్ణమైన అవగాహన ఉన్న నేటితరం ఏకైక నాయకుడు బుద్ధప్రసాద్ గారు.

రచయితలకు, కవులకు బుద్ధప్రసాద్ గారు పరమ ఆప్తులు. ఆయన ఆవిష్కరించినన్ని గ్రంథాలు వేరెవరూ ఆవిష్కరించలేదని చెప్పడం పచ్చినిజం. ఆయన సమయం చెప్పే వరకు ఆవిష్కరణలు ఆపుకున్న ప్రముఖులు నాకు తెలిసి పదుల సంఖ్యలోనే ఉన్నారు.

సహజంగా రాజకీయ నాయకులు సభలకు ఆలస్యంగా వస్తారు. సభలో తన పని ముగించుకొని, వేరొక చోట ఉపన్యాసం ఉందంటూ వెళ్ళిపోతారు. బుద్ధప్రసాద్ గారు సమావేశానికి వచ్చిన తర్వాత, సమావేశం ముగిసే వరకు అలానే ఉంటారు. సమావేశం ఏ విషయాన్ని గురించో దానిమీద లోతుగా విశ్లేషిస్తూ

ఉపన్యసిస్తారు. ఊకదంపుడు ఉపన్యాసాలకు దూరంగా, వాస్తవం ప్రతిబింబించే విధంగా ఉపన్యసించడం ఆయన నైజం.

తెలుగు ప్రాచీన భాషగా గుర్తింపు పొందడానికి ఆయన చేసిన కృషి తెలుగు భాషాభిమానులందరికీ తెలిసిన విషయమే. అంతర్జాలంలో తెలుగును ప్రచారం చేయడానికి, ఇతర రాష్ట్రాలలో, ఇతర దేశాలలో ఉన్న ప్రవాసాంధ్రుల భాషా సమస్యలు తీర్చడానికి ప్రయత్నించే ఏకైక వ్యక్తి బుద్ధప్రసాద్ గారే.

సౌజన్యం మూర్తీభవించిన బుద్ధప్రసాద్ గారికి షష్టిపూర్తి మహోత్సవం నిర్వహించడం – తెలుగు భాషకు జరిగే పండుగగా నేను భావిస్తున్నాను. భాషా సమస్యలు పరిష్కరించగలిగే అధికారం వారికి అందాలని, వారి హయాంలోనే తెలుగు వెలుగు దశదిశలా వ్యాపించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.



యాత్రాకృతిః తత్రగుణాః

- డా. సిహెచ్. బాబా వలిరావు

సురుచిరాకృతి సుగుణభరితం అనే అర్థం గల ఈ ఆభాణకం ప్రాయికమే అయినా, అధికశాతం అక్షరసత్యం. ఎక్కడో యిందుకు అపవాదం ఉండకపోవదు. అంటే సుందరాకృతి కూడా అప్పుడప్పుడూ అసుందర గుణయుక్తం అవుతుంది. అంతగా అందంలేని వారిలో గూడా సుగుణాలు కుప్పతెప్పలు కోకొల్లలు. అది వేరే విషయం. ఇక్కడ అది అప్రస్తుతం. ప్రస్తుతం రూపవంతుల విషయం. సురూపం ఇట్టే ఆకర్షిస్తుంది. నమస్కరింపజేస్తుంది. అందుకే కొద్ది లోపాలున్నవారు కూడా లోపరహితంగా బలవంతంగానైనా మారాల్సిన అవసరం ఉంది.

నాకు తెలిసి మండలి వారు అటు దివి తాలూకాలోను, ఇటు రేపల్లె తాలూకా లోను స్ఫురద్రూపులు. బంగారం, దబ్బపండు, పచ్చి పసుపు, దొండపండు వారి దేహచ్ఛాయను చూచి సిగ్గుపడతాయి. వారందరూ ఆజానుబాహులు, చంద్ర సమానముఖులు. వీరి పూర్వీకులు ఇంకా కడుపొడగరులు. బలిష్ఠులు కూడా. వీరిని చూస్తే వీరి పూర్వీకులు ఆనగొంది నుంచి వచ్చిన పాళియగండ్రనే విషయం సత్యమే అనిపిస్తుంది. కృష్ణారావుగారు వారి తమ్ముడు జనార్దనరావుగారు, మారేపల్లె రాఘవయ్యగారు, వారి పుత్రులు సుబ్రహ్మణ్యంగారు అతిక్రాంత మన్మథ నలకూబరులు. బుద్ధప్రసాద్‌గారి విషయం వేరే చెప్ప పనిలేదు.

సుందరాకృతి. సుగుణాలరాశి.

గాంధేయవాదం వీరికి తాత వెంకట రామయ్య గారి నుండి, తండ్రి కృష్ణారావుగారి నుండి ఉగ్గుబాలతో సంక్రమించింది. దాన్ని వృద్ధిచేసుకుంటూ రాణిస్తున్నారు. అది కుదురుగా క్రమశిక్షణ, నీతినియమాలు, సేవాభావం, నిస్వార్థరాజకీయం, భాషాభిమానం, సాహితీ ప్రియత్వం, మానవతావాదం, సజ్జనసంగతి ఎదిగాయి. కృష్ణారావుగారు ఎంతటి భవిష్యద్దర్శనం చేసి 'బుద్ధప్రసాద్' అని పేరు పెట్టారో అది అంతటి నిత్యసత్యం అవుతున్నది. తల్లిదండ్రులు పెట్టిన పేరును సార్థకం చేసుకోవడం అంత తేలిక కాదు. అదో గొప్ప విజ్ఞత. వీరి పూర్వీకులు 'గ్రామపెద్దలు'. వారి తాతగారు ఉపాధ్యాయుడుగా పదవీవిరమణ చేసిన తర్వాత భావదేవరపల్లి గ్రామానికి మూడుసార్లు ప్రెసిడెంట్‌గా ఎన్నికై అపరిమితమైన సేవ చేసి చిరస్మరణీయులైనారు. ఉపాధ్యాయుడుగా కూడా వారి కృషి అనన్యసామాన్యం. అందుకే చంద్ర రాజేశ్వరరావు వంటివారు వారి శిష్యులై రాణించారు. కృష్ణారావు గారు ఎం.ఎల్.ఏ.గా, ఎం.పి.గా, మంత్రిగా ఎంతగానో మన్ననలు పొందారు. అది పునాదిగా బుద్ధప్రసాద్‌గారు మూడు పర్యాయాలు ఎం.ఎల్.ఏగా గెలిచారు. గెలిచినా ఓడినా ఈయన ప్రజల మనిషి. బడుగు బలహీనుల ఆశాజ్యోతి.

కృష్ణారావు గారి తాతముత్తాతలు, తండ్రి వీరికి ఆస్తిపాస్తులు మిగల్చలేదు. దానధర్మాలకు, దైవకార్యాలకు వెచ్చించారు. దైవభక్తి, సేవాభావం, కీర్తి మిగిల్చారు. ఇప్పుడే కాదు ప్రారంభం నుండి కూడా

తెలుగునాట రాజకీయం అధిక ధనసాధ్యమే. ధనవంతులే రాజకీయాలు నడిపారు. అది పూర్తిగా లేని కృష్ణారావు గారు, బుద్ధప్రసాద్ గారు ప్రజాభిమానమే మూలధనంగా ఇంతకాలం నిలదొక్కుకు రాగలిగారు. ఎన్.టి.ఆర్. ప్రభంజనాన్ని ఎదుర్కొని కూడా గెలిచారు. ఒకసారి ఏకగ్రీవంగా గెలవడం విశేషం.

1977 నవంబరు తుఫానుకు, ఉప్పెనకు దివిసీమ పీనుగు పెంటలైన సమయంలో కృష్ణారావు గారి అకుంఠిత దీనజనసేవ, పునరావాస కల్పన నాన్యతోదర్శనీయం. ఇందులో యువకుడైన బుద్ధప్రసాద్‌గారి అండదండలు మరువరానివి. 'దీనజన సంక్షేమ సమితిని' స్థాపించి నిర్వహించారు. రాజకీయమే పెద్దవ్యాపారంగా మారిన ఈ రోజుల్లో కూడా ఈయన ఆ మసి అంటని మాణిక్యం. పులుగడిగిన ఆణిముత్యం. చిన్నప్పటి నుండి తండ్రిగారి వెంట ఉండి, వారితో కలిసి తిరిగి, ప్రజలనాడిని పసికట్టిన వ్యక్తి. అందుకే ఏ పదవిని చేపట్టినా, ఏ కార్యక్రమాన్ని నిర్వహించినా ఆ దక్షత, ఆ సాఫల్యం కన్పిస్తాయి.

కృష్ణాజిల్లా కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడుగా, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్యశాఖ మంత్రిగా, అధికార భాషా సంఘం అధ్యక్షులుగా, నేడు ఆంధ్రప్రదేశ్ శాసన సభా ఉపసభాపతిగా, తెలుగు భాషోద్యమ సమాఖ్య వ్యవస్థాపక సారథిగా, కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షులుగా వీరి కృషి, సేవ అపరిమితం. అనుపమం.

అన్నింటిని మించి వీరు కవిపండిత పక్షపాతులు. లలితకళాభిమానులు. మన నాగరికతా సంస్కృతులకు సాకారం. ఆధునికాంధ్రభోజులు. 'సర్వేపల్లిని', 'కట్టమంచిని', 'బెజవాడను', 'పి.వి.'ని తలపింపజేసే సాహితీప్రియంభావుక నాయకులు. అందుకే వీరి ధర్మపత్ని విజయలక్ష్మి గారికి ఎందరో సవతులు ఏర్పడ్డారు. పుస్తకప్రియులు, పాఠకోత్తములు, గ్రంథకర్తలు, చతురవచోవిలాసులు. 'మనసు మెత్తన – మాట మధురం'.

విరోధులు కూడా మెచ్చే వ్యక్తిత్వం వీరిది. ఇటీవలే ఆంధ్రజ్యోతి ఎ.బి.ఎన్‌లో వేమూరి రాధాకృష్ణగారు నిర్వహించిన 'ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే'లో వీరు నిజమే చెప్తుతున్నారని 92 శాతం ప్రజలు వక్కాణించారంటే ఈయన ఎంతటి సత్యసంధులో తెలుస్తున్నది.

శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువు ప్రాంగణంలో శ్రీకృష్ణదేవరాయలవారి విగ్రహాన్ని, ఆంధ్రనాయక శతకకర్త కాసుల పురుషోత్తమ కవి విగ్రహాన్ని ప్రతిష్ఠింపచేయడం, రాయలవారి జయంతిని ప్రతి సంవత్సరం నిర్వహించడం వారికే చెల్లుతున్నది.

మొదటి నుంచి వారు, వారి తండ్రిగారు కులమతాలకతీతంగా పనిచేశారు. సమసమాజాన్ని ఆకాంక్షించారు. కావుననే కుమార్తె అవనిజకు కులాంతర వివాహాన్ని సంతోషంగా, ఘనంగా నిర్వహించారు.

ఇట్టి ఈ సర్వోన్నతులు షష్ట్యబ్దిపూర్తి చెందుటే కాక శతవసంతాలు ఆయురారోగ్యాలతో, సకలసంపదలతో, అత్యుత్తమ ప్రజాసేవలో కొనసాగాలని ఆ శ్రీనివాసుణ్ణి మనసారా ప్రార్థిస్తున్నాను.

బాలానందంతో అనుబంధం

- డా. గంటి స్వర్ణబాల

ఆంధ్రప్రదేశ్ ఉపసభాపతి గౌ॥ శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు అరవై వసంతాలు పూర్తి చేసుకుంటున్న ఈ తరుణంలో, బుద్ధప్రసాద్ గారు తిరిగి బాల్యంలోకి మళ్ళీ అడుగిడుతున్నారు. మరి ఇపుడు తలుచు కోవాల్సినది ఆయన జీవితంలోని మధురంగా, స్ఫూర్తిదాయకంగా గడిచిన బాల్యంలోని తలపులే కదా!!

మానసిక శాస్త్రం, పిల్లలకి తరగతిలోని పాఠ్యాంశాలు మాతృభాషలో చక్కగా, తేలికగా అర్థం అవుతాయి అంటుంది. అలా శిక్షణ పొందిన వారు చదువులోనూ, తెలివితేటల్లోనూ రాణిస్తారని తెలుసుకున్న ఆయన, తెలుగులో ఎన్నో రచనలు చేస్తూ భాషా సంస్కృతులకు ఎనలేని సేవ చేయటం జగమెరిగిన సత్యమే!!

బుద్ధప్రసాద్ గారు రాజకీయవేత్తగా, సాహితీవేత్తగా సరిసమానంగా తూగుతున్నా – (Multi-tasking Modern Political man) రాజకీయవేత్తగా ఉంటూ రచనా వ్యాసంగం చేయటం, నిష్కళంకంగా జిల్లాభివృద్ధి; ప్రవాసాంధ్రుల భాషాసేవ, అపర గాంధేయ వాదిగా వన్నెకెక్కటం లాంటి వన్నింటినీ ఒకే దీక్షతో చేయటం మాటలా!! పాలనాపరంగానూ, విద్యాపరంగానూ కూడా చైతన్యం ప్రేరేపించే విధంగా జవసత్వాలు పుంజుకునేలా చేస్తూ, దృఢ నిర్ణయాలను సానుకూలంగా, విజయవంతంగా తీర్చిదిద్దటం ఒక కళా నైపుణ్యం.

ఇదంతా రావాలంటే మరి అలనాటి బాలానందం అన్నయ్యగారు శ్రీ న్యాయపతి రాఘవరావు, అక్కయ్య గారు శ్రీమతి న్యాయపతి కామేశ్వరి గార్లు బుద్ధప్రసాద్ గారిని గుర్తించి, అందించిన చిన్ననాటి సదవకాశాలే కదా అనటంలో అతిశయోక్తి లేదేమో!! ఆయన మాటల్లోనే చాలాసార్లు ఇలా చెప్పటం విన్నాము కూడా!! బాలల సమగ్ర పత్రిక 'బాల' మాసపత్రిక సంపాదక వర్గంలో స్థానం కల్పించడమే కాకుండా, దాశరథిగారి బాల్య విశేషాలతో కూడిన 'ఇష్టాగోష్టి' చేయటంతో ఆయన ప్రతిభకు గుర్తింపు లభించిందనే చెప్పాలి. మరి ఆ ఛాయలేగా, ఈనాడు మనందరం ఆస్వాదిస్తున్నది!!

అలనాటి (1973) నాటి మాట. శ్రీ జలగం వెంగళరావు గారి మంత్రి వర్గంలో విద్యా, సాంస్కృతిక శాఖామాత్యులుగా ఉన్న మండలి వెంకట కృష్ణారావుగారు వేయించిన తప్పటడుగులే కదా, ఈనాడు అదే రంగంలో ఆయన్ని పుణికి పుచ్చుకుని, తండ్రి అడుగు జాడల్లో నడిచారు. ఎందరికి కలుగుతుందీ అవకాశం!! అక్టోబర్, 1974లో ఆంధ్రప్రదేశ్ బాలల మహాసభలు నారాయణగూడలోని కేశవ మెమోరియల్ హైస్కూల్‌లో జరిగాయి.

అపుడు బుద్ధప్రసాద్ గారు అన్నయ్య, అక్కయ్య గార్ల స్ఫూర్తితో అవనిగడ్డలో, దివిసీమ బాలానంద సంఘానికి అధ్యక్షుడిగా ఉంటూ, 'జబ్బు కుదిరింది' నాటిక ప్రదర్శింప జేయటం, ద్వితీయ బహుమతి సాధించుకోవటం జరిగింది. అప్పటి ముఖ్యమంత్రి గౌ॥ శ్రీ జలగం వెంగళరావుగారు స్వయానా రావటం, కృష్ణారావుగారు, పరమహంసగారు లాంటి వారంతా బాలానందానికి రావటం, జరుగుతున్న ఏర్పాట్లు పర్యవేక్షించటం, తల్లిదండ్రుల సంఘం వాళ్ళు తయారు చేసి, వడ్డించిన పచ్చళ్ళు (గోంగూర లాంటివి) ఆస్వాదించటం ఎంతో ఆత్మీయంగా, అబ్బురంగా జరిగిపోయాయి.

అంతటి మేధావులు, అంత ఉన్నత ప్రభుత్వ పదవులలో ఉన్నవారు, నిరాడంబరంగా ఉంటూ, గడిపిన జీవితాన్ని అతి దగ్గరగా చూస్తూ పెరిగిన బుద్ధప్రసాద్ గారు కూడా అదే పంథాలో తనని తాను దిద్దుకోవటం జరిగిపోయింది. తండ్రిగారు, రేడియో అన్నయ్యగారు – అక్కయ్యగారు లాంటి వారి నుంచి పుస్తకాలు చదవటం, సత్ సంప్రదాయాన్ని పుణికి పుచ్చుకోవటం అలవడ్డాయి. ఆయన తల్లిగారు కూడ రేడియో అక్కయ్యగారితో కలిసిపోయి, అంతా ఒకే కుటుంబంగా ఉంటూ వచ్చారు.

1977లో దివిసీమ ఉప్పెన వచ్చినప్పుడు ఈ కుటుంబం అంతా ఎంతో సేవ చేసారు. ధన సాయంతో సహా. వీరితో కలిసి బాలానందం నుంచి కూడ ఎంతో మంది బాలలూ, వారి తల్లిదండ్రులూ, బాలానందం కార్యకర్తలూ కూడా అందులో పాల్గొన్నారు.

పుస్తకాలు చదవటం, విజ్ఞానార్జన, కవులంటే గౌరవం, భాషాభిమానం, కళాభిమానం, ఆదరణ వారిని గౌరవించటం, సత్కరించటం లాంటి వన్నీ చూస్తుంటే ఆయనలో ఓ యువ శ్రీకృష్ణదేవరాయల వారు కనిపిస్తారు!!

రేడియో అన్నయ్యగారి శత జయంతి ఉత్సవాల సందర్భంలో 'ప్రత్యేక తపాలా కవరు'ను తపాలా శాఖ వారు జారీ చేయటానికి కావలసిన అనుమతి తెప్పించటంలో ఎంతో దోహదపడ్డారాయన. బుద్ధప్రసాద్ గారు, రేడియో అన్నయ్యగారి జ్ఞాపిక – వెండి నాణెం ఆవిష్కరించారు. ఇంతే కాక, బాల సాహిత్యవేత్త శ్రీ వెలగా వెంకటప్పయ్య గారిని రేడియో అన్నయ్యగారి జీవిత చరిత్ర రచన చేయించటం, దానిని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అలనాటి ఉపలకుపతి ఆచార్య శ్రీ జి.వి. సుబ్రహ్మణ్యంగారితో చర్చించి విశ్వవిద్యాలయం ద్వారా ప్రచురింప జేసి శతజయంతి సందర్భంగా విడుదల చేయించారు. ఇవన్నీ బుద్ధప్రసాద్ గారికి రేడియో అన్నయ్య – అక్కయ్యగార్ల మీద ఆయనకున్న గౌరవం, బాలానందంతో ఆయనకున్న అనుబంధాన్ని చాటుకున్నాయి.

ఆయనలో నిర్వహణా సామర్థ్యాలు, నాయకత్వ లక్షణాలు మొగ్గతొడుగుతున్న సమయమది. రేడియో అన్నయ్య–అక్కయ్యగార్ల ప్రోత్సాహంతో దివిసీమ బాలానందంలో ఎన్నో బాలల ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించటం, జిల్లా స్థాయిలో నాటిక పోటీలూ, రాష్ట్ర స్థాయిలో చిత్ర కళా పోటీలు నిర్వహించటం, బాల సాహిత్య ప్రచురణలు చేపట్టి 'గోరంతదీపం', గేయ సంపుటి ప్రచురించటం, 'ఆంధ్రకేసరి' నృత్య రూపకం ప్రదర్శించటం లాంటి కార్యక్రమాలెన్నో తలపెట్టి, సాధించారు.

ఆయన ప్రేరణతో వేదికలెక్కి బిడియం పోగొట్టుకుని, చక్కగా మాట్లాడటం, వ్యాసాలు, చిట్టి గేయాలు వ్రాయటం, ప్రచురింప జేయటం అంతా అన్నయ్య–అక్కయ్య గార్ల చలవ!! ప్రోత్సాహమే!!

ఇవన్నీ కూడా ఆయన 'వ్యక్తిత్వ వికాసానికి' తోడ్పడ్డాయని అంటారు బుద్ధప్రసాద్ గారు!! అవన్నీ ఆయన్ని ఈనాడు ఉన్నత స్థాయిలో, కల్తీ లేకుండా, నిలబెట్టగలిగాయి అని అతి నిరాడంబరంగా కూడా చెప్పుకుంటారు!!

చిన్ననాటి జయాలే పెద్దయ్యాక విజయాలై ఆదర్శ భావాలతో, ఉన్నతంగా ఎదగటానికీ, ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండే గుణాన్ని అలవరచుకోటానికి తోడ్పడతాయంటారాయన!!

బుద్ధప్రసాద్ గారి రెండవ బాల్యం ఆయురారోగ్య, ఐశ్వర్యాభివృద్ధి కలిగి సమాజ, రాష్ట్ర, దేశ సేవ చేస్తూనే ఉండాలని ఆశిస్తూ.....

తెలుగు తేజోవికాసం

- సారిపల్లి కొండలరావు

తెలుగువాడుగా పుట్టాలన్నా, తెలుగుభాషాసాహిత్యాలు నేర్వాలన్నా పూర్వజన్మలో పుణ్యం చేసుకుని ఉండాలి –అని ఒక అరవ మహాపండితుడు మొగమాటం లేకుండా చెప్పాడని సాహితీవేత్తలు చెబుతుంటే విని పులకించాను. ఎందుకంటే – నేను కూడా పూర్వజన్మలో పుణ్యం చేయబట్టే ఈ జన్మలో తెలుగుజాతిలో పుట్టానని ఆ మహాపండితుని ప్రబోధవాక్యాల వల్ల గ్రహించాను. ఇదిలా ఉంటే ఇక తెలుగుభాషా సాహిత్యాల నుద్ధరించటానికి కృషి చేసేవాళ్ళు ఎంతటి పుణ్యాత్ములో, మేధావులూహించుకోవచ్చు. అలాంటి మహాపుణ్యాత్ములలో కీ.శే. శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారు అగ్రగణ్యులు. తెలుగుభాషాసాహిత్యాల కోసం శ్రీ వెంకట కృష్ణారావు గారు చేసిన కృషి ఆ తరం వారికి ప్రత్యక్షంగాను, ఈ తరం వారికి చరిత్ర ద్వారాను స్పష్టంగా తెలుస్తున్న విషయం.

గాంధేయ మార్గప్రియులయిన శ్రీ వెంకట కష్ణారావుగారి జ్యేష్ఠ పుత్రునిగా ది. 26–5–1956న జన్మించిన శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు కూడా అదే మార్గంలో పయనించటం తెలుగువారి అదృష్టం. విశేషించి బుద్ధప్రసాద్ గారు కూడా తెలుగు భాషా సాహిత్యాల కోసం వివిధ సభలను నిర్వహిస్తూ, వివిధ గ్రంథకారులను ప్రోత్సహిస్తూ నిరంతరం కృషి చేయటం తెలుగుభాష యొక్క మహిమకు నిదర్శనం. గతంలో తెలుగు భాషా సంఘాధ్యక్షులుగా తెలుగు భాషకు సేవచేయటమే కాక, స్వయంగా, 'మారిషస్‌లో తెలుగుతేజం', 'ప్రజలు–ప్రగతి', 'ఇంగ్లాండులో తెలుగు వైభవస్మృతులు' మొదలయిన పుస్తకాలు రచించి తెలుగు తేజోవికాసాన్ని ప్రపంచ స్థాయిలోని తెలుగువారికి తెలిసేలా చేశారు. ఇప్పటికీ ఎన్ని పనులలో ఉన్నా తెలుగు భాషా సభలలో తప్పనిసరిగా పాల్గొంటున్న వారి భాషాభిమానం తెలుగు వారందరికీ ఆదర్శప్రాయమనే చెప్పాలి. తెలుగు సంస్కృతి వికాసాన్ని గురించి చారిత్రికాధారాలతో సహా గంటలు గంటలు వారు ప్రసంగిస్తుంటే మహామహా పండితులు కూడా అమితాశ్చర్యంతో ఆలకించటం వీరి పరిశీలనా పాటవానికి నిదర్శనం. భాషా సాహితీవేత్తలు వీరి మార్గంలో పయనిస్తే తెలుగు తేజోవికాసం పదిరెట్లు పెరుగుతుందనటంలో అతిశయోక్తి లేదు.

ఇటువంటి మేధావి అయిన బుద్ధప్రసాద్ గారు రాజకీయరంగంలో అంచెలంచెలుగా ఎదిగి నేటికి నవ్యాంధ్రరాష్ట్రానికి ఉపసభాపతిగా బాధ్యతలు స్వీకరించటం ముదావహం. వీరి షష్టిపూర్తి వేడుకలకోసం బంధుమిత్రాభిమానులంతా గొప్పగా ఏర్పాట్లు చేయటం మహానందసంధాయకం. శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి ఆయురారోగ్యభాగ్యాలను సమృద్ధిగా ప్రసాదించి, నవ్యాంధ్రరాష్ట్రానికి నిరంతరం సేవ చేసే శక్తిని కూడా అనుగ్రహించాలని ఆ భగవంతుణ్ణి ఈ సందర్భంగా ప్రార్థిస్తున్నాను.

GREETINGS

- Dr. Arunkumar Kanti Mohanty

Shri Mandali Buddha Prasad, Hon'ble Deputy Speaker, Andhra Pradesh Legislative Assembly, is an excellent humanist, upright politician and charismatic people leader and dedicated to the up lift of the down trodden, destitute and neglected.

As an M.L.A., he is a man of service to the poor. He gets satisfaction only in serving the people than having a position in the society. He and his family are deeply involved in Public Service. He said "When you stand for the right cause, you will be appreciated even by your opponents". He is a non-controversial leader, who occupied a unique position in present contemporary politics.

As a Cabinet Minister, he initiated innovative schemes of 'Pashu Kranthi' and 'Mastya Kranthi' for the uplift of the farmers and fishermen community. He established an international standard Animal Husbandry Research Center at Pulivendula.

As a Compassionate man, he has earned a special place in the hearts of thousands of farmers, when 10,000 people lost their lives in 1977 cyclone and tidal wave. Day and night, he served the victims. At his request, AMG constructed hundreds of houses. AMG also built a shopping complex for the poor. During the Tsunami in 2005, we gave immediate help of rice, dhall, oil, soaps and nets etc and constructed many houses in Krishna Dist.

As Gandhian, they constructed an auditorium "Gandhi Kshetram" and under their leadership conducted several workshops for youth, in order to inculcate the Gandhian principles.

As a lover of Telugu language, literature, art and culture he travelled widely to several countries to propagate the Telugu culture, striving hard for National Integration and communal harmony.

As a Writer he authored number of books. He is friend of books. From his Pen many contemporary issues were published as articles in leading newspapers and magazines. He also has several publications to his credit.

We recollect his father late Shri Mandali Venkata Krishna Rao, Ex-Minister, Govt. of A.P. association and relationship with late Evg. Dr. S. John David, Founder, AMG who worked together for eradication of poverty among poor and needy. He and his father visited AMG many times and witnessed the projects and services of AMG.

On the occasion of Shri Mandali Buddha Prasad gari "SHASTHYABDIPURTHI" celebrations on 27th May 2016, we pray God to shower His manifold blessings upon him and his family and use him mightily in serving the poor and needy in the society in the days to come.

మా బుద్ధప్రసాదుకు ... మల్లెపూదండ!

- గంగాధర శాస్త్రి

శ్రీ మండలి బుద్ధప్రసాద్!

తెలుగుజాతికీ... తెలుగు భాషకూ పర్యాయపదం ఆ పేరు.

రామనామం ఎక్కడ వినబడితే ఆంజనేయుడక్కడున్నట్టు 'తెలుగు' పదం ఎక్కడ వినబడితే అక్కడ ప్రత్యక్షమయ్యే పేరు శ్రీ బుద్ధప్రసాద్!

ఆయన మా వాడు... అంటే మా ఊరి వాడు....

ఊరంతా చెప్పుకోతగినవాడు. ఆ పక్క ఊళ్ళన్నీ గొప్పగా చెప్పుకున్న వాడు.

ఆయన ఫోన్ రింగ్ టోన్ విన్నప్పుడల్లా తెలుగుతల్లి ఆయనకు మల్లెపూదండ వేస్తూనే ఉంటుంది – తన మీద తన బిడ్డకున్న బోలెడంత ప్రేమ చూసి!

పార్టీలకతీతమైన వాడు. కాబట్టే పదవిలో ఉన్నా లేకున్నా అదే వైభవం పొందుతున్నవాడు.

ఆయన మిత భాషి... స్మిత భాషి.... హిత భాషి! స్నేహశీలి!

రాజకీయాలలోనే ఉన్నా రాజకీయం చేయడం తెలియనివాడు!

రాజకీయాల్ని అడ్డం పెట్టుకుని ప్రజలకు సేవచేయడం మాత్రమే తెలిసినవాడు!

ఏ స్థాయికెదిగినా ... బస్సుల్లోనే ప్రయాణం చేసే నిగర్వి! నిరాడంబరుడు! అజాత శత్రువు!

మనతో వచ్చేవి మనం చేసే మంచి పనులే!

ఈ జీవిత రహస్యం తన తండ్రి నుంచి తెలుసుకుని ఆ మార్గంలో ప్రయాణిస్తూ, తండ్రికి మించిన తనయుడూ 'తెలుగు భాషకు ప్రాచీన హోదా' కోసం పరిప్లవించి, పరిశ్రమించి ఆ 'గౌరవం' దక్కించిన నిస్వార్థ భాషా ప్రేమికుడు శ్రీ బుద్ధప్రసాద్!

ఎం.ఎల్.ఏ.గా...

మంత్రివర్యుడిగా...

అధికారభాషా సంఘం అధ్యక్షుడిగా...

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతిగా...

గ్రంథ రచయితగా....

ప్రవాసాంధ్రుల సేవకుడుగా...

గాంధేయవాదిగా...

సామాజిక సేవాతత్పరుడిగా ...

ఒకటా....రెండా...

అసలు... ఈయనవల్ల 'నాకేమిట'ని ఆలోచంచక ప్రతి వ్యక్తికీ సేవద్వారా దగ్గరైన నిఖార్సయిన ప్రజా సేవకుడు – శ్రీ బుద్ధప్రసాద్!

ఇవ్వాళ నేను ఒక స్టేజికి రావడానికి ప్రధాన కారణం శ్రీ మండలి వేంకటకృష్ణారావు గారు. నన్ను గాయకుడిగా ప్రోత్సహిస్తూ 'గాంధీక్షేత్రం' స్టేజి ఎక్కించడమే! అంతటి హస్తవాసి బుద్ధప్రసాద్ మహాశయుడికీ ఉంది. కళాకారుల పాలిట ఈయనా శ్రీకృష్ణదేవరాయలే...!

దివంగత సినీమహాకవి వేటూరి సుందరరామ్మూర్తి గారితో 'దివిసీమ వైభవం' పైన 'దివిసీమ జాతీయ గీతం'లా ఒక గీతాన్ని రాయించి, దాన్ని నాతో స్వరబద్ధం చేయించి, పాడించి, రికార్డు చేయించి నాకు శాశ్వతమైన ఆనందాన్నివ్వడంతో పాటు జన్మనిచ్చిన దివిసీమకు కృతజ్ఞత చెప్పుకున్న 'దివిజాతి రత్నం' శ్రీ బుద్ధప్రసాద్! అది దివ్యసీమలాంటి దివిసీమపైన ఆయనకున్న అవ్యాజమైన ప్రేమ!

ఎదగడమంటే కనిపించిన చోటల్లా స్థలాలు కొనుక్కోవడం కాదు –

కనిపించిన ప్రతి వ్యక్తి హృదయంలోనూ చోటు సంపాదించుకోవడం....!

ఇందులో ఉన్న ఆనందం తెలిసిన వ్యక్తి శ్రీ బుద్ధప్రసాద్!

'మన వల్ల ప్రయోజనం పొందిన వాళ్ళ కళ్ళలో కనిపించే ఆనందం చూసి ఆనందించడమే నిజమైన ఆనందం' అంటాడు స్వామి వివేకానంద!

అలాంటి వివేకవంతమైన ఆనందాన్ని నిత్యం పొందే కర్మయోగి శ్రీ బుద్ధప్రసాద్!

సముద్రాన్ని కమండలంలో బంధించలేం! ఆదర్శంతమైన శ్రీ బుద్ధప్రసాద్ జీవితాన్ని రెండు పేజీల్లో బంధించలేం!

ఆయన గురించి ఎంత చెప్పినా అది కొంతే అవుతుంది.

నిరంతరం లోకం కోసం ఆలోచించే ఈ మహానుభావుడికి సంపద, విజయం, ఐశ్వర్యం, ఆరోగ్యం, సమస్తమూ ఇచ్చి – సప్తతి, సహస్రచంద్ర దర్శనాలతో పాటు... 'శతాధికాయుష్మాన్ భవ' అని పరమేశ్వరుడు ఆశీర్వదించుగాక!

షష్టిపూర్తి శుభాకాంక్షలతో....


శతమానం భవతి

- డి.వి. మోహనకృష్ణ

శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారు ప్రముఖ రాజనీతిజ్ఞులు, కవులు, కళాప్రియులు, కళాపోషకులు. వీరు కృష్ణాజిల్లా నాగాయలంకలో జన్మించి వారి తండ్రిగారి అడుగుజాడల్లో ఉత్తమ జీవితపథంలో నడుస్తున్నారు. వీరు జన్మించిన కృష్ణాజిల్లాలో నేను కూడా జన్మించటం నాకు చాలా సంతోషం. తెలుగు భాషాభివృద్ధికి వీరు ఆంధ్రప్రదేశ్‌లో కాక ప్రపంచవ్యాప్తంగా గణనీయమైన కృషి చేస్తున్నారు.

వారికి కళాకారులంటే ఎంతో అభిమానం. ఎందరో కళాకారుల్ని గుర్తించి వారి ప్రతిభను ప్రభుత్వానికి తెలియజేసి ప్రభుత్వపరంగా ఎంతో గుర్తింపు కలుగజేయటంలో వారి కృషి అభినందనీయం.

బుద్ధప్రసాద్ గారి షష్టిపూర్తి సందర్భంగా నా తరపున, కళాకారులందరి తరపున శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇంకా వారు శతవసంతాలు ఆయురారోగ్యాలతో ప్రభుత్వానికీ, కళాకారులకీ, అందరికీ ఎంతో సేవలు చేయగలరని, ఆ అవకాశం భగవంతుడు వారికి (ఇవ్వాలని) కల్పించాలని, ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, శ్రీ బుద్ధప్రసాద్ గారి షష్టిపూర్తి వేడుకలు నిర్వహిస్తున్న కిన్నెర ఆర్ట్స్ వారికి అభినందనలు తెలియజేస్తూ...



శ్రీ వెంపటి చినసత్యం, స్పీకర్ సురేష్‌రెడ్డి, శ్రీ వేదాంతం సత్యనారాయణ శర్మలతో...

ఆంధ్రజన 'మండలి'కి ఆశీస్సులు

- కర్నాటి లక్ష్మీనరసయ్య

చిన్నతనం నుంచి తెలుగుభాష, సంస్కృతి, చరిత్ర, కళలు, కవులు, కళాకారుల సాన్నిహిత్యంతో, ఆత్మీయతతో, అవగాహనతో 'ఇంతింతై వటుడింతయై' తెలుగుభాషా సంస్కృతుల పరిరక్షణ సైనికులకు సేనాపతిగా ఎదిగిన చిరంజీవి మండలి బుద్ధప్రసాద్‌కు అప్పుడే అరవైఏళ్లా? కాలం ఎంత వేగంగా పరిగెత్తుతోంది?

1974లో గాంధీక్షేత్రంలో జరిగిన కృష్ణా జిల్లా రచయితల సంఘం తొలి సమావేశంలో ప్రధాన కార్యకర్తగా మండలి వెంకట కృష్ణారావుగారితో కలిసి పాల్గొన్న యువ బుద్ధప్రసాద్‌గానే ఇప్పటికీ నా కళ్ళకు కనిపిస్తున్నాడు. ఆస్థాన కవి దాశరథి, నేను తెలంగాణా పోరాటంలో సైనికులం. మేము ఇద్దరం ఆ సదస్సులో పాల్గొన్నాం. సభకు నేను అధ్యక్షుణ్ణి. దాశరథి ముఖ్యఅతిథి... సభా ప్రారంభకులు 'మండలి' వారు. ముక్కామల నాగభూషణం గారు, మైత్రేయ ఆ సభలో పాల్గొన్నారు. జానపద కళలు, తెలుగునాటక వికాసంపై ఆనాడు నేను చేసిన సోదాహరణ ప్రసంగం ఇప్పటికీ తన చెవుల్లో మారుమ్రోగుతూ ఉంటుందని నేను ఎక్కడ కనపడినా గుర్తు చేసే బుద్ధప్రసాద్ గారి జ్ఞాపకశక్తి, కళాకారులు, నటులపై, పెద్దలపై ఆయనకున్న గౌరవం తలుచుకుంటే ఎవరికైనా ఒళ్లు పులకరిస్తుంది. ఎవరికి వారు ఆయన నావాడే అనుకునేటట్లు జ్ఞాపకం పెట్టుకుని పలకరించే గొప్ప వ్యక్తిత్వం ఆయనది.

శ్రీ మండలి వెంకట కృష్ణారావు గాంధీ క్షేత్రంలో మొక్కలు నాటే కార్యక్రమంలో మొట్టమొదటి మొక్క నాచేత నాటించారు. శ్రీమతి ప్రభావతమ్మగారు మాకు స్వయంగా వడ్డించిన భోజనం ఇప్పటికీ నాకు గుర్తే. మాకు ఖద్దరు చుట్టరికమూ ఉంది. వృద్ధులు చిరంజీవులను పొగడకూడదు. తొంభై ఒక్క సంవత్సరాల కర్నాటి చిరంజీవి మండలి బుద్ధప్రసాద్ సకుటుంబంగా నిండు నూరేళ్ళు ఆయురారోగ్య భోగభాగ్యాలతో వర్ధిల్లుతూ తెలగునేలకు, తెలుగుభాషా, సంస్కృతులకు సేవ చేస్తూ చరిత్ర సృష్టించాలని ఆశీర్వదిస్తున్నాను.

శుభం భూయాత్.

సాహితీ మిత్రులు

- డా. జి. సమరం

శ్రీ మండలి బుద్ధప్రసాద్ పేరులోనే బుద్ధుడు ఉన్నాడు. ఆయన శాంతమూర్తి, అహింసామూర్తి. ఆయన గాంధేయవాదానికి ప్రతీక. గాంధేయవాదులకి ఆదర్శం. సేవాతత్పరత, నిరాడంబరత మూర్తీభవించిన వ్యక్తి. అలుపెరగని సంఘసేవాపరాయణుడు.

ఎవరిలోనూ లేని ఒక ప్రత్యేకత ఆయనలో ఉంది. సాహిత్యమన్నా, సాహితీవేత్తలన్నా ఆయనికి చెప్పలేనంత అభిమానం. ఆయన లేని సాహితీ సభ లేదనవచ్చు. ఒకవేళ ఆయన లేని సాహితీ సభ నిర్వహింపబడితే అది వెలవెలాబోతూ ఉంటుంది. ఏ సాహితీ సభలో ఆయన ఉన్నా జీవం తొణికిసలాడుతుంటుంది. సాహితీవేత్తలకు ఆయన ఒక పెద్ద అండ. ఆయన మాట చాలు, సాహితీవేత్తలకు ఎంతో స్ఫూర్తి వస్తుంది. పదవి ఉన్నా లేకపోయినా ఆయనకి చెప్పలేనంత విలువ ఉంది, గౌరవం ఉంది. ఇది ఆయన వ్యక్తిత్వానికి గొప్ప నిదర్శనం.

ఎందరో వ్యక్తులు పదవుల్లో ఉండగా వెలుగొందుతారు. పదవి లేకపోతే విలవిలలాడిపోతారు. వారిని పిలిచే నాథుడు ఉండడు. వారి వెంట మనుష్యులు ఉండరు. కాని శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు ఈ విషయంలో పూర్తిగా ఎక్స్పషనల్. పదవి ఉన్నప్పుడు ఆయన ఎన్ని మన్ననలు పొందారో, పదవిలో లేనప్పుడు కూడా అంతగానో, అంతకంటే మించో ఆయన మన్ననలు పొందారు. దిస్ ఈజ్ రియల్లీ గ్రేట్.

వారితో నా పరిచయం ఈనాటిది కాదు. ఏనాటిదో. వాళ్ళ నాన్నగారు శ్రీ మండలి కృష్ణారావుగారు, మా నాన్నగారు శ్రీ గోరాగారు అత్యంత సన్నిహితులు, గాంధేయవాదులు, సర్వోదయవాదులు, సంఘసంస్కర్తలు. మా కుటుంబానికి, వారి కుటుంబానికి ఎంతో అనుబంధం ఉంది. శ్రీ బుద్ధప్రసాద్ గారు వారి చిన్నప్పటి నుంచి నాకు తెలుసు. చిన్నతనంలో ఆయన ఎంత సాదాసీదాగా ఉన్నారో, గాంధేయవాదిగా వారి నాన్నగారితో ఎలా కొనసాగారో, ప్రజలతో మమైక్యం అయ్యారో అదేవిధంగా ఈనాటికీ ఆయనలో ఆ సాదాసీదాతనం, గాంధీతత్వం, సంఘసేవాభావం వెలుగొందుతూనే ఉన్నాయి. చాలామంది యువకులు వయస్సు పెరిగిన తర్వాత, పదవులు వచ్చిన తర్వాత మారిపోతారు, మరోలా తయారవుతారు. కాని నేనెరిగిన మండలి బుద్ధప్రసాద్ గారు ఆనాటికీ ఈనాటికీ ఒక్కటే. వారిలోని మంచితనం, స్నేహశీలత అలాగే వెలుగొందుతున్నాయి.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి చేతుల మీదుగా నా పుస్తకావిష్కరణ సభలు జరిగాయి. ఆయన చేతుల మీదుగా నేను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు అందుకున్నాను. ఆయన చేతుల మీదుగా అనేక పురస్కారాలు అందుకున్నాను. నేను ఎన్ని పురస్కారాలు అందుకున్నా మండలి బుద్ధప్రసాద్ గారి చేతుల మీదుగా అందుకున్న పురస్కారాలే నన్ను ఎంతో పులకింప చేస్తుంటాయి. దానికి కారణం వారి మంచి హృదయమే.

అటువంటి మహనీయుని షష్టిపూర్తి సందర్భం నా మనస్సులో మాటని అక్షరరూపంలో సాక్షాత్కరింప చేస్తున్నందుకు ఎంతగానో ఆనందంగా ఉంది. ఆయన ప్రజలతో మమైక్యమై, సాహితీవేత్తల ఆత్మీయుడై వందేళ్ళు ఆయురారోగ్యాలతో వెలుగొందాలని వారికి నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

తెలుగు వెలుగు

- - బియస్రావు (భావరాజు శ్రీనివాసరావు)

రెండు దశాబ్దాల క్రిందటిమాట. ప్రఖ్యాతదర్శకులు శ్రీ విశ్వనాథ్ గారికి స్వాగతం పలకడానికి విజయవాడ రైల్వేస్టేషన్‌కి వెళ్ళాను. అప్పటికే శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు విశ్వనాథ్ వారి రాకకు వేచివున్నారు. విశ్వనాథ్ గారి ద్వారా అలా జరిగింది 'బాబు' (బుద్ధప్రసాద్) గారితో నా పరిచయం. ఆ పరిచయం పుణ్యమా అని వారు, శ్రీ వేటూరి సుందరరామమూర్తి గారితో అవనిగడ్డ ప్రాంతం 'పెదకళ్ళేపల్లి'లో సంయుక్తంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొనే అవకాశమూ నాకు కలిగింది.

పిమ్మట బాబుగారిని విజయవాడలో తరచూ కలుస్తుండే వాడిని. తండ్రిలాగే వీరూ గాంధేయవాదులే. వారి తండ్రిగారు కీ.శే.శ్రీ మండలి కృష్ణారావు గారిని మంత్రిగా వున్నప్పుడు ఒకసారి చూడడం తటస్థించింది. వారి నిరాడంబరతా, కలుపుగోలుతనం చూసి, మంత్రులంటే 'అందనివారే' కాదు, 'అందరివారూ' వుంటారు అనిపించింది. ఈ విషయంలో బాబుగారు తండ్రిగారి తత్వం పుణికి పుచ్చుకున్నారనిపిస్తుంది.

నా స్వవిషయంలోనూ దానికి కొన్ని ఉదాహరణలు వున్నాయి. 2004లో శాసనసభ్యునిగా ఎన్నికైన తర్వాత "ఈసారి మీరు తప్పకుండా మంత్రి అవుతారు అనిపిస్తోంది. అప్పుడు మీతో కలసి తిరుమల వెళ్ళాలని నాకోరిక" అన్నాను. మంత్రి కావాలని ఆయన కోరుకున్నారో లేదో కానీ, వారి నిజాయితీ, మంచితనం గురించి తెలిసిన వారందరూ కోరుకున్నారు.

ఆయన మంత్రి అయితే ఆయన నిర్వహించే ఏశాఖనైనా సమర్థవంతంగా నిర్వహిస్తారనే నమ్మకమది. తదుపరి ఆయన మంత్రివర్గంలో చేరాక, గుర్తుగా వారి కుటుంబంతో మమ్మల్నీ శ్రీవేంకటేశ్వరుని దర్శనానికి తీసుకెళ్ళారు.

2010లో హైదరాబాద్‌లో జరిగిన మా అబ్బాయి వివాహానికి వారు ఊళ్లోలేని కారణంగా రాలేకపోయారు. మరునాడు మా ఇంటిలో జరిగిన పూజకు సతీసమేతంగా వచ్చి ఎంతో సమయం గడిపారు. వారి కలుపు గోలుతనానికీ, స్నేహానికి వారిచ్చే విలువకీ ఇవి ఉదాహరణలు మాత్రమే.

సమైక్యవాదం - భాషాభిమానం

మండలి కృష్ణారావు గారైనా బుద్ధప్రసాద్ గారైనా గట్టి సమైక్యవాదులు. తెలుగువారంతా ఒక్కటే అని చాటి చెప్పే ప్రయత్నంలో భాగంగా 'ప్రపంచ తెలుగు మహాసభలు' ఎంతో ఘనంగా నిర్వహించారు. విదేశాల్లో ఏర్పడిన తెలుగు సంఘాలకు 'తెలుగు మహాసభలే' ప్రేరణ అని చెప్పుకోవచ్చు.

బుద్ధప్రసాద్ గారు తెలుగును అభిమానిస్తారు. తెలుగును అభిమానించే వారిని మరింత అభిమానిస్తారు. ఫోన్ చేస్తే మనకు వినిపించేది "మాతెలుగుతల్లికీ మల్లెపూదండ" గీతమే.

తెలుగు భాష ఎంతో ప్రాచీనమైనదే కాదు, ఎంతో గొప్ప భాష అని ప్రత్యేకంగా చెప్పవలసి రావడం, దానికి పోరాడాల్సి రావడం దురదృష్టమే. అప్పటికే 'ప్రాచీనభాష' గా తమిళం గుర్తింపు పొందిన తర్వాత, అటువంటి గుర్తింపు పొందడానికి కేంద్రం ప్రమాణాలు సవరించడం అందరినీ ఎంతో బాధించింది. దీనికి వ్యతిరేకంగా ఎందరినో కూడగట్టుకుని, 'ప్రాచీనహోదా' బాధ్యతను భుజాన వేసుకొని సఫలీకృతులయ్యారు శ్రీ మండలివారు.

"ఆముక్తమాల్యద' నాటకంలో 'శ్రీకృష్ణదేవరాయలు' పాత్ర శ్రీ బుద్ధప్రసాద్ గారు పోషించారని విన్నాను. కాకతాళీయమే కావచ్చు. అయినా ఎంతో సమంజసం అనిపించింది.

ఎప్పుడైనా వారింటికి వెళ్ళినప్పుడు మన భాషకీ, కళలకీ తగ్గిపోతున్న ఆదరణ గురించే మాట్లాడతారు. రాజకీయాల గురించి ప్రస్తావించడం నాకు జ్ఞాపకం లేదు.

రాజకీయాల్లో ఏదో కారణంగా వివాదాస్పదం కాని వ్యక్తులు చాలా అరుదు. అటువంటి 'Non Controversial' వ్యక్తి శ్రీ బుద్ధప్రసాద్ గారు. నిగర్వి. ఆయన ఎల్లప్పుడూ ధరించే తెల్లని వస్త్రాల్లాగే 'మచ్చలేని' మనీషి శ్రీ బుద్ధప్రసాద్ గారు.

వారి షష్ట్యబ్దిపూర్తి శుభసందర్భాన వారికి నా శుభాకాంక్షలు. వారికీ, వారి కుటుంబానికీ సదా సుఖసంతోషాలు ప్రసాదించమని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.



అంతర్జాతీయ మంగళవాద్య సమ్మేళనంలో శ్రీ కూచిభొట్ల ఆనంద్, తమిళనాడు గవర్నర్ శ్రీ కె. రోశయ్య, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ ఇ.ఎస్.ఎల్. నరసింహన్‌లతో....

తెలుగు ముద్దు బిడ్డ

- జి.ఎల్.ఎన్. మూర్తి

మానవ జీవన పరిణామ క్రమంలో 'జాతి' అనే పద నిర్వచనం సిసలు స్ఫూర్తిని అక్షరాల అమలు చేయటంలో 'మండలి' కుటుంబం అందరికన్నా ముందుంది. దిగంతాల ఎల్లలు తాకిన తెలుగుదనం ప్రశస్తిని వ్యవస్థీకృతం చేయటంలో మండలి వెంకట కృష్ణారావు, ఆయన వెంట తనయుడు మండలి బుద్ధప్రసాద్ అగ్రభాగాన నిలిచారు. తెలుగు జాతి ఐక్యత అందుకు అవసరమైన వనరులు, అవకాశాలు కల్పించటంలో ఈ తండ్రి అడుగుజాడలు అందిపుచ్చుకున్న బుద్ధప్రసాద్ అనునిత్యం ఆ దిశలో ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. తెలుగుమాటతో, పలకరింపుతో పులకరించే సమావేశాలు, మహాసభలు నిర్వహించటంలో ముందస్తు ఏర్పాట్లు జరిగిన అన్ని చారిత్రక సందర్భాల్లో 'మండలి' వారు అందరికన్న ముందు నిలిచారు. ఆధునిక చరిత్ర, జాతీయ ఉద్యమంలో తెలుగు భాషతో సమైక్యత కలివిడితనంతో విశ్వవ్యాప్తంగా చొచ్చుకుపోయిన తెలుగుదనం వెంట 'మండలి' వారి వ్యవస్థాగత నిర్మాణం ప్రస్ఫుటంగా అగుపిస్తుంది.

1913లో బాపట్లలో జరిగిన ప్రప్రథమాంధ్ర మహాసభల సంగతులు వాటి నేపథ్యంతో సహా సమకాలీన తరాలకు జ్ఞాపకాలు అందించడంలో మండలి బుద్ధప్రసాద్ పూనిక వెలుగుదారి పెంచింది. 1924లో తెలుగులోనే పాఠాలు, పరీక్షలు ఉండాలన్న ఉద్యమ స్ఫూర్తిని రాజకీయంగా అందిపుచ్చుకుని కార్యాచరణలోకి తెచ్చిన వారిలో మండలి వెంకట కృష్ణారావు చొరవ చారిత్రాత్మకమైంది. ఇప్పుడు రెండు రాష్ట్రాలుగా విడివడిన తెలుగు ప్రాంతాల్లో భాష వికాసం సంబంధిత రాజకీయ కార్యకలాపాల్లో తారతమ్యాలు ఎన్నో ఉన్నా తెలుగువారంతా ఒక్కటే అన్న సోదరభావన చెక్కు చెదరలేదు. ఉమ్మడి రాష్ట్రంలో నెలకొల్పిన భాష వికాస సంస్థల కార్యనిర్వహణ శైలిలోనే సరికొత్త రాష్ట్రాలు ప్రభుత్వాలు చేర్పులు మార్పులకు సమాయత్తం అవుతున్నాయి. విదేశాలతో పాటు మన దేశంలోని వేరువేరు రాష్ట్రాలలో స్థిరపడిన తెలుగువారందరికి ఆత్మీయమైన వేదికగా ఏర్పాటైన 'అంతర్జాతీయ తెలుగు అధ్యయన కేంద్రం' ఆశయ లక్ష్యాలు వర్తమానంలోని 2 తెలుగు రాష్ట్రాల ప్రభుత్వానికి దిశానిర్దేశం చేస్తోంది. 2012లో తిరుపతిలో జరిగిన 4వ ప్రపంచ తెలుగు మహాసభల స్ఫూర్తితోనే ప్రస్తుతం ఉభయ రాష్ట్రాల్లో 'భాష'ను ముందు పేరుగా చేసుకున్న సాంస్కృతికశాఖల నిర్వహణ సాగుతోంది.

రాష్ట్రేతర ప్రాంతాల తెలుగువారి కోసం సంక్షేమంతో పాటు భాష వికాసం కోసం మంత్రిత్వశాఖ ఉన్నా పనితీరులో స్పష్టత కొరవడింది. ఆ నేపథ్యాన్ని మననం చేసుకుంటేనే దేశవిదేశాల్లోని తెలుగువారి ఐక్యత, వారి పట్ల తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల యోచనలు, కార్యాచరణ అవగతం అవుతాయి.

భాష ప్రయుక్త రాష్ట్ర ఉద్యమంతో ఉధృతమైన తెలుగువారి ఆకాంక్షతో ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి 'ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం ముఖ్యమంత్రిగా ఆవిర్భవించిన ఆంధ్ర రాష్ట్రం 1953 అక్టోబర్ 1న కొత్త ఊపిరి తీసుకొంది. రకరకాల బాలారిష్టాల తరువాత 1956 నవంబర్ 1న ఇప్పుడు లేని 'ఆంధ్రప్రదేశ్' సరికొత్త జవసత్త్వాలతో పునరుద్భవించింది. విశాలాంధ్ర నినాదం అందరి మదిలో మెసులుతూ ఉన్నా ఆ రోజుల్లోనే సువిశాలమైన తెలుగువారి ఆవాస ప్రాంతాలెన్నింటినో వదులుకుని 'ఆంధ్రప్రదేశ్' అవతరించింది.

స్వతంత్ర రాజ్యంగా మనగలమని అన్ని ప్రయత్నాలు, పథకాలతో సమాయత్తమైన నైజాం రాజ్యంలోంచి నేటి తెలంగాణ ప్రాంతం 'ఆంధ్రప్రదేశ్'లో భాగంగా విలీనం అయింది. ఆ పరిణామాలన్నింటిల్లో తెలుగువారి మనసులు, తెలుగు మాట, పలుకుబడిలోని సమైక్యతా భావం సరికొత్త బంధాలతో పెనవేసుకున్నాయి. లోతుగా తరచి చూస్తే ఆ కలివిడితనంలోని భాష, నుడికారంపై మమకారంలో ఏ మాత్రం సడలని ఐక్యత ద్యోతకం అవుతూనే ఉంది. వీటన్నింటితో ముడిపడి ఉన్న తెలుగు జాతి సమైక్యత వాణికి బలమైన పునాది మండలి వెంకట కృష్ణారావు ఆయన తరువాత బుద్ధప్రసాద్‌ల కృషి, కార్యశైలి ఉన్నాయని స్పష్టమవుతుంది.

1969లో జరిగిన తెలంగాణ ఉద్యమం, అందులో విశృంఖలమైన ఆంధ్రవ్యతిరేకతతో ఎగిసిపడ్డ 1972–73 'జై ఆంధ్ర' ఉద్యమాల ఫలితంగా రాజి ప్రయత్నాలు, పెద్ద మనుషుల ఒప్పందాలు మళ్ళీ చేతులు కలిపాయి. 1974లో జనవరి 12న సంక్రాంతి పండుగ ముందు రోజున విద్యాశాఖ మంత్రిగా ప్రమాణంతో మండలి వెంకటకృష్ణారావు తెలుగువారి సమైక్యత చర్యలతో చురుకుదనం నింపారు. ఆ 'ఆనంద' ఉగాది తేదీ మార్చి 24 నుంచి వారం రోజుల పాటు అఖిల భారత తెలుగు సాంస్కృతికోత్సవాలు నిర్వహించారు. ఆ కార్యక్రమాలు, వాటిల్లో పాల్గొన్న వారి ఉత్సాహం, నిబద్ధతలు గమనిస్తే అసలు సిసలు తెలుగుదనం, అందుకోసం ఆరాటం ప్రస్ఫుటం అవుతాయి. 1975 ఏడాది మొత్తం 'తెలుగు సాంస్కృతిక సంవత్సరం'గా ప్రభుత్వం ప్రకటించింది. మార్గదర్శకత్వాలతో ఆదేశాలు జారీ చేసింది. మహత్తర స్ఫూర్తి ఎల్లెడలా ఆవహించింది. 'ఆనంద' నామ ఉగాదిలో మొదలైన తెలుగు సందడి 'రాక్షస' నామ సంవత్సరంలో ప్రతి తెలుగు గుండెలో పల్లవించింది. 1975 ఏప్రిల్ నెల 12 నుంచి 18 తేదీ వరకూ హైదరాబాద్ నడిబొడ్డులోని లాల్‌బహదూర్ స్టేడియం 'కాకతీయనగరం'గా కొత్తరూపు సంతరించుకొంది. అన్నింటా తానై అడుగడుగునా తెలుగుదనం వెల్లువెత్తి సరికొత్త తెలుగు ప్రపంచాన్ని 'మండలి' సృష్టించారు. తెలుగు వారు ప్రపంచంలోని ఏ ప్రాంతం నుంచైనా తెలుగు గడ్డపై తమ మాట ఆలకించి ఆయా అవసరాలకు తగినట్టుగా స్పందించేలా 'అంతర్జాతీయ తెలుగు సంస్థ'ను నెలకొల్పారు. నాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు 1984లో చేపట్టిన సంస్కరణలో భాగంగా అన్ని అకాడమీలు తత్సమాన సంస్థలను రద్దు చేయాలని ఒక్క పెట్టున నిర్ణయించింది. ఆ తరువాత అదే ప్రభుత్వం నియమించిన జస్టిస్ ఆవుల సాంబశివరావు కమిటి వారి నివేదిక సూచనలతో ఆయా సంస్థలన్నింటిని విలీనం చేస్తూ తెలుగు విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పారు. ఆనాటి కార్యశైలిలో భాగంగా అంతర్జాతీయ తెలుగు కేంద్రం ఆ విశ్వవిద్యాలయంలో అంతర్భాగమైంది.

తొలిదశలో యూనివర్సిటీ కనపరిచిన చురుకుదనం క్రమంగా మందగించటంతో అంతర్జాతీయ తెలుగు కేంద్రం పని తీరు చిక్కులపాలైంది. వనరుల కేటాయింపు, బాధ్యుల సూచనలు, ప్రతిపాదనలు ఆదరణకు నోచుకోకపోవటంతో అసలు ఆశయ లక్ష్యాలు పలుచబారాయి.

మండలి బుద్ధ ప్రసాద్ షష్టిపూర్తి వేడుకల సమయంలో ఆయన తండ్రి శ్రద్ధపెట్టి నెలకొల్పిన 'తెలుగు కేంద్రం' నిస్తేజంగా చేయాల్సినవి, తలపెట్టినవి కూడా క్రియాశీలకం చేయలేని స్థితిని చక్కదిద్దాల్సిన సంధి సమయం ఆసన్నమైంది. తెలుగు రాష్ట్రాల విభజన తర్వాత పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఎదుర్కొంటున్న సమస్యలు హైదరాబాద్ నుంచి తరలిపోక తప్పని స్థితిలో 1975లోని స్థితి పునరావృతం అవుతోంది.

మేరు నగధీరుడు

- భవిష్య

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారితో మూడు దశాబ్దాలుగా నాకు పరిచయం ఉంది. సభకు ఆహ్వానించిన వెంటనే ఏ మాత్రం అవకాశం ఉన్నా తప్పక వస్తారు. చిన్నసభ– పెద్ద సభ అనే తేడా గురించి ఆలోచించరు. అందరితో ఆత్మీయంగా మాట్లాడతారు. ఎప్పుడూ ఎక్కడా ఏ విధంగా కూడా అవతల వారిని నొప్పించరు. అలాగే సభలో మాట్లాడి వెళ్ళిపోవడం కాకుండా ఎంత సమయం తనకు అవకాశం ఉంటుందో అంత సమయం అక్కడే కూర్చుని కార్యక్రమాన్ని ఆసాంతం ఆస్వాదిస్తారు. బుద్ధప్రసాద్ గారు వస్తే ఆ సభకే ఓ నిండుదనం వస్తుంది. ఇలా అందరూ భావిస్తారు. మరో విశేషమేమంటే వారు అధికార భాషా సంఘ అధ్యక్షులైనా, మంత్రివర్యులైనా, ఉప సభాపతైనా, కవులకు, కళాకారులకు మాత్రం వాటన్నింటిని మించిన ఆత్మీయులుగా, ఒక గొప్ప వ్యక్తిగా భావిస్తారు. భాషా సేవకులుగా, సాహితీ సాంస్కృతిక ప్రోత్సాహకులుగా, పోషకులుగా, నిర్విరామ కృషీవలులుగా, నిరంతరం సమాజ సంక్షేమం కాంక్షించే ఆదర్శప్రాయులుగా వారిని అందరూ అభిమానిస్తారు, ఆహ్వానిస్తారు. నేను 'భావతరంగిణి' సాంస్కృతిక మాసపత్రిక స్థాపించి నేటికి 18సం॥లు అయింది. ఒకటి రెండు మినహా దాదాపు అన్ని వార్షికోత్సవ వేడుకలకు ఆయన మా ఆహ్వానం మేరకు పాల్గొనటం మాకెంతో ప్రోత్సాహం, ధైర్యాన్ని ఇచ్చింది. నా పత్రికకే కాదు రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలోని సాహితీ సాంస్కృతిక వికాసానికి కృషి చేసే పత్రికలన్నింటిని కూడా వారు ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. ఇదే విధంగా హుందాగా వ్యవహరించే గొప్ప రాజకీయ నాయకులు. ఇన్ని మాటలేల! మండలి బుద్ధప్రసాద్ గారు మేరు నగధీరుడు.




సంస్కృతికి ప్రతిరూపం

- కాపర్తి ప్రకాష్

గౌరవనీయులు మాన్య శ్రీ మండలి బుద్ధ ప్రసాద్ గారు 2004వ సంవత్సరంలో పశుసంవర్ధక శాఖ మంత్రిగా పరిచయస్తులు, వీరు మృదుభాషి. సాధారణ వ్యక్తిగా పరిపాలన దక్షత కల్గిన మంత్రిగా, గాంధేయవాదిగా పరిచయస్తులు.

నా శిల్పా ఆర్ట్ క్రియేషన్స్ వార్షికోత్సవ సందర్భంలో వారి నాన్నగారి పేర గౌరవ కీ॥శే॥ మండలి వెంకట కృష్ణారావు గారి జన్మదిన సందర్భంగా ఒకరికి స్వర్ణ కంకణం ఇచ్చుటకై అభ్యర్థించడమైనది. వారు పరిశీలించి గాంధేయవాది ఉప్పులూరి మల్లికార్జున శర్మగారి పేరు సూచించడమైనది, అందుకు సంస్థ సభ్యుల అంగీకారముతో గౌరవ మాన్య ముఖ్యమంత్రి కీ.శే. డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారి ద్వారా అత్యంత ఘనంగా నిర్వహించినాము. గౌరవ మాన్యశ్రీ రోశయ్య, గవర్నర్, తమిళనాడు గారి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించడమైనది. వివాద రహితుడుగా, మానవతావాదిగా నిలువెత్తు నిజాయితి పరుడుగా, సంస్కృతిగా అభిమానిగా, సమయస్ఫూర్తితో కార్యక్రమం నిర్వహించడంలో దిట్ట. తిరుపతిలో ప్రపంచ మహాసభలు జరుపడానికి గౌ॥ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి గారిని ఒప్పించి మెప్పించి ప్రపంచ దేశాలలో పేరు పొందడానికి మూలకారకులు. వారి షష్టిపూర్తికి మా సంస్థ తరఫున అభినందనలు. వారు నిండు నూరేళ్ళు సాంస్కృతిక, సాహిత్యం పట్ల అభిమానిగా విరజిల్లాలని మా కోరిక.



జర్మనీలో మేయర్ శ్రీ గుజ్జుల రవీంద్ర, శ్రీ సంపత్ కుమార్, శ్రీ జమిందార్లతో...

తెలుగుభాషోద్యమ బాంధవుడు

- గోళ్ళ నారాయణ రావు

భాషా సుగంధాన్ని పూసుకొంటూ – పూనుకునే, తెలుగుసేనల సర్వసైన్యాధ్యక్షులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు. మహాత్మాగాంధీ వల్ల, దేశ ప్రజలంతా కర్తవ్యోన్ముఖులైనట్లు, శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి వల్లనే, మా వంటి వేలాది మంది తెలుగు భాషోద్యమం పట్ల ఆకర్షితులయ్యాము అన్నది వాస్తవం.

ఒక భాష పట్ల మాత్రమే కాక, యావత్ సంస్కృతి పట్ల ఆయనకున్న అపారమైన ఆసక్తి, విజ్ఞానం, లక్ష్యం, ఆయన సంస్కారాన్ని తెలియచేస్తాయి – మనకు స్ఫూర్తిని కల్గిస్తాయి.

ఆయన ఉదారవాదం – సంస్కరణావాదం ఆయనను రాజకీయ నాయకునిగా కాక రాజకీయవేత్తగా, సమకాలీన సాంస్కృతిక శకకారుడిగా మనం గుర్తించేలా చేసాయి. ఎల్లలు లేని ఆయన కళాభిమానం, భాషాభిమానం, మనకు ఆయన పట్ల అంతులేని ఇష్టాన్ని పెంపొందిస్తాయి.

ఆయన రాజీలేని ధోరణిని సాంస్కృతిక – సాంఘిక విషయాలలో మాత్రమే (అది కూడా హుందాగా) ప్రదర్శిస్తారు. రాజకీయాలలో ఆయన సహనశీలత వల్లనే ఆయనను అజాతశత్రువుగా, రాష్ట్ర శాసనసభ ఉపసభాపతిగా అందరూ గుర్తించడం జరిగింది. తెలుగుకు, తెలుగు జాతికి అన్యాయం జరిగినప్పుడు తప్ప, ఆయన కఠినత చూపిన దాఖలాలు లేవు. ఆయన సలహాలు, సిద్ధాంతాలు, ప్రణాళికలు సత్సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు పరిచినట్లయితే, మన సంస్కృతి దేశానికే కాక, ప్రపంచానికే తలమానికమవుతుందని మేము విశ్వసిస్తున్నాము.

ఆయన ఉపన్యాసాలు – ఒకొక్కటీ ఒక్కో ధార్మిక ఉపన్యాసం వలే ఉంటాయి. ప్రాచీన సంస్కృతి, సమకాలీన సంస్కృతి, భవిష్యత్ సంస్కృతులకు సంబంధించిన విషయాలలో, ఆయన ఉటంకించే, వ్యక్తులు, సంఘటనలు, విషయాలు మనల్ని అప్రతిభులను చేస్తుంటాయి ఆయన ఉపన్యాసాలు. వాటిని అన్నింటినీ భద్రపరచి, ఒక 'ఉపన్యాస నిధి'గా చేసినట్లయితే, ప్రస్తుత భవిష్యత్ తరాలకు అవి మార్గదర్శకంగా ఉంటాయని నమ్ముతున్నాము (మనం విస్మరించరాని ఆవశ్యకతగా భావిస్తున్నాము).

ఎంతోమంది సమస్యలను ఎత్తి చూపుతారు. విమర్శలకే ప్రాధాన్యతనిస్తారు. విశ్లేషణాత్మకమైన పరిష్కారాలను ప్రతి సమస్యకు సూచించి, తాను ముందుండి నడిపించగలిగిన అరుదైన నాయకులలో అద్వితీయుడు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు. తెలుగు భాషోద్యమ చరిత్రలో, తన సేవల ద్వారా శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్న శ్రీ బుద్ధప్రసాద్ గారు కారణజన్ముడు అంటే పొగడ్త ఏ మాత్రం కాదు. సజ్జన పక్షపాతి అయిన ఆయన, ఆయన కుటుంబ సభ్యులు 'తెలుగు తల్లి' సేవలో మరింత పునీతం–సఫలం అవ్వాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాము.


మా మామ గారు సాహితీ తపస్వి పోలవరపు కోటేశ్వరరావు గారి ద్వారా, మాకు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారితో పరిచయం కల్గినందుకు, మేము అదృష్టవంతులుగా భావించుకుంటున్నాము. కృష్ణానది మన తెలుగు వారికిచ్చిన అమూల్యమైన కానుకగా ఆయనను గుర్తిస్తూ, ఆయన అంకిత భావాన్ని ప్రశంసిస్తూ, ఆయన ఆశయ సాధనకు మా వంతు సేవ, కృషి అందిస్తామని వాగ్దానం చేస్తున్నాము.

మరొకసారి ఆయనకు శుభాకాంక్షలు.

తెలుగు భాషా వరివస్య శేఖరులు

- గంగోత్రి సాయి

'నేను తెలుగువాణ్ణి అనుకొన్నప్పుడు ఒళ్లు పరవశిస్తుంది. నాది తెలుగు గడ్డ అనుకోగానే ఏదో దివ్యలోకంలో ఉన్న అనుభూతి కలుగుతుంది".



తెలుగు భాష గురించి, పుట్టిన తెలుగునేల గురించి ఇంత అభిమానంగా, ఘనంగా చెప్పుకోగలిగిన ప్రజా నాయకుడు శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారు కాక ఇంకెవరుంటారు. దాదాపు రెండున్నర దశాబ్దాల కాలం ప్రజాసేవలో కొనసాగుతూ వివిధ పదవులను, హోదాలను నిజాయితీగా, నిష్కళంకంగా నిర్వహించిన అకుంఠిత దీక్షాపరుడాయన. 1975 ఏప్రిల్‌లో ప్రథమ ప్రపంచ మహాసభలను నిర్వహించారు. ద్వితీయ ప్రపంచ మహాసభలను 1991లో కౌలాలంపూర్‌లో నిర్వహించారు. తెలుగు భాషకు, సంస్కృతికి అత్యుత్తమమైన సేవలు అందించారు.

అలాంటి ఘనాపాటి కుమారునిగా, శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు వారసత్వంగా తండ్రి నుంచి అందిపుచ్చుకున్నది, అశేష ధన కనక వస్తు వాహనాదులు కానేకాదు. తండ్రికున్న భాషాభిమానాన్ని, సాంస్కృతిక కళారంగాల పట్ల అనురక్తిని పుణికిపుచ్చుకున్నారు. తండ్రిగారిచ్చిన స్ఫూర్తితో, సొంత వ్యక్తిత్వంతో ఎదిగి, మచ్చలేని ప్రజానాయకుడిగా కీర్తి ప్రతిష్టలు ఆర్జించారు. కులాలకతీతంగా, పార్టీలకతీతంగా, ప్రజాభిమానాన్ని చూరగొన్న ఏకైక నిస్వార్థ ప్రజానాయకుడు శ్రీ బుద్ధప్రసాద్ గారు.

రాజకీయాలలో కొనసాగే వారందరూ రాజకీయ నాయకులే గాని రాజనీతిజ్ఞులు కారు. శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి వలే అగ్రేసరులు ఏ కొందరో మాత్రమే రాజనీతిజ్ఞులు ఉంటారు.

ఈ అకళంక రాజనీతిజ్ఞుడి షష్ట్యబ్ది పూర్తి మహోత్సవ సందర్భంగా వారు మరిన్ని ఉన్నత పదవులధిరోహించి తెలుగు భాష, సాంస్కృతిక కళారంగాలకు ఇతోధిక సేవ చేస్తూ పూర్తి ఆయురారోగ్య ఐశ్వర్యాలతో శతవసంతాలు జీవించాలని తెలుగుని ప్రేమించే వారందరి తరఫున ఆకాంక్షిస్తున్నాను.

బుధజన విధేయునికి శుభాశీస్సులు

- జ్యోస్యుల సూర్యనారాయణమూర్తి

మా పిల్లల్లో పిల్లవాడుగా నా దగ్గర చదువుకున్న బుద్ధిమంతుడైన చిరంజీవి బుద్ధప్రసాద్ దంపతులకు షష్ట్యబ్దిపూర్తి ఉత్సవ శుభాశీస్సులు, శుభాకాంక్షలు తెలియజేస్తూ అతని చిన్ననాటి ముచ్చట్లు కొన్ని ప్రస్తావిస్తాను.

మా తాత ముత్తాతల నుంచి దివిసీమకు చెందిన మా రెండు కుటుంబాల మధ్య అనుబంధం అలా కొనసాగుతూనే ఉంది. వాళ్ళ తాతగారు వెంకట రామయ్య గారు భావదేవరపల్లిలో ఉపాధ్యాయులు. మా నాన్నగారు శివరామకృష్ణ శాస్త్రిగారు 'గుళ్ళో మాష్టారు'గా అవనిగడ్డ గాలిగోపురంలో ప్రైవేట్లు చెప్పేవారు. బుద్ధప్రసాద్ పుట్టేనాటికి నాగాయలంకలో ఉన్న మండలి వెంకట కృష్ణారావుగారు తరువాత అవనిగడ్డకు మకాం మార్చారు. ఆయన మా అన్నయ్య క్లాస్‌మేట్స్. కృష్ణారావు గారు పార్లమెంటు సభ్యులు అయ్యేనాటికి అవనిగడ్డ సంతబజారురోడ్డులో నివాసం ఉండేవారు. తాత వెంకట్రామయ్య గారు మనుమడు బుద్ధప్రసాదు చదువుసంధ్యల్ని గమనించేవారు. ఎలిమెంటరీ తరగతుల పాఠానికి మా నాన్నగారి ప్రైవేటుకు తాతగారే మనవణ్ణి తెచ్చి దింపేవారు.

కాలువ అవతల జిల్లా పరిషత్ హైస్కూలు దగ్గర కృష్ణారావుగారు సొంత ఇంట్లో ప్రవేశించిన తరువాత వారి ఇంటికి ఎదురు వీధిలో మేము ఇల్లుకట్టుకోవటంతో బుద్ధప్రసాదు మాకు మరింత దగ్గరయ్యాడు. అవనిగడ్డ హైస్కూలు విద్యార్థి అతను. లెక్కల మాష్టారు నేను. 1970 వరకు నేను అక్కడ పనిచేశాను. అతను 1971లో టెన్తుక్లాసు పరీక్షలు రాసేనాటికి నేను అవనిగడ్డ నుంచి బదిలీ అయ్యాను. అప్పటి వరకు రోజూ మా ఇంటికి వచ్చి శ్రద్ధాభక్తులతో, వినయవిధేయతలతో చదువుకునేవాడు. పలకరిస్తే తప్ప పలికేవాడు కాదు. బుద్ధుడు కూర్చున్నట్టు కూర్చునేవాడు. అప్పుడు మాఇంట్లో సిద్ధార్థుని కాలెండరు ఉండేది. దానిముందే కూర్చునేవాడు. నేను 'బుద్ధదేవుని భూమిలో పుట్టినాను' అంటూ ఆటపట్టించే వాణ్ణి. నేను స్కూల్లో చదువు, క్రమశిక్షణల్లో, ఇంట్లో మడి ఆచారాల్లో చాలా కఠినంగా ఉండేవాణ్ణి. ఎంత అల్లరి, పొగరుబోతు విద్యార్థులైనా నాకు భయపడేవారు. ఆనాటి అవనిగడ్డ హైస్కూల్లో, రెల్లుపాకలు, పక్కాభవనం, నిబద్ధత గల ఉపాధ్యాయవర్గం, వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు, పెద్ద గంట స్తంభం, స్కూలు ప్రాంగణంలో కూరగాయలు పెంచటం, తోటపని మొదలైనవి తలుచుకుంటే ఎన్నో ప్రత్యేకతలు. ఇప్పటికీ కళ్లముందు కదలాడుతూ ఉంటాయి. బుద్ధప్రసాదు ఎం.పీ. గారి అబ్బాయి అయినా మామూలు పిల్లవాడుగా బుద్ధిగా ఉండేవాడు. చిన్నప్పటి నుంచీ తొణుకూ, బెణుకూలేని నిరాడంబరత, అవగాహన, పరిశీలనాదృష్టి మొదలైన నాయకత్వ లక్షణాలు నేను గమనించాను. అప్పుడే ఆశీర్వదించాను.

మా ఇంటికి చదువుకోవటానికి వస్తే తప్పకుండా కాళ్ళు కడుక్కొని లోపలికి వచ్చేవాడు. మా ఇంట్లో పాటించే మడి ఆచారాలను గమనించి అనుసరించేవాడు. నోములు, వ్రతాలు, పండుగలు, పర్వాల్లో విద్యార్థులందరికీ తీర్థప్రసాదాలు ఇచ్చేవాళ్లం. అతనూ భక్తితో తీసుకునేవాడు. నా శ్రీమతి చేసే శ్రావణమాసం వరలక్ష్మీవ్రతం, దేవీనవరాత్రోత్సవాల్లో చేసే అమ్మవారి బొమ్మను శ్రద్ధగా పరిశీలించేవాడు. మొన్న ఈ మధ్య

నన్ను చూడటానికి వచ్చినప్పుడు "ఇప్పటికీ ఆ అమ్మవారి బొమ్మ నాకళ్లముందు కనిపిస్తుంది" అన్నాడు. నా ఒళ్ళు పుకరించింది. ఏ పండుగ ప్రసాదం ఏమిటో కూడా గుర్తే. అతని జ్ఞాపక శక్తి, పరిశీలనాదృష్టి నాకు చాలా ఆశ్చర్యంగా ఉంటాయి. అప్పటి ఉపాధ్యాయులు కూడా అతనికి పేరుపేరునా గుర్తున్నారు. ప్రధానోపాధ్యాయులు సి.వి.యస్. కృష్ణమూర్తిగారు. అవనిగడ్డ జిల్లా పరిషత్ హైస్కూలు ప్రభుత్వ జూనియర్ కళాశాలగా మారినప్పుడు (1969) ఆయనే ప్రిన్సిపాలుగా ఉన్నారు. అప్పటి ఉపాధ్యాయులు సుగుణభూషణ రావు గారు, చెన్నారెడ్డిగారు, పురుషోత్తమ శాస్త్రి గారు, కపిల పురుషోత్తమం గారు, కుప్పానరసింహ శాస్త్రిగారు, పి.వి.జి. కృష్ణమూర్తి గారు, దుట్టా వెంకటేశ్వర్లుగారు, వేములపల్లి నాగయ్యగారు, పాలపర్తి వెంకట సుబ్బారావుగారు, సింహాద్రి వెంకటేశ్వరరావుగారు, సింహాద్రి శ్రీరంగంగారు, గద్దె బసవయ్యగారు, సింహాద్రి బసవయ్యగారు, దాసి బసవయ్యగారు, కొక్కిలిగడ్డ రాజారావు గారు, వెన్నెలకంటి సుబ్బారావుగారు, తిమ్మన కృష్ణారావుగారు, కోసూరు పరశురామయ్యగారు, కోసూరు సుబ్బారావుగారు, గాదె రామారావు గారు, చామర్తి పట్టాభిరామయ్యగారు, సిహెచ్. హనుమంతరావుగారు కథలు చెప్పే డ్రాయింగ్ మాష్టారు నడకుదుటి నరసింహంగారు, క్రాఫ్టు మాష్టారు విశ్వనాథం గారు ఇట్లా ఎందరో ఉపాధ్యాయుల పేర్లు, ఆ రోజుల్లో విద్యార్థులు వారికి పెట్టిన 'సరదా పేర్లు' కూడా బుద్ధప్రసాదు గుర్తు చేసుకోవటం విశేషం.

బుద్ధప్రసాద్‌కు గురువుల పట్ల, పెద్దలపట్ల ఉన్న గౌరవమే అతని అభ్యున్నతికి కారణం. అతను ఒకసారి అవనిగడ్డ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గారు ఎం.వి. కృష్ణారావు గారి ముందు కూర్చొని మాట్లాడుతుండగా నేను ఏదో పనిమీద లోపలికి వెళ్లాను. నన్ను చూడగానే బుద్ధప్రసాద్ లేచి నిలబడ్డాడు. "కూర్చోండి అబ్బాయి గారూ' అన్నాను. 'మాష్టారూ! మీరు నిలబడితే నేను కూర్చుంటానా?" అన్నాడు. అలాగే అతని పెళ్లి రిసెప్షన్‌కు నేను వెళ్ళినప్పుడు నన్ను చూడగానే లేచి నిలబడ్డాడు. వెంటనే అమ్మాయి కూడా లేచి నిలబడింది. "అమ్మగారు రాలేదా" అని అడిగాడు. ఉపాధ్యాయులంటే అతనికి అంత గౌరవం. ప్రైవేటుకు వచ్చినప్పుడు కాళ్ల దగ్గర కూర్చునేవాడు. ఇంట్లో చెప్పిన మాట వినకపోతే తాతగారు నాకు చెప్పేవారు. నేను చెబితే వినేవాడు.

అమాయకంగా కూర్చుని పాఠం విన్న బుద్ధప్రసాద్ నాన్నగారితో కలిసి కార్యక్రమాల్లో పాల్గొంటూ పెద్దలను, కవులు, పండితులు, పరిశోధకులు, చరిత్రకారులు, శాస్త్రవేత్తలు మొదలైన వారిని కలుసుకుంటూ అపారమైన జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని ఆర్జించాడు. తరువాత తరం అతన్ని ఆదర్శంగా తీసుకోవాలి. నిగర్వి, సంపదకు ఆశించడు. నోట్లో నాలిక లేనివాడు, నిష్కపటి, సాధుశీలి, బుధజన విధేయుడు, గురుభక్తి కలవాడు, తగాదాలకు పోడు, మెన్ అండ్ మేకర్‌గా కృషి చేస్తాడు. పదవులు అతనిని వరిస్తున్నాయి. అతను ఎవరి చుట్టూ తిరగడు. షష్టిపూర్తి పెళ్లికొడుకు బుద్ధప్రసాద్‌ను గురించి నేను చెప్పగలిగినది ఇంతే. ఏభై ఏళ్ళ క్రితం చదువు చెప్పిన తొంభైఏళ్ల మాష్టారి ఇల్లు వెతుక్కుంటూ వచ్చి శాలువా కప్పి పాదాభివందనం చేసి, పేరుపేరునా అందరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న చిరంజీవి మండలి బుద్ధప్రసాద్ ఆయురారోగ్యభోగభాగ్యాలతో మరొక షష్టిపూర్తి నూట ఇరవయ్యేట జరుపుకోవాలని నా వేదాశీర్వచనం.

సమస్త సన్మంగళాని భవంతు

చిరంజీవ! సుఖీభవ!

నేనెరిగిన బుద్ధప్రసాద్

- గొర్రెపాటి వెంకట రామకృష్ణ

శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారు ప్రాతినిధ్యం వహిస్తున్న అవనిగడ్డ నియోజకవర్గము (దివితాలూకాలోనే) మా ఘంటశాల గ్రామం ఒక మండల కేంద్రము.

గత 30 సంవత్సరములుగా వారి కార్యక్రమముల గురించి నేనెరుగుదును. గత 17 సంవత్సరములుగా స్వయంగా పరిచయం ఏర్పడినది. రాజకీయంగా చెరో ఒక పార్టీలో ఉన్నా ఆయన వ్యవహారశైలి నిరాడంబరత్వం, నడవడికలో నేను మనస్ఫూర్తిగా గౌరవిస్తాను.

రాజకీయంలో అరుదుగా కనపడే ఆయన పద్ధతి పరిశీలించాను. ఏ రాజకీయ పార్టీ నాయకుడైనా ముందు తన పదవి సుస్థిరతను, సొంత ఆర్థిక అభివృద్ధి తప్పనిసరిగా చూచుకుంటారు. ఈయనికి వచ్చిన పదవిని ఉపయోగించి చరిత్ర, భాషా, సాహితి, సాంస్కృతిక కళారంగాలకు వివిధ సామాజిక కార్యక్రమములకు, గాంధేయ వాదానికి అభివృద్ధి చేయడమే ఆయన మొదటి ఎజెండా.

ఆంధ్రుల తొలి రాజధాని కృష్ణాజిల్లా, దివితాలూక, శ్రీకాకుళం గ్రామంలో ఆంధ్రమహావిష్ణువు దేవాలయంలో, ఆనాడు 500 సం॥ క్రితం కృష్ణదేవరాయల వారు ప్రారంభించిన 'ఆముక్తమాల్యద' కావ్యం ఒక అపురూప చారిత్రాత్మక సంఘటన. ఇది భావితరాలు గుర్తుండే విధంగా నాటి శిథిలమైన ఆముక్తమాల్యద నిర్మాణాన్ని అపురూపంగా నిర్మించి, దానిలో శ్రీకృష్ణదేవరాయల వారు 'ఆముక్తమాల్యద' గ్రంథాన్ని రచించే భంగిమలో కాంస్య విగ్రహం వీరి చొరవతో ఏర్పాటు చేయడం అభినందనీయం.


ఇదే రకంగా అనేక రూప చారిత్రాత్మక చిహ్నాలు ఎక్కడ ఉన్నా దాని పునః నిర్మాణంలో ఆయన చేసే చొరవ మన అందరికి తెలిసినదే.

ఆయన ప్రాతినిధ్యం వహించే అవనిగడ్డ నియోజకవర్గంలో మా ఊరు ఘంటశాల కూడా ఇటీవల నియోజకవర్గ పునర్విభజనలో కలపటం మా అదృష్టంగా భావిస్తున్నాను. మండల కేంద్రమైన ఘంటసాల ప్రాచీన బౌద్ధక్షేత్రం. బుద్ధుని ధాతువులతో నిర్మించబడిన బౌద్ధ మహాస్థూపం, బౌద్ధ మ్యూజియం, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సంరక్షించబడుతున్నాయి. 2006 సం॥ జనవరిలో కాలచక్రం ఉత్సవాలు సందర్భంగా ఈ బౌద్ధమ్యూజియం బుద్ధప్రసాద్ గారిచే ప్రారంభించబడినది. విశేషం ఏమిటంటే ఆనాడు ఈ ఘంటశాల గ్రామం ఈయన ప్రాతినిధ్యం వహించే అవనిగడ్డ నియోజకవర్గంలో లేకపోయినా ఆనాటి నిడుమోలు నియోజకవర్గ శాసనసభ్యులు, ఆనాటి పార్లమెంటు సభ్యులు కూడా ప్రోటోకాలు నిబంధనలు ప్రక్కనబెట్టి సార్థక నామధేయుడైన బుద్ధప్రసాద్‌తోనే ప్రారంభించటం ఈయన అదృష్టంగా భావిస్తున్నాను. తరువాత ఈయన ఆధ్వర్యంలో బుద్ధుని ముఖశిల్పాన్ని పురావస్తు శాఖాధికారులకు అందించటం యాదృచ్ఛికంగా జరిగినది. అట్లాగే పవిత్రమైన 2560 సం॥ బుద్ధజయంతి ఉత్సవాలో, 60వ సంవత్సరములోకి (షష్టిపూర్తి

మహోత్సవానికి) ముందే ఈయనకు ఈ ఘంటశాల బౌద్ధమహాస్థూపంలో బౌద్ధభిక్షువులు, దమ్మ ప్రవచకులచే ఆశీర్వచనము అందించి జన్మదిన సన్మానం జరపటం, ఇది అందరి కన్నా ముందే జరపటం ఆయనకు బుద్ధభగవానుని ఆశీస్సులు పరిపూర్ణంగా ఉన్నాయని నమ్ముతున్నాను.

గత కొంతకాలంగా రాజకీయాల్లో పెనుమార్పులు వచ్చినాయి. వేరొక పార్టీవారు చేసే మంచి పనిని అభినందించలేకపోవడం జరుగుతుంది. ఇట్టి పరిస్థితుల్లో తాను ఏ పక్షంలో ఉన్నా, రాజకీయాలకు అతీతంగా తనకు నచ్చిన కార్యక్రమాల్లో పాల్గొనే చొరవ, ధైర్యం, సహృదయం, ఈయన సొంతం. కేవలం పని తనాన్నే గుర్తించి ఆర్థికానికి, ఆర్భాటానికి, ప్రభావితులు కాకపోవటం ఈయన కున్న మంచి లక్షణం.


ఇదే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి శతసంవత్సరాలు ఆయుష్షుని ఇవ్వాలని భగవంతుని ప్రార్థిస్తూ షష్టిపూర్తి అభినందనలు తెలియజేయుచున్నాను.



అభినందన

- బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి

పెద్దలు పెట్టినపేరుకు, ప్రవర్తనకు పొంతన కుదిరిన అతి కొద్దిమందిలో శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారు ఒకరు. బుద్ధప్రసాద్‌గారు మాకు సన్నిహితులు. వారితో స్నేహం వున్నదని అనుకోవడమే మాకు చాలా సంతోషంగా వుంటుంది. ఎప్పుడూ ఉల్లాసంగా, చిరునవ్వు చెదరకుండా వుంటారు బుద్ధప్రసాద్‌గారు. రాజకీయాలు, భాషా సాంస్కృతిక అంశాలపట్ల ప్రేమ అనే రెండు కత్తులను ఒక ఒరలో ఇమిడ్చి సమర్థవంతంగా నిర్వహిస్తున్న బుద్ధప్రసాద్‌గారిని చూస్తే చాలా ఆశ్చర్యం, గౌరవం కలుగుతుంటాయి. స్వాతంత్ర్యోద్యమకాలంలో సాహిత్యంలో అభినివేశం వున్న దిగ్గంతుల వంటి రాజకీయవేత్తలుండేవారు. జాతీయస్థాయిలో చూస్తే పండిత జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, పి.వి. నరసింహారావు, అటల్ బిహారీ వాజ్‌పేయి వంటి వారుంటే మన రాష్ట్రస్థాయిలో బెజవాడ గోపాలరెడ్డి, అయ్యదేవర కాళేశ్వరరావు లాంటివారున్నారు. ఇలాంటి వారికి కొనసాగింపు మన బుద్ధప్రసాద్‌గారు.


రోమ్ పర్యటనలో...

ఎంత సమూహంలోవున్నా ఒక రచయితనో, చరిత్రవేత్తనో చూస్తే పేరుతో పిలిచి, పలకరించి, ఇప్పుడు వారేం చేస్తున్నారో కనుక్కోవడం అనే లక్షణం రాజకీయనాయకులలో ఒక్క బుద్ధప్రసాద్ గారిలోనే గమనిస్తాము.

అందుకే మా ఫౌండేషన్ తరుపున పునఃప్రచురించిన తొట్టతొలి తెలుగు నిఘంటువు 'ఆంధ్రదీపిక'ను, తొట్టతొలి చరిత్ర సంచిక 'శ్రీ రాజరాజ నరేంద్ర పట్టాభిషేక సంచిక'ను బుద్ధప్రసాద్‌గారి చేతులమీదుగా ఆవిష్కరింపచేశాము.

మిత్రులు, సహృదయులు శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారు మరిన్ని కీర్తి శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాము.

జితేంద్రియుడు

- డా. టి.ఎస్. రావు

మండలి కుటుంబంతో నా పరిచయం దివి సీమ ఉప్పెన సందర్భంలో జరిగింది. అప్పుడు ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిగా ఉన్న నేను ఉప్పెన పునరావాస కార్యక్రమాలలో పాలు పంచుకొనేందుకు అవనిగడ్డ వెళ్లాను. అక్కడ మండలి వెంకట కృష్ణారావు గారి ఇంట్లోనే మా బృందం విడిది, భోజనాలు. మేం ఒక్కళ్లమే కాదు. ఉప్పెన సహాయానికి వచ్చిన అనేక బృందాలకు వసతి, భోజనాలు మండలి వారి ఇంట్లోనే. తాము కూడా ఉప్పెనలో నష్టపోయినా, తమ కన్నా ఎక్కువగా నష్టపోయిన వారిని ఆదుకొనేందుకు ఆ కుటుంబం తమ సర్వస్వాన్నీ వెచ్చించడం నాకు ఆశ్చర్యం కలిగించింది. నేను ఉప్పెన పునరావాస కార్యక్రమాలలో పని చేస్తున్న సందర్భంలో గాంధేయవాదిగా మండలి వెంకట కృష్ణారావు గారి గొప్పదనాన్ని, ప్రజల మనసుల్లో ఆయనకున్న స్థానాన్ని తెలుసుకున్నాను. అప్పటికి బుద్ధప్రసాద్ గారు తండ్రిచాటు కొడుకే.

క్రమంగా బుద్ధప్రసాద్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం, నేను కూడా వృత్తిపరంగా విజయవాడలోనే స్థిరపడటం జరిగింది. వారి కుటుంబంతో నాకున్న పూర్వ పరిచయం వల్ల నేను ఆయన గురించి పత్రికల్లో వస్తున్న సమాచారాన్ని ఆసక్తిగా గమనిస్తూ ఉండేవాడిని. అప్పుడే ఆయన మిగిలిన వారికన్నా భిన్నమైన రాజకీయనాయకుడనీ, భిన్నమైన వ్యక్తిత్వం కలవాడనీ గమనించాను. విజయవాడ ప్రచురణ కర్తలు, డాక్టర్ల మధ్య ఎప్పుడైనా ఆయన ప్రసక్తి వచ్చినా అది కూడా నా అభిప్రాయానికి సమీపంగానే ఉంది. అందరూ ఆయన గురించి గౌరవంగానూ, అభిమానంగానూ ప్రస్తావించే వారు.

రాష్ట్రంలో సౌమ్యులైన రాజకీయ నాయకులు లేరని కాదు కానీ, అలాంటి నాయకులు రోజురోజుకీ తగ్గిపోతున్నారనీ అందరికీ తెలుసు. ఎందుకంటే ప్రజాజీవితంలో పరిస్థితులు రోజురోజుకీ మారిపోతున్నాయి. మీడియా విజృంభణతో నాయకుల మీద ఫోకస్ విపరీతంగా పెరిగింది. వారికి ప్రైవసీ తగ్గింది. రాజకీయాల్లో విలువలు సన్నగిల్లాయి. వత్తిళ్లు అనేక రెట్లు పెరిగాయి. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయాల్లో క్రియాశీలంగా ఉంటూ సౌమ్యంగా ఉండటం, విజయవంతంగా రాజకీయాలు చేయడం అంటే ఆ వ్యక్తి ఎంతో అపారమైన పరిశీలనా శక్తి, మాట నైపుణ్యం, మనో నిబ్బరం ఉండి ఉండాలి. ఇవన్నీ తనకున్నాయని బుద్ధప్రసాద్ అనేక సందర్భాలలో నిరూపించుకున్నారు.

గత రెండు దశాబ్దాలలో తెలుగు భాషా పరిరక్షణ ఉద్యమాల్లో చురుగ్గా పాలుపంచుకుంటున్న సమయంలో ఆయనకూ నాకూ ప్రత్యక్ష పరిచయం జరిగింది. నేను ఆయన గురించి ఊహించుకున్న మంచి విషయాలన్నీ అక్షర సత్యాలని నాకు తెలిసింది. అప్పుడే నేను రాసిన వ్యక్తిత్వ వికాసం పుస్తకాన్ని ఆయనకు అంకితమిచ్చాను. తర్వాత నా పుస్తకలను మలేషియాలో ఆవిష్కరించినప్పుడు, ఇంకా అనేక సందర్భాలలోనూ ఆయనతో కలిసి కొంతకాలం గడిపే అవకాశం నాకు దక్కింది.

ఇతరులలోని మంచికీ, సానుకూల లక్షణాలకూ ఎంతో ఆనందంగా ప్రతిస్పందించే ఆయన, ఇతరులలోని లోటుపాట్లనూ, తప్పులనూ అంతే ఉదారంగా క్షమించడం, అసలు వాటిని పట్టించుకోనట్లుగా ఉండటం నేను గమనించి ఆశ్చర్యపోయాను. ఎదుటివారిలో మంచిని మాత్రమే గమనించి, స్వీకరించి, చెడును పట్టించుకోకుండా ఉండటం, దానివల్ల నష్టం జరిగినా క్షమించడం అనేది ఏ స్థాయి వ్యక్తులకైనా సామాన్యంగా సాధ్యమయ్యే అంశం కాదు. చిన్నతనం నుంచీ ఎంతో శ్రద్ధగా అభ్యాసం చేస్తే కానీ, ఎంతో విశిష్టమైన, ఉన్నతమైన మానసిక దృక్పథాన్ని ఏర్పరచుకుంటేనే కానీ అది సాధ్యం కాదు. అనితరమైన సాధ్యమైన ఈ అంశాన్ని సాధించిన బుద్ధప్రసాద్ ఒక్క మాటలో చెప్పాలంటే జితేంద్రియులు.

వారు జీవితంలో మరిన్ని ఉన్నత శిఖరాలు అందుకోవాలనీ, సుఖసౌభాగ్యాలతో వర్ధిల్లాలనీ మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను.



అమరజీవి పొట్టిశ్రీరాములుకు నివాళి

మన తెలుగు సారథి... వారధి

- అనిల్‌కుమార్ రెడ్డి

కొందరితో ఎన్నేళ్ళు పరిచయం ఉన్నా ఏం మాట్లాడాలో ఏమీ తెలీదు. కొందరి పరిచయం కొద్దిసేపే అయినా ఆకాశమంత ఆనందం కలుగుతుంది. అవధి లేకుండా మాట్లాడాలనే అనిపిస్తుంది. ఆ రెండో కోవకి చెందిన వారే శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు.

అద్భుతమైన మనిషి ... అరుదైన వ్యక్తిత్వం.
తెల్లకాయితంలాంటి స్వచ్ఛమైన మనసాయనది.
వారికి 'పదవి' వల్ల గుర్తింపు రాలేదు.
వారివల్ల 'పదవులకే' గుర్తింపు వచ్చింది.
తెలుగు అధికారభాషా సంఘం పేరెత్తితే బుద్ధప్రసాద్ గారు తప్ప మరెవ్వరూ గుర్తుకు రారు.
తెలుగు ప్రపంచ మహాసభల్లో పాల్గొని నడిపించిన స్వచ్ఛ - అచ్చ తెలుగు ప్రేమికుడాయన.
తెలుగుని ఆయన ప్రేమిస్తారు... ఆరాధిస్తారు... ప్రాణమిస్తారు.
తెలుగూ ఆయన్ని ప్రేమిస్తుంది. ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటుంది.
తెలుగు ప్రగతికి సారథీ వారధీ కూడా శ్రీ బుద్ధప్రసాద్ గారే.

తమిళనాడులో నివశించే తెలుగువారి కోసం, తెలుగు మనుగడ కోసం ఇన్నిసార్లు చెన్నై వచ్చిన నాయకుడు ఆయన తప్ప మరొకరు లేరు.

ఈ పరాయి రాష్ట్రంలో మా తెలుగు వారందరి ఆశాదీపం ఆయనేనంటే అది అతిశయోక్తి కాదు. పచ్చి నిజం.

పేదా, గొప్పా, చిన్నా, పెద్దా తేడాలు చూపకుండా అందరితో కలిసిపోయే బుద్ధప్రసాద్ గారంటే మాకు నిలువెత్తు గౌరవం.


వారు ఏ పార్టీలో ఉన్నా... ఏ పదవిలో ఉన్నా మంచి జరిగేది మాత్రం ఖచ్చితంగా, తెలుగుకీ, తెలుగువారికీ.

ఓసారి వారింటికి వెళ్లాను. ఎక్కడ చూసినా పుస్తకాలే. అది ఇల్లుకాదు. సరస్వతీ నిలయం. తెలుగుతల్లి ఆలయం. వారి కుటుంబ సభ్యులూ అంతే. తెలుగుదనాన్ని పుణికి పుచ్చుకున్న వారే!

ఎప్పుడు మాట్లాడినా, ఏది మాట్లాడినా శ్రీ బుద్ధప్రసాద్ గారిలో తొణికిసలాడేది వినయమే. తెలుగు భాష మీద ప్రేమా, మమకారమే.

ఎంత చిన్న సభకైనా తప్పక వస్తారు. ఆ సభకి ఎంతో నిండుతనాన్ని తెస్తారు.
అందరికీ అందుబాటులో ఉంటారు.
అందరి మాటల్నీ శ్రద్ధగా ఓపిగ్గా వింటారు.
చేయగలిగిన దాన్ని వెంటనే, ఏ ఆర్భాటమూ లేకుండా నిశ్శబ్దంగా చేస్తారు.
ఆయన తెలుగు వాడిగా పుట్టడం మన తెలుగువారు చేసుకున్న పుణ్యఫలం.
వారితో కలిసి పయనించడం నా పూర్వజన్మ సుకృతం.
మేమెరిగిన 'కృష్ణదేవరాయలు' వారు.
వారితో సమంగా తెలుగుని ప్రేమించేవారు సృష్టిలో మరొకరు లేరు.

వారికీ, వారి కుటుంబానికి ఆయురారోగ్య ఐశ్వర్య ఆనందాలు సంపూర్ణంగా లభించాలని ఈ షష్టిపూర్తి సందర్భంగా ఆ భగవంతుని కోరుకుంటూ వారి సహచర్యం ఎల్లవేళలా నాకు లభించాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ, శుభాకాంక్షలతో .. నమస్సులు.



గవర్నర్ శ్రీ సుశీల్ కుమార్ షిందేతో...

దివిసీమలో వెలిసిన దివ్యపుష్పం

- దీవి ఝాన్సీ

మండలి బుద్ధప్రసాద్‌గారితో నా పరిచయం మొట్టమొదట పరోక్షంగా జరిగింది. నేను తెనాలి పట్టణంలో చదువుకొనే రోజుల్లో దివిసీమలో పెనుతుఫాను సంభవించింది. ఆ తుఫాను దివిసీమపై విరుచుకుబడి ప్రళయతాండవం చేసింది. వార్తాపత్రిక తెరవగానే ఎక్కువ దివిసీమ భయానక దృశ్యాలే కనిపించేవి. అందులో ఒక ఫొటోలో ఒక పెద్దాయిన వెక్కివెక్కి రోదించటం కనబడింది. ఎవరో అనుకొన్నాను. కానీ ఆ వ్యక్తి ఎవరని ఆరా తీయగా అప్పటి విద్యాశాఖామంత్రి మండలి వెంకటకృష్ణారావు అని తెలిసింది. ఒక మంత్రి పదవిలో ఉండి ఒక సామాన్య మనిషి లాగా రోదించటం నాలో ఆలోచనలు రేకెత్తించింది. ఉప్పెన ఫొటోలన్నీ ఒక తెల్ల కాగితం పుస్తకంపై అంటించాను. అప్పటిలో అందరూ పిచ్చిదానిలా అలా అతికిస్తున్నావేమిటి? అని హేళన చేశారు. ఎవరి మాటలు పట్టించుకోక ఇప్పటికీ ఆ పుస్తకం నా దగ్గరే దాచుకొన్నాను. ఆ తరువాత నా జీవితంలో అద్భుతమైన సంఘటన జరిగింది. అవనిగడ్డలోని దివంగత పండిత దీవి నరసింహాచార్యులు వారి దత్తత కుమారుడు శారంగపాణి అయ్యంగార్‌తో నా వివాహం జరిగింది. అప్పుడు నా ఆనందానికి అవధులు లేవు. పుట్టింది తెనాలిలో అయినా దివిసీమతో అనుబంధాన్ని పెంచుకొన్నాను. అప్పటి నుండి బుద్ధప్రసాద్‌తో పరిచయం ఏర్పడింది. ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా బుద్ధప్రసాద్‌గారంటే అభిమానాన్ని పెంచుకొన్నాను. దివంగత మండలి వెంకట కృష్ణారావు, శ్రీమతి ప్రభావతీదేవి దంపతులకు పుట్టి రాజకీయాల్లో అడుగుపెట్టి ఎన్నో పదవులు చేపట్టి విజయలక్ష్మి మెడలో తాళికట్టి, విద్యార్థుల వెన్నుతట్టి ఎన్నో విశ్వవిద్యాలయాలను నిర్మించి ఏకగ్రీవంగా ఉపసభాపతి పదవిని అలంకరించారు. బుద్ధప్రసాద్ ఒక సాహిత్య పిపాసి. సాహిత్య ప్రియుల సావాసి. ఎంతోమంది సాహితీ ప్రియుల పేరులు వారి నాలుకపై నర్తిస్తూ ఉంటాయి. వారిపేరులు మాత్రమే కాదు, వారి చిత్రాలను ప్రదర్శనలో పెట్టి ఎంతోమంది తెలియని వారికి తెలియపరిచారు. అయనికి దేవుడిచ్చిన గొప్ప శక్తి జ్ఞాపకశక్తి. ఆయన ఉపన్యాసం పారే నదిలా స్తబ్ధతగా ఉన్న నియమబద్ధంగా, సందర్భానుసారంగా సాగుతూ మన మనస్సులో అనేక ఆలోచనలు రేకెత్తిస్తుంది. ఆయన ఉపనాస్యం విన్న చాలా సందర్భాల్లో నా కనుల వెంట కన్నీరు రాలాయి. దివంగత నరసింహాచార్యులు వ్రాసిన 'కృష్ణాస్రవంతి' అనే పుస్తకాన్ని గుర్తుపెట్టుకొని చాలాసార్లు ఆయన ప్రసంగాలలో ప్రస్తావించటం జరిగింది. అప్పుడే నేను చాలా బాధపడేదాన్ని. మరోరకంగా ఆయన పేరును ప్రస్తావించినందుకు ఆనందపడేదాన్ని.

బుద్ధప్రసాద్ నిజంగా ఈ అవనిలో జన్మించటం దివిసీమ ప్రజల పూర్వజన్మ సుకృతం. ఆయన ఏ రంగంలోనైన కదం తొక్కిన గుర్రం. అవనిజ నా మెట్టినిల్లు అయినందుకు నాకు ఎంతోగర్వం. ఆయనకు అందిన గౌరవం ఏ రాజకీయనాయకునికి లేదనటం పచ్చినిజం. కళారంగంలో చూచినట్లైతే కృష్ణామహోత్సవాలను వైభవంగా జరిపించారు. ఆ సందర్భంగా సురభీ నాటక కళాకారులను అవనిజ రప్పించారు. వారి నాటక ప్రదర్శనలు చూసి దివిసీమ ప్రజలు ధన్యులైనారు. బాలు, వేటూరి, విశ్వనాథ్‌ల వంటి గాయకులతో రచయితలలో, కళాకారులతో దివిసీమను పునీతం చేశారు. ఎదిగిఎదిగి ఒదిగిఒదిగి

మత్స్యశాఖామంత్రిగా తన వంతు న్యాయం చేశారు. పులిగడ్డ–పెనుమూడి వారధికి రథసారథి మాత్రమే కాదు, మన భాషా సాంస్కృతులను వ్యాపింపచేయుటకు అన్యదేశాలకు సైతం వారధిగా పనిచేసి వారికి తెలుగు భాషపై అభిమానాన్ని పెంచారు. గాంధీజీ సూక్తులనే స్ఫూర్తిగా తీసుకొని ఖద్దరు దుస్తులు ధరించి గాంధీక్షేత్ర పత్రికకు సంపాదకులుగా వ్యవహరించారు. 10వేలమంది పిల్లలకు గాంధీజీ వేషధారణ వేయించి వారిలో దేశభక్తిపై ఒక స్ఫూర్తిని నింపారు. జాయపసేనాని వేషధారణ వేసి తన కళాకౌశలాన్ని నిరూపించటమే కాక ఆయన విగ్రహాన్ని సైతం ఆవిష్కరింపచేశారు.

బుద్ధప్రసాద్ పుస్తక ప్రేమికులే కాదు. రసవత్తరంగా రచనలు చేయగల రచయిత కూడా. ఆయన వ్రాసిన గ్రంథాలలో 'లండన్‌లో తెలుగు వైభవ స్మృతులు' అనే పుస్తకం నాకు బాగా నచ్చింది. కోహినూర్ వజ్రం యొక్క విశిష్టత, దాని చరిత్ర బాగా తెలుసుకొన్నాను. తిరుపతిలో జరిగిన 4వ ప్రపంచ మహాసభలకు సారథ్యం వహించారు. ఈ సభలలో తెలుగు వైభవమే గాక, తెలుగు వారి వంటల రుచులను కూడా బాగా రుచి చూపించారు. విజయవాడలో కృష్ణా జిల్లా రచయితల మహాసభలకు సారథ్యం వహించి ప్రపంచ తెలుగు రచయితల మహాసభలను నిర్వహించారు. ఈ సభకు సినీనటులు బ్రహ్మానందం, తనికెళ్ళభరణి, గొల్లపూడి మారుతీరావులను ఆహ్వానించారు. ఈ ముగ్గురు ఉపన్యాసాలతో కళాకారులను చిన్నచూపు చూసే ప్రజానీకానికి గొప్ప కనువిప్పు కలిగింది. అంత అద్భుతంగా వారు ఉపన్యసించారు. అలాంటి కళాకారులను ఆహ్వానించిన బుద్ధప్రసాద్‌ను మనస్సులోనే వెయ్యిమారులు అభినందించుకొన్నాను.

అలానే రాజకీయ రంగంలోనే గాక, ఆధ్యాత్మిక రంగంలో కూడా ఎన్నో సేవలను అందించారు. హంసలదీవి శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయం, శ్రీకాకుళంలో 'ఆముక్తమాల్యద' వ్రాసిన శ్రీకృష్ణ దేవరాయలు మండపాలను నిర్మించి పూర్వవైభవాన్ని మన ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని వెల్లడించారు. స్వచ్ఛభారత్‌ను స్వచ్ఛందంగా అమలుపరచి చల్లపల్లిని కృష్ణుడు తిరిగిన రేపల్లెగా అగ్రగామి గ్రామంగా తీర్చిదిద్దారు. హంసలదీవి సముద్రానికి వృద్ధులు సైతం వెళ్ళేవిధంగా రహదారిని నిర్మించి అందరి మదిలో నిలిచిపోయారు. తక్కువసమయంలో పులిగడ్డ నుండి విజయవాడ వెళ్ళే కృష్ణ కరకట్ట మార్గాన్ని వెడల్పు చేయించి అందరి ప్రశంసలను పొందారు. చాలామంది మీ పార్టీవేరు, ఆయన పార్టీ వేరు కదా! ఆయనంటే అంత అభిమానం ఎందుకు? అని ప్రశ్నించేవారు. పార్టీలు వేరైన వ్యక్తిత్వం వికసించాలి. ప్రజల్లో చైతన్యాన్ని తీసుకురావాలని చెప్పి ప్రక్కకు వచ్చేదానిని.

బుద్ధప్రసాద్ నిజంగా ఒక 'దివ్యపుష్పం'. ఆ పుష్ప పరిమళం అనంత దూరాలకు వ్యాపించింది, వ్యాపిస్తుంది. ఎందుకంటే ఆయన ఆత్మలో దృఢత, ఆలోచనలలో పరిపక్వత, బుద్ధిలో దివ్యత, సంస్కారంలో శ్రేష్టత, మాటలలో మధురత, సేవలో నమ్రత, ప్రవర్తనలో సౌమ్యత, వ్యవహారంలో సరళత, స్నేహంలో ఆత్మీయత, వాంఛల పట్ల విముఖత, కళారంగంలో కమనీయత, ఆకారంలో విశిష్టత, వ్యక్తిత్వంలో రమణీయత. ఇన్ని అమూల్యమైన రేకులు కలిగిన పుష్పం. అదే అదే బుద్ధపుష్పం. మా దీవిలో వెలిసిన దివ్యపుష్పం. ఈ దివ్యపుష్పాన్ని చూసి ఆనందించటమే కాదు. ఆ పుష్పంలోని ఒక రేకుగా అయినా మన జీవితాన్ని మలుచుకొందాం. 60 వసంతాలు నిండిన ఈ దివ్యపుష్పానికి అందరం అభినందన వర్షం కురిపిద్దాం.

కృష్ణాజిల్లా పరిరక్షణ బుద్ధప్రసాద్ కృషి

- టి. శోభనాద్రి

కృష్ణానది అన్నా, కృష్ణాతీర వాసులన్నా కృష్ణాజిల్లాలతో సేద్యం చేసే రైతాంగమన్నా వల్లమాలిన అభిమానంతో కృష్ణా డెల్టా పరిరక్షణకు అనన్య సామాన్యమైన సేవలందించి రైతాంగ సమస్యలను నిరంతరం పరిష్కరించే సహృదయుడు శ్రీ బుద్ధప్రసాద్.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణాజిల్లాకు ఆ జిల్లాలో ప్రత్యేకించి దివిసీమ ప్రాంతానికి ఒక విశిష్ట స్థానముంది. విజయనగర సామ్రాజ్యాధిపతి సాక్షాత్తు చక్రవర్తులైన శ్రీ కృష్ణదేవరాయలు దివిసీమకు సమీపంలోని శ్రీకాకుళంలో విడిది చేసి 'ఆముక్తమాల్యద' గ్రంథాన్ని రచించినట్లు చరిత్రాంశం. దివిసీమలోని తలగడదీవి ప్రాంతానికి ఏలిక, కాకతీయ గజ సైన్యాధ్యక్షుని కుమారుడు 'నృత్య రత్నావళి కర్త', జాయపసేనాని కళలకు కాణాచి, మహానుభావులకు నిలయం, దివిసీమ.

కృష్ణా కాలువల ద్వారా కృష్ణాజలాలతో పునీతమై, సస్యశ్యామలమైన దివిసీమ, నవంబరు 19వ తేది 1977వ సంవత్సరంలో పెనుతుఫానుకు గురైంది. తుఫాను బీభత్సానికి దివిసీమంతా అల్లకల్లోలమై కాలువలు రోడ్లు నామరూపాలు లేకుండా కొట్టుకుపోయాయి. 1955లో నిర్మించిన 9 అడుగుల ఎత్తు కరకట్ట దివిసీమ చుట్టూ ఉన్నది కొట్టుకుపోయినది. 10,000 మంది ప్రాణాలు కోల్పోయారు. దివిసీమ పునర్నిర్మాణాన్ని చేపట్టటం, నీటిపారుదల వ్యవస్థను పునరుద్ధరించి, సకాలంలో వ్యవసాయ భూములకు నీరందించటం, ఎట్లాగ అని కొట్టుమిట్టాడుతున్న తరుణంలో, శ్రీ మండలి వెంకటకృష్ణారావు, మా ఇంజనీర్లు, కార్మికుల స్వచ్ఛంద సంస్థల మధ్యనే మసలుతూ, నిరంతరం పాటుపడినందు వలనే దివిసీమ దివ్యసీమైంది. అటువంటి విపత్కర పరిస్థితులలో అందరితోను ఉండి అనన్య సామాన్యమైన సేవలందించారాయన. శ్రీ బుద్ధప్రసాదు తండ్రికి చేదోడువాదోడుగా నిలిచారు. దివిసీమ పునరావాస పునర్నిర్మాణంతో పాటు కృష్ణా డెల్టా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుటకు నిర్మాణాత్మకమైన చర్యలు చేపట్టడం, అనుకున్న పనిని సాధించటం, బుద్ధప్రసాదు గారి ప్రత్యేకత. 1998 అక్టోబరులో కృష్ణానది వరదలు చుట్టిముట్టినప్పుడు, దివిసీమలోని చిరువోల్లంక మొదలైన గ్రామ ప్రజల రక్షణార్థం ప్రజలను ఉత్తేజపరచి వరద బాధ నుండి కాపాడిన వారు బుద్ధప్రసాద్. 2005, 2006 సంవత్సరములలో కృష్ణానదికి వరదలు వచ్చినప్పుడు జిల్లా అధికార యంత్రాంగాన్ని సమన్వయపరచి, ప్రాణనష్టం గాని, పశునష్టం గాని జరగకుండా చర్యలు తీసుకొన్నారు. దివిసీమ పునర్నిర్మాణ పనులలో ఇంజినీరుగా పని చేసే భాగ్యం నాకు కలిగినది.

2003, 2004 సం॥లో పులిగడ్డ – పెనుమూడి వంతెన నిర్మాణ స్థలం మార్పిడిని నిరోధించి తన ఎం.ఎల్.ఎ. పదవిని సైతం పణంగా పెట్టి, ప్రజా ఉద్యమం చేపట్టి, ముందుగా నిర్ణయించిన చోటునే వంతెన నిర్మాణానికి ప్రభుత్వాన్ని అంగీకరింపచేసి నాటి ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారిచే శంకుస్థాపన చేయించింది శ్రీబుద్ధప్రసాదే. దీనివలన కృష్ణాగుంటూరు జిల్లాలు మరింత దగ్గరవటమే కాకుండా నరసాపురం

– ఒంగోలు లకు 150 కి.మీ. దూరం తగ్గినది. ఆంధ్రప్రదేశ్ నూతన ప్రభుత్వం రూపొందించుచున్న కోస్టల్ కారిడారుకు కూడా ఈ వంతెన ద్వారా రవాణా సులభతరం అవుతుంది.

2004 సం॥లో వర్షాభావ పరిస్థితుల వలన కృష్ణాడెల్టాకు మొదటి పంటకు కూడా నీరు అందని పరిస్థితులలో, ప్రజా ఉద్యమాన్ని చేపట్టి, డెల్టా పరిరక్షణ పేర మచిలీపట్నం కోనేరు సెంటరులోనూ దరిమిలా ప్రకాశం బ్యారేజీపైన నిరాహార దీక్ష చేసి ప్రభుత్వాన్ని స్పందింపజేసి సకాలంలో డెల్టాకు నీటిని విడుదల చేయించిన ఘనత శ్రీ బుద్ధప్రసాదుదే.

కృష్ణాడెల్టాను, నీటి కష్టాల నుండి గట్టెక్కించడానికి పులిచింతల ప్రాజెక్టు నిర్మించితే 45 టి.యం.సిల నీరు నిలువ ఉంటుందని ఒప్పించి ఆనాటి ముఖ్యమంత్రి గౌ. కీ.శే. రాజశేఖరరెడ్డి గారిచే పులిచింతల ప్రాజెక్టుకు శంఖుస్థాపన చేయించినది శ్రీ మండలి బుద్ధప్రసాదు. పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయినది. ది. 09–12–2013వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి గారు ప్రాజెక్టు ప్రారంభించారు. ఇది గుర్తింపదగిన చరిత్రాంశము.

కృష్ణాడెల్టా ఆధునికీకరణ పనులు చేపట్టుటకు, ప్రణాళికలు రూపొందింపజేసి, యనమలకుదురు నుండి మోపిదేవి వరకు కృష్ణానది కరకట్ట రోడ్డు నిర్మాణాన్ని సాకారం చేసినది శ్రీ మండలి బుద్ధప్రసాదు. దీని వలన విజయవాడ నుండి మోపిదేవి వరకు 20 కి.మీ. దూరం తగ్గినది. ప్రయాణకాలం కూడా తగ్గింది.

కృష్ణానదిపై మహారాష్ట్ర ప్రభుత్వం ఆలమట్టి డాం నిర్మించటం దానిపై తలుపుల నమర్చటం, దానిని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ సమర్థించటం, మన ప్రాంతం నష్టపోయే పరిస్థితి ఏర్పడటం మనకు అశనిపాతం. దీనిపై శ్రీ బుద్ధప్రసాదు వెంటనే స్పందించి 2011 జనవరిలో రాజకీయాలకు అతీతంగా బ్రిజేష్ తీర్పు ఏర్పడిన విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు పోరాటం చేయాలని నిర్ణయించి విజయవాడలో రైతు ప్రతినిధులు, ఇంజనీర్లతో వేదిక నిర్వర్తించారు. దీనిని సాకారం చేయుటకు రిటైర్డు లోకాయుక్త శ్రీ ఆర్. రామానుజం విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి శ్రీ అంబటి లక్ష్మణరావు గారు, మాజీ మంత్రులు విశ్రాంత చీఫ్ ఇంజనీర్లతో, విజయవాడలో మరల 11–01–2011న ఒక రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పరచారు. తదుపరి నాటి ముఖ్యమంత్రి వర్యులను ఒప్పించి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పుపై సుప్రీంకోర్టులో దావా వేయటం, సుప్రీంకోర్టు స్టే యివ్వటం, గత మూడు సంవత్సరాలలో జరిగిన పరిణామం.

కృష్ణా జిల్లా రచయితల సంఘం 2006 అక్టోబరు 27, 28 తేదీలలో జాతీయ తెలుగు రచయితల మహాసభలను నిర్వర్తించిన నాటి నుండి శ్రీ బుద్ధప్రసాద్‌తో నా పరిచయం. తెలుగు భాషకు ప్రామాణికమైన బాల వ్యాకరణాన్ని రచించి, తెలుగు భాషకు శాశ్వతత్వమును కల్పించిన వ్యాకర్త సాహితీమూర్తి శ్రీమాన్ పరవస్తు చిన్నయసూరి.

నేను, మా అన్నగారైన కీ.శే. డా॥ యన్. సత్యనారాయణ గారు అభ్యర్థించినంతనే స్పందించి, ఆనాటి ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ సంచాలకులు కీ.శే. రాళ్ళబండి కవితా ప్రసాదు గారిని సంప్రదించి చిన్నయసూరి ద్విశతాబ్ది జయంతి ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్‌లోని 9 విశ్వవిద్యాలయాలలో, మద్రాసు విశ్వవిద్యాలయంలోను 2007 నుండి 2009 వరకు జరుపుటకు సహాయ సహకారాలనందించి ప్రోత్సహించిన

తెలుగు తల్లి ముద్దు బిడ్డ శ్రీ బుద్ధప్రసాద్. నాటి నుండి నేటి వరకు, నేను పరవస్తు చిన్నయసూరి సాహితీ పీఠానికి అధ్యక్షునిగా కొనసాగటం బుద్ధప్రసాదు ఆదర్శవంతమైన స్ఫూర్తి.

నేను వృత్తిరీత్యా ఇంజనీరు అయినా భాషాభిమానిగా కృష్ణాజిల్లా రచయితల సంఘంలో ఒక కార్యకర్తని. ఎన్నిరంగాలలో తాను సేవలందించుచున్నా, తెలుగు భాష ఔన్నత్యానికి నిరంతర సేవలందించుచూ అనేక మంది కవులకు, సాహితీవేత్తలకు భాషాభిమానులకు ఎందరికో స్ఫూర్తినిచ్చి ఆదరించటం శ్రీ బుద్ధప్రసాద్ గారిలోని ఒక ప్రత్యేకత. "Inspiration is Real Work" అంటారు శ్రీ అరవిందులు. ఇతరులకు ప్రేరణ ఇవ్వటం ప్రోత్సహించటమే అసలు పని, నిజమైన నాయకత్వ లక్షణం.

నిర్విరామ పరిశ్రమ, నిజాయతీతో వ్యవహరించటం తండ్రిగారైన కీ.శే. మండలి కృష్ణారావు గారి నుండి పుణికి పుచ్చుకున్న శ్రీ మండలి బుద్ధప్రసాదుకు భగవంతుడు అన్ని విధాలా శక్తి సామర్థ్యాలను నూరు సంవత్సరాల జీవితాన్ని ప్రసాదించుగాక.



మచిలీపట్నంలో కృష్ణా డెల్టా పరిరక్షణకు ఆమరణ నిరాహార దీక్ష

ఆత్మీయ సహాధ్యాయి

- సి.వి. బ్రహ్మాచారి

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారితో 42 సం॥ ఆత్మీయ అనుబంధం.

మొట్టమొదటి పరిచయం : శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు 1974లో ఆగస్టు నెలలో న్యూగవర్నమెంట్ కాలేజి ఖైరతాబాద్ యందు మొదటి రోజు క్లాసు రూంకు వచ్చి మొదటి వరుసలో కూర్చున్న కె. ఐలయ్య గారి, నా ప్రక్కన కూర్చుని మాతో పరిచయం అనంతరం ఒక గంట తర్వాత ఇంటికి వెళ్ళిపోయినాడు. మేము ప్రసాద్ గారిని చూచినప్పుడు ఖద్దర్ బట్టలు వేసుకొని ఉన్నందున పొలిటికల్ లీడర్ వచ్చినాడని అనుకోవడం జరిగినది. తర్వాత మరుసటి రోజు క్లాసు రూంకు వచ్చి మా ప్రక్కన కూర్చున్నాడు. ఆ రోజు ఫస్టు పిరియడ్ హిస్టరీ మాస్టర్ జాషువ గారు వచ్చి పరిచయ కార్యక్రమము ఏర్పాటు చేయగా బుద్ధప్రసాద్ గారు కూడా లేచి నా పేరు మండలి బుద్ధప్రసాద్, మా నాన్నగారి పేరు మండలి వెంకట కృష్ణారావు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి అని చెప్పినప్పుడు మా క్లాస్ వాళ్ళం సంతోషించినాము. ఆ విధంగా పరిచయం అయిన మేము మా జిల్లాలు, ప్రాంతాలు వేరైనా ఆ నాటి నుండి ఈ రోజు వరకు ఇంచుమించు42 సం॥లు మా ముగ్గురి స్నేహము వీడని బంధముగా కుటుంబ సభ్యులంగా వుంటు వారి కుటుంబంలో నిర్వహించు ప్రతి కార్యక్రమములో గాని మా కుటుంబంలో నిర్వహించు కార్యక్రమాల యందు పాలు పంచుకోవడం జరుగుచున్నది.

శ్రీ మండలి కృష్ణారావుగారి ఆధ్వర్యంలో 1975 సం॥లో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల యందు గాని, దాని నిర్వహణకు ముందు సంవత్సరం 1974లో 'అఖిల భారత తెలుగు మహాసభలు" హైద్రాబాద్‌లోని కేశవ్ మెమోరియల్ పాఠశాల ఆవరణంలో నిర్వహించిన సభల యందు బుద్ధప్రసాద్‌గారితో పాటు మేము కలసి పాల్గొనే అవకాశం కలిగినది.

2012 సం॥ డిసెంబరు 27,, మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు తిరుపతిలో నిర్వహించిన సభల యందు నేను ఐలయ్యగారు మూడు రోజులు కూడా పాల్గొనడం జరిగింది.

మా జీవితములో మరుపురాని పునర్జన్మ : వేసవి కాలమందు సాయంత్రం మేము రెడ్‌హిల్స్‌లో ఉండే బుద్ధప్రసాద్ గారి వద్దకు వెళ్ళి ముగ్గరము కలసి నాంపల్లి స్టేషన్‌లో నుండి నడచుకుంటు పబ్లిక్ గార్డెన్ వెళ్ళి ఈ రోజు లలిత కళాతోరణము ఉన్న స్థలము నందు పెద్దలు డా॥ దాశరథి గారు గాని, డా॥ సి. నారాయణరెడ్డి గారు మొదలైన కవులు అక్కడికి వచ్చిన ప్రముఖులతో కలిసి తిరిగి సా॥ 7, 8 గంటలకు ప్రసాద్ రెడ్‌హిల్స్‌లోని మినిష్టర్ బంగ్లా యందు వదలి మేము వెళ్ళేవాళ్ళము. ప్రతి రోజు వెళ్ళినట్లే రెడ్ హిల్స్ నుండి నాంపల్లి స్టేషన్‌కి రాగానే ఒక ప్యాసింజరు రైలు ఆగి ఉన్నందున దాని వెనుక బోగి ప్రక్క నుండి దాటుచుండగా అకస్మాత్తుగా ఒకేసారి వెనక్కు స్పీడ్‌గా వచ్చేసరికి నేను ప్రసాద్ పట్టాల మధ్య నుండి వెనక్కి జంప్ చేయడం, ఐలయ్య గారు

ముందుకు వెళ్ళడం వల్ల ఒక్క క్షణంలో ఆ ఘోర ప్రమాదం నుండి భగవంతుని అనుగ్రహము వలన బ్రతకడం జరిగినది. కాని ఆ క్షణం నుండి 30 నిమిషాలపాటు షాక్‌కు గురై శరీరమంత కంపించి పోయినాము. ఆ సందర్భము ఇప్పటికి మరవలేము.

మేము చదువుకునే రోజులలో ఒకసారి కృష్ణారావుగారికి న్యూ ఎం.ఎల్.ఏ. క్వార్టర్స్ సమీపమున చిన్న ఆక్సిడెంట్ అయినందున గాంధీ హాస్పిటల్‌లో ఉండగా మేము ప్రతి రోజు వెళ్ళేవాళ్ళము. ఒకనాడు మమ్ములను దగ్గరకు పిలుచుకొని మీ ముగ్గురు ఎల్లప్పుడు ఈ విధంగా స్నేహంగా ఉండాలని చెప్పటం జరిగింది. ఆ మాటలు నా మది యందు మెదలుతుంటాయి.

1977 సం॥లో దివిసీమ ఉప్పెన వచ్చినప్పుడు శ్రీ మండలి కృష్ణారావు గారు అవనిగడ్డలో ఉండగా, కుటుంబ సభ్యులు హైదరాబాదులో ఉన్నందున, ప్రసార మాధ్యమాలు, రోడ్, రైలు మార్గాలు పూర్తిగా దెబ్బతిని పోవడం వలన కృష్ణారావుగారి క్షేమ సమాచారములు తెలవక పోవడం వలన, కుటుంబ సభ్యులు మేము 1, 2 రోజులు మానసిక ఆందోళనకు గురి అయిన సందర్భము మరువ రానిది. ఆ యొక్క ఉప్పెనలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు గాంధి క్షేత్రమందు వారికి ఆశ్రయం ఏర్పాటు చేసి వారి ఆలన పాలన, చదువు సంస్కారములు మొత్తం మా మిత్రుడు బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినవి. ఆనాటి చిన్నారులు వీరి కుటుంబ సభ్యులుగా కలసిమెలసి ఉన్నత చదువులు చదువుకొని ఈ రోజు మంచి మంచి ఉద్యోగాలలో స్థిరపడినారు.

1982 సం॥ ఆగస్టు, 4 కృష్ణారావు గారు తమ షష్టి పూర్తి సందర్భంగా 60 రోజులు, 60 సంక్షేమ కార్యక్రమాలు చేపట్టటం జరిగినది. ఒక రోజు గాంధీభవన్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి, మిగతా మంత్రి వర్గ సభ్యులు, ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సీలు ఎంతో మంది ప్రముఖులు, అధికారులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి ఏఐసిసి అధ్యక్షులు శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి గారు విచ్చేసి మాట్లాడుతు ఒక నాయకుడు, మంచి నాయకుడిగా ఎదగాలంటే భార్య సహకారము ఉండాలి. అలాంటి సహకారం కృష్ణారావుగారి భార్య ప్రభావతమ్మ సహకారం ఉండగా అదనంగా కృష్ణారావుగారికి కుమారుడు బుద్ధప్రసాద్ గారి సహకారం కూడా ఉన్నదని ఆరోజు ఆ కార్యక్రమములో చెప్పడం జరిగినది.

మిగతా కార్యక్రమాలు దివిసీమలో ప్రతి రోజు ఒక ప్రోగ్రాం నిర్వహించినందున మేము ఇద్దరము వెళ్ళి వారం రోజులు ప్రతి కార్యక్రమములో పాలుపంచుకోవడం జరిగినది.

ఈ యొక్క స్వచ్ఛంద కార్యక్రమములో జాతీయ నాయకులు విదేశాల నుండి వచ్చిన అభిమానులు, ప్రముఖులు పాల్గొనడం జరిగినది. తిరుపతి నుండి పద్మావతి మహిళ యూనివర్సిటీ నుండి దాదాపు 150 మంది విద్యార్థినిలు వచ్చి మూడు రోజులు శ్రీమతి హేమవతి లవణంగారి ఆధీనంలో ఉండి ఈ కార్యక్రమములో భాగంగా రెండురోజులు సముద్రతీర ప్రాంతం దాని చుట్టు ముట్టు గ్రామాల యందు కొన్ని వేల మొక్కలను నాటడం జరిగినది. ఈ 60 రోజుల కార్యక్రమములో పాల్గొన్న ప్రతి వ్యక్తికి మంచి వసతి, భోజన సదుపాయాలు కలుగ జేయడం జరిగినది.

మా మిత్రుడు బుద్ధప్రసాద్ సహచర్యములో రాష్ట్ర నాయకులు, జాతీయ నాయకులు సభలు, సమావేశాల యందు పాల్గొనే అవకాశం కల్గినది. అలాగే తెలుగు కవులు, ఆస్థాన కవి డా. దాశరథి గారు, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా॥ సి. నారాయణ రెడ్డి గారు మొదలైన ఎంతోమంది తెలుగు కవుల పరిచయము ఏర్పడినది.

మా మిత్రుని పరిచయము అయిన తర్వాత నుండి ఇప్పటి వరకు ప్రతి ఎలక్షన్‌లో వారి ప్రచార కార్యక్రమములో పాల్గొనుట వలన ఆ యొక్క నియోజకవర్గంలోని గ్రామాలు, ఆ ప్రాంతం నాయకుల పరిచయాలు కూడా ఏర్పడినవి.

మా మధ్య తీపి గుర్తులు

1979 సం॥ మే 17న నా వివాహ సందర్భంగా మా మిత్రుడు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి ఆహ్వాన పత్రిక పంపించినాను. దానికి జవాబుగా 'కళ్యాణ కనకాంబరాలు' వ్రాసి పంపించినాడు.

ఓ మిత్రమా బ్రహ్మచారి, బ్రహ్మచర్య జీవితము నుండి
సంసార జీవితంలోకి అడుగిడుతున్న సందర్భముగా నా శుభాకాంక్షలు.
తెలుగు నేలను సస్యశ్యామలం చేస్తుంది చల్లని తల్లి కృష్ణవేణి
నీ ఇలవేణి కృష్ణవేణి
మీ సంసార జీవితంలో శతకోటి చంద్రికలు వర్ధిల్లాలని కోరుకుంటు
నీవు పెండ్లి పందిట్లో వేసే మూడు ముళ్ళు అవి చల్లంగా ఉండాలి నూరేళ్ళు
కలకాలం ఉండాలనీ ఆశీర్వదిస్తున్నాను. ఆనందిస్తున్నాను.
మిత్రమా మన నివాసాలు దూరం బహుదూరం
అందుకే నీ వివాహానికి రాలేక పోవుచున్నాను
అయిన అవనిగడ్డలో కూర్చుని నీ వివాహాన్ని తిలకిస్తున్నాను.
ఆనందిస్తున్నాను. ఆశీర్వదిస్తున్నాను.

ఇట్లు
నీ మిత్రుడు మండలి బుద్ధప్రసాద్

అని ఈ లెటరు రిజిస్ట్రేషన్ పోస్టు ద్వారా పంపించినాడు. ఇప్పటికి ఈ లెటరు నా వద్ద తీపిగుర్తుగా భద్రపరిచినాను.

మీ భావిజీవితంలో ఇక ఎన్నో ఉన్నతమైన పదవులు అధిరోహించాలనీ, మీ కుటుంబములు ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నాము.

నా అనుభవాలు - కొన్ని జ్ఞాపకాలు

- కిమిడి అయిలయ్య

అది ఖైరతాబాద్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల + బి.ఏ. మొదటి సం॥ము తరగతి గది. 1974 ఆగస్టు మొదటి వారము అనుకుంటాను. జీవితములో క్రొత్త అనుభూతిని పొందిన రోజు. నేను హైదరాబాదుకు రావడము క్రొత్త. ఇంకా తరగతి గదిలోనికి మాష్టారు రాలేదు. నేను ఎవరిని పలుకరించాలో, ఏలా మాట్లాడాలో అనే సందిగ్ధ అవస్థలో యున్నాను. నేను కూర్చున్నా ప్రక్క కుర్చిలో ఒక్క ఖాదీ బట్టలు ధరించిన విద్యార్థి కూర్చున్నాడు. అతను కలుగచేసుకొని నీ పేరేమి, ఏ ఊరు అని వివరాలు అడిగాడు. మాది వరంగల్ జిల్లాలోని ఒక చిన్న గ్రామము. నా పేరు కేమిడి అయిలయ్య అని బదులిచ్చినాను. నేను కూడ వారి వివరాలను అడిగాను. తన పేరు మండలి బుద్ధప్రసాద్, లకిడికాపూల్ దగ్గర ఉన్న అయోధ్య హోటల్ వెనుకాల మా ఇల్లు అని బదులిచ్చినాడు. మీ తండ్రి గారు ఏమి చేస్తున్నారు అని అడిగాను. మా తండ్రి గారు శ్రీ మండలి వెంకటకృష్ణారావు గారు, విద్యాశాఖామాత్యులుగా పనిచేస్తున్నారు అని బదులు చెప్పినాడు. నేను ఒకసారి ఆశ్చర్యమునకు గురి అయినాను. మంత్రిగారి కుమారుడు ఇంత నిరాడంబరంగా ఉన్నడా! అదే రోజు వారి ఇంటికి ఆహ్వానించినాడు. నేను హైదరాబాదు క్రొత్త దారి వెతకడము కష్టమని చెప్పినా వినకుండ నన్ను వారి ఇంటికి తీసుకెళ్లి, వారి అమ్మ గారిని, కుటుంబ సభ్యులను పరిచయము చేసినాడు. ఆనాడు మొదలైన మా స్నేహ సంబంధం ఇప్పటికి అనగా 42 సం॥లు అయినా స్నేహము చెక్కు చెదరకుండ కాపాడుచున్నది. బుద్ధప్రసాద్ గారు మంత్రిగారి పుత్రుడుగా, ఎం.ఎల్.ఏ.గా, మంత్రివర్యులుగా, తెలుగు భాష అధ్యక్షులుగా మరియు శాసన సభ ఉపసభాపతిగా మరెన్నో అధికార హోదాలో ఉన్నారు. మా స్నేహితములో ఎటువంటి భావన లేకుండ తను మామూలు వ్యక్తిగానే స్నేహాన్ని పంచినాడు. అందుకే బుద్ధప్రసాద్ గారు స్నేహానికి మారుపేరుగా చెప్పవచ్చు.

బుద్ధప్రసాద్ గారు మితభాషి, సౌమ్యుడు, స్నేహశీలి, నిగర్వి, నిరాడంబరుడు మరియు సాహిత్య పిపాసుడు. వారి మూలంగా నేను 'వేయి పడగలు', 'తెరిచి రాజ', 'బుద్ధసేనిని', 'మా బాబు' అనే విశ్వనాథ సత్యనారాయణ గారి సాహిత్యము చదవడమ అలవడినది. వారి మూలంగానే ఆరుద్ర, నారాయణరెడ్డి మరియు దాశారథి కవులను కలవడము జరిగినది.

బుద్ధప్రసాద్ గారి పెద్ద బావ డాక్టర్ పద్యాల చంద్రశేఖర్ గారు పంజగుట్టలోని ఎర్రమంజిల్ కాలనీలో ఉంటున్నారు. గాంధీ హాస్పిటల్‌లో డాక్టర్‌గా చేస్తున్నారు. మంచి సేవాతత్పరత భావాలు గలిగినవాడు. ఒక్క రోజు నేను, నా స్నేహితుడు బ్రహ్మాచారి ఇద్దరు డాక్టర్ గారి ఇంటికి వెళ్లినాము. బుద్ధప్రసాద్ గారు ఉన్నారా అని అడిగాము. మీరెవరు అని బదులు అడిగినారు. బుద్ధప్రసాద్ గారి స్నేహితులము అని బదులు పలికినాము. బుద్ధప్రసాద్ గార్కి స్నేహితులు ఉన్నారా అని ఆశ్చర్చముగా చూసినాడు. దాని అర్థము బుద్ధప్రసాద్ గారు ఎంత సౌమ్యుడో తెలియచేయుచున్నవి.

బుద్ధప్రసాద్ గారు ప్రకృతి పిపాసకులు. సాధారణంగా నేను, బుద్ధప్రసాద్ మరియు బ్రహ్మాచారి గారు సాయంకాలం వేళలో పబ్లిక్ గార్డెన్‌లో ఇప్పుడున్న లలితా కళాతోరణము వద్ద గుబురుగా పూలపొదలుండేవి. అక్కడ కూర్చొని కబురులు చెప్పుకొనే వారం. 1977 మార్చి ఉగాది ముందు రోజు అనుకుంటా, అది మా ముగ్గురి జీవితములో మరవలేని సంఘటన. ఆ రోజు మా ముగ్గురికి పునర్జన్మ రోజుగా భావిస్తాము. యధావిధిగా

కబురులు చెప్పుకుంటు ఆగి ఉన్న గూడ్సు రైలు బండి వెనుక నుండి రైలు పట్టాలను దాటుచున్నాము. పట్టాల మధ్యలోనికి రాగానే ఒకేసారి గూడ్సు రైలు బండి వెనుకకు వచ్చినది. అక్కడ ఉన్న వారంత మేము మరణించినామని భావించినారు. అదృష్టవశాత్తు అనుకోకుండ ముగ్గురము పట్టాల నుండి జంప్ చేసినాము. ఆ రోజు ఆ ఉద్యానవనములో చాలా సేపు కూర్చుని, సంఘటన గూర్చి చర్చించుకొన్నాము.

1977 నవంబర్ నెలలో దివిసీమలో ఉప్పెన వచ్చినది. వేల సంఖ్యలో ప్రజలు చనిపోయినారు. వేల సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులైనారు. శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారు తన మంత్రి పదవిని వదులుకొని, దివిసీమ ప్రజలకు సేవలందిస్తున్న సమయములో బుద్ధప్రసాద్‌గారు తండ్రితోపాటు తాను కూడ రాత్రి, పగలు వారికి సేవలందించి, తండ్రికి తగ్గ తనయుడుగా పేరు గావించినాడు.

ఆతిథ్యమునకు మారుపేరు మండలి వారి కుటుంబము. శ్రీ మండలి వేంకట కృష్ణారావు గారి షష్టిపూర్తి ఉత్సవాలు 1982 ఆగస్టు 4వ తారీకు నుండి దివిసీమలో ప్రారంభమైనవి. షష్టిపూర్తిని పురస్కరించుకొని 60 రోజులపాటు దివిసీమలో సేవ కార్యక్రమాలు ప్రారంభించినారు. బుద్ధప్రసాద్ గారు ఆహ్వానించగా నేను, బ్రహ్మచారి వెళ్ళినాము. వారింట్లో భోజనము వడ్డించే విధానము చూసి ఆశ్చర్యమునకు గురి అయినాము. భోజనము చేస్తుండగా, వారి కుటుంబ సభ్యులలో ఎవరో ఒక్కరు దగ్గరుండి, పల్లెములో ఏ పదార్థము ఖాళీ అయినదో, ఆ పదార్థము ఎంతో ఆప్యాయముగా వడ్డించడము మాకు ఎంతగానో ఆనందపరిచినది. నాకు వెంటనే ఒక్క కవి అన్న మాటలు గుర్తుకొచ్చినది. భోజనము వడ్డించేటపుడు ఏ పదార్థము వడ్డిస్తున్నారో ముఖ్యము కాదు, వారు ఎంత ఆప్యాయముగా వడ్డించడము ముఖ్యము.

పోయిన సంవత్సరము మమ్ములను మరియు బ్రహ్మచారి కుటుంబ సభ్యులను ఆతిథ్యానికి పిలిచినారు. ఆతిథ్యము స్వీకరించిన తర్వాత మా రెండు కుటుంబ సభ్యులందరికి పట్టు వస్త్రములతో సత్కరించినారు. నిజముగా మమ్ములను ఏ బంధువులు గూడ ఆ విధంగా సత్కరించలేదు.

ఇప్పటికీ గూడ కుటుంబపరంగా గాని, ప్రభుత్వ పరముగా గాని, మరి ఏ ఇతర కార్యక్రమాలు జరిగిన, ఎంతో రాజకీయ వత్తిడిలో ఉన్న మమ్ముల మరువకుండ ఆహ్వానము పంపిస్తున్నారు. మేము కూడ వీటికి హాజరగుచున్నాము. అదే విధముగా మా ఇంట్లో ఏ కార్యక్రమాలు జరిగినా మా ఆహ్వానమును మన్నించి వారు రావడం మాకు చాల ఆనందపరచుచున్నవి.

బుద్ధప్రసాద్ గారు తన రాజకీయ అభివృద్ధికి, సేవ కార్యక్రమాలలో మరియు సాహిత్య పరంగా గొప్ప పేరు గడిస్తున్నడంటే వారికి మూల కారణం వారి సతీమణి శ్రీమతి విజయ గారు. ఆమె సహనము, సౌమ్యము, ఓర్పు మూర్తిభవించిన స్త్రీమూర్తి. ఎందుకంటే 35 సం॥ల నుండి తనను ఎరుగుదుము. ఇంటికెల్లితే ఎంతో ఆప్యాయంగా పలుకరించి, మా కష్ట సుఖాలను అడిగి తెలుసుకుంటుంది. బుద్ధప్రసాద్ గారు బిజిగా ఉంటారు. కాబట్టి వారి సెల్‌కు ఫోన్ చేయకుండ, వారి ఇంటి ల్యాండ్ ఫోన్‌కు ఫోన్ చేస్తుంటాము. తాను ఏ మాత్రము విసుగుకోకుండ ఎన్నిసార్లు చేసిన ఓపికగా సమాధానము ఇస్తున్నది. బుద్ధప్రసాద్ గారికి ఏ వేళలలో తీరికగా ఉన్నడో చెప్తు ఉంటుంది.

బుద్ధప్రసాద్ గారు ఇంకా ఎన్నెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించి, ఇంకా మంచి పేరు ప్రఖ్యాతులు గడించాలని ఆశిస్తు, ఈ స్నేహాన్ని చివరి వరకు అందిస్తారని ఆశిస్తు, తన షష్ట్యబ్దికి ఈ అవకాశాన్ని ప్రసాదించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తు ముగిస్తున్నాను.

దివిసీమ దివ్వె

- ఏడిద రాజ్యలక్ష్మి

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు, శ్రీ ఏడిద కామేశ్వరరావు గారు ఎంతో మంచి స్నేహితులు. వారిద్దరూ వయస్సులో తేడా ఉన్నా, ఆలోచనల్లో, ఆశయాలలో ఇద్దరూ ఒకటే. ఇద్దరూ గాంధేయవాదులే.

ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీలో నేను, మా నాన్న గారు శ్రీ ఏడిద కామేశ్వరరావు గారు పనిచేస్తూండేవాళ్లం. మేమిద్దరమూ ఒక విభాగంలో వుండి, సాహిత్యపరంగా నాన్న గారు, పాటలు కాసెట్లు తయారు చేయడంలో నేనూ బాధ్యతలు నిర్వహిస్తుండే వాళ్లం. ఇలా తండ్రీ కూతుళ్లూ ఒక సంస్థలో కలిసి పనిచేయడం అదొక అదృష్టం. నాన్నగారి దగ్గరకు సాహిత్యాభిలాషకులు, రచయితలు వస్తూండేవారు. అలాగే బుద్ధప్రసాద్ గారు నాన్నగారి దగ్గరకు వస్తూండేవారు. అప్పుడే బుద్ధప్రసాద్ గారితో నాకు పరిచయం ఏర్పడింది. వారిద్దరూ మాట్లాడకునే సాహిత్యపరమైన విషయాలు చాలా ఆసక్తిని కలిగించేవి. కీ.శే. టంగుటూరి ప్రకాశం పంతులు గారితో నాన్న గారి అనుభవాలు, మొ॥ విషయాలు మాట్లాడుకునే వారు.

ఎప్పుడు హైదరాబాద్ వచ్చినా, తప్పక బాలల అకాడమీకి వచ్చి నాన్న గార్ని కలిసి, వారు వ్రాసిన ఓ గీతాన్ని తీసికొని వెళ్లేవారు. ఆ గీతాన్ని వారు నిర్వహించే 'గాంధీ క్షేత్రం' పత్రికలో ప్రచురించేవారు.

చిన్నతనం నుండే సంఘసేవ, గ్రామ వికాసం మొ॥ విషయాలపట్ల అభిరుచి కల్గిన శ్రీ బుద్ధప్రసాద్ ఎంతో గణనీయమైన వ్యక్తి. మరి తండ్రిగారి స్ఫూర్తితో, గాంధేయ మార్గమే ఎంచుకొని, ఖద్దరులోనే జీవిస్తున్న వ్యక్తి. పులి కడుపున పులి బిడ్డే పుడుతుంది కదా!

జగమెరిగిన బుద్ధప్రసాద్ గారికి ఎన్నో మాటలెందుకు? ఈ పాట చాలదా!

చల్లని తండ్రివి నీవయ్యా
ఎల్లలు లేని ప్రేమయెసుమ్మా ॥

1. దివి సీమకు దివ్వెవు నీవు
అందరి మదిలో జ్యోతివి నీవు
ఆశ్రయమిచ్చి ఆదరించి
"దీన జన సంక్షేమ సమితి"ని
రూపుదిద్దిన ఘనతయె నీది!!

2. తల్లీ తండ్రి ఎరుగని పిల్లలకు
తండ్రివై ఆలన పాలన చూపి

తల్లి ఒడిలో చేర్చిన నీవే
అందరి మదిని ఆదుకొన్న నీవే ॥

3. బుద్ధుని పేరుతో ప్రబుద్ధుడవు
తెలుగు భాషకు తేజమువై
తెలుగుకు చేయూతనిచ్చి
విజయమొందిన విజేతవు నీవె ॥

4. గాంధేయ వాదిగా నిలిచితి వీవు
గాంధీ క్షేత్రము నడిపితివీవు
తండ్రిని మించిన తనయుడిగా
ఖద్దరులోనే కనిపింతువు నీవు

5. మండలి వారి తేజము నీవే
ధన్యత నొందితి వీవే
పుణ్యశీలురు వారైతే
పురిటిగడ్డపై పూవువునీవె ॥

6. సాంఘిక సేవా సాధనముగగొని
విగత జీవుల పశువులకాచిన
సేవామూర్తివి నీవే కదా
ధర్మమూర్తివి నీవే కాదా!

బహుముఖ ప్రజ్ఞాశాలియైన బుద్ధప్రసాద్ గారి గురించి ఈ పాటలో కొన్ని విషయాలే ప్రస్తావించారు.

1975లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా బాలలకు కూడా సరియైన స్థానమిచ్చి, ఎన్నో మంచి కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా కీ.శే. శ్రీ ఏడిద కామేశ్వరరావు గారు నడుపుతున్న 'బాలభారతి' విద్యా సంస్థ నుండి, పిల్లలతో 'విశాల భారతి' అనే నృత్య నాటికను ప్రదర్శింపజేశారు. ఈ సభల నిర్వహణలో, తమ తండ్రి గారైన శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారితో తానుకూడా సభ్యుడిగా తమవంతు కార్యనిర్వహణ నిర్వహించారు.


మితభాషి, సంఘసేవ, దేశసేవే సాధనగా నడుస్తున్న గాంధేయవాది. భవిష్యత్తులో మరెన్నో మంచి మంచి కార్యక్రమాలను జరపాలని, ఆయురారోగ్యాలు ఇవ్వాలని ఆ భగవంతుణ్ణి మనసారా కోరుకుంటున్నాను.

శుభాశీస్సులతో...

అక్షర సుమాంజలి

- లోకం కృష్ణయ్య

'మండలి' అన్న పదం వినగానే మనకు గుర్తుకొచ్చేది తెలుగు మహాసభలు, మండలి వెంకట కృష్ణారావుగారు తెలుగు భాషా సంస్కృతి వికాసానికి చేసిన సేవ అలాంటిది మరి. సాధారణంగా కొడుకులు తల్లిదండ్రుల ఆస్తి, రాజకీయాలనే వారసత్వంగా స్వీకరిస్తుంటారు. కాని మండలి బుద్ధప్రసాద్ గారు తండ్రి రాజకీయ జీవితాన్నే కాక, తెలుగు భాషా సాంస్కృతిక వికాసానికి తండ్రి చేసిన సేవలను కూడా కొనసాగిస్తూ తండ్రికి నిజమైన వారసుడు అనే పేరు తెచ్చుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోనే కాక తెలుగు భాషా సంఘాలున్న అన్ని రాష్ట్రాలలో కూడా ఆయన తన తెలుగు సాంస్కృతిక సేవను కొనసాగిస్తున్నారు. తెలుగు సాంస్కృతిక కార్యక్రమం ఎక్కడ జరుగుతున్నా వీరికి ఏమాత్రం ఖాళీ సమయం దొరికినా తప్పక హాజరయ్యే సాంస్కృతిక బంధు 'మండలి బుద్ధప్రసాద్' గారు. 1975 ప్రథమ తెలుగు మహాసభలు ప్రారంభమైన నాటి నుండి నేటివరకు ఆయన తెలుగు భాషా వికాసానికి దోహదపడుతున్న ఆరడుగుల తెలుగు మనిషి మండలి బుద్ధప్రసాద్. 1977 దివిసీమ ఉప్పెన సమయంలో తోటి మిత్రులతో కలిసి 'దీన జన సంక్షేమ సమితి'ని కొనసాగించి నేటి వరకు దాని సేవలను నిర్వహింప చేస్తున్నారు. రాజకీయ నాయకునిగా, సౌజన్యమూర్తిగా, సాంస్కృతిక బంధువుగా తెలుగు నుడి కారానికి నిలువుటద్దముగా నిలిచిన వ్యక్తి మండలి బుద్ధప్రసాద్. 'ఆరాధాన' సాంస్కృతిక సంస్థకు ఆయన పెద్దన్నలాంటివారు. ఒకసారి ఆరాధన సంస్థకు ఆయన ముఖ్యఅతిథిగా రావలసియున్నది. 102 డిగ్రీల జ్వరాన్ని కూడాలెక్క చేయకుండా ఆయన కార్యక్రమానికి అంతరాయం కలుగకుండా అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన మహావ్యక్తి ఆయన. 'కిన్నెర' ఆర్ట్ థియేటర్స్ వారు శ్రీ మండలి షష్ట్యబ్దిపూర్తి అభినందన గ్రంథ ప్రచురణ సందర్భంగా వారికివే మా 'ఆరాధన' పూర్వక సుమాంజలులు.



చైనా పర్యటన సందర్భంగా...

YOUNG POLITICIAN WITH OLD VALUES!

- **Chennuru Anjaneya Reddy**

Those of us who saw Shri Buddha Prasad assist his father Shri MV Krishna Rao in organizing the first World Telugu Conference in1975 and later in organizing relief during the Tidal wave disaster in Krishna district in 1977, we tend to think of him as a young politician. He is 60 now. For Public Servants like me 60 years is time for retirement; for people in public life it is middle age and time to look forward with the confidence that the "best is yet to bel". Knowing him as I do, I would like to regard him as a young politician with old values, in his concern for values in public life in general and for his love of our language and culture!

He has not only trodden the path shown to him in public life by his father, he has achieved wider acceptability among his constituents. While in or out of the Assembly, he has conducted himself with dignity and never sought to make any harsh comments in these days of contentious politics. His interests have not been confined to politics only; they often brought him into the realm of language and literature. We all know of the role he played along with ABK Prasad and others in securing the 'classical language' status for Telugu and later his contribution as Chairman of the Official Language Commission. While on a private visit to London, he took the trouble of making enquiries and locating the monument of Charles Phillip Brown, whose services to Telugu Language and Literature are well known. He initiated steps to restore and maintain the monument. We Telugus have reason to be grateful to CP Brown,who brought great recognition to Telugu in colonial India.

Shri Buddha Prasad has natural interest in Telugu language and Culture. He was instrumental in initiating several projects to adopt this ancient language to modern tool like Internet. Many of his recent 'birth day' celebrations occasioned launching compendious volumes of learned essays devoted to language, literature and culture. He has also been taking interest in our performing arts, particularly Kuchipudi. In the new State of Andhra Pradesh (it is time we do away with this ill-fated name), he has to initiate some more important projects. On this occasion, I would like to bring them to his notice and assure him they merit his attention.

1. The charter of the Telugu University may be reviewed and its role confined to standardizing and modernizing the Telugu Language and usage and developing

digital tools to teach Telugu to our children, let alone non-Telugus; this will not happen unless the University's attention is shifted from literature to language and it is impressed on them that their business is language and not literature!

2. Telugu usage and teaching practices need radical reform. Uninformed definitions like Prakruti-Vikruti, Dushta samasam should be done away with; script needs to be further simplified and made key-board friendly

3. We have to develop a digital dictionary that would fit into a mobile Application.

4. We have to digital warehouse of all our literature, particularly unpublished manuscripts available in Chennai, Tanjore, Madurai and other places

5. We have to revive and nurture our State-level Akademies - Sangeeta, Sahitya, Nataka Akademies and take them out of the purview of Telugu University

6. Performing Arts like Burrakatha, Harikatha and Padyanatakam are almost reaching extinction; it is time we support and modernize them

7. We shall not limit our patronage to Kuchipudi dance form only; temple and court dances in Andhra which are more ancient, have been neglected over the years; in any case kuchipudi today is well-established;

8. We have disinherited ourselves from our traditions of Bharatanatyam and Yakshaganam: the former thrives in Tamilnadu and the latter in Karnataka

9. Above all, he owes it to his name to work for revival and restoration of Buddhist sites in AP by creating a separate wing in Archaeology Department for this job.

Observers of political developments in the Telugu States, think that one striking difference between Andhra Pradesh and Telangana is that in the former politics is ' managed' by businessmen while in the latter, it is run by politicians! In such a situation, Shri Buddhaprasad is one full-time, professional politician with public interest at heart. The State would do well to utilize his services to actively promote language and culture rather than confine him to the sedate job of Dy. Speaker and make him a helpless witness to invective-ridden slanging matches in the Assembly!

On this occasion, he has my best wishes for continued success in public life and to go on to celebrate his 'Sahashra chandra darshanam' in a public office!

సుమాంజలి

- డా॥ సప్పా దుర్గాప్రసాద్

గోదావరి మహాపుష్కర సంరంభం సందర్భంగా అమాత్య స్థాయిని మించిన అధికార ప్రజాప్రతినిధి మా రాజమహేంద్రవరం విచ్చేసారు. త్రిస్టార్ హోటల్‌లో అధికారిక బస. ఉదయం ఒక సభలో ఇరువురం కలిసాం. 'దుర్గాప్రసాద్ గారూ మనం సాయంత్రం శ్రీ విజయదుర్గా పీఠం అమ్మవారి దర్శనానికి వెళ్దాం' అన్నారు. నేను 'సరేసార్' అన్నాను. సమయానికి నేనూ, మా నటరాజ నృత్యనికేతన్ అధ్యక్షుల వారి కారులో సిద్ధంగా ఉన్నాం. మాకు ముందు పైలెట్ వాహనం. తరువాత అధికారిక భద్రతా సిబ్బంది వాహనం, ఆ తరువాత ఎర్రబుగ్గి కారులో ఆయన కుటుంబ సభ్యులు. ఆయన మాత్రం 'ప్రసాద్ గారూ నేను మీ కారులో వస్తాను' అన్నారు. ఒక్క నిమిషం నేను నిర్ఘాంతపోయాను. "అదేంటి సార్! పరివారాన్ని, అధికారాన్ని, కుటుంబ సభ్యులనూ వదిలి...." అన్నాను. "ప్రసాద్ గారూ మీతో అయితే అనేక విషయాలు చర్చించుకుంటూ వెళ్ళవచ్చని" అన్నారు. నేనూ, ఆయన, మా అధ్యక్షుల వారూ ఒక వాహనంలో బయలుదేరాం. మరో అమాత్యుడైతే 'మమ్మల్ని అనుసరించండి' అంటారు. మరీ ముచ్చట పడితే 'మా కారులో ఎక్కండి' అంటారు. కానీ... ఈయనేవిటిలా భద్రతను, అధికారాన్ని, హోదాను, కుటుంబ సభ్యులనూ వదిలి నిరాడంబరంగా మాతో రెండు గంటల ప్రయాణం చేసారు. ఆయనే ఈనాటి రాజకీయ నేతల్లో కనిపించని అరుదైన వ్యక్తిత్వం మూర్తీభవించిన ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఉపసభాపతి శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు. అంతటి హోదాలో అతి సామాన్యంగా అందరికీ అందుబాటులో కలిసి జీవించే మహామనీషి మా బుద్ధప్రసాద్ గారు.

పరిచయ నేపథ్యం : మా నటరాజ నృత్యనికేతన్ రజతోత్సవం 'పాతికేళ్ళ ప్రస్థానం' పేరున 2008 సం॥లో 3 రోజులు ఘనంగా నిర్వహించాము. 'విజయ విహారం' పేరున మా సంస్థ చేసిన ఘనకార్యాలు, నాట్యకళా చరిత్ర తెలిసేలా ఛాయాచిత్రాలు, నృత్యవాద్య పరికరాలు, నాట్యశాస్త్ర గ్రంథాలు, నాట్యరంగాన నిష్ణాతుల ఛాయా చిత్రాలు, నేను రచించిన పుస్తకాల ప్రదర్శనశాల ప్రత్యేకంగా ఏర్పాటు చేశాం. మూడు రోజులు శైవ, వైష్ణవ, శాక్తేయ సాంప్రదాయ 'ఆలయనృత్యం' ప్రదర్శనలు కొనసాగించాం. మంత్రులు, ప్రముఖులు, ప్రజలు, పండితులు ప్రదర్శనశాలను సందర్శించి నాట్యచరిత్రను తెలుసుకొన్నారు. ఆలయ నృత్య ప్రదర్శనలు తిలకించి పులకించి పోయారు. ఇది ఒక అపూర్వ సన్నివేశం. మూడవరోజు ముగిసింది, ప్రదర్శనశాల తీసెయ్యాలి.

కానీ... మా శాసన సభ్యుని ద్వారా ఆనాటి పశుసంవర్ధక శాఖామాత్యులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి వర్తమానం "రేపు ఉదయం నేను వస్తున్నాను. ప్రదర్శనశాలను తిలకిస్తాను" అంటూ, అప్పటి వరకూ నాకు బుద్ధప్రసాద్ గారితో పరిచయం లేదు. అందుకే అయిష్టంగానే 'సరే' అన్నాను. ఒక్కరోజు ప్రదర్శన పొడిగించాలంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం గనుక. తప్పక నాల్గవ రోజు 'విజయవిహారం' ప్రదర్శనశాల మంత్రిగారి చేతిమీదుగా ముగింపు ఉత్సవం అంటూ ప్రకటించాం. శ్రీ బుద్ధప్రసాద్ గారు వచ్చారు. అతి సామాన్యునిలా ప్రదర్శనశాలంతా తిలకించి, అనేక విషయాలు నానోటి ద్వారా చెప్పించుకొని విన్నారు.

"దుర్గాప్రసాద్ గారూ అమెరికాలో మీ పుస్తకాలు చూసాను, కానీ చదివే అవకాశం కుదరలేదు, నాకొక సెట్ పుస్తకాలు ఇస్తారా" అని అడిగారు. ఎంత వినయం, ఎంత సౌమత్య, మాటల్లో ఎంత మార్దవం నన్ను మంత్రముగ్ధుడిని చేసింది. అంతటి వ్యక్తి అడగగానే అందుబాటులో ఉన్న నా రచనలు అందించాను. అవన్నీ చదివి ఆయన లేఖ వ్రాయటం నన్నూ, నా మనసునూ ఆయనకు దగ్గర చేర్చింది.

రెండవసారి నేనాశ్చర్యపోయిన యదార్థఘటన. నాది ముక్కుసూటి మనస్తత్వం. ఎవరితో పరిచయం పెంచుకోను, ఎవరికీ దగ్గరకాను, నాపనేదో నేనుగా చేసుకుపోతాను. నచ్చని విషయాలు నచ్చలేదని ఖచ్చితంగా మొహంమీదే చెప్పేసే స్వభావం నాది. నానిక్కచ్చితనమే నాకురక్ష అని నమ్మి జీవిస్తున్న వాడిని నేను. ఎవర్నీ లెక్కచేయడు 'పొగరుబోతు', 'అగ్నిహోత్రుడు' అనేవి నాకు పెద్దలు పెట్టిన ముద్దు పేర్లు. ఇక విషయానికి వస్తే ... ఒక సభలో శ్రీ బుద్ధప్రసాద్ గారు ముఖ్య అతిథి. మా పురప్రముఖులు ప్రసంగించారు. శ్రీ బుద్ధప్రసాద్ ప్రసంగం ప్రారంభించారు. "ఈయనేం మాట్లాడుతార్లే, మొదలు విని మధ్యలో నెమ్మదిగా సభ నుండి జారిపోదాం, కాదు పారిపోదాం" అనుకున్నాను మనసులో. కానీ.... గంటసేపు అనర్గళంగా సభ జరుగుతున్న నేపథ్యం, విషయం దాటిపోకుండా ప్రసంగించడం, గంట ప్రసంగంలో ఒక్క ఆంగ్ల పదం దొర్లకపోవడం నన్ను కట్టిపడేసింది. అప్పటి నుండి ఆయనపై గౌరవ భావం శిఖరస్థాయి చేరింది.

అలా, అలా అనేక సందర్భాలలో కలుసుకోవడం, మాట్లాడుకోవడం, చర్చించుకోవడంతో మా అనుబంధం మహాసంద్రమైంది. మా అనుబంధం సోదరబాంధవ్యమైంది. ఎందుకంటే, నేను పుట్టింది కృష్ణా నదీ తీరం విజయవాడలో, పెరిగింది గోదావరి నది ఒడ్డు రాజమహేంద్రవరంలో, విద్య నేర్చింది హుస్సేన్ సాగర తీర హైదరాబాద్ నగరంలో. అటు అమ్మగారివైపు, ఇటు నాన్నగారివైపు కుటుంబాలకు నేనే పెద్దని. అందువల్ల బాధ్యతలు, బంధాలు ఎక్కువే. అందరూ నాకంటే చిన్నవారే, పైగా నా విద్య, నా ప్రవర్తన, నా అలవాట్లు నా స్థానాన్ని మరింత పెంచి మా ముందుతరం పెద్దలందరికీ నేనంటే గౌరవం. అందుకే నా మాట వారి పాలిట రామాజ్ఞ. ఎదురు చెప్పేవారేలేరు. అందువల్ల మనసులో చిన్న లోటు. అదే నాకంటే పెద్దవారుంటే బావుండునే నేను గౌరవించుకునేందుకు అని. అదిగో ఆ ముచ్చట బుద్ధప్రసాద్ గారి వల్ల తీరింది. మా కుటుంబ సభ్యులందరూ అంగీకరించడంతో మా పెద్దన్నయ్య బుద్ధప్రసాద్‌గారే. అందుకే ప్రభుత్వం నాకు ఇచ్చిన 3 కోట్ల విలువయిన స్థలంలో నిస్వార్థంగా ప్రపంచ నాట్య కళాచరిత్రలోనే తొలిసారిగా వేయి వసంతాల ఆలయ నృత్యచరిత్రను తెలియజేసేలా నేను నిర్మించిన 'ఆలయ నృత్య కళావనం'లో మాగురుదేవులు శ్రీ నటరాజరామకృష్ణ, నా తండ్రి సప్పా సత్యనారాయణ గార్ల విగ్రహాలు శ్రీ బుద్ధ ప్రసాద్ గారి చేతి మీదుగా ఆవిష్కరింపజేసుకున్నాం. "నేనెందుకు దుర్గాప్రసాద్, అధికారంలో లేను, కనీసం శాసనసభ్యుడిని కూడా కాదు" అని బుద్ధప్రసాద్ గారు వారించినా వినలేదు నేను. ఎందుకంటే ఆయన నాకు ఆత్మీయ సోదరుడు. ఆ అధికారం చాలు విగ్రహాలు ఆవిష్కరించేందుకు. విగ్రహావిష్కరణ శాస్త్రీయ నృత్య కళోత్సవం పేరున మూడురోజులు ఘనంగా నిర్వహించాం. దేశవిదేశాల్లో నాట్యాచార్యులుగా ఉన్న నా శిష్యులు వారివారి శిష్యులతో నృత్యప్రదర్శనలు చేసారు. నా శిష్యులు, ప్రశిష్యుల ప్రదర్శనలు చూసి నేనే గాదు, శ్రీ బుద్ధప్రసాద్ గారు కూడా మహదానందం చెందారు. ఇది ఒక అరుదైన అనుభూతి.

అలా గత తొమ్మిది వసంతాలుగా మా బంధం దినదినాభివృద్ధి చెందింది. ఎంతగానంటే నేను రచించిన కవితా సంపుటి 'నందివర్ధనాలు' ఆవిష్కరణ ఆయన చేతిమీదుగా జరగాలని ఆరు నెలలు ఎదురు

చూసేంతగా, నేను రచించిన నృత్య శిల్ప శాస్త్ర సమ్మిళిత ప్రణయ కావ్యం 'అమరవసంతం' ఆయనకే అంకితమిచ్చేంత గొప్ప అనుబంధం, ఆత్మబంధం మా ఇద్దరి మధ్యా.

నాకు నచ్చిన మనస్సుకు హత్తుకొన్న మరో చిన్న విషయం వివరించేసి ముగించేస్తాను.

బుద్ధప్రసాద్ గారబ్బాయి రాజా. తండ్రిని మించిన వినయ సౌమ్యశీలి. అతడ్ని చూస్తే ఎంత ముచ్చటో నాకు. అమాత్యవర్యుల పుత్రరత్నాలు ఎలా ఉంటారో, ఎలా ఉన్నారో చూస్తూనే ఉన్నాం. కానీ.... అందుకు భిన్నంగా చిరంజీవి రాజాని చూస్తుంటే అబ్బా! ఇలాంటి కొడుకొక్కడున్నాచాలు. జన్మ తరిస్తుంది గదా అన్పిస్తుంది నాకు. అలాగే శ్రీ బుద్ధప్రసాద్ గారి శ్రీమతి, ఆ అమ్మను చూసినా, మాట్లాడినా ఇంట్లో తోబుట్టువును చూస్తున్న భావన. బుద్ధప్రసాద్ గారి కుటుంబంలో నాకు పరిచయం ఉన్న ముగ్గురు సంస్కారానికి, సౌమ్యతకు, నిరాడంబరత్వానికి నిలువెత్తు రూపాల్లా అన్పిస్తారు నాకు.

శ్రీ బుద్ధప్రసాద్ గారు ఈనాటి రాజకీయాల్లో ఉండాల్సిన వ్యక్తి గాదు. దోచుకోవాలి, దాచుకోవాలి, గ్రూపులు కట్టాలి వంటి పదాలు తెలియని నిష్కల్మష నిరాడంబర నేత. నాయకత్వ లక్షణాలు నిండుగా గలిగిన వల్లభుడు. ఏ దేశమేగినా, ఎందుకాలిడినా తెలుగుజాతి, తెలుగుభాష, తెలుగు సంస్కృతి, తెలుగు సంప్రదాయాలు వెదికి పట్టుకుని, ప్రపంచ దేశాలలోని తెలుగువారినందరినీ బంధువులుగా చేసుకున్న తెలుగు ప్రజల ఆత్మబంధువు శ్రీ బుద్ధప్రసాద్ ఒక్కరే. ఇందులో అతిశయోక్తి ఆవగింజంతైనా లేదు. ముఖ్యంగా కళలన్నా, కళాకారులన్నా ముఖ్యంగా నా వంటి బీద కళాపండితులన్నా ఆయనకు మక్కువ ఎక్కువే. అందుకే అన్పిస్తుంది ఆయన భాషా సాంస్కృతిక శాఖామాత్యులయితే బావుండునేమో. అంతరించిపోయిన, పోతున్న ఎన్నో కళారూపాలు పునఃవైభవాన్ని సంతరించుకునే అవకాశం, ప్రపంచ కళావేదికపై అగ్రపతాక ఎగురవేసే అవకాశం ఆంధ్రకళాకారులకు దక్కుతుందనిపిస్తుంది. ఇలా వ్రాస్తూపోతే ఎంత వ్రాసినా తనివి తీరదు.

నిరాడంబర నిస్వార్థ సౌమ్య వినయశీలికి
విద్యల మర్మం, విజ్ఞత నెరిగిన వినమ్ర శీలికి
ఎంత ఎదిగినా ఒదిగి ఉండే మానస వికాసమూర్తికి
అరవై ఏళ్ళ పండుగ, తెలుగువారి గుండెల నిండుగా
ఆనంద సంబరాలు అంబరాన్ని తాకేలా

శ్రీ బుద్ధప్రసాద్ గార్ని, వారి కుటుంబాన్నీ చల్లగా చూడమని
ఆ కుటుంబాలు దినదిన ప్రవర్ధమానం కావాలని
ఆ గిరిజా నటరాజ స్వామిని జపిస్తూ
ఆత్మీయ సోదరునికి నిండు నూరేళ్ళూ
ఆయన కీర్తి వెయ్యేళ్ళూ కావాలని ఆకాంక్షిస్తూ...

తెలుగు భాషా సంస్కృతుల తోటమాలి

- ఏ.ఎస్. మూర్తి

'ఎంతచక్కనిదోయి ఈ తెలుగు తోట ఎంత పరిమళమోయి ఈ తెలుగు పూలు"....

– కందుకూరి రామభద్రరావు

ఒక తోటమాలి ఎంత నిరాడంబరుడో అంత క్రియా శక్తి శీలుడు. సజీవ చైతన్య శిల్పం. శిల్పి ప్రతిభకు ప్రతీక. కానీ తోటమాలి సేవ నిరంతర అనుసృజన చైతన్యం. తోటలో నారువేసి, నీరుపోసి నిరంతర పోషణ అందిస్తే గాని అది మొగ్గ తొడిగి పూలు పూసి అమృత ఫలాలను అందియ్య లేదు, అదే తెలుగు భాష, సంస్కృతుల పరిస్థితి ఈనాడు. తెలుగు భాష మధుర పీయూష. తెలుగు సంస్కృతి విశ్వచైతన్య దీప్తి. ఈ భాషా సంస్కృతుల అభివృద్ధికి అనన్య సేవలను అందించిన మహనీయులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు. ఆయనను చూడగానే గుర్తు వచ్చేది వారి తండ్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు. మోచేతి వరకు చలువ చేసిన చొక్కా, గోచీ పోసి కట్టిన పంచకట్టు, ఆత్మీయంగా పలకరించే ఆయన చిరునవ్వు – మూర్తీభవించి బుద్ధప్రసాద్ గారిలో దర్శనమిస్తాయి. శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు ప్రారంభించిన తెలుగు భాషా సంస్కృతుల పునరుజ్జీవనోద్యమాన్ని, అంతర్జాతీయ తెలుగు మహాసభలను శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు అనుసృజనం చేసారు. నాలుగు దశాబ్దాల పాటు రాజకీయరంగాన్ని సేవానిరతితో పునీతం చేసారు. ఉద్యమాలలో నిబద్ధతకు మారుపేరుగా అన్ని ఆటుపోట్లనూ తట్టుకుని ధ్యేయానికి నిలబడ్డారు.

దివిసీమలో సంభవించిన కనీవినీ ఎరుగని తుఫాను బీభత్సాలలో బాధార్తులకు కృష్ణారావు గారు, బుద్ధప్రసాద్ గారు అందించిన సేవలు అనూహ్యమై ఈనాటికీ వారికి ప్రజల నీరాజనాలను అందిస్తున్నాయి. 1999, 2004 ఎన్నికల్లో గెలుపొంది రాష్ట్ర పశుసంవర్ధక శాఖామాత్యులుగా వారు ప్రారంభించిన పశుక్రాంతి, జీవక్రాంతి పథకాలు, ఉన్నతస్థాయి ఆసుపత్రులు, సంస్థలూ ఈనాటికీ ఆ శాఖకు మార్గదర్శకంగా నిలుస్తాయి. బుద్ధప్రసాద్ గారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ ఉప సభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం ఆయన సేవా నిరతికి, ఆయన పట్ల తెలుగు జాతి అభిమానానికి నిదర్శనం.

శ్రీ బుద్ధప్రసాద్ గారు ఒక ప్రక్క ప్రజా సేవలకు ఎంత ప్రాధాన్యమిచ్చి కృషి చేసారో, మరో ప్రక్క తెలుగు భాషా సంస్కృతుల అభ్యున్నతికి అంత కృషి చేసారు. ప్రభుత్వ అధికార తెలుగు భాషా సంఘ అధ్యక్షులుగా తెలుగు విస్తృత వినియోగానికి కృషి చేసారు. పాఠశాలల్లో తెలుగు మాధ్యమంగా భాషా బోధనకు ఆయన చేసిన కృషి అసామాన్యం. తెలుగు నేలలో తెలుగు బోర్డులు ఉండాలన్న ఆయన కృషి ఫలితమే పట్టణాల్లో కనిపించే తెలుగు బోర్డుల దర్శనం. కృష్ణా జిల్లా రచయితల సంఘం భూమికగా సాగిన తెలుగు భాషోద్యమంలో, తెలుగు భాషకు ప్రాచీన ప్రతిపత్తి సాధించడంలో, రాష్ట్ర ఉద్యమంలో, తెలుగు భాషా సంస్కృతులకు అంతర్జాతీయ వేదిక కల్పించడంలో ఆయన పాత్ర కీలకం.

2014లో తిరుపతిలో జరిగిన 4వ అంతర్జాతీయ తెలుగు మహోత్సవాల నిర్వహణలో ఆయన పాత్ర ఆ తెలుగు మహోత్సవాల విజయానికి జీవం పోసింది. తెలుగు భాషమీద, సాహిత్యం మీద, సంస్కృతి మీద, అనేక గ్రంథాల రచనకు, ప్రచురణకు ఆయన ఒక అద్భుత స్ఫూర్తి. సాధారణంగా ఒక వ్యక్తి జన్మదినోత్సవంలో ఆవిష్కరించబడిన ఏ గ్రంథమైనా ఆ వ్యక్తి సాధించిన విజయాలకు అద్దం పడుతుంది. అయినా శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి యాభై ఆరవ జన్మదిన కానుకగా వెలువడిన 'వ్యాసమండలి' గ్రంథం తెలుగు భాషా సంస్కృతుల బహుముఖీన వైశిష్ట్యానికి అద్దం పట్టింది.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి గురించి ఎంత వ్రాసినా తక్కువే. అయినా ఈ షష్టిపూర్తి ఉత్సవం ఆయనకు మరింత ఆరోగ్య ఐశ్వర్యాలతో పాటు తెలుగుభాషా సంస్కృతుల సేవానిరతిని కలిగించాలని వారి నించి మరిన్ని ఉద్యమాలు ఉద్భవించి తెలుగు భాషా సంస్కృతులు విశ్వ విజ్ఞాన జ్యోతులుగా పల్లవించాలనీ మా బోంట్ల ఆశ, ఆకాంక్ష.

అభినందన

బుద్ధప్రసాదు గారు గాంధేయవాది. కళాబంధు. శాసనసభ్యుడిగా గణనీయంగా కృషి చేసి తెలుగు భాష సుసంపన్నం చేసాడు. అధికార భాషా సంఘం అధ్యక్షునిగా అపారమైన కృషి చేసిన అ మహామనిషి.

షష్టిపూర్తి సందర్భంగా ఇవే నా శుభాకాంక్షలు.

- ఏడిద గోపాలరావు
రంగస్థల గాంధీ
ఫోన్: 9490748851

అభినందన

- డా. జుర్రు చెన్నయ్య

మండలి బుద్ధప్రసాద్ గారి పేరు విన్న వారికి ఆయన నిలబెట్టిన వారసత్వం గుర్తొస్తుంది. ఒక్కో పేరు చెబితే మెచ్చేవారున్నట్లే నచ్చని వారు కూడా ఉంటారని అందరూ అంగీకరిస్తారు. కాని బుద్ధప్రసాద్ గారు అలా కాదు నూటికి నూరుపాళ్ళు ఆయన అందరికీ ఇష్టమైన వ్యక్తి, గౌరవించబడే వ్యక్తి. తండ్రి మండలి వెంకట కృష్ణారావుగారి వేలు పట్టుకుని తిరుగుతూ ఆయన సేవ చేసిన అన్ని రంగాల్లో తాదాత్మ్యాన్ని ఏర్పరచుకున్నారు. కృష్ణారావు గారి కృషి ఆగిపోయిన చోట ఆయన వారసునిగా ఆ కృషిని భుజానికెత్తుకున్నారు బుద్ధప్రసాద్ గారు. ఆ కృషి కొనసాగుతూనే ఉంది.

గాంధేయవాదాన్ని, భాషాసాంస్కృతిక సమైక్యతావాదాన్ని, సేవాగుణాన్ని, అందరితో సత్సంబంధాల్ని, విలువలు కలిగిన వ్యక్తిత్వాన్ని తండ్రి కొనసాగించారు. తండ్రిగారి జీవన సందేశాన్ని అక్షరాలా స్వీకరించి తన సాఫల్య జీవనాన్ని కొనసాగిస్తున్న బుద్ధప్రసాద్‌గారు ఆదర్శప్రాయులు. ఇన్ని సంవత్సరాల్లో అటు రాజకీయాల్లో కొనసాగుతూనే ఇటు భాషా సాంస్కృతిక రంగంలోనూ ఏకకాలంలో కొనసాగారు. ఈనాడు అత్యంత గౌరవనీయమైన శాసన సభ ఉపసభాపతిగా ఉన్నారు. అందరూ చిన్న చూపుచూసే పశుసంవర్ధక, మత్స్యశాఖకు మంత్రిగా పనిచేసి తన కృషితో శాఖకు ప్రజల్లో గౌరవం పెంచారు. ఎన్నో వినూత్నమైన పథకాలు ప్రవేశపెట్టారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయనను అధికార భాషా సంఘ సభ్యులుగా నియమించింది. భాషా సాహిత్య రంగాల్లో ప్రత్యక్ష పాత్ర నిర్వహించిన అనుభవం లేకున్నా, ప్రత్యక్ష పాత్ర నిర్వహించి ఆ పదవిని చేపట్టిన చాలామంది కంటే సమర్థంగా బుద్ధప్రసాద్‌గారు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా రాష్ట్రం వెలుపల వివిధ ప్రాంతాల్లో, విదేశాల్లో కూడా భాషా చైతన్యాన్ని పెంపొందించారు. అధికార భాషా సంఘానికి గట్టిగా మాట్లాడితే ఎటువంటి అధికారాల్లేవు. నిధులు లేవు. కాని తనకున్న గౌరవంతో పదవిని వెలిగించి భాషాభిమానాన్ని రేకెత్తించేందుకు బుద్ధప్రసాద్ గారు చేసిన కృషి ప్రశంసనీయమైంది.

విద్యాసంస్థల్లో అధ్యయనాంశంగా క్షీణదశకు చేరిన దశలో ప్రజా ఉద్యమ నిర్మాణానికి ఆయన సర్వశక్తులు ఒడ్డి పనిచేశారు. రాష్ట్రవ్యాప్తంగా భాషాభిమానులను, కవి రచయితలను, తెలుగు అధ్యాపకులను ఒక్క తాటిమీదకు తెచ్చారు. తెలుగుకు ప్రాచీన భాషా ప్రతిపత్తి సాధించడానికి జరిగిన కృషిలో ముఖ్య భాగస్వామి అయ్యారు. ఇతర రాష్ట్రాల్లో తెలుగు పరిరక్షణ కోసం ఆ రాష్ట్రాల తెలుగువారు పడుతున్న తపనను అర్థం చేసుకొని శాసన మండలి అధ్యక్షులు, పెద్దలు డా. ఎ. చక్రపాణి గారితో కలిసి ప్రభుత్వాన్ని ఒప్పించి శాసన సభ, శాసనమండలి ఉభయసభల సభ్యులతో సభాసంఘాన్ని వేయించారు. కృష్ణా జిల్లా రచయితల సంఘానికి వెన్నుదన్నుగా నిలిచి ప్రపంచ తెలుగు రచయితల మహాసభలను విజయవంతంగా జరిపించారు. భద్రంగా దాచుకొని చదువుకోదగ్గ ప్రత్యేక సంచికలను ప్రచురింపజేశారు. మండలి వెంకట కృష్ణారావు గారు

మొదటి, రెండవ ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణకు ప్రేరకులు, కారకులైనారు. మూడో ప్రపంచ తెలుగు మహాసభలను తెలుగు విశ్వవిద్యాలయం తరపున మారిషస్‌లో 1990లో నిర్వహించినపుడు వారు స్వయంగా బుద్ధప్రసాద్ గారితో కలిసి పాల్గొని తమ ఆశీస్సులందించారు. నాలుగో ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణకు సారథ్యం వహించడం ద్వారా బుద్ధప్రసాద్ ఆ స్ఫూర్తి కొనసాగించారు.

'ప్రాచీన భాష నుంచి ప్రపంచ భాషగా తెలుగు' అనేది నేటి మనందరి కర్తవ్యం. అయితే లక్ష్యనిర్దేశంలోనే గాక అందుకు కావలసిన రంగాన్ని సిద్ధం చేయడంలో కూడా బుద్ధప్రసాద్ గారి కృషి ప్రముఖంగా చెప్పుకోదగింది. 2011లో సిలికానాంధ్ర బుద్ధప్రసాద్‌గారి ప్రోత్సహంతో హైదరాబాదులోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఒక సదస్సును ఏర్పాటు చేసింది. మొట్టమొదటిసారిగా భాషావేత్తలు, పత్రికా సంపాదకులు, సమాచార సాంకేతిక పరిజ్ఞాన రంగంలో భాషను వినియోగిస్తున్న నిపుణులను ఒక వేదిక మీదకు తేవడం జరిగింది. అంతర్జాలంలో తెలుగు ఇతర భాషల కంటే అధికంగా వినియోగించుకునే పరిస్థితి రావాలని, తెలుగు భాషా సాహిత్యాలను అంతర్జాల మాధ్యమంలోకి తేవాలని ఆ సదస్సులో నిర్ణయించారు. అప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో పొన్నాల లక్ష్మయ్య గారు ఐటి శాఖా మాత్యులు. ఆయన కూడా బుద్ధప్రసాద్ గారి ఆలోచనలకు సంపూర్ణంగా మద్దతు పలికారు. ఫలితంగా సిలికానాంధ్రతో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమెరికాలో కాలిఫోర్నియాలోని మిల్పిటాస్‌లో తొలి అంతర్జాతీయ తెలుగు అంతర్జాల సదస్సు (ఐ.టి.ఐ.సి) నిర్వహించింది. తెలుగుకు అది ప్రపంచ వేదికగా నిలిచింది. అంతర్జాలంలో వినియోగించడానికి తెలుగు ఖతులను (యూనికోడ్) తయారు చేయాల్సిన అవసరాన్ని గుర్తించింది. అప్పటికప్పుడు ఫాంట్స్ తయారీకి అయ్యే ఖర్చును దాతలు విరాళంగా ప్రకటించారు. పొన్నాల, మండలి వెంకటకృష్ణారావు, ఎన్.టి. రామారావు, లక్కిరెడ్డి హనిమరెడ్డి, రవి ప్రకాశ్ వంటి పేర్లతో ఖతుల తయారీ ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార సాంకేతిక పరిజ్ఞాన ఉపసంఘు సభ్యునిగా మండలి బుద్ధప్రసాద్, మంత్రి పొన్నాల కృషి వల్ల 'తెలుగు విజయం' అనే పోర్టల్‌ను ప్రారంభించారు. అప్పట్లో 18 తెలుగు యూనికోడ్ ఖతులు తయారయ్యాయి. వినియోగంలోకి వచ్చాయి. కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని నిపుణుల సహకారం మరువలేనిది. ఈ కృషికి కేంద్రబిందువు మండలి బుద్ధప్రసాద్‌గారు. తర్వాత ఐ.టి.ఐ.సి సదస్సు విశాఖలో జరిగింది. ఈ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే అవకాశం నాకు లభించింది, సిలికానాంధ్ర కార్యదర్శి హోదాలో.

సౌజన్యం, నిరంతర అధ్యయనం, భాషాభిమానం, భాషకోసం ఏమైనా చెయ్యాలనే అంకిత భావం, భాషా సాంస్కృతిక రంగాల్లో మమైక్య భావం ఇట్లా మండలి వారిని వివిధ రకాల సేవా మండలిగా పేర్కొనాలి.

వారి అరవై యేళ్ళ పండుగ అనంతర జీవిత లక్ష్యాల సాధనకు కార్యాచరణ నిర్దేశించుకునే తరుణంగా భావిస్తూ దివి సీమ మణిహారమైన మండలి బుద్ధప్రసాద్ దంపతులకు షష్ట్యబ్ద పూర్తి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

సౌజన్యశీలి

- డా. దుర్గెంపూడి చంద్రశేఖర రెడ్డి

చూడగానే సౌజన్యమూర్తిగా కనిపిస్తారు, ఆత్మీయంగా పలకరిస్తారు. చిరునవ్వుతో మాట్లాడతారు. ఎదుటివ్యక్తితో వ్యవహరించడంలో ఆ వ్యక్తి అంతస్తును చూడరు, చిన్నా పెద్దా భేదం లేకుండా, అరమరికల్లేకుండా వ్యవహరిస్తారు. వినయం ఉట్టిపడుతూ ఉంటుంది. తెలుగువారి చరిత్ర, సంస్కృతి విషయంలో మహా పట్టుదల, సుబ్రహ్మణ్యశాస్త్రి గారికి గజమెత్తు పుస్తకాలు రాయించాలన్న కోరిక, సాహిత్య సమరాంగణ చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలంటే చెప్పలేనంత అభిమానం. ఎంత వినయ సంపన్నుడైనా ఎవరి వద్దా తలవంచనీయని స్వాభిమానం. రాజకీయాల్లో మునిగి తేలుతున్నా ఆ బురద అంటించుకోని నిష్కల్మష హృదయం. అధికార రాజకీయాల పట్లా తామరాకు మీది నీటిబొట్టులా ఉండగలిగిన పరిణత హృదయం. మండలి బుద్ధప్రసాద్ గారిని వర్ణించడానికి ఈ వాక్యాలు సరిపోతాయి.

బుద్ధప్రసాద్ గారికి అప్పుడే అరవయ్యేళ్లా అనిపిస్తుంది. వారి తండ్రి కృష్ణారావుగారు విద్యామంత్రిగా పరిచితులే. ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలలో సర్వం తానే అయి నిర్వహించినవారు. మొదటిసారి దాదాపు పదిహేనేళ్ల క్రితం బుద్ధప్రసాద్ గారిని చూసినప్పుడు ఆయన ఎలా ఉన్నారో ఇప్పుడూ అలానే కనిపిస్తున్నారు, రూపంలోనే కాదు అన్ని విధాలా, అందుకే ఈ ఆశ్చర్యం!

'శ్రీకృష్ణదేవరాయ వైభవం' ప్రచురణ సమయంలోనే బుద్ధప్రసాద్ గారితో కొంత సమయం గడిపే అవకాశం కలిగింది. ఆయనతో మరో నలుగురయిదుగురం మిత్రులం కలిసి హంపీ విజయనగరం చూడ్డానికి వెళ్లాం. రాయల గురించి పుస్తకం వేస్తూ హంపీ వియనగరం చూడకుండా ఎట్లా? మూడు రోజులు ఈ యాత్ర, కారు ప్రయాణం. అక్కడ తుంగ్రభద్ర ప్రాజెక్టువారి గెస్ట్‌హౌస్‌లో విడిది. విజయనగరమంతా చూసిన తర్వాత ఆరవీటి వంశంలో ఇప్పటి తరం అచ్యుతదేవరాయల ఆతిథ్యం స్వీకరించాం. ఆనెగొందిలో వారి పురాతన నివాసాలు చూసి వారి తమ్ముడి ఆతిథ్యం కూడా తీసుకున్నాం. ఈ పర్యటన మొత్తంలో బుద్ధప్రసాద్ గారు విజయనగరానికి సంబంధించి తెలుసుకోవలసిన అన్ని విషయాలూ పరిశీలించడంలో గడిపారు, ఆయన జిజ్ఞాస గొప్పది.

తెలుగువారి చరిత్ర, సంస్కృతి, సాహిత్యాల పట్ల ఒక రాజకీయ నాయకుడికి (ఇది అసలాయన ప్రవృత్తి కాదేమో) ఇంత ఆస్థ, అభిమానం ఉండడం ఆశ్చర్యకరమే. గత తరంలో ఇది కొంత సహజమే అయినా ప్రస్తుత పరిస్థితుల్లో ఇవి అంటరానివై పోయాయి. తరువాతి కాలంలో బుద్ధ్రసాద్ గారితో అనేక పర్యాయాలు మాట్లాడే అవకాశం కలిగింది. పుస్తకాలు, పుస్తక ప్రచురణ విషయాలు తప్ప మరో విషయం మాట్లాడిన సందర్భాలు అరుదు. అందుకే ఆయనతో పరిచయం సుఖంగా ఉంటుంది, మాట్లాడడం హాయిగా ఉంటుంది. ఈ సజ్జన సాంగత్యం నిరంతరాయంగా కొనసాగాలని కోరుకుంటూ, ఆరుపదుల ఈ నవయువకుడి ఆంధ్రసంస్కృతీ సేవా పరాయణత్వం వర్ధిల్లాలని అభిలషిస్తూ, అభినందనలు తెలియజేస్తున్నాను.

'సాహిత్య తీర రేఖ'

- యం.కె. సుగమ్ బాబు

ఒక సాహిత్య ప్రేమికుని నిజాయితీని మనం ఎలా అంచనా వేస్తాం? అతను సాహిత్యమంటే ఇష్టపడతాడనా? లేక సాహిత్య తరాల వెంబడి నిరంతరం ప్రయాణిస్తూ ప్రవాహ తీరుతెన్నుల్ని పరిశీలిస్తూ అవసరమైన వేళ ప్రత్యక్ష సాక్షిగా నిలుస్తాడనా?

– అవును! ప్రత్యక్ష సాక్షిగా వివరిస్తాడనే!

చాలామంది సాహిత్యాభిలాషులు సాహిత్య పరిమళాన్ని ఆస్వాదించడానికి లేదా అదో సెంట్‌లా ఒంటికి పూసుకోడానికి లేదా తమ భేషజాలకు రంగులద్దడానికి ఉపయోగించుకోవడం మనం చూస్తూనే ఉన్నాం. అయితే అందుకు భిన్నంగా ఒక సాహిత్యాభిలాషి ఉన్నాడు. నిలువెత్తు మనిషి. స్వచ్ఛమైన పలుకు, సజావైన నడక. గ్రంథస్థం చేయదగిన వాక్కు, అభ్యుదయ దృష్టి. ఆకర్షణ అనే పదానికి పర్యాయపదంలా ఉంటాడాయన.

– ఆయన పేరు అందరూ ఎరిగిందే శ్రీ మండలి బుద్ధప్రసాద్!

×××

విజయవాడ, 'ఎక్స్‌రే' పత్రిక సంపాదకుడు శ్రీ కొల్లూరి 2007లో నిర్వహించిన జాతీయ కవితల పోటీకి నేను న్యాయనిర్ణేతగా వ్యవహరించడం జరిగింది. ఆ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదాన సభకు శ్రీ బుద్ధప్రసాద్ వచ్చారు. ఆయన చేతుల మీదుగానే విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. అందులో విశేషం ఏమీ లేదు. కానీ, కార్యక్రమంలో శ్రీ బుద్ధప్రసాద్ నా గురించి చెప్పిన మాటలు నన్ను ఆశ్చర్యంలో కట్టిపడేశాయి. నేను గుంటూరు వాణ్ణినీ, జాషువా, జంధ్యాల పాపయ్యశాస్త్రి ప్రభృతులు నా గురువులనీ, 'పైగంబర' కవిత్వోద్యమాన్ని ప్రారంభించి, గుంటూరు జిల్లాకు ఒక ప్రత్యేకత కట్టబెట్టానని ఆయన ఆనర్గళంగా చెబుతుంటే నేను గతంలోకి వెళ్ళిపోయాను. 1985లో ఆనాటి ముఖ్యమంత్రి శ్రీ ఎన్టీఆర్ చేతుల మీదుగా గురజాడ–జీవితం–సాహిత్యంపై నేను రచించి దర్శకత్వం వహించిన 'అస్తమించని సూర్యుడు' డాక్యుమెంటరీ చిత్రానికి రాష్ట్ర బంగారు నందిని అందుకున్నాని ఆయన చెప్పడం నేను ఊహించని విషయం. సుగమ్‌బాబును గురించి ఇంత సమాచారం ఆయనకు ఎలా అందింది? దానిపై నమ్మకమెలా కుదిరింది? ఇప్పటికీ నాకు తోచదు. ఒక ఆత్మీయ కవిగా, జర్నలిస్ట్‌గా ఆయన నన్ను అభిమానించిన తీరు, సభలో చేసిన సన్మానం ఎప్పటికీ మరిచిపోలేను.

×××

గత సంవత్సరం 2015లో నేను రాస్తున్న రెక్కల ప్రక్రియలో మూడవ భాగంగా రానున్న 'దారి' సంపుటాన్ని శ్రీ బుద్ధ ప్రసాద్ గారికి అంకితమివ్వదల్చి ఆయనతో ఫోన్‌లో మాట్లాడాను. ఆయన వెంటనే


అంగీకారం తెలియజేశారు. ఇది కూడా ఆశ్చర్యాన్ని కల్గించిన విషయమే. 'రెక్కలు' ప్రక్రియ ఏమిటో, అందులోని విషయమేమిటో, నేనేం రాశానో అని కూడా చూడకుండా ఆయన ఒప్పుకోవడం మామూలు విషయం కాదు. అయితే నేను గ్రహించిన విషయమేమిటంటే శ్రీ బుద్ధప్రసాద్ సమకాలీనంగా వస్తోన్న సాహిత్యాన్ని ఎప్పటికప్పుడు 'ఫాలో' అవుతున్నారని, 'అప్‌డేట్'గా ఉన్నారని. లేకుంటే ఆయన స్థాయి దెబ్బతినే అవకాశం ఉంది కదా!

×××

దటీజ్ శ్రీ మండలి బుద్ధప్రసాద్. నిరంతరం ఆయన సత్ సాహిత్యానికి, కవులు, రచయితలు అలాగే కళాకారులకు చల్లని పచ్చని పందిరిలా నీడనిస్తారని, ఆదరిస్తారనీ నమ్ముతున్నాను. ఈ నెల 27వ తేదీన స్థానిక 'రవీంద్రభారతి'లో జరిగే వారి షష్ట్యబ్ది మహోత్సవం జయప్రదం కావాలని, అవుతుందని మనస్ఫూర్తిగా విశ్వసిస్తూ నా హృదయపూర్వక శుభాకాంక్షలు, ఆశీస్సులు అందజేస్తున్నాను.

"నీ బలమైన ఆకాంక్ష
అద్భుతం చేస్తుంది
ఆశ్చర్యాలను
సృష్టిస్తుంది -

కాళ్ళు కడుగుతుంది
సముద్రం!" ('దారి' రెక్కలు-3 సంపుటి నుంచి)



న్యూజెర్సీ డిప్యూటీ స్పీకర్
శ్రీ చివుకుల ఉపేంద్రతో

గమిష్యామి

- డా. జి. కృపాచారి

సకల కార్యనిర్వహణా చతురత, సర్వజన సామాన్య సద్గుణమమేక శీలి, సత్త్వగుణ సంపన్న సౌమ్యమిత్ర శ్రేయోభిలాషి, చిరునగవుల చిరునామా, భూషణ భాషిత సహజ స్నేహపాత్రుడు అయిన శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి షష్ట్యబ్ది మహోత్సవ అభినందన నాకు చాలా ఆనందం కలిగించింది. అరవైయ్యేళ్ళ జీవిత చక్రం అధిగమించి మరో నూతన జీవన ఆవిష్కరణకు అభినందన శుభనందనమే!

సన్మార్గ శైశవ జీవనంలో నాన్నగారి ప్రభావం సముత్తుంగ సముజ్వల ప్రభాధూత పతంగమై తెలుగు వారందరి హృదయ కుహురాలలో సుస్థిర స్థానం సంపాదించడం అంత సామాన్యమూ కాదు. సాధారణ విషయమూ కాదు. రైతు జన బాంధవుడిగా, అణగారిన వర్గాల ఆప్తుడిగా అన్నివేళలా ఆపన్న హస్తమందించే అమృతమూర్తిగా మండలి వారి సన్మంగళ సేవాజీవితం భవితకే మార్గదర్శకం. పులిగడ్డ–పెనుమూడిలో నిర్మించిన 'మండలి వేంకట కృష్ణారావు వారధి' కృష్ణా–గుంటూరు, ప్రకాశం జిల్లాల ప్రజలను దగ్గర చేసి మనువులకు, మనవులకు, మనుమల సంతానాలకు దగ్గరదారి చూపిన దార్శనికుడు.

తేనెలొలుకు తెలుగుభాషను విశ్వవ్యాప్తం చేస్తున్న నిరంతర తెలుగు భాషాప్రేమికుడు. అమ్మభాషను ప్రపంచ తెలుగు మహాసభల ద్వారా సజీవ భాషగా చేసి, తెలుగు జాతి ఔన్నత్యం, వేవేల వత్సరాదిగా స్థిరపరచి 'ప్రాచీన భాషహోదాకు' నిరంతర నిర్విరామ కృషి సలిపి తెలుగుతల్లికి జీవం పోసిన తెలుగు భాషా జీవ ప్రసాదమే మన మండలివారు, వారి సన్మండలి పద్మశ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మహోదయులు. కృష్ణా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. తెలుగు కృష్ణార్పణం కాకుండా నిలిపి, తెలుగు పిల్లలకు చేయూతనిస్తున్న కార్యసాధకులు.

భారతదేశం అంటే మహాత్మాగాంధీని స్మరిస్తుంది ప్రపంచం. అంతటి మహాత్ముని అడుగుజాడలో నిలచిన శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి జీవితం, జీవనం, గమనం అన్నీ శుభప్రదం కావాలని ఆశిస్తూ ఆకాంక్షిస్తూ షష్ట్యబ్ది శుభాకాంక్షలు.

మంచి మనిషి

- ఎం.వి. రమణకుమారి, ఎం.వి. సుబ్బలక్ష్మి

అసాధారణ ప్రముఖులు తాము ఎంత ఎత్తుకెదిగినా సామాన్యులుగానే ఉంటారనే సత్యానికి ఉదాహరణగా నిలిచే గొప్ప వ్యక్తి శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు. పెట్టిన పేరును సార్థకం చేసుకునేలా వారి జీవన గమనం సాగడం గమనార్హం. అజాత శత్రువుగా అందరి అభిమానాన్ని చూరగొంటూ అనేక విషయాలలో తనదైన అండదండలనందించే సహృదయ స్వభావి. ఆయన గుణగణాలు, ఇతరుల పట్ల చూపే ఆత్మీయతాభిమానాలు, నిరాడంబరత, నెమ్మదైన మాటలను చూస్తే, అరాచకీయ రాజకీయాలలో, వీరు ఎన్నో అద్భుతమైన విజయాలు సాధించడంలో ఆయన మంచితనం వెల్లివిరుస్తుంది. తరతమభేదాలు పాటించని బుద్ధప్రసాద్ గారి తత్వం, తెలుగు భాష గౌరవాన్ని పెంచి తెలుగు సంస్కృతికి అభివృద్ధి బాటను ఏర్పరచింది.

సేవా కార్యక్రమాలకు అందెవేసిన చెయ్యిగా బుద్ధప్రసాద్ గారు ఎన్నో శాఖలలో రాణించి, అనేకులకు ఆపద సమయాలలో ఆదుకున్న సంఘటనలు కోకొల్లలు. గాంధేయవాదిగా, ఆయన సిద్ధాంతాలను బాల్యం నుండే పాటించి, 'గాంధీ క్షేత్రం' పత్రికను నడపడం, ఆయన నిబద్ధతకు సూచన. పిన్న వయసునుండే కష్టాలను తెలుసుకున్న వ్యక్తులే, ఇతరుల ఇక్కట్ల పట్ల బాధ్యత వహిస్తూ సహాయాలను అందిస్తారని బుద్ధప్రసాద్ గారి ప్రవర్తన తెలియజేస్తుంది.

నిస్వార్థులు ప్రజా సంఘ సేవకులుగా వ్యవహరించగలరు అనేలా బుద్ధప్రసాద్ గారిని ఎన్నో పదవులు వరించాయి.

ఒక ఎం.ఎల్.ఏగా, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్యశాఖ మంత్రిగా, అధికార భాషా సంఘం అధ్యక్షులుగా, ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతిగా, కృష్ణాజిల్లా అభివృద్ధి, సాంఘిక సేవా తత్పరత, ప్రవాసాంధ్రుల సేవ, గ్రంథాభిమానిగా, ఆయన అందుకోని శిఖరాలు లేవు. శాంతం ఆయన ఆభరణం.

పిలవగానే ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సాంస్కృతిక సభలకు వచ్చి, కార్యకర్తల కాయకష్టానికి బాసటగా నిలిచే బుద్ధప్రసాద్ గారి ఔదార్యం అనితర సాధ్యం. కళలకు చుక్కానిగా, సాహితీవేత్తగా, సాంస్కృతిక సారథిగా మన్ననలను అందుకునే బుద్ధప్రసాద్ గారిని కన్న తల్లిదండ్రులు శ్రీమతి ప్రభావతి, మండలి వెంకట కృష్ణారావుల జన్మ ధన్యం. దివిసీమ కృష్ణా జిల్లా నాగాయలంకలో జన్మించిన బుద్ధప్రసాద్ గారు, ఆ ప్రాంతానికే కాదు, ప్రపంచానికే గర్వకారణం.

నిరాడంబరుడు - నిశ్చలమనస్కుడు

- గుడిమెట్ల చెన్నయ్య

"చిరునవ్వులతో విషవలయాలను ఛేదించి ముందుకు పదవోయి" అని పెద్దలు అంటారు. ఇది మండలి బుద్ధప్రసాద్ గారికి చక్కగా అన్వయిస్తుంది. ఎంతటి క్లిష్ట సమస్య అయినా తేలిగ్గా తీసుకొనే మనస్తత్వం ఆయనది. ఎల్లప్పుడూ చిరునవ్వులతో ఆయన పలకరించే విధానం అద్భుతం.

వారు ప్రసంగించేటప్పుడు అది సంక్లిష్టమైనా, సుదీర్ఘ ప్రసంగమైనా ఆహూతులను అలరింప చేస్తుందే కాని, విసుగు కలిగించదు. ఎందుకంటే వారు వాడే తెలుగు పదాలు సరళంగాను, సులభంగా అర్థమయ్యే విధంగానూ ఉంటాయి కాబట్టి.

ప్రపంచీకరణ నేపథ్యంలో మాతృభాషపై మమకారం తగ్గిపోతున్న ఈ దశలో వారు రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్ష పీఠం అలంకరించిన పిదప దేశములోని పలు ప్రాంతాలలో పర్యటించి, తెలుగుభాష మాధుర్యాన్ని, దాని ఔన్నత్యాన్ని విశదీకరిస్తూ మాతృభాషను ఎలా కాపాడుకోవాలో పలు సభలలో ఉద్బోధించేవారు.

తమిళనాడులో తెలుగు వారికి సంబంధించిన సమస్యలపై అనేక పర్యాయాలు మద్రాసుకు వచ్చి, పలు తెలుగు సంఘాల ప్రతినిధులతో, ప్రముఖులతో చర్చించి నివారణోపాయాల గురించి ముచ్చటించేవారు.

వారు ఒక పనిని చేపడితే అది పరిష్కారమయ్యేంత వరకు వారి కృషిని కొనసాగిస్తూనే ఉంటారు. రాష్ట్రేతర తెలుగు వారి సమస్యలలో తమిళనాడులోని తెలుగువారి సమస్యలు చాలా జటిలమైనవి కావున వాటిపై ఇప్పటికీ ఆయన తన ప్రయత్నాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు.

తెలుగు భాష, తెలుగు సంస్కృతులపై ఆయనకు మక్కువ ఎక్కువ. దీనికి చక్కటి ఉదాహరణ 2012 డిసెంబర్‌లో తిరుపతిలో జరిగిన 4వ ప్రపంచ తెలుగు మహాసభలే. అందు మన భాష యొక్క గొప్పతనాన్ని, మన సంస్కృతీ సంప్రదాయాలను రాబోయే తరాలకు తెలియజేసే ప్రయత్నములో అనేక వ్యయప్రయాసలకోర్చి ఆ సభలను నిర్వహించారు వారు.

అందు డిసెంబరు 28న జరిగిన 'రాష్ట్రేతర ప్రాంతాల తెలుగు వారు – సాంస్కృతిక సమస్యలు' అనే అంశంపై జరిగిన చర్చావేదికలో ఆనాడు నేనూ ఓ ప్రసంగికుడను. వారు, తమిళనాడు హోసూరు శాసనసభ్యులు శ్రీ కె. గోపీనాథ్‌తో వచ్చి అదే వేదికపై తమిళనాడులోని తెలుగువారి సమస్యలను కూలంకషంగా వివరించి తెలుగుభాషపై, తెలుగువారి సమస్యలపై తానెంతగా ఆవేదన చెందుతున్నారో తెలియపరచుకున్నారు.

ఇక వారి కలిమిడితనానికి మంచితనానికి మరో ఉదాహరణ. చెన్నైలో ఓ సభలో పాల్గొనేందుకు వచ్చిన వారిని, మా 'జనని' సంస్థ సత్కరించింది. సత్కరించే వారు ఎవరు? అది పెద్ద సంస్థా? చిన్న సంస్థా?

అని చూడక అడిగినదే తడవుగా మా అభ్యర్థనను మన్నించిన ఆయన విశాల మనస్తత్వానికి, సాధు స్వభావానికి ఇంతకు మించి వేరు నిదర్శనాలెందుకు?

అటువంటి మృదుభాషి, వినయశీలి, ఎదుటి వారిని గౌరవించే సహృదయులు అయిన శ్రీ మండలి బుద్ధప్రసాద్, ఆంధ్రప్రదేశ్, కృష్ణాజిల్లా, నాగాయలంకలో 1956 మే 26న మండలి వేంకటకృష్ణారావు, ప్రభావతి దంపతులకు జన్మించారు.

ప్రాథమిక విద్య జన్మస్థలములోనే ముగించుకుని, పట్టాను రాష్ట్ర రాజధాని హైదరాబాదు, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పొందిన వీరిని విజయలక్ష్మి (గారు) వరించింది(చారు). వీరికి ఇద్దరు ఆడ పిల్లలు, ఒక మగ పిల్లాడు. మంచి కుటుంబం మా మంచి విద్యాలయం అంటారు పెద్దలు. అందుకు వీరి కుటుంబమే తార్కాణం.

ప్రభుత్వ పరంగా రాష్ట్ర మంత్రివర్యులుగా, రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులుగా, మూడుసార్లు (1999, 2004, 2014) శాసనసభ్యుడిగా తెలుగు ప్రజలకు ఎనలేని సేవ చేశారు. చేస్తున్నారు కూడా.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతిగా బాధ్యతలు నిర్వహిస్తూ, అటు తెలుగు భాషాసేవ, ఇటు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న వీరు మంచి రచయిత కూడా.

మరి ఉన్నత ఆశయాలు కలిగిన గుణసంపన్నుడు అయిన శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి షష్ట్యబ్ది సందర్భంగా వెలువరించే ఈ ప్రత్యేక సంచిక ద్వారా వారికి ఇవే మా శుభాభినందనలు. శుభాశీస్సులు.

విజయలక్ష్మి చేయి చెంతనుండ
ముద్దు బిడ్డలు ముఫ్వురు ముచ్చటగా నుండ
పదిహేను కోట్ల తెలుగు బిడ్డలు వారి గుండెలో నిండ
భాషా సంరక్షణకై అవని(గడ్డ)పై పయనించుచున్నాడు
బుద్ధుడు, జగత్ ప్రసిద్ధుడు.

శతాయుష్మాన్‌భవ!

జై తెలుగు తల్లి!

బుద్ధపూర్ణిమ

- డా.పాలపర్తి శ్యామలానంద ప్రసాద్

శ్రీజాయపసేనానియు
తేజోనిధి కృష్ణరాయ దివ్యాకృతియున్
పూజార్హమైన దీవిని
రాజిల నీబుద్ధునందు ప్రసరించిరహో!

శ్రీమత్ గంధపాల గోత్రులు, మండలి వంశపయఃపారావార కువలయమిత్రులు, ప్రభావతీ వేంకటకృష్ణరాయ పుణ్యదంపతీ జ్యేష్ఠ పుత్రులు, విజయలక్ష్మీ పరిణయపరిపూర్ణగాత్రులు, విశ్వాంధ్ర జనాభిమానపాత్రులు, అస్మదాబాల్య మిత్రులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ విజయలక్ష్మి దంపతులకు ఉగ్రరథ శాంతి పౌష్టిక షష్టిపూర్తి జన్మదినోత్సవ శుభాకాంక్షలు!

మండలి వారు సంత వీధిలోను, మేము గుల్లపు చెరువుగట్టున అవ్వాఆరి ఇంటిలో నున్నప్పుడు మేమిద్దరము కాంద్రేగుల రాజావారి బంగళా ముందు వెలగచెట్లు, మొగలిపొదల మధ్యలో నున్న మండువాలోగిలిలో శ్రీ కోసూరి ధర్మరాజు గారి బడిలో పలకాబలపము పట్టితిమి. తరువాత మండలి వారు కాలువ అవతల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట స్వగృహములో ప్రవేశించిరి. నేను 'బాబు' కన్న రెండు తరగతులు క్రిందివాడను. సహాధ్యాయులము కాము కాని ఆయన కొన్ని రోజులు సంస్కృతము చదువుట వలన, నేను సంస్కృతం మాష్టారి అబ్బాయిని అగుట వలన మేము దగ్గరైతిమి.

కరువు కాలవ ప్రక్కన తాటితోపులు, చెఱకుతోటలు, వరిచేల మధ్య కొన్ని ఎకరాల విశాల ప్రాంగణములో ఒక పొడవైన పక్కా భవనము, రెల్లు పాకలు, పెద్ద గంట స్తంభము, కోడిపందేల పూల చెట్లు, కూరగాయల మొక్కలతో, సెవెంతు ఫారము వరకు ఉన్న అప్పటి అవనిగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్వరూపమును, హేమాహేమీలైన ఉపాధ్యాయులను, శ్రద్ధాసక్తులు, ఉత్సాహము గల విద్యార్థులను తలచుకొన్నచో ఒడలు పులకరించును. అప్పటి ఉపాధ్యాయుల పేర్లు, ఆకారములు, అలవాట్లు అన్నియు ఇప్పటికిని బుద్ధప్రసాదు గారికి గుర్తే. సంభాషణలలో ఎందరినో ప్రస్తావించుచుందురు.

శ్రీ బుద్ధప్రసాదు పందొమ్మిది వందల డెబ్బది యొకటిలో మార్చి నెలలో పదవతరగతి పరీక్ష వ్రాసెను. డెబ్బది మూడులో నేను వ్రాసితిని. డెబ్బదియొకటిలో శ్రీ మండలి వేంకట కృష్ణారావుగారు జపాను వెళ్ళి వచ్చిన సందర్భములోనో, డెబ్బదిరెండులో ఏకగ్రీవముగా శాసనసభకు ఎన్నికయి సాంఘిక సంక్షేమ, మత్స్యశాఖామాత్యులైన సందర్భములోనో అవనిగడ్డ హైస్కూలు వేదికపై అభినందన సభ జరిగెను. పద్యరచనాభ్యాసము చేయుచున్న నేను మండలి వారిపై ఒకటి రెండు పద్యములు ఒక గ్రాపు కాగితము వెనుక వ్రాసితిని. సభలో బెరుకుబెరుకుగా మిత్రులు బుద్ధప్రసాదుగారికి చూపితిని. ఆయన వెంటనే వేదిక దగ్గరకు

వెళ్ళి పెద్దలకు చెప్పి నన్ను వేదికపైకి పిలిపించెను. నేనుధైర్యముగా పెద్ద కవివలె మైకు ముందు పద్యములు ఎట్లు చదివితినో నాకు ఇప్పటికిని ఆశ్చర్యమే. మండలివారు వాత్సల్యముతో నన్ను దగ్గరకు తీసికొనిరి. పద్యములు వ్రాసిన కాగితముపై ఆంగ్లములో ఆశీర్వదించి చేవ్రాలు చేసియిచ్చిరి. కళలను, సంస్కృతిని ప్రోత్సహించుట, ప్రతిభావంతులైన చిన్నారులను గుర్తించి ఆత్మవిశ్వాసము కలిగించుట తండ్రిగారి నుండి 'బాబు' పుణికిపుచ్చుకున్న గొప్ప లక్షణము. ఈ సన్నివేశము నన్ను కవిత్వమువైపు నడిపినది. అప్పుడే మా పాఠశాలకు విశ్వనాథ వారికి ఆత్మీయులు, మహాకవి, సంస్కృతాంధ్ర, ఆంగ్ల, హిందీ భాషలలో మహాపండితులైన సద్గురువులు శ్రీ జోస్యుల సూర్యనారాయణ మూర్తి గారు తెలుగు ఉపాధ్యాయులగా వచ్చిరి. నేను వారింటిలో పిల్లవాడనై విశ్వనాథవారి సాహిత్యాధ్యయనము, కవిత్వాభ్యాసము సాగించు భాగ్యము కలిగినది. విశ్వనాథ వారి సంపాదకత్వమున 'నేషనల్ బుక్ ట్రస్ట్' వారు ప్రచురించిన భారత స్వాతంత్ర్య రజతోత్సవముల 'తెలుగు కవితా సంపుటి' లోనికి నా కవిత 'ఆదికవి ఆవేదన'ను వాత్సల్యముతో స్వీకరించిరి. బాబుకు ఆ పుస్తకము, ఆ కవిత ఇప్పటికిని గుర్తు. అనేక సభలలో దేశవిదేశములలో నా గురించి ఈ సంగతి చెప్పుచుందురు. బుద్ధప్రసాదు గారి జ్ఞాపక శక్తి పరమాద్భుతము. వ్యక్తులు, పుస్తకములు, ప్రదేశములు, వారి వారి ప్రత్యేకతలు చిటికెలో స్ఫురించుచుండును. విద్యార్థిదశలోనే 'దివిసీమ సాహితీ సమితి' మున్నగు సంస్థలకు కార్యదర్శిగా దివిసీమకు అన్ని రంగములలో ప్రశస్తి తెచ్చుటకు కార్యకర్తగా కృషి చేసెను. ఆ ప్రభావము నా తరము వారిలో ఎందరినో కవులుగా, గాయకులుగా, నటులుగా, పరిశోధకులుగా, రచయితలుగా, పాత్రికేయులుగా బహుముఖ ప్రతిభావంతులుగా, సమాజసేవాపరాయణులుగా దివిసీమ నుండి తయారుచేసినది.

నేను వేరే చదువులకు పోక పొన్నూరు శ్రీభావనారాయణ స్వామి సంస్కృత కళాశాలలో చేరుటకు కారణము మండలివారే. ఆ కళాశాలలో 'అవధాన శిరోమణి' డా. సూరం శ్రీనివాసులు గారి శిక్షణలో గురువులే పృచ్ఛకులుగా అష్టావధానము చేసితిని. ఆ సంగతిని నేను బాబుకు చెప్పితిని. అప్పుడు శ్రీ జోస్యుల సూర్యనారాయణమూర్తిగారు పదవీవిరమణ తరువాత గాంధీక్షేత్రములో మహిళా వయోజన విద్యాబోధన చేయుచుండిరి. పందొమ్మిది వందల డెబ్బది ఏడు నవంబరు పందొమ్మిదిన వచ్చిన గాలివాన, ఉప్పెనతో దివిసీమ అతలాకుతలమైనది. కృష్ణారావుగారు అంతటను తానై పునరావాస, పునర్నిర్మాణ కార్యక్రమములలో తలమునకలుగా నున్నపుడు 'బాబు' తోడుగా నుండెను. డెబ్బదిరెండు 'జై ఆంధ్ర' ఉద్యమములో సమైక్యవాదిగా నిలిచిన తండ్రిగారికి, డెబ్బది అయిదులో అనిందపూర్వముగా అద్భుతముగా జరిపిన ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణలో, రాష్ట్రస్థాయి నాటకోత్సవములు అవనిగడ్డలో జరిగినప్పుడు, మరెన్నో సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమములలో, గాంధీక్షేత్రం పత్రిక నిర్వహణలో, కృష్ణాజిల్లా రచయితల సంఘం సభలు, గాంధేయవాద శిక్షణ తరగతులు నిర్వహించుటలో యువకార్యకర్తగా శ్రమించిన బుద్ధప్రసాదుగారి వెంట నడిచిన విశేషములు వ్రాసినచో ఒక పుస్తకము కాగలదు.

దివిసీమ పునర్నిర్మాణ సేవాకార్యక్రమమునకు సేవాగ్రామ్ నుండి వచ్చిన పెద్దలు ప్రభాకర్‌జీ అధ్యక్షతన శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు ముఖ్య అతిథిగా, శ్రీ జోస్యుల సూర్యనారాయణమూర్తి గారు సంచాలకులుగా పందొమ్మిది వందల డెబ్బది ఎనిమిది ఆగస్టు పదిహేనున గాంధీక్షేత్రం గ్రంథాలయమున నా

రెండవ అష్టావధానమును శ్రీ బుద్ధప్రసాదు ఏర్పాటు చేసిరి. ప్రభాకర్‌జీ, మండలివారు, జోస్యులవారు పెద్దలందరు వాత్సల్యముతో నన్ను ఆశీర్వదించిరి అవధానకళకు దివిసీమ ప్రాతినిధ్యము 'బాబు' సంకల్పమే. అది నా జీవితమున మలుపు. ఆ తరువాత గాంధీక్షేత్ర కార్యక్రమములలో, ఉత్సవములలో, సభలలో, మహాకవులు దాశరథి, నారాయణ రెడ్డి గారి వంటి పెద్దలు పాల్గొన్న కవి సమ్మేళనములలో నాకు తప్పక చోటు ఉండెడిది. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతములలో, విదేశములలో నన్ను ప్రస్తావించి ప్రోత్సహించుట గురించి నేను చెప్పుచున్నట్లే చెప్పెడివారు మరెందరో కలరు. తనకు తెలిసిన వారి ప్రతిభను నిశ్శబ్దముగా కనిపెట్టి ప్రోత్సహించుట బాబు ప్రత్యేకత. కృష్ణారావుగారు అనారోగ్యముతో ఉన్న స్థితిలో కూడా వారి పుట్టిన రోజునాడు (ఆగస్టు 4) బుద్ధప్రసాదు గారు సాహిత్య కార్యక్రమములు ఏర్పాటు చేసి పండితాశీస్సులు ఇప్పించెడివారు. అప్పుడు కృష్ణారావుగారు సైగలతో నా యోగక్షేమములు అడిగెడివారు.

పందొమ్మిది వందల డెబ్బది తొమ్మిది ఆగస్టు పదహారున విజయవాడ సయ్యద్ అప్పలస్వామి కళాశాలలో నా ఉద్యోగమునకు ఇంటర్వ్యూ. కృష్ణాజిల్లా విద్యాశాఖాధికారి శ్రీరంగనాయకులు గారు, అవనిగడ్డ డిగ్రీకళాశాల ప్రాచార్యులు శ్రీ రామిసెట్టి దయానిధిగారు ఇంటర్వ్యూ బోర్డులో సభ్యులు. నేను వేంకట కృష్ణారావు గారికి, బుద్ధప్రసాద్ గారికి విషయము విన్నవించితిని. కృష్ణారావుగారు 'డి.ఇ.వో. గారికి నేను చెబుతాలే' అనిరి. మరునాడు ఆగస్టు పదిహేను ఉదయము బ్రహ్మంగారి గుడి ఎదుట రెండెడ్ల స్థూపము దగ్గర నన్ను చూచి 'నిన్న బందర్లో రంగనాయకులుగారు కనపడ్డాడు. నీ గురించి చెప్పా. ఇస్తార్లే' అనిరి. బుద్ధప్రసాద్ గారు వారింటి ప్రక్కనే ఉన్న దయానిధి గారింటికి నన్ను తీసుకొని పోయి నా సంగతి వివరించి చెప్పిరి. ఆ ఉద్యోగము నాకు వచ్చినది. నేను నా కుటుంబము లోటు లేకుండా బ్రతుకుచుంటిమి.

బుద్ధప్రసాద్ గారు నా పెళ్ళికి మా ఇంటికి వచ్చిరి. నేను వారి వివాహమునకు వెళ్ళితిని. కవి సమ్మేళణములో చదివిన పద్యములలో నొకటి గుర్తున్నది.

మరియొక మండలి కృష్ణుడు
చిరుతడు పొరాడి దివ్యసీమకు మణియై
వరలగ దీవింతు వధూ
వరులను మండలి కులమ్ము వర్ధిల్లంగా

అవనిగడ్డ త్యాగరాజ మందిరములో మా నాన్నగారి షష్టిపూర్తి ఉత్సవ సభకు బుద్ధప్రసాద్ గారు వచ్చిరి. పట్టుబట్టలతో గురు దంపతులను సత్కరించి గొప్ప ప్రసంగము చేసిరి. నా నలుగురు కుమార్తెల వివాహములకు తీరిక చేసుకొని వచ్చి దీవించిరి. వారి ఇరువురు కుమార్తెల వివాహ సందర్భమున 'కల్యాణ కృష్ణప్రభ', 'అవని కళ్యాణము' అను రెండు పుస్తకములు నాచే వ్రాయించి, అచ్చు వేయించి బంధుమిత్రులకు పెళ్లికానుకగా పంచెను. ఆయనకు మంచి పుస్తకమే మహోత్సవము. వారిది గ్రంథపాల గోత్రమే. ఆయనకు ఉన్న సాహిత్యాభిమానము వలన నేను ఆయనతో బస్సు, కారు, రైలు, విమానములలో దేశవిదేశములు ప్రయాణము చేయగలిగితిని. అమెరికాలో డల్లాస్ నగరమున పదమూడవ తానా మహాసభలలో నేను రచించిన 'పద్మవంశి' అను పద్యకావ్యమును 'మనస్సాక్షి మహాభారతము' అను వ్యక్తిత్వ వికాస గ్రంథమును బుద్ధప్రసాద్

గారు ఆవిష్కరించిరి. అక్కడ నేను చేసిన అవధానమును చూచిరి. తరువాత లండన్ నగరమున నాచే అచ్చతెనుగు అవధానము చేయించిరి. బ్రిటిష్ పార్లమెంటు భవనమునకు కవిపండితులను తీసుకొని పోయి తెలుగు పద్యము, తెలుగుమాట, తెలుగు పాటలతో ప్రతిధ్వనింపచేసిరి. తెలుగు వేదకవి శ్రీ జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, నేను అక్కడ ఆశువుగా పద్యములు చెప్పితిమి. ఈ మహాద్భుత సన్నివేశము బుద్ధప్రసాద్ గారి మహాసంకల్పమే. దానికి గుర్తుగా మన్మథనామ సంవత్సర ఉగాది నాడు తొలి 'అచ్చతెనుగు అవధాన' పురస్కారము గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారిచే వారే ఇప్పించిరి. అట్లే బరంపురములోను, తిరుపతి ప్రపంచ తెలుగు మహాసభలలో అవధాన సత్కారములు వారి సమక్షములోనే జరిగినవి. నిరాడంబరుడు, నిష్కల్మషుడు, తెలుగు భాషా సంస్కృతి పరిరక్షకుడు, అరుదైన రాజకీయ నాయకుడు, ఆత్మీయతామూర్తి శ్రీ మండలి బుద్ధప్రసాద్ దివిసీమ దేవతలందరి కరుణతో సప్తతి, సహస్రచంద్రదర్శన, శతవర్షోత్సవ పూర్ణాయుష్మంతులై వర్ధిల్లుదురుగాక!

బహుముఖ ప్రజ్ఞాశాలి

ఒక వ్యక్తి ఒక రంగంలో లేదా రెండు రంగాల్లో రాణిస్తాడు. కానీ శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు మాత్రం ఒక వైపు రాజకీయాల్లో ఉన్నత పదవుల్లో రాణిస్తూ మరోవైపు తెలుగు భాషాపరిరక్షణకు అవిరళ కృషి చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికార భాషా సంఘం అధ్యక్షులుగా ఉన్నప్పుడు వారు తెలుగు భాషా పరిరక్షణకు ఎనలేని కృషి చేశారు. అలాగే రచనారంగంలోనూ తన కలం రుచి చూపించారు. సంఘసేవలోనూ తనదైన ముద్రను వేశారు. ఇతర దేశాలలోని తెలుగువారితో సత్సంబంధాలను కొనసాగిస్తున్నారు. ఇలా అనేకానేక రంగాలలో తన ప్రత్యేకతను చాటుతూ 'బహుముఖ ప్రజ్ఞాశాలి'గా, రాజకీయాల్లో అజాత శత్రువుగా ఉంటూ అన్ని పక్షాల రాజకీయ నాయకులతో సత్సంబంధాలను కొనసాగించడం ఒక్క మండలి బుద్ధప్రసాద్‌గారికే సాధ్యం. వారు 60 సంవత్సరాలను పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మా 'పద్మమోహన ఆర్ట్స్' సంస్థ తరపున హృదయపూర్వక అభినందనలు తెలుపుతూ వారు నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో గడపాలని కోరుకుంటున్నాను.

దేపల్లె యాదగిరి గౌడ్

D. Yadagiri

వ్యవస్థాపక అధ్యక్షులు

పద్మమోహన ఆర్ట్ థియేటర్స్, హైదరాబాద్.

Cell : 98493 22292

షష్ట్యబ్ధిపూర్తి శుభాభినందనలు

- భారతీ కమలాకర్

పూజ్యులు ప్రముఖ రాజకీయ నాయకులు, సేవాతత్పరులు, తెలుగు భాషాభిమానులు శ్రీమాన్ మండలి బుద్ధప్రసాద్ గారు కృష్ణా జిల్లాలో జన్మించి కృష్ణా జిల్లాకే వన్నె తెచ్చిన మహనీయులు. కృష్ణా జిల్లా అభివృద్ధికోసం చేసిన, చేస్తున్న సేవా కార్యక్రమాలు వారి నిరంతర సేవా నిరతికి తార్కాణాలు. ఒకే జిల్లాకు చెందిన వారిమి కావటం వల్ల వారి సేవా తత్పరత, అకుంఠిత కార్యదీక్ష, పట్టుదల ఆ ఊరి ఆడబిడ్డగా నేను ఎరుగుదును. వారిలోనున్న స్నేహభావం, అంకిత భావం, గుణశీలత వంటి అనేక ఉత్తమ గుణాలను తండ్రిని మించిన తనయులుగా తండ్రి కీ.శే. మండలి వెంకట కృష్ణారావు వద్ద నుండి పుణికి పుచ్చుకొని శ్రీ బుద్ధ ప్రసాద్ గారు చేసిన సాంఘిక, సాంస్కృతిక, సాహిత్య, విద్యా భాషా సేవలు నిరుపమానముగా కీర్తి గడిస్తున్నాయి అనటంలో సందేహం లేదు. రాజకీయ రంగంలో తలమునకలౌతూ తెలుగు తల్లికి, తెలుగు భాషకు ఎనలేని కృషి చేస్తున్నారు. ఇంతేకాక ఆ జిల్లా బడుగు, బలహీన వర్గాలకి ఎన్నో ఉపాధి పథకాల ద్వారా చేయూతనిస్తూ ఆదుకుంటున్న శ్రీ మండలి బుద్ధప్రసాదు గారి మొక్కవోని దీక్షకు నా నమోవాకములు.

ఇంతేకాక ఎన్నో సాహితీ, సాంస్కృతిక సంస్థలలో ముఖ్య అతిథులుగా పాల్గొని నిండుమనస్సుతో ఆశీర్వదిస్తూ ఆర్గనైజర్స్‌ని ఆనందభరితులను చేస్తూ సభలను జయప్రదం చేస్తుంటారు.

మా కమలాకర ఛారిటబుల్ సంస్థ స్థాపించిన నాటి నుండి కొండంత అండగా ఉండి మాకు మార్గదర్శకులుగా నిలిచారు. మా సంస్థ నిర్వహించిన వివిధ వార్షికోత్సవ సభలకు ఆహ్వానించగానే విచ్చేసి మమ్మల్ని ఆనందింపజేయటమేగాక ఆయా సందర్భాలలో ప్రచురించిన ప్రత్యేక సంచికలకు తమ అమూల్యమైన సందేశాలను అందించి మా సేవా కార్యక్రమాలకు మరింత స్ఫూర్తినిచ్చారు. ముఖ్యంగా ద్విదశాబ్ది వార్షిక సంచికలో రజతోత్సవ వార్షిక సంచికలో అమూల్యమైన సందేశాలనిచ్చారు. ఆ సందేశాలే మాకు వెన్నుదన్నుగా మా సంస్థకి శ్రీరామరక్షగా నిలిచాయి.

శ్రీ మండలి బుద్ధప్రసాదు గారి షష్టిపూర్తి మహోత్సవ సందర్భంగా వారికి ఆయురారోగ్యాలు చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తూ హార్థిక జన్మదిన శుభాకాంక్షలను అందజేస్తున్నాను నా తరఫున, మా సంస్థల తరఫున.

నాడు మంత్రిగా సాధించిన విజయాలు

- డా. జి. ఎన్. రావు

అనావృష్టి, అతివృష్టి లాంటి ప్రకృతి వైపరీత్యాలతో సతమతమయ్యే రైతాంగం కేవలం వ్యవసాయ ఉత్పత్తులపై ఆధారపడి జీవించడం కష్టసాధ్యమవుతూంది. రైతుకు ఆసరాగా పాడి పరిశ్రమ ఉంటే రైతు ఆర్థికంగా నిలదొక్కుకుంటాడు. అందుకే పశుగణాభివృద్ధి, పాడిపరిశ్రమ, మత్స్యశాఖలకు అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వడం జరిగింది.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు మంత్రిగా ఉన్నప్పుడు, తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడమైంది. పులివెందులలో అంతర్జాతీయ స్థాయి ఆంధ్రప్రదేశ్ పశుగణ పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేశారు. హైదరాబాద్ కేంద్రంగా జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు ఏర్పాటు అయింది. 2008-09లో కొత్తగా రెండు పశువైద్య కళాశాలలు కడప జిల్లా ప్రొద్దుటూరులో, కరీంనగర్ జిల్లా కోరుట్లలోను ఏర్పాటు చేయబడ్డాయి. రాష్ట్రంలోని పశువైద్యుల కొరత తీర్చడానికి ఇవి ఎంతగానో ఉపయోగిస్తాయి. అలాగే పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మూడు సూపర్ స్పెషాలిటీ పశువుల ఆసుపత్రుల్ని కడప జిల్లా పులివెందులలోను, కృష్ణా జిల్లా విజయవాడలోను, హైదరాబాదులోని నారాయణగూడలోను నెలకొల్పబడ్డాయి. మనుషులలోని సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులలాగా ఇవి పశువులకు అత్యాధునిక చికిత్సనందిస్తున్నాయి.

2003-04 సంవత్సరంలో రూ. 166 కోట్ల బడ్జెట్ పశుగణాభివృద్ధి శాఖకు ఉంటే శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు దానిని 2008-09లో 579 కోట్లకు పెంచారు. మత్స్యశాఖకు 2004-05లో 24.74 కోట్ల బడ్జెట్ ఉంటే 2008-09లో 99.99 కోట్లకు పెంచారు.

వ్యవసాయ, అనుబంధ రంగాల్లో అభివృద్ధి జాతీయ స్థాయిలో 30 శాతంగా ఉంటే, బుద్ధప్రసాద్‌గారి కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో 40 శాతానికి పైగా ఉంది.

ఆంధ్రప్రదేశ్ పశుసంపదలో కేవలం 24 శాతం పశువులు మాత్రమే మేలైన జాతి పాడి పశువులు ఉన్నాయి. ఇతర రాష్ట్రాల నుండి మేలైన జాతి పాడి పశువులను కొనుగోలు చేసి 50 శాతం సబ్సిడీపై సమాజంలోని అట్టడుగు వర్గాల వారికి అందించడానికి 'పశుక్రాంతి పథకం' ప్రారంభించి లక్షలాది పాడిపశువులను పంపిణీ చేయడం జరిగింది. ఇంకా 'జీవక్రాంతి పథకం', 'క్షీరక్రాంతి పథకం', 'మత్స్యక్రాంతి పథకాలు' నూతనంగా రూపొందించి అమలులోకి తీసుకురావడం జరిగింది.

ప్రగతిపథంలో పశుసంవర్ధకశాఖ

పశుసంవర్ధక శాఖ ద్వారా అమలవుతున్న పథకాల మూలంగా లబ్ధి పొందుతున్న వారిలో 80 శాతం బడుగు, బలహీన వర్గాల వారే ఉన్నారు. శ్రీమండలి బుద్ధప్రసాద్ గారు రైతుల ఆత్మహత్యలు శాశ్వతంగా నివారించే లక్ష్యంతో వ్యవసాయంలో కలిగే ఒడిదుడుకులను రైతులు తట్టుకుని నిలబడే విధంగా వ్యవసాయానుబంధ రంగాల ద్వారా రైతులకు అదనపు ఆదాయం చేకూర్చాలనే దూరదృష్టితో పశుసంవర్ధక శాఖ ద్వారా చేపట్టిన పశుక్రాంతి, జీవక్రాంతి, క్షీరక్రాంతి వంటి ఎన్నో పథకాలు వేలకోట్ల రూపాయల నిధులతో దిగ్విజయంగా రాష్ట్రవ్యాపితంగా అమలు అయ్యాయి.

2008-09 సం॥లో గొర్రెల కాపరుల సంక్షేమానికి ముఖ్యమంత్రి జీవక్రాంతి పథకం. రూ. 27 కోట్లతో- 35,000 కుటుంబాలకు లబ్ధిచేకూర్చేందుకు 13333 పొట్టేళ్ళు, 6546 గొర్రెలు, మేకల యూనిట్లు, 5000 పొట్టేలు పిల్లలు సరఫరా చేయబడ్డాయి. గొర్రెల మార్కెట్ యార్డుల ఏర్పాటుకు రు. 5 కోట్లు కేటాయించారు.

అలాగే రైతులకు 90000 ముర్రాజాతి గేదెల పంపిణీ, మత్స్యకారుల రుణాల మాఫీవల్ల 28,270 మందికి 40.70 కోట్ల భారం తగ్గింపు, 282 మత్స్యమహిళల సహకార సంఘాలలో 20,102 మందికి సభ్యత్వం జరిగాయి.

2007-08లో పశుక్రాంతి ద్వారా 40,334 మంది గ్రామీణులకు పాడిపశువుల పంపిణీ మరియు 2008-09 ఆర్థిక సంవత్సరంలో 1.29 లక్షల పాడిపశువులు మరియు ముర్రా పద్దలను పంపిణీ చేయడం జరిగింది.

అలాగే పశుక్రాంతికి 2007-08లో 303 కోట్లు; 2008-09లో 200 కోట్లు కేటాయించడమైనది. పెరటి కోళ్ల పెంపకానికి 10,000 మందికి కోటి రూపాయలతో 50% రాయితీపై కోళ్ళ యూనిట్లు ఇవ్వడం జరిగింది. పావలావడ్డీపై పాడిపరిశ్రమ, గొర్రెల పెంపకము మరియు బ్రాయిలర్ కోళ్ళ పెంపకము చేపట్టడం జరిగింది.

ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ వివిధ కార్యక్రమాల ద్వారా పశుగణాభివృద్ధికి, తద్వారా పాలు, మాంసం, గుడ్ల అధికోత్పత్తికి కృషి చేసింది. అంతేగాక పాడి పశువుల పెంపకం, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం సన్న, చిన్నకారు రైతులకు, వ్యవసాయ కూలీలకు జీవనాధారమై వారి ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 24 లక్షల కుటుంబాలవారు పశుపోషణపై ఆధారపడి జీవించేవారు. గ్రామీణపేదరిక నిర్మూలనకు పశుగణాభివృద్ధి ఎంతగానో తోడ్పడగలదని భావించి, రాష్ట్రప్రభుత్వం ఈ రంగాన్ని అభివృద్ధి చేయడానికి బుద్ధప్రసాద్ గారు మంత్రిగా ఉన్నప్పుడు అత్యంత ప్రాధాన్యత నిచ్చి అదనపు నిధులను కేటాయించింది.

పశుక్రాంతి పథకం

పశుసంవర్ధకశాఖ శాస్త్రీయ అవగాహనతో దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న కుటుంబాలకు రెండు మేలుజాతి పాడి పశువులను రెండు విడతలుగా ఆరు నెలల వ్యవధితో అనగా సం॥ పొడవునా సదరు కుటుంబం పాల ఉత్పత్తి చేసే విధంగా ఇచ్చారు. ఇంత పెద్ద మొత్తంలో పాడిపశువులు, గేదె పద్దలు, ఆవుదూడలు ఇతర రాష్ట్రంలో నుండి సమకూర్చి ఇవ్వడం ఇది రాష్ట్ర చరిత్రలోనే ప్రథమం.

జీవక్రాంతి పథకము

ఆంధ్రప్రదేశ్‌లో పశు సంవర్ధక శాఖ ద్వారా ఈ పథకం పరిధిలో సబ్సిడీతో మేలు జాతి గొర్రెలు, మేకలు, పెంపకానికి పొట్టేళ్ళు పిల్లలు, విత్తనపు పొట్టేళ్ళను లబ్ధిదారులకు సమకూర్చారు. ఈ పథకంలో ప్రభుత్వం పేదకుటుంబాలకు విత్తనపు గొర్రెపొట్టేళ్ళు, పొట్టేళ్ల పిల్లల పెంపకపు యూనిట్లు, అలాగే గొర్రెలు, మేకల యూనిట్లు అందించింది.

రూ. 5 కోట్లతో 20 మార్కెట్ యార్డులను ఒక్కొక్కటి రూ. 25 లక్షల ఖర్చుతో ఏర్పాటు చేశారు. ఈ పథకంలో ప్రభుత్వము పేదకుటుంబాలకు విత్తనపు గొర్రెపొట్టేళ్ళు, పొట్టేళ్ళ పిల్లల పెంపకపు యూనిట్లు, అలాగే గొర్రెలు, మేకల యూనిట్లు అందించింది. దీనిలో రైతులకు 50శాతం సబ్సిడీ లభించింది.

పెరటికోళ్ళ పెంపకం

గ్రామీణపెరటి కోళ్ళ పెంపకాన్ని ప్రోత్సహించడానికి ఈ పథకం ద్వారా ఒక కోటి రూపాయల వ్యయంతో 40,000 మంది లబ్ధిదారులకు 50శాతం రాయితీపై పెరటికోళ్ళ పెంపకం యూనిట్లు సరఫరా చేయబడ్డాయి. ఈ పెరటికోళ్ళు సరఫరా చేయడానికి వరంగల్, నెల్లూరు, కడప, విజయనగరం జిల్లాలలో కోడిపిల్లల ఉత్పత్తి కేంద్రాలు కూడా నెలకొల్పబడ్డాయి.

గొర్రెల బీమా పథకం

గొర్రెల పెంపకం దారులకు నిజంగా ఇది ఒక వరం. సీజన్ల వారీగా గొర్రెలకు సంక్రమించే అంటు వ్యాధుల మూలంగా పెంపకం దారులు తీవ్రంగా నష్టపోవటం పరిపాటైపోయింది. జీవనాధారమైన మంద మొత్తం మరణించటం ఆ కుటుంబాలకు కోలుకోలేని దెబ్బ. దేశంలో ప్రప్రథమంగా ఈ పథకానికి రూపకల్పన చేసి శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారి ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలు చేసింది..

ఆంధ్రప్రదేశ్ గొర్రెలు మేకల పెంపకందారుల సహకార ఫెడరేషన్ స్థాపన

రాష్ట్ర ప్రభుత్వం చొరవతీసుకుని మేకలు, గొర్రెల పెంపకం దారుల సహకార సమాఖ్యను సదరు పెంపకందారులకు వర్తించే పథకాలలో భాగస్వామ్యం కల్పించే సదుద్దేశ్యంతో ఏర్పాటు చేసింది. 2007-08 ఆర్థిక సంవత్సరంలో ఈ ఫెడరేషన్ కార్యక్రమాల అమలుకు 2 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసింది.

గొర్రెలు, మేకలలో నట్టల నివారణ కార్యక్రమం

జీవాల పెరుగుదలపై తీవ్ర ప్రభావం చూపే సమస్య ఇది. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని మేకలకు కూడా వర్తించే విధంగా అమలుచేస్తూ ఆ మేరకు అవసరమైన అదనపు నిధుల్ని కేటాయించింది. ఈ పథకం అమలుకు 2007-08 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం 615 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసింది. 2008-09 సం॥లో ఈ పథకానికి రూ॥900 లక్షలు కేటాయించడం జరిగింది.

సంచార పశువైద్యశాలలు ఏర్పాటు

ప్రభుత్వం పశువైద్య శాలల స్థితి గతులను గణనీయంగా మెరుగుపరచటమే కాకుండా మారుమూల సుదూర ప్రాంతాలకు సైతం పశు వైద్య సేవలు అందించే లక్ష్యంతో సంచార వైద్యశాలలు ప్రారంభించింది. వీటి నిర్వహణకు 2007-08 ఆర్థిక సంవత్సరంలో రూ. 185 లక్షల నిధులను కేటాయించింది. 2008-09సం॥లో రూ॥ 194 లక్షలు కేటాయించడం జరిగింది.

మారుమూల గ్రామాల రైతుల పాడిపశువులకు కృత్రిమ గర్భదారణ సౌకర్యం

పశుసంవర్థక శాఖ మారుమూల ప్రాంతాలలో సైతం శాస్త్రీయ పద్ధతులలో పశువులకు కృత్రిమ గర్భధారణ సేవలందించేందుకు గ్రామీణ యువకులకు శిక్షణ నిచ్చి వారికి భృతి కల్పించటంతో పాటుగా వీరి ద్వారా రైతుల ఇంటి ముందటే వారి పశువులకు కృత్రిమ గర్భధారణ సేవలు అందే ఏర్పాటు చేసింది. 8 జిల్లాల్లో 500 సమగ్ర పశుగణాభివృద్ధి కేంద్రాలను జె.కె. ట్రస్టు ద్వారా ఏర్పాటు చేయడానికి 2007-08 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం 410 లక్షల రూపాయలు కేటాయించింది. 2008-09 ఆర్థిక సం॥లో ప్రభుత్వము రూ॥575 లక్షలు కేటాయించడం జరిగింది.

పశువైద్యశాలల ఏర్పాటు

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి నాయకత్వంలో పశుసంవర్థక శాఖ ద్వారా చేపట్టిన చర్యల ఫలితంగా నేడు పాడి పరిశ్రమ దిన దినాభివృద్ధి చెందుతూ ఉంది. ఈ దశలో విస్తృత మౌతున్న పాడి పరిశ్రమకు అవసరమైన సేవలు అందుబాటులోకి తేవాలనే తలంపుతో పశువైద్య శాలలకు అవసరమయిన సిబ్బంది నియామకం శిధిలావస్థలో ఉన్న

పశువైద్య శాలలకు నూతన భవనాలు, ప్రహరీ గోడల నిర్మాణానికి అవసరమయిన నిధులు కేటాయించి సత్వర చర్యలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాపితంగా అవసరం మేరకు పశువైద్యశాలలు సైతం కొత్తవి ఏర్పాటయ్యాయి.

పశుగ్రాసాభివృద్ధి : పాడికి ఆధారం పచ్చిమేత. పాడిపరిశ్రమలో మూడింట రెండువంతుల ఖర్చు మేతకే అవుతుంది. ప్రభుత్వం పశుగణాభివృద్ధిలో మేలురకం పశుగ్రాసాల సాగుకు గల ప్రాముఖ్యతను గుర్తించి అన్ని సమయాల్లో 75 శాతం రాయితీపై మేలైన పశుగ్రాస విత్తనాలను రైతులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంది. ఈ పథకం అమలుకు 2007-08 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం 370 లక్షల రూపాయల నిధులను, 2008-09 ఆర్థిక సం॥లో రూ॥500 లక్షలు కేటాయించడమైనది.

గిరిజన రైతుల పశువుల ఆరోగ్య పరిరక్షణ : పథకం అమలుకు 2007-08 ఆర్థిక సంవత్సరంలో నిధులను ప్రభుత్వం గణనీయంగా పెంచి 50 లక్షల రూపాయలను కేటాయించింది. 2008-09 సం॥లో రూ॥60 లక్షలు కేటాయించడమైనది.

షెడ్యూల్డ్ కులాల రైతుల పశువుల పునరుత్పత్తి పథకం : ఈ పథకం క్రింద షెడ్యూల్డు కులాల రైతుల పశువుల పునరుత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడానికి ప్రత్యేక శిబిరాలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమ అమలుకు ప్రభుత్వం 2007-08 ఆర్థిక సంవత్సరంలో 100 లక్షల రూపాయల నిధులను కేటాయించింది.

అంటువ్యాధుల నివారణ : పశువులలో కలిగే అంటువ్యాధుల నివారణకు అవసరమయ్యే వ్యాక్సిన్‌ల ఉత్పత్తి సిబ్బంది శిక్షణకు అస్కాడ్ పథకం క్రింద 2007-08 సంవత్సరానికి 880 లక్షల రూపాయల నిధుల్ని ప్రభుత్వం కేటాయించింది. 2008-09 సం॥లో కూడా అంతే మొత్తము కేటాయించడమైనది.

రైతులకు ఆర్థికంగా ఎంతో నష్టం కలుగచేసే గాలికుంటు వ్యాధి నియంత్రణ : పాడిపశువులకు గాలికుంటు వ్యాధి సోకటం వలన పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయే అతిశీఘ్రంగా వ్యాపించే అంటు వ్యాధి గాలికుంటు వ్యాధి. ఈ పథకం అమలుకు 2008-09 ఆర్థిక సం॥లో రూ॥275 లక్షలు కేటాయించడమైనది.

పశుసంవర్ధక శాఖలో సాంకేతిక సిబ్బంది నియామకం : రాష్ట్ర ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేయటమే కాకుండా రిటైరైన ఉద్యోగులను సైతం తిరిగి నియమించింది. అవుట్ సోర్సింగ్ విధానంద్వారా కూడా ఖాళీలను భర్తీ చేసింది. 2008-09సం॥లో 200 పశువైద్యసహాయక శస్త్ర చికిత్సకుల పోస్టులు, 820 పశువైద్య సహాయక పోస్టులు భర్తీ చేయుటకు ప్రభుత్వము అనుమతి మంజూరు చేసినది.

రాష్ట్రంలోని పశువైద్యశాలలకు కొత్త భవనాలు ప్రహరీగోడతో సహా నిర్మాణం : 2008-09 సం॥లో రాష్ట్రములో 664 చోట్ల శిథిలమైన పశువైద్యశాల భవనాల స్థానములో క్రొత్త భవనాలు ప్రహరీగోడతో సహా నిర్మాణానికి రూ॥5975 లక్షలు నాబార్డ్ వారి ఆర్థిక సహాయముతో ప్రభుత్వము నిధులు మంజూరు చేసినది.

పాడి పశువుల బీమా పథకం : భారత ప్రభుత్వము పదవ పంచవర్ష ప్రణాళికలో పాడి పశువుల పెంపకానికి ప్రోత్సాహమివ్వాలనే సత్సంకల్పంతో రైతుల శ్రేయస్సుకు 'పాడిపశువుల బీమా పథకం' ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టింది. దీనికోసం ప్రభుత్వం 515 లక్షల రూపాయలు ఖర్చు చేసింది. బీమా చేసిన పశువుల్లో 2554 పశువులు మరణించగా, 313.28 లక్షల రూపాయలు రైతులకు నష్టపరిహారం ఇన్సూరెన్సు కంపెనీలు చెల్లించాయి.

పాడిపరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య

ముఖ్యమంత్రి క్షీరక్రాంతి పథకం : శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు మంత్రిగా ఉన్న సమయంలో 2007-08లో ఈ పథకం క్రింద మంజూరైన 110.00 కోట్ల నిధులతో చేపట్టిన కార్యక్రమాలు : మండలాల్లో బి.ఎం.సి.యులు 136 ఏర్పాటు, జిల్లా డైరీలు, పాలశీతలీకరణకేంద్రాల బలోపేతం, మిల్క్‌ప్రొడక్ట్స్ ఫ్యాక్టరీ ఆధునీకరణ, జిల్లా డైరీలకు ఎ.ఎం.సి.యుల పంపిణీ, గోదావరి యూనియన్ పునరుద్ధరణ, 22 బి.ఎం.సి.యుల ఏర్పాటు.

శిక్షణా కార్యక్రమాలు : ఆంధ్రప్రదేశ్ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామస్థాయి పాలమిత్రులు, విలేజిడైరి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుల నుండి జిల్లాస్థాయి డిప్యూటి డైరెక్టర్ల వరకు శిక్షణా కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించారు. శిక్షణా కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించడానికి వీలుగా రూ. 2 కోట్ల నిధులతో ప్రత్యేకంగా "విజయ క్షీరక్రాంతి శిక్షణా కేంద్రం" నెలకొల్పడం జరిగింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పశువైద్య కళాశాలలు : రాష్ట్రంలో 3 పశువైద్య కళాశాలలు ఉండేవి. అవి రాజేంద్రనగర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా; తిరుపతి, చిత్తూరు జిల్లా; గన్నవరం, కృష్ణా జిల్లా. శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారు మంత్రిగా ఉన్న సమయంలో ప్రొద్దుటూరు, కడప జిల్లా మరియు కోరుట్ల, కరీంనగర్ జిల్లాలో మరో రెండు పశువైద్య కళాశాలల్ని నెలకొల్పారు.

మత్స్య కళాశాల : రాష్ట్రంలో మత్స్య అభివృద్ధి మరియు రొయ్యల పెంపకంనకు కావలసిన మానవ వనరులను సమకూర్చడంలో నెల్లూరు జిల్లా ముత్తుకూరులోని ఏకైక మత్స్య కళాశాలను బలోపేతం చేశారు.

డైరీ టెక్నాలజీ కళాశాలలు : శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంనందు కల రెండు డైరీ టెక్నాలజీ కళాశాలలు తిరుపతి మరియు కామారెడ్డి (నిజామాబాద్ జిల్లా ప్రస్తుత తెలంగాణ)లకు అదనపు నిధులు కేటాయించి బలోపేతం చేశారు.

పశు సంవర్థక డిప్లొమో ఇచ్చే కళాశాలలు : 1) గరివిడి (విజయనగరం జిల్లా); 2) కరీంనగర్ (కరీంనగర్ జిల్లా. తెలంగాణ); 3) మడకశిర (అనంతపురం జిల్లా); 4) మహబూబ్‌నగర్ (మహబూబ్‌నగర్ జిల్లా, తెలంగాణ); 5) పలమనేరు (చిత్తూరు జిల్లా); 6) వెంకట రామన్న గూడెం (పశ్చిమ గోదావరి జిల్లా. 7) రాపూరు (నెల్లూరు జిల్లా); 8) సిద్దిపేట్ (మెదక్ జిల్లా); 9) రామచంద్రాపురం (తూర్పు గోదావరి జిల్లా). వీటిలో కొన్ని శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారు మంత్రిగా ఉన్నప్పుడు తీసుకుని ఏర్పాటయ్యి బలోపేతం చేయబడ్డాయి.

ఆంధ్రప్రదేశ్ అత్యాధునిక పశుగణ పరిశోధనా కేంద్రం, పులివెందుల : కడపజిల్లా పులివెందులలో ఆంధ్రప్రదేశ్ అత్యాధునిక పశుపరిశోధన కేంద్రం శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారు మంత్రిగా ఉన్నప్పుడు స్థాపించబడింది. ఈ పరిశోధనా కేంద్రానికి 2007-08లో రూ. 31.00 కోట్లు, 2008-09లో రూ.100 కోట్ల నిధులు సమకూర్చబడ్డాయి.

పశువైద్యరంగంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు

శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారు మంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా పశువైద్యరంగంలో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులు మూడు ప్రాంతాల్లో మూడు నెలకొల్పబడ్డాయి. హైదరాబాద్‌లోని నారాయణగూడ (తెలంగాణ), కృష్ణా జిల్లాలోని విజయవాడ, కడప జిల్లాలోని పులివెందులలో అప్పటికే ఉన్న పశువుల ఆస్పత్రుల్ని సూపర్ స్పెషాలిటీస్ ఆసుపత్రులుగా తీర్చిదిద్దారు.

చేపలు / రొయ్యల పెంపక రైతుల కొరకు ఆక్వా ప్రయోగశాలల నిర్మాణం : శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి కాలంలో శ్రీకాకుళం, విశాఖపట్నం, భీమవరం, నెల్లూరులలో ఆక్వా ప్రయోగశాలలు నిర్మించబడ్డాయి. ఈ ప్రయోగశాలలో సాగునీరు, మట్టి పరిశీలన, వ్యాధి నిర్ధారణ, చేపలు / రొయ్యలకు ఇచ్చే మేతల నాణ్యత పరీక్షలు జరుగుతున్నాయి.

మత్స్యపారిశ్రామిక సహకార సంఘాల కోసం కమ్యూనిటీ హాళ్ళ నిర్మాణం : శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు మంత్రిగా ఉన్నప్పుడు మత్స్యకారులు వారి చేపల వేట పరికరాలను భద్రపరచుకొనుటకు, సమావేశాలు ఏర్పాటుకు వారి సామాజిక అవసరాలు అయిన పెళ్ళిళ్ళు, ఇతర సంబరాలు జరుపు కొనుటకు ఈ కమ్యూనిటీ హాళ్ళ నిర్మాణం ఉద్ధేశించబడింది. అన్ని గ్రామాలలోని మత్స్యకారులు లబ్ధిపొందుటకు ప్రణాళిక తయారుచేసి, ఒక హాల్ విలువ రూ.5.00 లక్షలు. పూర్తి గ్రాంటు మొత్తం 60 కమ్యూనిటీ హాళ్ళు నిర్మించు నిమిత్తం ముఖ్యమంత్రి ప్రత్యేక పథకం క్రింద రూ.4.00 కోట్లు కేటాయించడం జరిగింది.

తీరప్రాంత మత్స్యకారులకు కమ్యూనిటీ హాళ్ళ నిర్మాణం : శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు మంత్రిగా ఉన్నప్పుడు మొత్తం 48 కమ్యూనిటీ హాళ్ళు నిర్మించుకోవడానికి (ఒక హాల్ విలువ రూ.15.00 లక్షలు) మొత్తం రూ.7.20 కోట్లను ముఖ్యమంత్రి ప్రత్యేక పథకం క్రింద కేటాయించడం జరిగింది.

రుణాల మాఫీ : ప్రభుత్వం మత్స్యకారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వారు బకాయి పడిన దాదాపు 42.49 కోట్ల బకాయిలను రుణాలను మాఫీ చేసింది. ఫలితంగా 28,270 మంది మత్స్యకారులకు ప్రయోజనం చేకూరింది.

'పశుక్రాంతి' పథకం

2007-08 : ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్యాకేజీల క్రింద దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న ఒక లక్షా ముప్పై రెండు వేల కుటుంబాలకు యాభై శాతం రాయితీ క్రింద అధిక దిగుబడిని ఇచ్చే, పాడిపశువుల పంపిణీకి ఈ పథకం ఉద్ధేశించబడింది. బ్యాంకుల్లో రాతకోతల పనుల్లోనూ, ఋణాలు మంజూరు చేయడంలోనూ ఆలస్యం జరుగుతున్నందున 2007-08 సంవత్సరానికి 40,000 కుటుంబాలకు ఈ పథకాన్ని పరిమితం చేయడానికి ప్రభుత్వం అంగీకరించింది. ఆప్రకారం 40,334 పశువులను (29,240 గేదెలు, 7,800 ఆవులు, 3,294 పెయ్యలు) 2007-08 సంవత్సరంలో పంపిణీ చేయడం జరిగింది.

2008-2009 : పాడిపశువులు ముఖ్యమంత్రి ప్యాకేజీ - నార్మల్ స్టేట్ ప్లాన్, ప్రధానమంత్రి ప్యాకేజి, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద; పెయ్యలు ముఖ్యమంత్రి ప్యాకేజి - నార్మల్ స్టేట్ ప్లాన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద మొత్తం 1,33,000లను రూ 191.20 కోట్లలో ఇవ్వడం జరిగింది.

జీవక్రాంతి

గొర్రె పొట్టేళ్ళ సరఫరా ముఖ్యమంత్రి ప్యాకేజీ, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, పొట్టేలు పిల్లల పెంపకం ముఖ్యమంత్రి ప్యాకేజి, గొర్రెలు / మేకల మందలు ముఖ్యమంత్రి ప్యాకేజి, గొర్రెల అంగళ్ళు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద మొత్తం 60020 రూ. 32.75 కోట్లతో ఇవ్వడం జరిగింది.

పావలా వడ్డీ పథకం : 2008-2009 సంవత్సరంలో పాడి పరిశ్రమ కోళ్ల పరిశ్రమ, గొర్రెల, మేకల పెంపకానికి పావలా వడ్డీ పథకాన్ని అందుబాటులోకి తేవడమైంది. ఈ పథకం క్రింద పాడిపరిశ్రమ (50 పాడి పశువులు), పెయ్యల పెంపకం (50 పెయ్యలు), కొట్టాలలో మేకల పెంపకం (100 + 3 మేకలు), గొర్రెల పెంపకం కేంద్రాలు (100 + 3 గొర్రెలు), కోళ్ళు (5000) లకు లాభం చేకూరింది.

దివిసీమ ఉప్పెన తీర్చిదిద్దిన దీనజన బాంధవుడు

- విద్వాన్ బి. కిరణశ్రీ

సుమారు 4 సంవత్సరాల క్రితం Wish you a Happy Ugadi అని చరవాణిలో సంక్షిప్త సందేశ ఉగాది శుభాకాంక్షలు తెలిపిన నాకు 5 నిముషాల వ్యవధిలో 'ఉగాది' శుభాకాంక్షలు తెలియజేసిన మీకు కృతజ్ఞతలు. మీకు, మీ కుటుంబానికి ఉగాది, నూతన సంవత్సర శుభములు కలుగుగాక. ధన్యవాదములతో మండలి బుద్ధ ప్రసాద్! ఆ సంక్షిప్త సమాచారము చూసి వారికి ఇంగ్లీషులో శుభాకాంక్షలు తెలిపినందుకు సిగ్గుపడుతున్నాని క్షమించవలసినదిగా ఫోను చేశాను. ఈ చిన్న సంఘటన మాతృభాషపై వారికి ఎంత మక్కువో తెలియజేస్తుంది.

1912లో అప్పటి తెలుగు అకాడమి సంచాలకులు శ్రీ యాదగిరి గారు నేను 4వ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా బుద్ధ ప్రసాద్ గారిని కలవడం జరిగింది. ఆ సమయంలో యాదగిరి గారికి వారిచ్చిన సూచనలు, సలహాలు, ప్రచురించవలసిన పుస్తకాల గురించి వారిచ్చిన వివరణ, తెలుగు భాషపై వారికి గల పాండిత్యాన్ని గురించి తెలుసుకున్నాను.

ఈ సందర్భంగా ఒక్కసారి గతాన్ని గుర్తు చేసుకోవలసిన అవసరముంది. 1977 నాటికి ఇంత విస్తృతంగా వార్తా సాధనాలు గాని, ప్రచార సాధనాలు గాని లేవు. ఆంధ్రప్రభ దినపత్రికలో హృదయ విదాకరమైన దివిసీమ ఉప్పెనను గూర్చి వార్త వచ్చింది. ఆ రెండవ రోజు నెల్లూరు జిల్లా కలెక్టరు గారి నుండి నేను పనిచేస్తున్న పాఠశాలకు ఒక సర్క్యులర్ వచ్చింది. సేవ చేయాలనుకున్న ఉత్సాహవంతులైన యువకులు దివిసీమ ఉప్పెన సహాయకులుగా వెళ్ళుటకు ముందుకు రావలసినదని దాని సారాంశం. నేను తెలుగు పండితునిగా కొత్తగా ఉద్యోగంలో చేరిన దినాలు. ఆ సర్క్యులర్‌కు సమాధానంగా జిల్లా మొత్తం మీద 10 మంది బయలుదేరాము. వారిలో ఉపాధ్యాయ వృత్తిలో నున్న వ్యక్తిని నేనొక్కడిని మాత్రమే. మిగిలిన వారిలో ఎక్కువ మంది ఆరోగ్యశాఖ, రెవిన్యూ శాఖ నుండి వచ్చిన వారు. మేము అవనిగడ్డ పట్టణానికి అతికష్టం మీద రెండవ రోజుకు చేరుకున్నాము. అప్పటి విద్యాశాఖ మంత్రి మండలి వెంకటకృష్ణారావు గారిని కలిశాము. వారు స్థానికంగా ఒక నాయకునికి మమ్ములను అప్పజెప్పి వారి సూచనల మేరకు పనిచేయమన్నారు. ఆమేరకు 10 దినాల పాటు తొలి దశలో సహాయ కార్యక్రమాల్లో మా సేవలు వాడుకున్నారు. ఆ సందర్భములోనే మండలి కృష్ణారావు గారితో నాకు మంచి పరిచయం ఏర్పడింది. తెలుగు భాషపై వారికి గల మక్కువ, హైదరాబాద్‌లో తెలుగు అకాడమి ఏర్పాటుకు వారు చేసిన కృషి తెలిసింది.

రెండవ దశ సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు ఒక యువకుడు నిరంతరంగా పనిచేస్తున్న విధము, బాధితులను ఆదుకొనుటలో వారు చూపిస్తున్న ఆసక్తి, సహాయకులుగా వచ్చిన మాపై వారి ప్రత్యేక శ్రద్ధ గమనించి విచారించగా వారే మండలి బుద్ధప్రసాద్ గారు అని తెలుసుకున్నాను. తదనంతరం మంత్రి కృష్ణారావు గారు జీవించినంత కాలం వారితో సంబంధాలు చక్కగా కొనసాగాయి.

చాలా ఏళ్ళ తరువాత నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మాత్రమే మండలి బుద్ద ప్రసాద్ గారితో పరిచయం పెరిగింది. ఆనాటి అనుభవాలు ఇద్దరము గుర్తు చేసుకున్నాము. అధికార భాషా సంఘ అధ్యక్షులైన తరువాత వారిని నెల్లూరులో సన్మానించాలని ఆహ్వానించడం జరిగింది. కొన్ని అనివార్య కారణాల వలన అ కార్యక్రమం ఆగిపోయినది. ఇంతలో తెలంగాణ ఉద్యమం ఉధృతమై రాజకీయంగా పెనుమార్పులు సంభవించాయి.

ఈ సమయంలోనే ప్రభుత్వం నన్ను తెలుగు అనువాదకునిగా రెవిన్యూ శాఖలో నియమించింది. అక్కడ ముఖ్యకార్యదర్శి మరియు విపత్తు నిర్వహణాశాఖ కమీషనరు గౌ॥ డా॥ టి. రాధా, ఐ.ఏ.ఎస్. గారు పనిచేస్తున్నారు. వారి మాతృభాష తమిళం. మాతృభాషాభిమాని. మద్రాసులో తమిళం వాడుక భాషగా, రాష్ట్ర అధికార భాషగా చలామణి అయినట్లుగా ఆంధ్ర రాష్ట్రంలో కూడా తెలుగు వాడుక భాషగా, పాలనా భాషగా, అధికార భాషగా చలామణి కావాలని నందమూరి తారకరామారావు గారు మాతృభాష పాలనా భాషగా కొనసాగాలని 1986 సం॥లో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు దుమ్ముదులిపి బయటకు తీసి తన శాఖలో అన్ని ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులోనే ఉండాలన్న ఏకైక లక్ష్యంతో ప్రభుత్వ ఉత్తర్వులు నాచేత అనువాదం చేయించి విడుదల చేసేవారు. ఆ ఉత్తర్వులన్ని మండలి బుద్ద ప్రసాద్ గారికి మెయిల్ చేసేవారు. అదే విధంగా నాచేత సుమారు 70 పుస్తకాలు ఆంగ్లము నుండి తెలుగులోనికి అనువదింపచేశారు. ఈ చర్యకు ప్రతిస్పందించిన మండలి బుద్ధప్రసాద్ గారు ఒక రాష్ట్రేతర ఐ.ఏ.ఎస్. అధికారి తెలుగు భాషకు చేస్తున్న కృషిని తెలుసుకొని తాను స్వయంగా డా॥ టి.రాధా గారి కార్యాలయానికి వెళ్ళి వారిని పుష్పగుచ్ఛంతో సత్కరించడం జరిగింది. ఈ చర్యతో సచివాలయంలోనే ఒక సంచలనం కలిగింది. పాలనా భాషగా తెలుగు ఉండాలన్న విషయంలో బుద్ధప్రసాద్ గారికి గల నిబద్ధతకు సచివాలయం జేజేలు పలికింది.

ప్రతిభకు ప్రోత్సాహం:

అప్పటికే ప్రభుత్వ పాఠ్య గ్రంథ రచయితగా (7వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు, 1995 నుండి 2011 వరకు) 70 ప్రభుత్వ గ్రంథాలు ఆంగ్లం నుండి తెలుగులో అనువాదం చేసిన అనువాదకుడిగా లబ్ద ప్రతిష్టుడనైన నాకు అంతవరకు ప్రభుత్వం తరుపున ఏ పురస్కారం లభించకపోవడం తెలుసుకున్న బుద్ద ప్రసాద్ గారు 2015 మన్మథనామ సంవత్సర ఉగాది విశిష్ట పురస్కారానికి నన్ను ఎంపిక చేసి నూతన రాజధానిలో పురస్కారం అందజేయించి ప్రతిభకు ఎప్పటికైన గుర్తింపు వస్తుంది అన్న నమ్మకాన్ని నిజం చేసిన మహా వ్యక్తి మండలి. నేను వ్యవస్థాపక అధ్యక్షుడుగా ఉన్న జాషువా కవితా పీఠం నిర్వహించిన జాషువ 44వ వర్ధంతి సభకు ముఖ్య అతిథిగా హాజరై జాషువా కవి విగ్రహానికి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయిస్తానని సభా ముఖంగా ప్రకటించి జాషువాపై గల వారి అభిమానాన్ని చాటుకొని అందరి ఆనందానికి పాత్రుడయ్యారు. వీరి షష్టిపూర్తి సందర్భంగా ఆ మహావ్యక్తిని గురించి ఈ నాలుగు వాక్యాలు రాసే అవకాశం కల్పించిన శ్రీ మండలి బుద్ధప్రసాద్ షష్ట్యబ్దిపూర్తి అభినందన గ్రంథ బహూకరణోత్సవం కమిటీ అయిన కిన్నెర్ ఆర్ట్ థియేటర్స్ వారికి నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

తెలుగు సాంస్కృతిక నాయకుడు - తెలుగు భాషా సేవకుడు

- చెన్నూరి వెంకట సుబ్బారావు

తెలుగు భాషను ప్రేమించే మనిషి, తెలుగు మహాసభలు అంటే గుర్తుకు వచ్చే నాయకుడు మండలి బుద్ధప్రసాద్. తెలుగు ఎల్లెడలా వికసించాలని తపించే మండలి బుద్ధప్రసాద్‌తో నాకు 2008 నుంచి పరిచయం ఉంది. అమెరికాలో మొట్టమొదటి తెలుగు పత్రిక 'తెలుగుటైమ్స్' ఎడిటర్‌గా, మేనేజింగ్ డైరెక్టర్‌గా నేను చాలా ఉత్సవాలకు, మహాసభలకు హాజరవుతుంటాను. ఈ నేపథ్యంలో 2008లో సిలికానాంధ్ర వారు నిర్వహిస్తున్న అంతర్జాతీయ కూచిపూడి ఉత్సవాలకు హైదరాబాద్ నుంచి విమానంలో అమెరికాకు పయనమైనప్పుడు, అదే వేడుకకు వస్తున్న మండలి బుద్ధప్రసాద్‌తో పరిచయం కలిగింది. అప్పటి నుంచి ఆయనతో అనేకసార్లు సమావేశమయ్యే అవకాశం నాకు లభించింది.

అమెరికాలో ఓ తెలుగు పత్రికను నిర్వహించిన అనుభవంతో అమెరికాలోని తెలుగువాళ్ళ జీవిత గమనాన్ని తెలియజేసేలా నేను రాసిన తొలిపుస్తకం 'అమెరికాలో తెలుగువాళ్ళు'. దీనికి ముందుమాట ఎవరిచేత రాయించాలని అనుకున్నప్పుడు నా మదిలో మెదిలిన మొదటి వ్యక్తి మండలి బుద్ధప్రసాద్ గారే. ఆయనకు నా రచనను చూపించినప్పుడు ఆయన ఆసాంతం చదివి ముందుమాటను రాసిచ్చారు. ఈ పుస్తకం ఆవిష్కరణ సభకు కూడా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై చేసిన ఆత్మీయ ప్రవచనాలు నేను ఎప్పటికీ మరచిపోలేను.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తిరుపతిలో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలలో మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి మహాసభల నిర్వహణలో పాలుపంచుకునే అవకాశం నాకు లభించింది. ఈ మహాసభలకు ప్రపంచం నలుమూలలా ఉన్న ఎన్నారైలను ఆహ్వానించడంతోపాటు ఎన్నారైల సెషన్‌ను నిర్వహించే అవకాశాన్ని నాకు ఆయనే కల్పించారు. నేను రాసిన మరో పుస్తకం 'అమెరికాలో తెలుగు సంఘాలు'. దీనికి కూడా ముందుమాటను బుద్ధప్రసాద్‌గారే రాయడంతో పాటు తరువాత నేను రాయాల్సిన పుస్తకాల గురించి కూడా చెప్పి నన్ను ఎంతో ప్రోత్సహించారు.

వ్యక్తిగా, మంత్రిగా, ఉపసభాపతిగా ఆయన ఎన్ని పాత్రలు పోషించినా, ఆయన ఎప్పుడూ నవ్వుతూనే కనిపిస్తారు. ఆత్మీయంగానే పలకరిస్తుంటారు. విదేశాంధ్రుల్లో తెలుగు భాషపై అనురాగం పెంచేలా ఆయన ప్రసంగాలు ఉంటాయి. అందుకే ఆయనను ప్రపంచంలోని తెలుగు సంఘాలు, ఇతర సంస్థలు ఆహ్వానిస్తుంటాయి. ఆయనతో పరిచయం అనిర్వచనీయమైనది.

మృదుభాషి, గాంధేయవాది కేవలం తన వ్యక్తిత్వంతో పైకి వచ్చిన 'నాయకుడు' ఆయన. ఆయన షష్టిపూర్తి మహోత్సవం వైభవంగా జరగాలని మనసారా కోరుకుంటున్నాను.

మహోన్నతుడు

- డా. వి. కోటేశ్వరమ్మ

మహోన్నత కార్యనిర్వహణాదక్షులు, దీక్షాదురంధరులు పూర్వమంత్రివర్యులు కీ.శే. మండలి వెంకట కృష్ణారావుగారి వారసునిగా, వారి కలలను సాకారం చేస్తూ గాంధీజీ మార్గంలో విలువల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్న నిత్య కృషీవలుడు శ్రీ బుద్ధప్రసాద్ గారు. ఆధ్యాత్మికత, తాత్వికత రంగరించుకొని తెలుగు సంస్కృతి వైశిష్ట్యాన్ని ఇనుమడింపచేయుటకు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు అందిస్తున్న సేవలు అనన్యం.

నిరాడంబరత, ఆచరణీయత తనవి చేసుకొని, భావుకత, భాషాపటిమతో తెలుగు భాషాభివృద్ధికి కృషిచేస్తున్న మాన్య మహోదయులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు. సాహితీబంధువు, అందరివాడు, మనసున్న మంచి మనిషి, స్నేహశీలి, సౌజన్యమూర్తి శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి షష్ట్యబ్దిపూర్తి సందర్భంగా వారికి అభినందనలను మనసారా అందిస్తున్నాను.

తెలుగు సాహితీరంగంలో భాషాభివృద్ధికి అధికార భాషాసంఘం అధ్యక్షునిగా వీరందించిన సేవలు నాన్యతో దర్శనీయం, ఆదర్శనీయం. వీరి ఆధ్వర్యంలో తెలుగు భాషామతల్లి ఖ్యాతి నలుదిశలా వ్యాపించిందంటే అతిశయోక్తి కాదు. నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణకు వీరందించిన చేయూత పండితుల, కవుల, రచయితల ప్రశంసలను అందుకున్నది.

కలం–గళం తనవి చేసుకొని, ఆంధ్రరాష్ట్ర అభివృద్ధి కోసం రాజకీయరంగంలో తనదైన వాణి–బాణితో నిరంతరం ఆంధ్రప్రజల అభివృద్ధి వికాసం కోసం కృషిచేస్తున్న నిరాడంబర వ్యక్తి–శక్తి– శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు. బహు గ్రంథకర్త, సృజనాత్మకవేత్త, సాహితీమూర్తి శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు. వీరు ఎందరికో స్ఫూర్తిప్రదాత, మార్గదర్శకులు.

వీరి షష్టిపూర్తి సందర్భంగా చి. బుద్ధప్రసాద్ దంపతులకు నా హృదయపూర్వక ఆశీఃపూర్వక అభినందనలు అందిస్తున్నాను.

కవితలు

జగమెరిగిన ప్రసిద్ధుడు

- డా. సుద్దాల అశోక్‌తేజ

మనమండలి బుద్ధుడు
జగమెరిగిన ప్రసిద్ధుడు
తేటతెలుగు భాషామృత మాధురీ నిబద్ధుడు
విజ్ఞుడు - రసజ్ఞుడు - నిరంతరం
మానవసేవ కార్యక్రమ యజ్ఞుడు
శ్రీ గౌతమ బుద్ధునిలా - పదకవితా
పితామహుడు అన్నమాచార్యునిలా
చలనం - సంచలనం - గుడిపాటి వేంకటాచలంలా
వైశాఖ పూర్ణిమన పుట్టిన
మండలి వేంకట కృష్ణుని వరపుత్రుడు
తనకు మనం - మనకు తను
కనిపించిన క్షణంలో
తనకనులలో తళుకుమనే ఓ చల్లని వెలుగు
ఆ వెలుగును అనువదిస్తే అది కమ్మని తెలుగు
అంతర్జాలాన తెలుగు హంసల సందేశాలకు
ఆధారం కల్పించిన ఆధునిక శ్రీహర్షుడితడు -

×××

వీసా లేకుండ విశ్వదర్శనాన్ని చేయించే
పుష్పకమంటి పుస్తకవిమాన యాత్రికుడు
తలవంచి నను చదివితె - తలయెత్తేలా
చేస్తాననె బహుపుస్తక ప్రేమికుడు - మచిలీపట్నాన
కృష్ణ విశ్వవిద్యాలయ స్థాపనలో కీలక పాత్రుడు
దివితుఫాను - సునామీ ప్రకృతి ప్రళయాలలోన
కరుణాకృతిగా నిలిచిన మానవతా ధార్మికుడు
అమ్మకు బ్రహ్మకు మధ్యన నిచ్చెన నాన్నని
నమ్మి తండ్రి పేర పురస్కార మందించే తనయుడు
మట్టిని - మనిషినే కాదు. పశుపక్ష్యాదుల కొరకు
అనునిత్యం పాటుపడే
ప్రకృతి ప్రేమికుడు-
స్వచ్ఛభారతీయుడితడు

త్రిభాషా నవ కవితా ప్రసూన మాలిక

- కనమలూరు వెంకట శివయ్య

మండలి వంశ పాథోధి
చంద్రమాస్త్వం – సుఖీభవ
శతాయుష్మాన్, మహానందీ
విజయీభవ సర్వదా

హే శ్రీ బుద్ధప్రసాద! త్వ
మాంధ్రాళేః గర్వకారణమ్
సేవాం కరోషి భారత్యాః
అసామాన్యం – సఖే ! ప్రియ!

అమందానంద సంయుక్తా
శారదా సాహితీ ప్రియా
దద్యా దాచంద్ర తారార్కమ్
తుభ్యం శ్వేతం యశఃసఖే!

శ్రీకృష్ణరాయ ! కుత్రాసి?
వైకుంఠే శివసన్నిధౌ
స్వర్గే వా సత్యలోకే త్వం!
పశ్య తే పుత్ర ధీనిధిమ్;

పశ్య షష్ట్యబ్ది యాత్రోత్స
వ సంరంభం, ప్రజాకృతమ్
ద్రష్టు మిచ్ఛంతి సర్వే, శ
త సంవత్సర చర్చరీమ్

నిస్సందేహః తథా భూ యాత్
వేంకటేశ దయావశాత్
నిస్స్వార్థస్త్వం, సదా బ్రాహ్మీ
సేవామగ్నః – నమోస్తుతే

ప్రవర్త యాంధ్ర భాషా సే
వా యజ్ఞం తు నిరంతరమ్
నిష్ఠ త్వం శాశ్వతం మిత్ర
మాంధ్రా ళేః హృత్సు సర్వదా

పరుల స్వస్తిని కోరు దివ్యాత్మ నీది
ధర్మ పీతాంబరము తాల్చు తనువు నీది
మేలు సేయంగ పోవు పాదాలు నీవి
బుద్ధ దేవుని కంధర భూష నీవు

Who it is today doing Service to
Goddess saraswathi?
Who is today serving sweet Telugu Language
to reach its heights?
Who is today doing selfless service
with all efficiency?
Thus rose queston into the sky - high sky.

Clouds from all around reached the high sky and
Cried aloud "It is మండలి బుద్ధప్రసాద్ – బుద్ధప్రసాద్ – ప్రసాద్"

చత్వారి వాక్

- డా. తుమ్మపూడి కోటీశ్వరరావు

కృష్ణపైన నిర్మించిన 'కృష్ణరామ'
అద్భుతపు సేతువొకటె, రెండైన మండ
లముల కైక్యతాస్థితిని కల్పనమొనర్ప
ఎంత దగ్గరగానైతి మిరువురమును.

కాకుళస్వామి ఇంటి ప్రాంగణమునందు
సాహితీ సమరాంగణ సార్వభౌము
విగ్రహాద్భుత స్థితిని కల్పించి నీవు
నాడు నేటితో ముడి వూచినాడువయ్యా!

మనకా రెంటికిపైన రెండయిన సంబంధముంబలుండెన్ సఖా!
తెనుగుం బాసకు సింహపీఠములు సందీపార్కరత్నాంశులం
జను శ్రీకృష్ణుని దేవరాయలు విశ్వశ్రీ సనాథుండు శే
షుని ద్వైరూపము నీకు నాకును గురుజ్యోతుల్ ప్రసన్నాకృతీ!

దేశకాలావధీ సముత్తీర్ణులైన
గురల ఆశీస్సులమాక్షతాంగుండవగుచు
ఆయురారోగ్య భాగ్యసమన్వితమ్ము
శతవసంత సంక్రాంతి శోభితుడవగుము



శ్రీ పి.వి. నరసింహారావుతో...

అభినందన మందారమాల

- డా. వేటూరి ఆనందమూర్తి

మండల క్షేత్రాన మనసున్న మారాజు
దివిసీమకే పేరు దెచ్చినాడు,
నాగాయలంకలో నారు పోసిన మొల్క
భరతోర్వికే పంట పంచినాడు,
వెలుగు తేజమ్మునై తెలుగింట, పొరుగింట,
ఖండాంతర ఖ్యాతి గాంచినాడు,
రాజకీయాలనే రచ్చలు, మచ్చలు,
సోకకుండగ నేర్మి జూపినాడు,

తండ్రి చాటున బిడ్డడై తద్ద యొదిగి,
తండ్రికిం దగ్గ తనయుడై తనరి యెదిగి,
తండ్రి కన్నను మిన్నయై తనిసి పెరిగి
మహిత గాంధేయ వాదిగా మసలినాడు.

మంచి మనసున్న మండలి మంత్రి వరుడు,
మంచి స్నేహాన్ని పంచిన మాన ధనుడు,
మీదు మిక్కిలి నిండు గంభీరమూర్తి
తెలుగు కళలకు వన్నెలు తీర్చిదిద్ది,

తెలుగు పలుకుల చవులను తేర్చి చూపి,
తెలుగుదనమున కూపిరై నిలిచినాడు.
చతుర సంభాషణా ప్రియ చారుకీర్తి
సౌమ్య గుణవర్తి బుద్ధప్రసాద మూర్తి.

మంచితనానికి మారుపేరైన 'మండలి' వారిని గూర్చి, శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారిని గూర్చి, వారి తండ్రిగారు మండలి కృష్ణారావు గారిని గురించీ ఎరిగినదంతా చాలినంతగా నైనా చెప్పడానికి నోటి మాటలూ అచ్చుపుటలూ కూడా చాలవు. ఆంధ్రదేశంలోనూ, అఖిల జగత్తులోనూ అలనాడు వారూ, ఈనాడు వీరూ చేసిన, చేస్తున్న భాషా సాంస్కృతిక సేవ సమారాధనమై, సమాజపరమైన సంఘ సేవా కార్యక్రమమూ రెండూ కూడా, ప్రపంచ మంతటా నెలకొన్న తెలుగు వారందరికీ ప్రాతఃస్మరణీయమూ, సదా అనుసరణీయమూ అని ఒక్క మాటలో, ముక్త కంఠంతో, ఒక్కమాటగా అందరం చెప్పుకోవచ్చును.

వేటూరి వారి కుటుంబానికీ, మండలి వారి కుటుంబానికీ మధ్యగల స్నేహానుబంధం ఈనాటిది మాత్రమే కాదు. మా తాతల నాటిది. అది కొన్ని తరాలుగా మా స్వస్థలమైన పెదకళ్ళేపల్లితోనూ దివిసీమతోనూ పెనవేసుకొన్నట్టిది.

ఆ పరిచయ లేశమే కాబోలు, మళ్ళీ మండలివారితో తాళ్ళపాకవారిని గూర్చిన నా పరిశోధనా సేవలో భాగంగా, అన్నమాచార్య సంస్మరణి వ్యవస్థాపకుడైన మిత్రుడు శ్రీ కృష్ణం రాజుగారి పూనికతో పుంజుకొన్నది. తొలి తెలుగు ప్రపంచ మహాసభల సందర్భంగా మరింత బలపడింది. కేంద్ర ప్రభుత్వ పక్షాన తెలుగు భాషా సేవకుడిగా మారిషస్ దేశానికి వెళ్ళిన నా తొలియాత్రలో సాధికారతను సంపాదించుకొంది. రెండవ ప్రపంచ హిందీ మహాసభల సందర్భంగా మన రాష్ట్ర విద్యా మంత్రిగా శ్రీ కృష్ణారావుగారి బృందమూ, అధికారికంగా రెండో దఫా నా మారిషస్ యాత్రను పురస్కరించుకొని మేము కలిసి ప్రయాణించినప్పుడూ, అక్కడ పదిరోజుల పాటు ఉభయులకూ మిత్రుడైన ఈశ్వరచంద్ర విద్యాసాగర్ గారితో పాటుగా మన తెలుగు సోదరుల మధ్య కలిసి తిరిగినప్పుడూ మరింత సన్నిహితమైంది. అధికారిక కార్యక్రమాల మధ్య కలిసి గడిపిన కాలం కొద్దిదే అయినా అప్పటి జ్ఞాపకాలు మాత్రం బోలెడు. అన్నీ రాయడం సాధ్యం కాదు. మిత్రులు శ్రీ వేమూరి రాధాకృష్ణమూర్తి గారి పుస్తకాన్ని తిరుగ రాయడమవుతుంది!

అప్పుడు మారిషస్‌లో నేనుండిన రెండుమూడేళ్ల వ్యవధిలోనే తెలుగునాట చెలరేగిన ఉప్పెన బీభత్సంలో మండలి పెద్దవారు మమేకమై లోకం విస్తుపోయే విధంగా చేసిన అపారమైన ఆర్తజన సేవా కార్యక్రమం వారి మంచితనానికీ, మానవత్వానికీ మానవకోటి నివాళులెత్తినట్టి సన్నివేశం!

ఆ తరువాత ...

అవనిగడ్డ గాంధీక్షేత్రంలో మండలి చిన్నవారు శ్రీ బుద్ధప్రసాద్ గారు పెద్ద ఎత్తున సముచితంగా జరిపిన గొప్ప చారిత్రక సదస్సులో తనివితీరా పాత సంగతులన్నీ గుర్తు చేసుకున్నాం. అది వారి ఔదార్యాన్ని నేను సన్నిహితంగా ఉండి దర్శించిన సన్నివేశం. ఆ మైత్రి దినదినాభివృద్ధి చెందుతూ నేటికీ కొనసాగుతుంది.

బుద్ధప్రసాద్ గారితో గడిపిన మధుర క్షణాలు మూడు ముఖ్యంగా నాకు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. వాటిల్లో ఒకటి పెదకళ్ళేపల్లిలో గురుదేవులు శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి గారి కాంస్య విగ్రహావిష్కార సభ. ఇది మండలివారి పూనిక మీదనే, తిరుమల తిరుపతి దేవస్థానం వారి సంపూర్ణ సహకారంతో ఏర్పాటైన సభ. విగ్రహాన్ని బహుసుందరంగా తీర్చిదిద్దినవారు సుప్రసిద్ధ శిల్పకారులు గోదావరీ తీర వాసులైన శ్రీ వొడయార్ గారు. ఆనాటి విగ్రహావిష్కార సభ తి.తి.దే. శ్రీ కార్యనిర్వహణాధికారి శ్రీ లంక వెంకట సుబ్రహ్మణ్యం గారి సారథ్యంలో, విధాన మండలి అధ్యక్షులు శ్రీయుతులు చక్రపాణి గారి చేతులు మీదుగా, తి.తి.దే. శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి సమక్షంలో, అస్మదాదులమైన బంధు మిత్రుల మధ్య, సాహిత్య యోగ సాధకుల సందడితో మహా వైభవంగా జరిగింది. ఆ శ్రేయస్సంతా సహృదయులైన బుద్ధప్రసాద్ గారికీ, సుబ్రహ్మణ్యం గారికీ దక్కుతుంది. రెండోది తిరుపతిలో అత్యంత వైభవోపేతంగా సాగిన నాలుగో ప్రపంచ తెలుగు మహా సభల కోలాహలం. తెలుగుదనానికి కొత్త ఊపిరులూదిన ఆనాటి సభకు పిలుపందుకుని నేనూ వెళ్లాను. దేశవిదేశాల తెలుగు సోదరులందరినీ కలుసుకో గలిగాను. ప్రభుత్వ పక్షాన జరిగిన ఆ సభలలోనూ చాటుగా సకల నిర్వాహం మండలి బుద్ధప్రసాద్ గారిదే. ఇది వారి పాలనా దక్షతకు, అందరినీ కలుపుకుపోయే హృదయౌదార్యానికీ నిదర్శనం.

ఇక మూడవది కాకినాడలో ఇటీవల 'శతవర్ష భాస్కరం'గా ఏడాది పాటు సాగిన శ్రీ దంటు భాస్కరరావుగారి శత జయంత్యుత్సవాల ముగింపు మహాసభలు. శ్రీ దంటు సూరిబాబుగారు తలపోసి నిర్వహించిన ఈ సభలలోనూ ప్రముఖ పాత్ర మన మండలి వారిదే. ఆ సభలలోనే నా దొక గ్రంథావిష్కరణం జరిగింది. ఆ సందర్భంలో నాకు జీవిత సాఫల్య పురస్కారం అందజేసి సత్కరించినవారు మాన్యశ్రీ దంటు సూర్యారావుగారు. ఆమోదం పురప్రముఖులైన అక్కడి పండిత మిత్ర మండలివారందరిదీను. ఆధ్వర్యవం శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారిదే. ఆనందం మాత్రం నాది. అది నాలోని ప్రభాకర గురుదేవుల కీర్తిమూర్తికి కాకినాడ జరిపిన గౌరవంగా భావించాను.

ఆత్మీయ మిత్రులు శ్రీ బుద్ధప్రసాద్ గారి షష్టి పూర్త్యుత్సవ సంరంభానికి మైత్రితో నేనందిస్తున్న వాక్చిత్రమాలిక ఇది. స్వీకరించండి.

అభినందనలతో....

ఉత్తమ శ్లోకోక్తి

- డా. ధారా రామనాథశాస్త్రి

అప్పుడే బుద్ధప్రసాదున
కరువదేడులు నిండెనన్నది
నమ్మజాలని సత్యమైనను
నమ్మవలసిన సత్యమైనది.

నిత్యతరుణుడు నిత్యనూతన
భవ్యకార్యాచరణశీలుడు
పరమసేవాదురంధరుడై
ప్రణతులందిన పరమధీరుడు

గుండె నిత్య ప్రేమభాండము
కనులు శాశ్వత కరుణసీమలు
మాటచల్లని మధురవాహిని
హృదయ కేదారమున సంస్కృతి

తెలుగు బాసకు తెలుగుకైతకు
తెలుగు కళలకు తెలుగు సంస్కృతి
కెల్లతావుల చలవు చప్పర
ముల్లసిల్లగ చేసెనాతడు

'కృష్ణ'రాయని కళాపోషణ
బుద్ధదేవుని సౌమనస్యము
కుండలీకృత మండలమ్ముగ
ప్రసాదత్వము నెఱపునాతడు

తిరుమలేశుని దీవెనలతో
ఆంధ్రవిష్ణువు నాశిషముతో
తెలుగు వారల భాగ్యగరిమగ
తేజరిల్లు మహేంద్రుడీతడు

ఆయురారోగ్యములు సంపద
లందరిలో సుశ్లోక విభవము
నంది మండలి బుద్ధప్రసాదు
వర్ధిల్లుగావుత ఎల్లకాలము.

హరిత వైభవం

- సన్నిధానం నరసింహశర్మ

పండిత కవిమండలి తమ
కండగనుండంగ తగు మహాశయులందున్
ఖండితముగ చెప్పందగు
మండలి బుద్ధప్రసాదు మాన్యుని తొలుతన్

దొరతనమే పేరొందగ
వరసూచన లీయగల్గువారల రత్నం
బరగ మండలెయనునం
దరి యీ భావంపు ఫలము దర్శనమగుతన్

ఒక సంస్కార పరీమలంబు కృతులం దొప్పారుచున్ తండ్రి పే
రుకు చేకూరగ పుత్ర కీర్తి మలుపుల్ రూపొందనానంద గీ
తికలన్ బాడుచు జీవితంబు కలదద్దింకన్ విజృంభించి సా
గు కరంబందుకు మేల్తలంపు టెడదల్ ఘోషించు దీవించుచున్

హరిత దశావిశేషమది యర్వదిదాటి శతాధికంబునై
వరుసగ పుట్టుపండువుల వారలు వీరు సమాజదృష్టి జే
తు రనగ సంస్కృతి ప్రభల తోడ నితోధిక వైభవ ప్రభా
స్ఫురితము జీవితంబది యశోధికమై విలసిల్లుగావుతన్.

షష్టిపూర్తి అభినందన మాలలు

- మొవ్వ దేవనాథసూరి

1. మండలి వంశాబ్ధి చంద్రుడా
మృదుమధుర భాషణ చతురుడా
సుగుణాల సూర్యుడా, చిఱునవ్వుల మిత్రుడా
సాహిత్య ప్రియుడా, సౌశీల్యలోలుడా
నీకివే షష్టిపూర్తి అభినందన మాలలు.

2. దివిసీమలో పుట్టావు
అవనిగడ్డపై అల్లారుముద్దుగా పెరిగావు
భాగ్యనగరిలో విద్యాధికుడవైనావు
తండ్రిగారి అడుగుజాడలలో నడిచావు
నీకివే షష్టిపూర్తి అభినందన మాలలు.

3. చిన్నతనము నుండి ఖద్దరు వస్త్రములే ధరించావు
దయా, ధర్మ గుణములను ఊపిరులుగా నిలిపావు
'అహింసో పరమోధర్మః' అన్న బుద్ధదేవుని నామాన్ని దాల్చావు
సార్థక నామధేయుడుగా ప్రసిద్ధి నొందినావు
నీకివే షష్టిపూర్తి అభినందన మాలలు.

4. ప్రజా నాయకుడా, పరమనిష్ఠా గరిష్ఠుడా
సౌజన్యశీలుడా, సౌమ్యరూపుడా
విద్య, వినయ సంపన్నుడా, వివేకవంతుడా
పరమపవిత్రుడా, పరిపాలనా దక్షుడా
నీకివే షష్టిపూర్తి అభినందన మాలలు.

5. మానవసేవయే మహాభాగ్యమని
మాతృభాషావికాసమే బహు యిష్టమని
సంగీత సాహిత్యములే తన శ్వాసలని
తెలుగుజాతికే ఆదర్శ మవ్వాలని
నీకివే షష్టిపూర్తి అభినందన మాలలు.

6. అరమరికలు లేకుండా రాజకీయాలు నడిపిస్తావు
నీతినియమాలతో ప్రజాసేవ చేస్తూ ఉన్నావు
అవినీతి తిమిరాలకు ప్రచండ భానుడిలా ప్రకాశిస్తున్నావు
పార్టీలకతీతంగా అజాతశత్రువుగా నిలిచావు
నీకివే షష్టిపూర్తి అభినందన మాలలు.

7. పెద్దలను పెద్దమనసుతో గౌరవిస్తావు
పిన్నలను ప్రేమగా పలుకరిస్తావు
స్త్రీలకు వినమ్రతతో నమస్కరిస్తావు
మిత్ర, బాంధవులను సమంగా ఆదరిస్తావు
నీకివే షష్టిపూర్తి అభినందన మాలలు.

8. రాజకీయరంగములో నాయకుడవు
సేవారంగములో వీరసైనికుడవు
తెలుగు సాహిత్య రంగములో అభినవ శ్రీకృష్ణదేవరాయ సార్వభౌముడవు
తెనుగు భాషాభివృద్ధిలో తండ్రి మండలి కృష్ణరాయుని మించిన తనయుడవు
నీకివే షష్టిపూర్తి అభినందన మాలలు.

9. పదవులను చేపట్టి పదవులకే వన్నెలు దిద్దావు
పదవులను కృష్ణా రైతాంగసేవకై తృణప్రాయంగా త్యజించావు
నిరాడంబర జీవితములో నిండుకుండలా నిలిచావు
విశ్వవిఖ్యాతుడవై ఆచంద్రతారార్కముగ భువిపై వెలిగొందెదవు.
నీకివే షష్టిపూర్తి అభినందన మాలలు.

అవనిగడ్డ తెలుగుబిడ్డ

- వేంపల్లి అబ్దుల్ ఖాదర్

ఆ బహుళ పక్షం నెలవంక
నయనం విప్పింది నాగాయలంక

ఆ మనస్వి చిక్కటి చిరునవ్వు
నవ్వే నందివర్ధనం పువ్వు

ఆ వ్యక్తిత్వం అవనిగడ్డకే అందం
కారుణ్యవరా ఒక మకరందం

ఆయనతో అనుబంధం
పరిమళించే సుమగంధం

కిన్నెర నిక్వణమై కులుకు లొలుకు
చిగురు పెదవిపై మొలిచే చిరుపలుకు

ఆ యశస్వి రసరమ్య సౌమ్యవాదం
కనిపించని గాంధేయ మహానినాదం

ఆ నిశ్శబ్ద అంతరంగ తరంగం
ప్రవహించే అధికార భాషా సంఘం

ఆ మనస్వితో పంచుకునే మధుర స్మృతులు
తెనుగుదనం పూచిన భాషా సంస్కృతులు

ఆయన సాంప్రదాయ ఆహార్యశైలి
కన్నెపిల్ల చెక్కిలిమీటే తొలి చక్కలిగిలి

ఆ తపస్వి ఒక సొగసైన తెలుగు వాక్యం
రాజనీతిజ్ఞతన పండిన అపర లౌక్యం

కష్టజీవుల కన్నీళ్లలో ముంచిన ఆ కలం
సంక్షేమరంగ సాధనలో కలకలం

ఆ వివాదరహిత విలక్షణ వ్యక్తిత్వం
మానవీయతను స్పృశించే మధురత్వం

ఆ మస్తిష్కంలో మొలిచిన విజ్ఞాన ప్రభలు
విస్తరించిన ప్రపంచ తెలుగు మహాసభలు

ఉప సభాపతీ!

మీకేమిటి షష్ట్యబ్ది శుభాకాంక్షలు?
శుభాకాంక్షలకే మీరు శుభాకాంక్షలు!

మీ అంతరంగం!
ఎగిసే జలధి తరంగం!
అనంత సారస్వతారామం!
స్నిగ్ధసుకుమార నిసర్గధామం!

అభినందన గీతాంజలి

- డా. అయల సోమయాజుల గోపాలరావు

చిక్కని ఆభిజాత్యం
చక్కని వారసత్వం
పూర్వభాషిత్వం, స్మితపూర్వభాషిత్వం
వెరసి మండలి బుద్ధ ప్రసాద్ గారి మూర్తిమత్వం

ప్రజాస్వామ్య పద్ధతిలో అజాత శత్రువు
నీతినియమాల ధర్మసింధువు
సమాజహిత కార్యాచరణ బంధువు
సాహిత్య సాంస్కృతిక కళారంగ కేంద్రబిందువు

నిన్నటి అధికార భాషాసంఘ అధ్యక్షుడు
కానీ ఎన్నటికీ తెలుగు వెలుగులు విరజిమ్మే ప్రభాకరుడు
ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల నిర్వాహకమండలి వంశ ధీనిధి
నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభల రథసారథి

ఆత్మీయ అనుయాయులకు చలివేంద్రం
తెలుగుభాషా పరిరక్షణకు ముఖ్య కేంద్రం
గురజాడ మహాకవి అడుగుజాడ
విజయనగర అభ్యుదయ కవితల మేడ
మండలి కవితా ప్రస్థానంలో వెన్నెలవాడ

ఆరుపదుల వసంతరాయలు మండలి
ఏడు పదుల, ఎనిమిది పదుల,
నూరు పదుల పున్నమి హేలగా నడయాడాలి
ఐదు పదులు చేస్తూ అందిస్తున్న అభినందన గీతాంజలి

మనసులో వెన్న మాటలో మన్నన

- డా. గుమ్మా సాంబశివరావు

సీ॥ మనసు లోపల వెన్న మాటలో మన్నన
కలిగి కదలుచుండు ఘనుడితండు
పెద్దల పట్లను వినయమ్ము చూపుచు
గౌరవ భావాన క్రాలునితడు
ఆశ్రయించిన వారి నాదరించుచునుండు
ఆర్ద్రహృదయుడైన ఆర్యుడితడు
అన్యాయమియ్యది అనిపించినంతనే
ఎదిరించి నిల్చెడు హితుడితండు

గీ॥ ఇతడె మండలి వంశాబ్ధి హిమకరుండు
సాధుచరితుండు, బుద్ధప్రసాదుపేర
విశ్వవిఖ్యాత నుతుడౌచు వెలుగునట్టి
షష్టి వత్సర ప్రాయుండు సజ్జనుండు

తే॥ నిత్యచైతన్య మూర్తిగా నెసగుచుండ
మోము యౌవన రూపాన ముదము గూర్చు
నిర్మలత్వమ్ము చిత్తాన నిండి యుండ
వయసు జారదను ఘనుల వాక్కు నిజము.

ఆ॥వె॥ అపర గాంధియనుచు నార్యులు నుతియింప
తండ్రి కృష్ణరావు ధన్యుడయ్యె
తండ్రి బాట నడచి తండ్రిని మించెడి
తనయు డనుచు నీవు ధన్యుడైతి.

చం॥ తెలుగును రక్తనాళముల తేజము మీరగ నింపుకొన్న – నీ
యలఘు చరిత్ర విశ్వనుతమైనది – బుద్ధప్రసాదు నామమే
వెలవెల బోవు తెన్గునకు వెల్గులు చూపెడి దారిదీపమై
నిలుచునటంచు – ఆశలను నింపుచు నెల్లరు నిన్నుగొల్వరే.

కం॥ ఇచ్చిన పదవిని గొనుచును
మెచ్చెడు పథమున శ్రమించి మిన్నగ నుండే
సచ్చరితుడ వీ వంచును
నచ్చిన జనులెల్ల నీకు నతులిత్తురుగా

ఆ॥ ప్రతిభ చూపి నీవు 'పశువర్ధకపుశాఖ'
పూర్వచరిత నెల్లపూర్తిగాను
మార్చి – మత్స్యక్రాంతి మరి పశు క్రాంతియన్
పథక రచన తోడ వరలి తీవు

సీ॥ గాంధీయ తత్త్వమ్ము ఘన వారసత్వమై
తండ్రినుండియె నీకు తరలివచ్చె
దివిసీమ ఉప్పెనన్ దిక్కులు దుఃఖింప
సేవలనందించి చెలగి తీవు
కృష్ణడెల్టారక్ష కృషిచేయ ఉద్యమాల్
నడపిన దీటైన నాయకుండ!
పులిగడ్డ పెనుమూడి పూర్తిగా కలయంగ
వంతెన కట్టితే వరచరిత్ర!

గీ॥ ఇతర దేశాల సాయమ్ము నిట్టెయంది
మత్స్యకారులకు గృహాలు మానితముగ
నిర్మితము చేసి యిచ్చిన నిర్మలాత్మ!
నిండు నూరేండ్లు వర్ధిల్లు నిశ్చలముగ.

తే॥ దేశ దేశాల ఆంధ్రుల తేజమెసగ
విశ్వభాషగా తెలుగును వెలుగ చేయ
క్షణము క్షణమును తపియించు శ్రామికుండ!
సన్నుతిని గాంచు నీ సేవ శాశ్వతముగ

మత్తకోకిల : మానవత్వము రూపమెత్తిన మాన్యమూర్తివి నీవెగా!
లేనెలేవవి గర్వ రేఖలు లేశమంతయు చూడగా!
తేనెతెన్గును రక్షసేయగ దీక్షబూనిన వీరుడా!
వేన వేలుగ మెప్పు లందుచు విశ్వమందున వెల్గుమా!

శుభాభినందనలు

- వారణాసి సూర్యకుమారి

సీ. మండలి వంశమ్ము మణిదీపమైనట్టి
బుద్ధప్రసాద్ గారు బుద్ధిశాలి
దివిసీమ నుదయించి తెలుగుతేజమ్ముతో
భాషోద్ధరణజేయు భాగ్యశాలి
తల్లి ప్రభావతీ తండ్రి వెంకటకృష్ణ
రావ్‌గార్ల పూజించు రమ్యశీలి
సంఘసేవయేగాక సంస్కృతీసత్సాంప్ర
దాయముల్ పాటించు ధర్మశీలి

సీ. రాజకీయముల నారామమార్గమనగ
దేశభక్తి పితృనాదేశమనగ
సత్యసంధత నహింసలకు గాంధీజీని
బుద్ధుని సూక్తులే స్ఫూర్తి యనగ
న్యాయపాలనలోన నాయకత్వమునందు
ఖ్యాతిగాంచి రజాతశత్రు వనగ
దైవభక్తిని దానధర్మముల్ సలిపెడు
వారగున్ మంచికి మారుపేరు

తే.గీ. విద్య వినయ సంపత్తిని వినుతికెక్కి
ఆంధ్రభాషాభిలాషను ఆర్తితోడ
సాధనమ్మున సమకూరు సాధ్యమనుచు
తెలుగు భాషకు గుర్తింపు తెచ్చినారు

సీ. ప్రకృతి బీభత్సమున్ ప్రజలకు సహకార
మందించు కరుణార్ద్ర హృదయు లగును
నిస్వార్థపరతయు నిజనిరాడంబర
త్వము వారికాభరణములె యగును
గంభీరముద్రను గద్దెపై కనిపించు
గళమువిప్పిన యనర్గళముసాగు
ప్రతిభయే వారిని ప్రతినిధిగ నిలిపె
దేశవిదేశ విశేషములను

తే.గీ. పుస్తక పఠనాసక్తి యపూర్వమనగ
ప్రోత్సహింతురు సాహితీమూర్తులన్న
సత్కవిహృదయుల్ వారిని సత్కరించ
సంతసమ్మగు నభిమానులందరికిని॥

సీ. మత్స్యశాఖామాత్యపదవిని పశువైద్య
శాలలన్ విద్యాలయాలు నిలిపె
పాడిపరిశ్రమన్ పశుసంపదను పెంచి
పలువిధమ్ముల పాటుపడిరి
పులిగడ్డ వారధిన్ పూర్తి చేసియు తండ్రి
గారిపేరుంచిరి గౌరవమున
తెలుగు వెలుగునింప తెలుగుభాషాధ్యక్ష
పదవిని 'యూనికోడ్' జూపె

తే.గీ. ఉపసభాపతి శాసనసభకు వారు
పసిడికిని తావియబ్బిన పగిది నొప్పు
భరతమాతను సేవించు భాగ్యమనగ
భావి జీవయానముసాగు ప్రగతిపథము

తే.గీ. వాణియును లక్ష్మిదేవి శార్వాణి కూడి
అవ్విరించియు హరిహరుల్ యశము సిరులు
శాంతిసౌఖ్యముల్ సంతుతోసంతసమును
ఆయురారోగ్యములు వారి నలర జేయు

మండలి బుద్ధప్రసాద! మాన్యప్రమోదా!

- డా. అద్దంకి శ్రీనివాస్

1. కం. మండలి వంశాబ్ది శశీ!
పండితకుల పక్షపాత! పావన చరితా!!
పిండీకృత గుణసారా!
మండలి బుద్ధప్రసాద! మాన్యప్రమోదా!!

2. తే.గీ. అతిశయిల్లెను నినుజూచి యవనిగడ్డ
కృష్ణవేణమ్మ కెరటాల కేలుసాచె
ఆంధ్రవిష్ణువు మురిసి ఔరౌర! యనియె
కొండపల్లి బొమ్మలు బలు కులుకు మీరె!

3. తే.గీ. మంత్రివర్యుల సమితిలో మాన్యుడితడు
కపటమెరుగని సత్యవాక్యముల నాడు
బుద్ధదేవు ప్రసాదమై శుద్ధమతిని
సంచరించెడి హృదయ సంస్కారమితడు.

4. తే.గీ. కష్టజీవుల పాలిటి క్రాంతదర్శి
మత్స్యకారుల ఇంటి ముత్యాల మూట
పాడి పంటలు రెండునూ రెండుకళ్ళు
లోకహితమును కాంక్షించు శ్రీకరుండు.

5. తే.గీ. తెలుగు భాషాప్రియత్వము, తెలుగు సంస్కృ
తియన వల్లమాలిన ప్రేమ, తెలుగు కళల
పట్ల వాత్సల్య గరిమంబు పరిఢవిల్ల
దీప్తిగాంచిన తెలుగుల తేజమితడు.

6. ఆ.వె. ఎట్టి పదవికైన ఎనలేని కీరితి
తెచ్చునట్టి ఘనుడు, మచ్చలేని
చరితతో మెలగెడి సౌజన్యమూర్తి యీ
మండలికుల కీర్తి మండనుండు.

7. తే.గీ. హృదిని సౌశీల్య సౌభాగ్య హేలవిరియ
కనుల నభ్యుదయోన్నత కాంక్ష మీర
చేతలనందున సడిలేని చేవ వెలుగ
శతవసంతాలు గాంచుమో సరస హృదయ!!

మన మనిషి

- భువనచంద్ర

స్వచ్ఛమైన ధవళ వస్త్రాలు ధరించే
ఓ హిమాలయం
ప్రాక్ పశ్చిమ విజ్ఞానాన్నంతా తనలో దాచుకున్న
ఓ గ్రంథాలయం
ఒక్క చిరునవ్వుతో మనసులని గెలుచుకునే
ఓ మమతాలయం
ఒక్కసారి పరిచయమైతే జీవితాంతం మరువలేని
ఓ స్నేహాలయం
ఎత్తు పైయెత్తుల తాపంతో రగిలే రాజకీయ ఎడారిలో
ఓ ఒయాసిస్సు
నిర్మల ప్రశాంత జీవన కావ్యానికి నిఖార్సైన
ఛందస్సు
తెలుగు భాషోద్యమ కారులలో 'బాహుబలి'
మన ప్రియతమ నాయకులు **శ్రీ**
బుద్ధప్రసాద్ మండలి.
వారి మాట తెలుగు
వారి శ్వాస తెలుగు
వారి ఆశ తెలుగు
వారి బాస తెలుగు
మనసూ మాటా మనుగడా
సర్వం తెలుగే!
బొమ్మా బొరుసులని కూడా
ఏనాడో ఓనాడు విడదీయగలమేమోగానీ
బుద్ధప్రసాద్ గారినీ తెలుగునీ మాత్రం
ఏనాడూ విడదీయ లేము
మూర్తీభవించిన 'మంచితనం' ఆయన
మానవత్వాన్ని ప్రతిఫలించే 'మనిషితనం'ఆయన.
ఎల్లలెరుగని తెలుగు తల్లి పుత్రుడాయన
కల్లలెరుగని రాజకీయ మిత్రుడాయన.
నీతికీ నిజాయితీకి నిర్వచనం మండలి
వారి కిదే ఇదే నా నమఃసుమాంజలి.

వారిని మొదటిసారి విజయవాడలో కలిసాను... ఐలాపురం హోటల్‌లో. రాజకీయనాయకులతో నాకు ఏనాడూ పరిచయాలు లేవు. వారిని చూసాక అర్థమైంది... 'సింప్లిసిటీ'కి అర్థం. ఓ అరగంటసేపు మాట్లాడుకున్నాం. మరుసటి రోజు 'వేటూరి' గారి సంస్మరణ సభ. నేను విజయవాడ వెళ్ళింది అందుకే.

పొద్దున్న కార్యక్రమం పూర్తి అవగానే వారు 'హేయ్‌లాండ్'లో గాంధీగారిపై జరుగుతున్న జాతీయ సదస్సుకి రమ్మని పిలిచారు. అక్కడ వారితో 'లంచ్' చేసే భాగ్యం లభించింది. భాగ్యం అని ఎందుకంటున్నానంటే, సామాన్యంగా వివిఐపిలతో భోజనాలు చాలా గంభీరమైన వాతావరణంలో జరుగుతాయి. కానీ బుద్ధప్రసాద్ గారితో భోంచెయ్యడం ఎంత ఆనందాన్ని ఇచ్చిందంటే, మన ఇంట్లో మనం సహజంగా వు(తి)న్నంత అనుభూతి నిచ్చింది.

ఆ తరువాత చెన్నైలో చాలాసార్లు కలిసాను.. సభల్లో...సమావేశాల్లో... ఆఖరికి 'బాపూ' గారి అంతిమ యాత్రలో కూడా.

వారిని కలిసినప్పుడల్లా నా స్వంత మనిషిని కలిసినట్టుంటుంది. ఏ మాత్రం బెరుకు అనిపించేదికాదు. కారణం వారిలోని మంచితనం, సున్నితత్వం, హాస్యప్రియత్వం, సహజత్వం.

ఆయన ఓ నడిచే గ్రంథాలయం. మాట్లాడే ప్రతిమాటా సూటిగా, అర్థవంతంగా ఉంటుంది. ఆయన 'నెరవేర్చలేని వాగ్దానాలు' ఇవ్వడం ఏనాడూ నేను చూడలేదు. ఒక్కటి మాత్రం ముమ్మాటికీ నిజం, వారి పరిచయం కలగడం నా పూర్వజన్మ సుకృతం. మాటలకందని మహోన్నత వ్యక్తిత్వం శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారిది.

వారూ, వారి కుటుంబమూ నిండు నూరేళ్ళూ ఆయురారోగ్యఐశ్వర్యాలతో, ఆనందంతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, ఈ షష్టి పూర్తి మహోత్సవం దిగ్విజయంగా జరగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ...

నమస్సులతో

హృదయపూర్వక శుభాకాంక్షలు.

తండ్రికి దగిన సుతుండవు....

కం. గండూషితాంధ్రభాషా
మండనుడై మాన్యుడైన మండలి కృష్ణా
ఖండ యశః పుణ్య ప్రసా
దుండవు – తండ్రికి తగిన సుతుండవు – బళిరే !

– గురజాల హనుమంతరావు
రాజమహేంద్రవరం

తెలుగు దొర

- డాక్టర్ భూసురపల్లి వేంకటేశ్వర్లు

అతడొక వెల్లువై ప్రవహిస్తున్న స్రోతస్విని
పాయలు పాయలుగా పాథోనిధానాన్ని చేరి
తానే పారావారమైన ప్రశాంత ప్రతీతుడు
చెలియలి కట్టను దాటని
చిరునవ్వుల వెల్లువతో
చైతన్య ప్రపంచాన్ని జయించిన చెలిమికాడు.
చీకటిలో పురివిప్పే రాజకీయ తమస్వినికి
నాలుగు దశాబ్దాల అర్థం కాని ప్రశ్న
విజితావిజిత పథ సోపాన చిత్రంలో
నిచ్చెనమీద నిచ్చెన లెక్కినపుడే కాదు,
పుట్టపురుగు ముట్టినపుడు కూడా
అణువంత చిరునవ్వు చెదరని అమృతమూర్తి

స్వార్థం, సత్వం, స్థలితం, స్వాపతేయం
సహస్ర బాహు సమావృతమైన
భయంకర భేతాళ ప్రహసనంలో
అరవయ్యేళ్ళొచ్చినా అంతరాలెరుగని
పసినవ్వుల పలకరింపుకు
విజయం ఎట్లా వరిస్తుందో విధాతకే ఆశ్చర్యం.
మార్గమెంత బెడిదమైనా
మంచితనానికి ఎదురేముంటుంది.
ఆయన రాకతో
సచివాలయం గౌరవ దేవాలయం అయింది.
అక్షరాలకు పట్టాభిషేకం చేస్తున్న
అద్భుత జ్ఞానాలయం అయింది.

నాయకులంతా నగదు చుట్టూ
ప్రదక్షిణం చేస్తున్న రోజుల్లో
భాషా కక్ష్యలో పరిభ్రమించిన
బుధ దార్శనిక బృహస్పతి.
చరిత్రా సంస్కృతులంటేనే
చిరుగాలికి కదలాడే మనస్సున్న వాక్పతి
అపార పారావార ఆయోగ సంపన్నుడయ్యీ
వినడం, తెలుసుకోవడం విడిచిపెట్టని వివేకరూపం.

నిర్మలంగా కనిపించే నిర్భయం
స్నేహంతో సంగమించిన స్వేచ్ఛ
సహృదయంలో దాగిన బాధ్యత
ప్రేమతో పరిమళించే శిక్షణ
సంగమించిన సజీవ క్షేత్రంలో
ఊహకందని జంగమ సమర్థతా శిఖరం
మచ్చలేని తెల్లని దివ్యావరణంలో
మంద్రమార్దవ శ్రుతస్మిత పలకరింపు
గౌరవం ఆశించని పిలుపు
గౌరవించడంలోనే ఆయన గెలుపు
అందుకే నా యీ కైమోడ్పు.

కవితాభిషేకం

- రసరాజు

పండిన మేధతో అనుభవమ్మును జోడు కుదిర్చి - పాలనా
మండితుడంచు పేర్వడసి - మంచికి హారతులెత్తినట్టి మా
'మండలి' వంశసాగర హిమద్యుతికిన్ తులతూగునట్లుగా
రెండవవాడు వేరొకడు లేడు! నుతించెద తత్ ప్రశస్తినిన్

మకుటములేని రాజనగ మా 'గుజరాతు మహర్షి'యే! సమ
స్యకు తలవంచకుండ - ఒక శస్త్రమొ, అస్త్రమో వేయకుండ - శాం
తికి తలపాగ చుట్టి దొరనే తరిమెన్‌గద; అట్టి బోసి తా
తకు వరభక్తుడౌచు గనె ధన్యత 'మండలి' తండ్రిబాటలో!

'వేంకటకృష్ణరావు' ప్రభవింపగ 'మండలి' వంశమెల్ల, ప
ల్యంకిక నెక్కె - సాంస్కృతిక రంగము దీపిలె - మంత్రివర్యుడై
అంకిత దృష్టితో బడుల కభ్యుదయంబును గూర్చె - వాని దీ
పాంకురమౌచు నేడు యశమందెను 'బుద్ధప్రసాద్', చిరాయువుతో!

చమురు తగ్గిన మన తెల్గు ప్రమిదలోన
ఆవునేతిని పోసి -భాషాభివృద్ధి
సలిపె 'మండలి బుద్ధప్రసాద్'! పతాక
ఎగిరె అతని యేల్బడిలోన గగనవీధి

కవి'మండలి' - బుధ 'మండలి'
స్తవనీయుడటంచు సభల సాక్షిగ, వేనో
ళ్ల వచింపన్ 'మండలి' - 'ష
ష్టి' వరించెను - తెలుగుతల్లి సేసలు జల్లెన్!

'కిన్నెర' మీటె 'మండలి'కి కీర్తికిరీటము పెట్టి నేడు, వి
ద్వన్నుత సాహితీ జగతి - తండ్రికి తగ్గ కుమారుడంచు, సం
పన్న మనస్సు లల్లినవి పచ్చని దండ - లజాతశత్రువై
మన్ననగాంచె! ఆ హృదయ మాధురికిన్ కవితాభిషేకముల్!

షష్టిపూర్తి నవరత్న మాలికా

- డా. వుయ్యూరు లక్ష్మీనరసింహరాయః

శ్లో॥ శ్రీమన్మణ్డలి వంశాబ్ది రాకాచన్ద్రస్య రాజతామ్।
బుద్ధపూర్వప్రసాదస్య షష్టిపూర్తి మహోత్సవః॥ 1

శ్లో॥ మాతృభాషా విహారీ చ ప్రభావతీ సుతాగ్రజః।
ఆయురారోగ్యభాగ్యై శ్చ శ్రీప్రసాదో హి వర్ధతామ్॥ 2

శ్లో॥ విద్యావినయసమ్పన్నో వేఙ్కట కృష్ణనన్దనః।
శ్రీమాన్ బుద్ధప్రసాదాఖ్యో మేధావీ భువి వర్ధతామ్॥ 3

శ్లో॥ కృష్ణా ప్రాన్తకవీశానాం సఙ్ఘాధ్యక్ష స్సుధీవరః।
మణ్డలే ర్వంశతో జాత శ్శాన్తచిత్త శ్చ వర్ధతామ్॥ 4

శ్లో॥ నవ్యాన్ధ్రశుభరాష్ట్రస్య హ్యుపవక్తా కృతో మహాన్।
సభాచాలనదక్ష శ్చ శ్రీబుద్ధో భువి వర్ధతామ్॥ 5

శ్లో॥ రాజకీయోఽపి సన్మార్గః సత్సేవామార్గ తత్పరః।
సర్వేషామపి సన్మిత్రం శ్రీప్రసాదో హి వర్ధతామ్॥ 6

శ్లో॥ ప్రపఞ్చాన్ధ్ర మహాసంసత్సభా నిర్వహణాగ్రణీః।
సంస్కృతాన్ధ్ర మహాప్రీతః ప్రసాదు రభివర్ధతామ్। 7

శ్లో॥ గాన్ధేయ మార్గగామీ చ స్వచ్ఛభారతతత్పరః।
స్వదేశభక్తిశీలీ చ శ్రీప్రసాదో హి వర్ధతామ్॥ 8

శ్లో॥ దేశీయవస్త్రధారీ చ గ్రామవికాస దర్శకః।
శ్రీమాన్ బుద్ధప్రసాదో హి చిరం జీవం స్తు వర్ధతామ్॥ 9

దిక్కు నీవంచు దీవించె తెలుగు నాడు

- డా. ఆర్ధి రఘునాధ వర్మ

శ్రీకృష్ణరాయలే చిద్విలాసముతోడ
మండలికృష్ణుడై మరలివచ్చి
సాహితీ సమరంబు చక్కగా నెరవేర్చి
తెలుగు పల్కుకై కొంత వెలుగునిచ్చె
తనతండ్రి చూపిన తెనుగమ్మ సేవను
బుద్ధిగ చేపట్టి పొగడబడుట
బుద్ధప్రసాదంచు నిద్దంపు ప్రేమతో
అక్కున చేర్చిరి ఆంధ్రజనులు
ఔర! పాలనా చాణక్య! ఆంధ్రయువక!
సాహితీలోకపాలకా! చతురవచన!
భోజరాజాధి ప్రభువులు భువిని విడువ
దిక్కునీవంచు దీవించె తెలుగునాడు!!



తెలుగు పరిమళం

- సింహాద్రి పద్మ

సాహిత్య చలివేంద్రం
కవుల విడిదిల్లు, కళల పొదరిల్లు!
తెలుగు భాషోద్యమానికి చిరునామా!
ప్రపంచ తెలుగు మహాసభల ప్రజ్వలన జ్యోతి!
ఖండాంతర ఖ్యాతి నార్జించిన తెలుగు పరిమళం!
ఆంధ్ర భాషకు ఆధునిక ఆంధ్రభోజుడు!
వలచి వచ్చిన పదవులకు వన్నె తెచ్చిన రాజనీతి
'మత్స్యక్రాంతి', 'పశుక్రాంతి' పేదల సంక్రాంతి!
ఉప్పెనలకు ఉపద్రవాలకు – ఉప్పొంగే మానవేతిహాసం!
నిరంతర పుస్తకోపాసనం, ఆకర్షించే సందర్భోచిత వక్తృత్వం!
బుద్ధగాంధీల తత్వాన్ని ఒడిసి పట్టుకున్న వ్యక్తిత్వం
దివిసీమ స్వచ్ఛ గాంధీయం – మండలి బుద్ధప్రసాద



అమెరికాలో
'గూగుల్' సంస్థ సందర్శన

అభివాదం

- జ్ఞిం

మంత్రి గారి అబ్బాయి మంచి వాడవడమేమిటి?
ఇదో అద్భుతం!
మండలి వెంకట కృష్ణారావు గారి పేరు మరింతగా పెంచడమేమిటి?
ఇదో ఆశ్చర్యం!
తెలుగు భాషకోసం తపించిన తండ్రిగారి వారసత్వాన్ని అందుకుని
తెలుగు భాషోద్యమ సైనికుడిగా మారడమేమిటి?
ఇదో అద్వితీయం!
'నాన్న మంత్రైతే నాకేంటి తక్కువ' అని విర్రవీగకుండా....
నాణ్యమైన పనులతోనే నలుగురి మెప్పును పొందడం .
ఇదో అమోఘం!
మండలి పేరు వినగానే.. అప్పుడు తెలుగు మహాసభలు గుర్తొచ్చేవి.
ఇప్పుడు 'అక్షరమాల'ని ... 'అక్షమాల'గా తిప్పుతున్న.... 'తపస్వి' బుద్ధ ప్రసాద్ గారు గుర్తొస్తారు.
అలాగే నిండునూరేళ్ళూ... 'అ-ఆ'లను కావడిలో మోసుకుంటూ
తెలుగుని భూమండలం చుట్టూ తిప్పాలని ఆశిస్తున్నాను-
ఆ సరస్వతీ మాత వీరిని ఆశీర్వదిస్తుందని విశ్వసిస్తున్నాను -

నీవు పుట్టిన రోజు ఈ శుభవేళ మిన్న

- డా. మంగళగిరి ప్రమీలాదేవి

నీవు పుట్టిన రోజు ఈ శుభవేళ మిన్న
మంగళ గళ లలిత కుసుమ మకరంద
హృదయగత భావ సంపదల గూర్చి
అందించితేను నీ అక్షరమాలిక సానందముతో
వత్సరాలు గడిచినా మచ్చెరగని భావస్వచ్ఛత నీది

మనసంత కరుణైన మహనీయుడనుట
అది సత్యమది సుందరం, ఇది సత్య సుందరం
ఆర్తుల పలుకుల కోయని పలుక
మన ప్రసాదుడు మహామాత్యమౌళి

ఉదయించిన రవి బింబం తూర్పున కందం
ఎగసిపడే కెరటాలు ఏటికి అందం
కృష్ణరాయ వరప్రసాదు డితడు
భరతావని కందం
తెలుగు భాషారంగాన ముసిరిన
ఒడిదుడుకు తిమిరాల హరియించు
దివ్వెవై నిలిచావు
కృష్ణ వారధి నిర్మించి
మాపాలి రాముడనుట

భావ్యమే కాదు ఆంధ్రుల భాగ్యమగును
నీవు పుట్టిన రోజు ఈ శుభవేళమిన్న
ప్రేమతో రారండి పెద్దలు దేవతలు
తథాస్తు తథాస్తు తథాస్తు అంటూ.

విద్యాబుద్ధులు ఉన్నత పదవులు
సిరిసంపదలు చిన్నారులతో
కళకళలాడే కుటుంబ జీవనం
వే వెలుగులు నిండాలని
తథాస్తు తథాస్తు తథాస్తు అంటూ.

శతాధిక వత్సర ఆయుష్షూ మరి ఆరోగ్యం
అందరి ప్రశంసలందే యశస్సు
దివిసీమ ప్రభవించిన దివ్య పురుషునికి
సిద్ధించాలని సమకూడాలని
ఆశీస్సుల నందించ అందఱు మీరు
తథాస్తు తథాస్తు తథాస్తు అంటూ
ప్రేమతో రారండి పెద్దలు మీరు.

ఓం ధ్రువో౽సి

- విద్వాన్ చక్రాల లక్ష్మీకాంత రాజారావు

కం॥ వసుధన్ మండలి బుద్ధ
ప్రసాదు షష్ట్యబ్దపూర్ణ పర్వోత్సవమం
దు సురలు శతాయువనుచున్
పసగల దీవెన లిడఁగొని వర్ధిలుగాతన్

మ॥ సురలేకాదు సురేశ్వరుల్, మునివరుల్, చుట్టాల వర్గమ్ములున్,
వరపాండిత్య విరాజమాన బుధులున్, భావజ్ఞులున్, సత్కళా
ధరులున్, రమ్య కవిత్వ భాగ్యధరులున్, ధర్మజ్ఞులున్, రాజకీ
య రసౌచిత్య విశిష్ట మార్గచణులున్, సత్యార్థులున్, సర్వులున్,
సరసోదార మనోజ్ఞ చిత్తమున సేసల్ చల్లగా – మీరలున్
ధరణి న్నూరు వసంతముల్ గనుచు చేతః ప్రీతి జీవింపుడీ!

సీ॥ ఒకవైపు రాజకీయోద్యోగ బాధ్యతా
నిర్వహణమునందు నిపుణమతులు,
ఒకవైపు జనపాలనోద్యోగ బాధ్యతా
నిర్వహణమునందు నిపుణమతులు,
ఒకవైపు బుధసేవనోద్యోగ బాధ్యతా
నిర్వహణమునందు నిపుణమతులు,
ఒకవైపు 'తెల్గు' భాషోద్యమ బాధ్యతా
నిర్వహణమునందు నిపుణమతులు

తే॥గీ॥ వెలయు నిరువది నాల్గుగంటలును తలపు
తలుపు లెప్పుడు సత్కార్య తతుల నెఱపఁ
దెఱచి కొనియుండు తమరికి, దీప్తమయ్యె
తెలుగుదేశమ్ము తద్దయున్ వెలుగు తెలుగు
జాతి మీ ద్వార బుద్ధప్రసాదు గారు

అభివాదమే

- డా॥ తిరునగరి

అక్షులతో చూడని బుద్ధుని
అవతార పురుషుడైన భగవానుడంటారు అందరు
ప్రత్యక్షంగా మనమధ్య మసలే
ఈ బుద్ధప్రసాదుని
'దైవం మానుష రూపేణ' అంటాను నేను
మండలి వంశ ప్రదీపకుడు
మహాత్ముడైన వేంకట కృష్ణారావుగారి
పుత్రుడు
బుద్ధప్రసాద్ ప్రసన్నవదనుడు
భువిలో విద్యా వినయ సంపన్నుడు
'తెలుగు, అనగానే పులకించిపోయే
తెలుగువాడు
తెలుగు సంస్కృతి అనగానే
ఒడలు మరచిపోయే
ప్రేమికుడు
తెలుగుసాహితిసేవలో తరించే కర్మయోగి
తెలుగు భాషోద్ధరణకై ఉద్యమించే
చైతన్యశీలి
మండలి బుద్ధప్రసాద్ మాననీయుడు
మా తెలుగు వారందరికీ ధ్యేయుడు
ఆయన హృదయానికి లేవు
సరిహద్దులు
అవనిపైన తెలుగులంతా ఆయన బంధువులు
విశ్వమంతా పర్యటించిన తెలుగు బాబయ్య
విశ్వమంతలా తెలుగుదీపాలు వెలిగించిన
తెలుగన్నయ్య
మండలి బుద్ధప్రసాద్ మనీషి
మానవత రక్తంలో ప్రవహించే మనిషి
ఆయన ఎక్కని తెలుగు వేదికలేదు
ఆయన తెలుగు భాషా వ్యాప్తికి చేపట్టని
ఉద్యమం లేదు
తెలుగు భాషా సౌధనిర్మాణానికి
రాళ్ళెత్తుతున్న కార్మికుడు
తట్టలు మోస్తున్న శ్రామికుడు
బుద్ధప్రసాద్ మండలి
ఆయన వెంట కవి పండిత మండలి
తెలుగువారి గుండెలలో నిలిచిన
తెలుగువాడు
తెలుగువారంతా గర్వించే తెలుగు నాయకుడు
'దివిసీమ' ఖ్యాతిని
భువి అంతటా ప్రసరింప జేసిన తెలుగుబిడ్డ
'అవనిగడ్డ' విశిష్టతను
అఖిల ప్రపంచానికే ఎత్తి చూపించిన తెలుగునేత
ప్రజల మధ్యనే జీవించే గాంధేయవాది
పరోపకారమే పుణ్యమని భావించే
ప్రజల మనిషి
సౌజన్యమూర్తి బుద్ధప్రసాద్
షష్టిపూర్తి సందర్భంగా –
ఆయనకు నా అభినందన సుమాలు
అభివాద చందనాలు

అభినందన అక్షర సుమమాల

- తన్నీరు కమలాదేవి

తే॥ బుద్ధదేవుని వరమునఁబుట్టినావు
పేరుగైకొని పితృఋణమును దీర్చినావు
ఉన్నతోన్నత పదవుల నొందినావు
పరులు నీసాటియె బుద్ధప్రసాదవర్య

తే॥ ముగురు మూర్తులు దీవించి ముచ్చటింప
తథ్యమది యనిఁబల్క తథాగతుండు
మనుము నూరేండ్లు మహియందు మోదమలర
మహితగుణ సాంద్ర మండలి వంశవార్ధి చంద్ర



భాషోద్యమ గాండీవి

- సత్యనారాయణ శిలపరశెట్టి

మండలి బుద్ధప్రసాదు
మండిపడని మంచి మనిషి
వ్యవహారం ఆతను
గడ్డం లేనట్టి ఋషి

తెలుగును తల్లిగ కొలిచే
భాషా సంపదకు ఖని
తెలుగు కొరకు తెరువరిలా
తిరుగుతుండు విద్వన్మణి

మన శాసన సభ కొలువున
ఉపసభాపతీ భోజుడు
సంసారం ఒదిలెయ్యని
సత్రవర్తనా విభుడు.

కళల మండలికి 'మండలి'
పెద్దదిక్కు అయినవాడు
మండు నెలలు మదిలోగల
తెలుగు మండనముల వాడు

మండలి కృష్ణారావన
మన్ననగల వరపుత్రుడు
చేపట్టిన ప్రతి పనిలో
నిష్ఠ ఉన్న జయశీలుడు

భాషోద్యమ గాండీవం
కలిగిన మేటి కిరీటి
భాషాకాశాన మెరియు
అతనికెవరు నేడు సాటి

అరువది ఏళ్లొచ్చినా
అతడు కాడు వృద్ధుడు
అనేక విషయాలన్వే
షిస్తున్న బుద్ధుడు

చెట్టు చేమ వలన ప్రజా
నీకానికి ఎంతో మేలు
మండలి బుద్దప్రసాదు
లాంటివారు ఒకరు చాలు.

శుభాశీస్సులందిద్దాం
వందేళ్లుండాలని
సుఖశాంతుల వనిలో
విహరిస్తూ వుండాలని.

మా తెలుగు 'తండ్రి'కి మల్లెపూదండ!

- కొల్లూరి

అరవై వసంతాల వెలుగు
స్వచ్ఛమైన ఆరుపదుల తెలుగు
తెలుగు అక్షరానికి ఆకారం
సంస్కృతీ సంప్రదాయాల ప్రాకారం!

నిండు పౌర్ణమి పండు వెన్నెల్లా....
ఆ చిరుదరహాసి పలకరింపు
తెలుగు గడపకు ముత్యమంత పసుపు,
మానవతకు తెరిచిన తలుపు!

అపరగాంధేయ వాదిగా
తరతరాలకు ఆయనే ఒక చరిత్ర
నిజానికి, గాంధీ ఇజానికి,
కట్టుబడ్డ అవనిగడ్డ తెలుగుగడ్డ!

శాసనసభ ఉపసభాపతి
భారతీయ సాహిత్య సంస్కృతుల దళపతి
నిరంతర భాషోద్యమ సౌజన్యమూర్తి
ఆయనది అజరామర నిరాడంబర కీర్తి!

బహుముఖ ప్రజ్ఞా జ్ఞానశిరోమణి
జీవన సాఫల్య విశ్వవిజేత
కళారంగ ఆత్మీయదీప్తి, చైతన్య స్ఫూర్తి
తెలుగులోగిట అభినవ ఆంధ్రభోజుడు!

వాచకంలో, ఆహార్యంలో
ఆయనకు ఆయనేసాటి
ప్రాక్‌పశ్చిమాల్లో తెలుగు బావుటా
రెపరెపలాడించిన ఘనాపాటి!

బహుముఖ గ్రంథకర్త
బహుముఖ గ్రంథ ఆవిష్కర్త
బహుముఖ గ్రంథ స్వీకర్త
నవ్యాంధ్ర సాహితీ సృష్టికర్త!

ఎందరికో పదవి గౌరవం,
పదవికే ఆయన గౌరవం!
లభించాలి ఆయన సేవలకు పద్మపురస్కారం
అదే ఆయనకు ఆరుకోట్ల ఆంధ్రులిచ్చే నమస్కారం!

మానవత్వం పరిమళించే
ఆ మహనీయుడికి వందనం
తెలుగుజాతి కీర్తి తేజానికి వందనం
విజయసోపానాల సాహసుడికి వందనం
నిరంతర అక్షర సైనికుడికి వందనం!

తండ్రి నుండి ఉన్నత వ్యక్తిత్వాన్ని పుణికి పుచ్చుకున్న
రాజనీతిజ్ఞుడికి, వందనం!
జీవన సాఫల్య సమాహారానికి వందనం
అమ్మభాషను మరువని ఆ మహనీయుడికి వందనం!

అవినీతికి దూరంగా, ఆయన త్రికరణ శుద్ధికి వందనం!
నిరాడంబర సాత్వికుడికి వందనం!
విశ్వవిద్యాలయ స్థాపన విజేతకు వందనం!
అపర భగీరథుడికి వందనం!

అమ్మనేర్పిన భాష – పాల బువ్వభాష
తేనెలొలుకు భాష – తెలుగు భాషకు వందనం!
సుజలాం, సుఫలాం, మలయజ శీతలాంకు వందనం!
బుద్ధుడికి వందనం! జ్ఞాన సిద్ధుడికి వందనం!

అక్షరాభిషేకం

- డా. రాధేయ

సేవాభావమే వంశ చిరునామాగా
దివిసీమలో మెరిసిన ఓ కాంతి రేఖ
తండ్రి చిటికెన వేలు పట్టుకొని
నడిచిన సిద్ధార్థుడు!

నిష్కళంక రాజకీయం
నిండిన దరహాసం
నిత్యం ఖద్దరునే ధరించే గాంధేయవాది
పుస్తక పఠనం మరువని ఆత్మవిశ్వాసి!

కవులన్నా, కళాకారులన్నా
ఎల్లలు లేని భాషాభిమానం,
మాతృభాషా పరిరక్షణే వారి ధ్యేయం
తండ్రి పేరున ప్రతి ఏటా
మేధావులను సన్మానించే సౌజన్యం!

ప్రధాని మోడీ స్ఫూర్తితో
స్వచ్ఛభారత్ నినాదంగా
చల్లపల్లిని అగ్రగామిగా నిల్పిన
ఆచరణశీలి!

అరవై ఏళ్ల జీవన ప్రస్థానంలోనూ
ఇరవై ఏళ్ల ఉత్సాహవంతుడుగా
ఒక నాటి తండ్రి చాటు సిద్ధార్థుడు
నేటి మన నవ్యాంధ్ర బుద్ధుడు
మండలి బుద్ధప్రసాద్ గారికి
ప్రేమతో నా ఈ అక్షరాభిషేకం!

అక్షర విన్నపం

- మద్దాళి రఘురామ్

బహుశా అప్పుడెప్పుడో
దేవతలు నడయాడిన భూమి కాబోలు
ప్రకృతి అందాలకు ఈ ప్రాంతం
ఆనవాలు కాబోలు
ఈ సీమ దివిసీమగా విరాజిల్లింది
ఈ అందమైన సీమలో
ఆత్మీయత పంచిన తెలుగుజాతి ముద్దుబిడ్డ
మండలి వంశాంకురం శ్రీ బుద్ధప్రసాద్
ఒక వంక తండ్రి నిలిపిన పాదముద్రలు
మరొకవంక సమాజహితం కోసం
మహాత్ముడు పలికిన మహిత సూక్తి సుధలు
ఈ రెండింటి పూర్ణఫలంగా నిలిచారు
ఆరుపదుల బాలుడు మండలి
భాషోద్యమం జరిగితే చుక్కానిలా నిలుస్తారు
భాషా సంఘానికి తీరుతెన్నూ సూచిస్తారు
రాజకీయంలో అగ్రభాగాన వుండే
కృష్ణాజిల్లా ప్రజలకు ప్రతినిధిలా నిలుస్తారు
ఆలమందల రక్షణకు అవతరించిన కృష్ణమూర్తిలా
పశుసంవర్ధక శాఖను కూడా
ప్రజామోదంగా నిర్వహించగలిగిన ప్రసాదమూర్తి
మొత్తం మీద తెలుగువాళ్ళ
హృదయాలను గెలుచుకున్న ఆదర్శమూర్తి
ఆ మహనీయుడికి షష్టిపూర్తి ఉత్సవం
జరుగుతోందని తెలిసి
తెలుగు అక్షరం అతిథిలా తరలివచ్చింది
బహుమానం తెచ్చిందో లేదో గానీ
విజ్ఞాపన పత్రం తెచ్చింది
ఆర్యా!
మీకు షష్టిపూర్తి శుభాకాంక్షలు
సరే,
నాకు కాస్తంత అస్తిత్వాన్ని కలిగించండి
చిన్నా, పెద్దా ఏ నోటా నేను వినబడటం లేదు
చిన్నా, చితకా ఏ పేపరు తిరగేసినా
నా స్వస్వరూపం కనబడటం లేదు.
బళ్ళోకెళ్తే మరీ దారుణం
అసలు నా చిరునామాయే దొరకటం లేదు
చివరికి శాసనసభలోనూ అదే పరిస్థితి
ప్రశ్నోత్తరాలైనా, ప్రత్యుత్తరాలైనా
ఆదాయ, వ్యయాల వార్షిక ప్రణాళిక అయినా
నా జాడే ఉండదు
ఎవరిని అడగాలి?
ప్రజలనా? ప్రజా ప్రతినిధులనా?
అందుకే నా యీ విన్నపం
భాషాసారథిలా, సాంస్కృతిక వారధిలా
ఇంతకాలం నిలిచిన మీరు
ఇకమీదట గాంధేయవాదిలా కాదు
ఎగసిపడే అగ్ని తరంగం
వీరేశలింగంలా
అడుగుజాడలు పదిలంగా మిగిల్చిన
గురజాడలా
వ్యవహారిక భాష కోసం విరుచుకుపడిన
గిడుగు పిడుగులా
నాకు అండగా నిలవండి
సాహిత్య సభనైనా, శాసనసభనైనా
ఉద్యమంలోనైనా, ఉద్యోగంలోనైనా
నేను మువ్వనై మ్రోగాలి
తెలుగువాకిళ్ళలో నిత్యం నా సవ్వళ్ళు సాగాలి
ఈ ఆశ మీరే తీర్చగలరని
ఈ విన్నపం చేస్తున్నాను
తీరబోయే ఆశలే శ్వాసగా
మీ ముని వాకిట జీవిస్తున్నాను.

అక్షరాంజలి

- గుమ్మడి గోపాలకృష్ణ

గౌ॥ ఆంధ్రప్రదేశ్ 'రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి' శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి షష్టిపూర్తి వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుతున్న శుభ తరుణంలో మచ్చలేని నిస్వార్థ జననేతకు శత వసంతాలు ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలని నటరాజును వేడుకుంటూ సీసపద్య మందారం.

సీ॥ దివిసీమ రాయలు తెలుగువెలుగు మండ
లికృష్ణరావు కలిమి సుతుండు
చిరునవ్వు చెదరక సేవింప జనులను
తండ్రిని మరపించు ధర్మ గుణము
శ్రీకాకుళంబున శ్రీ విష్ణు సన్నిది
వెలుగుగా నిలిపెను తెలుగుభోజు,
సాహితీ పరిరక్ష శ్రామికోద్యోగియై
నిష్ఠతొ శ్రమియించు నియమశాలి

గీ॥ సాధు జీవన బుద్ధప్రసాద వర్య
విజయలక్ష్మియే తోడునీ విజయములకు
తెలుగు వాఙ్మయ ప్రగతి నిర్దేశ నిరత
శారదాంబ నీకిడు గాక శాంతి సుఖము



డా॥ బెజవాడ గోపాల్‌రెడ్డి గారి ఆశీస్సులు

అవనీజన ప్రియనేత

- నడకుదిటి రాధాకృష్ణమూర్తి

పల్లవి : ప్రజలకోసం – ప్రగతి కోసం విశ్రమించని యోధుడితడు
శాంతి కోసం – సమత కోసం పరితపించే బుద్ధుడితడు...
దేశదేశములెన్నో చుట్టిన... నవ్య జగతికి నాంది పలికిన
శాంతి కోరే సౌమ్యుడితడు... భావి భారత నేత యితడు....

చరణం : గాంధేయ మార్గమే లోక ప్రియమని – సర్వప్రగతికి మూలధనమని
ఆచరించిన కృష్ణరాయుని ఆశ తీర్చిన తనయుడితడు...
కలసి ఉంటే కలదు సుఖమని – ప్రజల కోసమే పాటుపడమని
ఉద్యమించిన మేటి మండలి తీర్చిదిద్దిన రత్నమితడు....
అన్ని తెలిసిన విజ్ఞుడితడు – అందరికీ ఆత్మీయుడితడు

చరణం : శాంతిదూతల దివ్య సూక్తులు శిరము దాల్చిన వినయుడితడు
దూరదృష్టితో ఎన్నో పనులకు స్ఫూర్తినిచ్చిన శిల్పి యితడు
కన్నవారికి కీర్తి యితడు – 'దివి' జన హృదయాప్తుడితడు
జ్ఞానగుణ సంపన్నుడితడు – కార్యజయ నైపుణ్యుడితుడు
జనం మెచ్చిన నేత యితడు – ప్రజాసేవలో ధన్యుడితడు


శ్రీ కోట్ల విజయభాస్కరరెడ్డితో...

అభినందన పరిమళాలు

- పువ్వాడ తిక్కన సోమయాజి

చందన గంధమ్ము, మదభి
నందన మిళిత పరిమళ మనఃప్రముదమ్మున్
చిందింతు, వలచి యితనికి
స్పందిత ధిషణా వయో వసంత సహస్రిన్!

చేవగట్టినేల విరజిమ్మిన విత్తులు మొల్కలెత్తి యు
జ్జీవనమిచ్చు తేకువయె శ్రీలకు తావలమై ఫలించు, న
ట్లీవును నట్టివంగడపుటింట జనించి గ్రహించితే, ప్రజా
సేవయె లక్ష్యసాధక విశిష్ట పథమ్మని మండలీ సుధీ!

అతనిని గాంచినంత నితడా మనవాడనిపించు, నంతలో
నతడె కనంగ మమ్ము కనులార్ద్రత దొఙ్కును, పల్కరింప సం
తతదరహాస చంద్రిక లుదార ముదావహమై ఘటిల్లు, వి
స్తృత కుశల ప్రసంగ పరిధిన్ ప్రవహించు హృదబ్జ మాధురుల్!

అరువదియేండ్ల ఉత్సవ - మహర్నిశలున్ గడియించు నీదు ను
ద్ధురతర గ్రంథశోధన రతుల్, రచనా ప్రవణత్వముల్ ప్రసం
గ రుచిర ధోరణుల్ వెలయగా ప్రభుతన్ నడపింపనౌ మనో
హరమగు శీలసంపదకె - చేతుము బుద్ధప్రసాద ధీమణీ!

కృష్ణను చేరు బృహస్పతి
కృష్ణుడె తానైన తండ్రి, యిర్వురు నొకటై
తృష్ణను దీవింతురు వ
ర్ధిష్ణుని సత్సుతుని, చూడుడీ మహమందున్!

షష్టిపూర్తి శుభాకాంక్షలు

- పోలాప్రగడ రాజ్యలక్ష్మి

అవనిగడ్డ అఖిలాంధ్రుల అభిమాని బుద్ధప్రసాదుగారు
మండలి వారి వంశమునకు ఆణిముత్యము వంటివారు
వ్యవహార దక్షతలో
తండ్రిని మించిన తనయులు
గాంధీగారి ఆశయాలను
అనుసరించి ఆచరించినవారు
వీరిలోని సౌజన్యత, సామరస్యము
ఆంధ్రులకు ఆదర్శము
వీరి ఆశయాలు ప్రజోపకారాలై
తెలుగువారికి ముచ్చట గొలుపుతూ ఉంటాయి.
సంతసించిన వారు మరెందరో ఉన్నారు
ప్రబుద్ధులైన బుద్ధప్రసాద్‌గారు
నిరాడంబరత కలిగిన స్నేహశీలి.
వాక్చతురుత కలిగి తెలుగు దేశ పరిపాలన చేపట్టినవారు,
మన బుద్ధప్రసాదుగారు
అప్పుడే అరువది సంవత్సరాలు వచ్చాయా?
అనిపిస్తోందేమిటి?
షష్టిపూర్తి మహోత్సవము
అందంగా, ఆనందంగా వీరికి జరుపుకుందాం
ఆయురారోగ్యములు ఇమ్మని
ఆ తిరుమలేశుని కోరుకుందాము
శాశ్వత కీర్తిని వీరికి ఇమ్మని
వేడుకుందాం.

పలుకు తెలుగు - మనసంతా తెలుగు

- విద్వాన్ బి. కిరణశ్రీ

కII మండలి వంశోద్ధారా !
తాండవ శివ వీక్షణములు కరుణయు, దయ మీ
కుండగ అనయము మెండుగ
నిండుగ నూరేళ్ళు మసలు నియమ విహారా!

ఉII మంచికి మారు పేరు; మరియాదకు ఎవ్వరు సాటిరారు ఏ
వంచన జోలి బోరు; నయవంచకులన్నను చేరనీరు; నొ
ప్పించని మాటతీరు; సరిపెట్టరు మాటలతోనే వారు; మె
ప్పించెదరెట్టులైన తను చెప్పిన రీతిగ చేసి చూపుచున్

సీII దివి సీమ ఉప్పెన నేర్పెనా వీరికి
ఆర్తుల కాపాడ అడుగువేయ
తండ్రి కృష్ణారావు తర్ఫీదు నిచ్చెనా
పరిపాలనలొ మేటి పటిమ చూప
తల్లి దుగ్ధములోనె తనివిని పొందెనా
తీపి తెలుగు భాష తేనె రుచిని
నాన్న ఆదర్శాలు తట్టి కదిలించెనా
ప్రజల సేవకు పాటుపడుట కొరకు

అవెII మాటలోనే కాదు మనసులో నిండెను
తెలుగు భాష మరియు తెలుగు దనము
విశ్వమెల్లదిరిగి వినిపించె వాణిని
మాతృభాష గొప్పదనము; గుణము.

అమృతమూర్తికి అక్షర నీరాజనం

- జి. రంగబాబు

అవని గర్వించే అమృతమూర్తి
భాషను అభిమానించే ప్రతి ఒక్కరి స్ఫూర్తి...
'అవనిగడ్డ'కు వెలుగైన 'తెలుగుబిడ్డ'
'పులిగడ్డ-పెనుమూడి' వారధి సాధించిన 'పులిబిడ్డ'...!

మండలి వంశానికే తలమానికం...
తెలుగు భాష అభివృద్ధికి ప్రారంభం నవశకం...
జగతినే జాగృతం చేయగల నాయకుడు
ప్రగతి కోసం సమాజహితం కోరే సేవకుడు....!

ఆయన ఊపిరి భాష, సంస్కృతి, సాహిత్య వికాసం...
మంచితనం, మానవత్వం ఆయన విలాసం...
కళారంగాన వెలకట్టలేని మకుటం లేని మహారాజు
రాజకీయ రంగంలోనూ ఆయన తరహా అందరికీ మోజు...!

తండ్రి ఆశయాలను పుణికిపుచ్చుకున్న గాంధేయ వాది...
సేవే ధ్యేయం, సమాజహితమే లక్ష్యమైన మానవతావాది...
తెలుగు మాధ్యమం కొరకు చేసిన అతని అవిరళ కృషి.....
చేసిందాయనను భాషాభిమానాన్కి ఎల్లలే లేవన్న మహామనీషి....!

'వజ్రభారతి'కి సాహిత్య ప్రియులు పట్టిన 'కళాహారతి'
అధికార భాషా సంఘ అధ్యక్షుణ్ణి చేసి గర్జించింది 'తల్లి భారతి'...
ప్రాచీన భాషా హోదా ఉద్యమాన్కి ఆయనే ఆధారం...
'ఉపసభాపతి' పదవికే వన్నె తెచ్చిన ఇల వో గాంధారం!

ఆశిషములు

- డా॥ గుడిసేవ విష్ణుప్రసాద్

కం॥ మండలి వంశపు తిలకుడు
అండగ దివిసీమ ప్రజల యాపదలెల్లన్
నిండు మనంబున దీర్చుచు
నుండెడి బుద్ధప్రసాదుకొసగెద నుతులన్

కం॥ శ్రీమండలి వంశాబుధి
సోమా! బుద్ధప్రసాద! శుభమగు నెపుడున్
ధీమంతా! నీతిజ్ఞా!!
ఆ మాధవుడిచ్చునాయురారోగ్యంబుల్

తే॥గీ॥ అందరికి మీరు సౌదర్యమందిరమ్ము
సుందరంబైన నడవడియందు ఘనులు
బుద్ధవర్యుండు! బుధజన పూజితుడ!!
అందుకొనుమయ్య! మా హరి చందనములు

కం॥ మండలి కరములు మెత్తన
మండలి హృదయంబువలెను మానిత మగుచున్
మండలి పలుకులు బుధజన
మండలి మెచ్చెడి విధమున మధురిమ లొలుకున్

ఆ॥వె॥ ముప్పదేండ్ల చెలిమి ముప్పిరి పేటయై
కలసి మెలసి యున్న కలిమె కలిమి
బుద్ధిమంతుడైన బుద్ధప్రసాదుండు
ఆప్తమిత్రుడగుట నదియె బలిమి

సీ॥ తెలుగుభాషాదీప్తి దేశదేశాలలో
వికసింపజేసిన విజ్ఞుడితడు
సంగీత సాహిత్య సమ్మేళనము లెన్నొ
ఘనముగా నడిపిన ఘనవరుండు
దేశభక్తి యుదుండు దైవభక్తి రతుండు
సేవాభినిరతుండు సేవకుండు
నీతివంతుండుగా నిలచి నడచువాడు
అవినీతి యంటని భవుడితండు

తే॥గీ॥ సంఘ సేవాంకితుండైన సదయుడితడు
ఆంధ్రరాష్ట్రాభివృద్ధికై ననుక్షణంబు
పరితపించుచు నుండెడి ప్రాజ్ఞుడితడు
నిండు నూరేండ్లు సుఖముగ నుండుగాత!

సీ॥ చిన్నతనము నుండి శీల సంపదలను
జీర్ణించుకున్న సచ్ఛీలు డితడు
గాంధీయ సిద్ధాంత గరిమను వదలక
ఆచరించుచున్న యనఘుడితడు
కార్యకర్తలకెల్ల క్రమశిక్షణను నేర్పి
శాంతిని స్థాపించు శాంతుడితడు
లలిత కళల నెల్ల లాలించి ప్రేమించి
పోషించు మా "దివిభోజు" డితడు

తే॥గీ॥ కార్యకుశలుడు, మితభాషి, కర్మయోగి
షష్టిపూర్తికి జేరిన సద్గుణుండు
తెలుగు దీప్తినిపెంచెడి ధీరవరుడు
బుధులు మెచ్చిన విజ్ఞుండు బుద్ధుడితడు

సీ॥ శ్రీకాకుళ స్వామి సిగయందు దాల్చిన
చారుమల్లిక సార సౌరభములు
మోపిదేవిస్వామి ముదమార దీవించి
చల్లంగ జూచెడి సంభ్రమములు
వేణుగోపాలుండు వేడ్కతో లాలించి
రక్షించి కాపాడు వీక్షణములు
భావదేవరపల్లి భావనారాయణుని
శుభ్రమందస్మిత విభ్రమములు

తే॥గీ॥ సరస సంగీత సాహిత్య స్తన్య మొసగు
దివ్యదివిసీమ మాత దేదీప్య రుచులు
అవనిగడ్డ లంకమ్మ తల్లి ఆశిషములు
కాచి రక్షించుగావుత! కరుణతోడ

లోకాః సమస్తాః సుఖినోభవంతు
ఓం శాంతిః శాంతిః శాంతిః


శతమానం భవతి

- పి.వి. సాయి

బుద్ధప్రసాద్ గారికి షష్టిపూర్తి మహోత్సవం
తెలుగు తల్లికి భలే సందడి
కంటికి రెప్పలా కాచుకునే బిడ్డంటే
ఏ తల్లికి మాత్రం సంబరం కాదూ!
తన మానస పుత్రుడ్ని చూసి
తెలుగు తల్లి మురిసింది
తన వారినందరినీ తట్టి లేపింది
ఆరోజు, తెల్లవారకముందే
తెలుగు వారి సంక్రాంతి రథం
బుద్ధప్రసాద్ గారింటి ముంగిట ముగ్గై వచ్చి,
వచ్చే బంధువులకు స్వాగతం పలికింది.
ప్రతి వసంతం మాదిరే - తెలుగు ఉగాది కాంత
నవీనోత్సాహంతో,
బుద్ధప్రసాద్ గారిని మేల్కొలిపి,
కరచాలనం చేస్తూ - శుభోదయం పలికింది.
కృష్ణా, గోదావరి, తుంగభద్రా నదీమ తల్లులు
వెంట తెచ్చిన పవిత్ర జలాలతో తలంటుపోశాయి.
పొందూరు ఖద్దరు పంచె, లాల్చీ, కండువా
ధరించిన బుద్ధప్రసాద్ గారిని చూసి
తెలుగుతల్లి మనసులోనే దిష్టి తీసింది
పాదనమస్కారం చేసిన కొడుకును
కన్నతల్లి "వంశాభివృద్ధిరస్తు!" అని ఆశీర్వదించింది
స్వర్గసీమ నుండి తండ్రి
"సుఖీభవ!" అని దీవించాడు.
బాసర సరస్వతి నుదుట తిలకం దిద్దింది
గద్వాల్, పోచంపల్లి, నారాయణపేట,
వెంకటగిరి, ఉప్పాడ, గుంటూరు జరీ చీరలు కట్టిన
ఆడపడుచులు మంగళహారతులు పట్టారు.
పూజా గృహాన కాణిపాకం వినాయకుడు,
దాక్షారామం భీమేశ్వరుడు, సింహాచలం నరసింహుడు,
అన్నవరం సత్యనారాయణ స్వామి, శ్రీ కాళహస్తీశ్వరుడు,
యాదగిరి లక్ష్మీ నరసింహుడు, భద్రాద్రి రామన్న,
తిరుమల వెంకన్న, శ్రీశైల మల్లన్న, వేములవాడ రాజన్న
"శతమానం భవతి!" అని దీవించారు
మెదక్ చర్చిలో, మక్కామసీదులో ప్రార్థనలు జరిగాయి
తెలుగు నుడికారంలోని వర్ణమాల,
సంధులు, సమాసాలు, అలంకారాలు,
సామెతలు, జాతీయాలు కలసికట్టుగా
బుద్ధప్రసాద్ గారి శిరస్సున వేసిన అక్షరాక్షతలు
తెలుగుభాషకు మరో వెయ్యేండ్ల అమృతాశీస్సులు!
తెలుగింటి పెద్ద బాలశిక్ష
పెద్ద ముత్తైదువలా వేడుకకు వచ్చి,
తనని మరువని బుద్ధప్రసాద్ గారిని
"దీర్ఘాయురస్తు!" అని దీవించింది.
అరసవిల్లి సూర్యతేజం, పైడితల్లి చల్లని చూపు
"ఆరోగ్యమస్తు" అని దీవించాయి.
అతిథులు నిర్మల్ వర్ణ చిత్రాలను,
ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలను
బహుమతులుగా తెచ్చారు.
సాయంకాలపు సాంస్కృతిక కార్యక్రమాలు
మన సంస్కృతీ, సాంప్రదాయాలను ప్రతిబింబించాయి.
అన్నమయ్య కీర్తనలు, క్షేత్రయ్య పదాలు,
త్యాగయ్య కృతులు, రామదాసు కీర్తనలు,
గాలిబ్ గీతాలు, బతుకమ్మపాటలు,
కూనలమ్మ పదాలు, ఎంకిపాటలు భాషకు ప్రాణం పోశాయి.
కృష్ణరాయల 'భువన విజయం',
తిరుపతి వేంకట కవుల 'పాండవోద్యోగ విజయం'
కూడిపూడి భాగవతుల 'ఉషా పరిణయం' యక్షగానం,
సురభివారి "బాలనాగమ్మ" నాటకం
తెలుగు సంస్కృతికి అద్దం పట్టాయి

తెలుగు పద్యానికి పట్టం కట్టాయి.
అందరికీ అరిటాకులో భోజనం
హైదరాబాద్ బిర్యానీ,
ఆంధ్రా ఆవకాయ, గోంగూర, ఉలవచారు,
నెల్లూరు వంటకాలు, రాయలసీమ రుచులతో కూడిన
విందు భలే పసందు
కాకినాడ కాజా, ఆత్రేయపురం పూతరేకులు,
బందరులడ్డు, ఒంగోలు మైసూరుపాకు
తమ తియ్యతియ్యని పలుకులతో
"మధుర వాజ్మి!" అని దీవించాయి
కడుపారా తెలుగు భోజనం చేసిన అతిథులు
తాంబూలం వేసుకొని, బ్రేవ్ మనుకుంటూ...

దివి సీమలో దివ్వెలా వెలిగి,
తెలుగునాట వెలుగు తేజమై ప్రకాశిస్తూ,
ప్రపంచ వ్యాప్తంగా తెలుగుభాషా సౌరభాలు వెదజల్లుతూ,
సాంస్కృతిక కళాబంధువై
సామాజిక సేవా పరాయణుడై,
తెలుగు తల్లికి తగిన వారసుడై,
శోభిల్లుతున్న బుద్ధప్రసాద్ దంపతులు
నిండు నూరేళ్ళు, ఆయురారోగ్యాలతో
చల్లగా ఉండాలని కోరుకుంటూ
శ్రేయోభిలాషులంతా తమ తమ ఇళ్ళకు వెళ్ళారు.
తెలుగు తల్లి మాత్రం
బుద్ధప్రసాద్ గారింట్లోనే బాగుందని ఉండిపోయింది.



సబర్మతి ఆశ్రమంలో...

చంద్రునికి నూలుపోగులు

- డా. దీవి శ్రీనివాసాచార్యులు

ప్రజల మనిషి, తెలుగు భాషాభివృద్ధికి కంకణబద్ధుడు, రైతులకు ఆత్మీయుడు, సముద్ర వనరుల అభివృద్ధికి అవిరళ కృషి చేసేవాడు, సాహిత్య సురభి మా మండలి బుద్ధప్రసాద్ గారి అరువది వసంతాల వేడుకకు ప్రేమతో అందించే నవరత్నమాలిక.

ఉ॥ అందగ నిల్చినావు సుమయమ్మను మించెదు మాతృభాషకున్
పండుగ చేసినావు మన భాషకు విశ్వపు వేదిపై మహా
ఖండము లైదిటన్ మనగ కమ్మని తెల్గుకు వెల్గుచూపితో
మండలి వంశవారధిని మన్నన లందిన చంద్రరేఖలై

సీ॥ కృష్ణపై వారధి కృషి తోడ సాధించి
గుంటూరి సీమతో గూర్చినావు,
కృష్ణా తరంగిణి కృసియించి కృంగగా
యెండిన పంటకై యేడ్చు రైతు
కన్నీటిధారలు కర్మతదృష్టితో
తుడిచిన వాడవు తోడు నిలచి,
నేడుగోదావరీ నీరము కూర్చిన
ముఖ్యమంత్రికిడు ముఖ్యుడైన

గీ॥ మంచి గంధపు గుణము మాటలందు
ముందె పల్కరించు చనువు మోము నందు
జనులు మెచ్చెడు భావన జాల మెందు
గల్గు బుద్ధప్రసాదుని గమన మందు

సీ॥ రచనలెన్నియొచేసి రసికత చూపిన
రాయల సరసన రమణ మెరసి
కవులకు రచయిత్రు, గాయక మణులకు
యక్షర మణిమయ యక్షయమగు
పీఠిక లొనరించి పేరెన్నిక గొనుచు
దన్నుగ నిలచిన దాతయితడు,
దివిసీమ పల్లెల దివిజ సీమయనగ
తీర్చిదిద్దినవాడు తెగువ మీర

గీ॥ భరతమాతకు గళమున భాషయితడు
తెల్గు భాషకు తొణకని తేజమితడు
ఆంధ్రజనులకు నాత్మీయ యనుజుడితడు
జనుల సేవకు ముందుండు యినుడు యితడు

సీ॥ నరనర మందున నమ్మిన గాంధేయ
సిద్ధాంత సిద్ధియు, స్థిర బుద్ధి
సేమము, మాటయు నిలిపెడి తత్వము
రూపము గొన్నది రూఢిగాను,
పదవులు చేరెను బారులు తీరుచు
దరికిని యడుగకె దమకుదాయె,
మంత్రిగా నెన్నికై మన్ననలందగా
రాష్ట్రపు మేలుకై రాత్రిబగలు

గీ॥ సేవచేసినావు, జనులు చింతదీరి
దరిని జేర, లక్షల సంఖ్య దాటిపోవ
భావదేవర పల్లిలో, భావనంబు
నెవరు చేయని కాలేజి నెగడునట్లు

కం॥ తాతయు, తండ్రియు, నేతలు
మాతయు, సతియును, తనయలు మంచికి నెలవుల్,
సుతుడా చక్కని రాముడు!
హితులా విశ్వంబు నందు హేరాళమహో!

సీ॥ దేశభక్తి సుధల తీరుగా గ్రోలిన
వేంకట రామయ్య విశదమతికి,
దేశసేవకు తన దేహ ధన మనంబు
లర్పించి ధన్యుడౌ యాత్మపితకు,
నిన్నుగన్న జనని నిర్మల చరితకు
మెరుగులు కూర్చిన మేటివీవు
యుగయుగంబులు నిల్చు యుచిత మార్గమగుట
కృష్ణరావు యశము, కృషియు వెలుగ

గీ॥ రాష్ట్ర శాసన సభలోన రాణకెక్కి
యుపసభాపతి పీఠము యుచితమనగ
నెల్లవారలు మెచ్చగ నెగడినావు
మిత్ర భావము చూపిన మేటివీవు!

సీ॥ భావనారాయణు భావాబ్ధిపోతమై
దివిసీమ ప్రజలకు దేవుడీవు,
తెలుగు దేశానికి వెలుగులు పంచిన
తేట తెనుగుపద పార్థుడనగ,
మంగళాద్రీశుడు మహిత కీర్తుల నీయ
మరియింత యెత్తుకు మార్గమగును.
వేంకటేశుండు నీ వెంట నుండి నడుప
కీర్తిశిఖరములు కేలుచాపు

గీ॥ అవని బుద్ధప్రసాదుని యాదరింప
యవని గడ్డను గడ్డకు యాదరమున
జేర్చు నాయకుడైనావు జేతు వినుతి,
కీర్తి చంద్రిక లెల్లెడ కెరలుగాత!

కం॥ మృదుభాషిత్వము, శాంతత,
పదునైన విచార సరళి, పండిత గోష్ఠుల్
పదుగురి మేలును చూచుట
సదయుడవౌ నీకు నిజము సరళము సుమ్మా

ఉ॥ చల్లని పైరగాలి వలె చక్కని నవ్వులు రైతు మోముపై
యల్లన పూయగా వలెను, యాంధ్రుల మన్నన మల్లెమాలగా
నెల్లరు మెచ్చగా తనరి, నిర్మల మౌచును నిన్ను చేరగా!
యుల్లము పల్లవించు సుమీ, ఊరికి నుర్వికి చేరువౌటచేన్?

మహత్



స్వచ్ఛ అవనిగడ్డ కార్యక్రమంలో...

మీరే ఒక తెలుగు వెలుగు

- డా. తెన్నేటి సుధాదేవి

మీ చిరుదరహాసంలో తెలుగు వెన్నెల
మీ మాటల్లో తెలుగు వెలుగు
మీ నడవడిలో తెలుగు సంస్కృతి
మీ కదలికలో తెలుగుబాణి
వెరసి
తెలుగుకు ఒక రూపంలా
ధవళ వస్త్రధారియై
మీరు తరలి వస్తుంటే
తెలుగు అక్షరాలు మీకు
స్వాగత గీతం ఆలపిస్తుంటే
తేట తెలుగుల మీవాణి
అమృతమై ఒలుకుతుంటే
తెలుగువాడై వుండి
తెలుగు అల్పమనుకునే అల్పజీవులకొక
సవాలుగా నిలచి
2012 డిసెంబరులో తిరుపతిలో
4వ ప్రపంచ తెలుగు మహాసభలు
దిగ్విజయంగా నిర్వహించడం
మీ సంకల్పానికి మచ్చుతునక
తెలుగు వెలుగులను విరజిమ్ముతా
'తెలుగు విజయం' ప్రాజెక్టు ద్వారా
అంతర్జాలంలో తెలుగు ఉపయోగితకు
తెలుగులో సంక్షిప్త సందేశాలను
పంపడానికి యూనికోడ్ రూపొందించడం
తెలుగు భాషాభివృద్ధికి
మీరు చేస్తున్న నిరంతర కృషికి తార్కాణం.
తెలుగు పరిమళం వెదజల్లే
మీ వ్యక్తిత్వానికివే మా నమస్సులు.
60 వసంతాల మీ నిష్కళంక జీవితం
ఇలానే కొనసాగాలనీ ఆకాంక్షిస్తూ
జన్మదిన శుభాకాంక్షలతో.....



కృష్ణా డెల్టా పరిరక్షణ ఉద్యమంలో...

భావన

- సి. వేదవతి

అది 1975వ సంవత్సరం
ప్రపంచ తెలుగు మహాసభల సందర్భం
ఎక్కడెక్కడి తెలుగువారూ ఒక్కచోటకు చేరి
తెలుగు భాషామ తల్లికి పట్టం కట్టుకోవాలని
నిలువెత్తు అలలై, తరగలై ఉత్సహించిన రోజు
అంతకు కొంతకాలం ముందే, ఘనమైన ఉత్సవాలకు
కార్యశాలగా మారిపోయిన లాల్‌బహద్దుర్ స్టేడియం
ఎటు చూచినా ఏదో సంరంభం!
పూలుపూచినంత కమ్మగా - తెలుగు వాసనల గుబాళింపులు
తెలుగు అక్షరాల పోహళింపు - ప్రత్యేక సంచికల నిగారింపు
ఉత్సవానికి తరలి వస్తున్న కవులు, కళాకారులు
ఇంతమంది కార్యదీక్షా పరుల సంరంభ మధ్యంలో
తానొక దీపస్తంభమై - చోదక సశక్తియై
నిలచిన స్థిత ప్రజ్ఞుడు - నాటి విద్యా సాంస్కృతిక శాఖామంత్రి
మాన్యమండలి వెంకట కృష్ణారావు మహోదయులు
తాను మంత్రి నన్న మాటే మరచి కార్యకర్తలతో మమేకమైన దీక్ష
ఆ కార్యకర్తలలో నేనూ ఒక భాగస్వామినినై
తెలుగుతల్లికి పూమాలికలల్లిన రోజు
మరువగలనా ఎంతకాలమైనా!
ఆనాటి సభలు స్ఫూర్తిమంతమై, జాతిని మేలు కొలిపి
మరిన్ని తెలుగు సభలకు ఊపిరులూది
తెలుగుభాషా సంస్కృతుల పునర్వైభవానికి
పూలబాటలు పరచుకొంటున్న సందర్భం
మండలి వారిప్పుడు లేరు కానీ
ఆయన రగిల్చి వెళ్లిన భాషోద్యమస్ఫూర్తి ఉంది
ఆనాటి స్ఫూర్తిని అంది పుచ్చుకున్న వారెందరో
అందరిలోనూ ప్రముఖంగా ఆ తండ్రి గారి వంశాంకురం
పేరులో నవ్యత్వం - తండ్రి వారసత్వంలోనూ ప్రముఖత్వం
మండలి బుద్ధప్రసాద్‌గా తెలుగు ప్రజకు పరిచితమై

తండ్రి గారి ఆశయాలను కొనసాగించడం కోసం
బద్ధకంకణుడై పరిశ్రమిస్తున్న బుద్ధప్రసాద్
పువ్వుపుట్టగానే పరిమళిస్తుందన్న సామెతగా
బాల్యం నుంచే తండ్రిగారి బాటను పట్టిన బుద్ధప్రసాద్
తనదైన స్థిర సంకల్పంతో, ముందుకు సాగుతూ
రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సేవారంగాలలో
ప్రముఖుడై, ప్రజాహిత కార్యశాలిగా మన్ననలందుతున్న వేళ
అనేక వేదికలపైన ఆయనను చూస్తూ, ప్రసంగాలను వింటున్న వేళ
నాలో ఒక ఆశ్చర్యం ! ఎంతగా ఎదిగిపోయాడు
నేనెరిగిన చిన్న నాటి మండలి వారబ్బాయి బుద్ధప్రసాద్!
ఎంత ఎదిగినా, ఒదిగి ఉండటమే తన మారమన్నట్లు బుద్ధప్రసాద్
తండ్రిగారి రూపురేఖలను పుణికి పుచ్చుకున్నాడు సరే –
ఖద్దరు ధారణ – గాంధీజీ ఆశయాలపై అత్యంత ఆదరణ
'గాంధీక్షేత్రం' పేరుతో పత్రికా నిర్వహణ
రాజకీయాలలో ఉన్నా వీడని సౌజన్యత
చిన్న నాటి స్నేహితులైనా, ఏనాటికీ వీడని స్నేహశీలత
తెలుగు భాషపైన, సంస్కృతిపైన తరగని అభిమానం
ఏ పదవిలో ఉన్నా, చెక్కు చెదరని నిరాడంబరతే
ఏ సభలో పాల్గొన్నా, ఔచిత్యపుటంచులు దాటని జాగరూకతె
రాజకీయం ఒక వైపు, పుస్తక పఠనాసక్తి మరోవైపు
అరుదైన కలయికగా రూపుదిద్దుకొన్న వ్యక్తిత్వం
తాను నడిపిన 'గాంధీక్షేత్రం' పత్రిక ద్వారా
నాకు అత్యంత ఆప్తుడైన వాడు బుద్ధప్రసాద్
చెట్టు, పుట్ట, గుట్టనైనా తడపివేస్తుంది సమభావనతో వెన్నెల
జల్లు జల్లుగా కురుస్తూ సర్వప్రకృతినీ అనుగ్రహిస్తుంది మేఘం
ఆ సమభావన వెనుక, ఆ సద్భావన వెనుక
బుద్ధప్రసాద్ వంటి మంచి మనుషులు కనిపిస్తారు నాకు
సమత, సహృదయత, కలబోసుకున్న మంచిమిత్రులు అగుపిస్తారు
మంచి మనిషి చిరంజీవి బుద్ధప్రసాద్‌కు
మనసు నిండుగ శుభకామనలు
మరిన్నీ వయోధర్మాన అందిస్తున్న
మరెన్నో ఆశీః పరంపరలు

పొగడ్తలు కాదు పొగడపూల జల్లులు

- తమరిశ జానకి

మాట మృదువు చూపు చల్లన
మనసు మల్లెపూవు మన మండలి
లేదు స్వార్థ చింతన ఉన్నది నిస్వార్థ భావన
తండ్రిపేరు నిలబెట్టిన తనయుడు కద మన మండలి
అందరికీ ఆప్తుడు ఆడంబర మెరుగని రాజకీయవేత్త
తరతమ భేదాలు లేని మహామనిషి అతడు
ఘనచరిత్రగల తెలుగు భాషా సంస్కృతులకు
సేవకుడై సైనికుడై సాగిపోవు సుందర మనస్కుడతడు
మరపురాని మంచితనానికి పోతపోసిన రూపమతడు
పొగడ్తలు కావు ఇవి పొగడపూల జల్లులు
అందరి మనసులనాహ్లాదపరచు సుగంధాలు
నిండునూరేళ్ళు నవ్వుతూ హాయిగా
నలుగురిమధ్యా ఇలాగే ధీటుగా తిరగాలని
దేవదేవుడిచ్చేను బుద్ధప్రసాద్‌కి
దివ్యమైన బహుమతి శతకోటి దీవెనల రూపాన!



మాజీ ఉప రాష్ట్రపతి శ్రీ బి.డి. జెట్టితో...

అవనిగడ్డ ముద్దుబిడ్డ

- డా॥ గరికిపాటి నరసింహారావు

సీ. అవనిగడ్డను పుట్టి అవని బిడ్డగ మెట్టి
రాజ్యమ్ము లేలిన పూజ్యుడితడు
పాడిపరిశ్రమ గాడి తప్పకయుండ
తోడుగా నిల్చిన నీడయితడు
అధికారమున నుండి అధికార భాషకై
అష్టకష్టాల్ పడు ఆంధ్రుడి తడు
పదవులందిన గాని పెదవులందెన్నడు
దర్పమ్ము చూపని ధన్యుడితడు

తే.గీ. గరికిపాటి వారూ! మీరు కంకణములు
వీడరాదని పంతమ్ము తోడ కవుల
విగ్రహమ్ములు నిలబెట్టు వీరుడితడు
శాసనసభకు 'బుద్ధిప్రసాద'మితడు.

కం. ఎండిన 'తెలుగు' తటాకము
నిండింపగ జూచు మాననీయుండితడే
పండవె శాసనసభయున్
మండలి బుద్ధప్రసాద మాన్యుని వలనన్



అక్షరాంజలి

- డా॥ అవనిగడ్డ సూర్యప్రకాష్

తెలుగు తనయుడట
వే వెలుగు రేడట
'బుద్ధప్రసాదు' అతని
షష్ట్యబ్ది పూర్తి మహోత్సవమట....

'మండలి' వారి
వంశాంకుర మట
జగదోద్ధరణకై అవతరించిన
'కారణ జన్ముడట'....

తూర్పు కొమ్మకు కాచిన
సూర్య ఫలమట
'బుద్ధుడు' పుట్టిన భూమిన
జనించిన ధన్యజీవుడట...

ఇంతింతై వర్ధిష్ణువైన
పరిణత వర్తనుడట
విజయాల పరంపరలో
పితృవాక్యాను శీలుడట...

ఆజాను బాహుడట
'అజం' యెరుగడట
'ఇజం' మరవక యెన్నడు
'నిజం' పలుకునట....

చిరునవ్వు సిరిపువ్వు
వరములై విరియునట
ఇరుల జాడల నెల్ల
తరిమి గొట్టునట...

దోషాలు ద్వేషాలు
ఇంచుకైనా యెరుగడట
కక్ష కార్పణ్యాలకు
బహు దూరముండునట...

సమ ధర్మ సచ్ఛీల
పదములె నడచునట
'మంచి'యను దారాన
మనుషులను కూర్చునట...

లౌక్యమూ లోకజ్ఞత
యెరిగిన వాడట
లక్ష్య సాధనలో
దిశా నిర్దేశకుడట...

ఫలాపేక్షలేనివాడట
త్యాగ నిరతికి సాక్షియట
యధార్థ తత్వానికి
పారదర్శకుడట...

భేషజాలకు పోడట
ప్రలోభాలకు లొంగడట
నిరాడంబరతకు నిగర్వతకు
ఆతడే మారు పేరట...

నిత్యం ధవళ వస్త్రధారియై
కార్యనిర్వహణకు పూనునట
మంద స్మిత వదనుడై
కరచాలనంతో పలకరించునట...

తెలుగు భాషోద్ధరణలో
మడం తిప్పని వాడట
దేశ దేశాల తెలుగోళ్ళను కలిపి
ఐక్యతను చాటిన ఉదాత్తుడట...

నిరంతర పఠనాసక్తుడట
"మారిషస్‌లో తెలుగు తేజం"
"ఇంగ్లాండు"లో తెలుగు వైభవస్మృతులు"
ఇత్యాదిగ్రంథాలు సృజించిన
గొప్ప రచనా శిల్పియట...

గాంధీ సిద్ధాంతాల్ని ఆచరించే
ఆదర్శ పుంగవుడట
'గాంధీక్షేత్రం' పత్రిక నెరపి
గాంధీ సేవా కార్యక్రమాలకు
ఊతమిచ్చిన దార్శనికుడట...

పలు పదవులనలంకరించిన
రాజకీయ ధురీణుడట
'ఉపసభాపతిగా వాసికెక్కిన
అసమాన్య ధీధితుడట..

ఒకనాటి దివిసీమ ఉప్పెనలో
అనాథలైన వాళ్ళను ఆదరించిన
నిస్వార్థ సేవా తత్పరుడట...,
'స్వచ్ఛతకు శుభ్రతమ్' సాదృశ్యమైన
'స్వచ్ఛ భారత్'ను నిర్వహించే
అభ్యుదయ గామియట...

సఖ్యతకు సభ్యతకు
సరళ హృదయుడట
అందుకే ఆతడు
అందరికి ఆప్తుడట...

అక్షరాక్షతలు

- డా. ఉండేల మాలకొండారెడ్డి

1. దశదిశల తెల్గు భాషామతల్లి కీర్తి
మారుమెలగెడి గతి ప్రథమ ప్రపంచ
సభలు జరిపిన ఘనుడు నీ జనకుడయ్యె!
తండ్రికికిన్ దగ్గ పుత్ర రత్నమ్ము నీవు.

2. అధికార భాషగా ఆంధ్రభాషకు రాచ
తీవి కల్పించిన భావుకుడవు
తెల్గు భాషా సంస్కృతి ప్రభల్ జగతి, వ్యా
పింపజేసిన కళాప్రేమికుడవు
పెనుతుఫానుల మధ్య వణకెడు దివిసీమ
ప్రజలకు ఆపన్న బాంధవుడవు
పాడిపరిశ్రమ పరివృద్ధి కత్యంత
సేవ చేసిన మంత్రి శేఖరుడవు
ఇన్ని రంగాలలోన రాణించుచున్న
గర్వమెరుగని సజ్జ నాగ్రణివి నీవు
ఆయురారోగ్య భాగ్యమ్ము లమరుచుండ
జరుపుకొనుమయ్య మరియొక్క షష్టిపూర్తి

3. లేదు చళుక్య భూవిభుడు, లేడనవేముడు, కృష్ణరాయడున్
లేడు, కళాభిమానులగురేడుల జాడలు కానరాని, యీ
నాడు, తెలుంగు శారద, కనన్య సమాశ్రయమిచ్చి, జాళువా
మేడలు కట్టునీకు ప్రణమిల్లెద రెల్ల, రసజ్ఞ సత్తముల్

4. "మారిషస్, సింగపూర్" వంటి దూరదేశ
వాసులై యున్న తెలుగు ప్రవాస జనుల
నారదమ్మున బిల్చి ప్రేమానురాగ
సేతువులు కట్టు సుస్నేహ శీలివీవు.

5. ప్రముఖ గాంధేయవాదిగా ప్రజలనెల్ల
స్వచ్ఛ భారత నిర్మాణ సమరమందు
సైనికుల జేయు నీకు ప్రశాంతి రస్తు
పూర్ణవిజయోస్తు సంతతాభ్యుదయస్తు.

శుభాకాంక్షలు

- డా. కొలకలూరి ఇనాక్

1. షష్ట్యబ్ది పూర్తైన, శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి
సరస సహృదయతకు
కళాత్మీయ హృదయ సంస్కారానికి - అభినందనలు
2. ప్రేమగా పలకరించే, ఆదరంగా అభిమానించే
మనసారా ప్రోత్సహించే
షష్ట్యబ్ది పూర్తి యువకుడి సౌజన్యానికి - అభినందనలు
3. ప్రజల మనిషిగా, కళాహృదయంగా
రూపుదాల్చిన తెలుగువాడిగా
ఆంధ్రావనిలో తేజరిల్లే అవనిగడ్డ చైతన్యానికి - అభినందనలు
4. అటు రాజకీయం, ఇటు ఆంధ్రత్వం మేళవించి
తెలుగుజాతిని, భాషను దేశాన్ని ప్రేమించిన
మధురమూర్తి తేజస్సుకు - అభినందనలు
5. ఇరు రాష్ట్రాలలో, ఇతర రాష్ట్రాలలో, ప్రపంచ దేశాలలో
ఉన్న 18 కోట్ల తెలుగువాళ్ళకు
మారుగా, చోటుగా, బాటగా వెలిగే దీప్తికి - అభినందనలు
6. ప్రభుత్వం కానీ కృష్ణాజిల్లా రచయితల సంఘం కానీ
నిర్వహించే ప్రపంచ తెలుగు మహాసభలకు
కేంద్రమైన తెలుగు విజయానికి - అభినందనలు
7. నిర్భయ రాజకీయవేత్తగా, సామాజిక నైతిక శక్తిగా
ప్రజల నాడి, వాడి, వేడి తెలిసిన ప్రశాంతమూర్తిగా
నిత్యం నవ్వుతుండే ప్రసన్నతకు - అభినందనలు
8. కళల్లో పసివాళ్ళను, పండబారిన వాళ్ళను
అక్కున చేర్చుకొనే
మానవతా ఆదర్శానికి - అభినందనలు
9. ఎన్ని సభలైనా, ఏ రాష్ట్రమైనా, ఏ దేశమైనా
పాల్గొని ప్రజల్ని పరవశింప చేసే
హృదయ మాధుర్యానికి - అభినందనలు.

అక్షరాభినందనం!

- డా. వడ్డేపల్లి కృష్ణ

యువత–నవతకో స్ఫూర్తి
రాజకీయ సత్కీర్తి
కలిగించే మంచి – మమత
మానవతా నవ్యమూర్తి;

మండలి బుద్ధప్రసాద్ –
జనమండలి ప్రసిద్ధప్రసాద్!
'దివిసీమ'కు ప్రసాదంగ
దివి అందించిన ప్రసాద్!

తెలుగునేలకంతటికీ
వెలుగుపూల ప్రసాద్!
మాతృభాష ఉన్నతికై
మన తెలుగు సంస్కృతికై

అహర్నిశలు ఆరాటం
అలుపెరుగని పోరాటం
చేసినట్టి నాయకుడు
గట్టు చేర్చు నావికుడు!

పుస్తకాలె కాదు, ప్రజల
మస్తకాల ప్రేమికుడు!
'సిద్ధార్థ'ని ప్రబోధాల
కార్యసిద్ధి కాముకుడు!

తండ్రి అడుగుజాడలలో
'గాంధిసూత్ర' సాధకుడు!
ప్రవాసాంధ్ర ప్రగతికొరకు
పరితపించు బోధకుడు!

ఆంధ్ర ఉపసభాపతి,
సాంద్రదయ ప్రభాపతి
అయినట్టి బుద్ధప్రసాద్
అనవరతం వెలుగొందగ

శతవసంతాలదాక
స్తుతకీర్తితో జీవించగ
షష్టిపూర్తి మాలికగా
ఇష్టపూర్తిగా యిదే
అక్షర అభినందనం
అభిమాన చందనం!

జేజేలు తెలుగు నాయకా!

- డా. వాసా ప్రభావతి

అవనితలంపై కాంతులు విరజిమ్మే
నక్షత్రాలు ఎన్నో!
సూర్యచంద్రుల్లా తేజోరాసులు
విరజిమ్మే నాయకులు కొందరే!
కృష్ణాజిల్లాను తీర్చిదిద్దిన
మేటి నాయకుడు మండలి వేంకట కృష్ణారావుగారు
ఆదర్శనారీమణి నాకు అత్యంత గౌరవనీయులు
వారి సతీమణి ప్రభావతీదేవి
పుణ్యదంపతుల పుత్రరత్నము
రాజకీయరంగంలో ఆకాశం ఎత్తుకు
ఎదిగిన సార్థక నామధేయుడు బుద్ధప్రసాద్.
గాంధీజీ ఆశయాల బాటలలో పయనిస్తూ
జాతీయభావాలను విరజిమ్మే
కాంతిపుంజంలా ఖాదీదుస్తులతో
నడిచే పతకం బుద్ధప్రసాదు.
ఒకనాడు సముద్రం ఘీంకరిస్తూ
కృష్ణాజిల్లాను అతలాకుతలం చేసినపుడు
మానవతా దృష్టితో ఆబాలగోపాలాన్ని
ఆదుకున్న ఆదర్శ కుటుంబమది.
పేదవారికి, మత్స్యకారులకు
అండగా, రైతులకు తోడుగా
నిలిచిన తండ్రికి తగిన పుత్రుడు
మన బుద్ధప్రసాదు.
అవనిగడ్డకే ఆదర్శం గాంధీక్షేత్రం
నాకు దర్శించే అవకాశం కలిగించిన
ఆదర్శ కుటుంబమది.
వనితా కాలేజీలో మావద్ద పాఠాలునేర్చి
ఆదర్శ నారీమణిగా ఎదిగిన అన్నపూర్ణ
ఈ ఆదర్శ నాయకుని సోదరీమణి.
తెలుగు భాషాసంస్కృతులపై
ఎనలేని మక్కువతో
నాలుగు ప్రపంచ మహాసభలను
దిగ్విజయం చేసిన మహా మనీషి.
ఎందరో కవి, పండితులను ఆదరించి
గౌరవించే ఆదర్శశీలుడు
మేటి సాహితీ, సాంస్కృతిక సంస్థలకు
చేయూతగా ప్రపంచపటంలో
నిలిచిన ఆదర్శ మనీషి
రచయితలలో రచయితగా
అనేక రచనలు చేసి మేటి రచయితగా
ఎదిగిన సహృదయశీలి
తెలుగుదేశంలో మారుమ్రోగుతూ
సాహితీ సాంస్కృతిక కార్యకలాపాలు
ఆనందంగా మీటే కిన్నెర
నడిపించే రఘురాం
తలపెట్టిన "బుద్ధప్రసాదు
60 వసంతాల ఉత్సవ"మే కాదు
నూరు వసంతాల మహోత్సవం
ఘనంగా జరపాలని మా ఆకాంక్ష.
అరవై వసంతాల మహోత్సవ వేళలో
జే జేలు తెలుగు నాయకా!
జేజేలు నీకు బుద్ధప్రసాదుగారూ!
జై తెలుగుతల్లి
జైహింద్.

‘మండలి’ సువంశ పయోనిధి రాజ రాజు

- డా. ఆచార్య ఫణీంద్ర

కం. ‘సామాజిక సేవ’యె తా
సామాన్యముగ మనలేక, సాకృతి గొనియున్
‘శ్రీమండలి’ వంశములో
ప్రేముడి ‘బుద్ధ ప్రసాదు’ పేరున వెలసెన్!

ఆ.వె. ఉగ్గు పాల తోడ ఒంట బట్టె తనకు
‘గాంధి’ తాత్త్విక గుణ గణము లెల్ల!
విదుడు, పూర్వ మంత్రి ‘వెంకట కృష్ణరావ్’ –
తండ్రి పేరు నిలుపు తనయు డయ్యె!

కం. కృష్ణా జిల్లా ప్రగతికి
‘కృష్ణా రావ్’ వారసునిగ కీర్తిని గొనుచున్ –
కృష్ణా నదిపై వారధి,
‘కృష్ణా యూనివరిసిటి’ని కృషితో నిలిపెన్!

సీ. నూనూగు మీసాల నూత్న యవ్వనమందె
‘దివిసీమ’లో గావ దీన జనుల –
యువ సభ్యుడై సేయ ఉత్తేజమున సేవ
తొలి ‘ప్రపంచ తెలుగు వెలుగు సభల’ –
ఎదిగి మంత్రిగ, తెల్గు కెల్ల దేశాలలో
ప్రోత్సాహ మొసగ భాషోత్సవములు –
‘మత్స్య, పాడి పరిశ్రమల మంత్రి’యై బ్రోవ
బడుగు జనుల బహు ‘పథక’ విధుల –

తే.గీ. తెలుగు భాషకు ‘ప్రాచీన దీప్తు’ లొసగ –
తెలుగు ‘కధికార భాష’గా తేజ మిడగ –
ప్రథమ ‘నవ్యాంధ్ర – ఉపసభాపతి’గ వెలుగ –
పుట్టె నతడు! తెలుగు తల్లి ముద్దు బిడ్డ!!

చం. విరివిగ సేవ లిట్లు పది వేలుగ సల్పుచు నాంధ్ర భూమికిన్,
వరలెడునట్టి ‘మండలి’ సువంశ పయోనిధి రాజ రాజుకున్
తరగని స్వాస్థ్య, సౌఖ్యములు, దండిగ నాయువు గల్గ జేయుచున్ –
అరువది యేండ్ల యౌవనము నభ్యుదయమ్మును, కీర్తి గూర్చుతన్!

ఆత్మావై పుత్ర నామాసి

- ఈతకోట సుబ్బారావు

పుస్తకాల్లో దాచుకొన్న నెమలీకల్లా
గుర్తుకొస్తుంటాడు మీ నాన్నగారు
పుస్తకాన్ని మస్తకం చేసి శిరస్సుపై ధరించి
అక్షరాలా తెలుగు అక్షరమాలలా నడుస్తుంటారు మీరు
వేదమయం మీ గమనం
భాషానది పురకలెత్తిన చందంగా
వేదికపై పదాల లయవిన్యాసాల నాట్యభంగిమలా వుంటుంది
మాధుర్యాన్ని బిందువు బిందువుగా నింపుకొంటూ
వేలాడుతున్న ద్రాక్షాగుత్తుల్లా వుంటుంది మాట
మావి కొమ్మన వూరుతున్న తేనెతుట్టలా వుంటుంది.
తెలుగుదనానికి నిండుదనం చేకూరుస్తూ
హుందాగా మీ నడకలో రాయల దర్శనం
పువ్వులకి పరిమళ సౌభాగ్య సంపదనందిస్తున్న
మీ చిరునవ్వులో కృష్ణవేణి కలగాన సంస్పర్శనం
మీరున్నంత సేపూ సభ భావసముద్ర సంగమంలా
నభస్సును చుంబించే ఆలోచనాతరంగ విన్యాసంలా
నిజమే - మీరు మీ నాన్నగారిలా
నిండుకుండలా సంపూర్ణ తెలుగుభాషా నిఘంటువులా
జనజిహ్వలపై రెపరెపలాడే సంభాషణా కేతనంలా
కోటి కిరణాల సూర్యుడిలా వుంటారు.
షష్టికీ కోటికీ వ్యత్యాసం తెలిసినవాడే మీ శ్లోకానికి మహతిరుతి కాగలడు!

భాస్కర మాలిక

- కుర్రా జితేంద్రబాబు

కII నిండుగ నూఱేఁడులు భూ
మండలమందు విహరించి మహనీయనుతా!
పండువు సేయుము హితులకు
మండలి బుద్ధప్రసాద! క్ష్మాహితవాదా!

చII అరువది యేండ్లు నిండిన శుభావహవేళను బంధుమిత్రబం
ధురమగు నీమహోత్సవము నూతనతేజము నిచ్చుఁగాక! మీ
కిరువది యేండ్లనాఁటివలె నీనవమార్గసమాజసేవకై
గురుతరశాంత చిత్త! నవకోమల వాఙ్మయరక్త! జగద్ధితస్థితా!

తేII శ్రీమతి ప్రభావతీదేవి శిష్టచరిత
హృద్యచరితుండు వేంకటకృష్ణరావు
తల్లిదండ్రులు మీ కహో! ధరణిమీఁద
సుకృత మన్న మీదే కదా! శుభచరిత్ర!

సీII ముమ్మారు జనగణసమ్మతి సాధించి
శాసనసభలోన సభ్యుఁడగుట
మంత్రిపదవిని దాల్చి మంచిపనులు చేసి
బడుగుజీవులకయి పాటుపడుట
తెలుఁగు మహాసభల్ ధీమంతు లౌననన్
జరిపించి విద్వత్ప్రశస్తి గనుట
మాతృభాషా ప్రియమతిమంతులను నెన్ని
సముచితప్రోత్సాహకముల నిడుట

గీII వెల్లడించెను జగతికి విశదరీతి
మీదుకర్తవ్యదీక్షను మేలు మేలు!
విబుధగణనుతచరిత! వివేకభరిత!
ధన్యజీవనమోద! బుద్ధప్రసాద!

కII మీతండ్రి పెంచి యిచ్చిన
యీ తెలుగు వచస్తరువును నెంతయుఁ బ్రీతిన్
ఈ తరమున కీయఁదలఁచి
మీతలపెట్టిన విధానమే చివురించున్.

తే॥ తెలుఁగు ప్రాచీనభాషయే ధీజనేష్ట
భాషయే యంచు నుద్యమపద్ధతిని బ్ర
చార మొనరించినట్టి మీతీరు తెచ్చె
సత్ఫలితములన్ మనతెల్గుజాతి కపుడు.

తే॥ విజయవాటికానగరాన విపులగతుల
మన ప్రపంచ తెలుఁగు సభలను బ్రసాద!
మీరు నిర్వహించినతీరు మేటిబుధుల
పొగడికల కెక్కె భేష్ భేషు! మూఁడుసార్లు

తే॥ జనులు నవ్యాంధ్ర రాష్ట్ర శాసనసభకును
మీ రుపసభాపతిగ నిల్చినా రని విని
పరవశించిరి సంతోష వార్ధియందు
భూరిమండలివంశాబ్ధి కైరవాప్త!

ఉ॥ సేవలు మీవి కావలె విశిష్ట విధమ్మునఁ దెల్గు జాతికిన్,
భావితరాలు మీ వెలుఁగుబాటలలో నడయాడి వృద్ధికిన్
రావలె దేశసంపద నిరంతరవృద్ధికి వచ్చునట్లు, సే
వావిభవాభిరామ! పరివర్ధితమండలి వంశనామ! స
ద్భావపరీతచిత్త! దీనజనబాంధవ! బాంధవచిత్తరంజకా!

ఉ॥ ఎందఱొ నాయకుల్ భువి జనించిరి మున్ను, సమాజమందు నే
కొందఱొ మన్ననల్ వడసి గొప్పగ సాగిరి మంచిదారిలో,
నందు సమున్నతార్యు లయినందున నెంతురు మిమ్ముఁ బండితుల్
ముందుగ, నాశ్రితావనసముజ్జ్వలకీర్తిధరా! సుధీవరా!

ఉ. కావున వందయేండ్లు జనకాంక్షితమార్గమునందు మీరు స
త్సేవలు సేయుచున్ దెలుఁగుతేజము పెంచుచు సాగుచుండుఁడో
ధీవిభవోన్నతా! నుతులు ధీజను లెప్పుడుఁ జేయ సజ్జన
శ్రీవిభవాభివృద్ధికర! శిష్టసుధామయసాహితీపరా!

గీ॥ తెలుఁగు భాషాభివృద్ధికై ధీవిశాల!
నిండు నూఱేండ్లు వర్ధిల్లుచుండు మయ్య!
సకల జనసత్యసేవకై సుకృతివర్య!
యాయురారోగ్యభాగ్యమ్ము లందు మయ్య!

సవ్యసాచి

- డా. తంగిరాల వెంకట సుబ్బారావు

భాషా సాహిత్య కళా తేజో 'మండలం'లో
బాల్యంనుండీ ప్రకాశిస్తున్న ధృవతార!
రాజకీయరంగంలో నిష్కళంక పూర్ణిమాచంద్రుడు,
కళాపోషణలో ఇంద్రుడు,
అన్ని పక్షాలకూ ఆప్తమిత్రుడు!
మానససరోవరంలాంటి ప్రశాంతవదనంలో
చిరునవ్వుల పువ్వులు వికసించే 'బుద్ధ'మూర్తి!
చెంపకు చారెడు కళ్ళల్లో
కరుణాతరంగాల డోలికలు!
స్నేహసౌగంధికాల మాలికలు!!
'ప్రభావతీ-కృష్ణరాయల' పుణ్యాల పంట!
తండ్రి కీర్తిప్రతిష్ఠలకు తగిన జంట!!
కృష్ణాడెల్టా రైతుల కష్టాలు తీర్చే తొలకరి జల్లు!
శాసనసభ్యుడుగా, మంత్రిగా, ఉప సభాపతిగా,
నిరంతర ప్రజాసేవా దురంధరుడైన మల్లు!!
దళితుల, బడుగు బలహీనవర్గాల, మత్స్యకార మహిళల
దారిద్ర్య తమస్సులను చీల్చిన సహస్రకరభానుడు!
మన పెద్ద పండుగ 'సంక్రాంతి' వంటి
'పశుక్రాంతి' - 'మత్స్యక్రాంతి' పథకాలను
ప్రసాదించిన ఘనుడు!!
అధికారభాషగా తెలుగును అమలుచేసిన సూత్రధారి!
పులిచింతల-పోలవరం ప్రాజెక్టుల ప్రధాన సూత్రధారి!!
తండ్రి-ప్రప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల శకపురుషుడు!
తనయుడు-నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభల మూలపురుషుడు!!
పులి కడుపున పులిపిల్లే కదా పుడుతుంది!!!
మంచి మంచి ఆరోగ్యకరమైన పుస్తకాల రచయిత,
'తెలుగు విజయం' యూనికోడ్ రూపశిల్పి!
సాహిత్య పోషణ, రాజకీయ విశ్లేషణ

సమంగా సరసంగా నిర్వహించే సవ్యసాచి!
కవుల కళాకారుల గుండెలలో
నిరంతరం నినదించే
అపర ఆంధ్రభోజుడు!
అందుకే అంత శ్రద్ధాభక్తులతో
శ్రీకాకుళంలో రాయల విగ్రహ ప్రతిష్ఠాపన!
వాడవాడలా రాయల పంచశతతమ మహోత్సవాల
వసంతోత్సవాల రంగురంగుల జల్లుల జడివాన!!

ఇప్పుడు –

అరవై వసంతాలు నిండిన
ఈ కళా తేజో 'మండలా'నికి......
కుటిల రాజకీయ దుఃఖాలను హరించి
అందరికీ ప్రశాంతిని 'ప్రసాదిం'చే అపర 'బుద్ధ'మూర్తికి.....
తండ్రికి తగ్గ తనయునకు....
వినయ సౌశీల్యయశోధన్యునకు.....
అజాతశత్రువునకు......
అఖిల జగన్మిత్రునకు.....
ఆయురారోగ్య సంపత్ పరంపరాభివృద్ధిని
ఆకాంక్షిస్తూ......
నా –
అనంతమైన ఆశీస్సులు.....

"శతమానం భవతి శతాయుఃపురుషః
శతేంద్రియ ఆయుష్యేవేంద్రియే ప్రతితిష్ఠతి!!"

సమీక్షలు

27 మే, 2016 సాయంత్రం రవీంద్రభారతి (హైదరాబాదు)లో శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారి షష్ట్యబ్ది పూర్తి సందర్భంగా జరిగిన 'బుద్ధయానం' గ్రంథావిష్కరణ కార్యక్రమంపై సమీక్ష

- డా. గంధం సుబ్బారావు

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారి షష్ట్యబ్దిపూర్తి మహోత్సవం 27-5-2016 సాయంత్రం హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో ప్రముఖ సాంస్కృతిక సంస్థ కిన్నెర ఆర్ట్ థియేటర్స్ వారి ఆధ్వర్యంలో వైభవోపేతంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి తమిళనాడు రాష్ట్ర గవర్నర్ డా. కొణిజేటి రోశయ్య ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలి అధ్యక్షులు డా.ఎ.చక్రపాణి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా.కె. రమణ, తెలంగాణ జాగృతి అధ్యక్షులు మరియు లోక్‌సభ సభ్యురాలు శ్రీమతి కల్వకుంట్ల కవిత, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ అథారిటీ చైర్మన్ జస్టిస్ శ్రీ గ్రంధి భవానీప్రసాద్, లోక్‌సభ పూర్వ సభ్యురాలు మరియు ప్రజానటి శ్రీమతి జమునా రమణారావు, డా. అక్కినేని నాటక కళా పరిషత్ అధ్యక్షులు శ్రీ సారిపల్లి కొండలరావు, ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్, ప్రముఖ మృదంగ విద్వాంసులు ఆచార్య యల్లా వెంకటేశ్వరరావు, తెలుగు విజ్ఞాన సమితి, బెంగుళూరు అధ్యక్షులు డా. ఎ. రాధాకృష్ణరాజు, జర్మనీలో ఆల్ట్‌లాండ్స్‌బర్గ్ మేయరుగాను, బ్రాండెన్‌బర్గ్ పార్లమెంట్ సభ్యునిగాను పనిచేసిన శ్రీ గుజ్జుల రవీంద్ర రెడ్డి, యూ.కె. తెలుగు అసోసియేషన్ (UKTA) వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ సత్యప్రసాద్ కిల్లి, అమెరికా తెలుగు అసోసియేషన్ (ATA) అధ్యక్షులుగా ఎన్నికైన శ్రీ అక్కిరెడ్డి కరుణాకర్ రెడ్డి, ATA సభ్యులు శ్రీ చందూ శ్రీనివాస్ గారలు పాల్గొన్నారు.

ప్రముఖ సాహితీవేత్త డా. వోలేటి పార్వతీశం సభాసమన్వయ బాధ్యతలు నిర్వర్తించారు.

కిన్నెర ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షులు డా.ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్.(రిటైర్డ్) సభను ప్రారంభిస్తూ, పూజ్యులు, కీ.శే. మండలి వెంకట కృష్ణారావుగారిని, వారి కుమారులు మండలి బుద్ధప్రసాద్‌గారిని ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరూ అభిమానిస్తారని ఇందుకు వారి నిస్వార్థ సేవాతత్పరత, భాషాభిమానం కారణమని పేర్కొన్నారు. బుద్ధప్రసాద్‌గారు తండ్రి నుంచి దీనజన సేవాగుణంతో పాటు, భాషాభిమానాన్ని కూడా వారసత్వంగా పొందారని, దానిని కొనసాగిస్తూ భాషాప్రేమికుల అభిమానాన్ని ఆయన చూరగొనడం తనకెంతో ఆనందదాయకంగా ఉందని అన్నారు.

పిమ్మట తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా. కె.వి. రమణ, ఐ.ఎ.ఎస్. (రిటైర్డ్) మాట్లాడుతూ, ఏ దేశచరిత్రను చూసినా కవులను, కళాకారులను గౌరవించి, సాహిత్యాన్ని, కళలను ప్రోత్సహించిన సామ్రాజ్యాలు, ప్రభుత్వాలు ఘనకీర్తిని ఆర్జించడమేకాక, సర్వతోముఖాభివృద్ధి చెందాయని అంటూ ఇందుకు శ్రీకృష్ణదేవరాయల భువన విజయమే మంచి ఉదాహరణ అని పేర్కొన్నారు. ఎందరో రాజులు పరిపాలించిన ఈ దేశంలో

శ్రీకృష్ణదేవరాయల వంటి కొందరు రాజులు మాత్రం ప్రజల హృదయాలలో శాశ్వతంగా నిలిచిపోవడానికి ఇదే మూలకారణం అన్నారు. మండలి వెంకట కృష్ణారావుగారు, వారి కుమారులు బుద్ధప్రసాద్‌గారు ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, రాజకీయ నాయకులందరిలో ప్రత్యేకతను సంతరించుకున్నారని కొనియాడారు.

ఆ తరువాత, లోక్‌సభ సభ్యురాలు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు శ్రీమతి కె. కవిత మాట్లాడుతూ, బుద్ధప్రసాద్‌గారిని తాను చాలాకాలంగా నిశితంగా గమనిస్తున్నానని, రాజకీయాలలో ఏ రకమైన వివాదాల జోలికి పోకుండా, కేవలం తెలుగు భాషాసంస్కృతుల కోసం పాటుపడే ఏకైక రాజకీయనేత బుద్ధప్రసాద్ అని కొనియాడారు. సైలెంట్ వర్కర్ గా పనిచేసుకుంటూ, భాషాసేవ చేస్తున్న బుద్ధప్రసాద్ వంటి నాయకులు ముందుంటే తెలుగు ప్రజలు రెండు రాష్ట్రాలుగా విడిపోయినా, మనకున్న ఉమ్మడి వారసత్వాన్ని కలిసి కాపాడుకోవచ్చని, అప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఎటువంటి విభేదాలు ఉండవని, రెండు రాష్ట్రాల అభివృద్ధికి ఇటువంటి నాయకులతో కలిసి పనిచేయడం తమకు కూడా ఆనందంగా ఉంటుందని ఆమె అన్నారు. పెళ్ళైన నెలరోజులకే కొంతమంది విడాకులకు సిద్ధమవుతున్న ఈ రోజుల్లో షష్టిపూర్తి చేసుకోవడమంటే తనకు చాలా సంతోషంగా ఉందని ఆమె అన్నారు.

మండలి బుద్ధప్రసాద్‌గారి షష్టిపూర్తిని పురస్కరించుకొని ప్రముఖ సాహితీవేత్తలు, కవులు, కళాకారులు, సాహితీ సాంస్కృతిక రంగాలలో సుప్రసిద్ధులైన వ్యక్తులు బుద్ధప్రసాద్‌గారు సాహితీ సాంస్కృతిక రంగాలకు చేసిన సేవలను, వారికి తమతో గల సాన్నిహిత్యాన్ని ప్రస్తావిస్తూ, వారి తండ్రిగారి ఔన్నత్యాన్ని ప్రస్తుతిస్తూ వ్రాసిన సుమారు 210 వ్యాసాలు, కవితలతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ వారు "బుద్ధయానం" పేరుతో మండలి బుద్ధప్రసాద్ షష్ట్యబ్దిపూర్తి సంచికను ప్రచురించారు. ఈ బృహత్ గ్రంథాన్ని తమిళనాడు గవర్నర్ డా. రోశయ్యగారు సభికుల హర్షధ్వానాల మధ్య ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ప్రసంగిస్తూ ఆయన బుద్ధప్రసాద్ తెలుగు భాషాభిమానని, తెలుగు సంస్కృతిని సుసంపన్నం చేయడంలో ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. బుద్ధప్రసాద్ తమ తండ్రి మాజీమంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారికి తగ్గ తనయుడిగా పేరు తెచ్చుకోవడం తనకెంతో సంతోషంగా ఉందని, 1977 లో దివిసీమలో సంభవించిన ప్రకృతి బీభత్సానికి గ్రామాలకు గ్రామాలే మునిగిపోయి, 10 వేల మందికి పైగా మృత్యువాత పడ్డారని, ఆ సమయంలో నైతిక విలువలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చే మండలి వెంకట కృష్ణారావుగారు కాళ్ళకు ముళ్ళు గ్రుచ్చుకుంటున్నా లెక్కచేయకుండా, బాధితులకు అండగా నిలిచి, వారితోపాటే ఉండి, వారి సహాయ పునరావాస కార్యక్రమాలను అంకితభావంతో నిర్వర్తించారని ఆయన అన్నారు. ఆ సమయంలో ఆయన అనుభవించిన ఆవేదనను తాను ప్రత్యక్షంగా చూశానని, మంత్రి పదవి ఉంటే ఉప్పెన బాధితులను సమర్థవంతంగా ఆదుకోలేనని భావించి మంత్రి పదవికి రాజీనామా చేశారని, ఐతే ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు ఆయన రాజీనామాను ఆమోదించక, ఆయనకు సహాయ పునరావాసాల శాఖను కూడా అదనంగా అప్పగించారని అన్నారు. అలాంటి తండ్రికి అదృష్టవశాత్తూ తగిన పుత్రుడు జన్మించాడని, బుద్ధప్రసాద్ స్వతహాగా మంచి మనిషని ప్రశంసిస్తూ పేరుకు తగినట్టు ఆయన బుద్ధునివంటి వారే అని అన్నారు. ఆవేశకావేషాలకు లోనుకాకుండా, చిన్నచిన్న వాళ్ళిచ్చే అర్జీలను కూడా పరిశీలించి, తగిన న్యాయం చేస్తాడని, అధికార భాషాసంఘం అధ్యక్షునిగా ఉన్నప్పుడు తెలుగు భాషా వికాసానికి ఎంతో కృషి చేశారని, ఎక్కడ "తెలుగు" మాట విన్నా బుద్ధప్రసాద్ జ్ఞాపకం వస్తారని ఆయన అన్నారు. ఎలాంటి స్థితిలోనైనా సంయమనంగా ఉండడం అందరికీ సాధ్యంకాదని, బుద్ధప్రసాద్‌గారిలో ఈ

లక్షణం సంపూర్ణంగా ఉందని, ఆయన ఇంకా తనకు యువకుడిగానే కనిపిస్తారని, బుద్ధప్రసాద్‌కి షష్టిపూర్తి అంటే అప్పుడేనా! అన్న ఆశ్చర్యమూ, పరిణతి చెందుతున్నాడన్న ఆనందమూ తనకు ఒకేసారి కలిగాయని రోశయ్యగారు అన్నారు.

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ డా.ఎ. చక్రపాణిగారు ప్రసంగిస్తూ, మండలి వెంకట కృష్ణారావు, బుద్ధప్రసాద్ గార్ల పేరు చెప్పగానే మనలో ఒక ఆత్మీయత పుడుతుందని, అటు రాజకీయాల్లోనూ ఇటు సాహితీరంగంలోనూ మండలి బుద్ధప్రసాద్ ఆదర్శప్రాయుడని అన్నారు. వారి తండ్రి మండలి వెంకట కృష్ణారావుగారు తనకు అత్యంత ఆత్మీయుడైన స్నేహితుడని, ఆ స్నేహాన్ని బుద్ధప్రసాద్ కొనసాగిస్తూ, తనపట్ల ఎంతో గౌరవంగా ఉండటం ఆయన సంస్కారానికి నిదర్శనమని అంటూ, మంత్రిగాను, అధికార భాషాసంఘం అధ్యక్షుడుగాను సమర్థవంతంగా పనిచేసిన బుద్ధప్రసాద్ ఇప్పుడు ప్రజాస్వామ్య భవనానికి మూలస్తంభాలలో ప్రధానమైనదైన చట్టసభకు ఉపసభాపతిగా సేవలందించడం తనకెంతో ఆనందంగా ఉందని అన్నారు. భాష మనుషుల మధ్య బంధాలను పెంచుతుందని, ప్రజలను ఐక్యం చేస్తుందని, భాషపై పట్టు ఉన్నవారు పైకెదుగుతారని, బుద్ధప్రసాద్ తెలుగు భాష ఔన్నత్యాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నారని, తిరుపతిలో నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలను ఘనంగా నిర్వహింపచేశారని, ఆయన జీవితంలో ఇంకా ఎంతో పైకెదుగుతారన్న నమ్మకం తనకున్నదని ఆయన అన్నారు. శాసనసభ నైతిక విలువల సంఘానికి అధ్యక్షులుగా ఉంటూ, బుద్ధప్రసాద్ ప్రజాస్వామ్యంలో చట్టసభల గౌరవం పెంచేవిధంగా శాసనసభ్యుల కోసం నైతిక నియమావళిని రూపొందించేందుకు కృషి చేస్తున్నారని, ఈ చర్య అన్ని వర్గాల ప్రముఖుల నుంచి అభినందనలు అందుకుంటున్నదని చెప్పారు.

ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ అథారిటీ చైర్మన్ జస్టిస్ శ్రీ గ్రంథి భవానీప్రసాద్ మాట్లాడుతూ, బుద్ధప్రసాద్ గారు ద్విపాత్రాభినయం చేస్తూ రెండు పాత్రలను సమర్థవంతంగా పోషించడం తనకు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నదని, కృష్ణాజిల్లాలో దివిసీమలో ఉన్నప్పుడు అక్కడి రైతుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసే రాజకీయవేత్త ఆయనలో కనిపిస్తారని, అక్కడ నిజమైన ప్రజాప్రతినిధిగా భాసించే ఆయన, సాహిత్య సభలలో ప్రసంగించేటప్పుడు, కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షులుగా ఉండి, వివిధ సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించే తీరు చూసినప్పుడు ఆయనలో ఒక పరిణతి చెందిన సాహితీవేత్తను, పండితుణ్ణి తాను చూస్తానని ఆయన అన్నారు. మనిషి మామూలుగా కనిపిస్తూనే, మహోన్నత వ్యక్తిత్వం గల బుద్ధప్రసాద్ గారు చూసేవారికి "కొండ అద్దమందు కొంచెమై ఉండదా" అన్నట్లుగా కనిపిస్తారని అన్నారు.

పిమ్మట, అలనాటి ప్రసిద్ధ సినీ కథానాయిక, పూర్వ లోక్ సభ సభ్యురాలు శ్రీమతి జమునా రమణారావు మాట్లాడుతూ – ఈ సభలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని, బుద్ధప్రసాద్ గారి తండ్రి మండలి వెంకట కృష్ణారావుగారు పూజ్యులైన మహానుభావులని, ఆయన తనకెంతో ఆప్తులని పేర్కొంటూ, దివిసీమను ఉప్పెన ముంచెత్తినప్పుడు అక్కడ తిరిగిన మొట్టమొదటి సినీతారను తానేనని చెప్పారు. ఉప్పెన సమయంలో ఆయన పడుతున్న బాధను చూసినపుడు తమ గుండెలు తరుక్కుపోయాయని, తమను చూసి ఆయన దుఃఖం ఆపుకోలేక చిన్నపిల్లాడిలా ఏడ్చేశారని అప్పుడు బుద్ధప్రసాద్ 20 ఏళ్ళ కుర్రవాడని అన్నారు. కృష్ణారావుగారు ఎంతో ఉత్తముడని, కళాకారులకు ఎన్నో విధాల సాయం చేశారని, ప్రపంచ తెలుగు మహాసభలను ఆయన ఎంతో ఘనంగా నిర్వహించారని, అప్పటినుంచి ప్రతి తెలుగు మహాసభలోను తాను పాల్గొంటున్నానని, ఆయన తెలుగు

భాషాసంస్కృతుల అభివృద్ధికి ఎనలేని కృషిచేశారని, సాంస్కృతిక శాఖామంత్రిగా తనకు అవనిగడ్డలో ఘనమైన సన్మానం చేశారని ఆమె అన్నారు. అది జరిగిన రెండు నెలలకే ఉప్పెన వచ్చి, దివిసీమ మొత్తాన్ని తుడిచివేసిందని ఆమె గుర్తు చేసుకున్నారు. బుద్ధప్రసాద్ గారు అటువంటి కుటుంబంలో జన్మించారని, తండ్రి ప్రభావం వారిలో చాలా ఉందని, తక్కువగా మాట్లాడటం ఎక్కువగా స్పందిచడం ఆయన గుణమని, తనను శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యద కావ్యాన్ని రచించిన శ్రీకాకుళంలోని ఆంధ్రమహావిష్ణువు దేవాలయానికి తీసుకువెళ్ళి చూపించారని, అక్కడ కృష్ణదేవరాయలు ఆముక్తమాల్యద కావ్యరచనకు శ్రీకారం చుట్టిన ప్రదేశంలో బుద్ధప్రసాద్ గారు ఒక మండపాన్ని నిర్మించి, అందులో శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ప్రతిష్ఠించారని చెప్పారు. రాజకీయాలలో విలువల పట్ల, సిద్ధాంతాల పట్ల నిబద్ధత గల మహోన్నత వ్యక్తికి జన్మించి, ఆ విలువలను కొనసాగిస్తున్న బుద్ధప్రసాద్ గారిని అభినందిస్తున్నానని ఆమె అన్నారు.

జర్మనీలో మేయరుగా పనిచేసిన శ్రీ గుజ్జుల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ – బుద్ధప్రసాద్ గారి స్ఫూర్తితోనే తనకు తన మాతృభాష పట్ల గౌరవం ఏర్పడిందని, తనకు ఇటువంటి స్నేహితులు దొరకటం గర్వకారణంగా ఉందని, వీరి స్ఫూర్తితో జర్మనీలో తెలుగు స్కూళ్ళను నడుపుతున్నామని అన్నారు.

బెంగుళురులోని తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షులు డా. ఎ. రాధాకృష్ణరాజు మాట్లాడుతూ – బుద్ధప్రసాద్ గారి 60 సంవత్సరాల జీవితంలో 45 సంవత్సరాలుగా తనకు వారితో అవినాభావ సంబంధం ఉన్నదని, వారి తండ్రిగారు 1975 లో హైదరాబాద్ లో నిర్వహించిన ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలలో కార్యదర్శిగా పనిచేశానని అన్నారు. తెలుగు భాషకు ఎంతో సేవ చేస్తున్న బుద్ధప్రసాద్ గారు, ఆంధ్రప్రదేశ్ శాసన మండలి అధ్యక్షులు డా. చక్రపాణిగారు ఇతర రాష్ట్రాలలో ఉన్న తెలుగువారి భాషా సమస్యలను పరిష్కరించడానికి కృషిచేయాలని, చక్రపాణిగారు శాసనసభ సంఘానికి అధ్యక్షులుగా ఉండి, ఇంతకు పూర్వం కొంత కృషి చేశారని, దానిని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

డా. అక్కినేని నాటక పరిషత్ అధ్యక్షులు శ్రీ సారిపల్లి కొండలరావు, ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్, ప్రసిద్ధ మృదంగ విద్వాంసులు ఆచార్య యల్లా వేంకటేశ్వరరావు, యూ.కె. తెలుగు అసోసియేషన్ (UKTA) వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ సత్యప్రసాద్ కిల్లి, అమెరికా తెలుగు అసోసియేషన్ (ATA) అధ్యక్షులుగా ఎన్నికైన శ్రీ అక్కిరెడ్డి కరుణాకర్ రెడ్డి, శ్రీ చందూ శ్రీనివాస్ గారలు బుద్ధప్రసాద్ దంపతులకు తమ అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

పిమ్మట కిన్నెర సంస్థతో పాటుగా, జంట నగరాలలోని సాహితీ, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు, స్నేహితులు, బంధువులు, అభిమానులు మండలి బుద్ధప్రసాద్, విజయలక్ష్మి దంపతులను పుష్పమాలలతోను, దుశ్శాలువలతోను, నూతన వస్త్రాలతోను ఆత్మీయంగా సత్కరించారు.

తనకు ఘనసన్మానం చేసి, అభిమానం చూపిన సాహితీ మిత్రులకు, సాంస్కృతిక సంస్థలవారికి కృతజ్ఞతలు తెలుపుతూ బుద్ధప్రసాద్‌గారు తాను ఈ స్థితికి రావడానికి కారణం జన్మతః తనకు సంక్రమించిన మహోన్నత వారసత్వమే అని, పుట్టుకతో సంక్రమించిన ఈ వారసత్వాన్ని నిలబెట్టుకోవడం తనకు కత్తిమీది సాములా ఉందని అన్నారు. తాను ఎక్కడ తప్పటడుగు వేసినా, తమ తండ్రికి చెడ్డపేరు వస్తుందని భయపడుతున్నానని,

రాజకీయాలలోకి రావడం తమ తండ్రికి ఇష్టం ఉండేది కాదని అన్నారు. రాజకీయాలలోకి రాకుండా సమాజసేవకు అంకితం కావాలని, సంఘసంస్కర్తగా నిలవాలని ఆయన ఆకాంక్షించారని తెలుపుతూ, తాను ఏనాడూ గొప్పతనం కోసం ప్రయత్నించలేదని చెప్పారు. ఆయన మిగిల్చిన పనులు పూర్తి చేయడమే తన ధ్యేయమని, తన అవనిగడ్డ ప్రజలందరూ తనకు పదవి ఉన్నా లేకున్నా అభిమానంతో ఆదరించి, దివిసీమ నాయకుడిగా నిలబెట్టారని, వారందరికి సదా కృతజ్ఞుడినని అన్నారు. తెలుగునాట ఉన్న మహానుభావులందరితో తనకు ప్రత్యక్ష పరిచయం ఏర్పడిందని, తమ ఇల్లు తన చిన్ననాటినుంచే రాజకీయ నాయకులతోనే కాక, సాంస్కృతిక వ్యక్తుల రాకపోకలతో పరిమళించేదని, అది కొద్దిగా తనకు అంటిందని, దానితో పాటు నిస్వార్థపరులైన సేవమూర్తులకు సేవచేసుకొని, వారితో కలిసి పనిచేసే అవకాశం కలిగిందని తెలియజేశారు. ఈ సేవామూర్తులు మరుగున పడిపోతున్నారని, వారి పరిచయాలతో కూడిన వ్యాస సంకలనాన్ని ఒకదానిని త్వరలో ప్రచురించబోతున్నానని తెలుపుతూ, తన ఈ స్థితికి కారకులైన వారందరికీ శిరసు వంచి నమస్కరిస్తున్నానని, రాజకీయాలలో విలువలను కాపాడుతూ, తన తండ్రిగారికి, తన దివిసీమ ప్రజలకు ఎటువంటి అపకీర్తి రాకుండా చూడటమే తన కోరిక అని, సభికుల హర్షధ్వానాల మధ్య అన్నారు. డిగ్రీ చదువుల కోసం 1974 లో హైదరాబాద్ లో అడుగుపెట్టానని, అప్పుడు సిటీలో మంచి గుర్తింపు పొందిన 'సిటీ కాలేజీ–లో కాకుండా, ఖైరతాబాద్ లోని న్యూ గవర్నమెంటు కాలేజీలో చేర్చారని, అక్కడ అదృష్టవశాత్తు ఆచార్య ఎస్. గంగప్పగారు తనకు గురువు కావడం వలన తెలుగు సాహిత్యంతో పరిచయం ఏర్పడిందని అన్నారు. మొదటి ప్రపంచ తెలుగు మహా సభలలో ఒక కార్యకర్తగా పాల్గొన్నానని, అప్పుడు కవులతో, కళాకారులతో పరిచయం ఏర్పడిందని, ఆ పరిచయాలను కొనసాగిస్తున్నానని అన్నారు.

రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలు కలిసిమెలసి జీవిస్తూ, సహజీవనం కొనసాగించాలని తన కోరిక అని, మలేషియాలో తెలుగు ఉత్సవాలలో కవితగారిని కలవడం జరిగిందని, తెలుగువారి మధ్య మనస్పర్థలు దూరం చేయాలని తాను కోరిన కోరికను ఆమె మన్నించినందుకు ధన్యవాదాలని అన్నారు. విదేశాలలో తెలుగు భాష పట్ల ఉన్న మక్కువ తనను ముగ్ధుడ్ని చేస్తుందని, ఆ మార్పు మనలో కూడా రావాలని, ఈనాటి తెలుగుభాష దురవస్థకు ప్రభుత్వాలను నిందించి ప్రయోజనం లేదని, జాత్యాభిమానం మనకు కలగాలని అన్నారు. ఇతర రాష్ట్రాలలో సమస్యను పరిష్కరించడం సులువే కానీ, మన రాష్ట్రంలో సమస్యలను పరిష్కరించడం కష్టంగా ఉన్నదని అంటూ, ఇంతమంది పెద్దలు ఈ కార్యక్రమానికి రావడం తనకు ఆనందంగా ఉందని, ఈ సందర్భంలో డా. రాళ్లబండి కవితాప్రసాద్ లేకపోవడం తనకు లోటుగా ఉన్నదని, రమణాచారిగారు, కవితాప్రసాద్ గారు ఈ రాష్ట్రంలో సాంస్కృతిక రంగంలో వెల్లువ తెచ్చారని, ఆ సేవ కొనసాగాలని అన్నారు. భవిష్యత్తులో తెలుగుజాతికి సేవచేయాలని కోరుకుంటున్నానని, సంచలనాత్మకంగా మాట్లాడటం తనకు చేతకాదని, ఇది గ్రహించిన మీడియా మిత్రులు కూడా తనతో సదా సహకరిస్తున్నారని అన్నారు. తెలుగు ప్రజల మధ్య మనస్పర్థలు లేకుండా కలిసి పనిచేద్దామని టి.ఆర్.ఎస్. ఎం.పి. కవిత చెప్పడాన్ని ఆయన స్వాగతించారు.

తనకు ఎల్లప్పుడూ మంచి ఆలోచనలివ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని ఆయన ముగించడంతో సభికులు కరతాళ ధ్వనులు చేశారు.

తెలుగు భాషా సంస్కృతులకు జవజీవాలు

కొత్త ఆశలు చిగురింపచేసిన శ్రీ మండలి బుద్ధప్రసాద్ షష్టిపూర్తి సందర్భంగా విజయవాడ శేషశాయి కల్యాణ మండపంలో 2016 మే 31న జరిగిన తెలుగు భాషా సాంస్కృతిక సమ్మేళనం

- డా. జి.వి. పూర్ణచందు

2016 మే 31న తెలుగు భాషా సాంస్కృతిక చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టం జరిగింది. విజయవాడలోని సాహితీ సాంస్కృతిక సంస్థలు, ఎన్టీఆర్ ట్రస్టు సంయుక్త నిర్వహణలో తెలుగు భాషా సాంస్కృతిక సమ్మేళనం ప్రయోజనాత్మకంగా జరిగింది. వివిధ రాష్ట్రాల నుండి విచ్చేసిన దాదాపు 1500 మంది సాహితీవేత్తలు, భాషావేత్తలు, విద్యావేత్తలు వివిధ కళారంగ ప్రముఖులు, చిత్రకారులు, శిల్పకారులూ రాష్ట్ర ప్రభుత్వానికి సాంస్కృతిక విధానాన్ని సూచించారు. తెలుగు భాషా సంస్కృతులకు జవజీవాలు నింపాలని కోరారు.

తెలుగు రాష్ట్రం ఏర్పడిన ఆరు దశాబ్దాల కాలంలో ఈ ఏకైక లక్ష్యం కోసం ఒక భారీ సమ్మేళనం జరగటం ఇదే ప్రథమం. ఒక సాంస్కృతిక విధానం ఉండాలనే ఉత్సుకతని ప్రభుత్వం కూడా ప్రదర్శించటం ఈ సమ్మేళనంలో ప్రధానాంశం. ఇంక నుండీ తాను భాషా సంస్కృతుల పరిరక్షణను భుజస్కంధాల మీదకు తీసుకుంటానని, ఎన్టీఆర్ ట్రస్టు చైర్మన్ శ్రీ నారా లోకేష్ ప్రకటించటం కొసమెరుపు. శ్రీ మండలి బుద్ధప్రసాద్ షష్టిపూర్తి సందర్భంగా ఏర్పరిచిన తెలుగు భాషా సాంస్కృతిక సమ్మేళనం ప్రజలలో కొత్త ఆశలు చిగురింపచేసింది.

రెండు తెలుగు రాష్ట్రాల నుండీ, ఇతర రాష్ట్రాల నుండీ అసంఖ్యాకంగా ప్రతినిధులు తరలి వచ్చారు. ఈ సభాసదులందరినీ సాంస్కృతిక సత్యాగ్రహులుగా నిర్వాహకులు అభివర్ణించారు. ఉదయం పది గంటల నుండీ సాయంత్రం ఆరున్నర వరకూ తెలుగు భాష, నాట్యం, సంగీతం, జానపద కళలు, చిత్రకళ, శిల్పకళలకు సంబంధించి ప్రభుత్వం తీసుకోవలసిన చర్యలపై వేడి వేడి చర్చలు జరిగాయి. వక్తలంతా స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వెల్లడించారు.

తొలుత జరిగిన ప్రారంభ సభలో సమ్మేళనాన్ని ప్రారంభిస్తూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ భవానీ ప్రసాద్ అన్ని అధికారాలూ ఉన్న అధికార భాషా సంఘం కావాలన్నారు. ప్రజలు మాట్లాడే భాషలోనే పరిపాలన సాగటం మంచిది, న్యాయవ్యవస్థ కూడా తెలుగులోనే పనిచేయటం అవసరం. ఎవరైనా అధికారి తెలుగు అమలుకు ప్రయత్నించినా, ఆ వ్యక్తి బదిలీ అయితే మళ్ళీ కథ మామూలే అవుతోందని అన్నారు. ముఖ్య అతిథిగా జర్మనీ నుండి విచ్చేసిన అక్కడి మేయర్ శ్రీ గుజ్జుల రవీంద్ర ప్రపంచంలో ఎక్కడున్నా తెలుగు వారిలో మన తెలుగు అనే భావన రావాలన్నారు. మనసులోని భావాలను వెళ్ళడించడానికి తెలుగు మనకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ సలహాదారు శ్రీ పెద్ది రామారావు సదస్సు లక్ష్య ప్రస్తావన చేశారు.

కేంద్ర సాహిత్య అకాడెమీ కార్యదర్శి శ్రీ కె. శ్రీనివాసరావు తెలుగు సాహిత్య అకాడెమీ స్థాపన వెంటనే జరగాలన్నారు. కేంద్రానికీ, రాష్ట్రానికీ మధ్య సాంస్కృతిక వారధిగా ఉపయోగపడవలసిన అకాడెమీ లేకపోవటం వలన మన భాషా సాహిత్యాలకు అన్యాయం జరుగుతోందన్నారు. ఎంతో పోరాటం చేసి ప్రాచీనతా హోదా సాధించుకున్నాం. కానీ, దాని వలన సమకూరే నిధుల్ని మనం వినియోగించుకో లేకపోతున్నాం. తమిళనాడు, కర్ణాటక లబ్ది పొందుతున్నారు. దేశ స్థాయిలో తెలుగు రాష్ట్రాల ప్రాతినిధ్యం లేకుండా పోతోంది, పరిశోధనలకు, పుస్తక ప్రచురణలకు లెక్కలేనన్ని నిధులు అందుబాటులో ఉన్నాయి. మనకు శ్రద్ధ లేకపోవటం వలన ఈ రెండు రంగాలలో మనం వెనకబడి ఉన్నాం. తెలుగు ప్రాచీన భాషా కేంద్రాన్ని మైసూరు నుండి ముందు తరలించి తెచ్చుకోవాలి. తెలుగు రాష్ట్రాలు రెండూ కలిసి భాషా సంస్కృతుల కోసం పనిచేయాలన్నారు.

తెలుగు భాషా సాంస్కృతిక శాఖ పూర్వ కార్యదర్శి శ్రీ ముక్తేశ్వరరావు ప్రభుత్వానికి సాంస్కృతిక విధానం లేకపోవటం వలన జరిగే లోపాలను వివరించారు. ఆచార్య కొలకలూరి ఇనాక్ కె.జి. నుండి పి.జి. వరకూ తెలుగు మాధ్యమం ఉండాలన్నారు. శాస్త్ర సాంకేతిక పాఠ్యపుస్తకాలు ప్రామాణికంగా తెలుగులోకి తేవాలన్నారు. గ్రంథాలయ వ్యవస్థను పటిష్టపరచాలన్నారు. తెలుగులో అచ్చయిన ప్రతిపుస్తకాన్ని గ్రంథాలయాలు కనీసం 1000 కాపీలైనా కొనాలని సూచించారు. తెలుగు అకాడెమీ, తెలుగు విశ్వవిద్యాలయం లాంటి సంస్థల విషయంలో ప్రభుత్వం సత్వర నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

భాషావేత్త ఆచార్య జి. ఉమామహేశ్వరరావు యువతరాన్ని తెలుగు వైపుకు తీసుకు వచ్చేందుకు ఆకర్షణీయమైన కార్యక్రమాల రూపకల్పన అవసరం అన్నారు. ఇంటర్ వరకూ అయినా తెలుగు నిర్బంధంగా బోధించాలని అన్నారు. భాషావిధానాన్ని ప్రభుత్వం ప్రకటించాలన్నారు. నిత్య జీవితంలో తెలుగు వాడకాన్ని పెంచేందుకు ప్రజా ఉద్యమాల అవసరం ఉందన్నారు. 'అమ్మనుడి' సంపాదకులు డా. సామల రమేశ్ బాబు ప్రభుత్వ రంగంలో జరిగే ప్రతి కార్యక్రమానికీ తెలుగు మొదటి మెట్టుగా ఉండాలి. ముఖ్యంగా తెలుగులో శిలాఫలకాల విషయంలో అలసత్వం కూడదు, తెలుగు సాధికారిక సంస్థ ఏర్పాటు అవసరం, నిఘంటు రూపకల్పన నిరంతర కృషిగా సాగాలన్నారు. డా. నాగసూరి వేణుగోపాల్ శాస్త్ర సాంకేతిక రంగాలను కూడా తెలుగులోనే నిర్వహించాలన్నారు. ఆచార్య కె. సంజీవరావు (శిఖామణి) తెలుగు విశ్వవిద్యాలయ అంశాన్ని జటిలం చేయకుండా ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించాలన్నారు. ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు భాషా సాంస్కృతిక సంస్థల బాధ్యతను సరైన వ్యక్తులకు అప్పగించాలన్నారు. నటులు శ్రీ గుమ్మడి గోపాలకృష్ణ సంగీత నాటక అకాడెమీ కావాలన్నారు. శ్రీ భూసురపల్లి వెంకటేశ్వర్లు లలిత కళా అకాడెమీ ఏర్పాటు, కళాకారులకు పెన్షను సౌకర్యం సమర్థవంతంగా అమలు కావాలని కోరారు. డా. ఈమని శివనాగిరెడ్డి శిల్పకళాకారుల దుస్థితిని సరిచేయాలని సూచించారు. ఆచార్య సత్యనారాయణ గారు జానపద కళలపట్ల ప్రభుత్వం శ్రద్ధ వహించాలని, ఈ కళలను పాఠశాలల్లో బోధించాలనీ అన్నారు.

శ్రీ కిరణ్ క్రాంతి చౌదరి స్థానిక కళలను విద్యాబోధనలో పాఠ్యాంశాలుగా పెట్టి నేర్పించాలని సూచించారు. శ్రీ సప్పా దుర్గాప్రాద్ డ్యాన్స్ టీచర్లకు సర్టిఫికేట్ కోర్సులు పెట్టాలని సూచించారు. శ్రీమతి శారదా రామకృష్ణ ఆంధ్రనాట్యానికి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు కోరారు. డా. కందిమళ్ల సాంబశివరావు నాటక

అకాడమీనీ, శ్రీ కాండ్రేగుల నాగేశ్వరరావు చిత్రకళా మ్యూజియంనూ, చిత్రకారుడు శ్రీ గిరిధర్ గౌడ్ కేరళా పద్ధతిలో చిత్రకళా అకాడెమీని, శ్రీ టి. వెంకట్రావు (టి.వి) ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు చిత్రకారులు వేసి పెయింటింగులతో అలంకరించాలని, చిత్రకళను నేర్పే కళాశాలలు కావాలని అన్నారు.

సదస్సుకు అధ్యక్షత వహించిన శ్రీ గజల్ శ్రీనివాస్ గుడిలో బడిలో అమ్మఒడిలో తెలుగే మాట్లాడి అమ్మభాష ఔన్నత్యాన్ని తరువాతి తరాలకు అందించాలని కోరుతూ ఆలపించిన గేయం అందరినీ అలరించింది. జానపద కళాకారుడు రామిశెట్టి కోటేశ్వరరావు, మిమిక్రీ కళాకారుడు మండలి జితేంద్ర తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటుతూ తమ కళలను ప్రదర్శించి ఉత్తేజితుల్ని చేశారు.

గుజరాత్, ఒడిసా, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి వచ్చిన తెలుగు ప్రముఖులు శ్రీ నాగరాజు, శ్రీ రాళ్లపల్లి సుందరం, వారణాశి నాగలక్ష్మి, ఆశ్విన్ రోజారాణి, బి.యస్.వి. రమేష్, శ్రీ మహంతి ప్రభృతులు తమ రాష్ట్రాలలోని తెలుగు వారికి తెలుగు నేర్పించటం, తెలుగు భాషా సంస్కృతుల పట్ల అనురక్తిని కలిగించటం, తెలుగులో కూడా ప్రాథ్యమిక, మాధ్యమిక, ప్రవేశిక లాంటి సర్టిఫికేట్ కోర్సులు పెట్టి హిందీ పద్ధతిలోనే తెలుగును తెలుగేతర రాష్ట్రాలలో నేర్పించటం, తెలుగు పాఠశాలల నిర్వహణకు నిధులు మరియు ఉపాధ్యాయులను కేటాయించి ఆదుకోవటం వంటి చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రేతర తెలుగు సమాఖ్య అధ్యక్షుడు శ్రీ పిసిపివి ప్రసాద్ ప్రధాన ప్రసంగం చేశారు. శ్రీ పూడిపెద్ది సత్యనారాయణ సభకు అధ్యక్షత వహించారు.

ఇంకా ఆచార్య యస్. గంగప్ప, ఆకాశవాణి సంచాలకులు శ్రీమతి ముంజులూరి కృష్ణకుమారి, డా. వేదాంతం రాజగోపాల చక్రవర్తి, డా. సంగనభట్ల నరసయ్య, శ్రీ దండు సూర్యారావు, శ్రీ విజయకుమార్ (ఎమెస్కో), శ్రీ నాయుడు గోపీ, శ్రీ మృత్యుంజయరావు ప్రభృతులు తమ సూచనలను అందించారు.

రాష్ట్ర ప్రభుత్వానికి భాషా సాంస్కృతిక విధానం, దానితో పాటు నిర్దేశిత సాంస్కృతిక క్యాలెండరూ ఉండాలని, కీర్తిశేషులైన మహాకవులు, మహాకళాకారుల ఇళ్లను సాంస్కృతిక వారసత్వ సంపదగా పదిలపరచాలనీ, వారి స్మృతిచిహ్నాలను నిర్మించాలనీ, సదస్సులకు వచ్చిన ప్రతి ఒక్కరూ కోరుకున్నారు. వివిధ రంగాల నిపుణులతో ఏర్పడిన కమిటీ సాంస్కృతిక విధాన రూపలక్పన చేస్తుందని, దాన్ని ప్రభుత్వానికి అందజేయగలమనీ నిర్వాహకులు ప్రకటించారు. భాషకు ఎంతో కొంత మేలు జరుగుతుందని సదస్సులో పాల్గొన్న ప్రతినిధుల్లో ఒక ఆశ, ఒక నమ్మకం కలిగాయి. మండుటెండల్లో వ్యయ ప్రయాసలకోర్చి సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ప్రతినిధులు తెలుగుకు జరిగే మేలులో తాము కూడా భాగస్వాములు అవుతున్నందుకు సంతోషం వ్యక్తపరిచారు.

'తెలుగు బుద్ధుడు' మండలి షష్టిపూర్తి అభినందన

తెలుగు భాషోద్యమ సేనాని, తెలుగు బుద్ధుడుగా వాసికెక్కిన శ్రీ మండలి బుద్ధప్రసాద్ షష్ట్యబ్ది పూర్తి అభినందన సభ సాయంత్రం ఆరున్నరకు జరిగింది. సాహితీ, సాంస్కృతికరంగ ప్రముఖులు, పురప్రముఖులు ఆయనను ఘనంగా సత్కరించారు. సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన యన్టిఆర్ ట్రస్టు అధ్యక్షులు శ్రీ నారా

లోకేష్ మాట్లాడుతూ, రాజకీయాలకు అతీతంగా తెలుగు భాషకు, సంస్కృతికి ఎనలేని సేవ చేసిన మహనీయుడిగా శ్రీ బుద్ధప్రసాద్ గారి గురించి మాట్లాడటానికి తాను వచ్చానన్నారు. ఇప్పటి తరంలో అలాంటి వ్యక్తులు అరుదుగా ఉంటారన్నారు. తెలుగు భాష పవిత్రమైనదనీ, తెలుగువాడిగా పుట్టటం అదృష్టమన్నారు. ఉదయం నుండి చర్చించి సదస్సు చేసిన నిర్ణయాలను ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకు వెళ్ళి ఒక నిర్దేశిత సమయంలోగా నెరవేరేలా బాధ్యత తీసుకుంటాను. యువకులకు జావా సీ ప్లస్ ఎంత ముఖ్యమో మన భాష అంతకన్నా ముఖ్యం. ప్రాంతాలకతీతంగా, రాష్ట్రాలకతీతంగా తెలుగు భాషకోసం, జాతికోసం పనిచేయాలన్నారు. రాష్ట్రంలో ఎన్నో సమస్యలున్నా తెలుగు భాషాభివృద్ధికి ఇచ్చే విలువైన సలహాలు స్వీకరిస్తామన్నారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన సాంస్కృతిక శాఖామాత్యులు శ్రీ పల్లె రఘునాథరెడ్డి రాష్ట్రంలో లలిత, సంగీత, నాటక, సాహిత్య, అకాడెమీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అధ్యక్షత వహించిన ప్రసిద్ధ రచయిత, నటులు శ్రీ గొల్లపూడి మారుతీరావు సాంస్కృతిక సముదాయాల ఏర్పాటు వలన కళలు వృద్ధి చెందుతాయని అన్నారు. భాష మరియు సాంస్కృతిక రంగాల గురించి ప్రభుత్వానికి ముందుచూపు ఉండాలని కోరారు.

సమ్మేళనం తీర్మానాలు

శ్రీ పెద్ది రామారావు ప్రతిపాదించిన తీర్మానాలను సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. తెలుగు భాషకు సంబంధించిన ఒక సాధికారిక సంస్థ ఏర్పాటు, తెలుగు ప్రాచీన భాషా సంస్థను మైసూరు నుండి తెలుగు ప్రాంతాలకు తరలించటం, ఇంటర్ వరకూ తెలుగు తప్పనిసరి చేయటం, తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడెమీ, ఆర్కయివ్స్, ప్రాచ్యలిఖిత సంస్థల వంటి ప్రభుత్వ సంస్థల విభజన వేగవంతం చేయటం, తక్కువ కాలవ్యవధి గల సర్టిఫికేట్ కోర్సులను రాష్ట్రేతరాంధ్రుల కోసం నిర్వహించటం, నామఫలకాలు, శిలాఫలకాల వంటి విషయాలలో తెలుగును అశ్రద్ధ చేయకుండా జాగ్రత్త పడటం, పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ సంగీత నృత్యాది కళలను నేర్పించటం లాంటి చర్యలను తక్షణం తీసుకోవాలని తీర్మానించారు.

శ్రీ నారా లోకేష్ అధ్యక్షతన ఏర్పడిన ఆహ్వాన సంఘం ఈ సమ్మేళనాన్ని నిర్వహించింది. ఉపాధ్యక్షులు శ్రీ గుత్తికొండ సుబ్బారావు, డా. ఈమని శివనాగిరెడ్డి, శ్రీ గోళ్ల నారాయణరావు, కార్యదర్శులు డా. పెద్ది రామారవు, శ్రీ విష్ణువర్ధన్, డా. జి.వి. పూర్ణచందు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

విశ్వనాథ సాహితీ విశ్వరూపం, స్వాతంత్ర్య సంగ్రామం–కథలు గాథలు, పద్యంలో మనం, ప్రబుద్ధ భారతి, గురజాడ కథ, రామానుజ చరిత్ర, జ్ఞాన గుళికలు, బుద్ధయానం మొదలైన ఎనిమిది గ్రంథాలను ఈ వేదికపైన ఆవిష్కరించి శ్రీ బుద్ధప్రసాద్‌కు అంకితం ఇచ్చారు. శ్రీ బుద్ధప్రసాద్ షష్టి పూర్తిని ఒక దండల వేడుకగా కాకుండా, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణోద్యమానికి శ్రీకారోత్సవంగా జరపటం ముదావహం.

షష్ట్యబ్దిపూర్తి వేడుక

23-5-2016 ★ అవనిగడ్డ



▲ ఆయుష్ హోమం చేస్తూ...

విశ్వయోగి విశ్వంజీ,
అష్టాక్షర జీయర్ స్వామి,
▼ భవగ్ని గురూజీ ఆశీర్వాదం





▲ మాతృమూర్తి శ్రీమతి ప్రభావతి దేవితో...

▼ కుటుంబ సభ్యులతో....



బంధుమిత్రుల అభినందనలు

















బంధుమిత్రుల అభినందనలు










షష్ట్యబ్దిపూర్తి వేడుక

26-5-2016 ★ అవనిగడ్డ



అభినందనలు తెలియజేస్తున్న పార్లమెంట్ సభ్యులు శ్రీ కొనకళ్ళ నారాయణరావు, జిల్లాపరిషత్ చైర్మన్ శ్రీమతి అనూరాధ, జిల్లా తెలుగుదేశం అధ్యక్షులు శ్రీ అర్జునుడు



హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతీస్వామి ఆశీర్వచనం



దేవాదాయశాఖామాత్యులు శ్రీ పైడికొండల మాణిక్యాలరావు అభినందన

మంత్రి శ్రీ కొల్లు రవీంద్ర, మంత్రి శ్రీ పి. మాణిక్యాలరావు, శ్రీ ఎల్.వి. సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్.ల అభినందన



బంధుమిత్రుల అభినందనలు















▲ మనుమరాలు చి॥ అక్షర కూచిపూడి నృత్యం



షష్ట్యబ్దిపూర్తి వేడుక

27-5-2016 ★ హైదరాబాద్



హైదరాబాద్ రవీంద్రభారతిలో 'బుద్ధయానం' గ్రంథావిష్కరణ చేసి బుద్ధప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న తమిళనాడు గవర్నర్ డా॥ కొణిజేటి రోశయ్య. చిత్రంలో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ డా॥ ఎ. చక్రపాణి, డా॥ కె.వి. రమణ, పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి కల్వకుంట్ల కవిత, శ్రీమతి జమునా రమణారావు, శ్రీ సారిపల్లి కొండలరావు, శ్రీ కొలకలూరి ఇనాక్, శ్రీ రాధాకృష్ణంరాజు, శ్రీ యెల్లా వెంకటేశ్వరరావు, శ్రీ ఆర్. ప్రభాకరరావు, శ్రీ మద్దాళి రఘురాం తదితరులు





▲ శ్రీ కె. రోశయ్య, శ్రీమతి కె. కవిత అభినందన



శ్రీమతి జమున



శ్రీ యల్లా వెంకటేశ్వరరావు



శ్రీ కొలకలూరి ఇనాక్

గవర్నర్ శ్రీ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ దంపతుల అభినందన

28-5-2016 ★ రాజ్‌భవన్








తెలుగు భాషా సాంస్కృతిక సమ్మేళనం

షష్ట్యబ్దిపూర్తి వేడుక

31-5-2016 ★ విజయవాడ



▲ శ్రీ నారా లోకేష్, మంత్రి శ్రీ పల్లె రఘునాథరెడ్డి సత్కారం



▲ 'ప్రబుద్ధభారతి' గ్రంథావిష్కరణ



ఎన్.టి.ఆర్. ట్రస్ట్ సి.ఇ.ఓ. శ్రీ విష్ణువర్ధన్ అభినందన



విద్యుత్ నియంత్రణ మండలి అధ్యక్షులు జస్టిస్ గ్రంథి భవానీప్రసాద్



కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీ కె. శ్రీనివాసరావు



ప్రసంగిస్తున్న శ్రీ ముక్తేశ్వరరావు, ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)











శ్రీ పెద్ది రామారావు





శ్రీ కాలకలూరి ఇనాక్



డా॥ ఎస్. గంగప్ప



'ఎమెస్కో' విజయ్‌కుమార్



శ్రీ గజల్ శ్రీనివాస్







శ్రీ సుద్దాల అశోక్‌తేజ











శ్రీ హరిశ్చంద్రప్రసాద్, శ్రీ శివనాగిరెడ్డి



శ్రీ అన్నవరపు రామస్వామి



శ్రీ గొల్లపూడి మారుతీరావు



కుమార్తె అవనిజ వివాహం శ్రీ కనపర్తి అవనీంద్రతో జరిగిన సందర్భంలో కుటుంబ సభ్యులతో...



శ్రీ మండలి బుద్ధప్రసాద్ - శ్రీమతి విజయలక్ష్మి